100

శత వసంతాల

# తెలుగు కథ

కథా సంకలనం

సంపాదకులు

తాళ్ళూరి నాగేశ్వరరావు

హితశ్రీ

# శత వసంతాల తెలుగు కథ

(కథా  సంకలనం)

సంపాదకులు :

**తాళ్ళూరి నాగేశ్వరరావు**

**హితశ్రీ**

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

**విజయవాడ**

**SATHA VASANTHALA TELUGU KATHA** *(Katha Sankalanam)*
*Compiled by :* ***Taalluri Nageswara Rao, Hithasri***

| | | |
|---|---|---|
| ప్రచురణ నెం. | : | 2350/652 |
| ప్రతులు | : | 600 |
| ప్రథమ ముద్రణ | : | మార్చి, 2017 |
| టైటిల్ డిజైన్ | : | గిరిధర్ |

స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్
ప్రథమ ముద్రణ : 1974

© విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

**వెల : ₹ 450/-**

**ప్రతులకు**

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
33-22-2, చంద్రం బిల్డింగ్స్
చుట్టుగుంట, విజయవాడ-520004
ఫోన్ : 0866-2430302
Email : vphpublish@gmail.com

**విశాలాంధ్ర బుక్‌హౌస్**
విజయవాడ, విశాఖపట్నం,
అనంతపురం, గుంటూరు
తిరుపతి, కాకినాడ, ఒంగోలు
శ్రీకాకుళం, కడప, విజయనగరం

**హెచ్చరిక :** ఈ పుస్తకంలో ఏ భాగాన్నైనా పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ కాపీరైట్ హక్కు కలిగినవారి నుండి లేక ప్రచురణకర్తల నుండి ముందుగా రాతపూర్వక అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం.

**ముద్రణ : విశాలాంధ్ర విజ్ఞాన సమితి ముద్రణాలయం - విజయవాడ**

# ముందుమాట

తెలుగులో మేలిమి బంగారు కథలను ఎంపిక చేసి ప్రచురించాలని నాలుగు దశాబ్దాల క్రితం విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంకల్పించి, అందుకు ప్రముఖ కథా రచయితలందరికి వర్తమానం పంపింది. గురజాడ నుండి రాచకొండ వరకూ వచ్చిన కథలను ఎంపిక చేసే బాధ్యతలను ఆనాటి ప్రముఖ సాహితీ విమర్శకులైన టి.నాగేశ్వరరావు, హితశ్రీగార్లకు అప్పజెప్పింది. ఓపికతో వారు కృషిచేసి కథలను ఎంపిక చేశారు. 1974వ సంవత్సరంలో స్వతంత్ర ఆర్టు ప్రింటర్స్ (విజయవాడ) వారు ఆ కథలను ముద్రించగా విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ పంపిణీ చేసింది. ఆ కథలను పునర్ముద్రించమని అనేకమంది రచయితలు, పాఠకుల అభీష్టం మేరకు కొద్ది మార్పులు చేర్పులతో వాటిని పాఠకులకు అందజేస్తుంది.

ఆంధ్రుల సామాజిక, కుటుంబ జీవనంలో గత వంద సంవత్సరాల్లో వచ్చిన మార్పులకు ఈ కథాసంకలనం అద్దం పడుతుంది. ఉత్తమ కథలను ఎంపిక చేయడంలో సంపాదకులతో పాటు, ఆనాటి పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు కూడా విశేష కృషి చేశారు. ఉత్తమ కథలను గుర్తించే ప్రమాణాలను ఎంచుకోవడం అంత సులభం కాదు. సామాజిక అభ్యుదయమే గీటురాయిగా పనిజేస్తున్న విశాలాంధ్ర పబ్లిసింగ్ హౌస్ ఆ పరిధిలోనే కథలను ఎంపిక చేయడంలో తన వంతు కర్తవ్యాన్ని నెరవేర్చింది. వడపోత అన్నింటికన్నా కష్టమైంది; క్లిష్టమైంది. కొంతమంది రచయితల కథలకు వారి కథల్లోని భావాల మూలంగానే గాక, భాషమూలంగా కూడా స్థానం లేకుండా పోయింది. అర్హత వున్న కొన్ని కథలకు స్థలాభావం రీత్యా అవకాశం కల్పించలేనందుకు విచారపడవలసి వచ్చింది. అందువల్ల కొంతమంది రచయితల కోపతాపాలకు పబ్లిషింగ్ హౌస్

గురికావాల్సి వచ్చింది. అయితే సామాజిక ప్రగతికి కంకణబద్ధమైన పబ్లిషింగ్ హౌస్‌కు ఆ కోపతాపాలూ, శాపనార్థాలు అంటుకోలేదు. అనతికాలంలోనే అచ్చువేసిన పుస్తకాలన్నీ అమ్ముడు పోయాయి.

**మనదేశ చరిత్ర ఎంతో విలక్షణమైంది; వైవిధ్యభరితమైంది. బహుళ సంస్కృతుల సమ్మేళనమే ఆ వైవిధ్యానికి పునాది. ఈ బహుళత్వాన్ని అవగాహన చేసుకోలేని వాళ్ళు ఒకే సంస్కృతీ సంప్రదాయాల పేరుతో ఉన్మాదంతో ఊరేగుతున్నారు. మన చరిత్రను తిరగరాయాలని ఆ ఉన్మాదులు కోరుతున్నారు; గొడవ చేస్తున్నారు; భౌతిక దాడులకు పూనుకుంటున్నారు. మేధావులనూ, ప్రత్యేకించి రచయితలను లక్ష్యంగా చేసుకుని ఉన్మాద కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఈ కథాసంపుటి అలాంటి ఉన్మాదులకు కనువిప్పు కలిగిస్తుందని ఆశిస్తున్నాం.**

గురజాడవారి "దిద్దుబాటు"తో ఆధునిక కథ శుభారంభం జరిగిందన్న 'పండితాభిప్రాయాన్న' నుసరించే ఆ కథతోనే ఈ సంకలనం ప్రారంభమయింది. ఆ తర్వాత కాలంలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మహోజ్వల పోరాటాలు జరిగాయి. దేశంలో పలు రకాలైన వర్గసంఘాలు ఆ కాలంలోనే పుట్టుకొచ్చాయి. పలు రకాలైన సిద్ధాంతాలూ ఆ కాలంలోనే ఆవిర్భవించాయి. ఆ వెలుగులో వచ్చిన కథలనూ స్వీకరించాం. స్వాతంత్ర్యానంతర కాలంలో తెలుగునాట కూడా సామాజిక, ఆర్థిక జీవనంలో మార్పులొచ్చాయి. దున్నేవానికే భూమి కావాలనే నినాదం నలుదిక్కులా మార్మోగిన కాలపు నాటి కథలనూ స్వీకరించాం. లాటిన్ అమెరికన్ కవి పాబ్లో నెరుడా అన్నట్లు - కవితలు, కథలు అభాగ్య సోదరుల కన్నీరు తుడిచే చేతిగుడ్డలు కావాలి; వారి పోరాటాలకు సాధనాలుగా కత్తులు లాంటి కథలు కావాలి... "రుమాళ్ళుగా, సవాళ్ళుగా, ఎర్రెర్రటి జెండాలు"గా ఆ కథా సంకలనాన్ని స్వీకరించి విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ పాఠకులకు అందిస్తుంది.

అభివందనాలతో

**గడ్డం కోటేశ్వరరావు**

సంపాదకులు

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

విజయవాడ,

6, మార్చి 2017.

# విషయసూచిక


| | రచయిత | కథ | |
|---|---|---|---|
| 1. | గురజాడ అప్పారావు | దిద్దుబాటు | 1 |
| 2. | చింతా దీక్షితులు | మొదటి బహుమానము | 6 |
| 3. | శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి | కలుపు మొక్కలు | 18 |
| 4. | వేలూరి శివరామశాస్త్రి | డిప్రెషన్ – చెంబు | 39 |
| 5. | కవికొండల వెంకటరావు | కంఠధ్వని | 56 |
| 6. | మొక్కపాటి నరసింహశాస్త్రి | మా బావమరిది పెళ్ళి | 64 |
| 7. | చలం | ఓ పువ్వు పూసింది | 78 |
| 8. | విశ్వనాథ సత్యనారాయణ | ఏమి సంబంధము | 88 |
| 9. | అడవి బాపిరాజు | భోగీర లోయ | 96 |
| 10. | కనుపర్తి వరలక్ష్మమ్మ | మా వూరు | 111 |
| 11. | మునిమాణిక్యం నరసింహారావు | వెండి కంచం | 123 |
| 12. | శ్రీనివాస శిరోమణి | చంద్రైకైక పుత్రః | 139 |
| 13. | కరుణ కుమార | టార్చిలైటు | 153 |
| 14. | ఆచంట జానకిరామ్ | తోటమాలి | 158 |
| 15. | మల్లాది రామకృష్ణ శాస్త్రి | రంగవల్లి | 169 |
| 16. | అందే నారాయణస్వామి | ఆత్మీయత | 178 |
| 17. | చక్రపాణి | అహం బ్రహ్మోస్మి | 196 |
| 18. | నార్ల వెంకటేశ్వరరావు | సభ్యత | 199 |
| 19. | కొమ్మూరి పద్మావతీదేవి | రంగ | 208 |
| 20. | కొడవటిగంటి కుటుంబరావు | నువ్వులూ – తెలకపిండీ! | 214 |
| 21. | బుర్రా వెంకట సుబ్రహ్మణ్యం | జేబురుమాలు | 226 |
| 22. | శ్రీరంగం శ్రీనివాసరావు | చరమరాత్రి | 244 |
| 23. | పాలంకి వెంకట రామచంద్రమూర్తి | వెధవ డబ్బు | 258 |
| 24. | గోపీచంద్ | ధర్మవడ్డీ | 263 |

| | | | |
|---|---|---|---|
| 25. | పిలకా గణపతిశాస్త్రి | గాంభీర్యం | 272 |
| 26. | శ్రీ వాత్సవ | కోడెత్రాచు | 282 |
| 27. | రావూరు వెంకట సత్యనారాయణరావు | మధుపర్కాలు | 293 |
| 28 | సోమంచి యజ్ఞన్నశాస్త్రి | బీడీ మారకం | 306 |
| 29. | డాక్టరు జి.వి. కృష్ణరావు | ఉదబిందువులు | 314 |
| 30. | కొడవటిగంటి కృష్ణమూర్తి | ఏ చెట్టు కా విత్తు | 331 |
| 31. | పాలగుమ్మి పద్మరాజు | కరణం కనకయ్య వీలునామా | 339 |
| 32. | ఇల్లిందల సరస్వతీదేవి | ముత్యాల మనసు | 350 |
| 33. | బుచ్చిబాబు | కాగితం ముక్కలు, గాజు పెంకులు | 356 |
| 34. | కప్పగంతుల సత్యనారాయణ | తుంగభద్ర పొంగింది | 365 |
| 35. | విద్వాన్ మల్లాది సత్యనారాయణ | జీవిత మాధుర్యం | 373 |
| 36. | మా గోఖలే | బల్లకట్టు పాపయ్య | 384 |
| 37. | సంజీవదేవ్ | ప్రొఫెసర్ భార్య | 394 |
| 38. | పి.వి. సుబ్బారావు | స్మారక సభ | 403 |
| 39. | భాస్కరభట్ల కృష్ణారావు | ఇజ్జత్ | 414 |
| 40. | ధనికొండ హనుమంతరావు | సత్యవ్రతుడు | 426 |
| 41. | వి.యస్. అవధాని | జ్యేష్ఠుడు | 441 |
| 42. | పన్యాల రంగనాథరావు | అమాయకత్వం | 448 |
| 43. | జమదగ్ని | బళ్లోకి వెళ్లాలి | 466 |
| 44. | కె. లక్ష్మీరఘురామ్ | బంధము | 474 |
| 45. | వేలూరి సహజానందం | జీవిక | 480 |
| 46. | అంగర వేంకట కృష్ణారావు | తొగరుచెట్టు | 486 |
| 47. | యన్.ఆర్. చందూర్ | దరఖాస్తులు | 491 |
| 48. | దాసరి సుబ్రహ్మణ్యం | ముందుచూపు | 498 |
| 49. | దేవరకొండ బాలగంగాధర తిలక్ | నవ్వు | 508 |
| 50. | క్రొవ్విడి లక్ష్మన్న | కోర్టు మార్షల్ | 515 |
| 51. | తూలికా భూషణ్ | మెరీనా తీరే | 525 |
| 52. | రాచకొండ విశ్వనాథశాస్త్రి | వర్షం | 533 |
| 53. | పంతుల శ్రీరామశాస్త్రి | కిల్లీ దుకాణం | 542 |


# గురజాడ అప్పారావు

**(1861 – 1915)**



**ఆ**ధునిక తెలుగు సాహిత్యంలో నాటకానికీ, కవిత్వానికీ, చిన్న కథకు శంకుస్థాపన చేసిన యుగ పురుషుడు. 'దేశమంటే మట్టికాదోయ్ - దేశమంటే మనుషులోయ్' అని తెలుగువారిని మేల్కొల్పిన వైతాళికుడు. కథానికా రచనలో నాటకీయత, క్లుప్తీకరణ, విశిష్టపాత్ర చిత్రణ, పాత్రోచిత సంభాషణ, హాస్య కరుణ రసపోషణ - వీరి పద్ధతి.

**రచనలు :** వ్యాస చంద్రిక, ముత్యాల సరాలు, కన్యాశుల్కము, ఆణిముత్యాలు, లేఖలు, డైరీలు మొదలగునవి.



# దిద్దుబాటు

"తలుపు! తలుపు!"

తలుపు తెరువబడలేదు. ఒక నిమిషమతఁ డూరుకొనెను.

గదిలోని గడియారము టింగుమని ఒంటిగంట కొట్టినది.

"ఎంత ఆలస్యము చేస్తిని? బుద్ధి గడ్డితిన్నది. రేపటినుంచి జాగ్రత్తగా వుంటాను. యాంటినాచల్లా పోయి సానిదాని పాట సరదాలో లగ్నమైపోయినది. ఒక్క పాట సరదాతో కుదరలేదు. మనిషి మీద కూడా సరదా పరుగెత్తుతూంది. లేకుంటే, పోకిరీ మనిషివలె పాట ముగిసినదాకా కూర్చోవడ మేమిటి? ఏదో ఒక అవకాశము కలుగజేసికొని దానితో నాలుగు మాటలు ఆడడపు ఆసక్తి యేమి? ఇదిగో లెంపలు వాయించుకుంటున్నాను. రేపటినుండి మరి పాటకు వెళ్ళను. నిశ్చయం. గట్టిగా పిలిచితే కమలిని లేవగలదు. మెల్లగా తలుపుతట్టి రాముడిని లేపగలిగితినా చడి లేకుండా పక్కజేరి పెద్దమనిషి వేషము వెయ్యవచ్చును."

గోపాలరావు తలుపు చేతనంటగానే రెక్క విడబారెను. "అరె యిదేమి?" అనుకొని, రెక్క మెల్లన తెరవ, నడవలో దీపము లేదు. అంగణము దాటి తన పడకగది తలుపు తీయ, నందును దీపము లేకుండెను. చడిలేక అడుగు వేయుచు మంచము దరికి పోయి కమలిని నిద్రించుచుండెనా, మేల్కొని యుండెనా యని కనుగొన యత్నించెనుగాని, యేర్పరింప లేడయ్యె. అంత జేబునుండి అగ్గిపెట్టె తీసి పుల్ల వెలిగించెను. మంచము పైని కమలిని కానరాలేదు. నిశ్చేష్టుడై చేతినుండి అగ్గిపుల్ల నేలరాల్చెను. గదిని, అతని మనస్సునూ కూడ చీకటి క్రమ్మెను. వెఱ్ఱి శంకలును, అంతకు వెఱ్ఱి సమాధానములను మనసున పుట్టుచు గిట్టుచు వ్యాకులత కలుగజేసెను. బుద్ధి తక్కువకు తనయందో, కానరామికి కమలిని యందో యేర్పరింపరాని కోపావేశమును, చీకాకును గలిగెను. నట్టివాకిటకి

వచ్చి పిలువ చుక్కకాంతిని దాసిగాని దాసుండుగాని కనపడలేదు. వారికి తగిన శిక్ష ఉరియేయని గోపాలరావు నిశ్చయించెను.

తిరిగి గదిలోనికి పోయి దీపము వెలిగించి, గది నలుదెసల పరికించెను. కమలిని కానరాలేదు. వీధిగుమ్మము జేరి తెరిచిచూడ చుట్టకాల్చుచు తలయెత్తి చుక్కల పరీక్షించుచున్న రాముఁడు వీధినడుమ కానవచ్చెను. పట్టరాని కోపముతో వానిని జూచి గోపాలరావు "రామా! రా" యని పిలచెను. రాముఁడు గతుక్కుమని చుట్ట పారవైచి, "బాబు," అని దగ్గరెను.

"మీ అమ్మేదిరా?"

"మా యమ్మా? ఇంటనున్నది బాబూ"

"మీ అమ్మ కాదురా? బుద్ధిహీనుడా? నా భార్య."

"అమ్మగారా? యెక్కడుంటారు బాబూ? పడున్నారు."

"ఇంట్లోనే లేదు?"

రాముడి గుండెలో దిగులు ప్రవేశించెను. గుమ్మములో అడుగు పెట్టఁగానే రాముని వీపుపై వీశగుద్దులు రెండు పడెను. "చంపివేస్తిరి బాబూ". అని రాముడు నేల కూలఁబడెను.

గోపాలుఁడు సదయ హృదయుఁడు. అక్రమ మాచరించితినను జ్ఞానమువెంటనే పొడమి ఆగ్రహావేశము దిగజారి పశ్చాత్తాపము కలిగెను. రామునిచేత లేవనెత్తి, వీపు నిమిరి పశువువలె నాచరించితినని యనుకొనుచు గదిలోనికి తీసుకొని పోయెను.

కుర్చీపయి కూర్చుని "రామా యేమాయెరా?" యని దైన్యముతో ననెను.

"ఏటో మాయలావుంది బాబూ."

"పుట్టింటికి వెళ్ళి యుండునా?"

"అంత వారు కారనా, బాబూ? కోపగించితే చెప్పలేను గాని, ఆడారు చదువు నేరిస్తే యేటౌతది?"

"విద్య విలువ నీకేం తెలుసురా, రామా?" అని గోపాలరావు మోచేతులు బల్లపయినాని వాని నడుమ తలయుంచి యోచించుచుండ కమలిని చేవ్రాలు నొక యుత్తరము కానవచ్చెను. దానిని చదువసాగెను.

"అయ్యా."

"ప్రియ, పోయి 'అయ్యా', కాడికి వచ్చెనా?"

"పెయ్య పోయిందా బాబూ?"

"మూర్ఖుఁడా? వూరుకో."

"అయ్యా! పది దినములాయె. రాత్రు నింటికి మీ రాకయే నే నెరుగను. మీటింగులకు

బోవుచుంటిమంటిరి లోకోపకారకములగు నుద్యమముల నిదురమాని చేయుచుంటి మంటిరి. మా చెలులవలన నిజము నేర్చితిని. నే నింట నుండుటను గదా మీరు కల్లలు పలుకవలసివచ్చె. నేను పుట్టింటనున్న మీ స్వేచ్ఛకు నిర్బంధమును, అసత్యమునకు అవకాశమును కలుగకుండును. మీచే దిన దినమును అసత్యమాడించుటకన్న మీ త్రోవకు అడ్డునుండకుండుటయే. పతి మేలుకోరిన సతికి కర్తవ్యముకాదా? నే నీ రేయి కన్న వారింటికి జనియెద, సంతసింపుఁడు. వెచ్చముగాక యేపాటి మిగిలియున్నను దయనుంచుడు."

ఉత్తరము ముగించి "నేను పశువును" అని గోపాలరావు అనెను.

"అదేటి బాబూ, అలా శలవిస్తారు?"

"శుద్ధ పశువును?"

రాముఁడు అతి ప్రయత్నముచే నవ్వు ఆచుకొనెను.

"గుణవతి, విద్యానిధి, వినయసంపన్నురాలు, నా చెడుబుద్ధికి తగిన శాస్తి చేసినది."

"యేటి చేసినారు బాబూ?"

"పుట్టింటికి వెళ్ళిపోయినది? గాని నీకు తెలియకుండా యెలా వెళ్ళిందిరా?"

రాముఁడు రెండడుగులు వెనుకకు నడిచి "నాను తొంగున్నాను కావల బాబూ? అలకచేస్తే చెప్పచాల్ను కాని బాబు? ఆడదాయి చెప్పకుండా పుట్టినారింటికి యెల్తానంటే లెంపలాయించి కూకోబెట్టాలి గాని, మొగోరిలాగా రాతలూ, కోతలూ మప్పితే ఉడ్డోరం పుట్టదా బాబూ?"

"ఓరీ మూర్ఖుడా? భగవంతుడి సృష్టిలో కెల్లా ఉత్కృష్టమయిన వస్తువు విద్యనేర్చిన స్త్రీ రత్నమే. శివుఁడు పార్వతికి సగం దేహం పంచి యిచ్చాడు. ఇంగ్లీషు వాడు భార్యను బెటర్ హాఫ్ అన్నాడు. అనగా పెళ్ళాము మొగునికన్న దొడ్డది అన్న మాట. బోధపడ్డదా?"

"నాకేం బోదకాదు బాబూ?" రామునికి నవ్వు ఆచుకొనుట అసాధ్యమగుచుండెను.

"నీ కూతురు బడికి వెళ్ళుచున్నది కదా! విద్య విలువ నీకే బోధపడుతుంది. ఆ మాట అలా వుండనియ్యి కాని, నువ్వో, నేనో బయలుదేరి చంద్రవరం వెళ్ళాలి. నేను నాలుగు రోజులు దాకా వూరినుంచి కదలడముకు వీలుబడదు. నువ్వు తాతల నాటి నౌకరువి. వెళ్ళి కమలినిని తీసుకరా. కమలినితో ఏమి జెప్పవలెనో తెలిసిందా?'

"యేటా, బాబూ? బాబు నా యీపు పగలేసినారు. రండమ్మా అంతాను."

"దెబ్బలమాట మరచిపో. కొట్టినందుకు రెండు రూపాయలిస్తాను తీసుకో. మరి యెన్నడు ఆ వూసెత్తకు, కమలినితో గాని తప్పిజారి అనబోయేవు సుమా?"

"అనను బాబూ."

"నువ్వు చెప్పవలసిన మాటలు చెబుతాను. బాగా విను. పంతులుకి బుద్ధి వచ్చింది. ఇక యెన్నడూ సానులపాట వినరు. రాత్రులు యిల్లు కదలరు. ఇది ఖరారు. తెలిసిందా? మిమ్ములను గెడ్డము పట్టుకొని బతిమాలుకున్నానని చెప్పమన్నారు. దయదలచి ఆయన లోపములు బయలు పెట్టక, రెండు మూడు రోజులలో వెళ్ళి పోయి రమ్మన్నారు. మీరు లేని రోజూ యుగముగా గడుపుతున్నారు. అని నిపుణతగా చెప్పు తెలిసిందా?"

"తెలిసింది. బాబూ,"

"యేమని చెబుతావో, నాతో ఒక మాట చెప్పు."

రాముడు తల గోకుకొనుచు, "యేటా యేటా, అదంతా నాకేం తెలదు. బాబూ, నానంతాను, అమ్మా! నా మాటినుకొండి, కాలం గడిపినోణ్ణి. ఆడోరు యెజమాని చెప్పినట్టల్లా యిని పల్లకుండాలి. లేకుంటే మా పెద్ద పంతులార్లాగ అయ్యగారు కూడా సానమ్మ నుంచుగుంతారు. మీ శెవులో మాట. పట్టంలోకి బంగారబొమ్మలాంటి సానమ్మ వచ్చింది. మరి పంతులు మనసు మనసులో లేదు. ఆపై మీ సిత్తం అంతాను."

"ఓరీ వెధవా?" అని గోపాలరావు కోపముతో కుర్చీనుంచి లేచి నిలచెను.

ఊసవలె రాముడు వెలికెగసెను.

అంతట మంచము క్రింద నుండి అమృత నిష్యందినియగు కలకల నగవును, కరకంకణముల హృద్యారావమును విననయ్యెను.



# చింతా దీక్షితులు

**(1891 - 1960)**

**క**థకులలో ఆది గురువులుగా అంగీకరింప బడిన వారు. చిన్నకథకు రూపురేఖలు దిద్ది, పెక్కు పోకడలు పోయి, ఆంధ్ర సాహిత్యంలో ఈ ప్రక్రియకు విశిష్టమైన ప్రాముఖ్యత కల్పించిన ఖ్యాతి వీరికే దక్కుతుంది. భారతీయ సంప్రదాయాన్ని వదులు కొని అన్య జాతి సంప్రదాయాన్ని అనాలోచితంగా అవలంబించడం ఎంత హాస్యాస్పదమో కొన్ని కథల్లో స్పష్టంగా ఎత్తి చూపారు.

**రచనలు :** నూరుకు పైగా కథలు, మిసెస్ వటేరావు కథలు, దీక్షితుల నాటికలు, లక్కపిడతలు, ప్రజా వాఙ్మయం మొదలైనవి.

# మొదటి బహుమానము

ధనుర్మాసంలో రాత్రి మూడో జామునలేచి నగర సంకీర్తనం చేయవలసిందని స్వాములవారు సెలవిచ్చారు. తత్ పూర్వమే భోజనాదికము కూడా ముగించవలసి ఉంటుంది సుమా అని మళ్ళీ జ్ఞాపకం చేశారు.

దానిమీద రుచిపుట్టడం కోసమని ఇంకా కొన్ని విషయాలు సెలవిచ్చారు. హిమాలయ ప్రాంతాల్లో ఉన్న వారంతా రాత్రివేళ లేచి భోజనాదికం పూర్తి చేసుకుని వెచ్చని ఉన్ని బట్టలు వేసుకుని ఇంటి డాబాల మీద కెక్కి సూర్యోదయం కోసం నిరీక్షిస్తూ వుంటారుట. ఎర్రటి సూర్యబింబం తూర్పున దృగ్గోచరము కావడంతోనే వారెక్కడా లేని ఉత్సాహం పడతారుట.

ఆ ప్రాంతాలవారే మరి కొందరు శివరూపాలు ధరించి శంఖాలూదుతూ "శివోహం" "శివోహం" అని ఉచ్చైస్వరాలతో పలుకుతూ నగర సంకీర్తనం చేస్తారుట.

ఆ విధముగానే తెలుగు వారందరూ నగర సంకీర్తనం చేస్తే చూడవలెనని స్వాముల వారి కోరిక – కోరికలు జయించిన స్వాములువారి కోరిక : ఆ విధంగానైనా ప్రాచీన ధర్మం తలయెత్తుతుందేమోనని వారి ఆశ కాబోలు.

"పోనీ ఎవరింట్లో వారు ఎవరిమట్టుకు వారు 'నగర సంకీర్తనం' చేసుకోకూడదా! ఈ కాలంలో ఈ ప్రజలను కట్టుకు రావడం సులభం కాదేమో" అన్నాను జంకుతూ. స్వాములవారి హృదయం విశాలమైనది. కాబట్టి అలాగ చేసినా మంచిదేనని వప్పుకున్నారు.

ఇంతకీ ఈ 'నగర సంకీర్తనం' యొక్క పరమార్థ మేమిటన్నారంటే... శివుడు విష్ణువును మేల్కొల్పాలిట: అనగా జ్ఞానశ – క్రీయాశక్తిని మేలుకొల్పాలిట – భర్త భార్యను మేలుకొల్పాలిట.

ఈ చివర మాట విని నేను నవ్వాను. స్వాములవారు నా నవ్వు భావము గ్రహించి అన్నారు గదా – గార్హస్థ్య ధర్మ మేమిటంటే, భర్త భార్యను మేల్కొల్పడమే; అంతే గాని భార్య ముందుగా లేచి భర్త కోసం కాఫీ కాచి కనిపెట్టుకు ఉండడం కాదు... నిద్రపోతూవున్న భర్తను భార్య చూడ్డం తటస్థించిందంటే ఆవిడకు బ్రహ్మలోక ప్రాప్తి కలుగుతుంది. ఈ రహస్యం ఇప్పటి గృహస్తులు మరిచిపోయారు.

ఇంకో విషయం కూడా స్వాములవారు సెలవిచ్చారు. హిమాలయ ప్రాంతాల్లో యతులకు భిక్ష తెల్లవారక ముందే పెడతారట. తెల్లవారిన తర్వాత సన్యాసులకు భిక్ష దుర్లభం. ఇది కాశ్మీరదేశములో వారి అనుభవాన్ని బట్టి చెప్పిన మాట.

భోజనాదికముతో దేహానికి తృప్తి కలిగించిన తరువాత మనస్సుకు కూడా ఆహ్లాదం కలిగించడానికి డాబాల మీద చిన్న పిల్లలు చేరి సూర్యోదయం కోసం నిరీక్షించడం చాలా గొప్ప విషయం. శ్రీ సూర్యనారాయణమూర్తి బింబదర్శనము మానవ హృదయములోని సౌందర్య పిపాసను తృప్తిపరుస్తుంది. అంతే కాకుండా భక్తిని మొలక లెత్తిస్తుంది : జ్ఞానము నిస్తుంది.

స్వాముల వారి మాటలు మనస్సులో పెట్టుకొని నేను మా ఇంట్లోనే 'నగర సంకీర్తనం' చేస్తే ఎంత బాగుంటుందో అని ఉబలాట పడ్డాను. శివరూపం ధరించడం – అంటే వంటి నిండా విభూతి పూసుకొని రుద్రాక్షలు మెడలో వేసుకొని, త్రినేత్రానికి బదులు కుంఖంబొట్టు పెట్టుకొని... తోలుచీరలూ, శూలా యుధమూ, డమరుకమూ అక్కర లేదనుకుంటాను... శంఖం చేత్తో పుచ్చుకొని "శివోహం" అనుకొంటూ శంఖాన్ని పూరిస్తే ఎంతో బాగుంటుంది. కాని...

## 2

కొన్ని నెలల క్రిందటనే మా ఊళ్ళో ఉన్న మహిళా మణులందరూ చేరి ఒక క్లబ్బు ఏర్పాటు చేసుకొన్నారు. స్త్రీల పురోభివృద్ధి కోసం నిరంతరమూ పాటుపడుతున్న గవర్నమెంటు ఉన్నతో ద్యోగస్తుల పట్టుదలా, శ్రమా ఇందుకు కావలసిన ధనమును సంపాదించిపెట్టినవి. ఈ ధనముతో, స్త్రీల క్లబ్బు కోసం భవనమూ, కూర్చోటానికి కుర్చీలు, బల్లలూ, ఇంట్లో ఆడుకొనే ఆటల సరంజామా బయట ఆడుకొనే ఆటలకు కావలసిన పరికరాలు, వార్తా పత్రికలు ఇంగ్లీషు గ్రంథాలయ బీరువాలు... అన్నీ ఏర్పాటు అయినవి.

ఇక సభ్యురాండ్ర సంగతి – పెద్ద ఉద్యోగస్థుల భార్యలూ, అధమపక్షం సైకిలైనా తొక్కగలిగినవాళ్ళూ, తత్తుల్యులైన ఇతర ధనికుల భార్యలూ, ఇంట్లో పనిపాటలు చేయవలసిన అవసరం లేని వాళ్ళూ ఇలాంటి శ్రీమంతులందరూ నెల చందాలు చెల్లించి

క్లబ్బులో చేరారు. ఇంగ్లీషు రాని వాళ్ళు సభ్యురాండ్రుగా ఉండకూడదనే నియమం లేదు గాని... అందులో చేరిన వారికందరికీ ఇంగ్లీషు వచ్చును. ఇంగ్లీషు మాత్రమే వచ్చునన్నా ఇబ్బంది లేదు. అందులో చాలా మందికి తెలుగు మాతృభాష కాబట్టి తెలుగురాదని చెప్ప చెల్లదు గాని – అక్కడ, ఆ క్లబ్బులో తెలుగు కృషికి కావలసిన పత్రికలు గాని గ్రంథాదులు గాని లేవు. అంతే కాకుండా, ఆ క్లబ్బులో తెలుగు మాట్లాడడం న్యూనతగా భావిస్తారు.

ముఖ్యనియమ మేమిటంటే అక్కడి సభ్యత్వం స్త్రీలకు మాత్రమే. పోతుటీగ లోపలకి పోవడానికి వీలు లేదు.

అది "లేడీస్ కల్ చర్ క్లబ్", అంటే విజ్ఞానధనులైన మహిళామణుల సంఘమన్నమాట. కల్చర్ అంటే బహు గ్రంథావలోకనము., లోక సంచారము. సజ్జన సాంగత్యాదుల వల్ల కలిగే అతఃకరణసంస్కారము. ఈ కల్చర్ ఈ కాలంలో ఒక్క ఇంగ్లీషు చదువుకొన్న స్త్రీ పురుషుల వద్దనే ఉన్నది. దీని బాహ్యలక్షణాలు ఈనాటివి కొన్ని చెప్పవలసివస్తే – టెన్నీసు ఆడడమూ, స్వెట్టర్లు వేసుకోవడమూ సిగరెట్లు పీల్చడమూ. నిరంతరమూ ఇంగ్లీషులో సంభాషణ సాగించడమూ, చవకరకం ఇంగ్లీషు నవలలు పఠించడమూ. రోజు రోజుకూ కొత్త కొత్త ఫ్యాషన్ల ననుసరించి జుట్టు కట్టులను మార్చుకోవడమూ – చెప్పవలె. అంతర్లక్షణాలు, తన దేశానికి సంబంధించిన వేషభాషాదులను ఏవగించుకోవడము.

నిజము చెప్పవలసివస్తే అంగిరీజుల ప్రభుత్వం వల్ల మనకు దాపరించిన యితర మేళ్ళతోపాటు ఈ కల్చర్ ఒకటి.

అసలు చెప్పదలుచుకున్న విషయం ఏమంటే – ఈ క్లబ్బులో నా భార్య సభ్యురాలైంది. యమ్మే ప్యాసైన యువతీవతంసమును భార్యగా చేసుకొనగలిగే భాగ్య మెందరికి పట్టుతుంది: మే ముభయులమూ ఇంట్లో ఇంగ్లీషు మాట్లాడుకొంటూ, ఇంగ్లీషు దుస్తులు వేసుకొంటూ, ఇంగ్లీషు పత్రికలు చదువుకొంటూ – ఇల్లు ఇల్లంతా కల్చరల్ మయము చేశాము కొన్నాళ్ళు. పెళ్ళయిన కొత్తలో మాకు పుట్టే పిల్లలు కూడా పుట్టీపుట్టడంతోనే ఇంగ్లీషు ఏడుపు ఏడుస్తూ, ఇంగ్లీషు నవ్వులు నవ్వుతూ కల్చర్‌తోనే పుడతారని అనుకొన్నాము; కాని వాళ్ళు చీమిడి ముక్కులు వగైరాలతోనే తయారైనారని చెప్పడానికి చాలా విచారంగా వున్నది. వాళ్ళని కాన్‌వెంట్ స్కూలులో అప్పజెప్పాము. కొత్తలో రుచ్యంగా వున్న మా ప్రణయము క్రమ క్రమంగా ఏళ్ళు గడచిన కొద్దీ వెలవెల్లాడడం మొదలుపెట్టింది. నేను ఒక మోస్తరు పూర్వాచారపరాయుణ్ణి అయినాను. నా భార్య మాత్రం కల్చర్డు లేడీగానే ఉండిపోయింది. అందువల్లనే క్లబ్బులో సభ్యురాలైనది కూడా.

ఇందువల్ల మా ఉభయులకూ అన్యోన్యం చెడిందని చెప్ప వీలులేదు. కాని మత భేదం మాత్రం కలిగింది. నేను పూజలూ పునస్కారాలూ చేస్తానంటే. నా భార్య మా

ఇంట్లో టీ పార్టీల కేర్పాటు చేస్తుంది. నేను గోడలకు దేవుళ్ళ విగ్రహాలు తగిలిస్తే అవి తీసేసి చవకరకం ఆర్టు బొమ్మలూ, సినిమా స్త్రీ పురుష తారల బొమ్మలూ ఆమె తగిలిస్తుంది. నేను పిల్లలకు బొట్టు పెడితే చెరిపేసి సబ్బుతో వాళ్ళమొహాలు కడిగి తెల్లసుద్దగుండ పూస్తుంది. లక్షణంగా మొహానికి పసుపు రాసుకొమ్మని ఒకమాటు నేను చెప్పినప్పుడు మా ఇద్దరికీ ఐరోపా మహాసంగ్రామ మంత పని జరిగింది. ఫేసుపౌడరు బదులు తనూ పిల్లలూ స్వచ్ఛమైన ఐశ్వర్య ప్రదమైన విభూతి పూసుకోరాదా అని ఒకనాడు హాస్యానికీ నేననేసరికి నాకు రెండు రోజులు ఇంట్లో భోజనం దుర్లభం అయింది.

ఇలాటి నా భార్యకు ఒకనాడు హఠాత్తుగా నామీద, నా పూర్వాచార పరాయణత్వము మీద అభిమానం కలిగింది. కారణం ఎంత ఆలోచించినా తెలియలేదు. కొంత వయస్సు దాటిన తరువాత బుద్ధి పరిణతమై మంచి మార్గములు పట్టవచ్చు గదా? నా భార్యకు అలాంటి మార్పు కలిగిఉండవచ్చు ననుకొన్నాను.

స్వాములవారు సెలవిచ్చిన ప్రకారం నగర సంకీర్తనం జరపడానికి నిశ్చయించు కొన్నట్లు నా భార్యతో చెప్పాను. నేను శివరూపం ధరించి, శంఖము ఊదుతూ, శివోహం అంటూ ఇంట్లో నగర సంకీర్తనం చేయదలిచాను కాబట్టి, తాను నా సహ ధర్మచారిణి కాబట్టి నాతోపాటు తానున్నూ పార్వతీ రూపం ధరించవలసిందని కోరాను. ఆ మాట అనడంతోనే నా భార్యకు కోపం వచ్చింది. తానెప్పుడూ అటువంటి వేషాలు వేసి ఎరగననీ, – సకృత్తుగా క్లబ్బులో నాటకం వేషాలు వేసేది కాని. ఆ సమయంలో అది జ్ఞాపకం చేస్తే దెప్పి పొడిచానని అంటుందని ఊరుకొన్నాను – తనను తృణీకరించడమూ న్యాయము కాదనీ తన తల్లిదండ్రు లీమాట విన్నట్లయితే ఇట్టి అల్లుడు వంటి దుర్యోగము తమకు ప్రాప్తించినందుకు విచారిస్తారనీ, ఏమేమో చెప్పింది.

పార్వతివేషం వేయడమంటే విభూతి పూసుకో నక్కరలేదన్నాను; కొంచెం పసుపు మొహానికి రాచుకుంటే చాలునన్నాను; కుంఖంబొట్టు పెట్టుకొంటే బాగుంటుందన్నాను – అంటూంటే భయపడ్డట్టు నటిస్తూ, అమ్మో పాములు కూడా మెళ్ళో వేసుకోమంటారు కాబోలునంది. కుంఖంబొట్టు పెట్టుకోవడం పాముల్ని మెళ్ళో వేసుకోవడంతో సమానంగా భావించినందుకు విచారించాను. పాములు నేనూ వేసుకోను నువ్వూ వేసుకోనక్కరలే దన్నాను.

పోనీ రబ్బరు పాములు తెచ్చిపెడుదునా అంది.

నాకు కోపం వచ్చింది. పెడమొహం పెట్టాను. నా కోపం చల్లార్చడానికన్నట్లు తాను పార్వతి వేషం వేయడానికి వప్పుకుంది.

వప్పుకొన్న రోజు మొదలు కొని నన్ను వేధించడం మొదలుపెట్టింది. ఏ చీర

కట్టుకుంటే బాగుంటుందనీ, చేతులూ మెడా లేని రవికలు తొడుక్కోవచ్చునా అని. తల్లో సూదులు పెట్టుకోవచ్చునా అనీ, జడలేసుకొంటే బాగుంటుందా, ముడివేసుకొంటే బాగుంటుందా అనీ, జోళ్ళు తొడుక్కోవచ్చునా అనీ ఈ విధంగా : అయినా ఎంతో ఉత్సాహంగా పార్వతి వేషం వెయ్యడానికి ఉబలాట పడుతున్నట్లుగా కనిపించింది. రవివర్మ వ్రాసిన పార్వతి బొమ్మ చూపి అటువంటి వేషం వేసుకోరాదా అంటే కొంత సందేహించి, అనాగరకమంటూ సణుగుకొని కొంత సేపటికి వప్పుకుంది.

ఆమె నా మతములోనికి దిగినందుకూ, పార్వతివేషం వేయడానికి సమ్మతించినందుకు ఎంతో సంతోషించాను. నిజంగా నా భార్య కల్చర్డు లేడీ అని అప్పుడు విశ్వసించాను.

## 3

ధనుర్మాసంలో ఒకనాడు తెల్లవారకుండా లేచి చన్నీళ్ళ స్నానం చేశాను. తుడుచుకొని వంటినిండా విభూతి పూసుకొన్నాను. భార్య నాకోసమని తెచ్చిన పెద్ద పులి బగ్గీల బట్ట కట్టుకొన్నాను. నొసట కుంఖంబొట్టు పెట్టుకున్నాను. గదిలో పీట వేసుకొని కూచోబోతూంటే ఆమె వచ్చింది. నా జుట్టు పైకి ఎగదీసి ముడివేసింది. దానిలో డాకురేకు చంద్రుణ్ణి దోపింది. వద్దు మొర్రో అంటూంటే వినక రెండు చేతులకీ రెండు రబ్బరు పాముల్ని కట్టి పెట్టింది. దారంతో ఎక్కడ సంపాదించిందో ఎముకల హారమొకటి నామెళ్ళో వేసింది. బుడబుక్కల వాడి దగ్గర తాను కొన్న దమరుకము నా వేళ్ళకు కట్టింది. ఎక్కడ సంపాదించిందో పులిచర్మం తీసుకువచ్చి పీటమీదవేసి దాని మీద కూర్చోమంది. పక్కనే శంఖం పెట్టి ఉండుండి ఊదమంది.

రబ్బరుపాములూ, ఎముకల పేళ్ళూ నా కక్కరలేదని దెబ్బలాడాను. రుద్రాక్ష మాల వేసుకోనిమ్మన్నాను. విన్నది కాదు. కోపంవచ్చి తీసివేయబోయాను. అప్పుడు నవ్వుతూ నా దగ్గరకు వచ్చి చెక్కిళ్ళు దువ్వి పెదవులమీద ముద్దు పెట్టుకుంది. వెంటనే పక్కగదిలోకి వెళ్ళి చేతులూ ముఖం పెదవులూ సబ్బుతో కడుక్కోవడం నేను కనిపెట్టాను. గదిలోనుంచి తిరిగి వచ్చి పెట్రోమాక్సులైటు నాకెదురుగా కట్టింది. కాంతి పూర్తిగా నామీద పడేలాగ.

నాకు అంత వినయంగా ఉత్సాహంతో సహాయం చేసినందుకున్నూ నన్ను ముద్దు పెట్టుకున్నందుకున్నూ నేనెంతో ఆనందం చెందాను. త్వరగా పార్వతివేషం వేసుకు రమ్మన్నాను.

ఆమె నాకెదురుగా నిలబడి నిదానించి చూచి మెచ్చు కొన్నట్లు తలతిప్పి నవ్వుతూ

ఏదీ శంఖం ఊదండంది. నేను 'శివోహం శివోహం' అని కేకవేసి శంఖం వూదాను. ఆమె చప్పట్లు కొట్టి, బాగు, స్ప్లెండిడ్, కాపిటల్ అంది.

పార్వతీ వేషం వేసుకొని వస్తానని చెప్పి, పచ్చచీర కట్టుకుంటే బాగుండదా అని సలహా అడిగి ఏదో బహుమానం సంగతి గొణుక్కుంటూ వెళ్ళిపోయింది.

"నగర సంకీర్తనం" ప్రారంభించా నన్నమాటే: నా భార్య కూడా చప్పున వేషం వేసుకు వస్తే ఇద్దరం కూర్చుని నగర సంకీర్తనం ప్రశస్తంగా చేయవచ్చు ననుకొన్నాను. అరగంటయింది.

ఆమె రాలేదు. స్నానం చెయ్యాలి. పసుపు రాసుకోవాలి. చీర ధరించాలి. ఆభరణాలు పెట్టుకోవాలి. తల్లో పువ్వులు పెట్టుకోవాలి – ఏవేవో గొడవలన్నీ ఈ ఆడవాళ్ళకి. ఆమెను తొందర చెయ్యడానికని శివోహం గట్టిగా ఉచ్చరిస్తూ, ఉండుండి శంఖం ఊదడం మొదలు పెట్టాను. గంటయింది. నా భార్య రాలేదు. ఎంత చదువుకొన్నా, ఎంత కల్చరున్నా ఈ ఆడవాళ్ళు ఆడవాళ్ళే – కాసంత పార్వతి వేషం వేసుకు రావడానికే ఇంతాలస్యమా? – మళ్ళీ నా భార్యను పిలవడానికని శివోహం అని గట్టిగా కేకవేసి శంఖం ఊదుతున్నాను. పూర్తికాకముందే ప్రవేశించింది ఆమె; నే నాశ్చర్యపడ్డాను. నా భార్య వేషం వేసుకోలేదు. గంట దాటినా వేషం వేసుకో తీరింది కాదా అని అడగబోతూంటే ఒకరి వెనుక ఒకరు అయిదుగురు ఆడవాళ్ళు నా గదిలో ప్రవేశించారు. నాకు సిగ్గేసింది. నా కంటె వాళ్ళు ఎక్కువ సిగ్గుపడుతూన్నట్లు చూచాను. అయిదుగురూ నాకేసి పరకాయించి చూచారు. "దీని పేరేమిటి." అన్నది ఒకామె. ఈవిడకి నేను కనిపించడం లేదు కాబోలు – "దీని"అని అమహత్తు ప్రయోగిస్తోందేమిటి చెప్మా. ఇది కల్చరు లక్షణమా అనుకొన్నాను. నా భార్య "ఇది శివరూపం. ఈయన నా ప్రియభర్త అని మీతో చెప్పడానికి నాకెంతో సంతోషంగా వున్నది" అన్నది ఇంగ్లీషులో.

ఆ సాధ్వీమణులు అయిదుగురూ ముసిముసినవ్వులు నవ్వుకున్నారు. నా దగ్గరకి కొద్ది కొద్దిగా వచ్చి పరీక్ష మొదలు పెట్టారు. దీపకాంతీలో తళతళా మెరిసిపోయే డాకురేకు చంద్రుణ్ణి చూచి మెచ్చుకొన్నారు. వంటినిండా ఉన్న విభూతిని ఫేసుపౌడరేమోనని అనుమానించి నన్నవమాన పరిచారు. మెళ్ళో ఎముకల పేరు చూచి భయపడి వెనక్కి ఉలిక్కిపడి వెళ్ళారు. "హారిడ్" అని ఒక ఇల్లాలు మూర్ఛపోయేటంత పని చేసింది. దగ్గిరికి రాకుండా దూరాన్నుంచే నా చేతులనున్న పాముల్ని చూచి పారిపోబోకు, రబ్బరుపాములేనని నా భార్య చెప్పినా, పూర్తిగా నమ్మక నిజము తెలుసుకునే ఉద్దేశముతో ఒక ఇల్లాలు గొడుగుతో నా జబ్బమీద పాముకింద పొడిచింది. లేచి వాళ్ళను తరిమివేద్దామా అన్నంత

కోపం వచ్చింది. గాని నా భార్య నవ్వుముఖం, నా కేసి తిరిగి గాలిలో నన్ను ముద్దెట్టుకున్నట్టు అభినయించే నా భార్య నవ్వుముఖం చూచి ఊరుకొన్నాను. "ఇది - ఈ- ఈ మనిషి క్షమించండి. ఈయన మీ భర్తా?' అని ఒకావిడ నా భార్యను సానుభూతితో అడిగింది. అయిదుగురు శ్రీమంతులూ నా భార్య దౌర్భాగ్యానికి జాలి చూపుతూ నిలబడి పోయినారు. నా భార్య మాత్రం సగర్వంగా నవ్వుతూ నిలబడింది. ఇంక పాకం ముదరనిస్తే ఈ విధంగానే నన్ను అవమానపరుస్తారని నిశ్చయించుకొని ఎలాగ వీళ్ళని తరమడమా అని ఆలోచించి. ఒక్కమాటు ఆవేశపూర్వకంగా డమరుకం వాయించి, "శివోహం" "శివోహం" అని కేకవేసి, శంఖం - వెనుక భీముడు కురుక్షేత్ర యుద్ధరంగంలో ఊదినట్లు - ఊదాను. శంఖం ఊదితే శత్రు రాజుల స్త్రీలకు - ముఖ్యంగా గర్భిణులకు ప్రమాదం సంభవించేదిట పూర్వం. ఊదడంతోనే అయిదుగురు చెల్లాచెదరై పోయారు. దరిమిలాను వాళ్ళకేమయినా ప్రమాదం కలిగిందేమో తెలియలేదు. నా భార్య వాళ్ళవెంట వెళ్ళిపోయింది.

పది నిమిషాలకి దూరాన్నించి ఒక మోటారు కారు మొరిగి పారిపోతూన్న చప్పుడు వినిపించింది. నా భార్య ఇంట్లో ఉన్నదేమోనని చూచాను. లేదు. వాళ్ళతో తానూ కారెక్కి వెళ్ళిపోయింది.

ఇదంతా నా కర్థం కాలేదు. పార్వతి వేషం వేసుకొని నా భార్యను రమ్మని పంపితే ఈ అయిదుగురు స్త్రీలనీ ఎందుకు తీసుకువచ్చినట్లు? పురుషుడని సందేహం లేకుండా వాళ్లంతా నన్నలాగ పరీక్ష చెయ్యడమేమిటి? నా భార్య వాళ్ళతో కారెక్కి లేచిపోవడమేమిటి? భక్తి శ్రద్ధలతో చేయవలసిన "నగర సంకీర్తనం" ఈ విధంగా పరిణమించింది.

స్వాములవారితో నా నగర సంకీర్తన చరిత్ర ఏ ముఖం పెట్టుకొని చెప్పగలను?

నా భార్య ఇంటికి వచ్చాక ఏమి చెప్తుతుందో అడిగి తీరుతాను. తప్పకుండా నన్నవమాన పరచడానికే ఈ విధంగా కుట్రపన్ని ఉంటుంది. దీనికి శిక్ష ఏమిటా అని ఆలోచన మొదలు పెట్టాను. అక్కసుతో నిండిన నా మనస్సు అనేక ఉపాయాలు చెప్పింది. ఇంటికి వచ్చాక నా భార్య పీక నులిమి వెయ్యవచ్చు; లేదా ఇంట్లో దూలానికి ఉరి తియ్యవచ్చు : లేదా ఒక గదిలో తాళం వేసి తిండిపుట్టకుండా మాడ్చివేయవచ్చు - ఇంకా ఎన్నెన్నో ఊహలు తోచాయి.

## 4

కొన్ని గంటలైన తర్వాత నా భార్య ఇంటికి వచ్చింది. నేను వేషం మార్చి వేసి మామూలు బట్టలు కట్టుకొని కూర్చున్నాను. వచ్చీ రావడంతోనే ఆమె నన్ను కౌగలించుకొని ఊపిరి సలపకుండా ముద్దెట్టుబోవడం మొదలు పెట్టింది. తన కంటి పాపనట నేను -

నేను పీచ్ అనే పండునుట – తన ప్రియమైన భర్తనట – తన మొహం మీద మొటిమనట– తన డార్లింగునట – తన చీరనట – తన రవికనట – ప్రతి మాట మధ్యనీ నా మీసాలు లాగుచూ నా పెదవుల మీద ముద్దు పెట్టుకొనేది.

నా భార్యకు మతిపోయిందేమో ననుకొన్నాను – హిస్టీరియా లక్షణాలు సంక్రమించాయేమో నని సందేహించాను – కాని అవేమీ కావు. తనకి పట్టరానంత సంతోషం నా వల్ల కలిగిందట. క్లబ్బులో తనకు గల స్థానం నా వల్ల లభించిందట– నా వల్ల తన కేదో బహుమానం వచ్చిందట –

స్వభార్య ఈ విధంగా భర్త యెడల ప్రవర్తిస్తుంటే – ఎంత ఉరితీయదలచుకొన్నా భర్త అన్న వాడు భార్య పట్ల సుముఖుడు గాక మాంతాడా? నేను సుముఖుడను అవడానికి అభ్యంతరం యేమిటి? నేను సుముఖుణ్ణి అయ్యాను. అవడానికి యింకో కారణం ఉంది. అది ఏమిటంటే – ఆమె నన్ను లాలించి పైట సవరించుకొంటూ బయటకెళ్ళి పక్కగదిలో తాను వచ్చేటప్పుడు తీసుకొని వచ్చి దాచి పెట్టిన అట్టపెట్టెలు నాలుగు రెండు చేతులతో పట్టుకు ప్రవేశించి వాటిని బల్లమీద పెట్టింది. అవి తనకూ నాకు వచ్చిన బహుమానాలట. వాసన నూనే, పౌడరూ, అత్తరువూ, దువ్వెనా మొదలైన వస్తువులున్న తళతళా మెరిసిపోయే "టాయిలెట్ సెట్టు" తనకు వచ్చిన బహుమానమట.

క్షవరానికి పనికి వచ్చే "సేవింగు సెట్టు" నాకు వచ్చిన బహుమానమట.

పైటకు గుచ్చుకొనే నగిషి బంగారు "బ్రూచి" తనకు వచ్చిన బహుమానమట. ఐదు అంగుళముల ఎత్తు గల నటరాజ విగ్రహం నాకు వచ్చిన బహుమానమట.

షేవింగు సెట్టును చూస్తే వళ్ళు మండినా, నటరాజ విగ్రహాన్ని చూచి పరవశుడనై బంగారు "బ్రూచి" తీసి నా భార్య పైటకు గుచ్చి నా ఆనందాన్ని వెలిబుచ్చాను.

ఇంతకీ ఈ బహుమానాలేమిటి? ఎందుకు? తన క్లబ్బులో మెంబరు కాబట్టి బహుమానాలు పొందవచ్చును గాని ఏమీ సంబంధం లేని నా కెందుకీ బహుమానాలు? ఇదంతా ఏదో కుట్ర అనుకొని నా భార్యను సమాధానం చెప్పమన్నాను. మా యింటి కా స్త్రీలు ఎందుకొచ్చారో చెప్పమన్నాను.

వచ్చిన బహుమానాలు పుచ్చుకొని ఊరుకోక ఎందుకీ కుశ్శంకలు అని నన్ను మభ్య పెట్టడానికి ప్రయత్నించింది నా భార్య. నేను సాగనివ్వలేదు. చెప్పితే కోప్పడనని మాటయిస్తే చెప్తూతానంది. నేను వాగ్దానం చెయ్యనన్నాను. నటరాజ విగ్రహం ఎంత బాగుందో చూడండి అంది. సమాధానం చెప్పి తీరాలన్నాను. మీరే కాదు. మీ బోటివారు చాలా మంది వున్నారంది. వాళ్ళకు బహుమానాలు రాలేదంది. అనుమాన మెక్కువై సమాధానం చెప్పి తీరాలన్నాను.

ఆమె చివరకి చెప్పిన సంగతులు :

ఒకనాడు లేడీస్ కల్చర్ క్లబ్బులో సభ్యురాండ్రంతా సభ జరిపారు. వినోదంగా కాలక్షేపం చెయ్యడమే క్లబ్బు యొక్క ఆశయము. ఈ సభ కూడా వినోదార్థమే. కొన్ని విషయాలు చర్చించుకొన్న మీదట వినోద విషయం చర్చకు వచ్చింది. ప్రతి సంవత్సరమూ సభ్యురాండ్రలో ఒక్కరికి ఇచ్చే బహుమానం ఈ యేడు ఏ విధంగా ఇయ్యడమని చర్చించారు.

పరుగుల పందెములు పెట్టితే బాగుంటుందన్నారు కొందరు. ఈత పందెం మంచి దన్నారు కొందరు. ఎవరు అందరికన్నా అందమైన డ్రెస్సు వేసుకొంటారో వారికా బహుమానం ఇయ్యకూడదా అంది ఒక ఇంగ్లండు వెళ్ళివచ్చిన స్త్రీ సిగరెట్టు కాలుస్తూ డబ్బు సర్దుబాటు కాని సభ్యురాండ్రు పనికిరాదన్నారు.

జడలకని కొందరు, ముడులకని కొందరు ఆభరణాల కని కొందరు పారితోషక మివ్వవచ్చునని పరిపరివిధాల చెప్పారు. పోనీ సంతానాన్ని బట్టి యివ్వకూడదా అని పక్క ఆమెతో అంది ఒక బహు సంతానవతి. ఈ విధంగా చర్చ జరుగుతూండగా ఒకావిడ ఒక ప్రపోజల్ చేసిందట. ఆవిడ పేరు నా భార్య చెప్పలేదు (నా భార్యయేమో నని అనుమానం). ఆ మాట వినడంతోనే అందరూ నిర్వాక్కులైనారు. కొంతసేపటికి అందరూ తేరుకున్నారు. బహు సంతానవతి వినాగా అందరూ ప్రపోజల్ బాగుందంటే బాగుందన్నారు. ఏకగ్రీవంగా అంగీకరించారు.

మగాడికి వలెనే ఆడదానికి కూడా వ్యక్తి స్వాతంత్ర్యం వుండాలి. ఇంతవరకూ మగవాడు ఆడదాన్ని బానిసగా చూస్తున్నాడు. ఇప్పుడు మగవాడికి బుద్ధి చెప్పవలసిన బాధ్యత ఆడదానికి వుంది. ఈ బుద్ధి చెప్పడం అనేక విధాల చెయ్యవచ్చును. కొట్టిగాని, తిట్టిగాని, సాధించి గాని, ఏడ్పించిగాని తిండి పెట్టకగాని చాకిరీ చేయించుకొని గాని, కూడా తిప్పుకుని గాని – ఏ విధంగానైనా చెయ్యవచ్చును. ఆనాడు ఆ సభలో నిర్ణయము చేసిన విషయము ఏమిటంటే ఇష్టమున్న సభ్యురాండ్రందరూ తమ తమ భర్తల్ని దద్దమ్మలను (ఫూల్సును) చెయ్యడానికి ప్రయత్నించాలి. ఎవరు ఈ విషయంలో ఎక్కువ నేర్పు చూపుతారో వారికి ఈయేటి బహుమానం. ఈ బహుమానానికి అర్హత భార్యాభర్తలిద్దరికీ ఉంటుంది గాబట్టి ఈయేటి బహుమానం భార్యా భర్తలిద్దరికీ ఉపయోగించే విధంగా ఉండడానికి తీర్మానించారు.

తీర్మానమైన తరువాత సభ్యురాండ్రలో అయిదుగురిని నిర్ణాయకురాండ్రుగా ఉండడానికి నిర్ణయించారు. వీరు ప్రతి సభ్యురాలి యింటికీ వెళ్లడమూ, ఆమె భర్తను చూడడమూ, ఏ విధంగా అతను ఫూలయ్యాడో గ్రహించడమూ. చివరకు బహుమాన

మెవరికిచ్చేది నిర్ణయించడము. వారము రోజులు సభ్యురాండ్రకు తీరిక లేదు. అందరూ ఆలోచనల్లో మునిగారు. అనేక సంఘటన లాలోచించారు. ఎవరిమట్టుకు వారే తమ రహస్యాన్ని ఇతరులకు చెప్పకుండా గుట్టుగా పెట్టుకొన్నారు. గడువు నాటికి అందరూ సిద్ధంగా వున్నారు. నిర్ణాయక రాండ్రు అందరినీ చూచి వచ్చి బహుమానం నా భార్యకివ్వడానికి నిశ్చయించారు.

నాకు కోపం మండిపోతోంది. నాతోపాటు చాలా మంది దురదృష్ట వంతులున్నారు అని కోపము దిగమింగాను. మిగిలిన వాళ్ళు తమ భర్తలను ఏ విధంగా చేశారని నా భార్య నడిగాను.

ఎప్పుడూ దొరలడ్రెస్సు వేసుకొనే ఒక ఉద్యోగస్తుడిచే పంచ కట్టించింది. ఒకావిడ బలవంతాన.

ఇంకో ఆవిడ తాను నవల చదువుకొంటూ సిగరెట్టు కాలుస్తూ కూర్చుని తన భర్తచేత వంటయింట్లో కాఫీ పెట్టిస్తోంది.

ఇంకో ఆవిడ తన భర్తను ఏదో మభ్యపెట్టి, అతనికి చీర కట్టి, రవిక తొడిగి, గాజులు పెట్టి ఆడవేషం వేయించింది. తాను ఇజారు తొడిగి, చొక్కా వేసుకొని మొగవేషం వేసింది. ఇద్దరూ కూర్చుని మాట్లాడుకుంటుండగా జడ్జీలు వెళ్ళారుట.

"వాళ్ళకెందుకిచ్చారు కారూ బహుమానం?" అన్నాను. "ఇవ్వవలసిందే. కాని ఆడవేషం వేసిన ఆ మగపురుషుడు పరాయి స్త్రీలు వచ్చారని మండిపడి వాళ్ళను కొట్టేంత పని చేశాడు. భార్యాభర్తలిద్దరికీ ఆరోజు నుంచి విరోధం, జడ్జీలు పారిపోయి వాళ్ళకు బహుమానం లేకుండా చేశారు.

ఇంకో ఇల్లాలు అటకమీద కెక్కి కాస్త ఆవకాయకుండ దింపమని చెప్పి తడి అంగోస్త్రం కట్టించి, భర్త తీరా ఎక్కాక నిచ్చెన తీసివేసి జడ్జీలు వచ్చే దాకా ధుమ ధుమలాడుతూ చెంకుకొంటూ ఉండేలాగ చేసింది.

నాకు ఈ ఆడవాళ్ళ చేష్టలు వింటున్నకొద్దీ అరికాలు మంట నెత్తికెక్కింది. ఇక చాల్లే అని నా భార్యను దండించడానికి మొదలు పెట్టాను.

"నా తప్పేముంది ఇందులో? మీరే ఈ వేషం వేస్తానన్నారు గదూ? చచ్చీచెడి మీకోసం డమరుకం, చంద్రుడూ, పాములూ, హారాలు తెచ్చిపెట్టినందుకా ఈ ఆగ్రహం : మొగాళ్ళకి కృతజ్ఞత ఉండదు కాబోలు : మీకు సహాయం చేసి నందుకేనా యింత చేస్తున్నారు. మిమ్మల్ని నేను శివవేషం వెయ్యమన్నానా? మిమ్మల్ని అటక ఎక్కించి, రవిక తొడిగించానా? వాళ్లే నయం పాపం, భార్యలేమి చేసినా కిక్కురు మనకుండా ఊరుకొంటారు. ఇంతకీ మీరు వేషం వేసుకోవడ మేమిటి? తప్పు నా మీద పెట్టడమేమిటి?"

"మరి వాళ్ళని... ఆ..... ఆ.... పశు..... గయ్యా..... ఆ స్త్రీలను ఎందుకు మనింటికి తీసుకువచ్చావు?" అన్నాను పళ్ళు కొరుకుతూ, "తీసుకువచ్చా కాబట్టే బహుమానం వచ్చింది. లేకపోతే మీ వేషాలు చూచి మీ మొహాలు చూచి సంతోషించే వాళ్ళెవళ్ళూ. చాల్లెండి? నాతో మాట్లాడకండి అని" నా భార్య విసిరి కొడుతూ లేచిపోయింది. నన్ను కృతఘ్నుడని నిందిస్తూ...

నిజమే : తప్పు నా భార్య దెలా గవుతుంది? నన్ను ఈ రూపం ధరించమన్న వాళ్ళ దవుతుంది తప్పు. అవును ఆ స్వాములవారే ఇందుకు కారణం.

కొన్నాళ్ళకు స్వాములవారి దర్శనలాభం కలిగింది. నమస్కరించాను.

"చేశావా నగర సంకీర్తనం" అన్నారుస్వామి.

"చిత్తం. సద్యః ఫలం కూడా కలిగింది" అన్నాను.

"నేను చెప్పలేదూ :" అన్నారు స్వాములవారు – ఆ సద్యః ఫలమేమిటో అడక్కుండా.



# శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

**(1891 - 1961)**

**క**వి, నాటకకర్త, నవలాకారుడు, కథా రచయిత, పత్రికాధిపతి, భాషా సేవకులు, కథని ప్రారంభించుటలో, పాత్రల సృష్టిలోనూ, పోషణలోనూ, శైలిలోనూ, సంభాషణలు వ్రాయుటలోనూ, భాషలోనూ, శీర్షికలు పెట్టుటలోనూ వీరికి ప్రత్యేకత వున్నది. మధ్యతరగతి బ్రాహ్మణ, క్షత్రియ కుటుంబాల వ్యవహారాలూ, స్థితిగతులూ వీరి రచనల్లో ప్రతిబింబిస్తాయి.

**రచనలు :** విషభుజంగం, రక్షాబంధనం, ఆత్మబలి మొ॥ (నవలలు), ప్రేమపాశం, రాజరాజు మొ॥ (నాటకాలు), 13 సంపుటాల కథలూ, అనుభవాలూ - జ్ఞాపకాలూ.

# కలుపు మొక్కలు

"చిత్తం చిత్తం ఒక్క కలంపోటుతో తమరొక్క బ్రాహ్మణ కుటుంబానికి యావజ్జీవమూ అన్నం పెట్టించగలరు."

"అన్నం పెట్టినా సున్నం పెట్టినా జిల్లా బోర్డు ప్రెసిడెంటుగాని, నావల్ల యేమవుతుందీ?"

"పేరు మట్టుకి వారిదే అంటే, మనవి చేసుకుంటాను. ఒక సత్రం వుందంటే దాన్ని ప్రతిష్ఠించిన దాత పేరూ, కనిపెట్టుకుని వుండి అక్కడ సర్దుబాట్లు చేసే గుమాస్తా పేరూనూ, అయితే ఆ దాత ఆజ్ఞని శిరసా వహించడమే ఆ గుమాస్తా విధి కాదా మహాప్రభూ?"

"నేను దాతను కానే? ప్రసిడెంటు అంటే గుమాస్తా కూడా కాదే?"

"తమరలా సెలవిప్పిస్తే నేనేం మనవి చేసుకోగలనూ? సబ్ కలెక్టరు దొరవారి శిఫారసు తోసేసి యే ప్రెసిడెంటు బతగ్గలడూ?"

"నిజమే కాని ఇది పూర్వకాలం మాట. ఇప్పుడలాంటి పద్ధతులేవీ సాగవు. వెనుకటి రోజుల్లో యే ముస్సద్దీప్లీడరో జిల్లా బోర్డు ప్రెసిడెంటు అయేవాడు. అధికార్ల దగ్గిర యెంత భయభక్తులతో మసులుకోవాలో వాళ్ళకి బాగా తెలిసివుండేది. ఇప్పటివాళ్ళూ – చాలా మంది మాటసుమా – స్కూలు ఫైనల్ కూడా కానక్కర్లేదు. ఓటు – ఇప్పుడంతా వోటుతో వుంది మహిమ. ఆపైని గుజరాతీ కోమట్లకి మంగళప్రదమైన పచ్చపెట్టి. ఇక చెప్పడానికేం వుందీ? పెద్ద సంతకమూ చిన్న సంతకమూ అని డఫేదారు నడిగిగాని–"

"తమరే వుపక్రమించారు కనక విన్నవించుకుంటాను. మన ప్రెసిడెంటుగారు – చిత్తగించారూ? తక్కిన గుణాలు అలా వుండగా నన్ను – రాత్రీ పగలూ కూడా – కేవలమూ వేశ్యావాటికలో– "

"సాటి బ్రాహ్మణ్ణి పట్టుకుని అలా అంటావేమిటయ్యా?"

"సాటివాడు కనకనే మాకీ తిప్పలు బ్రాహ్మడు కనకనే మాఘస్నానాలూ దొమ్మిరి

గుడిసెలూనూ. అలా కాక యే రెడ్డిగారో, యే నాయుడుగారో, యే చౌదరిగారో అయితే–"

"వా! బ్రాహ్మణ యుక్తి అంతా కురిపించేస్తున్నావే?

"ఇందులో కడుపుమాడిన దుఃఖమేగాని యుక్తేం వుంది మహాప్రభూ:"

"అయితే, సంగతంతా తెలిసే వుందికదా యే నాయకురాలినో పట్టుకోరాదుటయ్యా:"

"తమవల్ల కాకపోతేగదా?"

"అయినా సులభంగా పని జరిగే మార్గాలున్నప్పు డీ అవస్థలన్నీ యెందుకూ?"

"భోగందాన్నో, కులటనో ఆశ్రయించడంకంటె అవస్థ యేంవుందీ? కాక : ఇంటిల్లిపాది మీ ఒక నెల దినాలు పస్తుండి అయినా–"

"అలా దారికి రావయ్యా! జిల్లాబోర్డు ప్రెసిడెంట్ కయితే సప్లయిలు మహా బాగా చేస్తారు నీవంటివాళ్ళు."

"చిత్తం చిత్తం నాది పొరపాటే. "రిక్తహస్తేన నోపేయా" త్తని కారిక కూడా వుంది. చిత్తగించారూ? కనక రేపీపాటికి–"

"ఏదో మాటవరస కంటే యిలా మొదలుపెట్టా వేమిటయ్యోయ్! కాస్త సిఫారసు భాగ్యానికి నేను లంచం పుచ్చుకుంటానుటయ్యా!"

"లంచమా? ఎంతమాటా? ధర్మరాజువంటి తమ సన్నిధిలో అలాంటి మాట అనడాని కెన్నివేల గుండెలుండాలి? పోని అంటే, తమవంటి వారికి లంచమివ్వడానికి నాకు తాహతు మాత్రం యెక్కడిదీ?... ఇంతకీ: మా కందరికీ ఆధారం చూపించబోతున్నందుకు తమ కొక్కమణుగు నెయ్యి, ఏ పులుసులో కయినా పనికివస్తుంది వొక బుట్టెడు బెల్లం, ఏ రొట్టిముక్క లోకయినా వాడుకోడానికి కొక డబ్బా తేనె పానకం..."

"ఇవీ, ఇంకా ఇలాంటివీ నాకు సప్లయి చేస్తానంటావా యేమిటి? దిట్టమైన వాడవేనే?"

"తమ రాగ్రహించరని ధైర్యం కలగబట్టి..."

"వెర్రి బ్రాహ్మడవు నీ మీద ఆగ్రహం యేమిటిగానీ – రెండు రోజుల్లో మా పెద్దమ్మాయీ అల్లుడూ పిల్లలూ వస్తున్నారు. నేనే కొంటాను గానీ..."

"వద్దు మహాప్రభూ, వద్దు. తెల్లవారేటప్పటికి నేను దాఖలు చేసుకుంటాను. నేనూ ఆడపిల్లలు గలవాణ్ణి. ఆడపిల్లలికి పుట్టింటి ఆశ యెంత వుంటుందో, తల్లిదండ్రులు వాళ్ళ నెలా సంతోష పెట్టాలో నాకూ కొంచెం తెలుసు. పైగా నా కొడుక్కి తమరన్నం పెట్టించేటప్పుడు, నేను, తమ అమ్మాయిగారికి కాస్త వుపమా, కాస్త కాఫీ....."

"అవునవును బెల్లం మాట కేం గాని – వెధవ బెల్లం. మా యింట్లో ఈగలు కూడా దాని మీద వాలవు గాని – నువ్వు కాఫీ అంటే జ్ఞాపకం వచ్చింది. నీ దగ్గిర ఈ మధ్యనే యీనిన ఆవుందిట కాదూ?"

"ఉంది మహారాజా, వుంది. నాకు జ్ఞాపకం వచ్చింది కాదు. ఇంకెందుకూ? తెల్లవారేటప్పటికి స్వయంగా తోలుకువస్తాను నేను."

"గోదానం చేసుకున ట్టనుకుంటాను కామోసు నేం?"

"రామ రామా? దానం పట్టే దాకా తమ కేం?"

"బ్రాహ్మల కిస్తే యే పేరు పెట్టినా దానమే అవుతుంది? గాని మా కిచ్చింది - విన్నావూ? సప్లయి... ఇనాము... నజరానా... నేమాను."

"చిత్తమండి."

"అసలు, మాకు వొకళ్ళ కివ్వడానికే గాని, మేము పుచ్చుకోడాని కధికారం లేకుండా చేశారు గారూ మీ బ్రాహ్మలు?"

"అనకూడదు కానండి - పూర్వపువాళ్ళు ముక్కు మూసుక్కూచోడం తప్ప మరేమీ యెరగరండి."

"ముక్కు మూసుక్కూచోలేదు. మీ బ్రాహ్మలు, ముక్కుదాళ్ళు పోసి జాతినంతనూ నిర్వీర్యం చేసేశారు."

"అంటే..."

"అంటేనా? మనిషినీ మనిషినీ విడతీసి, దూరం చేసి, అసూయ పెంచి - అదంతా పెద్దగొడవ. దానికేం గాని - తెల్లవారితే ద్వారపూడి సంతకి జవాన్లని పంపుదామను కుంటున్నాను మానెయ్య మంటావా?"

"ఇంకెందుకు మహాప్రభూ?"

"నిజమేకదా"

"ఇంకా - సందేహం - గాయత్రీసాక్షి"

"మాకు లేని జంధ్యాలంటే మాకేం నమ్మకం గాని - మా అమ్మాయి గారిక్కడ వున్నంతకాలమే - కాదంటే ఒంటిపూట పడేదాకానూ, తరువాత మీ ఆవు మా కక్కర్లేదు సుమా."

"ఏదో శాస్త్రం చెప్పిన తరవాయిగా - పుట్టి పోయాక కూడా గుదిబండ లాగ- తరవాత నేను వచ్చి తోలుకు పోతాను కాదూ అన్నదాతా".

"సరే అయితేను. నువ్వు మాకు ఆవును తోలిపెడితే. ఈ కారణం వల్ల కూడా అది గోదానంలో చేరదు సుమా:"

"అసలు, తమకి సందేహం-"

"సందేహాని కేమీలేదు గానీ - అసలు సందేహం అంటే యేమిటి గానీ - యింకోటి కూడా వుంది గుర్తించావో లేదో?"

"ఏమిటండీ?"

"అప్పటికీ అది దానమే అంటే, మళ్ళీ నువ్వు తోలుకు పోవడం దత్తావహారం అయిపోతుంది. నీకు ఆ పాపం చుట్టబెట్టుకోకుండా వుండడానిక్కూడా అది దానంలో చేర్చడానికి వల్ల కాదు. తెలిసిందా?"

"అవునండి."

"సరే వెళ్ళండి. రేపు పొద్దున కనపడతారు కాదూ అవధాన్లుగారూ?"

"పొద్దున దాకానా, కాకులు కూశాటప్పుడు వచ్చి తమర్ని లేపనూ?"

"అదీ తెలివంటే, ఏమంటే? వెలుగు వచ్చాక అయితే దిక్కుమాలిన ప్రజలు – "

"పోనీ వొక పనిచేస్తే?"

"ఏమిటదీ?"

"రాత్రి పన్నెం డయాటప్పటికి–"

"బేష్; చాలా బాగుంది. మేము సినిమాకి వెళ్ళి వచ్చేప్పటికి తోలుకు వస్తావన్న మాట."

"చిత్తం"

"అలా చెయ్యి. నే నీ రాత్రే ప్రెసిడెంట్‌కు ఘాటయిన ఉత్తరం రాసి వుంచుతాను. పట్టుకు వెడుదువుగాని."

"అలాగే మహాప్రభూ :"

"మరి వెళ్ళు."

"అన్నదాతా సుఖీభవ :..........

## 2

"మణుగు నెయ్యే?"

"మరి తప్పదు."

"ఒప్పుకునే వచ్చారా యేమిటీ?"

"లేకపోతే చావనా?"

"ఇన్నాళ్ళనుంచి కాపరం చేస్తున్నాను. ఇంత మందిని కన్నాను. గాని పండుగురోజున అయినా మిల్లి గరిటెడు కంటె యెరగం–"

"ఈ వుద్యోగాలు లేనప్పుడు ఆ నిర్భాగ్యుడు మాత్రం యెరుగునా? వాడి రోజిది."

"ఇంకేమీ లేదు కదా?"

"ఆ...వు....కూ....డా"

"ఏమిటీ?"

"ఇంటో కూచుని అలా రంకెవెయ్యడంకాదు ప్రజ్ఞ, మన ఆవుని కూడా తోలిపెట్టాలి."

"కొంప ముంచాడు."

"ఎలాగో సమాధానం చెప్పుకోవాలి. లేకపోతే వుద్యోగం అంటే మాటలతో వుందా?"

"............."

"ఇంతకీ; అబ్బాయికది అత్తవారిచ్చిందే కాదూ?"

"మీకేమయినా మంచీ చెడ్డా తెలవాలా; అక్కర్లేదా?"

"తెలవకయేం తక్కువయిందీ యిప్పుడూ?"

మనమరాలికి పాలకోసం కదా వియ్యాలవారు దాన్ని తోలిపెట్టారు?"

"దాని తండ్రికి ఉద్యోగం కోసం మనం తోలిపెట్టాలి."

"నలుగురూ గడ్డిపెట్టరూ?"

"నలుగురూ పెట్టే గడ్డెక్కువా. ఆయన పెట్టే అన్నం యెక్కువా?"

".....నాకేం? కోడలి యిష్టమూ, అబ్బాయి మనస్సూ. ఆపైని మీ అవసరమూనూ. మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి."

"అబ్బాయే తోలుకు వెడతాడు. నా యిష్టం యేమిటి మధ్యన?"

"చంటి పిల్ల నోటిదగ్గిరి పాలు పడగొట్టి – పిల్లలున్నారా ఆ కలకటేరుకి?"

"రెండు రోజుల్లో పెద్ద కూతురూ అల్లుడూ. మనుమలు వస్తున్నారు. వాళ్ళకి కాఫీ...."

"కూతుళ్ళ తండ్రేనా? నోరెలా వచ్చిందో?"

"అధికారం – అధికారం – అది గల వాళ్ళ నోటికిక అడ్డేమిటి?"

"చంటిపిల్ల – మూడుమాసాల గుడ్డి – దాని వుసురు తగలదూ ఆ యముడికీ?"

"మాట్లాడవద్దు. గప్ చిప్; నిప్పున్న కర్ర తగులడక మానదు. ఇప్పుడు దీపాలు పెట్టేటప్పటికి "మాధవ కవళం" అంటూ వచ్చేవాళ్ళంతా పూర్వ జన్మలో యెవరో యెరుగుదువా? ఈ బాపతే, ఇక వూరుకో పించను పుచ్చుకున్నాక యిక వీళ్ళ మొగం చూచే వారెవరు?"

"ఆనక ఆయన గతి యెమిటో కాని యిప్పుడు పిల్ల కడుపు మాడుతుంది. ఇక డబ్బాపాలు పొయ్యాలి."

"ఒక్క నెల – ఒక్క నెల వోపిక పట్టు. ఆ పూచీ అంతా అబ్బాయిదే కాని – అయినా కష్టసుఖాలు నువ్వు కూడా కోడలికి బాగా బోధించు. నెలతిరిగే టప్పటికి యాభై రూపాయలు గళ్ళున చేతిలో పడతాయి. మొదటి నెల జీతం పెట్టి మాంచి కామధేనువుని కొనేస్తాను – అప్పుడింటిల్లపాదికీ పెరుగే. రెండోనెల జీతంపెట్టి వొక్క బనారసు చీర – చూశావూ?

కోడలు పొచ్చని మనిషి కనక వూదా రంగుది. జరీ పువ్వులది కొని కట్టబెట్టామంటే దాని మొగం యింతవుతుంది. మూడోనెల జీతంతో బుల్లెమకి బాల తొడుగు. దాంతో దాని కడుపు కొట్టిన దోషం పోతుంది. తరువాత సంసారం పూటుగా.”

“అఘోరించినట్టే వుంది మీ కల్పన. చాల్లెండి. నేర్చుకుపోయారిక వూరుకోండి. ఇది గొప్పగా చెప్పుకోకండి. నలుగురూ తాటాకులు కడతారు.”

“వాళ్ళ మొఘం. అబ్బాయికి ఉద్యోగం అయాక నేనిక ఆ వాజమ్మలతో మాట్లాడుతానూ?”

## 3

“తమ రలా అంటే–”

“నేనన్నదేంవుందీ యిందులోను? ఉన్న సంగతి చెప్పాను. ఆపైని మీయిష్టం.”

“అలా కాదు. తమరు కోప్పడితే నేనాగ లేను. నేను బ్రాహ్మణ్ణి, బీదవాణ్ణి, కుటుంబీకుణ్ణి. నేను చెప్పుకోవడం కాదు కాని ఘనాపాఠీని. తమరు కాస్త అనుగ్రహించాలి.”

“ఇప్పుడనుగ్రహానికేం తక్కువ వచ్చిందీ? వారు ఇంటికి రాగానే దర్శనం చేయిస్తాను. మీరు సావకాశంగా చెప్పుకోడానికి కావలసినంత అవకాశం కలిగిస్తాను. ఏం?”

“తమరు నాలుక చివరినుంచి మాట్టాడితే–”

“మరి నువ్వు?”

“... .... .... ....”

“వంగతోట దగ్గిర బావకాదేం?”

“............. కటాక్షించండి”

“ఏమిటిది?....... వోస్.”

“స్వీకరించండి.”

“లింగూ – లింగూ అయిదు రూపాయల కాగితం చేతిలోపెట్టి పే–ద్ద మేరు పర్వతం లాక్కుపోదామనా, వేషగాడవే.”

“మహారాజులు కాదూ? ఇవి చేతులు కావు. కాళ్ళు, రుద్రాక్షతావళం తాకట్టుపెట్టి తెచ్చా నీ అయిదు రూపాయలూనూ. ఇక నన్ను కోసినా తేలేను. రక్షించండి.”

“............ అలా అన్నావా? సరే అయితే, అత్యాశి మీ బ్రాహ్మలికి చెల్లింది. కాని మాకు కాదు. ఇక రేపు – ఇవాళకి మించిపోయింది. తెలిసిందా? ఉదయం యెనిమిదన్నరకే వస్తే కాఫీ పుచ్చుకునేటప్పుడు వారి దర్శనం చేయిస్తాను. అప్పుడు జవానుకి మాత్రం వొక రూపాయి తప్పదు సుమా?”

“అదోటా?”

“మరి తప్పదు. అంతా వాడితోనే వుంది”

"అయితే, యిక తలవొక్కటే మిగిలి వుంది. ఆ రూపాయ కోసమూ అది తాకట్టు పెడతాను."

"ఏదో సద్దుబాటు చేసుకోవాలి మరి?"

"ఏపూట కాపూట అవస్థపడేవాళ్ళం మేమేమి ఇవ్వగలం మహానుభావా?"

"నాకో కాగితం ఇచ్చినందుకూ, జవానుకో రూపాయ ఇవ్వబోతున్నందుకూ పూచీ అంతా మాదే అనుకోవద్దు సుమా?"

"ఎంతమాటా? మరి ఈ ఉత్తరం...."

"ఉత్తరం;.....

"ఏం, అలా పెదవి విరుస్తారేం?"

"ఉలిక్కి పడవద్దు. ఉన్న సంగతి చెబుతున్నాను. అబద్ధాలు చెప్పడమూ, మొగం యెదట పొగడడమూ, దగా చేయడమూ నా చేత కాదు. నువ్విన్ని విధాల ప్రాధేయపడు తున్నావు కనుక, నా మనస్సు వెన్నలాగా పోతుంది. కరిగిపోయింది కూడానూ."

"చిత్తం"

"ఈ పరిస్థితిలో నావల్ల నీకు జరిగే ఉపకారం వారితో సావకాశంగా మనవి చేసుకోడానికి వీలు చిక్కడమే. పనంతా ఆ ఉత్తరం వల్లనే కావాలి. కాని–"

"......... నిజం చెప్పండి."

"అదే చెబుతున్నాను. ప్రసిడెంట్ గారికి సబ్ కలెక్టరంటే యిష్టం లేదు.

"చచ్చాను ఏం?"

"ఏమయితే యేం? అది అలాగా"

"అయ్యో?"

"ఆ వుత్తరం నాలుక గీసుకోడానికైనా పనికిరాదు"

"కొంపగుల్ల–"

"అద్గదీ. అద్గదీ. రంగుతేలుతోంది. అక్కడ యేమాత్రం."

"రామ రామా బ్రాహ్మణ పక్షపాతులండీ కలెక్టరు దొరవారు. వెళ్ళి ఆశ్రయించాను. అనుగ్రహించారు."

"అలాగేం? అబ్బా ... ... సరే యేం జరిగిందో జరిగింది కుంభకోణం అదంతా నాకెందుక్కానీ – చెప్పాను కాదూ? ఆ ఉత్తరానికీ తెల్లకాగితానికీ ఒక్కటే విలవ."

"మరి గతేమిటీ?"

"అపాయంలేని ఉపాయం. దివ్యమైనదొకటుంది. కావలిస్తే చెబుతాను."

"సెలవియ్యండి"

"ఆ ఉపాయం అవలంబించారంటే మీరు వారిని చూడనే అక్కర్లేదు. తెల్లవారేటప్పటికి ఆర్డరు మీచేతిలో పడుతుంది."

"అనుగ్రహించమన్నాను కాదూ?"

"చెబుదామనే కాదూ ఈ ప్రయత్నం? అయితే, పని అయేక మాత్రం నా కింకో కాగితం – తెలిసిందా?"

"ఇంకానా?"

"......... బాగుంది. అయితే రేపుదయం రావయ్యా ప్రెసిడెంటు గారి దర్శనం చేయిస్తాను. మీ డబ్బు తిన్నాను గనక ద్రోహం చేయను"

"ధర్మమా?"

"పోనీ, కష్టంగా వుంటే మీ కాగితం మీరు పట్టుకుపోండి.... ...."

"మా బాబ్మాబాబు. ఉంషించండి."

"......... .......... .........."

"ఉపాయం చెప్పండి"

"చెప్పనూ? మరి ముందు నువ్వు 'ఊ' అనాలి."

"ఎక్కడ తేనూ?"

"మళ్ళీ మొదలా? ఎక్కడ తేవాలో, యెలా తేవాలో యెలా తేవాలో నేను చెప్పాలా? సరే కాసుకో, మణుగు నెయ్యి....'"

".......... ......... .......... ........."

"ఏం, తెల్లపోతావేం?"

"తమ రేమిటో సెలవిస్తున్నారు; నా తలవిలువ తెలుసుకుని తమ రేమన్నా–"

"నీ తల విలువ ఆవే చెబుతుంది."

"....... .......... ......... .........."

"నాలుక కరుచుకుంటావేం?"

".......... .......... ........."

"మాట్లాడవేమయ్యా?"

".......... .......... ........."

"నా దగ్గిరా వేషాలు?"

"ఆ ఉపాయం చెప్పండి."

"అలా దారికిరా. తప్పకుండా ఇస్తావు కాదూ?"

"ఇచ్చుకుంటాను."

"లేకపోతే, మళ్ళీ తెల్లవారాటప్పటికి ఆర్డరు రద్దయిపోతుంది సుమా"

"వద్దు వద్దు, చెప్పండి"

"అయితే, యేదీ మీ గాయత్రి–"

"ఆ! చాలు, మరి విను, బాగా జ్ఞాపకముంచుకో"

"చిత్తం"

"మెరకవీధి – దుగ్గిరాల శేషాచలం – ఎప్పుడయినా విన్నావా?"

"లేదు, ఎవరండి ఆయన?"

"ఆయన కాదు, ఆవిడ, వేశ్య"

"......... ......... ........."

"ఏం మైలపడ్డావా? సచేల స్నానం చెయ్యాలా?"

"........ .......... ఏమయితేం, సెలవివ్వండి."

"అది చాలా అందకత్తె. బంగారబ్బోమ్మ. మాంచి ముమ్మరంలో వుంది. చూస్తే విడిచి పెట్టడం కష్టం. అప్పుడే నలుగు రైదుగురు పకీరు లయిపోయారు."

"వర్ణన అక్కర్లేదు చెప్పండి."

"అది శిఫారసుచేస్తే–"

"శిఫారసా?"

"అవును. అంటే, సరసానికి వొప్పుకుంటే అన్నమాట"

"......... ......... ........."

"మరి నీ తెలివితేటలూ, నీ పాండిత్యమూ ఇందులో తెలుస్తాయి?"

"వేదం చెప్పుకున్న వాణ్ణి–"

"మరి నీ కొడుక్కి కూడా ఆ వేదమే చెప్పుకుంటే ఈ తిప్పలు లేకపోవును కాదూ?"

"......... ......... ........."

"వేదాలూ, శాస్త్రాలూ మీకే వుండాలి; ఉద్యోగాలు మీరే కొట్టేయ్యాలి. అవునా?"

"......... ......... ........."

"మీ పూర్వులు మాకు సర్వనాశనం పెట్టినా, చివరికి దాస్యం అయినా విధించారు. మీరు బయలుదేరి అది కూడా లేకుండా చేస్తున్నారు, కాదూ?"

"...........ఇక ఈ ఉత్తరం"

"ఆముదం అన్నమాట. అందులో వొకటో నెంబరు అంబాజీ పేట సరుకు. పేగులు మహా బాగా శుద్ధి చేసేస్తుంది. చేసేవేసింది కూడానూ."

"పుండు మీద కారం చల్లుతున్నారు మీరు"

"చీము పట్టకుండా తొరగా మానిపోతుంది నయమేకాదుటయ్యా?"

"......... ......... ........."

"వెళ్ళవయ్యా బ్రాహ్మడా? తెల్లపోయి నుంచుంటే అవుతాయటయ్యా ఈ రోజుల్లో పనులు?"

"ఆ పని చెయ్యక తప్పదంటారా?"

"తప్పకేం? నిర్బంధమా యేమిటి? మానెయ్యడమే నా సలహా. అదే బహు ఉత్తమమైన పని. కాని దానికి ముందు, ఉద్యోగవాంఛ వుందే? దానమ్మ కడుపుకాల. అదే చేస్తోంది యిదంతాను. కనుక దాన్ని వదిలించుకోగలిగితివా ఇక వేశ్యాదర్శనమే కాదు. దేవతా దర్శనం కూడా అక్కర్లేదు. నిశ్చింతగా కూచుని జంధ్యాలు మెట్టు కుంటూ వేదాలు, వేదాంగాలూ – బోలెడు పనుంది మరి దయచెయ్యండీపాటికి."

❄ ❄ ❄ ❄

"...........శివ శివా"

"ఎవరు మీరు?"

"మేం బ్రాహ్మలం"

"దండాలు అలా దయ చెయ్యండి"

"శ్రీ కృష్ణార్పణం..... .... ......"

"ఏం పనిమీద దయచేశారూ?"

"పెద్ద పని మీదే వచ్చాను"

"మేళం కావాలా కచేరి చెయ్యాలా?"

"నాకంత తాహతూలేదు. ప్రస్తుతం అవసరమూ లేదు. నేను వేదం వల్లించాను. ఆ విద్యలో, ఈ జిల్లాలో నా అంతటివాడు మరిలేడు; కాని బహుకుటుంబీకుణ్ణి పైగా, రెక్కలే ఆధారం. అన్నం పెడతావని వచ్చాను."

"ఏవూరు తమదీ?"

"అసలు దుప్పులపూడి; కాని నాలుగేళ్ళ నుండి యీ వూళ్ళోనే వున్నాము."

"..... ..... వస్తాను దయచెయ్యండి."

"..... ...... ......"

"... ... తమవంటి వారిని సత్కరించడానికి శక్తి లేదు. తాహతున్నూ లేదు. అయినా "పత్రం పుష్పం ఫలం తోయం – శ్రీకృష్ణులవారు సెలవిచ్చారుకారూ?... స్వీకరించి.. దీవించండి."

"సకల సౌభాగ్యాలు వున్న దానవు నిన్నేమని దీవించనూ? కాక: పది రూపాయలు చేతిలో పెట్టి శక్తి లేదనీ, యోగ్యత చాలదనీ...."

"ఒక్క నెల గ్రాసమయినా ఇవ్వలేకపోయాను. సిగ్గుగా వుంది. అయితే, ఇది వార్షికంగా భావించి, యేటా ఒక మాటు, ఇలాగే ఉదయం పూజ చేసుకుని యివతలికి వచ్చేటప్పటికి దర్శనం దయచేయిస్తూ వుండండి."

"అమ్మా, ఆనందపారవశ్యం కలుగుతోంది. మాటలు రావడం లేదు. నీ యోగ్యత విన్నాను. విన్నంతా నిదర్శనం కనపడుతోంది. చాలా సంతోషం. అయితే, నువ్వొక్క సంగతి ఆలించాలి. నేను నీ దగ్గిరికి డబ్బు కోసం రాలేదు. కనక, ముందు, ఈ రూపాయలు నీదగ్గిర వుంచు... ..."

"..... ...... తమ దగ్గిరే వుంచి తమరే వినియోగించండి. ఇచ్చేసింది మరి నేను పుచ్చుకోను. ఇక నా వల్ల తీరవలసిన ప్రయోజనం యేమిటో సెలవిప్పించండి."

"చెప్పమంటావా?"

"సందేహం యెందుకూ?"

"సందేహమే లేదు, చాలా ఆశపడివచ్చాను."

"కానివ్వండి, చెయ్యతగిందీ, చెయ్యగలిగిందీ అయితే నేను కాదనను."

"అనుగ్రహం వచ్చిందంటే నువ్వు మమ్మల్ని యెల్లకాలమూ పోషించేస్తావు. అంచేతే నిన్ను వెతుక్కుంటూ వచ్చాను."

"సరే"

"వేశ్యావాటికలో అడుగుపెట్టడానికి నా కిదే మొదలు. సగం చచ్చి వచ్చాను. కాని నీ యోగ్యత చూడగా సిగ్గుపడవలసిన ఆవశ్యకం యెంతమాత్రమూ కనపడదు"

"తమ కోరిక సెలవిప్పించండి."

"చేస్తానని నువ్వు ముందు వాగ్దానం చేస్తేగాని చెప్పలేను."

"అలాగ నేనెప్పుడూ వాగ్దానం చెయ్యను. వేశ్యల ద్వారా నెరవేరే రాచకార్యాలేమీ వుండవు. ఉన్నా ఆ పనేమిటో ముందు తెలవాలి"

".... .... అలా అన్నావా?... ... అయితే విను. నాకు ఆరుగురు కూతుళ్ళు. ముగ్గురు కాపరాలు చేసుకుంటున్నారు. ముగ్గురూ బిడ్డల తల్లులు. పెద్ద కూతురు మనుమలనే యెత్తింది. ఇంకా ఇద్దరు ఆడపిల్లలికి పెళ్ళిళ్ళు చెయ్యాలి. ప్రస్తుతం నాలుగో అమ్మాయికి కార్యం చెయ్యాలి. ఇదిలా వుండగా; నా కొక్కడే కొడుకు, ఆ కొడుక్కి మూడు మాసాల కూతురు...."

"తమ కుటుంబం పొద్దుటిపూట లేవగానే చూసే వాళ్ళ పాపాలు పోగొడుతుందండీ!"

"నీ కలాతోచడం నా అదృష్టమే. మరి ప్రకృతం ఆ కొడుకుని కష్టపడి యెఫ్పే చదివించాను. అదేదీ అదీ?.... యల్టీ....అది కూడా అయిపోయింది. ఉద్యోగం – అంటే యిప్పుడు మేష్టరీకోసం తిప్పలు పడుతున్నాను."

"... .... అలాగా?"

"అది నువ్వు శిఫారసు చేస్తే...."

"నేనా?

"అవును తల్లీ! అలాగే తెలిసిందమ్మా! ఈ పుణ్యం కట్టుకోవూ?"

"ఇదేదో అగ్నిహోత్ర ప్పుంతలా కనపడుతోంది. ఇదేదో కుట్రగా తోస్తోంది. అయినా అది యిచ్చే వారెవరూ?"

"జిల్లా బోర్డు...."

"ఆ!"

"ప్రెసిడెంటుగారుట"

".... ..... ......"

"ఏం తల్లీ? ఏం మామ్మా? ఏమిటో వొణికిపోతున్నట్టు కనపడుతున్నా వేమిటమ్మా? ముచ్చుమటలు పోస్తున్నట్లు కనబడుతున్నదేం తల్లీ మాట్లాడవేం మామ్మా?"

"అదంతా తరవాత చూసుకుందాం. బాబయ్యా నేను సిఫారసు చేస్తే యిస్తారని యెవరు చెప్పారు?"

"ఎప్పుడూ వారి దగ్గిరవుండే గుమాస్తా...."

"శ్రీహరీ... ........ శ్రీహరీ"

"అదేమమ్మా?"

".... ..... ....."

"నీ వాలకం చూస్తే నాకేమో దిగులుపుడుతోంది. చెప్పవేమిటమ్మా?"

"తమ రేమీ భయపడవద్దు. నా కివాళ కఠిన పరీక్ష కామోసు. లేకపోతే యిది యిలా సంభవించదు. అయితే, బక్కపలచగా – విషపుచూపులూ – నంగి నంగి మాటలూ – ఆ ఛండాలుడేనా తమ కీ సంగతి చెప్పింది?"

"అవును. ఆ బోసినోటి పులే."

"... ..... దేవుడున్నాడా అవధానులుగారూ?"

"అదేం తల్లీ?"

"అదేమంటే? దేవుడు లేడు. దెయ్యాలు మాత్రం వున్నాయి. ధర్మం లేదు. అధర్మం అంతటా నిండిపోయి వుంది. మంచి మందులోకయినా లేదు. దౌర్జన్యం మాత్రం పెరిగిపోతుంది. నీతి మాలోనేకాదు. మనదేశంలోనే లేదు. ఎవరేం చెప్పినా శుద్ధ అబద్ధం తప్ప సత్యం లేనేలేదు. ఎటు చూసినా హింస. ఎక్కడపట్టినా రక్తం, దేవుడు లేనేలేడండి."

"దేవుడి విషయమై ఇంతగా అపనమ్మకం కలిగించే సంఘటన నీకేమి సంభవించింది తల్లీ?"

"కోప్పడవద్దు. నన్ను నిందించనూ వద్దు. బ్రాహ్మల్లో కోటికి ఛండాలులు వున్నారంటారా? లేరంటారా?"

"లే-ర-ని-చె-ప్పు-లే-ను."

"అయితే ఆ ఛండాలులకు తమరు చెప్పిన ప్రెసిడెంటు మొనగాడు. కులపెద్ద".

"... .... ...."

"ఏం కష్టంగా వుందా తమకి?"

"లేదులేదు; కాని పాకీవాళ్ళ స్వాధీనంలో కూడా కొన్నిపనులున్నాయి."

"నిజమే; కాని పాకీవాళ్ళని ఏమీ అనకూడదు. ఏమంటే? పాకీపని వాళ్ళకి వృత్తి. వృత్తికీ ప్రవృత్తికీ సంబంధం యేమిటి?"

"నిజాని కేమీ లేదు."

"కనుక, పాకీవాడు పాకీపని చెయ్యాలి. లేకపోతే అంతకంటె యెక్కువ యోగ్యత కనపరచాలి."

"అవును"

"మరి బ్రాహ్మడు?"

"దైవికాంశ కనపరచాలి."

"మన ప్రెసిడెంటు దగ్గిర ఆ దైవికాంశ దాకా యెందుకూ, మానవాంశకూడా లేదు. సరికదా రాక్షసుల అంశ మాత్రం పూర్తిగా వుంది."

"కొన్ని అవగుణా లున్నాయని విన్నాను.పరమ దుర్మార్గుడని తెలవదు."

"దుర్మార్గుడే కాదు పశువు... .... ... పశువుకంటే అధముడు."

"నీకేమి అపకారం చేశాడు తల్లీ ఆయన?"

"నాకేమీ చెయ్యలేదు అపకారం; తన ఆటవికత మాత్రం బయట పెట్టుకున్నాడు."

"అంటే"

"నాట్య సంప్రదాయాలను కోయవాళ్ళు కూడా శిరసా వహిస్తారు. మన ప్రెసిడెంటు ఆ మాత్రమూ కాలేకపోయాడు."

"బోధపడలేదు."

"నేనొక బ్రాహ్మల యింటో పెళ్ళికి మేళం వెళ్ళాను."

"సరే"

"మొగపెళ్ళి వారికి మన ప్రెసిడెంటు చుట్టం"

"పెళ్ళికి వచ్చారన్నమాట."

"అవును.... ఒక రాత్రి బసకి రమ్మని నాకు కబురు. తమకి నా సంగతి చెప్పిన ఆ వూర కుక్కే రాయబారి.

"తెలవక అడుగుతున్నాను. అమ్మా, నీకూ ఆయనకి యిదివరకి సంబంధం లేదూ.?"

"లేదు. కబుర్లు వచ్చాయి. నేనంగీకరించలేదు."

“అ–లా–గా”?

“మా పింతల్లి కూతురికి ఆయనకీ సమ్మంధం వుంది. దానికీ నాకూ వున్న అనుబంధం పురస్కరించుకొని నేను వల్లకాదన్నాను. ఒకమాటు ఈ సంగతి దానితో చెప్పగా, దీని మీద వాళ్ళిద్దరూ తగువులాడుకున్నారు. మరో రెండు నెల్లకి వాళ్ళకి చెడి పోయింది.”

“చాలా గొడవవుందే?”

“నే నెప్పుడూ, యెక్కడా, యెవరి బసకీ వెళ్ళను. పైగా మేళం వెళ్ళినచోట బ్రహ్మచర్యం ఆచరిస్తాను.... వల్ల కాదని కచ్చితంగా చెప్పేశాను.”

“మంచిపని చేశావు తల్లీ!”

“నూరు రూపాయల కాగితం మీద పడేశాడు. పుల్లాకుని చూసినట్టు చూసి నేను దూరంగా వెళ్ళిపోయాను.

“..... అగ్రజాతుల్లో పుట్టవలసిన దానవమ్మా నువూ?”

“..... అదేమన్నమాట బాబయ్యా? ఇప్పు డగ్రజాతుల విశేషం యేమిటి? అగ్రజాతుల్లో మాత్రం స్త్రీలకి అదరగౌరవాలున్నాయా? అగ్రజాతుల్లో కూడా స్త్రీ అంటే బానిసే కాదూ? ఆట బొమ్మే కాదూ?”

“.... .... ....”

“ఏం కష్టంగా వుందా బాబయ్యా? అయితే, నే నన్నమాట మరిచిపోండి కరుణించి నన్ను క్షమించండి?.....””

“అక్కర్లేదు తల్లీ. అక్కర్లేదమ్మా! నువ్వు లోకవృత్తం చెప్పావు. కనక క్షమించ నక్కర్లేదు... అయితే తరవాత యేం జరిగిందీ?”

“ఆ వూరకుక్కగా డేం చెప్పాడో, మతి పోయిందో. అస లంతేనో, మన్నాడు సాయంత్రం సభలో నేను గజ్జెకట్టి వుండగా, విప్పించి సత్రకాయ చేత కట్టించాడు. రాత్రి వూరేగింపులో నన్ను కట్టమన్నాడు.

“నీమీద పగపట్టా డన్నమాట?”

“పశుత్వం కాని యిది పగా బాబయ్యా! సభలో నాయకురాలిని గజ్జె విప్పించిన వాడూ, వూరేగింపులో నాయకురాలిని గజ్జె కట్టమన్నవాడూ మనిషేనా?”

“ఇప్పటివాళ్ళకి మన విద్యలూ, మన సంప్రదాయాలూ, మన మర్యాదలూ యేం తెలుసును తల్లీ?”

“విద్యలు అక్కర్లేదు కాని ఆ విద్యలు నేర్చిన స్త్రీలు కావాలి. అంచేతే పశువులనడం.... అదలా వుండనివ్వండి. తరువాత వాకబు చేశాను. మన ప్రెసిడెంటుకి రూపతృష్ణ తప్ప మరేమీ లేదు. ఈ కుట్ర అంతా ఆ వూరకుక్కది.”

"మెహర్బానీ కోసమా?"

"కీలు బొమ్మని చేసి చాటునా మాటునా గడ్డి కరవడానికి."

".... ..... ......"

"ఎంత కల్పనో యిప్పుడు బోధపడింది? సాధారణంగా మేము డబ్బు తెచ్చిన వాడినల్లా చేరనిస్తాము. అయితే వాళ్ళలో రసికులు కాదగ్గ వాళ్ళు నూటికొకడో యిద్దరో వుంటారు. తతిమ్మా అంతా.."

"బ్రాహ్మడు, పెద్దింటివాడు. మన ప్రెసిడెంటే యిలా అయినప్పుడిక తక్కిన వాళ్ళ మాటెందుకూ?"

"నేను శిఫారసు చెయ్యడం అంటే యేమిటో తమకిప్పుడు బోధపడిందా?"

"తెలిసిందమ్మా"

"నే నంగీకరిస్తాననుకోండి. అయితే అబ్బాయిగారికి ఉద్యోగం యివ్వడం నిరుకా?"

"అలాగే చెప్పాడు గుమాస్తా."

"అంటే నా ఆత్మ ద్రోహమూ, మన ప్రెసిడెంటు పశుత్వమూ కలిస్తే వొక బ్రాహ్మణ కుటుంబానికి భుక్తి యేర్పరుస్తాయన్న మాట కదుటండీ?"

"... .... ...."

"కనక బాబయ్యా. ఈ రాత్రి ప్రెసిడెంటుని తీసుకురమ్మని వూరకుక్కతో చెప్పండి."

"అమ్మా-"

"ఒక్క దమ్మిడీ అయినా పుచ్చుకోదనిన్నీ చెప్పండి."

"అమ్మా-"

"కూచోండి బాబయ్యా అప్పుడే లేస్తారేం?"

"ఏమీలేదు. నేను వచ్చిన దారినే వెళ్ళిపోతాను." నువ్వు ఆత్మద్రోహానికి సిద్ధపడవద్దు.

"అదేమీ?"

"ఇంత కుట్రా? ఇంత ద్రోహమా? తనెలాగా తార్పుడు కాడే. నన్ను కూడా తన లాగా తయారు చేస్తాడా ఈ నీచుడు? నీకూ ప్రెసిడెంటుకీ యిదివరకే సంబంధం వుందనీ, ప్రాధేయపడితే శిఫారసు చేసి పని యిప్పిస్తావనీ వచ్చాను. పైగా నువ్వింత యోగ్యురాలవని యెరగనే యెరగను. నేను బ్రాహ్మణ్ణి. వేదం వల్లించాను. యాచన చేస్తూ కుటుంబ పోషణ చేసుకుంటున్నాను. ఇకముందు మరో నలుగుర్ని ఆశ్రయిస్తూ ఉంటాను కాని, వేశ్య అయినా కులాంగనలాగ అభిజాత్యం కల వొక కళావతిని తార్చడానికి - స్వార్థంకోసం వొక భీతహరిణాన్ని పులివాత కంద చెయ్యడానికి నేను సాహసించలేను. కనక తల్లీ నన్ను క్షమించు. నా కోరిక మరచిపో. నాకు సెలవియ్యి."

"వల్లకాదు బాబయ్యా. తమరు వెళ్ళడానికి వల్లకాదు. నా మూలంగా వొక పేద మూర్తి కుటుంబానికి జీవనాధారం యేర్పడడం నా అదృష్టం. నా జీవితంలో యిదెంతో పవిత్రమైన సంఘటన. ఇలాంటిది మళ్ళీ లభించదు. ఇంతకీ? నేను పతివ్రతనెలాగా కాను. మగనాలి నంతకంటే కాను. కనక దీనివల్ల నాకిప్పుడు కొత్తగా సంభవించే పాతిత్యం కూడా యేమీ లేదు.నాకు విచారం లేదు. తమరూ విచారించవద్దు."

"తల్లీ....."

"ఇక నేను వినను. తమరేమీ సెలవివ్వవద్దు. ఇది యిలా జరిగితీరవలసిందే. మనవి చేసుకున్నాను కానూ? పశువులతో సాహచర్యం మాకు పరిపాటే. బాబయ్యా, తమరు బెంగపెట్టు కోవద్దు. ఇందాకా నేను చెప్పిన మాట వూరకుక్కతో చెప్పండి."

"నన్ను...."

"మరేమీ చెప్పనివ్వను. మరోలాగా చేశారంటే. నేర్చిన వేదానికి తమరు ద్రోహం చేసినవారవుతారు."

"నా కంఠానికురి బిగించావమ్మా"

"తమరలా సెలవివ్వవద్దు ఇక దయచెయ్యండి. ఎప్పుడేనా దర్శనం దయ చేయిస్తూ వుండండి. అమ్మగారికి నా దండాలు మనవి చెయ్యండి"

"అమ్మా. నోరు కుట్టేశావు. కాళ్ళూ చేతులూ కట్టేశావు. నన్ను జీవచ్ఛవాన్ని చేసి...."

"అంతమాట అనవద్దు బాబయ్యా"

"ఏం సత్తా తల్లి నీది? ఎంత యోగ్యరాలవమ్మా నువ్వు. ఏం జన్మ కన్నా నీది? వేశ్యాకులంలో నువ్వు తప్పపుట్టావమ్మా."

"ఏం, వేశ్యా కులం అంత చెడిపోయిందా బాబయ్యా? అగ్రజాతి గృహిణులందరూ మచ్చలేని వారేనా నాయనగారూ? మాలో నన్ను తలతన్నే యిల్లాళ్ళు – సానులయి వుండిన్నీ పాతివ్రత్యానికి వరవడి పెట్టేవారు వేలున్నారు. కాని లోకం గుడ్డిది. పురుషులు మత్తులు.... ఇప్పుడిదంతా అప్రస్తుత ప్రశంస. దయచెయ్యండి. ఒక్కమాటు పాదాలు......"

"శ్రీ కృష్ణార్పణం... ఎన్ని తిప్పలు పెట్టాడూ నాకూ? దేవుడు లేడూ? గాయత్రీదేవి ఇదంతా చూడ్డం లేదూ? ఈ ద్రోహి – ఈ అప్రాచ్యుడు ముందుకి వస్తాడా?....."

## 4

"...... పద్ హారు, పద్ హేను, పద్దెనిమిది, పం– థొమ్మిది, ఇర్వయ్?"

"ఏం, రెండు వందలూ వున్నాయా?"

"...... ఉన్నాయి; కాని కడిగేసినట్టు వొట్టి రూపాయలా తేవడం?"

"................."

"మర్యాదలు తెల్వండీ మీ బ్రాహ్మలికీ; బజారంతా బత్తాయి పళ్ళలా దొర్లిపోతున్నాయి కదా, వొక్క వంద పట్టించుకు వస్తేం? ... పోనీ, నాలుగు చెక్రకేళీ గెలలు, వొక్క డజను ఆపిలు పళ్ళు, నాలుగు శేర్లు ద్రాక్ష పళ్ళు–"

"తోచిందికాదు. ఆగ్రహపడకండి; మొదటి నెల జీతం...."

"సంవత్సరాని కారు వందలండీ; రెండేళ్ళకీ పన్నెండు వందలు...."

"ఇం కెందుకూ, తెస్తానన్నాను కాదూ?"

"అయితే యింకోటి కూడా మరిచిపోకండి?"

"ఇంకా యేమిటి?"

"ఒక్క పరికిణీ గుడ్డ, నాలుగ్గజా లయితే చాలు. గజం రెండు రెండుం బావులా – రొక్కం నా చేతిలో పడేస్తురూ, నేను తంటాలు పడతానూ."

"...................."

"ఏం మాట రాదేం?"

"................."

"నా కొక్క కూతురండీ లేక లేక నలుగురు కొడుకుల వెనుక పుట్టిందండీ; మొన్ననే తొమ్మిదేళ్ళు నిండాయండీ; మా అత్తగారి పేరు పెట్టుకున్నామండీ; వెన్నప్పంలా పెంచుకుంటున్నా మండీ, అదంటే నాకు ప్రాణమండీ?"

"తెస్తాలేండి"

"రైటో; అదీ మాట. అదీ దర్జా, ఇక వెళ్ళండి. తెల్లవారేటప్పటికి మా యింటికి రండి."

"అలాగే.... అయితే, రెండు సంవత్సరాలకీ వొక్క మాటే ఆర్డరు పడిపోవాలి సుమాండీ."

".... .... ... నాలుకా తాటిపట్టా యిది? దీనికి తిరుగుందనుకున్నారటండీ?"

"మరి సెలవు"

"సెలవు"

"....చూడండీ! 'మాలపిల్ల' ఫిల్మంట, వెడదామా"

"నేను బయలుదేరితే మావాళ్ళు కూడా బయలుదేరుతారు తెలుసా?"

"అంతట్లో యేం మునిగిపోయింది. జట్కా పంపిస్తాను బయలుదేర తియ్యండీ."

"సెబాస్! మాంచి తెగువ కల బ్రాహ్మడివయ్యా! చూడండీ, జిల్లాబోర్డు మనకి స్వార్జితం అనుకోండి. ప్రెసిడెంటు బతుకు మన గుప్పిట్లో వుందనుకోండి. కనక, నన్ను మీరు మరిచిపోకండి. మిమ్మల్ని నేనూ మరిచిపోనూ."

"సరియే"

"ఈ రెండేళ్ళూ అయిపోయాక మిమ్మల్ని వంద రూపాయల గ్రేడుకి లాగేస్తాను చూచుకోండి

"......గుడ్ బా-య్. గుడ్ బా-య్"

"..........."

"..... ప్రెసిడెంటుగారు-"

"వస్తున్నారా, రమ్మన్నారా?"

"వస్తారుట"

"తీసుకువచ్చి నువ్వవతలికి పో. ముందివిగో ఈ..... అయిదు రూపాయలూ రోడ్డు కంట్రాక్టు బాపతు. ఈ రెండూ స్కూల్ మాష్టరీల బాపతు పట్టుకుపో."

"థాంకుస్, థాంకుస్...."

"..... కాంట్రాక్టర్లెవరేనా కనపడ్డారా?"

"లేదండి."

"దరఖాస్తుదార్లో"

"లేదన్నమాటే"

"నుంచున్నపాళంగా డబ్బు కావాలే. మరెలాగా?"

"రేపయితే సప్లయి కావచ్......ఉ"

"రేపటిదాకా ఆగదు. అధమం నూరు రూపాయలయినా పట్టుకువెడితే కాని యివాళ అమ్మాణ్ణి గుమ్మం యెక్కనివ్వదు".

"ఏం, మొగం ముడిచిందా?"

"నిన్న రాత్రి ఉత్సాహం అంతా చచ్చిపోయింది."

"అదంతా ఇవాళ కూడ తీస్తాను. అమ్మాణ్ణి మాట మరిచిపోండి."

"అంటే?"

"దానబ్బ సానిదగ్గిరికి వెడదాం ఇవాళ."

"ఏమిటీ?"

"ఇవాళ మీ తపస్సు ఫలించింది."

"ఎవరోయ్?"

"చెబుతా కాదూ"

"రాజామణా?"

"చా"

"నీలం..."

"ఛీ"

"వీరభద్రం…"

"చేస్"

"మరెవరోయ్?"

"చూస్తారు కాదూ? భోజనంచేసి యిక రెండుగంటల్లో బయలు దేరడమేకాదూ?"

"భోజనమూ వద్దు వల్లకాడూ వద్దు, ఇప్పుడే…"

"……………"

"ముక్కు మీద వేలు తీసెయ్, పిలూ డ్రైవర్ని…"

"అలా కాదు – పోనీ చెబుతా కూచోండి."

"తొరగా"

"శేషాచలం"

"దుగ్గిరాల…?"

"అవునదే"

"వో–య్యేస్? గుమాస్తా అంటే నువ్వేనోయ్; చక్రవర్తుల దగ్గర ప్రయివేటు శక్రటరిగా…."

"మాటలేకాదూ; వొట్టి షేక్‌హాండులేకాదూ?"

"ఇక అలా కాదు. విసరి కొట్టిన సానిని లొంగతీశావు నువ్వు. ఏం చేసినా నీ రుణం తీరదు. నీకేం కావాలో చెప్పు ఈక్షణంలో చేసేస్తాను…"

"అయితే, దీని మీద సంతకం పెట్టండి…."

"ఏమిటిదీ?…. రోడ్డు మెటలింగు కంట్రాక్టా? ఏమయినా రాల్చుకున్నావా?'"

"రామరామా; ఆయన మా అత్తవారి చుట్టమండీ"

"వెంకటయ్య టెండరు కంటె యెక్కువరేటుదే."

"దిద్దించేస్తాలెండి"

"గప్ చిప్ తొరగా అయిపోవాలి…."

"…. దీనిమీద కూడా కాస్త బరికెయ్యండి.'

"ఇదేమిటి?"

"హైస్కూల్లో కాళీ?"

"రెండున్నాయి కదా; ఓహో, యాభై రూపాయలదా? ఇందులోనయినా యేమయినా…"

"పరమదరిద్రుడు. పైగా మా అత్తవారి పురోహితులవారి ఏకైక అల్లుడు. వద్దు వద్దంటూవుంటే మా అమ్మాయికి దక్షిణాది పరికిణీ గుడ్డ…."

"ఛూ..... పోనీ నాకేం?"

"..............."

"ఇదేమిటి?"

"రెండు మాసాల కాళీ?"

"పాతిక రూపాయలదా?"

"అవును."

"ఇందులో నయినా......"

"దీని విషయం శిఫారసు చెయ్యడానికే శేషాచలం......"

"ఆ?"

"అవధానులుగారిని దాని మీదికి ఉసికొల్పాలి."

"అసాధ్యుడే? దాని యెదుటే ఆర్డరు వెయ్యకూడదూ?"

'కులాసాగా కాలం గడుపుకోకుండా అంతఃపురంలో కూడా మీకా పాడు వ్యవహారాలేమిటండీ?"

"సెబాస్; నీవంటి హంగుదారు మరి లేడోయ్."

"మీరు నన్ను కాస్త కనిపెడుతూ వుంటే నా జీవితం మీ కోసం ధారపోసెయ్యనూ?"

"ఇక ముందు నువ్వు సంతకం పెట్టమన్నచోట యేమిటని అడగకుండా – చూడకుండా సంతకం పెడతాను, సరా? వీలయినంత వరకూ బోర్డు సొమ్ము కూడా...."

"మీ పేరుగా వొక కొంప"


"కొంపేమిటి మళ్ళీ. మేడ అను. దానికి పునాది వెయ్యడానికి ప్రధాన మంత్రిని లాక్కువస్తాను చూసుకో."

"అయితే, ఇక నేను పోయి, అంతా సర్దుబాటు చేసి కాస్త భోంచేసి వస్తాను. యెనిమిదిన్నరకి సిద్ధంగా వుండండి."

"ఆల్‌రైట్ మైడియర్ ప్రీమియర్."

# వేలూరి శివరామశాస్త్రి

**(1892 - 1967)**



**గొ**ప్ప విద్వాంసులు, బహుభాషా కోవిదులు. శతావధానులు. కథారచనలో సిద్ధహస్తులు. శిష్ట వచన రచనకి శాస్త్రిగారు పెట్టిన ఒరవడి విశిష్టమైనది. తెలుగు నుడికారపు ఇంపు సొంపులకి వీరి శైలి పుట్టిల్లు. కథా వస్తువులో, సంవిధానంలో వీరిది అనన్య పద్ధతి. సనాతన అధునాతన భావసమన్వయమూ, భావ నిగ్రహమూ, వ్యంగ్యమూ, ఉత్తమపాత్ర చిత్రణా, మనోహర పదచిత్రాలూ పుణికి పుచ్చుకుని, 'రసాత్మక వాక్యమే కావ్యం' అనే నిర్వచనానికి వీరి కథలు వ్యాఖ్యలైనవి. కృష్ణాజిల్లా చిరివాడలో నివసించేవారు.

**రచనలు :** కథా షట్కము, కథా సప్తకము మొ॥ కథల సంపుటాలు, వంగభాష నుండి రవీంద్రుని, శరశ్చంద్రుని నవలలు అనేకం ఆంధ్రీకరించినారు.

# డిప్రెషన్ – చెంబు

## 1

**రా**మారావు లిటరేచరు ఆనర్సు ఫస్టుగా ప్యాసయి నాలుగయిదు నెలలు జుట్టు జాడించి తిరిగెను. పిదప Rama Roy Dwivedi B.A., (Hons) అను గిల్టు అక్షరములు గల బారెడు బల్ల తయారుచేయించి, మంచి ముహూర్తమున గోడకు తాపటము చేయించి, మేడమీద విశ్రమించెను.

అతని కెక్కడను తగు నుద్యోగము దొరకలేదు. దానికి కారణము ఆ డిగ్రీయే, పొమ్మనఁగనే లేచిపోఁగల నియమమునకు లోబఁడి పాతిక రూపాయలకు బి.యిడీలు కో యనిన కోటిమంది దొరకుచుండగా ఈ యెమ్మేకు విశ్వవిద్యాలయములు బెదిరిపోయెను. అవి ఒకవేళ ఏ యిరువది రెంటికో, లేక యే యిరువది మూటికో దయతో బేరమాడినను రామారావు మొగ్గడు. ఏల? తాను యెమ్మే, పై పెచ్చు తాను డిప్టీ కలక్టరుగారి అల్లుడు.

ఈ నాణెము చదువుల టంకసాలలోఁదక్క మరియొకచోట చెల్లదు. కాన నతడింకొక డిపార్టుమెంటునకు నీళ్ళు వదలుకొనెను. కాని భార్యయొక్కయు, తల్లి యొక్కకు కన్నీళ్ళు తుడుచుటకు దరఖాస్తు మీద దరఖాస్తు పెట్టుచుండెను. దానికి పదియేను రూపాయల కర్చు. ఆ రూపాయలకు తల్లి నగయో, పెండ్లామునగయో తాకట్టు "కరువు వచ్చింది, కలిసిరాలేదు" అని తల్లి మహాలక్ష్మి దైవమునే దూయునుగాని తులసికి (రామారావు భార్య) ఈ గుట్టు తెలియును. తాను చూచుచుండగా రామారావు పోస్టల్ డిపార్టుమెంటుకును, పోలీసు డిపార్టుమెంటుకును అర్జీలు పెట్టుచుండును. దివానుగిరికిని అసిస్టెంటు దివానుగిరికిని జమీందారులకు తనచేత అర్జీలు వ్రాయించుచుండును. తనమగని చదువునకును ఆ యుద్యోగములకును గల సంబంధము బదరీ బాదరాయణ సంబంధమేయని తులసి తెలిసియు ఆ నాటకమును తిలకించుచుండును.

రామారావుకు కొలువులేని లోటు లేదు. ఓరంత ప్రొద్దు పెండ్లాముతో పేరంటము. తానే కాలేజీకిని ప్రిన్సిపల్ కాని ప్రియాదులేదు. తానొక పదుగురు ప్రొఫెసరుల పెట్టు! తులసి ఒక నూరుగురు శిష్యులపెట్టు. ముక్కోటినాడు ముక్తి ద్వారములే తెఱవఁబడి యుండును గాని రామారావు మేడ బందు. మూర్తి-ది-కో ఆపరేటర్. సుందరం-ది-లాయలిస్ట్, శర్మా-ది-నిహలిస్ట్ లోనగు మిత్రులెవరేని వచ్చి "రామారావూ రామారావూ" అని రెట్టింప మొదలిడఁగానే మహాలక్ష్మి అసత్యభీతి లేక, "అయ్యా" అతగాడు అత్తింటికి వెళ్లాడని వారిని పంపివైచెడిది.

గ్రీకు - చిత్రకళలోని నగ్న సౌందర్యముతో పాటు అఱచాటగు ఆంధ్రకళ యందము గూడా రామారాయనీ గది యలంకరించుకొనెను. ప్రాచ్య రసాయనములతో పాటు అప్రాచ్య రసాయనములును అతని బల్లనెక్కెను. కోహళ వాత్స్యాయనులు మొదలు, Mary Stopes తరువాతి వారి వరకును గల సరస సారస్వతమతని బీరువాలు ప్రదర్శించెను.

తులసి గవాక్షము దెస చూపు త్రిప్పెనా అతనికి బెంగ. అత్తగారు కోడలిని పిలిచెనా వియోగము. పుట్టింటివారు తులసికి వ్రాయు చీటి అతని పాలిటి విడాకు. రామారావు తులసికి బలవంతముగా అనేక వేషములు వేసెను. దీనికి తులసి నగలొకటొకటియే ఆరతి కప్పురము వలె హరించెను.

ఇటులొక యేడాది గడిచెను. ఈ సంసారయాత్రకు మహాలక్ష్మి నగలు చాలా వరకు మంగళమాయెను.

ఇంతలో నొక కాండ జరిగెను. రామారావు పెట్టిన దరఖాస్తులలో నొక దరఖాస్తుకు ఖాళీ ఉన్నదని ఉత్తరము వచ్చెను. అది ఆ పట్నములోని కాలేజీలో ట్యూటర్ పని. అరువది రూపాయల జీతము.

అది అతనికి వారంటువలె కనఁబడెను.

"దాచుకొనుచున్నారే! ఏమిటా రహస్యము?"

"ఏమున్నది? ముష్టి యెత్తుకొనుటకు Pass."

"ఏదీ?"

"చూపుటకుఁగూడ సిగ్గుచేటు!" అని రామారావు దానిని మడచి అచటను ఇచటను దాఁచుచున్నటు లభినయించి తులసి పట్టుకొనునేమో యని భయపడి వడివడిగా మేడ దిగెను. అతడు మేడ దిగఁగనే తులసి అచటి పుస్తకము లన్నియు తిరుగ వేయఁదొడగెను. కాని, ఆ కాగితము కనఁబడలేదు.

"నగలా కరఁగిపోయె, సంసారమా గంపంత, కాలమా పచ్చికఱవు. ఈతఁడా యిహా మృగనాయకుడు" అని అనుకొనుచు తులసి అవియు నివియు వెదకుచుండెను.

"ఏమిటా దొంగతనము?" అని వెనుకనుండి రామారావనెను.

"నాదా మీదా?" అని తులసి యనెను.

రామారావు తన జేబునుండి ఆ కాగితమును దీసి "ఇదిగో దీనివెల ఒక ముద్దు" అనెను.

"మనిషికి ఏమి అక్కరలేదు; ఆఁడుది వున్నచో సరి" అని లోపల అనుకొనుచు తులసి ఆవలికి నడచెను.

"పోనీలే ఇదిగో ఇత్తునుగా" అని రామారావనెను.

తులసి మాటాడక మేడ దిగుచుండెను. రామారావు గబగబ నడచి ఆ కాగితమును వెనకనుండి ముక్కు ముందర పెట్టెను.

"రామారావుగారండీ", అను పిలుపు వాకిట నుండి వినవచ్చెను. రెండవ పిలుపు వినఁబడక ముందే రామారావా కాగితమును జేబులోఁ గ్రుక్కుకొని తులసిని తప్పించుకొని రెండు మెట్లు దుమికి వాకిటికిఁబోయి "పద నేనే వస్తున్నాను" అని ముందు నడచెను.

ఆ వచ్చినది తామలపాకుల అంగడివాడు. వానికున్న బాకీ తులసికి తెలియును. మగని మాటల తొందరయు, నడకలోని వడఁకును ఆమె చూచెను. ఆమె నవ్వలేదు. కాని ఆమె అంతరాత్మ ఏమి చేసెనో ఎవరు చెప్పఁగలరు?

తులసి కిన్నాళ్ళకు మేడక్రింద తీరికగా కూరుచుండ గల భాగ్యము లభించెను. అత్త పిల్లలకు అన్నము పెట్టుచుండెను. కోడలు ప్రక్కగదిలోఁ గూరుచుండెను. ఆ సంగతి ఆమె యెరిగినచో తన సంసారపు గుట్టునకు ఆ కోడలిని ఏదో మిషమీద మేడమీఁద బంధించి యుండెడిదే.

"ఎప్పుడూ ఒక్క ఆవకాయే. లేకపోతే గోంగూర పచ్చడి. పాడు పచ్చడి ఆంధ్రమాత. నేయైనా వెయ్యవు. ఇందాక కాకరకాయ వేయించిన వాసన కొట్టలేదేం?" అని ఓటికంచములోని మెతుకులను అటునిటు పద్మనాభుడు చిమ్మివేసెను.

"నాయనా: నేయి వేసుకుంటే నాలుకు జిడ్డెక్కి చదువురాదు" అని మహాలక్ష్మి యనెను.

"అన్నాయి కెల్లా వచ్చింది?"

"అన్నయ్య మాత్రం చదువుకోక ముందు...."

"పాపం, యిప్పుడు మాత్రం నెయ్యి వేసుకుంటున్నాఁడనుకొంటున్నావా?"

"అన్నాయి కోసం ఎన్ని అబద్ధాలన్నా ఆడుతుంది!" అని రమణ యనెను.

"నెయ్యి పేరుకోలేదట – పప్పులేదుట – కూరలేదుట – మనకే నయం – ఆవకాయ వుంది – గోంగూర వుంది – అన్నయ్యగారు వర్థి అన్నం తిని వూరుకునేవాట్ట! కాదే

అమ్మా?నీవు చెప్పలా?" అని ఆఖరువాడు పుండరీకాక్షుడు వట్టియన్నమును నోరఁగూరుకొనెను.

"అమ్మా! నాకు నే యొద్దుగాని, అన్నాయికి పోస్తావే – విస్తట్లో తెల్లగా చూచానే, – అది అదీ, – పెరుగే – అది కొంచెం పొయ్యవూ?" అని పొడి మెతుకులు మింగుడు పడక పుండరీకాక్షుడు గారాబ మొనరించెను. "వెధవా! నేయి వేసుకోనూలేదు. పెరుగు పోసుకోనూ లేదు. నీకెందుకురా" అని పద్మనాభుడు గద్దించెను. వెంటనే మహాలక్ష్మి యిటులనెను. "ఉండరా వాఁడికి కొలమారింది. చిన్నవాడా! పెరుగెక్కడుందిరా? అది పెరుక్కాదు. అన్నాయి లేచాక విస్తరికి చీమలు పట్టుకుంటవని ముగ్గోశాను. అదిగాక పెరుగోసుకుంటే పిలక పెరగదు"

"అలా అయితే నేను పోసుకోను" అని సుందరి యనెను.

"మహా పోసినట్టు నీవు పోసికోనట్టు!" అని రమణ యనెను.

"పోనీ అమ్మా! నాకు ఆ ముగ్గే పొయ్యే. ప, ప ప!" అని పుండరీకాక్షుడనెను."

మహాలక్ష్మి నవ్వి "ఎబ్బే కాదమ్మా. మనకు గేదె ఉందాచెప్పు! ఎవరేనా చెప్పండి" అని అనెను.

"లేదులేదు, అని పుండరీకాక్షుడును, సుందరియు రమణయు నొకరి తరువాత నొకరనిరి.

"ఏమిరా పద్మా?" అని మహాలక్ష్మి పద్మనాభుని గదమాయింపగా అతఁడిటులనెను.

"లేదు, పొలం లేదు, గడ్డిలేదు. గేదె లేదు, కాని పిల్లికి రోజూ పాలు."

ఈ మాటలతో పిల్లలందరకును ఆఁపరాని ఉత్సాము కలిగెను. మహాలక్ష్మి మొగము ముడుచుకొనెను.

"మమ్మన్ని గదిలో పెట్టి తాళం వేసి అన్నాయికి వదినెకు ఆఁ అక్కాయి చెప్పలేదేం, పద్దన్నాయి కూడా–?" అని సుందరి చెప్పబోవు చుండగా పద్మనాభుడు సుందరిని మిఱ్ఱి చూచెను. సుందరి మఱి మాటాడలేదు. ఈ మాటలు మహాలక్ష్మికి మామూలే కాని ప్రక్కగదిలోనున్న కోడలికి సరికొత్త. పిల్లల నోటగడ్డ కొట్టుచున్నా"మని మనసులో ననుకొనుచు తులసి మెల్లగా మేడమెట్లెక్క దొడగెను. ఆమెకు దెలియకుండ ఆమె వెనుకనే రామారావు.

తులసి వెనుదిరిగి చూచి ముందున్న పరదా తప్పించుకొని లోనికేగెను. వెనుక నున్న రామారావు – హస్తము లావింగమునకు ఆ యత్తము లగుచుండెను. తులసి మరల వెనుదిరిగి "మీరు కాసేపు కిందికి వెళ్ళి సంసారమంతా గమనించుకోండి! నన్ను కాసేపు ఒంటరిగా ఒదిలిపెట్టండి" అనెను.

"ఇది వైరాగ్యరోగానికి సమయం కాదు తులసీ!"

"రోగమూ, నిదానమూ, మందూ నాకు బాగా తెలిసింది. ఇదే సరియైన సమయం. మీరు నన్ను ఒంటరిగా ఉండనియ్యండి."

"ఇది పతివ్రతలకు లక్షణం కాదు. భర్త మాటకు యెదురాడితే గుడ్లగూబ అయి పుటుతుందట కాదూ, పుటుతుంది!"

"ఈ ఆడంగి రేకుల వాళ్ళ మాట చెప్పడానికి మగాళ్ళకు సిగ్గులేదూ?"

"మీబోటి వాళ్లచేత పుస్తె కట్టించుకోవడం అవమానానికి, పెళ్లాడడమే అవమానం. తల్లిని, తమ్ములని పోషించలేని వాళ్ళను మగాళ్ళుగా చూచేవాళ్ళు ఇంకో జన్మలో కాదు – ఈ జన్మలోనే గూడ్లగూబలు."

"తులసీ! కూచో! నిలుచుంటే కాళ్ళు నొప్పెటుతయ్! ఇదిగో మెత్తగా ఉంటుంది ఒళ్ళో కూచో!".

"ఎవళ్ళెలా పోతేయేం? ఆఁడది దగ్గర ఉంటే చాలు. ఉద్యోగ సద్యోగాలులేని పిన్నవాళ్ళ సంగతంతా యింతే."

"అందరిసంగతి నీకు తెలుసూ?"

ఈ మాటకు తులసి మొగము జేగురించెను. పెదవులు కంపించెను. ఇటులనెను – "మీరు మాటాడఁగలిగితే జాగ్రత్తగా మాటాడండి, లేకపోతే మీదఁబడి కొట్టండి. భార్యవంటి పరమ నీచురాలు ఈ జగత్తులో మరిలేదు!"

"కాదు తులసి! యోగం వల్ల సర్వదేశ జ్ఞానం కలుగుతుందటగా! అట్టిదేమయినా నీకు కలిగి చెప్పావేమోనని చెప్పాను."

"తప్పుకున్నా ముళ్లు గుచ్చుటం మగాళ్ళకు బాగా తెలుసు. కిందికి దిగిపొండి ఈపాటికి – పొండి ఈ పాటికి కిందికి"

"ఎవళ్ళయినా వింటారు. నీ పుణ్యమాయిది! కొంచెం మెల్లగా మాటాడుదూ!"

"పిల్లి కళ్ళు మూసుకొని పాలు తాగుతూ లోకులు గూడా మూసుకున్నారని అనుకుంటుందిట! లోకులకు తెలియదూ తమరు ఆఁడంగిరేకుల అబ్బయ్యగారని? మీ గౌరవం నే నెన్నాళ్ళనుంచి కాపాడుతూవచ్చానో మీకు తెలియదూ? నా నగలు ఎన్ని అమ్ముకున్నారో, అత్తగారి నగలు ఎన్ని ఆహుతి చేశారో మీకు తెలియదూ? కిల్లీ దుకాణాదారుకి ఇపుడిచ్చింది నా ప్రధానపు ఉంగరం కాదూ? తాకట్టు పెట్టడానికి మేడ అయింది. ఇఁక ఏముంది? లోకం మూయడానికి మూకుడు ఉన్నదా?సరే గాని కొంచెం కిందికి వెళ్ళండి. మీ సంగతి మీకే తెలిసిపోతుంది."

రామారావు తేరిపాఱజూచి యిటులనెను. "ఏమో అనుకున్నాను. కోపం వచ్చినపుడే

ఆఁడది చాలా అందంగా వుంటుంది. కావలసివన్నీ కనిపిస్తాయి?" తులసి సర్దుకుని యిటులనెను: "సైతాన్! మీరు కిందికి వెళతారా వెళ్ళరా?"

"వెళ్ళకేం? నాతో కూడ గనుకవస్తే కిందికే కాదు షికారుకూడా వెళతాను. ఇదుగో, పొద్దాక వస్తూంది. నీ మనస్సు పిరాయించినటులుంది షికారు పోదాం రా."

"అదొకటి తక్కువ. నేనే మీతోవస్తే మీరేమో పెద్ద ఉద్యోగస్థులని అందఱూ భ్రమపడతారు."

"అందఱూ డిప్టీ కలక్టరులు అవుతారా యేమిటి?"

"కాకపోయినా వాళ్ళ పొట్ట వాళ్ళు పోసుకుంటారు. వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడతారు!"

"ఎంత దప్పిక అయినా చాతకం ఆకాశగంగ కెదురుచూస్తుంది కాని చెరువులకు ఎగబడదు."

"ఎంతమాటా! గుంటలమీఁదికే ఎగబడిం దిప్పుడు."

"ఏమి తులసీ! నీ నగలూ, మా అమ్మ నగలూ నావి కావూ? ఇవి గుంటలాఁ "నస్త్రీ, స్వాతంత్ర్య మర్హతి" అనే హిందూలా ఎవళ్ళకీ తెలియదు. అందులో ఆఁడాళ్ళ కసలే తెలియదు."

"డొక్కల కరవు వస్తే మగాళ్ళు ముందర తల్లులనీ, తరువాత పెళ్ళాలనీ విరుచుకు తినేస్తారు. హిందూదేశంలో పెళ్ళి అనే ఆచారం ఎప్పుడంతరిస్తుందో కదా!"

"నీవు విడాకు లిచ్చేట్టున్నావే?"

"విడాకు లివ్వటమే వస్తే ఆంధ్రదేశంలో తులసే మొదటిది."

"ఇంకా బిల్లు–"

"తొందర పడకండి. కొద్దిరోజులలో వస్తుంది. అప్పుడు మీ మగవాళ్ళ పాటులు తెలుస్తయ్."

"అయితే బిల్లు రాకముందే కథ అంతా కానీ" అనుచు రామారావు తులసి సమీపమునకు జరిగెను. తులసి వెనువెనుకకు నడచి గదిలోనికి వెళ్ళి తలుపులు మూయఁదొడగెను. రామారావు వడివడిగా నడచి దగ్గరకు వచ్చి రెండు తలుపుల సందులో చేయి పెట్టెను.

టపాకచేరి నుండి వచ్చిన జాబులలో నొక జాబు రామారావు – గౌరవమునకుహానిని కలిగించెను. దానిని జూడఁగనే అతని ముఖము తుమ్మలలో ప్రొద్దుగ్రుంకినటు లాయెను. దానిమీద బి.యే. (ఆనర్స్) కాని, యెమ్మే అని కాని తుదకు "రామారాయ్ ద్వివేది" అని కాని లేదు. దాని మీద నున్న చిర్‌నామా ఇది.

"శ్రీరస్తు చిరంజీవ, ద్వివేదుల రామయ్య."

పేరు చేతనే గౌరవము పుడికి పుచ్చుకొనదలచు వారికి మొండిపేరు బండబూతు కాదా? మగని మొగమున మూడు బంతుల వ్రాసిపెట్టి నట్లుండిన యీ బండ తిట్టును తులసి సులభముగా చదివి ఆ కవరు విప్పి చూచి "పాపము మీ మేనమామగారికి ప్రాణము మీదికి వచ్చినదcట!" అనెను.

రామారావు ముఖము మారెను. "ఏది?" అని చీటి దీసికొని చూచి "వెంటనే వెళ్ళి అమ్మకు చెప్పు" మనెను. తులసి వెళ్ళెను. రామారావు ముఖమున చింతకు బదులు సంతసము నెలకొనెను. దాని కారణము గనుcగొనుటకు దుర్భిణిలో దూర నక్కరలేదు. తులసి క్రిందినుండి మీదికి రాగానే పొంచియున్న రామారా వామెను కౌగిటిలో నలిపివేసెను.

"అబ్బ ఏమిటీ మోటపని? లంఘనములలో మనుగుడుపు."

"అమ్మ రైలుకు వెళ్ళునా?"

"మీరు వెళ్ళరా?"

ఈ ప్రశ్నాయుధముచే తులసి తన నెదరింపదలచెనని రామారావు కొంచెమాలోచించి యిటులనెను! "నేను వెళ్ళను, పిల్లలతో అమ్మను వెంటనే వెళ్ళమను"

"ఆ అలుగోలులో ఈ బాలుగోపెందుకు" బాగుండదు మీరు మీ యమ్మగారితో వెళ్ళుcడు"

"అమ్మో, నీ యెడబాటు నాకు Anarchy. అమ్మయు పిల్లలును వెళ్ళుచో స్వరాజ్."

"కాదు Diarchy."

"పోనీ, అదైనా సమ్మతమే"

"మీ మాట, మీ యిష్టము. పిల్లలను నేను పంపను."

"పోనీ అల్లాగే. అమ్మను వెంటనే రైలుకు పంపు"

"నేను పంపుటేమిటి? రైలుదనుకైనను పంపిరండు"

"ఊ" యనుకొనుచు రామారావు మేడ దిగెను. అతని వెనుక తులసియు దిగెను.

"అమ్మా నేనును బయలుదేరవలసినదే కాని ఉద్యోగమొకటి కాళీయున్నదని తెలిసినది" అని రామారా వనెను.

"నాయనా, ఉద్యోగం చూడు. మామయ్య కెప్పుడూ ఇల్లాగే వొస్తుంది. మరేమి తొందర ఉండcగూడదు." అని తల్లి యనెను.

రామారావు ముఖము వికసించెను. వెంటనే అతడు బండిని బిలువబోయెను.

"ఈ పిల్లలను ఎప్పటల్లే మీ కప్పగిస్తాను. వీళ్ళను ఇక్కడ దిగవిడచి ఈ గౌరవం నాకు దక్కించండి. మీ రొక్కరే పోయిరండి"అని తులసి అత్తగారితో మనవి చేసికొనెను.

"వద్దు వద్దు. వీళ్ళు దయ్యపు పిల్లలు. నీ మాట వినరు". బండివానికి చేయి యూపి ఇంతలో రామారావు వచ్చెను. తల్లి యనిన మాటలకు సంతసించెను. "పిల్లలను కూడా తీసికొని వెళ్ళమనినచో బాగుండ" దనుకొని "దాని మొహం! అదేమి చూస్తుంది. కాని నేను చూస్తానులే" అనెను. తులసి బిగ్గరగా నవ్వెను. "నాయనా, వీళ్ళు పిల్లలు కారు, నెత్తిమీద బండలు. మీరెవరునూ మోయలేరు" అని మహాలక్ష్మి యనెను. వీళ్ళు నెత్తిబండలు కారండీ, నెత్తికి కిరాటాలు" అని తులసి యనెను. పిమ్మట వాదోపవాదము లాయెను. దానికి ఫలితముగా పుండరీకాక్షునితో మహాలక్ష్మి పయనము నిర్ధారితమాయెను.

రామారావు మేడ యెక్కెను.

బండి యెక్కి అత్త యిటులనెను. "ఎప్పుడూ ఎరుఁగనిదానవు. ఈ యింటి మొహం – సూది పొట్ట మాత్రం పాముపొట్ట. దీనిని నీ బుజాలకు ఎత్తి వెళుతున్నాను."

"రోగి పాలేకోరాడు; వైద్యుడూ పాలే చెప్పాడు" లక్ష్మి ఒక పొట్లము తీసి తులసికిచ్చి – "దీనిలో వంటయింటి సామానంతా ఉన్నది" అని చెప్పుచుండగా ఆమె రెప్పలు క్రమముగా తడిసికొనుచు వచ్చెను. కంఠము స్తంభించెను.

అత్తగారి నటుపంపి తులసి యిటు వంటయింటిలోనికిఁజని పొట్లము విప్పెను. మట్టియలు; మంగళసూత్రము!

తన సంసారయాత్ర కివి దారిబత్తెము. అత్తగారి కేల కన్నీరురిపెనో తులసికిపుడు తెలిసివచ్చెను. మంగళసూత్రము చుట్టును గుడికట్టిన మగలులేని వారి మనోరహస్య మంతయు ఆమె మానసమున మెరపువలె మెరసెను.

"పెద్దకొడు కిఁక సంసారమునంతయు నుద్ధరించును. తమ్ములను తనతో పాటు చేయును. చెల్లెండ్రకు పెద్దపెద్ద సంబంధములు తెచ్చును" అని గంపెడాసతో ఆ తల్లి ఉన్నదంతయు కొడుకు కోడండ్రకు బెట్టి మిగిలిన వారిని మాడ్చుటకు జంకలేదు. ఇది తులసి కిపుడు గోచరించెను.

"తానీ యింటికి వచ్చిననాడీ పిల్లలకు దుస్తులే కావు నగలును గలవు. వారపుడు హృష్టపుష్టులయి ఉత్సవ విగ్రహములవలె నుండిరి. ఇపుడు లజ్జాదేవి వారిమీద కాపురము, కడుపున కార్చిచ్చు, పుండువంటి పుష్యమాసమునఁ గూడ వారికి కప్పదుప్పటి లేదు. పద్మనాభుఁడు గోచీతో సంతసించెను. మూడవవాడు మొలనూలితో మురిసిపోయెను. పెద్ద యాఁడు పిల్లలకు మాసికల పరికిణీ, చిన్నదానికి చినుగులది. రాత్రి వారలందఱకును ఒకరి చర్మ మింకొకరికి దుప్పటి. వారి తల్లి తన కొంగును కొంతయు, తనను గొంతయు వారికిఁ గప్పి పిల్లల కోడి వలె నడుమ నిదురించును. అట్టి యత్తగారి నగలలోనిది తుది

మంగళసూత్రము!" ఈ సంగతు లన్నియును తులసి మనఃపటమున ఇపుడు అంకితము లగుచుండెను.

తల్లి చూపు ఆ పిల్లలకు సుగ్రీవాజ్ఞ. వారి భూగోళమంతయు నొక చీకటి గది. కాని వాకిటకేసి చూచుటకు వారి మోములు మూరెఁడు బారెఁడు సాగును. తమ తల్లి తమ యన్నకుఁ జేయు వంటకముల తావియే వారికి విందు. అన్నయు వదినయుఁ గలిసిన యొక యర్ధనారీశ్వర మూర్తియే వారి కథి దైవము. దానిలోని నారీమూర్తి యిపుడు తమకు ప్రత్యక్ష దేవతయై వంటింట సాక్షాత్కరించెను.

రమణ మెలమెల్లగా వంటింటికి దారి తీసెను. వెనుక పద్మనాభుడు. ఆ వెనుక సుందరి.

తులసి వారి నందఱను తన చుట్టు కూరుచుండబెట్టుకొని యిటులనెను: "పొద్దున చలిదివణ్ణంలో యేం వేసుకో తిన్నారు?"

వీరి కారునెలలనుండియు చల్ది యన్నము లేదు. కావున ఈ ప్రశ్న వారికి ఆశ్చర్యమును, కోపమును కలిగించెను. ఈ దేవి తమను రక్షింపనే వచ్చెనో, భక్షింపనే వచ్చెనో తమకు తెలియదు.కావున నందరును మాటాడక చూచుచుఁ గూరుచుండిరి.

"మరచిపోయారా యేమిటి?" అని తులసి యనెను.

"చదిలి వణ్ణమే మరచి ఆరునెల్లయింది" అని పద్మనాభు డనెను.

"అన్నయ్యకు ఉద్యోగం అయాక పొద్దున్నే వేడి వణ్ణమే పెడతానని అమ్మ అన్నది" అని సుందరి అనెను.

"చలిది వణ్ణము జబ్బు చెయ్యదూ?" అని రమణ యనెను.

తులసి నిట్టూర్చి కొంచె మాలోచించుచు గూర్చుండెను. "ఊరక కూరుచుండుట వలన గాని, విచారమువలన గాని పకృత ముపయోగములేదు. ప్రొయి రాజవలయును" అని తులసి ప్రొయి రగిల్చి బియ్యపు డబ్బాకడ కేగెను. అందు అరసేరు బియ్య ముండెను. ఉట్టి తట్టెను. నేతి పిడత ఖాళీ. పప్పుకొరకు వెతకెను. శూన్యము. కూరలు శోధించెను సర్వ మంగళము.

విసుకును, విచారమును గలిసి తులసిని కదిలించెను. "మేడమీది దేవుఁడేమి చేయు చున్నాడు" ఆయనకు యీ సంసారము ఇంత మరుభూమి యని యేమేని తెలియునా? పిల్లలనోట గడ్డకొట్టి తాను అమృత మారగించుచున్నటు లా దేవుఁడెరుగునా?" అనికొని తులసి ఆ బియ్యము ప్రొయ్యి కెక్కించి యిటులనెను–

"నిన్న రాత్రి ఏమి వేసుకొని తిన్నారు."

"ఎర్రమందు" అని పద్మనాభుఁడనెను.

"అనగా"

"ఎఱ్ఱమందనగా ఆవకాయ" అని రమణ అనెను.

"ఇంకా"

"ఆకాశము" అని పద్మనాభుఁడనెను.

"మజ్జిగ"

"మీకు కానఖ్ఖల్లా?" అని సుందరి యనెను. బంగాళా దుంపల కూరయు వడియములును వంకాయ బజ్జియు పప్పుచారును సెనగ బజ్జీలును తమకు మాత్రమే నైవేద్య మాయెననుకొని తులసి మరల నిటులనెను. – "సెనగ బజ్జీలు" పిల్లలొకరి మొగమొకరు చూచుకొనిరి. రాత్రి తమకావాసన తగిలినపుడు కారపు పూసయని సుందరియు, జంతికలని రమణయు వివాద పడిరి. వారి యిరువురి వీపుల మీద రెండంటించి పద్మనాభుఁడు పకోడీలని తీరుమానం చేసెను. ఇపుడవి సెనగబజ్జీలని తెలిసెను. తెలియఁగనే సుందరి యిటులనెను – "చూశావా వదినే! రాత్తిరి నేను కారప్పూసంటే కాదు పకోడీలని పద్దన్నాయి కొట్టాడు" అనెను.

"సరేకాని అమ్మ మీకేందుకు పెట్టదు?"

పదునొకండేండ్ల రమణ యీ ప్రశ్నకు మొగము చిట్లించుకొనెను. తొమ్మిదేండ్ల పద్మనాభుఁడు నవ్వెను. ఏడేండ్ల సుందరి మాత్ర మిటులనెను – "మీరు చదువుకున్నారు కాదూ, అందుకని అమ్మమీకు పెటుతుంది"

"అన్నాయి పెద్ద ఉద్యోగం చేస్తాఁడుటగా! చేసిం తరువాత మాగ్గూడా పెటుతుంది" అని రమణ యనెను.

"మీరు మాక్కూడా చదువు చెప్పిస్తారుటగా!" అని పద్మనాభుఁ డనెను.

ఈ సమాధానములచే తులసి విస్తుపోయెను.

ఈ ప్రశ్నోత్తరములలో ఈ విరతి విచారములలో రామారావు నూరుమారులు క్రిందికి దిగి పొంచిచూచి నూరుమారులు మేడమీదికి పోయెను. కాని తులసి వచ్చు జాడ కానఁబడలేదు. కొండ తన కడకు రానిచో మహమ్మదే కొండకడకు.

వసంతకాలము నందలి తుమ్మెదల వలె పిల్ల లిల్లంతయు రొదచేయుచు తిరుగుచుండిరి. రెండ్లేండ్ల కానాడు వారికి పండుగ. వారి కపుడే కనులు తెరచినటులుండెను. అట్టి సమయమున రామారావు తమ కట్టెదుట కానిపింపఁగనే వారు కొయ్యల వలె బిగిసికొని పోయిరి.

రామారావు సూటిగా పోయి వంటింటి తలుపు తట్టెను. లోపల గడియ.

"తులసీ!" అని రామారావు పిలిచెను. ప్రతి వచనము రాలేదు. అతడు చెవియొగ్గి

వినెను. స్నానశాలలో చెంబు చప్పుడగుచుండెను. మరుఁగు దారిని బోయి యతడు గవాక్షము క్రింద నిలవఁబడెను. అతని కనులు నివాదదీపముల వలె నిశ్చలము లాయెను.

"మీకు సిగ్గులేదా? పోండావలికి బొండు" అని తులసి యనెను.

"నయన సుఖం కో నివారయతి? అని వినలేదా?" అని రామారావనెను.

"విన్నాను విన్నాను – లేకి పనులు. చేయి నలిగిపోవును. లేచిపొండు."

"రామారావు కదలలేదు.  తులసి–? రమణా! ఓ రమణా! ఓహోయి రమణా!" అని అఱచెను. ఈ పిలుపు వినబడగానే పిల్లలదండు వచ్చిపడెను. "ఓహో నా మీద దండయాత్రకు బలే సైన్యమును తరిఫీదు చేసితివి" అని రామారావనెను.

"నే నింట్లోకి పోతాను"అని పద్మనాభుడు వెనుదిరిగిపోయెను.

"ఆ కుర్రవానికున్న వివేకము మీకు లేకపోయెను" అని స్నానశాల నుండి వినఁబడెను. రామారావు పద్మనాభుని దెసఁజూచుచు దాన నొదవిన పరధ్యానముచే గూటిలోని చేతిని గొంచెము లాగుకొనెను. వెంటనే గూఁటి తలుపు గుభాలున పడెను. రామారావు వాకిటిలోని కరగి పచారు చేయుచుండెను.

తులసి వంట యింటిలోనికి జని తలుపులు దగ్గరగా వేసికొనెను. రామారావుమొగము తలుపుల సందునుండి తులసికి కనబడెను.

తులసి చేయునది లేక "ఏమయ్యా పద్మా" అని అఱచెను. పద్మనాభుఁడు రాకముందే రామారావు తలుపుల సందునుండి మొగమును లాగుకొని స్నానశాలలోని కేఁగి సబ్బుతో మొగమును రుద్దుకొనఁదొడగెను.

"ఈ తూరి నేను లోనికి రావచ్చు ననుకొందును. ముఖ్యముగా మూడవ సారి" అని రామారావనెను. "వీధిలోనికి పోవలెను. రెండేండ్ల నుండి మీకు తల్లి విందు. నేడు ఆలి మందు. మీ యమ్మ నగలు మీ కడుపులోనికి. నా నగలు మీ ఒడలిమీదికి. వెనుక మీరు ప్యాసయినది యె.మ్మే కాదు; దాని ఫలితము నేడు; మీరు తిని ఈ పిల్లలను తినిపింపగలరా, లేక ఆ భారము నా మీద నిడుదురా?అని తులసి యనెను. "ఓస్ ఇంతేకద!" అని రామారావు తలుపు తోసి లోనికి పోఁబోవు చుండగా తులసి వెనుదిరిగి "చనువిచ్చుకొలది నెత్తికెక్కుట మీకలవాటు మీ కెబ్బరికము లేదు. ఆఁడుదాని కడ కెపుడు రాఁదగునో, యెపుడు రాఁగూడదో మీకు తెలియదు. మీకే కాదు, ఈ కాలపు యువకులకు–"

"ఆఁగాగు" ఆ పాళముగా వారి యందరి మీఁద బడకు.

"ఛీ" ఇటులనుటకు మీకు సిగ్గు లేదోటు? "దవ్వుగా పొండు"

"నేడు అస్పృశ్యత లేదు"

"మీవంటి వారియెడ అస్పృశ్యతయు, అదృశ్యతయు,. అసంభాష్యతయు గలవు."

రామారావు కోప సౌందర్యమును, ఎరుఁగును గాని అది ప్రణయ కోపము. ఆ కైవల్యమునకుఁ గూడ సంకోచముచే అసాకల్యము కద్దు. ఈ సత్యభామను, ఈ నాగకన్యను అత డెన్నఁడును చూచి యుండలేదు. ఇపుడు చూచి ఆఁగఁజాలక రెండడుగులు ముందరికి వేసెను. "ఏమిటీ రావణ వ్యాపారము? ఆడవాళ్ళను ఎత్తుకొని పోవుదురాయేమి?" అని తులసియనెను. "నేను నా భార్యకడ కరుగుట నారీ హరణమాఁ రావణ వ్యాపారమా?" అని రామారా వనెను.

"భార్యయనగా?"

"డుభృఇన్ భరణ పోషణయోః భరింపఁబడునది పోషింపఁబడునది భార్య?"

" "అబ్బో పాండిత్యము" ఈ డుడూ ఏమిటి? భరింపఁబడునది భార్య యగుచో నేను మీ యమ్మగారికి భార్యను?"

"కాదు తులసీ" అని రామారావు తులసిని ఎత్తుకొని "ఇదుగో నేనే భరించితిని" అని యనెను. పంజర బద్ధమగు క్రొత్త చిలుక వలె తులసి విదిలించుకొని గుంజుకొని తప్పించు కొనెను. ఆమె కాటుక కన్నుల నుండి ఒకానొక కృష్ణ ప్రవహించుటకు గాను కట్టలను తప్పించు కొనుచుండెను.

మరల రామారావట్టులే చేయుట కాయత్తుఁ డాయెను. మాటలు మాని తులసి అతని చెంప చిటేలునఁ గొట్టెను.

చెంపకాయ తిని రామారావిటులనెను–

"ఎశ్! సత్యభామ కాలితో దన్నెను! నీవు చేతితో చెంపమీఁద వేసితివి. నీ వసత్య భామవు.

తులసి మరల చేయెత్తెను. రామారావు రెండవ చెంప యొగ్గెను. తులసి ఛేళ్ళుమనిపించెను. రామారావు తులసి రెండు చెక్కుల మీఁదను రెండు చుంబన ముద్రలు వేసెను.

"ఇది సిలువ" అని తులసి యనెను

"రామ రామ" ఎవరేని ఒక చెంప మీద వేయుచో రెండవ చెంప గూడ వేయించు కొనుమని క్రీస్తు చెప్పెను. నే నటులు చేయుటయే గాక నీవు చేసిన పనికి నీ రెండు చెక్కులు గూడ ముద్దాడితిని" అని రామారావనెను.

"క్రీస్తు నుదాహరించు వారు ఇంటిల్లిపాదిని పస్తులో నుంచరు" అని తులసి యనెను.

"ఇంతే కద? ఏదీ ఇందాక అమ్మ యిచ్చిన పొట్లము" అని రామారావనెను.

ఆ పొట్లము విప్పి చూపినచో బాధ కలుగునో కలుగదో చూతమనుకొని తులసి లోనికిఁ జని పొట్లము తెచ్చి విప్పి చూపెను. రామారావు చూచి నిశ్శంకముగా నిటులనెను–

"ఇటుతే, అమ్మ వచ్చు వరకు ఆతంకము లేదు. నీకు బైబిల్ రానటులున్నది. "రేపటి సంగతి నీ కెందుకు? రేపటి సంగతి రేపే చూచుకొనగలదు" అని ఏసు అనెను.

"దయ్యము తారకముపదేశించినదట? నేను చచ్చినను ఈ మంగళ సూత్రము గాని, మట్టెలు గాని యీయను. కాని నా తాళి తీసి యిత్తును" అని తులసి తన పుస్తె పుటుక్కున తెచ్చి రామారావు మీఁద పడవయిచెను.

'ముదిరిన'దని అనుకొని రామారావు బజారునఁబడెను.

రామారావు సూటిగా సుందరం – ది–లాయలిస్ టు – ఇంటికి వెళ్ళెను. ఇతడు రామారావుకు బాల్య మిత్రుడు. ఈ మిత్రుని కడ నొక పదిరూకలు దొరకక పోవని రామారా వనుకొనెను.

సుందరము మోకాలు దిగని కొల్లాయ గుడ్డ కట్టుకొని కూరుచుండెను. ఎదుట నొక వెదురు బుట్ట పెట్టుకొని దానిలోని వేరుసెనగ కాయలను ఒలుచుకొని తినుచుండెను. రామారావును చూచీ చూడక ముందే సుందరము "ఈ యిల్లటపుటల్లుఁడు ఆ హిమాలయము నుండి ఆ ఓషధిప్రస్థము నుండి యెపుడు దిగెను" అని యనెను. రామారావీ మాటలకు మారు పలుకక "ఈ ఫలహార మేమిటి? ఈ కద్దరు కొల్లాయ మేమిటి? సుందరం – ది – లాయలిస్ట్ గాంధీ యెపు డాయెను" అని యనెను.

"ఈ కొల్లాయ కద్దరు కాదురా, దొంగ ఖద్దరు, ఫక్తు మాంఛెష్టరు – కుక్కపిల్ల యింకను కనులు తెరువనటులున్నది. నాయనా! డిప్రెషన్ డిప్రెషన్, అంతయు డిప్రెషన్!"

"ఉద్యోగ మెచటనూ దొరకలేదా?"

"దొరక కేమి, దొరికినది, గంగాదేవిని నమ్ముకొంటిని, బీ.యే.నీళ్ళు, బీయే. నీళ్ళు, నీళ్ళ కావడి వేసి బిందె అర్ధణాకు అమ్ముచుంటిని. వెల తగ్గెనని వేరుసెనగలు తినుచుంటిని."

"జయించితివి. నీ కిఁక ఈ లాయలిస్టు – తోకతో నేమి పని? ఇఁక నీ పేరు సుందరం–ది– బ్యాంకర్."

"పాప మేదో ఆశపడి వచ్చినటు లున్నావు. మోఁతవలన సంపాదన మూడణాలు. వేరుశనగల ఖర్చు మూడణాలు. బ్యాంకులో బ్యాలెన్సు నిల్."

అడుగబోయి అడిగించుకొనకున్నచో చాలుననుకొని సెలవు వేడుకొని యతఁడు సెలవీయక ముందే రామారావు బయటపడెను. పిమ్మట రోడ్డుమీఁద నడచుచు ఆలోచించి యాలోచించి ఆతఁడు మూర్తి యింటికిఁ జనెను.

మూర్తియు బి.యే. ఆన్‌సే. చిన్నఁబోయిన మొగముతో నతఁడు వసారాలో కూరుచుండి యుండెను. ఇంటి తలుపులు వేసియుండెను. ఎదుటికి వచ్చుచున్న రామారావును

గమనింపఁ జాలనంత ఆలోచనలో నతఁడు మునిఁగితేలుచుండెను. రామారావే కలుగఁజేసుకొని "హలో మూర్తీ–ది–కో–ఆపరేటర్" అని సంబోధించెను.

మూర్తి మొగమెత్తి "సుమధ్యాహ్నము. మిష్టర్ ద్వివేదీ–దీ–ఇంటల్లుడూ" అని సమ్మానించెను.

"ఇంటల్లుడు కాక వాకిటల్లుఁ డొకడా."

"య్యెస్! ఉండునురా ఉండును. ఉన్నాఁడురా. ఉదాహరణము తీసికొందము. నేనేరా. తెలియునా? అందరును నీవంటివా రుందురా? డిప్రెషన్! ఇపుడు సింహాసనం మీద చక్రవర్తిని తీసివేసి డిప్రెషన్ కూర్చున్నది. బస్తా రెండు రూపాయల కమ్మించుచున్నది. తెలిసెనా? ఈ డిప్రెషన్‌లో అన్నియు నుండును. ఇంటల్లుడు, ఊరల్లుఁడు విడాకుటల్లుఁడు, వాకిటల్లుఁడు. ఉద్యోగము దొరకనంత వఱకు నేను వాకిటల్లుడను. తెలిసెనా? నా పనియే యింతవఱకు బాగుగా నున్నటులున్నది." అని తలచి రామారావు తన వంటి యీ వాకిటల్లు నకు సానుభూతి చూపి రాజవీధిలోని కడుగిడెను.

అపరాహ్ణ సూర్యుఁడు అతని తలను, క్షుత్సూర్యుఁడతని యుదరమును మలమల మాడ్చెను. అపుడు తులసి అతని తలపులోనికి వచ్చెను. ఇంటికిఁ బరుగిడ మొదలిడెను.

తులసి పిల్లలకు అన్నము పెట్టి వారితో మాటలాడుచు గిన్నెలు తోమి ప్రొయి యలికి కొంగు పఱచి తమ యన్నమునకు గింజలెపుడు వచ్చునా యని నిరీక్షించుచుండెను.

తులసిమీద బుద్ధి పాఱి యింటికి సగము దూరమున నున్న రామారావు హఠాత్తుగా ఆగి "పైసాలేనిచో పరస్త్రీ విముఖుఁడను మాట జూటా పైసా లేనిచో స్వపరస్త్రీ విముఖుడు"అనికొని వెనుదిరిగెను.

అతని మిత్రులలో మిగిలిన వాఁడొక శర్మ. అతడు యమ్మే. బి.యల్. రామారావు శర్మ యింటి సందు మొగకు వెళ్ళి చూచెను. అచట ఒక పిట్టయేని కాన రాలేదు. "ప్లీడర్ల యిండ్లు కల్లం గళ్ళు కదా! ఈ సందింత యరణ్యముగా నున్నదేమి?" అని యతఁడను కొని కొంచె మాలోచించెను. అతనికి సమాధానము స్ఫురించెను.

"ఓహో, ఇది కోర్టువేళ" అని ఆతఁడు ఇంటికిఁబోవ నిశ్చయించు కొనుచుండఁగా శర్మ వాకిట లోనికి వచ్చి బెదిరి బెదిరి చూచెను. శర్మకు శత్వారమే కాక రెండు మున్నాళ్ళ నుండి అతనికిఁ దెలియకుండ తిమిర రోగము ప్రవేశించెను. అతని కంటి జోడు ఆ కారణమున మొన్ననే పగిలిపోయెను. దానితో నతఁడు జోడు – అలవాటు మానివేయఁ దలచెను, జోటిపని మనస్సుచేతనే చేయించి సమాధాన పడుచుండెను.

శర్మ తన సందు రెండు చివరలును పరికించి "ఎవరును లేరు" అని మనస్సును శాంత పఱిచికొనెను. పిమ్మట వడిగాఁ జని గోడకుఁ గట్టియున్నఁ "యమ్మే.బి.యెల్"

బల్లను జూచెను. అది తిన్నగా కానరాలేదు. "ఇది యొక సౌభాగ్యము కాబోలు. షార్ట్ సైట్ కూడా సంతరించినటు లున్నది" అని యనుకొని దేవులాడి దేవులాడి బల్లను పట్టుకొని బలవంతముగా లాగి ఇంటి లోనికిఁ దీసికొని పోయి భద్రముగా దాఁచి ఒక టావు కాగితము తీసికొని వ్రాసికొనుచుఁ గూరుచుండెను. దారిద్ర్య దేవత యొక్క వికట హస్తమును విస్పష్టముగాఁ జూచి రామారావు సానుభూతి చూపుటకు శర్మ యింటిలోనికిఁ జని – "శర్మా ది నిహిలిస్ట్, దేవుడు ఉన్నాఁడని వ్రాయుచుండెనా" అని అనెను.

"ఓహో! అకాలపు టెండ! ఇంటి యల్లుండ! నీ కెందుకి కాండ? దేవుఁడెచట నున్నాఁడురా? ఉన్న దొక్క డిప్రెషన్! యూ.పి.లో కలెక్టరు దొరవారు గ్రాడుయేట్లకు పది యెకరాల వంతున భూదానము చేయుచున్నారని విని అప్లికేషను వ్రాసికొనుచున్నాను. దీని రిజిష్టరుకు గాను నీ వొక పావులా దానము చేసి కొనవచ్చును" అని శర్మ అనెను.

"అదియే యున్నచో నా కీ పూట నిర్విచారముగా గడచిపోయెడిదే!" అని లోపల ననుకొని రామారావు – "ఆ భూదానము ఆంధ్రులకు గాదు. యు–పి–లోఁ గూడ ఒక జిల్లావారికే. కావున నా దానము అప్రశస్తదానము" అని మరి యచట నుండక ఆ డిప్రెషన్ బజారునుండి అసలు బజారునఁ బడి ప్రిన్సిపల్ అంబుజమ్మ గారి యింటికిఁ జనెను.

"ఇక ఈనాఁడు మా కెవరికిని అన్న ప్రాప్తి లేదు," అని యింటికడ తులసి యనుకొనెను. వెంటనే మూడు గంటలు మ్రోగెను. "నిక్కము, నిక్కము" అని తులసి యనుకొని బోషాణము తలుపులు తెరచి లోపలకి దిగి వెతకి వెతకి పెద్ద రాగిచెంబొకటి తీసెను. దానికి చింతపండు పులుసు పట్టించి తోముచుఁ గూరుచుండెను.

అచట రామారావు అంబుజమ్మగారి దర్శన మాచరించి "నేను ద్వివేదుల రామారావుని" అని మనవి చేసికొనియెను.

"ఆహాఁ మీరు మనిషేమియు తలక్రిందుగా లేరే? అప్లికేషనులోని "రామారాయ్ ద్వివేది బి.ఏ.(ఆనర్స్) మీరేనా" అని అంబుజమ్మ యనెను. రామారావు పెదవి కఱచుకొని "చిత్తము" అనెను.

"మీరింత యాలస్యము చేసితిరేమి" ఆ పోస్టుకు రెండు వందల అప్లికేషను లున్నవి. నూట యేఁబది మంది బి.యే.లు నలుబది రూపాయలకు వత్తుమని తమ యుదారతను వెల్లడించిరి, యమ్యేల య.మ్మే.ల యుదారత చూడఁదలచి ఆ పోస్టును ఇంత వఱకును ఎవరికిని ఈయకుండ తొక్కిపట్టి యుంచితిని. తమరే మాత్రము Sacrifice చేయగలరో చూతము?" అని అంబుజమ్మ యనెను.

రామారావు డిల్లపోయెను. వెంటనే సహజస్థితిని సంగ్రహించుకొని "ఆడవారిని కన్‌సల్‌ట్ చేసి మనవి చేయుదును" అని యనెను.

"మంచిది. అమ్మగారితో కాదు. భార్యగారితో నని యనుకొందును. వారికి మగల కన్న ఉదారత మెండు" అని అంబుజమ్మ యనెను. ఈ మాటలకు రామారావు బెంగపడెను. అతని దురవస్థ అంబుజమ్మ గ్రహించింది. "మిస్టర్ ద్వివేదీ తొందర లేదు. మీరు మీ భార్యతో ఆలోచించి మరల రండు" యని యనెను. రామారావా మాటచే పద్మవ్యూహము నుండి తప్పించుకొని నటుల సంతసించి సెలవు తీసుకొని లేచునంతలో వాకిటిలో నుండి – "బిక్షాందేహి" అని ఖంగున వినఁబడెను.

తొందర తొందరగా రామారావును, అతనికన్న తొందరగా అంబుజమ్మయు. వాకిటిలోనికి వచ్చిరి.

డిప్రెషన్ – చెంబు.

మిసెస్ రామారాయ్ ద్వివేది.

"బి.యే.ఆన్స్."

అని తారుతో వ్రాసిన రాగిచెంబు పట్టుకొని తులసి వారి యెదుట నిటారుగా నిలిచి యుండెను. ఆమె వెనుక సుందరి, రమణ, పద్మనాభుడు: అందరును గలసి యిటు లనిరి "బిక్షాందేహి."



# కవికొండల వెంకటరావు

**(1892 - 1962)**

**క**వి, కథా రచయిత, నవలాకారుడు ఆంధ్రావర్డ్స్‌వర్తు బిరుదాంకితులు. కవికొండలవారి కథలు చిన్న చిన్న ఉరుములు, మెరుపులు. మామూలు సంఘటనలను ప్రత్యేక దృష్టితో పరిశీలించి వైచిత్రి ప్రధానమైన కథలు వ్రాశారు. హాస్య ధోరణిలో వ్యంగ్యంగా జీవిత సత్యాలను, సమస్యలను ప్రదర్శించడం వీరి కభీష్టం. శైలి విలక్షణ మైనది. అల్లిబిల్లిగా అల్లుకున్న అందాల లతలా నిసర్గ సౌందర్య శోభితం, 'చీర ఎలా మొల తిరిగి, మెడ సురిగి, సిగ నొరిగి, ముమ్మెలికలు పడీ, ముయ్యేరు మేలి ముసుగ్గా' అవుతుందో కవి కొండలవారి కథ అలా సాగిపోతుంది.

**రచనలు :** తోలు బొమ్మలు, మట్టెల రవళి, బ్యూటీ అండ్ డ్యూటీ, దేవుని ఎదుట, బొమ్మ - చిలుక మొ॥ కథల సంపుటాలు, కవికొండల గేయాలు మొ॥ నవి.

# కంఠధ్వని

**ఈ** కథ నేను కన్నీళ్ళతో వ్రాస్తూ వున్నాను. ఇదివరలో ఎన్ని కథలు వ్రాసినా సిరాతో వ్రాశాను కానీ ఈ కథ మాత్రం నేను కన్నీళ్ళతో వ్రాస్తూ వున్నాను. – గోదావరి వరదను గురించి అనేకులు అనేక విధాలుగా ఈ మధ్య చెప్పుకోవడం, పత్రికలలో కుప్ప తిప్పలుగా అచ్చు వెయ్యడం అంకెలు వెయ్యడం ఏర్పాటు కావడం, చందాలు వసూలు చేయడం, వరద బాధితులకు సాహాయ్యపడ్డం, చాలా మంది ఈ వరకే ఎరిగి వుంటారు. దాన్ని గురించి మరి వివరిస్తినా ఉన్న గోడు చెడగొట్టుకోవడ మవుతుంది.

దుమ్మగూడెం నుంచి బ్రహ్మసమేధ్యం దాకా ఏర్పడ్డ మహా స్రవంతి వర్ణనాతీతం. అదంతా రెండవ మహార్ణవ మనవచ్చును. ఆ మధ్యనున్న ప్రజ గడ్డ అగచాట్లు అసంఖ్యాకాలు, పశువు లేమిటి, పక్షు లేమిటి, పాము లేమిటి, పాక లేమిటి, నరులేమిటి నానా జీవరాశి నవబీభత్సంగా తల్లడిల్లిపోయింది.

కాని ఆ గండ్లెండిపోయినాయి. ఇప్పుడు నేనేమైనా వ్రాస్తే, నిమ్మకు నీరొస్తూన్నట్లు చదివేవారేగాని గమ్మున గంగవచ్చేస్తూ వుందని లేచిపోరు.

"ఆనాడు గోదావరికి కాదు గండ్లు పడతా! నా కండ్లకు! వెల్లువై ప్రవహించింది నీరు కాదు కన్నీరు" అని నేనిప్పుడంటే నమ్మేవారెవరు? అయినా నా కలం ఇప్పటికీ కన్నీటముంచే వ్రాస్తూ వున్నాను.

ఇప్పటికీ, అనగా మూడు వారాలైనప్పటికీ, ఇల్లు తడారలేదు. ఇంటిలోపలి గోడలు, గొందిలు, బీరువాలు, పీటలు, సమస్తం గీత గీసి చూపినట్టు నీటి మట్టం చూపెట్టేవి. నానిపోయిన సరుకునంతనూ ఎండబెట్టడం యింకా పూర్తి కాలేదు. ఎండినా ఆ యా వస్తువులు మఱి పనికివస్తాయన్న ఆశ నాకు లేదు. అయినా నా పడకకుర్చీలో కూర్చుని నేనీ కథ వ్రాస్తూ వున్నాను. పడక కుర్చీలో కూర్చుని వ్రాస్తూ వున్నానంత మాత్రం చేత సుఖంచే వ్రాస్తూవున్నాను అని అనుకోకండి! దుఃఖంచే వ్రాస్తూ వున్నాను.

"ఎందుకు నీకంత దుఃఖం?" అని అడుగుతారేమో! తోడి మానవుని చూచి? ప్రకృతి ముందు ఓడిపోయిన తోడి మానవుని చూచి ఈ దుఃఖమంతా నాకు కలుగుతోంది. కథకంటె కబుర్లుగా చెప్పుకుంటే మెఋగనిపిస్తుంది; అయితే కబుర్లను మరిచిపోతాం. కథ అయితే అలా నిలిచివుంటుంది. కథకు సారస్వత లోకంలో ఒక స్థానముంది; కబుర్లకు అట్టి స్థానం లేదు. అంచేత దీనిని కథగానే ప్రపంచిస్తూ వున్నాను.

గోదావరిని గురించి తలపోసేటప్పుడల్లా కవుల కొకానొక విపరీత బుద్ధి పొడమకమానదు. అసలు ఏది వారు తలపోసినా అంతే అని నా వూహ : భూమినంతనూ జలమయం చేసి ఆ జలంలో మత్స్యావతారంగా శ్రీమన్నారాయణమూర్తి విహరించిన వాడన్నది నిజమేమో అని అనిపించింది ఆనాడు. అనగా 15-8-53వ తేదీ రాత్రి రాజమహేంద్రవరంలో; ప్రళయమన్నది అబద్ధం కాదనిపించింది. ఒక్కుమ్మడి హిమాలయ పర్వతాలు అడుక్కుపోయి హిందూ మహాసముద్రం తెప్పున పైకి తేలిందన్నా నప్పేలా గగపడింది.

ఎటొచ్చీ వానలేదు ఆ రాత్రి! మబ్బులేదు; చుక్కలు ప్రకాశమానంగా వున్నాయి. గట్లను గోరాడుతూ గోదావరి ఎప్పు డివల కురికిపడదామా అనే తుదిక్షణంకోసం వేచియున్నట్లుంది. చూచేవాళ్ళకు బాగానే ఆనుతూ వున్నది. జల ప్రవాహము, నడిచే వాళ్ళకు పోతగట్టంతా కూడా "స్పంజి" లాగు మెత్తమెత్తగా తట్టుతూ కాలు సాగిస్తూనే వుంది. అయితే పడుకున్న వానికి పరాకుచెప్పే వానికీ మాత్రం అమ్మహాతల్లి ఆ నిమేషమప్పుడు మత్తు మందు జల్లేసింది. గండ్లు కొట్టేసింది; ఒకచోటా? కాదు? అనేక చోట్ల? ఒక రీతిగానా? కాదు; అనేక రీతులుగా; ఇప్పుడు వాటి నన్నిటినీ, కాటారం నుంచి కపిలేశ్వరం దాకా లెక్కించడం అంటూవస్తే - అప్రస్తుతం. అవన్నీ ఈ పాటికి పూడ్చేసి వుంటారు. మరిన్నీ, నదియొక్క ఉద్రుతం తగ్గిపోయినాక. నీరు, గండిపడి పడ్డదో నిండిపోయి పడ్డదో ఎవరికి కావాలి?

❄ ❄ ❄ ❄

కాని ఒక్కలిప్తలో ఆనాటి రాత్రి ఆర్యాపురం అంతా జలప్రళయమైపోయింది. నే చెప్పదలచుకొన్న కథకూడా ఇక్కడ నుంచే ప్రారంభం : ఎలెక్ట్రిక్ తీగల్లోంచి పిల్లకాయల "బరబర" బండ్లెక్కి కూర్చున్నాయి. గది కన్నంలో పెట్టిన తిరగటి గురుజు కిటికీలోంచి తొంగిచూస్తూ వుంది. ఫెడీల్ ఫెడీల్ ఈ దవడ ఆ దవడ చపేట లిచ్చి, ముక్కుమీద గుద్దినట్లుగా, గుంపులు గుంపులుగా. ఏగీస దూలాలు, టేకిపలకలు, మద్దిమానులు, గుమ్మాల్లోంచి దూరి కొన్ని, కప్పులు తన్ని కొన్ని, ప్రహరీగోడలు పడగొట్టి కొన్ని, ఇలా ప్రజతో పాటు పంకిలంతో పాటు, తామూ పామరులే అన్నట్లు పరవళ్ళు త్రొక్కసాగాయి.

నడుస్తూవుంటే వెనుదరుముకొచ్చి, "చచ్చిపోతావా? గ్రుచ్చుకుపోతావా?" అని అడిగేలా "హోరుహోరు; హుం హుం;" శబ్దం గావించుకుంటూ ఒకటే వరద ఒకటే వరద.

అంతలో అరుగెక్కింది. మరి కొంత సేపట్లోనే అటుకెక్కిపోయింది. అంతా నీరే అంతా ఏరే; చూరులంట దొర్లిపడే నీరూ ఏటిలోకే, మేరలేకుండా జీవనాధారాలు గోలుపోయి ఏడ్చేవాళ్ళ కన్నీరూ ఏటిలోకే.

ఒకడు టెలిఫోన్ స్తంభం ఎగబ్రాకి చివళ్ళు పట్టుకు వ్రేలాడి "వ్రేళ్ళు పట్టు తప్పిపోతున్నాయి; రక్షించడర్రోయి" అని కేకేస్తూంటే అది వినిపించుకోకుండా, కప్పుదొలుచుకు పైకి తెప్పున తేలినట్టు వచ్చి ఒక కుటుంబం కుటుంబం ఒకటే అరపంట; "ఏమర్రోయి? 'ఇంటిల్లిపాదిమి హతమై పోతున్నాము; గంగమ్మ కాహుతి అయిపోతున్నాం; మాకు ప్రాణదానం చేసేవాళ్ళు లేరా; పడవలు తేరా; ఈత నేరరా; కొంప కూలిపోయేని? మేం ముంపులో పడిపోతున్నాం?" అని ఒకటే అరపంట ఆ కుటుంబం కుటుంబం! మరోచోట పడుకోడానికి మంచమంటూ లేని ఒక వ్యక్తి తలుపు ఊతెత్తి మామూలు ప్రకారంగా ఆ తలుపే తల్పంగా జేసుకు పడుకున్నాట్ట. గుండెలమీద చెయ్యేసుకు గుర్రు పట్టేట్ట; పగ లెంతగా అలిసి వచ్చేడో పాపం; – పక్కకు తిరిగాట్ట; చెయ్యి అలా; వేశాట్ట; తేలగొడుతూ నీరు చేతికి తగిలిందట? – ఆట్టే లోతుండదని, తేలే తలుపు మంచం దిగినట్టు దిగబోతే – మోకాలబంటి, మొలబంటి, మెడబంటి, ఇల్లంతా వరదై యీదించి యీదించి వీధిని పెట్టిందట ఆ కుర్రణ్ణి మహాగోదావరి!

ఇంతిల్లా అల్లకల్లోలంగా వున్నా తమ యిల్లు ఘట్టి అని, తన యిల్లాలుకు వెయ్యేళ్ళు ఆయుష్షని, తన కసలే చావు లేదని, తాను పట్టిందల్లా బంగారమేనని, వచ్చింది జంబూ నది గాని గంగానమ్మ కాదని, అనుకొన్నవారు లేకపోలేదు. అటువంటి వాళ్ళయొక్క ఇల్లు, ఆఖరుకు ఆగినా, వాళ్ళ పిల్లాజెల్లా సునాయాసంగా బయటపడ్డా, అతగాడికి అంతకంతకు లాభసాటిగా పెద్ద కరకట్టు కంటరాక్టో, పక్కా గుడిసె వేతబేరమో మర్నాడే తయార్రెడీగా చేపడ్డా లోకం ఎంతైనా అభినందనా లందిస్తుంది. కాని మఱోలా జరిగి యావత్తూ విషమిస్తే విచారమన్న దెవరికి? కథ వ్రాసే నాకు, కథ చదివే మీకు; వాని పురాతనపు టిల్లు కూలిపోవడమే మెఱుగంటారు మఱి పునర్నిర్మాణం చేసే వారసుల్లేక!

❄ ❄ ❄ ❄

ఊరి వీధులంట వెల్లువ, అదివఱలో ఎన్నడూ కనీ వినీ యెఱిగున్నది కాదు. పడవల పడిచెక్కలు, ఇళ్ళ "టెర్రేసులు" ప్రక్క ప్రక్కలుగా అమర్చబడ్డ "పారలెల్" గీతలుగా ఏర్పడి వున్నాయి. తభీమని ఒక పడవలోనికి ఒకానొక డాబామీద నుంచి ఒక పురుష వ్యక్తి ఏభై యేళ్ళ వాడు దూకాడు. "రావే! నీవు కూడా దూకవే! ఇంకెక్కడి ఇల్లే! ఇంటిని నమ్మకే! నమ్మకే!" అని అరిచాడు. పడవ పురుష వ్యక్తి పడ్డ పాటుచే ఇంటికి కొంచెం ఎడమైంది.

స్త్రీ వ్యక్తి దూకేలో ఆమె నీళ్ళల్లో పడింది. నీళ్ళల్లో ఆమె పడ్డం ఏమిటీ, ఇల్లు ఇల్లు డాబా సమేతంగా కూలడం ఏమిటి; పడిపోతూవున్న ఇంటికి తాళం వేసే తలంపు ఆమెకుందో అన్నట్టు ఆమె చెంగున వున్న తాళంచెవి అలా ఎగిరి గొళ్ళాన్ని తగిలింది. ఆమె "డెబ్రిస్"లో నలిగి నాశనమైనట్లు చూపఱకు తోచింది. "మఱి ఆవిణ్ణి రక్షింపబోవటం అటే, పడవ పోదు; నీవు కూడా ఆమెతో పాటు చావు నపేక్షిస్తున్నావా పడు; ఈ వరదనే పడు; చూచావా? గడ కందడం లేదు" అని గడ తేల్చి పడవలోకి గడను తీసుకుని, తెడ్డు మెడ్డుకుంటూ రక్షకుడు ఆ పురుషవ్యక్తిని ఒడ్డు చేర్చాడు.

గాడాంధకారం, ఆ పురుష వ్యక్తి ఆ పడవలో కూర్చుని ఏడ్చాడో, ఏమన్నాడో ఏలా ఉన్నాడో, కనిపెట్టడానికి దుస్సాధ్యము, తరిమికొట్టే టేకి దూలాన్ని తప్పించుకుంటూ, ఇరు తట్టుల్ని పడే ఇళ్ళు తగులకుండా, పడవను ఆ రక్షకుడు పోనిచ్చాడు కాబట్టి. ఆ పురుషవ్యక్తి గట్టెక్కాడు.

గట్టెక్కినప్పట్నుంచి ఆ పురుషవ్యక్తి కొకే విచింతనం. తన భార్య యేమైందని, తనకంటె చిన్నదైనటు వంటి, తన కంటె చలాకీదయినటు వంటి, తన కంటె ఆశాలతలు అల్లుకునేటటు వంటి, ఆమె తన కంటె ముందు చనిపోవడమా? ఇల్లు పదిలపఱచుకు ఇంకా తెల్లాఱి ఆమె తనకు కనిపించి తీరుతుందనే అతగాడి నమ్మకం. ఆ నమ్మకంతో గట్టున నిలబడ్డాడు. గట్టు ఎక్కడో గండడి ఊరిలోనికి నీరు వచ్చింది కాని ఆ పురుషవ్యక్తి నిలుచున్నచోటున చూస్తే గట్టు మళ్ళీ ఎక్కడ లేని ఘట్టీని;

భళ్ళున తెల్లారడంలో బయలుపడే ప్రతీ చీపురుముల్లును, ప్రతీ చీమను, ప్రతీ కట్టెపుల్లను, ప్రతీ కనులున్న మనిషినీ అడగడమే ఆ పురుషవ్యక్తి, తన యిల్లాలు అగుపించిందా అని, తన గేస్తురాలు జీవించి వుందా అని; తానెవ్వరో ముందు జెప్పడాయిరి; తనకంటె ముందు తనభార్యను గురించి అడిగేడు. "ఎవరికెరుక ఈ మహావిపదంబుధిలో" అని అనేవారే అందరు. ఆకాశం ఉదయారుణమైంది. ఆ అరుణిమ ఇంటి కప్పుల మీద ప్రవహించే నీటిమీద రక్తంలా నాట్యమాడుతూ వుంది. కొబ్బరి చివళ్ళను కవ్విస్తూ వుంది. ఎక్కడన్నా ఒకపక్షి కూసేనేమో గాని, కుక్క కనపడ్డం లేదు; కోడి వినపడ్డం లేదు; పిల్లులు, పిల్లలు, ఒక్క రీతిగా మాయమైనట్టు, మరుగుపడినట్టు, అయిపోయినారు. జీవనమంతా ఒకే చేవ అన్నట్టు కలప అడతీ సరుకు తప్పిస్తే మరి తెప్పున తేలిన పదార్థం ఆ జలం మీద కనపడలేదు. సూర్యబింబం తెలుపెక్కింది. లాంచీలు వీధులవెంట నడాడుతూ మెఱిసిపోతున్నాయి. లాంచీలకంటె వరుసలు తీరి అద్దె పడవలు, అధికారి పడవలు వరద బాధితులకు సాయపడ్డానికి గాను అమారుగా వున్నాయి.

కాని మన మనుకొనే పురుషవ్యక్తిని ఏవిగాని తలపోయడం లేదు. ఏవిగాని వాని దరిదాపునకు చేరుకోవడం లేదు.

పురుషవ్యక్తి పేరు భూపయ్య. భూపయ్య చూపించడానికి గాని కాపించడానికి గాని తనచేత రూపాయి లేదుగదా, చిల్లిగవ్వైనా లేకుండా వున్నాడు. కట్టు గుడ్డలతోను కడప్రాణంతోను కడిచిన రాత్రి అతడెలా రక్షింపబడ్డాడో మన మీ వరకే చూచాం; అతని కనుసన్నల్లో ఆదాకా మసలిన కాంత పేరు కళ్యాణమ్మ. ఆదాకా మసలిన కాంత అని ఎందుకంటూ వున్నానంటే మఱి చెప్పుకోడాని కామె కళేబరం కూడా కనిపించడం లేదుగా; కాని ఆమె చనిపోయిందంటే భూపయ్యకు నమ్మకం లేదు. ఆ కారణంగా గట్టువీడి మరోపట్టుకు పోడు. అతగాడి చూపెంతసేపూ వీధులంట కొత్తగా ప్రవహిస్తూ వున్న గోదావరి ప్రళయతాండవం మీదనే వుంది.

"ఒక్కరన్నా ఆమె జాడ చెప్పేవారులేరా? వీరా? వారా?" అని వాపోసాగాడు. "అంతచేటు వాపోయేవాడవుఅసలు ఆమె నెడబాసి ఎందుకు వచ్చావయ్యా?" అంటే "నన్ను పడవలో పడేసి, ఆమెను నీట పడేసిన ఆ దౌర్భాగ్యుణ్ణి అడుగు" అనేవాడు. కళ్ళు లోపలకు పోతున్నాయి. ఆకలీ దప్పీ తీర్చుకోకుండా అలమటించేడు భూపయ్య.

భూపయ్యలాంటి వాళ్ళింకా ఎందురున్నారో ఈ లోకంలో గట్టెక్కి ఏడ్చేవాళ్ళు భూపయ్య ఎలుగెత్తి అరిచిన అరపుచేత అతగాని కంఠం బొంగురు వోయింది.

ఒక గంగా భాగీరథీ సమానురా లెవర్తుకో అలాపోతూ "నాయనా! ఎవరికోసం ఏడుస్తున్నావు?" అని అడిగింది. "ఆమె కోసమే?" అన్నాడు. "ఆమే లాగుంది, పడిపోయిన ఇంటిమీదనో ఇంటి క్రిందనో కుంయి కుంయి మన్నట్టయింది. ఆ రుతం దయ్యానిదను కున్నాను. నిన్ను చూచాక బ్రతికున్న సుమంగలిదేనని అనిపిస్తోంది." అని జవాబు చెప్పింది. ఆ చెప్పిన ఆవిణ్ణి మరి ప్రశ్నలు వెయ్యాలీ అంటే నూటొక్క ప్రశ్న వెయ్యొచ్చు. "నీ కెక్కడ కనబడింది? నీ వెప్పుడు చూచావు? నీ వెల్లా గొంతు గుర్తించావు? నీవు ఏలా వెళ్ళి ఎలా మళ్ళగలిగావు నట్టేట గట్టినట్టున్న నా కొంపగుట్టు నీ కెలా తెలిసింది?" అని యిన్ని ప్రశ్నలు వేయొచ్చు. కాని భూపయ్యకు మరి ఆమె నడుగ బుద్ధిపుట్టలేదు. ఆమె అక్కడ మరి నిలుచుండనూ లేదు. భూపయ్య చూపప్పుడే ఒక ఆమడ దూరం మరో తట్టుకు ప్రాకిపోయినట్టు పోయింది. ఈ కొత్త స్త్రీ యొక్క వెన్ను పోల్చి బిగ్గరగా అరచేలో ఆమె వినిపించుకోలేదు. ఆమె వీనికి మరి కనిపించనూ లేదు. అయితే తన భార్య ఉందన్న, బ్రతికి బాగా వుందన్న నమ్మకం మాత్రం భూపయ్యకు ఆమె అన్న వాక్యం వల్ల ఇనుమడించింది. కుంయి మన్నది కుక్కా కావచ్చు. నక్కా కావచ్చు నమ్మకం లేనివాడికి. కాని భూపయ్యకు మాత్రం కళ్యాణియే!

కళ్యానికో ముప్పై అయిదేళ్ళుంటాయి. లావణ్యం లాలిత్యం రెండూ కూడా ఆమె సొమ్మే. కళేబరమన్నా కనపడితే చాల్ననే ఊహలోపడి భూపయ్య ఒక పడవ వాణ్ణి తన యింటి వద్దకు తీసుకెళ్ళమన్నాడు. పడవవాడు "కళేబరమేం ఖర్మం, కంఠమే వినబడ్డప్పుడు;

పదిరూకలు ఇవ్వండి?" అన్నాడు. పది రూకలు కావు కదా పది నూకలు లేవు భూపయ్యవద్ద ఆ పొద్దు. పై పెచ్చు నోట మాట రావడం లేదు. కేవలం సంజ్ఞామాత్రంగా బతిమాలు కున్నాడు. బతిమాలుకున్నా ఆ కర్కోటకుడు "ఊరికే అన్నాను గాని ఇంకెక్కడి ఊరయ్యా? ఊరు ఊరు మునిగిపోయింది. చూర్లే కానం, నీ సూదంటురాయి దానంతటదే దొరకాలి కాని మఱి నెమకితే వొఱకమే" అన్నాడు. భూపయ్య మరో పడవవాణ్ణి పట్టుకు పాకులాడాడు. వాడూ మొండి చెయ్యి చూపించాడు. తిన్నగా ప్రభుత్వోద్యోగి దగ్గరికి వెళ్ళి మనవి చేసుకున్నాడు. అతగాడు కూడా ఆఖరుకు లేనట్టే. తనవల్ల కానట్టే చెయ్యి వెతకలేసాడు. "అసురసంజ పడిపోతూ వుంది. ముసురు కూడా పట్టేట్టుంది. పొద్దున్న తెల్లారాక యోచిద్దాంలే" అన్నాడు ఆ పెద్ద జీతగాడు.

భూపయ్యకు పట్టరాని కోపం వచ్చింది. కొట్టబోయినంతగా చెయ్యెత్తి మళ్ళీ ఆ చెయ్యి అటుపొయ్యేదాన్ని ఇటు తీసుక తన ఫాలాన్ని మొత్తుకొని "అయ్యో! కళ్యాణీ! కళ్యాణీ!" అన్నాడు. "గట్టేక్కే ముందేమైంది ఈ ప్రలాపం?" అని గద్దించాడు ఆ ప్రభుత్వోద్యోగి. "ఇప్పుడన్నా స్వామీ! తరుణం మించలేదు" అన్నాడు భూపయ్య కన్నీళ్ళు కార్చుకుంటూ. ప్రభుత్వోద్యోగికి జాలేసింది. "కంఠం వినబడి కళేబరం కనపడకపోతే మరింత బాధే?" అన్నాడు ఆ ఉద్యోగి. "కళేబరం కనపడి కంఠం వినపడకపోయినా బాధే" అన్నాడు ప్రభుత్వపు నావికుడు. ఏమైనా వెళ్ళి చూచి కనుగొన్నాకకదా అనుకోవలసింది" అన్నాడు చేరువనున్న నిర్వాసి ఒకడు. భూపయ్య నిట్టూర్పు వొకటి విడిచాడు. ఆ నిట్టూర్పుకు పడవలన్నీ కదిలినట్టయ్యాయి. వరద చిరుకెరటాలూ చిందులు తొక్కినట్లయింది. ప్రభుత్వపు పడవలోనికి నిర్వాసి దూకుతూ "నేను తోడుంటాను, చూపించు?" అన్నాడు భూపయ్యతో. ప్రభుత్వపు పడవ ఆసామీ తెడ్డు వేశాడు. ప్రభుత్వోద్యోగి "ఇటో అటో తేల్చుకురావాలి అర్ధరాత్రైనాసరే" అని ఆజ్ఞ ఇచ్చాడు. తాను రేవులో వేచియున్నాడు.

"ఏ గంగా భాగీరథీ సమానురాలు నీతో చెప్పింది?" అని అడిగేడు పడవలో నిర్వాసి. "ఒకరు చెప్పేదేమిటి? అదిగో అఱపు. అదిగో నా కళ్యాణి మొఱ" అన్నాడు భూపయ్య. నిర్వాసి ఆకాశం వంక చూచాడు. ఆకాశం ఉఱుములతో మెఱుములతో అలజడిగొన్నట్టుంది. మెరుపు మెఱుపుకీ ఉలిక్కిపడేడు భూపయ్య. అదే మా యిల్లు? ఇదే నావెల్లి?" అని ఏదో ఉన్మాదునిలా అన్నాడు. పడవవాడు "ఈ గేస్తుగానికేం తెల్దు, మనం పోదాం?" అన్నాడునిర్వాసితో. నిర్వాసి "పోతే ఏలా? ఆమె కళేబరాన్నో కంఠధ్వనినో ప్రభుత్వోద్యోగికి చూపించాలి; " అన్నాడు. పడవవాడు "కళేబరాన్ని చూపించగలం గాని కంఠధ్వని నెలాచూపిస్తాం?" అన్నాడు తెడ్డేత కుదించి.


ఏదో తెడ్డుకు తగిలింది. అది కళ్యాణి తలకట్టా? ఏదో నావయొక్క చుక్కాని కడ్డబడింది. అది కళ్యాణి ఎముకా?ఎలుకా? ఇలా సందేహించుకుంటూ సందేహం

తీరకుండా ఆ పడిపోయిన యింటి జాడచుట్టూ నావతో ప్రదక్షిణం చేసి నావతోనే ఇంటి కప్పుమీదను అడ్డుగీతలు నిలువుగీతలు గీసి, గీట్లు దాటే ప్రవాహాన్ని తరిమి తుదకు దేన్ని సాధించలేక ముగ్గురూ కూడా నావలో చతికిలబడిపోయారు.

"మఱి భూపయ్యా! కళేబరం కనిపించకపోతే పోయిరి? నీవన్న కంఠధ్వనియైనా వినిపించ వద్దూ?" అన్నాడు నిర్వాసి. భూపయ్య "కళేబరం కనబడగలిగితే కంఠధ్వని కూపిరి నేనే పోయగలను" అని నిర్వాసి కొక పెడజవాబు చెబుతూ, రెండోపెడకు తన అరచేతులు బూరాగా ఊదాడు. "కళ్యాణీ; కళ్యాణీ, నీవెక్కడైనా వుంటే పలుకు; కూయిడ్డావుటగా? ఆమె చెప్పింది. ఏ 'డెబ్రిస్' క్రిందైనా వుంటే పలుకు; నిన్ను పైకి లేవనెత్తడానికి పడవేసుకువచ్చాను – ఇంకెక్కడి కళ్యాణి! కళ్యాణి! కళ్యాణి!" అంటూ పడవలోనే మూర్ఛిల్లాడు భూపయ్య. నిర్వాసి "భూపయ్యా! మనం ఆ గంగా భాగీరథీ సమానురాల్ని కూడా యీ పడవలో కెక్కించుకుని 'కుంయి' విన్న స్థలం తెలుసుకుని ఉండవలసింది. "ఇదేనా కళ్యాణి పడిన జాగా?" అని అడిగాడు. అప్పటికప్పుడే భూపయ్యకు స్పృహ తప్పింది. పడవవాడు "ఈ భూపయ్యే పోయినాడు తన కంటె ముందుగానని ఆ కళ్యాణమ్మ గారే అలా అవతారమెత్తి ముండమోపు మోసియుండ వచ్చు. ఈ వరదతో ఎవరు ముందర పోయేరో ఎవరు వెనుక పోయేరో ఎవరు ఎవరికి చెప్పిపోయారు? అన్నాడు" అంటూ పడవను వెనుద్రిప్పాడు.

పడవ వెనుదిరగడంలో పడవ పొడగునా అడుగున ఏదో ధ్వనించినట్టయింది. ఆభరణాల్లా అగపించినట్టయింది. ఎర్రగా కుంకుం పట్టే అలుక్కుపోయి. "ఒయ్యోయి? పడవక్రింద తగిలినట్టుగా వుంది కళ్యాణమ్మ కళేబరం?" అన్నాడు నిర్వాసి ఆ పడవ ఆసామీతో. భూపయ్య ఆ మాటతో స్పృహదేరి "దొరికిందా? కళేబరం? నా కళ్యాణి కళేబరం?" అన్నాడు.

"కళేబరం దొరికిందంటేనే ఇంత సంతోషించేడు భూపయ్య. కంఠధ్వని వింటే ఎంతో సంతోషించేవాడో" అన్నాడు నిర్వాసి. "కంఠధ్వని! కంఠధ్వని! దాన్ని ఎన్నిసార్లయినా వినగలను. కళేబరాన్ని చూచేది ఇదే కడసారి! కడసారి! కడసారి అని విస్తుపోతూ. తనభార్య యొక్క కళేబరాన్ని పడవవాడూ నిర్వాసీ పైకెత్తి పట్టి పడవలో పెడుతూ వుంటే, భూపయ్య వలవల ఏడ్చాడు.



# మొక్కపాటి నరసింహశాస్త్రి

**(1892 - 1973)**

**క**థకుడు, నవలాకారుడు, నాటక కర్త, వ్యాస రచయిత, హాస్య రచనలో అందెవేసిన చేయి, పువ్వుకు తావి సహజంగా అబ్బినట్లు, వీరి రచనలో హాస్యం సహజంగా దొర్లుతుంది. సంఘటనా ప్రధానమైన ఉత్తమ హాస్యాన్ని సృష్టించుట వీరి ప్రత్యేకత. అమాయికత్వమూ, అవివేకమూ కలబోసుకొని తెలుగు సాహితీ ప్రియుల్ని నవ్వుల సోనల్లో ముంచెత్తే బారిష్టర్ పార్వతీశం మొక్కపాటి వారి అపూర్వ సృష్టి. పిఠాపురంలో నివసించే వారు.

**రచనలు :** బారిష్టరు పార్వతీశం, ఏకోదరులు (నవలలు), ప్రతిబింబాలు, విన్నవి - కన్నవి (కథలు) మ్రొక్కుబడి (నాటికలు)

# మా బావమరిది పెళ్ళి

**నా**కు పెళ్ళి అంటే మహా చెడ్డ సరదా. సరదాలోనూ కాస్తా కూస్తా కాదు. అందులో మొగపెళ్ళివారితో తరలివెళ్ళడం అంటే ఇక వేరే చెప్పనక్కర్లేదు. విశేషించి ఇంటి అల్లుణ్ణి, అందులో పెద్ద అల్లుణ్ణి అయితే ఇంక అడిగారూ? ఏ అల్లుడైనా ఆడపెళ్ళి అంటే కొంచెం చిక్కే మొత్తము మీద. ఇంటిల్లిపాదీ, ఆడవాళ్ళూ మొగవాళ్ళూ కూడా అటూ ఇటూ ఏదో పనులున్నట్టుగా పరుగెత్తుతూ కేకలు వేస్తూ వుంటే అల్లుడికి మట్టుకు కూర్చోబుద్ధి పుడుతుందా? నా బోటివాడు చూసీచూడనట్టుగా పరధ్యానంగా కుర్చీలో ఏమీ కలుగజేసుకోకుండా పడుకున్నా. మామగారు ఏ పనికోసరమో కుర్చీలో వున్న మనిషిని కేకవేసి అర్ధనిమీలిత నేత్రుడై ఇంత హడావుడిలోనూ, నిర్వికల్ప సమాధిలోనున్న మహామహుడు అల్లుడని తెలిసికొని మాట్లాడకుండా చక్కాపోయినా, వాళ్ళ పుట్టి అంతా మునిగిపోయినట్లు పై వాళ్ళు మటుకు ఊరుకోరు. ఎందుకో అందుకు అస్తమానమూ "సత్యం, ఇలారా" అని ఒకరూ, "బావా, ఒక మాటు వంటపందిట్లో" అని ఒకడూ, "అన్నగారూ, పందిట్లో ములాయిబుడ్డీ సంగతి చూడండి" అని ఒకరూ, "ఏమోయ్ మామా" ఇలా కూర్చుంటే ఏలాగు. 'భోగము మేళము ఇంకా రాలేదు' అని ఒకరూ – ఇలాగు ప్రాణాలు తీసివేస్తారు. వాళ్ళంతా వీధిలోనుంచి దొడ్లోకి, దొడ్లోనుంచి వీధిలోకి పరుగెత్తడమే కాని చేసే పనేమీ కనబడదు. ఒకటి రెండుసార్లు చూసి వీళ్ళతోటి బాధ పడలేక వాళ్ళకంటె ఎక్కువ తొందరగా ఎక్కడికో అక్కడికి పిలుపు అందకుండా పరుగెత్తుతుండేవాణ్ణి. ప్రస్తుతం ఆ బాధ ఏమీ లేదు – మొగపెళ్ళి గనుక.

తెల్లవారితే స్నాతకము. బంధువులంతా వచ్చారు. అనగా ముఖ్యు లొకరిద్దరు తప్ప. కావలసిన సామానులన్నీ, బాణా సంచాసహా వచ్చినాయి. మర్నాడు ప్రయాణానికి సామాను సర్దుకోవడంతో పడుకునేటప్పటికి రాత్రి రెండు గంటలయింది. ఈ ప్రయాణమెలాగో,

అక్కడికి ఎలా చేరుతామో అనుకుంటూ కన్ను మూసేసరికి పాతికమంది చంటిపిల్లలు రాగాలు పెట్టడం మొదలు పెట్టారు. నిజానికి ఇంట్లో ఇంత మంది చంటిపిల్ల లున్నారని నే నెరుగను. తెలిస్తే అక్కడ పడుకోక పోయ్యేవాడిన్ని పడుకోవడమేమిటి, అసలు పెళ్ళికే వెళ్ళక పొయ్యేవాణ్ణి, ఆపూట వచ్చిన జనాభాను లెక్క చూడడముతో ఏడెనమండుగురు కంటె పిల్లల తల్లులున్నట్టు తోచలేదు. దాన్ని బట్టి ఏడెనమండుగురు కంటె చంటిపిల్ల లుండరు కదా – పోనీ ఇందులో కొంతమందికి కవల పిల్లలున్నా మొత్తము మీద డజను కంటె ఎక్కువ ఉండరు కదా అనుకున్నాను. వాస్తవానికి అంతకంటె ఎక్కువమంది లేకపోయి ఉండవచ్చును. కాని ఇంతమంది ఏకగ్రీవంగా ఒక్కసారే తమ అభిప్రాయాన్ని తెలియపరచేసరికి కొంచెము బాధగానే వున్నది. రాత్రి తెల్లవార్లు నిద్ర లేక తెల్లవారురఝామున మూడు గంటలకు కన్ను మూసినప్పుడు కోకిల కూసినా దాన్ని మందలించబుద్ధి వేస్తుంది. ఇలాంటి సందర్భంలో చంటి పిల్లల కంఠాలు అందులో అన్ని కంఠాలూ,కేవలమూ కోకిల స్వరాలని చెప్పడానికి వీలుండదు గదా! ఏలాగైతేనేమి? వాళ్ళనందరినీ సముదాయించి వాళ్ళ తల్లులు పడుకోబెట్టేసరికి నాలుగు గంటలు కావచ్చినది.

మళ్ళీ ఏలాగో కన్ను మూశాను. పొరుగూరి నుంచి కుదిర్చిన బాకావాడు నాపాలిటి యముడులాగా అప్పుడే వచ్చాడు. పోనీవచ్చినవాడు – వాడూ ఒక రాత్రివేళను బయలుదేరి ఉండవలెను గదా – నిద్ర లేకుండా నడిచి వచ్చినాడా – కాస్సేపు పడుకో కూడదూ! ఇంకా ముందు అయిదురోజులు వుండనే వున్నదాయెను! అమ్మా. వాడెందుకు పడుకుంటాడు? నాలుగు వందల పరకాళాతాన్లు ఒక్కమాటు చించినట్లు బర్రున బాకాపట్టాడు. తేలు కుట్టినట్టుగా లేచాను. దురుద్దేశము కలిగింది చెప్పవద్దూ. వాన్ని నిలువునా చీల్చివేదామను కున్నాను. కాని తీరా ఇంత పెళ్ళి ఆగిపోతుంది; ఇంతమందికీ ఉత్సాహ భంగం అవుతుంది – అనుకొని శాంతించాను. బడాయి కాదుగాని, ఆ సమయంలో నేను గనకనే ఆగాను. మరొకడయితే తెల్లవారేసరికి రాజమండ్రి జయిల్లో వుండేవాడే. సరే, వాడూ మానేటప్పటికి భజంత్రీలు వచ్చారు. ఇంతట్లోకి తెల్లవారింది. తేనెపట్టులో ఈగలు లాగ ఇంట్లో అందరూ కిలకిల్లాడుతూ లేచారు. కావడము ఆరోజు అన్ని రోజుల్లాంటిదే అయినా నా మట్టుకు సూర్యుడేదో కొత్త తేజస్సుతో ఉదయిస్తున్నట్టూ, ప్రభాత వాయువులలో కొత్త సౌరభము వున్నట్టూ, స్త్రీల ముఖాల్లో వింతసౌరు వున్నట్టూ తోచింది.

దంతధావన మయ్యేసరికి చంటిపిల్లల మీదా, బాకావాడి మీదా, భజంత్రీల మీదా వచ్చిన కోపము కొంచెం చల్లారింది. ప్రొద్దున కాఫీ ఇచ్చేవాళ్ళు ఎవళ్ళూ లేక, ఆకలి

పట్టలేక, స్నాతకానికి తెచ్చిన అరటిపళ్ళు నాలుగు కుర్రవాళ్ళు ఎవళ్ళూ చూడకుండా నోట్లో చడీచప్పుడూ కాకుండగా వేసుకున్నాను. ఇంతట్లోకే మా మామగారు వచ్చి "ఏమి నాయనా, ఇవ్వాళ కాఫీ కూడా లేదు కాబోలు – భోజనాలు ఆలస్యమవుతవి, కాసిని పాలు పుచ్చుకుంటావా ఏమిటి" అన్నారు. "అఁ ఎందుకు లెండి, ఎంత పొద్దుపోతవేమిటి భోజనాలు, అయితే మట్టుకు మునిగిపోయిందేమిటి" అన్నాను. అరటిపండ్ల సంగతి ఆయన కేమి తెలుసును? "అలాకాదు, కాసినిపాలు పుచ్చుకుంటేనే కాని వల్ల కా"దని, చంటిపిల్లల కోసరము తెప్పించిన పొయ్యి మీద పెట్టిన ఆవుపాలు కాసినీ ఎవరితోటీ చెప్పకుండా ఆపుకోరాలో వంచుకొని కాస్త పంచదారవేసి మామగారు స్వయంగా నా ముందు పెట్టారు. పుచ్చుకోకపోతే ఆయన కేమి కోపంవస్తుందో ననుకొని రెండు గుక్కలలో ఆపుకోరాడు పాలూ తాగివేశాను.

ఇంతట్లోకే యింట్లో ఆడవాళ్ళలో కంగారు బయలుదేరింది. ఏమిటని విచారింపగా, పొయ్యిమీద కాగుతూన్న ఆవుపాలు ఏ పిల్లో తాగివేసినది; ఇక చంటిపిల్లల గతి ఎలాగని కంగారు పడుతున్నారు. మామగారు వెళ్ళి, "అవి ఆవుపాలా? గేదెపాలు అనుకున్నాను. వెధవపనులూ, వెధవ తెలివితేటలూనూ, ఎవ్వరితోనూ చెప్పనక్కరలేదా? చెప్పకపోతే ఎలా తెలుస్తుంది నాకు? చంటి పిల్లలు అలా గోలపెడుతున్నారు. మళ్ళీ పాలు ఎప్పటికి రాను, ఎప్పటికి కాగను; ఎన్నియేళ్ళు వచ్చిన తెలివితేటలు ఒక్క మాదిరిగానే తగలబడుతున్నాయి" అని యింటిల్లిపాది మీద ఇంటి కప్పెగిరి పోయేటట్లు కేకలు వేశారు. మా ఆవిడ ఏదో మాట్లాడబోతుంటే "నీ వేమీ మాట్లాడవద్దు" అని సంజ్ఞ చేసి నేను నిమ్మళంగా అవతలికి దాటాను అదీ తెలివి అయినది గనుక గ్రహించుకొని "సరే నాన్నా, యిప్పుడు కేకలు ఎందుకు? అయిందేదో అయిపోయింది. ఆలస్యమయితే పాలు ఇంక ఎక్కడ దొరకవు కూడాను. ముందు ఎక్కడయినా పాలకు పంపించు" అని తండ్రిచేతికి తపేలా అందించింది. ఆయన పాపం కోపం అంతా మరిచిపోయి మళ్ళీ పాల ప్రయత్నము మీద వెళ్ళిపోయినాడు.

నేనీ హడావిడి అణిగే దాకా కొంచెము అటూ ఇటూ తిరిగి కుర్చీలో కూర్చుని కాస్సేపు నిద్రపోదామని కన్నుమూశాను. మా పెద్ద బావమరిదీ ఒక్క పరుగున వచ్చి నన్ను లేపి, "బావా వచ్చారోయ్" అన్నాడు. కళ్ళు మూసుకునే, "ఆహాఁ వచ్చారా; సంతోషము, జాగ్రత్తగా వచ్చారా? సామానులు లోపల పెట్టించి పిల్లలకు పాలూ గీలూ కావలెనేమో చూడు. కొంచెం తలనొప్పిగా ఉండి పడుకున్నాను" అన్నాను. "పిల్లలేమిటి? పాలేమిటి?" అన్నాడు. "ఆ ప్రశ్న ఏమిటి నీ మొహము పిల్లలకు ఆవుపాలు కావలెనేమో కనుక్కో" అన్నాను. "ఎవరి పిల్లలకు " అన్నాడు. "ఇప్పుడు ఎవరు వచ్చారు సూరమ్మా పిల్లలూ కాదా" అన్నాను. వాడు పకాలున నవ్వి "కాదోయ్, బోగము మేళము" అన్నాడు.

"ఏడిసినట్టే వుంది తెలివితేటలు; వాళ్ళకోసము నేను బెంగ పెట్టుకొన్నాననే నిద్ర పోతున్నవాణ్ణి లేపావా? సరే ఇంక నేమి, నీకు చేతి నిండా కావలసినంత పని. వెళ్ళి పాపము వాళ్ళ సప్లయి సంగతి చూడు" అన్నాను. ఇంక నిద్ర వీళ్ళు ఎలాగూ పోనివ్వరు అని ఆ వొచ్చిన మొహాలు ఎలాంటివో చూతామని నేనూ వీధిలోనికి వచ్చాను. ఎంత యేంటీ నాచ్ అయినా కళ్ళముందు నుంచి వాళ్ళు వెడుతూ వుంటే తల వంచుకునేనా వాళ్ళకేసి చూడ బుద్ధి అవుతుంది. తలవంచుకుని క్రీగంట చూస్తే వాళ్ళకు సైగ చేస్తున్నా ననుకుంటారేమోనని నేను ఎప్పుడూ బాహాటంగా తల ఎత్తే చూస్తాను. అది కాకుండా బ్యూటీ ఎక్కడున్నా సౌందర్య పిపాస కలవారు చూచి ఆనందించక మానరు కదా? ఊళ్ళో సగము మంది జనము బండ్ల చుట్టూ నిలబడి బండ్ల వాళ్ళను సామాను సాగ్రత్తగా దింపమనీ భోగం వాళ్ళను జాగ్రత్తగా దిగమనీ హెచ్చరించడమూ మొదలు పెట్టారు. పాపము వాళ్ళు ఎక్కడికి వెళ్ళినా, ఏలోటూ లేకుండా అలా యోగక్షేమము కనుక్కొని ఊరిలో అశేష జనమూ సప్లయిలు చేస్తుంటారు. కనుకనే వాళ్ళు నెగ్గుకుని వస్తుంటారు. ఆ రాత్రి ఊరిలోనుంచి పెళ్ళివారు బయలుదేరి వెళ్ళేవరకూ గ్రామస్థులయిన యువకులకు ఈ సప్లయి తోటి భోజనానికేనా ఎక్కడా తీరిక లేకపోయింది. బండిలో నుంచి దిగిన రెండు మొహాలు చూశాను. మూడోమనిషి దిగుతూంటే ఇక నక్కడ నిలబడలేకపోయాను. అనిత్యసువాసినుల సౌందర్యము చూస్తుంటే వళ్ళు గరిపొడిచింది. ఏదో పది వూళ్ళు తిరిగేవాణ్ణి. అనేక రకాల ముఖాలు చూసేవాణ్ణి నాకే హడలు పుడుతే ఇంక ఆడవాళ్ళూ, పిల్లలూ చూస్తే వాళ్ళేమవుతారా అనిపించింది. ఏది ఎలా వున్నా మనవాళ్ళు మేజువాణి పెట్టించక మానరు. వాళ్ళు ఆడుతున్నప్పుడు ఆడవాళ్ళు పిల్లలను ఒడిలో పెట్టుకొని చూడకమానరు. పిల్లలు వీళ్ళని చూసి జడుచుకోక మానరు. అందుకని పిల్లల మట్టుకయినా ఇంద్రాక్షి విభూతి చెప్పడానికి ఒక బ్రాహ్మణ్ణి తీసుకువస్తే గాని వల్ల కాదని మామగారితోటి దెబ్బలాడాను. ఆయనెంతసేపూ వేళాకోళమనుకున్నాడు గాని నా నోట్లో (Anxiety) అంటే నా కంఠములో ఆదుర్దా కనిపెట్టలేకపోయాడు.

ఇంతట్లోకే ఎదట వర్జమొస్తూన్నది; స్నాతకానికి పీటలమీద కూర్చోవాలి; లేవండి అంటే లేవండి అన్నారు. ఊళ్ళో నలుగురినీ కేకవేసుకొని రమ్మని మామగారు నాకూ, ఆయన పెద్ద కుమారుడికీ పురమాయించారు. మేమిద్దరమూ – మా వెనకాల పది పదిహేనుగురు ఆడవాళ్ళూ బయలుదేరి నిముషములో అందరినీ పిలుచుకొని చక్కా వచ్చాము. మేము వచ్చేటప్పటికి అప్పటికే ఒక పక్కని మేజువాణి జరుగుతూ వున్నది. మేము ఏలాగూ పిలుస్తామనే ధైర్యము తోటి ఊళ్ళో కుర్రకారు అంతా భోగము వాళ్ళ దగ్గర సభ తీర్చారు. ఎదురుగుండా స్నాతకము జరుగుతున్నది. పురోహితుడికి కొంచెము

వయస్సు మళ్ళినా, దృష్టి అంతా మేజువాణీ మీదనే వున్నది. ఏ మేజువాణీ చూస్తున్నా డబ్బుల దగ్గిర మటుకు ఎపుడూ ఏమీ మరిచిపోలేదు.

సరే, పెండ్లి కొడుకునకు కఱ్ఱా, చెప్పులూ, చెంబూ, గొడుగూ, మొదలయిన పరికరాలు అన్నీ యిచ్చి ఒకమారు కాశీవెళ్ళి రెండు నిమిషాలలో మళ్ళీ వర్షము తగలకుండా తిరిగి రమ్మన్నారు. రెండడుగులువెళ్ళగానే బావమరిది వరసవాళ్ళంతా "సరే వెళ్ళనివ్వండి ఎక్కడికి వెడతాడో, పిలవకండి; ఏమి చేస్తాడో చూతాము" అని మామూలు 'విట్లు' వేశారు. ఏమో ఒకవేళ నిజంగా చక్కా పోతాడేమో కొంపతీసి అని మేనమామ జేమారూ, బెల్లము ముక్కా తీసుకువెళ్ళి "రా, నాయనా, వెళ్ళకు మా పిల్లనిచ్చి పెళ్ళిచేస్తాము" అని బ్రతిమాలి తీసుకువచ్చాడు. పెళ్ళికొడుకు అల్ప సంతోషి. లేకపోతే మేనమామ ఇచ్చిన రెండు రూపాయల జేమారుకు చప్పున కక్కుర్తిపడి వెనకకు రాకపొయ్యేవాడే; పయిగా మాట వరుసకు అన్నాడే కాని ఇప్పుడు మావాడికి ఇవ్వబోయే పిల్ల మేనమామ కూతురు కాదు. మరొకళ్ళయితే ఆ మాట మీద నిలబెట్టి నీ కూతురినిచ్చి పెండ్లి చేస్తావా చెయ్యవా అని నిఖాచేసి ఉండే వాళ్ళే. ఇక నేమైతే నేమి. పెళ్ళికొడుకు అంత కాశీ ప్రయాణమూ మానుకొని పిల్ల నిస్తాననే సరికి మాట్లాడకుండా వెనుకకు చక్కా వచ్చాడు. వెర్రివాడు అనండి, అమాయకు డనండి – పెద్ద మనిషి అనండి – అంతా ఒకటే.

స్నాతకము పూర్తి అయినది. ఆడబడుచులు మంగళహారతులు తీసుకొని చక్కా వచ్చారు. "సరే కానివ్వండి అమ్మా, త్వరగా, మంగళహారతి ఇచ్చి వేసెయ్యండి. మనకింకా బోలెడంత పని ఉన్నది" అన్నారు మా మామగారు. "సరే మా అభ్యంతరం ఏమీ లేదు; పళ్ళెములో పడేదేమిటో వేస్తే గాని మంగళహారతి యివ్వడమేలాగు" అన్నారు. "ఏలాగేమిటి, మంగళహారతి రూపాయలతోటి ఇవ్వరు కదా – చేత్తోటి కాని – ఇస్తాలేండి – ఏదో ఒకటి తరువాత, కానివ్వండి" అన్నారు.

"తరువాత నెందుకులెండి. ముందు రూపాయలు అందులో పడితేనే కాని మా చేతులు ముందుకు రావు" అన్నారు. రోజులు అలాంటివి; డబ్బు దగ్గిరికి వచ్చేసరికి తండ్రి మాటయినా నమ్మరు. అంతా కోమటి బేరంలోకి దిగింది. డబ్బిస్తేనే కాని ఆడపడుచులు మంగళహారతి ఇవ్వరు; డబ్బిస్తేనే కాని బ్రాహ్మణులు ఆశీర్వదించరు. డబ్బిస్తేనే కాని పురోహితుడు పెళ్ళి చేయించడు; కట్న మిస్తేనే కాని పెళ్ళికొడుకు దొరకడు; వస్తువులు పెడితేనే కాని పెళ్ళికూతురు వప్పుకోదు. ఏలాగయితేనేమి పదినిమిషాలు ఘర్షణపడి రూపాయలు పళ్ళెములో ఘల్లుమనగానే నాలుగు పాటలు పాడి మంగళహారతు లిచ్చారు. గమ్మత్తేమిటో గాని మామూలుగా మనవాళ్ళ కంఠాలెంత అసహ్యముగా వున్నా, ఇటువంటి సమయాలలో వాళ్ళు నలుగురూ కలిసి పాడుతూ వుంటే నా కది ఒక విధమయిన

ఆనందముగానే వుంటుంది. అవతల భోగము వాళ్ళు మట్టుకు వీళ్ళ కంఠాలూ, పాటలూ విని నవ్వుకుంటూనే వున్నారు.

సభ వారికీ ఇష్టము లేకపోయినా మేజువాణి అప్పటికి కట్టిపెట్టించి, తాంబూలాలు ఇచ్చి అందరినీ పంపివేసి భోజన ప్రయత్నాలు చేశాము. ఏవో రెండు మెతుకులు నోట్లో వేసుకుని ఇవతల పడేసరికి సుమారు మూడు గంటలయినది. ఇక నక్కడుంటే వాళ్ళ పనికి అడ్డుగా వుంటుందని నేను ఇంకొక స్నేహితుల ఇంటికి వెళ్ళి పడుకున్నాను.

దీపాలు పెట్టేసరికి లేచి కొంచెము దూరము షికారు వెళ్ళి నెమ్మదిగా ఇంటివైపు మళ్ళాను. ఆకాశము నిర్మలంగా వున్నది. వెన్నెల చక్కగా ఉన్నది. గాలి కొంచెము చల్లగా వీస్తున్నది. ప్రయాణమునకు చాలా అనుకూలముగా వున్నదని సంతోషించాను. మా వీధిలోకి వచ్చేసరికి బళ్ళలో సామానులు సర్దుతున్నారు. ఒక్కమాటు అన్ని బళ్ళకేసి చూచి బళ్ళవాళ్ళని త్వరగా సర్దమని ఒక కేకవేసి సాయంకాలం నుంచీ ఈ పనిమీదనే ఉన్నట్లు హడావిడిగా ఇంట్లోకి వెళ్ళాను. అలా డాబుచేస్తూ ఏదో నిరవాకము చేస్తున్నట్టు నటిస్తే కాని మాటదక్కదు. బంట్రోతు మొదలు గవర్నరు వరకూ రాజ్యభారం అంతా తమరే మోస్తున్నట్టూ, చక్రవర్తి శ్రేయస్సు కోరే వారు తమరు తప్ప మరొకరు లేనట్టూ నటిస్తారు. ఖద్దరు బట్టలమ్మే గుమాస్తా మొదలు దేశ బాంధవులు వరకూ ఉన్న అన్ని రకాల వారూ తమంత దేశభక్తులూ త్యాగులూ మరొకరు లేనట్టు నటిస్తారు. ఒళ్ళంతా విభూతి పూసుకొని వీధులలో తిరిగే బైరాగి మొదలు మహర్షి బిరుదాంకితుల వరకూ ప్రతివాళ్ళూ తమంత భక్తులూ, విరాగులూ, పరమేశ్వరుని కాప్తులూ, మరొకరు లేనట్టు నటిస్తారు. ఏమి చెయ్యము?

లోపల ఆడవాళ్ళు ఇంకా పెట్టెలు సవరిస్తున్నారు. మా ఆవిడా పెట్టె దగ్గర కూచుని పెట్టెలో బట్టలు ఇవతల పారేసి, బయట నున్నవి పెట్టెలో పడవేసి, అన్నీ కలిపి ఒక మాటు ఇవతలకు తీసి, మళ్ళీ అన్నీ కలిపి పెట్టెలో పెట్టింది. ఇంతా చేస్తే పెట్టెలో ఏ బట్టలు పడ్డవో, ఏ బట్టలు పడలేదో జ్ఞాపకము లేక పోయింది. అందుకని తన వెకాల కూచుని ప్రపంచమంతా మరచి బొమ్మకి తలంటి నీళ్ళు పోసుకుంటున్న కూతురిని అల్లరి చేస్తున్నదనే మిషతోటి ఒకటి తగల్నిచ్చి మళ్ళీ పెట్టెలో బట్టలు ఒకటొకటే వెయ్యడము మొదలు పెట్టింది.

నేను తిన్నగా మా ఆవిడ దగ్గరకు వెళ్ళి ఇంటిల్లపాదీ హడలిపోయేటట్లు "ఇంకా ఎంతసేపు ఈ సర్దడము. తెమలడమంటూ వుండదు ఏ వేళకూను. పెందరాళే రెండు మెతుకులు నోట్లో వేసుకొని బయలు దేరుతేనే కాని రేపు చాలా ఇబ్బంది పడవలసి వుంటుందనే జ్ఞానము ఒక్కళ్ళకూ లేదు. ఎప్పుడూ నీ పనులింతేను. ఆడవాళ్ళ తోటి ప్రయాణము పెట్టుకోవడము బుద్ధితక్కువ. ఈ మాత్రము సర్దుకోలేని వాళ్ళు నోరు

మూసుకొని ఇంటి దగ్గర కూర్చోక "తగుదునమ్మా" అని ఎక్కడికి పడితే అక్కడికి తయారు. కానియ్యవేమి యింకాను? హాత్ హూత్" అని పెద్ద పెద్ద కేకలు వేశాను. ఇదంతా చూసి ప్రక్కనున్న మా పిల్ల వాళ్ళ తల్లిని కొడతానేమోనని భయపడి తల్లిని కౌగలించుకొని రాగాలు పెట్టడం మొదలు పెట్టింది. నా అసలు ఉద్దేశం మా ఆవిడను కోపపడదామని కాదు. దాన్ని కోపపడటమంటే నా మనస్సు వొప్పుకోదు. మా ఆవిడ చాలా బుద్ధిమంతురాలూ, చాలా నెమ్మదైనదీ, తెలివి తేటలైనదీ అని నా నమ్మకము. ఇప్పుడూరికే తక్కిన ఆడవాళ్ళందరికీ బుద్ధి చెబుదామని మా ఆవిడమీద వంక బెట్టి కేకలు వేశాను. అది ఆ రహస్యము కనిపెట్టినట్లు కనిపించదు. ఆనక బండిలో ఒంటిగా వున్నప్పుడు చెప్పి సముదాయిద్దా మనుకొన్నాను. అదీగాక వాళ్ళ పుట్టినింటే, వాళ్ళ వాళ్ళయెదటే ఒక్కసారి ఇలా డబాయిస్తే నా భార్యమీద నాకుండే సంపూర్ణ స్వాతంత్ర్యము తెలుపవచ్చుననీ. నా భార్య చాలా బుద్ధిమంతురాలు, ఆయన ఇన్ని కేకలు వేసినా మారుమాటాడలేదని తక్కిన ఆడవాళ్ళంతా సంతోషిస్తారనే నా అభిప్రాయమే కాని, మా ఆవిడ ఎదురు తిరిగితేమట్టున కొంప మునిగిపోయేది. ఏదో నా అదృష్టము బాగుంది. అలాంటి ప్రమాదమేమీ జరుగలేదు.

నా కేకలూ వృథాగా పోలేదు. ఆడవాళ్ళందరూ గబగబా సామాను సర్దుకొని పెట్టెలు ఇవతల పడవేశారు. బళ్ళవాళ్ళు తీసుకువెళ్ళి బళ్ళల్లో పారవేశారు. తీరా చూసేసరికి సగము బళ్ళు సామానుతోనే నిండిపోయినాయి. ఇంత సామాను ఎందుకర్రా అంటే వినరు. ఏవో నాలుగు బట్టలు తీసుకుంటే చులాగ్గా వెళ్ళిరావచ్చునా – అలా ఒప్పుకోరుగా; ట్రంకుపెట్టెలు, రంగూను పెట్టెలు, మార్మైను పెట్టెలు – ఎందుకు ఇవన్నీని? మనలో ఉండేదే అది; ఊరికే అనవసరమైన బరువంతా నెత్తిన పెట్టుకోవడము. జీవితములో కూడా అంతే. లేనిపోని బాదర బందీలు. అయినవీ కానివీ, నెత్తినేసుకోవడము, అందుకనే మనకు సంసారాల్లో ఎప్పటికీ తెగూ, తెంపూ అంటూ వుండదు.

నేనేదో మహాశ్రమ పడిపోతున్నా ననుకొని మా మామగారు వచ్చి "నాయనా, లేచి మడికట్టుకొని రెండు మెతుకులు నోట్లో వేసుకుని కాశ్శేపు కూచో; రాత్రి తెల్లవార్లూ నిద్దరుండదు. నీకు జబ్బుచేస్తుంది గూడాను. ఇలా చేస్తూ వున్న కొద్దీ ఉంటూనే వుంటుంది. బళ్ళ దగ్గర ఎవరో ఒకరు ఉంటారు. రా, మడిగట్టుకోమని తొందర పెట్టారు. పెద్దవాడు ఆయన అలా బలవంతపెడుతూ వుంటే ఇంక బాగుండదని మడిగట్టుకోడానికి లోపలకి వెళ్ళాను.

నెమ్మదిగా అందరి భోజనాలూ అయినాయి. సుమారు తొమ్మిది గంటలయింది. జనమంతా బళ్ళ దగ్గర చేరారు. బళ్ళు సరిపోయేటట్లు లేదు; పల్లెటూరు, మా మామగారికి

పలుకుబడి ఎక్కువ; అందుకని ఊళ్ళో వాళ్ళు కూడా సగము మంది పెళ్ళికి బయలుదేరారు. ఉన్నమట్టుకు బళ్ళల్లో బండి కొక్కొక్క జోడా చొప్పున దంపతులంతా సర్దుకున్నారు. ఎవళ్ళని దిగమంటే వాళ్ళకే కోపము. పోనీ అని ఆ బండిలో ఇంకొకళ్ళని కూచోబెట్టినా కోపమే; ఏలాగు? ఇంకా కొన్ని బళ్ళు పిలిపించి వీలైనంత వరకు ఆడవాళ్ళనూ, పిల్లలనూ ఎక్కించి తక్కినవాళ్ళను కొంతమందిని కొంత దూరము నడవమన్నాము. బళ్ళవాళ్ళలో ఒకతనికి నేనంటే చాలా భక్తీ – గౌరవమూనూ – ఎందుకో తెలియదు. "బాబూ గాంధీమహాత్ములులా ఉంటారు, వాడెప్పుడూ ఆయన్ను చూడలేదులెండి. – తమరెక్కడ కూచున్నా దెహెవేంద్ర సభలాగుంటుందండి. తమరు నా బండిలో కూసోండి. నా బండి వేరే అట్టేపెట్టి ఎవ్వరూ ఎక్కకుండా చేస్తానండి,తమరు దయ చెయ్యాలం" డెని, ఆ బండిలో మరికాస్త గడ్డివేసి, నా పరుపు పరిచి నా సామాను సర్ది అట్టేపెట్టాడు.

మా ఆవిడను బండి ఎక్కమంటే పిల్లవాడికి పాలుపోసి వస్తానన్నది. 'పాలు పొయ్యడానికి చెంచా కనపడలేదు. పెట్టెలో పెట్టినట్టున్నాను.' అని తెప్పించి చూసింది. కనపడలేదు. నా పెట్టెలో చూచిన జ్ఞాపకము నాకు; అందుకని నా పెట్టె తెప్పించి చూసాను. అందులోనూ లేదు. ఇంతట్లోకే మా పెద్దపిల్ల వచ్చి 'నాన్నా, నా పెట్టెలో వున్న'దన్నది. కాబోలుననుకొని దాని పెట్టె కూడా తెప్పించి చూశాను. అందులోనూ లేదు. మా ఆవిడకు ఏదో జ్ఞాపకము వచ్చి ముఖము విప్పారింది. 'ఏమీ చెమిచా కనపడ్డదా' అన్నాను. 'ఆనవాలుగా ఉంటుందని పిల్లవాడి ఉయ్యాల తొట్టిలో పరుపుకింద పెట్టాను' అని ఒక్క పరుగున వెళ్ళి చెంచా తీసుకొచ్చి పాలు పొయ్యడ మారంభించింది. 'ఏడిసినట్టే వున్నాయి తెలివితేటలు' అని విసుక్కుని నేను పెట్టెలు సవరించి బండిలో పెట్టించేసరికి పిల్లవాడికి పాలు పొయ్యడమూ అయింది. యావన్మందీ బళ్ళల్లో ఎక్కి బళ్ళు సాగేసరికి పదకొండు గంటలయింది. ఎదుట ముప్పయిమయిళ్ళ ప్రయాణమున్నది. క్రింద నడుస్తూన్న మా పెద్ద బావమరిదీ మరికొందరు యువకులూనూ "చీకటిలో ఒంటరిగా వస్తున్నారు; భయము వేస్తుందేమో" నని భోగమువాళ్ళ బళ్ళలో కొంచెము ఇరుకుగావున్నా సర్దుకున్నారు.

తెల్లవారుఝామున రెండు గంటలవుతుంది. బండ్లు నెమ్మదిగా, నిశ్శబ్దముగా, కునికిపాట్లు పడుతూ వెడుతున్నాయి. బళ్ళలో జనం కూడా ఎంత ఇరుకుగా వున్నా అలాగే కూచుని కునికిపాట్లు పడుతున్నారు. మా బండిలో పిల్లలు కులాసాగా నిద్రపోతున్నారు. మా ఆవిడ నన్ను సంబోధించి 'అలా తెల్లవార్లూ ఎలా కూర్చుంటారు. కాస్సేపు అలా పడుకోండి. నేను కాస్త సర్దుకుంటాను' అని అక్కడ తనే పడుకొని నిద్రపోయింది!

తెల్లవారేసరికి ఒక గ్రామము చేరినాము. అక్కడ ఆ పూటకు ఆగి, వంట చేసుకొని భోజనాలు చేసి, మధ్యాహ్నము రెండు గంటలకు బళ్ళు కట్టించాము. మధ్యమ గోదావరి పాయ ఒకటి దాటవలసి వచ్చింది. అది సుమారు ఒక మైలు వెడల్పు వుంటుంది. ఇంకా ఫాల్గుణమాసమే అయినా అందులో నీరు లేదు. మధ్యనుమాత్రం కొద్దిగా వున్నది. బళ్ళు పోనిచ్చారు. ఇసుకలో బళ్ళు నడవడము కష్టముగా వున్నదని మగవాళ్ళను దిగి నడవమన్నారు. చచ్చినట్టు దిగి నెమ్మదిగా నడుస్తున్నాము. ఎండ పైన నెత్తి మాడుస్తున్నది. అడుగున కాళ్ళు అంటుకుపోతున్నాయి.

ఇంతలోకే నీళ్ళ దగ్గరకు చేరినాము. సరదాగా నీళ్ళలో నడవ వచ్చునని కొందరు ఆడవాళ్ళూ, పిల్లలూ కూడా దిగినారు. వీళ్ళను చూచి భోగము వాళ్ళు కూడా బళ్ళలో నుంచి కులాసాగా దిగి, నీళ్ళలో తిప్పుకుంటూ, నవ్వుకుంటూ, వేళాకోళాలాడుకుంటూ నడవడ మారంభించారు. బళ్ళవాళ్ళకు కొంచెము అల్లరి చేద్దామని బుద్ధి పుట్టింది. ఎడ్లకేసి చూశారు. ఎడ్లు గ్రహించి కళ్ళు మీటినాయి; బళ్ళవాళ్ళు 'పప్ప' అన్నారు. వాళ్ళను విడిచిపెట్టి ఒక్క పరుగున పరుగెత్తినాయి;ఈ సంగతి భోగము వాళ్ళు కనిపెట్టలేదు. నీళ్ళలోనుంచి ఇవతలకు వచ్చి రెండడుగులు వెళ్ళేసరికి కాళ్ళు చురుక్కుమన్నాయి. బళ్ళ వాళ్ళను కేకవేశారు. ఇంకెక్కడ బళ్ళు – అప్పుడే అవతల ఒడ్డుకు చేరినాయి. ఇక్కడింక వాళ్ళు వేసిన గంతులూ, కేకలూ, చేసిన అల్లరీ లెక్కలేదు. ఏమి చేస్తే ఏమి లాభము? అలాగే నడవవలసి వచ్చింది. మన మగవాళ్ళు వాళ్ళనలా నడవనిస్తారా? మనవాళ్ళకు స్త్రీల పట్ల గౌరవము లేదనేది వట్టిమాట. తక్షణం పదిమంది యువకులు తమ పాదరక్షలు తీసి వాళ్ళ దగ్గరకు విసిరారు – తొడుక్కోమని. మరికొందరు తమ కండువాలు గిరవాటేశారు – వాట్లమీద నడువమని, ఇలాంటి వాళ్ళను చూస్తూ కూడా మన వాళ్ళకు Chivalry లేదంటే వప్పుకోగలమా?

సూర్యాస్తమయము అయేసరికి పెళ్ళి కుమార్తె గారి గ్రామము చేరాము. వివాహము తెల్లవారుఝామున. సామాను విడిదిలో సర్దుకుని, రెండు మెతుకులు నోట్లో వేసుకుని రెండు కునుకులు తీద్దామని పడుకున్నాను. కన్ను మూశానో లేదో, ఒక పెద్దమనిషి తొందరగా నన్నులేపి, "అయ్యా ఎంతైందండీ" అన్నాడు. నాకు ఒళ్ళు మండింది. మండదు మరి? ఇంత మంది వుండగా టైము తెలుసుకోటానికి నన్నే లేపాలీ? గడియారము తలక్రింద పెట్టుకు పడుకుంటా ననుకున్నాడా? ఈయన్ను ఏడిపిద్దామని బుద్ధి పుట్టింది. "ఎంతేమిటండీ, ఎంత అయినా అయిన దేను" అన్నాను."అది కాదండీ సుమారు ఎంత అవుతుందండీ" అన్నాడు. "ఇప్పటికి మూడు వేలు అయిందండి, ఇంకా పెళ్ళంతా ముందే ఉన్నది" అన్నాను. ఆ బ్రాహ్మడు తెల్లబోయాడు. చీకట్లో నాకు కనబడలేదు.

అయినా కాని తెల్లబోయి వుండాలనుకున్నాను. "“అదికాదండి అయ్యా, డబ్బు సంగతి కాదండి. సుముహూర్తాని కింకా ఎంత వ్యవధి ఉన్నదో తెలుసుకుందామని ఎన్ని గంటలైనదో అడిగానండి” అన్నాడు సవినయముగా. “ఓయి నీ యిల్లు బంగారంగానూ, అదిటయ్యా, నే నిలా అనుకున్నాను; సరే టైము సంగతి నాకు ఎలా తెలుస్తుంది బాబూ, నిద్రపోతున్న వాడికి. గడియారము తలక్రింద ఉంటుందనుకున్నారా? లేక నాకేమైనా దివ్యజ్ఞాన మున్నదనుకున్నారా? ఇప్పుడే కునుకు పడుతోంటే మునిగిపోయినట్టు లేపారు?” అని అవతల వైపుకు తిరిగి పడుకున్నాను. ఆ బ్రాహ్మడు మారుమాట లేకుండా చక్కా పోయాడు.

మళ్ళీ ఎలాగో తంటాలు పడి కన్ను మూశాను. చక్కని కల వచ్చింది. కల మధ్యలో వుండగా మా చాకలి వాడు కొంచెము అమాయకుడు – వచ్చి హడావిడిగా నన్ను లేపాడు. ‘బాబూ, పెళ్ళికుమారుడు గారికి ఎదురు సందేహ మవుతోందిటండి, మామయ్యగారు తమర్ని దయచెయ్య మన్నారండి” అన్నాడు. వాడు లేపినందుకు కొండంత కోపం వచ్చింది. కాని వాడి మాటకు నవ్వు వచ్చింది. ఎదురు సన్నాహమని వాడి ఉద్దేశమై వుంటుందను కున్నాను. పెండ్లికుమారుడు గారికైనా సరే. వారి తండ్రిగారికైనా సరేను. ఎదురు సందేహమయ్యేది, పక్క సందేహమయ్యేది; నేనుమట్టుకు రాను, ఈ మాటు నువ్వు కాని, నీ వారసులు గాని, తదితరులు గాని ఎవరు వచ్చి నన్ను లేపినా బుర్ర బద్దలు కొడతాను. ఈ సంగతి అందరితోనూ చెప్పు. అవసరమైతే కరణముగారి తోటి చెప్పి సాటింపు చేయించమను. ప్రమాదము జరిగిన తరువాత ఏమనుకొని ఏమీ లాభములేదు”అన్నాను. వాడు హడలిపోయి నోరు మూసుకు చక్కాపోయాడు.

ఇంక నిద్దర బట్టలేదు. విడిదిలో అంతా  పెళ్ళికి వెళ్ళిపోయారు. వచ్చినదే పెళ్ళికి కదా! చూచివద్దాము లేకపోతే బాగుండదనుకొని, లేచి, చాకలి తెచ్చిన సేలము జరీపంచ కట్టి, షర్టూ, కోటూ తొడుక్కొని, ఉప్పాడ జరీ ఖండువా పైన వేసుకొని పెళ్ళి పందిట్లోకి చేరాను. పందిట్లో జనము కిటకిట లాడుతున్నారు. ఒక పక్కను మేజువాణీ జరుగుతోంది. ఆడవాళ్ళంతా ఒక పక్కను కూర్చున్నారు. పండితుల వేదఘోషతో పందిరి మారు మ్రోగుతోంది. నేను నెమ్మదిగా జనాన్ని తప్పించుకుని ముందు కూర్చున్నాను. పెండ్లికుమార్తెను ధాన్యపు తట్టలోపెట్టి అప్పుడే పందిట్లోకి తీసుకువచ్చారు. ఆ అమ్మాయి ఒక్కసారి తలయెత్తి సభ కేసి చూసి మళ్ళీ తలవంచుకొని నెమ్మదిగా పెళ్ళి కొడుకువైపు చూసింది. పెళ్ళికొడుకూ ఆ పిల్ల కేసి చూస్తున్నాడు. ఇద్దరి కళ్ళూ కలుసుకున్నాయి. ఒక్క క్షణము ఇద్దరూ సభ సంగతి మరచిపోయారు. వాళ్ళలేత హృదయాల్లో ఏమి ఉద్వేగము

కలిగిందో, వాళ్ళ లేత మనసులలో ఏమి భావాలు పరుగులెత్తినాయో ఎవరు తెలుసుకో గలరు? వాళ్ళకే తెలియదనుకొంటాను.

"కాళ్ళు పళ్ళెములో పెట్టునాయనా" అన్నాడు పురోహితుడు. కన్యాప్రదాత పెళ్ళి కొడుక్కి కాళ్ళు కడిగి, కొంచెము గద్గదస్వరముతో 'కన్యాం కనక సంపన్నాం... దశపూర్వేషాం... శాశ్వత బ్రహ్మలోక నివాస సిద్ధ్యర్థం' అని కొబ్బరిపండూ పిల్లనూ పిల్లవాడికిచ్చాడు. వాళ్ళ ఉద్దేశము. అనగా ఈ మంత్రకారుల ఉద్దేశము, ఏమిటో; ప్రేమ సంగతి వాళ్ళకు ఏమీ తెలియదేమో అనుకుంటూ ఏమిటేమిటో ఆలోచిస్తూ కూచున్నాను. పెళ్ళికొడుకు లేచి మంగళసూత్రము ముడివేస్తున్నాడు. బ్రాహ్మణు లాశీర్వదిస్తున్నారు. అమంగళమేమీ వినబడకుండా భజంత్రీలు వాయిస్తున్నారు. నా జీవితములో ఇటువంటి క్షణమే ఒకటి జ్ఞాపకము వచ్చింది. కళ్ళు కొంచెము చెమర్చినాయి. తల ఎత్తి ఆడవాళ్ళు కూర్చున్న వైపు చూశాను. మా ఆవిడ కూడా ఇంద్రనీలాల లాగా మెరుస్తున్న తన విశాల నేత్రాలతో నాకేసి చూస్తోంది. మా ఇద్దరి కళ్ళూ కలుసుకున్నాయి. కొంతసేపు పూర్వ స్మృతిలో ప్రపంచము మరిచి పోయాను. తక్కిన ఆడవాళ్ళ కళ్ళూ తమ భర్తల కోసము వెతుక్కుంటున్నట్లు తోచింది నాకు. ఆ అయిదు రోజులూనూ ప్రతి క్షణమూ తమ పూర్వానుభవమంతా జ్ఞప్తికి తెచ్చుకుని ఆడవాళ్ళు అపారమైన ఆనందం అనుభవిస్తారను కుంటా? వాళ్ళకు పాపం ఎప్పుడూ వర్తమానమేమీ లేదనుకుంటాను. గతము స్మృతికి తెచ్చుకోవడం, భవిష్యత్తును గురించి ఆలోచించడమూ. ఈలాగే వాళ్ళకు రోజులు వెడుతూ వుంటాయను కుంటాను. మా పెద్ద పిల్ల అయిదేళ్ళది. పెళ్ళికూతురు దగ్గర నిలబడి జరిగేదంతా బహు శ్రద్ధగా చూస్తోంది. దాని భవిష్యత్తును గురించి అది కూడా ఆలోచిస్తున్నదేమో!

తలంబ్రాలు పోసుకోవడమైనది. ఫలప్రదానము లిప్పించి మంగళహారతులిచ్చి, వధూవరు లను పీటల మీద నుంచి లేవదీసి ఒక్కసారి విడిదిలోకి తీసుకువచ్చారు. ముడి పడిపోయింది; ఇంకనది బ్రహ్మకు కూడా అభేద్యము.

కావలసిన దేమిటో అయిపోయింది. మూడు ముళ్ళూ పడ్డాయి. ఇంకను మిగిలింది ఆడపడుచు లాంఛనాలూ, వియ్యపురాలు లాంఛనాలూ, అల్లుడు లాంఛనాలూ, అల్లుడు అలగడమూ, ఆడపడుచూ అలగడమూ, వచ్చినవాళ్ళు అలగడమూ, మధ్యను ఆడపెళ్ళివారి ప్రాణాలు తియ్యడమూను. ఎలాగో అలాగు వాళ్ళ దగ్గరనుంచి వచ్చినంత రాబట్టి వాళ్ళను దివాలా ఎత్తించినంత పని చెయ్యడము. అప్పటికే ఒకళ్ళకూ తృప్తి లేకపోవడమూ.

ఇక పెళ్ళికి వచ్చిన మగవాళ్ళకు పనేముంది? ఏమీ లేదని పోవచ్చునా? పోరు. అయిదు రోజులూ ఉండడమూ, ఇంకా వీలైతే తిరిగి గృహప్రవేశానికి కూడా రావడమూను.

ఇంక అయిదు రోజులూ ఇక్కడ కూచుని, భోజనముల దగ్గరనీ తగాదా; ఫలహారముల దగ్గర తగాదా; భోగముమేళము దగ్గర తగాదా; ఎవళ్ళూ ఏమీ నోరెత్తడానికి వీలులేదు; ఇదేమని అనడానికి వీలు లేదు. ఏమన్నా అంటే కోపము వచ్చి లేచిపోవడము, ఈ మాత్రము సర్దుబాటు చేసుకోలేకపోతే పెళ్ళికి పిలవడ మెందుకని నిష్ఠూరము లాడడము. ఇటువంటి మహామహుల జీవితములు వ్రాయవలెనంటె. వారు ఏయే వివాహాలలో ఎలా దెబ్బలాడినది తప్ప ఇంక వ్రాయవలసిన హంశము ఏమీ ఉండదనుకుంటాను.

ఇంక తాంబూలాలు సేవించి మేజువాణీల దగ్గరకు చేరుతారు. పోనీ, వచ్చిన వాళ్ళు వాళ్ళ విద్య చూచి సంతోషించవచ్చునా, ఉఁహూ – చక్కని జావళీ కాని, పదం కాని శ్లోకం కాని, అష్టపది కాని, పాడి అభినయిస్తుంటే ఎవరో ఒక అమాయకుడు మహా విద్వాంసుడులా ముందుకు వచ్చి ఏ దేనీ హిందూస్థానీ పాడవే అనడం. పాపం, ఎంతకోపం వస్తేమట్టుకు వాళ్ళు యేమిచెయ్యగలరు. హిందూస్థానీ పాడుతుంటే ఇంకో పెద్దమనిషి "ఇకనైనా నేమి ఈ మాయమట్లు" అని పాడమనీ తన దేశాభిమానం ప్రకటిస్తాడు. నాకు అభినయమంటే చాలా అభిమానము. వచ్చిన జట్టులో ఒక గొప్ప విద్వాంసురాలు ఉన్నదని విన్నాను. సావకాశముగా చూద్దామంటే ఏలాగు? అసహ్యము వేసి ఒక్కరోజున అక్కడ కూచోలేదు. సనాయిపాటకుడిచేత పాడించి నే నొక్కడినీ అక్కడ కూచుని ఆనందించేవాడిని.

ఎలాగయితేనేమి, అయిదు రోజులూ గడిచినాయి. అయిదవ రోజున కళ్ళనీళ్ళు గక్కుకుంటూ, "అష్టవర్షా భవేత్కన్యా పుత్రనత్పాలితామయా... అని పిల్లను ముఖ్యులైన వారందరికీ వప్పచెప్పారు. చూచే వాళ్ళందరికీ, అందులో ముఖ్యముగా ఆడవాళ్ళకు, కళ్ళనీళ్ళు వచ్చినాయి.


హడావిడిగా, పోయినవి పోగా ఉన్నవి పెట్టెలో సర్దుకొని నిద్దర్లు లేక, వేళపట్టున తిండిలేక, తిన్నది అరగక, పిల్లలకు పోషణలేక, నలుగుడుపడి ఇంటికి చేరుకున్నాము.

వధూవరులు కుడికాలు ముందుపెట్టి గృహప్రవేశమయ్యారు. మరునాడు సమారాధన, ఆరాత్రి భామాకలాపమూను. ఆ మరుసటి దినము భోగమువాళ్ళు సంభావన పుచ్చుకుని శలవు తీసుకున్నారు. ఇంకను, వాళ్ళువెడుతూ ఉంటే వీధిపొరుగునా ఊళ్ళో మొగపురుగులంతా బారులు తీర్చి నిలబడ్డాయి. పిల్లవాళ్ళు చెడిపోతారు. మన మిక్కడుంటే వాళ్ళు రారుకదా అని పెద్దవాళ్ళు వచ్చారు. పెద్దవాళ్ళు చూడగా లేనిది మనము చూడకూడదా అని కుర్రవాళ్ళు వచ్చారు. కొందరు ఊరు పొలిమేరదాకా సాగనంపి, బిక్కమొహాలు వేసుకుని వెనక్కు వచ్చారు. కొందరు సాహసము కలవాళ్ళు బళ్ళతోటి కూడా పడవల కాలవల దాకా వెళ్ళి వాళ్ళను పడవ ఎక్కించారు. పడవ గట్టును

రాసుకుంది. లోపలికి తొయ్యవలసివచ్చింది. సరదాగా ఇందులో కొందరు కుర్రాళ్ళు పడవ నడిఏట్లోకి వెళ్ళే దాకా తోశారు. ఇంక మునిగిపోతా మేమోనని భయపడి ఇవతలకి వచ్చారు. శలవు పుచ్చుకొని వెడదామంటే భోగము వాళ్ళు కనపడలేదు. కొంతదూరము వాళ్ళ పడవ లాగినా ముక్తి వస్తుందని రెండు మైళ్ళ దూరము లాకుదాకా ఒక్క విసురున లాక్కుపోయారు. పడుచుదనము, పడవలో భోగమువాళ్ళు సంతోషిస్తారనే ఉత్సాహమును విసురుకా కేమి?

భోగము వాళ్ళు ఈలోపున వాళ్ళమాట మరిచిపోయి. పడవలో ఒక వర్తకునితోటి సంభాషణ ఆరంభించారు. పడవ లాకు దగ్గరకు వచ్చింది. ఈ కుర్రవాళ్ళు పడవలోకే వెళ్ళి బోగము వాళ్ళను సంబోధించి మేమింక వెడతామని అన్నారు. వీళ్ళ నెప్పుడు జన్మ మధ్య మందు చూడనట్టు నటించి "చిత్తము దారేపోయే వాళ్ళంతా మాతోటి చెప్పి వెళ్ళనక్కర లేదు" అన్నారు. ఈ కుర్రవాళ్ళకి పై ప్రాణాలు పైన ఎగిరిపోయినాయి. ఒకళ్ల మొగాలు ఒకళ్ళు చూసుకున్నారు. మాట్లాడకుండా ఇంటికి చేరుకుని ఒక్కొక్కళ్ళూ నాలుగు లంఖణాలు చేశారు.

నాకు పెళ్ళంటే మహా చెడ్డ సరదా – ఇంత తంటా ఇంత గందర గోళమూ, ఈ మేజువాణితో. ఈ అకాలపు భోజనాలూ లేకుండా ఉంటే మహా సరదాగానే వుంటుంది. వధూవరులు ప్రాజ్ఞులైతే ఇంక నడిగారూ; వాళ్ళ పెళ్ళి వాళ్ళు కూడా ఆనందిస్తారను కుంటాను. అంటే అది స్వల్ప విషయం. పెళ్ళి జరగడం మనం ఆనందించడమే ప్రధాన విషయం.



# చలం

**(1894 - 1979)**

ఆధునిక తెలుగు కథా సాహిత్య సీమలో చలం గారు బ్రహ్మాండమైన ఉప్పెన. స్త్రీకి జరిగే అన్యాయాల్నీ, అక్రమాల్నీ సహించలేక కలం పట్టిన సంస్కర్త. కవి, సౌందర్యోపాసకుడు, నాటకకర్త, నవలా రచయిత, తత్త్వవేత్త. చిన్నకథ వీరిచేతిలో ఒక టెక్నిక్‌ను రూపొందించుకొని, పరిపూర్ణత్వాన్ని పొందింది. వజ్రాయుధం లాంటి వ్యావహారికభాషా, జలపాతం లాంటి శైలీ, సానుభూతితో కూడిన మనస్తత్త్వ పరిశీలనా, శక్తియుత భావప్రకటనా - వీరి సొమ్ము. కథానికా యుగ నిర్మాతలలో ప్రముఖులు.

**రచనలు :** స్త్రీ, ప్రేమలేఖలు, ఉత్తరాలు; దైవ మిచ్చిన భార్య, అమీనా, జీవితాదర్శం మొదలగు (నవలలు), కొన్ని వందల కథలు; పురూరవ, శశాంక, త్యాగం మొ॥ (నాటకాలు), నాటికలూ, మ్యూజింగ్స్ మొదలగునవి.

# ఓ పువ్వు పూసింది

**అ**ర్ధరాత్రి అడివిలో పువ్వు పూసింది. చుట్టూ చీకటిని చూసి, భయమేసి, 'అమ్మా' అని ఏడ్చింది. ఆకులూ, తొడిమలూ దగ్గరగా తీసుకుని భయం లేదని వూయించాయి ఆ తెల్లని పసిపువ్వుని.

"ఏదీ?" అంది పువ్వు.

"ఎవరు?" అంది తల్లితీగ చీకట్లోంచి

"నన్ను నీ దగ్గిరికి తీసుకువొచ్చాడూ, అతను."

"ఎవరు తీసుకొచ్చారు? నేనే తెచ్చుకున్నాను నిన్ను; నా గారాబాన్ని, నా బంగారాన్ని, నా ముద్దుల మురిపాన్ని. నిన్ను."

"నువ్వేనా? ఎవరో అనుకున్నాను. నువ్వేనా నా చేతిని పట్టుకుని నక్షత్రాల మధ్య నించి ఆడుతో, నవ్వుతో, అట్లా తేలివొచ్చి నన్నిక్కడ దించింది; ఓసారి కనపడు."

"తెల్లారనీ, నన్నుచూద్దుగాని. ఇప్పుడు పడుకో."

"భయమేస్తోంది. కిందికి పడిపోతానా?"

"నేను పట్టుకున్నాను కాదూ?"

"ఆకలేస్తోంది. అమ్మా!"

పువ్వునోట్లోకి వెచ్చగా, తియ్యగా, వొంటినంతా సంతోషంతో నింపుతో పాలు వొచ్చాయి.

"వొచ్చావా?" అని వొళ్ళో పెట్టుకుని వూపింది గాలి.

"అమ్మా! ఏమిటి అట్లా పాకుతోంది నా వెనక?"

"ఏం లేదు; అది పాము. తిండికోసం తిరుగుతోంది."

"నన్ను తింటుందా?"

"నిన్నెందుకు తింటుంది?చాలా మంచిది. పిట్టపిల్లల్ని తింటుంది; మన జోలికి రాదు."

పెద్ద పెద్ద చెట్ల వెనకనించి అర్ధచంద్రోదయ మౌతోంది. కళ్ళు పెద్దవిగా విప్పింది. పువ్వు. చెట్ల కొనలు మెరుస్తున్నాయి. నేలమీద సందుల్లోంచి చారలుగా వెన్నెల పాకుతోంది చీకటిని పక్కలకు తోసుకుంటో, చుట్టూ అడివిని చూసి...

"చూడు. అమ్మా చూడు" అంటో చప్పట్లు కొట్టి ఆడింది పువ్వు.

నిద్రకళ్ళతో పాడుతోంది తల్లి.

తలెత్తి తల్లివంక చూసింది.

"ఎంత అందంగా వున్నావు అమ్మా?"

తన కళ్ళకి అందక తల్లిని తీగెలు చీకట్లలోకి పెనవేసుకున్నాయి. పరిమళాలలో విరబోసుకుని నల్లని నీడల్లో వూగుతున్నాయి ఆకు గుబుర్లు.

"ఎవరిమీద నమ్మా కావిలించుకుని అల్లుకున్నావు? అతనెవరు గంభీరంగా అట్లా నుంచున్నాడు నీ బరువు మోస్తో.

"మీ నాన్న"

"అమ్మా, అమ్మా. అమ్మా; ఎవరు అట్లా కిర కిర మంటారు?అమ్మా. పట్టుకో నన్ను."

"అవి కోతులు, మీ నాన్న కోసం వొస్తాయి. నిన్నేం చెయ్యవు అవి."

"మరి నాన్న వాటిని...."

తన పేరు పిలుస్తున్నారు. పాడుతో వెన్నెలలో తేలి తన చుట్టూ మూగుతున్నారు. పుష్ప కిన్నెరలు. తనెరుగును వాళ్ళని.

"పుట్టావా. నువ్వు ఇక్కడ పుట్టావా?"

– చుట్టూమూగి, పువ్వుని కడుగుతున్నారు. రేకుల్లో చిన్నచిన్న నొక్కులు అందంగా దిద్దారు. మంచుముత్యాల హారాలు వేశారు.వాళ్ళ వెనుక తనకి కనపడకుండా నీడలో ఎవరు నుంచున్నారు? తనకి తెలుసు ఎవరో? ఎప్పటెప్పటినించీ,అనంతకాలంనించి, అనేక రూపాలలో, అనేక లోకాలలో, అనేక ఆనందాలలో తనతో చెయ్యి కలిపి ఎన్నడూ తనను వొదలని ఆ నీడ ఎవరు?

తన తలపై నుంచి, చీకట్లలోనించి తియ్యని పిలుపు. దూరంగా దేనికోసమో అరుపు. ఆకులన్నీ నిలిచి వింటున్నాయి. గాలి చిన్న తరంగాలతో పులకరించింది.

ఎవరు? ఎవరు? ఎంత వెతికినా కనిపించని ఎవరు?

"అమ్మా? అమ్మా? ఎవరు?"

"కోవెల."

"ఎవర్ని పిలుస్తుంది?"

"ప్రియుణ్ణి."

"రాడేం?"

"చీకటి."

"మళ్ళీ పిలవమను."

"పిలుస్తుంది."

"ఎంత అందమమ్మా ఈ లోకం? నే నెక్కడ వున్నాను ఇక్కడికి రాక?"

పువ్వుకి ఎదురుగా, పెద్ద కాంతి పుష్పం అంధకారపు తూర్పు శాఖన వికసించి జ్వలిస్తోంది. తేలికగా తనని కప్పి నవ్వించే మబ్బు తెరలోంచి తన వెలుగు చేతుల్ని జాస్తోంది పువ్వు వేపు.

❄ ❄ ❄ ❄

ఉత్సవాలు, వాయిద్యాలు, అరుపులు, సంతోషాలు.

వూడుస్తున్నారు. తోరణాలు కడుతున్నారు. జయ జయ ధ్వానాలు చేస్తున్నారు.

ప్రతి మబ్బుకి రంగుల్ని అలంకరిస్తున్నారు. ఆత్రుతగా సంతోషాన్ని ఆపుకోలేక ఇటూ అటూ పరుగెత్తుతున్నారు. అనిలకుమారులు, దుమ్ము దులుపుతూ, అందర్నీ మేలుకోమంటూ, ఎండిన ఆకుల్ని దూరంగా తోసేస్తో, చెట్లు గాలిలోకి నోళ్ళు తెరుచుకొని ఆరగిస్తున్నాయి ప్రథమ భోజనాన్ని.

కాంతి, కాంతి ప్రపంచమంతా కాంతి. ఆకాశాన్నంతా ఆనందంతో నింపుతో కాంతి. అలలమల్లే కాంతి విరుచుకు పడుతోంది లోకంమీద.

లోకం రూపమే మారింది. సగం చందమామ నవ్వుతో నమస్కరించి ఆకాశం లోపల కరిగిపోయినాడు. లోకాధిపతివలె వెలిగిన వేగుచుక్క భయంతో ఏమూలకో వొదిగాడు. మబ్బులు సిగ్గుతో రంగుల్ని కడిగేసుకుని. తెల్లని వొళ్లతో పక్కపక్కల ముడుచుకున్నాయి.

దేదీప్యమానమైన కాంతితో ఎర్రగా, ఎక్కడా కల్మషాన్నీ, అంధకారాన్నీ అల్పత్వాన్నీ సహించని, క్షమించని దివ్య నిర్మల తేజస్సులు కుమ్మకుంటో బయల్దేరాడు మార్తాండుడు.

పక్షులన్నీ రెక్కలు చాచి ఎగురుతున్నాయి. మృగాలు వొళ్ళు విరుచుకుని కదులుతున్నాయి. పవనకుమారులు చెట్ల ఆకుల చివర్లలో కూచుని భయంగా చూస్తూన్నారు.

సమస్తమూ మరిచి కళ్ళు తెరుచుకుని చూస్తున్న పువ్వువైపుకి తీక్షణంగా ఒక్క కిరణాన్ని విసిరాడు సూర్యుడు.

"చచ్చాను" అని కళ్ళుమూసుకుంది కన్య. వొళ్ళంతా వొణికింది. దెబ్బతిన్నట్లు సొమ్మసిలింది. తానంతా ఎర్రగా ఐపోయింది. ఒక్కసారి తన మొదట్లోంచి నేలలోంచి చీల్చుకొని తనలోకి దిమ్మరించే అమృతంతో తానంతా నిండిపోయింది.

“అమ్మా” అని ఒక్క అరుపు అరిచింది. భయం కాదు. సంతోషంకాదు. చావు కాదు, పుటక కాదు. నవ్వయవ్వనం.

తనలోకి ఆ లేత ఎండ, వెన్నెల, కింది గడ్డి నవనవ. ఆకాశంలోని నీలపు నునుపు, తన తండ్రి కొమ్మల బలం, కోవెల కంఠంలోని జాలి. గాలిలోని అర్థం లేని అల్లరి, తన తల్లి వేళ్ళ కింది భూమిలోని అనర్గళ సారం – అన్నీ ప్రవహించాయి.

తన రేకుల్లో తళతళలు, తన యీనెల్లో నున్నటి వుబుకు. తన బొడిపెల్లో పగలడానికి సిద్ధమైన మదపు సౌరభం, తన తొడిమలో విశాలమౌతున్న బలం తన సమస్తంలో ఆగని, అంతులేని, కారణం లేని కాంతి.

అకస్మాత్తుగా తనని ముంచుతో, చీలుస్తో, పైన దొర్లి సముద్రం అలలమల్లే, మూర్ఛ తెప్పించే పరిమళం, తనని, తల్లిని, గాలిని ఆకాశాన్ని నింపి, పొర్లే అలలుగా, జ్వాలలుగా తనలోనించి పరిమళాలు.

పట్టలేక ఫక్కుమని నవ్వింది. ఆ నవ్వు ఎండకే కాంతినిచ్చింది.

ఆ మత్తుకి, ఆ మాధుర్యానికి ఆకాశం కిందికి దిగిరావొద్దా? గాలి ఈ వార్త ముల్లోకాలలో ప్రకటించవద్దా? ఆ కాంతి అంతా ఒకటై తనకి హారతి ఇవ్వద్దా – ఈ చెట్లు, పక్షులు, కీటకాలు, మృగాలు, ఈ అనంతాకాశం, సూర్యచంద్రులు ఈ లోకమే తన పరిమళ సౌభాగ్యం కోసం సృష్టిపొందలేదా?

తన ముందు ఇంకెవరు?

అల్లరిగా గంతులేసింది. చప్పట్లు కొట్టింది. కళ్ళలోంచే కాంతుల్ని విసిరింది. ఎవరు అటు వెళ్ళినా ఆకుల వెనుక దాక్కుని తొంగి చూసి పక పక నవ్వింది. తన రేకుల్ని వూపింది. పరిమళాన్ని ఎక్కడా అంతం లేని భాగ్యం మల్లే విరజిమ్మింది ప్రపంచం మీద.

సంగీతాలతో, నృత్యాలలో సోలుతో, తూగుతో, చుట్టూ మధుపాలు సేవించి వెంబడి రాగా, పూలని లెక్కకింద తలెత్తి చూడకుండా, గర్వంగా, యవ్వనంతో మదించి, వొంటినిండా పచ్చని పుష్పరజం చల్లుకుని పోతున్నాడు మధుపం.

ఎండలో రజంలోంచి నల్లగా మెరిసే అతని దేహం. క్రూరమైన తొండం, రక్తం వలె ఎర్రనైన కళ్ళు. గాలిని శూలాలవలె గుచ్చే పెద్ద మీసాలు చూసి వొణికింది పువ్వు.

“అమ్మా! ఎవరది?” అని తల్లి ఆకుపచ్చ పమిటలో దూరింది.

నవ్వి కూతురు తల నిమిరింది.

“నీ జోలికి రాడులే” అంది కొంటెగా తల్లి.

“రాడా? ఎంత పొగరు?” అంటో ఆకుల్లోంచి సగం తొంగిచూసి పరిమళాల్ని విసిరింది పువ్వు. వూపిరాడనీక మొహానికి అడ్డుపడి, రెక్కల బలాన్ని లాగేసే ఆ పరిమళానికి తల తిరిగి ఆగాడు మధుపం.

"అమ్మా! ఆగాడు" అంది భయంగా పువ్వు.

తనని ఆగనీక, నిలవనీక, ఏమిటి ఆ బాధ? తియ్యని మత్తెక్కించే ఆ వేదన? ఏమిటో తనకి తెలీక, భయపెట్టి,తనని తొందరచేసే ఆ కాంక్ష?

తిరిగాడు తనవేపు.

పొమ్మన్నాడు అనుచరుల్ని. మళ్ళీ ఇంకోసారి కొత్త పూరజం అతనినిండా చల్లి అలంకరించి ఎగిరిపోతున్నారు మిత్రులు. చుట్టూ ఆకుల మీద వాలి నవ్వుతున్నారు పోకిరివాళ్ళు.

తనవేపు ఎగురుతున్నాడు అతను. బలంగా, ధైర్యంగా అతనికి ఎవరు ఎదురు అన్నట్టు. ఎండలో మెరుస్తో, తేలుతో, గాలిని చీల్చుకుంటో వొస్తున్నాడు అనివార్యంగా.

సిగ్గు, సిగ్గు. సిగ్గు.

తన గర్వం, తన ఆధిక్యత, విజృంభణ – ఏమీ లేవు. దాక్కుంది ఇంకా లోపలగా.

వొస్తున్నాడని భయం, సంతోషం.

తీరా రాడేమోనని దిగులు,న్యూనత.

వొస్తున్నాడని గర్వం, సిగ్గు.

ఏమిటి అంత స్వతంత్రం?

ఏమిటి ఇంత ఆలస్యం?

తను తప్ప ఇంకేం కనపడకుండా ఐ తన చుట్టూ ప్రాధేయపడి పాడాలి.

తానుమాత్రం అందక, ఆకుల్లో తప్పించుకుని వేధించాలి.

నిర్లక్ష్యంగా, అవలీలగా ఆకుల్ని వొత్తిగించి, తనని నలుగురు ముందూ బాహాటం చేశారు. క్రీగంటితో చూసి, "పో, ధూర్తుడా?" అంది. కాని తన కంఠస్వరమేనా అది? ఏమిటా తియ్యదనం, ఆ ఆహ్వానం? తనెంత ప్రయత్నించినా తనకి లోబడని ఆ హృదయారాటం?

వెడల్పయిన స్వరంతో, జుమ్ముమనే ఆ ఆపులేని ప్రేమగీతాన్ని ఆలాపిస్తో తన చుట్టూ తిరుగుతున్నాడు. ముందు కాళ్ళని తన వేపు జాచి, రెక్కల మీద రంగు రంగులుగా మెరుస్తో ఎండ. అతని వొంటిమీద రజపు మదపు వాసన తల తిప్పుతోంది.

పొంగివచ్చే వరదమల్లే ముంచేసింది తన కింకేం తోచకుండా ఆ మధుప గీతం. సముద్ర హోరుమల్లే రక్తపు పోటుమల్లే.

అడుగుతున్నాడు, నవ్వుతున్నాడు. తల వొంచి ముందు కాళ్ళతో ప్రాధేయ పడుతున్నాడు. "నీ కోసమే అనంతకాలం నుంచీ వెతుకుతున్నాను. నా ఐశ్వర్యాన్ని నీ పాదాల ముందు గుమ్మరిస్తాను. తలెత్తి ఒకసారి నా వంకచూడు" అంటున్నాడు.

అన్నీ అబద్ధాలు, కాని, ఎంత మధురమైన అబద్ధాలు!

నీ పొక్కతవేనే నాకు అన్నాడు. ఆ పుష్పరజమంతా ఎక్కడిదో? ధూర్తుడు.

తెల్లని రేకలు మెరిపించి చిన్న నవ్వు నవ్వి దాక్కుంది ఆకుల మధ్య గాలి సహాయంతో.

అతను బలహీనంగా, మృదువుగా కొమ్మల్లోనూ దాక్కునే తన కోసం, ఇంకా రాడేం, వెళ్ళిపోడుకదా? మెరుస్తో, రెక్కల వూపుతో, లెక్కలేని పువ్వుల మధ్య ముల్లోకాలలో అవలీలగా సంచారం చేయగలిగిన అతను – ప్రత్యేకం తన కోసం – తన ముందు ప్రాధేయ పడుతున్నాడు.

"పో !" అంది, పోతాడేమోనన్న భయంతో.

మధుపం ఆ మాటతో ఆమె తన స్వంతమైనట్టు, అధికారమైనట్టు, సంకోచం లేకుండా విహరించే రాజ్యసీమ ఐనట్టు, కరుకు గోళ్ళతో, మృదు పత్రాలు, ఏమౌతున్నాయో అనే దృష్టిలేకుండా వాలాడు పువ్వుమీద.

"అమ్మా!" అని పెద్ద కేక వేసింది – ప్రాణం పోతున్నట్టుగా.

అమ్మ పలక లేదు. తనని వొదిలారా? అందరూ వొదిలారా? ఇదే అంతమా? తన ప్రాణాలు ఎగిరి పోతున్నాయి.

నిర్దయగా, ఏమీ తన అనుజ్ఞ లేకుండా, క్రూరంగా, గోళ్ళతో చీల్చి, తల దూర్చి, తను ఎన్నడూ తనలో ఉన్నదని తెలీని, తన గర్భకుహరాంతరాన్ని తొండంతో ఛేదించి తాగుతున్నాడు మధువునంతా.

వొళ్ళు చీలికలౌతోంది. రక్తాన్నే తాగుతున్నాడు. వెనక కాళ్ళతో పక్కల్ని సాగతీసి చింపుతున్నాడు. ఇంక త నెట్లా బతకడం? ఎట్లా మొహమెత్తడం?

కాని అప్రయత్నంగా రేకలతో అతన్ని కప్పి దాచుకుంది. తన ఈనెలతో సన్నని వొంపు తీరిన నడుముని కావిలించుకుని దగ్గిరికి లాక్కుంది. తనలోని పచ్చని పరిమళపు గంధాన్నంతా అతని నిండా చల్లింది. తననే తా నర్పించుకుంది.

"ఇంక నన్ను వొదిలి వెళ్ళకు మని" వేడుకుంది. "నేను నీ దా"న్నంది. "నీ కన్న ఇంకేం లే"దంది.

ఇంకా, ఇంకా, ఇంకా – నాలో ఇంకేం మిగలకుండా నా ప్రాణాన్నే, ఆత్మనే తాగెయ్యమని రహస్యం పలికింది.

ఝల్లుమంది వొళ్ళు. తాను చూసిన సూర్యులు వెయ్యిమంది తన కళ్ళ ముందు భగ్గుమన్నారు. రాత్రి నక్షత్రాలన్నీ ధగ ధగ తనచుట్టూ నాట్యం చేశాయి. సముద్రాలు హోరుమన్నాయి. ఎట్లా భరించడం ఈ ఆనందం, ఈ బాధ, ఈ తీపి, ఈ తీపు!

గుండె బద్ధలు కాదా? నాళాలు చీలిపోవా? తన రేకులే చించుకుని రాలిపోవా?

ఆగలేక పట్టుకుంది దగ్గిరిగా కప్పేసింది. మూర్ఛపోయింది.

వొదిలేశాడు తనని కరుణామయుడు, మధురమూర్తి. తనని వొదిలేసి, తన కళ్ళలోకి నవ్వాడు. ఏమియ్య గలదు తాను! చాలా హాయిగా సంతుష్టితో తన కళ్ళల్లోకి నవ్వాడు.

ఎవరు? తానెట్లా తీర్చుకోగలదు. ఈ కృతజ్ఞతని?

నమ్రతతో నమస్కరించింది.

తనమీద కాళ్ళూని, అవలీలగా గాలిలోకి ఒక్క దూకు దూకి, చీకటి వెలుగులాగు మెరిసి రెక్కల్ని జాచి, ఒక్క చూపు, తన వైపు వెనక్కి చూడకుండా వెళ్ళిపోయినాడు. అతని నెచ్చెలిగాళ్ళని ఒక్క కేకతో పిలిచి, వాళ్ళతో ఉల్లాసంగా నవ్వుతో తన ఉనికినే మరిచి, అతని వెంటబడి అడ్డుపడే తన హృదయాన్నే తోసేసి, తనకు తెలీని, తాను అందుకోలేని, నీలపు లోకాల్లోకి ఆకుపచ్చ కాంతుల మధ్య నించి ఎగిరిపోతున్నాడు. కనపడ్డంత దూరం దిగులుతో తలవొంచి చూస్తోంది. తానా? కదలడం చాతకాదు.

ఆకుల తెరచాటున సిగ్గుగా పెరిగిన కన్య. ఏమని తాను లోకం కళ్ళ ముందు, సిగ్గు విడిచి, అతన్ని అనుగమించగలదు?

తనకే రెక్కలుంటేనా? ఇంక ఎటూ చూడకుండా తల్లిని, తండ్రిని, ఆకుల్ని, మిత్రుల్ని, సమస్తమూ మరిచి అతని వెంట సహచారిణి ఐ సేవ చెయ్యదా?

కాని అబల.

దీవిస్తున్నారు. లాలిస్తున్నారు.

తన చుట్టూ చిన్న చిన్న వనకన్యలు చేరి పాడుతున్నారు.

తన వొంటివంక గర్వంగా చూసుకుంది. ఎంతో సాఫల్యంతో, నిండుతనంతో, లోతులో, బరువెక్కిన తనవంక చూసుకుని పొంగిపోయింది.

సూర్యుడు పైకి లేచి పెద్ద చెట్ల ఆకు నీడల్ని మంటపెడుతున్నాడు; గుంపులు గుంపులుగా చిలకలు ఆకుపచ్చ మెరుపుల మల్లే ఎగిరిపోతున్నాయి. శీతాకోక చిలకలు తప్ప తాగి ఎండలో తూలుతున్నాయి. రంగు రెక్కల్ని గర్వంగా గాలిలో చాచి, సోమరిగా తేలిపోతున్నాడు గరుడుడు మబ్బుల మధ్య.

❄ ❄ ❄ ❄

మెల్లిగా పొట్టివై పోయే నీడల్ని సోమరిగా చూస్తో, శాంతంగా కూచుంది పువ్వు బలంగా శక్తిని భూమివేళ్ళలోంచి తనలోకి లాక్కుంటో. తన అందమంతా పోతేనేం? పరిమళం లేకపోతేనేం. కేసరాలు అవిసి, వొడిలి తన పత్రాలమీదనే వాలిపోతేనేం? తనవైపుకి కాంక్షతో మధుపాలు చూడకపోతేనేం? ఇప్పుడు తన చూపు తన లోపలికి... తన జీవితానికి అర్థమే మారిపోయింది.

తన లోపల కొత్త ప్రాణం కదులుతోంది. చోటుకోసం వెతుక్కుంటో తన పక్కల్ని సాగతీస్తోంది. మధువం తన నిండా విరజిమ్మిపోయిన పుష్పరజంతో పచ్చనై జారిపోయిన తన పత్రాల్ని ఎండ వెచ్చదనానికి వప్పచెప్పి, తన చుట్టూ జరిగే సృష్టి ఉత్సవంలో తానూ ఒక ముఖ్యపాత్రధారిణి ననే గర్వంతో, ఇంకేం కావాలి అనే స్తిమితంతో, నిర్లక్ష్యంగా జూస్తోంది – క్షణమైనా ఆగక నిరంతరంగా అలలమీద నాట్యంచేసే సృష్టిలీలని.

గాలిమీద చిందులు తొక్కుతోంది ఎండ.

ఆకాశాన మధ్య మండిపడే భాస్కరుడి కంటపడింది ఆ పువ్వుతల్లి. క్రూరంగా, చూస్తో ఎదట నిలచింది కాలం, పరిమళం లేని మధువు లేని, రంగుతప్పిన ఆ పువ్వుని అనవసరమని తలవూపింది సృష్టి. రేకులు రంగు తప్పి ముడతలు పడ్డాయి. కేసరాలు ఒక్కొక్కటే వూడి జాలిగా కింద ఆకుల మీద వాలి గాలి వూపుకి దుమ్ములో పడ్డాయి కాని దృష్టిని తన గర్భం వేపు తిప్పి, తననీ, తన అందాన్నీ, ప్రపంచాన్నే మరిచింది పువ్వు.

❊ ❊ ❊ ❊

మబ్బులనుంచి చివరి రంగుల్ని పిలుచుకుని సూర్యుడు ఎప్పుడు కడసారి శెలవు చెట్ల చిటారికొమ్మల మీది గరుడులనుంచి తీసుకొని వెళ్ళిపోయాడో, ఎప్పుడు శాంతి గీతాల్ని వాయుకుమారులు పాడి కొమ్మల్లో కూచున్నారో, ఒక్కక్షణం విశ్రాంతి లేక తిరిగిన జీవులన్నీ ఎక్కడెక్కడ అన్ని వ్యాపుర్తుల్నీ వొదిలి నీడల్లో వొదిగాయో, పక్షులూ, కోతులూ తన తలపై గుబుర్లలో ఎప్పుడు ఎప్పుడు మాటుమణిగాయో గమనించనైనా లేదు పువ్వు.

వెతికివెతికీ మూలమూలల దాక్కున్న వెలుతురిని మింగేస్తోంది వెయ్యి నాలికలతో చీకటి.

మొదటి నక్షత్రపు మిణుకు మిణుకు లోంచి జారిన కాంతిరేఖ మీద కూచుని వొచ్చి నిలిచాడు తన ముందు.

తన పేరు పిలిచాడు.

"ఎవరు" అంది పువ్వు. కాని తెలుసు తనకి.

గజగజ వొణికింది. చుట్టూ చూచింది ఏడుస్తో.

"రా" అన్నాడు.

"నా పాపాయి" అంది.

"నీ ప్రాణాన్ని నీ పాపాయి కిచ్చి నాతో రా" అన్నాడు నవ్వుతో.

"ఎట్లా రానూ?" అని అరిచింది చివరి అరుపు.

తన చేతిని పట్టుకుని, కన్నీళ్ళు తుడిచాడు.

"చూడు" అన్నాడు.

లోకమంతా పెద్ద వెలుగు. అన్ని రూపాల్నీ, భిన్నత్వాల్నీ తనలో కరిగించుకుంటున్న మెత్తని వెలుగు. నేలమీది ఎండుటాకుల నించి, ఆకాశాన నక్షత్రాల దాకా, అన్నిటినీ ఏకం చేసే దివ్యకాంతి, అంతా, అంతా, ఆ వెలుగంతా అతను అన్నిచోట్లా అతను.

పొట్టలోని ఆ కళ్ళని నింపుతో, పట్టుకు చీల్చుకు చీల్చుకు తింటో, చీకట్లో దాక్కుంటో, పిల్లలకి రసం తాగిస్తో, చంపుతో, ఏడుస్తో, నవ్వుతో, కోపంతో దూకుతో, ఆనందంతో వూగుతో – ప్రతి మూలా అతను. తన పాపాయిని లాలిస్తో, తాగిస్తో అతను.


"రా"?

నవ్వుతో తన వార్ధక్యం, నిరర్థకత్వం, ఎండుతనం అంతా పోయి, బాల్యం యవ్వనం, బలం, సంతోషం, మాతృత్వం, ప్రేమ, అన్నీ అతని ముందు అర్పించి మొక్కింది.

అతని చెయ్యి పట్టుకుని అనంతాకాశంలోకి ఒక్క దూకు దూకింది.

ఇంక భయమనేది లేదు. విచారం లేదు. సందేహం లేదు. సమస్తమైన ప్రపంచంతో, కాలంతో అతి సన్నిహితుడతడు. అతని వేళ్ళను పట్టుకున్న తన నింక ఏ మూల ఏ రూపంతో నిలిపినా ఆ కొత్తవుండదు. తనకోసం చేతులు జాచి వుంటాయి. చిరునవ్వులు వెలిసి వుంటాయి. తన ఆగమనం కోసం గొప్ప విలువలుంటాయి.

ఆకాశంలో తేలుతో, భక్తితో అతని మొహం వంక చూసి పక్కున నవ్వింది – ఆనందాన్ని అణుచుకోలేక.



# విశ్వనాథ సత్యనారాయణ

**(1895 - 1976)**

**క**విసామ్రాట్, సంస్కృతాంధ్రాంగ్ల భాషాకోవిదులు. సాహిత్య ప్రక్రియలన్నిటిపై ప్రాభావంగల సాహితీవేత్త. సనాతన హైందవ సంప్రదాయాల పట్ల అచంచల విశ్వాసం కలిగి, పురాతన వ్యవస్థను పునరుద్ధరించవలెనని ధ్వనిస్తూ అనేక రచనలు చేశారు. శైలి గ్రాంథిక వ్యావహారిక సమ్మిశ్రమము. పాండిత్యము, కవిత్వము, వివిధ విషయ పరిజ్ఞానము విశ్వనాథ వారి కథలో పోటీలు పడుతాయి. విశ్వనాథ 'మధ్యాక్కఱ'లకు కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. విజయవాడలో నివసించేవారు.

**రచనలు :** శ్రీమద్రామాయణ కల్పవృక్షం, కిన్నెరసాని పాటలు, విశ్వనాథ మధ్యాక్కఱలు, వేయిపడగలు, చెలియలి కట్ట, ఏకవీర మొ॥ (నవలలు), చిన్నకథలు, తల్లిలేని పిల్ల మొ॥ (నాటకాలు)

# ఏమి సంబంధము

**అ**ప్పటికి నాకు పదహారేండ్లో, పదిహేడేండ్లో. నాకు సరిగా జ్ఞాపకం లేదు. ఏదో బంధువుల యింట్లో పెళ్లికి వెళ్లాం ఒక ఊరు. మేము మగపెళ్లివారము. ఒక ఇల్లు విడిదికి ఇచ్చారు. ఆ ఇంటివాళ్లు వాళ్లాయింట్లో కొంతమేర సర్దుకొని తక్కిన భాగం విడిదికి వదలిపెట్టారు. కాని అది పల్లెటూరు. అయిదురోజుల పెండ్లి. పెళ్లివారింటికి ఆ యింటివారుకూడ రెండుపూటలు భోజనానికి. రెండు రోజులు గడిచేటప్పటికి వాళ్లూ వీళ్లూ కలిసి చనువుగా వుంటున్నారు. మూఁడవ రోజున మధ్యాహ్నం అనుకొంటాను. నేనా చావట్లో పడుకొన్నాను. ఆ యింటాయన చనిపోయాడు. ఆయన భార్య, కూఁతురు ఆ ఇంట్లో వుంటున్నారు. మగపిల్లలున్నారు. వాళ్లు చదువుకోవటానికి వెళ్లారో యేమో? ఊళ్లోలేరు ఆరెండు రోజులమట్టీ నే నెవ్వరో వాళ్లకు తెలుసు. నేను చదువుకొంటున్నానని, మాది అన్నోదకాలకు లోపంలేని సంసారమని ఆవిడకి తెలిసింది. నేను కొంచెం తెలుగులతో పరిచయం చేయడం, కంఠమెత్తి పద్యం శ్రావ్యంగా చదవటం అప్పటికే ఉంది. సామాన్యంగా మన యిళ్లల్లో ఆడవాళ్లు భర్తలు పోయిన తర్వాత భారతమో, భాగవతమో, భక్త విజయమో, ఇల్లాంటి గ్రంథాలు చదువుకుంటూ కాలక్షేపం చెయ్యటం సహజమే. ఆవిడ కూడా అటువంటిదే. అందుచేత నేను తెలుఁగు పుస్తకాలతో పరిచయం కలవాణ్ణి అని తెలియటం మూలంగా నే నంటే ఈ రెండు రోజుల్లో కొంచె మభిమానంగా ఉంది.

ఆవిడ కూఁతురు అప్పటికే పదేండ్ల పిల్ల. కాలిపొడుగరి. చిదిమి దీపం పెట్టవచ్చు. తల్లి చాలా భారీ మనిషి. ఆ అమ్మాయి కూడా పెద్దదైతే తల్లియంతది ఔతుందిలాగా ఉంది. పుష్టి గల పిల్ల, చేతులు పొట్లాలల్లే ఉన్నవి. ఆ మొగములోని అందము చెప్పటానికి వీలులేదు. పెద్ద కళ్లు, గుబురుగా పెరిగిన నల్లని కనుబొమలు. భగవంతుడు సౌందర్యం

అంటే ఇట్లా ఉండాలి అని చేసి చూపినట్లుగా ఉంది ఆమె మొగం. ఆ పిల్ల నవ్వుతుంటే ఇప్పుడు తలుచుకుంటే అప్పుడు నేనెంత ఉవ్విళ్లూరానో తెలుస్తోంది. కాని ఆ పిల్లను చూచి నేనెంత సంతోషించానో మనస్సులో అంత దిగులూ పడ్డాను. మా నాయనగారు నాకు పదియవ యేటనే పెండ్లి చేశారు.

ఆ మధ్యాహ్నం సావిట్లో పండుకొని ఉండగా ఆ తల్లి, కూఁతురు ఇద్దరూ వచ్చారు. ఆ తల్లి నన్నేమైనా పద్యాలు చదవమన్నది. నేను చదివాను. ఆవిడ చాలా సంతోషించింది.

ఆ కూఁతురు ఎంత అందకత్తెయో అంత చిలిపిపిల్ల. ఆ పిల్ల నాతో సరాగాలాడటం మొదలు పెట్టింది. అప్పటి చిన్నతనం వివృతంకాని జీవితంలో ఉన్న మోహమంతా సుందరంగా భాసించే రోజులు. ఆ పిల్ల దగ్గరకువస్తే, నాతో మాట్లాడితే, నవ్వితే, పరాచికాలాడితే అప్పుడు నా శరీరమంతా పులకితమైంది. నా మనస్సంతా ఆనందధామమైంది. ఆ పిల్ల శరీరచ్ఛాయ మేలిమిబంగారం. ఆ కాంతి వ్యాపించి నా శరీరంలో చొచ్చి నే నేదో ఒక తేజోమూర్తి నైనా ననిపించింది.

ఆరోజున సదస్యమవటం మూలంగా పెళ్లివారందరూ పెళ్లి ఇంట్లోనే ఉన్నారు. మేము ముగ్గురమే విడిదిలో వున్నాము. ఆ పిల్ల చేసిన కొంటెపనులన్నీ జ్ఞాపకం లేవు. లీలగా ఈ ఒక్క విషయమే జ్ఞాపకముంది.

నేను చిన్నప్పటినుండి బస్తీలో చదవటం మూలంగా పల్లెటూరి విషయాలు నాకు తెలియనివి కొన్ని మిగిలిపోయినై. అన్ని చెట్లు ఎరుగుదును. అన్ని మొక్కలు ఎరుగుదును. సీమ మెరపకాయ మాత్ర మెరుగను. సరిగా అది గండుచీమంత ఉంటుంది. ఆ ప్రమాణంలోనే పండుతుంది. ఆ పిల్ల వాళ్ల దొడ్లోకిపోయి పండిన ఈ సీమ మెరపకాయ తెచ్చి నా కిచ్చి యిది తియ్యగా వుంటుంది తినమన్నది. అందులో తెలివిగా ఏమిచేసిందంటే? తొడిమ లేకుండా తెచ్చింది. కామించి పళ్లు మొదలైనవి యెరుగును. ఇదీ అట్లాంటిదేమోనను కొన్నాను అని నోట్లో వేసుకొని నమలితిని. ఇంక చూడు నోరు మండిపోయింది. ఆ మంటని పట్టుకోవడం కష్టమైంది. అటు పరుగెత్తి నీళ్లు పుక్కిలించి ఉమిసి ఎంత చేసినా కారము తగ్గదు. కళ్ల వెంట నీళ్లు, ఆపసోపాలుపడటం, చెవులల్లోంచి పొగరావటం, నే నింత బాధపడుతుంటే ఆ పిల్ల నవ్వటం, తల్లి చిరునవ్వుతో తూష్ణీభావం వహించటం. ఇద్దరిలోనూ నాయందు ద్వేషం లేదు. ఇద్దరికీ నే నంటే అభిమానం వున్నది. నేను తెలివితక్కువగా ఆకాయ నమలటమేమిటి? నా మనస్సులో కొంత సిగ్గూ ఉన్నది. ఆ పిల్లమీఁద నాకుగల ప్రేమని నా చిన్నతనపు తెలివితక్కువ వలన వచ్చిన సిగ్గు వెక్కిరించింది. ఆ పిల్ల నేను బాధపడుతుంటే సంతోషించటానికి కోపంవచ్చింది. కాని ఆ సిగ్గునూ కోపాన్నీ అణచిపెట్టి నేను కూడా అదంతా ఒక సరదాలాగా నటించక తప్పక వచ్చింది.

నాకు వివాహమైందని ప్రసంగంలో మా అమ్మగారి వల్ల ఆవిడకి తెలిసింది. ఆవిడ

నవ్వుతూ "అయ్యో! అల్లాగా, మా అమ్మాయిని మీరు చేసుకుంటా రనుకున్నానే?" అంది పెళ్లి అయిదవరోజున మాదారిని మేము వచ్చేశాం. తరువాత యేడాదికో రెండేండ్లకో నా భార్య కాఁపురానికి వచ్చింది. ఆ పిల్లనుగురించి ఐదారేండ్లు తలఁచుకొంటూ ఉండేవాడిని. వాళ్లకూ మాకూ బాంధవ్యమూ లేదు. ఆ యూరికీ మాకూ సంబంధమూ లేదు. పూర్తిగా మరచియే పోయినాను.

## 2

మంచి నడివేసంగి. ప్రొద్దుటిమట్టి భోజనం లేదు. బెజవాడలో ప్రొద్దున్నే ఆరుగంటల కెక్కితే సాయంత్రం అయిదున్నరకి గుంటకల్లులో దిగిందిబండి. నేను అనంతపురం వెళ్ళుతున్నాను. ఆ రోజున శుద్ధ సప్తమి అనుకొంటాను. సంజవెన్నెల కాస్తున్నది. అనంతపురం బండి బయల్దేరింది. నాలుక పిడచగట్టుతోంది. ఈ చెవిలో గాలి ఆ చెవిలో దూసుకొంటోంది. ఆగాలి మొగంమీద చేతులకు తగిలినంత మేరకు విరవిరలాడిపోతున్నది. ఆ రైలుబండి యెందుకు వచ్చిందిరా బాబూ అన్నట్టు నడుస్తున్నది. దూరాన చిన్ని చిన్ని గుట్టలు చీకటి ముద్దలు పడ్డట్టు కూర్చున్నవి. ఎటుచూచినా రాళ్లే. రైలు వాగుల మీదుగా పోతున్నది. వాగులలోని ఇసుక వెన్నెలలో నీళ్లు లేక నాలుక చాచినట్లున్నది. రైలు పెట్టెలలో నీళ్లులేవు. స్టేషను వస్తుంది గదా అక్కడ మంచినీళ్లు దొరకుతవని ఎదురు చూచాను. ఒక స్టేషను వస్తుంది గదా అక్కడ మంచినీళ్లు దొరకుతవని ఎదురుచూచాను. ఒక స్టేషను, రెండు స్టేషనులు, ఏ స్టేషనులోనూ నీళ్లు లేవు. త్రాగేనీళ్లని డబ్బాలలో పెట్టారు. వాటిల్లో నీళ్లులేవు. నా ప్రాణం తహతహలాడి పోతోంది. అప్పటికే తొమ్మిది కావొస్తోంది. ప్రతిస్టేషనులో దిగటం, ఆ పరుచుకుపోయిన వెన్నెల్లో రాత్రి ప్లాటుఫారములమీఁద నీళ్లకోసం దేవులాడటం.

ఒక స్టేషనులో నేను రైలు పెట్టెలోనుంచి దిగి నీళ్లు దొరుకునేమోయని వెళ్లుతుంటే ఆడవాళ్ల పెట్టెలో ఒక స్త్రీ నన్ను పిలిచి "అయ్యా, మా పిల్లల నాలుకలు ఎండిపోతున్నవి. కొంచెం మంచినీళ్లు తెచ్చిపెట్టారా?" అంది. నేను కూర్చున్న పెట్టెలో దీపం గ్రుడ్డిది. ఆ ఆడవాళ్ల పెట్టెలో దీపం మంచి ప్రకాశంగా వుంది. అయినా ఆవిడ కిటికీలో నుంచి వ్రాలి నాతో మాటాడటం మూలంగా వెల్తురామె మొగంమీద పడటం లేదు. ఆవిడ ముఖరేఖలు నాకు విస్పష్టంగా కన్పించటం లేదు. స్థూలంగా చూస్తే చాలా అందకత్తెవలె కన్పించింది.

"సరే, నేను మంచినీళ్లకోసమే వెళ్లుతున్నాను. దొరికితే తెస్తా" నన్నాను. "ఇదిగో ఈ చెంబు తీసుకెళ్లండి" అని ఆమె మరచెంబు మరతీసి నాచేతి కందిచ్చినది.ఆ దప్పిక స్థితిలో స్త్రీ పురుష విభేదం లేదు. పరపురుష విభేదం లేదు. ఆవిడ చేయి నాకు తగిలినది. ఇంకో గంటసేపటి నుంచి నీళ్లే దొరకకపోతే వడకు చచ్చిపోవటమే. మృత్యువునకు గంట

దూరంలో వున్న ఆ సమయంలో ఆవిడ చేయి నాకు తగిలి నేను సంతోషించడం అధర్మలక్షణమా?జంతు లక్షణమా?

ఆ స్టేషనులో నీళ్లు దొరికినవి. నేను కడుపునిండా త్రాగాను. ఆ చెంబునిండ పట్టుకొన్నాను. నేను బ్రతికానన్న సంతోషంకంటే, ఆవిడకి చెంబెడు నీళ్లూ తీసుకువచ్చి యివ్వటానికి వీలైందన్న సంతోషమెక్కువైంది. నేనావిడకు మహోపకారం చేస్తున్నాననా? ఈ ఉపకరానికి ప్రత్యుపకారంగా ఆమె నాయందు స్నిగ్ధురాలౌతుందనా? నీళ్లు తీసుకొని వెళ్లి యిచ్చాను. ఆవిడ చెంబు పుచ్చుకొనటంలో ఈసారి తన చేయి నా చేతికి తాకకుండానే పుచ్చుకున్నది. పిల్లలకిచ్చింది; తాను కొంచెం త్రాగింది. నే నాపాటున వెళ్లిపోవచ్చునా. వెళ్లిపోలేదు. “చాలునా? ఇంకొక చెంబెడు తీసుకొనిరానా?” అని అడుగుతూ అక్కడే నిలుచున్నాను. ఆమె “అక్కరలేదండీ” అంది. నేను నీళ్లు తెచ్చిపెట్టానన్న కృతజ్ఞత ఆమె మొగంలో ఉన్నది. కాని “నేను కృతజ్ఞురాలను, నమస్కారములు” మొదలైన నాగరపు మాటలు ఇంగ్లీషుభాష నేర్వని వాళ్లకు తెలియవుగనుక ఆమె నాతో ననలేదుకాని, మొగములో నాకృతజ్ఞతమాటలన్నీ మొగములోకంటె రెట్టింపు కనిపించుచున్నవి.

ఈ పిల్లలకు మంచినీళ్లిచ్చుటలో ఆమె అటునిటు మసలుటలో ఆ చక్కని వెలుగులో నామె మొగము చక్కగా నాకు కనుపించింది. మొదట ఆమె సౌందర్యమే నన్ను కొట్టింది. తరువాత ఆమె మొగ మెక్కడో చూచి నట్లనిపించింది. నన్నది వఱ కామె చూచిన ట్లామె మొగములో లేదు. నే నిదివఱ కామెను చూస్తే ఆవిడా నన్ను చూచియుండాలికదా? ఇది కాకుండా కొందరిని చూచినప్పుడు వాళ్లని మనం చూడకపోయినా చూచినట్లుంటుంది. అటువంటి ముఖలక్షణములు కల వ్యక్తి నెవరినో చూచియుంటాము. ఆ లక్షణ సామ్యంచేత వాళ్లనూ చూచినట్లుంటుంది. మీదే ఊరు? మీరెక్కడికి వెళ్లుతున్నారు? మొదలైన ప్రశ్నలు వేస్తే బాగుండేదేమో? కాని ఆమె మొగము చూస్తే కృష్ణా గోదావరిజిల్లాల స్త్రీవలె ఉన్నది గాని దత్తమండలపు స్త్రీ వలె లేదు. అడుగుదామనుకొని అడగకుండానే నా పెట్టెలోకి నేను వెళ్లిపోయాను. కాని ఆమె ఆ సుందరమైన ముఖం నా మనస్సులో ముద్రితమయ్యే ఉన్నది.

## 3

తర్వాత రెండేండ్లకు ఆ ఊళ్లో నా కుద్యోగమైంది. అక్కడికి వెళ్లాను. అద్దె యింటికోసం తిరిగాను. చివరికొక ఇంట్లో ఒక భాగం కుదిరింది. కుదిరిన రోజున సాయంత్రమే మా వాళ్లు వచ్చారు. ఆ ప్రక్క భాగం ఎప్పుడూ తాళం వేసే ఉన్నది నాలుగు రోజులు. ఆ యింటాయన వేరే కాపురముంటున్నాడు. ఆ భాగంలో ఎవరుంటున్నారని అడిగాను. ఆ ఉంటున్నాయన కలెక్టరాఫీసులో గుమస్తా అనీ, ఆయన భార్య ప్రసవించడానికి పుట్టింటికి

వెళ్లిందనీ, ఆయన ఒక్కడే ఉంటున్నాడనీ, నాలుగు రోజులు సెలవు మీద యింటికి వెళ్లాడనీ చెప్పారు. అయిదవ రోజున ఆయన వచ్చాడు. ఆయన సబ్ మేజిస్ట్రేట్ చేసి మళ్లీ కలెక్టర్ ఆఫీసుకి ఒక పెద్ద గుమాస్తాగా వచ్చాడు. ఆయన రాత్రి యెప్పుడో పదింటికి వచ్చేవాడు. ప్రొద్దున్నే తొమ్మిదింటికి వెళ్లేవాడు. నేను రోజూ ప్రొద్దున్నే లేచేటప్పటికే ఏడున్నరౌతుంది. మే మిద్దరము కలుసుకొని మాట్లాడడమే పడలేదు. పైగా ఆయన కొంచెం మేజిస్ట్రేటు చేసివచ్చినవాడు గనుక కొంచెం టెక్కుగూడా కలవాడు. నాలుగైదు నెలలు ఆ ఇంట్లో కలిసివున్నా ఆయనా, నేనూ కలిసి మాట్లాడలేదు. ఆయనెవ్వరో? నే నెవ్వరో? ఇట్లా ఇంకొక నెల గడచింది.

ఒకరోజున సాయంత్రముపూట వాకిట్లో వచ్చి గుర్రపుబండి నిలిచింది. అందులో నుండి ముగ్గురు పిల్లలు, పసిపిల్ల తల్లి దిగారు. నేను వాకిట్లో కూర్చొని యేదో వ్రాసుకుంటున్నాను. తల యెత్తి చూస్తే ఆవిడ కనిపించింది. చప్పున పోల్చుకోలేకపోయాను. రెండేండ్ల క్రిందట రాత్రిపూట రైలుపెట్టెలో ఉన్న వెలుగులో చూచిన మొగమాయెను. కాని ఆ కనులు, కనుబొమ్మలు 'నేనే' అన్నవి. ఆవిడ బండి దిగుతూనే తలయెత్తకుండానే యింట్లోకి వెళ్లిపోయింది. ప్రక్కభాగంలో ఎవరో ఉన్నారు. మనకెందుకులే అనుకొన్నదో, ఎవరో ప్రక్కభాగంలోకి వచ్చారని భర్త చెప్పాడో? యెంత అనుకొన్నా ప్రక్కగా ఒక మనిషి ఉంటే తలయెత్తి చూడటం మానవ సహజం. తాను మేజిస్ట్రేటు భార్య. రేపుప్రొద్దున మగడు తహసీల్దారౌతాడు. మనసులో ఆ అహంకారం ఉండి యుండవచ్చు.

కాని ఆవిడ బండిదిగి యింట్లోకి వెళ్లేవరకూ నే నావిడ వంకనే చూస్తున్నాను. భర్తకూడ వెంటనే వున్నాడు. నేను తన భార్య వంక చూస్తున్నానని ఆయనకు తెలుసు. నన్ను మర్యాద తెలియని వాడనుకోవలసిందే కాని గద్దించటానికి వీలులేదు. అభియోగం దీసికోరావటానికి వీలులేదు. ఆయన నడకలో, చూపులో ఒక తిరస్కృతి, నిరాదరణ కనిపించినా పైకి పొక్కలేదు. అయినా నే నిట్లు వ్రాయడ మెందులకు? చూస్తే తప్పా, ఇది మనుష్యసహజం. ఊరికే చూచారో దురూహతో చూచారో? ఎట్లాతెలుస్తుంది?

ఇంతకూ ఆవిడ ఆనాడు ఎండదెబ్బ తిగిలినా మనిషియొక్క శరీరము, మొగము పుష్టిగా కనిపించినవి. ఇప్పుడు బక్కచిక్కి యున్నది. ఆ నాటి శరీరసౌష్టవం లేదు. బుగ్గలు లోపలికి పోయినవి. కనులు కొంచెము గుంటలు పడ్డవి. కానుపు చాలా కష్టపు కానుపైం దేమో? పాప మింకా తేరుకోలేదనుకొన్నాను.

పది రోజులైంది మా అమ్మ అంది – "అబ్బో! వాళ్లకు చాలా టెక్కు, పలుకరించినా మాట్లాడ్రా" అని, "పోనీలే" అన్నాను.

ఆ ఊళ్లో నూతులు పాతాళగంగలు. ఒకరోజున వాళ్ల పనిమనిషి రాలేదు. స్నానానికి,

పానానికి అన్నిటికి ఆవిడే తోడుకోవాలి. మనిషి, పాపం నీరసస్థితిలో వుంది. తొమ్మిదిన్నరకు అన్నం పెట్టకపోతే ఆ మగడు ఆవిడమీద గూడా మేజిస్ట్రేటుగిరీ చెలాయిస్తాడు. రాత్రికి పెందరాడే వంట కావాలి. భోజనం చేసి ఆఫీసుకు వెళ్లాలని చెప్పాడట. సాయంత్రం. నే నైదింటికి యింటికి వస్తే నూతిలో నీళ్లు తోడుతోంది. ఒక బొక్కెన బయటకు వచ్చేటప్పటికి ఆవిడ ప్రాణాలు కడబట్టు తున్నవి. అక్కడ రెండు బిందెలు పెట్టింది. రెండు బిందెల నిండా నీళ్లు కావాలి. నాలుగు బొక్కెనలైతే కాని బిందె నిండదు. "నేను కొంచెం కాళ్లు కడుక్కుంటాను బొక్కెన యిస్తారా?" అన్నాను. బొక్కెన వదలిపెట్టి యింట్లోకి వెళ్లింది. నేను కాళ్లు కడుక్కొని ఆ రెండు బిందెల నిండా నీళ్లు తోడి యింట్లోకి వెళ్లాను.

తర్వాత మూన్నాళ్లకు ఒకరోజున సాయంత్రం నేను ఇంట్లోకి పోతుంటే ఆవిడ యింట్లోకి యెదురుగా వస్తోంది. నామీద కనులునిలిపి చూచింది. ఆ కన్నులలోకి ఏదో గుర్తు తగిలినట్లుగా తోచింది.

ఆ నీళ్లు తోడిపెట్టడం వల్ల ప్రసన్నురాలైందో, ఆ రైలు బండిలో నీళ్లు తెచ్చిన నాటి గుర్తు తగిలిందో మా అమ్మతో, మా వాళ్లతో పరిచయంగా మాట్లాడటం ప్రారంభించిందట.

చిన్నప్పుడు రాగచ్ఛాయగా పద్యంచదవట మనే గుణం నాలో పెరుగుతూ వచ్చింది. అప్పుడు కంఠమెత్తి పదిపదిహేను రాగాలు పద్యాలమీద జోడించి పాడటం, ఫర్వాలేదు. బాగానే వుందని వినేవాళ్లనుకోవటం జరుగుతుండేది. వారానికో, పదిరోజులకో ఒకసారి రాత్రిపూట భోజనం చేసి పడుకొని సంగీతాలు తీస్తుండటం నా కలవాటు, ఒకరోజున రాత్రి అల్లా సంగీతాలు తీశాను. మరునాడు "మీ అబ్బాయి సంగీతం పాడుతారండీ!" అని మా అమ్మతో అన్నదట.

తరువాత వారం రోజులకు పగలు నేను భోజనం చేస్తుంటే మా అమ్మ చెప్పింది. "ఒరేయి, ఈ అమ్మాయి యెవరో యెరుగుదువా? నీ చిన్నప్పుడు మనం మా ఊరు పెళ్లికి వెళితే నీచేత సీమమిరపకాయ కొరికించిందే ఆ అమ్మాయి. మొన్న నేను ఆ అమాయిని కూర్చోబెట్టి పుట్టుపూర్వోత్తరాలన్నీ అడిగాను. ఈ అమ్మాయి తమ్ముడు యిప్పుడు మన ఊళ్లో ఉద్యోగం చేస్తున్నాడట. మన యింటి ప్రక్కన రెండిండ్ల అవతల ఉన్నదే రామారావుగారి యిల్లు - ఆ యింట్లో అద్దెకున్నారట. వాళ్ల అమ్మ నాకు మల్లేనే చాలా ముసలిదైనదట. నిన్నెక్కడ చూచామా అని ఆ అమ్మాయి అనుకొన్నది. నీవు సంగీతం పాడిన తర్వాత ఆ అమ్మాయికి సరిగా తెలిసిందట? ఆ చిన్నప్పుడు నీవు పాడిన పద్యమే సరిగ్గా అల్లాగే పాడావట. అప్పుడు చప్పున అమ్మాయికి జ్ఞాపకం వచ్చిందట" అని చెప్పింది.

అదివరకే అనుకుంటున్నారు. వాళ్ళాయనకు తహసీల్దారైంది. మా అమ్మ యీ మాట చెప్పిన మరునాడే వాళ్లు ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయినారు. ఆ రోజు నేను ఊళ్లోలేను.

## 4

తర్వాత మూడేండ్లకు నేనా వూళ్లో ఉద్యోగం మానేసి మా ఊళ్లో చేరాను. ఆవిడ తమ్ముడు, అతని సంసారం, ఆ రామారావుగారింట్లోనే అద్దెకుంటున్నారు. వాళ్ల కబుర్లు రోజు చెప్పుకొంటూనే ఉంటాం. తెలిసిం దేమిటంటే ఆ అమ్మాయి మళ్లీ కడుపుతో ఉందనీ, తమ్ముడు అక్కగారిని పురిటికి తీసుకొనివస్తాడనీ, అయిదవ నెల పడలేదు. ఏడవనెల పడలేదు. తొమ్మిదవ నెల వచ్చింది. తల్లిపోరు పడలేక తీసుకొచ్చాడనీ, ఆ అమ్మాయి ప్రసవించే రోజులనీ.

మూడవ రోజు రాత్రి ఆ అమ్మాయికి నొప్పులు వచ్చినవనీ, డాక్టరును తీసుకువచ్చారని, ఆరోజు రాత్రికి యెల్లాగో అల్లాగ గడచిందనీ.

తర్వాత రెండు రోజులు ఆవిడ పని కిందెట్టు మీదెట్టుగా ఉన్నది. ప్రసవ సంబంధమైన వ్యాధి కాదు. వేరే వ్యాధి యేదో వచ్చింది. చుట్టుపట్ల యిళ్ల వాళ్లందరూ చూడటానికి వెళ్లారు. నేనూ వెళ్లాను. వెళ్ళిన నిమిషంలోనే ఆ అమ్మాయికి ప్రాణ నిష్క్రమణవేళ అయింది. క్రిందకు దింపటానికి యెవ్వరూ లేరు. భర్తకు టెలిగ్రామిచ్చారు. రాలేదు. నేనూ, వాళ్ల తమ్ముడూ పట్టుకొని క్రిందకు దింపాము. మరునాడు మోసేందు కెవ్వరూ రాలేదు. రెండు ప్రాణాలు. అందరకూ అశుభమే. నేను కూడా వాహకులలో నొకడనైనాను. ప్రొద్దు గ్రుంకిన తర్వాత నక్షత్ర దర్శనం చేసి భోజనం చేశాను.

ఆ రాత్రి ఒక రాత్రివేళ కల వచ్చింది. ఆ అమ్మాయి పదేండ్ల పిల్ల. నేను పదహారేండ్ల కుఱ్ఱవాడిని. వాళ్ల యింట్లో నేను పద్యాలు చదివాను. ఆ అమ్మాయి సీమమిరప కాయ తీసుకొని వచ్చి తినమన్నది. తిన్నాను, నోరు మండింది, ఏడుస్తూ నిద్రలేచాను. నిద్రలో గుర్రుకొడుతూ నోరుతెరచి నిద్రపోయినానేమో? అగ్నిమండలపు పురుగు నాలుక చివర వ్రాలింది. భగ్గున మండింది. నిద్ర మెలకువ రావటంతోనే తెలిసినది. అది నాలుక చివరే కాకుండా పెదవి మీద కూడా పుండైంది. ఆ పుండు సరిగా పదిపన్నెండు రోజుల వరకూ మానలేదు. అన్నం తిననీయలేదు.



# అడవి బాపిరాజు

**(1895 - 1952)**

**క**వి, కళాకారుడు, చిత్రకారుడు, నవలాకారుడు, కథా రచయిత, కులపతి. కాల్పనిక జగత్తులో విహరిస్తూ, భావాత్మకమైన కథలను, రంగుల కుంచెలతో చిత్రించడం వీరి ప్రత్యేక మార్గం. వీరి కథలలో అపూర్వ కల్పనలూ, ఉదాత్త భావాలు, లలిత కళల ప్రశంస, జాతీయ వాతావరణమూ, కమ్మని శైలీ, భావోత్కర్ష మెండుగా వుండి పాఠకుల్ని రస జగత్తులో ముంచి తేల్చుతాయి.

**రచనలు :** హిమబిందు, నారాయణరావు, కోనంగి, గోన గన్నారెడ్డి మొ॥ (నవలలు), రాగమాలిక, తరంగిణి, అంజలి మొ॥ కథాసంపుటాలు

# భోగీర లోయు

పగపట్టిన పన్నగిలా ఆ లోయలోనికి చొచ్చుక పొయ్యాను.

ప్రతి వంకరకూ ప్రత్యక్షమైన ప్రకృతి దృశ్య సౌందర్యం మహాకావ్యంలో పుటలు తిప్పినప్పటి రసానుభూతిలా గున్నది.

నాలుగు మెలికలు, ఒక్కొక్క మెలిక మూడు వందల ధనువులు, అర్ధానుస్వార రూపమై ఎప్పటికప్పుడు ఆఖరులాతోచిన ఆ మెలికలో రెండు వైపులా నదీదేవత సంతరించిన నలభై నిలువులయెత్తు నల్లరాతి గోడలు, చెట్లు దట్టంగా పెరిగిన కొండ చరియలు. వాటిపై నీలాల శిఖరాలు కారుదున్నల్లా, భయంకరమైన ఖడ్గమృగాలల్లా పడివున్న నల్లరాతి బండ్లలో ముప్పై ధనువుల వెడల్పున రాగమాలికలు పాడుకుంటూ భోగీర ప్రవహిస్తున్నది.

పారిజాతవనాలు, అడవి మల్లెలు, ఇప్పచెట్లు, చీకటిమానులు, నల్లమద్దులు, రేగులు ఆ కొండచరియల నిండా వున్నవి.

దూరాన్నుంచి ఘంటానాదాలు, భిక్షుల మంత్రస్వనాలు తుమ్మెదల ఝుంకారావాలతో, పక్షుల కలకూజితాలతో కలిసి వినవస్తూన్నవి.

విహారానికి వచ్చిన మృగినై ఆ లోయ చొచ్చుకుపోతిని. మావాండ్లు వెనకనే నెమ్మదిగా వస్తూ వుండిరి. "అమ్మాయీ! ఒంటరిగా ముందు వెళ్ళిపోకమ్మా!" అని మా అమ్మ అన్నమాట యెక్కడో దూరాన్ని వినపడింది. ఒక మలుపు మళ్ళింది. ఎట్టయెదుట దివ్యదర్శనం.

భోగీర ఉత్తరవాహిని అయిన అర్ధచంద్రాకారంలో నదికి ఇరవై ధనువుల యెత్తున రూపెత్తిన మంత్ర ప్రదర్శనంలా గుహలు, చైత్యాలు, విహారాలు, ఒక శిల్పమాలిక దూరాన్నుంచి కళ్ళల్లో ఇంద్రధనువు లాడుతూన్నవి. స్తంభాల శిల్ప విన్నాణము, చిత్రకౌశలం, విగ్రహాల సుసౌష్టవ మూర్తిత్వమూ. ఆహారే! భిక్షుల కౌశేయ కాశ్మీర కుసుమవర్ణ వికాసము,

విద్యార్థుల ధవళ వర్ణ ధౌతవిలాసము, నాగరుల జానపదుల వివిధ వర్ణ వినీత విచిత్రత్వము – ఒక పెద్ద చిత్రంలా ప్రత్యక్షమైంది.

కళ్ళు మూసుకొని తథాగతుని ధ్యానించుకొన్నాను. భోగీరాశ్రమ మహాపరిషత్తు సంఘారామానికి హృదయంలో చేయెత్తి జోహారు లర్పించుకొన్నాను.

నీళ్ళకు నదిలోకి దిగేవాళ్ళు. రంగురంగుల కలశాలను భుజాల మీద అలంకరించుకొని మెట్లెక్కే వాళ్ళు. యోషలు, పురుషులు, బాలికలు, భిఖ్ఖులు; ఒకసారి భావాలు హృదయాన్ని నింపివేస్తుండగా, ఒకసారి భావాలు లేని చైతన్య రహిత హృదయం కలదాన్ని అవుతూ ఆగిపోతిని. పైనుండి విద్యార్థులు, భిక్షుకులు నాకేసి తేరిపార చూస్తున్నది నేను గమనించనే లేదు. ఆ ప్రథమ దర్శన ముహూర్తము పరమ పూజ్యమైంది.

ఆ పవిత్ర ప్రదేశంలో అడుగుపెట్టి అపశ్రుతి మ్రోయించ లేదు కదా నేను? ఏదో సిగ్గు అలుముకుపోయింది.

మా గురువులు శిల్పార్ణవులు. ఆయన మోము హిమాలయ శిఖరంలా శాంతి పూరితమైంది. ఆయన సాధారణంగా మాట్లాడరు. అనే నాలుగు ముక్కలూ సూక్తాలై, సూత్రాలై ప్రత్యక్ష మవుతూ వుంటవి.

చిన్నతనాన్నుంచీ చిత్రలేఖనాది కళలంటే చెలిమి కత్తెల్లా ఆడుకొంటూ ఉన్న నన్ను ఆ ఉత్కృష్ట విద్యలో సంపూర్ణ యోగనిష్ఠాపరిపూర్ణను చేయడానికై మాళవ మహారాజ్యభార ధౌరంధర్యులైన మా తండ్రిగారు, మహామంత్రులు ఆనందవసువుల వారు నన్ను ఈ ఆశ్రమానికి ఒక్క పవిత్ర ముహూర్తాన పంపించినారు. మా కుటుంబం అంతా వచ్చి మా నాయనగారు ఇదివరకే నిర్మించిన గుహాచైత్యాన్ని అలంకరింపించ ఆజ్ఞ యిచ్చినారు. అలంకారాదికాలన్నీ పూర్తి కాగానే మహోత్సవంతో ఆశ్రమాచార్యులకు సమర్పించాలని మా నాన్నగారి సంకల్పము.

ఆ గుహావిహారానికి ప్రాంగణ మంటపము పూర్తి అయింది. స్తంభాలు, శిల్పాలు, విగ్రహాలు, భిఖ్ఖులు నివసించడానికి లోని గదులు, శిలాతల్పాలు, ద్వారశిల్పాలంకారాలు, గర్భగృహ శిల్పాలు,తథాగత గంభీర శిల్పమూర్తి, ఆసనము, ఛత్రము, తోరణాలు, ధర్మచక్రము – అన్నీపూర్తి అయ్యాయి. వివిధ దేశాలనుంచి శిల్పము, చిత్ర లేఖనము నేర్చుకోవచ్చిన శిష్యులు, పనివాండ్రు చిత్రలేఖనా లంకారము పూర్తి చేస్తున్నారు.

మహాశిల్పి, చిత్రభవన నిర్మాణ కళాకౌశలి మా గురువులున్నూ తమ శిష్యులతో పాటు మధ్య మండపమంతా జాతకగాథలు, అలంకార చిత్రములు వేస్తున్నారు.

ఒకచోట ఒక శిష్యుడు చిత్రకల్పన చేసి గురువులకు చూపిస్తున్నాడు. గురువులు దానిని సవరించి వేయవలసిన వర్ణాలు చెప్పి వేరొక చోటకు వెళ్తారు. వర్ణాలు పూర్తిచేసి

వేరొక శిష్యుడు నివేదిస్తాడు. గురువులు రంగుల పాత్రలలో తూలికలు ముంచి చిత్రంలో తప్పుదిద్దుతున్నారు. గురువులే వేరొక చోట రూపకల్పన కల్పించి నలుగురు శిష్యులచే వర్ణాలు నింపించుతున్నారు. చిత్రకల్పన, రూపసృష్టి వర్ణికా పూర్ణము అంతా మా గురువులే కొన్నిచోట్ల సంకల్పించి అద్భుత భావాత్మక కళా వైదగ్ధ్యము ప్రత్యక్షము చేస్తున్నారు. దినదినమూ ఆ విచిత్రోత్సవము సందర్శిస్తూ గుండెలు నృత్యాలు సల్ప ముగ్ధనై పోతూ వుంటిని. నా కళ్ళు అరమూతలు పడినై! నా యవ్వనము పొంగి దిశలంటినది. నా అంగుళులు విధాతృసృజనా భావాలై కల్పనకై యోగనిష్ఠ వహింప ఉన్ముఖాలైనవి.

ఆజ్ఞకై గురువులకడ మోకరిల్లినాను.

## 2

ఎవరో బాలిక నా యెదుట మోకరించింది. ఆ మూర్తి వస్తూ వున్నదని గ్రహించడంతోనే కన్నులు చటుక్కున మూసుకున్నాను.

"ఎవరీమె?"

ఆమెతో కూడా వచ్చిన ఒక వృద్ధ–

"స్వామీ, ఈ బాలిక మాళవప్రభుని మేనమరదులవారున్ను. మాళవదేశానికి ముఖ్య మంత్రులున్ను అయిన ఆనందవసువులవారి ఏక తనయ. చిన్నతనాన్నుంచీ చిత్రలేఖనములో మంచి చాతుర్య మలవరచుకొన్నది. ఐనా ఆమె శక్తికి తగిన గురువులు లభించలేకపోవడం చేత విద్య వృద్ధి పొందినది కాదు. జినదేవుని ధర్మ ప్రచారంలా, తమ కీర్తిన్నీ లోకాన్ని ఆవరిస్తూ వుండటం చేత తమ పాదసన్నిధిని శుశ్రూష చేయటానికని మా అమ్మాయిగారు వచ్చారు. చిత్ర విద్య ద్వారా నిర్వాణ మార్గా న్నన్వేషించటానికీ మా అమ్మాయిగారికీ దీక్ష యివ్వవలసిందని ఆనందవసువుల వారున్నూ, మేమున్నూ ప్రార్థిస్తున్నాము."

"ఎవరయ్యా, అక్కడ? ఈ పిశాచాలని నా దగ్గర కెవరయ్యా వదిలిపెట్టింది? గురుద్రోహం తలపెట్టిన పాపాత్ములైన శిష్యులెవరయ్యావారు?" అనిపెద్ద గొంతుకతో అరచినాను.

ఆ వృద్ధ అంతట "అమ్మాయిగారు? లెండిపోదాము" అనుచుండ. నేను చెంగున ఆమెపై నుండి దాటి ఏదో గొణుగుకొంటూ వెళ్ళిపోయినాను. వాఘీరాశ్రమ సంఘాచార్యులైన సత్యశీల భిక్షాచార్యులకడకు చేరుకొన్నాను. సత్యశీలాచార్యులు నూరేండ్ల వృద్ధు. సర్వశాస్త్ర సంపన్నుడు. ఇంతైనా వీడిపోని శక్తి సంపన్నుడైన ఆ మహాత్ముడు నన్ను ప్రక్కనున్న కుశాసనముపైన అధివసింపజేసి, "తండ్రీ! ఏమంత తొందరపాటుతో వస్తూన్నావు?" అని ప్రశ్నించాడు.

పవిత్రుడైన ఆచార్యులవారి పాదాలకు నమస్కరించి "భయంకరమైన ఒక విషయాన్ని తమకు చెప్పదలచుకొన్నాను. ఈ ఆశ్రమానికి ప్రథమంలో నేను వచ్చినప్పుడు నాకు రెండవ జీవితంలాంటి ఆశయాల్ని కొన్నిటిని తమతో మనవి చేసి, తమ ఆజ్ఞతో పరమశ్రమణకుడు నాకు ప్రసాదించిన ఈ నా కొద్ది విద్యను సంఘానికీ, లోకానికీ అర్పించాలని ఈ సంఘారామం ప్రవేశించాను."

"అవును. ఆ ఆశయాలకు భంగం యేమివచ్చింది తండ్రీ?"

"ఒక బాలికకు నేను చిత్ర విద్య నేర్పాలట స్వామీ?"

"మాళవ మహామంత్రి ఆనందవసువు పాప మెరగని తన కుమార్తెకు నీచేత విద్య నేర్పించాలని ఆశించి తథాగతుని పాదంమ్రోల ఆశ్రయిస్తున్నాడు, బాబూ!"

"నా నియమానికి వ్యతిరేకం గదా, ఆచార్యదేవా?"

"అంత కఠిన నియమం ఎందుకు పూనావో నేను తెలుసుకోడానికి ప్రయత్నం చేయలేదు. నిన్నూ అడగలేదు. పురుషునికి బద్ధ శత్రువు కాదగిన అవమానం స్త్రీ ఏమి చెయ్యగలదు. తండ్రీ? పురుషుని ఉత్తమ శక్తిని పైకి విజృంభింపజేయడానికి స్త్రీయున్నూ, స్త్రీయొక్క పవిత్రశక్తిని తేజరిల్ల జేయడానికి పురుషుడున్నూ ఉద్భవించారు. పవిత్రులయిన నాగార్జునాచార్యులవారి ఉపదేశం అట్టిదే; తథాగతుని పవిత్ర ధర్మమూ అదే?"

"అలాగయితే భిక్షుక, భిక్షుణీ దీక్షలెందుకు గురుదేవా?"

"ఓయి వెఱ్ఱివాడా? దీక్ష లేనిదే నిర్వాణమార్గం ఎట్లా అన్వేషిస్తావు? ప్రాపంచిక దూరుడవై ప్రాపంచికా తీతమైన ధర్మాన్ని అన్వేషించాలి. ఆ దీక్షలో, ఆ తపస్సులో స్త్రీ పురుషులొకళ్ళ కొకళ్ళు అడ్డం రాకూడదు; అంటే, స్త్రీ పై పురుషునికి వాంఛా, పురుషునిపై స్త్రీకి వాంఛా పోవాలి. అంతవరకు ప్రపంచంలో వుండి జినభక్తులై ధర్మ మార్గావలంబకులై చివరకు ప్రపంచం వీడి నిర్వాణార్హులు కావాలి.

"ప్రభూ! నాగార్జునార్యదేవులు నివసించిన పవిత్ర సంఘా రామం వున్న శ్రీ పర్వతపురం కృష్ణా తీరాన్న వున్నది.

"అవును, ధాన్యకటక నగరానికి యెగువను."

"అక్కడ ఒక శిల్పి ఆంధ్ర బ్రాహ్మణ యువకుడు వుండేవాడు. అతడు సాంఖ్యాయన సగోత్రుడు. ఇక్ష్వాకు మహా ప్రభువుల ఆస్థాన శిల్పి."

"బౌద్ధ దీక్ష వహించినవాడా?"

"బుద్ధదేవుని, విష్ణుని తొమ్మిదవ అవతారమని నమ్మినవాడు. శిల్పకర్మ రీత్యా మోక్షం చూరగొనాలన్న సంకల్పం కలవాడు. సౌందర్యతత్త్వోపాసి.

"బుద్ధుడే పరమావతారం. అతని పూర్వ అవతారాలలో ఒకటి విష్ణు అవతారం."

"ఆ శిల్పికి వసంత పుష్పాల సౌరభము, నీలాకాశము. మేఘాల నీలి అంచులు, చిరుగాలిలో పుట్టిన చిన్న కెరటాల మీద ప్రసరించి తళుకుమనే చంద్రకిరణాలు, సెలయేటి పతనాల తుంపురులు, ఇంద్రధనుస్సు అంచులు, లేడికూనల ముట్టెలు, సుందరీమణుల అపాంగవీక్షణాలు పులకరాలు కలుగజేసి అతన్ని శ్వేతతారాదేవి పాదాలకడ మోకరిల్లజేసేవి."

"ఇంత నశ్వరమైన సౌందర్యాన్నా అతను ఆరాధించినది?

"ప్రభూ! సంఘారామంలో, రాజప్రాసాదాలలో, అతడూ,అతని శిష్యులూ సృష్టించిన శిల్పాలూ, చిత్రలేఖనాలూ, ఆయా నగరాలలో అతడు నిర్మించిన భవనాలూ, స్థూపాలు లోకమోహనమై వెలిగాయి."

"పరమ దేవుడైన మహాశ్రమణకుని గొప్ప భక్తుడే."

"చిత్తం, అతడు ఇక్ష్వాకు రాజకుమారి నొకర్తెను ప్రేమించాడు. ఆమె అతని దివ్యప్రేమను గౌరవించి తిరిగి ప్రేమించినట్లు అభినయించింది."

"ప్రేమించనేలేదా యేమిటి?"

"స్వామీ? ఆమె శుష్క హృదయ, వృధాడంబరం కలిగిన విచిత్ర స్వరూపమైన శూన్యజీమూతం వంటిది. అతని ప్రేమ లోకాల నావరించింది. ఆమె అంత కన్న అనంతమైన ప్రేమల్లో అతన్ని ముంచివేస్తున్నట్లు నటించింది?"

"ఏ మా వెఱ్ఱి ఆ బాలికకు?"

"స్వామీ? స్త్రీ హృదయం యెవ్వరు యెరుగగలరు? రాజబంధువైన ఆమె తండ్రిని ఆమె పాణిగ్రహణానికై ఆ శిల్పి యాచించాడు. తండ్రి సంతోషముతో అనుమతి యిచ్చాడు. కాని కపటనటనా నటి. కర్కశహృదయయైన ఆ బాలిక "నే నేమిటి? ఈతనిని పెండ్లి చేసికోవటమేమి" టని పెడనవ్వు నవ్వింది. ఆ శిల్పి హృదయంలో చీకటి ఆవరించుకుంది. భయంకరమైన తుఫాను మబ్బులు పట్టినవి. దావానలం అడవుల్ని మండించినప్పుడు వుద్భవించే పొగ అతని జీవితాన్ని క్రమ్మివేసింది. అతనికి దైవం లేదు, బుద్ధుడు లేదు, ధర్మం లేదు, ప్రేమ లేదు."

"ఎంత వెఱ్ఱివాడైపోయినాడు?"

"వెఱ్ఱివాడు కాదు స్వామీ! సర్వజ్ఞానమూ నశించిపోయిన పిచ్చివాడయి పోయినాడు. అతని జీవితంలోని దుర్భర విషాదము హాలహాలమై సమస్త భువనాలూ దహించడానికి బయలు దేరినట్లయింది. దేశాలు తిరిగి తిరిగి ఈ ఆశ్రమానికి చేరుకున్నాడు."

"ఓయి వెఱ్ఱిబాలుడా! ఇంత విషాదగాథా నీది? ఇందుకనా స్త్రీ లోకంమీద నీ కింత కోపము?"

"కోపము కాదు. భయము స్వామీ! తన పాదసన్నిధి చేరుకుని కొంత వూరట పొంది జగద్గురువైన పరమ శ్రమణకుని అవతార మూర్తులైన మీకు నా సేవ అర్పించి భౌతిక వాసనల నుండి దూరమై నిర్వాణానికి అర్హత సంపాదించుకోడానికి దీక్ష వహించాను. నేను పూనిన ప్రతిజ్ఞలు తమకు నివేదించి శిల్పకళాదీక్షకు పూనాను. ఈ విషాదచరితుణ్ణి ఒక బాలికల గురువు కమ్మని ఆజ్ఞాపించడం నామోక్షానికి నన్ను దూరం చేయడం అని మనవి చేసుకొంటున్నాను."

"బాపూ!బుద్ధదేవుని పరమ కరుణచేత అనన్యమైన మానవసేవ నాకు లభించింది. లోకాన్ని సంతరించడానికి పూనుకొన్న నాకు మానవ హృదయం పూర్తిగా తెలుసును. శిల్పివైన నీ చిత్తవృత్తిలో ప్రేమ నశింపక లోతుల అణగివున్నది. నిర్వాణపథార్థివై యున్న నీవు స్త్రీ విషయమై భయము సంపూర్ణముగా నాశనము చేసుకొనవలసి వుంటుంది. స్త్రీ మాయాదేవి యొక్క అంశ; ప్రజాపరిమిత, శ్వేత తారాదేవి; ఈ బాలికకు నీవు చిత్రలేఖన విద్య నేర్పి నీ తపస్సు పూర్తి చేసుకో. భయపిశాచము నీ హృదయాన్ని ముక్కలు చేయకుండా చూచుకో!"

మేము ఒక్క విఘటికా కాలము నిశ్చలులమై, వేణువనము అను పేరుగల ఆ మహాచైత్యంలో సంధ్యాకాలము దోరరంగుల పాకించేవరకు ధాన్యకటకపు పాలరాతి బుద్ధదేవుని విగ్రహాల్లా కూర్చుండిపోయాము. నా హృదయంలో జడత్వ మావరించింది. దూరాలపుట్టి యోజనశతాలు ప్రవహించి ప్రవహించి, వొడ్డుకు చేరి విరిగిపోయే కెరటంలా నా ఆలోచనలు వికలాలు అయిపోయినవి.

## 3

జ్యోత్స్నా ప్రియనామములైన మా చిత్రాచార్యులు విసవిస వెళ్ళిపోవడంతోనే అక్కడ ఆగలేక పరుగిడిపోయినాను. నా హృదయం పచ్చి మృణ్మయపాత్రలా ఛిన్నమై పోయినది. దాసీజనము ఆశ్చర్యపడుతూ వుండగా, తల్లి, వెలవెలపోతూ వుండగా, విసవిస నడచి 'మాళవ మహారాజు విహార' గుహలోనికి పరువిడిపోయి మంచముపై నాథునిచే నిరసింపబడిన ఉమాదేవి చేతిలోని పూలదండలా ఒళ్ళు తప్పిపడిపోయాను.

నాకు మెలుకువ వచ్చేటప్పటికి విహారమంతా చీకటిలో వున్నది. ఎక్కడో రెండు నేతి దీపాలు మినుకు మినుకు మంటూ మిణుగురులులా వున్నవి. ఆ చీకట్లోంచి గుహలోని స్త్రీ పురుష చిత్రమండలమంతా నా వైపే కరుణ హాసావ లోకనములతో పరిశీలిస్తున్నది. నా మంచానికి దగ్గిరగా మహాగురువు సత్యశీల భిక్షాచార్యుల వారు కాలాతీతమైన స్వరూపంతో పరమ దయను ప్రసరించే వెన్నెలలు నింపే చూపులతో, ఆ ముదుసలి పెదవుల వరపూరితమైన నవ్వుల వెలిగిపోతూ వుండగా చూస్తూవున్నారు.

మత్తు నెమ్మది నెమ్మదిగా విడిపోయి బుద్ధి నిర్మలమై లోకజ్ఞానము వచ్చి చటాలున లేచి నిలుచుంటిని. పడబోయిన నన్ను మా వృద్ధదాసి పట్టుకొని "ఆచార్యుల వారికి నమస్కారము చేయి తల్లీ?" అని ఉపదేశించింది.

ఆ వృద్ధాచార్యుల పాదాలకడ మోకరిల్లి పోయినాను.

"అమ్మాయీ! నీ దీక్షకు చాలా సంతోషము. ఎందుకమ్మా శిల్పమంటే నీకింత మమకారము?"

"స్వామీ!....."

"ఊరడిల్లి చెప్పమ్మా, తల్లీ! తొందరలేదు."

దాసీజనము భక్తితో కొనివచ్చి అర్పించిన పీఠముపై శాంతపవిత్రులైన ఆ వృద్ధ భిక్షులు అధివసించినారు. ఆయన కడనే తలవంచి కూరుచున్నాను.

నా గొంతులోనుండి వినబడీ వినబడని స్వరము మాత్రమే ప్రవహించినది.

"స్వామీ! చిత్రకళ నేర్చుకోని నాడు నా జన్మం వృథా! నా పూజ నుసి అయిపోతుంది. నేనింక తీరని యీగాఢ పవిత్ర వాంఛను భరించనూ లేను; తోలివేయనూ లేను".

"అదేమిటమ్మా వెఱ్ఱిబాలికా! ఇంక నీకు చిత్రకళ నేర్పేవారే లేరూ?"

నేను చటాలున లేచి కూచున్నాను. "స్వామీ! నేను అందరి చిత్రలేఖనా సామర్థ్యమూ పరిశీలించినాను. ప్రజ్ఞా రహితుల దగ్గిర అభ్యాసము వున్న విద్య కొంచెమూ నశింపజేసు కోడానికే గదా?"

"సరేనమ్మా! జోత్స్నా, ప్రియ శిల్పాచార్యుల వారిని నీకు చిత్రవిద్య నేర్పడానికి వొప్పించాను. కాని వారు కొన్ని నియమాలు కోరారు. వారు చిత్రిస్తోవుంటే వెనక నుంచి చూచి నేర్చుకోవాలట. ఎదుటబడ కూడదు. వారు లేనప్పుడే గోడలపై చిత్రలేఖనము కల్పించాలట. అది వారు తర్వాత దిద్దగలరు. ఫలకాలపై రచించిన నీ చిత్రాల్ని వారికడకు సేవకులచేత పంపిస్తే వారు సరిచూడగలరు..."

"స్వామీ! ఎలాంటి నియమము శాసించినా సరే, నాకు చిత్రవిద్య ప్రసాదిస్తే చాలు. నేను ధన్యురాల్ని; నా జన్మం అంతా తరించింది."

కులపతి సత్యశీలా చార్యులు వృద్ధత్వంలో కూడా కాంతి వీడని తన కన్నులతో నవ్వుకుంటూ వెళ్ళిపోయారు.

ఈ వరము నాకేలా ప్రసాదింపబడింది; ఎంతటి అపూర్వ సంఘటన! ఈ భిక్షను, పూవు మధువును దాచుకొని సంభావించినట్లు యెంత పూజింపగలనో! తీగలలో స్వరాలు చేరినట్లు, వసంతంలో సౌరభాలు పొదువుకు పోయినట్లు నాలో ఈ శిల్పవిద్య హత్తుకు పోవాలిగాక!

**4**

త్వరలో శుభముహూర్తము చూసి నాకడ ఈ విచిత్ర పద్ధతిని చిత్రవిద్యను అభ్యసింప దీక్ష వహించింది ఆ బాలిక. ఆమె పేరు కల్హార మాల యట. విషాలు హృదయాలల్లో దాచుకొన్న ఈ పాప జన్మలకు, మార పిశాచి ఆయుధాలకు చక్కని పేర్లు మాత్రం పెట్టారు వెఱ్ఱివాళ్ళు పురుషులు. జన దేవుడు స్త్రీత్వంతో లోకాలు ఎందుకు మలినం చేశాడో? బుద్ధ దేవునికి పవిత్రమైన ఆ నలభై రోజుల మహా తపస్సులో జరిగిన పరీక్ష నాకు ఎన్ని సంవత్సరాలు జరుగనుందో?

ఆ బాలిక రచించే చిత్రాలలో ప్రజ్ఞ వున్నది. వర్ణ జ్ఞానమూ బాగానే తెలుసును. ఆడ వాళ్ళు రేఖా నైపుణ్యం ఎలా సంపాదించుకోగలరు చెప్మా? ఈ చిన్నదితీరైన రేఖలు ప్రవహింపజేస్తో వుంది. ఎక్కడో తప్పు వస్తూ వున్నది. నిజమే, కొందరు విద్యార్థులు ఇన్ని సంవత్సరాలు నేర్చుకుంటూ గూడా ఇప్పటికీ రేఖాశక్తి అలవడ జేసుకోలేకుండా వున్నారు. ఆమె కుంచెలు ఆమే కట్టుకుంటుందిట – విచిత్రమే. అతి లలితాలైన వేళ్ళల్లో శక్తి ఉండదు కదా? ఈ బాలిక వేళ్ళు పురుషుని వేళ్ళలా ఉంటవేమో. ఆ బాలికే పురుషునిలా ఉంటుందేమో. మెరుములా వచ్చి నా దగ్గర వాలినప్పుడు అస్పష్టంగా తోచింది నాకా మూర్తి ఆ రూపము సుందర విగ్రహమే. ఛీ? ఈ స్త్రీనామక పిశాచిని ఎందుకు తలపోచుకుంటున్నానో?

ఆమె రచించిన చిత్రాలు సవరించడం నాకా రోజుల్లో ఎంతో హేయమైన పనై వేధించింది. నేను సృష్టింప సంకల్పించిన శిల్పాలు గాని, చిత్రాలు గాని నా హృదయంలోనే ఇంకిపోయినవి. కీలు బొమ్మలా ఏదో దిద్దేవాణ్ణి. లోలోన మన్యపుజ్వరం బాధించేవాడిలా చిక్కిపోయినానట. నెమ్మదిగా చేతులకు వణుకు ప్రారంభిస్తుందా అన్న భయము అంకురించింది. ముప్పది ఐదేండ్లు నడుస్తూ ఉన్న నా జవసత్వాలు నాకు దూరమై పోతున్నవి. తప్పని సరిగా విద్యార్థులకు విద్య నేర్పటం ఎల్లాగో పెట్టుకున్నాను. తక్కిన కాలాలు మా విహారగుహలో అంతర కందరంలో ఆ కఠిన శిలావేదికపై పండుకొని ఉండడమే తప్ప అడవులలోనికి విహారానికి వెళ్ళలేక పోయేవాడను.

ఒకరోజున కల్హారమాల రచించిన చిత్రము సవరించడానికి మాళవ మంత్రిగారి విహారానికి పోయినాను. నేను రచించిన బోధిసత్వుని ప్రక్కనే ఒక బాలికామూర్తి చిత్రాన్ని చూచినాను. ఎవరు చిత్రించినారు ఆ బొమ్మను? ఎందుకు చిత్రించినారు? నా ఆజ్ఞ లేనిదే ఏ మూర్ఖుడు చిత్రించ సాహసించాడు? ఆ విగ్రహము విస్తుపోయినట్లు నా వైపు చూస్తూ వున్నది. గాలి పీలుస్తున్నట్లే వున్నది. కొంచెము సంప్రదాయ విరుద్ధముగా వున్నది. సమభంగాకృతిని త్రిభంగమూర్తి కడ కల్పించుట అపశ్రుతి భూయిష్టము.

ఇంతలో ఆ విగ్రహము కదిలి నెమ్మదిగా చేతులు జోడించి తలవంచుకొన్నది. అది మూర్తికల్పన కాదు; ప్రాణ పూరితమైన బాలికామూర్తి. నా గుండె ముడుచుకొని పోయింది. విస్ఫారితమైపోయింది. మహావేగాన భేరీభాంకారాలు వాయించనా రంభించింది. చైతన్య రహితుడనై అట్లనే నిలుచుండిపోయాను.

ఆ సౌందర్యము అలౌకికము. ఆమె ముఖాన నిశ్చలత్వము, ప్రజ్ఞాపరిమితత్వము, శాంతి, నిర్మల కోమలకాంతి, అత్యంత నిగూఢ సత్యము తాండవమాడుతున్నాయి. స్త్రీ మొఖము చూడనన్న నా ప్రతిన నట్టేట సుడిగుండాలలో మునిగిపోయినది.

"నువ్వు దేవబాలికవా?" అని గబగబ ముందుకు బోయి ఆమెను ప్రశ్నించాను.

"ప్రభూ! – నేను – కల్హారమాలను – మాళవమంత్రి – కుమార్తెను–"

"నా శిష్యవా? హ, హ, హ, హ, .......”అని వెడనవ్వుతూ చివాలున వెనక్కి తిరిగి ఆ అడవులలోకి మహావేగాన వెళ్ళిపోయినాను. నా హృదంతరాళాల కారు చీకట్లు కానట్టి, వెలుగు కానట్టి శూన్యమేదో ఆవరించుకుంది. నా ఒళ్ళు కంపించింది. నేను భరించలేని భయంక రానందము పరవళ్ళుకట్టి నన్ను ముంచి, సుళ్ళలో తిప్పి, అతి లోతులకు లాగి, ఎక్కడకో విసిరికొట్టింది.

భయంకర మృగాలు ఆ అడవులలో సంచరించుతూ వుంటవనే మాట మరిచిపోయి నేనే నిశాచరమైన వ్యాఘ్రము వలె ఆ చెట్ల నీడల్లో పడివుంటిని. రాత్రల్లా దూరాన తోడేళ్ళు, చిరుతలు అరుస్తూవున్న విషయమే గ్రహించలేదు.

నాకు పెనుభూతాలు కనపడలేదు; పాముల బుసలు వినబడలేదు. విషపుచెట్టు యొక్క లేత ఆకు యెంత కోమల సుందరమై వున్నప్పటికీ, అది విషపూరితమే అయినట్లు, సౌందర్యం పుంజీభవించిన స్త్రీ మూర్తులన్నీ విషపూరితాలే. ఈ విషము సేవించిన్నీ దహించబడకుండా జినదేవుని కరుణవల్ల ఒకనాడు బయట పడ్డాను. నేను మళ్ళీ ఈ విషప్రయోగం యే మహత్తర కారణం చేత నన్ను తాకిందో; అమిత జాగ్రత్తతో గమనిస్తూ వున్న నా దీక్ష కర్కశహస్తాల పాలబడి కటిక నేలబడిన మట్టిబొమ్మలా ముక్కలు ముక్కలైపోయింది. ప్రపంచానికి దూరంగా వుందిగదా అని ఈ సంఘారామానికి చేరాను. ప్రపంచమే తరుముకుని తరుముకుని, ఇంద్రుణ్ణి తరుముకు వెళ్ళిన బ్రహ్మహత్యా పాతకంలా, నన్ను వెంబడించింది. ఏనాటి ప్రారబ్ధమిది?"

ఆ బాలిక యెంత నిర్మల చరిత్రం నటిస్తూన్నది! అతి నిర్మలమైన నీళ్ళు కలిగిన కాసారం లాంటి హృదయం కలిగిన మనిషిలా వుంది. ఆమె దివ్య సౌందర్యాన్ని రసపూర్ణమైన కళా స్వరూపంలోనికి దింపడానికి సమయాలు పాటింప నవసరంలేని దివ్యచిత్రమూర్తిత్వంలా వున్నది. ఇంత అందము విషపూరితమై వుండగలదా? ఆ ఇక్ష్వాకు

బాలిక మాత్రం సౌందర్యవతి కాదా? చలించిన ఈ నా మనస్సును కట్టి వేయటానికి తపస్సులో నా మనస్సును పవిత్రం చేసుకోవాలి.

ఇంతలో తూర్పు దెసను యెఱ్ఱజీరలు సాగినవి. ఏలాగో ఆశ్రమానికి చేరుకొన్నాను. ఈ బాలికకు యింక విద్య చెప్పకుండా వుండడానికి వీలులేదు. సత్యశీలాచార్యుల వారి ఆజ్ఞ అనుల్లంఘనీయము. ఈ దివ్య వృద్ధుడు తన ఆజ్ఞతో నన్ను కట్టివేసినాడు. ఆ బాలికకు చదువు చెప్పమని నన్ను వొప్పించే సందర్భంలో యేవో విచిత్రమైన – భావగర్భితమైన మాటలన్నారు. ఆయన మాట లమోఘములు; సత్య స్వరూపములు. ఇప్పుడు జరిగినదంతా వారికి నివేదించి వారి యాదేశాను సారంగా నడుచుకోవటమే నా ధర్మం అని నిశ్చయించుకొన్నాను.

దర్శించిన మరుక్షణంలో సత్యశీల భిక్షాచార్యుల వారు చిరునవ్వు నవ్వుతూ నన్ను కూర్చుండమని సైగ చేసి, 'నాయనా! నీలో శుభపరిణతి ఆసన్నమయ్యే ధర్మ సమయం వచ్చింది. నీ సంఘ సేవ సంపూర్ణత తాల్చాలి....

"స్వామీ! నేను అవమానం పొందటమే ధర్మసేవా? వేళాకోళమే ఎరుగని తమ మాట యీరోజున యిలాగున చిరునవ్వులతో నిండియున్నదేమి? అది నా కర్మమనుకొని నేను వూరడిలాలి గాక!"

"ఓహెూ! సౌందర్యతత్త్వోపాసీ! నీ చిత్రలేఖన విద్యలో ఒక్క చిన్న దోషమున్నదని నీవు గ్రహించలేదు. కరుణ నీ విగ్రహాల్లో మూర్తించలేదు. సంప్రదాయజనితాలై, మూర్తిలో – రూపకల్పనలో ఏ మాత్రమూ లోటులేని చిత్రాలను యెన్ని కల్పించినా, వాటిలో కరుణ తొణికిస లాడటంలేదు. తండ్రీ! కరుణ నశించిపోయిన మరుభూమియైన నీ ప్రజ్ఞ "ఏకోరసః కరుణఏవ" అనే మాట మరిచిపోయింది. నీ బోధిసత్త్వుల చూపుల్లో కర్కశత్వం వున్నది. యోగం వున్నది. బుద్ధుడు పరమ కరుణామూర్తి తండ్రీ! అహింసా పూర్ణావతారము, చేతిముద్రలలో, భంగిమాలలో, వివిధ స్వరూపములైన దృష్టులలో సంపూర్ణ సత్యమైన దివ్యత్వం లేదు. ప్రాపంచిక రూపమైన దివ్యత్వమే కరుణ, ఈ ముక్కలు నే నన్నానని విషాదపడకు. కొరత పడిన నీ పూజ పరిపూర్తి చెందవద్దా?"

మరిన్నీ కలవరంలో పడి మా విహారం యెలాగో చేరుకొని అక్కడ దివ్యభిక్షుని విగ్రహం మ్రోల నా తలవాల్చి కాంతికై యాచించాను. ఘటికలు జరిగిపోయినవి. వరములా నా మార్గము నాకు ప్రత్యక్షమైంది. "నా బొమ్మలలో కర్కశత్వమున్నదా, ప్రభూ! ఇన్ని సంవత్సరాలూ నా తపస్సులో చంద్ర గ్రహణంలా అసంపూర్ణత్వం వరించుకొనే వుందా?"

"నీ నియమాలని భగవంతుని కర్పించి మానవశీలమందు విశ్వాసంతో చిత్రకళా దీక్ష నెరపవయ్యా" అని నాకు పరమగురుని ఆదేశం వినబడినట్లయింది.

## 5

నన్ను చూస్తూనే మా గురుదేవులు, తాను తా గానట్లు "నువ్వు దేవబాలికవా?" అని ప్రశ్నించినప్పుడు యేదో నిర్వచింపజాలని ఆనందంతో వొణికి పొయ్యాను. సామాన్యమైన మూర్తైనా అనన్యమైన యేదో వెలుగుతో మహాసౌందర్యమూర్తిలా తోస్తారు. ఉత్తమ శిల్పమూర్తి లక్షణాలు ఆయనలో కొరతపడినా కొరత పడినట్లే వుండవు. ఆ రావడం వచ్చినా బుజాలు చేతులతో అదిమిపట్టి ఇటు అటు వూపి, 'ఏల ఈ తప్పిదం చేశా'వని నన్ను శిక్షిస్తే, నా జన్మ పవిత్రమైందని వూహించుకొనేదాన్ని. ఆ క్షణంలో ఆయన దివ్యుడే అయిపోయినాడు. ఆయనవేపు నన్నేదో విచిత్రశక్తి ఆకర్షణ చేసింది. ఇంతలో ఆయన మటుమాయమై పోయినాడు. నా తప్పిదానికి నివృత్తి వున్నదా? ఈ సత్పురుషుని తపస్సు భంగం చేయటానికుద్భవించిన పాపినా నేను? పవిత్రమైన ఆయన నియమానికి భంగం చేశాను. తత్ఫలితంగా, ఏ నియమాలూ లేకుండా చిత్రవిద్య నేర్చుకొనటాని కందరూ రావచ్చునని ఆయన ప్రకటన చేశారు.

ఆ మరునాటినుంచీ ఆయన నన్ను తనకడకే పిలిపించుకొని చిత్రవిద్యలోని రహస్యాలు మహాగాంధర్వంలా ఉపదేశించ మొదలు పెట్టారు. ఆయన రూపమే మారిపోయింది. ఏదో వింతశక్తి చేత అలుముకు పోయినారు. కొద్ది మాటలతో మాత్రమే వినేవాళ్ళ తృప్తిని తీర్చే ఆయన ఆనాటినుంచీ ఝరీవేగంతో, తియ్యని గొంతుకతో ఘటికలు ఘటికలు మాట్లాడేవారు. ఎందుకో? ఏవేవో ప్రశ్నలు నాపై వర్షము కురిపించేవారు. ఆ రోజుల్లో నాకు కలిగిన ఆనందాన్ని వర్ణించలేను. ఆయనకడ సంతతము వుండబుద్ధి. ఆయన పాదాంగుళులను పువ్వుల మొగ్గలను ముట్టినట్లు ముట్టీ కళ్ళకద్దుకోటానికి కాంక్ష. ఉన్నట్లుండి నాకేదో వివశత్వం!

"కల్హారమాలికా! ఈ చిత్రవిద్య పూర్తియైన ఆ వెనక నీవేమి చేయదలచుకొన్నావు?"

"బుద్ధదేవుని చరిత్ర రచించుకొంటూ నా జీవితం పవిత్రం చేసుకోవాలన్న కోరికే నన్ను కదిల్చివేస్తోంటుంది. అంతకన్న నా మొరకు హృదయాని కేమీ తోచదు".

"మానవుల్లోని దివ్యత్వమే కళాస్వరూపమై వెలువడుతుంటుంది. నిశ్చయమే. కాని వివాహమైన వెనక నీ దీక్ష యెట్లా సాగుతుంది కుమారీ?"

"ప్రభూ! నేను వివాహమే చేసుకోను."

"అది అసంభవము. మీ తండ్రిగా రే రాజన్యునికో నిన్ను నివేదిస్తారు. నీవు మహారాణివి కావలసిన యోగమున్నపుడు ఆ యోగాని కెట్లెదురీదగలవు?"

"నా జన్మనంతా తమ పాదాల దగ్గరే విద్య నేర్చుకొంటూ శుశ్రూష చేస్తుంటాను!"

"ఓ వెఱ్ఱిపిల్లా! ఆడవాళ్ళకి సహజమైన మాయమాటను మరిచిపోయినావు కావు."

మా గురుదేవుని మాటలకు నా మనస్సు వికలమై పోయింది. నావి మాయమాటలేలాగు? నా సర్వస్వము గురుదేవుని పాదాలకడ సమర్పించడానికి సిద్ధంగా లేనా?

మా గుహలో మా గురుదేవులు రచించిన బోధిసత్వుని ప్రక్క ఆయన దేవేరిని రచింప సంకల్పించాను. ఆ చిత్రము పూర్తి అయిన వెనుక అది దివ్య భావ పూరితము, చిత్రకళకు దివ్యమణి వంటిది అని గురుదేవులు, తోటి శిష్యులు రసజ్ఞులు మెచ్చుకుంటూ వుంటే నాకు సిగ్గువేసింది.

మా గురుదేవులను ఒక నిమేషమాత్రము విడిచి వుండలేకపోయేదాన్ని. ఆయన నిజంగా జ్యోత్స్నాప్రియులే. ఆయన గుహకు పోయి శయ్యాదు లమరించడం యెంత సంతోషదాయకమై వుండేది!

ఆయన కళ్ళల్లో ఒక్కొక్కడు జ్యోత్స్నలే ఆడేవి. ఒక్కొక్కప్పుడు ఆయన చూపులు మబ్బు పొదివిన నెలబాలుని కిరణాలై మరుగుపడేవి. ఆయన యేదేని కారణాంతరాన నాకు వుపదేశిస్తూ నన్ను ముట్టినప్పుడు నా సర్వరూపమూ కరిగి సుళ్ళుచుట్టేది. అలాంటి దివ్యక్షణాలలో ఆయనా, నేనే – లోకాల హృదయం మధ్య.

## 6

ఈ బాలికా హృదయతత్వం నాకు అర్థం కాలేదు. ఈమె జీవితమే నాకు కొత్త అయినది. ఈమె తక్కిన స్త్రీల కన్న వేరా? ఇక్ష్వాకు రాజవంశజ అయిన ఆనాటి ఆ బాలిక అందము ఆడుపులి అందము. ఇది వెన్నెల రేఖ. వెన్నెలలోని శిరీష కుసుమము. పాలవెల్లువ తరగ. ఈమె అందంలో యేమి వంక వున్నది? నిజముగా ఈమె హృదయం పవిత్రమైనది. ఓహో! కల్హారమాలికయా ఈమె?

ఈ బాలిక నన్ను విడిచి ఒక్క క్షణం వుండదు. ఆమె స్వయంగా పచనం చేసి విచిత్ర రుచుల భోజనము కొనివచ్చేది. నా పాదసంవాహనం చేయ సిద్ధపడిన నాడు ఆమె నా పాదాల స్పృశించినపుడు నాలో విద్యుల్లతికలు అలుముకు పోయినవి. ఆమెను నా కౌగిలిలో అదిమివేయక ఏలాగు నిగ్రహించుకోగలను? నేను అధఃపతి తుదను కావడం లేదుగదా?

ఆమె పెదవులు జేగుర్లు నిండి అతిలలితాలైన చిగుళ్ళు. ఆమె కళ్ళు యెంత పవిత్ర కాంతుల్ని సేకరించుకొన్నవి! స్వచ్ఛమైన కదలిక లేని చెరువు నీటిలో ప్రతి ఫలించిన తారకా కాంతులవి.

ఆమె అందము నిర్మల నీలాకాశంలో తేలిపోయే తెల్లనిపక్షి. ఆమె అందము ఆ పక్షి గొంతుక లోంచి విడిపోయి ఆ నీలంలో తొణికిసలాడే పాట. ఆమె అందము పండిన పంటలోని పచ్చదనములోని పరిమళము. ఆమె అందము వెన్నెల ప్రసరింపు జిడ్డుగల తీపి. అయ్యో! ఆ అందం నా దేహంలో నా హృదయంలో, నా ఆత్మలో లీనం చేసికొనక నా జన్మ వృధా.

ఆమె గుహలో ఒంటిగా చిత్రించుకునే కాలంలో ఆమెను – కల్హారమాలాదేవిని కలుసుకోడానికి వెళ్ళాను. భగవానుడా! అతి కోమలమైన ఆమె జీవితాన్ని పరీక్ష చేయడానికి వెళ్ళే నేను అందమయిన రెక్కలతో పూలలో ఎగిరే సీతాకోక చిలుకను పొంచుండి కబళింపబోయే ఊసరవెల్లిలా వున్నాను. చిత్రించుకొంటూ వున్న ఆ బాలిక ప్రజ్ఞాపరిమితలా వున్నది.

"ఏమిటీ, నువ్వీరోజు చిత్రించుకుంటున్నది?"

"ఉన్న ఒక్క వస్త్రమూ బుద్ధదేవునికి అర్పిస్తున్న ఆ పవిత్ర చరిత్ర చిత్రము రచిస్తున్నాను."

"ఏమిటీ? నన్ను చూడనీ, ఓహో! ఎంత అద్భుతసృష్టి! బాలికా! నీ కింకా శుశ్రూష అవసరము లేదు. నీ విద్య పూర్తి అయింది."

ఈటెదెబ్బ తిన్న గువ్వలా ఆమె వణికిపోయింది. "ప్రభూ! నన్ను మీరు ప్రేమించడం లేదా? నాకై నియమాలన్నీ వదులుకొని నన్ను ఆమ్రవల్లి కన్న ధన్యురాల్ని చేసి ఒక్కసారిగా నన్ను అవసరములేని పుష్పంలా విసరి పారవేస్తారా?"

"నీకు ప్రేమను గురించి ఏమి తెలుసును?"

"ప్రభూ! ఆ దివ్యవరము ప్రసాదింపబడినప్పుడు ఏమి తెలుసుకోవాలి?"

"వెఱ్ఱిదానా? చటుక్కున 'నన్ను ప్రేమించడం లేదా' అని ప్రశ్న వేశావు. నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా?"

"వెన్నెల అంటే కలవలకు ప్రేమా? సూర్యకాంత పుష్పము సూర్యుణ్ణి కోరుతుందా? పుష్పము తేనెను కోరుతుందా? ప్రభూ! నన్ను స్వీకరించుకోండి. నేను మీ ప్రేమభిక్ష లేనినాడు హోమంలోని నుసినికదా!"

"నేను ముప్పదియైదు ఏళ్ళ ముసలివాడను. నువ్వు నవయౌవనంలోని పదునెనిమిదేళ్ళ మిసిమి పడుచువు."

"ప్రేమకు ఈడుందా ప్రభూ?"

"నేను ఈ క్షణం నీ దేహాన్ని కోరితే నీ శీలం నలిపివేసుకొని నా కాంక్ష తీర్చగలవా?"

"ప్రభూ! మీ ప్రేమ, మీ దివ్యప్రణయము ఆశిస్తున్నాను. నా నాశనానికి వెఱవను.

మీకు అర్పణ చేసుకోవడమే నా జీవితానికి పరమ మోక్షము. ఇదిగో నా మూర్తి! నన్ను మీ హృదయానికి గాఢంగా అదుముకోండి. నా విద్యలు మీవి, నా కలలు మీవి, నా ఆత్మ మీది."

నా దేహం వణికిపోయింది. ఎంత పవిత్ర జీవన ప్రవాహము! ఆమెను తనివోవ బిగియార నా బాహువుల అదిమివేసి కౌగలించుకొన్నాను.

"కల్హారమాలికా!నన్ను వివాహం చేసుకోగలవా? నా ఆత్మేశ్వరీ? ఇట్టి మహదానంద సమయం కోసమేనా జినదేవుడు ఆనాడు నన్ను రక్షించినాడు. నువ్వు నా కోసమే ఇన్ని సంవత్సరాలు యెదురు చూస్తూ వున్నావా? ఈ నీ దివ్యమూర్తి నాదేనా? ఈ అద్భుతమైన మోము, భారమైన ఈతలకట్టు, ఈ దివ్యలోచనాలు, శ్వేతతారాదేవి చేతిలోని కమలాలైన నీ ఈ పవిత్రవక్షాలు, నీ ఈ పరమ దేహకాంతీ – నావేనా? నువ్వు నాదానవేనా? జినప్రభూ! నీ కరుణ ఇదేనా! రా! ఆత్మేశ్వరీ, రా! మోకరిల్లు. పరమశ్రమణకుడే మనని ఆశీర్వదిస్తాడు!"

"ఆ ప్రభుని దాసుడనైన నేనున్నూ మిమ్మల్ని ఆశీర్వదిస్తున్నాను – దివ్య దంపతులైన మిమ్ము" అని సత్యశీలాచార్య గురుదేవులు. లేచి ఆయనకడ మోకరిల్లాము.

# కనుపర్తి వరలక్ష్మమ్మ

**(1896 - 1978)**





**క**థా రచయిత్రి, నవలలూ, వ్యాసాలూ, నాటికలూ వ్రాశారు. స్త్రీ జనాభ్యుదయం, సాంఘిక సంక్షేమం కొఱకు తమ జీవితాన్ని అంకితం జేసి అవిరళంగా కృషి చేశారు. వీరి కథలు సూటిగా, సరళంగా హృదయానికి హత్తుకొనేట్టుగా వుంటాయి. బాపట్లలో ఉండేవారు.

**రచనలు :** వసుమతి (నవల) శారద లేఖలు, బాలనీతి కథావాళి, జ్యోతి (నాటిక) మొదలైనవి.

# మా వూరు

వెంకట రమణయ్య పంతులు రిటైరు కాగానే, యెక్కడ మకాం పెడదామనే ఆలోచనలో పడి, భార్య బుచ్చిలక్ష్మమ్మ వద్ద ప్రస్తావన తెచ్చాడు.

“ఎక్కడేమిటి. రామవరం వెళ్ళి అక్కడే వుందాము” అన్నది తక్షణమే బుచ్చి లక్ష్మమ్మ.

“వెధవ రామవరం, పాతికేండ్లనుంచీ బస్తీల్లో వుంటున్నా, నీకా పల్లెటూరి మీద మమత పోదేం” అన్నాడు, రమణయ్య పంతులు.

“ఏమోనబ్బా. నాకు మా వూరు స్వర్గంలా వుంటుంది” అన్నది బుచ్చి లక్ష్మమ్మ.

“ఏడిసినట్టే వున్నది. ఊళ్లో రైలు స్టేషనా పాడా!” అన్నాడు పంతులు.

“రైలు స్టేషన్ లేకపోతేనేం. గంట గంటకు బస్సులు నడుస్తున్నాయట” అన్నది బుచ్చిలక్ష్మమ్మ.

“ఒక పేపరు రాదు. ఒక రేడియో లేదు. ఏ వస్తువు కావలెనన్నా ఎనిమిది మైళ్ళ దూరాన వున్న బస్తీకి పోవాలె. అయినా అక్కడ నీ వాళ్లెవరున్నారు? మీ తల్లి దండ్రులు లేకపోయిరి. అన్నదమ్ములూ లేకపోయిరి. చెల్లె లెక్కడో వుండె. ఇంకా నీ కక్కడేమున్నదని మా వూరు పోదామంటావు” అన్నాడు పంతులు.

“మా నాన్నగారు యిచ్చిన ఇల్లు లేదండీ; పోయి ఆ ఇంట్లో వుందాము” అన్నది బుచ్చిలక్ష్మమ్మ.

“ఆఁ అంతే. పడిపోతూ పోతూవున్న ఇల్లున్నదని పోవాలి. అంతే!” అన్నాడు వెక్కిరింపుగా పంతులు.

“ఇల్లొక్కటేమిటి? మా ఊళ్ళో ఇప్పుడన్నీ ఉన్నాయిట. మొన్న మా పినతండ్రి మనుమడు రామకోటి వచ్చి చెప్పలేదూ” అన్నది బుచ్చిలక్షమ్మ.

“ఏమి వున్నాయని చెప్పాడు?”

"వాళ్ళు బ్యాటరీతో రేడియో పెట్టుకున్నారట, పేపర్లూ వస్తున్నాయట" అన్నది బుచ్చి లక్ష్మమ్మ.

"ఆఁ అన్నీ ఉన్నాయట!" అన్నాడు పంతులు విసుగ్గా.

మళ్ళీ మళ్ళీ వెక్కిరించేప్పటికి బుచ్చి లక్ష్మమ్మకు పుట్టెడు దుఃఖం వచ్చింది.

"దివాణం అంత కొంప దీపం పెట్టే వాళ్ళు లేక అధ్వాన్నమైపోతున్నది. మీకు ఎంత సేపటికి నలుభై యిలు యాభైలు అద్దెలు పెట్టీ ఈ ఊళ్ళో ఉందామన్న మాటే గాని లక్షణంగా మామగారు యిచ్చిన ఇంట్లో వుండి చేమ చెట్టూ చూచుకుందామన్నమాట లేదు. మా నాన్న ఉండగా ఆ ఇల్లు ఎంత వైభవంగా ఉండేది!" అని కళ్ళ నీళ్ళు పెట్టుకున్నది, బుచ్చి లక్ష్మమ్మ.

"ఉశ్, ఏడవబోకు! ఆ ఊరు పోతేనే గాని నీకు ఆ కష్టాలు తెలియవు. ఈ ఊళ్లో ఇట్టే మర తిప్పితే బొయ్యిమంటూ ఏనుగుతొండం లాగా నీళ్ళ ధార వచ్చి పడుతుంది. అక్కడే మున్నది, చేతులు పడేటట్టు తోడుకోవాలె".

"ఏమంత తోడుకోవాలేమి, బారెడు తాడైతే చాలు."

"ప్రొద్దు గూకితే ఊరంతా అంధకారమయం. ఇక్కడ ఏ రాత్రి చూచినా పట్టపగలే. అక్కడ బైటికి పోవాలంటే ఎంత దూరమైనా చచ్చినట్టు నడిచిపోవాలె. ఇక్కడైతే సిటీబస్సులు, సైకిల్‌రిక్షాలు, జట్కాలు, ఎప్పుడు కావాలంటే అప్పుడే దొరుకుతాయి– భూమిమీద అడుగుపెట్టి నడవాల్సిన పనిలేదు. ఇక రైలా, అయిదు మార్గాలకు కూడలి. ఏ వూరైనా క్షణంలో పోయిరావచ్చు" అన్నాడు వెంకట రమణయ్య పంతులు.

"అవునులెండి. ఇక్కడ ఎన్ని మైళ్ళ దూరాన వున్నా ఊళ్ళో వున్నట్టే నంటారు. నిజానికి ఈ బెజవాడలో ఉన్నామన్న పేరేగాని రైలుస్టేషన్ మనకెంత దూరం చెప్పండి?" అన్నది బుచ్చి లక్ష్మమ్మ.

"అయితేనేం, నీవు నడిచిపోతున్నావా? ఈ బస్తీ సౌకర్యాలు అక్కడెట్లా వస్తాయి" అన్నాడు పంతులు.

"అబ్బో! ఏమి సౌకర్యమో సౌకర్యము! మరబియ్యము! మరనీళ్ళు! మరదీపాలు! మర భాగోతాలు! పైగా వేళాపాళా లేకుండా చెవులు తూట్లు పడేటట్టు మరపాటలు. ఎత్తిపోతున్నది సుఖం! నిజంగా ఈ బస్తీలో ఉండేవాళ్ళు గూడా మరమనుషులే. ఆ యంత్రాల్లో మరలు ఎట్లా తిరుగుతూ వుంటాయో ఈ బస్తీ మనుషులు గూడ క్షణక్షణానికి గడియారాలు చూచుకుంటూ అట్లా తిరుగుతూ ఉంటారు' అన్నది బుచ్చిలక్ష్మమ్మ.

పంతులుకు ఫక్కున నవ్వు వచ్చింది. నవ్వుతూ నవ్వుతూ "సరస్వతీదేవి నిన్ను కటాక్షించి ఏ రాత్రో నీ జిహ్వాపై బీజాక్షరాలు వేసినట్టున్నదే! కాళిదాసులాగా కవిత్వం మాట్లాడుతున్నావు" అన్నాడు.

"అబ్బ! మీ యెగతాళీలకేం లెండి! నా వానాకాలపు చదువుకు కవిత్వం గూడానా. మీరేమన్నా చెప్పండి. పల్లెటూరి సౌఖ్యం ఈ ఊళ్ళో రమ్మన్నా రాదు. చిక్కని పాలు, గట్టిపెరుగు, కమ్మని నెయ్యి, అప్పుడు పాదున కోసుకువచ్చిన కాయలు– చేలో పండిన ధాన్యం, స్వయంగా దంపించుకున్న బియ్యము – ఏ పదార్థం చేసుకున్నా యెంత రుచిగా వుంటుంది? ఈ దిక్కుమాలిన బస్తీల్లో తాజా సరకంటూ ఉంటుందీ? ప్రతిదీ ఎండబెట్టి, మగ్గబెట్టి తినడమేగా! అప్పటికప్పుడు చెట్టున కోసిన జామపండ్లు తినేవాళ్ళం, ఎంత రుచిగా ఉండేవి? వరికంకులు పనలమీద కోసి తెప్పించి రాలగొట్టించి ఆ పచ్చివడ్లు మా అమ్మ అటుకులు కొట్టించేది. ఎంత తియ్యగా ఉండేవి, ఆ అటుకులు!" అన్నది బుచ్చి లక్ష్మమ్మ గుటకలు వేస్తూ.

"సుగుణాకార జన్మభూమి సుఖమెట్టిదయా!" అన్నాడు వెంకటరమణయ్య పంతులు.

"ఏమోనండీ, మీ రెంతైనా నవ్వండి. మా రామవరం మీద ప్రేమ నాకు తగ్గనూ లేదు, తగ్గేంత విశేషాలు నేను ఈ వూళ్లో చూడనూ లేదు" అన్నది బుచ్చిలక్ష్మమ్మ.

ఇంతలో యీ భార్యా భర్తల సంభాషణ వింటూ పక్క వాటాలో వున్న శారదాంబ తటాలున వచ్చి "ఇన్నాళ్ళు బస్తీ సౌఖ్యాలు అనుభవించినా, మా పిన్ని గారికి పల్లెటూళ్ళ మమకారం చెక్కుచెదరలేదండీ, బాబుగారూ!" అన్నది.

"అదేనమ్మా, నాకూ ఆశ్చర్యంగా వున్నది" అన్నాడు రమణయ్యపంతులు.

"అసలు ఆ పల్లెటూరు వెళ్ళితే తోచనేతోచదు. మా పిన్నిగారికి యెట్లా బాగా వుంటుందో! ఒక్కపూట ఉంటిమా, ఒడ్డు కుడుచుకున్నట్టుగా వుంటుంది. మా మేనమామగారి ఊరు వట్టి పల్లెటూరు. ఆ వూరెప్పుడైనా కర్మం చాలక వెళ్ళామంటే పిచ్చియెత్తినట్టుండేది. ఏమిటో ఊళ్ళోకి పోయినవాళ్ళనల్లా ఎగాదిగా చూస్తూ ఏ వూరినుంచి వస్తున్నారు? యెవరింటికి వస్తున్నారని అడిగే ఆ మనుష్యులను చూస్తే బలే చికాకు వేసేది. మనుషులకు ఏమీ ఝరీ వుండదు. జాము ప్రొద్దెక్కినా నోట్లో చుట్టో, పల్లుదోము పుల్లో పెట్టుకుని తిరుగుతూ వుంటారు మొగవాళ్ళు. ఆడవాళ్ళో బిందెతీసుకొని చెరువుకు వెళ్ళడమో, తట్ట తీసుకుని పశువుల పేడకు వెళ్ళడమో, తప్పితే లక్షణమైన స్త్రీగాని పురుషుడుగాని కనిపించరు. దొడ్లో కాస్తేనే, కాయ కూరా, పాడివుంటేనే పాలూ పెరుగూ, అంతే. కొనుక్కుందామంటే చస్తే దొరకవు. ఇక ఆ వూరు నుంచి వద్దామంటే మన వశం కాదు. మా మామయ్య దయతలచి తాను పంపదలుచుకొని బండి కట్టిస్తే తప్ప లేకపోతే మనకై మనం రాలేం. అందుకే పల్లెటూళ్ళంటే నాకు మహా తలనొప్పి సుమండీ" అన్నది శారదాంబ పకపకా నవ్వుతూ.

"అదేనమ్మా, నాకూ అంతే!" అన్నాడు పంతులు.

"అయితే, పిన్నిగారూ! మీ ఊళ్ళో బ్రాహ్మణ ఇండ్లున్నాయా? మా మామయ్యగారి ఊళ్ళో వాళ్ళు ఉండేవాళ్ళు కాదులే" అన్నది శారదాంబ.

"మా ఊరికేమమ్మాయి. మా ఇల్లొకటీ, మా పినతండ్రిగారి ఇల్లొకటీ, పురోహితుడు పున్నయ్యశాస్త్రిగారి ఇల్లొకటి. విష్ణార్చకులు రంగాచార్యులగారి ఇల్లొకటి, శివార్చకులు భద్రయ్యగారి ఇల్లొకటి, బడిపంతులు గోపాలంగారి ఇల్లొకటీ, మొత్తం ఆరు ఇండ్లు ఉండేవి" అన్నది బుచ్చిలక్ష్మమ్మ.

"మా మామయ్యగారి ఊళ్లో, వాళ్ళూ లేరు! మా మేనమామ భార్య, ఏ నందికేశుడి వ్రతమో చేసుకోవాలంటే, మా వూరు వచ్చి చేసుకొనేది!" అన్నది శారదాంబ.

"మాకు అటువంటి యిబ్బంది లేనేలేదు. మా వాళ్ళే మాకు చాలు– మాది కంచెంత బలగం గడప పచ్చన చేసుకున్నామంటే బోలెడు మంది బంధువులు వచ్చేవాళ్ళు. ఎన్ని నోములైనా మా ఇంట్లోనే చెల్లేవి" అన్నది బుచ్చిలక్ష్మమ్మ.

"ఇక ఈ కథలు చెప్పడానికి పూనుకుంటే మీ పిన్నికి రాత్రింబగళ్ళు చాల"వంటూ, వెంకట రమణయ్య పంతులుగారు చల్లగా బుజాన ఉత్తరీయం వేసుకొని వీధిలోకి వెళ్ళారు.

"మీ బాబుగారి మాటలకేమిగాని శారదాంబా! నోముగాని వ్రతంగాని, ఇంట్లో వాళ్ళమటెకే చేసే అలవాటు మా అమ్మకు లేనేలేదు. నోముకెంత చేస్తామో అంతకు యిబ్బడిగా ఊళ్ళో పందేరానికి చేసేది. ఒకరకున్నది ఒకరికి పెట్టుకోడమూ, ఒకరి కొకరు సాయపడడమూ, ఒకరి కష్టానికొకరం ఆదుకోవడం, అట్లా ఎంతో సమిష్టిగా వుండేవాళ్ళం. ఎప్పుడైనా ఒకమాటు గుంటూరు నుంచి మా పింతల్లీ వాళ్ళూ వచ్చేవాళ్ళు. వాళ్ళూ మీవలెనే మా గ్రామ మర్యాదలు చూచి నవ్వేవాళ్ళు. ఒకమాటు మా చిన్నపిన్ని వచ్చింది. ఆ రోజుల్లో ఒకనాడు ఒక సాలెవాళ్ళ అబ్బాయి త్రోవను పోతూవుంటే 'ఆ నారాయణనుయిట్లా పిలమ్మా!' అన్నారు మా నాన్నగారు; 'నారాయణన్నయ్యా! నారాయణన్నయ్యా! మా నాన్న పిలుస్తున్నార'ని నేను ఆ అబ్బాయిని కేకవేసి పిలిచాను. అది చూచి అతను వచ్చి వెళ్ళాక 'ఒసే, ఆ సాలె అబ్బాయి నీకు అన్నయ్యంటే?' అని మా పిన్ని విరగబడి నవ్వింది. నాకు బలే కోపం వచ్చి, "నాన్నా! నాన్నా! నారాయణను అన్నయ్యా అని పిల్చానని పిన్ని చూడు యెట్లా నవ్వుతున్నదో!" అని మా నాన్నతో చెప్పాను. 'దాని ముఖంలే!' అయినవాళ్ళనే 'ఏమండీ, గీమండీ' అని పిలుచుకునే ఆ బస్తీవాళ్ళకు మన గ్రామ మర్యాదలేమి తెలుస్తాయ్, పొమ్మన్నారు మా నాన్న."

బుచ్చిలక్ష్మమ్మ గొంతు డగ్గుత్తిక పడ్డది. కండ్ల నిండా నీళ్ళు వచ్చాయి.

"పిన్నిగారు ఊరుకోండి. అంత సుఖం అనుభవించారు కనుకనే ఆ గ్రామమంటే అంత ఆపేక్ష పడుతున్నారు" అన్నది శారదాంబ జాలిగా.

## 2

బుచ్చిలక్ష్మమ్మ ప్రోద్బలంవల్ల ఇంటర్ చదువుకుంటున్న కుర్రవాడు చలపతి రావును హాస్టల్లో ఉంచి చిన్నపిల్ల సుబ్బులును వెంటబెట్టుకొని వెంకటరమణయ్య పంతులూ, బుచ్చిలక్ష్మమ్మ రామవరం వెళ్ళారు. తల్లిదండ్రులు పోయిన తరువాత పాతికేళ్ళకీ మధ్య బుచ్చిలక్ష్మమ్మ రామవరం వెళ్ళలేదు. ఆమెకూ, ఆమె చెల్లెలికి వాళ్ళ తండ్రి యిచ్చిన పొలం కొంత ఉంటే రైతులే వాళ్ళ ఉన్నవూరు వచ్చి మక్తాయిచ్చి పోతున్నారు – అంతగా అవసరం వస్తే రమణయ్యపంతులో, ఆయన తోడల్లుడో వెళ్ళి రావడం తప్ప ఆడవాళ్ళు వెళ్ళడమే లేదు – బుచ్చిలక్ష్మమ్మకు వాళ్ళ ఊరి మొగదలకు వెళ్ళేటప్పటికి యేదో కొత్త వూరుగా కనిపించింది. తిన్నగా తమ తండ్రిగారి ఇల్లు చేరుకున్నారు.

ఆ ఇల్లు చూస్తే బుచ్చిలక్ష్మమ్మకు పట్టరాని విచారం కలిగింది. తమ బాల్యంలో మహావైభవోపేతంగా వుండే ఆ ఇల్లు, గోడలు పడిపోయి వసారాలు క్రుంగిపోయి చాలా శిథిలావస్థలో వున్నది. దాన్ని చూస్తే పూర్వ విషయాలన్నీ జ్ఞాపకం వచ్చాయి. ఎంతోసేపు అరుగుమీద కుప్పలా కూలి కూర్చున్నది.

“ఏమిటి అట్లా కూర్చుంటావేం మా వూరో మా ఊరో అని వచ్చిందాకా వేధించావే, వచ్చిన తర్వాత దిగాలుపడి కూర్చున్నావేం? లేచి ఇల్లు బాగుచేసుకొనే ప్రయత్నం చేయక” అని వెంకటరమణయ్య పంతులు తొందర చేశాడు.

ఆ జీర్ణగృహంలో ఒక వీధి బడిపంతులు అద్దెగిద్దె లేకుండా ఉంటున్నాడు. వీరు కూడా ఒకవైపు బాగుచేసుకుని ఆ ఇంట్లోనే వండుకుతినే వసతి చేసుకున్నారు.

పనిమనిషి లేకుండా అన్ని పనులు తానే చేసుకోవలసిరావడమూ, బావిలో నీళ్ళు చేదడమూ, పాలూ పెరుగూ దొరక్కపోవడమూ, అన్నీ కష్టాలుగానే కనిపించాయి బుచ్చిలక్ష్మమ్మకు.

ఊళ్ళో చూద్దామంటే అందరూ కొత్తవారుగానే కనిపించారు. – ఈమెతో మాట్లాడినవారే లేకపోయినారు! ఆమె ఏయే మధుర స్మృతులతో వచ్చిందో అది ఒక్కటీ అనుభవానికి రాలేదు. ఇది మా వూరు కాదనిపించింది ఆమెకు. కరణం రామకోటీ గారిని గురించి విచారించగా పిల్లల చదువుల నిమిత్తం ఆడవాళ్ళనూ పిల్లలనూ బస్తీలో కాపరం పెట్టి తాను మాత్రం వస్తూ పోతూ కాలక్షేపం చేస్తున్నాడని తెలిసింది. అయ్యో! ఇరవైయేళ్ళలో మా రామవరం ఎంత తారుమారై పోయింది – అనుకున్నది బుచ్చిలక్ష్మమ్మ

## 3

రామవరం మునుపటి రామవరంగా లేదు.

గ్రామం పెరిగిపోయింది.యూనియన్ పంచాయతీ బోర్డు యేర్పడ్డది. అక్కడక్కడ

గుడ్డిదీపాల లాంతరు స్థంభాలు, మట్టి రోడ్లు వెలిశాయి. పూరిగుడిసెలకు పన్నులు పడ్డాయి. ఊరిమధ్య మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద రేడియోపెట్టి సాయంత్రవేళ వార్తలు వినిపిస్తున్నారు. పెద్ద బజారులో మంగలిషాపు, చాకలిషాపు, కాఫీహోటలు ప్రత్యక్షమైనాయి. బస్తీనుండి సైకిళ్ళతో వచ్చి రోజురోజూ దినపత్రికలు కోరినవాళ్ళకు పడేసిపోతున్నారు. గ్రామానికి అలంకారంగా ఒక గ్రంథాలయము పఠనమందిరము కూడా ఏర్పడ్డాయి. ఎటుచూచినా బస్తీ పోకడలే కనిపిస్తున్నాయి. పూర్వం గ్రామీణులలో వున్న అమాయికత్వమూ, అనాగరికత్వమూ, సౌహార్థత్వమూ మచ్చుకైనా కనపించడం లేదు.

పూర్వం ఒకరినొకరు అక్కయ్య, అన్నయ్య, వదెనె, బావ, పిన్ని, బాబాయి, మామయ్య, అత్తయ్య, తాతయ్య, జేజెమ్మ, అంటూ పిలుచుకునేవాళ్ళు. 'ఏమండి, రాండి పోండి' అంటూ మర్యాదు పిలుపులు పిలుచుకుంటున్నారు. వీరితోబాటు గ్రామప్రజలు కాంగ్రెసుపార్టీ అని, కమ్యూనిస్టు పార్టీ అని, సోషలిస్టు పార్టీ అని బహుముఖాలుగా చీలిపోయినారు.

మూడవనాటి సాయంత్రం కరణం రామకోటి ఊరినుంచి వచ్చి బుచ్చిలక్ష్మమ్మనూ, రమణయ్య పంతులునూ చూడడానికి వచ్చాడు. రమణయ్యపంతులు అతన్ని కూర్చోమని మర్యాదచేసి ఆ రాత్రి తమ యింట్లోనే వంట చేస్తారు, భోజనం చెయ్యమన్నారు.

“అఁ- ఎందుకు నేను చేసుకుంటా లెండి. అన్నీ వున్నాయి” అన్నాడు కరణం రామకోటి.

అట్లా వల్లగాదని బుచ్చిలక్ష్మమ్మ గట్టిగా చెప్పి తానే వంట చేసింది.

రాత్రి భోజనాలైనాక వీధి అరుగుమీద కూర్చుండి యిష్టాగోష్టిగా మాట్లాడుతూ “ఏమోయి మీ వూరు పూర్తిగా మారిపోయిందే” అన్నారు రమణయ్య పంతులు గారు.

“అవునండీ మామయ్యగారు! బస్తీ అంశలన్నీ మా వూరికిగూడా పట్టినాయండీ” అన్నాడు రామకోటి.

“మీ ఊళ్ళోనూ రాజకీయ పార్టీలన్నీ గూళ్ళు కట్టుకున్నట్టే ఉన్నాయే” అన్నాడు. పంతులు.

“అఁహాఁ. మామయ్యగారు మూడు రోజుల్లో గ్రామ వ్యవహారమంతా ఆకళింపు చేసుకున్నారే” అన్నాడు కరణం.

“ఆకళింపు కాకేమవుతుందోయి. నిన్న మూడు పార్టీల వారు వోటర్లుగా చేరండని దరఖాస్తు ఫారాలు తెచ్చుక కూర్చున్నారు. అయితే నే నెవరికీ చేరలేదనుకో. గ్రామంలో చీలికలకు తక్కువలేదని తెలిసింది” అన్నాడు పంతులు.

‘‘అయ్యో! చీలికలు లేని గ్రామమున్నదండీ ఇప్పుడు? ఎలక్షన్లు ఎప్పుడు

వచ్చాయో అప్పుడే గ్రామాల సఖ్యత, సామరస్యం చెడిపోయింది” అన్నాడు కరణం.

“అవునయ్యా! ఇదేదో ప్రజాస్వామికం అని మురుసుకుంటున్నాము గాని వాళ్ళ వాళ్ళ కొంపలోనైనా ఏ ఇద్దరు ఒక్కమాటగా ఉండే అవకాశం శూన్యమైపోయింది.”

ఇంతలో వంటయింటి పనులన్నీ చక్కబెట్టుకొని వచ్చిన బుచ్చిలక్ష్మమ్మ “రామకోటీ! ఇప్పుడు ఈ ఊరి మున్సబెవరు? రామస్వామి అన్నయ్యా, కోటమ్మ వదినే బాగావున్నారా?” అన్నది.

“రామస్వామిగారు పెద్దవాడైనాడు. ఆయన కొడుకే మునసబీ చేస్తున్నాడు. కోటమ్మగారు గతించి నాలుగేండ్లయింది. అప్పటినుంచి ఆయన మరీ దిగాలు పడిపోయినాడు. ఇప్పటికీ మనమంటే ఆయన కెంత ప్రేమ! ఒకమాటు చూచిరా అత్తయ్యా!” అన్నాడు కరణం.

“పేరిసెట్టి మామయ్యో!” అన్నది బుచ్చిలక్ష్మమ్మ

“అతను పోయి చాలా రోజులైంది. ఆయన భార్య మాత్రం కాళ్ళు కీళ్ళు స్వాధీనం తప్పి మంచాన పడివున్నది. కొడుకులిద్దరూ వ్యాపారం చేసుకుంటున్నారు. కూతురు అత్తవారింట్లో వున్నది” అన్నాడు కరణం.

“ఇరవై యేండ్లలో యెంత మార్పు వచ్చిందీ!” అన్నది బుచ్చిలక్ష్మమ్మ.

“ఇరవై యేండ్లేమిటి, ప్రపంచం క్షణక్షణానికీ మారిపోతుంటే” అన్నాడు రమణయ్య పంతులు.

“మా అత్తయ్య వట్టి పూర్వకాలపు మనిషి” అన్నాడు రామకోటి.

“అవునయ్యా! నా కీకాలపు పద్ధతులేమీ తెలియవు అన్నది బుచ్చిలక్ష్మమ్మ.

“తెలిస్తే ఈ ఊరు వస్తానని పట్టుపట్టే దానవేనా?” అని నవ్వాడు రమణయ్య పంతులు.

రామకోటి గూడా నవ్వాడు.

“నవ్వండయ్యా! నవ్వండి. రామవరం ఇట్లా మారిపోయిందని నాకేమి తెలుసూ! అయినా ఒక ఆదివారం సెలవు వస్తే మా గుంటూరు పోయిరావలెనని పరిగెత్తేవారే, మా ఊరిమీద నాకు మాత్రం ఆపేక్ష వుండదూ?” అన్నది బుచ్చిలక్ష్మమ్మ

“మీ ఊరిమీద నీకు ప్రేమవున్నది. సరే ఊరికి గూడా నీమీద ప్రేమవుంటే బాగుండును”అన్నాడు పంతులు నవ్వుతూ.

“మీ రెంత బస్తీ వారైనా ఆ మాత్రం తెలుసుకోలేనను కుంటున్నారా ఏమిటి? ఊరికెట్లా ప్రేమవుంటుంది. ఊరిలో ప్రజలకు ప్రేమలుంటాయిగాని?” అన్నది బుచ్చిలక్ష్మమ్మ

“ఆహో, మా అత్తయ్య పరవాలే. తోటా తిప్పికొట్టేసింది” అన్నాడు రామకోటి నవ్వుతూ.

“అసలు పల్లెటూరు గడుసుదనాలు మాకుండనే వుండవు” అన్నాడు పంతులు. ముగ్గురూ నవ్వుకున్నారు.

# 4

బుచ్చిలక్ష్మమ్మ రామకోటి వచ్చిన మర్నాడు మధ్యాహ్నం భోజనాలు కాగానే ఆయన తోడిచ్చిన మోతాదును వెంటబెట్టుకొని రామస్వామి అన్నయ్యగారి ఇంటికి వెళ్ళింది. రామస్వామి కొమారుడు గోపాలస్వామినాయుడు వాకిట్లో పచార్లు చేస్తూ మోతాదును చూచి ఎవరామె అన్నాడు.

"నాకు తెలియదండి. మీ నాయనగారిని చూపమని కరణంగారు పంపితే పిలుచుకొని వచ్చానండీ" అన్నాడు.

తాతయ్యను చూడటానికి వచ్చిన యీ బాపనమ్మో రెవరా అని మనుమలు మనుమరాండ్రు విస్తుపోయి నిలిచి చూస్తున్నారు.

బుచ్చిలక్ష్మమ్మ సరాసరి రామస్వామి గదిలోకి వెళ్ళింది. రామస్వామి శక్తి శౌర్యాలు వుడిగి మంచంలో పడుకొని వున్నాడు. తల నెరిసింది. ముఖం ముడతలు పడ్డది. కండ్లు లోతుకు దించుకొని పోయినాయి. దృష్టిలో మాంద్యం ఏర్పడ్డది. గిరజాల జుట్టుతో ఒత్తయిన మీసాలతో, దర్పంగల చూపుతో అతి ఠీవిగా వుండే యువకుడైన ఆ రామస్వామి యెక్కడ! దీనానుడై అస్తంగత భాస్కరునివలె వున్న ఈ రామస్వామెక్కడ? మానవుల కెన్ని దశలు! చెపితే గాని గుర్తుపట్టలేనంతగా మారిపోయినాడు రామస్వామి. బుచ్చిలక్ష్మమ్మ రిచ్చపోయిన చిత్తంతోనే –

"రామస్వామి అన్నయ్యా!" అన్నది.

ఆర్ద్రహృదయంతో పిలిచిన ఆ కంఠం ఎప్పుడో విన్నదే? పాతిక ముప్పదేళ్ళనాటి గాథలెన్నో అందు నినదించాయి.

రామస్వామి మంచంమీద పడుకున్నవాడు దిగ్గున్న లేచికూర్చుండి ముఖంలో ముఖం పెట్టి పరిశీలనగా చూచాడు.

"పెద్దమ్మాయి నీవా! పెద్దమ్మాయి నీవా! ఎన్నాళ్ళకు చూచానమ్మా! ఎన్నాళ్ళకు చూచానమ్మా. ఎప్పుడొచ్చావు చెల్లీ!" అన్నాడు. వెంటనే దుఃఖం పొర్లివచ్చింది.

"కూర్చోమ్మా కూర్చో" అని పక్కనున్న ముక్కాలపీట చూపించాడు.

బుచ్చిలక్ష్మమ్మ ముక్కాలిపీట మీద కూర్చుని తాను తెచ్చిన కలకండ పొట్లాం రామస్వామి కిచ్చింది.

"అమ్మాయి! ఈ అన్నయ్య మీద ఎంత ప్రేమమ్మా నీకు" అన్నాడు రామస్వామి

ఏ వూరులో వుంటున్నారో, ఈ వూరెందు కొచ్చారో, పిల్లలెందరో, ఎవరేమి చేస్తున్నారో, ఆమె చెల్లెలు రామలక్ష్మమ్మ ఎక్కడున్నదో అన్నీ విచారించాడు తన నిస్సహాయ స్థితి చెప్పుకున్నాడు.

"పెద్దమ్మాయి, మీ వదినె లేదుగదా. దానితోనే నా శకం పోయింది. అది వుంటే నీవు వచ్చినందుకు ఎంత సంతోషించేది. ఎంత ఘనంగా మర్యాద చేసేది. అమ్మాయి, నేను నిస్సహాయుణ్ణయి పోయినాను గదా. ఎంత మంది వుంటేనేం. ముప్పున ఇంటిది లేని తెప్పరం సామాన్యమైనది కాదమ్మా!"అని పసిపిల్లవాడిలాగా వలవలా ఏడిచాడు.

బుచ్చిలక్ష్మమ్మ గూడా కండ్ల నీళ్ళు పెట్టుకొని "పోనీలే అన్నయ్యా! వదినె అదృష్టవంతురాలే. ముత్తయిదువ చావు ఎంతటివారికి" అన్నది.

"అవునమ్మా! మీ వదినె అదృష్టవంతురాలే, బ్రతికి నన్నాళ్ళు ఠీవిగా ఒకరికి లొంగకుండా దర్జాగా నడుపుకొన్నది. పోవడమూ ఘనంగానే పోయింది. నేనే నిస్సహాయుణ్ణయి పోయినాను. అమ్మాయి! మీ వదినె పోయిన తర్వాత ఎందరున్నా శూన్యంగా కనిపిస్తున్నది. విమోచన మెప్పటికో!" అన్నాడు రామస్వామి కళ్ళనీళ్ళతో.

"అన్నయ్యా, కృష్ణా! రామా! అనుకో. నీకేం కావాలె? కొడుకు నీ అంత వాడైనాడు. అంతా వాళ్లే చూస్తారు" అన్నది బుచ్చిలక్ష్మమ్మ.

"అవునులే అమ్మాయి నాకేం కావలె. మాటవరుసకు చెపుతున్నా. అయితే, బావగారు కూడా వచ్చారా; ఉద్యోగం చేస్తున్నారా? పించెను పుచ్చుకున్నారా?" అన్నాడు రామస్వామి.

"పించెను యీ నెలలోనే పుచ్చుకున్నారు. వారూ, నేనూ, చిన్నమ్మాయీ వచ్చాము" అన్నది బుచ్చిలక్ష్మమ్మ.

" మఱి వారిని నాకు చూపవూ?" అన్నాడు రామస్వామి.

"రేపు పంపిస్తాలే" అని, "అన్నయ్యా! వెళ్ళివస్తా" అని బుచ్చిలక్ష్మమ్మ లేచింది.

"అప్పుడే వెళ్ళుతావా అమ్మాయి! నిన్ను చూస్తే నాన్నను, అమ్మను అందరినీ చూసినట్టుగా ఉన్నది. కాసేపు కూర్చో అమ్మా" అన్నాడు.

బుచ్చిలక్ష్మమ్మ కూర్చున్నది. గోపాలస్వామి నాయుడు అరటిపండ్లు, కొబ్బరికాయ తెప్పించి, వారికి తాంబూలమిచ్చి పంపమని భార్యతో చెప్పాడు. భార్య వచ్చి బొట్టుపెట్టి, పండ్లు, తాంబూలము బుచ్చిలక్ష్మమ్మ చేతికిచ్చింది.

"అమ్మాయి ఇన్నాళ్ళకు నీవు వస్తే, అంత చీరె, రెవిక పెట్టలేకపోతిని. మీ వదినె వుంటే యిట్లా పంపేదేనా?"

"పోనీలే అన్నయ్యా! ఇట్టా అట్టే వచ్చిన వారికి చీరెలు, రెవికలు ఏమిటి?" అన్నది బుచ్చిలక్ష్మమ్మ.

అక్కడినుండి బుచ్చిలక్ష్మమ్మ పేరిసెట్టిగారింటికి వెళ్ళింది. పేరిసెట్టి భార్య మహాలక్ష్మి చిన్న కొడుకు ఇంటి అరుగుమీద తడికెల గదిలో పడుకొని వున్నది. బుచ్చిలక్ష్మమ్మ ఆమెను చూడటానికి పోయి, "షాహుకారత్తయ్యా!" అని పిలిచింది. మహాలక్ష్మికి నడుములు

వొంగిపోయినా కాని కండ్లు చెవులు స్ఫుటంగా ఉన్నాయి. షాహుకారత్తయ్యనగానే చివాలున లేచి కూర్చుని –

"నా తల్లీ ఎన్నాళ్ళకు కనబడ్డావు" అని కౌగలించుకున్నది.

"అత్తయ్యా! నోట్లో వేసుకో!" అని పటికబెల్లము పొట్లాము చేతిలో పెట్టింది బుచ్చిలక్ష్మమ్మ.

"ఈ అత్తయ్యమీద ఎంత ఆపేక్షమ్మా నీకు. ఆ ఊరినుంచి ఇల్లా వచ్చి చూడడానికి వచ్చావు" అన్నది.

"ఆపేక్షేమున్నది అత్తయ్యా, పెద్దవాళ్ళు, యీవూరు వచ్చి మిమ్ములను చూడకుండా ఎట్లా పోతాను; అసలు వచ్చిందే మిమ్ములను చూడటానికి. అయితే కొడుకులకు పిల్లలా? కొమార్తె నాగరత్నం ఏ వూళ్ళో ఉన్నది?" అని అడిగింది బుచ్చిలక్ష్మమ్మ.

ఏం జెప్పను? పెద్దోడికి పిల్లా లేదు. పీచూ లేదు. వాడి పెళ్ళామో గద్దరిది. వాకిట్లోకి చేరనివ్వదు. చేసింది చేతిలో పెట్టదు; ఆ పెద్దోడు వట్టి చవట. అది ఎంతంటే అంత. దాని ముంగల 'అమ్మా' అని పిలవడానికి కూడా అడిలిచస్తాడు. చిన్నోడు కరుకోడైనా ఆడి పెళ్ళాం కాసంత మంచిదే. అందుకే ఆళ్ళను కనిపెట్టుకొని వున్నా. నాగరత్తానికేం తిన కుడవా బోలెడంత ఉన్నది. దాని భాగ్యం ఈ మొగాలకేడది. దాని మొగుడు బొంబాయి, మొర్మేలుతో వ్యాపారం చేత్తాడు. తెనాలిలో సూశావో లేదో మూడంతస్థుల మేడ ఆళ్ళది. ఎంత ఉంటేనేం పెద్దమ్మాయా? పుట్టింటోళ్ళ ఆశ అందరికుండెదే. మీ మామయ్య పోయినాక ఒక అన్నదమ్ముడైనా దాన్ని నట్టింటికి పిలిచి గోరెడు పసుపు కుంకమ పెట్టిన పాపాన పోలేదు. నా పెట్టుపోతలన్నీ మీ మామతోనే పోయినాయి" అని కన్నుల నీరు పెట్టుకున్నది మహాలక్ష్మమ్మ

"పోనీలే అత్తయ్యా, ఎందుకు విచారిస్తావు, నీ కున్నదీ మన్నదీ నాగరత్నానికేగా?" అన్నది బుచ్చిలక్ష్మమ్మ.

"ఆ ఒక్క ఆడపిల్ల ఉంటే దాని కియ్యకుండా మరోళ్ళకెందుకిస్తానూ, అసలది నావద్దనే పడి వుంటుంది. నాకే కూతురింట్లో ఉండటానికి మనసొప్పకేం, ఈడనే పడివుంటున్నా. పెద్దదంటుంది ఏమిలేదని కూతురుకియ్యాలె ఆ కాసులు పేరు, పట్టెడ, గాజులు, దండకడియాలు మాకు చెరిసగమియ్యరాదా అని. నేనెందు కిస్తాను? చిన్నది నోరు తెఱచి అడుగదు కాని దానికి అదే ఊహ, ఎప్పటికైనా కాస్తో కూస్తో దీనికీ దీని బిడ్డలకీ, మిగతాది నాగరత్తానికి యిస్తా, అసలు పెద్దదానికి చిన్నమెత్తు ముట్టచెప్పుతానూ. నా ఘటం హరీ అనేదాకా ఉన్న గుల్లాగుట్రా నా ఒంటిమీద ఉండాలిసిందే. ఈ కాస్తాచెయి విడుచుకుంటే ఈళ్ళు గుక్కల్లో నీళ్ళుపోస్తారూ" అంటూ మహాలక్ష్మమ్మ గుక్క తిప్పకుండా ఎదలోని సోదంతా ఏకరు పెట్టింది.

బుచ్చిలక్ష్మమ్మ 'వెళ్ళుతా నత్తయ్యా' అంటూలేచింది.

"ఉండమ్మాయి, రాకరాక వచ్చావు" అంటూ మహాలక్ష్మమ్మ కర్ర మోటించుకుంటూ వంగిపోయిన నడుముతో బుచ్చిలక్ష్మమ్మ వెంట నడిచింది. ఇద్దరూ సందు మలుపు తిరిగారు. మహాలక్ష్మమ్మ బొడ్లో దోపుకున్న సంచి తీసి నాలుగు రూపాయి కాయితాలు చేతిలోపెట్టి –

"అమ్మాయి! మా అత్తమ్మ కొనిపెట్టిందని పేటు రెవిక కుట్టించుకొని తొడుక్కో అమ్మా!" అన్నది.

"ఎబ్బే! అత్తయ్యా! ఏమిటిది? నాకు వద్దు. పెద్దదానివని చూడటానికి వస్తే ఈ పెట్టుబళ్ళే మిటి?" అని వద్దంటే వద్దన్నది బుచ్చిలక్ష్మమ్మ.

"అమ్మాయి, నీవు తీసుకోకపోతే నన్ను చంపుకున్నట్టే" అన్నది మహాలక్ష్మమ్మ.

బుచ్చిలక్ష్మమ్మ మాట్లాడలేక పోయింది. పెద్దకాలపు వాళ్ళ ఆపేక్షే వేరు అనిపించింది ఆమెకు.

## 5

రమణయ్య పంతులుగారు రామవరం వచ్చి వారం రోజులైంది. మధ్యాహ్నం భోజనాలై వాకిట్లో కూర్చుండివుండగా పోస్టుజవాను ఉత్తరం తెచ్చి యిచ్చాడు. పెనిమిటి చదువుకుంటూ వుండగా "ఎవరివద్దనుంచీ! ఎవరివద్దనుంచీ" అని రెట్టించి అడిగింది బుచ్చిలక్ష్మమ్మ

"చలపతి వద్ద నుంచి వచ్చింది. మనం వచ్చిన మూడవనాటి నుంచీ వాడికి జ్వరమేట" అన్నారు పంతులు.

"అయ్యో! నేను అనుకుంటూనే వున్నా. హోటళ్ళ తిండి వాడికి పడదు. ఏమి జబ్బు చేసిందో" అన్నది బుచ్చిలక్ష్మమ్మ దిగులుగా.


"సరే పదిరోజులు సెలవుపెట్టి వాడినిరమ్మని వ్రాస్తానులే" అన్నాడు పంతులు.

"వాడినెందుకు రమ్మనడం? మనమే వెళ్ళుదాం" అన్నది బుచ్చిలక్ష్మమ్మ.

మౌనం అర్ధాంగీకారం అన్నట్టు ఊరుకున్నాడు పంతులు.

# మునిమాణిక్యం నరసింహారావు

**(1898 - 1973)**



**మ**ధ్య తరగతి తెలుగు ఇల్లాలు 'కాంతం' నాయికగా అనేక కథలు వ్రాసి తెలుగు సాహిత్యంలో సజీవ పాత్రను సృష్టించారు. సాంసారిక జీవితంలోని రమణీయ ఘట్టాలను మనోహరంగా చిత్రించారు. పాఠకునిలో ఆసక్తిని రేకెత్తించే విధంగా కథని ప్రారంభించుటా, పోషించుటా, సున్నితమైన హాస్యంతో చమత్కారమైన సంభాషణలు వ్రాయుటా, సులభశైలీ, ఆకర్షణీయమైన శీర్షికలూ - కథా రచనలో మునిమాణిక్యం వారి మెళుకువలు.

**రచనలు :** కాంతం, కాంతం కైఫీయత్, కాంతం కాపురం మొ॥ 24 కథల పుస్తకాలు, రుక్కుతల్లి, శరద్రాత్రులు మొ॥ నవలలు, నాటికలు, నాటకాలూ, వ్యాసాలూ.



# వెండి కంచం

**కా**నీకి ఒకటే విస్తరి!

రోజుకు నాకు రెండు విస్తళ్ళు కావాలె. మా ఆవిడకు రెండు. మొత్తం నాలుగు. నాలుగూ ఒక అణా. ఈ లెక్కని నెలకు సుమారు రెండు రూపాయలు విస్తళ్ళ క్రింద అవుతున్నది.

ఒక వెండి కంచం కొనుక్కుంటే, బాగుండును! వెండి కంచం కొనుక్కుంటే నెలకు రెండు రూపాయల చొప్పున సంవత్సరానికి అయ్యే ఇరవై నాలుగు రూపాయలూ ఆదా అయిపోతుంది.

వెండి కంచం ఎనభై రూపాయలు పెడితే వస్తుంది. ఎన్నాళ్ళు అయినా వుంటుంది. దానికి పెట్టిన ధర నాలుగేండ్లలో తిరిగి వచ్చినట్లే లెక్క!

ఆ తరువాత ఆ కంచం మనకు ఊరికే వచ్చినట్లే. పైగా సాలుకు ఇరవై నాలుగు రూపాయలు ఆదా కూడా.

ఒక కంచం కొంటే! అర ఎకరం పొలం కొని పారేసినట్లే!

అర ఎకరం మీద అంతకంటె ఎక్కువ ఆదాయం రాదు.

ఇల్లాగ వచ్చిన ఇరవై నాలుగు రూపాయలలో, ఓ నాలుగు ఎందుకైనా పోయినా నికరంగా ఇరవై రూపాయలూ మిగలవలసిందే ;

ఇరవై ఏండ్లలో నాలుగు వందలు!! అదేమీ చిన్నమొత్తం కాదు!

ఇంకొక తమాషా కూడా చెయ్యవచ్చు! ఏ సంవత్సరం మిగిలిన ఇరవై ఆ సంవత్సరం వడ్డీకి వేస్తూ ఉంటే ఇరవై ఏండ్ల తరువాత వెయ్యి రూపాయలు అవుతయి.

ఈ వెయ్యికీ ఇంకొక వెయ్యి కలిపి ఒక ఇల్లు కట్టుకోవచ్చు.

ఆలోచిస్తే, ఒక వెండికంచం కొనటం వల్ల భవిష్యత్ జీవితం అంతా బాగుపడేటట్లు వుంది.

## 2

అయితే,

నెలకు యాభై రూపాయల జీవితంలో ఈ పెద్ద సంసారాన్ని ఈదుకు రావడం కష్టంగా వుంటే, ఒక్కసారి ఎనభై రూపాయలు పెట్టి వెండి కంచం కొనటం ఎట్లాగు? వెండి ధర మండిపోతున్నది. ఎంత ఆలోచించినా ఉపాయం ఏమీ తోచలేదు.

తెల్లని వెండిపళ్ళెంలో అన్నం తినాలని నాకు చాలా కాలం నుంచీ సరదా! అందమైన వస్తువులు ఎవరు కోరకుండా ఉంటారు. జీవితం సౌందర్యమయం చేసుకోవాలని ఎవరికి వుండదు?

కాని ఎన్ని విధాల ఆలోచించినా వెండికంచం కొంటానికి డబ్బు ఎల్లాగ వస్తుందో తెలియలేదు. నా బ్రతుక్కు వెండికంచం కొనుక్కోలేను అని నిరాశ చేసుకోలేకపోయినాను. విచారంతో ఎంతో ఆలోచించగా, ఆలోచించగా ఒక ఉపాయం తోచింది.

వెండి పూత పూసిన పళ్ళాలు వుంటవి, అదొకటి కొంటే ::

భలే! ఈ ఆలోచన  నాకు ఆదివారం పొద్దున్నే రావడం ఒక అదృష్టమే! నేను చటుక్కున లేచి, పైన ఉత్తరీయం వేసుకొని పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ హెబ్బారుషాపుకు వెళ్ళాను! ఇల్లాంటి వస్తువులన్నీ అక్కడే దొరుకుతవి.

ఆ షాపులో గిల్టు కంచం ఒకటి అద్దాల బీరువాలో ధగధగ మెరిసిపోతున్నది. దానిని బయటకు తీయించి చూశాను.అబ్బ! ఎంత తెల్లగా మెరుస్తున్నది. వెండికంచానికీ దీనికి భేదం ఏమీ కనిపించలేదు.

నా బ్రతుక్కు ఇది కొనుక్కుంటే చాలదా అనిపించింది.

ధర ఇరవై రూపాయలు. కొంచెం ఎక్కువే అనిపించింది.

కాని హెబ్బారు ఏమి చెప్పాడు.... "ఇది చాలా మంచి కంచం. యుద్ధానికి పూర్వం తెప్పించిన సరకు. ఇపుడు ఇటువంటి సరుకు రావడం లేదు. గిల్టు కంచం అని  పేరే గాని వెండికంచం కంటే బాగా వుంటుంది."

"ఈ రంగు పోదాఅండీ?" అని అడిగాను ఆదుర్దాగా.

"ఇప్పుడు వచ్చే కంచాలైతే, చెప్పలేము కాని, దీనికేమండీ? దీనికి మార్పు లేదు? ఎన్నాళ్ళయినా ఇల్లాగనే వుంటుంది."

"అయితే, వెండికంచం కొంటే ఎక్కువేమి వుంది?" అని అడిగాను.

"ఏమీ లేదు. డబ్బు ఎక్కువగా ఉంటే వెండికంచాలు కొంటారు. మన మోస్తరు వాళ్ళంతా వాడేవి ఇల్లాంటివే? అందరి ఇళ్ళల్లోనూ వెండి కంచాలున్నాయా?" అని ఆయన నవ్వాడు.

"అంతే అంటారూ?" అన్నాను నేను ఆయన అన్న మాట మీద నమ్మకం లేనట్టు.

"ఇంకా మీకు సందేహమేనా? పెద్ద పెద్ద వాళ్ళ యిళ్ళలో కూడా ఇవ్వేనండీ?" అన్నాడు ఆయన. ఒక గొప్ప రహస్యాన్ని నాకు ఆ క్షణంలో బుద్ధిపూర్వకం గానో, పొరపాటునో చెప్పేసినాడు. నాకు చాలా తృప్తి గలిగింది. తప్పకుండా కొందామనుకొని "రేపు వస్తాను" అని చెప్పి వచ్చేస్తున్నాను. హెబ్బారు నన్ను పిలిచి అడిగాడు. "దీనికోసం చాలా మంది తిరుగుతున్నారు. సి.సి.రావుగారు నిన్న వచ్చి చూచి వెళ్ళారు. మీకు కావాలంటే చెప్పండి! దాచిపెట్టి ఉంచుతాను. ఇల్లాంటిది ఇది ఒక్కటే నాదగ్గర! దాని తరువాత ఏమనుకొన్నా లాభం లేదు!"

"రేపు వచ్చి ఏ సంగతీ మీకు చెపుతాను. అప్పటిదాకా ఎవ్వరికీ ఇయ్యబోకండి" అన్నాను. హెబ్బారు అంగీకారాన్ని సూచిస్తూ పళ్ళాన్ని బీరువాలో పెట్టివేశాడు. నేను ఇంటికి వచ్చేశాను. వచ్చి మళ్ళీ ఆలోచించాను. ఇప్పుడు అందరి ఇళ్ళల్లోనూ ఇల్లాంటి కంచాలే వున్నాయని చెప్పాడు. నిజమే అయి వుంటుంది ఆ మాట! కంచం తెల్లగా మెరుస్తున్నది. గిల్టు కంచం అని ఎవ్వరూ అనుకోరు.

ఆ తెల్లటి పళ్ళెంలో అన్నం పెట్టుకు తింటూ వుంటే వెండి కంచంలో తిన్నంత తృప్తి వుంటుంది. కొంటే ఏం?

ఆ రంగు ఉంటుందా ఎల్లకాలమూ? అదే నన్ను బాధిస్తున్న సమస్య!

ఉంటుందని హెబ్బారు చెపుతున్నాడు. అబద్ధం చెప్పిందాకా అతనికేమి అవసరం వచ్చింది? అదీకాక అతను అబద్ధం చెపుతున్నట్టుగా ఏమాత్రము లేదు.

ఆ కంచం మంచిది కాకపోతే సి.సి.రావుగారు ఎందుకు కావాలంటారూ? ఆయన చాలా భాగ్యవంతుడు. రంగుపోయే కంచం అయితే ఆయన కొనాలని అనుకోడు. రంగు పోయే కంచాలైతే ఒకరు మట్టుకు ఎందుకు కొంటారు? ఇది అల్లాంటిది కాదు.

ఇంకొక సంగతికూడా తోచింది. పోనీ ఎంత లేదన్నా నాలుగేండ్లు ఉండదా ఆ రంగు పోనీ మూడేండ్లు! అయితే మట్టుకు నష్టం ఏముంది! ఈ మూడేండ్లూ విస్తళ్ళు ఉపయోగిస్తే డెబ్బై రెండు రూపాయలు అయింది. ఈ కంచం ఇరవై రూపాయలకే వస్తుండే!

ఇల్లాగ ఎంత ఆలోచించినా ఆ కంచం కొనటం, చాలా లాభకరమైన విషయంగా తోచింది.

మా ఆవిడ ఏదైనా కాస్త డబ్బు ఆదా అయ్యే విషయంలో నాతో ఏకీభవిస్తుంది! నేను కుర్చీ కొంటానంటే, వద్దు, అది అయితే నాలుగు ఏండ్లలో పాడైపోతుంది. ఇనప కుర్చీ కొంటే శాశ్వతంగా ఉంటుందని నాకు సలహా ఇచ్చింది. ధైర్యంగా వెళ్ళి ఈ విషయం, అంతా చక్కగా చెప్పాను ఆవిడతో.

ఆమె నావంక విపరీతంగా చూచి, ఇంతతెలివి తక్కువ పని ఇంకొకటి లేదన్నట్లు తల తిప్పి, "మీకింత వెర్రి ఏమిటండీ, ఎబ్బే! గిల్టు కంచం కొనుక్కుంటారా? మనకేం కర్మం అండీ" అంది.

ఈ మాటలు వింటే నాకు చాలా కోపం వచ్చింది. మనమేమో మహా వెండికంచాలు కొంటానికి శక్తి ఉన్న వాళ్ళం లాగా మాట్లాడుతుందేమిటి ఈవిడగారు. అసలు వచ్చే జీతంలో గడపటమే కష్టంగా ఉంటూ ఉంటే?!

కోపం వచ్చినా దిగమ్రింగి "అంతా కొనుక్కోటం లేదా" అన్నాను.

"ఎవరండీ అల్లాంటి వస్తువులు కొనేది?" అని అడిగింది.

అది మామూలు ప్రశ్నే కాని అందులో నన్ను అవమానపరచే పదార్థము చాలా వుంది. ఈ వూళ్ళో అల్లాంటి కంచాలు ఎవరెవరు కొన్నారో హెబ్బారును అడగటం మరిచిపోయాను. అయినా ఊరుకోక ఊళ్ళో భాగ్యవంతుల పేర్లు కొన్ని చెప్పాను కసి తీరేలాగున.

ఆవిడ నవ్వి "వాళ్ళకేం కర్మం అండీ గిల్టు కంచాలు కొనుక్కొన్నదాకా?" అన్నది.

"అయితే హెబ్బారు తెప్పించిన గిల్టు కంచాలన్నీ ఎవరు కొంటున్నారంటావు?" అని అడిగాను.

"మన కెందుకు పోనిద్దురూ. ఎవరో తలకు మాసిన వాళ్ళు కొనుక్కుంటారు" అని చమత్కారంగా మాట్లాడింది.

నేను కోపం తెచ్చుకొంటే. పోట్లాటలోకి దిగుతుంది. పోట్లాడేందుకు నేను సిద్ధం కాలేదు.

కొంచెము మెల్లగా అన్నాను. "ఆ కంచం వెండికంచం లాగా తెల్లగా మెరుస్తున్నది?" కొంటానికి అంగీకరించమని బ్రతిమాలుడు పద్ధతిలో అన్నాను.

"అట్లాగే మెరుస్తుంది? అది బోగం మెరుపు?" అని ఆవిడ చీదరించుకొన్నది.

"మరి వెండికంచం కొనుక్కో లేనప్పుడు. అది అయినా కొనుక్కొని సంతోషిస్తాను" అన్నాను కొంచెం దీనంగా.

"శక్తి లేకపోతే పోనీయండి. ఉన్నప్పుడే కొనుక్కోవచ్చు! అంతేగాని గిల్టు కంచం కొనడం ఎందుకండీ?"

"ఏం కొంటె? తెల్లగావుంది! ...."

"తెల్లగా వుందంటారూ? ఎంతకాలం ఉంటుందండీ ఆ మెరుపు. మర్నాటి కల్లా పోతుంది. అదీకాక అది ఎందుకైనా పనికొస్తుందా? వెండికంచం అయితే సొమ్ము! ఎప్పుడమ్మినా సొమ్ము అంతా వస్తుంది. అవసరం వస్తే తాకట్టు పెట్టుకొని పదిరూపాయలు తెచ్చుకోవచ్చు. ఇది ఎందుకు పనికివస్తుందండీ? ఎబ్బే?" అని చీదరించుకొన్నది.

దాని తరువాత నేను ఎంత చెప్పినా ఆవిడ వినుపించుకుంటేనా? గిరగిరా తల తిప్పివద్దంటే వద్దని కూర్చున్నది. సంగతి తేలిపోయింది. ఇక ఆవిడకు నచ్చజెప్పి కొనడం పడదు.

నా యింట్లో నా మాటకు ఇంత విలువ లేకుండా పోయిందేమా అని విచారం కలిగింది. ఆలోచించిన కొద్దీ రోషం హెచ్చిపోయింది. చివరకు ఒక పౌరుషమైన పని చేయడానికి నిశ్చయించుకొన్నాను.

చెప్పకుండా ఆ కంచం కాస్తా కొనుక్కొస్తాను. కొని తీరుతాను! నాకు అంత మోజుగా వుంది. నేనే గనుక ఆ కంచం కొనకపోతే.... అని ఏదో అనుకోబోయి ఊరుకొన్నాను.

## 3

నేను అసలు మహా పట్టుదల మనిషినని నా అభిప్రాయం. ఆ రోజు సాయంత్రమే హెబ్బారు షాపుకు వెళ్ళి ఆ పళ్ళాన్ని చూపిస్తూ ఇల్లా అన్నాను.

"ఇది నాకు కావాలె. జీతం రావటంతోనే డబ్బు ఇచ్చి తీసుకొని వెడతాను. ఇది నాకోసం ఉంచండి."

హెబ్బారు నా స్థితి జూసి చాలా జాలిపడ్డాడు. "సరే, అల్లాగే కానియ్యండి. డబ్బు వచ్చినప్పుడే వచ్చి తీసుకెళ్ళండి. అందాకా మీ కోసం అట్టిపెడతాను"

"నిజంగా నా కోసం ఉంచండి. కొంచెం ఆలస్యం అయినా సరే. ఇంకొకరికి ఇయ్యకండేం?" అన్నాను.

హెబ్బారు నవ్వి "మాట అన్న తరువాత ఇంకొకరికి ఇస్తానుటండీ! ఆ కంచం మీదే అనుకోండి. మీరు ఎప్పుడైనా రండి. దాన్ని అల్లాగే ఉంచుతాను" అన్నాడు. నేను సంతోషించి ఇంటికి వచ్చేశాను.

ఆరోజునుంచీ హెబ్బారు షాపుకు రోజూ వెళ్ళి ఆ కంచం అక్కడ వున్నదీ లేనిదీ చూసుకొంటూ వుండేవాడిని. ఆ కంచం నాదే అక్కడ పెట్టి వుంచాను అని అనుకుంటూ సంతోషిస్తూ వుండేవాడిని.

ఆ నెల ఆఖరుకు కొందామనే గట్టిగా అనుకొన్నాను. కాని తీరా లెక్క జూచుకొంటే డబ్బు అంతా ఇంటి ఖర్చుకు సరిపోయింది.

ఎప్పుడో పెద్దపిల్లకు పరికిణీ గుడ్డ కొన్నందుకూ, ఆవిడ కనకాంబరం చీర కొనుక్కొన్నందుకూ, నాయుడుగారి భార్యదగ్గర పాతిక రూపాయలు అప్పు జేసిందట మా ఆవిడ. వాటి కేదో డబ్బు ఇచ్చినట్లే జ్ఞాపకం. దానికంతా ఏదో గొడవగా లెక్క జెప్పి ఈ బాకీ ఈనెలలో తీర్చక తప్పదని కూర్చున్నది.

నేను రెండు ప్రైవేటు ట్యూషనులు తీసుకొనక తప్పిందికాదు. ఆ ఇద్దరూ కలిసి పాతిక రూపాయలు ఇచ్చారు. ఆ రూపాయలు మా ఆవిడకిచ్చి, నాయుడుగారి భార్య బాకీ తీర్చేయమన్నాను.

ఇట్లా జరగటం వల్ల నేను అనుకొన్నట్లు ఆ నెల కంచం కొనలేక పోయినాను. కాని వచ్చే నెల మళ్ళీ ఆ కుర్రవాళ్ళు పాతికా ఇస్తారు. దానితో పళ్ళెం కొనక తప్పదని నిశ్చయించుకొన్నాను.

పళ్ళెం కొనాలన్న కోరిక మరీ బలం అయింది. విస్తట్లో తినటం అంత దరిద్రపుపని ఇంకొకటి లేదని తోచింది. పుల్లలు ఊడి నోటిలోకి వస్తున్నాయి. అరటి ఆకులు అయితే బాగుండును. అవి చాలా ఖరీదు. అయినా రోజూ దొరకవు అవి. జీవితం దుర్భరం అనిపించింది.

మల్లెపూల లాంటి అన్నం తెల్లని పళ్ళెంలో పెట్టుకుని తింటూ ఉంటే, ఎంత హాయిగా వుంటుంది? అల్లాంటి అదృష్టం నాకు ఎప్పుడు కలుగుతుందో?

మనిషి అయిన ప్రతి మానవుడికి సౌందర్యతృష్ణ ఉంటుంది. పొట్టకు ఇంత తిండీ, కట్టుకొనేందుకు బట్ట ఉన్నంత మాత్రాన మానవుడు తృప్తి పడడు. ఎన్నో అందమైన వస్తువులకోసం మానవ హృదయం పరితపిస్తుంది.

నాకు పళ్ళెం కొందామన్న ఆరాటం ఎక్కువ అయింది. హెబ్బారు షాపుకు రోజూ వెళ్ళి ఆయనతో ఏదో ఆ విషయం ఈ విషయం మాట్లాడి, నా కంచం యథాస్థలంలో వున్నదీ, లేనిదీ చూసుకొనేవాణ్ణి. అద్దాల బీరువాలో కొన్ని గ్లాసుల ప్రక్క, పగలు సూర్యకాంతిలోనూ, రాత్రి ఎలక్ట్రిక్‌లైటు కాంతిలోనూ ఆ కంచం ధగధగా ధగధగా మెరసిపోతూ వుండేది. కళ్ళతో చూసుకుని గుటకలు మ్రింగి వచ్చేస్తుండేవాడిని.

ఆ తరువాత ఆగస్టు నెల జీతం వచ్చింది. నేనూ మా ఆవిడా కలిసి లెక్క జూచుకొన్నాము. పెరుగుకూ, పాలకూ, కలిసి క్రిందటి నెలకంటే అయిదు రూపాయలు ఎక్కువ అయింది. పైగా ఇంకొక కొత్త ఇబ్బంది కూడా వచ్చిపడ్డది. మా ఆవిడ, ఎందుకో నాయుడుగారి భార్య దగ్గర అప్పుడప్పుడు చేబదుళ్ళు చేసిన మొత్తం ఇరవై రూపాయలు అయిందట! ఆ డబ్బుకు ఆమెగారు తొందరజేస్తున్నదని మా ఆవిడ చెప్పింది. ఏం జేసేది? ఆ నెల జీతమూ, పై సంపాదన పాతికా, అంతా కూడా మా ఆవిడ చేతికిచ్చి చేతులు కడుక్కున్నాను.

అక్కడినుంచి నా చేతిలో దమ్మిడీ లేకపోవడం మూలాన నానా ఇబ్బందీ పడ్డాను. సిగరెట్లకు కావాలె, కిళ్లీలకు కావాలె; రెండు రోజులకొకసారి అయినా, "ఇదిగో, చూడూ, ఒక అర్ధరూపాయి యిద్దూ?" అని అడగక తప్పేదికాదు.

"ఇది మరీ బాగుందే! నా దగ్గర ఎక్కడదీ?" అనేది ఆవిడ.

నిజానికి ఆవిడ ముందు డబ్బు పోగుపోసుకొని కూర్చున్నదా? నేను సంపాదించి తెచ్చి ఇచ్చిన డబ్బు, పాలవాళ్ళకూ పెరుగువాళ్ళకూ, ఎవరెవరికి ఎంతెంత యివ్వాలో, అంతా ఇచ్చేసి ఇంట్లోకి నెలకు సరిపొయ్యే వస్తువులన్నీ తెప్పించేది! ఇంకా డబ్బు ఎక్కడిదీ ఆమె చేతిలో? అందుకని నేను మళ్ళీ అనేవాడిని "కాస్త ఆ నాయుడుగారి భార్యను అడిగి అయినా రెండురూపాయలు తెద్దూ?"

"ఇప్పుడు ఇల్లాగే అంటారు? నెల ఆఖరుకు ఇవ్వవచ్చేసరికి ఊరికే ఇదౌతారు?" అని ఆమె అనేది.

"కాదులే! కాస్త తీసుకరా!" అని నేను బ్రతిమలాడితే ఆవిడగారు ఒక రూపాయో అర్ధో నా చేతిలో పెట్టేది. ఇట్లాగే నెలంతా నెట్టుకుపోయేది.

చాలా కష్టంగా గడుస్తూ వచ్చింది. అయినా ఈ ట్యూషన్ చెప్పటం చాలా కష్టమైన పని. స్కూలులో వాగి, వాగి వచ్చి మళ్ళీ ఇంటి దగ్గర ఇద్దరు మొద్దులకు పాఠాలు చెప్పటం ఎంత కష్టమో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారు తప్ప, ఇతరులు ఎవరూ ఊహించలేరు.

అదీగాక ఈ ట్యూషన్ అసలు చెప్పకూడదు. అధికారులకు తెలిస్తే చాలా ప్రమాదకరమైన విషయం. ఈ దొంగపని ఎన్నాళ్ళని చెయ్యటం? ఈ పళ్ళెం కొనగానే ఈ కుర్రాళ్ళని పంపించి వేద్దామని నిశ్చయించుకొన్నాను.

సెప్టెంబరు నెల జీతం వచ్చింది. ఆ జీతమూ, కుర్రాళ్ళు ఇచ్చిందీ, అంతా కలిపి డెబ్బై అయిదు రూపాయలకు, మా ఆవిడ ఖర్చు చూపించి పైగా ఇంకొక పది రూపాయలు ఎక్కడైనా అప్పు తెస్తేనే గాని ఈ నెల గడవదు అన్నది.

"నా కెక్కడా అప్పు పుట్టదు. నీవే, ఆ నాయుడుగారి భార్య నడిగి తెచ్చుకో" అని విదిలించుకు వెళ్ళిపోయినాను ఆరోజుకు.

తానేమో మహా తెలివిగలదానినని మా ఆవిడ గర్వం. నేను కాబట్టి ఈ మాత్రం అన్నా గడుపుకొని వస్తున్నాను అంటుంది. జీతానికి జీతమూ, పైన పాతికో పరకో వస్తే అదీ అంతా ఆమె చేతిలోనే పడేస్తుంటిని. ఆమె దాంతో సరిపెట్టుకోలేక పైన అధమం ఒక పాతిక అయినా అప్పు జూపిస్తున్నది!

ఇల్లాగే, అక్టోబరు, నవంబరులు కూడా గడిచిపోయినవి. నేను మటుకు పళ్ళెం మీద ఆశలు వదులుకోలేదు. రోజూ వెళ్ళి చూచుకొని వస్తూ వుండేవాడిని. అది అక్కడే వుంది. ఎక్కడికీ పోలేదు. ఎక్కడున్నా అది నా పళ్ళెమే కదా అన్న ఆలోచన మటుకు నాకు చాలా సంతోషాన్ని ఇస్తూ వచ్చింది.

ఏ నెల కానెల, ఈవిడ జీతం జీతం అంతా కాజేసి, నా చేతిలో ఒక దమ్మిడీ అయినా మిగలకుండా జేయటం, అందుమూలాన ఆ పళ్లెం కొనలేకపోవటం. నేను ఎంతో కాలం భరించలేక పోయినాను.

ఒకరోజున చాలా విచారంతో అన్నాను. "నీ వేమో, మహా తెలివిగలదానవనీ, సంసారం పొదుపుగా చేస్తావనీ, ఆశపడి జీతం అంతా నీకు ఇస్తున్నాను. నీవు చేస్తున్న ఆదా అయినా ఏమీ లేదు. పైగా నెలనెలా అప్పు జూపిస్తున్నావు, ఎబ్బే! ఏమీ లాభంలేదు. ఈ నెల నుంచీ డబ్బు నేనే వాడతాను!

ఈ మాటలు విని ఆవిడ మూతి ముక్కూ విరిచి, "అయో, అయ్యో, మీరు వాడటం, ఈ సంసారం గడవటమూనా! నేను గాబట్టి ఎల్లాగో ఒరగబెట్టుకొని వస్తున్నాను. డబ్బు మీ చేతిలో పడితే, ఇక పిల్లలూ నేనూ కూడా మాడవలసిందే! మీ స్నేహితుడేగా. ఆ శ్రీనివాసరావు! ఆయన చూడండి ఎల్లాగ అవస్థ పడుతున్నాడో! ఆయన పెళ్ళాము ఒకటే గోల! ఒక ఎకరం పొలం వుంటే, అది కూడా అమ్మాలని చూస్తున్నాడు."

"అయితే ఏమిటి నీవు అనటం?"

"ఇంకా ఏమి అనేది? మీరు డబ్బు వాడితే ఎందుకూ పనికి రాకుండా పోతాము"

"ఏమీ పోము. మనకు ఏమీ అమ్ముకోవలసిన అగత్యం రాదు."

కాంతం నా వంక వికారంగా చూసి "అమ్ముకొందామన్నా మనకేమీ లేదుగా" అన్నది చేతులు త్రిప్పుతూ వెక్కిరింతగా, నాకు మనస్సు చివుక్కుమన్నది. నాకు లేనిమాట నిజమే కాని, అయితే మటుకు అల్లాగంటే కష్టంగా ఉండదూ?

"అల్లాగ అంటేనే నాకు ఒళ్ళు మండేది?" అన్నాను కోపంగా.

"లేనప్పుడు లేదంటే, కోపం ఎందుకూ?" అని మళ్ళీ అన్నది ఆవిడ. నాకు కోపం వస్తున్నదని భయం ఏ మాత్రమూ లేకుండా.

నాకు చాలా కోపం వచ్చింది. పెద్దగా ఇల్లా అన్నాను. "అవును.లేదు. లేకపోతే మటుకు...." ఆపైన ఏమంటానికీ తోచక కాసేపు ఊరుకొని మళ్ళీ అన్నాను! "అందరూ ఉండే అమ్ముతున్నారా ఏమిటి? అమ్మాలని బుద్ధే పుట్టాలి గాని ఏదైనా అమ్మవచ్చు!"

ఈ మాటలు కోపంగానే అనేశాను. నిజానికీ అమ్మటానికి ఏమీ లేదు. నగలు కూడా లేవు! పాత్ర సామగ్రి అయినా సరిగ్గా సంసారానికి సరిపోయే మాత్రం వుంది.

ఏదో డబాయింపుగా అన్నానుగదా అని ఆమె ఊరుకొంటే సరిపోయేది! అల్లా ఊరుకోక ఆమె. "ఏమి అమ్ముతారో కాస్త చెప్పండి చూద్దాము?" అన్నది దీర్ఘాలు తీస్తూ.

"రోషం వచ్చి ఏదో అన్నాడులే అని ఆమె ఊరుకోవాలిసింది. ఊరుకోక ఆమె గారు అంత నిక్కచ్చిగా అడుగుతున్నప్పుడు ఏదో అమ్ముతున్నానని చెప్పాలె గాని 'మేమే' అంటే

ఆవిడకు నేను ఎంత లోకువ అవుతాను. ముందు ముందు ఇంకా ఎత్తిపొడుపు మాటలు అనవచ్చు. ఇదంతా నేను ఆలోచించి చివరకు అన్నాను ఇల్లాగ!

"ఏమి అమ్ముతానా, గుంటూరులో అరండల్ పేటలో ఇల్లు ఒకటి అమ్మేస్తాను" అని పెద్దగా అరిచాను.

మా ఆవిడ కాబట్టి ఇన్ని మాటలూ నేను కోపంగా అంటూ ఉంటే నిలబడ గలిగింది. కాని ఇంకొకరు అయితే "పాపం, ఈ పిచ్చి బ్రాహ్మడు పెళ్ళాం మీద కోపం కొద్దీ, నిక్షేపంలాటి ఇల్లు అమ్మేస్తాడు కామాలు" అని హడలిపొయ్యే వాళ్ళే! ఆ పద్ధతిలో అన్నాను. మా ఆవిడ మటుకు తొణక్కుండా అడిగింది. "గుంటూరులో మనకు ఇల్లు ఒకటి ఉందా ఏమిటండీ?"అని.

ఈ మాటలు అన్న పద్ధతిని విడతీసి చూస్తే, అందులో పదింటికి ఒక పాలు సందేహమూ నాలుగు పాళ్ళు విస్మయమూ, కలిపి వున్నట్లు తెలుస్తుంది.

నాకు గుంటూరులో ఒక ఇల్లు ఉన్నదనే అనిపించింది. "నీకేం తెలుసు ఉందో లేదో" అన్నాను గర్వంగా.

"నాకెప్పుడూ చెప్పలేదే?" అన్నది ఆవిడ తెల్లబోయి.

"ప్రతి విషయమూ, ఆడదానికి చెప్పాలని లేదు."

"పోనీలెండి, ఇదివరకు చెప్పలేదు సరే! ఇప్పుడు చెప్పండి. అక్కడ మనకో ఇల్లు ఉందా?"

'ఆ' అన్నాను గొంతు పెద్దది చేసి.

'ఆ' అని ఎల్లా అన్నానూ అంటే, ఆ విషయమై ఆవిడకు ఎల్లాంటి సందేహము ఉన్నా, ఆ దెబ్బతో అది ఎగిరిపోయే పద్ధతిలో అన్నాను.

అయినా ఆవిడకు సందేహము పోక "ఎప్పుడు కొన్నారండీ?" అని నవ్వింది.

అట్లా దారికిరా,అని మనస్సులో అనుకొని "నేను కొన్నానని చెప్పలేదే" అన్నాను.

"కొనక పోతే ఆ యిల్లు మనదెట్లా అవుతుంది.'

"మనదీ అని కూడా నేను అనలేదే?"

"మనది కాకపోతే ఎట్లా అమ్ముతారు?'

"అమ్మడానికి హక్కు వుంది కాబట్టి?"

"అదేమిటండీ? మన యిల్లు కాకపోవడం ఏమిటి? అమ్మటానికి హక్కు ఉండటం ఏమిటి?"

"ఏమీ లేదు. అక్కడ మా అత్తగారి యిల్లు ఒకటి ఉంది. అది కాస్తా అమ్మేస్తాను?"

కాంతం విరగబడి నవ్వుతూ "వాళ్ళు ఊరుకొంటారుటండీ?" అన్నది.

"అత్తగారి ఆస్తిపై అల్లుడికి ఆ మాత్రం హక్కు లేదా?"

"ఎవ్వరైనా వింటే నవ్వి పోతారు?"

"ఎవ్వరూ నవ్వరు. పైగా చాలా తెలివైన పని చేస్తున్నానని అందరూ నన్ను మెచ్చు కొంటారు."

అంతటితో ఆ రోజున మా సంభాషణ అయిపోయింది. కాని ఆవిడను ఒప్పించి డబ్బు వాడకం నా చేతులోకి తీసుకోలేకపోయినాను.

ఈ సంసారం, నెత్తిమీద వేసుకొని ఈదటం మూలాన ఈ మాత్రమన్నా గడుస్తున్నదనీ నేను డబ్బు వాడకం మొదలు పెడితే అప్పులు ఎక్కువయిపోయి మా వీధిలో ఎవరి ఇల్లు అయినా ఒకటి అమ్మవలసిన అవసరం నాకు గలిగి తీరుతుందని ఆమె నమ్మకం. అందుచేత ఆమె డబ్బు నా కళ్ళకు కనపడనీయదు. నాకూ తెలుసు ఆ మాట! రూపాయి జేబులో వేసుకొని వెళ్ళి చిల్లర ఎప్పుడూ నేను ఇంటికి తేలేదు. నిజానికి ఆమె వాడితేనే నయం. నయమే కాని. డిసెంబరు గడిచినా కూడా. నేను ఆ పళ్ళెం కొనలేకపోయినాను. నా పళ్ళెం హెబ్బారుషాపులో వున్నది.

పాపం ఆ పళ్ళానికి నోరు లేదుగాని ఉంటే నన్ను జూచినప్పుడు కళ్ళ నీళ్ళు పెట్టుకుని "నన్ను ఎన్నాళ్ళు ఇంకా, ఈ చెరలో వుంచుతావు, నన్ను తీసుకెళ్ళవా?" అనేది. నాకు అల్లాగ అన్నట్లే తోచింది. జాలి కూడా వేసేది.

ఇట్లా అంటూ వుండగా, జనవరి నెలలో నా చేతిలోకి పదిరూపాయలు వచ్చినై. ఏమైనా కానీ ఎవ్వరికీ చెప్పకుండా వెళ్ళి ఆ కంచం కొనుక్కుందామని బయలు దేరాను.

కంచం ఖరీదు ఇరవై. నా చేతిలో పదే వున్నై. ఎట్లాగు కొనేది? ఒక ఉపాయం ఆలోచించాను. ఈ పదీ ఇప్పుడు ఇచ్చేసి, మిగిలిన పదీ ఇంకొకనెలలో ఇస్తానంటే హెబ్బారు ఒప్పుకొంటాడు.

గబగబా షాపుకు వెళ్ళాను. ఆరోజున ధైర్యంగా అద్దాల బీరువా వద్దకు వెళ్ళి చూడవచ్చు. ఇదివరలో అంటే ఆయన ఏమంటాడో అని అనుకొనేవాణ్ణి. "కొనేదీ లేదు. పెట్టేదీ లేదు. రోజుకు ఒకసారివచ్చి చూస్తూ వుంటావు. ఏమిటీ న్యూసెన్సు" అని అంటే అనవచ్చునని భయంగా వుండేది.

ఇవ్వాళ ధైర్యంగా బీరువా దగ్గరకు వెళ్ళాను నాకంచం నేను తీసుకొంటానికి. అయితే ఆరోజు ఆ కంచం అక్కడ కనిపించలేదు. ఏమైపోయింది?

అక్కడ ధగ ధగ మెరుస్తూ వుండేది? కనపడలేదు. గుండెలు గబగబ కొట్టుకొన్నవి. అంతటా చూచాను. గ్లాసుల ప్రక్కనా, దీపాల ప్రక్కనా, వెనకాలా, పైనా, అంతటా, ఎక్కడా లేదు.

ఇంకెందుకు ఆలోచన? ఎవరో దుర్మార్గుడు నా వస్తువును కాజేశాడు.

హెబ్బారు షాపులో లేదు. ఎవరో కుర్రవాడు ఉన్నాడు. ఆ కుర్రవాడు "ఏమిటండీ, చూస్తున్నారు. పంతులుగారూ?" అన్నాడు.

"ఇక్కడా నా కంచం ఒకటి ఉండాలె" అన్నాను.

ఆ కుర్రవాడు ఆశ్చర్యపడి "మీ కంచం ఇక్కడెందుకు పెట్టారూ?"అని అడిగాడు.

ఏమి చెప్పేది? "నాదంటే.......నేను కొనాలని అనుకొన్నది? కొన్నట్లే?" అన్నాను.

"హెబ్బారుగారితో చెప్పకపోయినారా మీకోసం ఉంచమని?"

"చెప్పానయ్యా?"

"ఎన్నాళ్ళ క్రితం?"

"ఆరు నెలలు అవుతుంది."

ఆ కుర్రవాడు నవ్వి "ఆరు నెలల క్రింద చెప్పితే ఉంటుందిటండీ?" అన్నాడు.

"ఉంచుతానన్నాడు. ఉంచాడు కూడామొన్నటిదాకా?"

"అయితే, ఇంకేం మీ కోసం చాలా రోజులు అట్టి పెట్టి, విసుగు పుట్టి ఇక మీరు కొనరనే నిరాశతో ఎవరికో అమ్మి ఉంటారు. వారు మట్టుకు ఎన్నాళ్ళని ఉంచుతారు?" అని అన్నాడు ఆ కుర్రాడు.

ఈ మాటలు వినేసరికి నాకు కోపమూ, దుఃఖమూ పెనవేసుకొని వచ్చినవి. ఇంతకంటే ఘోరకృత్యము ఇంకొకటి లేదు? హెబ్బారు నన్ను నమ్మించి మోసపుచ్చాడు!

ఆ కొన్నవాడు ఎవరో, నిక్షేపం లాంటి కంచం, తెల్లగా మెరుస్తూ ఉండేదాన్ని. నేను లేకుండా జూచి కాజేశాడు. గద్ద తన్ను కెళ్ళినట్లు తన్ను కెళ్ళాడు. ఇంతకంటే అన్యాయం ఏముంటుంది?

నేను ఇపుడు ఏమిచెయ్యాలె? ఏడుస్తూ ఇంటికి పోవలసిందేనా? లేకపోతే ఆ కంచాన్ని ఎత్తుకపోయిన దొంగను పట్టుకొని నా కంచం నేను తెచ్చుకోవాలా? "ఎంతకు కొనుక్కొని వెళ్ళాడయ్యా ఆ పళ్ళాన్ని?" అని అడిగాను.

"నాకు బాగా తెలియదండీ ఈ మధ్య ఎవరో అడుగుతుంటే పాతిక రూపాయలని చెప్పారు" అన్నాడు ఆ కుర్రవాడు.

ఇంకేం! పాతిక రూపాయలిచ్చి, ఎవరో కొనుక్కుని పోయి ఉంటారు. బేరం చేస్తే ఇవ్వరని తెలుసు. అసలు ఆ కంచెం నాదాయె? వాడికెందుకిస్తారూ? అందుకనే అంత ధర పెట్టాడు?

పాతిక కాదు యాభై పెట్టినా అల్లాంటి కంచం వాడికి తలక్రిందుగా తపస్సు చేసినా దొరుకుతుందా ఈ రోజుల్లో? ఏదీ అల్లాంటిది ఇంకొకటి బజారులో ఎక్కడైనా తెమ్మను

చూద్దాము? కాజేశాడు? ఏం జేస్తాము? అని అనుకొంటూ దిగాలపడి నుంచున్నాను.

ఇంతలో హెబ్బారువచ్చి "ఏం కావాలండీ పంతులుగారూ, అల్లా దిగులుగా నుంచున్నారూ?" అని అడిగాడు.

నేను బిక్క ముఖంతో అన్నాను. "నా కంచం ఎవరో కొనుక్కు పోయినారటగా? నా కోసం ఉంచుతానంటిరే?"

"ఎప్పటి మాటండీ? అయినా ఆ కంచం మీకు ఎందుకులెండి. ఇనపముక్క?"

వళ్ళుమండే మాటలు ఇవి. ఇంతకు ముందు ఎంతో మంచిదని చెప్పాడు. ఇప్పుడేమన్నా అది ఇనపరేకు అంటాడు. ఎక్కువ ధనం వస్తే అమ్ముకొని!

"అప్పుడు మంచిదని అంటిరే?" అని అడిగాను.

"అప్పుడు అన్నాను; మీరు ఏమంటారో చూద్దామని; మీరు అమాయకంగా కొంటానంటే నవ్వుకొన్నాను."

ఈ అబద్ధాలు వింటేమరీ వళ్ళుమండి, "ఎందుకండి ఈ మాటలన్నీ. ఎక్కువ ధర వస్తే అమ్ముకొన్నానని చెప్పరాదూ?" అన్నాను.

"అదా మీ అనుమానం; కావలిస్తే చూడండి?" అంటూ హెబ్బారు. ఒక బీరువాపై నుండి చిత్తుకాయితాలలో పడేసి వున్న కంచాన్ని తీసి చూపించాడు.

అది నా కంచమే; అంచులు తెల్లగా వున్నా అడుగంతా తుప్పుపట్టింది. చిల్లులు పడ్డది. ఎందుకూ పనికిరాదు. దాన్ని చూస్తే నాకు కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగినై. నా కోసం అది ఎంతకాలమో ఎదురు చూసింది. పరితపించింది? ఈ పరితాపం వల్లనే దాని శరీరం మలినమై తూట్లమయమయింది. ఆ కంచానికి నే నేదో గొప్ప అపరాధం చేశాను అని అనిపించింది.

ఇక ఆయనతో ఆటే మాట్లాడి లాభం లేదని తోచింది. నేను కొంటానన్నప్పుడు చాలా మంచి సరుకు అని అంటివే. ఇప్పుడు ఇల్లాగ అయిందేమి అనటం వల్ల లాభం ఏమీ లేదు.

నేను ఆరునెల్లు ఆలస్యం చేశాను. ఈ మధ్య దానిపని కాస్తా అయిపోయింది. నిజానికి కొనకపోవటమే మంచిదయింది. కాని నాకు మటుకు ఎందుకో చాలా కష్టం వేసింది. అది కాస్తా అట్లా అయిపోయింది కదా. ఇక తెల్లటి కంచంలో అన్నం తినాలన్న నా సరదా ఎట్లా తీరాలె? ఈ తీరని కోరిక నన్ను చాలా బాధపెట్టింది.

విచారంగా ఇంటికి వచ్చేశాను. ఈ జన్మలో తెల్లటి కంచంలో అన్నం తినే భాగ్యం నాకు లేదుగదా అని దుఃఖం వచ్చింది. వెండి కంచం నేను కొనుక్కోలేను గదా? ఇదన్నా కొనుక్కోక పోతిని. పైగా దాని బ్రతుకు బండలు చేస్తిని? కళ్ళనీళ్ళ పర్యంతం అయింది.

ఇంటికి వచ్చేసరికి తొమ్మిది గంటలైంది. చాలా విచారంగా గదిలోకి వెళ్ళి పడుకొన్నాను. మా ఆవిడ వచ్చి అన్నానికి లెమ్మన్నది. నాకు తినాలని బుద్ధి పుట్టలేదు. "వద్దు" అన్నాను.

"ఎందుచేతా?" అన్నది ఆవిడ.

"మనస్సులో ఏమీ బాగాలేదు" అన్నాను.

"కారణం ఏమిటో కొంచెం చెపుదురూ?" అంటూ దగ్గరకు వచ్చి మీద చెయ్యి వేసింది.

సంగతంతా వివరంగా చెప్పాను. కాంతం నవ్వి "ఈ మాత్రానికే నండి? మీకు తెల్లటి కంచం మీద అంత అభిమానం వుంటే, గిల్టు కంచం ఎందుకండీ? వెండి కంచం కొందాం రండి" అన్నది. నా జన్మకు అల్లాంటి భాగ్యం లేదులే అని మనస్సులో అనుకొని, లేచి కాళ్ళు కడుక్కొని పైన తువాలా వేసుకొని వంట ఇంట్లోకి వెళ్ళాను.

అక్కడ నేను ఏమి చూశాను? – పెద్ద పీటా, దాని ముందు ఒక వెండి కంచం! నా కళ్ళను నేను నమ్మలేక పోయినాను.

"అరె? ఎక్కడిదీ కంచం?

"మనదే?" అన్నది ఆవిడ నవ్వుతూ.

"మనదే? మన కెక్కడిదీ?"

"కొన్నాను?" అన్నది.

"డబ్బు ఎక్కడిదీ కొనటానికి?"

అంతా డబ్బు ఉండే కొంటున్నారుటండీ! మీకు ఇష్టమైన వస్తువు గదా అని కొనేశాను. ఎనభై ఎనిమిది రూపాయలు'.

"ఇంత డబ్బు ఎక్కడిదో చెప్పు. నాకు భయంగా వుంది?"

"భోజనం చెయ్యండి. చెపుతాను."

"చెప్పందే భోజనం చెయ్యను!"

"అప్పు జేశాను."

ఈ మాట వినేసరికి నా గుండెలో రాయి పడ్డది. "అప్పు జేశావా? ఇంత అప్పు నేను తీర్చగలనా? ఈ దిగులుతో అన్నం కూడా సహించదు." అన్నాను నేను. అప్పటికింకా నేను పీట పైన కూర్చోలేదు. నిలబడే మాట్లాడుతున్నాను. 'అప్పు' అన్న మాటవిని దిగులుతో క్రింది చూపులు చూస్తూ ఉండిపోయాను. కాంతం రెక్కబట్టుకొని కూర్చోబెడుతూ. "ఎందుకండీ అంత దిగులు పడతారు? అప్పు లేదూ ఏమీ లేదూ, నా డబ్బు పెట్టి కొన్నాను."

ఈ మాటలు మరీ విచిత్రంగా వున్నయ్. తన డబ్బుట? తనకు డబ్బు ఎక్కడిదో?

"నీకు డబ్బు ఎక్కడిదీ?" అని అడిగాను.

"రామన్నపేటలో యిల్లు అమ్మేశాను."

"రామన్నపేటలో నీకు ఓ యిల్లు వున్నదా?"

"ఉండాలా ఏమిటండీ, అంతా ఉండే అమ్ముతారా?" అని నా మాటలు నాకు ఒప్పజెప్పింది.

"సరేలే. వేళాకోళం కట్టిపెట్టి డబ్బు ఎక్కడిదో చెప్పు"

"సంపాదించుకొన్నానండీ?"

"ఎట్లా సంపాదించుకొన్నావూ?"

"అదో పెద్ద కష్టమా ఏమిటండీ? నా మొగుడుగారు నెలకు డెబ్బై అయిదు రూపాయలు సంపాదిస్తున్నారు. ఆయన డబ్బు అంతా నా చేతికే ఇస్తారు. నేను ఎట్లాగో కష్టపడి మిగుల్చుకొని ఇది కొనుక్కొన్నాను" అని దీర్ఘాలు తీసింది.

నాకు నవ్వు వచ్చింది. "ఇదంతా నీవు సంపాదించినట్లే కామాలును" అన్నాను.

"ఆ. సందేహం ఏమీ లేదు. ఈ డబ్బు అంతా నా కష్టార్జితం. ఆడవాళ్ళ సంపాదన అంటే ఇదే? ఇది నా కంచం. దీనిమీద నా పేరే వేయిస్తాను" అని నిక్కచ్చిగా చెప్పేసింది. నేను సంతోషించి 'అయితే నన్ను ఈ కంచంలో తిననిస్తావా?" అని అడిగాను.

"అల్లాగే, పిచ్చి పిచ్చి చేష్టలు చేయకుండా ప్రేమగా, ఉన్నంతకాలమూ, నా కంచంలోనే మీరు తినాలె. మీరు తిని లేచిన తరువాత ఆ కంచంలో నేను తింటాను" అన్నది.

ఆ తరువాత నేను సంతోషంతో మాట్లాడకుండా ఆ తెల్లటి కంచంలో కడుపు నిండా అన్నం తిన్నాను.

ఆ తరువాత ఆవిడ కూడా అన్నం తిని కంచం శుభ్రంగా కడిగి, తుడిచి అందులోనే వక్కలూ, తమలపాకులూ పెట్టుకొని గదిలోకి వచ్చింది. దీపపు కాంతిలో వెండికంచం గర్వంతో ధగ ధగ మెరిసిపోతున్నది.

నేను తమలపాకులు నములుతూ, అన్నాను : "అయితే, చూడు ఎట్లా సంపాదించావు ఇంత డబ్బు. ఏనెల కానెల నాకు లెక్కజెప్పే దానివే? అదంతా అబద్ధమా?"

"ఎబ్బే. అబద్ధం ఎందుకు చెపుతానండీ. అంతా నిజమే! ఎట్లాగో కష్టపడి మిగిల్చాను.

"ఏమిటి ఆ కష్టపడటం? నాకు అర్థం కావడంలేదు. కొంచెం చెబుదూ?"

"ఎట్లాగో ఓ అట్లాగు మిగిల్చాను. అదంతా మీ కెందుకూ? ఆడవాళ్ళ రహస్యాలన్నీ చెప్పమంటారేం?"

"అబ్బ చెబుదూ" అంటూ చేయి పట్టుకు దగ్గరకు లాక్కున్నాను.

"అంహ, చెప్పను" అంటూ నాకు దూరంగా నుంచుని, "దానికేంగానీండి, చూడండి. నాయుడుగారి భార్యకు పదిరూపాయలు ఇవ్వాలె, ఆవిడ చాలా తొందర పెడుతున్నది. మీ దగ్గిర డబ్బు ఉన్నట్లుగా వుంది. ఇచ్చేయండి" అన్నది.

నాకు చాలా ఆశ్చర్యం వేసింది. నాకు పదిరూపాయలు వచ్చినయ్యని ఎట్లా తెలిసింది ఈమెగారికి అప్పుడే.

"నా దగ్గర డబ్బు ఉందని నీకు ఎట్లా తెలిసింది?" అని అడిగాను.

"అంతమాత్రం తెలియదా ఏమిటండీ నాకు?" అంటూ ఆవిడ చొక్కా జేబులో చేయిపెట్టి పర్సు తీస్తున్నది.

నాకు ఆ డబ్బు ఎక్కడో మద్రాసునుంచి వచ్చింది. అదైనా స్కూల్‌లో ఇచ్చిపోయినాడు పోస్ట్‌మాన్. ఈవిడకు ఎట్లా తెలిసింది? నాకు చాలా ఆశ్చర్యం కలిగి "నీకు ఎట్లా తెలిసిందీ చెప్ప"మని పట్టుపట్టాను. ఆవిడ చెప్పనంటే చెప్పనన్నది. పైగా, అన్నది."మీ దగ్గర వుంటే కర్చు అయిపోతూంది నేను తీసుకొంటాను ఈ పదిరూపాయలూ" అని.

"ఏం చేస్తావూ?"

"చెప్పలేదుటండీ నాయుడుగారి భార్యకు ఇవ్వాలనీ?"

"ఇక తెలిసిందిలే నీ రహస్యం? ఆ నాయుడుగారి భార్యకు నీవు ఎంత ఇవ్వాలిసిందీ నేనే స్వయంగా కనుక్కొని ఇస్తానుండు?" అని అంటూ నవ్వు ఆపుకోలేక పోయాను.

కాంతం కృత్రిమ కోపాన్ని నటిస్తూ. "ఓహో ఇది చాలా బాగుందండోయ్;


ఆవిడను మాట్లాడించేరు సధ్యః. ఆవిడకు ఘోషా, ఎవ్వరితోనూ మాట్లాడదు. కోపం కూడా వస్తుంది".

నేను విరగబడి నవ్వాను. ఈవిడ ఆడుతున్న నాటకాన్ని గ్రహించి.

కాంతం పర్సులోనుంచి నోట్లు లెక్కపెట్టి తీసుకొని. "బాకీ తీర్చేస్తే మర్యాదగా వుంటుంది. రేపు ప్రొద్దున్నే ఆవిడకు పంపించివేస్తాను ఈ పదిరూపాయలూ, ఇంకా కాస్తో కూస్తో వుంటే నెల ఆఖరుకు ఇవ్వవచ్చు లెండి" అన్నది.

నాయుడుగారి భార్య ధర్మమా అంటూ మాకీ కంచం ఏర్పడ్డది. "ప్రతి ఇంటావిడకూ ఇల్లాగ ఒక నాయుడుగారి భార్య ఉంటే సంసారాలు బాగుపడతవిరా" అనుకొని నిద్రపోయాను.

# శ్రీనివాస శిరోమణి



**క**థకులు, వ్యాసకర్త, శ్రీ వాల్మీకి రామాయణము నకు నవరస భరితమైన వచన రచన చేసి వాసికెక్కినారు. వీరి కథల్లో ఘటనా వైశిష్ట్యమూ, సంభాషణల వైచిత్ర్యమూ. మనోవైజ్ఞానిక చిత్రణా, హృద్యమైన హాస్యంతో మిళితమైన వ్యంగ్యమూ సుందరంగా అభివ్యక్తమౌ తుంటాయి.

**రచనలు :** శిరోమణి కథలు, పంచవటి (కథలు) శ్రీ వాల్మీకి రామాయణమునకు వచనము.

# చంద్రైక పుత్రః

"**అ**క్కయ్యా, బావ ఏం చేస్తున్నాడు" అంటూ పొద్దునే కరణము రామయ్య వచ్చి సుబ్బమ్మని అడిగినాడు.

"కూర్చోండి పంతులూ, నిన్న ఉదయం పాలెం పోయినారు. ఇంతవరకూ రాలేదు. రాత్రికే వస్తాము అన్నారు" అన్నది సుబ్బమ్మ.

"ఎందుకు పోయినాడు?"

"అక్కడ వారి తాలూకు ఎవడో పిల్లగాడు ఉన్నాడుట. వాణ్ని పెంచుకోవలసింది అని వారి వారు అందరూ పట్టుపట్టినారు, ఆ పిల్లవాణ్ని చూడటానికి పోయినారు."

"అదేమిటి అక్కయ్యా, బావకు మతిపోతే పోయింది; నీకు కూడా మతిపోయిందేమిటి? – ఏ ఒక్కచోటనైనా పెంపుడు కొడుకు అతకడము కానీ పెంచుకొన్న తల్లితండ్రులకు ఉపయోగ పడటము కానీ చూచినామా? లేనిపోని తద్దినం. పెంపుడు అంటే తగాదా కొనుక్కోడము అన్నమాట. ఈ కాస్త విషయము నీకెట్లా తోచలేదు" అన్నాడు రామయ్య.

"పంతులూ, మీ బావగారి సంగతి నీకు తెలియనిదేముంది? అనుకొన్నట్టు చేసి తీరవలసిందే."

"కాదులేవమ్మా, నీకు తోచి వుండదు. లేకపోతే నీవు చెబితే బావ వినకపోవడము ఏమిటి?"

"అయితే నా ఇష్టముతోనే మీ బావగారు ఈ ప్రయత్నము అంతా చేస్తున్నారు అంటావా?"

"సుతరామూనూ."

సుబ్బమ్మ ఒక్క నవ్వు నవ్వింది. "సరే, ఆయన గారు రానియ్యి చూద్దాము" అన్నది.

"అయితే అక్కయ్యా, నీకు పిల్లలుకనే వయస్సు మళ్ళింది అంటావా."

"ఇంకేమి పిల్లలు. నేను కిందట గాలివాన ఇంకా అయిదు సంవత్సరాలకు కొడుతుందనగా కాపురానికి వచ్చినాను. గాలివాన కొట్టి ఎన్నేళ్ళు అయిందో లెక్క చెప్పు."

"గాలివాన కొట్టి ఇప్పటికి పాతికేళ్ళు అయింది ఏమోలే – నీ కడుపున ఒక కాయ కాయకూడదూ" అన్నాడు రామయ్య.

"చాలులే – నీ చమత్కారము. నలభై అయిదు దాటిపోయినవి. ఇంకా పిల్లలు ఏమిటి?"

"పోనీలే – నీవు పిల్లలను కనలేకపోయినా మా బావకు పిల్లలు పుట్టే వయస్సు మాత్రం మళ్ళలేదు."

సుబ్బమ్మ నవ్వింది. కాని ఆమె ఊహలు ఎక్కడెక్కడికో పోయినవి. ఒక్కసారి రామయ్యను తేరిపారచూచి, "నిజమే పంతులూ, నీవు అన్నట్టు నా పిల్లవాడు కాకపోయినా ఆయన గారి పిల్లవాడు అయినా కొంతనయమే" అన్నది.

"అదేనమ్మా నేనూ చెబుతూ ఉంది" అని రామయ్య అంటూ ఉండగా కిర్రు చెప్పులతో గ్రామమున్సబు నారయ్య వచ్చినాడు. రామయ్యను చూస్తూ "పంతులూ ప్రొద్దునే వచ్చినావు. ఏమిటి తహశిల్‌దారు మన ఊరు వస్తున్నాను అని తాకీదు ఏమైనా పంపించినాడు" అన్నాడు.

"అదేమీలేదు. ఒక జ్యోషి మన ఊరు వచ్చినాడు. ఆయన పాండిత్యమూ మీరు పరీక్షించవలెను."

"ఇంతకూ నీకు ఆయన ఏమి జోష్యము చెప్పినాడు" అంటూ నారయ్య కుర్చీలో చేరగిలబడినాడు.

"ఇప్పుడు ఉన్నవాండ్లు చాలనట్లు యింకా నల్గురు ఆడపిల్లలు పుట్టుతారు అన్నాడు."

"శబాస్ మొత్తము పదిమంది అవుతారు అన్నమాట. ఆడుది అంటే మా చెల్లెలుకే తగిపోయింది. చూడు మీ అక్కను..."

"సరేలే సరాగము" అంటూ సుబ్బమ్మ "ఎప్పుడో ఎందుకు పంతులూ – ఆ జోష్యులను ఇప్పుడే పిలిపించు. మీ బావగారు పోయివచ్చిన పని పండో కాయో తేలుతుంది. చూతాము" అన్నది.

"పంతులూ – ఇప్పుడే పిలిపించవయ్యా – మధ్యాహ్నాము నుంచీ నేను మళ్ళీ ప్రయాణమై పోతాను. మోతాహదు లేదు ఎవరిని పంపిస్తావు" అన్నాడు నారయ్య "గురవణ్ని పంపిస్తానులే" అంటూ సుబ్బమ్మ లోపలికి పోయి పాలూ పెరుగూ నెయ్యి మొదలు అయిన మోయీను సామగ్రులు అన్నీఇచ్చి అవన్నీ కరణము గారి ఇంట్లో ఒప్పచెప్పి అక్కడ ఉన్న జోష్యులవారిని వెంటనే పిలుచుకొని రమ్మన్నది. రామయ్య గురవణ్ణి చూస్తూ "వీడు ఎవడు బావా, గుండు అల్లె ఉన్నాడు వీడు ఏదేశము నుంచి ఇక్కడికి దిగినాడు" అన్నాడు.

"మీ అక్క వంట చేసుకోలేక చిత్తూరుజిల్లా నుంచి అల్లా వీణ్ణి రావించిందయ్యా" అన్నాడు నారయ్య.

"వీడు ఆట్టే తినలేడు అనుకొంటాను."

"చాలులెస్తురు మీ వేళాకోళాలు. ఆ జోస్యులు వచ్చేప్పటికి మీరు కాస్త మంచి మాట చేసుకోండి" అంది సుబ్బమ్మ. నారయ్య లేచి ఇంట్లోకి పోయినాడు.

నారయ్య మామూలు గ్రామ మున్సబుల మాదిరిగా కరణాల దస్త్రాల కావలి వాడు కాడు. అతడు శ్రీమంతుడు. ప్రతిభావంతుడు. చిన్నప్పుడు అయితే చదువుకోలేదు; కాని వయస్సు వచ్చిన తరువాత ఓ భట్టురాజు గారిని ఇంట్లో వుంచుకొని తెలుగు ప్రబంధాలు అన్నీ చదివించుకొని తెలుసుకొన్నాడు. వ్యవహార జ్ఞానము కోసము ఒక ఇంగ్లీషు అయ్యవారిని పెట్టుకొని ఇంగ్లీషు నేర్చుకొన్నాడు. ధారాళముగా ఇంగ్లీషు మాట్లాడుతాడు. దొరలు మాట్లాడినా ఇంగ్లీషు ఇట్టే తెలుసుకొని ఇంగ్లీషులోనే జవాబులు చెప్పుతాడు.

పితృపితా మహార్జితము ఒక ఏభై ఎకరాల మాగాణి భూమి, ఒక నూరు ఎకరాల మెట్ట భూమి వుంది. తాత ముత్తాతలు "వద్దు కుయ్యో మొర్రో శిస్తులు కట్టలేము" అన్నప్పటికీ తాహసీల్దార్లు శిస్తులు పెంచడానికి మంజూర్లు చేసిన ఇసుక పర్రలు వందల కొద్దీ యకరాలు నారయ్య హయాములో సరుకు వనాలు అయిపోయినవి. అందువల్ల టోకు బేరము చేసే సరుకు కర్రల అడితీ ఒకటీ.... రైసుమిల్లు ఒకటీ ఉన్నవి. ఆయన ఆ గ్రామ పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు కూడాను. ఇంకా ఇల్లాంటి గౌరవోద్యోగాలు ఎన్నో ఉన్నవి. వదిలేచోట ధారాళముగా వదలడమూ – పట్టవలసిన చోట మంచి గావుపట్టు పట్టడమూ ఆయనకు బాగా తెలుసును. దానము ధర్మమూ పేరూ ప్రతిష్ఠా కలవాడు.

వ్యాపారమూ వ్యవహారాలూ నారయ్య వంతు. వ్యవసాయమూ గొడ్డూ గోదా ఇల్లూ వాకిలీ మొదలు అయినవి అన్నీ సుబ్బమ్మవి. నారయ్య చెప్పిన మాట ఆ ఊళ్ళో ఎప్పుడు అయినా చలామణీ కాకపోతే కాకపోవచ్చును. కాని సుబ్బమ్మ మాట ఆ ఊళ్ళో సుగ్రీవాజ్ఞ. ఇకను ఆ దంపతులకు తీర్పరీ కూర్పరీ కరణము రామయ్య పంతులు. రామయ్య నారయ్య కన్నా పది ఏళ్ళు చిన్నవాడు.

రామయ్య మాట నారయ్య ఎన్నడూ తీసివేసేవాడు కాడు. నారయ్య చెప్పింది చేయకుండా రామయ్య ఎన్నడూ ఠలాయించిందీ లేదు. ఇద్దరూ ఒక్కమాట మీద పోయేవాండ్లు. అందువల్లనే ఆ గ్రామములో పోట్లాటలు వచ్చి పార్టీలు పడి గడ్డివాములు తగులబెట్టుకోవడము కానీ వారి గొడ్లకు వీరు, వీరి గొడ్లకు వారూ మందులు పెట్టి చంపివేయడాలు కానీ లేవు. ఇన్ని మాట లెందుకు – అది బస్తీ పక్కనున్న పల్లెటూరు.

అయినప్పటికిన్నీఒక సివిల్ వ్యవహారము కానీ, ఒక క్రిమినల్ వ్యవహారము కానీ ఊరుదాటి కోర్టుకు పోయింది లేదు.

నారయ్య కానీ అంత కుంకుమ బొట్టు పెట్టుకొని లోపలి నుండి బయటకు వచ్చినాడు. అప్పుడే జ్యోస్యులున్నూ వచ్చినాడు. జ్యోస్యము వినడానికి సుబ్బమ్మ కూడా వచ్చి తలుపు చాటున నిలుచున్నది. నారయ్య జ్యోషీని ఎగాదిగా చూచి "బాల జ్యోతిషం వృద్ధ వైద్యం" అన్నారు. బాగుంది. జ్యోస్యులూ జాతకము ఇవ్వగానే ముందుగా యేమి ఆలోచిస్తావు?" అని ప్రశ్న వేసినాడు.

"ఆయుర్దాయాన్ని గురించి ఆలోచిస్తాను."

"అయితే ఈ జాతకానికి ఆయుర్దాయము చెప్పు" అంటూ జాతకచక్రము ఉన్న కాగితము నారయ్య జోస్యులకు ఇచ్చినాడు. రామయ్య "జోస్యులుబాబూ లగ్నము ఏమిటి – నక్షత్రము ఏమిటి?" అన్నాడు.

"మేషలఘ్నము – మఘా నక్షత్రము" అంటూ "జాతకుడికి దీర్ఘాయుర్దాయము పట్టింది. జాతకము మహా దొడ్డది. ఒక్క పంచమ భావానికే తప్ప మరి యే ఇతర భావానికీ ఏ దోషమూ లేదు. పంచమాధిపతికిన్ని పంచమ స్థానానికిన్నీ పాపార్గళం పట్టింది పుత్రకారకుడు అయిన..."

"ఇదుగో జోస్యులూ మాకు నీ శాస్త్రము గోల అంతా అక్కరలేదు. ఫలము చెప్పండి" అన్నాడు నారయ్య..

"ఇప్పటికి సంతానము లేదు" అన్నాడు జ్యోషి.

"సరే ఇక ముందు సంగతి?" అన్నాడు రామయ్య.

"అయితే కర్మ స్థానాధిపతి అయిన"

"దత్తు చేసుకొంటాడేమో చెప్పవయ్యా" అన్నాడు నారయ్య

"దత్తు పుత్రయోగము లేదు."

"దత్తు చేసుకుంటే"

"దత్తత చేసుకోటము ఉండదు. అనగా దత్తత చేసుకోతలచుకొన్నా కొనసాగదు. విఫలము అయిపోతుంది."

"అంటే"

"దత్తుడు ఇంటికి రాగానే చస్తాడు"

"అమ్మనాయనో – పుత్రశోకము కన్నా దత్తపుత్ర శోకము పట్టశక్యము కాదు అన్నారు పెద్దలు" అన్నాడు రామయ్య. నారయ్య ముఖము వెల వెలా పోయింది.

"అయ్యా, ఈ జాతకములో ఉపపదానికి చంద్ర శుక్ర సంబంధము పట్టింది. కాబట్టి

జీవకళత్రము ఉంటుంది. కర్మస్థానము బాగావుంది. కర్మకారకుడూ కర్మాధిపతి బాగా ఉన్నాడు. "శుభదృగ్యోగాత్యుందరీ!" అని సూత్రము. మంచి అందకత్తెను జాతకుడు కొద్ది రోజులలో పెండ్లి చేసుకొంటాడు. "స్వకులేగుప్తాచ" చంద్రేణైక పుత్రః అనే సూత్రాలున్నూ జాతకానికి అన్వర్తిస్తవి. ఆ అందకత్తెకు ఒక పిల్లవాడు పుట్టుతాడు. వాడు ఈ జాతకుడికి కర్మాధికారి అవుతాడు. తప్పదు.

నారయ్య పక పకా నవ్వినాడు. సుబ్బమ్మ తీవ్రముగా ఆలోచించడము మొదలు పెట్టింది. రామయ్య "శాస్త్రులువారూ, సంతానము ఇంకా ఎంత కాలానికి కలుగుతుంది" అని ప్రశ్నించినాడు.

"ఎబ్బే ఎంతో కాలానికా – ఇప్పుడు కర్మాధిపతి అయిన శని దశలో కుటుంబాధిపతి అయిన శుక్రభుక్తి నడుస్తూ వుంది. కొద్ది రోజులలో జీవకళత్రమూ, ఆ తరువాత – నేటికి పదహారు మాసాలలో జాతకుడికి కర్మచేసే పిల్లవాడు పుట్టుతాడు."

"అట్లా నిజముగా పదహారు మాసాలలో పిల్లవాడు పుట్టేట్లయితే మీకు నూటపదహార్లు బహుమానము ఇప్పిస్తాను" అన్నాడు రామయ్య.

"తప్పకుండా నూటపదహార్లూ బహుమానము పుచ్చుకొంటాను" అన్నాడు జ్యోషి. నారయ్య పదిరూపాయలు తాంబూలములో పెట్టి జ్యోషీని సన్మానించినాడు. రామయ్యతో జ్యోషి వెళ్లిపోయినాడు. నారయ్య పెండ్లాన్ని చూస్తూ "నేను దత్తు చేసుకొంటాను అని మాట ఇచ్చినాను. ఏమి అవుతుందో చూడవలెను" అన్నాడు.

"ఏమి అవుతుంది జోస్యుల నోటివాక్యాన...."

"అయితే నేను దత్తు చేసుకోడము నీకు ఇష్టములేదు అన్నమాట."

"నేను అనేకమార్లు చెప్పినాను. మీరు విన్నారు కారు. ఏమిచేసేది? మొగడికి పుట్టిన పిల్లవాడు అయినా పెండ్లానికి పుట్టిన పిల్లవాడు అయినా ఉపయోగ పడుతాడు కాని ఏ అయ్యకో ఏ అమ్మకో పుట్టినవాడు ఎప్పుడూ అక్కరకు రాడు" అంది సుబ్బమ్మ.

"ఎట్లాగూ – " అని నవ్వినాడు నారయ్య.

❄ ❄ ❄ ❄

జ్యోషీ చెప్పిపోయినట్టుగానే నారయ్య దత్తు చేసుకోతలచుకొన్న పిల్లవాడికి నాల్గురోజులు జ్వరము కాసి చనిపోయినాడు. వంశము నిలవడానికి ఇంకొక పిల్లను పెండ్లి చేసుకోవలసిందేను అని సుబ్బమ్మ పట్టు పట్టింది. రామయ్య అందుకు తోజు చేసినాడు. నారయ్యకు ఇష్టము అయినా కాకపోయినా గ్రహాల ప్రభావమో ఏమో మళ్ళీ పెండ్లి చేసుకోవటానికి ఒప్పు కొన్నాడు. సవతిని సంపాదించటానికి సుబ్బమ్మే పూనుకొన్నది. బహు సంతానము చాలు ఉన్న కుటుంబాలలో పిల్లను తీసుకొని రావలెను అనుకొన్నది.

విచారించింది. స్వయముగా బయలుదేరింది. దూపాటి సీమలో ఒకపేద కుటుంబాన్ని చూచింది. ఆ ఇల్లాలు తొమ్మిది మంది పిల్లలను కన్నది. పిల్లకు ఇరవై సంవత్సరాలు. దారిద్ర్యము వల్ల పెండ్లి కాలేదు. తల్లికి మాదిరిగానే రెబట అల్లె వుంది. తల్లిచాలు పిల్లగా సుబ్బమ్మకు ఆ అమ్మాయి తోచింది. ఆ పిల్ల తల్లితండ్రులనూ తక్కిన సంతానాన్ని పోషించే భారము తమదేను అన్నది. పెనిమిటికి పిల్లను కుదిర్చింది. దైవాను కూలముగా ఉండేటందుకు ఏడుకొండల వాడి ఎదుట పెండ్లి జరుగవలెను అని నిర్ణయించింది.

శుభముహూర్తాన తిరుమల క్షేత్రములో పెనిమిటి నారయ్యకూ సవతి మంగమ్మకూ మూడు ముళ్ళూ వేయించింది. అంతటితో ఆమెకు తనివి తీరలేదు. ప్రత్యేకముగా మొగుణ్ణీ సవతిని అలిమేలు మంగాపురము తీసుకొని పోయి అక్కడే దేవాలయంలో ఉన్న సంతాన గోపాల కృష్ణుడికి మొక్కించింది. పుట్టెడు పటికి బెల్లము నైవేద్యము పెట్టించి నూతన వధూవరులచేత పసిపిల్లలకు పందారము చేయించింది.

తిరుపతినుంచి ఇంటికి తిరిగిరాగానే వ్యవసాయపు పనులు అన్నీ మంగమ్మ తండ్రికిన్నీ గొడ్డూ గోదా వ్యవహారాలు అన్నీ మంగమ్మ తల్లికీ సుబ్బమ్మ ఒప్పగించి వంట ఇంటి పెత్తనము మాత్రము తనమీద వేసుకొంది. నారయ్య కూడా సుబ్బమ్మకు ఏ మాత్రమూ తీసిపోలేదు. తమ డాబా మీద శీత వాత వర్షాతపాలకు లొంగిపోకుండా ఉండేటట్లుగా రెల్లుగడ్డితో చలువ పందిరి వేయించినాడు. ప్రాచీనార్వాచీన పద్ధతులను వేటినీ వదిలిపెట్టకుండా పడకగది సరంజామా అంతా కేటలాగులు అన్నీ చూచి మద్రాసు నుంచి తెప్పించి ఆ చలువ పందిరిలో అమర్చేట్లు చేసినాడు. అది నూతన వధూవరులకు శయ్యా గృహము అయింది.

నారయ్య అంతటితో పోనీయలేదు. తన మునసబు గిరీకి గుమాస్తాను ఏర్పాటు చేసినట్లు గానే రామయ్య పంతులు కరణీకానికిన్నీ ఒక గుమాస్తాను ఏర్పాటు చేసి తన రైసుమిల్లు – కట్టెల అడితి వ్యాపారము ఆయనకు ఒప్పగించి ఇల్లు కదలకుండా ఉండిపోయినాడు. భోజన మజ్జనాదులకు తప్ప డాబా దిగడము మానివేసినాడు. ఇక మంగమ్మ సంగతి చెప్పవలసిన అవసరమే లేదు.

బక్క చిక్కిన ఎద్దుల జతను సంతలో చౌకగా కొనుక్కొని తెచ్చి ఇంతమడ్డికూడూ దాణా తెలకపిండీ పెట్టి మేపితే వారము రోజులలో తేరుకొని బుసలు కొట్టుతూ చక్కగా పొలము పనిచేస్తవి. కుక్కకు ఒక్కపూట ఇంత అన్నము వేసి అంత బెల్లము పెడితే అది తెల్లవారేసరికి పుంజుకొని భౌభౌ మంటూ ప్రతివాణ్ణీ కరవబోతుంది. అయితే మానవుల ఎదుగు బొదుగులు తిండిమీద ఆధారపడవు అని ఇంగ్లీషు వైద్యులు అంటారు. ఇది నిజమో బేనిజమో తెలియదు కాని మంగమ్మ మండలము రోజులలో గుర్తు పట్టడానికి

వీలులేకుండా మారిపోయింది. బంగార శలాక మాదిరిగా తయారు అయింది. శోడ శకలాప్రపూర్ణము అయిన చంద్రబింబము మాదిరిగా ఆమె ముఖము కనుపించసాగింది.

రోజులు గబగబా పరుగెత్త సాగినవి. మంగమ్మకు నిన్ననో మొన్ననో ఆ యింటికి వచ్చినట్లుగా వుంది. కాని అప్పుడే రెండు నెలలు గిర్రున తిరిగిపోయినవి. సుబ్బమ్మ తాతగారికీ జబ్బుగా వుందనీ, ఒక్కసారి పుట్టినింటికి వచ్చిపొమ్మనీ వర్తమానాలు వస్తూవున్నవి. ఆమె కాపురానికి వచ్చిన ఈ పాతిక సంవత్సరాలలోనూ ఎన్నడూ పుట్టినింటికి పోయినా సాయంత్రానికి స్వగృహానికి చేరేది. ఉన్న గొడ్లపాలు సుబ్బమ్మ తప్ప మరి ఎవరూ తీయడానికి వీలులేదు. ఒకవేళ ఎవరు అయినా తీయపోయినా ఆ గొడ్లు ఆమెకు పాలు యిచ్చినట్లు ఇతరులకు ఇవ్వవు. తాతగారిని పోయి చూడవలెనని సుబ్బమ్మకు ఎంతో అభిలాషగా వుంది. గొడ్ల పాలు తీయడము ఎవరికి ఒప్పజెప్పడము అనే చిక్కులో పడ్డది. మంగమ్మ తల్లి తన కూతురు గొడ్ల పాలు తీయడంలో నేర్పరి అని చెప్పింది. సుబ్బమ్మ మంగమ్మను పరీక్షకు పెట్టింది. పోట్ల ఆవులు కూడా మంగమ్మ చెంబు తీసుకొని కూర్చుంటే శేర్లకు శేర్లు పాలు కార్చడము మొదలుపెట్టినవి. సుబ్బమ్మ నిజముగా ఆశ్చర్యపడిపోయింది. "పది సంవత్సరాల ఈ మధ్య ఈ గొడ్లు నాకు ఇన్ని పాలు ఇచ్చిఎరగవు. చెల్లెలా నీ సుతారము నాకు కూడా నేర్పు" అంది సుబ్బమ్మ. మూడు రోజులు అయ్యేసరికి గొడ్లు అన్నీ మంగమ్మకు మాలిమి అయిపోయినవి. పాలు సమృద్ధముగా ఇవ్వడము మొదలు పెట్టినవి. సుబ్బమ్మ ఎంతో సంతోషపడ్డది. "చెల్లెలా, నా ప్రాణము తెరపిన పడ్డది. ఇంత కాలమూ ఏ ఊరు అయినా పోయి నాల్గు రోజులు ఉండి రావడానికి ఈ గొడ్ల మూలాన వీలు కాకుండా పోయింది. అబ్బ, ఇంత కాలానికి నీవు దేవతకుమల్లె వచ్చినావే చెల్లెలా!" అంటూ సుబ్బమ్మ మెచ్చుకొన్నది.

ఇంతలో సుబ్బమ్మగారి పుట్టింటినుంచి జట్కాబండి వచ్చింది. ఆమె తాతగారు ఏ క్షణమో దేహము చాలించేట్లు ఉన్నాడనీ, ఆమెను ఆయన చూడవలెను అనుకొని బండి పంపించినారు అనీ బండివాడు చెప్పినాడు. ఆమె కన్నుల వెంట నీరు కారుస్తూ ఉంటే "ఎందుకు అక్కా ఆలోచిస్తావు? ఏమీ భయంలేదు. పోయిరా! నేను అంతా జాగ్రత్తగా చూసుకొంటాను" అన్నది మంగమ్మ.

"చెల్లెలా! ఈరోజు పగలు యెట్లాగో గడుపు. నా వెంట మీ అమ్మను కూడా తీసుకొని పోతాను. మా ఊరు యిక్కడికి మూడు మైళ్ళే వుంది. వస్తే ఇద్దరమూ సాయంత్రానికి వస్తాము. లేకపోతే మీ అమ్మను పంపించి వేస్తాను" అని మంగమ్మతో చెప్పి, నారయ్యను కూడా తనవెంట రమ్మన్నది సుబ్బమ్మ. ఆయన అయితే బయలుదేరలేదు. కాని సుబ్బమ్మా, ఆమెకు తోడుగా మంగమ్మ తల్లీ జట్కాబండిలో ప్రయాణము అయి, పోయినారు.

సుబ్బమ్మ పుట్టింటికి వెళ్ళిన రెండు రోజులకు నారయ్య జిల్లా బోర్డు మీటింగుకు వెళ్ళవలసి వచ్చింది. అతడు ఆ మరునాడే రావలెను అనుకొన్నాడు. కాని సాధ్యము కాలేదు. వారము రోజులు అయినా సుబ్బమ్మ కానీ, నారయ్య కానీ తిరిగి రాలేదు. అంత ఇంటికీ మంగమ్మే సర్వాధికారి అయిపోయింది.

అది కార్తీక మాసము. మధ్యాహ్నము మూడు గంటలు అయింది. హఠాత్తుగా మబ్బులు పట్టినవి. కాస్సేపటిలో చీకటి పడ్డట్టు అయిపోయింది. బీటిలోనికి వోయిన గొడ్లు అన్నీ ఇంటికి వచ్చినవి. జీతగాండ్లు అందరూ ఇండ్లకు పోయినారు. రాత్రి పడుకోడానికి వచ్చే జీతగాండ్లు అన్నాలు తిని వస్తాము అని చెప్పి వెళ్ళి పోయినారు. చీకట్లు బాగా కమ్ము కొన్నందువల్ల ఇంకా ఎంత పొద్దు ఉంది తెలియలేదు. ఎప్పుడో ఎందుకు అనుకొని గురవడు వంట చకచకా చేసివేసినాడు. కొద్ది కొద్దిగా చినుకులు పడుతూ ఉన్నవి. గాలి మాత్రము జోరుగా ఉంది. మంగమ్మ పొంతకుండలో వేడినీళ్ళు స్నానమే చేసింది. శీతాకాలాన్ని మించిన చలివేస్తూ ఉంది. ఉత్తరము నుంచి విపరీతము గాలి తోలుతూవుంది. ఆ చలికి మంగమ్మా రోజూకన్నా మరికాస్త అన్నము తిన్నది. పయికిపోయి పడుకోడము ఆ గాలీ వానలో సాధ్యము అయ్యేట్లు ఆమెకు కనిపించలేదు. కిందనే పడుకొంది. చీకటి పడేవేళకు చినుకులున్నూ జోరు చేసినవి. మంగమ్మ శాలువ ముసుగుపెట్టు పడుకొంది. ఇట్టే నిద్రపట్టింది.

రాత్రి తొమ్మిది గంటలు అయింది. మంగమ్మ ఉలిక్కిపడ్డట్టుగా లేచింది. గాలి ఈలలు వేస్తూ వుంది. వాన ఎడా పెడా కొడుతూ వుంది. దీపాలు ఎప్పుడో ఆరిపోయినవి. దీపము వెలిగించడానికి నిప్పుపుల్ల గీస్తే నిలవలేదు. ఆరిపోయింది. అంతా అంధకార బంధురముగా ఉంది. తలుపు యేవైపున ఉంది కిటికీలు యే వైపున వున్నవి చటుక్కున తోచలేదు. వసారా పెంకులు లేచిపోతూ ఠపీల్ ఠపిల్ మంటు చప్పుడు చేస్తూ వున్నవి. ఆమెకు భయము వేసింది. “గురవా – గురవా” అని కేక వేసింది. జవాబు లేదు. ఆ చీకటికి కన్నులు అలవాటు పడ్డవి. కిటికీలూ తలుపులూ లీలగా కనిపించినవి. ఎట్లాగో ధైర్యము చిక్కబట్టింది. తలుపు తెరిచింది. దీపము లేదు. లాంతరులు కూడా నిలవడములేదు. మధ్య మధ్య మెరుపులు పట్టపగలు అంతా వెలుతురు వేస్తూ వున్నవి. నాల్గు జతల ఎద్దులనూ హాలులో వదిలిపెట్టి గురవడు బయటికి వెళ్ళుతున్నాడు.

తళుక్కున మెరుపు మెరిసింది. గొడ్ల కొఠ్ఠము మీద పెంకులు గాలికి ఎగిరి పోతూ వున్నవి. చిమ్మిరి చెట్టములోనుంచి నీళ్ళు కొట్టుతూ వున్నట్లుగా వాన దంచుతూ ఉంది. బిత్తరపోయి చూస్తూ నిలుచుంది. చూడి గేదెలనూ పాడి ఆవులనూ గురవడు ఇంటిలోకి తోలి తక్కిన గొడ్లను బయటకు పోవడానికి మెడ తాళ్ళు వదలివేసినాడు.

"అమ్మగారూ, కొమ్ములు బఱ్ఱె ఈనేట్టు వుంది. బ్యాటరీ దీపము వెతకండి" అన్నాడు గురవడు. అదృష్టవశాత్తూ బ్యాటరీ దీపము పెద్దదే మంగమ్మకు దొరికింది. దీపము వేసి చూసింది. పెంకులు అన్ని పోయిన ఆ కొట్టములోనే బఱ్ఱె ఈనుతూ కనిపించింది. దూడను గురవడు ఎత్తుకొన్నాడు. తల్లి గేదెను ఇంట్లోకి తీసుకొని రావడానికి మంగమ్మ దాని మెడతాడు ఒక చేతితో పట్టుకొంది. రెండో చేతిలో బ్యాటరీ దీపము పట్టుకొని నడిపిస్తూ ఉంది. ఉత్తరుపుగాలి పడమరకు తిరిగిపోయింది. గేదె నడువలేక నడువలేక నడుస్తూ వుంది. గాలి ఒక్క విసురు విసిరింది. మంగమ్మ కాళ్ళు నిలపలేకపోయింది. వెల్లకిలా పడ్డది. గురవడు పరుగెత్తుకొని వచ్చి పసిపిల్లను రెండు చేతులలో ఎత్తుకొన్నట్టుగా మంగమ్మను ఎత్తుకొని వచ్చి మంచమ్మీద పడుకోపెట్టి "అమ్మగారూ నడుములు నొప్పి పట్టినవా?" అన్నాడు.

"లేదురా – కాళ్ళు నిలవలేదు" అన్నది.

"అమ్మగారూ – గేదెనూ దూడనూ నేను చూసుకుంటాను. తాము తడిసిపోయినారు. ఒళ్ళు తుడుచుకొని స్వస్థముగా పడుకోండి" అని చెప్పి గురవడు అవతలకు వెళ్ళినాడు.

❄ ❄ ❄ ❄

డాబా గది అయినప్పటికిన్నీ, కిటికీలు మూసివేసి ఉన్నప్పటికిన్నీ గాలి రంయ్‌మని వస్తూ ఉంది. గోడ పక్కను నేలమీద పెట్టిన లాంతరులో దీపము గంతులు వేయడము మొదలు పెట్టింది. మంగమ్మ ఒండ్లు కొంగరపోతూ వుంది. తల గబా గబా తుడుచుకొని, చీరె, రెవిక తీసివేసి, ఒళ్ళు తుడుచుకొని పెట్టెలో చీరె కట్టుకుంటూ ఇటు చూచింది. గురవడు వాకిలిపక్కను నిలుచుని వున్నాడు. వాడు తనను చూచినాడా అనే సందేహము వచ్చింది. చీరె కట్టుకొంటూనే "గురవా! ఏమి చేస్తున్నావు?" అని అడిగింది.

"చలికి వణుకుతూ ఉన్నాను" అన్నాడు.

బ్యాటరీ దీపము వేసి వాణ్ణి చూచింది. గుండువంటి గురవడు వణుకుతూ వుంటే వాడి దేహమూ – పాము పొట్టవంటి వాడిపొట్ట కండలతో మలుపులు తిరిగిన వాడి జబ్బలూ మంగమ్మకు గమ్మత్తుగా తోచినవి.

"ఒరేయ్ చలికి ఎంతసేపు అట్లా వణుకుతావు" అంటూ పెట్టెలోనుంచి తువాలూ పంచె తీసి "ఈ తువాలుతో తుడుచుకుని ఈ పంచె కట్టుకో" అన్నది మంగమ్మ.

"పంచే, తువాలూ దొరగారివి" అంటూ అనుమానించినాడు. మంగమ్మ ఒక్క నవ్వు నవ్వి "ఇప్పుడు నీవే దొరవు" అని వాడి ముఖము వంక చూచింది. వాడికి సిగ్గు వచ్చి తల వంచుకున్నాడు. ఆమె చేతులో వున్న బ్యాటరీ దీపములో బ్యాటరీ అయిపోయింది. గంతులు వేస్తూ వున్న దీపము ఎన్నడో ఆరిపోయింది. అంతా చీకటి గుయ్యారముగా

వుంది. గాలి వానా మరింత జోరు అయింది. మంగమ్మ పడుకొంది. ఆమె ఒళ్ళు అంతా తిమ్మిరి తిమ్మిరిగా వుంది.

"గురవా" అని పిలిచింది.

"ఆఁ" అని పలికినాడు.

"ఒరేయ్ నాకు భయము వేస్తూ వుంది. నీవు ఇక్కడకు రా" అన్నది. వాడు ఆ చీకటి గదిలోకి వచ్చినాడు.

❄ ❄ ❄ ❄

గాలివాన నాడు రాత్రి ఇంటి కాపలావాడూ, గురవడూ తప్ప ఏ జీతగాడూ ఇంటో లేనందుకు నారయ్యకు పుట్టెడు కోపము వచ్చింది. కాని ఎవరినీ ఏమీ అనలేదు. గొడ్ల కొట్టము కొట్టుకొని పోవడము తప్ప యే నష్టమూ లేకుండా పోయినందుకు మనస్సులో సంతోషించినాడు. గొడ్ల కొఠము పెంచి జీతగాండ్లు అందరూ ఉండటానికి బందోబస్తు అయిన భవంతి వేయించడము మొదలు పెట్టినాడు.

సుబ్బమ్మ తాతగారు చనిపోయినాడు. దినవారాలు అయిన తర్వాత ఎంతో దుఃఖముతో ఇంటికి తిరిగి వచ్చింది. గాలివానకు ఏ నష్టమూ రానందుకు ఆమె సంతోషపడ్డది. గొడ్లకొఠము పెంచి జీతగాండ్లు కూడా తమ ఆవరణములోనే కాపురాలు ఉండే ఏర్పాట్లు నారయ్య చేస్తూ ఉన్నందుకు ఆమెకు మరింత సంతోషము వేసింది.

అంతవరకూ మందకొడిగా అయోమయముగా ఉంటూ వచ్చిన గురవడు మహా హుషారుగా పనులు చేస్తూ ఉండడము చూచి ఆశ్చర్యపోయింది. అందులో పలుకరించినా మాట్లాడని వాడు ఎవరు ఏమి అడిగినా గురవడు తడువుకోకుండా సమాధానాలు చెపుతూ ఉంటే సుబ్బమ్మకు మరింత ఆశ్చర్యము వేసింది.

మంగమ్మకు నెల తప్పిపోయింది. సుబ్బమ్మ సంతోషానికి మేరలేకుండా పోయింది. మూడు నెలలు గడచినవి. మంగమ్మకు కడుపు వచ్చినట్లు రూఢి అయిపోయింది. ఆమె కొడుకును కంటుందో, కూతురును కంటుందోనని అందరూ ఆలోచించసాగినారు. ఆ ఇంట్లో ప్రతిరోజూ అచ్చట్లూ ముచ్చట్లూ ఉండి ప్రతి క్షణమూ పండుగగానే ఉంది. ఊళ్ళో వాండ్లు, అందరూ పండ్లు, పసుపు, కుంకమూ పట్టురవికె గుడ్డలు, పట్టుచీరెలు తెచ్చి ఇవ్వసాగినారు. ఆ ఊళ్ళో వున్న బ్రాహ్మణ ఇండ్ల ఆడవాండ్లు కూడా యధాశక్తిన పసుపూ కుంకమూ తెచ్చి ఇచ్చినారు. మంగమ్మకు కొడుకు పుట్టవలెను అనే అందరూ కోరుకున్నారు. వేళాకోళానికి సుబ్బమ్మ కూడా ఇక బిడ్డలను కంటుంది అని అన్నారు.

ఇల్లు అంతా ఎంత గబగబలుగా వున్నా, ఎంత కోలాహలముగా ఉన్నా సుబ్బమ్మ వెయ్యి కళ్ళతో గురవణ్ణీ కనిపెడుతూ వుంది. నారయ్య ఏదో వ్యవహారము మీద మళ్ళీ

ఊరికి పోయినాడు. రాత్రి భోజనాలు అయినవి. సవతులు ఇద్దరూ కబుర్లు చెప్పుకొంటూ తాంబూలాలు వేసుకొంటున్నారు. గురవడు యథాప్రకారము డాబామీదికి మంచినీళ్ళూ వగయిరాలు తీసుకొని పోతూ మంగమ్మ వంక జూడడమూ ఆమె వాడితో నేత్రావధానము చేయడమూ కనిపెట్టింది. ఏమీ తెలియనట్టుగా అమాయికముగా "చెల్లెలా – వారు ఊళ్ళో లేరాయెను. పయిన పడుకోడము ఎందుకు, నీకు డోకు వచ్చినా, ఒళ్ళు తిప్పినా పైనుంచి నీవు కేకలు పెట్టితే మేము లేస్తాము లేవలేకపోతాము కాబట్టి కిందనే పడుకో" అంటూ సుబ్బమ్మ మంగమ్మ ముఖము తేరిపార చూచింది.

"అక్కా నాకు ఆ మంచము మీద పడుకొన్నట్టుగా ఏ మంచముమీద పడుకొన్నా ఉండదు".

"అయితే ఆ మంచమే ఇక్కడికి తెప్పించేదీ?"

"నాకు ఆ మరలు తీయడము చేతకాదు."

"చేతనయినవాండ్లే తెస్తారు" అంది. ఆ మంచాన్ని అప్పటికి అప్పుడు కిందికి తెప్పించింది. మంగమ్మ తీవ్రముగా ఆలోచించింది. ఆమెకు భయము వేసింది. ఉత్తరక్షణమే ధైర్యము తెచ్చుకొన్నది. సుబ్బమ్మ తనమీద ఆపేక్షచేతనే అట్లా చెప్పి ఉంటుంది అని నిర్ణయించుకొన్నది. కాని ఆమె బుర్ర పరిపరి విధాలపోతూ వుంది.

"చెల్లెలా – నిద్రపోతున్నావా" అంటూ సుబ్బమ్మ వచ్చింది.

"లేదు" అన్నది మంగమ్మ.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"ఎబ్బే ఏమీలేదు."

"ఇక రేపటినుంచి నేనే గొడ్డూ గోదా చూచుకొంటాను. మీ అమ్మకు వంట ఇల్లు ఒప్పచెప్పుతాను. గురవణ్ణి వంటపనిలోనుంచి తగ్గించివేయవలెను అనుకొంటున్నాను" అన్నది.

మంగమ్మ చూస్తూ ఊరుకుంది.

"చెల్లెలా ఎందుకు అట్లా చూస్తావు..... వాణ్ణి అసలే పంపించివేదామా అని కూడా అనుకొంటున్నాను."

"మీ ఇష్టము."

"నీవు తెలివి అయినదానివే చెల్లెలా – అవునులే – అంతే" అంటూ సవతి పక్కలో కూర్చుని సంతోషముతో ఆమెను కొంచెము సేపు చేతితో నిమిరి "హాయిగా నిద్రపో" అని చెప్పి వెళ్ళిపోయింది.

సుబ్బమ్మ యథాప్రకారము సావిట్లో పడుకొంది. సంతోషాతిశయమువల్ల కాబోలు

ఎన్నడూ లేని పద్ధతిన సొమ్మసిల్లి నిద్రపోయింది. తెల్లవారుఝామున మూడు గంటలు కావస్తూ వుంది. సుబ్బమ్మకు హఠాత్తుగా నిద్ర మెలకువ వచ్చింది. పక్కగదిలో మనిషి అలికిడి అయింది. క్షణలేశము ఆలకించింది. చడీచప్పుడూ లేకుండా బయటికి నడిచింది. గొడ్ల కొఠములో గురవడి గది దగ్గరకు పోయింది. తలుపులు బయట తాళము వేసి వుంది. మారు తాళము చెవితో తాళము తీసింది. లోపలికి పోయింది. పెట్టితీసి చూచింది. ఏభై రూపాయలు కనిపించినవి. పట్టరాని కోపము వచ్చింది. తన మెడలో వున్న కాసుల దండ అమాంతమూ తెంచింది. ఆ తెంచడములో కొన్ని కాసులు కిందపడ్డవి. యధాప్రకారము తలుపుకు తాళము వేసింది. రెండోకంటికి తెలియకుండా వచ్చి పడుకొంది.

పడమటి ఇంట్లో గురవడు పొయ్యిలో నిప్పు రాజేస్తున్నాడు.

హఠాత్తుగా సుబ్బమ్మ "ఆఁ ఆఁ" అంటూ "నా మెడలో కాసులదండ ఎవరు తెంచుతున్నారు" అంటూ కేకలు పెట్టుతూ లేచింది.

❄ ❄ ❄ ❄

కరణము రామయ్య ఆశ్చర్యముతో "అది ఏమిటి అక్కయ్యా – తెల్లవారుతూ ఉండగా నీమెళ్ళో కాసుల పేరు తెంపుకొని పోవడము ఏమిటి?" అన్నాడు.

"అదే పంతులూ – ఆశ్చర్యము. పోలీసులను పిలిపించు" అంది సుబ్బమ్మ.

రామయ్య ఆలోచిస్తూ "ఎవళ్ళో ఏమిటో మనము ముందుగా..."అంటున్నాడు. సుబ్బమ్మ ఉగ్రమూర్తి అయి "పంతులూ! యావన్మందినీ బయటకు లాగించి తాళాలు వేయించడమే కాదు. చూడు నా ఇంటికి కూడా తాళము పెట్టించినాను. నా ఆవరణలో ఎవరు తప్పుపని చేసినా నేను మన్నించేది లేదు. ఎందుకు అనుమానిస్తావు? నీవు పోలీసులను పిలిపిస్తావా లేకపోతే నేనే పోయి పోలీసులను పిలుచుకొని వచ్చేదా" అంది.

పంతులు నిబ్బరముగా "బావ మున్సబుగిరీకి వచ్చింది మొదలు ఈరోజు వరకూ ఒక్క క్రిమినల్ కేసు పొలిమేర దాటిపోలేదు. బావ ఏమంటాడోనని ఆలోచిస్తున్నాను" అన్నాడు.

"పంతులూ బావగారు ఏమీ నిన్ను అనకుండా ఉండే భారము నాది."

"అయితే పోలీసులను రప్పించడము ఎంత మహద్భాగ్యము అక్కా ఇల్లు సోదా చేయించవలసి వస్తుంది సుమా."

"అదే నేను కోరుతూ వుంది."

"సరే" అన్నాడు పంతులు.

❄ ❄ ❄ ❄

గురవడి మీద క్రిమినల్ కేసు విచారణకు వచ్చింది. మేజిస్ట్రేటు ఉగ్రుడు అయి పోయినాడు. సంవత్సరము కఠిన శిక్ష విధించినాడు.

❄ ❄ ❄ ❄

తొమ్మిదో మాసము వెళుతూ ఉండగా మంగమ్మ సుఖముగా ప్రసవించింది. దుండు ముక్కవంటి మగపిల్లవాడు పుట్టినాడు.

బ్రహ్మాండముగా బారసాల తంతు జరిగింది. నూలపదార్లు తీసుకోడానికి జ్యోషి కూడా హాజరు అయినాడు. ఊరివారి అందరికీ మృష్టాన్నదానము చేసినారు.

సుబ్బమ్మ సాయంత్రము అప్పుడు సంతోషముగా శిశువును పెనిమిటి దగ్గిరకు తీసుకొని వచ్చి "చూడండి, ఎంత చక్కనివాడో చూడండి, అచ్చుము మీ పోలికేను. ఆ గడ్డమూ –ఆ ముక్కూ ఆ కళ్ళూ అంతా మీరేను" అంటూ నవ్వింది.

నారయ్య శిశువునూ ఆ శిశువును కన్న మంగమ్మనూ చూస్తూ బ్రహ్మానంద పడిపోయినాడు.

# కరుణ కుమార

**(1901 - 1956)**



**అ**సలు పేరు కందుకూరి అనంతం. పల్లెటూరి హృదయం. పల్లెటూరి జీవితం. పల్లెటూరి భాష. వీరి కథల్లోని కొత్తదనం, గొప్పదనమూను, పల్లెసీమలలోని ప్రజల సుఖదుఃఖాలు, వారి జీవిత విశేషాలూ, సమస్యలూ ఇతివృత్తంగా, స్థానిక భాషతో, శాశ్వతంగా పాఠకుని స్మృతిపథాన నిలిచిపోగల కరుణ రసాత్మకమైన కథలు వ్రాశారు. వీరి శైలిలో దేశీయాలూ, మాండలికాలు కోకొల్లలు.

**రచనలు :** సన్న జీవాలు, కరుణ కుమార కథలు

# టార్చిలైటు

రెడ్డిపాలెం అని ఓ చిన్న పల్లెటూరు. ఈ గ్రామంలో బోర్డు ఎలిమెంటరీ స్కూలు పెట్టి ఓ సంవత్సరం కూడా కాలేదు. అంతకు పూర్వం ఓ వైదికాయన వీధిబడి పెట్టుకొని పదిమంది పిల్లకాయలకి చదువు చెప్పుకొంటూ వుండేవాడు. నిరుడు సంవత్సరం జిల్లా బోర్డు ఎన్నికలలో గరటయ్య అని ఆ ప్రక్కవూరు రైతు ఒకాయన గెలిచి, ప్రెసిడెంటు అయ్యాడు. ఆయన గారికి రెడ్డిపాలెం అంటే ఎంతో మోజు. ఆ రెడ్డిపాలెంలో పదియిళ్ళ వాళ్ళు కాపులు బలవంతులున్నారు. తెల్లవారి లేస్తే వాళ్ళ దగ్గర ఇంత తెచ్చుకోవడం, ఇవ్వడం – వాళ్లకీ వాళ్ళకీ తొంభయి లావాదేవీలు. అందువల్ల తన ప్రెసిడెంటుగిరీలో ఆ గ్రామానికి కొన్ని శాశ్వతమయిన ఉపకారాలు చేయాలని, మీటింగులో బోర్డు స్కూలు మంజూరు చేయించి, పదిహేను వందల రూపాయలతో బిల్డింగు కట్టించి, వీధిబడిలో చదువుకొనే పిల్లకాయలనందరినీ బోర్డు స్కూలులో చేర్పించాడు ప్రెసిడెంటు.

ఇద్దరు టీచర్లకు చాలినంత మంది పిల్లలు లేనందువల్ల పెంటల మీద తిరిగే చాకలి, మంగలి, కుమ్మరి, రెడ్డె, సాలె, గొల్ల, యానాది వగైరా ప్రతి పిల్లకాయనీ తీసుకువచ్చి ఓ అరవయిమందిని పోగుచేసి ఆ స్కూలులో చేర్పించాడు ఆ ప్రెసిడెంటు.

ఈ సంవత్సరమే కొత్తగా పెట్టిన స్కూలయినందువల్ల ఈ యేడు ఈ స్కూలులో కూడా ఆరోగ్యవారం జరిపి, పిల్లకాయలచేత ఆటలాడించి, బహుమతులివ్వవలసిందని ప్రెసిడెంటుగారి దగ్గరనుండి హెడ్మాస్టరుకు తాఖీదు వచ్చింది. అయితే, దీనికయ్యే ఖర్చులు జిల్లాబోర్డు భరించుకొనే స్థితిలో లేనందువల్ల గ్రామంలోని రైతులవల్లా, గ్రామస్థులవల్లా తలాకొంచెంగా చందాలు వేయించి, ఆ పైకంతోనే ఆరోగ్య వారం జరపవలసిందని కూడా ఆ తాఖీదులోనే వ్రాశారు ప్రెసిడెంటుగారు.

ఆ హెడ్మాస్టరు క్రైస్తవుడు. పేరు జకరయ్య. పాపం, బీదవాడూ, భయస్థుడూను. ప్రెసిడెంటు గారి ఉత్తరువు తీసుకొని గ్రామంలో పదిమంది పెద్దలకూ చూపి, తలాకొంచె

చందావేసి సహాయం చేయవలసిందని కోరాడు జకరయ్య. ఈ ఆరోగ్యవారాలూ, వేడుకలూ, వీటి ఉపయోగాలూ వాళ్ళ కంతగా అర్థమైనా కాకపోయినా, ఏమో పిల్లకాయల చేత ఆటలాడించి బహుమతులిస్తానని అంటున్నాడు అయ్యవారు అని, పదిమంది కాపులూ, బ్రాహ్మలూ, గ్రామాధికార్లూ కలిసి చందాలు వేసి, ఓ యిరవై రూపాయలు జమచేసి, అతని చేతిలో పెట్టారు.

స్కూళ్ళ డిప్టీ ఇన్‌స్పెక్టరును పిలుచుకొనివచ్చి, ఆయన సమక్షంలోనే పిల్లకాయలచేత అరమైలు పరుగు, నూరుగజాల నడక, ఎక్కువ ఎత్తు ఎగరడం, ఎక్కువ పొడుగు దూకడం, బల్లలకింద కాళ్ళకు గోతాలు కట్టుకొని నడవడం, కింద చల్లిన పువ్వులేరి కుప్పగా పెట్టడం – ఒక రకమేమిటి; పట్నవాసపు బడులలో ఆడించే ఆటలన్నీ పిల్లకాయలచేత ఆడించి, ఆటల్లో గెలుపొందిన పిల్లకాయలకు ఒకరికి సూటుకేసు, ఇంకొకరికి టార్చిలైటు, మరొకరికి పెద్దసైజు జపాను అద్దం, ఇంకొకరికి ఫౌన్‌టెన్‌పేనా, వేరొకరికి సబ్బు పెట్టి, ఇంకొకరికి గొడుగు – ఇట్లాగే తలా ఒక వస్తువు బహుమతీలు యిచ్చాడు.

కాని ఆ రాత్రికే గ్రామంలో అల్లకల్లోలం బయలుదేరింది.

ఆటల్లో గెలిచి బహుమతులు తీసుకొన్న పిల్లకాయలందరూ – ఒకడు చాకలివాడు, ఇంకొకడు మంగలివాడు. మరొకడు వొడ్డేవాడు. యానాదివాడు, సాలివాళ్ళపిల్ల, కుమ్మరివాళ్ళ పిల్ల – ఈ రకంగా అందరూ బీదవాళ్ళ పిల్లకాయలే. గ్రామంలో డబ్బుగల వాళ్ళూ, గొప్ప వాళ్ళూ, పలుకుబడి గల వాళ్ళూ యిచ్చిన డబ్బుతో వస్తువులు కొనడమూ, ఆ వస్తువులు చివరకువాళ్ళ చేతికింద నీళ్ళుతాగే నౌకర్ల పిల్లకాయ లెత్తుకొని పోవడమూ జరిగింది.

గ్రామస్థులు కుతకుత ఉడికిపోతున్నారు. తమ పిల్లకాయలకు వస్తాయనుకొన్న వస్తువులన్నీ కూటికీ గుడ్డకూ మొగం వాచిన దరిద్రజీవుల సంతానం ఎత్తుకొని పోయారు. అందులో తమ స్వగ్రామంలో, తమ కళ్ళ యెదుట తెల్లవారిలేస్తే తమ చెప్పుచేతుల్లో ఉండి, తమకింద తాబేదారీ పనిచేసే నౌకర్ల బిడ్డలకు బహుమతులూ. తమ బిడ్డలకు వొరిచేతలూనూ! పెద్దరెడ్డిగారి అబ్బాయి ఒకటే గోల! కరణంగారి అబ్బాయి ఇంట్లో వాళ్ళని నిలవనివ్వడం లేదు. సాలెవాళ్ళ కిచ్చిన అద్దం తెచ్చి నాకిస్తావా, చస్తావా అని కాశయ్య కూతురు ఒకటే ఏడుపు! ఇంతెందుకు, చాకలి వాళ్ళు, మంగలివాళ్ళూ, కుమ్మరివాళ్ళూ అందరూ సంతోషంతో పొంగిపోతూ పండగ చేసుకుంటూ ఉంటే పెద్దగ్రామస్థుల ఇళ్ళల్లో ఆ రోజు రోజంతా ఎండగలూ, ఉపవాసాలూనూ!

హెడ్డుమాస్టరు జకరయ్య కావలెనని వాళ్ళందరికీ ఈ అవమానం చేశాడని వాళ్ళ నమ్మకం. ఊళ్ళో పెద్దలనుకొనే పదిమందీ చేరి కూడబలుక్కున్నారు. ఆ మర్నాడు ఉదయాన్నే మీటింగుపెట్టి జకరయ్యను పిలిపించి, “మా దగ్గర డబ్బులు దండి,

ఊళ్ళోవాళ్ళకి పంజారం చేస్తావా? ఇంత తలపొగరా నీకు? మా డబ్బుతో కొన్న వస్తువులు మళ్ళీ వాపసు తీసుకొని వచ్చి, మా పిల్లకాయలకు పంచిపెడుతావా, లేక నిన్ను పట్టుకొని మెత్తగా తన్నమంటావా" అని పదిమందీ కస్తీ చేశారు.

జకరయ్య గడగడలాడిపోయాడు. ఒంటరిగాడు. అది గ్రామంలో పెద్దపులులనుకొనే వాళ్ళందరూ చేరి చేసిన పంచాయతీ. అదిగాక, పబ్లికు మీటింగులో డిప్టీ యిన్స్పెక్టరుగారి సమక్షంలో పంచిపెట్టిన బహుమతి వస్తువులు – వాటిని మళ్ళీ తాను ప్రైవేటుగా ఊడబెరుక్కో వచ్చునా? ఈ సంగతి జిల్లా బోర్డు ప్రెసిడెంటుగారికి తెలిస్తే తన నౌకరీకి మోసం కదూ? మరి తీసుకురాకపోతే గ్రామస్థులు బ్రతకనిస్తారా?

గండకత్తెర చుట్టుకొన్నట్టున్నది అతగాడికి.

జకరయ్య అట్టే ఆలోచించి, "స్వామీ! మీకు దణ్ణం పెట్టుతా. ఈ బహుమతులిచ్చిన వస్తువులు వాపసు తీసుకొని వచ్చేపని నా నెత్తిన పెట్టకండి. మీరందరూ చేరి నా మీద నేరం పెట్టారు కాబట్టి, నా స్వంత డబ్బుతో ఆ వస్తువులు మళ్ళా కొత్తవి కొని మీకు ఇచ్చుకొంటాను. అంత మాత్రం దయపెట్టండి" అని వాళ్ళ కాళ్లు పట్టుకొన్నాడు.

కాని, వారంతా పెద్దమనుష్యులు – ఒప్పుకొంటారా వారు? జకరయ్య ఎంత చెప్పినా, ఎన్నివిధాల ప్రార్థించినా, "ఆ వస్తువులు ఆ పిల్లకాయల దగ్గర ఉండడానికి మాత్రం వీలులేదు. పోయి నీవు వాపసు తీసుకొని వస్తావారావా?" అని వాళ్ళు నిక్కచ్చి చేశారు.

జకరయ్యకు దిక్కుతోచక, ఆ వెళ్ళడం వెళ్ళడం ఎకాయెకి జిల్లాబోర్డు ప్రెసిడెంటు దగ్గరికి వెళ్ళి, జరిగిన విషయమంతా ఆయనతో మనవి చేసుకొని, రక్షించండని ఆయన కాళ్ళమీద పడ్డాడు.

ఆ ప్రెసిడెంటు అసాధ్యుడు, రాజకీయవేత్త; దూరాలోచనపరుడు; ముందు సంవత్సరం రాబోయే ఎన్నికల్లో శాసనసభకి కూడా నిలబడాలని చూస్తున్నాడు. జకరయ్య చెప్పుకున్నదంతా విని "నేను రేపు మీ గ్రామానికి వచ్చి, గ్రామస్థులతో స్వయంగా మాటాడి వ్యవహారం పరిష్కారం చేస్తా. నీకేం భయంలేదు, పో"మ్మన్నాడు.

జకరయ్య ప్రెసిడెంటు దగ్గరకు పోయిన సంగతి గ్రామస్థులుకు తెలిసి, వాళ్ళు వెంటనే బహుమతులు దీసుకొన్న పిల్లకాయల తల్లిదండ్రులను రచ్చకు పిలిపించి, బెదిరించి, వాళ్ళ దగ్గిర వస్తువులన్నీ వాపసు తీసుకొని, పెద్దరెడ్డి స్వాధీనంలో పెట్టుకొన్నారు.

భయపడి అందరూ వస్తువులు వాపసు ఇచ్చారు, కాని టార్చిలైటు తీసుకొన్న చాకలివాళ్ళ పిల్లవాడు మాత్రం వాపసు ఇవ్వలేదు. వాడి తండ్రి రంగం, మోల్మేను వగైరా పట్నాలు తిరిగి వచ్చినవాడు, మనిషి – ఎర్రగా నేత్రాలూ వాడూ ఆజానుబాహువు; ఏడడుగుల ఎత్తుంటాడు. చేతులకు మురుగులు, దండకడియం, అయిదు వేళ్ళకీ ఉంగరాలు, మొలకు బిళ్లల మొలతాడు, చెవులకు తమ్మెట్లు – చూడ్డానికి మహా జబర్దస్తీగా

వుంటాడు. గ్రామస్థులెంత బెదిరించినా వాడు టార్చిలైటు వాపసు ఇవ్వకుండా మొండొడ్డుకొని కూర్చున్నాడు. పైగా, ఇచ్చినవాళ్ళని కూడా చీవాట్లు పెట్టి పురెక్కించాడు.

మరునాడు ఉదయం జిల్లాబోర్డు ప్రెసిడెంటు గారు గ్రామానికి వచ్చేవరకు వస్తువులు చేజారి వాపసు యిచ్చిన వాళ్ళూ, వాళ్ళ బంధువులూ, చాకలివాళ్ళూ మొదలైన అలగాజనం అందరూ యేభయిమంది తోడయి, పెద్దరెడ్డి యింటిమీద పడి, "చాకలివాడు వస్తువు ఇవ్వనిదే మేము మాత్రం వాపసు ఇస్తామా? మా వస్తువులు మాకిచ్చి వేయవలసింద"దని కర్రలూ కత్తులూ పట్టుకు తయారయారు.

ఇంతలో జిల్లా బోర్డు ప్రెసిడెంటుగారు రాగానే వారిని పెద్దరెడ్డి యింటికి పిలుచుకుకొనిపోయి బస చేయించారు.

పదిగంటల దాకా ఎవరెవరు ఏమేమి మాట్లాడుకొన్నారో అంతా గోప్యంగా జరిగిపోయింది. పదకొండు గంటలకు కారెక్కి హెడ్ క్వార్టర్సుకు చక్కా వెళ్ళిపోయాడు ప్రెసిడెంటు.

రంగం చాకలివాడి హుషారీ చూచుకొని అలగాజనమంతా ఏకమై నడుములు బిగిస్తున్నారు. పెద్దరెడ్డి వీధిలోకి రావడం మానేసి రహస్యంగా మాలవాళ్ళకు చెప్పి పంపి, కల్లుపోస్తాననీ, డబ్బులిస్తాననీ బేరాలు చేస్తున్నాడు.

వ్యవహారం ముదిరి కొట్టుకోవడం దాకా వచ్చేవరకు, మునసబు కరణాలు చల్లగా తప్పుకొని, గ్రామపరిస్థితులు పోలీసువారికి, మేజిస్ట్రేటుకీ రిపోర్టు పంపించారు.

గ్రామంలో అయితే జకరయ్య ప్రస్తావన మళ్ళీ ఏమిలేదు కాని, గ్రామస్థులతో మాటాడి ప్రెసిడెంటుగారు వెళ్ళిపోయిన తరువాత ఒకనాటి ఉదయం జకరయ్యకు పోస్టులో ఓ కవరు వచ్చింది. అది చించిచూస్తే ఇట్లా ఉంది:

"జిల్లా బోర్డు ఆఫీసు, తే.16-11-38

**ఉత్తర్వు**

ఇటీవల మీ గ్రామంలో జరిగిన ఆరోగ్య శిశువార వేడుకల సందర్భంలో మీరు అజాగ్రత్తగా ప్రవర్తించి, గ్రామంలో అనవసరమైన కలతలూ, పార్టీలూ పెంచి, పాఠశాల పురోభివృద్ధికే గాక, గ్రామ పురోభివృద్ధికి కూడా భంగకరంగా నడచుకొన్నందువల్ల మీరు స్కూలు టీచరుగా ఉండడానికి అనర్హులని తీర్మానించి, మీ సంజాయిషీతో నిమిత్తం లేకుండానే మిమ్మల్ని ఈ తేదీ లగాయతు నౌకరీనుండి బర్తరపు చేయడమైనది.

(సం) గంటయ్య,

ప్రెసిడెంటు.



# ఆచంట జానకిరామ్

**(1903 - 1994)**

**భా**వుకులు, చిత్రకారులు, విమర్శకులు. కాల్పనిక ప్రపంచంలో, వాస్తవ జగత్తులో సమానోత్సాహంతో విహరించగల సాహిత్య బంధువు. వాస్తవమైన ప్రధాన సంఘటనలకు, కథకూ కావాల్సినంత ఊహ కలిపి, కళాత్మకంగా కథలు వ్రాయుటే వీరి ప్రత్యేకత. స్వానుభవమూ, నిజాయితీ - ఇవే రచనకు విలువ నిస్తాయని నమ్ముతారు. తిరుపతిలో నివసించేవారు.

**రచనలు :** నా స్మృతిపథంలో, సాగుతున్న యాత్ర. (రెండు భాగాలు)

# తోటమాలి

"నిన్న రాత్రి విపరీతంగా గాలీ, వాన! మొక్కలన్నీ అల్లల్లాడి పోయాయి.... ఎల్లా ఓర్చుకోగలిగాయో అంత హంగామా!... మాధవీలత నేలకు ఒరిగిపోయింది. చిత్రం, ఎన్ని పర్యాయాలు ప్రయత్నించినా తీగమామిడి మీదికి ప్రాకలేకపోతోంది!..." అనుకుంటున్నాడు తోటమాలి....

"అవును - మావాడే"

తోటమాలి తలయెత్తి చూచాడు! పెద్ద మాలి తన తండ్రీ, ప్రక్కనే దేవతాస్త్రీ!..... దేవతాస్త్రీ!....

ఇంతట్లోకి నేరేడు చెట్టు దగ్గర లేగదూడ 'అంబా' అనడం విని "ఇప్పుడే వస్తాను" అంటూ వెళ్ళిపోయాడు పెద్దమాలి.... దేవతా స్త్రీ తోటమాలిని సమీపించింది. అతడు ఆమెకేసి అల్లాగే చూస్తున్నాడు - అనిమేషుడై.

"రాత్రి ఎంత గాలి!" అంది.

తోటమాలి ఉలిక్కిపడ్డాడు. దేవతా స్త్రీకి మన మాటలు వచ్చు!

కాని, తనకు మాటలు రాలేఁ

"నాకు భయమేసింది!" అంది.

"భయమెందుకూ?" అందామనుకున్నాడు. కాని ఆమె కళ్ళను చూస్తూ మాటలు మరచిపోయాడు తోటమాలి!

నేలమీద వాలిన తీగను లేవనెత్తుతూ "నిన్నటి గాలికా? .... పాపము" అంది.

అతనికి ఈసారి మాటలు వచ్చాయి. "అవును. నిన్నటి గాలికే" అన్నాడు. కాని తన మాటలు తనకే వినబడలేఁ!!

ఆమె, "ఏదీ! ఈసారి చూద్దామ.... ఇటునించి.... ఈ పలవ ఆసరా చేస్తే..."

ఇద్దరూ కలిసి మాధవీ లతను చెట్టుపైకి ఎక్కించారు.

ఈ మాత్రానికే అలసిపోయింది ఆమె.

అతి సున్నితమైన వేళ్ళకు అంటిన ఇసుక కేసి చూస్తూ ధగధగలాడే అభ్రకపు రేణువుని అతని చేతికి అంటించి 'బంగారం!' అంది అబ్బురపాటు అభినయిస్తూ!

తనకు తెలియకుండానే ఫక్కున నవ్వాడు అతను. ఆమే నవ్వింది. ఇద్దరూ కలిసి మళ్ళీ నవ్వారు...

"ఆ వాగులో నీళ్ళు మంచివేనా?" అంది.

"మేము తాగే నీళ్ళే అవి" అన్నాడు. ఈసారి తన మాటలు తనకు కూడా వినబడ్డాయి.

ఆమె తోవతీయగా ఇద్దరూ వాగుకేసి నడచారు.

❊ ❊ ❊ ❊

ఆమె రాజకుమారి 'ఉషాబాల' అనీ, తోటలన్నా, పువ్వులన్నా తగని సరదా అనీ తర్వాత చెప్పాడు పెద్దమాలి కొడుకుతో – 'బంగారు తల్లి' అన్నాడు పెద్దమాలి.

ప్రతి ఉదయం ఉషాబాలా, తనూ కలుసుకుంటూండేవారు. ఊరిచివరి కొండ చెరియలోని ఆ తోటలో సాయంత్రం పూయడమే అలవాటైన పువ్వులను వేకువనే మేలుకోవడం నేర్పాడు అతను ఆమెకోసమని....

ఉదయాని కో వింతరకంగా అల్లి వుంచేవాడు దండలు ఆమె కోసమని – తోటమాలి.

❊ ❊ ❊ ❊

ఆకుల సందుల నుంచి తోవజేసుకుని వస్తూ వున్న ఏటవాలు సూర్యకిరణాలతో వాగు ఒడ్డున ఇసుకగూళ్ళు కట్టుకునేవారు వారిద్దరూ. ఒకసారి ఇసుక గూడుతో ఆడుకుంటూవుంటే ఆమె చేతి ఉంగరం అతని చేతిలోకి వచ్చింది. అతడు అప్రయత్నంగా ఉంగరాన్ని కళ్ళకద్దుకొని ఆమె కివ్వబోయాడు.

రాజకుమారి తోటమాలి వ్రేలిని తొడిగింది. వెలలేని పుష్యరాగం తాపిన తన ముద్దుటుంగరము.

❊ ❊ ❊ ❊

ఉంగరం అందానికి మురిసిపోతూ వున్న కొడుకును చూచి ఆ సాయంత్రం పెద్దమాలి 'నాయనా' అని యేదో చెప్పబోయాడు. కాని పుష్యరాగపు కాంతిని ప్రతిఫలిస్తూవున్న కొడుకు కన్నులలోని ఉత్సాహం చూచి తలవంచుకు వెళ్ళిపోయాడు పెద్దమాలి. ఆవుల్ని పాలు పితకడానికి.

రేపు ప్రొద్దునకు ఏ యే పువ్వులు విడుస్తాయో చూడడం కోసం పూల చెట్లలోకి వెళ్ళాడు తోటమాలి!

గిర్రున తిరిగిపోయాయి ఋతువులు. సంపెంగలు, గోరింటలు, జాజులు, మల్లెలు, మొగలిపువ్వులు, పారిజాతాలు, చామంతులు, బంతిపువ్వులూ – మళ్ళా సంపెంగలు వచ్చాయి. తోటమాలి ఉత్సాహం అతిశయించిన కొద్దీ పెద్దమాలి తండ్రి భయం మరింతైంది.

వైశాఖ పౌర్ణమి. కాస్త ఎండ ఎక్కువైనందువల్ల శోషిల్లిన చెట్లన్నీ చంద్రోదయమయ్యేసరికి "అమ్మయ్య" అంటూ ఆ చల్లదనానికి ఆస్వాదిస్తున్నాయి.

వాగు ఒడ్డున కూర్చుని ఈ పిడికిటిలో ఇసుక ఆ పిడికిటిలో పోసుకుంటూ వున్న తోటమాలి వెనుక అందెల చప్పుడు విని అదిరిపడ్డాడు. చంద్రకిరణాలలో పరిచారిక ముక్కున నత్తు తళుక్కుమంది. అతను లేచి నుంచుని – "ఎవరు? అన్నాడు. "దేవిగారి సెలవైంది" అంది పరిచారిక.... దే....వి....గా.....రి.. సెలవు!.... రాజకుమారి తనకోసం కబురు పంపింది.

"దక్షిణపు తలుపు తీసివుంటుంది – అక్కడ నేనుంటాను" అంది పరిచారిక. వెన్నెల ఆకాశమంతా ఆవరించింది.

తోటలోని పువ్వులన్నీ కోశాడు తోటమాలి – విడిచినవి, విడుస్తూవున్నవి, క్షణంలో కూర్చాడు మనిషి పొడుగున దండ. ఆ వాసనకు నిద్రపోతూ వున్న తుమ్మెదలన్నీ లేచాయి –వెన్నెల చూసి మళ్ళీ నిద్దురపోయాయి.

దోసిలిలో మాల నుంచుకొని ఎదుట నిలబడ్డ కొడుకును చూచి తండ్రి ఏదో చెప్పబోయాడు. కాని, "నాయనా" అని ఊరుకున్నాడు...... తండ్రి ఏదో చెబుతున్నాడని ఆప్యాయంతో వినాలను కొన్న కొడుకు తండ్రి తలవంచుకోవడం చూచి, మాట్లాడకుండా కుటీరంలోంచి బయలుదేరాడు. వలపు తొందరలో ద్వారం వద్ద తలవంచడం మరచిపోయాడు. చూరు ఠంగుమని తలకు తగిలింది.

"దెబ్బ తగిలిందా నాయనా?" అని దగ్గరగా, కంగారుగా పెద్దమాలి..... "లేదు నాన్నా" అని త్వరత్వరగా నడిచాడు తోటమాలి.

తోట అవతలి కంచెదాకా, నిద్దర కళ్ళతోనే పెంపుడు లేడి అతన్ని సాగనంపింది.

ఇంతసేపూ పిండార బోసినట్టు వెన్నెల కాసిన చంద్రుడు తోటమాలి కోట ద్వారం చేరేసరికి నల్లమేఘం వెనుక దాక్కున్నాడు. చీకటిలోనే కోటలో ప్రవేశించాడు తోటమాలి – దక్షిణపు వేపు నుంచి పరిచారిక తోవ చూపింది.

ఆ నిర్జన ప్రదేశంలో అతని గుండె దడదడ తప్ప వేరు శబ్దం లేదు. మొగసాల అవతల చలువరాతి చప్పరం. ఆ అవతల విశాలమైన మెట్లు, మెట్లపైన ఎడమ వైపునుంచి వింత నగిషీతో వేయి స్తంభాల ప్రాకారం. అంతు లేదా అనుకున్న ఆ ప్రాకారం చివర, దీపపు వెలుతురు. కుడివేపుగా పెద్ద గది..... అగరు వాసన.... పొగలేని ధూమపు వాతావరణం.

అవతలవేపు గోడవద్ద కిటికీకి ప్రక్కగా మనిషి నిలువున పెద్దసెమ్మా!..... సంపెంగ నూనె దీపం...... నిలువుటద్దం, ఎదుట దేవతా స్త్రీ – కాదు, ఉషాబాల! తాను తెచ్చే దండలు సవరించుకోడం కోసం జడ అల్లుకుంటూంది.

తోటమాలి గుండె ఆగిపోయింది. చూపులు తనవే కాని, అడుగులు తనవి కాదు. ఆమె వెనుకనుంచి ఆమె దగ్గరకు చేర్చాయి యెవరి పాదములో అతనిని.

ఆమె తిరిగి చూచింది. అపరిమితమైన సంతోషంతో ఆమె గులాబీ పెదవులు రవంత విడివడ్డాయి. లేత తమలపాకు ఎడంగా. రెండు చేతులూ ముందుకు చాచి దండ అందుకుంది..... మబ్బు చాటునుంచి వచ్చిన చంద్రుడు వారి నిద్దరినీ ఒక్క క్షణంలో వెన్నెల కాంతిలో ముంచెత్తి మళ్ళా మాయమైపోయాడు.

ప్రక్కన తలుపు తెరచిన శబ్దం..... దీపాల వెలుతురు..... ఎన్నో కంఠాల ధ్వని.....

రాజమాత! రాకుమారుడు!!

తోటమాలి కదలలేదు.

"ఎవరితను?" అన్న రాజమాత ప్రశ్న.

దూరాన పరివారపు గుసగుసలు.

తోటమాలి కదలలేదు. ఆమె కన్నులలోకి అల్లాగే చూస్తున్నాడు.

రాజమాత కూతురు భుజాన చేయివుంచి మళ్ళా అంది! "ఎవరితను?"

"ఎవరు నువ్వు? మాట్లాడవేమి!" – ఎవరీ మాటలు? ఉషాబాలే! ఉషాబాలే! (బిగ్గరగా) "ఎవరునువ్వు? ఎవరు నువ్వు?"

"ఎవరు నువ్వు!" అని పాలగచ్ఛంతా ప్రతిధ్వనించింది; – తోటమాలి కదలలేదు.

రాజకుమారుడు ఓ అడుగు ముందుకు వచ్చాడు.

ఉషాబాల చేతిలోని దండను చూచిన రాజమాత వడివడిగా కొడుకు దగ్గరకువచ్చి, అతని చెయ్యి పట్టుకుంది. ఆగంతకుని వైపు చూచి వెళ్ళిపొమ్మని సైగ చేసింది.

ఉషాబాల తలవంచుకుంది.

❄ ❄ ❄ ❄

ఇందాకటి నల్లమేఘం యిప్పుడు లేదు.... చంద్రునిలోని మచ్చమాత్రం వెండి పళ్ళెము అంతా ఆవరించింది....

నిద్దురకళ్ళతోనే పెంపుడు లేడి తోటమాలిని తోటలోనికి ఆహ్వానించింది. కొడుకు కోసం తండ్రి మేలుకొనే వున్నాడు....భూమిలోకి కుంచుకుపోతూ వచ్చిన తోట మాలిని తండ్రి సందిటలో తీసుకున్నాడు. "నాయనా!" అన్నాడు – ఇక మాట్లాడలేకపోయాడు.

తన తోటలోని పువ్వులన్నీ నిద్రపోతాయి.... తన తోటలోని పక్షులన్నీ నిద్రపోతాయి.... మేలుకొని మేలుకొని, పెంపుడులేడీ అతని పాదాలమీద తలవాల్చి నిద్రపోతుంది...

కాని, తోటమాలికి మాత్రం నిద్దుర లేదు. ఉదయభానుని చూస్తూ, వజ్రపు టుంగరంతో తన ఎర్రని కళ్ళు తుడుచుకుంటాడు. ఇప్పటికీ, ఎప్పటికీని, తోటమాలి!!

## 2

చంద్రునిలోని మచ్చ అల్లా వెండిపళ్ళెమంతా వ్యాపించిపోయినా ఆ రాత్రిని ఎన్నటికీ మరువలేదు తోటమాలి.... సెలయేటి ఇసుక తిన్నెలలో పిచుకగూళ్ళు కట్టుకుంటూ ఆడుకుంటూ వుండగా రాజకుమార్తె తన వేలిని వుంచిన ఉంగరం – వజ్రపుటుంగరం, ఎంత మరచిపోవాలన్నా, ఆమెను మరచిపోనివ్వదు.

ఎంతో ప్రయత్నించాడు తోటమాలి తండ్రి – పెద్దమాలి – కొడుకును మన ప్రపంచంలోకి మరల్పాలని. కాని, లాభంలేదు. కొడుకు పలుకడు – నిట్టూర్పైనా లేదు. గంటల తరబడి వజ్రపుటుంగరంలోకి అల్లాగే చూస్తూ వుంటాడు. పెద్దమాలి మరీ సముదాయింప బూనితే, జాలిగా తండ్రికేసి చూస్తాడు. "నాన్నా! నాన్నా!" అంటాయి. కడుపు చెరువయ్యేటట్టు. అతని కళ్ళు. అల్లాంటప్పుడు పెద్దమాలి మనోవీధిని కాలము ఇరవై యేళ్ళు వెనక్కి జరిగిపోతుంది ఒక్క పరుగున. పొత్తిళ్ళలోని పసికూన, పురిటిలోనే తల్లిని పోగొట్టుకున్న అర్భకుడు కనుపిస్తాడు; పసికందును వణికే తన చేతులలో ఉంచి, 'తల్లయినా మీరే! తండ్రయినా మీరే!' అన్న ఆమె కడసారి మాటలు వినిపిస్తాయి.....

ఎంతో బ్రతిమాలాలి అనుకుంటాడు. "కన్న తండ్రీ! నా కోసం – నీ ముసలి తండ్రి కోసం" అనాలి అనుకుంటాడు.కాని, తన ఓదార్పు నిష్ప్రయోజనం అని తెలుసు.

కాలమే మాన్పాలి ఈ గాయాన్ని.

❄ ❄ ❄ ❄

మూడు రాత్రింబవళ్ళు అల్లాగే. తదేక దృష్టితో శూన్యంలోకి చూచాడు తోటమాలి. నాల్గవనాటి వేకువను తూరుపు తెల తెలవారుతూ ఉండగా, ఆ శూన్యమవతల ఏమి కనబడిందో, ఆ కాటుక చీకటిలో ఏమి మెరిసిందో చటుక్కున లేచి తండ్రి పాదాలను తాకాడు.

"ఎర్రావుపాలు పితగనా, నాన్నా!" అన్నాడు.

పెద్దమాలి ఆనందానికి మేరలేదు. "నేను పితుకుతాను, నువ్వు దూడను వదులు" అన్నాడు.

తండ్రి పాలు పితుకుతూ ఉండగా, లేత గరిక చిగుళ్ళు తినిపిస్తున్నాడు దూడకు తోటమాలి. దూడను అతి ఆప్యాయంగా మూజూస్తూ వున్న గంగగోవు కళ్ళు ధగధగ మెరిసిపోతున్నాయి.

ఆ ధగధగ తోటమాలికి వింత చైతన్యాన్ని కలిగించినది. తండ్రి అందిచ్చిన గుమ్మపాలు ఒక్క బిగిని తాగివేసి, గునపం, పార పుచ్చుకొని తోటలోకి వెళ్ళి పోయాడు తోటమాలి. దక్షిణపు వైపు కంచె పడిపోయిందని ఎత్తి కట్టడానికి అటు వెళ్ళాడు పెద్దమాలి.

తోటమాలి మిట్టమధ్యాహ్నం ఒక్క అరగడియ విశ్రమించాడు, అంతే! ప్రొద్దు గ్రుంకేలోపుగా పూలమొక్కలన్నీ త్రవ్వేశాడు. ఒక్క మొక్క లేదు.

మాలతీ తీగ వద్ద మాత్రం ఒక్క క్షణం అనుమానించాడు. ఎంతో ప్రయత్నాన.

ఆవేళ మామిడి మొక్క పైకి తామిద్దరూ కలిసి ఎక్కించిన తీగ... ఆ కాస్తపనికే అలసిపోయింది ఆమె!

..... ఒక్క దెబ్బతో తెగిపోయింది తీగ. ఒక్క గునపపుపోటుతో పెల్లగిరి వచ్చింది వేరు.

చీకటిపడేప్పటికి ఆ తోటలో ఒక్క పూలమొక్క లేదు.

❊ ❊ ❊ ❊

మరునాడు, తండ్రీ కొడుకూ కలిసి శుభ్రంగా దున్నివేశారు తోటనంతా.

మూడురోజులు ఆరనిచ్చి, కొత్తవిత్తులు చల్లాడు తోటమాలి....

.... తండ్రీ కొడుకూ కలిసే పనిచేస్తున్నారు.... కలసే భోం చేస్తున్నారు... ఒక్క చోట పడుకుంటున్నారు. కాని, ముక్తసరిగానే మాటలు. కొడుకు ముఖాన మునుపటి మేఘాలు లేవు. ఆతని కళ్ళల్లో ఒక క్రొత్త వెలుగు.... హఠాత్తుగా చూస్తే మాత్రం. తోటమాలి ఒక పదేళ్ళు పెద్దయినట్టు వుంటుంది. అతడొక యోగిలా కనపడతాడు ఇప్పుడు - తండ్రికి కూడా!

❊ ❊ ❊ ❊

మళ్ళీ పున్నమ వచ్చేసరికి తోటంతా పువ్వులతో నిండిపోయింది. అన్నీ ఎర్రటి పువ్వులే. ఏ వంక చూచినా ఎర్రటి పువ్వులే - అదీ. అప్పుడు తగిలిన గాయంలోంచి ద్రవించె రక్తపు ఎరుపు!

❊ ❊ ❊ ❊

ఈ నెలరోజులూ తోటమాలి ఊరుకోలేదు. కోడికూత వేళనే లేచి, బండికి ఎడ్లను పూన్చి, పై కొండలలోకి వెళ్ళేవాడు. ప్రొద్దు నెత్తిమీదికి వచ్చేసరికి తిరిగి వచ్చేవాడు.....

ఒక్కడూ, ఎండిపోయిన ఆ సెలయేటి ఇసుకలో దింపేవాడు కొండను దొల్చి తాను తెచ్చిన చలువరాతి పలకలను.

ఎవరి సహాయం లేకుండానే. ఆ నదీగర్భంలో, వైశాఖమాసంలో, ఆ వెన్నెలలో రాజకుమార్తే, తానూ కథలు చెప్పుకున్న చోటనే నిర్మించాడు చలువరాతి మందిరం.

ఆమె పలికిన ఒక్కొక్కమాటే వల్లించుకుంటూనే కట్టాడు చలువరాతి మెట్లు.

రత్నఖచితమైన ఆమె గాజుల మ్రోత వింటూనే నిర్మించాడు. ఆమెలాంటి ప్రతిమనే.

వాడి, నేలకు వాలిన తీగను పైకి ఎత్తుతూ ఆమె చూపిన అలసత్వాన్ని తలుచుకుంటూనే చెక్కాడు ఆమె నేత్రాలను....

మొదటిమాటు వాగులోని నీటిని తన దోసిలిలోంచి రుచిచూస్తూ "ఎంత తియ్యగా వున్నాయి" అన్న ఆమె నోటిని చూస్తూనే దిద్దాడు చలువరాతి పెదవులను....

❉ ❉ ❉ ❉

మళ్ళా పున్నమకు మందిరము పూర్తయింది. పొగడచెట్లు మరుగున వాగులో, నదీగర్భాన, చలువరాతి మందిరం. చలువరాతి వేదికపైన, బ్రొటనవ్రేలిమీద అంటీ అంటనట్టు నుంచున్న అప్సరసభంగిమ, తోటమాలి తీయటి కలలన్నీ రూపం దాల్చి వెలసిన చలువరాతి ప్రతిమ – ప్రతిమ కాదు, హృదయాన్ని చీల్చుకువచ్చిన పాట....

సూర్యుని మొదటి కిరణాలు వేదికకు బంగారపు పూత పూస్తూ వుండగా, ఆమె పాదాలను అలంకరించేవాడు రక్తవర్ణమైన రకరకాల పువ్వులతో....

మధ్యాహ్నపు వేళలలో, విశ్వ ప్రపంచమే ఒక్క క్షణం కునుకుతూ వున్నప్పుడు, మందిర ప్రాంగణంలో కూర్చొని మొగలి రేకులలో నింపేవాడు – తాము ఆ రోజులలో ఒకరి చెవిలో ఒకరు చెప్పుకున్న అందమైన మాటలన్నీ....

చీకటి పడుతూ వుండగా, తాను వెలిగించిన తైలదీపపు తోరణాల క్రింద నుంచుని ఆ విజన ప్రదేశంలో గొంతెత్తి ఆమె దివ్యనామ సంకీర్తనం చేసేవాడు..... ఉషాబాలను గూర్చి పాడడానికి సాహసించలేకపోయిన పాటలన్నీపాడేవాడు గొంతెత్తి. ఆ విజన ప్రదేశంలో – తోటమాలి!

"దేవీ! ఈ శిలాలయంలోనే నాట్యం చేస్తావా! భగ్న హృదయుని నిర్గత శోకగీతమే నీకు శ్రావ్యమా!.... స్వర్ణసీత ఒక అన్వేషణ....ఒక దివ్యానుభూతి స్వర్ణసీత!.... అంతమే లేని ఆవేదన స్వర్ణసీత!" అంటూ విలపించేవాడు తోటమాలి.

❉ ❉ ❉ ❉

మళ్ళా నవరాత్రులు వచ్చాయి... బొమ్మల పండుగ.... దేవీపూజ.

"రాజమాత దేవీ పూజ చేస్తున్నారు. మీ తామరకొలనులో పెద్ద తామరపువ్వులు ఒక వేయి పూవులు పంపమని సెలవైంది" అన్నది పెద్దమాలితో దివాణంలోని పరిచారిక చంపం. అప్పుడెప్పుడో, వేసవిరాత్రి వెన్నెలలో వాగువద్ద ఇసుక తిన్నెపై కూర్చొని ఈ

చేతిలోని ఇసుక ఆ చేతిలోని పోసుకుంటూ, పరధ్యానంగా ఉన్నప్పుడు తోటమాలితో "దేవిగారి సెలవైనది" అన్న పరిచారికే.

పెద్దమాలి ఏదో పనిమీద వున్నాడు. "వస్తా– పద, పొగడ చెట్లకు ఉత్తరంగా వున్న ఎఱ్ఱ తామర కొలనిలోని పువ్వులు లాగి ఇస్తాను. వెళ్ళు – నీ వెనుకనే వస్తాను" అన్నాడు.

..... పొగడచెట్లకు ఉత్తరంగా వెళ్ళడానికి బదులు పొన్నపువ్వులు కోసుకుంటూ వాగుదరి జేరింది పరిచారిక. వాగు మధ్య ఏటవాలుగా వస్తూ వున్న సూర్యకిరణాలలో ధగధగ మెరసిపోతోంది మందిరం.

కొన్ని అడుగులు ముందుకు వెళ్ళి పరీక్షతో చూచింది పరిచారిక.

చలువరాతి మెట్లు... మెట్లకు అవతల, దేవతలే చెక్కారా అనిపించే అతి చక్కని నగిషీ మకర తోరణాలు...

ఇంకా లోపల, ఎఱ్ఱని పూలతో నిండిన ఎత్తయిన వేదికపైన ప్రతిమ.

ప్రతిమ ముందు వంగి పువ్వులు అలంకరిస్తున్నాడు తోటమాలి.

ఇంక రెండు అడుగులు ముందుకు వేసింది పరిచారిక.

ప్రతిమ మెడలో ఎఱ్ఱని కాశీరత్నాల మాల వేసి, ఒక్క ప్రక్కకు జరిగాడు తోటమాలి.

ఆ నిమిషమే సూర్యుని కిరణాలు ప్రతిమ ముఖాన్ని బంగారపు కాంతితో నింపివేశాయి.

పరిచారిక చూచింది! ఆ ముఖమే! ఆ కన్నులే! ఆ పెదిమలే....

......పూజ ముగించుకుని మందిరము బయటకు వచ్చే తోటమాలికి పొన్నల గుంపులో కలిపిపోతూ వున్న పరిచారిక చీర చెంగు మాత్రం కనిపించింది.

"దివాణం నుంచి ఎవరో వచ్చినట్టున్నారు" అన్నాడు తండ్రితో. "అవును– కామాక్షి కూతురు చంపక వచ్చి వెళ్ళింది. పూజకోసమని ఎఱ్ఱతామర పువ్వులు తెమ్మని పెద్దరాణిగారు పంపారు" అన్నాడు పెద్దమాలి.

గంపనిండా ఎఱ్ఱతామరపువ్వులు తీసుకుని దివాణంలోకి వచ్చింది పరిచారిక –

మరునాడు ఊరు ఊరంతా సాటిపోయింది! లోయతోటలోవి వాగులో చలువరాతి మందిరంలో తోటమాలి పూజచేసే దేవతా విగ్రహం రాజకుమార్తె.... రాజకుమార్తే! అని.

❄ ❄ ❄ ❄

అల్లనేరేడు చెట్టు దగ్గర ఆవును పాలు పితికి, దూడను వదలి, పలుపు చెట్టుకు కడుతున్నాడు పెద్దమాలి.

తోటగుమ్మం వద్ద దివాణంవారి మేనా ఆగింది. మేనా తలుపులు తెరచుకొని తోటలో అడుగుపెట్టింది రాజమాత!

పెద్దమాలి గుండె దడదడ కొట్టుకొంది.... కొడుకు పనిచేస్తున్న పారిజాతపు చెట్టుకింది

కొండ గోరింటి మడివేపు ఒక్కసారి చూచి, రాజమాతను ఆహ్వానించడానికి తొందరగా నడిచాడు పెద్దమాలి.

వంగి అతను చేసిన ప్రణామం అందుకుంటూ, సౌజన్యం వెదజల్లుతూ, సెలవిచ్చినది రాజమాత!

"తామర పువ్వులు చాలా బాగున్నాయి. రేపు ఉదయం ఇంకో వేయి పువ్వులు పంపు మాలీ!.... తోటంతా క్రొత్తగా వేశారా? ..... ఆ పారిజాతపు చెట్టు క్రింద, అతడేనా మీవాడు?"

పెద్దమాలి తలెత్తలేకపోయాడు.... పొర్లివచ్చే దుఃఖాన్ని ఆపుకోవడమే విశ్వ ప్రయత్నమైంది...

భూమివైపు చూస్తూనే "చిత్తం" అన్నాడు.

ముందుకు నడుస్తూనే అన్నది రాజమాత!

"అన్నీ క్రొత్త మొక్కలే!.... ఏమి ఎరుపు? ఏమి ఎరుపు!"

తండ్రీ, రాజమాతా మాట్లాడుకోవడం చూచాడు, దూరాన పారిజాతపు చెట్టు వద్ద వున్న తోటమాలి. గబగబ వాగువైపు వెళ్ళిపోయాడు.

..... తోట విషయమే మాట్లాడుతూ, తామరకొలను వైపు నడచింది రాజమాత. అతి భక్తితో ఆమెను అనుసరించాడు పెద్దమాలి, కొడుకు వాగువైపు వెళ్ళిపోవడం క్రీగంటితో చూచి.

ఆరబోసిన కుంకంలా వుంది తామరకొలను. ఎర్ర తామరలు అద్భుతంగా వికసించాయి.

"ఓ పదిపువ్వులు కోసి ఈ సజ్జలో పెట్టు మాలీ!..... మా పూజకు కావాలి" అని పురమాయించి, తాను పొగడచెట్టు వేపు నడిచింది.

..... పొగడచెట్ల కేసి నడుస్తూ రాజమాత తోటనంతా ఒకసారి పరకాయించి చూచింది. ఎంతో కొత్తగా వుంది తోట. కాని, ఏదో లోటు కనబడుతోంది ఆవిడకు.

ఆ మధ్య భాగవతం చదువుతూ ఉన్నప్పుడు, కృష్ణుడు లేని బృందావనం గురించిన వర్ణన జ్ఞాపకం వచ్చింది ఆవిడకు:

శరత్కాలమే.....వెన్నెలే.... బృందావన సీమే.... కాని, కృష్ణుడు లేడు.

పొగడచెట్లు దాటి వాగు అంచు చేరింది రాజమాత.

ఎదుట నదీగర్భంలో తెల్లని మందిరం. ఎంత అందంగా ఉంది! జయపురం నుంచి ప్రత్యేకంగా తాను పిలిపించిన శిల్పులు కట్టిన, జనానాలోని తమ కృష్ణమందిరమూ యింత అందంగా లేదు.

మందిరపు సోపానపుటంచులు రాచుకుంటూ సన్నగా ప్రవహిస్తోంది వాగులోని ఊటనీరు సన్నగా, తెల్లగా.

ఎందుచేతనో, క్రిందటిరోజు, పూజా సమయంలో, తన చేతిలోంచి జారి క్రింద పడ్డ వెండి గిన్నె లోంచి నేలమీద ప్రాకిన పాలచాలు జ్ఞాపకం వచ్చింది ఆమెకు.

మడమలు తడుస్తూ, వాగులో నడిచి, చలువరాతి మెట్లపై కాలు పెట్టింది రాజమాత.....

రాజమాత ప్రవేశింపరాని స్థలం లేదు కాని, ఈ మెట్లు ఎక్కడానికి మాత్రం ఎంతో సందేహించింది రాజమాత!

ఒక్కొక్క అడుగుకు గంపెడంత ధైర్యం కావలసివచ్చింది....

ఎంతో అద్భుతమైన నగిషీ పని! నిజంగా దేవతలే చెక్కారు – ఈ మకర తోరణాలు!!

మందిరంలో ప్రవేశించింది రాజమాత. వణికే గుండెలను చేతితో అదుముకుంటూ.

పైనున్న గవాక్షము నుంచి రెండు జంట కిరణాలు వెలుతురు బాణాలలా వేదికపై ప్రసరిస్తున్నాయి. ఆ వెలుతురుకు ఒక్క క్షణం కళ్ళు మూసుకుంది రాజమాత!.....

కళ్ళు విప్పి చూచింది రాజమాత!

వేదికపైన ప్రతిమ లేదు.

జీవకళ ఉట్టిపడుతోంది అనుకున్న తన కూతురి విగ్రహం లేదు

విగ్రహం వుండవలసిన చోట గుండ్రని కాంతిలో వున్నవి రెండు దోసిళ్ళ పారిజాత పువ్వులు.

దగ్గరకు వెళ్ళింది రాజమాత.

తెల్లటి రేకులపైన మంచుముత్యాలు – వేయి కన్నీటి చుక్కలు!


పారిజాతపు గొట్టాలన్నీ ఆమెకేసే చూస్తున్నాయి – వేయి ఎర్రని సూదిమొనల లాగ?–

రాజమాత పెదవులు అదిరినవి.

ఇంతటి త్యాగమా! ఇంతటి త్యాగమా!! అన్నది రాజమాత.

# మల్లాది రామకృష్ణ శాస్త్రి

**(1905 - 1965)**



**మ**ల్లాదివారి బాణీ అనుకరణకు లొంగనిది. జాను తెనుగు వీరి సొమ్ము. భావ ప్రకటనలో,వాక్య నిర్మాణంలో గడుసు పోకడలు పోయి, రసాత్మకమైన శైలిని సృష్టించి, ప్రాచీన, ఆధునిక, జానపద పాత్రలతో రసవత్తరమైన కథలు వ్రాశారు. వీరి కథలలో ప్రధాన రసం శృంగారం. మద్రాసులో ఉండేవారు.

**రచనలు :** మునిగోరింట, రంగవల్లి, చిత్రశాల, అల్లోనేరేడు, మత్తకోకిల మొ॥ ఓ డజను కథల సంపుటాలు.



# రంగవల్లి

**అ**ది – "మనుచరిత్రం బందుకొనువేళ" – కొత్త బరువుగా, పెండేరం ఒరుసుకుంటూన్నది – పెద్దన్నగారు. ఆ పాదం రవంత ముందుకు మోపి, రాజును మించిన ఠీవితో గొంతు సారించాడు: రాయలవారు. పరధ్యానంగా, వింటూనట్టు చిరునవ్వుతో, యోధుడల్లే కూర్చున్నాడు.

మనుచరిత్ర రచన పూర్తి అయేసరికి అందులో రవ్వల్లాంటి పద్యాలన్నీ విద్యానగరంలో ప్రతి ఇంటింటికీ, చూరు చూరుకూ, పెండె పెండెకూ పట్టిపోయినాయి. ఆ సంగతి ఇచ్చి పుచ్చుకునేవారికీ, తతిమ్మా పెద్దలందరికీ కూడా తెలుసు. కాని, ఈ తతంగం అంటూ తలపెట్టి, ముహూర్తం పెట్టినప్పుడు – అదో ఉత్సవమంత హంగామాగా చేస్తున్నప్పుడు మళ్ళీ ఒక్కసారి, అక్కడా– అక్కడా నాలుగు పద్యాలు ఏరి, వినిపించడం – అదో లాంఛనం: ఆ మొక్కు తీరిపోగానే, ఆశ్వాసాలకు ముందూ వెనకా పద్యాలు చదవడం రివాజు : ఆ పద్యాల పసలో వుంది – కృతి పుచ్చుకునేవాడు, ఎంతవరకూ మోజు పడతాడో – ఎంతకు తూగుతాడా అనేది :–

ఒకటి తరువాత మరో పద్యం, వెనుకటిదాని తాతలాగా, సభలో మురుస్తోంది : రాయలవారు, ఇంద్రుడైనాడు, చంద్రుడైనాడు, – వాళ్ళను పుట్టించిన వాడైనాడు – చతుర్దశ భువనాల్లో వున్న తురుష్కుల నందరినీ, ఒంటి చేతి మీద చీల్చి చెండాడాడు: అంతటితో శాంతించక బంగారం తాంబూలంలో పచ్చని అగ్రహారం పెట్టి, పెద్ద బ్రాహ్మడి నోటిమీదుగా ప్రబంధం అంకించుకుంటున్నాడు –

వందిమాగధులకు అది ఆట విడుపు, సభాస్తారులు మాత్రం తప్పని సరిగా పద్యాలను రాజోచిత మర్యాదగా, తలపంకించుతూ, కొలువు చేస్తున్నారు –

"చిన్నాదేవి జీవిత నాయక–"

ముసలి సత్తువ కొద్దీ, ఉన్నట్టుండీ, కందపద్యం తునక బాకల్లే విసిరాడు. గురి బెడిసిపోకుండా రాయలవారి గుండెల్లో నాటింది –సభలోంచి దూసుకున్నారు.

"కవితా ప్రావీణ్యపణేశ. కృష్ణరాయ మహేశా :–"

రాజువెంట సభ అంతా తరలింది. నడుస్తూనే పెద్దన్న గారు పద్యం పూర్తి చేశారు. అప్పటికప్పుడే, కృష్ణరాయ మహేశుడు. అరదం మీదికి దుమికి, మనో వేగం అయినాడు.

వాకిటి కావలి తిమ్మన్న ఒక్కడూ, జాలిగా ఆ వంకే చూస్తూ నిలుచున్నాడు. పెద్దన్నగారి అడుగు అక్కడ ఆగింది.

"ఏం తాతా?" అని గొనుక్కున్నాడు తిమ్మన్న

"ఏం అన్నా!" గదమాయించింది – గండపెండేరం.

"కృష్ణుడి మీద యిప్పటికైనా కరుణ కలిగిందేమో అనుకున్నాను"? అని నిట్టూర్చాడు తిమ్మన్న.

"తమ్ముడూ :– కవికీ కత్తికీ కరుణ ఏమిటి? ఒక్కటే వాడి :" అని పిడుగల్లే అన్నాడు పెద్దన్నగారు; గజపతుల ఆడుపడుచు అలా అయిపోవడానికి కారణం ఏ రాజపరమేశ్వరుల ప్రతాపం : కన్నతల్లి మోహనాంగిని కత్తివాత చేసిన – కన్నడ రాజ్యరమారమణుడు – ఎలా మరచిపోతాను, – ఎందుకు కరుణిస్తాను తిమ్మన్నా : – అంకితం పద్యాలకు అహోరాత్రాలు పదును పెట్టాను – ఆకల్పాంతం ఈతడి యశఃకాయాన్ని చీల్చి చెండాడుతుండవద్దూ : మోహనాంగి. నా శిష్యురాలు తిమ్మన్నా : – ఆ తల్లి ఆత్మ శాంతికి, – ఇంతకాలం బ్రతికాను–" పెద్దన్నగారు శోకంతో, నేల దద్దరిల్లే అడుగులు వేస్తూ వెళ్ళిపోయినారు –

తిమ్మన్న అలాగే ద్వారానికి ఆనుకుని చతికిల పడిపోయి – కళ్ళనీళ్ళతో, ఆనాటి కథంతా తలపోసుకున్నాడు – కన్నదీ, విన్నదీ... ...

## 2

రాయలవారు కటకం ద్వారా దిగ్విజయం చేసి, మగుడి నగరుకు వేం చేస్తున్నారని – రాజధానిలో చాటించారు : నగరానికి నలుమూలలా ఉన్న పూలన్నీ దులుపుకు వచ్చి, పౌరులు మహారాజు మీద పుష్పవర్షం కురిపించేందుకు కావలసిన కట్టుబాట్లన్నీ మహామంత్రి చేశాడు; అందరికీ కనువిందుగా కన్నడ – రాజ్యరమారమణుడు రాజమార్గ మంతటా ఠీవి మెరయించి – అలసటగా అంతఃపురం ప్రవేశించాడు.

మహారాణి తిరుమలాంబికా, అమ్మాయి మోహనాంగి ఎదురుగా వచ్చారు. అన్ని ఏళ్ళనుంచి కాపురం చేస్తున్నా, రాణి అప్పటికప్పుడు, అన్నాళ్ళకు కనపడ్డ నాథుణ్ణి ఓరగా

చూస్తూ. కొత్త పెళ్ళికూతురంత సిగ్గుపడ్డది. మహారాజు, ఒక్క కటాక్షవీక్షణం అలవోకగా ప్రసరించారు.

"విజయలక్ష్మీ సమేతులు – మహారాజులు" అని ప్రణామం చేసింది – మోహనాంగి. రాయలవారు రవంత ఉలికిపడి, తిమ్మరుసు అయ్యవారి వంక చూశారు.

"ప్రభువు మార్గాయాసం అపనయించుకోవలసి ఉంది" అని మనవి చేసినటుగా పలికి, ఇద్దరూ బయటికి తప్పుకున్నారు.

అమ్మాయి శ్లేషించిందేమోనని, అనుమానం అప్పాజీ ?" అన్నారు రాయలవారు తిమ్మరుసు వెంట అడుగువేస్తూ, "అనుమానం కాదు; అది రూఢే ప్రభూ?"

"అతి రహస్యంగా కొనసాగించామే? మనం గజపతుల కన్యను చెట్టబట్టినట్టు – అప్పుడే యిక్కడికి ఎలా తెలిసిందీ?"

"రవి కంటబడనివి. కవికి యెలా తెలుస్తాయో అలాగే? మీ బిడ్డ మాత్రం గ్రహించలేదా?"

"విజయలక్ష్మీ అని పేరు కూడా ఎలా తెలిసింది? అంతఃపురం మనమీద వేగు నడుపుతూందా?"

"అది అసంభవం నాయనా? కాని, నీ దిగ్విజయ వార్త మరుక్షణంలో దిగ్దిగంతాలూ వ్యాపించడం పరిపాటి అయిపోయింది. ఇదీ అంతే?"

"అంతేనని తోచదు అప్పాజీ :– నాకు అవగతం కాని హంశం ఏదో వుంది? తన తల్లికి సవతిని తెచ్చానని. మా తల్లికి ఆగ్రహం వచ్చిందేమో?"

"రాదు – ప్రభువు శోభన పరంపరా వ్యాప్తికి మురియని ప్రజలు – విద్యానగరంలో లేరని –నేను మనవి చేయవలసిన ఆగత్యం వస్తుందని అనుకోలేదు–"

"అది కాదు – అప్పాజీ?–"

"నీ మనసుకు సంకోచాన్నీ భేదాన్నీ కలిగించే విషయాన్ని యింకా తరచడం ఎందుకు నాయనా :– పడిన శ్రమకు తగినఫలం దక్కింది – అదే, నీకూ నీ దేశానికి కావలసింది; యీ మూడు రాత్రులూ వసంతోద్యానం మీ విడిది–" రాయలవారు ముసిముసిగా నవ్వారు.

## 3

విద్యానగరంలో విడిది విడిదికీ, – తెల్లవార్లూ, శోభనపు కళ. పున్నమి వెన్నెలగా వెల్లివిరిసింది – రాయలవారు – ఎక్కడో మారుమూల మాధవీ మంటపంలో, అసురుసులతో, – ఆకాశంలో చుక్కలు కన్నులకు అందినన్ని లెక్కపెట్టి – ఆదమరచి నిద్రపోయినారు .

నగరిలో, పెద్ద ముత్తైదువు తిరుమలాంబ, నాధుడు సాక్షాత్ కృష్ణావతారమని నమ్మిన చాందసాన, పరిపాటి అయిన ఆ ఒంటరితనంతో, నిదురవచ్చే దాకా, ప్రభువు దిగ్విజయ వార్తలు చెలికత్తెలు, చిలవలు పలవలల్లి మనవి చేయగా, సెహబాస్ అని తల ఊపుతూనే ఊయెలమీద, కునుకు పట్టించుకుంది.

తొలికోడి కూసింది. రాయలవారు – ఉలికిపడి మేలుకున్నారు. నిదురమబ్బున అడుగు తడబడగా, మాధవీ మంటపంలో అల్లిబిల్లిగా ఉన్న మల్లెతీగలు, రాయల వారిని అలవోకగా గాఢాలింగనం చేసినవి: కలలంతటా అల్లుకుపోయిన – గజపతుల ఆడపడుచు కౌగిలింతగా, రాయలవారు తబ్బిబ్బైపోయి, నిదురమైకాన మనసును ఉగ్రూత లూచి, తెలివి తెచ్చుకుని, తీగెలమెలి విడిపించుకుని, నికరంగా, – ఇక మేలుకున్నారు.

కపర – కపరగా ఉంది, చీకటి; కన్ను చూచాయగా కనబడుతూంది; మాటు మణగిన నగరం. ఓ మూలనుంచి మేలుకుంటూంది:

ఎక్కడనుంచో మూలుగు వినపడుతూంది; ఎంతసేపు గానో, ఆ సవ్వడి – మనసులో రాపాడుతూనే వుంది. కాని, పోలికకు రాలేదు :

అడుగులు, అటులాగినవి : గున్నమావి తిన్నెలమీదనుంచి, వస్తూంది ఆ మూలుగు – "అప్పాజీ?"

రాయలవారి గొంతులో భయం, ఆశ్చర్యం, విషాదం, విభ్రమం –

మహామంత్రి రెండు కళ్ళూ పొడిచేసి, ఎవరో ఆ తిన్నెమీద పడేశారు : గాటుల్లో చిమ్మిన నెత్తురు. పేరుకు పోయింది : మనిషి, ఒకటే మూలుగుతో, మూటల్లే ఒంటిమీద స్పృహ లేకుండా గుటగుట – లాడుతున్నాడు రాయలవారంత కరుకుయోధుడు – నిర్ధాక్షిణ్యంగా అంతసీమను జయించుకు వచ్చిన జగజెట్టి – చూసి చూడగానే, పసిపాపడల్లె అడలుతూ, నిలువునా కుప్పకూలి పోయినాడు;

ఒక దూసుకున్న కత్తిలాగా, మనసు, రాత్రి ఏం జరిగి వుంటుందో ఒక్కసారి ఝుళిపించింది.

గజపతుల కన్నె. ఆమె వెంటవచ్చిన దాసీ రాకాసులు. మహామంత్రి, మంచితనానికి చేసిన తంత్రం పసిగట్టి ఉంటారు; అలా కసితీర్చుకుని ఉంటారు.

తనకైతే, చేతనైనంత వరకూ, రాజ్యాలు జయించడం, పరరాజుల ధాకను అరికట్టడం, ఇలాటి వీరరాహుత మర్యాదలే తప్ప. మరో పోణిమి. మొదట నుంచీ అబ్బలేదు. మనసుతోనే వ్యూహాలు పన్ని ఊహలతోనే ఆటకట్టించే ఎత్తు దుమికించడం. మహామంత్రుల ప్రజ్ఞ. అది తనకు అర్థం కాదు. చేతకాదు.

మొదటినుంచి కూడా. గజపతులతో వియ్యం తనకు ఇష్టం లేదు. ఆ చిన్నది. తన కుమార్తె ఈడుది. ఎంత జయించినా మటుకు, ఏ మొగం పెట్టుకొని తనంత పలకమారిన

సంసారి. తగుదునమ్మా అంటూ, పెళ్ళికొడు కొతాడు? ఆ చిన్నది ఏమనుకుంటుంది? కన్నవారూ, విన్నవారూ, ఏమనుకుంటారు?–

మహామంత్రి దీనికంతటికీ ఒక్కటే సమాధానం యిచ్చారు. అంతా విని, ఒక్క చిరునవ్వు నవ్వి, "నీకు తెలియదు నాయనా; రాజతంత్రంలో,, కయ్యానికే గాదు వియ్యానికీ అంతకు మించిన ప్రాముఖ్యం వుంది; మన సీమలో వుండి, ఆ సీమ ఏలికలను, అనుక్షణం అదుపులో వుంచనౌనా? కత్తి పదునుకు చేరువగా వాళ్ళ కన్నెలను తెచ్చుకుంటే, ఏ నాటికీ మనకు వాళ్ళు పాదాక్రాంతులేగా? కత్తికి ఒక్కటే పదును. రాజనీతికి – వేయి పదును లున్నాయి: నేను చెప్పినట్లుగా చెయ్యి:–" ఇంకా అర్థం అయ్యేట్టు రెండు ముక్కలలో చెప్పారు. తాను సరేనని తలవంచుకున్నాడు.

కత్తికి బాసెకం కట్టి తరలించారు. గజపతులు, కన్నెధార పోశారు. పెళ్ళివారు విద్యానగరానికి తిరిగి వచ్చారు.

కొత్త పెళ్ళి కూతురికి, ఆమె పరిచారికా గణానికి, అప్పాజీ అతి రహస్యంగా విడిది ఏర్పాటు చేశాడు. అతి వైభవంగా పునస్సంధానానికి సన్నాహం చేశాడు.

అంతవరకూ రాయలవారు, వధువును కళ్ళ చూడలేదు. ఎవరూ, ఆమె అందచందాలను వర్ణించి, నోరూరించలేదు. ఆయనకు ఆ విషయంలో అట్టి ధ్యాస కూడా లేదు. అప్పాజీ మాటకు ఎదురాడే అలవాటు లేక రాజ్యభారంతో బాటే, ఈ బరువూ ఎత్తడానికి మొగ్గాడు. అంతేకాని, అద్దరి వయసులో తనకు యీ పెళ్ళి ఎందుకు. ఆ చిన్నిది ఎలా వుంటే మటుకు తనకెందుకు? ప్రార్థనల్లా ఒకటే? ఈసారి అయినా ఆంధ్రనాయకస్వామి కరుణించి, మొగపిల్లవాణ్ణి యిస్తే – వంశం నిలుస్తుంది – తానూ అప్పాజీ యిన్నాళ్ళుగా చేసిన నిర్వాహకం నిలుస్తుంది. తిరుమలాంబిక నీళ్ళాడే ప్రొద్దులు. ఆ చల్లని కబురు వినేందుకే, రాయలవారి తహతహ :

"ఈ రాత్రికే మీకు శోభనం నాయనా?" అంటే సరే నన్నాడు :– "కాని, ఈ రాత్రి పిల్లదాని కంట నీవు పడవద్దు?" అన్నా, అదేమని విడ్డూరానికి చకితుడు కాకుండా సరే నన్నాడు:– కారణం ఏమిటో అప్పాజీ వివరించాడు.

"గజపతుల గణమంతా జయించి తెచ్చామని, కత్తులు నూరుతున్నది. వాళ్ళతో కలిసి మెలిసి వైనం తీసిన, పరిచారికలు, ఇది రూఢి చేశారు; చిన్నది, మేలి ముసుగుతోనే వుంటూంది. అందువల్ల ఆ కవళిక గమనించడానికి ఆస్కారం లేక పోయింది. అది ఒడ్డె ప్రతాపం! ఒంటరిగా పడకటింటిలో తొలిసారి తారసిల్లినప్పుడు, అక్కసు మీద ఏ ప్రమాదమన్నా జరగవచ్చు! అందుకని – నీకు మారుగా, మువ్మూర్తులా నీ ప్రతిమను అక్కడ అమర్చాను; నిలువెల్లా తేనె నింపాను – నేను మాటున ఉండి, వైఖరి గమనించి,

దుడుసుతనం చేసి, ఒరదూసినా, ఎదుటపడి, లొంగదీసి, నీకు అనుకువగా, మనసు కరిగిస్తాను!"

మహామంత్రి, ఇంత ఎత్తువేశాడు. చివరకు ఇలా అయినాడు.

అప్పాజీ ఇలా బడుగు కావడానికి కారణం – గజపతుల కన్నె : ఆడుది అని కనికరించ నవసరం లేదు.

– ఒరలో నుంచి కత్తి దూకింది. రాయలవారు – అంతకుమించిన ఒరవడితో, ఆ ప్రాసాదంలోకి దూకారు.

## 4

ముఖమంటపంలో, ఆ ఒక్కతే అలవోకగా నిలుచుని ఉంది. రాయలవారు హుంకరింపుగా అంతవరకూ సాగారు. ఆ చిన్నది, అడుగు ముందుకు వేసి, అరికట్టింది – ఓరగా – "ఏమా దూకుడు?" అన్నట్టు. నిదానంగా, మందలింపుగా చూసింది – కన్నడ – రాయలు అరమోడ్పుగా చూపు కుదించుకుని – కుడ్యభాగాలన్నీ కొత్తగా చూస్తున్నట్టు చూశాడు. రతీ – మన్మధులు. ముక్కోటి వైఖరుల మురిసి పోతున్నారు. చూడగా చూడగా, కరాన గాద్గదికం – గళాన కలవరం – రాయలవారు, ఒక్క నిమేషం, మామూలు మనిషల్లే అయిపోయి – అంతలో ఠీవి సంభాళించుకుని... కత్తి పదునంత కన్ను చేసి – విసరపోయినారు.

బెదురు లేకుండా నవ్వింది. ఆ ఒక్కతే, ఆ వీరుడి ఝళిపింపుకు.

"తండ్రి పరువానికి, తలవంపులు కాదా ఈ దుడుసుతనం, జయవీరా;" అని కిలకిల లాడింది. ఒడ్డెపడుచు జాణతనం కన్నడ రాయలకు సోకలేదు. ఆ మాట మెలకువ విప్పి చెప్పే దాకా అర్థం కాలేదు. ఆ చిన్నదాని కంటివంక, చేతికత్తి పదును వంక చూస్తూ చూపులు సానబెడుతున్నాడు.

"మీ నాయనగారు, కంటపడ్డ దాసీపడుచును, ఒంటరిగా చూసి కౌగలించేవారు కదా : మీరు కత్తి దూయడం మరియాదా? ఎంత అమాయకులండీ? ఏ అమ్మకన్న బిడ్డలండీ–"

– ఎంతో అమాయికంగా, సంశయం తీర్చుకునేందుకు అడుగుతున్నట్టు విన్నపాలౌతూంది, ఆ చిన్నది – రాయలవారు ప్రజ్వలించి పోయినాడు.

– అంతఃపుర తోరణానికి, నులిమంచు వంటి ఉలిపిరి తెర : దాని వెనుక మరొకటి....

ఏడు తెరల వెనుక మెసలే బంగారు బొమ్మ – ఈ మాటలకు కిల కిల లాడింది. ఇటు అడ్డం తొలగని చిన్నది. రాయలవారంతా ఉవ్వెత్తునా, మౌనంగా నవ్వుతూంది.

ఒక్క హుంకారంతో చిన్నది మల్లెదండల్లే రాలిపోయింది. రాయలవారి, రతనాలు తాపిన బాకు, తెరలన్నీ దూసుకుపోయి కిలకిలను కూల్చేసింది.

కూలిపోయింది – కన్నకూతురు. మోహనాంగి – పిడిమీదుగా నెత్తురు చిమ్మకుండా గుండె పొదివిపట్టుకుంది – చావు చాయలకు రాలేని నవ్వు నవ్వింది.

"విజయలక్ష్మీ నా నెచ్చెలి. ప్రభూ; మీరు కత్తికి బాసెకం కట్టించగానే, కంఠం నరికేసుకుంది. గజపతి మీకు దాసుడైనాడు. ఆ యింటి ఆడపడుచు అవమానం తప్పించుకుంది."

–రాయలవారు, – రాతి బొమ్మ.

"కత్తి కొక నీతి, గంటానికి ఒక నీతి ఉంటుందని ఊహించలేకపోయినాను. మహామంత్రులకు హృదయం లేకపోవచ్చు! మహారాజు మహాకవి; బిడ్డల కన్న తండ్రి; తిరుమలాంబికా ప్రాణేశ్వరులు; ఇంతటి వారని ఎన్నడూ కలగనలేదు."

రాతిబొమ్మ కన్నీరు ద్రిమ్మరిస్తూంది.

కొనఊపిరి, ఇంకా పలుకుతూంది.

"కృష్ణరాయలు ధర్మ ప్రభువు: అని అమాయకులు అనుకుంటున్నారు. హిందువు లందరూ కన్నతండ్రిగా భావిస్తున్నారు. పాపం!"

– రాయలవారు కన్నతండ్రిగా – అమ్మా! అని ఆక్రోశించాడు.

"మీ మీద నాకు పగలేదు ప్రభూ! రాజ్యకాంక్షకు ఏ ఇంటి పడుచైనా ఇలా బలి కావలసిందే; గజపతి – మీ అంత వైభవోపేతుడు కాకపోయినా, సాటి హిందూ ప్రభువు; విజయలక్ష్మీ నావంటి ఆడుపడుచే; కాని, మహారాజుకు యెవరు హెచ్చరికలు చేస్తారు? మహామంత్రి ప్రజ్ఞాచక్షులకు ఇలాంటి అల్ప విషయాలు గోచరించవు కదా? అవును, అదే రాజనీతి?…అదే సామ్రాజ్యం…."

….బంగారపు బొమ్మ మంచు ముద్దయిపోయింది. కన్నడ రాయల మనసు తల్లిలేని పసిపాప అయింది.

సర్వశూన్యంగా వున్న అంతఃపురంలో పిడుగులు ఒర దూసుకున్నట్టు, ఝుళక్‌మని మ్రోగింది. రాయల గుండెలో శోకం, ఎక్కడి దక్కడే పేరుకు పోయింది. చిన్నరాణికి పరివారంగా తరలివచ్చిన ఒడ్డె కన్నెలందరూ కన్నె త్రాచులల్లే ఒడ్డాణపు కత్తులు దూసి కమ్ముకున్నారు.

విచ్చుకత్తుల వాడికి, రాయలవారు మ్రాన్పడలేదు. ఆ కన్నెల కన్నుల రంపపుకోతకు వితావితలైనాడు. ఎన్నడూ వంగని శిరస్సు నేలకు సోకింది.

–అరవిచ్చిన మల్లెదండల్లె మోహనాంగిని పుణికి పుచ్చుకుని, ఆ కన్నెలందరూ ఆవేశంతో దుమికే తరగలల్లె, సన్నజాజుల నీడలో శాశ్వతంగా జోకొట్టారు; తమ రాజధానికి కలకాలం జ్ఞాపకంతో తలవంచుకుని వెళ్ళిపోయినారు.

– మోహనాంగి జాడ, నాగవాసంలో ఏనాటికీ తెలియలేదు; ఆ తల్లి ఆరాటానికి, అంతులేదు; పిల్లదాని వైనం తెలియజెప్పడానికీ, ఊరడించడానికీ, మహామంత్రులు కాని, మహారాజుకాని, అంతఃపురం చాయలకు రాలేదు.

– మంచి ప్రొద్దురాకమునుపె తిరుమలాంబిక నీళ్ళాడింది : బారెడు పిల్లవాడు.

వసంతోద్యానంలో, దివ్యభవనం ఒకటి నూతనంగా వెలిసింది. అది నివాస నికేతనమో, సమాధో, కారాగారమో, ప్రజలకు అర్థం కాలేదు. అడిగి తెలుసుకునే నిబ్బరం ఎవరికీ లేదు.

ఎన్నడన్నా, "పున్నమి వెన్నెల్లో, ఆ భవనంలో వింత వెలుగులు తోచినట్టు వేయి వన్నెల కిలకిలలు వినిపించినట్లు, ప్రజలు, భయం –భయంగా భ్రమసిపోయేవారు. తెల్లవారిన తరువాత, అదంతా, ఏదో చీకటి – చీకటిగా– ఊహకు అందని శాపంగా చూసిన వాళ్ళకు కనిపించేది. చూడకపోయినా, తలచుకుంటే అలా అనిపించేది.

ఎవ్వరూ అడుగు అటు పడనిచ్చేవారు కాదు. ఒక్క పెద్దన్నగారు మాత్రం – చుట్టపు చూపుగా కటికి చీకటుల్లో, అటు పచారు చేస్తూ వుండేవారు.

కాలం గడవగా – గడవగా – "అది చిన్నా దేవి,మేడ?" అంటూ ప్రజలు రహస్యంగా తలచుకుని, ప్రభువును తలచుకుని, దద్దరిల్లేవారు.

– రాయల రాజ్యంయధా వైభవంగా సాగుతూంది. అష్టదిగ్గజాలకూ పుష్టీ తుష్టీ ఒనగూడుతూనే వుంది. సప్త సంతానముల సంకల్పానికీ, నిర్వహణానికీ – ఏమీ లోటు లేదు.

కాని పెద్దన్నగారు –మరిచిపోదు;....

....."ఆ తల్లి ఆత్మశాంతికి, యింతకాలం బ్రతికాను తిమ్మన్నా :–

... తిమ్మన్న కంట నీరు వరదలౌతూంది. సభా భవనం నిశ్శబ్దంగా ఎలుగెత్తి రోదిస్తున్నది. చెమ్మతో చెదరిన చూపులకు, రాజధాని శిఖర గోపుర ప్రాసాదాలు. శిధిలాలై గోచరిస్తూన్నవి.

సభా భవనం ముందు, తిమ్మన్న ఒక్కడూ నిట్టూర్పల్లె నిలిచిపోయి వున్నాడు....



# అందే నారాయణస్వామి

**(1908 - 1982)**

**అ**ందేవారి కథానికలలో సమాజ సంస్కరణ, ధార్మిక దృష్టి, గ్రామ జీవిత చిత్రణ, గ్రామస్థుల మనస్తత్వ పరిశీలన - ముఖ్య విషయాలు. తెలుగు నుడికారాన్ని పుణికిపుచ్చుకొని సహజత్వంతో, జాతీయతతో ఆకర్షకమగు శైలి వీరిది. సన్నివేశాలలో వాస్తవికత, ఇతివృత్తాలలో జాతీయత వీరి ప్రత్యేకత. వీరి బిరుదు 'ఆంధ్ర మెపాసా'.

**రచనలు :** కష్టసుఖాలు, ఇద్దరు తల్లులు (నవలలు) ఉపాసనాబలం, స్నేహితులు మొ॥ కథల సంపుటాలు

# ఆత్మీయత

తొలీగా నేనా గ్రామం వరినారు నిమిత్తం వెళ్ళాను. నారుకోసం తిరిగి తిరిగి ప్రాణం బేజారైపోయింది. నారు ఎక్కడా కుదరలేదు. సూర్యుడు నడినెత్తికి వచ్చాడు: అప్పటికి తిండీ తిప్పలూ లేదు. కడుపులో చరచరలాడుతున్నది. పైన నెత్తి కాలుతున్నది. భోజనం పెట్టేటందుకు ఆ వూళ్ళో బంధువులెవరూ లేరు. పోనీ పూటకూళ్ళు తిందామా అంటే అది కుగ్రామం. పెట్టే వాళ్ళు లేరు. ఎవరిదో గచ్చరుగు గల యిల్లు నీడగా వుంటే తిరిగి తిరిగి ఆ అరుగుమీద చతికిల పడ్డాను. ఇవాళ లేచిన వేళ యెటువంటిదో గాని వచ్చిన పని కాకపోగా, తిండికి గూడా మాడవలసి వచ్చింది. పోనీ ఎకాయెకి ఇంటికి వెళ్ళిపోదామా అంటే అక్కడకు మా గ్రామం ఎనిమిది మైళ్ళు వున్నది. ఆవాళ ఎండ చుర్రుమంటున్నది. అందులో తిరిగి తిరిగి వుండటం వల్లనూ, తిండీ తిప్పలూ లేకపోవడం వల్లనూ కాళ్ళు తేలిపోతున్నవి. ఎట్లా వెళ్ళడం? మా గ్రామానికి బస్సులూ, గిస్సులూ యేమీ లేవు. ఆ అరుగుమీద కూర్చొని యెట్లానా? అని ఆలోచిస్తున్నాను. ఇంతలో ఆ ఇంటి యజమానికామాల లావుగా వున్నాడు, భోజనం చేసి తేపుకుంటూ బైటికి వచ్చాడు. అప్పుడు నేను "ఏమండీ! పని వుండి ఈ గ్రామం వచ్చాను. భోజనం వేళ దాటిపోయింది. తిరిగి తిరిగి దస్సివున్నాను. ఈ వూళ్ళో పూటకూళ్ళు పెట్టేవాళ్ళెవరైనా వున్నారా." అని అడిగాను. పెట్టేవాళ్ళు లేరని తెలిసి గూడా. ఎందుకంటే, ఇల్లూ వాకిలీ చూస్తే ధనవంతులుగానే వున్నారు. ఆయన దయదలచి "యీ వూళ్ళో పూటకూళ్ళు పెట్టేవాళ్ళు లేరు, పోనీ పాపం! యీ పూటకు మా యింట్లో భోంచెయ్యమని అంటాడేమో" నన్న ఆశతో అడిగాను. అతడు చప్పరించి, "యీ వూళ్ళో పూటకూళ్ళు పెట్టే వాళ్ళెవరూ లేర"ని బదులుచెప్పి లోనికి వెళ్ళిపోయాడు. నా ఆశ వృధా అయింది. ఇక యెవరి నడిగినా లాభం లేదనుకొని కాసేపు యెక్కడైనా పడుకొని చల్లబడ్డాక మా వూరు వెళ్ళిపోదామని నిశ్చయించి అక్కడనుంచి

లేచి ఆ గల్లీ దాటి మలుపు తిరిగాను. ఆ వీధి మూడో ఇల్లో, నాలుగో ఇల్లో అయి వుంటుంది. పెంకుటి భవంతి. ముందు వసారా. ఇంటిముందు వేపచెట్టు వున్నది. చల్లగా వుండటం వల్ల ఆ వసారాలో కాస్త వెన్ను పారిద్దామని వెళ్ళాను. ఎవరో అమ్మాయి వసారా స్తంభాన్ని ఆనుకొని తాటిపండు చీకుతూ వున్నది. నేను వెళ్ళి చొక్కా విడిచి కూచున్నాను.

ఇంతలో లోపలినుంచి ఒక స్త్రీ చంకన బిడ్డను యెత్తుకుని గుమ్మంలోకి వచ్చి నిలుచుంది. వయసు ముప్పై ఏళ్ళుంటవి. చామనచాయ శరీరం, ఆకుపచ్చరంగు చీరె కట్టుకుంది. ఆమెను ఎక్కడో చూసినట్టు వుండడం వల్ల "ఎక్కడ చూశానా" అని నెమరుకు తెచ్చుకుంటున్నాను.

ఆమె నాకేసి పరకాయించి చూసి "మీది కాజ కదూ?" అంది.

"అవునమ్మా" అన్నాను.

"నన్ను గుర్తు పట్టలేదా బాబాయ్! మనం గుంటూరు సత్రంలో వున్నాం" అంది.

అప్పుడు నాకు గుర్తు వచ్చింది. దాదాపు ఏడెనిమిది ఏళ్ళ క్రిందట మా ఆడవాళ్ళకు సుస్తీ చేస్తే మందు తింటానికి గుంటూరు సత్రంలో వున్నాం. మేమున్న ప్రక్కగదిలోనే ఆ అమ్మాయి ఆసుపత్రిలో ప్రసవించడానికి వచ్చి వున్నారు. మేము ఒకళ్ళ యింట్లో లేని వస్తువులు ఒకళ్ళను అడిగి తీసుకుంటూ ఎంతో కలిసి మెలసి వుండేవాళ్ళం. తరచు ఆమె భర్త అక్కడ వుండేవాడు కాదు. ఆమె తల్లి ఆమెతోపాటు వుండేది. నేను అప్పుడప్పుడు వాళ్ళకు బజారు నుంచి వెచ్చాలూ అవీ తెచ్చి పెడుతూ వుండేవాణ్ణి. ఆమె నన్ను బాబాయ్! అని పిలిచేది. అప్పుడామె బక్కపలచగా వుండేది ఇప్పుడు కొంచెం లావయింది.

అప్పుడు నేను "జానికమ్మవా తల్లీ! మారిపొయ్యావు. గుర్తు పట్టలేకపొయ్యాను" అన్నాను.

"చానాళ్ళకు కనిపించావు బాబాయ్! ఈ వూరు ఏం పనిమీద వచ్చావు?" అని అడిగింది.

"వరినారు కోసం వచ్చాన"ని చెప్పాను.

"భోజనం చేశావా బాబాయ్?" అని అడిగింది.

"లేదమ్మా" అని చెప్పాను.

"ఇంకా భోజనం చెయ్యలా! మా ఇంట్లో భోజనం చేద్దువుగాని రా బాబాయ్!" అంది ఆప్యాయంగా.

ఆకలితో వున్న నాకు ఆమె మాటలు ఎండి బీటలు వారిన చేలో వర్షం పడ్డట్టయింది.

"నారు కోసం తిరిగి తిరిగి వుండటం వల్ల, విపరీతంగా ఆకలిగూడా వేస్తున్నది తల్లీ!" అంటూ ఆమె వెంట లోపలికి వెళ్ళి, పెరట్లో నుయ్యిదగ్గిర కాళ్ళూ చేతులూ కడుక్కుని,

ఆమె వడ్డించగా తృప్తిగా భోంచేశాను. పప్పూ, ఘుమఘుమలాడే నెయ్యి, రెండు పచ్చళ్ళు, గడ్డ పెరుగుతో చుట్టానికి పెట్టినట్లు భోజనం పెట్టింది. భోజనం కాగానే కాసేపు కునుకు తీసి లేసేసరికి ఎండ తగ్గింది. "వెళ్ళి వస్తా జానికమ్మా!" అని చెప్పి చంటిపిల్ల చేతులో ఒక బేడా పెట్టి, బయలుదేరి మా వూరు వచ్చేశాను.

## 2

తర్వాత దాదాపు రెండు మాసాలకు, గేదె తప్పిపోతే వెదకడానికి మళ్ళా ఆ గ్రామం వెళ్ళాను. బందిలి దొడ్లో పడ్డదేమోనని చూసుకొని, అక్కడ లేకపోతే పశువులను వూరు వెలపల మందవేసే వేళ కావడం వల్ల. వూరు వెలపలకు వెళ్ళి మందలో చూశాను. అక్కడా కనిపించలేదు. ఇక తిరుగు ముఖం పట్టాను. పది బారలు నడిచానో లేదో వెనుకనుంచి "బాబాయ్" అన్న కేక వినవచ్చింది. ఎవర్నో పిలుచుకుంటున్నారనుకొని తలవంచుకొని వెళ్ళిపోతున్నాను.

"ఇదిగో బాబాయ్! నిన్నే!" మళ్ళా కేక వినిపించింది. వెనక్కు తిరిగి చూశాను. జానకమ్మ నెత్తిన మూటతో మంద ప్రక్క బాటలో నిల్చుని వుంది. దగ్గరికి వెళ్ళి "ఏం తల్లీ!" అన్నాను.

"మా యింటికి రాకుండానే వెళ్ళుతున్నావేం బాబాయ్! ఏం పని మీదవచ్చావు?" అని అడిగింది ఆప్యాయంగా!

"గేదె తప్పి పోయింది తల్లీ! వెదకటానికి వచ్చాను. కనిపించలేదు" అని చెప్పాను.

"అట్లాగా! మా ఇంటికి వెళదాం" రమ్మని నన్ను వెంట పెట్టుకుని ఇంటికి తీసుకెళ్ళి కాళ్ళకు నీళ్ళిచ్చి "భోజనం చేసి వెళ్ళమ"న్నది.

"ఎందుకుతల్లీ! ఇప్పుడు పదిగంటలైంది. భోజనం వేళకు యింటికి వెళ్ళతాను" అన్నాను. కాదు కూడదని బలవంతపెట్టింది. రానివ్వలేదు. కాళ్ళు కడుక్కుని భోం చేశాను. జానకమ్మ పొగాకు తెచ్చియిచ్చి, "ఎండగా వున్నది. ఇప్పుడేం వెళతావు కాసేపు పడుకో బాబాయ్!" అంటూ మంచం వేసింది. నేను చుట్ట చుట్టుకుంటూ మంచం మీద కూర్చున్నాను. జానకమ్మ మంచందగ్గర కూర్చుని ఆప్తులకు చెప్పినట్లు ఇంటి విషయాలన్నీ నాకు చెప్పింది. వాళ్ళకు పది ఎకరాల మాగాణి, నాలుగెకరాల రేగడా వున్నదట! రెండు ఎడ్లజతలు, ఇద్దరు పాలేళ్ళు అంతా స్వంతకమతం. అప్పూ సప్పూ ఏమీ లేదట. నిరుడు పంట అమ్మిన డబ్బు పెట్టి ఒక ఎకరం పొలం కొన్నారట. మొన్నవాళ్ళ పెద్ద ఆడబిడ్డకు సారెపెట్టి పంపిస్తే ఐదు వందలు అయినవట! ఆమె పుట్టిల్లు పొన్నెకల్లు. తండ్రి లేడు. తల్లీ అన్నా వున్నారట! ఇవన్నీ చెప్పింది. నాకు అంతా మగపిల్లలే గాని ఆడపిల్లలు లేరు. ఆడపిల్లల

యొక్క అనుభూతిని యెన్నడూ చవిచూసి యెరుగని నాకు ఆమె చూపుతున్న అమాయకపు ప్రేమకు హృదయం ఉప్పొంగిపోయింది. ఇంతలో పొలం నుంచి కామాలు భర్త వచ్చాడు. నలభై యేళ్ళుంటవి, యెత్తుసరి విగ్రహం. నన్నాయనకు పరిచయం చేసింది.

ఆయన "అట్లాగా!" అంటూ చెప్పులు విడచి చేతిలో కర్ర మూలపెట్టి "ఏమండి! మీ వూళ్ళో మంచి గిత్తలు దొరుకుతయ్యా?" అని లాంఛనప్రాయంగా నన్ను పలకరించాడు.

"ఎందుకు దొరకవండి?" అన్నాను. భర్తకు భోజనం పెట్టేందుకు జానకమ్మ లేచి వెళ్ళిపోయింది.

నేను పడుకుని కాసేపు కునుకుతీసి లేచి ఆవతల వసారాలో ఎడ్లకు దానా వులవలు వుడకపెడుతున్న జానకమ్మను పిలిచి "ఇక వెళ్ళి వస్తా తల్లీ! మీ దంపతులు మా వూరు ఒకసారి" రమ్మని చెప్పి చంటిపిల్ల చేతులో చిల్లర పెట్టి వచ్చేశాను.

## 3

మా స్వగ్రామం కాజ. అటు తర్వాత దాదాపు నెల రోజులకు నేను మాయింటి వీధి అరుగుమీద ఎండలో కూర్చుని ఎడ్లకు సిగమారు వేస్తూ, మా మనవడికి కథలు చెపుతున్నాను. అది చలికాలం. సూర్యుడు రావిచెట్టుపైకి వచ్చాడు. అప్పుడు ఉదయం తొమ్మిదిగంటలవుతుంది. జానికమ్మ భర్త రామకోటయ్యగారు మా వీధిపై నుంచి వస్తున్నాడు. ఈయన యీవూరు ఎందుకు వచ్చాడబ్బా! బహుశా ఎడ్ల నిమిత్తం వచ్చివుండవచ్చు! అనుకున్నాను. ఆయన మా గుమ్మం సమీపించాడు. నన్ను గుర్తు పట్టలేదు. వెళ్ళిపోతున్నాడు. అప్పుడు నేను లేచి "ఏమండీ! రామకోటయ్యగారు! మా యింటికి రాకుండానే వెళ్ళిపోతున్నారే?" అన్నాను. ఆయన నా వంక చూసి "ఓహో! మీరా!" అంటూ నా వెంట లోనికి వచ్చాడు. "కూర్చోం"డని మంచం వాల్చాను. అతను కూర్చున్నాడు. కాళ్ళకు నీళ్ళిప్పించాను. ఆయన "యిప్పుడెందుకు లెండి కాళ్ళకు నీళ్ళు! బాకీ వుండి వచ్చాను. వెంటనే వెళ్ళిపోతాను" అన్నాడు.

"మా ఇంట్లో భోజనం చెయ్యకుండా మీరు వెళ్ళటమే! మీ వూరు వస్తే చాలు మా అమ్మాయి జానకమ్మ భోజనం చేయంది బతకనివ్వదు! మీరు వెళ్ళేటందుకు వీల్లేదు!" అన్నాను.

"భోజనానికే మొచ్చెలెండి! భోజనం సంగతి తరవాత చూద్దాం! ముందు వచ్చిన పని కానివ్వండి! మా వూళ్ళో ఒకడు, రెండు వందలు బాకీ వుండి, అత్తవారి వూరు యీవూరైతే యిక్కడికి వచ్చేశాడు. పాలేరుగా వుంటానంటే పెళ్ళికని డబ్బిచ్చాను. మా దగ్గిరా తీరా రెండు మాసాలైనా పనిచెయ్యలేదు. ఎగకొట్టి చెప్పకుండా ఈ వూరు వచ్చేశాడు.

ఇప్పటికి ఐదారు మాసాలు కావచ్చింది. నోటు గూడా వ్రాయించుకోలేదు. వాడిపేరు నాగయ్య. ఇక్కడ లేళ్ళవారి అల్లుడట. ఈ వూరు నాకు కొత్త, మీరు కాస్త విచారించిపెట్టండి" అన్నాడు.

"నాకు తెలుసులెండి! మీ వూరితో సమ్మందం చేసింది లేళ్ళ కామయ్య. అతని రెండో కూతుర్ని మీ వూరిచ్చాడు. భోజనం కాగానే వెళ్ళి కనుక్కుందాం లెండి!" అని చెప్పాను.

ఆయన ఆ పూట మా ఇంట్లోనే భోజనం, కాగానే కామయ్య ఇంటికి వెళ్ళాం. వాళ్ళది పూరి ఇల్లు. ఒక గదిలో అల్లుడూ, కూతురు వున్నారట! మేము వెళ్ళేసరికి నాగయ్య యింట్లోనే వున్నాడు. బాకీ విషయం అడగ్గా "ఇప్పుడు చేతిలో డబ్బు లేదు. రెండు నెలల్లో యిస్తా"నన్నాడు. అప్పుడు నేను రామకోటయ్యగారిని యివతలకి పిలిచి, "వీడు పనీ పాటా చెయ్యని మాచకమ్మ. మీరు నాగయ్య అంటే యెవరో అనుకున్నాను. వీణ్ణెందుకు ఎరగను! గంగానమ్మ గుడి దగ్గర చీట్లాడుతూ వుంటే, పొలం వెళ్ళుతూ చాలాసార్లు చూశాను. వీడికి బాకీ ఎట్లా పెట్టారు? వీడి మామ వేలకు వేలు తింటున్నవాడు, ఒక కుంట పొలం కూడా వున్నది. అతనిచేత అవాల్తీ చేయించుకుంటే మీ బాకీ వస్తుంది" అని చెప్పాను. ఇంతలో యెక్కడ నుంచో కామయ్య వచ్చాడు, సంగతంతా అతనితో చెప్పి బాకీ అవాల్తీ పడమని అడిగాం. అతడు మండిపడుతూ, "మొగుడూ పెళ్ళానికి రుణం పెట్టేది కాక, పైగా అవాల్తీ కూడానా!" అంటూ అక్కడ నిలబడకుండా లోనికి వెళ్ళిపొయ్యాడు. అప్పుడు రామకోటయ్యగారు నన్ను యివతలకి పిలిచి, "వీడికి మా వూళ్ళో యిల్లూ, వాకిలీ వున్నది. అందులో వీడి అన్న వుంటున్నాడు. అన్నలో సగం వాటా వస్తుంది. వీడిచేత నోటు వ్రాయించుకుంటే మంచిది" అన్నాడు. చూస్తే అంతకంటే గత్యంతరం కనపడలేదు. నాగయ్యను "చేతిలో వచ్చినప్పుడు యిద్దువు గాని ప్రాంసరీ నోటు వ్రాసివ్వ"మని అడిగాం.

వాడు "ఇంతమాత్రానికి నోటెందుకు? యెగవేసి పోతామనా? గుంటూరులో పాలవర్తకం చెయ్యబోతున్నాను. మీ బాకీ రెండు నెలల్లో యిచ్చేస్తాను" అన్నాడు. "చేతిలో వచ్చినప్పుడు యిద్దువుగాని నోటు వ్రాసి ఇవ్వడానికేం?"అని ఎంతో దూరం చెప్పాం. వాడు ససేమి వ్రాసి ఇవ్వనంటే ఇవ్వనన్నాడు. రామకోటయ్యకు కోపం వచ్చి గట్టిగా మాట్లాడగా, వాడు నేను వ్రాసిచ్చేది లేదు. నువ్వు చేసుకునేది చేసుకోపొమ్మన్నాడు. చేసేది లేక యిద్దరం మా ఇంటికి వచ్చేశాం. అప్పుడు నాకో ఆలోచన తట్టింది. మా వూరికల్లా శివయ్యగారు పెద్ద. ఆయన మాటంటే మా వూళ్ళో యిక తిరుగులేదు. ఆయన కంటే చదువుకున్న వాళ్ళు వున్నారు. గాని, ఎంతమంది వున్నా ఆయనకే పలుకుబడి! రామకోటయ్యగార్ని వెంట పెట్టుకుని శివయ్యగారి దగ్గరకు తీసుకెళ్ళాను. సంగతంతా

వారితో చెప్పాను. చెప్పింది ఆయన శ్రద్ధగా ఆలకించి 'నోటు వ్రాసి ఇవ్వమన్నా వ్రాసి ఇవ్వలేదా? నేను కనుక్కుంటా పదండి!"అని పై మీద పంచె వేసుకొని అప్పుడే మా వెంట బయలుదేరాడు. మేము కామయ్య యిల్లు సమీపించే లోపల దారివెంబడి శివయ్యగారితో యిద్దరు ముగ్గురు కలిశారు. మేమంతా కలిసి రామయ్య యింటికివెళ్ళి గుమ్మం ముందు నిలబడ్డాం. శివయ్యగారు కామయ్యను ముందుగా పిలిచి "మీ అల్లుడిచేత వీరికి నోటు వ్రాయించి యివ్వలేకపొయ్యావు?" అని అడిగాడు.

అప్పుడు కామయ్య "అయ్యో! ఎంత చెప్పినా అతను వింటేనా! పాపం వీరు పొరుగూరు నుంచి వచ్చారు. నోటువ్రాసి యివ్వమని ఎంతో దూరం చెప్పాం. నా మాట వింటేనా బాబు!" అని బొంకి కాపాడుకున్నాడు.

అప్పుడు శివయ్యగారు "మీ అల్లుణ్ణి పిలవ" మనగా కామయ్య యింట్లో వున్న అల్లుణ్ణి పిలిచాడు. అతడువచ్చి శివయ్యగారి ఎదుట నిలబడ్డాడు. "ఏం అబ్బాయ్ వీరికి బాకీ వున్నావుట" అని అడిగాడు శివయ్యగారు.

"ఉన్నానండీ!" అన్నాడు నంగిగా నాగయ్య.

"ఉంటే నోటు వ్రాసియివ్వనన్నావటగా? బాకీ వున్నప్పుడు నోటు వ్రాసి యివ్వడానికేం? వ్రాసియివ్వమ్మా?" అనిచెప్పి, వెంట వచ్చిన వారిలో ఒకరిని నోటు వ్రాయడానికి పురమాయించి నోటు పూర్తి చేయించి రామకోటయ్య గారికి ఇప్పించి వెళ్ళిపొయ్యాడు శివయ్యగారు. వారి పనిపూర్తి అయినందుకు అప్పుడు నాకు తృప్తి కలిగింది. రామకోటయ్యగారు నోటు పుచ్చుకుని ఇంటికి వెళ్ళిపొయ్యారు.

మార్గశిర పుష్యమాసాలు వెళ్ళి మాఘమాసం వచ్చింది. చలి తగ్గిపోయింది. పడమట చేలో వేసిన మిరపతోట కోతకు వచ్చింది. మా వూరిని ఆనుకొని రోడ్డు వున్నది. రోడ్డుకు ఆనుకొని చెరువు, చెరువునిండా తుమ్మలు, తుమ్మచెట్లనిండా కొంగలు, ఆ చెరువు కింద కొంత మాగాణి భూమి సాగవుతున్నది. రోడ్డుమీద నిలబడితే చాలు, ఆ చెరువు, చెట్లనిండా ఆ కొంగలు, దూరాన పచ్చని పొలాలు, ఆ దృశ్యం ఎంతో బాగుంటుంది. గుంటూరువెళ్ళే బస్సులు కూడా అక్కడనే ఆగుతవి. అక్కడ ఒక పెట్టె దుకాణం వున్నది. వచ్చే వాళ్ళు, పొయ్యేవాళ్ళతో అక్కడ సందడిగా వుంటుంది. పడమటి పొలం వెళ్ళాలంటే ఆ రోడ్డు దాటి దారిగుండా వెళ్ళాలి. నేను పొద్దున్నే సద్దెన్నంతిని, మిరపతోటకు వెళదామని రోడ్డు దగ్గరకు వచ్చి, పెట్టె దుకాణం దగ్గర కొబ్బరి తాడుకు చుట్ట కాల్చుకుంటున్నాను. గుంటూరు నుంచి బస్సు వచ్చి, దించే వాళ్ళను దించి, ఎక్కించుకునే వాళ్ళను ఎక్కించుకుని వెళ్ళిపోయింది. ఆ బస్సు అటు వెళ్లడంతోనే గుంటూరు వెళ్ళే బస్సు వచ్చి నిలిచింది. దిగేవాళ్ళు దిగుతున్నారు. ఎక్కేవాళ్ళు యెక్కుతున్నారు. నాకా బస్సులో జానకమ్మలాగా

ఒక స్త్రీ కనిపించింది. అదాటుగా చూడటం వల్లనేమో ననుకొని  బస్సు దగ్గిరకు వెళ్ళి చూశాను. నిజంగా జానకమ్మే! నా ప్రాణం లేచి వచ్చింది. "ఎక్కడికి ప్రయాణం తల్లీ?" అని అడిగాను. ఆమె నన్ను చూసి "ఆయనగారు కూడా వున్నారు. ఇద్దరం గుంటూరు పెళ్ళికి వెళుతున్నాం బాబాయ్!" అన్నది. "ఈ పూటకు ఇక్కడ దిగి ఇద్దరూ భోజనం చేసి వెళ్ళ" మన్నాను.

"అల్లుడూ, కూతురూ మీ ఇంటికి ఎలా రాకుండా వుంటారులే బాబాయ్! వచ్చేటప్పుడు తప్పక వస్తాం!" అన్నది. ఇంతలో బస్సు కదిలిందినేను పొలం వెళ్ళిపొయ్యాను.

మూడవ రోజున జానికమ్మ చెప్పిన ప్రకారం దంపతులిద్దరూ మా వూళ్ళో దిగి మా యింటికి వచ్చారు. ఆ రోజల్లా మా ఇంట్లో వుండి, మర్నాడు వెళ్ళిపొయ్యారు.

మాకు పాడి లేదు. గేదె యెండిపోయింది వారు వచ్చినప్పుడు వారికి గడ్డ పెరుగూ అదీ సరయింది కాకపోవడం వల్ల కించపడుతూ, జానకమ్మతో మాట సామెతగా "మాకు పాడిలేదు తల్లీ! గేదె సూడిది. మజ్జిగ నీళ్ళకోసం యిబ్బంది పడుతున్నాం" అన్నాను.

అందుకామె "మాకు రెండు గేదెలు యిస్తున్నయ్! మీ గేదె యీనిందాకా ఒక దాన్ని తోలుకొచ్చుకో బాబాయ్!" అన్నది.

"ఎందుకులే తల్లీ! యెవరో కాసిని పోస్తూనే వున్నారు. అవే సరిపెట్టుకుంటున్నాం" అని చెప్పాను.

అంతటితో జానకమ్మ వూరుకుందా! వారు వెళ్ళిన మూడవ రోజుకల్లా పాలేరు చేత గేదెను మా యింటికి తోలనే తోలింది. మా గేదె యీనిందాకా వుంచుకుని తర్వాత వారి గేదనూ, దూడనూ వారింటికి తోలి వచ్చాను. ఆ రెండు మాసాలూ యిబ్బంది పడకుండా సుఖంగా తాగాం.

మా పరిచయం బాంధవ్యంగా మారింది. రాను రాను  మా రెండు కుటుంబాలకూ ఎంతో  ఆత్మీయత యేర్పడింది. మా ఇళ్ళల్లో యెవరింట్లో యే కాస్త పని వచ్చినా రెండో వారు లేకుండా జరుగదు. నాకు ఆడపిల్లలు లేని కొరత తీర్చాడు భగవంతుడు. ప్రతి పండక్కూ జానకమ్మను మా యింటికి తీసుకొస్తున్నాను.

## 5

పొలం పనులు అట్టే లేకపోవడం వల్ల ఒక రోజు ఉదయం నేను మా ఇంటి వసారాలో కూర్చుని భాగవతం చదువుతున్నాను. రామకోటయ్యగారి పాలేరు వచ్చి "మిమ్మల్ని రామకోటయ్యగారు యేగిరం పిలుసుకురమ్మన్నారండి!" అన్నాడు.

"అంత అర్జంటైన పనేమిటి?" అని అడిగాను.

"అదేంటో గొడవగా వుందండి! మిమ్మల్ని యంట పెట్టుకుని తీసుకు రమ్మన్నారండీ, రామకోటయ్యగారు!" అన్నాడు పాలేరు.

నేనూ, పాలేరు వెంటనే భోజనాలు చేసి బయలుదేరాం. పెదపాలెం చేరేటప్పటికి మధ్యాహ్నం రెండు గంటలైంది. జానకమ్మగారి ఇంటికి వెళ్ళేసరికి పిల్లలు కనిపించారు గాని, భార్యాభర్తలు కనిపించలేదు. "మీ అమ్మా నాన్న ఎక్కడికి వెళ్ళారని అడగ్గా, మా అమ్మ ఇంట్లో పడుకున్నది. మా నాన్న ఎక్కడికో వెళ్ళాడు" అని చెప్పారు.

పాలేరు నీళ్ళు తెచ్చి ఇవ్వగా, కాళ్ళు కడుక్కుని యింట్లోకి వెళ్ళాను. జానకమ్మ ఒక మూల చాపమీద పడుకుని వున్నది. దగ్గిర పెద్దపిల్ల కూచుని వున్నది. ఆమె కళ్ళు దించుకు పోయినవి: ఎన్నాళ్ళనుండో అన్నం తిననట్లుగా కనిపించింది.

"అమ్మా! తాతయ్య వచ్చాడే" అని పిల్ల చెప్పగా జానకమ్మ లేచి కూర్చుని నన్ను చూచి కంటతడి పెట్టుకుంది.

"ఇదంతా ఏమిటమ్మా?" అని అడిగాను. "ఏముంది! ఏమీలేదు బాబాయ్!" అన్నది. "నాకు చెప్పకపోతే ఎవరికి చెప్తూతావు తల్లీ!" అని గుచ్చి గుచ్చి అడిగిన మీదట చెప్పింది. "విలువలేని బతుకు బతికి దేనికి బాబాయ్! ఇన్నియేళ్ళు వచ్చినా తిట్లు పడటం తప్పలేదు. మొన్న నానా మాటలు అన్నారు" అన్నది.

"ఆయన అనేవాడు కాదే. అంతకోపం ఎందుకొచ్చిందమ్మా!" అని అడిగాను.

"నేనేమీ అనలేదు బాబాయ్! ఆయన చెప్పిన పని చెయ్యలేదట!" అన్నది.

"ఆయనచెప్పినపని యేమి చెయ్యలేదు నువ్వు?" అని అడిగాను

"ఆరోజున నిజంగానే చెయ్యలేదు బాబాయ్! ఆయన మీద నాకు కోపం రగిలిపోతున్నది. అసలు సంగతేమిటంటే మా తోడికోడలు గారిది పక్క యిల్లని నీకు తెలుసుగా! మొన్నొకరోజున ఇద్దరి మధ్య వున్న దొడ్డి దడి పడిపోవడంవల్ల, మా గేదె పోయి వాళ్ళ చెట్ల పాదు మేసిందని మా తోడికోడలు మమ్మల్ని తూరుపారపట్టడం ప్రారంభించింది. మేము పచ్చగా వున్నామని అసలే మేమంటే వాళ్ళకు కడుపుమంట! మునుపొకసారి మా కోళ్ళు వాళ్ళ దిబ్బ చిమ్మేసినైయ్యని, అప్పుడట్లాగే తిడితే నేను వూరుకున్నాను. యెందాకని వూరుకునేది. నేను వెళ్ళి జ్ఞానం లేని పశువు, మీ చెట్ల పాదని దానికేం తెలుసు! అని కలుగజేసుకున్నాను. పెళ్ళాన్ని వెనక వేసుకొని మా మరిది వచ్చి నన్ను నానామాటలు అన్నాడు. నేను బుద్ధి తక్కువదాన్నట. అట్లా అతడు కూస్తున్నా, యీయన వింటూ యేమీ కలుగజేసుకోలేదు. బెల్లంకొట్టిన రాయిలా వూరుకున్నాడు. యిక ఎవరు యింటి మీదికి వచ్చినా అట్లా వూరుకునే వారేగా బాబాయ్. ఇటువంటి విషయాల్లో గూడా మగవాడు కలుగజేసుకోకపోతే అవతలవాళ్ళకి ఆడది యెంత

లోకువైతుంది బాబాయ్! తమ్ముడు చేత అనిపించింది గాకుండా పైగా తాను గూడా తిడతాడా. ఇక యెందుకు ఈ బతుకు బతికి బాబాయ్!" అని చెప్పింది జానకమ్మ.

ఆమె ఈ మాటలు చెపుతూ వుండగా ఆమె కళ్ళవెంట నీళ్ళు కారుతూనే వున్నవి. ఆమె స్థితిని చూసి నా గుండె నీరయింది. లోలోన బాధపడ్డాను. "మామ్మవుకదూ! ఏడవబోకు! భార్యాభర్తలు అని వున్నాక మాట పలుకు రాకుండా వుంటుందా తల్లీ, యెవరి వల్ల పొరపాటున్నా, అవన్నీ సర్దుకు పోవాలి. ఎలుక నుంచి ఇల్లుకు చిచ్చుపెట్టుకున్నట్లు ఎవరినుంచో మీరిట్లా కీచులాడుకోవడం బాగాలేదు. ఎట్లా చిక్కిపొయ్యావు యెన్ని రోజులైందమ్మా! అన్నం తిని?" అని అడిగాను.

"నాలుగు రోజులనుంచి అన్నం తినడం లేదు తాతయ్యా!" అని చెప్పింది పెద్దపిల్ల.

"నేను తింటే యెవరికి తినకపోతే యెవరికి బాబాయ్! ఇన్నాళ్ళబట్టి తినకుండా వున్నా, నువ్వు తిన్నావా? తినలేదా అని ఎవరైనా పలకరించిన వాళ్ళున్నారా బాబాయ్. నేను చచ్చినా బ్రతికినా ఆయన కేమీ అవసరం లేదు" అన్నది జానకమ్మ.

"నీదంతా పిచ్చి వూహ తల్లీ! నిన్ను గురించి ఆయనకేమీ పట్టకపోతే నన్నెందుకు పిలిపిస్తాడు?" అని సర్దిచెప్పాను.

ఇంతలో రామకోటయ్యగారు గొడ్లసావిట్లో వుండి పిలుస్తున్నారని కబురు రాగానే నేను లేచి సావిట్లోకి వెళ్ళాను. రామకోటయ్యగారు అక్కడ మంచంమీద కూర్చుని వున్నాడు. సందె పడింది. పాలేరు బుడ్డాడు అప్పుడే పొలం నుంచి పశువులను తోలుకువచ్చి సావిట్లో ఎక్కడ కట్టేసేవి అక్కడ కట్టేస్తున్నాడు. రామకోటయ్యగారు నన్ను చూచి "రాండి! మీ కుమార్తెగారు ఏమైనా దారికి వచ్చిందా?" అని చిరునవ్వుతో అడిగాడు.

నేను ఆయన సరసన మంచం మీద కూర్చుని "ఎలా దారికొస్తుందండీ! పెద్ద వాళ్ళయి సంసారంలో కష్టసుఖాలు ఇద్దరూ సమంగా పంచుకుంటున్న ఈ యీడులో కూడా మీరా మాటలంటే నిజంగా మానుషంగల ఏ స్త్రీ సహిస్తుంది చెప్పండీ?" అన్నాను.

"అదికాదండీ! మనిషిని ఎదిరిస్తే యెటువంటి వాళ్ళకైనా కోపం వస్తుందంటారా? రాదంటారా? అత్తమీద కోపం దుత్తమీద చూపించినట్లు యెక్కడి కోపమో నామీద చూపిస్తే యెట్లాగు? మొన్న తోడికోడళ్ళు పోట్లాడుకుంటుంటే మా తమ్ముడు కూడా కలుగజేసు కున్నాడు. వా డసలే పనికిమాలిన వాడు. అంతా పోగొట్టుకొని అన్నిటికీ సిద్ధంగా కూర్చున్నాడు. నేను కూడా కలగజేసుకుంటే రగడ పెరిగిపోతుందని వూరుకున్నాను. ఆవిడకు నేను కూడా పోట్లాటకు వెళ్ళలేదని నా మీద కోపం!" అన్నాడు.

"సరేలెండి! యేదో కోపం వచ్చి మీ రన్నారనుకోండి. పోనీ యిన్ని రోజుల నుంచీ అమ్మాయ్ అన్నం తినకుండా వుంటే మీరు యేమైనా తినమని అనగలిగారా? ఆడవాళ్ళ

మనసు చివుక్కుమంటే ఏముంది. తెగించి ఏ అఘాయిత్యమైనా చేసుకుంటే అప్పుడేమనుకుంటే ఏమిలాభం? ఇప్పుడైనా మీరు వెళ్ళి లేచి అన్నం తినమని చెప్పండి" అన్నాను.

"మీరు చెప్పారుగా లేస్తుందిలెండి! అందుకే మిమ్మల్ని పిలిపించాను"అన్నాడు రామకోటయ్య.

"అబ్బే నేను చెపితే వినేస్థితిలో లేదు. మీరు పిలవండి లాభంలేదు. అన్న వారికి మీకే ఇంత యిదిగా వుంటే, పడ్డదానికి ఇంకెంత కష్టంగా వుండాలి. మీరు పిలిస్తేనే గాని ఆమె కోపం తగ్గేటట్టు లేదు" అనియెంతో దూరం చెప్పి ఆయనచేత జానకమ్మను పిలిపించాను. తర్వాత జానకమ్మకు చెప్పవలసిన మాటలు చెప్పాను. ఆమె లేచి వంట చేసింది. యీ నాలుగు రోజులబట్టి ఏదో పెద్దపిల్లే వుడకేస్తున్నదట.

ఆ రాత్రి జానకమ్మ భర్తకీ, నాకూ స్నానానికి నీళ్ళు తోడి ఇద్దరికీ వడ్డించింది. మా భోజనాలయ్యాక ఆమె తింటుందో తినదోనని దగ్గర వుండి ఆమెచేత గూడా తినిపించాను.

రెండురోజుల వరకు నన్ను బలవంత పెట్టి యింటికి వెళ్ళ నివ్వలేదు. భార్యాభర్తలు లక్షణంగా మళ్ళా ఎప్పటిలాగా యింటి వ్యవహారాల్లో ఒకళ్ళని ఒకళ్ళు కలబలుక్కుంటున్నారు. ఆ మూడవ రోజున తొందర పనులున్నవని చెప్పి ఇంటికి వచ్చేశాను.

## 6

నాకు ముగ్గురు కొడుకులు. పెద్దవాళ్ళిద్దరికీ భార్యలు రావడానికి వచ్చారు. వాళ్ళకు సంతానం కూడా. మూడోవాడి పెళ్ళి అయింది గానీ, భార్య ఇంకా కాపరానికి రాలేదు. మాకు వ్యవసాయమే జీవనం. స్వంత పొలం వున్నది ఒక ఎకరమే అయినా, ఐదారు ఎకరాల కవులుకు చేస్తాం. నా భార్యకు, కోడళ్ళకూ ఆడవాళ్ళల్లో యింతవరకు పొరుపులు ఏమీ లేవు. మూడో వాడి పెళ్ళికి ఋణం మాత్రం కొద్దిగా వున్నది. అట్లాగే సంసారం నెట్టుకొస్తున్నాము.

ఆ రోజున పెద్దవాడూ, చిన్నవాడూ పొద్దునే లేచి పడమటి పొలం వెళ్ళారు. రెండోవాడుబండి కట్టుకుని తెల్లవారు జామునే బాడిక్కు వెళ్ళాడు. నేను సద్దిన్నం తిని మాగాణి కాడికి వెళ్ళాను. వర్షం పడడం వల్ల నేలంతా రొచ్చురొచ్చుగా వున్నది. ఎవరో కుర్రాళ్ళు గనేల కలుగులో యెండ్రకాయలు పడుతున్నారు. మాపొలం పక్క బోదకాలువ దగ్గర చేపలకోసం కొంగలు గుంపులు గుంపులుగా వాలినవి. పైరు పొట్టకారుకు వచ్చింది. పొలం నలుమూలలా తిరిగి చూశాను. ఈ సమయంలో యేదైనా ఎరువు వేస్తే

బాగుంటుందని ఆలోచిస్తున్నాను. ఇంతట్లో జానకమ్మగారి పాలేరు అక్కడకు వచ్చి "మిమ్మల్ని జానకమ్మగారు పిలుసుకు రమ్మన్నారు" అని చెప్పాడు.

"ఏం! మళ్ళా భార్యాభర్తలేమన్నా కీచులాడుకున్నారా?" అని అడిగాను.

"అటువంటిదేమీ లేదండీ! యెందుకో మిమ్మల్ని దబ్బున పిలుచుకురమ్మన్నారు" అన్నాడు.

ఆపర్న ఇద్దరం ఇంటికి వచ్చాం! నాకు చూస్తే తొందరపనులున్నవి. మాగాణి ఎరువు వెయ్యాలి. అదిన్నీ గాక ఆ సంవత్సరం మిరపతోటకు తెగులుపడ్డది. గుంటూరువెళ్ళి మందు తెచ్చి చల్లాలి. ఇవన్నీ మావాళ్ళకు తెలియవు. నేను చెయ్యవలసిందే! అయినా ఎందుకు పిలిపించారో అన్న ఆదుర్దాకొద్దీ ఈ పనులు ఆపుకొని భోజనాలు కానిచ్చి ఇద్దరం బయలు దేరాం. పొద్దున వర్షం పడడం వల్ల దారంతా బురదగా వున్నది. కొంతదూరం వెళ్ళాక మళ్ళా వాన పట్టుకుంది. ఎండకు ఎండి, వానకు తడిసి మా శరీరాలు చావతేలినై యిటువంటి వానలు యేం లెక్క! వానలోనే ప్రయాణం సాగించాం. వడ్లపూడి చేరేసరికి వాన వెలిసింది.అక్కడ కాలవ దాటాలి. వూరుని ఆనుకుని వున్న కాలవ దగ్గరకి వచ్చాం. బల్లకట్టు అద్దరిన వున్నది. తడిసిన బట్టలు పిండుకుని బల్లకట్టుకోసం కాలవకట్టమీద నిరీక్షిస్తున్నాం. మాతోపాటు నలుగురైదుగురు బల్లకట్టుకోసం వేచియున్నారు.

అవతల ఒడ్డునుంచి బల్లకట్టు జనాన్ని యెక్కించుకుని కదిలింది. జనం పిక్కట బిర్రు వున్నారు. అందులో ఎవరో బైరాగి వెంట ఒక కుక్కతో గూడ బల్లకట్టు ఎక్కాడు. ఇంకా ఎవరో రెండు మేకలను గూడ యెక్కించారు. బట్టకట్టు మధ్యకు వచ్చేసరికి ఎట్లా పడ్డారో గాని ఎవరో పిల్ల కాలవలో పడ్డది. పడి మునకలు వేస్తు కొట్టుకెళుతున్నది. అందులో, ఎక్కిన జనమంతా గల్లంతుగా ఆహాకారాలు చేయడం మొదలు పెట్టారు. ఆ పిల్ల తల్లో, ఎవరో శోకాలు పెట్టడం మొదలు పెట్టింది. అంతా చూస్తున్నారే కాని ఆ పిల్లను రక్షించడానికి యెవ్వరూ సాహసించ లేదు. అందులో కాలవ నిండుగా పారుతున్నది. పిల్ల పది గజాలు దూరం కొట్టుకెళ్ళింది. నాకు ఈత వచ్చు. చిన్నప్పుడు పిల్లలమంతా పందాలు వేసుకుని మా చెరువులో యీదేవాళ్ళం ఆపర్న నేను వెనకా ముందూ చూడకుండా నీటిలో వురికి యీదుకుంటూ ఆ పిల్లను ఒడ్డుకు తీసుకొచ్చాను, ఇంతలో బల్లకట్టు కూడ ఇవతల ఒడ్డు చేరింది. ఆ పిల్ల, తల్లి ఏడుస్తూ మా దగ్గరికి వచ్చింది. "మీ బిడ్డకేమీ ఫరవాలేదు. ఏడవబోకమ్మా!"అని చెప్పాను. మాచుట్టూ అంతా మూగారు. వెంటనే తియ్యటం వల్ల పిల్ల నీళ్ళు కూడా ఎక్కువ తాగలేదు. దిమ్మరపోవడం వల్ల ఐదు నిమిషాల వరకూ పలకలేదు. తరువాత కళ్ళు విప్పి చూసి లేచి కూర్చుంది. అప్పుడు ఆతల్లి పడ్డ సంతోషానికి

మేరలేదు. వాళ్ళది పెదపాలెమట. పెనమాక పుట్టింటికి చూచి రావడానికి వెళ్ళుతున్నదట! నగలూ అవీ ఎవరో కలవాళ్ళుగానే వున్నారు. పిల్లకు ఎనిమిది, తొమ్మిదేళ్ళుంటవి. ఆమెకు ఈ పిల్ల ఒక్కతే సంతానమట! "నీవల్ల మా బిడ్డ బ్రతికింది నాయనా!" అని తల్లి ఎంతోదూరం నన్నుపొగిడింది.

కుక్కను ఎక్కించినందుకు బల్లకట్టు వాణ్ణి ఎక్కినందుకు బైరాగివాణ్ణి అంతా తలోమాట అన్నారు. అసలు యేమి జరిగిందంటే బల్లకట్టు కొంత దూరం వచ్చేసరికి కుక్క బైరాగిచేతులో తాడు గుంజుకుని మేకల మీదికి దూకిందట! కుక్క తమను ఎక్కడ కరుస్తుందోనని జనమంతా ఒత్తిగించుకున్నారట! అసలు బల్లకట్టే మునిగిపోవలసింది. కాస్తలో ప్రమాదం తప్పిందని అంతా సంతోషించారు.

బిడ్డ లేచి కూర్చోగానే తల్లి ట్రంకుపెట్టె తీసి పొడిబట్టలు కట్టి కాలవ ఒడ్డున ప్రయాణీకుల కోసం వేచి వున్న గుర్రం బండి మాట్లాడుకుని వెళ్ళిపోయారు. నావెంట వచ్చిన పాలేరు, నేను బల్లకట్టెక్కి అవతల ఒడ్డుకు చేరుకుని సాయంత్రానికి పెదపాలెం చేరాం.

మేము వెళ్ళేసరికి హాల్లో జానకమ్మ పెసలు బాగుచేస్తున్నది. రామకోటయ్యగారు లేడు. ఆమె ముఖం చిన్నబోయి వున్నది. మనిషి ఏమీ వుషారుగా లేదు. నన్ను చూసి ఆమె లేచి కాళ్లకు నీళ్లు తెచ్చియిచ్చింది. నేను కాళ్లు కడుక్కున్న తర్వాత మంచం వేసి నన్ను కూర్చోబెట్టి ఆమె చెప్పింది. "ఈయన లేనిపోని కక్ష్యలు తెచ్చిపెట్టుకున్నాడు బాబాయ్! మాగాణికి నీళ్లుపెట్టడంలో తగాదాలు వచ్చి, మా పాలేరు అవతల వాళ్ళ పాలేరు కొట్టుకున్నారు. వాళ్ళు కొట్టు కుంటూ వుంటే తరువాత యీన వెళ్లి సర్దాడట కూడా! ముందు వాళ్ల పాలేరే మా పాలేరును కొట్టాడట! తర్వాత ఇద్దరూ కొట్టుకున్నారు.

ఇద్దరికి దెబ్బలు తగిలినై. అవతలవాళ్లేం చేశారు? ఈయన్ని మా పాలేర్ని కలిపి ఛార్జీ పెట్టారు. తర్వాత ఈయన వాళ్ళ నలుగురు అన్నదమ్ముల్నీ, పాలేరునూ కలిపి ఛార్జీ పెట్టాడు. అంతా నానా గొడవగా వున్నది. ఈ ఛార్జీలూ పాడూ ఎప్పుడూ యెరగం బాబాయ్!అవతల గోరంట్ల వాళ్ళు. సామాన్యులు కారు. నలుగురు అన్న దమ్ములు. అంగబలం, అర్థ బలం కల వాళ్ళు. వాళ్ళంటే గ్రామంలో అంతా దడుస్తారు. వాళ్ళసలే కక్ష మనుషులు. వెనకా ముందూ లేకుండా దేనికైనా సిద్ధపడే రకం. కొట్లాటలు జరుగుతాయని వూరంతా పుకారుగా వున్నది బాబాయ్. ఈయన రేత్రనక, పగలనక యెప్పుడు బడితే అప్పుడు పొలం నుండివస్తూ వుంటాడు. వాళ్ళు ఎప్పుడు ఏం చేస్తారో! అని నాకు భయంగా వున్నది. రాత్రిళ్ళు నిద్రపట్టడం లేదు బాబాయ్!" అని చెప్పింది.

నేను వాళ్ళకంటే ధనవంతుణ్ణి కాదు. వాళ్ళకంటె పలుకుబడి కలవాణ్ణి కాదు. ఈ

తగాదా తీర్చడం నా వల్ల నేమవుతుందని నన్ను పిలిపించినట్లు? పిచ్చి జానకమ్మ! ఆమెకు నాయందున్న ప్రేమ అటువంటిది. అప్పుడు నేను "అట్లయితే కక్షలు లేకుండా రాజీపడడం మంచిపనమ్మా" అన్నాను.

ఇంతట్లో రామకోటయ్యగారు వచ్చారు. "ఏమిటండీ! ఈ తగాదాలు? ఛార్జీల దాకా వచ్చింది" అన్నాను.

"రానివ్వండి ఏంచేస్తాం! ముందు వాళ్ళ పాలేరే దెబ్బలాటకు దిగాడు. తర్వాత కలబడ్డారనుకోండి! దెబ్బలు మా పాలేరుకే ఎక్కువ తగిలినై. మేము ముందు ఛార్జీ పెట్టవలసింది. పెట్టకుండా వూరుకుంటే వాళ్లే ఛార్జీ పెట్టారు. తర్వాత మేమూ పెట్టాం. నిజ నిజాలు కోర్టులోనే తేలుతై" అన్నాడు రామకోటయ్యగారు.

"ఎవరిది నిజమో ఎవరిది అబద్ధమో కోర్టు వాళ్ళకేం తెలుసు? వాళ్ళకు చెవులే గాని కళ్ళు లేవు. చెప్పింది వినడమే గాని జరిగింది వాళ్లు చూడరు కదా! ఈ కక్షలన్నీ దేనికి గాని, రాజీపడండి!" అని చెప్పాను.

"వాళ్ళసలే మంచివాళ్లు కాదు. వాళ్ళతో మనకు తగాదాలు దేనికి? రాజీపడండి!"అని వాపోయింది జానకమ్మ.

"మనమేం తగాదాకు కూర్చున్నాం. ముందు తగాదాకు కాలుదువ్వింది వాళ్లు. కానీ వెధవలు! నన్నేం చేస్తారో చూస్తాను. నేను మాత్రం చస్తే వాళ్లను రాజీ అని ప్రాధేయపడను" అంటూ రామకోటయ్య చావిట్లోకి వెళ్లిపోయాడు.

"ఇదేదో రాజీ చెయ్యపోతే కక్షలు పెరిగి కొంపలంటుకుంటై బాబాయ్! అంతా పుల్లలు వేసే వాళ్లే గాని తగాదా సర్దేవాళ్ళు ఒకళ్ళూ కనిపించలేదు. అయిన వాళ్ళకు మామీద యీ కేసు రావడం సంతోషంగా వుంది. మేము పచ్చగా వుండి పొయ్యామని అసలే మేమంటే వాళ్ళకు సరిపడదు. నువ్వు కాకపోతే యింకా మాకెవరు బాబాయ్! నువ్వు నిలబడి యెట్లాగో రాజీ చెయ్యాలి!" అని కంటతడి పెట్టింది జానకమ్మ.

ఆ గ్రామంలో పలుకుబడిగల వాడు మునసబుగారు. ఆయన పేరు గోపాల కృష్ణయ్యగారు. ఈలోగా ఒకసారి ఏదో విషయంలో ఆయనతో మాట్లాడాను. మర్నాడు ఉదయం కాలకృత్యాలు తీర్చుకుని రామకోటయ్యగారికి పరిచితుడైన పొరిగింటి ఆసామిని తోడు చేసుకుని గోపాలకృష్ణయ్య గారింటికి వెళ్లాం. మేము వెళ్లేసరికి ఆయన వీధి అరుగుమీద దంతదావనం చేసి అప్పుడే ఇంట్లోకి వెడుతున్నాడు. మేము వసారాలో బల్లమీద కూర్చున్నాం. ఆయన బట్టలువేసుకువచ్చి "యేం పని మీద వచ్చారని" అడిగాడు. ఇట్లా వీళ్లు ఛార్జీలు పెట్టుకున్న సంగతి చెప్పి "మేము రామకోటయ్యగారి తాలూకు వాళ్లం, మీరు పూనుకుని తగాదాలు లేకుండా రాజీ చెయ్యవలసిందని" కోరాను.

మునసబుగారు నేను చెప్పినదంతా విని "వీళ్లు ఛార్జీలు పెట్టుకున్న సంగతి నేను విన్నాను. మీరు రాజీ చెయ్యమనడం బాగానే వున్నది గాని, అవతల గోరంట్ల వాళ్లు పెడసరం మనుషులు. చెబితే వినే బాపతు కాదు! అయినా పిలిపించి చెప్పి చూస్తాను. ఇప్పుడు పని మీద వెళ్లుతున్నాను. సాయంత్రం పిలిపించి మాట్లాడుతాను. మీరు రేపు ఉదయం రావలసి"దని చెప్పాడు.

ఆ మర్నాడు ఉదయం మళ్ళీ మేమిద్దరం మునసబుగారింటికి వెళ్లాం. ఆయన మమ్మల్ని చూడ్డంతోనే "నేను ముందే చెప్పలేదటయ్యా, వినేరకం కాదనీ, రాజీ మాట యెత్తేసరికి వాళ్లు – మా పాలేరును చితగగొట్టి పైగా ఏమీ ఎరుగని మా అన్నదమ్ములు నలుగుర్నీ కలిపి ఛార్జీ పెట్టాడు. కానివ్వండి! యెంతవరకు పోద్దో చూద్దాం! అని దీర్ఘాలు తీశారు. తగాదాలు దేనికని ఎంతోదూరం చెప్పాను. వాళ్ళు వినలేదు" అని చెప్పాడు.

మేము చేసేది లేక తిరిగి వచ్చి జానకమ్మతో ఆ విషయం చెప్పాం. ఆమె చింతకు మేర లేదు. గ్రామంలో కూడా ఇద్దరు ముగ్గురు వాళ్లతో తగాదా పెట్టుకోవడం మంచిది కాదని నాకు చెప్పారు. వాళ్ళు మునసబు గారి మాట కూడా వినలేదు. ఇది యే విధంగా రాజీ అవుతుందా! అన్న ఆందోళనే పట్టుకుంది నాకు. ఆ సాయంత్రం ఒకళ్ళతో యీ విషయమే మాట్టాడి పై వీధి నుంచి వస్తున్నాను. దారిలో ఒక స్త్రీ కనబడి నన్ను పలకరించింది. ఆమెను నేను గుర్తు పట్టలేదు. నా ధ్యాసలో నే నున్నాను. ఆమె తన వెంట నున్న పిల్లతో "తాతయ్యకు నమస్కారం చెయ్యమ్మా!" అంటూ మర్చిపొయ్యావా చిన్నయ్యా?? మొన్న కాలవలో పడ్డ ఈ పిల్ల ప్రాణాలు కాపాడావు. నువ్వు వుండబట్టి మా బిడ్డ మాకు దక్కింది" అన్నది.

అప్పుడు నేను క్షేమంగా వున్నారా అమ్మా. అదే సంతోషం" అన్నాను.

ఆమె "మా ఇంటికి రా చిన్నయ్యా!" అంటూ నన్ను వెంటబెట్టుకుని వాళ్ళ యింటికి తీసుకెళ్ళింది. ఆశ్చర్యం. అది రామకోటయ్యగారి పైన చార్జీ పెట్టిన గోరంట్లవారి యిల్లు. ఇన్నాళ్ళ బట్టి ఆ గ్రామం కొట్టిన పిండిలా వస్తూ పోతూవుండడంలో ఏ యిల్లు ఎవరిదో నాకు తెలుసు. వాళ్ళది పెద్ద భవంతి. ఆమె లోనికి వెళ్ళి కుర్చీ వేసి యెంతో మర్యాద చేసింది. వాళ్ళ అన్నదమ్ముల్లో యెన్నోవాడో గాని ఆమె భర్త కామాలు! ఆమె ఆయనతో "మొన్న మన అమ్మాయి కాలవలో పడ్డప్పుడు తీసి కాపాడింది ఈయనగారే! దేవుడులా అడ్డుపడ్డాడు" అంటూ నన్నాయనకు పరిచయం చేసింది. అప్పటి నా సంతోషానికి మేరే లేదు. ఆడబోయిన తీర్థ మెదురైనట్లు వీళ్ళతో గలిగిన ఈ స్నేహానికి నాకు పెన్నిధి దొరికినట్లయింది. ఆయన గారు ఆప్యాయంగా నన్ను "స్వగ్రామం యేదండి? యీ వూళ్లో బంధువు లెవరైనావున్నారా?" అని అడిగాడు.

“మాది కాజ. ఈ వూళ్లో రామకోటయ్యగారు మా అల్లుడేనండి!” అని బదులు చెప్పాను.

“ఒహో అట్లాగ?” అని ఆయన మందహాసం చేశాడు. “ఏదో మీరు మీరు చార్జీలు పెట్టుకున్నారట! ఇప్పుడు మనం ఆప్తులమయ్యాం. ఇక మీకు మాకు తగాదా యేమిటండి?” అన్నాను.

ఆయన నవ్వి “మా అందర్నీ కలిపి చార్జీ పెట్టాడు కదండి మీ అల్లుడు!” అన్నాడు.

“అదే నేను చెప్పేది. ఇదివరకు జరిగిందేదో జరిగిపోయిందనుకోండి! ఈ స్నేహంలో ఇప్పుడు మనం ఒకళ్ల మీద ఒకళ్లు యెలా చర్య తీసుకోగలం? మీమీద మేమూ తీసుకోలేం, మా మీద మీరూ తీసుకోలేరు!” అన్నాను.

“చిన్నయ్యగారికీ మనకూ తగాదా ఏమిటండి లేకపోతే!” అన్నదా ఇల్లాలు భర్తతో.

రాజీ అయిపోయింది! ఆయన ఇంట్లో వున్న తమ్ముణ్ణి “వారికీ మనకూ యెందుకొచ్చిన తగాదాలురా మన ఛార్జీ యెత్తి వెయ్యండి!” అని చెప్పి నాతో “మీరు గూడా మీ అల్లుడితో తన ఛార్జీ యెత్తివెయ్యమని చెప్పండి!” అని చెప్పాడు.

అప్పటికి నా గుండె తేలికపడ్డది. ఆమె “ఆ పూట మా ఇంట్లో భోజనం చేస్తే గాని వీల్లే”దని పట్టుపట్టింది. ఆయన గారు కూడా రానివ్వలేదు. ఆ పూట అక్కడ తృప్తిగా భోజనం చేసి సంతోషంగా బైటపడ్డాను. ఇంటికి వచ్చి జానకమ్మతో “రాజీ చేసి వచ్చానమ్మా!” అని యీ కథంతా చెప్పేసరికి ఆమె ఆనందభరితురాలైంది. ఆ మర్నాడే యింటికి తిరిగి వచ్చి ఆగిపోయిన పనులు చూసుకున్నాను.

## 7

కొన్ని సంవత్సరాలు గడిచిపోయినవి. పెదపాలెం నాకు కొట్టిన పిండైంది. ఇన్నాళ్ళ బట్టి మేము అక్కడకు వెళ్లడం, వాళ్లు ఇక్కడకు రావడం యథా ప్రకారం జరుగుతూనే వున్నది. గానయితే మా ఇంట్లో ఒకళ్లకు ఒకళ్లకు సరిపడడం లేదు! అంతా ఉప్పత్తుల మారిసంసారం అయింది. ఆడవాళ్ళు యే కాస్త పని దగ్గరా ఉప్పత్తులు పడి తగువు లాడుకోవడం. పోనీ ఆడవాళ్ళు అయితే యెట్లయినా సరిపెట్టుకోవచ్చు. అది మగవాళ్ళకు గూడా వ్యాపించింది! వాళ్ళు గూడా వంతులు పడజొచ్చారు. ఒకళ్ళమాట ఒకళ్ళ మాటకు కలవడం లేదు. పోరు నష్టం పొందు లాభం అన్నారు. వాళ్ళకు మాట కలవక పోవడం వల్ల పనంతా కుంటై పోతున్నది. ఒక రోజున గుంటూరు సరుకులు తీసుకెళ్ళేటందుకు బాడుగ వచ్చింది. నేను ఎవర్ని వెళ్ళమన్నా, వాడెళతాడని వీడు, వీడెళతాడని వాడు వంతులు పడ ఆఖరుకు యెవరూ వెళ్ళలేదు. పొలం పనుల్లో గూడా యిట్లాగే వంతులు

పడిజొచ్చారు. నేను చేను కెళ్ళేటందుకు పెద్దవాడనైపొయ్యాను. ఇప్పుడు నాకు డెబ్భైయేళ్ళు దాటినై, వోపిక వుడిగిపోయింది. వెనకటిలాగా చాకిరీ చెయ్యలేను. ఇదంతా యెందుకని నేను ఎవరి సోలెడు వాళ్ళకు పోశా. మాది ఐదుగదుల యిల్లు. చెరి రెండేసి గదుల్లో పెద్దవాడూ, రెండోవాడూ, చివరి గదిలో ముసలివాళ్ళం మేమిద్దరం వుంటున్నాం. మూడోవాడు ఇంటిప్రక్క ఖాళీ స్థలములో వుమ్మడిమీదనే యిల్లేసుకుని వుంటున్నాడు. ఉన్న ఆస్తల్లా ఇల్లు మాత్రమే! ఉన్న యెకరం పొలం మూడో వాడి పెళ్ళికి అయిన అప్పుకూ, తర్వాత వాళ్ళు వుప్పత్తులు పడి సరిగా పనిచెయ్యపోవడం వల్ల అయిన బాకీకి సరిపోయింది. పొలం అమ్మి వాళ్ళకు సరిపెట్టివేశాం.

వాళ్ళు వేర్లు పడడంతోనే యెంతో శ్రద్ధగా ఒకళ్ళ కంటే ఒకళ్ళు పోటీలు పడి పనులు చేసుకోవడం మొదలు పెట్టారు. అదివరకు పాలికి చేస్తున్న పొలం పెద్దవాడూ, రెండోవాడూ చేరి తీసుకుని చేస్తున్నారు. ఆ పొలం గాకుండా యింకా చెరికాస్త పొలం గూడా కౌలుకి తీసుకుని చేసుకుంటున్నారు. మూడోవాడు వ్యవసాయం లేకుండా నంబూరు నూలు మిల్లులో అరవైరూపాయల జీతం మీద నౌకరుగా చేరాడు. వాళ్ళు అట్లా సంసారం నడుపుకోవడం సంతోషమే గాని, మా ముసలి వాళ్ళ సంగతి వాళ్ళకేం పట్టలేదు. అయ్యో! వీళ్లెట్లా జీవిస్తారా! అన్న ఆలోచన గూడా వాళ్ళకు కలగలేదు. బండీ యెడ్లూ పెద్దవాడు ఖండించుకున్నాడు. గేదెను మాత్రం మాకు వదిలారు. యెడ్లసిగమార్లు, మోకులు, నులకపేనడం మొదలైన చిన్నచిన్న పనులు చేసుకుని మే మిద్దరం కాలం వెళ్ళబుచ్చుతున్నాం.

ఆ రోజున జోరున వాన కురుస్తున్నది. బైటికి వెళ్ళేటందుకు వీల్లేకపోయింది. నా భార్య రెండోవాడి ఇంటికివెళ్ళి, కోడల్ని 'తవ్వెడు గింజలు బదులు ఇవ్వమన్నదట. 'అయ్యో! మా దగ్గర యెక్కడ వున్నై, మాకే యివాళ గింజల్లేవంటూ,' అవతలకి వెళ్ళి 'ప్రేమగల కొడుకుల దగ్గర తెచ్చుకోరాదు?" అన్నదట మెల్లిగా. ఆ మాటలు యీవిడకు వినిపించినవి. అంటే తమ మీద లేకుండా తతిమ్మా వాళ్ళమీద ప్రేమగా వుంటామని వాళ్ళ వుద్దేశం. ఈ ఉద్దేశం ఒకళ్ళకే గాదు ముగ్గురికీ అంతే. ఆఖరకు పెద్దవాడింట్లో గూడా ఆ రోజున గింజలు పుట్టలేదు. అడగటం దండగని మూడోవాణ్ణి అసలు అడగనే లేదు. ఇరుగు పొరుగు యిళ్ళలో యెక్కడో బదులడిగి తెచ్చుకుని ఆ రోజు గడుపుకున్నాం.

మర్నాడు తెరిపిచ్చింది. ఎవరో మోకు వేసిపెట్టమనగా వసారాలో కూర్చుని వేస్తున్నాను. జానకమ్మ రెండెడ్ల బండి కట్టుకుని వచ్చింది. అప్పటికి మేము యేర్లు పడి దాదాపు యిరవై రోజులైంది. ఆమె బండిదిగి లోనికి వచ్చి"యేర్లు పడ్డారట కదు బాబాయ్?" అని అడిగింది.

"అవునమ్మా! యెట్లా తెలిసింది నీకు!" అన్నా నేను.

“మొన్న యీ వూరునించి యెవరో వస్తే అడగ్గా యీ సంగతులన్నీ చెప్పాడు. మరి మీ ఇద్దరూ ఎవరి దగ్గర వుంటున్నారు బాబాయ్! అని అడిగింది.

“యెవరి దగ్గరా లేదు తల్లీ! మా అంతట మేమే వుంటున్నాం” అని చెప్పాను.

“ఈ పెద్దతనంలో మీ అంతట మీరేం వుండగలరు బాబాయ్? మా ఇంటికి వచ్చెయ్యండి!” అన్నది.

“ యెందుకులే తల్లీ! వంట్లో సత్తువ సాంతం వుడిగిపోలేదు. కొద్దో గొప్పో యింకా చాకిరీ చెయ్యగలను. యేమీ దిగుల్లేదు” అన్నాను.


“అయితే మాత్రం కూతురి యింట్లో వుండడం తప్పా బాబాయ్? నువ్వేమీ అనుకోవద్దు” రమ్మని యెంతో దూరం చెప్పింది.

నా కడుపున పుట్టిన కొడుకులు గూడా అంత మాత్రం మాట అనలేదు. “కాదులే తల్లీ! నువ్వు చూపిన ఆదరణకు సంతోషం!” అని చెప్పి ఆమెను పంపివేశాను. నేను కాదంటే మాత్రం జానికమ్మ వూరుకుందా! వాళ్ళకు పండిన ధాన్యమల్లా పంపుతూ, మా యోగక్షేమాలు విచారిస్తూనే వుంది. ఆమె నాకు నిజమైన బిడ్డ!



# చక్రపాణి

**(1908 - 1975)**



**అ**సలు పేరు ఆలూరు వెంకట సుబ్బారావు. కలం పేరు - చక్రపాణి. రచన అనువాదమైనా, మౌలికమైన సమస్థాయిలో నిర్వహించగల సమర్థులు. శరత్ సాహిత్యాన్ని తెలుగువారి కందించిన వంగభాషా కోవిదులు. అపహాస్య రచనల ద్వారా వ్యక్తుల లోటుపాట్లను విమర్శించుట వీరికి వెన్నతో పెట్టిన విద్య. శైలి వ్యంగ్య ప్రధానమైనది. సమాజంలోని అపసవ్యాలూ, మారుతూన్న కాలంతో పాటు మారే విలువలూ చక్రపాణిగారి కథా వస్తువులు. 'చందమామ', 'యువ' పత్రికలకు సంపాదకులు. ప్రఖ్యాత చలన-చిత్ర దర్శకులు, నిర్మాతలు.

# అహం బ్రహ్మాస్మి

**అ**ద్వైతాశ్రమంలో చోరీ!

అది చోరీ కాదు. ఆశ్రమవాసులకి అగ్నిపరీక్ష.

అందర్నీ కూర్చాడు అధ్యక్షుడు; సత్యం చెప్పమని నొక్కి అడిగాడు.

అంతా ఎరగమన్నారు.

హృదయాలు విప్పమన్నాడు – మళ్ళీ.

హృదయాలు విప్పడమే కాదు, పెట్టెలు కూడా తెరిచి చూపారు ఆశ్రమవాసులు.

పోయిన వస్తువులు దొరకలేదు.

"ఆశ్రమంలో వ్యక్తిగత ఆస్తి యేమీ వుండకూడదని ప్రతి సభ్యుడికీ తెలుసు. తెలిసి కూడా శేషగిరి ఆ నియమాన్ని ఉల్లంఘించాడు. అందుచేతనే భగవంతుడీ విధంగా అతన్ని శిక్షించాడు. భగవంతుడు సర్వ శక్తివంతుడు; మానవ మాత్రులకు అతని లీలలు అర్థం కావు" అన్నాడు అధ్యక్షుడు.

ఆశ్రమవాసులంతా శేషగిరినే దొంగను చూసినట్టుచూశారు.

సాయంత్రం అధ్యక్షుడు భగవంతు నిలా ప్రార్థించాడు :

"సర్వేశ్వరా! నీ లీల లతి విచిత్రములు. నీవే ఈ పనిని. శేషగిరికి జ్ఞానోపదేశమునకై చేసి వుంటావు. నీవే ఆ సొమ్ము మరల నాకు చేర్చు. శేషగిరి అజ్ఞాని. అతనికింకా ధన వ్యామోహం వదల లేదు. అతన్ని క్షమించు."

శేషగిరి తన అజ్ఞానాన్ని ఒప్పుకొని, క్షమించమని భగవంతుడ్ని ప్రార్థించాడు.

మర్నాడు అధ్యక్షుడు మామూలుగా ఉదయపు నడకకు వెళ్ళి వచ్చే సరికి ఆశ్రమంలో పోలీసులున్నారు. పోయిన వస్తువులు అధ్యక్షుడు పెట్టెలోనే దొరికినై. అధ్యక్షుడికి ఆశ్చర్యం కంటె ఆనందం ఎక్కువ కలిగింది.

"భగవంతుడు భక్తలోలుడు. నేను కోరిన విధంగా నా వస్తువులు నాకు వప్పగించాడు" అన్నాడు.

"స్వామి వారు చెప్పిందంతా జరిగింది. భగవంతుడి మాయ మా బోటి మూఢులకేం అర్థమౌతుంది" అన్నాడు శేషగిరి.

భగవంతుడి మాయ తెలుసుకొని పోలీసులు, శేషగిరి వస్తువులు శేషగిరికి వప్పగించి వెళ్లిపోయారు.

"ఈ ఘటన మీ బోటి అధ్యాత్మిక విద్యార్థుల కొక కఠిన ప్రశ్న. ఇప్పుడు భగవంతుడు యే రూపముతో రక్షకభటుల దగ్గరకి పోయి వుంటాడో మీరు చెప్పగలరా?" అన్నాడు. అధ్యక్షుడు

ఆశ్రమవాసునికి భగవంతుడి రూపం అంతు బట్టలేదు. అంతా శేషగిరి వంక చూశారు.

"అంత కంటె కఠినమైన ప్రశ్న యింకొకటి వుంది. భగవంతుడు యే రూపంతో దొంగతనంచేసి వుంటాడని మీ నమ్మకం?" అన్నాడు శేషగిరి.

ఆశ్రమ వాసులకి ఇదికూడా అంతు పట్టలేదు; అధ్యక్షుడి వంక చూశారు.

"కామరూపంతో భగవంతుడు ఒకరి శరీరాన్ని ఆశ్రయించక్కర్లేదు" అన్నాడు అధ్యక్షుడు.

"బహుశా అదే రూపంతో పోలీసులికి కూడా రిపోర్టు చేసి వుంటాడు" అన్నాడు శేషగిరి.

అధ్యక్షుడు నొచ్చుకున్నాడు.

"సర్వేశ్వరా! నీ లీల లతి విచిత్రములు! నేనెంత అజ్ఞానినో నువ్వు శేషగిరి రూపంతో రుజువు పర్చావు. శేషగిరి ఆధ్యాత్మిక విద్యలో నాకెంటె గొప్ప. అతను నా దగ్గర నేర్చుకునేది ఇంకేమీ లేదు" అని ప్రార్థించాడు అధ్యక్షుడు.


"సర్వేశ్వరా! నీ అవ్యాజ కృపవల్ల నేను వారం రోజులకే గురువుగార్ని మించి పోయాను. ఐనా నా జీవితమంతా వారినే గురువుగా ఎంచుకుంటాను. దయానిధీ! నీవు నాలోనే కాదు. గురువుగారిలో గూడా విరాజిల్లుతున్నావు" అని ప్రార్థించాడు శేషగిరి.

అదే శేషగిరి ఆఖరి ప్రార్థన.

ఆనాటి సాయంత్రమే ఆశ్రమం వదలిపెట్టాడు శేషగిరి – గురువుగారి శెలవూ, దీవనలూ పొంది.

# నార్ల వెంకటేశ్వరరావు

**(1908 - 1985)**



**క**వి, కథకుడు, నాటక కర్త, పత్రికా సంపాదకుడు. సాంప్రదాయ సంస్కారాలనూ, ప్రాచ్య పాశ్చాత్య విజ్ఞానాన్ని జీర్ణించుకున్న వ్యక్తి. విస్తారమైన తెలుగు పలుకుబడితో, సజీవమైన భాషతో వీరి రచనలు శ్రవణానంద కరంగా వుంటాయి. సాహితీ లోకంలో వీరి సంపాదకీయాలకు ప్రత్యేకమైన స్థానమున్నది. ఆంధ్రజ్యోతి సంపాదకునిగా పని చేశారు. రాజ్యసభ సభ్యులుగా ఉండేవారు.

రచనలు : పిచ్చా-పాటీ, మాటా-మంతీ (వ్యాసాలు) కొత్తగడ్డ (నాటికలు), కదంబం (కథలు)

# సభ్యత

"కుంటివాణ్ణి బాబయ్యా; కుంటివాణ్ణి"

నేను ఒక అడుగు అవతలికి వేశాను. కాని, వాడు నన్ను వదిలిపెట్టలేదు. చంక కింది కఱ్ఱల మీద ముందుకు గెంతి, మరింత దైన్యాన్ని సూచించే కంఠంతో "కుంటివాణ్ణి స్వామి; ఒక్క రాగిదమ్మిడీ ధర్మం చెయ్యండి" అని మళ్ళీ అర్థించాడు.

"పాడుబస్సు ఎంతకూ రాదేమి?" అనుకుంటూ మరి నాలుగడుగులు జరిగాను. సాయంత్రం ఆరు దాటితే చాలు. సెంట్రల్ దగ్గర మాంబళం బస్సు దొరకడం కష్టం. ఒక్కొక్క రోజున పక్కా అరగంట సేపు కనిపెట్టుకు వుండవలసి వస్తుంది. ఈ లోగా ఈ బిచ్చగాళ్ళ పీడ భరించడం కష్టం! కుంటివాళ్ళు, గుడ్డివాళ్ళు, కుష్ఠువాళ్ళు, ఈగలవలె ముసురుకొని ప్రాణాల్ని తోడివేస్తారు. కుష్ఠువాళ్ళదే మరీ ఘోరం! కుష్టు సగం సగం తినివేసిన చేతుల్ని ముఖంలో పెట్టి "ధర్మం స్వామీ?" అని అడుగుతారు. వాళ్ళను చూచినప్పుడు నాకు అదేమో గాని జాలి కలగదు; జుగుప్స పుడుతుంది.

ట్రిప్లికేన్, మైలాపూర్, అడయార్, అంజికరై, పురుశువాకం, సైదాపేట .... వరసగా అన్ని బస్సులూ వస్తున్నాయి, పోతున్నాయి. కాని, ఈ మాంబళంబస్సు....

"అయ్యా? గుడ్డివాణ్ణి...."

బండికింద పడి ప్రాణాలు పోక. మూలుగుతూ వున్న బక్క చిక్కిన గొంతులా వుంది వాడి గొంతు. చికాకుగా చప్పున పక్కకు జరిగాను. కాని, అక్కడ మాత్రం ఈ బిచ్చగాళ్ళు నిలవనిస్తేనా?

"పాలులేని బిడ్డ బాబయ్యా? ఒక్క కానీ...."

విసుగుతో ఒక మూలకు జరిగి, అక్కడ యిద్దరు నన్స్ వుంటే, వారి పక్కన నిలబడ్డాను. నే నక్కడికి పోవడమే తడవుగా ఒక కుష్ఠువాడు తయారయ్యాడు.

"లెపర్, మెడాం? లెపర్" అంటూ వాడు వాళ్ళవైపు మొండిచేతుల్ని చాచాడు.

మండుతూ వున్న పొయ్యిలో నుంచి ఇవతలికి తీసి ఆర్పిన కట్టెల మాదిరిగా వున్నాయి రసికారుతూ నల్లగా వున్న ఆ మొండి చేతులు.

పొమ్మని సంజ్ఞ చేశారు ఆ నన్స్. కాని వాడు "లెపర్, మెడాం?" అనే పల్లవి మానలేదు.

ఏసుక్రీస్తు కుష్ఠువాళ్ళని దగ్గరికి తీసి, ప్రేమ పూర్వకంగా వాళ్ళకు సేవ చేశాడని ప్రతీతి. ఒకనాడు ఆయన అలా చేశాడనే కాబోలు. ఆయన అనుచరులలో కొందరు ఈనాటికీ కుష్ఠువాళ్ళంటే ప్రత్యేకాభిమానాన్ని ప్రదర్శిస్తారు. ఆదివారాల నాడు రోమన్ కేథలిక్ చర్చి బయట చూడండి. ఎంత పెద్ద కుష్టుపటాలం కనపడుతుందో?

"లెపర్, మెడాం?" యెత్తు పారకపోయేసరికి, నా దగ్గిరికి జరిగి. "ఒరు దమ్మిడీ పోరుంగో అప్పా?" అనే కొత్త పల్లవి అందుకున్నాడు.

నేను వాణ్ణి కసురుకుంటూ, ఇంకా అంత దూరాన్నే వున్న మాంబళం బస్సు వైపు నడిచాను. నాకాళ్ళూ వేళ్లూ తొక్కుతూ కనీసం పదిమంది దానిపైకి ఎగబడ్డారు. కాని ఆశాభంగమైంది. ఆ బస్సు ఆగనైనా ఆగకుండా సాగిపోయింది. వెళ్ళిపోతూ వున్న బస్సులో నుంచి "ఎడమిల్లే" అంటూ కండక్టర్ తిప్పుతూ వున్న చెయ్యి మమ్మల్ని పరిహసిస్తూ వున్నట్టు తోచింది.

క్షణం క్షణం అధికమౌతున్న విసుగుదలతో జనరల్ హాస్పిటల్ గేటువైపుకు జరిగి అక్కడ బస్సు కోసం పొంచి నిలుచున్నాను. రైళ్ళు దిగి సెంట్రల్ నుంచి ప్రయాణీకులు జట్లు జట్లుగా వస్తున్నారు. పోతున్నారు. ఎలాగో బస్సులలో జొరబడి పదిమంది బస్సుస్టాండ్‌లో నుంచి కదిలితే. పదిహేనుమంది కొత్తగా వచ్చి చేరుతున్నారు. ఒక చేతిలో పెట్టె, ఒక చేతిలో పళ్ళబుట్ట, చంకలో పరుపుచుట్ట – ఇంత మోతతోనూ తక్కినవాళ్ళను తోసుకు ముందుగా మైలాపూర్ బస్సు యెక్కాలని ఆ మొదలియారుకు అంత పట్టుదల ఏమిటో? చేతిలో ఒక బిడ్డ, చంకలో ఒక బిడ్డ, వెంట ఒక అవ్వ– అరగంట నుంచి నిలుచున్నా, పాపం, ఆ భాగ్యశాలికి బస్సు దొరకడమేలేదు. "చాక్లెట్" "క్రీమ్ చాక్లెట్" "కాలణా" అని కొందరు అరుస్తున్నారు. పత్రికలమ్మే కుర్రవాళ్ళ కేకలతో చెవులు గింగురుమంటున్నాయి. పెద్ద పెద్ద గుడ్డల మూటల్ని ఒక పక్కగా పెట్టుకుకూర్చొని, సైదాపేట చాకలివాళ్ళు కునికిపాట్లు పడుతున్నారు. సోడియం వేపర్ లైట్‌లో ఆ ప్రదేశమంతా వింతగా, విలక్షణంగా కోలాహలంగా వుంది.

"మీరు వక్కాకు నమిలి వూసినంత? ఒక్క రాగిడబ్బు బాబయ్యా" అంటూ మొదటి కుంటివాడు మళ్ళా తయారయ్యాడు.

"ఛీ! పోరా!" అని నేను విదిలించాను.

"తెలుగు మా రాజులు మీరైనా ఒక ధర్మం చెయ్యకపోతే ఎలా బాబయ్యా?"

ఆ గొంతు ఎన్నడో, ఎక్కడో విన్నట్లుగా వుంది. ఎక్కడై వుంటుంది చెప్మా? ఏ బస్సు స్టాఫ్ దగ్గరనో ఇలాగే ఇదివరకు తగిలి వుంటాడా? పరికాయించి వాడి ముఖం వంక చూశాను. పరిచితమైనట్టిగా వుంది. వీణ్ణి ఎక్కడ చూచి వుంటాను? గుర్తు తెచ్చుకోవడానికి గట్టిగా ఆలోచించాను. కొంతసేపు మనస్సు, దట్టంగా మబ్బు పట్టిన ఆకాశంలా వుంది. ఇంతలో ఆ మబ్బుచాటు నుంచి మెరిసిన మెరుపుతీగలా..... ''ఆఁ!వీడు గోపాలస్వామినాయుడుగారి ఇంట్లో పనివాడు కాదూ?" అని స్ఫురించింది.

"ఏరా అబ్బీ! నీ పేరు రాముడు కాదూ?" అని వెంటనే వాణ్ణి అడిగాను.

"ఔను బాబయ్యా!" అంటూ వాడు తెల్లబోయాడు.

కాని, చెన్నపట్నంలో ప్రతి నౌకరుకూ రాముడనే పేరు తగిలిస్తారు. వాడి అసలు పేరు రంగయ్య కావచ్చు; గంగమ్మ కావచ్చు; వెంకయ్య కావచ్చు; తన పేరంటే వాడికి చెడ్డ మమత వుండవచ్చు. వేరే పేరు పెట్టి పిలిస్తే వాడి మనస్సు చివుక్కు మనవచ్చు. అయినా,రాముడనే వ్యవహరిస్తారు. చూడగా ఇక్కడ 'రాముడు' అనే కుల మొకటి ఏర్పడుతున్నట్లుగా వుంది.

వాడి జవాబుతో సందేహం పూర్తిగా నివర్తికాక "నీవు గోపాలస్వామి నాయుడుగారి ఇంట్లో పనిచేస్తూ వుండేవాడివి కాదురా?" అని ప్రశ్నించాను.

"నిజమే, బాబయ్యా?" అంటూ వాడు కూడా నన్ను చప్పున పోల్చుకున్నాడు.

గోపాలస్వామి నాయుడుగారూ, మేము రెండు మూడేళ్ళనాడు ఒకే ఇంటిలో అద్దెకు వుండేవాళ్ళం. ఆరు నెలలపాటు కలిసివున్న తర్వాత ఇల్లు చాలడం లేదని మేము వేరే చోటికి మారిపోయాం. ఆ నాయుడుగారు ఏమైనారో, ఎక్కడున్నారో తర్వాత నాకు తెలియనే తెలియదు. రైలు బండిలో ప్రయాణం చేస్తూ, ఆ కాసేపూ ఒకరి నొకరు పలకరించుకుంటూ యోగక్షేమాల్ని విచారించుకుంటూ, ఆత్మ బంధువులా అన్నట్టుగా వుండి, తమ గమ్యస్థానం రాగానే, ఎవరికి వారు దిగిపోయి, ఒకరి కొకరు పూర్తిగా పరాయివారు ఎలా అయిపోతారో అలాగే వుంటుంది. పెద్ద పెద్ద బస్తీలలో ఒక యింటిలో అద్దెకు వుండేవారి పద్ధతి కూడా; మా సంగతే చూడండి. ఆరు నెలలపాటు మేము ఆత్మీయులంగా వున్నాం. ఆ తర్వాత మే మెవరిమో, గోపాల స్వామి నాయుడుగా రెవరో?

"పాపం! నీకు ఈ దురదృష్టమేమిరా?" అని రాముడికి నా సానుభూతి తెలియ పరచాను.

"దురదృష్టం కాదు బాబయ్యా, అదృష్టం" అంటూ వాడు తడుముకోకుండా అన్నాడు.

"కుంటివాడై పోవడం అదృష్టమంటరా" అని నేను ఆశ్చర్యాన్ని ప్రకటించాను.

"నిజం, స్వామీ! గొప్ప అదృష్టం. అసలు ఈ కష్టాలమారి బ్రతుకులో నాకు పట్టిన అదృష్టం ఇదొక్కటే!"అంటూ వాడు చిరునవ్వు నవ్వాడు. ఆ చిరునవ్వులో లీలా మాత్రంగా దైన్యచ్ఛాయలు కూడా కనపడక పోలేదు.

వాడి వైఖరికి నేను విస్తుపోయాను. కాలుపోవడం, కుంటివాడు కావడం – ఇది గొప్ప అదృష్టమట! రాముడి కథ పూర్తిగా తెలుసుకోవాలనే పట్టుదల కలిగింది.

రాముడు తన కథని ఇలా చెప్పాడు!

"మీరు ట్రిప్లికేన్నుంచి మాంబళం మారిపోయిన తర్వాత రెండు మూడు నెలలకు ఒకరోజు సాయంత్రం కృష్ణమూర్తిని నేను బీచ్‌కి తీసుకు వెళ్ళాను. కృష్ణమూర్తి అంటే మీకు తెలుసుగా? నాయుడుగారి చిన్నబ్బాయి. అది ఆదివారం. బీచ్ జనంతో కిటకిటలాడుతూ వుంది. అంత జనాన్ని చూచి, అబ్బాయి ఎంతో సంబరపడ్డాడు. అవ్వాళ మేము చాలా సేపు బీచ్‌లో ఆడుకున్నాము. నేను ముందు పరిగెడుతూ వుంటే, అబ్బాయి నా వెంట పరుగెత్తాడు. నేను బోర్లపడుకుంటే, నా మీదగా గెంతాడు. "ఛల్ ఛల్ గుర్రం!" అంటూ నామీద స్వారీచేశాడు. మేము నీళ్ళ వొడ్డుకు వెళ్ళి పిచ్చుక గూడు కట్టాము. ఒక పెద్ద అలవచ్చి, దాన్ని ముంచివేసింది. అప్పుడు సంతోషం పట్టలేక, అబ్బాయి చప్పట్లు కొడుతూ గంతులు వేశాడు. "పొద్దుపోతున్నది. ఇక ఇంటికిపోదా" మంటే వినక మారాం చేశాడు. సరేనని బీచ్‌లోనే మరి ఒక గంటసేపు ఆడుకొన్నాము. చొక్కా జేబును శంఖాలతో నింపుకుని, ఎనిమిది గంటలకుగాని అబ్బాయి ఇంటికి కదల్లేదు.

ఆ మాటలు చెబుతుంటే రాముడి ముఖం ఆనందంతో వెలిగింది. ఆనాడు వాడు కృష్ణమూర్తితో బాటు అయిదేళ్ళబ్బాయి అయిపోయి, బీచ్‌లో ఆడుకుని వుండాలి. అసలు రాముడిదైనా ఏపాటి వయస్సు? మైనారిటీ వెళ్ళిందో, లేదో? రెండు మూడేళ్ళ నాడు వాడు మరింత లేతవాడు.

"మౌంట్ రోడ్, రాయపురం, మైలాపూర్, అడయార్" అనే కండక్టర్ కేకల మధ్య ఒక బస్సు వచ్చింది. ఒక్క మెట్టున పదిమంది దానిపైకి ఎగబడ్డారు. ఆ తొక్కిసలాటలో మొదలియారే దిగబడిపోయాడు. ఇక, ఆ పిల్లలతల్లి సంగతి వేరే చెప్పాలా?

"మర్నాడు నేను మామూలుగా ఇంటి పనుల్ని చేసుకుంటూ వుంటే, నాయుడు గారు కేకేశారు" అంటూ రాముడు తనకథ తిరిగి సాగించాడు.

"వస్తున్నా బాబయ్యా?" అంటూ నేను చట్టున వెళ్ళాను. "అబ్బాయి వుంగరమేదిరా?" అని నన్ను గూర్చి చూస్తూ, ఆయనడిగాడు. "ఏమో బాబూ? నాకు తెలియద"న్నాను. "తెలియక ఏమైపోతుందిరా?" అని ఆయన రొక్కించాడు. "నిన్న సాయంత్రం బీచ్‌లో జారిపోయిందేమో? అని నేను బిక్కముఖముతో అన్నాను. అలా ఎలా జారిపోతుందిరా? అది అబ్బాయి వేలుకు చాలా బెట్టుగా వుంటేనూ?" అని పార్వతమ్మగారు అందుకున్నారు.

నాయుడుగారిని తండ్రిగానూ, పార్వతమ్మగారిని తల్లిగానూ నేను చూసుకుంటూ వుండేవాణ్ణి. వాళ్ళే నా మీద అనుమానపడేసరికి నాకు పట్టలేని దుఃఖం వచ్చింది. "కల్లి బొల్లి యేడ్పుల కేమిలేరా? నిజం చెప్పు?" అని నాయుడుగారు నిగ్గదీశారు. కృష్ణమూర్తి నా చేతులలో పెరిగాడు. ఎంత పరమదుర్మార్గుడైనా, తన చేతులతో పెంచిన బిడ్డ సొత్తునే అపహరిస్తాడా బాబూ? అసలు దొంగతనమనేది మా ఇంటా వంటా లేదు."

రాముడికళ్ళను గిర్రున నీళ్ళు తిరిగాయి. పొటకరిస్తున్న పడుచుదనం మిసిమితో నిగనిగలాడుతూ వున్న వాడి చెక్కిళ్ళ వెంట రెండు ధారలు కిందికి జారాయి. ఆ క్షణంలోనే తనమీద అపవాదు వచ్చి పడ్డట్టు వాడు విలపించాడు. "వీడు ఎంతటి అభిమానవంతుడు? వీడిది ఎంతటి సున్నితమైన మనస్సు" అని నేను విస్తుపోయాను.

"నాయుడుగారూ, పార్వతమ్మగారూ నిగ్గదీసిన కొద్దీ, నేను అయోమయంలో పడిపోయాను. ఒక మాట చెప్పబోతే నోటి వెంట ఇంకోమాట వచ్చింది" అని కన్నీళ్ళను తుడుచుకుంటూ రాముడు మళ్ళీ తన కథ అందుకున్నాడు. "వారు మరికాసేపు రెట్టించినట్టయితే. పూర్తిగా తడబడిపోయి. దొంగతనం చేసిన మాట నిజమేనని ఒప్పుకొనేవాణ్ణే! 'ముందు ఏమో అనుకున్నాను గాని, వీడి వాలకం చూచిన తర్వాత మరి సందేహం లేదు. వీడే ఉంగరాన్ని కాజేశాడు.' అని నాయుడుగారు తేల్చి వేశారు. పార్వతమ్మగారు ఆయన మాటలకు తాళం వేశారు. పోలీసువాళ్ళని పిలిపించి, నన్ను అప్పగించాలని వారుభయులూ ఆలోచించారు కూడా! మొదటినుంచీ బిక్కమొహం వేసుకొని ఈ సంగతంతా చూస్తున్న కృష్ణమూర్తి పోలీసువాళ్ళ ఊసు వచ్చేసరికి ఆవురుమన్నాడు. పరుగెత్తుకువచ్చి, నా కాళ్ళను చుట్టవేసి వెక్కి వెక్కి యేడ్చాడు."

ఈ ఘట్టంలో రాముడి ముఖంలో కనబడిన భావాన్ని నేనెన్నటికీ మరిచిపోలేను. కృష్ణమూర్తి తన కాళ్ళను చుట్టవేసి, వెక్కి వెక్కి ఏడ్చిన దృశ్యం తలపుకు రాగానే వాడి ముఖంలో ప్రేమ, కృతజ్ఞత తాండవమాడింది. దానితో పాటు నాయుడు దంపతుల కాఠిన్యం, కృతఘ్నుత జ్ఞప్తికి వచ్చి నిష్ఠురచ్ఛాయలు కమ్ముకున్నాయి. ఈ పరస్పర విరుద్ధ భావాలకు అప్పుడు వాడి వదనరంగంలో జరిగిన తీవ్ర సంఘర్షణ ఇప్పటికి గూడా నా కళ్ళకు కట్టినట్టు కనబడుతున్నది.

"చివరికి నన్ను తరిమి వెయ్యడానికి నిశ్చయించారు. వెళ్ళలేక వెళ్ళలేక నేను వెళ్ళిపోతూ వుంటే, అబ్బాయి ఏడుస్తూ నా వెంట బడ్డాడు." అని రాముడు నిట్టూర్చాడు. "పార్వతమ్మగారు అబ్బాయిని రెండు కొట్టి, గిలగిల తన్నుకుంటూ వున్న వాణ్ణి ఇంట్లోకి లాక్కువెళ్ళారు. ఎక్కడికి వెళ్ళడానికీ తోచక, తిండి తిప్పలు కూడా లేకుండా, రెండు రోజుల పాటు నాయుడుగారి ఇంటి చుట్టూ ప్రదక్షిణం చేశాను. లోపలికి వెళ్ళి "నేను ఏ పాపమూ ఎరుగ"నని నాయుడుగారి కాళ్ళు పట్టుకుందామా అనిపించింది. కాని, లాభం వుండదనే

భయం వల్ల లోపలికి అడుగు పెట్టలేదు. రెండో రోజున నేను ఇంటిముందు నుంచి పోతూ వుంటే, లోపలున్న కృష్ణమూర్తి చూచాడు. "రాముడూ?" అంటో నా దగ్గరికి లేడిలా పరుగెత్తుకు వచ్చాడు. అబ్బాయి వెంటే పార్వతమ్మగారు వచ్చి, "ఇంకా ఇక్కడే తచ్చిట్లాడుతున్నావు దేనికిరా, వెధవా?' అనినన్ను తిట్టి అబ్బాయిని నా చేతుల్లోంచి లాక్కుంది. అబ్బాయి ఏడ్పు విని నాయుడుగారు కూడా బయటకు వచ్చి, "మా యింటిఛాయల మరి కనబడ్డావంటే, కాళ్ళు విరగ్గొడతాను సుమా?" అని బెదిరించారు. అయిదేళ్ళ పాటు ఎద్దులా చాకిరీ చేశాను. చివరికి నాకు జరిగిన మర్యాద ఇదే బాబూ?"

హృదయం భారం వల్ల కాబోలు కొంత సేపటి వరకూ రాముడు మరి మాట్లాడలేదు.

"నాయుడుగారికి ఇక నాపై దయ కలగడం కల్ల అనుకొని మూడోరోజున వేరే పని వెతుక్కున్నాను" అని గుక్క తిప్పుకున్న వాడిలా రాముడు తిరిగి అందుకున్నాడు. "ట్రిప్లికేన్‌లోనే సత్యనాధన్‌గారికీ ఒక పని వాడు కావాలని తెలిసి, ఆయన దగ్గరికి వెళ్ళాను. రెండుపూటలా అన్నం పెట్టి ఐదు రూపాయలు యిస్తామనీ, ఇంటి పనులు చెయ్యాలనీ, వారి రిక్షా లాగాలనీ ఆయన చెప్పాడు. సరేనని పనిలో ప్రవేశించాను. ఆయన దగ్గర నేను పని చేసింది ఒక్క ఏడాది మాత్రమే. ఈ ఏడాదిలో నా రక్తమాంసాల్ని పిండి వేశారంటే నమ్మండి. చీకటితో లేచి తొమ్మిదిన్నర వరకూ ఇంట్లో గొడ్డు చాకిరీ చెయ్యాలి. పది గంటలకు వాళ్ళ ఇద్దరు అమ్మాయిల్ని రిక్షాలో ఎక్కించుకొని బడి దగ్గర దించి రావాలి. పదకొండు గంటలకు స్వామినాథం గారిని హైకోర్టుకు తీసుకు వెళ్ళాలి. హైకోర్టు వరకూ వెళ్ళి వచ్చిన అలుపు తీరనైనా తీరకముందే మళ్ళీ బడిదగ్గిరికి పోయి అమ్మాయిల్ని తీసుకు రావాలి. టిఫిన్ కాగానే మళ్ళీ వాళ్ళను బడి దగ్గర దిగబెట్టాలి. తర్వాత సాయంత్రం నాలుగు గంటల వరకూ ఇంటి చాకిరీ, అప్పుడు హైకోర్టుకు వెళ్ళి అయ్యర్ గారిని తోడుకు రావాలి. అయిదు గంటలకు మళ్ళీ బడి దగ్గర హాజరు. ఆ తరువాత అమ్మగారిని , పిల్లల్నీ బీచ్‌లో తిప్పాలి. నా ఖర్మంకాలి, వాళ్ళు రెండో ఆట సినిమాకు వెళ్ళితే, రాత్రి పన్నెండుగంటల దాకా బండి మోత తప్పదు. నాయుడుగారి దగ్గర పనిచేసిన నాలుగైదు సంవత్సరాలూ నాకు రవ్వంతైనా కష్టమనిపించలేదు. నా పని నేను చేసుకుంటున్నట్టు గానే వుండేది. స్వామినాథంగారి దగ్గర నా బ్రతుకు జట్కాగుర్రం కంటె కనాకష్టమైపోయింది. పైగా, యెంత రెక్కలు విరుచుకున్నా మెప్పు వుండేది కాదు. "సోంబేరి" అని అయ్యర్‌గారు నాకు కితాబులు ఇస్తూ వుండేవారు. "కోతి ముండవాడు" అని అయ్యర్‌గారి భార్య నాకు పేరు పెట్టింది. "నేను కోతిలా వున్నానండీ?" అని రాముడు నిష్ఠూరపూర్వకంగా నవ్వాడు.

వెడల్పు నుదురు, తీర్చిదిద్దినట్టు వున్న ముక్కు, చిన్న నోరు, చక్కని పలు వరుస బలమైన కింది దవడ, ఇలాంటి వాడినా ఆ అయ్యర్‌గారి భార్య కోతివాడనడం?

"కోతిముండావాడని అంటూ వుంటే నాకు మొదట్లో కష్టమనిపించేది. క్రమేపీ ఆ

తిట్టుకు కూడా అలవాటు పడ్డాను. అయ్యర్‌గారిని అనవలసిన మాటను ఆయన్ని అనలేక, నా మీద పెట్టి అంటున్నారేమో నని సరిపెట్టుకున్నా" అని రాముడు ఈసారి పరిహాసంగా నవ్వాడు. వాడి ఎత్తుపొడుపుకు నేనూ నవ్వు ఆపుకోలేకపోయాను.

"ఏడెనిమిది నెలలయ్యేసరికి నా గుండెల్లో నొప్పి పుట్టసాగింది. అదే పోతుందిలే అన్నట్టుగా కొంతకాలం తోసుకు తిరిగాను. చివరికి ఒకనాడు గుండెనొప్పి మరీ యెక్కువైంది. మూలుగుతూ, ముక్కుతూ, ఎలాగో అయ్యర్‌గారి అమ్మాయిల్ని బడిదగ్గర దింపి వచ్చాను. ఇంటికి వచ్చేసరికి చెడ్డ చలి వచ్చింది. రిక్షా వాకిట్లో వదిలేసి, వరండాలో ఒకమూల పైపంచ పరుచుకు పడుకున్నాను. నా గొడ్డు మూలుగు విని, నా గతి కనుక్కున్న వాళ్ళు లేరు సరికదా కోర్టు వేళయ్యే సరికి అయ్యర్‌గారు పెద్ద దెయ్యంలా రిక్షాలో వెళ్ళి కూర్చుని నన్ను కేకవేశాడు. తూలుతూ నేను లేచి వెళ్ళి గుండె నొప్పి ఎక్కువగా వుందనీ, బండి లాగలేనని చెప్పుకున్నాను. "సోంబేరీ" అంటూ స్వామినాథంగారు నా మీద మండిపడ్డారు. నేను దొంగవేషం వేస్తున్నా నన్నాడు. "లేదు,సామీ!" అని ఎంత చెప్పుకున్నావినలేదు.

బండిని ఎలా లాగుతున్నానో కూడా తెలియకుండా, కొంత దూరం పళ్ళ బిగువున వెళ్ళాను. ఇంతలో వెనక నుంచి ఒక కారొచ్చింది. ముందు నుంచి ఒక బస్సు వచ్చింది. సరిగా అక్కడే రోడ్డుకు అడ్డంగా రెండు ఇసకబళ్ళు కూడా తగిలాయి. అప్పటికి నాకు అలుపు మరీ ఎక్కువైపోయింది. గుండె పగిలిపోతుందా అన్నట్టుగా వుంది; కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి; కాళ్ళు తడబడుతున్నాయి. ముందునుంచి వస్తున్న బస్సును తప్పుకోబోయి, వెనకగా వస్తున్న కారు కింద పడిపోయాను... కళ్ళు తెరిచేసరికి ఈ ఆసుపత్రిలోనే మంచంమీద వున్నా" అంటూ రాముడు జనరల్ హాస్పిటల్ వైపుకు వేలెత్తి చూపించాడు.

స్టాపింగ్ ప్లేస్‌ను చేరకముందే బస్సు అందుకోవాలని కాబోలు, మొదలియార్ మేమున్న చోటికి వచ్చాడు.

"ఆపరేషన్ తప్పదని డాక్టరుగారు నా కాలు తీసేశాడు" అని రాముడు గద్గదికంగా తిరిగి తన కష్టకథను ప్రారంభించాడు. ఆ నా డంతా స్వామీనాథంగారు నా గతి కనుక్కోలేదు. మర్నాడు సాయంత్రం కోర్టు నుంచి ఇంటికిపోతూ ఒకసారి వచ్చి, ఆ నెలకు నా జీతం ఐదు రూపాయల్ని నా మొఖాన పారేసి వెళ్ళాడు. తర్వాత తొంగైనా చూడలేదు. చెమటోడ్చి రక్తమాంసాలు పిండి, ఏడాదిపాటు గొడ్డు చాకిరీ చేసిపెట్టాడనే ఆలోచనైనా లేకపోయింది ఆ పెద్దమనిషికి?"

ఈ సంగతి చెబుతూ వుంటే లోతుగా, చిన్నవిగా వున్న రాముడి కళ్ళు నల్లని వాడిన ముఖంలో నుంచి రెండు చింత నిప్పులు మాదిరిగా జిగేలుమన్నాయి.

"గుండె నొప్పివల్ల అదివరకే సగం చచ్చివున్నానేమో రెండు నెలలకు గాని నేను ఆసుపత్రిలో నుంచి బయట పడలేదు. ఆ రెండు నెలలూ నాకు కంటిమీద కునుకుంటే

ఒట్టు. కాళ్లూ చేతులు తిన్నంగా వుండగానే అంతంత మాత్రంగా వున్న నా బ్రతుకు ఇకముందు ఎలా వెళ్ళదీయడమా అని రాత్రింబగళ్ళూ కుమిలి కుమిలి ఏడ్చాను. కాలు పోవడం వల్ల ఇంత సుఖపడతానని తెలిసివుంటే ఆ రెండు నెలలూ అంత బాధపడేవాణ్ణి కాదు."

"ఏమి సుఖంరా?" అని నేను ఆశ్చర్యంగా అడిగాను.

"సుఖం కాదటండీ? నే నెంత చాకిరీ చేసి పెట్టినా, ఎవ్వరికీ మెప్పులేక పోయింది. కడుపునిండా కూడైనా దొరికేది కాదు. చల్దన్నం మూడు ముక్కలు తాము తినగా మిగిలిన ఎంగిలీ నా ముఖాన కొట్టేవారు. నెలకు ఐదు రూపాయల జీతమని పేరు. అది నా గుడ్డా గుడుసుకూ సరిగా సరిపోయేది కాదు. పై పెచ్చు కాస్త ఆలస్యంగా లేస్తే తిట్లు, కాస్త పెందరాడే పడుకుంటే తిట్లు. నిలుచుంటే తిట్లూ, కూర్చుంటే తిట్లు. బండ చాకిరీ వల్ల మూలపడినా తిట్లే. ఇప్పుడు నన్ను అడిగేవారూ పెట్టేవారూ లేరు. నాకు నేనే యజమాన్ని. ఇప్పుడు నేను కనీసం రూపాయడబ్బుల్ని కళ్ళ జూడని రోజు లేదు. కాలు పోకపోతే, ఇంత అదృష్టం పట్టేదంటారా?"

''నిజమే'' అని నాలో నేను రాముడితో ఏకీభవించక తప్పలేదు. కాని, మానాభిమానాన్ని చంపుకుని, సభ్యతను మరిచి, పొట్టకూటికై బిచ్చమెత్తడం.....

మైలాపూర్ బస్సు మరొకటి వచ్చింది. చేతిలో ఒక బిడ్డను – చంకలో ఒక బిడ్డను, వెంట అవ్వను పెట్టుకుని, నిలబడి వున్న భాగ్యశాలి దగ్గరనే ఈసారి బస్సు ఆగింది. ఆమె ఫుట్‌బోర్డు పైకెక్కి, అవ్వ యెక్కిస్తున్న ఎడబిడ్డను అందుకోబోతున్నది. ఇంతలో పులివలె మొదలియార్ ఫుట్‌బోర్డు పైకి లంఘించాడు. అవ్వ అందుకోబోతున్న బిడ్డకు అతడి చేతిలోని పెట్టిగోడు ఠపీమని తగిలి బొటబొట నెత్తురు కారింది.

''కాని మానాభిమానాన్ని చంపుకుని సభ్యతను మరచి, పొట్ట కూటికై బిచ్చ మెత్తుకోవడం..." అనే నా తలపు పూర్తి కానేలేదు. పూర్తి కావలసిన అగత్యం మరి లేకపోయింది కూడా!



# కొమ్మూరి పద్మావతీదేవి

**(1908 - 1970)**

**క**థా రచయిత్రి, నటి. పండితులనూ పామరులనూ మెప్పించగల ఆంధ్ర సాహితీ సరస్వతి. నిఖార్సైన తెలుగు వాతావరణంతో, తెలుగు స్త్రీల నిర్మల జీవనాన్నీ, మానసిక ఔన్నత్యాన్నీ, సాంఘిక గౌరవ హోదాలనూ, సమాజం పట్ల గల బాధ్యతా స్వీకరణనూ ప్రతిబింబిస్తూ - చక్కగా, ఏ గజీ బిజీ లేకుండా, నేరుగా హృదయంలో ప్రవేశించే రీతిగా ఎన్నో కథలు వ్రాశారు. మద్రాసులో నివసించే వారు.

**రచనలు :** పొగడదండ, బంగారు బొమ్మ (కథల సంపుటాలు)

# రంగ

"అమ్మా స్కూళ్లో అందరూ నాన్న ఏడీ, నీకు నాన్న లేడా అంటున్నారమ్మా. ఎన్నో అడుగుతున్నారే."

"నిన్నేనమ్మా, పలకవేమే అందరికీ నాన్న ఉన్నాడు. నాకేనా లేంది" అంటూ పన్నెండేళ్ళ రంగ పసిపిల్లలా తల్లితో చెప్పుకుంటూ రాగాలు తీసింది.

సావిత్రమ్మ కూతురు అడిగిన దానికి ఏమీ చెప్పలేక తల్లడిల్లిపోతూ గుండె రాయి చేసుకుని అలా కూలపడిపోయింది.

కూతుర్ని ముస్తాబుచేసి ఎలా పంపిందో బడికి. తల్లో ఆలోచనలు తుఫానులా గిర్రున తిరిగిపోతున్నాయి. ఎంత డబ్బు ఉంటేనేం? సంఘంలో తనకీ కూతురుకీ మర్యాద లేకపోయాక. నిస్సారమైన తన బతుకూ, గడిచిన రోజులూ, ఆమె కంటికి ఒక్కసారిగా కనిపించసాగాయి.

మంచి ఉద్యోగంలో ఉన్న అతనికి కట్నం పోసి పెళ్ళి చేశారు. రంగ పుట్టిన ఏడాదికే అతను తన్ని ఒంటిదాన్ని చేసి వెళ్ళిపోయాడు. నా అనే వాళ్ళంతా ఒక్కొక్కరే తనకి దూరం అయిపోయారు. తన భర్త స్నేహితుడైన విశ్వాన్ని నమ్ముకుని సర్వం విడిచి రంగతో తనిలా వచ్చేసింది. ఎందుకని ఈ పని చేసిందో తనకే తెలియదు. అతని పదవీ, అధికారం, అతను చూపిన ప్రేమా అదంతా తన్ని పరవశురాలిని చేశాయి. జీవితం ముందు ఏం కాబోతుందో అన్న ఆలోచనన్నా లేకుండా విశ్వాన్నే నమ్ముకుని, అన్నిటికీ అందరికీ దూరమయి వచ్చేసింది. ఆరేళ్లు ఎంత సుఖపడింది. కాలు కింద పెడితే అరిగిపోతుందనేవాడు విశ్వం. ఎంత బాగా చూశాడు. ఎన్ని నగలు, ఎన్ని చీరెలు. స్వర్గ సుఖం అనుభవించింది. రంగని కూడా ఎంతో బాగా చూసేవాడు. ఒక్క నిమిషం తన్ని విడిచి వుండేవాడు కాదు. అలాటిది ఎవరికన్ను పడిందో తన సుఖం అంతా మట్టిపాలయి అంత అంతస్తు నుంచీ నేలకూలింది.

ఎవరు ఏమి చెప్పారో తనమీద, ఇంటికి రావడం మానేశాడు. మెల్లిగా తనకు దూరం అయిపోయాడు. విశ్వాన్ని కలుసుకోవాలని ఎంతో ప్రయత్నించింది. కారణం అడిగి తెలుసుకోవాలని అనుకుంది. లాభం లేకపోయింది. భార్యతో ఉంటూన్న విశ్వాన్ని చూడాలని ఆ ఇంటికే సిగ్గు విడిచి వెళ్ళింది. చూడ్డానికి వీల్లేదని విశ్వం, భార్యచేతే చెప్పించి కారులో ఎక్కి వెళ్ళిపోయాడు. సుడిగుండంలో పడినట్లయింది. తన ఏడుపు వినేవాళ్ళెవరు? ఎవరి దగ్గర చెప్పుకోగలదు? ఇల్లు మాత్రం తనది అయింది. ఓపిక మీద నగలన్నీ అమ్మి రంగకోసం జీవితాన్ని ఈడ్చుకుంటూ మోడులా బతుకుతూంది. ఈ వూళ్ళో అందరికీ తన బతుకు బాగా తెలుసు. విశ్వం భార్య అనే అంతా అనుకునేవాళ్ళు. విశ్వం భార్యగా అధికారాలు అన్నీ తను చలాయించింది. విశ్వం విడిచిపెట్టాడని తెలుసు అందరికీ. అందుకే ఈనాడు రంగని అడుగుతున్నారు. ఏమని చెప్పగలదు? ఊహ తెలిసిన రంగ ఏం చేస్తుందో ఇదంతా వినీ.

సాయంత్రం బడినించి వస్తూనే రంగ మళ్ళీ తల్లిని ప్రశ్నల వర్షం కురిపించేసింది.

"అమ్మా! మరే నాన్న సంగతులన్నీ సత్యవతే చెప్పేసిందమ్మా."

"ఎవరే, ఆ సత్యవతి?"

"నాతో చదువుతూంది. నాకంటె పెద్దది కూడా. కారులో వస్తుందమ్మా! ఎన్ని నగలని. ఎంతో గొప్పవాళ్ళమ్మా. రోజుకో నెక్లెస్ వేసుకుంటుంది."

"అది ఏం వేసుకుంటే మనకేం? దాంతో అసలు మాట్లాడకూ."

"నాన్న పేరు సత్యవతి చెప్పిందమ్మా! అన్నీ చెప్పేసింది. నే వెళ్ళి నాన్నని పిలుచుకుని రానా అమ్మా?"

"నోరు మూసుకోవే! అబ్బ?"

"నువ్వు చెప్పకపోయినా సత్యవతి చెప్పింది. ఎందుకమ్మా నిన్ను వదిలేశాడు నాన్న".

ఇలా అడుగుతున్న రంగని తల్లి కసిరింది.

సావిత్రమ్మ మనస్సంతా ఎలాగో అయిపోయింది. తలనొప్పి తాచు లాగా తలను చుట్టివేసింది. తల్లిని చూసి రంగ భయపడింది.

రంగ చాలా అందమైన పిల్ల. ఎంత మంచి రంగు. చిదిపి దీపం పెట్టవచ్చు అంటారు కూడాను. కాటుక పెట్టినట్టున్న ఆ కళ్ళు దిద్దినట్టున్న ఆ కనుబొమ్మలు, బుగ్గన సొట్టలు, రంగ రంగుకి మరింత అందాన్ని యిచ్చాయి. ఒక్కసారి చూస్తే కళ్ళు తిప్పుకోలేనంత అందం కలది రంగ. బట్టలు దగ్గర తల్లితో ఎన్నో పేచీలు పెడుతుంది. చాలా కావాలని అడుగుతుంది. ఏవేవో కోరికలు, ఆశలూ, వయసుతో పాటు పెరుగుతూ వస్తున్నాయి. చిలిపిగా గెంతుతూ అమాయకంగా తిరిగే రంగని చూచి ఆ తల్లి ఎంతో కుమిలిపోతూ

వుంటుంది. రంగ తనలా కాకుండా గొప్పఇంటి కోడలు కావాలనీ – రంగ కోరికలన్నీ తీర్చగల అల్లుడు రావాలనీ ఆశ. తీరని కోరికలు గుండెలో రగులుతూ ఉంటే కూతురి జీవితానికి గాలిమేడలు కథ కలలు కంటూంది సావిత్రమ్మ. ప్రక్క ఇంట్లోనే ఉంటున్న శాస్త్రిగారికి ఒక్కడే కొడుకు. బోలెడు ఆస్తి. చదువుతున్నాడు. అందమయిన వాడు కూడా. రంగకి ఈడు, వాళ్ళింట్లో రంగ పడితే బాగుండును.

సావిత్రమ్మతో శాస్త్రి భార్య సీతమ్మ చాలా స్నేహంగా ఉంటూనే వుంది. పండగలకీ దానికీ తల్లినీ రంగని పిలవని రోజులేదు. రంగ అంటే సీతమ్మకి చాలా యిష్టం. విశ్వం వదిలిన సంగతి అదీ అన్నీతెలిసి కూడా యేమీ తెలియనట్లుండే గొప్పతనం గలది సీతమ్మ. అక్కయ్యా అంటూ సావిత్రమ్మని పిలుస్తూనే వుంటుంది సీతమ్మ. ఒకరోజున మాటల్లో రంగని మంచి ఇంట్లో పడెయ్యాలనీ – ఇంకా చదివించే తాహతు తనకి లేదనీ, సావిత్రమ్మ అనేసింది. సీతమ్మ ఏమంటుందో వినాలని. చదివించమని తనే సహాయం చేస్తానని అన్నాక, సావిత్రమ్మ ఏం చెప్పలేకపోయింది. పిశాచిలా వున్న ఈ సంఘం ఎంత వేధిస్తోంది. ఈ సీతమ్మ తప్ప తన్నిఎవ్వరూ పలకరించరు. వింతగా కూడా చూస్తారు. రంగని ప్రశ్నలడిగి చంపుతున్నారు. సంఘం నీడలా వెంటనంటి పీడిస్తోంది. దీన్నించి తప్పించుకునే మార్గం కనబడదు. సావిత్రమ్మ రోజు రోజుకీ నీరసించి నిలువునా కృంగిపోతోంది.

“రంగా! ఇలా చూడు ఏం చేస్తున్నావు మేడమీద?” అన్నది సీతమ్మ చిరాగ్గా.

“సుధ దగ్గిర లెఖ్కలు చెప్పించుకుంటున్నా పిన్నీ.”

“ఇవాళ చెప్పించుకున్నావు సరే గానీ, ఇక మీద అలా వెళ్ళకమ్మా” అన్నది కోపంగా.

“ఏం వెడితే?”

“నే చెప్పాను వినూ? అంతే. అడ్డు ప్రశ్నలు అడక్కు”. అంటూ ముఖం చిట్లించి, కసరింది.

రంగ వస్తున్న ఏడుపుని ఆపుకుంటూ, తల్లి దగ్గరకు వెళ్ళి చెప్పుకుని ఏడ్చింది.

సావిత్రమ్మకు కట్టిన కళ్ళపొరలు ఒక్కసారిగా వీడిపోయాయి. ఇంత విశాల ప్రపంచంలో తనూ, రంగా నిలబడినట్లు అయింది. రంగకి ఏం చెప్పగలదు? సీతమ్మ ఎందుకని అలా చెప్పింది? పాడు ప్రపంచం.

❄ ❄ ❄ ❄

“ఇంత ఆలస్యంగా వచ్చావేంరా? కారు పంపేసి ఎక్కడికి పోయావురా?”

“ఎక్కడికీ వెళ్ళకూడదా? ఇదేం ప్రశ్నలమ్మా”

“ఏంరోయి, విపరీతంగా వున్నాయి మాటలు.”

“ఆడపిల్లనటమ్మా! శాసించడానికి.”

సీతమ్మ కొడుకు నడత పసికట్టింది.

నెలలూ, ఏండ్లూ గడిచిపోతున్నాయి. సుధాకర్ రంగమీద ప్రేమతో తల్లినీ, తండ్రినీ లెక్క చేయక తిరుగుతున్నాడు. సావిత్రమ్మ రంగని ఏం అనలేకపోయింది. భగవంతుడినే నమ్ముకుని కూచుంది. సీతమ్మకి రంగ అన్నా, ఆ యిల్లన్నా ఇప్పుడు గిట్టదు. తన కొడుకుని సర్వనాశనం చేస్తున్నారని తల్లినీ, కూతుర్నీ తిట్టిపోస్తోంది. సావిత్రమ్మ వీధి తలుపన్నా తెరవకుండా ముఖం దాచుకుంది. రంగ తల్లి మాట కాదని సుధకోసం ప్రాణాలయినా ఇస్తానని పట్టుపట్టింది. ఈ విషమ పరిస్థితిలో సావిత్రమ్మ నలిగిపోతోంది. కానీ, రంగ తన భవిష్యత్తు అదీ తలుచుకుని ఆనందంగా సుధామయంలో వూగిసలాడిపోతోంది. కట్టలు తెగిన నీటి ప్రవాహంలా సుధా, రంగలు అందరినీ ఎదిరించి వివాహానికి నిశ్చయించుకున్నారు.

శాస్త్రి ససేమిరా అన్నాడు. రంగనే పెండ్లాడితే కట్టుబట్టలతో ఇంటినుంచి పొమ్మన్నాడు. తల్లి హృదయం పగిలినట్లయి, కొడుకును వదులుకోలేక, శాస్త్రిని ఒప్పించాలని ఎంతో ప్రయత్నించింది సీతమ్మ. ఏం లాభం లేకపోగా, కోపిష్టి వాడయిన శాస్త్రి సీతమ్మని ఇంట్లోంచి పొమ్మన్నాడు.

సముద్రం పొంగులా వచ్చిన ఈ ప్రేమ ప్రవాహానికి సుధా రంగలు ఎదురు ఈదుతూ, ప్రాణాలమీద ఆశ వదలుకున్నారు. ఆ ప్రవాహంలో అలా అలా కొట్టుకుపోతున్నారు. ఎటో వెళ్ళిపోయారు?

ఊరు చిన్నదేమో, ఎక్కడ చూచినా ఇదే మాట. ఊరు ఊరంతా వింతగా చిత్రంగా చూస్తున్నారు. ఏది వచ్చినా ధనవంతులకే అని కూడా అంటున్నారు. రెండేండ్లు దొర్లిపోయాయి. అంతా క్రమంగా మరచిపోయారు. మంచం పట్టిన సావిత్రమ్మ మెల్లగా పక్క యింటికి వెళ్ళి తలుపు తట్టింది. సీతమ్మ తలుపు తీస్తూ "ఆయనకి, ఏం బాగలేదమ్మా, మరీ యెక్కువగా వుంది ఆయాసం" అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది.

"సుధని ఒక్కసారి చూస్తానమ్మా!

"ఎందుకూ? వద్దు. నేను చూడనివ్వను.

"మా రంగ ఎక్కడ ఉందీ, కాస్త చెపుతాడని ఇలా వచ్చానమ్మా. దాన్ని కళ్ళచూస్తేనే గానీ, ఈ ప్రాణం పోయేట్టుగా లేదు సీతమ్మా!"

"అయింది చాలు తల్లీ! ఇంక అడగడాలు దేనికి?"

"పోనీ నువ్వు నీ కొడుకుని అడిగి చెప్పమ్మా! రెండేండ్లయింది దాన్ని చూసి. ఎలా వుందీ. ఎందుకని ఇక్కడే వుంటున్నాడు మీ సుధ? నా రంగ, నా తల్లి ఏమయింది? చెప్పమ్మా! నా తల్లివి కదూ? నీ కాళ్ళు పట్టుకుంటానమ్మా! అడిగి చెప్పు! మా రంగ...

అంటూ ఆ పైన యిక మాటలురాక, ఆ శోకమూర్తి కన్నీళ్ళ ధారలతో వెక్కి వెక్కి ఏడుస్తూ సీతమ్మ పాదాల మీద వాలింది.

సీతమ్మకు మనసు కరిగింది. కోపం చల్లారింది. దిక్కులు చూస్తూ తెల్లబోతూ, సావిత్రమ్మను లేవదీసి, కూచోబెట్టి కళ్ళ తుడుచుకుంది.

"మీ రంగకు ఆడపిల్లట. సుఖంగానే వుంది. భయపడకు."

"ఆఁ ఆడపిల్లా! ఎక్కడుంది మరి? మీ సుధ...

"వాడి సంగతి ఎందుకుగానీ, మీ రంగ బాగానే వుందిట."

"ఊఁ! ఏమిటమ్మా సీతమ్మా! దానికి ఏమయింది? ఆడపిల్లతో అది ఎక్కడ ఉందీ చెప్పు? మీ సుధ.... దాన్ని వదిలి ఇక్కడే...."

"ఇంక చాలించు నీ ప్రశ్నలు. ఇప్పుడు మా వాడికీ, నీ కూతురుకి, ఎలాటి సంబంధమూ లేదు తెలిసిందా? అది ఎటు వూరేగిపోయిందో ఎవరికి తెలుసు?"

"అయ్యో! అదేమిటమ్మా! ఎటుపోయింది? ఎలా పోయిందమ్మా? చెప్పవా? నే దాని దగ్గరకు పోతానమ్మా. ఒక్కసారి చూసి మరీ చస్తాను. రంగ యెటుపోయిందో."

"చాల్లే! యింక నన్నేం అడగబోకు. ఎలా పోయిందీ మా వాడికేం తెలుసు? సిగ్గులేక అడగవచ్చావా? అంతా తల్లి పోలిక. అప్పుడే చెప్పాను వాడికి. విన్నాడా? ఇప్పుడు వాడూ అంటున్నాడు తల్లిపోలికే నని."

"ఆ, రంగని అన్నాడూ!.... అన్నాడూ... రంగా" అంటూ అక్కడే నేలమీద ఒరిగింది సావిత్రమ్మ. సీతమ్మ భయపడిపోయింది. పలుకరించినా పలుకని సావిత్రమ్మ కళ్లు మూసింది. కళ్లు మూసిన ఆ జీవిని ఇంకా నలుగురూ, నాలుగూ అంటూ ఆఖరు సారిగా చూడవచ్చారు.



# కొడవటిగంటి కుటుంబరావు

**(1909 - 1980)**



**మ**ధ్యతరగతి సంసారుల జీవితాలనూ, సమస్యలనూ, సంస్కారాలనూ, స్థితిగతులనూ ఎంతో వాస్తవికంగా, హృద్యమంగా అద్దంలో ప్రతిబింబించేటట్టు కథలు వ్రాయడంలో ప్రథములు. చెప్పదల్చుకున్న విషయాన్ని సూటిగా, పాఠకుని మనస్సును బలంగా నాటేట్లు చెప్పడం వీరి పద్ధతి. సాంఘిక, ఆర్థిక, రాజకీయ, నైతిక, శాస్త్రీయ సమస్యలను స్వీకరించి - సమాజంలో అమల్లోవున్న ఎన్నో అన్యాయాల మీద ధ్వజమెత్తి దెబ్బమీద దెబ్బ తీశారు.

**రచనలు :** కులంలేని పిల్ల, కొత్త కోడలు,చదువు మొ॥ నవలలు, కొన్ని వందల కథలు, ప్రాణులు - ప్రపంచం, గ్రహాల పుట్టుక మొ॥ శాస్త్రీయ గ్రంథాలు.

# నువ్వులూ – తెలకపిండీ!

(కథానిక)

**తె**లకపిండి ఎట్లా వస్తుందో అందరికీ తెలుసు. నువ్వులు ఆటే నాగరికత లేని సరుకు. అది పొలాల్లో కష్టజీవుల చేతుల్లో పెరిగి మధ్య వాళ్ళకు అమ్ముడు పోయి బస్తీ చేరుతుంది. అక్కడ దాన్ని గానుగ ఆడి  నూనె తీస్తారు. ఆ నూనె అందమైన సీసాలకూ, డబ్బాలకూ ఎక్కి అనేక వంటిళ్ళను అలంకరిస్తుంది. తెలకపిండి చెక్కను నువ్వులొకవేళ చూసినా పోల్చుకోలేవు. అది గొడ్లకూ, పేదవాళ్ళకూ ఆహార మవుతుంది.

నువ్వులు గానుగాడడం ఏమంత గొప్ప విషయం కాదు. నేను మనుష్యుల్ని గానుగాడగా చూశాను. ఎందుచేతో నాకా పద్ధతి రుచించలేదు.

❄ ❄ ❄ ❄

సోమయాజులు నా ఆప్త స్నేహితుడు. వాడిపట్ల నాకున్న భావాన్ని గురించి ఏ కవులూ, ఏ కథకులూ రాయలేరు. అటువంటి భావాలను మాటల్లో వ్యక్తం చేయటానికి ప్రయత్నిస్తే అబద్దాలనో, అతిశయోక్తులనో అనిపిస్తాయి. నేను వాడికోసం ప్రాణం త్యాగం చేస్తానో లేదో పరీక్షకు రాలేదు అదృష్టవశాత్తూ. అటువంటి పరీక్ష వస్తే ఏం చేస్తానో చెప్పలేను. ఇటువంటి ప్రశ్నలకు అంతరాత్మలను సమాధానాలడిగితే, అవి చెప్పే కబుర్లు కోటలు దాటాయి. సోమయాజులును పులి వెంబడిస్తే వాణ్ని తప్పించడానికి పులితో కలియబడగలనని నా అంతరాత్మ చెబుతున్నది. కాని, పులుల్ని మించిన మనిషి వాడివెంట పడి కోరలతో పట్టుకుంటే నేను మంత్రానికి కట్టుబడ్డ వాడల్లే చూస్తూ నిలబడ్డాను.... అయినా నా అంతరాత్మలో నాకు విశ్వాసం చావలేదు. నిజానికి మనము పులులతోనూ, విష సర్పాలతోనూ ఎట్లా వ్యవహరించాలో నిర్ణయించినంత బాగా, పులుల వంటి, విషపదార్థాల వంటి మనుషులతో వ్యవహరించడం గురించి నిర్ణయించలేం.

సోమయాజులు పేద కుటుంబానికి చెందినవాడు. నేను చిన్నతనం నుంచీ వాడితో

కలిసి చదివినవాణ్ణి కనక నాకు వాళ్ళమ్మా. నాన్నా, వాడి తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ, బాగా తెలుసు. వాళ్ళ ఇంటి వాతావరణాన్ని నేను కొంచెమైనా సహించలేకపొయ్యేవాణ్ణి. వాళ్ళు దరిద్రంతో బాధపడటం కూడా దారిద్ర్యాన్ని ఆరాధించటం లాగా కనిపించేది. వాళ్ళింటో అందరి సంస్కారమూ ఒకే ధోరణిలో ఉండేది. ఎట్లా పూచికపుల్ల దగ్గర్నించీ పోగు చేతామా అని? అది ఇది దారిద్ర్యంతో సంబంధం లేకుండా వేరే వ్యక్తిత్వం సంపాదించుకున్నది. ముఖ్యంగా సోమయాజులు తల్లి అడ్డమైన, పనికిమాలిన వస్తువులన్నీ సంపాదించటానికి దొంగతనం మినహాగా మిగిలిన యుక్తులన్నీ చేసేది. ఏ ఉదయం వీధిలో చూసినా ఆమె పేడకోసం ఎవరితోనో ఒకరితో పోట్లాడుతూనే వుండేది. తరువాత, ఆమె దగ్గర దేవిరింపు కూడా వుండేది. ఆవిడ మా ఇంటికి వచ్చినప్పుడల్లా, "మీకు అక్కర్లేనిది ఏదన్నావుంటే ఇస్తురూ" అని పుచ్చుకుపోతూ వుండేది. ఆ వస్తువు మా ఇంట్లో ఉండటం చూసే ఆవిడ అడిగేది. అది మాకు అక్కర్లేని దన్నట్లు నటిస్తే మేం మరింత త్వరగా ఇస్తామని ఆవిడ విశ్వాసం. మా అమ్మకు ఆవిడ దేవిరింపు బొత్తిగా గిట్టేది కాదు. ఆవిడ అడిగిన వస్తువు నిజంగా అక్కర లేకపోయినా మా అమ్మ తనకు దానితో పని వున్నట్లు నటించేది. మా అమ్మయినా తక్కువ తిన్నది కాదు. కాని సోమయాజులు తల్లి ఇంటికి వచ్చినప్పుడల్లా వంటింటో డబ్బాలకేసి, కూరగాయలకేసి, పప్పులకేసి ఆశగా చూస్తుంటేనూ, ఏదన్నా మా అమ్మ బాగుచేస్తుంటే చాలు. "అయ్యో, బియ్యంనూక పురుగు పట్టినట్టుందే" "గోధుమ రవ్వ ముక్కినట్టుందే?' అంటేనూ భరించడం కొంచెం కష్టంగానే వుండేది.

సోమయాజులు గారింటో అనుక్షణమూ వస్తువులు ఆదా... దమ్మిడీలో నూరోవంతు చెయ్యని వస్తువుల పొదుపు – తపస్సులాగా సాగుతూ ఉండేది. ఈ తపస్సులో నిమగ్నులై ఉన్న వాళ్ళకు మరో ఆనందం ఉండే అవకాశం లేదు. మనస్తత్వ రీత్యా నైతేనేం. దృక్పథాలలో నైతేనేం వాళ్ళు మానవుల కంటె కాడి ఎద్దులకు సన్నిహితంగా వుండేవాళ్ళు.

శ్రామిక వర్గానికి చెందవలసిన ఆర్థిక పరిస్థితులుండి కూడా బ్రాహ్మణ కుటుంబాలైన కారణంచేత మధ్యతరగతి హోదాతో నెట్టుకు వచ్చిన వారిని నేను చాలా మందిని చూశాను. కాని బ్రాహ్మలైన దోషంచేత మధ్య తరగతి అనిపించుకుంటూ శ్రామికులు పొందిన జీవితానందం కూడా సాధించలేకపోయిన కుటుంబం నా ఎరుకలో సోమయాజులు వాళ్ళదే. రాను రాను బ్రాహ్మణ కుటుంబాలకు ఈ గతే హెచ్చుగా పడితే నేనాశ్చర్యపడను.

అప్పటికీ సోమయాజులు కుటుంబం మధ్యతరగతి సంస్కారానికి చాలా వరకు ఉద్వాసన చెప్పేశారు. వాళ్ళింట అక్కరలు వచ్చేవి కావు. ఒకవేళ వస్తే ఎవరికీ తెలిసేది కాదు. ఎవరన్నా పిలిస్తే వెళ్ళేవాళ్ళు. కాని వాళ్ళను ఎదురు పిలిచేవాళ్ళు కారు. పక్కవీధిలో

ఉన్న చుట్టాలనే ఏడాదికొకసారి చూసేవాళ్ళు కారు. ఉన్న దారిద్ర్యాన్ని చిన్న మాసి పాత తోనన్నా కప్పటానికి యత్నించేవారు కారు.

సోమయాజులు ఏ విధంగా వాళ్ళ ఇంటో మిగతా వాళ్ళతో అతికినా నేను స్నేహం చేయలేక పోయేవాణ్ణి. లేక స్నేహం కారణంగా వాడు నాకు మరొక విధంగా కనిపించేవాడో; ఏమైనా నాకళ్ళకు సోమయాజులు దరిద్రం ఒక లోపంగా కనిపించేది కాదు. నాకు వాణ్ణి చూస్తే అవ్యాజంగా చెప్పరాని జాలి కలిగేది. కాని ఆ జాలి బాల్య స్నేహ లక్షణం. దానికి వాడి దారిద్ర్యంతో గాని, కష్టాలతో గాని సంబంధం లేదు. నిజంగా కష్టాలు చూసి జాలిపడే శక్తి అంతచిన్న వయస్సులో ఎక్కడుంటుంది.

స్కూలు ఫైనలు దాకా నేనూ సోమయాజులూ కలిసి చదివాం. కాని అంతటితో వాడు చదువు కట్టిపెట్టి వకీలు సత్యనారాయణగారి దగ్గర ప్లీడరు గుమాస్తా పని నేర్చుకునే వాలంటీరుగా చేరాడు. ఆ తరువాత నేను నాలుగేళ్ళు కాలేజీ చదువు చదివి పైనా లోపల కూడా ఎన్నో మార్పులకే లోనయినా, ఏ మూలో వాడి కోసం నా హృదయంలో కొంత మేర మార్పు లేకుండా దాచి వుంచాను. గడియారాల నెవరూ వెనక్కు తిప్పలేరు కాని కొంతవరకు వాటిని ఆపి ఉంచటం అసంభవం కాదు.

సోమయాజుల్ని గురించి చెప్పవలసిన విషయం చెప్పలేదు. వాడు పాడగలడు. ఎవరంత బాగా పాడగలడని అడక్కండి. నిజంగా గొప్ప పాటకు సాటిలేదు. సంగీతంలో విద్వత్తును పోల్చవచ్చు. సాధనను పోల్చవచ్చు. గొంతెత్తి మనస్సులు కరిగించే వాడి పాటతో ఆనందాన్ని ఇంకోదాంతో ఎట్లా పోల్చడం? సోమయాజులుకు రాగజ్ఞానం లేదు. తాళజ్ఞానం లేదు. పాటతో తన్మయత్వం తీసుకురావటానికి ఈ మూడూ అవసరం లేదని నాకు సోమయాజులు రుజువు చేశాడు. ఒక్క సాహిత్యంతో తప్ప తన్మయత్వం రాని నాకు వాడి పాట వెర్రెత్తించింది. అది అహోరాత్రాలు నన్ను రకరకాల పీడించేది. వాడి పాట వినే ఆనందంలో సుఖమే హెచ్చుగా ఉండేదో, బాధే హెచ్చుగా ఉండేదో నిర్ణయించ లేకపోయేవాణ్ణి.

❄ ❄ ❄ ❄

సోమయాజుల పాట గురించి నేను చెప్పేది అతిశయోక్తి గాదని రుజువు చేయటానికి లేదు. కాని ఒక్క మాట మాత్రం చెప్పగలను. వాడి పాట విని చలించని వాళ్ళను చూశాను. నాకన్నా వెర్రెత్తిన వాళ్ళను కూడా చూశాను; జయలక్ష్మి ఒక పెద్ద తార్కాణం.

నాకు జయలక్ష్మి మీద ఏవిధమైన అభిమానంగాని గౌరవం గాని లేదు. కాని ఆ పిల్ల వాడి వెంట ఎందుకు పడిందో నే నూహించగలను. నేను ఆడదాన్నయి వుంటే సోమయాజుల పట్ల సరిగా జయలక్ష్మిలాగే ప్రవర్తించి వుండేవాణ్ణేమో.

జయలక్ష్మి మరెవరో కాదు. వకీలు సత్యనారాయణగారి చెల్లెలు కూతురు. వాళ్ళ

నాన్న పట్నంలో గొప్ప వ్యాపారస్తుడు. ఆయనకు ఏమీ లేదు. సత్యనారాయణ గారి చెల్లెలు మల్లికాంబను ఆయన కిచ్చినప్పుడు సత్యనారాయణ తండ్రిగారిని అంతా కోప్పడ్డారు – దారే పొయ్యేవాడికి పిల్లనిచ్చారని, సత్యనారాయణగారు ప్రాక్టీసు పెట్టి రెండు చేతులా సంపాదన ప్రారంభించగానే అత్తవారి దృష్టిలో గురునాధంగారు మరీ సులకనయినాడు. కాని జయలక్ష్మి పుట్టుటయే ఆరంభం గురునాధం గారి దశ తిరిగి పట్టిందల్లా బంగారం కాసాగింది. చూస్తుండగానే ఒక లక్ష వెనకవేసి రెండో లక్షకు నడుం బిగించాడు. చిన్నచిన్న బస్తీల వాతావరణంలో వదిలిపోయిన మొక్క పట్టణం వాతావరణంలో పెరిగి మహావృక్షమై ఊడలు దించసాగింది. జయలక్ష్మి సంపన్నుల పిల్ల. జయలక్ష్మి అన్న ఇంగ్లండులో చదివి వచ్చి పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు.

జయలక్ష్మి మేనమామ గారింట కొన్ని రోజులు ఉండటానికి వచ్చింది. సోమయాజులు పాడతాడని ఆమె ఎట్లా పసికట్టిందో తెలియదు. తన మేనమామ దగ్గర గుమాస్తా కనకా, తను సంపన్నురాలూ అతను బీదవాడు కనకా, ఆమె మొదట తన అధికారం వినియోగించి అతనిచేత పాడించుకున్నది. తన మేనమామ ఇంట్లో లేనప్పుడు అతన్ని మేడమీది వరండాలోకి పిలిపించి పాడమనేది. సోమయాజులు పాడేవాడు.

నిజంగానే జయలక్ష్మికి మతిపోయింది సోమయాజులు పాటతో. అతను పాడనంటే బాధ పడేది. క్రమంగా అతని మీద తనకు గల అధికారాన్ని మరిచిపోయింది.

“ఇదిగో, అమ్మాయి. ఇక నన్ను పాడమనకు. ప్లీడరుగారు నన్ను కోప్పడ్డారు. పాటలే పాడతావా. పనిచేస్తావా? అన్నాడు. నాకీ పాట కూడుపెడుతుందా గుడ్డ పెడుతుందా?” అన్నాడు సోమయాజులు ఒక రోజు జయలక్ష్మితో.

“పోనీ పాడకు – నీ కిష్టం లేకపోతే” అన్నది జయలక్ష్మి నిబ్బరంగా. కాని లోపల ఆమె మనస్సు దహించుకుపోతున్నది. నల్లమందు అలవాటైన వాడికి అది లేకుండా ఉండటం ఎంత దుర్భరమో, సోమయాజులు పాట వినకుండా వుండటం ఆమె కంత దుర్భర మయింది.

ఒకరోజు సాయంకాలం సోమయాజులు కోర్టునుండి ప్లీడరుగా రింటికి వచ్చాడు పనుండి. ప్లీడరుగారు నేరుగా క్లబ్బుకు వెళ్ళారు.

ఆఫీసు గదిలో సోమయాజులు పని చూసుకుంటుండగా, జయలక్ష్మి వచ్చి అతని ఎదురుగా మాటా పలుకూ లేకుండా నిలబడింది. ఆమెలో ఏదో మార్పు కనిపించింది సోమయాజులుకు. వారం రోజులు పస్తులున్న దానల్లే వున్నదామె.

“ఏమిటి?” అన్నాడు సోమయాజులు.

“నేను రేపు వెళ్ళిపోతున్నాను” అన్నది జయలక్ష్మి.

"అట్లాగా?" అన్నాడు.

"ఎంత అదృష్టం; నేను మళ్ళా కనిపించనని నీకు విచారం లేదుకదా?" అన్నదామె.

దీని కేమనాలో సోమయాజులుకు తెలియలేదు.

"ఒక్కసారి పాడు; మళ్ళీ వినను" అన్నది జయలక్ష్మి.

"ఇప్పుడా? పనుంది" అన్నాడు సోమయాజులు.

జయలక్ష్మి భరించలేకపోయింది.

"పని; పని; ఏం పని ఇది. గొప్పవాళ్ళ ఇళ్ళలో కుక్కలు నీకన్నా బాగా బతుకుతై. ఇదేనా పని? మా మామ నెలకు పది రూపాయలిస్తాడా? ఈ పది రూపాయలకేనా నీకు దేవుడింత పాట ఇచ్చాడు? నీకు ఆశ లేదా? గొప్పవాడి వౌదామని? " అని ఘాటుగా ఎత్తిపొడిచింది జయలక్ష్మి.

"అందరూ గొప్పవాళ్ళయితే కొద్దివాళ్లెవరు?" అన్నాడు సోమయాజులు.

"నువ్వు కొద్ది వాడివిగానే ఉండు. కాని కాస్సేపు పాడు. నీ యిష్టం. ఏదన్నా రాగం ఆలాపన చెయ్యి. నీకు పాటలు పాడటం చాతకాదు" అన్నది జయలక్ష్మి.

సోమయాజులు సన్నగా నవ్వి పాడసాగాడు. పైగా కేదారగౌళ ఆలాపన చేశాడు. వాడి శంకరాభరణంగాని, కళ్యాణిరాగం గాని కొంతవరకు తట్టుకోవడం చాలా కష్టం.

జయలక్ష్మికి నిజంగానే మతిపోయింది. వాడు పాడటం ఆపగానే "ఎట్లా పాడతా వింత పాట? ఎన్నోసార్లు నేను మోసపోయినా ననుకున్నాను. నువు నిజంగా అంత బాగా పాడవని, నేనే ఊహించుకుంటున్నాననీ అనుకున్నాను. నేనింకా ఏడెబ్బయ్యేళ్ళో బతుకుతాను. కాని నీ పాట వినలేను. నువు నిజంగా ఇంత బాగా పాడలేదనీ, నా భ్రమ అనీ మళ్ళీ నన్ను నేను నమ్మించుకుంటున్నాను. ఎట్లా సోమయాజులూ? రోజూ నీ పాట వినడం ఎట్లా సోమయాజులూ? రోజూ నీ పాట వినడం ఎట్లా? మీ ఇంటో వాళ్ళంతా ఎంత అదృష్టవంతులు? రోజూ నీచేత పాడించుకు వింటారు కాదూ?" అన్నది.

"నా చేత బలవంతాన పాడించే వా డింకొక్కడే ఉన్నాడు" అన్నాడు వాడు.

"అయితే నే నొక్కతినే కాదన్నమాట? నాకు మతి పోలేదన్నమాట? ఈ అనుమానం కూడా నాకు తట్టింది సుమా" అన్నది జయలక్ష్మి.

❄ ❄ ❄ ❄

సోమయాజుల్ని పెళ్ళాడాలనే బుద్ధి జయలక్ష్మికి ఎప్పుడు పుట్టిందో నాకు స్పష్టంగా తెలియదు. సోమయాజులుకు ఆమె పట్నం నుంచి ఒక ఉత్తరం రాసింది. ఉత్తరంలో చాలా కవిత్వముంది. సోమయాజులు మనిషి ఎదురుగా ఉన్నా చలించనివాడు కాస్తా ఆ ఉత్తరానికి చలించాడు. విశేషమేమంటే ఆ ఉత్తరంలో జయలక్ష్మి తనను పెళ్ళాడమని

సోమయాజులు నడిగింది. వాడు ఒప్పుకుంటే తన తండ్రిని ఒప్పిస్తానన్నది. వెధవ ప్లీడరు గుమాస్తా గిరి మానేసి తన దగ్గిరే ఉండవచ్చునన్నది.

వాళ్ళిద్దరి మధ్యా ఉత్తర ప్రత్యుత్తరాలు సాగినై. అన్ని ఉత్తరాలూ వాడు నాకు చూపలేదు. ఆ విధంగా అందులో ఏమున్నదీ నాకు తెలియజేశాడు.

ఒకటి మాత్రం ఖాయం. గురునాథం గారు కూతురు పెళ్ళి ఆలోచనకు వెంటనే ఒప్పుకోలేదు. కాని జయలక్ష్మి చాలా మొండిది. ఆఖరుకు సోమయాజులును వాళ్ళు పట్నం పిలిపించారు. వాళ్ళే రైలు ఖర్చులు కూడా ఇచ్చారు. ఇంతదాకా వచ్చినాక సోమయాజులు తల్లిదండ్రులకు విషయం తెలిసిపోయింది. వాళ్ళ సంతోషానికి మేరలేదు. తమకొడుకు పెళ్ళి అయినట్టుగా అందరితోనూ చెప్పేశారు.

వాడి తండ్రి నన్ను చాటుగా పిలిచి "చూడు బాబూ, మా వాడికి వాళ్ళు బాగా కట్నం ఇచ్చేట్టు చూసుకోవద్దూ మనం? ఇవ్వగలవాళ్ళేగా తీపురమా?" అన్నాడు.

"మీ రిందులో జోక్యం కలిగించుకోకండి. అసలే దగ్గితే ఊడే ముక్కుగా వుంది. ఈ పెళ్ళికి వాళ్ళెట్లాగూ ఒప్పుకోరు. ఒకవేళ ఒప్పుకుంటే అదే అన్ని కట్నాలూనూ. మీరిందులో తొందరపడి వేలుపెట్టారో అసలుకు మోసం వస్తుంది" అన్నాను.

"అదేమిటోయ్? మనం మగపెళ్ళి వాళ్ళంగా? మన పిల్లవాణ్ణి వాళ్ళు పిలిపించటం ఏమిటి?" అన్నాడాయన.

"ఈ పెళ్ళి జరిగితే, పెళ్ళివారంతా కలిసి మీ అబ్బాయి ఒక్కడే. ఆ చేసుకునే అమ్మాయి ఒక్క మొగుణ్ణే చేసుకుంటుంది గాని, అత్తగారినీ, మామగారినీ చేసుకోదు" అన్నాను.

"అదేం? కాపరానికి రాదూ?"

"మనవాడే కాపరానికి పోతాడు."

"ఛా;" అన్నాడు సోమయాజులు తండ్రి, నా మాట నమ్మలేకుండా.

గురునాథం గారూ వాళ్ళూ సోమయాజుల్ని గురించి ఎంత తక్కువ అంచనాలు వేసుకున్నారో మనకు తెలీదు. అది సోమయాజులుకి లభించింది.

"కుర్రాడు బాగానే వున్నాడే!" అంది జయలక్ష్మి తల్లి మల్లికాంబగారు. గురునాథంగారికి కూడా అదే తోచి వుండాలి.

అదీకాక సోమయాజులు అందరిపట్లా చాలా వినయ విధేయతలుగా వుండేవాడు. ఎవరితోనూ యే విషయంలోనూ పేచీలు పెట్టుకునేవాడు కాడు. అన్నిటి కన్నా ముఖ్యం – జయలక్ష్మి వాడికి మంచి సూట్లు రెండు ఆర్డరు చేయించింది. ధోవతులూ షర్టులూ కొనిపెట్టింది.

గురునాథంగారి ఇంటో జయలక్ష్మికి ఎటువంటి అడ్డులేదు. ఆమెకు వేరే గది వుంది.

ఆ గదిలో ఇద్దరూ గంటలు తరబడి కూర్చునేవాళ్ళు. సోమయాజులు చేత గంటలు తరబడి పాడించుకునేది. వాణ్ణి ఆనుకుని కూర్చునేది. మరీ ఆపేక్ష వస్తే వొళ్ళోనే వచ్చి కూర్చునేది.

ఇంకా పెళ్ళి కాకపూర్వమే సోమయాజులుకు పాడటమంటే అసహ్యం పుట్టిపోయింది. పాపం, జయలక్ష్మి, తన తృష్ణ సంతృప్తి పరచుకోవటంలో సోమయాజులుకు ఆవగింజంతైనా స్వాతంత్ర్యం లేకుండా చేసింది. తనంతట తాను గొంతెత్తి ఎన్నో యుగాలైనట్టనిపించింది వాడికి ఆ సమయానికి. వాడికి జయలక్ష్మి మీద ప్రేమే ప్రజ్వలించకపోతే ఎవరితోనో చెప్పకుండా ఇంటికి వచ్చేయ్యవలసినవాడే.

వాడు పట్నం వెళ్ళిన నెల రోజుల్లో పెళ్ళి అయిపోయింది. పెళ్ళికి వాడి తలిదండ్రులెవరూ వెళ్ళలేదు. "మీరు వెళ్ళనవసరం లేద"ని నేను చెప్పిన సలహా, డబ్బు ఖర్చవుతుందన్న వాళ్ళ తాపత్రయానికి కలిసి వచ్చింది.

❄ ❄ ❄ ❄

జయలక్ష్మి సోమయాజుల్ని తప్ప పెళ్ళాడనని ఎందుకు పట్టుపట్టిందీ. ఆమె ఇంటో వాళ్ళకుగాని, స్నేహితులకు గాని తెలియదు. పెళ్ళి అయినాక మాత్రం ఆమె, "మా ఆయన సంగీతం మీరు వినలేదు కాదూ!" అని అందరి దగ్గరా వాడి పాట వినిపించసాగింది.

తన మొగుడి పాట విన్నవాళ్ళంతా తన మాదిరిగానే వెర్రెత్తి పోతారని, ఇంత పాటగాణ్ణి మొగుణ్ణి చేసుకున్నందుకు వాళ్ళు తనను చూసి అసూయ పడతారనీ ఆమె ఆశించి వుంటుంది. ఈ విషయంలో ఆమె నిరాశ అయింది.

సోమయాజులు పాటవిన్న వాళ్ళల్లో చాలా మందికి అందులో ఏమంత ప్రత్యేకత కనిపించలేదు. కొందరు అతన్ను " ఈ రాగం పాడు, ఆ రాగం పాడు, ఆ కృతి పాడు. ఏవైనా సినిమా పాటలు పాడు, హిందీ పాటలు పాడు" అని అడిగి ఆశాభంగం పొందారు. కాస్త సంగీత జ్ఞానం కలవాళ్ళు సోమయాజులు కా జ్ఞానం లేదని తెలుసుకున్నారు.

పైకి అందరూ ఇంపైన పాట! చక్కని శరీరం మంచి పొడుగు అన్నారే గాని జయలక్ష్మి లెక్కన తన్మయత్వం పొందలేదు.

పైగా సోమయాజులు తిరగబడ్డాడు. "నీ కోసం పాడమంటే పాడతాను గాని వీళ్ళందరి ముందు పాడమంటావు దేనికి? వాళ్ళకు నా పాట నచ్చకపోవచ్చు. నువ్వు జిడ్డు తగిలిస్తున్నావనుకోరా?" అన్నాడు.

"పాట అన్న తరువాత నలుగురికి గాని ఒక్కరికా?" అన్నది జయలక్ష్మి. తన కీర్తి కాంక్షను అభ్యుదయ నినాదంతో సమర్థిస్తూ.

ఈ అంధకారంలో జయలక్ష్మికి ఒక ఆశారేఖ అగుపించింది. గురునాథంగారి

స్నేహితులలో ఒక పాటగా డొకాయన ఉన్నాడు. ఆయన కూడా సోమయాజులు పాట విన్నాడు. తన అభిప్రాయాన్ని జయలక్ష్మి వింటుండగానే గురునాథం గారికి చెప్పాడు.

"మనవాడు పూర్వజన్మ వాసనవల్ల మంచి గాత్రంతో పుట్టాడు. కాని సరిగమల దగ్గిర్నుంచీ కట్టుగా నేర్చుకుంటేగాని పాటగాడుగా రాణించలేడు" అన్నాడాయన

"అట్లా అయితే, సంగీతం చెప్పిద్దాం" అన్నాడు గురునాథం.

సోమయాజులు గొప్ప వాడు కావడానికి, పాడేశక్తి కోల్పోవడానికి అదే మొదలు.

సోమయాజులుకు చాలా పెద్ద విద్వాంసుణ్ణి చూసి పెట్టారు. సాధన ప్రారంభించాడు. ఇంటిదగ్గర కూడా తంబురా పెట్టుకొని సాధన చేసేవాడు. అదివరకు తన మగడు గొంతెత్తితే పరవశమయ్యే జయలక్ష్మి ఈ సాధన బలవంతాన సహించవలసి వచ్చింది.

ఈ విధంగా సోమయాజులు మూడేళ్ళ పాటు సంగీత శిక్షణ పొందాడు. రాగాల్లో భేదాలేమిటో, మేళకర్తలేమిటో, జన్యరాగాలేమిటో, ఆరోహణావరోహణాలేమిటో తాళభేదాలూ, జాతులూ అన్నీ నేర్చుకుని కర్ణాటక సంగీత విద్వాంసుడైనాడు.

అదివరకు తాను పాడిన "గాలిపాట" తలుచుకుని వాడు సిగ్గుపడేవాడు. కాని ఇప్పుడు వాడి పాట చూసి పరవశమయ్యేవాళ్ళు లేరు. సంగీత సాహిత్యంలో వాణ్ణి తలదన్నిన హేమాహేమీలు ఉండనే ఉన్నారు. ఏ రోజున రేడియోను మద్రాసుకు గాని, తిరుచునాపల్లికి గాని తిప్పినా సోమయాజులు జన్మలో సంపాదించలేని కీర్తిని సంపాదించుకున్న వాళ్ళు వినిపిస్తారు! సోమయాజులు ప్రత్యేకత ఏమిటి?

ఇప్పుడు సోమయాజులు పాడితే జయలక్ష్మి గుండె తటతట లాడటం లేదు. ఆమె వాణ్ణిప్పుడు పాట పాడమని అడగదు. వాడు రాగం పాడితే, గొంతెత్తగానే రక్తిగా వుండేది. ఇప్పుడు గంటా గంటన్నర వింటే గాని అందులో ఏ రసమూ ఉత్పత్తి కాదు.

"ఏమోయ్? ఇంతకష్టపడి, ఇంత డబ్బు ఖర్చుచేసి నేర్చుకున్నావు సంగీతం, దీనివల్ల ఫలిత మేమిటోయ్?" అన్నాడు మామగారు.

"పాట కచేరీలు చేసుకోవచ్చు – ఎవరన్నా చేయిస్తే" అన్నాడు అల్లుడు సంకోచంతో.

చిత్రమేమిటంటే, సోమయాజులు సంగీతం నేర్చుకున్నందుకు సంతోషించిన వాడు సోమయాజులొక్కడే. పాపం, వాణ్ణి పాట కచేరీలు చెయ్యటానికి కెవరూ పిలవలేదు.

వాడికి విద్వత్తు లేకపోవడం ఒక్కటే లోపమన్నట్టు వెనక మాట్లాడినవాళ్ళు కూడా విద్వత్తు సంపాదించి వాడు పరిపూర్ణుడైననాడు హర్షించలేదు.

జయలక్ష్మి రేడియో ఎప్పుడన్నా పెడితే సినిమా రికార్డులు పెట్టుకు వినేది. కాని ఆమెకు సంగీతం మీద వెనకటి ఆసక్తి లేదు.

❄ ❄ ❄ ❄

ఒక రోజు జయలక్ష్మి అన్న ఉద్యోగం మానేసి ఇంటో ఉంటున్న రోజుల్లో గురునాథం

గారింటికి ఒక మనిషి వచ్చాడు. జయలక్ష్మి అన్న పరబ్రహ్మ శాస్త్రి ఆయనతో ఏదో వ్యవహారం మాట్లాడాడు. పరబ్రహ్మశాస్త్రి తన బావమరిదిని పిలిచి ఆ పెద్ద మనిషి దగ్గర పాడమన్నాడు. సోమయాజులు పాడాడు. ఆ తరువాత వాళ్ళు వాణ్ణి పంపించేశారు.

సోమయాజులు భార్య నడిగాడు.

"ఏవో నాటకాలు కంట్రాక్టు చేస్తారుట, మా అన్నయ్య చెప్పలా?" అన్నది జయలక్ష్మి అట్టే ఆసక్తి లేని దానల్లే.

"నన్నెందుకు పాడమన్నారు?"

"ఏమన్నా వేషం వేయిస్తారేమో? పాడగలరు గదా" అన్నది జయలక్ష్మి.

ఆ మాట అక్షరాలా నిజమయింది.

ఈ సంఘటన జరిగిన నెలకల్లా పరబ్రహ్మశాస్త్రి పట్నంలో ఒక మూల ఇల్లు తీసుకుని నటులను చేర్చి నాటకం రిహార్సల్సు ఆరంభించాడు. ఆ పెద్ద మనిషి – ఆయన పేరు శేషయ్య – పాటలు యెట్లా పాడాలో, యెవరు ఎట్లా నటించాలో చెబుతూ వచ్చాడు సోమయాజులుకు. చాలా పాటలూ, పద్యాలూ గల పాత్ర ఇచ్చారు.

"నీకేం బోలెడంత పాట ఉంది పాడేస్తే చాలు. నాటకం రక్తి కడుతుంది. నటించనక్కర్లేదు. కాస్తో కూస్తో నేను చెబుతాను. రెండు నెల్లు రిహార్సల్సు నలిగితే తరువాత అసలు అనుభవమంతా స్టేజీమీద వస్తుంది" అన్నాడు శేషయ్య.

"ఇంత కష్టపడి సంగీతం నేర్చుకుని నేను స్టేజీమీద పద్యాలు పాడటమేమిటి?" అన్నాడు సోమయాజులు బావమరిదితో.

"అదేపొరపాటు, కోటివిద్యలూ కూటి కొరకే, చెరువులో నీళ్ళుండి ఏం లాభం? వాటిని మనం ఉపయోగించుకోవాలి" అన్నాడు శాస్త్రి.

రిహార్సల్సులో శేషయ్య సోమయాజులుకు పద్యాలెట్లా పాడాలో, ఎక్కడ నిలపాలో, ఎక్కడ రాగం తియ్యాలో, పద్యం ఎట్లా ఎత్తుకోవాలో, ఎట్లా ముగించాలో చెప్పాడు. శేషయ్యకు గొంతులేదు. పాట రాదు. కాని పద్యం ఎట్లా చదవాలో తెలుసు. పద్యం చదవటంలో కాక రాగాలాపన చెయ్యటంలో ఆసక్తి మెండుగా గల సోమయాజులు సంగీతం ఖూనీ అవుతున్నట్టు తోచింది. శాస్త్రితో ఫిర్యాదు చేస్తే శేషయ్య చెప్పినట్లు చెయ్యమన్నాడు.

రెండు నెలల్లో నాటకం పండింది. మొదటి ప్రదర్శనానికి అట్టే జనం రాలేదు. గాని వచ్చినవాళ్ళు సోమయాజులు పాటకు తన్మయులైనారు. కొన్ని పద్యాలు మూడేసి సార్లు కూడా పాడించారు.

"ఆ వన్సుమోర్లు నాకు – నీకు కాదు" అన్నాడు శేషయ్య.

"నాకు తెలుసు" అన్నాడు సోమయాజులు నిగర్వంగా!

ఈ నాటకం మొత్తం మీద రెండు వందల ప్రదర్శనాలు పడ్డాయి. శాస్త్రీ, శేషయ్యా కలిసి పాతికవేలు లాభం చేశారు. సోమయాజులకు ఆంధ్రదేశంలో స్టేజీమీద పాడగలవాడనే పేరు మాత్రం లభించింది.

అతనికి నాటకాలలో ఆఫర్లు కూడా రాసాగినై. ఆటకు యాభై మొదలు నూరు రూపాయల చొప్పున ఇస్తామని అతని వెంట పడ్డారు నాటకాలవాళ్ళు. కాని వెళ్ళవద్దని శాస్త్రి అన్నాడు.

పరబ్రహ్మశాస్త్రి కింకా పెద్ద ఆలోచనలున్నాయి. అతను గ్రామఫోనూ, సినిమా పాటల రికార్డులూ కొన్నాడు. ముఖ్యంగా హిందూస్థానీ సినిమా రికార్డులు.

"ఇదీ రేపటి సంగీతం. ఈ సంగీతంలో లక్షలున్నాయి. వీటిని బాగా పట్టుకోండి. ఈ బాణీ అలవాటైతే ఆ తరువాత ఏం చెయ్యాలో చెబుతాను" అన్నాడు శాస్త్రి.

సోమయాజులు గొంతుకీ పంజాబీ సంగీతం – ఒక రాగలక్ష్యం గాని, ఒక శాస్త్ర నిబంధన గాని లేని యీ కలగాపులగపు సంగీతం – పచ్చి వెలక్కాయ అయి కూర్చుంది.

"ఇదేం సంగీతం? దీన్లో అర్థమేమిటి? దీన్ని నేర్చుకోవట మేమిటి? నాకిదెట్లా అబ్బుతుంది?" అని సోమయాజులు వాపోయినాడు.

"వినటానికి సుఖంగానే వుంటుంది. అందులో ఏం లోపం వుంది?" అన్నది జయలక్ష్మి.

"అందులో ఉన్న సంగీత మేమిటి కనక?"అన్నాడు సోమయాజులు.

"అందులో ఏమీ లేదనీ మీరే అంటారు. అది ఎట్లా అబ్బుతుందని మీరే అంటారు? ఏది నిజం?" అన్నది జయలక్ష్మి సానుభూతి లేకుండా.

ఆకస్మికంగా సోమయాజులు సంగీతం విషయం ఆలోచించడం మానేసి, జయలక్ష్మిని గురించి ఆలోచించసాగాడు. తనకోసం తన వాళ్ళందరితోనూ పోట్లాడి పెళ్ళాడిన జయలక్ష్మి తనకు దగ్గరగా ఉండి కూడా ఎంత దూరమయింది? ఎందుకిట్లా అయింది? తను ఏ మహాసముద్రంలో ఏ దిక్కుగా ప్రయాణిస్తున్నట్టు? ఈ ఓడ ఏ రేవు చేరుతుంది? తను కష్టపడి కర్ణాటకం నేర్చుకున్నాడు. దాన్ని వదిలి నాటకం పద్యాల్లో పడ్డాడు. అవీ వొదిలేసి యిప్పుడు సినిమా పాటల్లో పడబోతున్నాడు! ఎవరి కోసం? ఎవరు మెచ్చుకోవటానికి? తన కేపాటా రానప్పుడు తన పాట విని ఆనందించినవాళ్ళున్నారు. ఇవ్వాళ?

ఈ ప్రశ్నలకు నిజంగా సమాధానాలు లేవు. ఉంటే సోమయాజులుకు తెలీవు.

వాడు ఏ పనీ సగం చేసే బాపతు కాదు. ఒక సంవత్సరమట్టా సినిమా సంగీతంలో మునిగి తేలాడు. అందులో భావానికిగల ప్రాధాన్యం అర్థం చేసుకున్నాడు. వివిధ వాద్యాలు ఏ విధంగా ఉపయోగిస్తారో ఊహించాడు. అందులో కొన్ని వాయిద్యాలు ఎట్లా వుంటాయో కూడావాడికి తెలీదు. కాని వాటి ప్రత్యేకతలు వాడి చెవిపట్టింది.

శాస్త్రి చాలా సాహసమైన ఎత్తు వేశాడు. ఎవరో సినిమా చిత్రం తీస్తుంటే, అందులో తాను రెండణాల వాటా తీసుకున్నాడు. తన ఎత్తేమిటో శాస్త్రి సోమయాజులుకు చెప్పేశాడు.

"నేను పదిహేను వేలే పెడుతున్నాను. ఇది పోయినా నా కభ్యంతరం లేదు. కాని నేను ఈ పిక్చరుకు గట్టి మ్యూజిక్ డైరెక్టరును పెడుతున్నాను. నువ్వు అతనివెంట వుండి సినిమా సంగీతం గురించి నేర్చుకో దగినదంతా నేర్చుకో. ఆ తరువాత ఏం చెయ్యాలో నేను చెబుతాను" అన్నాడు శాస్త్రి.

ఈ కొత్త చిత్రంలో పన్నెండు పాటలున్నాయి. ముందు పాట తయారు చేశారు. సంగీత దర్శకుడు ప్రసిద్ధుడూ, సమర్థుడూనూ, పన్నెండు పాటలూ పూర్తి అయి రికార్డు చెయ్యటానికి రెండు నెలలు పట్టింది. ఈ రెండు నెలలూ సోమయాజులు సమస్త విషయాలూ చూశాడు. కొన్ని పాటలలో అక్కడక్కడా మార్పులు కూడా సూచించి, సంగీత దర్శకుడి చేత బాగుందనిపించు కున్నాడు. చివర ఒకటి రెండు పాటలు తనే స్వయంగా రాశాడు కూడాను.

పాటలన్నీ రికార్డయినై. వాటిని విన్నవాళ్ళు చాలా మెచ్చుకున్నారు. అదొక గొప్ప విషయం కాదు. సోమయాజులు రాసిన రెండు పాటలను ఎవరూ గుర్తించలేదు. మిగిలిన పాటలతో సమంగానే ఇవీ వున్నాయి. ఆ ఆధారంమీదే శాస్త్రి సినిమా కంపెనీ ఆరంభించాడు. వీళ్ళింకా చిత్రాలు తీయలేదు కాని, తీస్తారు. వాటికి సోమయాజులు సంగీత దర్శకుడుగా ఉంటాడు. అచ్చగా సంగీతంమీదే పొయ్యే చిత్రాలు తీస్తారు. వాటిమీద వచ్చే లాభం గురునాథంగారి మూడో లక్షలో చేరుతుంది. సోమయాజులు దేమీ ఉండదు. నాలుగైదు చిత్రాల వరకూ సోమయాజులకు డోకా ఉండదు. ఆ తరువాత అతని పాటలు పాతబడ సాగుతాయి. ఆ తరువాత సోమయాజులు తెలకపిండిరూపంలో గానుగలో నుంచి తోడబడతాడు. గురునాథం గారి వ్యాపార రథంచెక్కు చెదరకుండా ముందుకు సాగిపోతుంది.

ఎక్కడో అనామకుడుగా పడివున్న వాణ్ణి తెచ్చి ఇంతవాణ్ణి చేసిన కీర్తి ఏవిధంగా నైతే గురునాథంగారికి దక్కిందో, ఆ విధంగానే సోమయాజులులో సంగీతం డబ్బు చేసే సంగీతం – ఇంకిపోయిన మర్నాటి నుంచీ వాణ్ణి బతికున్నంత కాలమూ పోషించే భారం కూడా గురునాథం గారికి దక్కుతుంది. అందుకు గాను సోమయాజులు యావజ్జీవమూ వారికి కృతజ్ఞుడై యుండగలడు.

# బుర్రా వెంకట సుబ్రహ్మణ్యం

**ఆ**ంధ్రాంగ్ల భాషలలో చేయి తిరిగిన రచయిత, అరుదుగా వ్రాసినా, అతి నిశితమైన, వైచిత్రితో కూడిన మానసిక ప్రవృత్తులను ప్రదర్శించే నికరమైన కథలు వ్రాశారు. వీరి కథలు జీవితంలోని కొన్ని దృశ్యాలకు సమగ్రమైన వ్యాఖ్యలు. అపారమయిన పరిశీలనా దృష్టితో, భావ తీక్షణతతో, వినూత్న కథా కథన పద్ధతిలో ఉత్తమ కథలు సృష్టించారు. వీరు కథలు అరుదుగా మాత్రం వ్రాయడం ఆంధ్రుల దురదృష్టమని చెప్పవచ్చు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో అడ్వకేట్ జనరల్‌గా పనిచేశారు.

**రచనలు :** జేబురుమాలు (కథలు), విజయ (నవల)

# జేబురుమాలు

## 1

"ఏమిటి నువ్వు కుట్టున్నది, పద్మినీ?"

"జేబురుమాలు."

"ఎవరికి?"

"ఎవరి కేమిటి? నాకే."

"చాలా బాగుంది గుడ్డ. పట్టుగుడ్డేనా?"

"పట్టే అనుకుంటాను. క్రీప్ డిచైన్ అనో, క్రేప్ డిషైన్ అనో అంటారు. నీ చేతిలో ఏమిటా పుస్తకం?"

"ఇదా? అబ్బే..... ఏమీ లేదు."

"అయినా చూపించు."

"పద్మినీ. ఈవాళ నీ పుట్టిన రోజు కాదూ?"

"ఎవరు చెప్పేరు నీకు?"

"నా కలా జ్ఞాపకం...."'

"ఆ పుస్తకం ముందు చూపించు."'

"ఈవాళ నీ పుట్టినరోజైతే చూపిస్తాను."

ఈ వాళే నా పుట్టినరోజు."

"అయితే ఇదిగో."

"ఏమిటిది, చిట్టిశాస్త్రీ? నా కిది పుట్టినరోజుకి బహుమానమా?"

"అత్తకీ, మామకీ చూపించకుండా నీ పెట్టెలో దాచెయ్యాలి నువ్వు."

"వాళ్లు చూస్తే ఏమీ?"

"వాళ్ళేమైనా అనుకుంటారు.... పైగా నాకు సిగ్గుకూడాను."

"సిగ్గెందుకూ?... చిట్టిశాస్త్రీ. నీ పుట్టిన రోజెప్పుడు?"

"ఎప్పుడైతే నీకెందుకులే.... పై చదువులకి నువ్వు చెన్నపట్టణం వెళ్ళడం నిశ్చయమేనా?"

"అమ్మా, నాన్నా యింకా వాదించుకుంటున్నారు. నాన్నకి పంపించాలనుంది. అమ్మకి అంతగా ఇష్టం లేదు.... ఈ పుస్తకం బాగుండేటట్టుంది. ఎంత దీని ఖరీదు?"

"ఎంతైతే నేమీ?"

"ఇక్కడే వ్రాసిపెట్టేరు. ఏడున్నర రూపాయలు. అబ్బా! ఎందు కింత ఖర్చు పెట్టేవు?.... పోనీ, నీ పుట్టిన రోజెప్పుడో చెప్పు."

"అత్త నువ్వు చెన్నపట్టణం వెళ్ళకుండా ఏమిటి చెయ్యాలంటుంది?"

"ఏమిటేమిటో అంటుంది."

"నాకు తెలుసునులే."

"ఏమిటి?"

"నీకు పెళ్ళి చేసెయ్యాలనేనా?"

"అదంతా నీ కెందుకు?.... అతి ప్రసంగం మాను.... నువ్వు చెన్నపట్టణం వెళ్ళవా ఈ సంవత్సరం?"

"నాకు వెళ్లాలనే వుంది. అందులో ముఖ్యంగా నువ్వు అక్కడికి వెళ్ళేటట్టయితే."

"నా మాటకేమిలే."

"కాని. మా అమ్మ నన్ను వదలి వుండలేనంటుంది. తనతో నేను చెన్నపట్టణంలో కాపురం పెట్టడం ఒట్టిమాట. డబ్బు హెచ్చు ఖర్చవుతుంది. అదికాక మా చెల్లాయికి పెళ్లి చెయ్యాలి. అమ్మా, నేనూ కూడా చెన్నపట్టణంలో వుండిపోతే సంబంధాలు వెతకడం కష్టం. నే నీ ఊళ్ళోనే పడివుండడం నిశ్చయం..... అన్నట్టు లక్ష్మీకాంతం అని నా స్నేహితుడొకడు చెన్నపట్టణం వెళ్తున్నాడు. నా బ్రతుకిక్కడే."

"మీ చెల్లికి అప్పుడే పెళ్లా?"

"పన్నెండేళ్ళు నిండుతున్నాయి. దానికి చదువుకోవాలనీ లేదు. మాకూ అంతగా చదువు చెప్పించే శక్తీ లేదు. నాన్న పోయి ఆరేళ్ళయిందప్పుడే."

"ఇంత డబ్బుపెట్టి యీ పుస్తకం ఎందుకు కొన్నావు, చిట్టిశాస్త్రీ?"

"నువ్వు నవ్వనంటే ఒక సంగతి చెప్తాను."

"ఏమిటి?"

"ఆరునెలల బట్టి నా చిల్లర ఖర్చుల కిచ్చే డబ్బులన్నీ కూడబెట్టి కొనగలిగేను.... పద్మినీ, ఎవరితోనూ చెప్పకు."

"నువ్వు చాలా తమాషా మనిషివి సుమా.... ఈ పుస్తకంమాట అమ్మకి తెలియకుండా ఎలా దాచగలను? అమ్మకి తెలియకుండా నే నేమీ ఇంతవరకు చెయ్యలేదు."

"చూపిస్తే మరేమీ లేదు. నాకు సిగ్గుగా వుంటుంది. అదిగాక అత్తకి కొంత కోపం వస్తుందేమో అని కూడా భయం."

"చూపించను లే, దాచేస్తాను. కాని, నీ పుట్టినరోజు ఏదో చెప్పు. నీకు మట్టుకు నే నేదైనా యివ్వవద్దూ?"

"నాకేమీ అక్కరలేదు, పద్మినీ."

"చెప్పు! నేను కూడా నీ కొక పుస్తకం కొనివ్వనా? లేకపోతే మరొక టేమైనా కావాలా?"

"నా కేమీ వద్దు. నన్ను నువ్వు మరచిపోకుండా వుంటే చాలు."

"చాలా విచిత్రంగా మాట్లాడుతున్నా వీవాళ నువ్వు. నిన్నెందుకు మరచిపోతాను నేను?"

"నువ్వు చెన్నపట్టణం వెళ్ళిపోతున్నా వంటే నాకు చాలా దుఃఖంగా వుంది. పద్మినీ. ఏడాదిలో ఎప్పుడో కాని నిన్ను నేను కలుసుకోడం ఉండదు.... సరే, కొంతకాలానికి నీకు పెళ్ళి కూడా అయిపోతుంది. ఆ తర్వాత నిన్ను చూడడమే దుర్లభం అవుతుంది."

"పెళ్ళి పెళ్ళంటా వెందుకు? దాని గురించి నువ్వు మాట్లాడకు.... నీ కేమి కావాలో నిజంగా చెప్పు. నే నిస్తాను. పుట్టినరోజుకే అని కాదులే! ఏమిటి కావాలి?"

"నాకేమీ తోచడం లేదు. చెన్నపట్టణం వెళ్ళేటట్టయితే ఎప్పుడు బయలుదేరుతావు?"

"బయలుదేరితే రెండు మూడు రోజులలో బయలుదేరాలి."

"నా స్నేహితుడు లక్ష్మీకాంతం ఎల్లుండి బయలు దేరుతున్నాడు."

"చెప్పు నీ కేమికావాలో.... పోనీ ఈ జేబురుమాలివ్వనా, అంతకీ నగిషీ చెయ్యడం అయాక."

"నీకోసం కుట్టుకుంటున్నా నన్నావు?"

"పరవాలేదులే. నిన్ననే మొదలు పెట్టేను ఏమీతోచక. ఒకవైపు సగం కూడా కాలేదు. ఇంకా మూడు వైపులు నగిషీ పని చెయ్యాలి.... అయితే ఈ జేబురుమాలు పుచ్చుకుంటావా?"

"నీ ఇష్టం."

"నా ఇష్టం అని కాదు. మరేదైనా కావాలంటే కూడా కొని ఇస్తాను. నాదగ్గర పదిహేను రూపాయిలు దాకా వున్నాయి."

"ఈ జేబురుమాలే కావాలి."

"సరే. నేను చెన్నపట్టణం వెళ్తేమట్టుకు ఏ శలవలకైనా నే నిక్కడకి వచ్చినప్పుడే నీ కివ్వగలను."

"అసలు నాకేమీ అక్కరలేదు, పద్మినీ."

"ఊరుకో... ఏమిటంటే, చెన్నపట్టణం వెళ్ళేటట్టయితే బయలు దేరేముందు దీనిని నేను పూర్తి చెయ్యలేను. అదిగాక ఈ నగిషీపనంతా చాలా చికాకైనపని. నాకు సామాన్యంగా ఇటువంటి పనులకి తగినంత ఓపిక కూడా లేదు."

"నువ్వు జేబురుమాలు కుట్టి నాకిస్తానంటేనే నా కెంతో సంతోషంగా వుంది. వేరే కుట్టి ఇవ్వనవసరంలేదు... నిజంగా, నేనంటే నీకు కొంచెమైనా అభిమానం ఉందా, పద్మినీ?"

"ఏమిటి, ఈవాళ నాతో ఇంత విచిత్రంగా ప్రవర్తిస్తున్నావు?... నా మేనత్త కొడుకువైనప్పుడు నీ మీద అభిమానం ఉండకేం చేస్తుంది?"

"మేనత్త కొడుకు నవడం వల్లనేనా నీ అభిమానం అంతా?"

"అదే కాదు, చిట్టిశాస్త్రీ! నువ్వు ప్రత్యేకంగా కూడా నచ్చావు? సావిత్రత్త కొడుకు లక్ష్మీనారాయణ కూడా నాకు మేనత్తకొడుకే అయినప్పటికీ అతనంటే నా కంత అభిమానం లేదు."

"వాడు, సరే, ఒట్టి పోకిరీ వెధవ. వాడికంటె నే నంటేనే నీకు ఎక్కువ అభిమానం అని నన్ను సంతోషించమంటావా?"

"నా కిదేమీ బోధపడడం లేదు. కాని నువ్వు చాలా మంచివాడవని నాకు తెలుసును. నా పుట్టిన రోజుకు ఇది కొని నాకివ్వాలని నీ కెందుకు బుద్ధిపుట్టిందీ?..... చిట్టిశాస్త్రీ, నిజంగా నువ్వంటే నాకు చాలా అభిమానం, నిజంగా. ఈ జేబురుమాలు నగిషీ అంతా పూర్తికాగానే నీకిస్తాను, ఏమి?.... ఈ పుస్తకం దాచేస్తానులే. భయపడకు.

## 2

రెండేళ్ళ తర్వాత:

"ఈ కుట్టుపను లంటే మీకు చాలా సరదాయేనా?"

"సరదాయేనండీ. కాని చాలాకాలం బట్టి ఏమీ చెయ్యడం లేదు. నిన్ననే మొదలు పెట్టేను, ఏమీ తోచక. నా కంత ఓపిక లేదండీ. మీరే మీ ఓపికతో ఆడజన్మ ఎత్తుంటే ఇటువంటి కుట్టుపనులూ! నగిషీ పనులూ, ఎన్నో చేసుందురు."

"రమారమి రెండు సంవత్సరాలు మనం ఒకే కళాశాలలో ఒకే తరగతిలో వున్నాం కదా, ఇంకా మీరు నన్ను "మీరూ మీరూ" అనడం న్యాయమేనా? 'లక్ష్మీకాంతం' అంటూ ఉండండి."

"లక్ష్మీకాంతం గారూ' అంటే నాకు నచ్చడం లేదు."

"నన్ను మీరు 'మీరూ' అనడంలేదూ?" అలాగే.

"మీ విషయంలో వేరు. మీరు ఆడవారు. మర్యాద చెయ్యవలసిన బాధ్యత నాకుంది."

"స్త్రీ పురుషులు సమానులనే రోజులు కదా ఇవి, నాకు మట్టుకు మర్యాదలెందుకు? అదికాక నా పేరుకొక తోక పెట్టి 'పద్మినీ గారూ' అన్నా, 'పద్మినీదేవి గారూ' అన్నా వినడానికి చాలా అసహ్యంగా ఉంటుంది. సాధారణంగా 'పద్మినీ' అంటే, ఆ పేరులో అందం ఉంది. ఒప్పుకుంటారా?"

"పేరులో మాత్రమే కాదు."

"మీ రిలా కొంటెతనపు మాటలాడడం నా కిష్టం లేదు. ఎవరైనా వింటే బాగుండదు. అనేకమంది ఇలా వస్తూ పోతూ వుంటారు. అదీకాక ఆ మూల కూర్చున్న పిల్ల మన మాటలన్నీ వింటోందని నా అనుమానం... వద్దు, వెనక్కి తిరిగి చూడకండి. నెమ్మదిగా మాట్లాడండి.

"నా కింకా మర్యాదలు చెయ్యడం మాననంటారు?"

"ఈరోజు ఈ విధంగా గడవనివ్వండి."

"సరేలెండి. ఈ సాయంత్రం ఇక్కడికి నన్ను రమ్మని మీరు కళాశాలలో చెప్తే ఏదో ప్రత్యేకమైన కారణం ఉందనుకొన్నాను."

"ఏమీ లేదండీ, నా కేమీ తోచడం లేదిక్కడ... అదీకాక నిన్న రాత్రి బట్టీ నా మనస్సు చాలా చికాకుగా ఉంది. నిన్న సాయంత్రం నా గదిలో ఉన్న పిల్ల నాతో పోట్లాడింది. చీటికీ మాటికీ పోట్లాడుతుందా పిల్ల. కోపంలో నా చీర ఒకటి చింపేసింది."

"నిజంగా?"

"అవును. కాని నేనుమట్టుకు ఊరకునే రకం కానులెండి. తన పెట్టెలోంచి క్రొత్త చీరె ఒకటి పైకిలాగి దాన్ని నేను చింపేశాను. దానితో ఇద్దరం ఏడుస్తూ కూర్చున్నాం.... ఎందుకలా మాట్లాడకుండా చూస్తారు? ఇప్పుడిలా నవ్వుతూ చెప్తున్నాననా? తర్వాత యిద్దరం మళ్ళీ స్నేహితురాళ్ళ మయిపోయాం లెండి. ఆడవాళ్ళం అందరం చాలా విచిత్రమైన జంతువులమని ఒప్పుకుంటారా?"

"మీరు ఆవిడ ఉన్న గది వదలి వేరే గదికి వెళ్ళకూడదండీ?... కొందరి కొందరి స్వభావాలు అలాగే ఉంటాయిలెండి. ఆడవాళ్ళలోనే కాదు; మాలో కూడా. క్రిందటి సంవత్సరం నేనున్న గదిలో ఒకడుండేవాడు. వాడు కూడా.... ...."

"నిన్న రాత్రి ఆ గది వదిలెయ్యాలనే అనుకున్నాను. కాని ఇప్పుడింక వదల నక్కరలేదు... మిమ్మల్ని రమ్మని ఇక్కడ నేను చెప్పే కబుర్లు చూడండి! నా దరిద్రపు ఘోషంతా మీతో నే నెందుకు చెప్పాలి చెప్పండి!"

"అలా అనకండి. మీరు నాతో ఎంత చనువుగా వుంటే నా కంత సంతోషం..... నేను మీతో ఇంతవరకు చెప్పలేదు. మూడు నాలుగు సంవత్సరాల బట్టి రాత్రింబగళ్ళు నా ఆలోచనలు సగం మిమ్మల్ని గురించే. రాజమహేంద్రవరంలో మీరు చదువుకుంటున్న రోజులలో పురుషోత్తం మీ మాటలు చెప్తున్నప్పుడు...."

"మా చిట్టిశాస్త్రి?"

"అవునండీ, మేము అందరం 'పురుషోత్తం' అని పిలుస్తూ ఉండేవాళ్ళం లెండి. పురుషోత్తం ఏమిటేమిటో మిమ్మల్ని గురించి చెప్తున్నప్పుడు ఎప్పటికైనా మిమ్మల్ని కలుసుకోవాలనీ, మీతో మాట్లాడాలనీ నా కుండే అభిలాష ఇంతా అంతా అని చెప్ప నలవికాదు."

"నిజంగా?"

"నిజంగా. మీరు షికార్లకి వెళ్లేచోట్లకి నేను కూడా వెళ్తూ వుండేవాడిని. ఊరికా మిమ్మల్ని చూడడానికే. మీరు సినిమాకి కాని, నాటకానికి కాని వెళ్తున్నారని తెలిస్తే నేను కూడా అక్కడ తయారయే వాడిని. మిమ్మల్ని దూరాన్నుంచి చూసి సంతోషించడానికే."

"నా కారోజులలో మీరంటూ ఒక రున్నారన్న మాటే తెలియదు"

"మీకు తెలియడానికి అవకాశం ఏదీ? నా అదృష్టవశాత్తూ మనం ఇద్దరం ఒకే కళాశాలలో ఒకే తరగతిలో ఉండడం సంభవించింది. దానికి తోడు మీరు చెన్నపట్టణం వచ్చిన కొన్ని నెలలకే మీ తండ్రిగారు నేను రాజమహేంద్రవరం నుంచి ఇక్కడికి వస్తుంటే మీకు అందజేయమని నా కేవో కొన్ని వస్తువులిచ్చారు. ఆ సమయంలో నా ఆనందానికి మేరలేదు. నేనారోజున ఇక్కడికి ఆ వస్తువులు పట్టుకురావడం, మీకు కబురు పంపడం, మీరు క్రిందకి దిగిరావడం, ఆ తర్వాత మనకి జరిగిన సంభాషణా నేను ప్రాణం ఉండగా మరచిపోలేను."

"నాకూ బాగా జ్ఞాపకం ఉంది సుమండీ. మీరు వస్తారని నాకు మా నాన్న ముందర రోజునే వ్రాశాడు. ఆ సాయంత్రం మీకోసం ఎదురు చూస్తూ ఉన్నాను."

"నా కోసం కాదు. ఆ వస్తువులకోసం అనండి."

"లేదు, మీకోసం కూడా.... మీ కోసమే."

"తర్వాత మిమ్మల్ని చూడడానికి నన్ను తరచుగా మీరు రానివ్వడం మీ దయ నా అదృష్టమూను."

"మీరు నమ్ముతారో నమ్మరో కాని మీరు ప్రతిశనివారం రావడం నాకెంత అలవాటయి పోయిందంటే మీరెప్పుడైనా రాకపోతే నాకేమీ తోచదు. ఆ సాయంత్రం అంతా నాకు తలనొప్పిగా ఉంటుంది.

"నిజం చెప్తున్నారా?"

"నిజమేనండీ.... అన్నట్టు క్రిందటి వారం మీరు నాకిచ్చిన పుస్తకం చదివేసేను సుమండీ. చాలా బాగుంది."

"నేను చెప్పేను కాదండీ. చాలా బాగుంటుంది. మొన్న మొన్నటివరకూ ఆ గ్రంథ కర్త పేరు కూడా నాకు తెలియదు. మధుసూదనరావు మన తరగతిలోనే ఉన్నాడు చూడండీ...."

"ఎప్పుడూ మీ పక్కన కూర్చుంటాడు, అతనేనా?"

"అవునండీ, అతనే. చాలా తెలివైనవాడు. నేనూ అతనూ చాలా స్నేహితులంలెండి. అతను చెప్పేడు ఈ గ్రంథకర్త గురించీ ఈ గ్రంథం గురించీ."

"చాలా తెలివైనవాడా అండీ అతను?"

"అవునండీ, చాలా తెలివైనవాడు."

"తరచుగా మీరు అతనితోనే తిరుగుతూ వుంటారు కాబోలు?"

"మిమ్మల్ని చూడటానికి రాని సాయంత్రాలన్నీ అతనితోనే గడుపుతాను. చాలా చమత్కారంగా మాట్లాడుతాడులెండి."

"ఊరికా పైనుండి చూసినవాళ్ళకి అంత తెలివైనవాడిలా కనబడడే!"

"అవును. చాలా మంది అలా అన్నారు. మనిషికి అమితమైన సిగ్గు. బాగా ఎరుగున్న వాళ్ల దగ్గరకాని తెలివితేటలు తెలియపరుస్తూ ప్రవర్తించడు.... ఈవాళ నేను వస్తుంటే వేళాకోళానికి తనను కూడా మీ దగ్గరకి తీసుకువచ్చి మీతో పరిచయం కలపమన్నాడు."

"తీసుకురాలేకపోయారా?"

"తీసుకురమ్మంటారా? ఈసారి తీసుకువస్తానులెండి."

"అన్నట్టు మీరు వెళ్ళిపోయే వేళయింది. మీ పుస్తకం తెచ్చి ఇచ్చేస్తాను."

"వద్దండీ. మీ కంత నచ్చింది కనుక మీ దగ్గరే ఉంచుకోండి. బహుమానంగా ఇచ్చానను కోండి. నేను చదివేకే మీకిచ్చాను కాని...."

"బహుమానంగా యిచ్చేస్తామంటారా? అంత డబ్బుపెట్టి కొనుక్కున్నారు! నాకు చాలా నచ్చింది సుమండీ ఆ పుస్తకం, మరి దానిని నాకు మీరు బహుమానంగా యిస్తే మీకు నన్నేమిటి మ్మంటారు?"

"నాకు మీ రేమీ ఇవ్వక్కర్లేదండీ. నా మీద దయ వుంచితే చాలు."

"అలా కాదు. మీకు ఏ గ్రంథకర్త అంటే ఎక్కువ అభిలాషో చెప్పండి. నేనొకొక పుస్తకం కొని మీకిస్తాను."

"నాకు పుస్తకా లొద్దండి."

"మరేమిటిమ్మంటారు?.... పోని, నేనిప్పుడు కుట్టున్న జేబురుమాలిమ్మంటారా?"

"ఆ గుడ్డ చాలా బాగుంది సుమండి. ఏమిటండాగుడ్డ?"

"క్రీప్‌డిచైన్ అనో క్రేప్ డిషైన్ అనో అంటారండి. నిన్ననే మొదలు పెట్టేను ఏమీ తోచక. ఒకవైపు పూర్తిగా అయింది. మరొకవైపు సఖం కూడా కాలేదు. మిగిలిన రెండు వైపులూ నగిషీ పని మొదలు పెట్టనేలేదు.... ఈ జేబురుమాలు పుచ్చుకుంటారా?"

"మీ ఇష్టం."

"నా ఇష్టం అని కాదు. కావలిస్తే మరేదైనా కొని ఇస్తాను."

"ఈ జేబు రుమాలే కావాలండీ."

"అంత త్వరలో అయిపోదు సుమండీ. వెంటనే దీనిని నేను పూర్తి చెయ్యలేను. అదిగాక ఈ నగిషీ పనంతా చాలా చికాకైన పని. నే నిదివరకే అన్నాను. నాకుసామాన్యంగా ఇటువంటి పనులకి తగినంత ఓపికలేదు."

"సావకాశంగా కానివ్వండి. తొందరేమిటి? మీరు జేబురుమాలు కుట్టి నా కిస్తానంటేనే నాకెంతో సంతోషంగా ఉంది. నిజానికి వేరే కుట్టి ఇవ్వనవసరం లేదు."

"అలా అనకండి. మీరు అంత ఖరీదైన పుస్తకం కొనుక్కుని నా కిచ్చేసినందుకు నేను కృతజ్ఞత చూపించనక్కరలేదూ?"

"అంత కృతజ్ఞత కేముందండీ? మీ రేమి చెయ్యమన్నా చేసేందుకు సంసిద్ధుడనేకా?"

"అయితే వెళ్ళిపోతారా?... మళ్ళీసారి మీరు వచ్చేటప్పుడు మీ స్నేహితుడిని పిలుచుకు వస్తారుకదూ?"

"మధుసూదనరావునా? తప్పకుండా తీసుకువస్తానండీ. శలవు?

"శలవు."

## 3

మరొక రెండేళ్ళ తర్వాత :

"ఈవాళ నన్ను ప్రత్యేకంగా రమ్మని కూడా నీ కుట్టుపనే నువ్వు చేస్తూ కూర్చుంటే నిన్ను చూస్తూ ఆనందించమనా నీ వుద్దేశ్యం, పద్మినీ?"

"లేదు, మధూ. అంత కోపం తెచ్చుకోకు. ఈ పని మానెయ్యమంటే మానేస్తాను. రెండేళ్ళబట్టి ఏమీ చెయ్యడం లేదు. నిన్ననే మొదలు పెట్టేను ఏమీ తోచక..... మానెయ్యనా?"

"అది మానెయ్యక్కర్లేదు, ఏమైనా మాట్లాడు."

"ఏమిటి మాట్లాడమంటావు? నీ చిన్న చిన్న బాధలన్నీ వరుసగా చెప్పి నువ్వు చికాకు పడిపోతున్నావు కాని, నువ్వు కొద్ది రోజులలో సీమ వెళ్లిపోతానని చెప్పినప్పటి నుంచీ నే నెంత దుఃఖపడుతున్నానో నువ్వు ఆలోచించడం లేదు."

"అంత దుఃఖపడవలసిన కారణం ఏమిటి?"

"ఏమీ బోధపరచుకోలేవు కాదూ నువ్వు?... నిన్ను మళ్ళీ ఎప్పుడు చూస్తానో మధూ! తిరిగి వచ్చాక నన్ను చూస్తావో లేదో కూడా."

"చూడకేం చేస్తాను."

"ఏమో! అప్పుడు నిన్ను 'మధూ' అని పిలిచేందుకు కూడా అర్హత నా కుంటుందో లేదో. మళ్ళీ మధుసూదనరావుగా మారిపోతావేమో నువ్వు; కనబడకుండా మాయమైపోతావేమో కూడా."

"తిరిగి వచ్చేసేక మాట అలా ఉండనీ, పద్మినీ, ఆదేశాలలో నా కార్యం ఎంతవరకు సాధించగలుగుతానా?' అని బెంగ పెట్టుకున్నాను. నాకున్న ఆస్తంతా ఈ సీమ ప్రయాణం మీదా, ఈ సీమ చదువుల మీద పోస్తున్నాను. నెగ్గకపోతే చావడమే మేలు."

"అలా అనుకోకు, మధూ, నువ్వు చాలా తెలివైన వాడివి. నీకు తెలియదూ ఆమాట?"

"తెలియక కాదు. భయం. అధైర్యం.... తీరా వచ్చాక నాకు ఉద్యోగం దొరుకుతుందో దొరకదో అని యిప్పటినుంచీ బాధ."

వాటి గురించి ఇప్పటినుంచీ ఆలోచించకు మధూ.... నీ దూరబంధువు డెవడో సీమలో కలెక్టరీ పరీక్షలో ఉత్తీర్ణుడయాడని చెప్పేవు కాదూ?"

"అవును. కృష్ణశాస్త్రి అని మావాడే."

"చూడు. అటువంటి వాళ్ళ సంగతి ఆలోచించుకో."

"అసలు కృష్ణశాస్త్రే నన్ను సీమకి రమ్మని ప్రోత్సహించింది. అతని సలహా మీదనే బయలుదేరుతున్నాను. ఒక ఏడాది యింకా అతనక్కడుండాలి. నాసంగతంతా ఆలోపున చక్కబెడ్తానన్నాడు."

"ఏడా దయేవరకూ ఆయన ఈ దేశం రారన్నమాట."

"రాడు."

"రాగానే ఎంత జీతం యిస్తారో ఆయనకి?"

"నాలుగువందలో, అయిదువందలో."

"అంత డబ్బే!"

"మరేమిటనుకున్నావు?.... నా భవిష్యత్తంతా ఎలా ఉంటుందో అని భయంగా వుంది, పద్మినీ."

"భయపడకు మధూ, నీకుమట్టుకు అంత అదృష్టం పట్టదన్న మాటేమిటి?.... ఇంతకీ మధూ, నీ బాధలే ఆలోచించుకుంటున్నావు కాని, నా మాట నువ్వు తలపెట్టడమే లేదు."

"నన్నేమిటి చెయ్యమంటావు మరి? నా జీవితం అంతా ఎంత గందరగోళంగా వుందో చూడు."

"జ్ఞాపకం ఉందా నువ్వు ఆరు నెలల క్రిందట నా కిచ్చినమాట?.... మరచి పోకూడదు సుమా!"

"మరిచిపోను, పద్మిని, కాని..."

"నిన్ను మొదట చూసినప్పుడే నువ్వంటే నాకెంతో మంచి అభిప్రాయం కలిగింది. నీతో ఎక్కువ పరిచయం సంపాదించాలని నేను పన్నిన పన్నాగాలు ఇన్నీ అన్నీ కావు. "నేను చేసే పనులు లోకంలో మర్యాదస్థురాళ్ళు చేసే పనులా కావా? అని కూడా ఆలోచించుకోకుండా ప్రవర్తించాను. నన్ను మోసపుచ్చడం న్యాయంకాదు."

"నిన్ను మోసపుచ్చను.... కాని, ఈ మాత్రం నువ్వు బోధపరచుకోలేవూ? ఇప్పుడు నా చదువులే నాకు ముఖ్యం. మరే సంగతులూ ముఖ్యం కాదు..."

"నువ్వు నాకు చేసిన వాగ్దానం కూడానా?"

"అది కూడా."

"ఇలా ఎప్పుడో ఒకప్పుడు నాతో అంటావని నే నెప్పుడూ భయపడుతూనే వున్నాను."

"నీమీద నాకు ప్రేమలేక కాదు, పద్మినీ... మరి నీకు నే నెలా బోధ పరచగలను?"

"నువ్వు నన్ను మొదటిసారి చూడడానికి రావడం నీకు జ్ఞాపకం ఉందా?"

"జ్ఞాపకం లేకేమీ."

"నీ స్నేహితుడితో?"

"అవును. లక్ష్మీకాంతంతో."

"ఆ రాత్రంతా నేను నిద్రపోలేదు, తెలుసునా? నిన్ను గురించే ఆలోచిస్తూ వున్నాను."

"నేను ఆ రాత్రి చాలా సేపటివరకూ నిద్ర పోలేదు... కాని, ఆ రోజుల ప్రశంస ఇప్పుడెందుకు పద్మినీ? అప్పటికీ ఇప్పటికీ యుగాలు జరిగిపోయినట్టు అనిపిస్తుంది నాకు."

"ఏడాది పైన పది నెలలు కూడా కాలేదు!... ... నువ్వు నాతో ఇంత నిర్లక్ష్యంగా మాట్లాడినప్పుడు నాకు ఏడుపు పర్యంతం వస్తుంది.... మధూ. ఆ దేశాలలో ఆడవాళ్ళతో స్నేహం చెయ్యనని వాగ్దానం చెయ్యవూ?"

"ముసలివాళ్ళయినా? కూడానా!"

"ముసలివాళ్ళయినా కూడా?"

"సరే, వాగ్దానం చేసేను. ఇంకా ఏమిటి వాగ్దానం చెయ్యమంటావు చెప్పు."

"ఎంత వేళాకోళంగా ఉంది నీ కిదంతా!.... మధూ, నువ్వు నన్ను మరచిపోతే నాజీవితంలో సగం ఆనందం చచ్చిపోతుంది. నువ్వు తప్పకుండా నన్ను మరచిపోతావని నాకు తెలుసును."

"నా జ్ఞాపకశక్తి అంత తృణీకరించవలసినది కాదు... నిన్ను మరచిపోను పద్మినీ, ఎలా మరచిపోగలను?"

"నన్ను ఓదార్చడానికి అంటున్న మాటలవి. నిజంగా నీకు నే నింక అవసరం లేదు. నీ చదువులూ, నీ భవిష్యత్తూ నీకు ఎక్కువ ముఖ్యం అయిపోయాయి. ఒకానొక కాలంలో నా అవస్థ అంత అన్యాయంగా ఉండేది కాదు, వాటన్నిటికంటే నేనే ఎక్కువ ముఖ్యంగా వుండేదానని."

"ఇప్పుడూ నువ్వే నాకు ఎక్కువ ముఖ్యం, పద్మినీ, కాని ఈ ప్రత్యేక సమయంలో నేను నా స్వంత విషయాల గురించి బెంగపెట్టుకోడం అసందర్భం అంటావా? ఇప్పుడు కాకపోతే ఎప్పుడు వాటిని గురించి ఆలోచించడం?"

"కాని నా మాటే ఆలోచించడం లేదు నువ్వు."

"మూడు వారాల క్రింద నీ పుట్టినరోజుకి నేను పంపిన పుస్తకం అందిందా?"

"అన్నట్టు దాని మాటే చెప్పడం మరచిపోయాను! అందింది, మధూ. పుస్తకం చాలా బాగుంది. అప్పుడే రెండుసార్లు చదివేను.... ఈవాళ నువ్వురాగానే చెప్దాం అనుకుంటూ గూడా మరచిపోయాను, క్షమించు మధూ."

"చూసేవా మరి! నేను నిన్ను మరచిపోతున్నానో. నువ్వు నన్ను మరచిపోతున్నావో తెలుసుకోడానికి ఇదే రుజువు".

"నువ్వు నీ మాటల ధోరణిలో పడేసరికి వింటూ నా మాట మరచిపోయాను... అవును, నాదే తప్పు."

"ఎప్పటికీ నిన్ను పూర్తిగా మరచిపోలేనని ఇప్పుడైనా ఒప్పుకుంటావా?"

"పూర్తిగా మరచిపోవులే.... ఇదే మొదటిసారి నా పుట్టినరోజుకి నువ్వు బహుమానం ఇవ్వడం. ఇదే ఆఖరిసారి కూడా అనుకుంటాను. అంతేనా?"

"ఓపికపట్టి చూడు. ఇప్పటినుంచీ ఆశలూ, అనుమానాలూ ఎందుకు?"

"ఎంత అడిగినా నీ పుట్టినరోజు ఏదో నువ్వు నాకు చెప్పలేదు. మధూ."

"ఎందుకూ?"

"నాకు మట్టుకు ఆరోజున నీ కేదైనా ఇవ్వాలని ఉండదూ?"

"నేను నీ కిచ్చేను కనుక నువ్వు కూడా నా కివ్వాలా?"

"అంతేకాదు కారణం.... నీ పుట్టిన రోజు ఏదో చెప్పు."

"చెప్పను."

"ఈ చిన్న చిన్న విషయాలలో చాలా క్రూరత్వం చూపిస్తావు నువ్వు... ... చెప్పు."

"అసలు సంగతి, నాకే తెలియదు పద్మినీ. మారుమూలని పల్లెటూరులో పుట్టేను. అక్కడ వాళ్ళకు తిథులు తెలుసు కాని తేదీలు తెలియవు. నేను కూడా అంత పట్టుదలగా తెలుసు కుందామని ప్రయత్నం చెయ్యలేదు. తప్పురోజు ఏదైనా చెప్పమంటే చెప్పగలను... పుట్టేము చాలదూ? ఏ రోజో కూడా ఎందుకు జ్ఞాపకం వుంచుకోడం?"

"పోనీ, అటువంటి కారణం లేకుండానే నీకేదైనా బహుమానం ఇస్తాను. నీకేమి కావాలో చెప్పు.

"సరే, నువ్వు కుడుతున్న జేబురుమాలు కావాలి. నగిషీలన్నీ చేసేక కుట్టడం పూర్తయాక నా కియ్యి."

"ఇది నీకు నచ్చిందా?"

"గుడ్డ చాలా బాగుంది. ఏమిటి దాని పేరు?"

"క్రేప్ డిచైన్ అనో, క్రేప్ డిషైన్ అనో అంటారు. నిన్ననే మళ్ళీ మొదలు పెట్టేను. ఏమీ తోచక రెండు వైపులు పూర్తిగా అయాయి. మూడవవైపు నగిషీ సఖం కూడా కాలేదు. ఇంకా ఆఖరివైపు పని మొదలు పెట్టాలి... నిజంగా ఈ జేబు రుమాలే కావాలంటావా?"

"నువ్వు మరొకరికోసం కుడుతుంటే తప్ప."

"ఎవరికీ కాదు. మొదలిపెట్టినప్పుడు నువ్వు పుచ్చుకుంటావేమో చూద్దామన్న ఆశతోనే మొదలు పెట్టేను... ... వెంటనే దీనిని పూర్తి చేస్తానని మాటివ్వలేను సుమా. ఈ నగిషీ పనంతా చాలా చికాకైన పని. నాకు సామాన్యంగా ఇటువంటి పనులకి తగినంత ఓపిక కూడా లేదు."

"పోనీ, నేను సీమకి బయలుదేరే లోపుగా తయారవుతుందంటావా?"

"మూడొంతులు తయారవుతుంది. లేకపోతే, నువ్వు అక్కడికి వెళ్లేక పంపిస్తాను....

సీమలో ఉన్నంతకాలం ఈ జేబురుమాలు ఎప్పుడూ నీ కోటు పై జేబులో పెట్టుకు తిరుగుతానని నాకు వాగ్దానం చెయ్యి, మధూ.”

“మరి దాన్ని చాకలివాడికి వేసిన రోజులలోనో?”

“నేనంటే నీకు పరమవేళాకోళం కదా!”

“లేదు, పద్మినీ, ఎప్పుడూ పెట్టుకుంటాను.... అసలు నువ్వుపంపించడం అంటూ వుంటే! నా కిస్తాననడమే చాలు, పంపించినా పంపించకపోయినా!”

“పంప కేంచేస్తాను?... వెళ్తావా అయితే?”

“వెళ్తాను. మళ్ళీ ఒకసారి సీమకి బయలుదేరేముందు వస్తాను.”

“సీమమాట చెప్పకు, మధూ.”

## 4

మరొక రెండేండ్ల తర్వాత :

“ఓహో, పెళ్ళి కూతురుగారు ఈ మూల కూర్చుని ఏదో కుట్టుకుంటున్నారా?”

“పెళ్ళయిపోయి వారం రోజులయినా కూడా ఇంకా పెళ్ళికూతురునేనా?”

“నిన్ను ఏమని పిలవాలో నా కింకా తెలియడం లేదు. ఈ దేశంలో పెళ్ళాలని పిలవడం గొప్ప చిక్కు ‘పద్మినీ’ అని పిలుద్దాం అంటే అందరూ నిన్ను ఆ పేరు పెట్టే పిలుస్తారు. నా ప్రత్యేక భావాలకి ఆ పేరు పనికిరాదు. పాశ్చాత్య పద్ధతులు అవలంబించి ‘ప్రేయసీ’ అని కాని ‘ప్రియురాలా’ అని పిలవాలంటే నా సిగ్గుమాట అటుండగా అటువంటి పలుకరింపులు వింటే కొందరికి పొట్టబద్దలయ్యేటట్టు నవ్వు రావచ్చును, మరి కొందరికి గుండె బద్దలయ్యేటట్టు ఏడుపు రావచ్చును! ఏమంటావు?”

“ఈ నవ్వులూ ఈ ఏడుపులూ ఎందుకు తెచ్చిపెట్టుకోవడం? మానెయ్యండి.”

“నన్ను ‘మీరూ’ అని కాని వేరే విధంగా పిలవనంటావు?”

“ఏమని పిలవమంటారో చెప్పండి.”

“నువ్వూ, అని పలుకరిస్తే తప్పేమిటి?”

“నాకు తెలియదు.”

“మిగిలిన వాళ్ళున్నప్పుడు ‘మీరూ, మీరూ’ అని అంటే అన్నావు కాని మనం ఇద్దరమే వున్నప్పుడైనా మరొకలా పిలువకూడదూ?”

“ఒకప్పుడు ఒకలా పిలిచి మరొకప్పుడు మరొకలా పిలవడం నాకు చేతకాదు కొంపతీసి పొరపాటున మనిద్దరమే ఉన్నప్పుడు ‘మీరూ’ అని పిలిచి మిగిలిన వాళ్ళున్నప్పుడు మరొకలా పిలుస్తానేమో!”

"అలా అయినా పరవాలేదు.... నిజంగా చూడు. పిలిస్తే 'కృష్ణా' అని పిలువవచ్చును. లేకపోతే 'శాస్త్రీ' అని పిలువవచ్చును. సులభంగా ఉచ్చరింపదగినవి రెండు చిన్న పేర్లు నా కున్నా గూడా వాటిని నువ్వు ఉపయోగించకుండా ఉండడం మంచిపనికాదు."

"మీరు పట్టుకున్న ఉత్తరం ఎవరిదగ్గర నుంచి?... లేకపోతే నేను అడుగకూడదా?"

"నీకు చూపించాలనే తీసుకువచ్చాను. నాకు మధు సూదనరావని ఒక దూర బంధువు దున్నాడు. ఇప్పుడు సీమలో వున్నాడు. పాపం, ఈ మధ్యనే అతని పరీక్ష పోయింది. కొన్ని వారాల క్రిందట అతనికి మన పెళ్ళిని గురించి వ్రాశాను."

"దానికి జవాబిది.... కళాశాలలో వుండగా నిన్ను ఎరుగుదునని వ్రాస్తాడేమిటి?"

"ఏదీ, ఇలా ఇవ్వండీ.... ఆయన పేరు?"

"మధుసూదనరావు."

"మధుసూదనరావా?.... అవునవును, పట్టపరీక్షకి చదువుతున్నప్పుడు నా తరగతి లోనే వుండేవాడు."

"పాపం, చాలా కష్టాలలో వున్నాడిప్పుడు, ఇంకా సీమలో ఉండి చదివేందుకు నన్ను సహాయం చేసి పెట్టమంటాడు. నే నేమీ చెయ్యలేను."

"ఆ రోజులలో చాలా తెలివైనవాడని పేరు సంపాదించా డాయన."

"తెలివైనవాడే. అయితేనేమి?... అక్కడికి వెళ్ళేక చదువులు కూడా కొంత సన్నగిల్లేయనే నా అనుమానం. రాత్రింపొగళ్ళు చదివితే కాని ఏమీ రాదు. నే నీ ఉద్యోగంలో యిప్పుడున్నానూ అంటే, ఎంత కష్టపడితే నాకు లభించింది. అది గ్రహించరు చాలా మంది."

"ఆయన ధన వ్యయం, చదువులూ, అన్నీ వృధా అన్నమాటే?"

"వృధాయే."

"పాపం."

"రేపు రాత్రికి నా స్నేహితుడు సంజీవరావు మనిద్దరినీ భోజనానికి పిలిచాడు. ఇంకా ఎవరెవరినో కూడా పిలుస్తున్నానని చెప్పేడు. అతని భార్య నీతో వచ్చి చెప్పిందా?"

"చెప్పింది."

"ఆవిడ నీ కెలా నచ్చింది?"

"నాకు నచ్చలేదు సుమండీ."

"ఏమీ?"

"ఆవిడ షోకులు చూస్తే నాకు అసహ్యం. ఏమిటో తిప్పుకుంటూ నడుస్తుంది. వికారంగా

మాట్లాడుతుంది. లోకం అంతా తనకేసే చూస్తోందన్నట్టూ, లోకం అంతా తనకేసి చూడాలన్నట్టూ ప్రవర్తిస్తుంది. నాకు నచ్చ దా మనిషి."

"నీ కింకా ఎవ రెవరిదగ్గర ఎలా ఉండాలో తెలియదు కాని, తెలిసేక ఆవిడని చూసి చాలా ఆనందిస్తావు. చాలా మంచి దావిడ. కొన్ని రోజులు పోయాక నువ్వే కనిపెట్తావు. ఊరికా సిగ్గుపడిపోయి అందరివెనకా గోడకి జార్లబడి నుంచుంటే ఏమిలాభం? అందరితోనూ కలిసి మెలసి తిరిగి ఎవరితో యెలా మాట్లాడాలో అలా మాట్లాడుతూ ఉండాలి. నువ్వింకా నేర్చుకోవాలీ పద్ధతులన్నీ."

"నా కేమీ అక్కరలే దా పద్ధతులు."

"అక్కరలేదంటే ఎలాగ? ఆవిడతో స్నేహం చేసి ఈ విషయాలన్నిటిలోనూ తరిఫీ జవుతావేమో నని ఆశపడుతున్నాను నేను."

"నే నేమీ ఆవిడదగ్గర నేర్చుకో దలచుకోలేదు."

"నేర్చుకోకపోతే వీలులేదు. ఊరికా చదువుకున్న దానవై యున్నంత మాత్రాన చాలదు. ఈ చిన్న చిన్న చమత్కార చేష్టలలోనే మనిషి రాణించడం, రాణించక పోవడం బయలుపడుతుంది. తంటాలు పడి శ్రద్ధగా నేర్చుకుంటేనే కాని, ఈ చేష్టలు పట్టుబడవు. రాను రాను వాటి ఉపయోగం నువ్వే గ్రహిస్తావు."

"ఉన్న దానిని ఉన్నట్టుగా నచ్చకపోయాక....."

"నువ్వు నచ్చలేదని కాదు."

"మరి మీరంటున్న మాట లన్నిటికీ అర్థం ఏమిటి? నాకంటె ఆవిడ మీకు ఎక్కువ నచ్చిందన్న మాట కాదూ?"

"అదేమన్నమాట! ఆవిడ దగ్గర నువ్వు తరఫీజయాక ఆవిడ తలతన్ని నువ్వే పైకొస్తావు.... రేపు భోజనానికి వెళ్ళేటప్పుడు మంచి రంగు పట్టుచీరె కట్టుకో. చాలా షోకుగా తయారవాలి నువ్వు."

"ఏ రంగులు మంచివో, ఏ చీరెలు మంచివో నాకు తెలియదు. నా పెట్టె తీసి మీరే స్థిరపరచండి."

"నీకు చీరె కూడా నన్నే కట్టమంటావు కాబోలు!"

"పెంకితనం!.... అవును మరి, అందంగా చీరె కట్టుకోవడం నాకు తెలియదని నిశ్చయించుకు అది గూడా మీరే కట్టానంటే, దానికీ నేను ఒప్పుకోవలసినదేగా?"

"నువ్వు కుట్టున్నదేమిటి?"

"కనబడడం లేదూ? జేబురుమాలు."

"నాకే కాదూ?"

"కాదంటేనో."

"కాకుండా ఎలా ఉంటుంది? ఏమిటా గుడ్డ? తమాషాగా వుంది."

"క్రీప్ డిచైన్ అనో క్రేప్ డిషైన్ అనో అంటారూ? అది."

"ఏమీ, ఆ పేరు క్రీప్ డిషైన్ కాగూడదా క్రేప్ డిచైన్ కాగూడదా?"

"ఏమో, ఆ దేశాలన్నీ తిరిగి వచ్చిన వారు మీకే తెలియాలి."

"నాకూ తెలియదులే!... నీ కీ కుట్టుపనులన్నా నగిషీ పనులన్నా చాలా సరదాయేనా?"

"సరదాయే. ఈ మధ్య చాలా రోజుల బట్టి ఏమీ చెయ్యడం లేదు కాని...."

"అవును మరి, ఈ మధ్యని నీకు వేళెక్కడుంది?"

"ఛీ, ఊరుకోండి.... నిన్ననే మొదలుపెట్టేను. ఏమీ తోచక."

"ఈ నగిషీ పనంతా ఇంత పట్టి పట్టి చేసేందుకు నీకు ఓపిక కూడా వుంది?"

"నిజానికి ఓపిక లేదు. చాలా చికాకైన పనిది. కొందరు ఒకపని తలపెత్తే అది ముగించే వరకూ నిద్రపోరు. నే నా రకం కాదు. జరిగినంత వరకు జరగనివ్వమని బద్ధకిస్తూ ఉంటాను. ఒక పని మొదలుపెట్టేక పూర్తి చెయ్యకుండా ఏళ్ళ తరబడి ఊరుకుంటాను."

"అలా ఉంటే వీలు లేదు మరి. ఏది, చూడనియ్యి ఎంతవరకూ అయిందో."

"మూడు వైపులు పూర్తిగా అయాయి. నాల్గవ వైపు నగిషీ రమారమి సగం పూర్తి అయింది."

"ఎప్పుడు మొదలుపెట్టే విది?"

"నిన్ననే..... అంటే, ఆ మధ్యని కాస్త పనిచేసి అలా పెట్టెలో పడేసి ఊరుకున్నాను. నిన్ననే మళ్ళీ పైకి తీసేను."

"అలా చెప్పు! అందుకే గుడ్డ మాసిపోయినట్టుగా ఉంది."

"అది మాయడం కాదు. గుడ్డ రంగే అంత."

"ఎప్పటికి పూర్తి చేస్తావిది?"

"ఎప్పటికైతే మీ కెందుకు? మీకే కుట్టిపెటుతున్నానని మీ కంత ధైర్యం ఏమిటి?"

"నాకు కాకపోతే మరెవరి కంటావు?"

"నా కోసమే కాకూడదూ?"

"నీకు ఇలాంటి జేబురుమాలెందుకూ?....ఆ మాటలన్నీ మాను. నే నడగగానే నా కోసమే అని వెంటనే అంటే ఎంత అందంగా ఉండునో ఆలోచించు."

"మీకేనండీ. మీకు కాకపోతే మరెవరికి? ఇంతసేపూ వేళాకోళంగా మాట్లాడుతున్నాను.

అంత తెలివైనవారు, ఆ మాత్రం బోధపరచుకో లేకపోతే ఎలాగ?.... అయితే దీనిని మీకు నేను బహుమానంగా ఇస్తే నాకు మీ రేమి బహుమానం ఇస్తారు?"

"నీకు నేను మొగుడి నవడమే బహుమానం. వేరే బహుమానా లెందుకు?.... రేపు సాయంత్రానికి నువ్వు ఆ నగిషీ పనంతా పూర్తి చేసెయ్యాలి. సంజీవరావు ఇంటికి మనం భోజనానికి వెళ్లినప్పుడు ఆ రుమాలు నా జేబులో ఉండాలి.... జేబురుమాలుకి ఒక మూలన నా పేరు గూడా నగిషీలో వేస్తే బాగుంటుందేమో. తగినంత వేళ లేదంటావా? పోనీ, ఆ పని తర్వాత చెయ్యవచ్చునులే."


"రేపు రాత్రి మీతో నాకు రావాలని లేదండీ."

"మళ్ళీ మొదలు పెట్టకు. రేపు నువ్వు రాక తప్పదు. ఆ జేబురుమాలు గురించి బద్ధకించకు సుమా. తప్పకుండా తయారుగా ఉండాలి. రేపు రాత్రి వాళ్ళందరి మధ్యా దానిని పైకి తీసి చూపించి ఈ నగిషీ పనంతా ప్రత్యేకంగా నా కోసం నువ్వు కష్టపడి చేసేవని వాళ్ళందరి తోటీ చెప్పొద్దు మరీ?.... ఏమంటావు?"



# శ్రీరంగం శ్రీనివాసరావు

**(1910 – 1983)**



**క**లలో దర్శించిన మరో ప్రపంచాన్ని ఇలలో సాక్షాత్కరింపజేయాలనే దీక్షతో కవితా తపస్స నిర్వహిస్తోన్న ఋషి. కాల్పనిక జగత్తుకి సంబంధించిన భావకవిత్వం నుండి ప్రజల దృష్టిని వ్యథార్త జీవుల యథార్థ దృశ్యాలవైపు మళ్ళించటానికి కలం పట్టారు. అపార మానత్వం శ్రీశ్రీ రచనల్లో అంతర్వాహిని. కనుసన్నలలో మెలగుతూ పిలిచినంతనే శబ్దపరంపర వీరికి ఊడిగం చేయటానికి కదం తొక్కుతూ వస్తుంది.

**రచనలు :** మహాప్రస్థానం (కావ్యం) వారం వారం, (వ్యాసాలు - కథలూ) మూడు యాభైలు (గేయాలు) 1 + 1 = 1 (నాటికలు)

# చరమరాత్రి
(కథానిక)

**(నరకం, భూమి, స్వర్గం అనే మూడు కాలాలలో ఆలాపన)**

**రా**త్రి పదకొండు గంటలయింది. ఇంకొక గంట. ఇంకొక్క అరవై నిమిషాలు. సరిగ్గా పన్నెండు కాగానే చచ్చిపోదల్చుకున్నాను. అన్నీ ఆలోచించుకున్నాను. ఇప్పుడా? ఆరు నెలల నుంచీ నా కిదే ఆలోచన. ఆరు నెలల నుంచీ సిద్ధమౌతున్నాను. ఇప్పటిదా ఈ నిశ్చయం? ఆరు నెలల కిందటే తెగించాను. అప్పటినుంచీ నా కిదే ఆలోచన. నిశ్చయాన్ని మార్చుకుందామని కాదు. ఆరు నెలలు అహోరాత్రాలు జాగ్రత్సుషుప్తులలో ఎడతెగని యోచనా తరంగాలలో నా నిశ్చయాన్ని స్నానం చేయించాను. ఆరు నెలల అవభృథ స్నానంలో పవిత్రీకృతమైన, నా అందమైన, నా ఆడుకునే, నా తిరుగులేని, భయంకరమైన సంకల్పాన్ని ఈ రాత్రి ఆచరణలో పెడుతున్నాను.

ఈ రాత్రి నా ఆత్మహత్యా మహోత్సవం. ఇది ఆహ్వానపత్రిక కాదు. ఈ ప్రదర్శనకి ప్రేక్షకులు అనవసరం. ఇది నా సొంత వ్యవహారం. ఇతరులు లోనికి రాకూడదు.

మరణించాలని నిశ్చయించుకున్నాను. సరిగ్గా ఈ రాత్రి పన్నెండు గంటలకి చచ్చిపోవాలని సంకల్పించుకున్నాను. "ఈ రాత్రి పన్నెండు కాగానే. ఈ రాత్రే ఎంచేత? పన్నెండుకే ఎందువల్ల? అసలు చచ్చిపోవడం ఎందుకు? చచ్చిపోతూన్న ఓ వ్యక్తీ! నువ్వెవ్వరు?"

నే నెవరు? అనవసరం. ఐతే ఈ రాత కూడా అనవసరమే! పోనీ, నే నెవరో చెప్పనా? ఎవరికి చెప్పను? ఎందుకీ రాత? అదే, ఈ రచన ఎందుకో, ఎవరికో తేల్చుకుందామనే చచ్చిపోతున్నాను. ఆరు నెలలుగా చచ్చిపోతున్నాను. ప్రతీదినం ఆధ్యాత్మికంగా చచ్చిపోయాను. ఈ రాత్రి భౌతికంగా, త్వరలో నేను చెయ్యబోయే ఆఖరు అభినయం. నా వాక్యానికి ఫుల్‌స్టాప్. నా కావ్యానికి పరిసమాప్తి.

జీవితాన్ని అర్థం చేసుకోవడానికి జీవించడమే అవసరం అనే సునాయాసపు సూత్రం నిరాకరించి మరణం ఇందుకు నా మార్గంగా యెంచుకున్నాను. ఇది ఎవరికీ బోధపడదు. ఎవరికీ బోధపరచలేనని కూడా నే నెరుగుదును. అయినా, నా ఈక్వేషన్ కిదే సొల్యూషన్.

అదే పొరపాటు. నేనొక రచయితననీ, రాతలో ప్రకాశించలేక చచ్చిపోతున్నాననీ అనుకోవద్దు. ఈ చేతులతో నా ఎనిమిదివందల పేజీల నవలని దగ్ధం చేశాను. నాకు రాత చేతకాదని ఎవరూ అనరు. నే నసలే అనుకోలేదు. కీర్తిదాహం తీరక పోవడం నా ఆత్మహత్యకి కారణం కాదు. ప్రేమలో పరాజయం కారణం కాదు. ధనాభావం అంతకన్నా కారణం కాదు.

ఎంచేతనంటే! మా నాన్నకి బోలెడంత ఆస్తి ఉంది. పెద్ద ఉద్యోగం చేస్తున్నాడు. రెండు చేతులా ఆర్జిస్తున్నాడు. (లంచాలంటావా? అనుకో) నేను ప్రేమించిన స్త్రీ నన్ను అంగీకరించింది. మా వివాహం విషయంలో మా తల్లిదండ్రులు మాకు సంపూర్ణ స్వాతంత్ర్యం ఇచ్చారు. నన్ను ప్రేమిస్తున్న అమ్మాయికి అందమూ, చదువూ, డబ్బూ, తెలివీ ఉన్నాయి. జీవించాలనుకుంటే రేపే ఆమెని పెళ్ళి చేసుకోగలను. నా వయస్సు 24 ఏళ్లు. నా బదుకంతా ముందే వుందని నా కెవరూ చెప్పనక్కరలేదు. నాకే కీర్తి కావలిస్తే నా నవల ప్రకటించి ఉందును. నేను రచయితనే కాదు. చిత్రకారుణ్ణి. నా చిత్రాలు ప్రదర్శించి ఉందును. (వాటిని కూడా నాశనం చేశాను. కాని అంతకన్నా మంచివి చిత్రించగలను) నేను చిత్రకారుణ్ణి మాత్రమే కాదు. నాకు సంగీతం కూడా వచ్చును. వయోలిన్ వాయిస్తాను. క్రికెట్, టెన్నిస్, ఫుట్‌బాల్ ఆడతాను. నాకు మానవమాత్రుడు కోరుకోదగ్గవన్నీ ఉన్నాయి. నన్ను తెలిసినవారంతా నాకేమీ లోపం లేదంటారు.

నేను మెడికల్ కాలేజీలో చదువుకుంటున్నాను.

ఈ వివరాలన్నీ అనవసరం. సరదాగా చదువుకోడానికి కథ రాయడం లేదు నేను. పన్నెండు గంటలకోసం కాచుక్కూచున్నాను. ఈ లోపున ఏం చెయ్యడానికీ తోచక ఇది రాస్తున్నాను. ఆరునెలల నా ఆలోచనల సారాంశం రాస్తున్నాను. ఇది ఎవరిచేతిలో పడ్డా ఇబ్బంది లేదు. బహుశా పదకొండు గంటల యాభై తొమ్మిది నిమిషాలకి ఈ రాసినదంతా ఈ వెలుగుతున్న కొవ్వొత్తికి అప్పగిస్తానేమో. ఈ రోజే మా నాన్న పంపించిన రెండువందల రూపాయలు ఈ కొవ్వొత్తికే ఇచ్చివేసినవాణ్ణి కానూ నేను!

విద్యుద్దీపాలున్న ఈ గదిలో ఒక కొవ్వొత్తిని మాత్రం వెలిగించి కూచున్నానంటే, నా టేబిలు ముందు కాగితాలూ, కలం పెట్టుకొని కూచున్నానంటే, ఒక చేరుమాలు, ఒక సిగరెట్టుపెట్టె పెట్టుకొని కూచున్నానంటే, చేతి గడియారాన్ని వెల్లకిలా పడుకోబెట్టి కూచున్నానంటే, సీసా ఒకటి ఎదురుగుండా వుంచి....

బ్రాందీ? తప్పు. విషం? తప్పు. రైట్. అదే! క్లోరోఫారం! చూశావా మరి? నేనేమీ ఆలోచించకుండా చెయ్యను. నూతిలోపడి ఉక్కిరి బిక్కిరిగా ఉరిపోసుకుని నాలుక వేలాడుతూ, విషం తాగి కడుపు దహించుకుని పోయి, రైలుబండి కింద ముక్కలైపోయి.... ఈ చావులేవీ నాకు మనస్కరించవు. నిద్రపోతూ కలలుకంటూ అపస్మారంలో హాయిగా, అందంగా కరిగిపోయి సురిగిపోతాను. చావు బదుకుల సరిహద్దును తుడిచివేస్తాను. హఠాత్తుగా అనాయాసంగా చచ్చిపోవడానికి కూడా వీళ్ళున్నాయి. ఎలక్ట్రిక్ షాకుతో, ఎత్తునుండి దుమికి కణతమీద రివాల్వర్ కొట్టుకొని. పన్నెండు ఔన్సుల గాజుగ్లాసులో పదిఔన్సుల నీళ్ళుపోసి రెండు చిటికెల (అంత అనవసరం) సైనైడ్ కరగించి చిటికెనవేలి మీద బ్లేడుతో గంటుపెట్టి ఆ వేలు ద్రవంలో వుంచితే చాలును. నా హైపొడెర్మిక్ సిరింజిని వాడినా చాలును. కాని ఇవేమి నాకు తృప్తి కలిగించవు. నా సంగతే వేరు. నా సంగీతం వేరు. హాయిగా, అందంగా స్వప్నాలతో.... అదీ నా రకం.

చిత్రం కాదూ? ఇదివరకు ఆరునెలల క్రితం, ఎప్పుడో, ఆరునెలల క్రిందట, క్రీస్తుపూర్వం ఆరునెలల వెనక, భూమి పుట్టిన ఆరునెలలకు ముందు, అప్పుడు ఆ రోజుల్లో జీవితమంటే ఆప్యాయంగా, ఊపిరి తియ్యడమే మహద్భాగ్యంగా, సుందర దృశ్యాలు చూస్తూ, సుందర గ్రంథాలు చదువుతూ, రాస్తూ, గానం చేస్తూ, బొమ్మలు చిత్రిస్తూ, నేను ప్రేమించిన నన్ను ప్రేమించిన ప్రేమను ప్రేమిస్తూ జ్ఞానాన్ని మధిస్తూ, వెయ్యి చేతులతో వెయ్యి ఇంద్రియాలతో జీవితమాధుర్య మంతా తనివితీరా పీల్చిన, విసుగు లేకుండా అనుభవించిన.... లేదా పీల్చినట్లు, అనుభవించినట్లు భ్రమించిన నేను, నేడు, ఈనాడు, నేటికి, ఈ నాటికి, అన్ని ఆశలూ అడుగంటి, ఐహిక యాత్రలో, ఆకర్షణపోయి, ఒకానొక క్రూరమైన క్రోధావేశం పుట్టుకొచ్చి ఎంత వేగం ఈ వికార నటనానికి పరిసమాప్తి చెబుదామా, ఎంతశీఘ్రం ఈ నికృష్ట దృశ్యాన్ని చెరిపివేద్దామా అని తహతహ, ఆవేదనా, ఆందోళనా పొందడం అమ్మయ్యో నాకే ఆశ్చర్యం! ఓహో ఆశ్చర్యం, నాలో నాకే ఆశ్చర్యం కలిగిస్తోంది.

కాని నే నేం చెయ్యగలను? ఇంకేం చెయ్యను? ఏం చెయ్యమంటావ్. ఏం చేద్దాం అనుకున్నా ఎదురుగుండా, ఏం లాభం? అనే ప్రశ్న అటకాయిస్తుంది. ఎన్ని విధాల యోచించినా మృత్యువు అవశ్యకమై, కౌగలించుకునే స్నేహితుడు లాగా, ఆదరంగా ఓదార్చే బంధువులాగ, ఆహ్వానిస్తూ వికృతకవాటమై స్వాగత తోరణాలు ధరించిన దివ్య భవనంలాగ కనబడుతూ, జీవితం భయంకరమై, దుస్సహమై, దుష్టమై, విహ్వాలభావం సోకించి, శత్రువై, సర్పమై, శార్దూలమై శాపమై రావద్దనే రాక్షసిలాగ, పోపో అనే పొగలాగ కనబడుతూ వుంటే, వినబడుతూవుంటే ఆహా! నా నిశ్చయం, ఔరా! నా నిర్ణయం ఇంకోలాగ ఎలా వుంటుంది?

చనిపోవాలని నిశ్చయించుకున్నాను. చిత్రం కాదూ? ఏడాది కిందట నా స్నేహితుడు, డబ్బు లేక చదువుమాని, పనిలో ప్రవేశించి, సంసారంలో ప్రవేశపెట్టబడి, బదుకువల్ల లాఠీచార్జీ చెయ్యబడి కరువువల్ల నిలువుదోపిడీ చెయ్యబడిన నా స్నేహితుడు ఏడాది కింద కనబడి నన్నొక మహోపకారం, చిటికెడు పొటాసియం ఫెర్రో సైనైడ్, చిత్రం! స్పెల్లింగ్ తప్పుతో రాసిన మాట, సగంమూసిన సగం కళ్ళతో ప్రార్థిస్తూ వున్న నా స్నేహితుడు, కాగితాన్ని నా చేతిలో పెట్టి (కోరిన వస్తువును నోటితో చెప్పలేక) ఒకే ఒక్క మహోపకారం చెయ్యమని, ఆఖరి కోరిక చెల్లించమని ప్రాధేయపడితే, ససేమిరా అని నేను పట్టుపట్టి, ఇవ్వను గాక ఇవ్వనని భీష్మించుకొని ప్రాణపు పావిత్ర్యం గురించి, జీవిత సౌభాగ్యం గురించి, కవిత్వపు గమకాలతో ఉపన్యాసం ఇచ్చిన నేను, అతని కథంతా విని, ఎన్నో మార్గాంతరాలు చూపించి, ఎన్నో దృష్టాంతాలు బోధించి, బదకవలసిన అవసరం రుజువు చేసిననేను, పరాజయ మెరగని జీవితపు పతాకాన్ని అతని మనస్సులో ప్రతిష్ఠించిన నేను (నాకు జ్ఞాపకం, బ్రేనింగ్ కవి Soul అనే గీతం నుంచి Oh, our manhood's Prime Vigour!.... Oh' the wild Joys of Living! ఇత్యాది పాదాలు, బైరన్ రాసిన "To sit on rocks" మొదలైనవి. అదంతా ఇక్కడ ఉటంకించడం అనవసరం – నా వాదానికి వాటిని స్తంభాలుగా చేసిన నేను) నేను (ఈ వాక్యాన్ని ఇంతటితో పూర్తి చెయ్యాలంటే) అతణ్ణి బతికించాను. అతని కిపుడు మళ్ళీ కొడుకు! అతని కిపు డెంతో మర్యాద! ఎంతో హాయిగా ఇప్పుడతడు జీవిస్తున్నాడు.

ఇక నేను ఎప్పుడు ప్రవేశించిందో నా మనస్సులో ఈ కీటకం! (ఆరునెలల కిందట కాబోలు) ఎలా ప్రవేశించిందో యీ క్రిమి నాకు తెలియకుండా కాబోలు ఎన్ని పద్మవ్యూహాలు, ఎన్ని సాలీడు గూళ్ళు, ఎన్ని అంధకార గుహాంతరాలు చొరబడ్డానో, ఎన్ని ఇంద్రజాలాలు చేశానో, ఎన్నిమార్లు పునః పునః పునః పరీక్షలు చేసుకున్నానో నా హృదయ, హృదయ, హృదయాంత రాంత రాంత రాళాలలో! ఎన్ని ప్రశ్నలు, ఎన్ని సంజాయిషీలు, ఎన్ని రాజీలు, చిరాకులు, కోపాలు, తాపాలు, సందేహాలు! ఓహో,ఆ సందిగ్ధాల సంధ్యా సమయంలో నన్ను నేనే ఎన్నో మార్లు చిత్రవధ చేసుకున్నాను. ఎంత యమ యాతన పడ్డానని! అడుగడుగునా ఎవరో వెనకనుండి తరుముకు వస్తున్నట్లుండేది. ఏదో కొండచిలువ నన్ను చుట్టుకొన్నట్లుండేది. కారుకమ్మిన పొగలు తుపాను పెట్టినట్లు ఉక్కిరి బిక్కిరి కలిగేది. ఇక నా మెదడులో హోరు చెప్పనక్కరలేదు. సంగీత విరుద్ధమైన వివిధ శబ్ద సమ్మేళనలతో, వాటిలోనే వివిధ విచిత్రలయలతో, అవ్యక్త భీతావహంగా వినిపించే ధ్వనులు, కథలలో చెప్పుకునే, మనస్సులో వూహించుకునే, మానవుడి భయం నాటి నుండీ నేటివరకూ ధరించే రకరకాల రూపాలూ, వికారపు కోరలూ, కొమ్మల కొమ్మల కొమ్ములూ, అనేక వస్త్రాలూ, ఒంటినిండా ముళ్ళూ, నాసారంధ్రాలనుండి అగ్నులు కక్కే జంతువులు నన్ను

ముట్టడించేవి. అర్థంలేని పైశాచిక మంత్రాలు నా నిద్రకి భంగం కలిగించేవి. నల్లని వర్ష మేఘాలతో నా మానసిక వ్యోమమంతా చాందినీ కప్పేవి.

ఎక్కడి దా అంధకారం! ఫ్లెమిష్ చిత్రకారుల వర్ణలేపనంలో, బోదిలేర్, రాన్ బో కవుల సంక్షోభ కవిత్వంలో, డీక్విన్సీ నల్లమందు పొగలలో, డీన్‌స్విఫ్ట్ మాంసద్వేషంలో, షొసెన్హార్ తత్వజిజ్ఞాసలో, బిథోవెన్ కళ్ళ వెనక, డోస్టవ్‌స్కీ గ్రంథ పుటలలో, ఎడ్గార్ పో ఆత్మలో, దండక, ఆఫ్రికా అరణ్యాలలో, సైబీరియా ఎడారులలో, ఉత్తర ధృవరాత్రుల మంచు కప్పిన మైదానాలలో ఎక్కడనుండి వచ్చిన అంధకారం అది?

నా చీకటిలో గిల గిల కొట్టుకుంటూ, సూదుల వంటి బాణాల వంటి భావాలతో, తప్తతైల ప్రవాహాల నిరంతర స్నానంలో, పగిలిన అగ్నిపర్వతాల ప్రచండార్భాటములో, ప్రకోపించిన పంచభూతాల నిరంకుశ పరిపాలనలో, గగన చుంబకములైన మహాతరంగాలు ఘూర్ణిల్లే ప్రళయ సముద్రాలతో నా మెదడంతా అల్లకల్లోలమయ్యేది.

చచ్చిపోతున్న ఓ వ్యక్తీ! చాలించు, ఇక నీ సరదా రాత! చస్తానని ఎవరిని జడిపిస్తావు? చాలా చూశాం, ఇలాంటివి. ఈ కార్యం చేసేవారెవరూ ఇన్ని తర్జనభర్జనలు చెయ్యరు. ఒక్క క్షణంలో ముగించుకుంటారు. నూతిలో వురికీ, సముద్రంలో పడీ, విషం తాగీ, ఉరి పోసుకునీ, ఎత్తునుండి దుమికీ, ఎలక్ట్రిక్ షాక్‌తో ఎక్సెట్రా! జాబితా లనవసరం. ఒక లక్ష మార్గాలున్నాయి. ఏదైనా స్వీకరిస్తారు, నీలా గనుకున్నావా?

లేదు, చాలా ఆలోచిస్తారు. నా లాగే చాలా వితర్కిస్తారు. నా లాగే. నాకు తెలుసును. మరణించడం అంటే, నిండుప్రాణం హరించిపోవడమంటే మీద మీద లేదు. మరణశిక్ష విధించబడినవాడు కూడా ఇష్టంగా ఉరికొయ్య ఎక్కడు. ఎంతోమంది ఉరి తీయబడేముందు తమ్ము తీసుకువెళుతున్న వాళ్ళతో కాట్లాడి, వాళ్ళని రక్కి, కరచి, విలవిలలాడుతారు. దీర్ఘరోగులు కూడా సులువుగా చచ్చిపోరు. సమీపించే మృత్యువును ప్రతి రక్తకణంతోనూ ఎదుర్కొంటాడు. వైద్యులు కుదర్చలేక పెదవి విరిచిన అసహ్యమైన జబ్బులు మోసుకుంటూ ఎలాగైనా బతికి వుండడం కోరతాడు ప్రాణి. మురికి కాలువలోని కుక్క కుళ్ళి కుళ్ళి చచ్చిపోతుంది కాని, ఎంత తిండి లేకపోయినా, ఎంత వానలో తడిసి, ఎంత చలిలో కొంకరివారి పోయినా వెంటనే చచ్చిపోదు. ఎన్నో జననాలనీ, మరణాలనీ, నేను దగ్గరవుండి చూశాను. చూశావామరి! నేను చచ్చిపోతున్నానంటే నిరాలోచితంగా, పిరికితనంగా పెడసరం చేస్తున్నానని ఎంత మాత్రమూ అనుకోవద్దు. ఒక్కొక్క సంగతే జాగ్రత్తగా చూచి, ఒక్కొక్క మార్గమే ఓపికగా అనుసరించి ఈ అమూల్య నిరాశ నందుకున్నాను

గట్టిగా గాలివేసి కొవ్వొత్తి ఆరిపోయింది. చీకట్లోనే ఆలోచిస్తూ అలా వుండిపోయాను కొంతసేపు. మళ్ళీ దీపం వెలిగించి రాస్తున్నాను. ఇంకా పన్నెండు కాలేదు.

అయితే ఏమంటున్నావ్, నేస్తం! నేను చచ్చిపోవడం ఏమీ సమంజసంగా లేదంటావు.

నేను సజీవంగా ఉండడం సమాజ క్షేమానికి అవసరం అంటావు. నా బదుకు నాదికాదు. అది సంఘంలో ఒక భాగం. అది పోతే సంఘ యంత్రం నడవదు. సమాజంలో నా స్థానాన్ని విసర్జించి పలాయనమవుతున్నా నంటావు కాదూ? ఉండు, ఆ స్థలం నిర్ణయమయిందా? ఆ విలువలు నిర్దేశింపబడ్డాయా? నా స్థలాన్ని నేను వెదుక్కుంటూ వుంటే ఎన్ని రకాల నిరోధాలు ఎదుర్కొంటున్నాయో ఎరుగుదువా? నా చుట్టూ ఎన్ని ముళ్ళ కంచె లున్నాయో చూశావా? నన్ను వెలివేసి, సందేహించి, నే నంటే భయపడి, అసహ్యించుకుని నన్ను హతమార్చడానికి చూసే ఈ ఇనప పద్ధతి మీద నాకేం గౌరవం ఉంటుంది? కుళ్ళిపోతున్న సంఘం మర్యాదలను నే ననుసరించగలనా? ఈ కపట నాటకంలో నా కిష్టంలేని పాత్ర వహించి ఎలా ఒప్పించగలను?

నేస్తం! నేటి ప్రపంచానికి తెలిసింది ఒక్కటే విలువ. ధనం! నా సంగీతాన్నీ, కవిత్వాన్నీ, చిత్రలేఖనాన్నీ ఎవరూ హర్షించరు. డాక్టరునై, వృత్తిలో దిగినప్పుడు కూడా నా యిల్లూ, నా వేషమూ, నా మోటారు కారూ చూస్తారు కాని డబ్బు తీసుకోకుండా వైద్యం చేస్తానంటే వెర్రివాడికింద కట్టేస్తారు. ఎవరికి వారు, తమ తెలివితేటలను, జిత్తులనూ, సామర్థ్యాలనూ డబ్బుకింద మార్చుకోడానికి ప్రయత్నించడం పరిపాటి. ధనార్జన ప్రధానమై, పరదైవమై, మానవులకు మహదాశయమైపోయింది. ప్రపంచ సమస్య అంటే ఆర్థిక సమస్య. మనుష్యుల విలువలు కొలవడానికి స్పష్టంగా కనిపించే కొలత ధనం కాక మరేముంది ప్రస్తుత పరిస్థితులలో? ధనం వల్లనే ఆధిక్యం కాబట్టి ధనోపార్జనకే ప్రతివ్యక్తీ పెనుగులాడతాడు. ధనమూల మిదం జగత్. వీడు గుడ్డిగవ్వ చెయ్యడు. మన సామెతలు మన దృక్పథానికి సాక్ష్యం. చెడిపోవడానికి, బాగుపడడానికీ భేదం ధనమే నిర్ణయిస్తుంది. ఏకాగ్రతతో తపస్సు చేసే యోగులలాగ కొందరు కుబేరుని వేదికముందు సహస్రనామ జపం చేస్తూనే ఉంటారు. వడ్డీలు, లెక్కలు! వడ్డీలకు వడ్డీలు! జీవితమంతా డబ్బు పోగు చేసే యజ్ఞం. పెట్టుబడులెందుకు, వాణిజ్యం ఎందుకు? వణిజనీతి అంటారు. పాలలో అట్టే నీళ్ళు చేర్చవద్దు. బియ్యంలో ఎక్కువ రాళ్ళు కలపవద్దు. నేతిలో ఎక్కువ కొవ్వు కలపవద్దు. అసలీ కల్తీ చెయ్యడా లెందుకు? లాభంకోసం, వ్యాపారం సాగడానికి, బంగారం, కాకిబంగారం, తినే తిండి, కట్టే బట్ట, కట్టడాలు, కావ్యాలూ, చదువూ, సౌందర్యం అన్నీ అమ్మకానికి సిద్ధం. అన్నిటికీ సరసమైన ధరలు, న్యాయమైన వ్యాపారం చెయ్యాలట. ప్రకటనలు! బొమ్మలతో, కరపత్రాలతో, గోడలమీద, విద్యుచ్ఛక్తితో, విమానాల నుంచి ప్రకటనలు దేశ దేశాలలో ప్రచారం. దేశాలకు దేశాలే బజార్లు, వర్తకపు న్యాయం. వ్యాపారపు సూత్రాలు. సరుకు నమ్మకం. మా షాపులు చూడండి. ఒక్కమారు చూస్తే మరెక్కడికీ వెళ్ళరు. వేశ్య అలంకరించుకొని ఆహ్వానించినట్లే. ఒకడు చెడితేనే గాని మరొకడు బాగు

పడదట! తక్కువ కొని ఎక్కువకు అమ్మాలట! ఒక్కొక్కప్పుడు బజారు నాడి పరీక్షించి సామాన్లను చీకట్లో దాచెయ్యాలట! అన్నిటికీ ఖరీదు కట్టడం పరిపాటి అయిపోయింది. "ఏమండీ బీరకాయ లెంతకి కొన్నారు?... ... అబ్బే! దగా పడిపోయారండి" ఒకడు కుళ్ళు వంకాయ లమ్మేస్తాడు. ఒకడు చెత్త పద్యాలమ్మేస్తాడు. వందరూపాయలకీ దమ్మిడీ లాభం హామీ ఇచ్చే వ్యాపారం చూపిస్తే ధనుంజయుణ్ణియిపోతా నంటా డొకడు. పెట్టుబడిదారీ విధానానికి అంత్యకాలం ఆసన్నమయిందని వీళ్ళెవరూ కనుక్కోలేకుండా వున్నారేం? ఇంకా ఆ పాత వ్యవస్థనే పట్టుకుని ఊగులాడుతారేం? ఉత్పత్తి ప్రాథమిక దశలో ఉన్నప్పుడు వ్యక్తి సామర్థ్యానికి ప్రాముఖ్యం ఉండేది. ఇప్పుడో! ఇది జూదంగా మారలేదూ! అంతా లాటరీ! అంతా గారడీ! ఎవడెప్పుడు గెలుస్తాడో తెలియదు. ఎవడెందుకు ఓడిపోతాడో తెలియదు. నేటి వ్యవస్థ కొక నీతి లేదు. ఒక నియమం లేదు.

అందువల్ల ఈ జూదంలో నేను పాల్గొనలేను. పడిన శ్రమకు రూపాయి అణా పైసలతో లెక్క కడుతున్నప్పుడు, పని ఎగగొట్టి ధనం సులువుగా ఆర్జించాలని ఉబలాటం కలుగుతుంది. పనిలో శ్రద్ధ పోతుంది. అడుగు, ఈ ఉద్యోగస్తులందరినీ "మీరు చేస్తున్న పనిలో మీ కెంత ఆసక్తి వుం"దని? "ఏమిటో ఆ జీతపురాళ్ళ కోసం కాకపోతే ఎవడిక్కావాలీ వెధవ ఉద్యోగం?" అంటారు.

ఏదో ఒక ఉద్యోగంలో తలదూర్చి, ఏదో ఒక వృత్తిలో బోర్డుకట్టి, అడుగునుంచీ ఆరంభించి అభివృద్ధికోసం పడిగాపులు పడుతూ జీవితాన్ని వెళ్ళమార్చడమేనా మానవుడి పరమావధి? జీవితాన్ని ప్రబోదానం చేసే ఇతరశక్తులు, జీవితాన్ని ఆనందమయం చేసే ఇతరానుభూతులు మరేవీ లేవా? ఒకరినొకరు ద్వేషిస్తూ, తమ్ము తామే అసహ్యించుకుంటూ ఇంతేనా బతుకంటే? తానే చెయ్యగల పని తన మనస్సంతా పెట్టి చెయ్యడం? చేసినందు వల్ల తాను ఆనందం పొందడం, దాని ఫలితం అందరినీ అనుభవించ నివ్వడం ప్రస్తుత పరిస్థితులలో సాధ్యమవుతుందా? ఇది నాది అనుకోవడం, దాన్ని దాచుకోవడం, దానికోసం ఈర్ష్యపడడం, ఎంత వెర్రి మమకారం? ఉన్నత జీవితంలో ఈ విషాలు లేవు. ఒక కవి గీతాలు రాస్తే, ఒక వైజ్ఞానికుడు శాస్త్ర పరిశోధన చేస్తే, ఒక కళాకారుడు శిల్పం సృష్టిస్తే, ఆ ఫలం అంతా సంఘం అనుభవిస్తుంది. సంఘం అంతా దాన్ని పంచుకుంటుంది. అందుకు అభ్యంతరం ఉండకూడదు. ఉంటే సమాజంలో ఇంకా కుళ్ళు నిలిచి ఉందన్న మాట. అందుకే మనదేశంలో వైజ్ఞానికులకంటె బిచ్చగాళ్ళే ఎక్కువ మంది.

సంఘంలో ఇంకా చాలా కల్మషం నిలిచివుంది. కాబట్టే సంఘ కార్యాలన్నీ బాధల మధ్యా, కన్నీళ్ళ మధ్యా జరుగుతున్నాయి. అయితే ప్రపంచానికి కావలసిన అల్ప కార్యాలన్నీ ఎవరు చేస్తారు? అందరూ అందలమెక్కితే మోసేవాళ్ళెవరూ? సేవ్య సేవక ధర్మం. ఇదొక

అభ్యంతరమే పూర్వం. అందుకే ఆ సామెత. ఇపుడు మనుష్యుల శ్రమ మానవుని బుద్ధిబలం వల్ల చాలామట్టుకు తగ్గిపోతుంది. నేను సుఖంగా వుండడానికి నా నౌఖరును కష్టపెడతాననడానికి వీలులేదు. విద్యుచ్ఛక్తి నిన్ను సుఖపెడుతుంది. ఆవిరి నిన్ను సుఖపెడుతుంది. విజ్ఞానం నిన్ను సుఖపెడుతుంది. నీ సుఖాలను నీ సోదరులందరికీ పంచి పెట్టు. అందులోనే అనల్ప సౌఖ్యం వుంది.

ఔను. ఈ ప్రపంచం మిథ్య అనీ, జీవితం దుఃఖభూయిష్టమనీ అనే వాళ్ళను నేను లక్ష్య పెట్టను. ఈ విషాదాలన్నింటికీ నీ అజ్ఞానం కారణం. వీటన్నింటిని తొలగించడానికి వీలుంది. మనుష్యులకు సుఖించడానికి జన్మతః హక్కుంది. ధనికవర్గం యీ సుఖాన్ని దాచుకుంది. అలా దాచుకోడానికి వీలుగా నేటిపద్ధతి సర్వమూ నిర్మించబడింది. ఈ వ్యవస్థను సమర్థించడానికి కూడా మన పండితులు కొందరు బయలుదేరుతున్నారు. ధనవంతులకే మరింత ధనం! వెనుకబడిన వాడు వెనకనే. దరిద్రుడుగా పుట్టడమే తప్పు. అది వాడి కర్మం. అది వాడి పాపం.

ఒక గానసభగాని, ఒక నాటకం గాని జరుగుతూ వుంటే ఇవతల నేను నిలబడిన హాలుమీద రౌడీలు రాళ్లు విసరడం చూస్తాను. అంతా వాళ్ళని దుండగులని దూషించేవాళ్ళే. కాని, నేను మాత్రం వాళ్ళ పక్షం వహించి వాళ్ళను అర్థం చేసుకుంటాను. ఈ ధనికులంతా లోపల కూర్చుని కళాసామ్రాజ్యం పరిపాలిస్తున్నామనీ, వెలుపలనుంచి జరిగే అల్లరి తమ రసాస్వాదనకు భంగం కలిగిస్తున్నదనీ భావిస్తారు. అంతేగాని, శిల్పానికి వాయువువలె, జలంవలె సార్వజనీనమైన అనుభవ యోగ్యత ఉన్నదని అంగీకరించరు. వీళ్ళ పోలీసులు రౌడీలను తరమడానికి సిద్ధంగా వుంటారు. వెలుపలవారి హక్కునే లోపలివారు అపహరిస్తున్నారని ఎవరు గ్రహించగలరు? తాము అనుభవిస్తూనే ఇతరులను కూడా అనుభవించనియ్యగల విశిష్టత ఉన్నత జీవితానికి లక్షణమని ఎంతమంది అంగీకరించ గలరు? ఇందుకా కవులు గ్రంథాలు రాసేది? గాయకులు గొంతుచించు కొనేది? శిల్పులు చిత్రాలు సృష్టించేది? వైజ్ఞానికులు నూతన సత్యాలు కనిపెట్టేది?

కాని ఈ మహా శిల్పుల జీవితాలు కూడా ధనానికే అంకిత అయిపోవడం నాకు జాలి కలిగిస్తుంది. డబ్బు ఎంత క్షమించరాని నేరం చేస్తోంది? అమూల్యమైన రసాత్మలను కొనేస్తుంది. అందమైన భవనాన్ని చూస్తే దీన్ని కట్టినవాడు ఎంతో కొంత డబ్బు తీసుకొన్నాడన్న సంగతి నేను స్మరించడం మానలేను. మువ్వ గోపాల పదాన్ని అమోఘంగా అభినయిస్తున్న అమ్మాయి హస్త ముద్రల వెనుక ధనం చేసే కరాళ నాట్యాన్నే చూస్తాను. ఒక గొప్ప నాటక కర్త సృష్టించిన పాత్రను ఒక ప్రసిద్ధుడైన నటుడు ప్రతిభావంతంగా వ్యాఖ్యానిస్తూ వుంటే "ఏయ్ నువ్వు డబ్బు తీసుకున్నా" వని అరవాలనిపించుతుంది.

రాళ్ళనీ, రాతి గుండెలనీ కరిగించగల రాగాలాపన సాగిస్తూన్న వైణికుణ్ణి చూసి అతని వేళ్ళు కూడా ధన స్పర్శ వల్ల మలినమైపోయినవే కదా అని బాధపడతాను. ఏ ప్రదర్శనానికి వెళ్ళినా నేను కొన్న టిక్కెట్టు నా గుండెల్లోబాకులాగ గుచ్చుకునే ఉంటుంది.

ఈ బెడద లేవీ లేక, ఈ ఆలోచన లవీ లేక అందరూ ఎంత తృప్తిగా నిశ్చింతగా బతికేస్తున్నారో! అందుకే నాకనిపించుతుంది, నేనే ఎందుకు చచ్చిపోవాలి? ఎందువల్ల ఆ మోటారు కారులో పోతూన్న మొద్దబ్బాయి, గగంగిరెద్దులాగ తయారయి సినిమాకో, షికారుకో వెడుతున్నవాడు చచ్చిపోకూడదు? ఎందువల్ల ఆ సిగరెట్టు కాల్చుతూ, చేతికర్ర తిప్పుతూ క్లబ్బు వరండాలో పచారు చేస్తూన్న, లంచాలు తినడంలో, తినిపించడంలో ప్రత్యేకత వహించిన ఆ పెద్దమనీషి చచ్చిపోకూడదు? ఎందువల్ల ఆ బనారసు చీర కట్టుకున్న, బంగారం పెట్టుకున్న, ఒళ్ళంతా అన్ని దిక్కులా బలిసి, ఆడవాళ్ళ సభలో ఆగిపోయే ఇంగ్లీషులో ఉపన్యాసం చేయబోతున్న యువతీ రత్నం మరణించకూడదు?

ఓహో! ఇవి వ్యర్థాలోచనలని భావించవద్దు నేస్తం! నేనూ నీలాగే లోకాన్ని చదువు కుంటున్నాను. నిర్ధనులంతా, నిమ్న జాతులంతా, వాళ్ళ బతుకుతో వాళ్ళు తృప్తి పడుతున్నారనీ, చేసిన పాపం అనుభవిస్తున్నారనీ, అసలు వాళ్ళకి ఆత్మలే లేవనీ, ఈ కొత్త రచయితలూ, కొత్త నాయకులూ బయలుదేరి వాళ్ళకి లేనిపోని ఆశలు కల్పించి, వాళ్ళలో అశాంతి రేగించి తిరుగుబాటు పురికొల్పుతున్నారనీ అంటూన్న చవకరకం, చవట విమర్శలు లక్ష్యపెట్టనక్కరలేదు. అసలు మన అభిప్రాయాలను వాళ్ళ మనసులలో ప్రవేశపెట్టడం లేదు సరికదా ఇవన్నీ వాళ్ళ హృదయాలలో, నోరులేని వాళ్ళ జీవితాలలో అంతర్గర్భితంగా అణిగి వున్న ఊహలే. బైటికి రాలేక లోపల లోపలనే కుత కుతమని ఉడికిపోతూన్నవి. సమాజ గమనాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకున్నవాడు ఎవరిపక్షం వహించాలి ఈనాడు? నాకు తెలుసు. ఈ బాధ ఎవరి బాధో నాకు తెలుసును. ఒక ఫ్యాక్టరీలో కూలీ, ఆఫీసులో కుర్రాడు, వర్తకుడి దగ్గర గుమస్తా, వడ్రంగి దగ్గర పని నేర్చుకుంటున్న అబ్బాయి, హోటల్లో పనివాడు, చాలీచాలని జీతం తెచ్చుకుంటున్న బ్యాంకు గుమస్తా, పల్లెటూళ్ళో బడిపంతులు, నాటకాల్లో చిల్లర వేషాలు వేసేవాడు, ముద్రాక్షర శాలలో అచ్చుకూర్చేవాడు – ఓహో, ఇంకా ఉదాహరణలు గుణించడమెందుకు – బస్సు స్టాండులు, రైలు స్టేషను వద్దబరువులు మోసేవాడు, పొలాలలో పాలికాపు, పట్టణాలలో కాలువలు తుడిచేవాడు, దారిప్రక్క బిక్షువు, వైద్యశాలలో రోగి, గుడిసెలో ముసలమ్మి, (ఆహా, స్త్రీలోకంలో ఉదాహరణలు స్మరిస్తే చెయ్యి వణుకుతోంది. పురుషుల దేం కష్టం!) ఇప్పుడే చచ్చిపోయిన బిడ్డని చేతుల్లో పెట్టుకున్న పదహారేళ్ళ బాలెంతరాలు, మగడు చచ్చిపోయాడని టెలిగ్రాం వస్తే ఏడుస్తూ కూర్చున్న ఇల్లాలు, వృద్ధాప్యం మీదపడినా,

చాకిరీ చెయ్యకపోతే దినం వెళ్ళని దీనురాలు, నీళ్ళు తోడుతూ, అంట్లు తోముతూ బతికే దాసీది. గతిలేక శరీరాన్ని అమ్ముకునే వేశ్య, వద్దు వద్దు ఇక చాలును, ఎవరునన్నర్థం చేసుకుంటారో ఎందుకు వేరే చెప్పడం?

ఓహో! అభినవ బుద్ధుడా! ఈ యాతనా ప్రాణులకు నిర్వాణం సంపాదించడానికా నీ ప్రాణాలు తీసుకుంటున్నావు? ఏ లోకాలకి పోయి, యే దేవతలముందు వాదిస్తావు వీళ్ళకి న్యాయం యిమ్మని? జీవించు, బతికివుండి వీళ్ళకేదైనా తరణోపాయం ఆలోచించు. ప్రాణాలు నిలుపుకొని వీళ్ళ పక్షాన్ని పోరాడు.

వ్యర్థంగా చచ్చిపోతున్నానా? వీళ్ళనంతా చూస్తూ మరణిస్తున్నానా? ఏమీ చెయ్యలేక నిష్క్రమిస్తున్నానా? నేను మరి ఏం చేస్తున్నా నా చుట్టూ వెయ్యి రహస్యపుకళ్ళు; ఏం చెయ్యాలనుకున్నా ఇదిగో నా వెనకనే ఒక సి.ఐ.డి ఇదిగో వారంటు! ఇదిగో చెరసాల! ఇదిగో ఉరికొయ్య! మాటకి సంకెళ్ళు. చేతికి నిరోధం, గ్రంథాలకి నిషేధం. ఎన్ని లోపాలున్నా యీ పద్ధతిని అనుసరించవలసిందే! కాదని ప్రతిఘటిస్తే వజ్రముష్టితో అశనిపాతం! ఈ సంఘర్షణ హెచ్చిపోయి, కలవారికీ, లేనివారికీ, తెగతెంపులు జరిగే సంగ్రామంలో, స్పెయిన్‌లో, చీనాలో, అదే యావత్ప్రపంచంలో విజృంభించినపుడు ఇవిగో మరఫిరంగులు! ఇవిగో బాంబర్ విమానాలు! ఇదిగో అగ్నివర్షం! ఇదిగో మృత్యువు! ఇదిగో వినాశనం!

మానవుని మంచితనం గురించి పదే పదే నువ్వు చెబుతావు గాని మనుష్యుడిలో యెంత కల్మషం అణగివుందో చూడమంటావా! ఔను. ఈ మోసాలు,అబద్ధాలు, అనుమానాలు. హత్యలు ఏ పోలీసు స్టేషన్‌కి, ఏ క్రిమినల్ కోర్టుకి వెళ్ళినా స్పష్టంగా కనబడతాయి! అమ్మయ్యో! మానవులలో ఎంత దుర్మార్గులున్నారో? వీళ్ళని శిక్షించకపోతే మరి వీళ్ళని పట్ట పగ్గాలుంటాయా?

ఔనౌను. దగాకోరులని సంఘం నిరసించిన వాళ్ళని నే నెరుగుదును. కాని వాళ్ళ పాపానికి నీకూ, నాకూ, సంఘం మొత్తానికీ యెంత బాధ్యత ఉన్నదో గుర్తించావా? అధోగతిలో వాళ్ళు కొట్టుకుపోతూ వుంటే అందరూ ఒక తన్ను తన్ని, ఒకరాయి విసిరేవాళ్ళే కాని, ఆ పతితులను ఉద్ధరించాలన్న ఆసక్తి చూపిస్తున్న వాళ్ళెందరు? వాళ్ళ పరిస్థితులను మనః స్థితులను జాగ్రత్తగా గమనించి, అర్థం చేసుకుని బాగుచెయ్యవద్దా! ఈ ప్రవర్తనలన్నీ ఒక విధమైన సాంఘిక రోగాలే కావా? వీటిని మన బుద్ధి బలం వల్ల చికిత్స చేసుకోలేమా?

అందుకే నేను బతకవలసిన అవసరం ఉందంటావుకాదూ? నా లాగే ఆలోచిస్తున్న వ్యక్తులున్నారు. వారికో సంఘం వుంది. ఒక సిద్ధాంతం, ఒక శిక్షణా, ఒక కార్యక్రమం ఉంది. ప్రపంచం అంతటా ఇట్టి సంఘాలుండడమే కాక, నువ్వు కలలు కంటూన్న ఆశయాలను మానవులందరి కోసం సాధించడమే దీక్షగా గలమహత్తర దేశం ఒకటున్నది.

కాబట్టి నాకు నిస్పృహ అనవసరం అంటావు. ఇది నిస్పృహ కాదు, నేస్తం! నేను బోధపరచలేను. "మృత్యు ప్రేమ" అని దీనికో ముద్దుపేరుపెట్టనా! ఔను. నేను జీవితాన్ని నిరాకరించ గలిగినంత గాఢంగా మరణాన్ని ప్రేమిస్తున్నాను. నా నిష్క్రమణ ఒక నిష్ఫల కృత్యం కాదు. అదో కొత్త ప్రవేశం మరో కొత్త ప్రారంభం. అదొక సవాలు. ఒక సాధనం. ఒక తిరుగుబాటు, ఒక దృఢ నిశ్చయం.

అరే! పన్నెండు కావస్తోంది;

వీడ్కోలు తీసుకుంటున్నాను. మళ్ళా వస్తాను. నాకు తెలుసును. రమణీయమైన ఈ భూలోకానికి నా ఆశీర్వాదం. నదుల వల్ల, పర్వతాల వల్ల, అరణ్యాలవల్ల మహానగరాలవల్ల, పల్లెటూళ్ళవల్ల సౌందర్యాన్ని ప్రదర్శిస్తూ భూలోకం అభ్యున్నతి కాంచుగాక! ఆనకట్టలతో, వంతెనలతో, వేనవేల మైళ్ళరాళ్ళ దారులతో, విమానాలతో, శాస్త్ర పరిశోధనశాలలతో, టెలిగ్రాఫ్, రేడియో శ్రవణాలతో, సినిమా టెలివిజన్ నేత్రాలతో మానవత్వం విజృంభించును గాక! లోకమంతా ఏక కుటుంబమై తన విధిని తానే నిర్ణయించుకోగల శక్తిని మానవుడు సాధించును గాక!

సరిగ్గా పన్నెండయిందిప్పుడు

❄ ❄ ❄ ❄

కుడిచేతిలో కలం రాస్తూనే ఉంది. ఎడంచేతితో క్లోరోఫారం సీసా చూస్తున్నాను. గడియారం ముళ్ళు కలుసుకున్నాయి. వీటిని నేను విడిపోనివ్వను. ఈ క్షణాన్ని ఇక్కడే నిలబెట్టేస్తాను. ఈ క్షణం కోసం ఆరు నెలల నుండి ఆరాటపడుతున్నాను. దీని విచిత్రమైన ప్రవర్తనని అర్థం చేసుకుందామని ప్రయత్నించాను. శాశ్వతంగా దీన్నిప్పుడు ఆక్రమిస్తాను. ఏం చేస్తున్నాను? క్లోరోఫారం వాసన చూస్తున్నాను. ఇక్కడే ఉండి కూడా ఎక్కడికో పోతున్నాను. ఇదేమిటి? ఎటుపోతున్నాను? ఒక్కమారే అనేక దిక్కులుగా ప్రయాణం చేస్తున్నా నేమిటి? ఈ కొవ్వొత్తి దీపం ఆకాశమంత అయిపోయి గారడీ శాలువ లాగా కప్పేస్తోంది నన్ను. గడియారం కనబడలేదు. మౌనం ప్రవహిస్తోంది. ఇదేం, ఇలా కరిగిపోతున్నాను! సరిహద్దులు దాటి పోతున్నాను. ఎన్ని నిచ్చెనలో అడ్డుగా, నిలువుగా, గళ్ళు గళ్ళుగా పరిగెత్తుతున్న జామెట్రీ కలుసుకొంటున్న సమానంతర రేఖలు సముద్రాకాశాల సంగీతం జ్ఞాపకాలతో కలిసి స్వప్నాలు చేసే నాట్యం, నిరీశ్వర సాక్షాత్కారం!

నిరాధారంగా, నిరాకారంగా తేలిపోతున్నాను. నిరీశ్వరుడితో నిండిపోతున్నాను. ఈశ్వరుడి ఇంకో వేపుకి పోతున్నాను. పరాజయాల కాల్బలాలతో, పరాభవాల నౌకాదళాలతో, అనుమానాల విమానాలతో దండయాత్ర సాగిస్తున్నాను. "దేవుడు లేడు" అని నే నన్నప్పుడు నా ఉద్దేశం, "దేవుడు ఉన్నాడు" అని. ఇది ఎవరికర్థం అవుతుంది? నా "ఔను" కి,

"కా"దని, నా "వుంది" కి "లే"దని అర్థం ఉందనీ, లేదనీ, ఉండిలేదనీ, లేక ఉందనీ ఎలా నచ్చ చెప్పగలను?

అర్ధరాత్రి ఇప్పుడు! అయితే ఈ సూర్యుడేమిటి? (కొవ్వొత్తి వెలుగంటారు నాకు తెలుసును) ఇది మరణం అంటారు. కాదంటాను నేను. ఎప్పుడూ నేను పెడసరంగానే వాదిస్తానేం? అందరూ వద్దంటున్న పనులు చేస్తానేం? ఎప్పుడూ ఇంకో వేపు చూస్తానేం? (అన్నిటికీ ఇంకోవేపు ఉన్నది కాబట్టి) అన్నిటికన్నా విశేషం: నిరీశ్వరుడే ప్రత్యక్షమై "నే నున్నాను" అంటే నమ్మకం లేకుండానే నమ్మకాన్ని ప్రకటిస్తాను.

ఒక చోట గురజాడ ఇలా అన్నాడు:

"దేవతలతో జోడు కూడితి;
రక్కసులతో కూడి ఆడితి
కొత్త మిన్కుల తెలివి పటిమను
మంచి చెడ్డల మార్చితిన్!"

ప్రస్తుతం నేను చేస్తున్న పని కూడా అదే.

అంచుల దగ్గిర అంతా యాదృచ్ఛికమే! అక్కడ పరమాణువుల ప్రవర్తనగాని, జీవాణువుని స్వభావాన్ని గాని, ఇతమిత్థమని నిర్ణయించలేము. ఇదో కఠోరమైన గందరగోళమైన బీజగణిత సమస్య. ధన ఋణ సంజ్ఞలను బట్టి బ్రాకెట్లను విప్పుకుంటూ వెళ్ళాలి. ఎక్కడ ఒక సంజ్ఞ తప్పినా లెక్కంతా తప్పుతుంది.

$- \{(a-a) + (b-b) - (\underline{c}-\underline{c}) + (d-d)........\} = ?$

- }(ఔను – కాదు) + (మంచి–చెడ్డ)–(వెలుగు–చీకటి) + (చావు–బదుకు).... } = ?

ఈ లెక్కని ఎందరు ఎన్ని మార్లు చేస్తే అన్నిమార్లు జవాబులు వస్తాయి. అందుకే ఎవరి ఆవరణల మధ్య వాళ్ళు ఇమిడిపోతారు. తమకు వెలుపల వున్న సంజ్ఞ ఏమిటో కూడా వాళ్ళకి తెలియదు. అన్ని ఆవరణలకి వెలుపల ఏ సంజ్ఞ ఉందో అసలే తెలియదు. మొత్తం మీద ఈ లెక్కకి జవాబు సున్నా అని గాని, ఒకటి అనిగాని, రెండు అని గాని నిర్ధారణగా ఎవరూచెప్పలేరు.

$-(1+1) = -2$

$+(1+1) = +2$ అనిలెక్క చేసి, ద్వైతులు రెండంటారు

$-(1-1) = 0$

$+(1-1) = 0$ అని చేసి, మిథ్యావాదులు సున్నా అన్నారు.

నే నొక్కణ్ణే ఏ తర్కానికీ లొంగకుండా, వెలపలి సంజ్ఞ ఏదయినా లక్ష్యపెట్టకుండా,

1-1 = 1

1+1 = 1 అని అనడం మానలేదు.

అంటే దీని అర్థం : ఔను / కాదు, మంచి / చెడ్డ, వెలుగు / చీకటి, చావు / బ్రతుకు, మనిషి / దేవుడు, అంతా ఒకటే అని. ఇందుమూలంగా శూన్యం మీదనూ, అనేకం మీదనూ ఏకాంకి గల ఆధిక్యాన్ని ఉగ్గడిస్తున్నాను. ఈ ఏకం ఎవరో కాదు. మానవుడు. అతడే సత్యం. అతడే నిత్యం. అతడే ఈశ్వరుడు.

జీవించినా, మరణించినా నేను నేనే కాబట్టి జీవితం సుఖమనీ, మరణం దుఃఖమని గానీ, జీవితం బానిసతనం, మరణం స్వాతంత్ర్యం అని గాని వాదించడం మానేస్తున్నాను. పరస్పర ప్రేమ వల్ల మానవులంతా సమానులవుతారు. ప్రతి మనిషీ రెండోవానిలో తన్నూ, దేవుణ్ణీ చూస్తాడు కాబట్టి, ప్రపంచంలో వైషమ్యాలకూ, వైక్లబ్యాలకూ తావుండదు.

ఇదీ నా ఆలోచనల గమ్యస్థానం. భూత, వర్తమాన, భవిష్యత్కాలాలను ఒకే క్షణంగా ముద్ద చేసి నేను  కల్పించుకున్న, నేను నివసిస్తున్న స్వర్గం, ఇక్కడ నాకు ఒంటరితనం లేదు.నాతో బాటు ఆమె కూడా అనంతంగా తేలిపోతూంది. ఆమె యెక్కడో, నే నెక్కడో అనుకోవద్దు. నన్ను కలుసుకొనడానికి ఆమె మరణించి పోనక్కరలేదు. ఇద్దరం కలిసే, ఇక్కడలో, ఇప్పుడులో ఈదుకుపోతున్నాము. రెండు స్వప్నాలు. రెండు మృత కళేబరాలు. రెండు కంకాళాల కార్తీక దీపాలు, (ప్రమిదా, కొవ్వొత్తీ) ఇంకా రెండేమిటి? ఒకే ఒక తనం. ఒకే రెండు తనం లేకపోవడం. ఒకే నిండుతనం.

ఓహో; సత్యా సత్యాల కవతల సాఫల్యం! నిత్యా నిత్యాలను మించిన సాంగత్యం! మానవ మనశ్శాఖల మీద పుష్పించిన సంగీతం! అనేక తరాలలో ఏక కాలమే జీవిస్తున్న అనుభవం! ఏక కాలంలో ఉండడాన్నీ, ఉండకపోవడాన్నీ సాధించే స్వాతంత్ర్యం.ఇది నా కామ్యం! ఇది నా  గమ్యం! ఇది నా స్వర్గం!

# పాలంకి వెంకట రామచంద్రమూర్తి

**(1909 - 2005)**

**వి**నోదాత్మకమైన కథలు రచించుటలో పాలంకి వారిది పెట్టింది పేరు. దైనందిన జీవితంలోని చిన్న చిన్న సంఘటనల్ని ఏరుకొని ఆహ్లాదం కలిగించే రచనా సంవిధానంతో వీరు అసంఖ్యాకంగా కథలు వ్రాశారు. వీరి పాత్రలు నిత్యమూ మన కళ్ళెదుట మసలే వ్యక్తులే. ఆశ్చర్యం కలిగించే కొసమెరుపులతో అద్భుతరసాన్ని అనుపమానంగా పోషించటం పాలంకివారి విశిష్టత. సెంట్రల్ కో ఆపరేటివ్ ల్యాండ్ మార్టుగేజ్ బ్యాంకు, హైద్రాబాదులో పని చేసేవారు.

**రచనలు :** పాలంకి కథలు

# వెధవ డబ్బు

ఆ అమ్మాయికి పదహారేళ్ళుండవచ్చు. అతగాడికి ఇరవై కంటే ఎక్కువ ఉండవు. "ఈడూ, జోడూ" ఐన దాంపత్యం వాళ్ళది. వాళ్ళిద్దరూ సాయంకాలం షికారుగా వీధినిపడి పోతున్నారు! ఏవేవో చెప్పుకుంటున్నారు! కిలకిల నవ్వుకుంటున్నారు. తమమాట లెవరైనా వింటున్నారేమో అన్న సంకోచం కాని భయంకాని లేనేలేదు వాళ్ళకి.

వాళ్ళ మాటలన్నీ వెనకాల నడిచి వస్తూన్న కనకాచలంచెట్టికి వినపడుతూనే వున్నాయి. ఆ వృద్ధుడు ఆ జంట కొక పది అడుగుల వెనక్కాల గాలివాలున ఉన్నాడు. "చూశావా వాళ్ళెంత హాయిగా వున్నారో! ప్రథమ యవ్వనం తొణికిసలాడుతోన్నప్పుడే హాయి! నీకేముందింక? తొంభైయేళ్ళ తొక్కువి! యముడు పంపే టెలిగ్రాముకి ఎదురు చూస్తున్నావు! ఈ లోగా ఎంత దక్కుతే అంత అని వాళ్ళ పలుకులు విని ఆనందించు" అంటూ గాలిదేవుడు ఆ నూత్న దంపతుల సంభాషణంతా తెచ్చి, చెట్టిగారి చెవులకి వప్పగించాడు.

ఆ జంట సందువదిలి మౌంటురోడ్డు ప్రవేశించారు. కుడిచేతి వైపున సింప్సన్స్ కంపెనీ 'షో రూము' కనపడింది. అద్దాల వెనక్కాల స్ప్రింగు మంచం. దాని మీద కుషను. రకరకాల సోఫాలు కుషన్లు కనపడి ఆకర్షించాయి. ఆ పడకగది ఫర్నిచరు సెట్టు అంతా "రూ. 816/–" అని అట్టముక్కపై వెల వేసివుంది. "విత్తం కొద్దీ వైభవం!" అంది అమ్మాయి. "మీవాళ్ళు కొనివ్వకూడదూ?" అన్నాడతగాడు ఛలోక్తిగా. ఆమెకు కొంచెం కోపం వచ్చి ముఖం ఎర్రపడింది. అతగాడే మళ్ళీ, "ఎందుకూ, ఎప్పటికైనా నాకొక పెద్ద ఉద్యోగం కాకపోతుంది గనకనా? అప్పుడు నేనే కొంటాను?" అన్నాడు.

కనకాచలంగారు, అతగాడామెకు కోపం రప్పించడం, అంతలోనే సమాధాన పరచడం చూసి వుప్పొంగిపోయాడు. "చిలకా గోరింకల్లాగున వున్నారర్రా! చిట్టిచిట్టి తగాయిదాలు, రాజీనామాలూను! పాపం మీకా స్ప్రింగు సామానుమీద మనసు పోయిందికదూ, పెద్ద

ఉద్యోగం వస్తే కొంటానంటున్నాడు వెర్రినాయన! ఇప్పుడేదో చిన్న నౌకరియే అన్నమాట. వీళ్ళ మనుసు యెప్పుడైనా తీరుతుందా? పోనీనేను ఆ 816 రూపాయలూ ఇచ్చి "కొనుక్కోండర్రా" అంటే యెలాగుంటుంది? నాకు బ్యాంకులో లక్షల కొద్ది డబ్బు మూలుగుతోందాయిరి. ఏం చేసుకోను వెధవడబ్బు? నా అనంతరం తినటానికి యెవళ్ళో లేకపోలేదు. ఐతేం, ఈ పిన్న దంపతులెవళ్ళో నాకు తెలవకపోయినా వీళ్ళ ఆ కాస్త మనుసూ నేను తీరుస్తే, వీళ్ళెంతో ఆనందిస్తారు. 'ఎవరీయన? మన ముక్కూ మొహం ఎరక్కపోయినా వెనకాలే వస్తూ మన కోరిక విని తథాస్తు దేవతకు మల్లే ఇట్టే తీర్చేశాడు!' అని ఆశ్చర్యపోతారు. "భలే గమ్మత్తుగా వుంటుందప్పుడు!" అంటూ కనకాచలంగారు ఆ దంపతులను ఆపబోయాడు. కాని వెంటనే ఆయన ఆలోచన మరొకపక్కకి వెళ్ళింది. "అరెరె, ఎంతతెలివి తక్కువ ఆలోచన నాది! వీళ్ళు కష్టార్జితమైన సొమ్ముతో యీ సామాను కొనుక్కున్నప్పుడు కలిగే ఆనందం, నా మూలాన యిలాగ తేరగా వచ్చిపడితే కలుగుతుందా? నా సరదాకొద్దీ వీళ్ళకు డబ్బు ఇచ్చి, వీళ్ళంతట వీళ్ళు సంపాదించుకోవలసిన సంతోషాన్ని మనం చెడగొట్టకూడదు" అంటూ ఆయన తన ఉద్దేశం మార్చుకున్నాడు.

ఆ మిథునం ముందుకు సాగేరు. వాళ్ళకు యెదురుగా ఒక నావికుల గుంపు వచ్చింది. "ఎవళ్ళండీ వీళ్ళు. వీళ్ళ డ్రెస్సంతా అదోరకంగా వుంది" అన్న దామె. "వీళ్ళు నావికులు. ఓడల్లో యుద్ధం చేసేవాళ్ళు" అన్నా డాతడు. వాళ్ళ సంభాషణంతా అటువైపు ఓడలమీదకి, "సముద్రం అవతలవుండే దేశాల మీదకీ, ద్వీపాల మీదికీ పోయింది. "మొన్న సినిమాలో చూసిన ద్వీపమేదో చాలా బాగుందికదండీ? ఆ కొబ్బరితోటలూ కోతులూ, ఆ కోతులు కథలోని ప్రేమికులకు కొబ్బరికాయలు పడెయ్యటం, చాలా తమాషాగా వుంది" అన్నదామె. "ఔను, ఆ దీపాలను 'సౌత్ సీ ఐలెండ్సు' అంటారు. తెల్లవాళ్ళు దేశదేశాల నుంచి వినోదంగా గడపటానికి అక్కడికి ఓడలమీద వస్తుంటారు. తెల్లవాళ్ళు కొత్తగా పెళ్ళి చేసుకున్నప్పుడు ఎవళ్ళ జోక్యం వుండకుండా స్వేచ్ఛగా ఉండటానికని ఇలాంటి ద్వీపాలకు పోయి కొన్నాళ్ళు అక్కడ గడిపి వస్తారు. దాన్నే వాళ్ళు 'హనీ మూన్' అంటారు. 'హనీ' అంటే 'తేనె', 'మూన్' అంటే చంద్రుడు' అన్నాడాతడు. "మనం కూడా అలాగ ఏ ద్వీపానికైనా వెడితేనో హాయిగా?"అంది ఆమె. "నాకూ అలాగే వుందిమరి. కాని డబ్బో! ఓడమీద ప్రయాణం అంటే బోలెడు డబ్బు కావాలి" అన్నాడాతడు.

ఇదంతా చెట్టిగారి చెవిని పడుతూనే వుంది. "మీకంటే బోలెడు అనిపిస్తోంది కాని ఆ సొమ్ము నాకొక లెక్కలోది కాదర్రా వెఱ్ఱిపిల్లల్లారా. పి.అండ్ ఓ కంపెనీ వాళ్ళని నేనుబాగా ఎరుగుదును. మీకు ఒక ఓడలో మొదటి తరగతి టిక్కెట్లు కొని యిచ్చి, మీ ప్రయాణం సుఖంగా వుండేట్లు ఏర్పాటు చెయ్యగలను.... కాని ఓడలో మొదటి తరగతి ప్రయాణీకులు

ఎలా ప్రవర్తించాలో, ఆ పద్ధతులూ పంపిణీలు మీకు తెలుసామరి? ఇప్పుడంటే చెన్నపట్నం వచ్చారు గాని మీరు ఏ గోదావరి తీరాన్నో ఒక పల్లెలో పుట్టిపెరిగిన వాళ్ళయివుంటారు. అలాంటప్పుడు మిమ్మల్ని తీసుకుపోయి ఒక గొప్ప ఓడలో ఫస్టుక్లాసు ప్యాసింజర్ల మధ్య పడేస్తే ఏం లాభం? అక్కడి వాళ్ళంతా మిమ్మల్ని 'బైతుల'ని హేళన చేస్తారు. మీకు సంతోషం కలిగిద్దామని చేస్తే చివరి కది మీకు చెఱ ఐ ఊరుకుంటుంది. మొదటి తరగతికన్న రెండో తరగతి మేలేమో. అలాగా అనటానికి వీల్లేదు. కొంచెం తేడాగాని ఆ రెండు తరగతులకి అట్టే భేదం లేదు. మూడవ తరగతే ఇలాంటి వాళ్ళకి సరిపడుతుంది. కాని మూడవ తరగతి బొత్తిగా అన్యాయమేమో. రంగం, మోల్మేనూ కూలీకోసం వెళ్ళే అలగా జనం అంతా మూడవ తరగతిలో ఎక్కి వెడుతూంటే చూశానుగా, మూడవ తరగతి ప్రయాణంకన్న నరకం వేరే ఉండదు. ఈ దంపతుల్ని సుఖంగా హాయిగా ఇంటిపట్ల ఉండనివ్వక, ఏం పాముకుంటారని ఓడమీద పంపటం?" అనుకొని కనకాచలం ఆ పాపాని కొడిగట్టుకోవడం విరమించుకున్నాడు.

చెట్టిగారి నిశ్చయానికొచ్చేలోగా ఆ దంపతు లేదో మరో గొడవలో పడ్డారు. ఆ కొత్త కోరిక యేమిటో చెట్టి చెవిలో పడలేదుగాని అది డబ్బుమీద ఆధారపడి ఉన్నదే అని మాత్రం తేలింది. ఏమంటే ఆ యువకుడు తన పడుచుతో, "అంతా డబ్బుతో ఉందనుకో". 'ధనమూల మిదం జగత్' అని ఊరికే అన్నారా?" అన్నాడు. ఔను! అందుకేగా నేను 'విత్తం కొద్దీ వైభవం' అంటిని? డబ్బు లేని వాళ్ళకి ప్రతిదీ అందని మ్రానిపండే. డబ్బుంటే ఏ సుఖమైనా అరచేతిలో వెన్న ముద్దయి చిక్కుతుంది" అని భర్తతో యేకీభవించిందామె.

కాని చెట్టి, "ఎంత అమాయకులర్రా మీరిద్దరూనూ! డబ్బు సుఖాన్ని చేకూరుస్తుందట్రా వెఱ్ఱి మొహాలలారా? నూరు రూపాయలు పెట్టుబడితో వ్యాపారం మొదలెట్టిన నాకు ఇప్పుడు కొన్ని లక్షలుమూలుగుతున్నాయి? నేనేం సుఖపడ్డాను? ధనాన్ని గూర్చి మీరిద్దరూ ఇప్పుడు వెల్లడి చేసిన ఆ అభిప్రాయం శుద్ధ పొరపాటని నిరూపించటానికి నా కెంతో సేపు పట్టదు. ఎందుకూ ఒక్క పదివేల రూపాయలు తెచ్చిమీ చేతిలో పోస్తే సరి. ఆ డబ్బు మూలాన్ని ఎన్నెన్ని కీడులు మూడుతాయో మీకే తెలిసొస్తుంది? లేకుంటే కలిగే దుఃఖం కన్న ఉంటే ఉన్న దుఃఖం ఎక్కువదర్రా కుర్రవాళ్ళల్లారా. "డబ్బు, డబ్బో" అంటున్నారు వెధవ డబ్బు! డబ్బు చేరితే సుఖంగా నిద్రకూడా పట్టదు తెలుసా? ఆ పదివేలూ ఇచ్చి మీ సుఖనిద్ర చెడగొట్టమంటారా నన్ను చెప్పండి.... ఉహూ! నేనా పాపపు పని చెయ్యను! మానస సరోవరంలోని హంసలకు మల్లే హాయిగా ఆనందంతో తేలిపోతున్నారు మీరిప్పుడు. ఇలాగే ఉండండి. డబ్బులేదని విచారించకండి. వెధవడబ్బు" అని దాన్ని శపిస్తో చేయబోయిన ఆ వాగ్దానం అంతా ఉపసంహరించుకున్నాడు.

ఆమె చేతిలోంచి రుమాలు జారి క్రింద పడింది. ఆమె తీసుకుందామని వెనక్కి తిరిగింది. ఆ లోగానే యువకుడు దాన్ని తీసి ఆమె కెంతో సొగసుగా అందించాడు. ఆ చిరునవ్వు మొహంలోని సోయగాన్ని చూసి ఆమె, “ఎంత అందగాడు!” అనుకుంది. బటానీలూ, వేయించిన వేరు శనగపలుకులూ జంగెడలో పోసి అమ్మదెస్తూ ఒకడు ఎదురయాడు. యువకుడు అణా వేరు శెనగలూ, అర్ధణా బటానీలూ కొని ఆమె రుమాలులో పోశాడు. జంగెడవాని చేతిలో పావలా కాసు పడేసి, చిల్లరకై నడుస్తూనే చెయ్యిజాపేడు. జంగెడవాడు చిల్లర యిచ్చి, ముందుకు పోయేంతలో దానిలో అర్ధణా కాసు యువకుని చేతిలో గాక క్రింద పడిపోయింది. “ఏమిటి, వెతుకుతున్నారు?” అంది పడుచు. “అర్ధణా కాసు ఎక్కడో పడిపోయింది” అన్నాడతడు.

“పోనీద్దురూ, అర్ధణాయే కదా, యే ముష్టివానికో దొరికితే సంతోషిస్తాడు!” అని ముందంజ వేసింది. అతడూ ఆమె ననుసరించి వెళ్ళేడు.

ఆ వెనకాల ఇంకా వస్తూనే వున్న కనకాచలం చెట్టికి ఆ అర్ధణా కాసు కనపడింది. అతడు వెంటనే దాన్ని తీసుకుని జేబులో వేసుకున్నాడు.

# గోపీచంద్

**(1910 - 1962)**



**బ**హుముఖ ప్రజ్ఞాశాలి. సలక్షణమైన చిన్నకథలు వ్రాయుటలో సిద్ధహస్తుడు. రాజకీయ కథలు వ్రాసిన మొదటి రచయిత. కళకు ప్రయోజనం వుండాలనీ, ఆ ప్రయోజనం సంఘానికి శ్రేయస్సు కూర్చేదిగా వుండాలనీ, రచయిత రచనా విశేషం ఆ ప్రయోజనాన్ని సాధించటానికి ఉపయోగపడాలనీ వీరి సిద్ధాంతం. సజీవమైన భాషా, సరళమైన శైలీ, నిరాడంబరమైన శిల్పమూ, సూక్ష్మమైన మానసిక విశ్లేషణా, విప్లవాత్మకమైన భావసంపదా, హేతుబద్ధమైన శాస్త్రీయ విజ్ఞానమూ, సంగ్రహతా, వ్యంగ్యాత్మకమైన వ్యాఖ్యానాలు - వీరిని గొప్ప కథకునిగా జేసినయ్. వీరి నవల 'పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా'కు కేంద్ర సాహిత్య అకాడమీ ప్రైజు లభించింది.

**రచనలు - కథలు :** అనేక సంపుటాలు, అసమర్థుని జీవయాత్ర, యమపాశం, చీకటి గదులు, మెరుపుల మరకలు మొదలగు నవలలు, తత్త్వవేత్తలు, పోస్టు చేయని ఉత్తరాలు, చీకటి కోణాలు, త్వత్తమసి.



# ధర్మవడ్డీ

**నే**నా వూరు ఎందుకు వెళ్ళానో, నా కిప్పుడు జ్ఞాపకం లేదు. కాని వెళ్ళటం చిన్నప్పటి స్నేహితుడు కనపట్టం, తన ఇంటికి తీసుకువెళ్ళడం జరిగింది. కలవక కలుసుకోవడం వల్ల, చిన్నప్పటి విషయాలు తలుచుకుని నవ్వుకొంటూ వున్న సమయంలో అతడొచ్చాడు. రావటం రావటం ఎలా వచ్చాడని?

ముందు వాకిలి నెమ్మదిగా తెరిచాడు. కుడికాలు గడపలో పెట్టి అటూ ఇటూ దొంగ చూపులు చూశాడు. చంకలో వున్న మూటని పదిలంగా రెండోచేత్తో పట్టుకొని తల ఓరగా పెట్టి అడుగులో అడుగు వేసుకుంటూ, నా స్నేహితుని దగ్గరకొచ్చి చంకలో మూట అందిస్తూ "ఇదిగోనోయ్, డబ్బూ" అన్నాడు.

అసలు అతన్ని చూడగానే నా స్నేహితుడికి ముఖ కవళికలు మారిపోయినై. అందుకు ముందున్న సంతోషం మాయమైపోయింది. నెమ్మదిగా మూట అందుకుంటూ "మనిషంటే మనిషివి నువ్వే సూరయ్యా! నికార్సయిన మనిషివి" అన్నాడు.

ఆ మాటకు సూరయ్య సంతోషం పైకి కనపడనివ్వకుండా, "మాటలకేంలే? డబ్బు తీసుకోగానే కాదు. నెలరోజుల్లో అసలు ఫాయిదాలు ఇచ్చివెయ్యాలి. వడ్డీ నీకు తెలిసిందేగా – ధర్మవడ్డీ – నెలకి నూటికి రూపాయిన్నర. అదైనా నువ్వని ఇస్తున్నాను" అన్నాడు.

"అలాగే సూరయ్యా, నెలదాటక ముందే ఇస్తాను" అన్నాడు నా స్నేహితుడు.

"ఇస్తానంటే కాదు. మాట చెల్లించుకోవాలి. శుభకార్యం ఒకటి తలపెట్టానా? మంచికీ చెడుకీ డబ్బు కావాల్సి వొస్తుంది. తర్వాత కోర్టు గీర్టూ అంటే...

"అదేమిటి సూరయ్యా! నీ దగ్గర ఎన్నిసార్లు డబ్బు తీసుకోలేదు. ఎన్నిసార్లు యివ్వలేదు. ఎప్పుడైనా మాట తప్పీలు వొచ్చిందా?"

"సరేలే. డబ్బు లెక్కపెట్టుకో. అన్నీ రూపాయలే. కొద్దిగా మాత్రం చిల్లర వుంది. మళ్ళీ నాకు రూపాయలే ఇవ్వాలి సుమా! నోట్లూ గట్లూ అంటే కుదరదు."

"నువ్వు చెప్పాలా, సూరయ్యా" అంటూ నా స్నేహితుడు మూట విప్పాడు. చూసేటప్పటికి నా తల తిరిగిపోయింది. అయోమయం అయిపోయింది. ఆ మూటలో వున్నవన్నీ రాళ్ళే! చిన్న చిన్న రాళ్ళూ, పెద్ద పెద్ద రాళ్ళూ పెద్దవన్నీ కంకర రాళ్లూ, చిన్నవన్నీ గులక రాళ్ళూ! నమ్మలేక నా స్నేహితుని మొహం పరీక్షగా చూశాను. అతడు మాత్రం ఇదంతా లెక్క చెయ్యకుండా. అతి జాగర్తగా ఆ రాళ్ళని తీసి ఒక్కొక్కటే లెక్కపెడుతూ కూర్చున్నాడు.

నాకేమీ తోచక సూరయ్య వంక చూశాను. అతనింకా తల ఓరగానే పెట్టి లెక్క పెట్టబడుతూ వున్న రాళ్ళను రెప్ప వెయ్యకుండా పరీక్షిస్తున్నాడు. ఇంతలో నా స్నేహితుడు లెక్క పూర్తిచేసి, "సరిపోయినయి, సూరయ్యా" అన్నాడు.

"ఇవ్వాళ సరిపోయినై అంటే కాదోయి. ఇవ్వాళ ఇరవై. మళ్ళా ఇరవై సోమవారం నాటికి నా డబ్బంతా దమ్మిడీల్తో ఇచ్చేయ్యాలి" అని జ్ఞాపకం చేసి నా స్నేహితుడితో మూడుసార్లు "ఇస్తాను" అనిపించుకొని వెళ్ళిపోయాడు సూరయ్య.

అతడు ఎప్పుడు వెళ్తాడా, ఈ తంతేమిటో ఎప్పుడు తెలుసుకుందామా అని కూర్చున్న నేను, అడుగుదామని నా స్నేహితుని వైపుకి తిరిగేటప్పటికి, అతడు చేత్తో నన్ను వారించి వాకిలి వైపుకి చూపాడు. నేను అటు చూట్టం, సూరయ్య గభాలున తలుపు నెట్టుకొని లోపలకి రావడం ఒకేసారి జరిగింది. మనిషి ఇదివరకు మల్లే లేడు. ఆపాదమస్తకం వొణికిపోతున్నాడు. కళ్ళు యెర్రగా జ్యోతుల్లా వున్నై. గాలి తెగ పీలుస్తున్నాడు. తల మాత్రం ఓరగానే వుంది.

ఒక్క క్షణం వాకిట్లో ఆగి రంయిన నా స్నేహితుడి మీదకి వచ్చి ఇలా కేకలు వేశాడు – "ఏదీ నా డబ్బు? ఎన్నాళ్ళయింది? ఇదిగో అదిగో అంటూ కుక్కని తిప్పుకున్నట్టు నీ యింటిచుట్టూ తిప్పుకుంటావా? పరువూ మర్యాదా ఉండక్కర్లా? కడుపుకి అన్నం తింటున్నావా, గడ్డి తింటున్నావా?"

నిజం చెప్పొద్దూ! ఈ మాటలు వినేటప్పటికి నాకు కంపరం ఎత్తింది; కోపం వచ్చింది కాని ఏమి చెయ్యటం? గుడ్లు వప్పచెప్పి చూస్తూ కూర్చున్నాను.

నా స్నేహితుడు భయంగా, అతి వినయంగా, "ఇదిగో సూరయ్యా, నీ డబ్బు? నాల్గు రోజులు ఆలశ్యమైనంత మాత్రాన నీ బోటి పెద్ద మనిషి ఇట్లా నోరు పారేసుకోవటం ఏం మర్యాద?" అని తన దగ్గరే వున్న ఆ రాళ్ళ మూటని ఇచ్చాడు.

"మరి వడ్డీయో? డబ్బు నాకు చేదై ఇచ్చాననుకున్నావా? నీ తాతకి అచ్చుండి ఇచ్చాననుకున్నావా? పూర్తి పరిష్కారం చేసి కదులు." అని బొడ్లో చెయ్యేసి నిలవేశాడు సూరయ్య.

"ఇస్తాను సూరయ్యా, వొదులు" అన్నాడు నా స్నేహితుడు.

"తీసుకురా" అని ఒక్క తోపు తోశాడు సూరయ్య.

నా స్నేహితుడు పడబోయి నిభాయించుకొని గోడ పక్కకు వెళ్ళి పది రాళ్ళు ఏరి తెచ్చి సూరయ్య చేతుల్లో పెట్టాడు. సూరయ్య వాటిని లెక్కపెట్టుకొని, నా స్నేహితునితో ఒక్క మాటైనా అనకుండా గిరుక్కున వాకిలి వైపుకు తిరిగి తల ఓరగా వుంచుకొని గబ గబా నడిచి వెళ్ళిపోయాడు.

నా స్నేహితుడు ఒక్క నిట్టూర్పు విడిచి నేను అడగవలసిన అవసరం లేకుండా తానే ఇలా చెప్పాడు. – "పాపం ఏం చెప్పను? ఒకప్పుడు ఈ ఊళ్ళోకల్లా షావుకారు సూరయ్య.ఇప్పుడు పిచ్చెక్కి యీ విధంగా తయారయ్యాడు" అన్నాడు.

"ఇతనికి పిచ్చా? ఎందుకెత్తింది? పిచ్చిలో ఇదేమిటి?" అని అడిగాను.

నా స్నేహితుడు సూరయ్య కథ ఈ విధంగా చెప్పాడు.

"సూరయ్య ఈ గతికి రావడానికి అతని తండ్రే కారణం. అతని తండ్రి చాలా మంచివాడు. మెత్తని హృదయం కలవాడు. అటువంటి అతడే, కొడుకు పతనానికి కారకుడయ్యాడు."

"అంత మంచివాడు.... ....."

చెప్తాను విను. అంత మంచివాడు అవటం వల్ల దానాలు చేసీ, అడ్డాలు వుండీ తన ఆస్తంతా పాడు చేశాడు. ఆస్తిపోయిన తర్వాత పలకరించే దిక్కు లేకుండా చచ్చిపోయాడు. ఇది కన్నులారా చూచిన సూరయ్యకు సంఘం మీద కసి ఏర్పడ్డంలో ఆశ్చర్యం లేదు. అందుకని పూర్తిగా తన స్వభావాన్నే మార్చుకొని పెత్తనానికి వొచ్చినప్పటినుంచీ కఠోరంగా సంపాదించడం మొదలు పెట్టాడు. ఉన్న నాలుగు ఎకరాలూ అమ్మేసి వడ్డీ వ్యాపారం మొదలుపెట్టాడు. మనుషుల్తో ఉన్న ఇతరత్రా సంబంధాలన్నీ క్రూరంగా తెగ్గొట్టుకున్నాడు. తనకీ, మిగిలిన మనుషులకీ ఒక్కటే సంబంధం – వడ్డీ వ్యాపారం. తాను వడ్డీకి డబ్బు ఇవ్వటానికి పుట్టాడు; మిగిలిన జనం డబ్బు పుచ్చుకొని వడ్డీ ఇచ్చుకోటానికి పుట్టింది.

ఇట్లా తయారై, మిగిలిన రైతుల్ని పీల్చి పిప్పిచేసి కొద్ది సంవత్సరాల్లోనే వూళ్ళో కల్లా షాహుకారై కూర్చున్నాడు. ఎంత షాహుకారైనా డబ్బు సంపాదించడం అలవాటైన తర్వాత పద్ధతులు యెలా మారతై – కనక డబ్బు అవసరం లేనప్పటికీ కూడా పాత పద్ధతులమీదే నడిచాడు. పిల్లికి బిచ్చం పెట్టేవాడు కాదు. అడిలిగీపెట్టినా దమ్మిడీ జారవిడిచేవాడు కాదు. బాకీదార్లని ఎన్ని కష్టాలు పెట్టాలో అన్నీ పెట్టి, ఇన్ని నీళ్ళు కూడా పుట్టకుండా చేసి తన డబ్బు పిండుకునేవాడు. ఆ పిండుకోవడంలో కూడా దయాదాక్షిణ్యాల్లేవు. కొంపలు కూలినా, కుటుంబాలు నాశనమైనా అతని హృదయం కరిగేది కాదు.

అందుకని అతని డబ్బుతో పాటు, అతనిమీద వూళ్ళో అసూయా అసహ్యం కూడా పెరుగుతూ వచ్చినై. అతన్ని చూస్తే భయమే తప్ప, ఇష్టం ఒక్క వ్యక్తి క్కూడా లేకుండాపోయింది. సూరయ్య ఇదికూడా మంచిదే అనుకున్నాడు. నాక్కావలసింది డబ్బు; వీళ్ళయిష్టం ఎవరి క్కావాలి? అంటూ వుండేవాడు. పరిస్థితులు ఇట్లా వుండగా ఒక సంఘటన జరిగింది.

ఈ ఊళ్ళోనే అవతలి వీధిలో చంద్రయ్య అనే రైతు వున్నాడు. చంద్రయ్య ఈ సూరయ్యకి రెండు వందల రూపాయల బాకీ యివ్వతేలేదు. చంద్రయ్య అవటం చిన్న రైతే ఐనా టౌన్తో సంబంధం వున్నవాడు అవటం వల్ల, డబ్బన్నా కోర్టన్నా లెక్క లేకుండా వుండేవాడు. డబ్బున్న వాళ్ళంటే అసహ్యంవుంది. భయం లేదు. తనకు అవసరానికి డబ్బిచ్చాడనే విశ్వాసం లేకపోగా తన దగ్గర సూరయ్య అన్యాయంగా డబ్బు దోచుకుంటున్నాడనే భావం, కోపం కలిగినవాడు. సూరయ్య హెచ్చు వడ్డీ వస్తుందని అతనికి అప్పు పెట్టాడే గాని, పెట్టిం దగ్గర్నుంచీ డబ్బు రాదేమో అనే భయంతో అతని ఇంటి చుట్టూ తిరగటం మొదలు పెట్టాడు. ఒక రోజు చంద్రయ్యని నా డబ్బిచ్చి కదలమని నిలవేశాడు. నానా దుర్భాషలూ ఆడాడు; దాన్తో లోలోపల రగులుకుంటున్న అగ్ని చంద్రయ్యలో నుంచి గుప్పున బయట పడింది – "నేను దమ్మిడీ ఇవ్వను. నీ తాత్తో చెప్పుకో! ముందు గడపలోనుంచి అవతలకి వెళ్ళు" అని కేకలు వేశాడు.

పాపం సూరయ్యకు ఇట్లాంటి అనుభవం ఇదివరకెప్పుడూ కలగలేదేమో, చంద్రయ్య మాటలకి నిరుత్తరుడై ఒక్క నిమిషం మాట్లాడలేకపోయాడు.

"వెళ్ళవ్!" అని గద్దించాడు చంద్రయ్య., "చంద్రయ్యా! ఇది నీకుమంచిది కాదు; కోర్టుకు లాగి వప్పు తీయిస్తాను" అన్నాడు సూరయ్య.

"వప్పు తీయిస్తావ్రా మాదచ్చోద్" అని నానా బూతులు కూసి మెడమీద కఱ్ఱవేసి బయటకు గెంటాడు చంద్రయ్య.

ఇక చూడు సూరయ్య సంగతి. సూరయ్యకు శివం ఎత్తింది. పిచ్చి గంగిర్లెత్తినై. కనపడ్డవాడు కల్లా చెప్పాడు. "ధర్మ వడ్డీ – ధర్మవడ్డీ కూడా ఇవ్వడట; అసలేం ఇవ్వడట; ఇదెక్కడన్నా వుందా? రాములవారి కాలం నుంచీ ఈ వడ్డీ వుంది కదా?" అని మొత్తుకున్నాడు.

తిరిగి తిరిగి ఇంటికి వెళ్ళి గబ గబా నాలుగు మెతుకులు నోట్లో వేసుకని అంగోస్త్రం నడుంకి కట్టి తెల్లగుడ్డ గొడుగు చంకనపెట్టి టౌన్కి బయల్దేరాడు. అప్పటికీ ఆశ చావక, చంద్రయ్య వాకిలి ముందు సకిలిస్తూ నాలుగైదు సార్లు అటూ యిటూ పచారు చేశాడు. బజార్న పోతున్న వార్ని నిర్నిమిత్తంగా పిలిచి "కొంచెం కోర్టులో పని వుండి టౌన్కి

వెల్తున్నాను" అని ఇంట్లో వున్న చంద్రయ్యకు వినబడేటట్టు చెప్పాడు. చంద్రయ్య "కోర్టుక్కాదు నిన్ను పుట్టించిన బ్రహ్మదేవుడి దగ్గరకు వెళ్ళు. ఈ వూరు నీళ్ళు నీకు ప్రాప్తం లేదు" అని ఇంట్లో నుంచే కేకవేశాడు.

ఇంకేం చేస్తాడు? ఇక తప్పే దేముంది? చంద్రయ్య మాటలకు కొంచెం జంకినా డబ్బెలా వొదులుకోవటం? మనస్సుని తిట్టి లోబరచుకొని టౌన్‌కి వెళ్ళి ప్లీడరుతో మాట్లాడి, చంద్రయ్యకు రిజిష్టరీ నోటీసు ఇప్పించాడు. నోటీసైతే ఇప్పించాడే గాని, మనస్సులో ఆరాటం హెచ్చింది. దిగులు దిగులుగా వుండి ఏమీ తోచక టౌనులో అటూ ఇటూ తారట్లాడి ఇంటికి బయల్దేరేట ప్పటికి మసక పడ్డది. టౌను నుంచి మా వూర్రావాలంటే రోడ్డు దిగి డొంకలో మైలు నడవాలని నీకు తెలుసు. డొంక దగ్గరకు వచ్చేటప్పటికి బాగా చీకటి పడ్డది. రోడ్డు దిగేటప్పటికి అతనికి భయం వేసింది. ఆ డొంక మా ఓక్క వూరికి వచ్చేదే అవటం వల్ల మనుష్య సంచారం తక్కువగా వుంటుంది. పైగా రెండు పక్కలా కొరివి దయ్యాలు తలలు విరబోసికున్నట్లు కనబడే, గుబురుగా పెరిగిన చెట్లు. సూరయ్య ధైర్యం చేసి ఆంజనేయ దండకం పఠిస్తూ డొంకలో పది గజాలు నడిచాడు. ఆ పెద్ద మర్రిచెట్టు చూశావుగా, అక్కడకు వొచ్చాడు. అకస్మాత్తుగా పక్క పొదల్లో అలికిడి వినిపించి ఆగిపోయాడు. గొంతులో పాట గొంతులోనే ఆగిపోయింది. వెంటనే అతని కోసం పొదల్లో కనిపెట్టుక్కూచున్న చంద్రయ్య ముఠా పదిమంది అతన్ని కమ్ముకున్నారు. మీదకు దూకారు. చావచిదక గొట్టారు. పాపం కింద పడేసి సున్నం మీద ఎముకల్లేకుండా కొట్టారు. చంద్రయ్య మీద పడి అతని జేబులోవున్నఇరవై రూపాయలూ లాక్కొని "దావా దాఖల్చేశావుగా? కర్చెవ్వరు పెట్టుకుంటారు నీ తాత?" అని కాలికి వొచ్చినట్టు తన్నీ, మిగిలిన వాళ్ళని తీసుకొని, సూరయ్యని అక్కడే వొదలి వెళ్ళిపోయాడు.

క్షణాల మీద ఈ వార్త ఊరంతా పొక్కింది. "సూరయ్యని కొట్టారంటే సూరయ్యని కొట్టా"రని వూరంతా ఆ గుబ్బుగా చెప్పుకుంది. కాని ఒక్కడు కూడా జాలి తలిచినవాడేలేడు. 'పాపం' అన్న పాపాన పోయినవాడే లేడు.

సూరయ్య భార్య దొడ్డ ఇల్లాలు. కూతురు కూడా చాలా మంచిది. కాని బయట జరిగే దురంతాలను వాళ్ళెలా ఆపగలరు? సూరయ్య మనస్సుని ఎలా తిప్పగలరు?

తెల్లగా తెల్లవారిం తర్వాత వూళ్ళో షాహుకార్లు సూరయ్యని పరామర్శించడానికి వొచ్చారు. సూరయ్యకు ఆ రాత్రంతా నిద్రలేదు. ఏదో ఆలోచించుకుంటూ కూర్చున్నాడు. భార్యా కూతురు నోటికి మూతలేకుండా ఏడుస్తున్నా, వాళ్ళ వంకకే చూట్టం లేదు. అన్ని దెబ్బలు తిన్నా ఒక్క మూలుగన్నా మూలగటం లేదు.

షాహుకార్లు వొచ్చి, "సూరయ్యా! ఇక చూస్తూ వూరుకుంటే లాభం లేదు. క్రిమినల్ కేసు బణాయించి వాళ్ళ అంతు కనుక్కోవలసిందే?" అన్నారు.

సూరయ్య కొంచెం కదిలి, వాళ్ళని నింపాదిగా చూచి, "ఇంకేం? అందరం చందాలు వేసుకొని వ్యాజ్యమాడదాం" అన్నాడు.

'చందాలు' అనేటప్పటికి షాహుకార్లు మొహమొహాలు చూసుకున్నారు. "ఇదేమిటి సూరయ్యా నిన్ను కొట్టటమేమిటి? మేం చందాలు వేసుకోవటమేమిటి?" అన్నారు.

ఈ మాటలకు సూరయ్యకు కోపం వచ్చింది. అంత బాధలోనూ లేచి కూర్చుని "వాళ్ళు నన్ను కొట్టారా? నా దగ్గిర వున్న డబ్బుని కొట్టారు. అంటే ఈ వూళ్ళో వున్న షాహుకార్లందర్నీ కొట్టారు. వడ్డీకోసం అప్పుపెట్టే ప్రతివాడ్నీ కొట్టారు. నన్ను కొట్టటమైతే ఒక్క చంద్రయ్యే కొట్టేవాడు. మిగిలిన వాళ్ళంతా ఎందుకు కుమ్మక్కు చేస్తారు? వాళ్ళు కొట్టగలరు గనక అంతా కలిపి కొట్టారు. మనం చందాలు వేసుకోగలం గనక అంతా కలిసి చందాలు వేసుకుందాం" అన్నాడు.

షాహుకార్లకు యిదేమీ అర్థం కాలేదు. దెబ్బల్తో సూరయ్య మతి చెడ్డదీ అనుకున్నారు. నెమ్మదిగా ఒకరి తర్వాత ఒకరు జారుకున్నారు.

ఎంతమంది చెప్పినా, ఎంత చెప్పినా సూరయ్య వినలేదు – కేసు పెట్టనంటే పెట్టనన్నాడు. "నా సొంత డబ్బు తగలేసుకొని, ఈ డబ్బున్న వాళ్ళకోసం వ్యాజ్యం ఆడిపెట్టనా? నే చెయ్యను" అనేవాడు.

కాని, చంద్రయ్య ఏ ముహూర్తాన చెయ్యి చేసుకున్నాడో గాని, అప్పటినుంచీ సూరయ్య దశ తిరిగిపోయింది. దెబ్బలు తిని కేసు పెట్టకపోయేట ప్పటికి వూళ్ళో వాళ్ళకి లొల్లి అయిపోయాడు. తాము ఏ డబ్బుని చూచి భయపడుతున్నారో ఆ డబ్బు సమయానికి సూరయ్యను ఆదుకోలేకపోయేటప్పటికి ఇంకేముంది? పెద్దలు మొదలు, కుర్రవాళ్ళవరకూ సూరయ్యని ఆటలు పట్టించడం మొదలు పెట్టారు. ఇల్లు కదిల్తే చాలు – "సూరయ్య వడ్డీ, చంద్రయ్య లాఠీ" అని పిల్లలు చప్పట్లు కొట్టుకుంటూ వెంటపడేవారు. రావలసిన డబ్బు అడిగితే బాకీదార్లు "ఏం తన్నులు కావాలా?" అనేవారు. కొందరు 'ఇదిగో అసలు – ఇదిగో వడ్డీ' అని మొట్టికాయలు వేసేవారు కూడాను.

చివరకు సూరయ్యకు చిల్లి గవ్వ కూడా వసూలు కాకుండా పోయింది. ఎట్లా వచ్చిన డబ్బు అట్లాగే పోయింది. ఎక్కడ పెట్టిన డబ్బు అక్కడే ఇంకిపోయింది. తనకు తదనంతరమైనా వస్తుందనుకున్న ఆస్థి రాకుండా పోయిందని అల్లుడు కూతుర్ని ఇంట్లోనుంచి వెళ్ళగొట్టాడు.

సూరయ్య భార్య మొహం, కూతురు మొహం చూడలేక వీలైనంత వరకు ఇంట్లో వుండకుండా తిరుగుతూ కాలం గడిపేవాడు. నాలుగు మెతుకులు నోట్లో వేసుకొచ్చి చెరువు గట్టుమీద రావిచెట్టు కింద ఒంటరిగా కూర్చునేవాడు. ఇన్ని రాళ్ళు ఏరుకుని ఒక్కొక్కటీ చెర్లో వేస్తూ, అవి నీళ్ళలో పుట్టించే కదలికను పరీక్షిస్తూ కూర్చునేవాడు.

కాని, ఊళ్ళో జనం అక్కడ అతన్ని సుఖంగా వుండనివ్వలేదు. అతడు నిస్సహాయుడౌతున్న కొద్దీ జనం తన బలాన్ని యెక్కువ ఉపయోగించడం మొదలు పెట్టింది. జనానికి అతనిమీద కలిగిన కసీ, అలుసూ అతనితోనే ఆగక అతని కుటుంబం మీదకు తిరిగింది.

ఒకరోజు సూరయ్య కూతురు వాముల దొడ్లో గేదెకు మేత వేస్తుంటే నలుగురు పట్టుకొని గాతంలో పడేసి బలాత్కారంగా చెరిచారు. వాళ్ళు విడిచిపెట్టి వెళ్ళిం తర్వాత ఆ పిల్ల లేచి, నడవలేక కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి, బావిలో పడి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంగతి తెలిసి సూరయ్య భార్య అవమానాలు సహించలేక కిరసనాయిలు పోసుకొని కాల్చుకొని మరణించింది. అదే సమయంలో విరోధులు సూరయ్య ఇవ్వవలసిన బాకీలు తమ పేర ట్రాన్స్‌ఫర్ చేయించుకొని ఇల్లు వేలం వేయించారు...."

ఇంతవరకూ ఓపికతో విని, ఇక ఆపుకోలేక నేను ఈ ప్రశ్న వేశాను – "ఈ ఘోరకృత్యాన్ని జరక్కుండా ఎవ్వరూ ఆపలేదూ?"

"తప్పన్న వాళ్ళే లేరు. చేసుకున్నది అనుభవిస్తున్నాడని కొందరూ, ఈ ఉద్రేకంలో అడ్డు చెపితే తమ కుటుంబాలు సరిగ్గా ఉండవేమో అనే భయంతో కొందరూ, మొత్తానికి అంతా మెదలకుండా వూరుకున్నారు."

"ఊఁ! తరవాత ఏం జరిగింది?" అని అడిగాను.

"ఇంకేముంది? డబ్బుదారిన డబ్బు నడిచింది. కూతురు అలా పోయింది. భార్య ఇలా అయిపోయింది. సూరయ్య గుండెలు పగిలిపోయినై. ఆవులాగా అడలుతూ వూరు పట్టుక తిరిగేవాడు. కొన్నాళ్ళకు పిచ్చెత్తింది. ఇప్పు డెవరన్నా జాలి తలిచి ఇన్ని మెతుకులు పెడితే తింటాడు. ఆ చెరువుగట్టు మీద రావిచెట్టు కిందే వుంటాడు. ఎండలో, వానలో అక్కడే వుంటాడు. ఎప్పుడూ కూతురు సంగతి గానీ, భార్య సంగతి గానీ ఎత్తడు. ఎవర్నీ పలకరించడు. రోజు కొక్కసారి వెళ్ళి తన పాత ఇంటిని దూరాన్నుంచి చూచుకొని కన్నీరు పెట్టుకుంటూ వుంటాడనీ, రాత్రిళ్ళు తన కూతురు పడి ఆత్మహత్య చేసుకున్న బావి దగ్గరకి వెళ్ళి ప్రదక్షిణం చేసి వస్తూ వుంటాడనీ వూళ్ళో వాళ్ళు చెప్పుకుంటూ వుంటారు... ఇదీ సమాచారం...."

నేను కథంతా ప్రాణాలు బిగపట్టుకొని విన్నాను. సూరయ్య కథ చెప్పమన్నప్పుడు ఇటువంటి విషాదగాథ వింటానికి సిద్ధపడలేదు. గనుక చాలా ఖేదపడ్డాను. "మరి ఈ రాళ్ళ వ్యవహారమేమిటి?" అని అడిగాను.

'అలవాటు' అన్నాడు నా స్నేహితుడు. "పాత అలవాటున పట్టి ఇలా చేస్తూ వుంటాడు. మేం కూడా జాలిపడి అతని మనస్సుని ఈ అవస్థలో కష్టపెట్టడం ఎందుకని తగు విధంగా ప్రవర్తిస్తూ వుంటాం. ఈ సూరయ్య...."

నా స్నేహితుడు చెబుతుండగానే వీధిలో పెద్ద గోల బయల్దేరింది. "సూరయ్య వడ్డీ, చంద్రయ్య లాఠీ" అని కేకలు బయటనుంచే సూరయ్య 'బే' అని అడిలాడు. ఆ ధ్వని విని మే మిద్దరం బయటకు పరుగెత్తాం.

బయట వీధిలో సూరయ్య రోజుకుంటూ, రొప్పుకుంటూ గబ గబా నడుస్తూ వెళు తున్నాడు. చేతుల్లో నా స్నేహితుడిచ్చిన మూట భద్రంగా వుంది. వెనక పదిమంది పిల్లలు పోగై గోల చేసుకుంటూ సూరయ్య మీదకు రాళ్ళు విసురుతున్నారు.

నడుస్తూ నడుస్తూ వున్న సూరయ్య అకస్మాత్తుగా పరుగెత్తటం మొదలు పెట్టాడు. రయిన పరుగెత్తి ఒక ఇంటిముందు ఆగి, ఒక్క నిమిషం ఆ యింటిని చూచి అక్కడ నుంచి కదిలి పక్కనే వున్న బావి గట్టుమీద నిలబడ్డాడు. పిల్లలంతా ఎక్కడి వాళ్ళు అక్కడే ఆగిపోయారు. చేతుల్లో రాళ్ళు చేతుల్లోనే వున్నాయి. నేనూ నా స్నేహితుడు వూపిరి బిగపట్టి చూస్తూ నుంచున్నాం. సూరయ్య వంగి బావిలోకి చూచి లేచి, ఇంటి వైపుకి చూశాడు. ఉండి ఉండి 'బే' అని సైరన్‌లాగా, విన్నవాళ్ళకి సలపరం పుట్టేటట్టు అడిలి రాళ్ళమూటతో సహా బావిలోకి దూకాడు.

వాళ్ళూ వీళ్ళూ పోగయ్యారు గాని ఏమీ లాభం లేకపోయింది. నా స్నేహితుడిచ్చిన రాళ్ళ మూట తేలనివ్వకపోయింది. శవం బయటకు వచ్చింది. తర్వాత – మేం ఇంటికి వచ్చిన తర్వాత – నా స్నేహితుడు ఇలా చెప్పాడు – "ఆ ఎదురుగా వున్న ఇల్లే అతని ఇల్లు. అతడు దూకిన బావే అతని కూతురు ఆత్మహత్య చేసుకున్న బావి."



# పిలకా గణపతిశాస్త్రి

**(1911 - 1983)**

**వి**ద్వత్కవులు. విమర్శకులు, పండితులు. ప్రాచ్య పాశ్చాత్య సాహిత్యాలను మథించి ఒక విశిష్టతను అలవరుచుకొని తెలుగుకథకు క్రొత్త అలంకరణలు సమకూర్చారు. పౌరాణిక, జానపద, చారిత్రక, సాంఘిక ఇతివృత్తాలతో అనేక రసాత్మక కథలు వ్రాశారు. వీరి కథలలో మన జాతి ఔన్నత్యమూ, సంప్రదాయాలూ, ఆదర్శాలూ, లలితకళల ప్రాభవమూ సాక్షాత్కరిస్తాయి. కాల్పనిక సాహిత్య స్రష్ట. శైలి అలంకారశోభితం. ఆంధ్రపత్రికలో పని చేసేవారు.

**రచనలు :** విశాల నేత్రాలు (నవల) ప్రాచీన గాథాలహరి (కథలు)

# గాంభీర్యం

## 1

"ఇది ఎవరి విగ్రహం మల్లన్నా?"

మల్లన్న ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు. అతని కింతవరకూ రాజనర్తకి రంగనాయకి తన వెనక నిలబడినట్లే తెలియదు. అతడు తదేక ధ్యానంగా తన శిల్పంలో నిమగ్నుడైనాడు. తటాలున వెనక్కి తిరిగి రంగనాయకిని చూచి, చకితుడై, తన చిరుగుల ఉత్తరీయం ఒళ్ళంతా కప్పుగుని, చేతిలోని ఉలికింద ఉంచకుండానే కంగారు పడుతూ యాదాలాభంగా.

"అబ్బే! ఎవరిదీ కాదు!" అన్నాడు.

"ఇంతవరకు చెక్కిన తరవాత ఎవరిదీ కాకపోవడ మేమిటి?"

"అయినా నీ కళ్ళ కెల్లాగ కనిపిస్తూందో చెప్పు చూదాము?"

"కోతిలా ఉంది?"

"నిజంగానే!"

"నిజమే!"

"కోతిమాత్రం కాదులే!"

"అయితే ఆంజనేయ స్వామివారా?"

"కాదు"

"మరి ఎవరు చెప్మా?"

"దేవదాసి!"

"అయితే నేను కోతినంటావా?"

మల్లన్న అట్లాగే తన విగ్రహం చెక్కుతూ "నువ్వేదో అప్సరస ననుకుంటున్నావు గాని నిజంగా కోతివే" అని రెట్టించాడు. దీనితో ఆమెలోని పరిహాసభావం అంతా పటాపంచలయి పోయింది. ఆ తరవాత రంగనాయకి "ఓహో! మాటలు బాగానే నేర్చావే!" అని అతనికేసి

చురచురా చూస్తూ అక్కడినుంచి బయలుదేరి ఆ దగ్గిరగానే వున్న నాగమూర్తి భవనం వైపు గబగబా నడిచి వెళ్ళింది.

మల్లన్న ఆమె శరీర భంగిమలు గమనిస్తూ అలాగే శిల్పం మలుస్తున్నాడు. ఆమె మీద పడిన పుష్యమాసోదయ కాంతిలో ఆమె మొలనూలి మువ్వలు, కర్ణతాటంకాలు, కాలి అందెలు తళతళ మెరిశాయి. మల్లన్న ఆమె చంచల శరీర భంగిమలు గమనిస్తూ మధ్య మధ్య తాను మలిచే శిల్పం కేసి నిదానంగా పరిశీలిస్తున్నాడు.

శిల్పాచార్యుడు నాగమూర్తి భవనం చుట్టూరా ఉన్న ఉద్యానవనంలోని ఒక పొన్నతరువు నీడలో నిలబడి మల్లన్న ఉలితో ఒక విగ్రహం మలుస్తున్నాడు. అతని దృష్టి కనుచూపు మేరలో నడిచి వెడుతూన్న రంగనాయకిని పరిశీలిస్తున్నది.

అప్పుడే రెండు గడియల పొద్దెక్కింది. అయినా మంచు కురవడం వల్ల ఆ పరిసరం అంతా పొగ కమ్మినట్లు దృశ్యాదృశ్యంగా భాసిస్తున్నది. మంచు బిందువు లప్పుడప్పుడు చెట్ల ఆకులమీద నుంచి జారి నేలపై రాలుతున్నాయి. దూరంగా ఒక చోట కొంతమంది పిల్లలు చలిమంట చుట్టూరా చేరి చలి కాగుతున్నారు. చలిమంట పైకి లేచిన కొద్దీ దూరంగా నృత్యంచేసే వారి నీడలన్నీ దగ్గిర దగ్గిరగా గుమిగూడుతున్నాయి. ఆ చలిమంట వెలుగులకుమేలుకున్న పిట్టలు గూళ్ళలో కలకలరావాలు చేస్తున్నాయి. మల్లన్న అల్లాగే కనబడినంత వరకు రంగనాయకిని పరిశీలిస్తూ చెక్కడపు పని చేస్తున్నాడు. దూరంగా భవన ప్రాంగణంలో ఆచార్యునితో సంభాషిస్తున్నా, రంగనాయకి వైఖరు లతని శిల్ప విన్యాసాలకు సహకరిస్తూనే వున్నాయి.

రంగనాయకి ప్రత్యక్ష మయ్యేసరికి శిల్పాచార్యుని సర్వావయవాలు నేత్రాలై వికసించాయి. వస్తూనే రంగనాయకి ఒక వంకదణ్ణం పెట్టి, ఆచార్యుడు పూర్తి చేసిన మేనకా విశ్వామిత్ర శిల్పం ఎంతో ఆశ్చర్యంగా పరిశీలించసాగింది. నాగమూర్తి సోగగా వంగిన ఆమె నేత్రాంవలాలు తిలకించాడు. శిల్పం చూస్తూ, దాని విషయం గ్రహించిన ఆమె కపోలాలు ఎర్రబంతి పూరేకులు విరజిమ్మాయి. ఆచార్యుని కించుమించుగా 45 ఏళ్ళుండవచ్చును. అయినా ఆయన మంచి రూపసి లాగే కనిపిస్తున్నాడు. బంగారు సరిగంచు పనిగల వంగపండు రంగు కాశ్మీరు శాలువా కప్పుకున్న అతని శరీరచ్ఛాయ ఆ శాలువా కాంతులలో కలిసిపోతున్నది. మాట్లాడినప్పుడల్లా రత్నఖచిత కుండలా లాయన కపోలాలపై కదులుతున్నాయి. తాంబూలం నములుతూ మధ్య మధ్యన ఆయన పండు తమలపాకుల ఈనెలు తీస్తున్నాడు. ఒక చెక్క టక్కున కొరికి పెద్దపెద్ద పెదిమెలపై ప్రసరించే చిరునవ్వుతో ఆయన మెల్లిగా అన్నాడు.

"రంగా! ఇవ్వన్నీ ఎందుకో తెలుసునా?"

"తెలియలేదు. అళియరాయలవా రేమైనా కొత్త దేవాలయం కట్టిస్తున్నారా?"

"కాదు; యాచమనాయనిం గారు విఠలస్వామివారి గోపురం అలంకరింప జేసి, ధనుర్మాసోత్సవం చేయిస్తున్నారు."

"అయితే మేళతాళాల సందడి బాగా ఉంటుందన్నమాట!"

"ఆహా! అందులో నువ్వు కూడా వున్నావన్నమాటే! సరేగాని, ఈ మేనకా విశ్వామిత్ర విగ్రహం బాగా నచ్చిందా?"

"ఏమో నాకేం తెలుసును. నే నెప్పుడైనా మేనకను చూశాను గనకనా?"

"నేను మాత్రం చూశానా? రంగా?"

"అబ్బో! చూడకేం చాలా మందినే చూశారు! చూడకపోతే అచ్చుపోసినట్లింత బాగా చెక్కగలరా?"

రంగనాయకి అసూయగా ఆచార్యునివై పొక క్రీగంటి చూపు చూసింది.

"అదేమిటి రంగా! నిజంగా నిన్నే మనసులో పెట్టుకొని నే నీ మేనకామూర్తి మలిచాను."

"నే నంతటి చక్కని చుక్కనా?"

"నీవు సాక్షాత్తూ ఆ మేనకవే?"

"ఆః! చాల్లేండి మీ వేళాకోళాలు!"

"వేళాకోళాలు కాదంటే నమ్మవు గదా! నువ్వు ముమ్మాటికీ మేనకవే!"

ఆచార్యుని చూపు రంగనాయకి అధరరక్తిమవైపు తిరిగింది. ఆమె సిగ్గుతో తలవొంచుకొని, కాలి బొటనవ్రేలితో నేలమీద వ్రాస్తూ మెల్లిగా ఎత్తిపొడిచింది.

"పోనీలెండి! నేను కోతిని మాత్రం కాను! నా కదే పదివేలు."

"అదేమిటి? నువ్వు కోతివని ఎవరన్నారు?"

రంగనాయకి తనకూ మల్లన్నకూ మధ్య జరిగిన సంభాషణకు బాగా చిలువలు, పలువలు చేర్చి చెప్పింది. ఆచార్యునికి మల్లన్న మీద బాగా కోపం వచ్చింది.

"ఈమధ్యన వీడి ధోరణి ఏమీ బాగా లేదు. నే నొకసారి పిలిచి కూకలేస్తాలే!"

"అది అంతా ఎందుకులెండి! ఏదో మీదగ్గర విద్య నేర్చుకొని మీ పేరు నిలబెడితే చాల్లెండి."

ఆ పిమ్మట రంగనాయకి తిరిగి వెళ్ళబోయింది.

"అవునులే! నేనింత కష్టపడి నీ విగ్రహం చెక్కినందుకు బహుమతి!"

నాగమూర్తి రంగనాయకి దగ్గిరగా వచ్చి ఆమె చెక్కిలి ముద్దు పెట్టుకోబోయాడు.

"చాల్లెండి! మీ కోతిచేష్టలు!" అని రంగనాయకి అతన్ని తప్పించుకొని తుర్రుమని

వీధిలోకి పారిపోయింది. ఆచార్యునికి ఆమె మాటల నిగూఢ వ్యంగ్యం సూటిగా గుండెల్లో నాటుకొంది.

**2**

ధనుర్మాసోత్సవాలు బాగా దగ్గిరపడ్డాయి. సంక్రమణ పుణ్యకాలానికి స్వామి ఆలయగోపు రాలంకారాలన్నీ పూర్తి అయిపోవాలి. ఆచార్యుని శిష్య లందరు ఒక్కరొక్కరే తమకు అప్పగించిన ప్రత్యేక విగ్రహాలన్నీ పూర్తి చేసి ఆచార్యుని కప్పగిస్తున్నారు. మల్లన్న కప్పగించిన వాటిలో రెండు మూడు మూర్తులింకా పూర్తి కావలిసే వున్నాయి. ముహూర్తం దగ్గిరపడుతున్న కొద్దీ ఆచార్యున కీ విషయంలో ఆతృత ఎక్కువైంది. ఏదో తన పని తాను చేసుకుపోతున్నాడు కదా అని ఈ మధ్యన నాగమూర్తి అతని పని ఎంత జరిగిందో బాగా పరిశీలించలేదు. ఈ మల్లన్న తల్లిపోయిన దగ్గరనుంచీ ఆచార్యుని కేదో ఆవేదన కలిగిస్తూనేవున్నాడు.

మల్లన్న నాగమూర్తి కొక వేలు విడిచిన మేనల్లుడవుతాడు. వాళ్ళది చాలా సామాన్య సంసారం. చిన్నతనంలోనే తల్లిదండ్రులు పోయిన మల్లన్నకు ఆచార్యుడే సంరక్షకుడైనాడు. మల్లన్న చిన్నప్పుడు చిట్టి చిట్టి మట్టిబొమ్మలు చేసి వాటితో ఆడుకునేవాడు. ఆచార్యు డతనిలో సునిశితమైన శిల్ప ప్రతిభ ఉన్నదని గ్రహించి, అతని నీ విద్యలో ప్రవేశపెట్టాడు. కాని మొదటినుంచీ అతని శిల్ప పద్ధతి అదొక తరహాగా తయారయింది. నాగమూర్తి శిష్యులందరితోనూ శిల్పంలో సౌందర్యము, లాలిత్యము, సంప్రదాయము, తూ-చ తప్పకుండా ఉండాలని నొక్కి చెబుతూండే వాడు. ఆ శిల్పాలన్నీ మార్దవపూర్ణమైన సౌందర్యంతో తొణికిసలాడుతూ ఉండాలని అతని పట్టుదల. ఎఱ్ఱన్న మొదలయిన శిష్యులంతా విగ్రహాలన్నీ ఆయన చెప్పినట్టుగా అచ్చుపోసినట్లు తయారు చేసి యిచ్చేవారు. వేషభాషల దగ్గిరనించీ వారు నాగమూర్తిని అనుకరించే వారు ఆత్మస్తోత్ర పాఠాలలా ఉన్న ఆ శిల్పాలు చూసి ఆచార్యుడు మురిసిపోతూ వుండేవాడు. కాని, మల్లన్న బాణీ అంతా అతని కేదో వికారంగా, తన శిల్పాలను వేళాకోళం చేస్తున్నట్టుగా వుండేది.

ఆచార్యుడు తన భవన ప్రాకారంలో యెక్కడా అసౌందర్యం గాని, అమంగళచ్ఛాయగాని, విషాద నిశ్వాసంగాని చొరకుండా అతి జాగ్రత్తగా కాపాడుకునేవాడు. ఎక్కడైనా ఒక్క కాకిపిల్ల కూసినా అతని శ్రుతికుహరాలలో శూలంతో పొడిచినట్టుండేది. సకృత్తుగానైనా దౌర్భాగ్యంతో అల్లాడే దరిద్రులు కనిపిస్తే అతడు దూర దూరంగా తప్పుకుని ఒక్క నిమిషం కళ్ళు మూసుకునే వాడు. ఎల్లప్పుడు పాము కుబుసాల వంటి సరిగంచు వలువలు, ఉత్తరీయాలు ధరించి వాటి భారానికే అలిసిపోయి ఉసురుసురంటూ ఉండేవాడు. అతని స్వాప్నిక శిల్ప జగత్తులో వారసుందరీ సౌందర్యం ఒయ్యారంగా నృత్యం చేస్తూ

కళ్ళలో కలిసిపోయేది. ఆ వారకాంతల పాదకింకిణీ మంధరనాదం అతని అంతరాంతరాల్లో వీణానిక్వణనంలా మ్రోగి రాగప్రవాహాలతో వెల్లివిరిసేది.

నాగమూర్తి మధ్యాహ్నం భోజనం చేసి తాంబూల సేవ చేసి హంసతూలికా తల్పం మీద మేనువాల్చి కొంచెం సేపు విశ్రమించాడు. తిరిగి లేచేసరికి మధ్యాహ్నం మూడు ఝాములు తిరిగింది. నాగమూర్తి బద్ధకంతో, జోగే కళ్ళతో శీతాకాలం ఎండలో చలికాగుతున్నట్లు నిశ్చలంగా నిలిచిన పూలతీగల వేపూ, పొన్నతరువుల వైపూ, నీడల్లో కలిసిపోతున్న నీరెండవైపూ చూస్తూ రెండు మూడు సారులు ఆవలించి చిటికెలు వేశాడు.

అంతలో లోపలికి నిశ్శబ్దంగా వచ్చి నిలిచిన ఎల్లన్న అతని భావనా ప్రవాహానికి అడ్డు తగిలాడు.

"ఏం? ఎల్లన్నా! పని అంతా అయిపోయినట్లేనా?"

"ఆఁ అన్నీ అయినట్లే! ఇంకా మల్లన్న ఒకటి రెండు మూర్తులకు నగిషీ పని చెయ్యాలనుకుంటాను!"

ఆచార్యునికి చిరాకు తలకెక్కింది. "ఒరే, తెల్లారితే ముహూర్తంగదా! ఇన్నాళ్ళనించీ వీ దేమి చేస్తున్నట్టు?"

రంగనాయకి ఎన్నడూ ఎల్లన్న శిల్పాలదగ్గిరికి రానైనా రాలేదు. అందుచేత ఇప్పుడతని కొక అవకాశం దొరికింది. ఆ లోపలికోపంతో చల్లగా అంటించాడు.

"ఏమోనండి! ఏంచేస్తున్నాడో! అస్తమానమూ ఏవో రాళ్ళు మలుస్తూనే ఉన్నట్లు ఉంటాడు మరి."

నాగమూర్తి ముఖం ధుమధుమలాడింది. ఎల్లన్న ఆ విషయం కనిపెట్టక పోలేదు.

"ఒరేయి! ఎల్లన్నా! పద! పని ఎంతవరకయిందో చూదాము."

ఇద్దరూ నడిచివెళ్ళి మల్లన్న శిల్పాలు మలుస్తున్న పొన్నచెట్టు నీడకు జేరుకున్నారు. అచార్యుడు అతడు చెక్కిన శిల్పాలన్నీ చూసి ప్రస్తుతం మల్లన్న మలుస్తున్న విగ్రహం దగ్గర నిల్చున్నాడు. మల్లన్న తన తన్మయతలో వెనకాల నిల్చున్న గురుశిష్యుల నిద్దరినీ గమనించనే లేదు. హఠాత్తుగా అతని కీ క్రిందిమాటలు ముళ్ళలా గుచ్చుకున్నాయి.

"ఒరేయి! మల్లన్నా! ఇదేవిటిరా! ఈ వంకర టింకరబొమ్మ?"

మల్లన్న మేనమామ ముఖవైఖరి చూసి కంగారు పడిపోయాడు. ఉలితోసహా అతని దుర్భల శరీరము, సన్నని వేళ్ళు ఒక్కసారిగా వణికాయి. "ఇదుగో! అంతా అయిపోయింది.... ఈ సాయంత్రంతో పూర్తి అయిపోయినట్లే !"

"అయితే మాత్రం! ఈ దిష్టిబొమ్మలు నేనేం చేసుకోను! యాచమనాయనింగారి దగ్గిర నాకు మాట దక్కనియ్యవురా?"

"నే నేంజేశాను?"

"ఇంకా ఏంచేశా నంటావేమిటి? నువ్వేదో ఉద్ధరిస్తున్నా వనుకున్నాను! చూసి చూసి. చివరికి కీ పేడబొమ్మల బాణీ మొదలు పెట్టావేమిటిరా?"

మల్లన్నకు తన సహాధ్యాయి ఎదట జరిగిన అవమానం మరీ దుర్భరమైపోయింది. ఎఱ్ఱన్న అతనికేసి "చూడు నా తడాఖా!" అన్నట్లు చూశాడు. మల్లన్నకిది మరి ఒక బాకు పోటయింది. ఇంక ఊరుకోలేక మల్లన్న మూతి బిగించి, బింకంగా "పేడబొమ్మల బాణీ ఏమిటి?.... ఏదో నాకు తోచినట్లు చెక్కాను" అన్నాడు.

"నీకు తోచినట్లు చెక్కడం ఏమిటిరా! నేను చెప్పినట్లు చెయ్యాలిగాని!"

మల్లన్న ముఖం బాగా ఎఱ్ఱబడింది. మళ్ళీ నాగమూర్తి అందుకున్నాడు.

"నీతోటి వాళ్ళు ఎఱ్ఱన్నా ఎవళ్ళన్నా ఇల్లాగే చేశారురా! నీ కింకా జ్ఞానం ఎప్పటికి వస్తుందిరా?"

"ఆ బాణీ నా వల్లకాదు. నే నావిధంగా చెయ్యలేను."

"ఒరే! ఇన్నాళ్ళకి ఇది చేతకాకపోతే ఇక లాభం లేదు. ఇహ ఇదంతా కట్టిపెట్టి, మీ నాన్నలాగ గ్రామ పౌరోహిత్యం ప్రారంభించు! అది మీ కులవృత్తే!"

మల్లన్న లోలోపల కోపం పైకి కనబడనీయకుండా ఎఱ్ఱన్న కేసి చూస్తూ అన్నాడు.

"ఏదో లేనివాళ్ళం! ఏం చేస్తాం - మా నాన్నగారు గ్రామ పౌరోహిత్యం చేసినా ఎన్నడూ భోగంవాళ్ళ వెనకాల పడి తాళం మాత్రం వెయ్యలేదులే?"

నాగమూర్తికి, తన తండ్రి విజయనగర వేశ్యలకు గొల్లకలాపాలు, భామకలాపాలు నేర్పి అళియ రామరాయ చక్రవర్తి ఆదరం పొంది అగ్రహారం సంపాదించిన విషయం తటాలున జ్ఞాపకం వచ్చింది. దానితో అతని కళ్ళు చంద్రనిప్పులయ్యాయి! ఇక ఉండబట్టలేక, "ఛీ! దౌర్భాగ్యుడా! నా ఇంట్లో తిని, ఇంటివాసాలు లెక్కపెడతావురా! ఫో! నా యింట్లోంచి లేచి ఫో!" అన్నాడు. అంతటితో వూరుకోక మల్లన్న చెక్కే విగ్రహాన్ని కాలికొద్ది ఒక్క తాపు తన్నాడు. అసలా తాపు మల్లన్నకు తగలవలసిందే! కాని, మల్లన్న కొంచెం తప్పించుకోవడం చేత అది విగ్రహానికి తగిలింది. ఎఱ్ఱన్న నిర్ఘాంతపోయినట్లు చూస్తూ నిలబడిపోయాడు. మల్లన్న కన్నీళ్ళతో చరచరా ఆ భవనావరణం దాటి వెళ్ళిపోయాడు.

## 3

మల్లన్న వెళ్ళిపోయిన తరువాత కొంతసేపటి వరకు నాగమూర్తిని పలకరించడానికి కూడా యెవరికీ సాహసం కలగలేదు. కోపం వస్తే ఆయన కింక ఒళ్ళు తెలియదు. కాని, కొంతసేపటికి అది అంతా తాటాకుల మంటలా చల్లారిపోతుంది. ఇప్పుడూ అల్లాగే జరిగింది. తీరా భోజనాలవేళ మల్లన్న తన పక్కన కనపడకపోయేసరికి అతనికి బాగా

పశ్చాత్తాపం కలిగింది. ఆ మర్నాడెల్లాగో అల్లాగ ధనుర్మాసోత్సవము, గోపురాలంకారము అన్నీ జరిగిపోయాయి గాని, ఆచార్యుని ముఖాన కత్తివాటు వేసినా నెత్తురుచుక్క లేదు! ఆ వేళ కూడా మల్లన్న ఇంటికి రాలేదు. ఇంక ఆ తరువాత ఆయనకేమీ తోచక విజయనగరం అంతా వెతకవలసిందని శిష్యులనందరినీ పంపించాడు. వారు విజయనగర వీధులు, ఆపైన సందులు గొందులు అన్నీ వెతికారు. ఎక్కడా మల్లన్న జాడ తెలియలేదు. తొందరపడి యేదైనా అఘాయిత్యం పని చేశాడేమోనని నాగమూర్తికి కంగారు పట్టుకుంది. ఆచార్యుని భార్య మల్లన్నని చిన్నప్పటినుంచీ పెంచి, పెద్దవాణ్ణి చేసింది. పండుగ రోజుల్లో మల్లన్న ఇంట్లో లేకపోవడంవల్ల ఆమెకు మతిపోయినట్లయింది. మంచి మంచి బట్టలూ అవ్వీ ఇచ్చినా, మల్లన్న అవి అతి పొదుపుగా వాడుకుని సామాన్యంగా చిరుగుల బట్టేలే కట్టుకుంటూ ఉండేవాడు. మల్లన్న ఎక్కడ ఏమి ఇబ్బందులు పడుతున్నాడోనని నాగమూర్తి లోలోపల బాగా బాధపడ్డాడు.

చివరికి ఒకనాడు మల్లన్న వార్త చూచాయగా తెలిసింది. రాజధాని నగరానికి సమీపంగా ఉన్న ఒక పల్లెటూళ్ళో మల్లన్న ఉన్నాడనీ, అక్కడ అతను పిల్లల బొమ్మలు, చిన్నచిన్న విగ్రహాలు చేసి అమ్ముకుని జీవయాత్ర సాగిస్తున్నాడనీ ఒక వార్త వచ్చింది. వెంటనే నాగమూర్తి ఎఱ్ఱన్నను పిలిచి అతన్ని ఇంటికి తీసుకురమ్మని పంపించాడు. కాని మల్లన్న అతనితో ఇంకా విద్యానగరం రాదలచుకోలేదని ముక్తసరిగా చెప్పి పంపించేశాడు. ఆపై ఆచార్యుడే ఒక మేనా ఎక్కి మల్లన్న ఉన్న గ్రామానికే వెళ్ళాడు.

కాని వెళ్ళిన మరునాటి సాయంత్రానికే నాగమూర్తి మేనా తిరిగి వచ్చేసింది. మేనా లోపల నాగమూర్తి జ్వరంతో మూలుగుతున్నాడు. ఆయన్ని జాగ్రత్తగా తీసుకువెళ్ళి లోపల పడుకోపెట్టారు. భార్య వచ్చి మల్లన్నమాట అడిగింది. ఆచార్యుడు జ్వరంతో మూలుగుతూ మల్లన్న రానన్నాడని ఆమెతో చెప్పాడు. ఆమె ఆ వార్త విని నిర్ఘాంతపోయింది. నాగమూర్తి వెడితే మల్లన్న రాకపోడని ఆమె అనుకుంది. పైగా నాగమూర్తి పుట్టెడు జ్వరంతో తిరిగి వచ్చాడు. ఆమె దీనితో ఒక పెద్ద నిట్టూర్పు విడిచింది.

క్రమంగా జ్వరం ఎక్కువైపోయింది. జ్వరం తగిలిన మూడవనాటి రాత్రి ఆచార్యుని కిక వంటి మీద స్పృహ లేనట్లె కనిపించింది. ఆ స్థితిలో ఆచార్యునికి ప్రయాణ వృత్తాంతం అంతా మళ్ళీ కళ్ళకు కట్టినట్లు కనిపించింది.

మల్లన్న నివసించేది చాలా కుగ్రామం. అతడు ఉన్న గృహానికి ఇరుగు పొరుగున్న ఉన్న వాళ్ళంతా చాలా సామాన్య సంసారులు. మల్లన్నది ఒక పూరి ఇల్లు. నాగమూర్తి అక్కడికి చేరుకునే సరికే సూర్యాస్తమానం అయింది. ఆ ఇంట్లో రెండే గదులున్నాయి. ఒకదానిలో మల్లన్న స్వయం పాకం చేసుకుంటున్నాడు. రెండవదానిలో తన బొమ్మలు

అన్నీ పెట్టుకున్నాడు. ఆ పరిసరము, ఆ ఇల్లు చూసేసరికే ఆచార్యునికి వళ్ళంతా జలదరించింది.

మల్లన్న ఉన్నదానిలో నాగమూర్తి కేమీలోటూ చెయ్యలేదు. చాలా ఆప్యాయంగానే ఆదరించాడు. ఆచార్యుడతని శిల్పాలు చూద్దామని ఆ రెండవ గదిలోకి వెళ్లాడు. కాని అంతా అంధకారబంధురంగా ఉంది. అక్కడ కూడా చిన్న బొమ్మలు కొన్ని అస్పష్టంగా కన్పిస్తున్నాయి. మల్లన్న దీపం వెలిగించుకు వస్తానని వంట గదిలోకి వెళ్లాడు. ఆచార్యుని ఎదురుగా ఒక పెద్ద విగ్రహం కనబడింది. కాని ఆ చీకటిలో అది చాలా అస్పష్టంగా వుంది. ఇంతలో ఒక ప్రమిదలో దీపం వెలిగించి తీసుకుని వచ్చి మల్లన్న మెల్లిగా ఆ విగ్రహం ఎదుట వుంచాడు.

ఆచార్య డా విగ్రహం అంతా జాగ్రత్తగా పరిశీలించాడు. ఒక్కసారిగా అతనికి ముచ్చెమటలు పోశాయి. హృదయానికి కొొక వజ్రఘాతం తగిలి నట్లయింది. అది ఒక భయంకరమైన భిక్షుక స్త్రీ విగ్రహం! ఆ దీనురాలు మశూచికంతో మరణవేదన పడుతున్న తన శిశువు నెత్తుకొని ఆప్యాయంగా ముద్దు పెట్టుకుంటూంది. ఆ శిశువు శరీరం ఆనవాలైనా లేకుండా ఒళ్ళంతా ఒత్తుగా మశూచికం పోసింది. తల్లి ఆరోగ్యంగానే వుంది. అయినా ఆమె అపారమైన మాతృ ప్రేమతో ఆ శిశువును తన హృదయానికి హత్తుకొని విచారంగా ఆ శిశువు కళ్ళల్లోకి చూస్తున్నది.

అది చూసీచూడ్డంతోనే ఆచార్యుని హృదయంలో అసహ్యభావము, భయము, ఒకదానితో ఒకటి పెనవేసుకుని నృత్యం చేస్తూ ఉవ్వెత్తుగా పొంగాయి. ఆ తరువాత మరి అతడా విగ్రహం కేసి చూడలేకపోయాడు. భయం చేత అతని కాళ్ళు వణికాయి. ఆ భయోద్వేగంతో అతడక్కడ నిలబడలేక పోయాడు. ఇక్కడికి రాగానే మొదట మల్లన్నని తిరిగి యింటికి రమ్మని ఆహ్వానించాడు. మల్లన్న "తరువాత ఎప్పుడైనా వస్తా"నని మర్యాదగా చెప్పి తప్పించుకున్నాడు. వెళ్ళేటప్పుడు నాగమూర్తి మళ్ళీ అతన్ని రమ్మని అడుగుదామను కున్నాడు గాని మరి అతని కా మాటే జ్ఞాపకం రాలేదు. మేనా ఎక్కిన కొంతసేపటికే అతనికి పులకరం వచ్చినట్లయింది. క్రమంగా అది జ్వరంగా మారిపోయింది. జ్వరం వచ్చిన మూడవ నాటి రాత్రి కూడా ఆ విగ్రహం అతని కళ్ళ ఎదురుగా నిలబడినట్టు కనబడింది. అతడు భయపడి కళ్ళు మూసుకున్నాడు. ఆ రాత్రంతా భయంకరంగా కలవరిస్తూనే వున్నాడు.

ఆ మర్నాడు యథాప్రకారంగా వైద్యులు వచ్చి అతడి నాడి పరీక్ష చేశారు. వారనుమానిం చినట్లే అయింది. నాగమూర్తి ఒంటిమీదా, ముఖంమీదా, మశూచికం చిహ్నాలు కనబడ్డాయి. ఆ రాత్రికి అది మశూచికమేనని స్థిరపడిపోయింది. మశూచికం

అనే మాట అనేసరికి ఆచార్యుని మనస్సులో జ్వలిస్తున్న జీవితాశాజ్యోతి కాస్తా అంతరించేపోయింది. అతని కిక జీవించాలనే కోరికే కలగలేదు. అతడు మంచి రూపసి కావడం చేత చిన్నప్పటినుంచి ఈ వ్యాధి అంటేనే అతనికి విపరీత భయం. ఏ దురంత వ్యాధి వచ్చినా అతడింతగా భయపడి ఉండకపోను! జ్ఞానం వచ్చినప్పటి నుంచీ ఎక్కడా లోపంలేని శరీర సౌందర్యం ఆరాధించి అన్వేషించే అతనికి వికృత శరీరంలో జీవించడంకంటే అలాగే మరణించడమే మంచిదనిపించింది! తనకీ భయంకర వ్యాధే ఎందుకు రావాలి? ఒకవేళ మల్లన్న పూరి పక్కన ఎవరికయినా మశూచికం పోసిందేమో! అతడనేక విధాలుగా ఆలోచించాడు. అతనికే ప్రశ్నకీ ప్రత్యుత్తరందొరకలేదు. చివరికి విధివిధానం అజ్ఞేయమని అతడు సమాధాన పడ్డాడు.

క్రమంగా ఆనాటికానాడు మశూచికం ఎక్కువై అతని శరీరం అంతా అందవికారంగా తయారయింది. అతని పరిస్థితి చూచి వైద్యులు కూడా భయపడ్డారు. ఆనాడే మల్లన్నకు కబురు వెళ్ళింది. మల్లన్న వచ్చేసరికి వ్యాధి చాలా ముమ్మరంగా ఉంది. నాగమూర్తికి మల్లన్న వచ్చిన సంగతి తెలియదు. మల్లన్న ఎన్నడూ మశూచికం పడలేదు. మేనత్త వద్దని ఎంత బ్రతిమాలినా వినక అతడాచార్యుని శయ్య విడవకుండా అహోరాత్రాలు పరిచర్య చేశాడు. అప్పుడప్పుడా స్పృహలేని స్థితిలోనే నాగమూర్తి ఎవరికో చేతులు జోడించి, నమస్కరించి లోలోపల ఏదో గొణుక్కునే వాడు. వైద్యులది చూచి బాగా సంధించినదనీ, వ్యాధి చెయ్యి దాటిపోతున్నదనీ నిశ్చయించారు. ఆనాటి రాత్రి గడవడం కష్టమని అందరూ అనుకున్నారు.

కాని, అతి కష్టం మీద ఆ రాత్రి గడిచింది. మరునాడు అరుణోదయం, వైద్యుల మనస్సులలో ఆశోదయము ఒక్కసారిగా జరిగాయి. మల్లన్న ఆచార్యునికేసి నిశ్చలంగా పరిశీలించాడు. ఆచార్యుడు మెల్లిగా కళ్ళు తెరిచాడు. క్రమంగా వైద్యులకు ధైర్యం కలిగింది. మల్లన్న అతని దృష్టికి ఎదురుగా జరిగి కూర్చున్నాడు. నాగమూర్తి అతనివేపు కొంతసేపు చూసి, “మల్లన్నా! వచ్చావురా! నాయనా!” అన్నాడు. మల్లన్న సంతోషంతో మరీ దగ్గిరగా జరిగాడు. ఆచార్యుడు ఒక్క నిట్టూర్పు విడిచి “మల్లన్నా! ఇంతకాలానికి ఈ శిల్పవిద్య లోతు తెలుసుకున్నానురా!” అన్నాడు. మల్లన్న ఈ మాటకు కూడా సమాధానం చెప్పలేదు. అల్లాగే ఆచార్యునివైపు చూస్తున్న అతని రెండు కళ్ళల్లోనూ రెండు బాష్పకణాలు నిలిచాయి!

# శ్రీ వాత్సవ



'శ్రీ వాస్తవ' కలం పేరుతో పుంఖానుపుంఖంగా రచనలు కొనసాగిస్తున్న వీరి అసలు పేరు యండమూరి సత్యనారాయణరావు. సాహిత్య సమీక్ష శ్రీ వాత్సవ గారి అభిమాన విషయం. వీరు అనేక భాషలలో నిష్ణాతులు. బహు వ్యాసకర్తలు. మనస్తత్వ శాస్త్ర విషయాలతో ప్రయోగాత్మకంగా కథలు వ్రాశారు. ప్రతి సంవత్సరం వెలువడే తెలుగు సాహిత్యాన్ని సమీక్షిస్తూ అగ్రశ్రేణి సమీక్షకులుగా పరిగణన పొందారు. ఆకాశవాణి, హైద్రాబాదులో పని చేశారు.

**రచనలు :** సైరంధ్రి (నవల) ఉషఃకిరణాలు (సాహిత్య అకాడెమీ బహుమానం పొందినది), జల్తారు జాబిల్లి (పిల్లల నవల), నాగరిక, గీతాంజలి (అనువాదాలు)

# కోడెత్రాచు

"మరిగంటేను తాతా! పాము కలలోకి వస్తే మంచిదంటావా?"

"పాము కలలోకి రావడం మంచిది కాదంటారు. అయితే అదియెలాగా వచ్చిందేమిటి మోహన్‌సింగ్? నీలాంటి పడుచోళ్ళకి మరి కలలు గిలలు లేకుండా, మూసిన కన్నెత్తకుండా నిద్రబోవాలి గాని, కలలేమిటి?"

"సరేననుకో! ఈ ఒక్కసారే కాదు; వారం రోజులనించి పాములుకలలోకి వస్తున్నాయి. ఒక్క పాము కాదు; ఒకోసారి పెద్ద పాములదండు తరుముకొచ్చినట్టు. ఒక్కోసారి పడగెత్తినట్టు, ఒక్కోసారి నిలువవెత్తి లేచి పైకి ఉరికినట్టు యిలాగ యెన్నో రకాలు!"

"ఎప్పుడైనా పాము కరచినట్టయిందా."

"లేదు – వాటిని చూచిన వెంటనే నాకు భయం వేసి పారిపోయినట్టూ, కేకలు వేసినట్టూ అవ్వడం, మధ్యలో మెలకువ రావడం – ఇలాగ జరుగుతోంది!"

"అయితే, సింగ్, మీ అయ్యకి ఏదైనా మ్రొక్కుబడి వుందేమో! తీర్చుకోమని చెప్పు."

"మా అయ్యకి అలాంటి వేవీ లేవు. వాడు రంగం యెల్లి రావడంతోటే పోయాయి అవన్నీ! పైగా మిలిటరీలోకి కూడా యెళ్ళొచ్చాడా మరి."

"అవునులే – అతను గుండెలు తీసిన గండు సిపాయే! మీ అమ్మ మాంచి యిల్లాలు; వాడు ఇన్ని తిరిగొచ్చినందుకు నమ్ముకుని నిన్ను గ్రుడ్డు అప్పటినించి పెంచి పెద్దవాణ్ణి చేసింది. ఆవిడకు పూజలూ, పునస్కారాలు చాదస్తం వుంది!"

"ఉన్నాయి. కాని దానికీ, నాకు కల్లో పాము కనిపించడానికీ సంబంధం ఏముంది?"

"ఉన్నది. చెబుతున్నాగానూ? ఎవరో నాగేంద్రుడు పగబట్టి ఉన్నాడు. నాగుల చవితికి పుట్టలో పాలేసుకున్నారా?"

"నాకు ఈ యింజనీరుగారి దగ్గర నౌకరీ దొరికినప్పటినించీ యింక తీరికేదీ? పూజలేదు; నాగుల చవితీ లేదు."

"పెద్ద చిక్కే వచ్చింది. నీకు మరి యింత నౌకరీ దొరికింది. బంట్రోతుపనైనా పదిరాళ్ళు కళ్ళ చూస్తున్నావు – మరి ఆ మ్రొక్కుబడులూ అవీ తీర్చుకోవలసింది."

"ఆ మధ్యనో బైరాగి చెయ్యి చూచి, నీకు పాముగండం వుంది. యేరుముక్క యిస్తాను కట్టుకోమన్నాడు. నేను నమ్మకం లేక కట్టించుకోలేదు."

"అయ్యో! ఏ పుట్టలో ఏ మహత్యం ఉందో; అదీ చూడవలసింది. ఇంతకీ యీ పీడ పోవడానికి ఓ పామునైనా చంపి చూడు. ఒక్కసారి పామును చంపితే, ఇంక పామువల్ల భయపడనక్కర లేదంటారు."

"నేనే! పామును చంపడమే!! నా వయస్సుకి!!"

"నీ వయసుకేం? మంచి పహిలా పచ్చీసులో వున్నావు! పెళ్ళి కాలేదు గాని ఈ పాటికి బిడ్డ తండ్రివి కావలసినవాడవు."

"దానికేం గాని – పామును చంపగలనంటావా?"

"ఎందుకు చంపలేవు? మొండివాడు రాజుకంటె బలవంతుడు."

"మొండి కెత్తాలంటావు?"

"అంతేమరి! మొండికెత్తితేనే వెట్టి భయాలు పోవడం."

తాత చెప్పిన మాటలు మోహన్‌సింగ్‌కు బుర్రకెక్కాయి. తాత అల్లాటప్పయ్య కాదు. ఎంత మంది దొరలక్రిందో పనిచేశాడు. జీవితం ఆరు పువ్వులూ మూడు కాయలుగా నడిపించాడు. ఇప్పటికీ సర్వీసులో ఉండి డబ్బు గడిస్తున్నాడు. అతనికి తెలియని విషయం లేదు. ఈ పాము భయం పోగొట్టడానికి తాత చెప్పిన ఉపాయమే మంచిదేమో! మోహన్‌సింగ్ మొండికెత్తాడు; పాము కనిపిస్తే భయపడకుండా చంపి తీరుతాడు. ఇంక భయం లేదు. తన కేంలోటు? నెలకి అరవై ఎనిమిది రూపాయలు సర్కారు ఇస్తున్నారు. ఇంజనీరుగారు పిలిచినపుడల్లా పలకడం, వారి ఇంటివద్ద కావలసిన సరుకులు పంపించడం తప్ప తన కేం పని లేదు. బట్టలూ, అవీ వాళ్ళే ఇచ్చారు. ఇంజనీరును చూడటానికి వచ్చిన ప్రతి వాడూ తృణమో పణమో తన చేతిలో వేస్తున్నాడు. ఈ సంపాదన అంతా వాళ్ళ అమ్మ చేతిలోనే వేస్తేగాక, తాను కూడా ఒక ప్రయోజన పరుడయ్యాడు. ఇన్నాళ్ళూ తనూ ఒక స్వతంత్ర వ్యక్తి అనిపించలేదు. ఆఫీసులో ఉన్నంతసేపూ ఇంజనీరు చెప్పిన పని చెయ్యాలి; లేకపోతే తాత చెప్పినట్టు వినాలి. ఇంటి దగ్గర ఉన్నంత సేపూ అమ్మ చెప్పినట్టు. తనకి జతగాళ్ళూ లేరు. తిండి తినడం, ఆఫీసు కెళ్ళడం, ఇంజనీరు ఇంటికెళ్ళడం – ఇదే జీవితం. ఎప్పుడైనా సినిమాకు వెళ్ళడం తప్ప. ఆ రోజువారీ జీవితంలో మార్పులేదు. ఇలాగే గడచిపోతోంది. ఎప్పుడైనా తీరిక వుంటే తాను మదన కామరాజు కథలు, కాశీ మజిలీ కథలు ఒకడి దగ్గర ఎరువు తెచ్చి చదువుకొనేవాడు. అవి బాగానే వుండేవి.

నాగకన్యలు, దేవకన్యలు, రాజకుమార్తెలు, కీలుగుఱ్ఱాలు ఇవన్నీ తమాషాగా ఉండేవి. సినీమాలో కూడా అలాంటి కథలే. ఎప్పుడైనా తనకి అలాంటిది జరుగుతుందా అని ఒకోసారి అనుకుంటూ నిద్రపోయే వాడు. అప్పుడు రక రకాల కలలు వచ్చేవి. ఎక్కువ సారులు పాము కలలే. ఒకోసారి కలల్లో ఆడవాళ్ళు కూడా కనిపించేవారు. వాళ్ళు దెయ్యాలు గానూ, రాక్షసులుగానూ, ముసలమ్మలుగానూ వచ్చి భయపెట్టేవారు. అందుకే ఆడవాళ్ళంటే సింగుకి మరీ భయం; సిగ్గుగూడాను. రెండు మూడుసారులు అతని కలలో ఎదిరింటి అచ్చమ్మ కనిపించింది. కూరగాయలమ్మే అచ్చమ్మ తాటకలాగు ఉంటుంది. పగలు చూస్తే నిజంగా రాత్రి కలలోకి వచ్చి తీరుతుంది. ఈ మధ్య నాలుగుడబ్బులు కూరగాయల అమ్మకం వల్ల సంపాదించి నప్పటినుంచి, అచ్చమ్మ 'అథారిటీ' ఎక్కువయింది.

తరచు అచ్చమ్మకీ, తన తల్లికీ వాగ్యుద్ధాలు జరుగుతూ వుండడం చూచి, హడలిపోయి మోహన్‌సింగ్ పారిపోతూ వుండేవాడు. ఆమెను చూస్తే నిలువెల్లా భయమే! అటువంటి అచ్చమ్మ తన కలలోకి రావడం, తనని దగ్గరగా చేరదీసి కౌగిలించుకొన్నట్టు అయితే సిగ్గుతో నీరైపోయేవాడు. మర్నాడు ఆ పాపపరిహారార్థం స్నానం చేసేవాడు. అలాంటి సమయాలలో, అచ్చమ్మ బదులు దాని కూతురు లక్ష్మి కలలోకి వచ్చినా బాగుండుననిపించేది. లక్ష్మి అంత అందమైంది కాదు కాని, పదమూడు పద్ధాలుగేండ్ల లేబ్రాయం. చామనచాయ. పిట్ట చిన్నదైనా కూత ఘనం. కూరగాయలు అమ్మడంలో వాళ్ళ అమ్మకంటె నాలుగాకు లెక్కువ చదివింది.

లక్ష్మికీ, మోహన్‌సింగుకీ అట్టే పరిచయం లేదు. ఉద్యోగంలో చేరని క్రితం, చిన్న పరికిణీ, రవిక వేసుకొని వచ్చి, సింగును కథలు చెప్పమని అడిగేది. వాళ్ళిద్దరూ పక్క చెరువుగట్టున పొగడ చెట్టుక్రింద కూర్చుని వెళ్ళిపోయేవారు. లక్ష్మిని వాళ్ళ అమ్మ నాలుగైదుసారులు సింగుతో మాటలాడవద్దని చావచంపింది. అయినా, ఆ పిల్ల మానేదికాదు. సింగుతల్లి కూడా యిలాంటి చెడుసావాసం చెయ్యవద్దని కొడుకుని మందలించింది. దానితో సింగు మాట్లాడ్డం మానేశాడు. ఆఫీసులో ఉద్యోగం ఒకటి వచ్చింది. పిల్లతో సహవాసం మానుకున్నాడు.

కాని, రోజూ ప్రొద్దున్నవేళ సింగు తన బంట్రోతు దవాళీవేషం వేసుకొని వెళ్ళే సమయానికి, లక్ష్మి మురిసిపోయి కూరగాయలగంప ప్రక్క నెట్టుకొని 'సింగూ!కొంచెం గంపెత్తవూ?' అని అడిగేది. సింగు మాటాడకుండా గంప యెత్తేటప్పుడు, ఆ పిల్ల కొంటె నవ్వులు చూచి కోపపడేవాడు. అంతే, పోనీ ఆ పిల్ల కలలోకి వచ్చినా బాగుండును; పాముల పీడ పట్టుకుంది; ఏమైనా సరే వదుల్చుకోవాలి ఈ పాడుకలలు!" తాత చెప్పినట్టు. అనుకొని అవకాశం కోసం ఎదురుచూస్తూ ఉన్నాడు మోహన్‌సింగ్.

## 2

ఆవేళ మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత దొరగారి స్వంత టపా యింటిలో ఆడవారి కిచ్చి వేసి తిరిగి ఆఫీసు ఆవరణలోకి వచ్చాడు సింగు. జనం క్రిక్కిరిసి బయటికి వచ్చి నిలుచున్నారు; ఆఫీసరుగారు, గుమాస్తాలు, బంట్రోతులు అందరూ విస్తుపోయి చూస్తున్నారు. సింగు పరుగెత్తుకొని వచ్చాడు. చూచేటప్పటికి ఏముంది? ఆఫీసుచుట్టూ వున్న పొదలలోంచి వెనుబాటుగా ఆవరణలోకి వచ్చినదేమో ఆ పాము! నాలుగు మూరల పొడవు పెద్ద పాము. సాక్షాత్తు ఆ నాగేంద్రుడు వచ్చినట్టే వున్నది. బరిమీదికి వచ్చి కదలకుండా ఉన్నది. అన్ని వైపులా జనం క్రమ్మేసి వున్నారు. ఆడపాము, పడగలేదు అని కేకలేస్తున్నాడు తాత. 'చూస్తారేమిటి? చంపే ఉపాయం చూడండి' అని ఆఫీసరుగారు అంటూంటే అక్కడ వున్న హేమాహేమీలంతా ఎవరిమొగాలు వారు చూచుకొంటున్నారు. మోహన్‌సింగ్‌కి ఒక్కపెట్టున లేని ధైర్యం వచ్చింది. ఇంతకంటె అదను లేదనుకున్నాడు. చఱ్ఱున లోపలికి వెళ్ళి, మూలగదిలో గోడకు జేరవేసి వున్న పొడుగుపాటి కొలత బద్ద తెచ్చి నిలువెత్తు పాముమీద హఠాత్తుగా వేసికొట్టాడు. తన్నుకొంటూ వున్న ఆ పాముమీద తన పగ తీర్చుకోవడానికి ఎన్ని దెబ్బలో కొట్టి, ఆఖరికి ప్రాణం పోయిందనిపించాడు. తన కలల్లో చూచిన భయహేతువులన్నిటికీ దీనితో సరి అన్నట్టు ఆ పాము శరీరశేషాలకు దహనసంస్కారం కూడా మోహనసింగే స్వయంగా తన చేతులమీదుగా జరిపించాడు.

ఇలాంటి సాహసకృత్యం చేసినందుకు మోహన్‌సింగ్ అంటే జనం అందరికీ అభిప్రాయం మారిపోయింది. ఇంజనీరుగారు మొదట్లో నమ్మలేదు. ఇంత పిరికిగ, ఇంత భోలాభోలీగా కనిపించే తన స్వంత నౌకరు మోహన్‌సింగ్ పెద్ద పామును చంపగలిగిన సాహసవీరుడనేమాట సులువుగా నమ్మలేకపోయాడు. ఆ క్రతు సమాప్తి జయప్రదంగా జరగడం చూచి దొరగారు ఆనందించి మోహన్ సింగ్‌కు అయిదు రూపాయలు బహుమతి యిచ్చారు. మిగతా జనం మోహన్ సింగ్ సాహసాన్ని మెచ్చుకున్నారు. తాత మాత్రం సింగును లోపాయికారీగా పిలిచి మరో భయం పెట్టాడు. "నువ్వు చేసిన పని మంచిదే! కాని, ఒరేయి సింగూ! భార్యాభర్తలకి ఎడబాపులు పెట్టావురా బాబూ! పూర్వం ఒక కిరాతకుడు యిలాంటి ఘోరం చెయ్యడం చూచే ఆనాడు వాల్మీకివారు శపిస్తే, అది రామాయణం అయిందట. ఆడపాము వున్నచోట మగపాము ఉండితీరుతుంది. దాని భార్యను చంపిన పగ కోడెత్రాచు తీర్చుకుని తీరుతుంది. అందుచేత నీవు ఆ మగపామును కూడా చంపేవరకూ జాగ్రత్తగా వుండాలి" అని చెవిని వేశాడు.

మోహన్ సింగ్ పామును చంపిన కీర్తి సంపాదించిన వీరుడు, ధీరుడు విక్రమార్కుడు అయ్యేడు గానీ మనసులో మరో భయం మరింత ఎక్కువయింది. ఇదివరకు ఒక్క

స్వప్నావస్థలోనే సర్పభయం ఉండేది. ఇపుడు జాగ్రత, సుషుప్తి స్వప్నావస్థలు మూడింటి యందూ భయం తప్పలేదు. చిటుక్కుమంటే పామనే భయం; కదిలితే, తాకితే, పలికితే పాము భయం. ఆ భయంతో చివరకి జ్వరం కూడా వచ్చివేసింది. తల్లీ తండ్రీ ఒకటే గోల! పుట్టలో పాలు పోశారు, శివాలయంలో అభిషేకం చేశారు; సుబ్బారాయుడి గుడిలో కొబ్బరి కాయలు కొట్టారు. ఏమీ లాభం లేదు. మోహన్‌సింగ్ ఒళ్ళు మూడురోజులూ నిప్పులు చెరిగింది. జ్వరంలో క్షణం క్షణం పరాకు మాటలు. "అదుగో, పాము పడగ ఎత్తుకొని వస్తోంది. పట్టుకోండి పట్టుకోండి" అని కేకలు వేస్తున్నాడు. ఆఖరికి మూడోరోజున తాత చూడటానికి వచ్చి, మోహన్ సింగ్ భయం పోగొట్టడానికి ఆ కోడె త్రాచును పట్టించడమే ఉపాయమని అన్నాడు.

"అయితే, తాతా! ఆ పాము పట్టితే దొరుకుతుందా?"

"ఎందుకు దొరకదూ? తప్పకుండా దొరుకుతుంది!"

"అక్కడే వుంటుందని రూఢి యెలాగ?"

పాముకి మనుష్యులకంటె ప్రేమ యెక్కువ. చనిపోయిన తన భార్య కోసం వెదకుతూ అక్కడే తచ్చాడుతూ వుంటుంది. వాళ్ళకి అటువంటి అనుబంధం! అందుకే నాగబంధం అంటారు."

"ఎలాగ పట్టుకోవడం మరి?"

"పాములవాడిని తీసుకొస్తే వాడే చూస్తాడు ఆ పని."

"అయితే తాతా! మీరే చూడాలి వాడిని రప్పించే ఉపాయం."

"తాత చెప్పిన యీ యుపాయంతో మన్నాడు పొద్దున్న మోహన్‌సింగ్‌కి వచ్చిన కొత్త ధైర్యం వల్ల జ్వరం తగ్గిపోయింది. ప్రక్క పల్లెటూరులో ఒక గొప్ప పాములవాడు వచ్చాడంటేను కబురు పెట్టారు. అతగాడు నాగస్వరంకాయ. బుట్ట వేసుకొని మళ్ళీ మధ్యాహ్నం మూడు గంటల వేళకు వచ్చాడు. కొంచెం చల్లబాటువేళ అయితేగాని సమయం కాదన్నాడు. ఈలోపున రెండు తెల్లమడతలు తెప్పించమన్నాడు. ఇంజనీరుగారు కూడా సమయానికి ఆఫీసులోనే వున్నారు. కాబట్టి రెండు జతల తెల్లదుప్పట్లు, చాకలి తెచ్చిన మడతలు తెప్పించారు. పాములవాడికి కడుపునిండా అన్నం కూడా పెట్టించారు. అతగాడు కొంచెంసేపు విశ్రమించి, మోహన్‌సింగ్‌ను వెంట బెట్టుకుని ఆడపాము వచ్చిన చోటు, చంపిన స్థలం, దహనపరచిన ప్రదేశం ఇవన్నీ గుర్తుగా చూచుకొన్నాడు. చివరికి యీ మైదానం ప్రక్క వెయ్యండని తెల్లమడతలు విప్పి పరపించాడు. చుట్టూ పచ్చని బయలు, దూరంగా పొదలు, గురివెంద చెట్లు, సంపెంగ, రేరాణి, దొంకమల్లె, పురుగుడు చెట్లు వ్యాపించి వున్నవి. పచ్చని పట్టు తివాచీ లాగున గరిక పోచలు మొలిచిన మైదానం

మృదువుగా, సొగసుగా ఉంది. సాయంకాలం ఆరుగంటలు కావస్తోంది. సూర్యాస్తమానం కాలేదు; నీరుటెండ బంగారు కాంతులు ఆఫీసు గోడలమీద పడి పసుపుముద్దల లాగు కనిపిస్తున్నాయి. పాములవాడు తన నాగస్వరం కాయ పట్టుకొని, రెండు బుగ్గలూ పూరించి ఊదివేస్తున్నాడు. ఆనందభైరవిలో రాగాలాపన చేసి ఆవరణ చుట్టూ తిరిగాడు. ఏమీ పసిబట్టలేదు. జనం కిమిన్నాస్తి మాటలాడటం లేదు. 'శంకరా భరణం ఎత్తుకొన్నాడు; పలికించి వేస్తూంటే, అరమూతపడిన కన్నులతో ఆశ్చర్యచకితులై అక్కడ వున్న ఆ బాలగోపాలం చూస్తున్నారు. పాము అలికిడి లేదు. మోహన్‌సింగ్ భయంతో వణకిపోతున్నాడు. తాతకి దగ్గరగా చేరి, పాములవాడు ఎక్కడికి వెళ్తే అటువైపు వేయి కన్నులతో పరికిస్తున్నాడు. పత్తాలేదు. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుని చిన్న చిన్న వంశీరంధ్రాలనించి స్వరాలు వాహినులై ప్రవహిస్తున్నవి. ఈ మాటు వినిపిస్తున్నది 'పున్నాగవరాళి'. భువన మోహనమైన ఆ గానస్రవంతికి అక్కడ జనమంతా తమ శిరస్సులను అప్రయత్నంగా కంపింపజేస్తూ ఉన్నారు.

'మౌళి' వాద్యం ప్రారంభమైంది; పదునాలుగు లోకాలూ చేరువకు వస్తున్నవా అనిపిస్తుంది. 'శిశుర్వేత్తి, పశుర్వేత్తి, వేత్తి గానరసం ఫణీ' గానామృతంతో ఒక వినూతన గంధర్వలోకమే సృష్టి అవుతోందేమో! ఆ పాటలో ఏదో పిలుపు! దేశ కాలపాత్రలకు అతీతమైన, విశ్వజనీనమైన ఆహ్వానం అది. ప్రియునకు ప్రేయసిలాగున, మాతకు శిశు వులాగున, పురుషునకు ప్రకృతిలాగున ఆక్రందనం ఆ వినిపించే పిలుపు. ఈ పిలుపు వినే, ఆదికవి కరుణ అశ్రుధారగా ప్రవహిస్తే ఆ యమృతాశ్రువులు మహాకావ్యమైనవి. ఇది వినడానికే యమునాతీర పై కతస్థలాలు గోపగోపికాగణాలతో లజ్జావిహీనములైనవి. ఇది వినడానికే సౌందర్యఖనియైన మన్మథుడు లోకభయంకరమూర్తి శంకరుని శాపానికి గురియై అనంగుడైనాడు.

"రారా" అనే పిలుపుతో మారుమ్రోగుచున్న 'పున్నాగవరాళి' త్రిస్థాయిలోనూ ప్రతిధ్వనిస్తున్నది. భ్రమిస్తూ వున్న రోదసి, కంపించే తలలూ యీ గాన వాహినిలో మునిగి తన్మయత్వములో నున్నవి. మెఱసిపోయే దేహకాంతితో విప్పిన పడగతో రాజఠీవితో సంపెంగపొదనించి కదుల్తూ వచ్చాడు నాగరాజు. లావణ్యనిధి! నాగస్వరంపలికే ప్రతిస్వరం ఆ నాగసర్పం మీద పులకలు కలగించిందేమో! ఆపలేని ఆనందంతో పైకిలేచి ఒయ్యారముగా తెల్లటి పాన్పుమీదికి చేరి తల ఆడిస్తూ ఉన్నాడు ఆ త్రాచు.

గానతన్మయత్వంలో సఖీవియోగంమాట మరచిపోయాడో ఏమిటో తోకపైన లేచి, నిలువునా పద్మమువలె పడగవిప్పి నాట్యం చేస్తున్నాడు. పాములవాడు స్వరం ఆపక ఒక చేతితో బుట్ట చూపుచు, రెండవచేతితో గళంపట్టుకొన్నాడు. గానం ఆగిపోయింది. కాని

అందరి చెవుల్లోనూ మారుమ్రోగుతూవుంది. పాము బుట్టలో బందీ అయిపోయింది. పాములవానికి కొత్తబట్టలు; బహుమతులు లెక్కలేవు. బరిమీద యింత పరువైన పాము ఎన్నడూ పట్టలేదని ఆ పాములవాడు సంతోషించి ఇంజనీరుగారివద్ద బహుమతులు పొందాడు. తనపీడ విరగడ అయినందుకు మోహన్‌సింగ్ స్వయంగా ఒక అయిదు రూపాయలు ఆ పాములవాడి చేతిలో పెట్టాడు.

## 3

అంతటితో కథ పూర్తి కాలేదు. మోహన్‌సింగ్ సర్పపీడ ఆ పామును పట్టుకొనడంతో వదలలేదు. ఇంకా అతని స్వప్నాలలో పాములు కనిపించి భయపెట్తూనే వున్నవి. మళ్ళీ తాతను అడిగితే అతనేమీ చెప్పలేకపోయాడు. బహుశః పామును చంపిన పాపం, పట్టించిన పాపం అంతగా వ్యథ పెట్తూ ఉన్నవేమో అని పూజలు, పునస్కారాలు చెయ్యమన్నాడు తాత. అవి అంటే ఇదివరకు సింగుకు నమ్మకం లేకపోయినా ఎన్నో చేశాడు: కాని లాభం లేకపోయింది. యథాప్రకారం కలల్లో పాములు తప్పలేదు.

ఇంకొక కొత్త భయం కూడా ప్రారంభమైంది. ఏ ఆడది కనిపించినా పాములాగ కనిపిస్తోంది. ఆ తళతళలు, ఆ చూపులు, ఆ మెలికలు తిరగడం, ఆ బుసకొట్టడం ఆ మెల్లిగా నడవడం అంతా పామువడుపే. తన తల్లి మినహా, ఎవరు కనిపించినా సరే. ఆ స్త్రీలో తాను చంపివేసిన ఆడపాము కనిపిస్తోంది. ఇంక ఇటువంటి బాధలు వాళ్ళతోటీ చెప్పుకొంటే లాభంలేదని లోలోపల దిగమ్రింగుతున్నాడు. ఇంజనీరుగారి భార్యను చూస్తే ఒక జర్రిగొడ్డలాగున వుంటుంది. మరీ భయపడిపోతున్నాడు. చెప్పిన, పని సరిగా చెయ్యలేకపోతున్నాడు. రోజూ అయ్యగారి వల్ల చీవాట్లే! ఎదురింటి అచ్చమ్మ కొండచిలువలాగా కనిపిస్తూ వుంటుంది: దానిని చూస్తే అసహ్యంతో కూడిన భయం. రోడ్లమీద కంకరకొట్టే ఆడవాళ్ళు ఇదివరకు చూస్తూ వుంటే బాగానే వుండేవాళ్ళు; ఇపుడు వాళ్ళంతా నాగుబాములలాగ కాళ్ళల్లో పడుతూ ఉన్నట్లు కనిపిస్తున్నారు. ఇదంతా తెలివిగా ఉన్నప్పటి అనుభవం. కలల్లో కనిపించే పాములరకం వేరు. అవన్నీ తాను పట్టించిన త్రాచుపాములలాగు వుంటాయి. కోడెత్రాచులు. పడగలు విప్పుకొని వస్తాయి. చేతితో పట్టుకోబోతాడు; చెయ్యే పాము అయిపోతుంది. బాబోయి అని కేకవేసి లేస్తాడు. కునుకుతీస్తే కలవస్తుందని పొడికళ్ళతో రాత్రిళ్ళు జాగరణం చేస్తూ వుంటాడు.

మోహన్ సింగ్ నానాటికీ చిక్కి శల్యమై పోతున్నాడు. సరిగా నిద్రలేదు. పరధ్యానం. తల్లి వేరు ముక్కలు కట్టించింది: రక్ష రేకులు పెట్టించింది. తండ్రి డాక్టర్లకు చూపించాడు. వాళ్ళు త్వరగా పెళ్ళి చెయ్యమని సలహా యిచ్చారు. ఈ నీరసస్థితిలో పెళ్ళి ఏమిటని తల్లి ఒప్పుకోలేదు. సంబంధాలు వస్తూనే వున్నవి; సింగుకా ఇష్టం లేదు. చూచిన ఆడదల్లా

పామై కూర్చుంటే ఇంక పెళ్ళి చేసుకొని ఏమి సుఖపడతాడు? సింగు ఆఫీసుకు వెళ్ళడం, ఇంట్లో తనగదిలో పడివుండటం తప్ప ఆ యెదరింటి పిల్ల లక్ష్మి వంకయినా చూడటం లేదు. ఆ పిల్ల రెండు మూడు సారులు వచ్చి పలకరించబోయింది కాని చూడగానే పడగెత్తిన తాచుపాములాగన కనిపించి మోహన్‌సింగు తలుపులు బిడాయించి గది లోపలికి రానీయలేదు.

**4**

ఆరోజు హోలీ పూర్ణిమ. మోహన్‌సింగ్‌కు సెలవు. తల్లి, దండ్రి మేనమామ యింటికి పోయారు. జబ్బు మనిషి అని సింగును తీసుకెళ్ళలేదు. సింగుమీద ప్రొద్దుటినించి ఎందరో వచ్చి కిటికీలోంచే రంగులు వేసిపోయారు. సంధ్యవేళ లక్ష్మికూడా వచ్చి తలుపు తీయించి ఊపిరి సలపకుండా రంగు కొట్టి వెళ్ళింది. అద్దంలో తన ముఖం చూచి మోహన్ సింగు ఆ రంగుల వికృతస్వరూపానికి అసహ్యించుకొన్నాడు.

వేడినీళ్ళతో శుభ్రంగా స్నానం చేసి, తెల్లని మడతలు కట్టుకొని పండుగ భోజనం మస్తుగా చేశాడు. ఏదో సినిమా ఉంటే తొలి ఆటకు వెళ్ళి వచ్చాడు. పచ్చపువ్వులాంటి వెన్నెల. తన యింట్లో ఉక్కగా ఉంది. ఎదురుగా చెరువుగట్టుమీద పొగడచెట్టు క్రింద కూర్చుంటే బాగానే వుంటుంది. చెరువులో నీరు అంతగా లేదు. పసిరిబారిపోయిన ఆ నీళ్ళలోనూ, నాచులోనూ వెన్నెల మసకమసకగా ఉంది. రాలిన పొగడపూలు మత్తుగా వాసనలు విరజల్లుతూ వున్నాయి. చెరువుకి యెదురుగానే అచ్చమ్మ ఉన్న పూరిల్లు, దీపం లేదుగాని, వెన్నెలలో ఒక మనిషిలాగ తెల్లని బట్టలతో గుమ్మంలో ఆనుతూ వుంది. పరకాయించి చూచాడు; తలలో మల్లి పూలు, తెల్లటి పరికిణీ, తెల్లటి గోరంచు ఖండువా, చిలకాకుపచ్చ రంగు రవిక, లక్ష్మి! పదిగంటల రాత్రి అవుతుందేమో! ఒకర్తే కూర్చుని వుందేమో! లేదు; చెరువుగట్టుమీదకే వస్తూవుంది.

ఇందాకా అంత ఘోరంగా వంటినిండా రంగు కొట్టిపోయింది. ఈ ఆడదానికి ఎంత కండకావరం? ఈడ్చి తన్నేవాడులేక! ఇది ఎవడిని కట్టుకుంటుందో కాని వాడి పని అంతే!! తనే కట్టుకుంటేనో? ఎలాగ కట్టుకుంటాడు? వాళ్ళు బొందిరీలు. లక్ష్మి మరియెవ్వళ్లో కూరలు అమ్ముకునే వాళ్ళున్నూ. అదీగాక అచ్చమ్మ – ఆ దెయ్యం యిష్టపడుతుందా? ఆ అచ్చమ్మతో యిష్టంగా ఉంటాడు పోలీసు ఆయన – అతనికి తెలిస్తే చంపెయ్యడూ? అసలు ఎవరినో ఒకళ్ళను పెళ్ళి చేసుకొంటే మంచిదేమో! ఈ మాట అమ్మతో చెప్పివెయ్యాలి. కాని ఆడదంటే భయం పట్టుకుందేమిటి? ప్రతి ఆడదీ పాములాగ కనిపిస్తుందేమిటి? లక్ష్మి కూడా పాములాగే కనిపిస్తుంది. ఈ మాటు ఈ పాముని పట్టేసుకోవాలి. రాని, దగ్గరకు రానీ! లక్ష్మి దగ్గరకు వచ్చేసింది.

"ఎవరు వారు? రాత్రికాడ చెరువుగట్టు మీద కూకున్నారు?"

సింగు మాటాడలేదు. చాలాసారులు లక్ష్మి తానూ కలిసి ఆ చెట్టు క్రిందే కథలు చెప్పుకున్నారు. అపుడు తప్పు లేదు, భయం లేదు. ఇపుడు లక్ష్మి పెద్ద అయింది. ఆడది. చూస్తే భయం: పాములాగ కనిపిస్తోంది. ఆ వెన్నెల, పున్నమి పొగడపూలు, లక్ష్మి ఇవన్నీ కలిసి నాగస్వరం పలికిస్తూ ఉన్నట్టు అయింది, 'రారా' అనే పిలుపు. తనలో వున్న పాము ఆ నాగస్వరానికి పైకి లేచి ఆడుతున్నట్టు అయింది. తనో పాము; లక్ష్మిఒక పాము – రెండుపాములు కలిసిపోతాయి ఈ సంగీతంలో; అదే నాగస్వరం; కాదు, తాను పామును పట్టుకోవాలి. లక్ష్మి చేసిన దౌర్జన్యానికి బుద్ధి చెప్పాలి.

దగ్గరకు వచ్చిన లక్ష్మిని మోహన్ సింగు తన బాహువుల్లో బంధించాడు. అతనిలో చెప్పలేని, ఇదివరకు చూడని కొత్త శక్తులు మేల్కొన్నాయి. ఏమి చేశాడో! ఏమైపోయాడో! కొంతసేపటికి పెద్ద ఏడ్పుతో లక్ష్మి ఇంటిముఖం పట్టింది. మోహన్ సింగ్ తాను చేసిన అకార్యానికి మొగం చూపకుండా తన గదిలోకి పోయి తలుపులు బంధించుకొన్నాడు.

## 5

మోహన్ సింగ్ ఇండియన్ పీనల్ కోడ్ 324 సెక్షన్ క్రిందనో, మరి దేని క్రిందనో, మరి దేని క్రిందనో బాలికా బలాత్కార నేరానికి అరెస్టు చేయబడ్డా డన్నమాట ఇంజనీరుగారు వినేటప్పటికి ఆయన మొదట్లో నమ్మలేదు. వాడు అటువంటి వాడు కానేకాడు. ఎంతో సాధువు: అమాయకుడు. అలాంటి అఘాయిత్యం అతనివల్ల కానే కాదు. సింగ్ తల్లి, తండ్రి ఆయన కాళ్ళ మీద పడి వేడుకొన్నారు. ఇదంతా ఆ అచ్చమ్మ ముండా, ఆ పోలీసు ఆయన చేసిన పని యని చెప్పుకొని, రక్షిస్తే కాని వీలులేదని బ్రతిమలాడారు.

వెనువెంటనే ఇంజనీరు గారు పోలీసు స్టేషన్‌కి వెళ్ళి వివరాలు తెలుసుకొని, అంతా డాక్టరుగారి చేతుల్లో వుందని విన్నారు. డాక్టరు మామూలు వైద్యమే కాక మానసిక చికిత్సలో కూడా పరిశోధన చేసిన వాడవడం చేత, యీ కేసంటే అతి శ్రద్ధతో పరికిస్తున్నాడు.

ఇంజనీరుగారిని చూచి, తాను పరీక్షచేసిన ప్రకారం నేరంరూఢి అయినదని వెల్లడి చేశాడు. లక్ష్మినీ, మోహన్‌సింగునూ పరీక్ష చేసిన తర్వాతనే యిది రుజువైందని డాక్టరుగారి సాక్ష్యం.

''ఇప్పటికీ నేను నమ్మలేకుండా ఉన్నాను'' అని ఇంజనీరుగారు ఆశ్చర్యం వెలిబుచ్చుతున్నారు.

"మోహన్‌సింగుకు వస్తూ వున్న కలలమాట మీరు ఎన్నడైనా విన్నారా?"

"అవును. తరచు పాములు వచ్చినట్టు, మీద పడినట్టు కలలు వచ్చేవట. ఆఖరికి ఒక పామును చంపాడు. దాని జంటను పట్టించాము కూడాను"అని కథంతా చెప్పారు ఇంజనీరుగారు.

"అదే యిందులో మీరు తెచ్చిపెట్టిన చిక్కు! కలల్లో పాములకీ, నిజం పాములకీ ముడిపెట్టారు. కలల్లో పాములు అవి కానేకావు. ఇవి మనస్సులో అణగత్రొక్కివేసిన కోరికలు. అవే పురుషత్వ చిహ్నములయిన సర్పములుగా కలల్లో కనిపించేవి. అతని కోరికలే ఇంతకాలం పాములని తెలుసుకోలేకపోయాడు. అవే యింత పని చేయించాయి. అతనికి తెలియకుండా తలయెత్తి ఈ అమానుషరూపంగా బయటపడ్డాయి."

"సరే. మీ సైకోఎనాలిసిస్ బాగానే వుంది. కాని ఈకేసు తప్పించే ఉపాయం చెప్పండి ముందు."

"వెంటనే ఈ కుఱ్ఱవానికి వివాహం చెయ్యడమే"

"అలాగే చేయిద్దాం లెండి. ముందీ కేసు వదల్చుకొని బయటపడే ఉపాయం చూడండి."

"పెళ్ళి చేస్తే అన్నింటికీ పనికివస్తుంది."

"అంటే?"

"ఈ పిల్లకే పెళ్ళి చేయించివేస్తే సరి..."

"దానికి వాళ్ళ తల్లిదండ్రులు ఒప్పుకోవద్దూ?"

"ఒప్పుకోక యేం చేస్తారు? వాడి ప్రాణం మీదికి వస్తే–"

"ఎలాగో మీరు ఇష్టపరచండి–"

"పిల్ల పిల్లవాడు ఇష్టపడుతూనే ఉన్నారు. వాళ్ళను ముందే ఒప్పించాను. ఇంక పెద్దవాళ్ళచేత కూడా...."

"సరే కానివ్వండి.... ఎంత చిత్రం జరిగింది."

"నే చెప్పవచ్చే మాటేమిటంటే. మన అందరి మనస్సులోనూ త్రాచుపాములు నిద్రపోతూ వుంటాయి. అవే మనం భయపడి అణచివేసిన బలమైన కోరికలు, వాటికి తగిన కట్టుబాట్లు ఉన్నంతసేపూ అవి అలాగ నిద్రలోనే వుంటవి. కాని అవి మనకి తెలియకుండానే కట్లు విప్పుకొని బరితెగించినప్పుడు వాటిని పట్టపగ్గాలు ఉండవు. వాటిని బంధించి వుంచినంతసేపూ వాటి ఛాయలు భయాలుగా అనేక రూపాలు పొంది అజాగ్రత్తలో కలవరపెట్టూ వుంటాయి."

"అదీ కథ!"

# రావూరు వెంకట సత్యనారాయణరావు



**జీ**వితం కన్నీటికోన కాదు. ఆనంద మందిరం అని చాటే సాహితీవేత్త. సాంఘిక జీవితంలో దైనందిన సంఘటనల్లో తొంగిచూసే జాతీయమైన హాస్యంతో, సున్నితమైన చమత్కారంతో చదువరులకు చక్కలిగింతలు పెట్టగలరు. వెన్నెల విరిసినట్లు, తీయగా చిరునవ్వులు చిందించి, మనస్సుని మాధుర్యంతో నింపివేయగల నైపుణ్యం ఆయనిది. చాలా సినిమాలకు కవిగా పనిజేశారు. ఆంధ్రపత్రిక స్పెషల్ కరస్పాండెంట్‌గా హైద్రాబాదులో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు.

**రచనలు :** నెలవంక, బాటసారి మొ॥ నవలలు ఏరువాక నాటకం, ఆషామాషీ, అనేక వ్యాసాలూ కథలూ.

# మధుపర్కాలు

"**పు**ట్టన్నది రెండు నిట్టాళ్ళపాక. అవి నెత్తిమీద నీడకోసం వేసుకున్న నిట్టాళ్ళు. అసలా ఇంటికి నిట్టాళ్ళు ఆ దంపతులే! పుట్టన్నా, సీతమ్మా ఒక్కటే ఎత్తు, భౌతికంగానే కాదు... ఆత్మలోకూడా సమానమైన ఎత్తులోనే వుంటారు. ఒకటిగా వున్న ఆత్మను రెండుచేసి, రెండింటికి రెండు శరీరాలు కల్పించి, భూలోకంలో కొన్నాళ్ళు ఆడుకురండని ఆ విధాత పంపాడా: అనిపిస్తుంది వారిని చూస్తే.

పుట్టన్న వృత్తి బట్టలనేత. రోజుకు ఏ నాలుగుగంటలో తప్ప, చేతిలో కండెను పడుగులో నుంచి అటూ యిటూ గిరాటు వేస్తూ, వస్త్రం నేస్తూనే వుంటాడు. సీతమ్మ రాట్నం దగ్గరనుంచి లేవదు. వడివడిగా చిలపలు తోడటం, కండెలు చుట్టడం, పడుగు వేసినప్పుడు భర్తతో పాటు గంజిపెట్టడం. కుంచె తీయడం ఆమె విధులు. ఏ సమయంలో కూడా వారు 'కాయకష్టం చేస్తున్నాం' అనే భావాన్ని బయట పెట్టేవారు కాదు. అదో యజ్ఞంగానే చూసుకునేవారు. ఒక్కకండె చుడితే సీతమ్మ కళ్ళు పువ్వులయ్యేవి. ఒక జానెడు నేస్తే పుట్టన్న పెదవులమీద పొట్ట పువ్వులు పూచేవి.

వారి పాక కెదురుగా ఒక గానుగచెట్టుంది. దాని క్రింద వారికున్న ఆవు కట్టి వేసి వుండేది. వెలిసిపోయిన కాషాయవర్ణం. ఒక్క వ్రేలెడు వెడందాగా వచ్చి కలుసుకొన్న గిన్నె కొమ్ములు. పరోపకార బుద్ధితో బరువై క్రిందకు దిగిన పొదుగు. ఆ ఎర్ర ఆవుతో తెల్లటి కోడెదూడ. తల్లికి అందనంత దూరంలో కట్టి వేసివుండే ఆ దూడవంక అప్పుడప్పుడూ చూచి 'అంబా' అంటూ వుంటుందా గోమాత. తక్కిన సమయంలో మోర పైకెత్తి వూరువంక చూస్తుంది. ఆగోమాత కా చిన్నిలేగ ఒక్కటే కాదు, ఆ పల్లెలో చాలామంది పెంపుడు పిల్లలున్నారు. వారందరివద్ద నుంచీ ప్రతి ఉదయం, సాయంత్రం పాలకోసం కొమ్ము చెంబులు వస్తాయి. పుట్టన్న పాలు పితికి వాటిని నింపి తనువట్టి చెంబుతో ఇంట్లోకి

వెడతాడు. ఆ వెళ్ళేటప్పుడు చూస్తే అతని ముఖంలో వెన్నెల రేఖలు కనిపిస్తాయి. పసిపాపల కోసం తన గోవు పాలు వినియోగపడ్డాయనే సంతృప్తే ఆ వెలుతురుకు కారణం.

పుట్టన్న వంశస్తులావూరులో చాలా కాలంనుంచి వుంటున్నారు. తర తరాలుగా వచ్చే బాంధవ ముద్ర చెరిగిపోకుండా కాపాడుకోవడం అతని ముఖ్య ఆశయం. ఏ ఇంట్లో పెళ్ళి జరిగినా అతడు స్వయంగా నేసి మధుపర్కాలు పంపాలి. ఏటా జరిగే పెళ్ళిళ్ళ సమయంలో అతడు రాత్రింబగళ్ళు మగ్గం వద్దనే వుంటాడు. సీతమ్మ రాట్నం మీదనుంచి చెయ్యి తీసినట్లే కనిపించదు. మధుపర్కాలకు వారేమీ పైకం తీసుకోరు. వాటితో నూత్న వధూవరులు పీటలమీద కూర్చోవడం, తలంబ్రాలు పోసుకోవడం... చూడటం..... వారికళ్ళనుంచి ఆనంద బాష్పాలు కురియడం.... అదే మామూలు.

పుణ్యం, ధర్మం జీవితానికి పెట్టని కోటలుగా భావిస్తూ జీవిస్తున్న పుట్టన్నకు, ధనంమీద ఆశ లేదు. మూడు పూటలా కడుపును గంజితో నింపడం ఒక్కటే అతని ఆశయం. సీతమ్మ కూడా అంతకుమించి ఏమీ కోరదు. కాకపోతే గోవుకు మేత ఒకటి కావాలి, కాని, కొమ్ము చెంబులతో పాలకు వచ్చేవారంతా – చిట్టూ, తవుడూ, తెలకపిండి చెక్కలు, కానుకలుగా తెస్తూనే వుంటారు. ఊరి ఆసామి..... కుప్పనూర్పిళ్ళ కాలంలో అడక్కుండానే వరిగడ్డి తెచ్చి అతని దొడ్లో వామిపెట్టి పోతారు.జనపకట్టలు తెచ్చి ఇంటిమీద ఎండేసి పోతారు. పుట్టన్న వద్దని బ్రతిమాలినా వినరు. నీ గోవు కామధేనువు పుట్టన్నా" అని వారు నవ్వుకొని వెళ్ళిపోతారు.

అయినా ఏటేటా అతడు లగ్నాలకు అందించే మధుపర్కాలతో సంపాదన అంతా హరించిపోయింది. అప్పు అడగడమంటే అతని కెంతో అభిమానం. 'అప్పు కంటె ఆత్మహత్య మేలన్నాడు మా అయ్య' అంటాడు సీతమ్మతో. అప్పంటే నే మాత్రం ఒప్పుకొంటానా! గూట్లో పిట్టల్లాగా కూర్చునే వాళ్ళను.... గెడ్డలు పెట్టి కొట్టడం నే మాత్రం చూడగలనా' అంటుందామె. ఇలాటి పరిస్థితిలో ఊరిపెద్ద కాపు పాపయ్యగారింట్లో పెళ్ళివచ్చింది. అసలు శ్రావణమాసంలో ఆ గ్రామంలో పెళ్ళిళ్ళు చెయ్యరు. పాపయ్యగారి తల్లికి చూపు పోతోందన్న భయంతో పెళ్ళి తలపెట్టారు. "మసగ్గానైనా మనమరాలి పెళ్ళి చూడనియ్యవుట్రా నాయనా?" అన్న తల్లి మాటలకు జాలిపడి ఆయన ఆ నెలలోనే లగ్నం పెట్టించాడు.

'అదైనా అయిదురోజుల వ్యవధిలో పెట్టారు. సీతమ్మ నూతికిపోయి వస్తుంటే పాపయ్య కనబడి 'అప్పా! అమ్మాయి పెళ్ళికి లగ్నం పెట్టాం... వచ్చే శనివారం.... బావతో చెప్పు' అన్నాడు.

"అలాగే అన్నయ్యా.... మంచి మాట చెవినేశావు. మంచినీళ్ళ బిందె ఇంట్లో దించి వచ్చి వదినతో మాట్లాడుతా" అంటూ వెళ్ళింది. మాట విన్నప్పుడు సీతమ్మ ముఖంలో

చిరునవ్వు తొంగి చూచింది గాని... నాలుగు అడుగులు వేయగానే ఆ నవ్వు అంతరించి పోయింది. వడివడిగా వెళ్ళి బిందెదించింది. భర్తతో ఆ వార్త చెప్పింది. అతడూ వినగానే నవ్వాడు. కాని ఆ నవ్వుకూడా గాలిలో వెలిగించిన దీపంలాగా గప్పున ఆరిపోయింది.

"కాయకష్టమైతే చేస్తాం.... నూలెలా వస్తుంది?" అని అతడు విచారపడ్డాడు.

"పోనీ ఈ ఒక్కమాటుకీ...." అని వూరుకొంది సీతమ్మ.

"ఒక్కమాటుకీ? ఆచారం ఆపివేద్దామంటావా!... ఆచారం నే నాపలేను... కావాలంటే బ్రతుకు ఆపివేస్తాను" అన్నాడు పుట్టన్న పట్టరాని కోపంతో.

"ఆచారం ఆపమనలేదు..."

"మరేమిటి నువ్వన్నది?"

"పోనీ అప్పు..."

"నాకు చెప్పకామాట... ఒక్క రూపాయి అప్పు చేస్తే... ఇచ్చిన వాడికి ఎక్కడ లేని చనువూ వస్తుంది. కాసేపైనా చక్కగా పడుతోంది నిద్ర... అది కూడా పోతుంది. అందాకా దేనికి, అప్పు మాట జ్ఞాపకం వస్తే మగ్గంలో కూర్చుని ఇటుకండె అటూ, అటు కండె ఇటూ విసిరే స్థిమితం వుంటుందా! అప్పు మాత్రం చెయ్యను" అన్నాడతడు – ఉత్తరీయం కొంగుతో కళ్లు ఒత్తుకుంటూ. తానా మాట ఎత్తడం తప్పని సీతమ్మ లోలోపల బాధ పడుతూ "అవును. చెయ్యొద్దు" అంది.

వారిద్దరూ చాలా సేపు మౌనంగా కూర్చున్నారు. అప్పుడు పుట్టన్న మొఖం అరచేతుల్లో దాచుకొని అన్నాడు "పోనీ ఆవును" సీతమ్మ "అవునా?" అన్నది. మళ్ళీ ఇద్దరి మధ్యా నిశ్శబ్దం వచ్చి నిలచింది. గుండెల్లో చెప్పరాని దడదడ పుట్టింది.

"ఏం చేస్తాం? తరతరాలా వచ్చే ఆచారాన్ని పోగొట్టుకోవడం కన్నా గోవును వదులుకోవడం మంచిదికదూ! ఈ లగ్నానికీ వస్త్రాలందిస్తే చాలు. అంతగా అయితే మళ్ళీ పెళ్ళిళ్ళ కాలం వచ్చే సరికి వూళ్లో నుంచి లేచిపోదాం. పొరుగూరికి ఆచారాలు వెంటరావుగా" అన్నాడతడు.

"కాని, అవును అమ్మితే పాలకు వచ్చే వాళ్ళంతా ఏమైపోతారు?" అన్నదామె.

"ఏం చేస్తాం? పోనీ ఒక పనిచేద్దాం..." అవును వూళ్లోనే అమ్ముదాం. పిల్ల పాల వాళ్ళంతా అక్కడికే పోయి తెచ్చుకొంటారు" అన్నాడు.

"వాళ్ళకంత బుద్ధి పుట్టొద్దూ" అంది సీతమ్మ.

"అంతకంటె మనమాలోచించలేమో! అవును ఈపూటే బేరం పెడతా... చద్దన్నం తిని బస్తీకివెళ్ళి నూలుతెస్తా" అన్నాడు పుట్టన్న.

సీతమ్మ "సరే" అంది. పుట్టన్న కళ్ళ నీళ్ళుఉత్తరీయంతో గట్టిగా తుడుచుకొని, కొప్పులాగావున్న జుట్టుముడిని ఒక్కసారివిప్పి, దులిపి, మళ్ళీ ముడివేసుకొని బయలుదేరాడు.

అప్పుడే సందె వెలుగులు దూసుకువస్తున్నాయి. గానుగచెట్టు చిటారు కొమ్మకు అతికించినట్లుగా నెలవంక కనిపిస్తూన్నాడు. పుట్టన్న వాకిట్లోకి రాగానే ఆవు "అంబా" అని అరిచింది. పుట్టన్నకు పట్టరాని దుఃఖం వచ్చింది. వెళ్ళి దాని మెడ కౌగలించుకొన్నాడు. "నామీద కోపంవచ్చిందా? అమ్ముతున్నానని బాధపడుతున్నావా ఏం చెయ్యను, ఆచారంకోసం అమ్ముకోవలసి వచ్చింది. నువ్వెక్కడున్నా ప్రతి రోజూ వచ్చి చూస్తా... నిన్ను దైవం లాగా కొలుస్తున్నా. నువ్వు కాపాడకపోతే ఎవరు కాపాడుతారు నన్ను?" అని మెడవదలి ఉత్తరీయంతో దాని ఒళ్ళంతా తుడిచాడు. దానిని విడవలేక విడవలేక వూళ్ళోకి వెళ్ళాడు.

మరునాడు ఉదయం పుట్టన్న లేచి గానుగపుల్ల విరిచి ముఖం కడుక్కొంటున్నాడు. తూర్పు దిక్కున సూర్యుడు సగం పైకిరాగా – చల్లటి ఎండవచ్చి పల్లె మీద పడుతోంది. పక్షులు గూళ్ళల్లో ఉండే రెక్కలు విదలించుకొంటున్నాయి. "పుట్టన్న ఇంటికి కొమ్ముల చెంబులు వచ్చినాయి. వారికి ఆవు కనిపించలేదు. పుట్టన్నా ఆవేది?" అన్నదొక ముసలమ్మ. పుట్టన్న వెనక్కి తిరక్కుండానే "అమ్మేశా తల్లీ అచ్చన్నగారికి."

"అయ్యో! అమ్మేశావా! ఇక మా పిల్లల గతేమిటి? గుక్కెడుపాలు పోస్తున్నాం – గనుక కక్కటిల్లకుండా పరుంటున్నారు" అన్న దా అవ్వ.

"ఏం చెయ్యను తల్లీ! అలా వచ్చింది కాలం. అమ్మేటప్పుడు అచ్చన్నతో చెప్పాను. పిల్లపాలు మాత్రం పోస్తూవుండాలి సుమా" అని.

వచ్చినవారంతా దీనంగా నిలబడ్డారు.

పిల్ల పాలకోసం వచ్చినవారిలో ఆ వూరి పూజారి కూడా వున్నాడు. ఆయన ముందుకు వచ్చి ఇలా అన్నాడు – "నువ్వు ఋషిలాంటి వాడవు గనుక, పసిపిల్లల కోసం త్యాగం చేశావు. నువ్వు చేసే దానం వల్ల ఎందరు పిల్లలు కడుపులు నిండి కమ్మటి నిద్రపోతున్నారు? ఎందరు తల్లులు చూపులు చల్లగా వుంటున్నాయి?"

"ఏం చెయ్యను బాబు.... నే బ్రతకడం కోసం అయితే ఆవుని అమ్మేవాణ్ణి కాను, పరువు బ్రతికించుకోవడం కోసం అమ్మాల్సి వచ్చింది" అన్నాడు పుట్టన్న.

"అది మా దురదృష్టం" – అన్నాడు పురోహితుడు.

ఇంతలో సీతమ్మ బైటికి వచ్చి కుడితి కుండ "ఇదిగో! నిన్నే! ఈ కుడితి అచ్చన్నగారింటి దగ్గర ఇచ్చొస్తా...." అంది.

"ఇచ్చిరా! ఈ పూటతో ఈ కుడితితో మనకూ, ఆవుకూ వున్న ఋణం తీరిపోతుంది." అన్నాడు వెనక్కి తిరక్కుండానే. సీతమ్మ కన్నీరు చీరకొంగుతో తుడుచుకొంటూ వెళ్ళిపోయింది. పాలకు వచ్చిన వారు కూడా ఒక్కొక్కరే వెళ్ళి పోయారు. మరికొంచెం సేపటికి పుట్టన్న వెనక్కి తిరిగిచూచాడు. సిరి తొలగిపోయిన తర్వాత మిగిలిన నిరుపయోగ జీవిలాగా కనిపిస్తోంది – కట్టుకొయ్య. పుట్టన్న మనస్సు గావురుమన్నది. దాన్ని పీకి దూరంగా గిరాటువేద్దామనుకొని, గుంజి చూశాడు. అది – రాలేదు. కాళ్ళీడ్చుకుంటూ ఇంట్లోకి వెళ్ళాడు.

ఆ రోజే బయలుదేరి బస్తీకి వెళ్ళాడు. నూలు తెచ్చాడు. ఆ నాలుగు రోజులు అతడు మగ్గం గోతిలో నుంచి లేవలేదు. సీతమ్మ రాట్నం వదలలేదు. నాలుగురోజులు గడిచాయి. తెల్లారే లగ్నం... ఆ సందెవేళ ఆముదం దీపాలు – అటూ ఇటూ పెట్టి నేత నేస్తున్నాడు పుట్టన్న. ఇంతట్లోనే చెరువుగట్టున మేళాలు మ్రోగినాయి. "పెళ్ళివారు దిగారు" అంది సీతమ్మ. "ఇంకొక్క ఘడియలో నేత పూర్తి అవుతుంది" అన్నాడు పుట్టన్న. మరి కాసేపటికి పల్లకి, దాని వెంట బళ్ళూ ఆ వీధినే వచ్చాయి. సీతమ్మ చూడటానికి బైటికి వెళ్ళింది. ఇలాయి బుడ్ల వెలుతుర్లో పెళ్ళికొడుకును చూచింది. వెంట ఇరవై బళ్ళున్నాయి. అన్నీ వాళ్ళ ఇల్లు దాటిపోయేదాకా నిలబడి చూచి ఇంట్లోకి వచ్చింది సీతమ్మ. "పెళ్ళికొడుకు కళ్ళూ, ముఖం బాగానే వున్నాయి. పాతికేళ్ళుంటాయి. అయినా ఫరవాలా! ఈడుగానే వుంటాడు. పార్వతి మాత్రం ఒడ్డూ పొడుగూ లేదూ" అంది.

"ఎవరికెలాటి మొగుణ్ణి తేవాలో ఆ దేవుడికి తెలియదేమిటే" అన్నాడు పుట్టన్న.

ఇంకొక గంటసేపటికి మధుపర్కాలు– తీసుకు వెళ్ళడం కోసం మేళాలతో పెళ్ళివారు వచ్చారు. సీతమ్మ మధుపర్కాలు మడతపెట్టి ఇంట్లో వున్న దేవుడి పటం దగ్గర పెట్టి నమస్కరించి తెచ్చింది. ఒక ముత్తయిదువ ఆమె నుదుట కుంకం పెట్టి పళ్ళు, తాంబూలం యిచ్చింది. ప్రక్కనున్న మగాయన "పుట్టన్నా! తెల్లారి జానెడు ప్రొద్దెక్కే లగ్నం.... నువ్వు పెందరాళే లేచి రావాలి" అన్నాడు. పుట్టన్న ముసి ముసి నవ్వులు నవ్వుతూ "కాలుకడిగి కన్యాదానం చేస్తుంటే దేవతలు తొంగి చూస్తారట. దరుడు రాకుండా వుంటాడా!" అన్నాడు. వచ్చిన మంగళ వాయిద్యాలతో మధుపర్కాలు తీసుకొని వెళ్ళిపోయారు. పుట్టన్న దంపతుల మనస్సులు మల్లెపందిరిగా మారిపోయాయి.

తెల్లవారింది. పాపయ్యగారింట్లో పెళ్ళి వైభవంగా జరుగుతోంది. ఒక్క కోమటి ఇల్లు తప్ప తక్కిన ఇళ్ళన్నీ తాళాలు పెట్టి వున్నాయి. అర ఎకరం పందిరివేసినా జనం పట్టక కిటకిట లాడిపోతున్నారు. ఒక పందిరి గుంజనానుకొని సీతమ్మ నిలబడింది, ఆవిడకి కొంచెం పక్కగా పుట్టన్న వున్నాడు. నూతన దంపతులు తలంబ్రాలు పోసుకుంటున్నారు.

సన్నాయి పాట సాగిపోతోంది. సంతోషతరంగాలుగా పిల్ల తల్లిదండ్రులు ఒకరినొకరు ఎరగనంత క్రొత్తగా చూచుకుంటున్నారెందుకో. పుట్టన్న తన ధర్మం నెరవేర్చుకొన్నానన్న ఆనందంలో మునిగిపోయాడు. లగ్నం అయింది. 'అందరు భోజనాలకు పదండీ' అన్న కేకలు నాలుగు వైపుల నుంచి వినిపించాయి. అంతా వెళ్ళినా పుట్టన్న సీతమ్మా గోడ ప్రక్కగా నిలబడి ఏదో చెప్పుకొని నవ్వుతున్నారు. పాపయ్య చూశాడు వారిని.

"యేం అక్కా నువ్విక్కడే వున్నావు – బావయ్య అలిగాడా? కలిగిందేదో పెడతాం. అంత అలిగితే ఎలా బావా" అన్నాడు.

"అలిగిన వాళ్ళ కిక్కడ అత్తెసరు వెయ్యలేదని చెపుతున్నా" అని సీతమ్మ నవ్వింది.

"అంత అలగాలని వుంటే తిని అలుగుతాను గాని, పప్పన్నం వదులుతానా" అన్నాడు పుట్టన్న.

పాపయ్య నవ్వి "పదండి లోపలికి" అంటూ బైటి గుమ్మంవైపు వెళ్ళి వాకిట్లో ఇంకెవరన్నా ఉన్నారేమోనని చూచివచ్చాడు.

ఆరాత్రే ఆ నూతన దంపతులకు పునస్సంధానం. పళ్ళెం నిండా మల్లెలు పోసుకొని కూర్చొని ఒక పెద్ద ముత్తయిదువ పార్వతి జడవేస్తోంది. ఒక ప్రౌఢ కొనగోటితో తొడిమలు త్రుంచి రెండేసి పువ్వులు జతచేసి అందిస్తోంది. పూలజడ పెరుగుతున్న కొద్దీ పార్వతి కళ్ళు పెద్దవవుతున్నాయి.కాని అవి ఎవరూ చూడకుండా దాచుకుంటోంది.

"పార్వతీ! యీ మల్లె పువ్వులెందుకో – తెలుసా" అంది ఆ ప్రౌఢ.

పార్వతి ఒకసారి సిగ్గుతో ఒళ్ళు విదిలించుకుంది.

"ఆ! ఆఁ అంత తిప్పుకోకే ఒప్పలకుప్ప.... నీకంటే గొప్పవాళ్ళే గుప్పిట్లో ముత్యాలై పోయారు." అన్నదా అవ్వ.

"వెళ్ళగానే చెప్పాలి మల్లెల నడిగి నామనస్సు తెలుసుకొమ్మని" అందా ప్రౌఢ.

"పో అత్తా" అంది పార్వతి.

"ఇక పొమ్మనక ఏం చేస్తావు?... తోడు దొరికిన తర్వాత తన వాళ్ళంతా తొత్తులవుతారు" అందా ప్రౌఢ.

ఇంతలో పాపయ్య భార్య రెండు కొత్త దుప్పట్లు తెచ్చి జడవేసే ముసలమ్మకు చూపించి "పిన్నీ యీ రెండింట్లో ఏది వెయ్యను" అంది.

ఆ అవ్వ ఒకచేత్తో పార్వతి జడ పట్టుకొని రెండు చేత్తో దుప్పట్లను తాకిచూచి, "రెండూ ఒకమోస్తరుగానే వున్నాయి. ఒకటి వేసి ఒకటి మడతపెట్టి తలాపి దిక్కున పెట్టు" అంది.

"ప్రౌఢ పార్వతి తల పైకెత్తి నీ కేది బాగుందే" అంది.

"ఆఁ దాన్నడుగుతావేం! దాని కాయన బాగుంటాడు. తక్కినవన్నీ ఎట్లా వుంటే ఏం" అంది అవ్వ.

పార్వతి తల్లి దుప్పట్లు తీసుకొని వెళ్ళిపోయింది. జడవేసే అవ్వ "పార్వతీ! యీ సరసాలికేం గాని తొలిసారి భర్తను కలుసుకోబోతున్నావు. ఒక జీవితం రెండై, రెండు జీవితాలు ఒకటవుతాయి. యీ వయస్సు, యీ వలపు గెలిచే దాకా వుండవు. చివరిదాకా మిగిలేది – త్యాగం, ధర్మం మాత్రమే. ఇవి మననం చేసుకోండిద్దరూ. నీకొక కథ చెప్తాను – ఆయన ఏదైనా మాట్లాడమంటే ఇది చెప్పెయ్! అదెక్కడి కథో కాదు. మన పుట్టన్నలేడు అతడి కథే. ఎప్పటి కథో కాదు ఇప్పటి కథే. ఎంత త్యాగం చేశాడో తెలుసా అంటూ, అతడు – ఆవును అమ్మి మధుపర్కాలు కొనుక్కురావడం వృత్తాంతమంతా చెప్పింది. పార్వతి ఎంతో జాగ్రత్తగా విని ఆలోచిస్తోంది. ఆ ఆలోచనలో నుంచి పుట్టన్న కేదైనా సహాయం చెయ్యాలనే కోర్కె కుచ్చులాగా వచ్చింది. ముసలమ్మ జడ బిగించి కుచ్చు బిగించింది. ప్రౌఢ పళ్ళెంలో మిగిలిన గుడ్డి పువ్వుల్ని దోసిట్లో పోసుకుని ఎగరవేస్తోంది.

శయన మందిరంలో పాన్పుకు ప్రక్కగా నిలబడి వుంది పార్వతి. రామ్మూర్తి ముసిముసి నవ్వులు నవ్వుతూ జేబులో వున్న నవర్సు తీసి ఆమె కొంగు అందుకున్నాడు. ఆమె చెంగున గంతు వెయ్యబోయింది. "బంగారం బంగారం" అన్నాడు. తన్నే అంటున్నాడు అనుకొందావిడ. అతడు కొంగున నవర్సు కట్టాడు. దీన్ని నీ యిష్టం వచ్చినట్టు ఖర్చుపెట్టుకోవచ్చు తొలినాడు బంగారం యిచ్చిగాని పడుచును స్వీకరించకూడదు" అన్నాడు. ఆమె కాలి బొటన వ్రేలితో నేల గీస్తోంది. ఆమె చెయ్యి పట్టుకున్నాడాయన, అగరవత్తులు సగం పైగా నుసి అయిపోయాయి. ఆమె పుట్టన్న ఆవును అమ్మి మధుపర్కాలు నేసి యిచ్చిన వృత్తాంతం చెపుతోంది. రామ్మూర్తి బాలీసు నానుకొని, పార్వతి కుప్పెలు తన గుప్పెట్లో దాచుకొని – కథ వింటున్నాడు. చివరి కిలా అన్నాడు. అంత త్యాగం చేసిన పుట్టన్నకు నమస్కరించాలి – ఆయన ధర్మం నెరవేర్చాడు. మన ధర్మం మనం నెరవేరుద్దాం" అన్నాడు. "ఏమిటా – ధర్మం" అంది పార్వతి. ఆ ఆవుని తిరిగి ఆయనకే ఇచ్చేద్దాం?

"పుట్టన్న ఒప్పుకుంటాడా?" అంది పార్వతి భర్త కళ్ళల్లోకి చూస్తూ.

"అదంతా నేను ఆలోచిస్తాను. తెల్లవారేసరికి ఆవు పుట్టన్న ఇంటివద్ద వుండాలి... అన్నట్లు అచ్చన్న ఇల్లెక్కడ?" అన్నాడు.

"రామమందిరం ప్రక్కయిల్లే."

"అయితే, కోడికుయ్యగానే లేచి వెడతాను. సొమ్మిచ్చి ఆవును తోలుకువెళ్ళి పుట్టన్న ఇంటి వద్ద అప్పగించమంటాను..."

"మరి, యీ నవర్సుతో గోవును కొంటే!..."

"అంతకంటే మంచి పనేం వుంటుంది పార్వతీ! తొలిరాత్రి ఒక త్యాగమూర్తిని గురించి చెప్పావు. యౌవనం జీవితాలకు తెల్లగుర్రం లాంటిది. దీనిమీద స్వారీ చేయడంలో ఆనందం లేకపోలేదు. కాని, గమ్యం దృష్టిలో పెట్టుకొని ప్రయాణించడంలో గొప్ప భాష్యం వుంది. మనం అందరికిమల్లే యౌవనాంధులమై ప్రయాణం చెయ్యొద్దు. పరమార్థాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రయాణం చేద్దాం. ఆ పరమార్థాన్ని సాధించడంలో అర్ధాంగి బిరుదు సార్థకం చేసుకోగలననే విశ్వాసం నాకు కల్పించావు. మన జీవితాలు తరిస్తాయనే ధైర్యం నాలో తొంగిచూచింది" అంటూ అతడు పార్వతి ముంగురులు సవరించాడు.

"మీ అడుగుల్లో అడుగులు వేసి తడబడని జీవితం నడపడం కంటే నాకేం కావాలి" అంది పార్వతి. పట్టరాని ఆనందంతో ఆమె తలను తన వక్షం మీదికి తీసుకున్నాడు రామ్మూర్తి. త్యాగానికి అతుక్కున్న ధర్మంలాగా ఆమె మనస్సాయన ఆత్మకు అతుక్కు పోయింది. ఇంతలో కోడి కూసింది. ఆమె ఉలిక్కిపడింది. అతడు మరింతగా ఆమెను హృదయానికి హత్తుకొని నవ్వుకొన్నాడు.

మధుపర్కాలు తీసుకొని వెళ్ళి ఇచ్చిందాక ఒక దీక్షతో వున్నారు పుట్టన్న దంపతులు. ఆ కార్యం నెరవేరింది. వారి మనసులో బరువు తగ్గింది. తగ్గిన తర్వాత ఆవుమీద బెంగ అధికమైంది. ఎలాగో మనస్సుకు సంతృప్తి తెచ్చుకొని నిద్రపోయారు. కాని నిద్రలో వారికా గోమాత ప్రత్యక్షమైంది. పుట్టన్నకు ఆవు 'అంబా' అని అరుస్తూన్నట్లు వినిపించింది. దిగ్గున లేచి వెళ్ళి ఇంటిమీద వున్న జనప కట్ట తీసుకుని గానుగచెట్టు దగ్గరకి వెళ్ళాడు. బిక్కు బిక్కుమంటూ కట్టుకొయ్య కనిపించింది. అతడి మనస్సు చిట్లి, కొన్ని బెల్లు లూడిపోయినట్లయింది. తిరిగి వచ్చి ఇంట్లో పడుకొన్నాడు. నిద్ర రావడం లేదు. ఆవు ముట్టె తెచ్చి అతని పొట్టమీద పెట్టి గోకమన్నట్లుగా తోచింది. గభాలున లేచి కూర్చున్నాడు. చూపులు చూరులోకీ, మనస్సు శూన్యంలోకీ చొచ్చుకుపోతోంది. నువ్వు పోసిన పాలు త్రాగి పసిపిల్లలు గుక్కలు మాని నిద్రపోతున్నారు'' అని పూజారి అన్నమాటలు వినిపించాయి. ఆ భావాన్ని తరుముకొంటూ వెనక నుంచి పసిపిల్లల ఏడ్పులు వినిపించాయి. చెవులు గట్టిగా మూసుకొని "సీతా! సీతా" అని పిలిచాడు. ఆమె లేచింది. తన అనుభూతి అంతా చెప్పాడు. "అయిపోయిన దాని కింత దిగులైతే ఎలా? ముందు సంగతి ఆలోచించాలిగాని" అన్నదామె. ముందు సంగతి ఆలోచించాడా దేవుడు. జరిగిన దానికి విచారపడటం ఒక్కటే మన పని అని పుట్టన్న బైటికి వెళ్ళాడు. తూర్పురేక లారుతున్నాయి. పుట్టన్న కట్టు కొయ్యవైపు చూడలేక తలవంచుకొన్నాడు. 'అంబా' అనే పిలుపు వినిపించింది. అదీ తన భ్రమే ననుకొంటూ తల ఎత్తాడు. గానుగ చెట్టు క్రింద ఆవు నిలబడివుంది. పరుగెత్తుకు వెళ్ళాడు. దాని మెడ కవుగలించుకొన్నాడు. "సీతా!

సీతా" అని పిలిచాడు. ఆమె వచ్చింది. "ఆవు తెంచుకు వచ్చింది" అన్నాడు. "తెంచుకు రావడమేమిటి కట్టుకొయ్యకు కట్టేసి వుంటే" అన్నదామె. ఇద్దరూ విస్తుపోయారు. ఎవరు తెచ్చి కట్టివేస్తారు. "తెంచుకొని వీధివెంట పోతుంటే ఎవరైనా తెచ్చి కట్టేసి వుంటారు. వాళ్ళకు మనం అమ్మివేశామని తెలియదుగా మన్ను" అంటూ పుట్టన్న ఉత్తరీయంతో కొమ్ములు తుడుస్తున్నాడు. ఒక కొమ్ము తుడుస్తూంటే "త్యాగం నువ్వు నేర్పిందే" అన్నట్లు రెండోది తుడుస్తూంటే "నీ పవిత్రత మాకెలా వస్తుంది" అన్నట్లు వుంది. పాలవేళ అయింది. "తోలుకుపోయి అచ్చన్న ఇంట వదలివద్దాం" అన్నాడు భర్త. ఒక్క జనపకట్ట తిన్న తర్వాత తోలుకుపోదాం" అన్నది భార్య. "అక్కడికే పట్టుకుపోయి వేద్దాం. పిల్ల పాలవాళ్ళు వచ్చి నిలబడతారేమో!" అంటూ అతడు త్రాడు విప్పాడు. అతడు త్రాడు పుచ్చుకు ముందు నడవబోతాడు. గోవు కదలలేదు. తప్పదు తల్లీ! అతనికి అప్పగించి రావాలి" అన్నాడు పుట్టన్న. ఆ మాట ఆలకించినట్లుగానే అడుగులు వేసింది ఆవు. సీతమ్మ జనపకట్ట చంకను పెట్టుకొని వెంట నడుస్తోంది. కాస్త దూరం వెళ్ళేటప్పటికి అచ్చన్న ఎదురొచ్చాడు. పాపయ్యగారి అల్లుడు డబ్బిచ్చాడని తనే తోలుకువచ్చి కట్టేశాననీ చెప్పాడు. భార్య భర్తలిద్దరూ ఒకరి మొగం వంక ఒకరు చూసుకొన్నారు. "ఆయన డబ్బివ్వడమేమిటీ!" అన్నాడు పుట్టన్న. "అప్పేమో" అంది సీతమ్మ. "ఆవును కట్టేసి వెళ్ళి అడుగుదాం పదా" అన్నాడు అచ్చన్నతో. "మీ ఇంటిదగ్గిరే కట్టేసుకో బావా! సొమ్ము నా సంచిలో పడిందిగా" అన్నాడు అచ్చన్న.ఆవును తోలుకు తెచ్చి గానుగచెట్టు క్రింద కట్టేసి, భార్యాభర్తలిద్దరూ బయలుదేరి పాపయ్యగారి ఇంటికి వెళ్ళారు.

వెండి పువ్వులున్న పీటమీద కూర్చుని, వెండి మరచెంబు దగ్గిర పెట్టుకొని ముఖం తోముకుంటున్నాడు పాపయ్యగారి అల్లుడు. మామగారు అరుగుక్రింద నుంచుని, అల్లుడేదైనా పలకరిస్తాడేమో, జవాబు చెప్పాలని ఉబలాట పడుతున్నాడు. పాపయ్యగారి భార్య కిటికీ దగ్గరికి వచ్చి అల్లుణ్ణి చూచి, పమిటి వెడల్పు చేసి కప్పుకొని, భర్త వంక చూచి చిరునవ్వు నవ్వింది. వెళ్ళిపొమ్మనే భావంతో నాలిక ములగాకంత బయటపెట్టాడు భర్త. ఇంతలో పుట్టన్న దంపతులు వచ్చారు వాకిట్లోకి. పాపయ్య "ఏమిటి బావా! పొద్దునే వచ్చావు! మా చెల్లెల్ని పుట్టింట్లో దించిపోదామనా" అన్నాడు.

"దానికైతే నే రావాలా! కోడళ్ళు పుట్టింటికి వెళ్ళడానికి – కోయల కూయడానికి ఒకళ్ళ పెత్తనం అక్కర్లేదని మా పెద్దమ్మ చెపుతూ వుండేది" అన్నాడు పుట్టన్న.

పాపయ్యకు నవ్వు వచ్చింది గాని, అల్లుడున్నాడని జ్ఞాపకం వచ్చి ఆపుకొని వోరకంటితో ఆయనవంకే చూచాడు.

రామ్మూర్తి నీళ్ళు పుక్కిలించపోయాడు – నవ్వు ఆపుకోలేక వుమ్మేశాడు.

"మా పుట్టన్నబావ! మీకు మధుపర్కాలు తెచ్చి యిచ్చిం దీయనే! మీకే కాదు, వూళ్ళో యెక్కడ పెళ్ళయినా, ఈయనే తెచ్చిస్తాడు. కానీ పుచ్చుకోడు. అంత ధర్మాత్ముడు" అన్నాడు పాపయ్య.

"తెలుసు" అన్నాడు రామ్మూర్తి.

"నే చేసేదీ ఒక ధర్మమేనా? గుళ్ళు కట్టించానా, గోపురాలు కట్టించానా, సత్రవులు వేశానా, ఒక మాట అడగాలని వచ్చాను అల్లుడుగార్ని" అన్నాడు పుట్టన్న.

"ఏమిటది" అన్నాడు పాపయ్య ఆశ్చర్యముతో.

"నేను అచ్చన్నకు ఆవును అమ్మాను. అది కొనితెచ్చి మళ్ళీ నా వాకిట్లో కట్టేశారు మీ అల్లుడుగారు."

"ఆ! మీ ఆవునా?......"

"అవును... కట్టేశాను... మీ ద్వారా నేర్చుకున్న విద్యే అది. మీరు ధర్మం కోసం అమ్మనూ అమ్మారు. నేనూ ధర్మం కోసమే అది కొని తెచ్చి మీ కిచ్చాను. మావంటి యువకులు త్యాగం, ధర్మం నేర్చుకోవడం తప్పంటారా?!"

"తప్పనడం లేదు.... మీరు ఆవును నావంటి వాడికి దానం చెయ్యడమేమిటా అంటున్నాను. ఏ పిల్లలున్న వాళ్ళకో ఇస్తే పుణ్యం వస్తుంది గాని నావంటి వాడికీ...."

"నాకు తెలుసు తాతా!... ఆ ఆవు నీ దగ్గర వుంటే రోజూ పదిమంది పసిపిల్లలకు పాలు దొరుకుతున్నాయి... ఇంకెవరికిచ్చినా, వాళ్ళ కడుపులే నిండుతాయి..."

"నిజమేననుకోండి" అయినా నేను మీ దగ్గర ఆవును తీసుకోవడం మంచిదికాదు... నే నోటు వ్రాస్తా మీకు."

"నోటు రాస్తావా తాతా! ఏం నోటు వ్రాసి ఇచ్చామని మాకు మధుపర్కాలు తెచ్చావు! మొదటి నుంచి నువ్వు మధుపర్కాల ద్వారా తీర్చేవి నోటు బాకీలేనా!...... సహాయ సంపదలు, ధర్మాలు లేక ఇలా నోట్లు పుట్టినాయి. లేనివారి లోట్లు వున్నవారు తీర్చడమే ధర్మం' అని భగవంతుడు ఒకేసారి మానవజాతికి దస్తావేజు వ్రాసి ఇచ్చాడు."

పార్వతి కిటికీలో నుంచి ఈ సంభాషణ అంతా వింటూనే వుంది. పుట్టన్న మాట్లాడకుండా నిలబడ్డాడు. పాపయ్య గారికి అల్లుడి మాటలు అమృతపు జల్లులుగా తోచాయి. ఆ మాటల కిటికీల ద్వారా అల్లుని హృదయంలోకి తొంగి చూస్తున్నాడు. "తన భాగ్యం మంచిదై ఈ అల్లుడు లభించాడను కొన్నాడు. కాదు కాదు – మా పార్వతి చేసుకొన్న పూర్వపుణ్యం" అనుకొన్నాడు.

అల్లుడు పుట్టన్నతో ఇలా అన్నాడు.

"తాతా! పోనీ, ఆ ఆవు నీది కాదనుకో, దానికి నువ్వు ధర్మకర్తవనుకో.... గ్రామంలో పిల్లలకు క్షీరం దానం చేస్తూ వుండు."

పుట్టన్నకి పట్టరాని సంతోషం వచ్చింది. "అట్లాంటి పని అయితే చెయ్యడానికేం బాబూ! గంతులేస్తూ చేస్తా. పెద్దవాళ్ళకు చేసిన సహాయంలోనే ఎంతో పుణ్యం వుంటుందంటారు. పసివాళ్ళకు చేసిన సేవ భగవంతుడిసేవే నంటారు. అట్టాంటి పని చెపితే, ఎట్టాంటి వాడైనా ఒప్పుకొంటాడు – అయితే నే వెళ్ళి వస్తా. ఈ మాట మా ఆవిడికి చెప్పి మళ్ళీ వస్తా.... మీకెట్టా దణ్ణం పెట్టాలో తెలియడంలా..... మీరీవూరు వచ్చినప్పుడల్లా... నన్ను.... నా ఆవునీ చూచి వెళ్ళాలి" అని రెండడుగులు వేసి గిరుక్కున వెనక్కు తిరిగి, "మరిమీది చిన్న తనమైనా, చాలా మంచి మనస్సండి. మంచి వూహలు గలవారి పంచనే బ్రతకమంటారు పెద్దలు. మీరీవూరి నుంచి వెళ్ళే దాకా – ఈ అరుగు దగ్గరే నుంచుంటా. ఇంకేమన్నా మంచిమాటలు చెప్పాలని వుంటే చెప్పండి.... ఉండండి ఆవు మాట మా ఆవిడకి చెప్పి వస్తా.... దాన్నికూడా తీసుకొస్తా మీకు దణ్ణం పెట్టడానికి" అని మళ్ళీ తిరిగి వెళ్ళబోయాడు.

"తాతా!" అన్నాడు అల్లుడు.

"ఏమిటి బాబూ! ఏమన్నా మంచి మాట తట్టిందా! చెప్పండి.... త్వరగా చెప్పండి".

"చెపుతా, నిన్ను నీ ఉత్సాహాన్ని చూస్తుంటే మంచి మాటలకు కరువా తాతా! చెపుతున్నా విను. నాకు చాలా ఆస్తి వుంది. మా మామగారు మర్యాద కోసం నాకో రెండెకరాల మాన్యం వ్రాసి ఇచ్చారు, కానుకంటే కాదనలేక పోయాను. దాన్ని నేనెవరికి కానుకగా ఇవ్వాలా అని ఆలోచించా. ఇప్పటికి తేలింది. నువ్వు నూతన దంపతులకు మధుపర్కాల కప్పి సత్కరిస్తూ వచ్చిన మహా దాతవి. నా రెండెకరాల మాన్యం నీకు వ్రాసిస్తా. దానికి మధుపర్కాల మాన్యం అని పేరు పెడతా. ఆ ఫల సాయంతో నువ్వు మధుపర్కాలు నేసి మామూలుగా నూతన దంపతులకు కానుకలిస్తూ వుండు... ఏం తాతా?"

"ఆ! మాన్యమా! మధుపర్కాల మాన్యమా! మరి, అది పుచ్చుకుంటే నా సేవేం వుంటుందందులో... వద్దులెండి.... వద్దు..." అని పుట్టన్న కేకలు పెట్టాడు.

"అలా అనకు తాతా! ఫలసాయం ఎంత వచ్చినా అది నూలికి సరిపోతుంది. కాని మధుపర్కాలు తయారు కావాలంటే నీ సేవ ఎంతో కావాలి. అంతేకాదు తాతా..... ఆ పడుగు పేకల్లో నీ పవిత్రాత్మ కూడా ప్రతిబింబిస్తుంది. ఉత్తమమైన నేత పరిశ్రమ నారాధించడమే కాకుండా వాటిని దానం చేసే నీ ఆత్మ ఎంత గొప్పది తాతా! నీ వంటివారిలోనే జాతీయ జీవనం తన ప్రాచీన రూపాన్ని ఇప్పటికీ కాపాడుకొంటోంది!... గ్రామ జీవనానికి వెన్నెల స్తంభాల వంటి ఈ పరిశ్రమల్ని పోషించే వారి కంటే దేశభక్తులు,

త్యాగమూర్తులూ వేరెవరున్నారు తాతా! గ్రామం ఒక పాలవెల్లి. దానిలో పువ్వులు మీ వంటివారు. తాతా! ఈ పూటే దస్తావేజు వ్రాయిస్తాను?....

పుట్టన్నకు సంతోషంతో గొంతు పూడిపోయి ఎంతో నత్తి వచ్చింది. ఏం చెప్పాలో తోచక గిర గిర తిరుగుతున్నాడు. చివరకు "సరే బాబూ..... ఇది కూడా మా ఆవిడతో చెప్పొస్తా. ఏదైనా మంచి మాట విన్నప్పుడు ఒక్కణ్ణే ఆలోచించలేను.... వెంటనే దాంతో చెప్పాలి.. చెప్పి మళ్ళీ వస్తా" అంటూ పరుగెత్తాడు. కరణంగారు కూడా ఆశ్చర్యంతో ఎందుకో పుట్టన్న వెంటనే నడిచారు.

కిటికీలో వున్న పార్వతి ఒక బంతిపూవు భర్తమీద విసిరింది. ఆయన వెనక్కి తిరిగి చూశాడు.

"త్యాగ మూర్తులు" అంది.

"నేర్పిన వారెవరు?" అని ఆయన వెండిచెంబులో నీళ్ళు అరచేతిలో పోసుకొని ఆమెవైపు విదిలించాడు. విచ్చిన కలువ రేకులపై మంచు ముత్యాల్లాగా ఆ నీటి బిందువులామె ముఖాన వెలసినాయి.

# సోమంచి యజ్ఞన్నశాస్త్రి



**వి**నూత్న వ్యంగ్యధోరణిలో చిందులు త్రొక్కే వీరికలం అదుపులో చిన్నకథ హద్దు లెరిగి మసులుకుంటుంది. యజ్ఞన్నశాస్త్రిగారి కథలు చేవగల చివురుకొమ్మలై కుహనా రాజకీయ వాదులకీ, నల్లబజారు వర్తకులకీ, లంచగొండులకీ చురకలు వేస్తాయి. ప్రయోజనకరంగా కథల్లో ఆద్యంతం హాస్యాన్ని నిర్వహించడం శాస్త్రిగారి విశిష్టత, అనుకరణకి లొంగక హాస్యరసాన్ని చిప్పిలచేసే ఆహ్లాదకరమైన శైలి సోమంచివారి సొమ్ము

రచనలు : విశ్వంపెళ్ళి, కళ్యాణి, న్యాయం, పేరయ్య రాజంట (నాటకాలు) లంచం పట్టిన ఆఫీసరు - లాభం చేసిన గొల్లది (కథలు) ఎట్టిటేపు (వ్యాసాలు)

# బీడీ మారకం

"**బా**బూ, ఓ బీడీ యిప్పించుకుంటారా?"

ఉలిక్కిపడ్డాడు. అప్పుడే జైలు ప్రహరీ గేటుదాటి లోపల ప్రవేశించిన కూర్మారావు.

"ఓ బీడీ యిటు పారేయించండి బాబూ" అన్నాడు వెంకడు మళ్ళీ.

"గాడిదకొడకా, ఎన్ని తడవలు చెప్పాలిరా! వార్డు విడిచిపెట్టి యిట్టా రాకూడదని? యెమికలు యిరగబొడిచేస్తాను కబడ్దార్" అని గదమాయించాడు. కూర్మారావు కూడా వున్న వార్డరు.

"ఉండయ్యా! మారాజు ల్నోబీడీ అడుక్కోనీ" అన్నాడు వెంకడు. వార్డరు బెదిరింపులకు ఏమీ విలువ కట్టనట్టుగా. "బాబూ, ఆ మూట యిట్టా పారెయ్యండి నే నట్టుకొస్తా" అంటూ కూర్మారావు చేతులోంచి మూట తీసుకున్నాడు.

ఆఫీసు వరండాలోంచి జైలరు వీళ్ళకేసి చూస్తూనే వున్నట్టు తట్టింది వార్డరుకి. వార్డర్లందరూ స్ట్రిక్టుగా వుండాలని జైలరుగారు హుకుం జారీ చేశారు. అశ్రద్ధ చేస్తే అసలుకే మోసం; పనే పూడుతుందన్నాడు కూడాను. లాఠీ తిరగవేసి వెంకడి నడుంమీద ఒక్కటి రాల్చాడు వార్డరు.

"చచ్చాన్రా బాబో" అని కూలబడ్డాడు వెంకడు.

"యెదవ చచ్చినోడు.యినడు. బడితెపూజకిగాని లొంగనంటే యేం చేసేది చెప్పండి?" అన్నాడు వార్డరు.

కూర్మారావుకు మొహం యెఱ్ఱబారిపోయింది. బట్టలుతుక్కోవడం, సామాను మోసుకోవడం లాటి మోటపనులు అట్టే చేతకావు కూర్మారావుగారికి తన బరువు తగ్గించడానికి వొచ్చిన వెంకడి మీద చెయ్యి చేసుకోవడంలో తననే వార్డరు అవమాన పరిచినట్టు తోచింది కూర్మారావుకి. జరుగుతున్న అన్యాయానికి ఆయన వొళ్ళు మండిపోయింది. వార్డర్ని నరికి పారేద్దా మనిపించింది.

కోపం చెడ్డది. యుక్తా యుక్తాలు మరిచేటట్టు చేస్తుంది. వార్డర్లమీద కత్తిగట్టి ప్రయోజన మేమిటి? జైల్లో వార్డర్లది ప్రభుత్వం, వాళ్ళు క్రూరంగా ప్రవర్తిస్తారు. నిజమే. కాని వార్డర్లే లేకపోతే, వాళ్ళ సానుభూతి, సహాయమే లేకపోతే, జైలు జీవితం మరీ దుర్భరమయిపోదూ? కూర్మారావుగారి బుద్ధి, ఆయన హృదయానికి, శాంతిమార్గ – యుక్తమార్గం బోధించింది. వార్డర్లని మంచి చేసుకోవాలి; ఎదిరించి బెదిరించకూడదు.

వ్యక్తి సత్యాగ్రహం ధర్మమా అని కూర్మారావుగారికి జైలు పద్ధతులన్నీ అవగాహనమయాయి. ఆయనకి అసలు ఈ సత్యాగ్రహాలన్నా, జైలు ప్రయాణాలన్నా చాలా భయంగానూ, రోతగానూ వుండేది. అదృష్టవంతుడవటంచేతా, ఆ బెడదలేమీ లేకుండానే ఆయనకి జిల్లా బోర్డులో కాంగ్రెస్ సభ్యత్వం లభించింది. పరాయి ప్రభుత్వం పోవాలని ఆయనకి మాత్రం లేదు కనకనా, దాని కోసం ప్రత్యేకంగా బాధలు పడకపోతే మాత్రం! కనక లభించిన పదవిని స్వీకరించి, ఆయన 'దేశక్షేమానికి' పాటుపడుతూ వొచ్చారు.

అయితే వొడుదుడుకులు ఎవరికైనా తప్పవు. వ్యక్తి సత్యాగ్రహమంటూ ఒకటి తెచ్చిపెట్టారు గాంధీగారు! జైలు కెళ్ళి వొస్తేనే కాని పదవి నిలవదన్నారు రాష్ట్ర నాయకులు!

పదవి వొదులుకోలేకా, చూసి చూసి జైలుకి వెళ్ళలేకా, ఆయన బహుమానసిక ఆందోళనకి లోనయారు కాని, ఆయన ఆంతరంగిక స్నేహితులు. 'జైలుకాపురం ఈ మారు ఏ విధంగానూ బాధాకరంగా లేదు' అని ఉత్తరాలమీద ఉత్తరాలూ, కబుర్లమీద కబుర్లూ పంపి ప్రోత్సహించగా ఆయన 'యుద్ధానికి తన వ్యతిరేకత వెలిబుచ్చి' జైలుకి చేరుకున్నారు.

కళ్ళు మూసి కళ్ళు తెరిచేలోపున అయిపోయాయి ఆరునెల్లూను. జైల్లో హాయిగా గడిచింది. అసలుఅంత సుఖంగానూ, నిర్విచారం గానూ ఎప్పుడూ, ఎన్నడూ ఆరునెల్లు గడపలేదు. (వెధవ్వి నాలుగు డబ్బులు మనవి కాదనుకుంటే సేవలు చెయ్యడానికి కావలసినంత మంది ఖైదీలూ, వార్డర్లూను!)

ఆగస్టు ఉద్యమంలో, అందుచేత, ఆయన ఉత్సాహంతో జైలు ప్రయాణం కట్టారు. "బ్రిటిషు ప్రభుత్వం నశించాలి" అని కాయితాలు అచ్చువేయించి పంచిపెట్టి, కానయితే. మొదటినుంచీ పరిస్థితులు తల్లకిందులుగానే కనిపించాయి. మేజిస్ట్రేటుగారు అతనికి "బి" క్లాసు యిచ్చి వూరుకున్నారు. ఆస్తిపరుడు, జిల్లాబోర్డు మెంబరు. విశేషించి వ్యక్తి సత్యాగ్రహంలో "ఏ" క్లాసు అనుభవించిన వీరుడు; సంగతులేమీ గమనించకుండా లుడుంగున "బి" క్లాసు యిచ్చేసి వూరుకున్నాడు మేజిస్ట్రేటు. పైగా స్నేహితులతో చెప్పించినా వినలేదు. ఈమాటు కఠినంగా వుండాలని ఆర్డర్లొచ్చాయిట. "ఏ" క్లాసిస్తే ఆయన వుద్యోగమే వూడుతుందట!

జైలు వాతావరణం ఎరిగున్నదికాదు. నరకరూపంలో పడ్డట్టనిపించింది. ఆయన బట్టల మూటంతా పూర్తిగా సోదాచేసి (జాగ్రత్తగా దాచిపెట్టిన డబ్బూ, నాలుగు బీడీకట్టలూ కొట్టెయ్యడమే కాకుండా) చివరికి, కట్టుకున్న బట్టలు కూడావిప్పమన్నాడు జైలరు.

ఆ దృశ్యం తలుచుకునేసరికి, కూర్మారావుగారికి మళ్ళీ వొళ్ళు రస రస మండిపోయింది. అందులో ముఖ్యంగా. ప్రాణప్రదంగా దాచుకున్న బీడీకట్టలు జైలరు కొట్టెయ్యడం తలుచుకునే సరికి!

అంటే కూర్మారావుగారు బీడీదాసులని అభిప్రాయపడకూడదు. ఆ మాటకొస్తే, ఆయన పదిమందిలో లాంచనానికి ఎప్పుడైనా ఏడాదికో మాటు ఓ సిగరెట్టు. వూదేవారేమో కాని, స్వతహాగా ధూమపానీయులు కారు. ఆయన బీడీకట్టలు ప్రాణప్రదంగా దాచుకున్నది కాల్చడానికి కాదు; మార్చడానికి; వస్తు మారకానికి.

ధనమూల మిదంజగత్. కాని జైలు సామాన్య జగత్తు కాదు. కనుక అక్కడ చలామణీ అయేదీ సామాన్య ధనం కాదు. ఆ జగత్తులో రూపాయి అణాపైసలు కాదు చలామణి అయేది. బీడీలు. ఏ ఖైదీచేతనన్నా (రాజకీయేతర నేరాలు చేసి జైల్లో పడ్డ ఖైదీలచేత) పని చేయించుకోవాలంటే బీడీరూపంలోనే ఫలితం ముట్టచెప్పాలి. జైలు సామ్రాజ్యంలో మారకం రేటు బీడీలలెక్క. ఆ సామ్రాజ్యంలో తన అధికారం స్థాపించుకోడానికి తెచ్చుకున్న సొత్తంతా దాచేసి సోహస్తగతం చేసుకున్నాడు. గత జైలు వాసంలో తన స్నేహితుడయిన జైలరు.

"శాంతం! శాంతం!!" అంది మళ్ళీ కూర్మారావుగారి బుద్ధి. పొంగిన పాలకి విచారించి లాభంలేదు. "సాధకమున పనులు సమకూరు ధరలోన". వార్డర్లతో, మెల్లిగా స్నేహంచేసుకోక గడవదు. నిట్టూర్పు విడిచి. అతి జాలిగా తనకేసి చూస్తున్న వెంకడి చేతినించి మూట తీసుకుని కాళ్ళీడ్చుకుంటూ తన వార్డు చేరుకున్నాడు కూర్మారావు.

మరునాడు ఉదయం తన కాలకృత్యాలు తీర్చుకొని లోపలికొచ్చేసరికి, జైలు డాక్టరుగారు గబగబా పెద్ద అంగలేసుకుంటూ వార్డు కలయ జుట్టుతున్నారు. ఓ సంవత్సరం జైల్లో వుండగా కూర్మారావుగారికీ డాక్టరుగారికీ కొంచెం నేస్తం కలిగింది. డాక్టరు స్వతహాగా కఠినుడే అయినా, కూర్మారావు ఆయనతో స్నేహం. ప్రత్యేకంగా కృషి చేసి సాధించాడు. పరిచితుడు, సుముఖుడు. జైలు అధికారుల్లో తన యోగక్షేమాలు విచారించేవాడు. కూర్మారావుకి కొంచెం మొహం వికసించింది. ప్రాణం కొంచెం లేచొచ్చింది. తనూ పెద్ద పెద్ద అంగలేసుకుంటూ, డాక్టర్ని సమీపించి, దండంబెట్టి పలకరించాడు. డాక్టరుగారు ఓమాటు మెడ వెనక్కి తిప్పి, కూర్మారావుని గుర్తు పట్టనట్టుగా ముందుకు సాగాడు.

"సార్, ఒక్కమాట, నాకు ఒంట్లో బాగుండడం లేదు. రోజూ నాకో కప్పు పాలు రికమెండు చెయ్యాలి, సార్..... పైగా ప్రతివారం నాకు తలంటు అలవాటేమో, నూనె

లేకపోతే చాలా కష్టపడిపోతాను. రోజూ తలకి నూనె రాసుకోకపోతే పైత్యం చేసి వొళ్ళు తిరుగుతుంది. కొంచెం నూనె కూడా రికమెండ్ చేస్తే..."

కొట్టొచ్చినట్టు వెనక్కి తిరిగారు డాక్టరు. కూర్మారావుని ఎగాదిగా చూసి "జైలు కొచ్చేసరికి అన్ని రోగాలు పుట్టుకొస్తాయబ్బా. ఇంటి దగ్గర ఏనాడూ పాలుతాగని వాడికీ ఇక్కడి కొచ్చేసరికి రోజు పాలు పుచ్చుకోకపోతే చచ్చేటంత రోగమొస్తుంది! తలకి నూనె కూడా కావాలిట. తలంటడానికి ఓ పిల్లమాత్రం వొద్దూ!" అంటూ చటుక్కున నడిచిపోయాడు.

నిర్ఘాంతపోయాడు కూర్మారావు.

"చూశారా! ఏమాత్రం సందుదొరికినా అగౌరవ పరచాలని ప్రయత్నిస్తున్నారు జైలు అధికారులందరూ. మన ఆత్మగౌరవం మనం కాపాడుకోవాలి. ప్రాణాలర్పించడానికి సిద్ధమై ఈ జైలుకు చేరుకున్నాము. దేహాన్ని కొంచెం కష్టపడనిస్తే నష్టమేమీ వుండదు. ఈ డాక్టరు వార్డులోకి వచ్చినప్పుడు ఎవరూ ఆయన్ని పలకరించకూడదు. ఆయన్ని ఏమీ అడక్కూడదు. మనం ప్రాధేయ పడుతున్నంత కాలమూ, మన్ని చులకనగా చూస్తూనే వుంటారు" అన్నాడు రంగనాధంగారు.

"నిజమే. డాక్టరు రోగం కుదర్చాలంటే ఆయన్నందరూ వెలివెయ్యాలి" అన్నారు యితర సత్యాగ్రహులు.

ఆనాటినించీ వారం రోజులు డాక్టరుతో ఎవరూ మాట్లాడలేదు.కాని దేహం మనవశంలో వుండదెప్పుడూను డాక్టర్నడిగి మందో మాకో తెచ్చుకుంటేనే గాని జరగని అవసరాలు వొచ్చిపడ్డాయి కొందరికి. తన అవసరాలు యితరత్రా తీర్చుకోడానికి తగిన సొమ్ము తెప్పించుకోగలిగిన కూర్మారావుకి మాత్రం డాక్టర్ని తిరస్కరించి ఆత్మగౌరవం నిలబెట్టుకోడానికేమీ లోపం లేకపోయింది.

❋ ❋ ❋ ❋

రంగనాధంగారికి మూడు రోజులయి జ్వరం తగులుతోంది.

డాక్టరుతో మాట్లాడనన్నారు కనక ఆయన జ్వరం సంగతి చెప్పుకోలేదు. మందు తెచ్చుకోలేదు. భోజనం మానేసి పస్తున్నారు. "అయ్యా మందూ లేక, ఆహారమూ లేకపోతే మరీ నీరసించిపోతారు. జైల్లో పెద్ద జబ్బుపడితే మన సంగతి చూసేవాడే వుండడు. అవసరమయిన వాటికోసం డాక్టర్ని ప్రాధేయపడ్డం కూడదు. కాని అవసరమయినప్పుడు వాడిని నిలబెట్టి సేవ చేయించుకోవాలి. లేకపోతే మరి పేట్రేగిపోతాడు" అన్నాడు సుబ్రహ్మణ్యం. వొద్దు వొద్దంటున్నా మర్నాడు డాక్టరొచ్చినప్పుడు "రంగనాధం గారికి మూడు రోజుల నించీ జ్వరంగా వుంది. ఆహారం లేదు. పాలు యిప్పించాల"ని చెప్పాడు.

"భోంచెయ్యడం లేదుకద! జ్వరం దానంతటదే పోతుంది. "లంఘనం, పరమౌషధం'

అన్నారు పెద్దలు వినలేదూ? పాలు పుచ్చుకుంటే ఇంకా జ్వరమెక్కువ వుతుంది. అంచేత ఇప్పించను" అని చిరునవ్వుతో, విజయగర్వం చిందులాడగా వెళ్ళిపోయాడు డాక్టరు. "డొక్క పగలగొట్టాలి ఈ గాడిద కొడుకుని" అని డాక్టరు చెవిలోపడేలాగా కేకెట్టాడు సుబ్రహ్మణ్యం.

రంగనాధంగారు ఈ సంఘటనకి చాలా నొచ్చుకున్నారు. సత్యాగ్రహ పద్ధతులు జీర్ణించుకున్న మనిషి ఆయన. ఇరవై సంవత్సరాల క్రితం ఆయన బియ్యే చదువుతూ వుండగా గాంధీజి పిలుపు వినిపించింది. చదువుకి స్వస్తి చెప్పి దేశ సేవలో పడ్డాడు. జీవితంలో సహంకాలం జైల్లోనే గడిచిపోయింది. ఆయన ఏ పదవులూ ఆశించలేదు. "నన్ను సత్యాగ్రహ సిద్ధాంతం ఆకర్షించింది. నా జీవితంలో చేతనయినంత వరకూ ఆ సూత్రాలు ఆచరణలో పెట్టాలని నా ఆశయం. నిజమైన సత్యాగ్రహినవడం కంటే నాకు లభించవలసిన పదవి ఏమీలేదు." అని ఆయన అంటూ వుండేవారు. ఆచరించలేకపోయినా ఆశయాల మహాత్యం గుర్తించిన రాజకీయ ఖైదీలందరికీ ఆయనంటే అమిత గౌరవం. సాధారణంగా ఆయన మాటకి ఎదురు చెప్పే వారు కారెవరూను. "నా నిమిత్తం ఎవరూ డాక్టర్ని మళ్ళీ పలకరించకూడదు" అని ఆయన శాసించారు. నాలుగో రోజున కూడా జ్వరం తగ్గలేదు. ఏదో విధంగా ఆయనకి ఆహారం పడాలి.

"ఏమండీ! మీరు తెప్పించుకున్న పాలు ఓ రెండు రోజులు రంగనాధం గారికిస్తారా?" అని కూర్మారావుగారినడిగాడు సుబ్రహ్మణ్యం.

కూర్మారావు డాక్టరుగారిద్వారా పనులేమీ జరగవని తెలుసుకున్నవాడై, కోరికలు ఏ విధంగా నెరవేర్చుకోవచ్చునో అవగాహన చేసుకుని మూడోనాటి నుంచీ రోజూ ఓ పావుశేరు పాలు తనకి అందేటట్టు ఏర్పాటు చేసుకున్నాడు. ఆ పాలమీద ఇప్పుడు సుబ్రహ్మణ్యం దాడికొచ్చాడు. "నాకు పాలు పుచ్చుకోకపోతే ఎంతో బలహీనంగా వుంటుందండీ" అన్నాడు కూర్మారావు. "రెండు పూటలా భోజనం, ఓ పూట కాఫీ, మరోపూట టీ తాగిన మీదట పాలు తాగకపోతే మీకే బలహీనంగా వుంటే నాలుగు రోజుల్నుంచీ మంచినీళ్ళ మీద వున్న రంగనాధం గారి కెలా వుంటుంది చెప్పండి? మీరు కనికరించి ప్రసాదించాలి" అన్నాడు సుబ్రహ్మణ్యం మళ్ళీ. పాలు కావలసినది రంగనాధం గారికి. మరీ మొండిపట్టు పడితే అందరూ తప్పు పట్టొచ్చు. అందులో సుబ్రహ్మణ్యానిది చాలా దురుసునోరు....."సరే కానివ్వండి" అన్నాడు కూర్మారావు. ఏం చేస్తాం! రెండు మూడు రోజులే అన్నారు గదా."

కాని కూర్మారావుకి పాలు లేకుండా ఆ ఒక్కరోజు గడిచేసరికి ప్రాణాంతకమయింది. ఆయనకి కాళ్ళూ చేతులూ విలవిల్లాడినట్టయింది. సాయంత్రానికి జ్వరం తగిలిందేమోనని కూడా ఆయన కనుమానం కలిగింది.

"ఒరే, మన కెలాగయినా మరో కప్పుపాలు సంపాదించి పెట్టాలిరా" అన్నాడు

కూర్మారావు వార్డరుతో. "బాబూ, పైనించి తీసుకురావడానికి అసలు వీలే లేదింక. 'సి' క్లాసులో మామూలు ఖైదీల కెవరికైనా పాలొస్తున్నాయేమో కనుక్కుంటాను. నాలుగు బీడీలు పారేసి అది మనం తెచ్చుకోవచ్చును" అని సలహా యిచ్చాడు వార్డరు.

"చేసే ఏర్పాటేదో త్వరగా చెయ్యి. లేకపోతే నే మంచం ఎక్కవలసొస్తుంది" అని ఒత్తిడి చేశాడు కూర్మారావు.

❉ ❉ ❉ ❉

"నీ ప్రాణానికి హరీమని చస్తాడయ్యా వీడు. శవాకారాన్ని చూసినా జాలి పుట్టదేం నీకు. మన ప్రొఫెషన్‌కి అప్రతిష్ఠ తెచ్చేవాడివి పుట్టావు నువ్వొక్కడోను" అని తీక్షణంగా చివాట్లు పెట్టాడు 'సి' క్లాసు రాజకీయ ఖైదీ. డాక్టరు రామేశంగారు. జైలు డాక్టర్ని అటకాయించి, వెంకడికి పదిహేను రోజులనించీ జ్వరంగా వుంది. ఆ జ్వరమేదో డాక్టరు కనిపెట్టలేదు సరేకదా తెలుసుకుందామని ప్రయత్నమైనా చెయ్యలేదు. జ్వరం తగులుతూ వున్నా ఓ వారం రోజులు వాడు తిరుగుతూనే వుండేవాడు. చివర కది రక్త విరోచనాల్లోకి దింపింది.

వెంకడు రాజకీయ ఖైదీ కాదు. మద్యపాన నిషేధ ప్రచారం చేస్తూ కల్లం గళ్ళు పికెటింగు చేసి రాజకీయ ఖైదీలొస్తే, అమలులో వున్న మద్యపాన నిషేధ చట్టాన్ని ఉల్లంఘించి కల్లు గీసి జైలుకొచ్చాడు వాడు. వాడికీ, సత్యాగ్రహులకీ సామాన్యంగా సంబంధం వుండకూడదు. గాని, వాడు రాజకీయ ఖైదీలకి బట్టలు వుతికీ, కాళ్లు పట్టీ, ఇతర చిల్లరసేవలు చేసి, బీడీలు సంపాదించు కుంటూ వుండేవాడు. కాబట్టి సంపర్కం ఏర్పడింది. రాజకీయ ఖైదీలు వాడి యోగక్షేమాలు కనుక్కోడమొచ్చింది.

"ఇప్పుడు వాడిని చూసి, మందిస్తేనే గానీ వీల్లే"దని రామేశంగారు అడ్డుపడ్డారు. పదిమందీ జైలు డాక్టర్ని చుట్టుముట్టేశారు.

'సి' క్లాసు ఖైదీలు అల్లరివాళ్ళు ఎలాగయినా. 'బి' క్లాసు వాళ్ళకి కోపమొచ్చినా మీద కలియబడి చెయ్యి చేసుకుంటారన్న ప్రమాదం లేదు. ఇక్కడ మాట దక్కేటట్టు లేదు. డాక్టరు వెళ్ళి వెంకడిని చూశాడు. వెంకడికి జబ్బు చాలా ముదిరిపోయింది అప్పటికే. వార్డులోంచి తీసి, ఆసుపత్రిలో చేర్పించక తప్పింది కాదు; అన్నం మానిపించి పాలు మంజూరు చేశారు కూడాను.

❉ ❉ ❉ ❉

"బాబూ, మీ అదృష్టం బాగుంది. డాక్టరుగారు ఈ రోజున 'సి' క్లాసులో కొత్తగా ఓడికి పాలు యిప్పించారు. నే మాట్లాడి ఏర్పాటు చేసొచ్చా; పది బీడీలకి, ఇవాళనించీ మీకు మళ్ళీ పాలు అందుతాయిలెండి" అని శుభవార్త చెప్పాడు వార్డరు కూర్మారావుకి.

❉ ❉ ❉ ❉

వెంకడికి ఆ రాత్రి అకస్మాత్తుగా ఆయాస మెత్తుకొచ్చింది. రామేశంగారు గొడవచేసి, జైలు డాక్టర్ని రప్పించాడు.

"పనీపాటూ లేకుండా హాయిగా తిని కూచోలేక వెధవ జబ్బులన్నీ తెచ్చుకుంటారు. పైగా పగలొచ్చి ఏడవకూడదూ ఈ ఉపద్రవాలు" అని అర్ధరాత్రి నిద్రాభంగ మైనందుకు ఖైదీల నందర్నీ తిట్టుకుంటూ ఆసుపత్రి కొచ్చాడు డాక్టరుగారు.

డాక్టరొచ్చేసరికి దగ్గు, ఆయాసం తోటి ఉక్కిరి బిక్కిరవుతున్నాడు వెంకడు. పొద్దున్న లేని దగ్గూ, ఆయాసం, అందులో రక్త విరోచనాల రోగం మీద, ఎక్కడ నించొచ్చాయో అసలే కనిపెట్టలేక డాక్టరుగారు మరీ మండిపడ్డారు. "వెధవ్వి నా ప్రాణానికి కొత్త కొత్త రోగాలు కూడా తెచ్చిపెడుతున్నావు" అని కాళ్ళు చల్లబడుతున్న వెంకడిని కసరడం ప్రారంభించాడు. డాక్టరుగారి తిట్లన్నీ వినకుండానే కళ్ళు తేలేశాడు వెంకడు. కళ్ళు మూసేశాడు డాక్టరుగారు.

❄ ❄ ❄ ❄

దహనక్రియల కోసం వెంకడిని కిందికి దింపినపుడు తలగడ కింద కనిపించాయి మూడు బీడీలు. పాలు అమ్మగా వొచ్చిన పది బీడీల్లోనూ కమీషను విరుచుకుని వార్డరు ఎనిమిది బీడీలూ వెంకడికి అందజేశాడు. బీడీ నోట్లో పెట్టుకోగానే ప్రాణం లేచొచ్చింది వాడికి. జబ్బువల్ల వెళ్ళి పనులు చేసి బీడీలు సంపాదించుకోలేక నాలుగయిదు రోజులనించి పస్తున్నాడు వాడు. పైగా అన్ని బీడీలు వాడికిది వరకెప్పుడూ ఒక్కమాటు దొరకలేదు. వాడి కళ్ళు చెదిరిపోయాయి. బీడీ మీద బీడీ అయిదు బీడీలు ఒక్క దమ్మున పీల్చేశాడు. రక్త విరోచనాల తోటీ, వారం రోజులుగా ఆహారం లేకపోవడం వల్ల క్షీణమైన వాడి శరీరం. ఆ ఆనందం భరించలేకపోయింది. ఉక్కిరి బిక్కిరయిపోయాడు. బీడీ పొగతో ఏ కోశానో కునుకుతూ వున్నవాడి ప్రాణం లేచి, పరుగులు తీసి అలిసిపోయి అకస్మాత్తుగా ఆగిపోయింది.

ఆ రాత్రి పాలు తాగగానే ప్రాణం లేచొచ్చింది కూర్మారావుగారికి. తృప్త హృదయులై, ఒక్క త్రేనుపు తేల్చారు. "పది బీడీలకి మంచి పాలే దొరికాయి. మారకం రేటు బాగానే వుంది. బీడీ పీలిస్తేనే కాని బతకలేమనుకునే వాళ్ళు ఈ జైళ్ళలో వుండబట్టే ఏదో బతుక్కు రాగలుగుతున్నాం గాని లేకపోతే ప్రాణం హరీ మన్ను గదా"అనుకున్నాడు కూర్మారావు.



# డా॥ జి.వి. కృష్ణరావు

**(1914 - 1979)**

**క**వి, రచయిత, విమర్శకులు, మద్రాసు విశ్వ విద్యాలయం వారి పి.హెచ్. డి పట్టం పొందారు. సంస్కృతాంధ్రాంగ్ల సాహిత్య సముద్రాలను పుక్కిట పట్టిన అగస్త్యులు. ప్రాచ్య పాశ్చాత్య దర్శన గ్రంథాలను అవలోకనం చేసిన తాత్త్వికులు. విశేషించి సమాజ శాస్త్ర విషయాలను కూలంకషంగా ఆకళించుకున్న మేధావి. మానవ జీవితాన్ని శాసించే వివిధాంశాలను హేతుబద్ధంగా చర్చించి కార్యకారణాలను దర్శించి ప్రతిభావంతమైన అనేక రచనలు చేశారు. సాంఘిక, సాంస్కృతిక, నైతిక రంగాల్లో మన పల్లె పట్టులూ,బస్తీలూ పొందుతున్న పరిణామాలవల్ల ఉత్పన్నమయ్యే సమస్యల స్వరూప స్వభావాలు సర్వాంగ సుందరమైన వీరి రచనల్లో సాక్షాత్కరిస్తాయి. ఆకాశవాణి, విజయవాడ కేంద్రంలో పని చేసారు.

**రచనలు :** కీలుబొమ్మలు, పాపికొండలు మొ॥ నవలలు: జే గంటలు, ప్లేటో ఆదర్శ రాజ్యం, Studies in Kalapurnodayam, ఉదబిందువులు, చైత్ర రథం, ఆదర్శ శిఖరాలు, కావ్య జగత్తు మొ॥ సాహిత్య గ్రంథాలు.

# ఉదబిందువులు

"అమ్మా, అమ్మా!"

కొడుకు పిలుపులోని ఉద్వేగాన్ని పసికట్టిన సుభద్రమ్మ, చెరుగుతున్న వడ్లచేట క్రిందబెట్టి అతనివైపు చూచింది.

"కృష్ణా రామా అంటూ మూలకూర్చోక ఇదేమిటే? ఓపిక ఉన్నది ఒళ్ళు దాచుకుంటే, బండెడు చాకిరి నెత్తిమీద వేసుకొన్నావా?" రామయ్య ధోరణి మార్చాడు.

"ముసలిదానిమీద ఎన్నాళ్ళ నుంచిరా ఈ మమకారం? నిండుచూలాలు ఈ పని చెయ్యలేదు. కాని అసలు సంగతేమిటో చెప్పు?" సుభద్రమ్మ నవ్వింది.

తన హృదయాన్నియిట్టే పసికట్టినందుకు అతని చిరాకు మరీ ఎక్కువయింది.

"నీ ముద్దుల కొడుకు ఏమిచేశాడో చూశావా?"

"నా చిట్టి తమ్ముడు ఏమిచేశాడో చూశావా అనరాదూ? అనవు. ఎందుకంటా? ఇంతకూ అసలు సంగతేమిటో!" తల్లి నిట్టూర్చింది.

కన్నంలో దొంగకు తేలుకుట్టింది. అవును. తల్లివల్ల జరిగిన పొరపాటేముంది?""

"మా తమ్మయ్య ఉత్తరం వ్రాశాడు. నేను ముందుగా వ్రాస్తేనే వ్రాశాడనుకో?"

"నువ్వేమి వ్రాశావు? అతగా డేమన్నాడు?"

"ఏమున్నది వ్రాయటానికి? ఈయేడు ఊచతెగులు తగిలి పంటలు పోయాయి. ఎకరానికి అయిదారు బస్తాల రాలుబడి కూడా లేదని వ్రాశాను." రామయ్య గొంతు జీరబోయింది.

"అవును. ఈ ఏటి రాలుబడి అంతేగా? నువ్వు చేలను పండవద్దన్నావా ఏమిటి?" తల్లి వాత్సల్యం అతన్ని కప్పింది.

“ఊళ్ళో మగతాదారులు ఏమి చేస్తున్నారని మా చిట్టితమ్మయ్య అడుగుతున్నాడు. అవును. ఇంతకాలం నుంచి వాడి చేలో నేను చేస్తున్నదేమిటి, మగతా కాక?”

“ఉద్యోగంలో చేరింతర్వాత చిన్నవాడికి బొత్తిగా మతిపోయింది.”

“వాడికేమీ మతిపోలా. పోయిందల్లా మనకే”

“అయితే నేను వచ్చిపొమ్మంటున్నానని కార్డుముక్క రాసి పడెయ్యి.”

“రాయవలసిన అవసరం నాకేమీ లేదు. వాడి లెక్క ప్రకారం రావలసిన పైకం అంతా పైసలతో సహా ఇవాళే మనియార్డరు చేస్తున్నా.” రామయ్య వెళ్ళిపోయాడు.

సుభద్రమ్మ విస్తుపోయింది. తన ఇద్దరి కొడుకుల సంగతి ఆమెకు పూర్తిగా తెలుసు. వాళ్ళకు తండ్రి అయినా తల్లి అయినా తనే. తన చేతులమీదుగా పెంచి పెద్దవాళ్ళను చేసింది. ఇద్దరూ కవలలు. ఒకటే పోలిక. ఒకేతల్లి పాలు త్రావి ఒకే సంస్కారంలో పెరిగారు. అయినా గుణాలలో ఇరువురికీ ఎంతో తేడా. పెద్దవాడి మనసు ఉదారం. చిన్నవాడు కూడా మంచివాడే కాని, కాస్త లోభగుణం వున్నదేమోననిపిస్తుంది. అయినా సుభద్రమ్మ కనుగలిగి దిద్దటానికి ప్రయత్నించింది. ఉన్న కొంద్ర తక్కువ. ఇద్దరి పిల్లలకూ ఇంగ్లీషు చెప్పించే తాహతు లేదు.కనుక చిన్నవాడైన లక్ష్మయ్యను ఇంగ్లీషు చదువులకు పంపి, ఆమె రామయ్యను వీధిబడి చదువుతో మానిపించి తనకు తోడుగా నిలుపుకొన్నది.

రామయ్యకు ఏకోశానా కుళ్లుబోతుతనం లేదు. నమ్మిక చిక్కితే అతడు ఒడలుకోసి యిస్తాడు. మనసు విరిగిందో అతనిని ఎవరూ వినిపించలేరు. అతని స్నేహం వంటిదే పగ కూడా. అవి అతి ఉత్కటాలు. లక్ష్మయ్య లక్షణరావై ఎల్.టీ. పూర్తి చేసుకుని బస్తీలో బడిపంతులై ఒక గ్రాడ్యుయేటును పెళ్ళి చేసుకొన్నాడు. కొడుకులిద్దరూ ఒకరికొకరు అండదండగా వుండాలన్నఆశ కొలది లక్ష్మయ్య చదువు ఖర్చులు పాటికి రానీక తనవంతు రెండెకరాలు పోను మిగతా ఆస్తిని ఇద్దరికీ చెరిసగం పంచి ఇచ్చింది. తమ్ముడూ, తల్లీ కావాలనుకొన్న రామయ్య సణగలేదు. అంతేకాదు, తమ్ముని పొలం తానే చేస్తూ రాలిన పంటను అమ్మి ముద్రశుద్ధిగా ఈనాటివరకూ అప్పగిస్తూ వచ్చాడు.

అలాంటి రామయ్యకు లక్ష్మణరావు అలా ఉత్తరం వ్రాశాడని వినగానే సుభద్రమ్మ మనస్సు చివుక్కుమన్నది. తనకే అలా అనిపించినప్పుడు పెద్దవాని మనస్సు ఎలా ఉండాలి? చిన్నకొడుకు దగ్గర వుంటే గూబగుయ్యి మనిపించేది. కాని, ఏమి లాభం? ఎక్కడో దూరాన వున్నాడు.

ఆవాళే సుభద్రమ్మ చివాట్లు వేస్తూ చిన్న కొడుకుకు ఉత్తరం వ్రాసింది. కాని మళ్ళీ ఏమి తోచిందో వ్రాసిన ఉత్తరం చించివేసి జరూరుగా ఒకసారి వచ్చి వెళ్ళవలసిందని కార్డు వ్రాసి రామయ్య కొడుకు సూర్యం చేత పోస్టులో వేయించింది.

రామయ్య తల్లిని పలకరిస్తూనే వున్నాడు. కాని ఆమెకు ఆ పలుకరింతలో ఏదో లోటు ఉన్నట్లు గానే ఉన్నది. వారం రోజులకు చిన్నకొడుకునకు మారుగా కవరు వచ్చింది. ఆమె విప్పి చదివింది.

అత్తయ్యకు,

నమస్కారాలు. ఇక్కడంతా క్షేమం. అక్కడ అందరికీ కుశలమే కదా! మీ ఉత్తరం చేరింది. ఏదో చిరాకులో వుండి మీ అబ్బాయి బావగారికేదో తెలివితక్కువ సమాధాన మిచ్చారట. ఎంతో నొచ్చుకుంటున్నారు. తమకు మొగం చెల్లక నన్ను సమాధానం వ్రాయమన్నారు. మీరే వ్రాస్తే బాగుంటుందని మొత్తుకున్నాను. వింటేనా? ఇంకా జాగు చేయటం మర్యాదకాదని వ్రాస్తున్నాను. నా సాహసానికి క్షమించాలి. నేనేవచ్చి బావగారికి కనిపించి క్షమాపణ చెప్పుకొంటే మేలేమోనని పించింది. కాని అన్నదమ్ముల నడుమ నీ జోక్యమేమిటి అంటారేమోనన్న భయంతో మానివేశాను. బావగారికి మీరెలాగైనా నచ్చజెప్పండి. అదనంగా పంపిన ఆరువందలకు చెక్కు పంపిస్తున్నాను. వారికి అందజేయండి.

అక్కయ్యతో గలిసి ఒకసారి మీరు ఇక్కడకు ఎందుకు రాకూడదు?

**ఇట్లు**<br>
**మీ కోడలు**<br>
**శ్యామల.**

"ఇందుకే చదువుకొన్న వాళ్ళ కంటే చాకళ్ళు మేలంటారు?" సుభద్రమ్మ విసుగుకొన్నది.

ఆరాత్రి రామయ్య భోజనం చేసి తాపీగా కూర్చుండగా "నీ తమ్ముడు ఉత్తరం రాశాడురా!" అని తల్లి చెప్పింది.

అతడు ఊ కొట్టి ఊరుకున్నాడు. "పొరపాటు జరిగిందని వాడెంతో బాధపడి ఆరువందలు తిరిగి పంపాడు." అంటూ ఆమె కోడలు పంపిన చెక్కు ఇవ్వబోయింది.

"కుక్క ముట్టిన కూటికోసం ఈ రామయ్య ఎన్నడూ ఆశపడడు". అతడు చివుక్కున లేచి బజారుకు వెళ్ళిపోయాడు.

సుభద్రమ్మ నిర్ఘాంతపోయింది. ప్రక్కనే ఉండి అంతా విన్నపెద్ద కోడలు "అత్తయ్యా, పెద్దదానవు. నీకు తెలియనిదేముంది? ఆ మనిషికి కోపం వస్తే అంతేగా! పోటు పొడుస్తున్నంత మాత్రాన కళ్ళు తీసివేసుకోగలమా?" అన్నది.

"అవునమ్మా, అంతే. మిన్ను కురవక చేలు, కన్ను కురవక బ్రతుకులూ పండవు" సుభద్రమ్మ పైట కొంగుతో ముక్కు తుడుచుకొన్నది.

మబ్బు లురిమాయి. తత్తరపాటుతో రైతులు అరకలు కట్టారు. మెట్టచాళ్ళు ముగిసాయి. గంగమ్మ వెల్లపొడిచింది.

సాయంకాలం దమ్ము నాగలి ఇంటికి తోలుకుపోతూ పాత పాలేరు ముత్తయ్య చినబాబు చేను దున్నించలేదేమని సుభద్రమ్మను ప్రశ్నించాడు. ఆ రాత్రి ఆమె రామయ్యను కదలించింది.

"ఇకనుంచి నీ పొలంతో నాకు నిమిత్తం లేదని ధాన్యం డబ్బు పంపిననాడే వ్రాశానే?"

"ఇంతకూ చేను దున్ననేలేదు?"

"పోరంబోకులన్నీ దున్ని జరిమానాలు వేయించుకొనే దుర్గతి నా కింకా పట్టలేదు."

"పోరంబోకులా?" తల్లి కొడుకుల మాటలు వింటున్న మంగమ్మ అందుకొన్నది.

"కాదు, మీ బాబిచ్చిన అరణం!"

"అమ్మాయ్! పుణ్యానికి పోతే పాపం వెంటపడుతుంది గాని నీ వూరుకో. వాడీలోకంలో లేడు."

సుభద్రమ్మకు అర్థమయింది. పెద్ద కొడుకు వ్రాసే వుంటాడు. చిన్నకొడుకు అన్నను నలుగురిచేత అనిపించాలనీ మొగం చెల్లకో, మరచిపోయో చేను సంగతి పట్టించుకోలేదు. చూస్తూ, చూస్తూ బంగారం వంటి చేను పాడు పెట్టటమా? పిల్లా జెల్లా ఉన్నవాడు. బస్తీలో కాపురం.

తెల్లవారుజామున సుభద్రమ్మ లేచివెళ్ళి ముత్తయ్యను లేపి లక్ష్మయ్య చేను చేసుకొమ్మన్నది. తరుణం దాటిన తరువాత తలకెత్తుకొనే సాహసం లేక అతడు తన వల్ల కాదన్నాడు. "అయితే కూలినాగళ్ళు పెట్టి దమ్ము చేయించి నాటు వేయించు. ఖర్చులన్నీ నేనే పెట్టుకొంటాను. నీ కష్టం అట్టేపెట్టుకోను ముత్తయ్యా;" అన్నది. లోగడ చాలా కాలం తన్నాదుకొన్న ముసలమ్మ నోరు తెరిచి అడుగుతున్నది. అతడు కాదనలేకపోయాడు.

లక్ష్మణరావు చేలోపడ్డ మొక్కలు రామయ్య చెవిలో పకపకా నవ్వాయి. తాను తల్లిని పువ్వుల్లో పూజిస్తుంటే ఈనాడు ఇలా నలుగురిలో నవ్వులపాలు చేస్తుందా? మాట మాత్రమైనా తనతో అనలేదు. నిజానికి ఆమె బొంది మాత్రం తమతో వున్నదే కాని ప్రాణాలన్నీ చిన్నకొడుకు వద్దనే.

ఈ ఆలోచన రాగానే రామయ్యమనసుకు గతమంతా మరొక రీతిగా తోచింది. తల్లి పక్షపాత బుద్ధితోనే తన చదువు మానిపించింది. చిన్నవాడి చదువు ఖర్చులు లెక్కకట్టనీక ఆస్తి పంపిళ్ళు వేయించింది. కళ్ళు ఉండి తాను అంధుడయ్యాడు.

ఆ రాత్రి సుభద్రమ్మ మనుమణ్ని ఒళ్ళో కూర్చోబెట్టుకుని, "ఓ జయమ్మ నీ కుమారుడు" అన్న భాగవత పద్యం చెబుతున్నది. రామయ్య ప్రక్క అరుగుమీద ఒద్దికగా కూర్చుని "అమ్మా!" అన్నాడు.

"ఏమిటిరా?"

"ఏమీ లేదు. ఇంతకాలం పెంచావు. ఓ యింటివాణ్ణి చేశావు. ఇంకా నీమీద ఆధారపడటం బాగుండలేదమ్మా! రేపటి నుంచి మా సోలెడు మేము పొంగించుకొంటాము.

సుభద్రమ్మ కొయ్యబారిపోయింది. ఎలాగో తెమల్చుకొని దగ్గుత్తికతో అడిగింది; "ఇంతకూ నేను చేసిన పాపమేమిటి?"

అతడు మాట్లాడలేదు.

"గడవవలసిన పురుళ్ళూ, పుణ్యాలూ గడిచినా ఈ మొండికట్టె పోక వచ్చింది.

రామయ్య మారు మాటాడక వెళ్ళిపోయాడు. ఆ మాటలన్నీ వాకిట్లో నిలబడి వింటున్న మంగమ్మ బావురుమన్నది.

"అమ్మాయీ, జరుగవలసిందేదో జరుగుతుంది. నెలలు వచ్చిన మనిషి దిగులు పడరాదు."

మరునాడు జాము ప్రొద్దెక్కిన తరువాత గాని సుభద్రమ్మ లేవలేదు. లేచి ఆమె దొడ్లో కాలు పెట్టగానే తొలిచూరి పడ్డ వెల్లావు, దూడ ఒక్కసారిగా అరిచాయి.

"ఏమే అమ్మాయి; దూడను విడవలేదా?" ఆమె కోడలిని పిలిచి అడిగింది.

"వాటికైనా బుద్ధి ఉండదా అత్తయ్యా!"

"నాయనమ్మా! నాయనమ్మా! ఇందాక పాలచెంబు వత్తుకుని నాన్న దగ్గిలికెలితే పద్దా ఆవు ఏమిచేశాయనుకొన్నా? నువ్వు చూలాలిసింది. బలే చిందులు పెత్తాయిలే! సినిమాలో కూలా అలా చిందులు పెత్తలు." సూర్యం అభినయించాడు.

"నోరుముయ్ వెధవ!" మళ్ళీ పాలచెంబు పట్టుకుని వచ్చిన రామయ్య తన చేతిలోని దాయత్రాటితో కొడుకును ఒకటి వేశాడు.

"పెద్దబ్బాయ్!" చిరుతపులి కాండ్రుమన్నది.

"ఇదినా సంసారం" రామయ్య తల్లివంక నైనా చూడక వెళ్ళి లేగ కోడెదూడను విప్పి ఆవుకు దాయవెయ్యబోయాడు. అది బిసతప్పిన రాకెట్టయి ఎగిరిపడ్డది. మరి కొంచెమైతే అతని కన్ను పోవలసింది.

సుభద్రమ్మ గిరుక్కున మళ్ళీ ఇంట్లోకి వెళ్ళిపోయింది. పోయిన కొంచెం సేపటికే బాదుతున్న చప్పుడు పడ్ల అరుపులు వినిపించాయి. దానిని ఆమె కన్నబిడ్డలాగా పెంచింది.

కట్టు తాడు విప్పితే అది వెంటబడి వంటయింటి గుమ్మందాక వచ్చి నిలబడిపోయేది. ఆ సంగతి జ్ఞప్తికి రాగానే ఆమె నిలుచున్న చోటనే చతికిలబడిపోయింది.

భూమిమాత్రం చతికిలబడలేక తన చుట్టూ నాలుగుసార్లు అలంగం తిరిగింది. ఆ మధ్యాహ్నం కటికినులకల్లో పండుకొని సుభద్రమ్మ ఇంటి వాసాల వంక చూస్తూన్నది.

"నాయనమ్మా, నాయనమ్మా!"

"ఎవరది"

"ఇస్! బిగ్గరగా మాతాలకు. నాన్న బయట అలుగు మీద కూచున్నాలు. ఇంతాలు."

"అరె. అటు తిరిగిరా!"

"అమ్మో! వత్తే బతకనిత్తాలు! మొన్నే చెప్పాలుగా, పానాలు తోలెత్తానన్నాలు."

"అలాగా!"

"సరే గాని, అన్నం తిన్నావా?"

"ఆc.....ఆc"

"ఒత్తిదే. అబద్దాలు చెపుతున్నావు. నీకు ఆలపిల్లలు పులతాలు నాయనమ్మా"

"ఓరి పిచ్చిగాడిద!"

"గాలిద ఓంద్రపెత్తును. నేను పెత్తను."

ఆమె మాటాడలేదు.

"ఈ యింట్లో అందరికీ కోపాలే. నీకు కోపం, నాన్నకు కోపం, అమ్మకు కోపం, ఆవుకు కోపం, ఆవుదూలకు కోపం. నాకేనా" లేంది! నేనూ కోప్పలతా. "ఒలే పెద్దబ్బాయ్! నీకు మతిపోయిందిలా! లేకపోతే నిచ్చేపంలా పాలు తాగలేక పద్దను అమ్మేత్తావా?" సూర్యం నాయనమ్మను అనుకరించాడు.

నవ్వుతుందనుకొన్న నాయనమ్మ బొమ్మలాగ చూస్తున్నది. సూర్యానికి ఏమీ అంతు పట్టలేదు. ఏదో తప్పు చేశానన్న భయంతో అతడు చల్లగా జారుకొన్నాడు.

తనను దగ్గరకు చేరనీని పాడి పడ్డను తెగనమ్మి రామయ్య బక్క నీళ్ళకు కూడ వాచిపోతున్నాడు. ఆవు కూడ దాయ వేయనీయటం లేదు. కోడెదూడ గదా అదైనా బాగుపడుతుందన్న ఆశతో వదలి ఊరుకుంటూ వచ్చాడు. ఆవు తీరి గలదనీ, ఒక ప్రక్క అయినా తీయకపోతే లేగదూడ అరమాయించుకోలేదనీ అతడు గుర్తించలేదు. పొలముమీది చాకిరి అయితే చేస్తూ వచ్చాడే కాని పాడి పశువులకు అతడెప్పుడు పరామరిక చేశాడు? పదిరోజులలోనే అజీర్తి రోగంతో కోడెదూడ చచ్చిపోయింది. వల వల ఏడుస్తూ సూర్యం ఆ సంగతి తడిక కంతలోంచి సుభద్రమ్మకు చెప్పాడు. నిప్పుల కవ్వంతో ఆమెకు గుండెలు

చిలికినట్లయింది. వచ్చిపడుతున్న కడగండ్లన్నిటికీ తల్లే కారణమని కొడుకు మరీ గండరించాడు.

లేగదూడ చనిపోగానే సుభద్రమ్మ మనసు పరిపరి విధాల పోయింది. తన ఉనికి వల్ల కొడుకు కోపం పెరుగుతుందే కాని తరగదు. ఆ కోపంతో ఇలాగే ఏవో తెలివి తక్కువ పనులు చేస్తాడు. నష్టపోతాడు. తన మనస్సు మరీ వికలమవుతుంది. ఈ చిక్కులన్నీ దేనికి? కొంత కాలం తానక్కడ లేకపోతేనో వాడి మనస్సు కుదుట పడవచ్చును. లేదా తనకైనా కొంత మనశ్శాంతి కలుగువచ్చును.

ఆ మధ్యాహ్నం కొడుకు వాటాలోకి వెళ్ళి మంగమ్మను పిలిచి "అమ్మాయి, ఇల్లు భద్రం! నీ సంసారం సంగతి నీకు చెప్పనక్కరలేదు. వస్తానమ్మా!" అన్నది. గ్రుడ్ల నీరు గ్రుడ్లలోనే క్రుక్కుకొంటూ "నన్నేమి చేసిపోతున్నా వత్తయ్యా?" అని మంగమ్మ అన్నది.

"నేను బిడ్డల్ని కన్నానే గాని గడ్డల్ని కనలేదు" సుభద్రమ్మ ముఖం కొంచెం ఎర్రబడ్డది.

కోడలు మళ్ళీ నోరెత్తలేదు.

సూర్యం ఇంటివద్ద లేని సమయం చూచుకొని సుభద్రమ్మ చిన్నమూటతో బయలుదేరి ఎలాగో మరునాటి పదకొండు గంటలకు లక్ష్మయ్య ఇంటికి చేరింది. ఇంట్లో కొడుకుగాని, కోడలుగాని లేరు. పని మనిషి బండ బూతులు తిడుతూ లోపలి నుంచి నాలుగేళ్ళ వాణ్ణి, రెండేళ్ళవాణ్ణి తరువుకొచ్చి వరండాలో నిలబడ్డ సుభద్రమ్మను చూచి, "బిచ్చానికి ఏలాపాలా లేదా ఏంది? పో పో?" అని కసురుకొన్నది.

సుభద్రమ్మకు తన రేగిన తల, రైలు ప్రయాణంతో మాసిన బట్ట జ్ఞప్తికి వచ్చి నవ్వుకొని, "లక్ష్మయ్య లేడూ?" అన్నది.

"ఈడ లచ్చుమయ్యలు లేరు, గిచ్చుమయ్యలు లేరు పోపో! ఈ దొంగేసాలు సాల సూసాము". పనిమనిషి పిల్లలను లోపలికి నెట్టి తలుపు వేసుకొన్నది.

ఆ క్రిందటి ఉదయాన ఎప్పుడు రెండు మెతుకులు ఎంగిలి పడ్డదో ముసలి ప్రాణం ఆ వరండాలోనే చతికిల బడ్డది. సాయంకాలం నాలుగున్నరకు స్కూలు నుంచి తిరిగి వచ్చిన లక్ష్మణరావు విస్తుపోయి పనిమనిషిని చెడామడా తిట్టి తల్లి స్నానానికి నీళ్ళు తోడించాడు. ఆమె స్నానం చేసింది. అంతలోనే శ్యామల ఆఫీసు నుంచి వచ్చి జరిగిందంతా విని నొచ్చుకుంటూ, ముందుగా ఉత్తరముక్క వ్రాస్తే కాకపోయిందా అత్తయ్యా!" అన్నది.

"ఇంతకూ మా వియ్యంకుడికి ఉత్తరం వ్రాయమంటావు?"

"ఏమని?" శ్యామల విస్తుపోయింది.

"ముందుగా ఉత్తరం ముక్క తప్ప అమ్మాయిని ఇంటికి రానీయవద్దని"

"అదికాదు అత్తయ్యా! మాటమాత్రం ముందు తెలిస్తే ఇలా జరుగకపోను గదా అని అంటున్నాను."

"రోజుకొక పనిమనిషిని మార్చుకొంటున్నారని నేను మాత్రం కలగన్నానా?"

"ఏమండోయ్, మిమ్మల్నే; సమాధానం చెప్పండి. నా వంతు అయిపోయింది." కోడలు నవ్వింది.

"బాగుంది వ్యవహారం. అత్తా కోడళ్ళు పోటాడుకొనే వాళ్ళు పోట్లాడుకోండి. మధ్య నన్ను లాగుతారు దేనికి?"

"ఇంతకూ మే మిద్దరం పోట్లాడుకొంటే చూస్తానంటావు?" తల్లి కొడుకు వంక తేరి చూచింది.

"అమ్మబాబోయ్, ఇద్దరూ ఏకమయ్యారు! ఈ రాత్రి నుంచి సత్ర భోజనం, మఠం నిద్ర తప్పదు కాబోలు!" లక్ష్మణరావు ఉత్తరీయం భుజాన వేసుకొని బయలుదేరాడు.

"అత్తయ్య ఎప్పుడు ఎంగిలిపడ్డదో! పెందలాడే రండి!" శ్యామల భర్తను హెచ్చరించింది.

రోజులు తరాటు గొడుతున్నాయి. ఒళ్ళు సరిగా వంచుకోలేక, చేతివాటుకు వీలుపడక పనిమనిషి మానుకొన్నది. సుభద్రమ్మ విసుగు కోలేదు. అన్ని పనులూ తానే అందుకొంటూ కొడుకు ఇల్లు చక్కదోసుకొస్తున్నది. పిల్లలు ఏడుపులు, పెడబొబ్బలు తగ్గించి పెందలాడే లేవటం, ఎవరి పనులు వారు చక్కబెట్టుకోవడం ప్రారంభించారు. "నానమ్మా! నానమ్మా! మొగం కడగవూ?" అంటూ మూడో వాడు లేచి వచ్చేవాడు. "అరే అన్నాయ్, చిట్టాడి ముఖం ఇత్తడి తెపాలరా; అందుకే కడిగి అవతల పెట్టమంటున్నాడు" అని రెండోవాడు వెక్కిరించేవాడు. "నీ మొగమే సత్తెపాల, రాచిప్ప!" అని కొక్కిరించి నాయనమ్మ కడుగుతానన్నా వద్దని తన పని తాను చేసుకోవడం మొదలెట్టాడు. అయినా, నాయనమ్మ చేసే వంటకాలలో అదనంగా ఉప్పు, కారాలు వేసి సరిక్రొత్త రుచులు కల్పించడానికి యత్నించకపోలేదు. కాని, సుభద్రమ్మ పడనీయటం లేదు.

మంగమ్మ అత్తయ్యకుఉత్తరం వ్రాసింది. తనకు ఆడపిల్ల కలిగిందట. అంతా కులాసాగా వున్నారట. సూర్యం నాయనమ్మ కోసం మారాము చేస్తున్నాడట. రామయ్య తల్లి వాటాలో అడుగు పెట్టటం లేదు సరిగదా, అందులో దీపం కూడా పెట్టనీయటం లేదట.

"బావగారికి ఎందుకంత పట్టుదల?" ఉత్తరం చదివిన శ్యామల విస్తుబోయి అడిగింది.

"మనిషి కొక బుద్ధి, మనమేమి చెబుతాము?" సుభద్రమ్మ నిర్వేదంతో నిట్టూర్చింది.

ఒకనాటి సాయంకాలం అంతా హాల్లో కూర్చుండగా లక్ష్మణరావు ఉత్సాహంతో అన్నాడు.

"అమ్మా, ఇవాళ మన ఊరినుంచి ఉత్తరం వచ్చిందే?"

"రామయ్య వ్రాశాడా?" సుభద్రమ్మ ముఖం విరిసింది.

"కాదు, షావుకారు చంద్రయ్య వ్రాశాడు."

"ఏమని?" ఆమె గొంతులో మొదటి ఉత్సుకత లేదు.

"మన వాటా ఇల్లూ, దొడ్డీ అమ్ముతారా అని అడుగుతున్నాడు. పదివేల దాకా పెంచేటట్లున్నాడు."

"ఇవాళ ఇల్లు అమ్ముతానంటావు. రేపు నన్నమ్ముతానంటావు?"

"అమ్మా! అమ్మా! నిజంగా నాయనమ్మను అమ్ముతారంటే" పెద్ద కొడుకు రఘు ఉత్సాహంతో అడిగాడు.

"ఆఁ, అమ్ముతారు, కొంటావా?" శ్యామల అడిగింది.

"ఓ."

"ఏం పెట్టి?"

"నాన్నను తాకట్టు పెడతాము, నాయనమ్మను కొనుకుంటాము."

"ఆ తాకట్టు కొప్పుకునే దరిద్రు డెవడంట?"

"మా నాన్న బాగా లెక్కలు వేస్తాడే. హైస్కూలు పిల్లలంతా అంటున్నారు. యే షావుకారైనా తాకట్టు పెట్టుకోడా యేమిటి? ఎందుకు నవ్వుతా?"

"నోరుముయ్, వెధవా! వసపిట్ట వాగుడూ నువ్వూను. అది కాదమ్మా! ఆ కొంప అక్కడ ఉండి ఏమి చేస్తున్నది? దీపం పెట్టేవాళ్ళయినా లేరా? అమ్మితే యేం? నువ్వు చూస్తూనే వున్నావుగా. అద్దె కట్టలేక ఎంత అవస్థ పడుతున్నామో, ఆ డబ్బుతో ఇక్కడ స్థలమైనా కొనుక్కోవచ్చునుగా? యేమంటావు శ్యామలా?" అతడు భార్యను హెచ్చరించాడు.

"అమ్మాయ్, మీ ఆస్తిని మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి! మధ్య కాదనడానికి నాకేమి హక్కు?" సుభద్రమ్మ చటుక్కున లేచి వెళ్ళింది.

ఆ రాత్రి శ్యామల భర్తతో తగవు పెట్టుకొన్నది. మీ సుఖం మీరు చూసుకొంటే సరిపోయిందా? ఇదివరకే మీ అన్నయ్య ఆమె మీద కారాలు, మిరియాలు నూరుతున్నాడు. ఇప్పుడు ఇల్లు అమ్మటానికి ఒప్పుకొంటే ఏమవుతుంది? కచ్చె కట్టి మీచేత ఇల్లు అమ్మించిందను కోడా? ఇదివరకు వచ్చిన మాట పట్టింపులతోనే ఆమె కుమిలిపోతుంటే ఇది మరొకటా? ఈమెను మళ్ళీ పెద్దకొడుకు ముఖం చూడవద్దంటారు. మీలాగే వారూ ఆమె కడుపున పుట్టలేదా?"

"నీకు బొత్తిగా మతిపోయింది. నువ్వనేదేమిటి? నీ పిల్లల బాగోగులు నీకు పట్టకపోతే నాకా?" లక్ష్మణరావు వికటంగా నవ్వాడు.

"అందుకే మండుతుంది. అంత దూరపు ఆలోచన కలవాళ్ళు అయితే మీ అన్నయ్యతో మాటాడి ఆమెకు చెప్పండి. అయినా తెలియక అడుగుతాను. ముందుగానే అన్నదమ్ములిద్దరూ ఆమె ఆస్తిని అమ్ముకొంటే ఆమె ఎక్కడ ఉంటుంది? ఏమి తింటుంది? ఆమెకు ముసలితనం వచ్చిందనేగా ఈ ఆట ఆడుతున్నది?"

మరునాడే సుభద్రమ్మ ప్రయాణం కట్టింది. వెళ్లవద్దని శ్యామల ఎంతగానో బ్రతిమాలింది. పెద్దమనుమలిద్దరూ చెరొక రెక్క పట్టుకున్నారు. మూడోవాడు ఆమె మూటను తీసుకుపోయి ఇంట్లో ఎక్కడో దాచారు.

లక్ష్మణరావు తిరిగి గృహ విక్రయ ప్రస్తావన తేలేదు. మాసాలు గడిచాయి.

"అమ్మా, మనియార్డరు వచ్చింది" అంటూ ఒకనాడు లక్ష్మణరావు డబ్బూ, ఫారమూ పట్టుకొచ్చి తల్లికివ్వబోయాడు.

"ఎక్కడ నుంచి? ఎవరు పంపారు?" ఆమె అడిగింది.

"అన్నయ్య. నీ పంట పైకం కాబోలు. కాకపోతే ఎనిమిది వందలు దేనికి పంపుతాడు? ఇక నుంచి పొలం ఎవరికైనా ఇచ్చుకొమ్మంటున్నాడు."

"అక్కరలేదు. తిప్పి పంపు" ఆమె తాపీగా అన్నది.

"ఎనిమిది వందలే!"

"ఊళ్ళో క్లబ్బులున్నాయే!" శ్యామల నవ్వింది.

"షటప్!"

"బళ్లో ఈ చదువులే చెబుతున్నావా?" సుభద్ర కొడుకు వంక చూసింది.

లక్ష్మణరావు అక్కడ నుండి వెళ్ళిపోయాడు. ఆ రాత్రి ఇంటికి రాలేదు. మరుసటి ప్రొద్దునే సుభద్రమ్మ కోడలిని అడిగింది!

"రాత్రి అబ్బాయి రాలేదుగా ?"

"లేదత్తయ్యా!"

"ఎక్కడికి వెళ్ళాడో?" సుభద్రమ్మ గొంతులో విషాదం పలికింది.

"అంతకు పూర్వమే సమాధానం ఆలోచించుకొన్న శ్యామల చెప్పింది! "ఏదోపని ఉన్నదట. ఒక వారం స్కూలుకు సెలవు పెట్టి వెళ్ళారు."

సుభద్రమ్మ మళ్ళీ ప్రశ్నించలేదు. నిజానికి ఆ ధైర్యం కూడా లోపించింది. వెనుకటి దుస్థితి తిరిగి తారసిల్లుతున్నదా! లోగడ చిన్న కొడుకున్నాడని బయలుదేరి వచ్చింది. ఇప్పుడు మరెక్కడకు బయలుదేరుతుంది? ఆలోచించే సాహసం లేక సుభద్రమ్మ కోడలి మాట నమ్మింది. జీవనలాలస ప్రగాఢం. అతి విచిత్రం. అది జీవేశ్వరులనే కాదు. సర్గాపవర్గాలనే కాదు. ధర్మాధర్మాలనే కాదు. హేతువునే సృష్టిస్తుంది. అవసరమైతే ఆ హేతువును గూడా నాశనం చేస్తుంది.

శ్యామల చెప్పిన వారం రోజులు గడిచాయి. కాని, లక్ష్మణరావు ఇంటికి రాలేదు. క్లబ్బులోనే మకాం పెట్టి అక్కడ నుంచే స్కూలుకు వెళ్ళి వస్తూ ఇంటి ముఖం చూడలేదు. ఈ సంగతి తెలుసుకున్న శ్యామల లోలోన ఉడికిపోతున్నది. అత్తకు ఏమని చెబుతుంది? ఆమెకు నీడలేకుండా ఎలా చేస్తుంది?

"నాయనమ్మా, నాయనమ్మా! నాన్న ఎక్కడకు వెళ్ళాడు? ఎప్పుడు వస్తాడు?" అని రఘు ఒక సాయంకాలాన అడిగాడు.

"బుద్ధిలేని వాళ్ళు ఎక్కడికైనా వెళ్ళుతారు. ఎన్నాళ్ళయినా వుంటారు. నీక్కూడా బుద్ధిలేదా?" శ్యామల కొడుకు మీద విరుచుకుపడ్డది.

"చూచావా, చూచావా? నేను చేసిన తప్పేమిటి నాయనమ్మా?" రఘు మొగం చిన్నబుచ్చుకొన్నాడు.

"అన్ని తప్పులూ నావే బాబూ?" సుభద్రమ్మ గొంతు జీరబోయింది.

ఆ తెల్లవారు జామున సుభద్రమ్మ కోడలిని లేపి "వస్తానమ్మా ; " అన్నది. శ్యామల తెల్లబోయింది.

"నాకు అంతా తెలుసమ్మా! నే నుండగా వాడు ఈ ఇంట్లో అడుగు పెట్టడు. అదంతా నా ప్రారబ్ధం. దానికి నీ వేమిచేస్తా? వస్తానమ్మా. వస్తా! నేను వెళ్ళిపోవడం నీకు కష్టమే. కాని, ఏమి చేయను? కలకలలాడే సంసారం నా మూలాన పాడుకావడం నా కిష్టం లేదు. ఆలుమగళ్ళను ఒకరినొకరు కాకుండా చేయలేను. నేను రాకముందు హాయిగా వున్నారు. వచ్చి లేనిపోని కలతలు తెచ్చిపెట్టాను. అవన్నీ మరచిపో. వెనుకటిలాగా సుఖంగా వుండండి!"

"అక్కడ కాదనుకొని ఇక్కడకు వచ్చావు. ఇక్కడ కాదనుకొని ఎక్కడకు పోయేటట్లు? వద్దు అత్తయ్యా, వద్దు! ముసలితనంలో తల్లిని తరిమివేసే అధికారం ఎవరిచ్చారు? అయినా తన సంపాదన తెచ్చి ఎవరినీ పోషించటం లేదు. కాస్తో కూస్తో నేనూ తెస్తూనే వున్నా. అంత కష్టమైతే మానుకొంటారు. నేను తెస్తున్న దానితోనే ఎలాగో సర్దుకొందాము. మీరు వుండాలి అత్తయ్యా! జంకితే ఎంత దూరమైనా తరిమికొడతారు." శ్యామల అత్త చేతులు పుచ్చుకొన్నది.

"కడుపున పుట్టిన బిడ్డల కంటే నీవే చాలా నయం. చాలు, నాకు ఇంతకన్నా ఏమి కావాలి? కాని, ఒకటి ఆలోచించు.అత్త వచ్చి కొడుకుని కోడలికి కాకుండా చేసిందని లోకం ఆడిపోస్తూంది. లోకం సంగతి ఎలా వున్నా అంతరాత్మ పీడిస్తుంది. ఏదైనా బాధపడతాను గానీ ఈ బాధ మాత్రం పడలేను. కాటికి కాళ్ళు చాచుకొన్న నా సంగతి వదలు. మగని కెడమైన మగనాలు ఎంత చులక నవుతుందో ఆలోచించు. పైగా పిల్లా

జెల్లా. వీళ్ళందర్నీ ఈడేర్చాలి. ఈ బాధ్యత గొప్పదమ్మా! మనం మనుషులం కాని, పశువులం కాదు."

శ్యామల నిశ్చల దీపశిఖ అయిపోయింది.

"అమ్మాయ్!"

"ఏమిటి అత్తయ్యా?"

"ఇంతకాలం నుంచి హృదయం చిదిమి పెడుతున్నా సంతృప్తి పడక ఈ ముసలి ప్రాణం మరొకటి కోరుతున్నదమ్మా!"

"ఏమిటి అత్తయ్యా!"

"నాకోసం లక్ష్మయ్యతో తగాదా పడనని మాట ఇవ్వు?"

శ్యామల అత్త వంక చూడలేక ముఖం తిప్పుకొన్నది.

"మాటాడవేమమ్మా? కోరరాని దానిని కోరేనా?"

"అంతా మీలాటివారు కాలేరత్తయ్యా!"

"కావద్దు తల్లీ! కావద్దనే నా ఆశీస్సు."

సుభద్రమ్మ వెళ్ళిపోయింది. ఇంక క్లబ్బులో అజ్ఞాతవాసం చేయవలసిన అవసరం ఏ మాత్రం లేదని శ్యామల ఉత్తరం వ్రాసి రఘు చేత భర్తకు పంపించింది. ఆ సాయంకాలమే అతడు ఇంటికి చేరాడు.

సుభద్రమ్మ తన ఇంటికిపోయి తా నల్లరిపడటం, పెద్దవాని మనస్సు వికలం చేయడం ఇష్టం లేకపోయింది. ఏగూటిలో పక్షులు ఆ గూటిలో వుంటున్నవి. వాటి సుఖం తానెందుకు చెడగొట్టాలి? బ్రతికి ఇంక ఎవరిని ఉద్ధరిస్తుంది?

ఈ ఆలోచన రాగానే సుభద్రమ్మకు తన జీవితమ్మీద విరక్తి కలిగింది. కాని బలవంతాన ప్రాణాలు తీసుకోలేక చేతి బంగారు మురుగులు అమ్మివేసి ఆ బస్తీలోనే మారుమూల పేటలో బియ్యపుకొట్టు పెట్టుకొని జీవయాత్ర సాగిస్తున్నది.

ఆ సంక్రాంతికి రామయ్య వద్ద నుంచి తల్లిపేర మనియార్డరు వచ్చింది. లక్ష్మణరావు నిర్ఘాంతపోయాడు. తల్లి స్వగ్రామం చేరక ఎక్కడకు పోయినట్లు? అతడు పోయి భార్యకు మనియార్డరు చూపించాడు.

"ఇంకేఁ కావలసిందేదో వచ్చిందిగా. పుచ్చుకోండి!"

"ఫోర్జరీ చేయమన్నావా?"

"ఎన్నాళ్ళ నుంచి ఈ ధర్మబుద్ధి?"

"అన్నయ్యతో వ్యవహారం!"

"అయితే కూడబలుక్కుని పంచుకోండి."

"ఎందు కంత కోపం?"

"నాకు భాగం లేదని?"

అతడు మళ్ళీ మాటాడలేదు. ఆ సాయంకాలం శ్యామల రఘువద్ద వాపోయింది.

"ఈ నాయనమ్మ మన వూళ్ళో లేదట రఘూ!"

"మన వూళ్ళో లేదా?" రఘు ఆశ్చర్యపోయాడు.

"ఇవాళ అక్కడ నుంచి మనియార్డరు వచ్చింది. వుంటే ఎందుకు వస్తుంది?" ఆమె కంట తడి పెట్టింది.

రఘుకు అర్థమయింది. తల్లి కన్నీరు చూడలేక అన్నాడు.

"నాయనమ్మ ఈ ఊళ్ళోనే ఉన్నదమ్మా;"

"ఈ ఊళ్ళోనే; నీవు చూచావా?"

"ఉంది. అప్పుడప్పుడు వెళ్ళి వస్తూనే వున్నా."

"ఒకనాడు కాకపోతే ఒకనాడైనా చెప్పావుకావేమిరా? అవునులే, విత్తొకటైతే చెట్టు మరొక టవుతుందా?"

"చెప్పవద్దంటే ఏమి చెయ్యను?" రఘు ఖిన్నుడయ్యాడు.

"అయితే బయలుదేరు." శ్యామల కొడుకును తొందర పెట్టింది.

"నాన్న వింటాడేమో?"

"ఎవరి మోచేతి నీళ్ళూ త్రాగటం లేదు కాని పద!"

ఇద్దరూ రిక్షాలో బయలుదేరారు. వారు వెళ్ళేటప్పటికి కొట్టు వేసి వున్నది. రఘు ప్రక్కవాళ్ళని కనుక్కొంటే రెండు రోజులనుంచి కొట్టు మూసివేసి వుంటున్నదని చెప్పారు. అంతకు ముందెన్నడూ అతడు నాయనమ్మ యింటికి వెళ్ళలేదు. ఆమె అడ్రస్ కనుక్కొని తల్లీ కొడుకులు వెదకికొంటూ శిథిలావస్థలో వున్న ఒక చిన్న పెంకుటింటికి చేరారు. తలుపు ఓర వాకిలిగా వేసి వున్నది. లోపలినుంచి మాటలు వినిపిస్తున్నాయి. "కొత్త సరుకు. ఆ బియ్యం మీకు పనికి రావు. మాట పోతుంది. మీ అమ్మతో చెప్పు. నాలుగైదు రోజుల్లో పాతబడ్డ సరుకు వస్తుంది. అప్పుడు నేనే పంపిస్తాగా!" శ్యామల తలుపు బారలుగా త్రోసుకు వెళ్ళింది. లోపల ఎవరూ లేరు. గది చీకటి కోనేరుగా వున్నది. మూలుగును బట్టి తడువుకొంటూ పోయి ఆమె నులక మంచంలో పండుకొన్న అత్త చేయి పట్టుకుని చూచింది. ఒడలు సెగలు, పొగలు చిమ్ముతున్నది.

"ఒరే రఘు, నీవు రిక్షాలో పోయి నేను రమ్మంటున్నాని చెప్పి డాక్టరు రాధమ్మను అర్జెంటుగా వెంట బెట్టుకురా. ఇప్పుడు ఇంట్లో వుంటుంది. ఇల్లు తెలుసుగా?"

అతడు రాధమ్మ కారులో తిరిగి వచ్చాడు. డ్రైవరు సాయంతో సుభద్రమ్మను కారు

వెనుక సీటులో పండుకోబెట్టి గదికి తాళం పెట్టి శ్యామల రఘు వెనుక సీటు ముందు కూర్చున్నారు. కారు బయలుదేరింది.

"ఎవరు ఈ ముసలమ్మ?" రాధ అడిగింది

"దిక్కు లేనిది" శ్యామల గొంతు డగ్గుత్తిక పడ్డది.

"ఈ అనాథ సేవ ఎప్పటినుంచి?" ఆమె నవ్వింది.

"ఏదో దూరపు చుట్టరికం. ఆమెకు కావలసినవాళ్ళు ఎక్కడో వున్నారు. సుస్తీగా ఉన్నదంటే చూచి నీకోసం కబురంపించాను".

"నర్సింగ్ హోంకు పోదామా, మీ యింటికా?"

"నర్సింగ్ హోంకే పోనీండి!"

"అమ్మా!" రఘు ఏదో చెప్పబోయాడు.

ఆమె మెల్లగా కొడుకుని గదిమింది.

శ్యామల ఆఫీసుకు సెలవుపెట్టి అత్త వద్దనే వుంటున్నది. పిల్లలు అప్పుడప్పుడు వచ్చి చూచిపోతున్నారు. లక్ష్మణరావుకు ముఖం చెల్లక రాలేదు. నాలుగు రోజుల తరువాత సుభద్రమ్మకు తెలివి వచ్చింది.

"ఎవరిల్లు?"

"ఇల్లు కాదు నాయనమ్మా!! ఆసుపత్రి" దగ్గర వున్న రఘు అంతా వివరించి చెప్పాడు.

"డాక్టర్లు దేవుళ్ళు కాదూ?" అంటూ కోడలు కనిపించగానే ఆమె బలహీనంగా నవ్వింది.

"అదేమిటత్తయ్యా?"

"ఎందుకొచ్చిన దండుగ గాని నీ ఇంటికి చేర్చు. ఈ ముసలితనంలో మందులు పట్టవు".

"అలాగే నత్తయ్యా! బావగారికి ఉత్తరం వ్రాశాను. బండి తోలుకొస్తారు. రాగానే వెళ్ళిపోదాము. ఈ మందు పుచ్చుకోండి!"

"అవునవును. రామయ్య బండి తప్పక తోలుకొస్తాడు?"

సుభద్రమ్మ మందు త్రోసివేసింది.

"ఇంతగా కలవరిస్తున్నావే, నిన్ను చూట్టానికి పెదనాన్న ఎందుకు రాడు?"

"రాడు బాబూ, రాడు. నేను చచ్చిపోయినా రాడు. వాడి సంగతి నీ కిప్పుడప్పుడే అర్థం కాదు."

పెద్దకొడుకు వచ్చి చెబితేనన్నా మందు తీసుకొంటుందేమోనని శ్యామల బావగారికి

ఉత్తరం వ్రాసింది. మంగమ్మ, సూర్యం వచ్చారే కాని రామయ్య మొగమైనా చూపించలేదు. సుభద్రమ్మ పోరు పడలేక శ్యామల ఆమెను తన యింటికి తీసుకువెళ్ళింది

మళ్ళీ జ్వరం ఎక్కువైంది. ఎవ రెన్ని విధాల బ్రతిమాలినా సుభద్రమ్మ మందు త్రాగటం మానివేసింది. ఒకనాడు రఘును ఒంటరిగా పిలిచి "బాబూ, ఉత్తరం ఏమి చేశా" వని అడిగింది. "పెదనాన్నను కలుసుకొన్నప్పుడు ఇమ్మంటివిగా. అలాగే ఇస్తాను నాయనమ్మా" అన్నాడు.

కొలది రోజులకే హంస లేచిపోయింది. ఆమె శరీరంతో లక్ష్మణరావు, శ్యామల, పిల్లలు మంగమ్మ, సూర్యం స్వగ్రామం చేరారు. అప్పుడు గూడా రామయ్య వెళ్ళి తన గొడ్లచావట్లో కూర్చున్నాడే కాని తల్లిని చూడటానికైనా రాలేదు. ఎందరు ఎన్ని విధాలుగా అన్నా తల్లి అంత్యక్రియలలో పాల్గొనలేదు.

కర్మ ముగిసిన తరువాత లక్ష్మణరావు అన్న వద్దకు వెళ్ళి అయిన ఖర్చులు చెప్పి తల్లి తాలూకు పది సంవత్సరాల పంట నిలవ ఉండాలని లెక్క తేల్చాడు.

"ఆమె పంట దమ్మిడీ ముట్టుకోలేదు. ఎప్పుడు కప్పుడు మనియార్డరు చేస్తూ వచ్చాను. ఆమె తిరగగొడుతుంటే ఆమె సేవింగ్స్ అకౌంట్‌లో జమ కట్టించాను" రామయ్య లోపలకు వెళ్ళి ప్యాస్‌బుక్ తమ్ముని ముందు పడేసి గొడ్ల చావిడికి బయలుదేరాడు.

"ఖర్చులు పోగా నీకు సగం వస్తుందన్నయ్యా!" పుస్తకం తెరిచి చూస్తూ లక్ష్మయ్య అన్నాడు.

"నాకేమి సంబంధం లేదని ఏనాడో చెప్పాను" అతను వెళ్ళిపోయాడు.

రఘు వెదకికొంటూ వచ్చేటప్పటికి రామయ్య గొడ్ల చావట్లో గాటిమీద కూర్చుని మేస్తున్న ఎడ్ల జతవైపు దిగాలుగా చూస్తున్నాడు.

"పెదనాన్నా"

"ఏమిటి?"

"నాయనమ్మ ఈ ఉత్తరం మీ కిమ్మన్నది."

"అమ్మ చచ్చిపోయింది. అంత్యక్రియలు జరిగిపోయాయి."

"ఈ ఉత్తరం మీకిమ్మని చెప్పి చనిపోయింది."

"చచ్చిన వాళ్ళకు బ్రతికున్నవాళ్ళతో పనేమిటో?"

రఘుకు ఆశ్చర్యం, కోపం కలిగాయి. "నా కెలా తెలుస్తుంది?" అంటూ ఉత్తరం ఇవ్వబోయాడు.

"నేనెందుకులే, నువ్వే చదువు"

రఘు కవరు చించి ఉత్తరం తీసి మెల్లగా ప్రారంభించాడు :

పెద్దబ్బాయ్!

"తల్లినయి ఉండి చిన్నవాడి మీద పక్షపాతం చూపించాననే కదా నీకు కోపం? మానవులన్న తరువాత మమతలలో ఎచ్చు లొచ్చులుంటాయి. మనకు రెండు చేతులొక్కటే. కాని ప్రతిపనికీ నీవు ముందు కుడిచేయి చాపుతావు. మరికొందరు ఎడమచేయి చాపుతారు. దీనికే మంటాము? అది అలా ఉంచు. చిన్నవాడి చదువు ఖర్చులు లెక్కలు గట్టక ఆస్తిని సరిసమానంగా పంచాననే కదా నీ బాధ. కలతలు లేక ఇద్దరూ ఒకరికొకరు తోడుగా ఉంటారని ఆశపడి మోసపోయాను. పెద్దగా చదువు కొన్నంత మాత్రాన గుణాలు రావు. చిన్నవాడు నీ మనసు గుర్తించలేదు. జరిగినదేదో జరిగిపోయింది. ఈ పదేళ్ళ పంట నీదే. దీనిలో దమ్మిడీ కూడా చిన్నవాడికి రాదు. ఇకనైనా నన్ను క్షమిస్తావు కదూ?

**సుభద్ర."**

రఘు ఉత్తరం ముగించి చూచేటప్పటికి పెద తండ్రి చెక్కిళ్ళపై సెలయేళ్ళు ప్రవహిస్తున్నాయి. అతడు ఉత్తరం పెదతండ్రి కిచ్చాడు.

"బాబూ, ఈ సంగతి మీ నాన్నకు చెప్పకు." మాట తీసుకుని అతడు ఉత్తరం ముక్కలు ముక్కలుగా చించి వేశాడు.

రఘు దిమ్మరపోయి తేరుకుని నమస్కరించాడు.

# కొడవటిగంటి కృష్ణమూర్తి

**చూ**స్తుండగానే మబ్బు కమ్మి తటిల్లని మెరుపు మెరిసినట్టు. కృష్ణమూర్తిగారి కథ మొదలై ఇంతలోనే ఆశ్చర్యకరంగా తటాలున ముగిసిపోతుంది. మెరుపు వెలుగులో దారి కనిపించినట్లే. కృష్ణమూర్తిగారి కథల్లో ఒక సత్యం అనుభవైకవేద్య మౌతుంది. సామాన్య విషయాలుగా కన్పించే సంఘటనల్లోంచి కథావస్తువుల్ని ఏరుకొని మానవ స్వభావాన్ని పరిచయం చేస్తూ, కుండ బ్రద్దలుకొట్టినట్టుగా జీవితాన్నీ, జీవితాలనీ విమర్శించడం కృష్ణమూర్తి గారికి వెన్నతో పెట్టిన విద్య. డొంక తిరుగుడు లేని స్పష్టమైన శైలి.

**రచనలు :** మాలో మేము. బీరకాయ పీచు, ప్రైజ్ అండ్ ప్రెజ్‌డిస్. ఆచంట మల్లన్న (కథల సంపుటాలు).



# ఏ చెట్టు కా విత్తు

చిల్లర డబ్బులూ, టిక్కెట్లు రెండూ తీసుకుని వెళ్ళబోతుండగా ఎవరో పిలిచారు వెనుక. వళ్ళు జలదరించేటట్టు. "ఏం రోయి – మోహనాయి!"

మోహనుడు వెనక్కి తిరిగి చూచాడు. ఇద్దరు ఆంగ్లో ఇండియన్ కన్యలు కిలకిల నవ్వుకుంటూ కనిపించారు. మోహనాయి! " ఎవడా వెధవకూత కూసిందీ––" అన్నట్టుగా చుట్టూ చూశాడు.

"ఎందు కాలస్యం చేస్తున్నావు – త్వరగా రావోయి. మళ్ళీ చోటు వుండదు." అన్నాడు స్నేహితుడు. డబ్బుపెట్టి కొన్నవాడికంటె వాడి కెక్కువ తొందరగా వుంది. మరుక్షణం మోహనుడు చూశాడు – నరసయ్య తనవేపు పరుగెత్తుకొస్తున్నాడు అమెరికాను చూచిన కొలంబస్ అల్లే. మోహనుడి గుండె జారి పోయింది.

"ఏం రోయి, మోహనాయి!" అని అతన్ని సమీపించి వీపుమీద చరిచాడు నరసయ్య.

మోహనుడు మాట్లాడుతున్నాడేగాని అతని మనస్సంతా రాబోయే ప్రళయాన్ని ఎలా ఎదుర్కోవటమా అని ఆలోచిస్తూనే వుంది.

"ఎవరండి మీరు? – మర్యాదకూడా తెలియదల్లేవుందే!" అన్నాడు వీపుమీద నరసయ్య చెయ్యి పడగానే.

నరసయ్య నివ్వెరపోయినాడు. తన ఎదురుగావున్న ఇద్దరివంకా చూశాడు. ఇద్దరూ సూట్లతో నీటుగా వున్నారు. మోహనుడి మోహం మటుకు అసహ్యంగా వుంది. పక్కతను ఆశ్చర్యంగా చూచాడు నరసయ్యవంక.

"అరె! జ్ఞాపకంలేదూ?" అన్నాడు నరసయ్య.

"ఎవరు మీరు?"

"నీపేరు మోహనాయి కాదూ?"

"నా పేరు మోహనుడు. నన్నెట్లా ఎరుగుదురూ?" అక్కడి దొరసాన్లూ, దొరలూ, అయ్యర్లూ, అమ్మాళులూ, రావులూ, రాణీలూ, అందరూ తనవంకే చూస్తున్నట్టుంది నరసయ్యకు. మొహాన చెమట తుడిచివేసుకుని మోహనుడి వంక చూచాడు.

"క్షమించండి! పొరపాటు నాదే. చేసిన తప్పుకు చాలా చింతగా వుంది. క్షమించండి." అని వెళ్ళిపోయినాడు నరసయ్య వెనక్కు తిరిగి చూడకుండానే.

"ఎవడు ఆ బైతు?"

"నాకూ తెలియదు."

"మరి నిన్ను పేరు పెట్టి ఎలా పిలిచాడు?"

"నాపేరు మోహనాయా ఏమిటి?"

మోహనుడు పచ్చి అబద్ధం ఆడాడు. అతను ఇదివరకు ఆడినవాటిల్లోనూ ఇక ముందు ఆడబోయే వాటిల్లోనూ ఇప్పటిది ఏ విధంగానూ లెక్కలోకి రాకపోయినప్పటికీ, దీంట్లో విశేషం వుంది. అసలు నరసయ్య, అతనూ మొదట కలుసుకున్నది నాలుగో క్లాసులో. నరసయ్య మూడో క్లాసు పేసయి స్కూలు తెరవగానే నాలుగో క్లాసుకు వెళ్ళిపోయినాడు. మోహనుడు అలా కాక యింటిదగ్గర ప్రయివేటుగా చదివి స్కూలు తెరిచిం తరువాత కొంచెం ఆలస్యంగా చేరినవాడు. అతను చేరిన మొదటి రోజున పిల్లలంతా ఎందుకో నవ్వటమూ! అతను పట్టలేక బావురుమని ఏడవటమూ, పిల్లలు మరింత నవ్వటమూ అతనికి స్పష్టంగా జ్ఞాపకం వున్నాయి. నరసయ్య అందరినీ చీవాట్లు పెట్టి తన దగ్గిర కూర్చోపెట్టుకోవటమూ కూడా జ్ఞాపకం వుంది. ఇంతలో మేష్టరు వచ్చి మోహనుడి పేరూ, తండ్రి పేరూ, వృత్తీ, అన్న ఏం చదువుతున్నదీ, చెల్లెలు పెళ్ళి అయిందీ, మేనమామకు ఆడపిల్ల లెంత మందో, ఎన్ని ఎకరాలు ఎక్కడెక్కడ వున్నదీ, ఏఏ ఎకరానికి ఎంత ధాన్యం వచ్చేదీ మొదలయిన వన్నీ తను తెలుసుకోవటమే కాక పిల్లలందరికీ కూడా తెలియబరిచాడు. మర్నాడు అందరిలోనూ నరసయ్య తనను కావలించుకుని "మోహనకారుడమ్మా ఈ బిడ్డ శాన్నాళ్ళు బతకడమ్మా" అన్న వెధవపాట – ఎక్కడో విన్నది – పాడటమూ, పిల్లలంతా పప్పుబెల్లాలు పెట్టినట్లుగా చప్పట్లు కొడుతూ నరసయ్యనూ తన్నూ మధ్యపెట్టి చుట్టూ తిరగటమూ, మేష్టరు రాగానే ఎక్కడివా రక్కడే గప్‌చిప్ సాంబార్ బుడ్డీ అయిపోవటమూ అతను పదిజన్మలెత్తినా మరిచిపోడు. బడి వదలగానే నరసయ్య ఏమీ ఎరగని వాడికి మల్లే అతని దగ్గరికి వచ్చాడు. వాడి నైజం ఇదివరకే బోధపడటం వల్ల తను పెడమొహం పెట్టడమూ, వాడు బతిమాలుతూ దగ్గిరికి వచ్చి, తన తలను గట్టిగా పట్టుకుని "ఎన్ని నీళ్ళో తల్లో!" అని నోటితో చప్పుడు చేయటమూ, అందరూ నవ్వటమూ, అతను ఏడుస్తూ ఇంటికి పోవటమూ ఎలా మరిచిపోవటం?

అప్పటినుంచీ ఆ అలుసు తీసుకుని అందరూ అతన్నిఅనేక రకాలుగా ఏడిపించారు. ఇలాంటివి సాధారణంగా అందరికీ జరుగుతై. మొదటి రెండు మూడు రోజులూ. తర్వాత అంతా మామూలు కావటమూ, కొత్తగా వచ్చినవాడిని అందరితోపాటు తనూ మగతనం తెచ్చుకుని ఏడిపించటమూ, మళ్ళీవాడు అలవాటయిపోయి కొత్తగా వచ్చేవాడిని తగలటమూ సర్వ సాధారణంగా జరిగే విషయం. మొదటి రెండు రోజులలోనూ మోహనుడు పిల్లల తాకిడి తట్టుకోలేక పోయినాడు. నరసయ్య న్యాయంగా రెండో రోజునించీ అతన్ని ఏమీ అనకపోవటమే కాకుండా ఎవరన్నా అతన్ని మరీ గోలచేస్తుంటే వాళ్లని కోప్పడేవాడు కూడాను. కాని, మోహనుడికి నిజంగా నరసయ్య మీదనే గుర్రుగా వుండేది. ఎందుకని అంటే, అసలు గోల మొదలు పెట్టింది అతనే! నరసయ్యా తనబోటి వాడేనని అతనికి తెలియకపోవటమే కాక అతను పచ్చిదొంగ అని మోహనుడి నమ్మకం. ఇతరులు తనని గోల చేస్తుంటే సర్దటానికి వచ్చినట్టు వచ్చి పోతూపోతూ ఏమరుపాటుగా వుండి నెత్తిన మొట్టిపోయే రకం అని అతని అనుమానం – అలా జరగగా అతను చూచాడు కూడాను! అందుకని నరసయ్య ఎన్ని విధాల అతని దగ్గిరికి రావటానికి ప్రయత్నించినా అతను రానియ్యలేదు. ఇంతగోల రెండు రోజులలో అయిపోయేదే ఒక విధంగా జరిగివుంటే. రెండో రోజురాత్రి ఏడుస్తూ వెళ్ళి మేనమామతో చెప్పాడు మోహనుడు, పిల్లలంతా తనని కొట్టి చంపుతున్నారని, నరసయ్య మీద మరీ ఎక్కువగా చెప్పాడు.

మర్నాడు మేనమామ స్కూలుకు వచ్చి అందరిలోనూ మేష్టరుతోటి చెప్పాడు. మేష్టరు అందరినీ ఆయన ఎదటనే కోప్పడి ఈ తడవ అల్లరి చేసినవాళ్ళని చీలుస్తానని చెప్పాడు. మేనమామ వెళ్ళిపోతుండగా మోహనుడు బైటికి వచ్చి రాసుకుంటున్న నరసయ్యను చూపించి "వాడికెంత పొగరనుకున్నావు మామయ్యా!" అని చెప్పి వెళ్ళాడు. స్కూలు వదిలిపెట్టగానే నరసయ్య అతని దగ్గిరికి వెళ్ళి తనతో వుండమనీ, అలా వుంటే అతనికి ఏ విధమైన భయమూ వుండదనీ చెప్పాడు. ఇంతలో ఇద్దరు పిల్లలు చేరి మోహనుడిని వెనుక్కు తోశారు. మోహనుడు అమాంతంగా తన వెనక ఒకడు వంగి కూచుని వుండటం చూడక, పోయి వాని మీద పడి, అంతటితో ఆగకపోయి ఇసుకలో వెల్లికిలా పడ్డాడు. అక్కడవున్న పిల్లలంతా కరతాళ ధ్వనులు చేశారు. మోహనుడు ఏడుస్తూ ఇంటికి వెళ్ళాడు. కాని. అతను వెళ్ళకముందే ఒక చిత్రం జరిగింది. నరసయ్య ఆ ముగ్గురినీ పట్టుకుని మూడు మొట్టికాయలు మొట్టి పంపాడు. వెంటనే తన దగ్గిరికి వచ్చి "నేను కూడా మీ యింటిదాకా వస్తానులే – భయంలేదు!" అన్నాడు. ఒక చేత్తోకన్ను రుద్దుకుంటూ రెండో చేత్తో "ఫో!" అని నరసయ్యను విసిరాడు మోహనుడు. మర్నాడు క్లాసులో మోహనుడు కిందటిరోజు తనను ఏడిపించిన వారిమీద నేరం మోపాడు. మాష్టరు ఆ ముగ్గుర్ని చావబాదాడు. వాళ్ళు కాస్సేపు ఏడిచి వూరుకున్నారు.

రెండురోజులయిం తర్వాత నరసయ్య సాయంత్రం బజారుకు వెళ్ళాడు. వచ్చేపోయే జనానికి అంతులేకుండా వుంది. సూర్యాస్తమయం అయింది. కాని వెల్తురు బాగానే వుంది. పడమటి దిక్కు అంతా ఎర్రబడి ఆ ఎరుపు ఎత్తయిన మేడల మీది పై భాగాలకు చుట్టేసుకుని వుంది. మొహం పుల్లలు అమ్మేవాళ్ళూ, లాంతరగ్లాసులు తీసుకుపోయేవాళ్ళు, మిఠాయి తూయించేవారూ, మొహాన కుంకం, చెవిలో పువ్వూ పెట్టుకుని గుడినించి తిరిగివచ్చేవారూ, పళ్ళెంలో కొబ్బరికాయా, అరటిపళ్ళూ పెట్టుకుని గుడికి వెళ్ళే మందయానలూ, తడిసిన సోడా బళ్ళను తడుపుతూ "సోడా" అని బొంగురుబోయిన గొంతుతో అరిచేవాళ్ళూ మొదలైన వారితో నిండి వుంది బజారు. చీకటి పడకమునుపే వెలిగించిన గాసులైటు కింద ఇలాయి బుడ్డీ వెలిగించి కూచుని వుంది గారెల లక్ష్మమ్మ. పక్కన పంపుదగ్గర మొహం కడుక్కుంటూ సినిమా చూచి పోదామని పల్లెటూరు నుంచి వచ్చిన ఒకాయన, – అవతల కోమటి కొట్టుముందు వుల్లిపాయలు చెరుగుతున్నాడు ఒకతను చేటతో, ఇవతల కొట్లోంచి మిరపకాయల కోరుతో దగ్గుతూ బయటికి వచ్చాడు ఒకాయన. వీధి మధ్యగా బాండు వాయించుకుంటూ సినిమాబండి పోతుంటే జనం ఎగబడి కాయితాలు తీసుకుంటున్నారు. నరసయ్య సరాసరి గారెల లక్ష్మమ్మ దగ్గిరికి వెళ్ళాడు. రెండురోజులకో సారి అతను అక్కడ ఆవడకొని తినటం మామూలు, డబ్బు దొరికితే, నిక్కరు జేబులో చెయ్యి పెట్టి కానీ తీసియిచ్చి ఆవడ వున్న ఆకు తీసుకోబోతుండగా ఎవరో వెనక నుంచి అతని చెవి పట్టుకున్నారు. వెనక్కు తిరిగి చూచాడు. మిరపకాయల కోరుకు దగ్గుతో వచ్చినాయన!

"నీ పేరేమిటమ్మా?"

"నరసయ్యండీ," నరసయ్య చెవి వేడి ఎక్కింది.

"పిల్లల్ని మహా ఏడిపిస్తావుటే?" నరసయ్య చెవి నలిగిపోతున్నది.

"అందరూ నీ వంటివారు కాదూ?" నరసయ్యకు ఏడుపు వచ్చింది. కాని ఏడవలేదు. ఏడిస్తే ఆయన అంతటితో వదిలిపెట్టి పోయేవాడే?

"ఇక ఎన్నడూ అలా చెయ్యవు కదా!" చెంప చెళ్ళుమనిపించి వెళ్ళిపోయినాడు ఆయన. నరసయ్య అమాయకమైన మొహం వేసుకొని అలాగే చూచాడు.

అంతమందిలో ఇంతపని జరిగితే ఒక్కరికీ తెలియదు. నాలుగు గజాలు పోయింతరవాత ఆయన పక్క మోహనుడు ముక్కు కోయిస్తానంటూ సౌంజ్ఞ చేస్తున్నాడు! నరసయ్య ఆవడ అక్కడేపారేసి, ఇంటికి వెళ్ళిపోయినాడు.

వారంరోజులు పోయింతరవాత నరసయ్య మామూలుగానే మోహనుడి దగ్గిరికి వచ్చాడు. మోహనుడు తనతో మాట్లాడవద్దన్నాడు. రెండేళ్ళు ఇద్దరూ కలిసి చదువుకున్నారు. తరువాత నరసయ్య వెళ్ళిపోయినాడు – ఎక్కడికో. మోహనుడికి అతను మళ్ళీ కనిపించలేదు.

పదిహేనేళ్ళయిన తరువాత మళ్ళీ ఇవాళ కనిపించి, ఆజన్మాంతం కలిసి గడిపినట్టుగా – వెధవ! కొన్నది నాలుగు అణాలన్నర టిక్కెట్టు కావడం చేత వెనక ఎవరున్నదీ చూడటానికి వెనకకి తిరిగి చూడాలి చూడదలుచుకున్న వారు. నరసయ్య ఎక్కడ వున్నాడా అని చూచాడు. ఎంత సేపు చూచినా ఎక్కడా కనబడలేదు. లైట్లు ఆరిపోయినై. తెరవేపు తిరిగాడు మోహనుడు. పైగా నరసయ్య అందంగా నాజుకుగా వుంటాడు. నరసయ్య పేరు గలవాడు బాగుండటం అతని కిష్టం లేదు. నరసయ్య అయినవాడు అసహ్యంగానే వుంటే బాగుంటుంది.

ఇప్పటి మోహనుడు వేరు. బి.యల్.పాసై లాయరుగా తరఫీదు పొందుతున్నాడు. ఇంటినుంచి ఎక్కువ డబ్బు రాకపోవడం వల్ల వచ్చిన దానిని బడ్జెటు వేసి సద్వినియోగం చేయటానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు. ఇంకోడితో – అతనూ తనలాగానే లాయరు గావడానికి ప్రయత్నిస్తున్నవాడు – కలిసి రూము ట్రిప్లి కేనులో తీసుకుని సినిమాలకూ, సినిమాలేని రోజున బీచికీ షికారు కొట్టుతూ వుండేవాడు. డబ్బుఅన్నిటికీ సరిపోయేది కాదు. అందుకని లోపల మాడుతున్నా పైకి మట్టుకి సబ్బుతో రుద్దినమొహం, నీటుగా సూటు, చెవులకు సెంటు మొదలయిన వాటితో తయారయే వాడు. స్నేహితుడు కూడా తన బోటివాడే కావటం వల్ల చిక్కులేక పోయేది. ఒకరిని ఒకరు ఎగతాళి చేసుకోవలసిన అవసరమే లేక పోయేది. ఇద్దరికీ డొక్కలు మాడుతుండేవి.

క్రమంగా యే కారు ఎవరిదీ, ఎవరో, ఎక్కడివారో, ఎవరి స్నేహితులో, ఎవరితో ఎక్కువ తిరుగుతుంటారో మొదలైన వార్తావళి సంగ్రహించి, తెలివికల వాళ్ళలో తెలివికలవాడై, ఆకులో ఆకై పోయినాడు మోహనుడు.

మోహనాకారుడు కావటం వల్ల కాదు, నిజంగా అతని కాపేరు పెట్టింది. కాని, పేరుని ఇంకో విధంగా సార్ధకం చేసుకున్నాడు అతను. ప్రేమించకుండా వుండటం కంటె ప్రేమించి విఫలమనోరథుడు కావటం మంచిది, అన్న టెన్నిసన్ మహాకవి వాక్యాన్ని అక్షరాలా అమలులో పెట్టాడు. తన చెల్లెలుతోపాటు తన ఇంటికి వచ్చే ఆడపిల్లలినీ ప్రేమించాడు. వయస్సు ముదిరిన కొద్ది గోంకూర సుబ్బినీ, అంట్లు తోమే మాచామునూ, పాలు ఇచ్చే సీతాంనూ, ఇంట్లో అద్దెకున్న విశాలాక్షమ్మగారినీ ప్రేమించాడు. కాలేజీవెళ్ళిం తరువాత లిల్లీ జానునూ, పేతురు చెల్లిలునూ ప్రేమించాడు. గది కెదురుగావున్న మస్తానును కూడా ప్రేమిద్దానుకున్నాడు కాని వాడి దుంప తెంచుకొనీ దాని భర్త రజాక్ ముస్లిమ్ లీగ్‌లో చేరటం మూలాన చూస్తూ చూస్తూ ధైర్యం చేయలేక పోయినాడు. మద్రాసు వచ్చిం తరువాత క్లాడెట్‌కోల్బర్టునూ, నార్మాషీరరునూ, మార్లిన్ టేట్రిక్‌నూ ప్రేమించాడు. డొరోథీ లేమరుమీదికి గూడా అతని హృదయం పడుతూ వుండేదిఎప్పుడన్నా. పోతే లీలాదేశాయినీ,

సాధనాబోసునూ, ప్రమీలనూ, నసీంనూ, శోభనా సమర్థనూ, జయ అమ్మాళునూ ఇండియాలో ప్రేమించాడు. శాంతాఆప్టేను ఎందుకు ప్రేమించాలో గానీ, ఎలా ప్రేమించాలోగానీ అతనికి తెలియలేదు. వాసంతి ఇంకా చిన్నది. పెద్దదయిన తరువాత అతనూ అందరితోపాటే . ఇదివరకు వారిలో గోహరూ, సులోచనా, మాధురీ అతన్ని ఆకర్షించారు. ఆ రోజులు వేరు. గడిచిన రోజులు మళ్ళీ అన్నా రావాలి. లేక జ్ఞాపకమన్నా రాకుండా వుండాలి. రెండూ జరగవు! మోహనుడు నిట్టూర్పు విడిచాడు!

"Good bye Mr. Chipps" చూచినప్పటి నుంచీ గ్రీర్‌గార్సనును ప్రేమించాడు. ఆవాళ అతను సినిమాకి రావడానికి కారణం ఆమే! ఆవాళ ఆట "ప్రైడ్ అండ్ ప్రెజుడిస్", గ్రీర్‌గార్సన్‌కూ, లారెన్స్ ఓలీవీయర్‌కు పడటంలేదు. గ్రీర్‌గార్సన్‌కు ప్రక్కన లారెన్స్ ఒలీవీయర్ నాయకుడుగా వుండటం మోహనుడికి సుతరాము ఇష్టం లేదు. అతనికి వాడంటేనే ఇష్టములేదు. మోహనుడి వుద్దేశ్య ప్రకారం వాడి పక్కన ఏ అందమైన ఆడదీ నాయిగా నటించకూడదని, సినిమా అయ్యే లోపల వాడు గ్రీర్‌గార్సన్ని ముద్దు కూడా పెట్టుకుంటాడు. తన కళ్ళ ఎదటే! శివ శివ! పైగా ఇంగ్లీషు టాకీసులో మనకు నచ్చిన వారిని మన కిష్టంకాని వారిచేత మన ఎదట అంతంత సేపు ఆవిధంగా ముద్దు పెట్టుకోనిస్తే అదేమిటోగా వుంటుంది. హిందీ సినిమాలలో కనక అలా అయితే, పాకిస్తాన్ అవసరం కావటానికి అది మరో కారణం అయేది. మొదటే నాయికా నాయకులు ప్రేమించుకున్నట్లయితే మధ్యవారు కష్టాలు పడటం, చివరకు ఎప్పుడో వారు కలుసు కోవటం జరుగుతుంది మన కిష్టం లేకపోతే వారు కలుసుకోక పూర్వమే లేచి బైటికి పోయి గాలి మేయవచ్చు. ఈ సినిమాలో అలా కాక మొదటినుంచీ నాయికా నాయకలకు పడదు. రాబోయే సంగతి విశదం అవుతూనే వుంది. చివరకు వారు గాఢంగా కావలించుకోవటం – వూరికే ముద్దులు పెట్టుకోవటం – పడ్డ కష్టాలకు ప్రతిఫలంగా అతను కళ్ళారా చూడాలిసి వుంది. గ్రీర్‌గార్సన్నీ ఎవ్వరూ ముద్దుపెట్టుకోవటం అతని కిష్టం లేక పోవటానికి ప్రత్యేకంగా కారణం వుంది. లైట్లు వెలిగినై. ఈ చర్యల్లో మోహనుడు జేబురుమాలు తీసి మడత విప్పకుండా నుదుటి చెమట అద్దుకున్నాడు. అంచులతో పెదిమల్ని తుడిచాడు. మామూలుగా కూచున్నాడు. అందరూ ప్రక్కనున్న వారిని, ముందున్న వారిని, వెనుకవున్న వారిని తిలకిస్తారు. పక్కనున్న స్నేహితుడు చాక్లెట్స్ కొని అతనికిచ్చాడు.

మోహనుడు చాక్లెటు తింటుండగా అతని స్నేహితుడు అతని చెవిలో వెనక్కి తిరిగి చూడమని చెప్పాడు. స్నేహితుడు చెప్పినవేపే చూచాడు మోహనుడు.

"చూచావా?"

మోహనుడి గుండె ఆగటానికి ప్రయత్నించడం గాని. కళ్ళు మెరవటం గాని స్నేహితుడు గమనించలేదు.

"అచ్చుగా గ్రీర్‌గార్సన్!" అన్నాడు స్నేహితుడు. మోహనుడు మాట్లాడలేదు.

"ఇటువేపే చూస్తున్నది!" లైట్లు ఆరినై.

మోహనుడు బి.ఏ. చదువుతుండగా ఆమె యఫ్.ఏ. చదివింది. నాలుగు సంవత్సరాలు దాటింది ఆమెను చూచి. అతను ప్రేమించిన వాళ్ళందరిలోనూ ఆమెదే అగ్రస్థానం. పదే పదే జ్ఞాపకం వస్తూ కూడా వుంటుంది. గ్రీర్ గార్సన్ చూచినపుడల్లా ఆమె స్ఫురణకు వస్తుంటుంది. మోహనుడికి మనస్సు సరిగా పని చెయ్యటం లేదు. టైము ఎలా గడుస్తున్నదీ తెలియటం లేదు. లారెన్స్ ఒలీవియర్‌గాడు అతనికి వొళ్లు మండేటట్లు గ్రీర్ గార్సన్‌ను బతిమాలుతున్నాడు. వెధవ మొహం వేసుకుని. అతను భరించలేక పోయినాడు. దబదబా బైటికి వచ్చాడు. నాలుగు నిమిషాల అటూ ఇటూ తిరిగే టప్పటికి లోపల గంట మోగింది. మోహనుడు ఆదుర్దాగా హాలు వంక చూచాడు. "ఆమె" ఎవరితోనో దబదబా బైటికివచ్చికారు ఎక్కబోతున్నది.మోహనుడు జన్మలో ఎరగని ధైర్యంతో ఆమెను సమీపించి "ఏమండీ, మీరు ఈ వూళ్లో వుంటున్నారా?" అన్నాడు. లోపల్నించి ఎవరో తల బైటికి పెట్టి "ఎవరాయన?" అన్నారు ఆమెతో. ఆమె ఆశ్చర్యంగా మోహనుడి వంక జూచి "ఏమో!" అంది. మోహనుడు నివ్వెరపోయినాడు.


"ఏమండీ! మీరు నా భార్యను ఎరుగుదురా ఏమిటి?" అన్నాడు ఆయన కారులోంచి చాలా మర్యాదగా.

మోహనుడికి మతిపోయింది. ఆ గొంతు అతను ఎరిగినదే. కారు లైట్లు వెలిగినై. కారులోపల కూడా వెలిగింది లైటు. మోహనుడి ఆశ్చర్యానికి అంతులేదు. లోపల ఆమెపక్కన నరసయ్య కూర్చుని వున్నాడు!

"అలా పరుగెత్తుకుని వచ్చావేం?" అన్నాడు వెళ్ళిపోతున్న కారు వంక దిగ్భ్రమతో చూస్తున్న మోహనుడితో స్నేహితుడు.

# పాలగుమ్మి పద్మరాజు

**(1915 - 1983)**



**అ**ంతర్జాతీయ ఖ్యాతిపొందిన కథా రచయిత. కవిగా, నవలాకారునిగా, నాటక రచయితగా, వ్యాసకర్తగా, సినీ రచయితగా, దర్శకునిగా, విశేష కీర్తి ప్రతిష్టల్ని పొందిన వారు. 'గాలివాన' అన్న వీరి కథ ప్రపంచ కథానికల పోటీలో ద్వితీయ బహుమతి పొందినది. మానవ మనస్తత్వాన్ని తరచి చూచి, వ్యక్తుల ప్రవర్తనను నిబంధించే అనేక ప్రభావాలను పరిశీలించి, నిశితమైన వాస్తవిక దృష్టితో, హృదయంగమమైన శిల్పంతో ఉత్తమ కథలు వ్రాశారు. 1939 నుండి 1952 వరకు కాకినాడ లోని పి.ఆర్. ప్రభుత్వ కళాశాలలో సైన్సు లెక్చరర్‌గా పని చేశారు.

**రచనలు :** బ్రతికిన కాలేజీ (నవల), హత్య, ఆత్మహననం (నాటికలు), కూలిజనం, కథావాహిని (కథలు).

# కరణం కనకయ్య వీలునామా

**ప**శ్చిమగోదావరిజిల్లా భీమవరం తాలూకా, భీమవరం శివారు, రాయవరం గ్రామ కాపరస్తుడున్నూ, సదరు గ్రామ కరణము గాయుంటూ కొందరు దుష్టులు కావేషి కొద్దీ చేసియున్న అసత్య కంప్లయింటులు ఆధారముగా సర్కారు వారిచే సదరు కరిణీకము నుండి తొలగించబడినటు వంటి లేటు కోదండయ్య గారి రెండవ కుమారుడున్నూ, అయిన కనకయ్య అనే పేరుగల నేను నా పరిపూర్ణ యిష్టానుసారముగా వ్రాయించుకున్న వీలునామా.

సదరు వీలునామా నేను వ్రాయుటకు మరొకరి బలవంతమేమియూ లేదనిన్నీ, ఇది వ్రాసిన సమయమందు, నా మెదడు మంచి ఆరోగ్యమైన స్థితియందే వున్నదనిన్నీ, నేను ఎన్నడునూ బుద్ధిమాంద్యము, పిచ్చి, మూర్ఛలు, అంతులేని ఉద్రేకము మొదలగు మానసిక రోగములకు లోనుగా లేదనిన్నీ ఇందుమూలముగా హెచ్చరిస్తూ యున్నాను.

ప్రస్తుతము శ్రీమతిన్నీ, (నే నింకనూ బ్రతికియేయున్నాను గనుక) అగ్నిసాక్షిగా నేను వివాహమాడి యున్నటువంట్టిన్నీ. నా ఏకైక పుత్రికకు తల్లియైనటు వంట్టిన్నీ వెంకట చాషమ్మ నుద్దేశించి కొన్ని ముఖ్య సంగతులు వివరింపవలసి యున్నందున ఈ దిగువ వీలునామా దాఖలా యావత్తు విషయములూ ఆమె కొరకు ఉద్దేశింపబడినవని యిందుమూలముగా తెలియజేయడమైనది.

చిరంజీవి చేషుకి నీభర్త కనకయ్య ఉభయకుశలోపరి, ఆశీర్వదించి చెప్పునది ఏమనగా:

నీవు వట్టి అమాయకురాలవైన కారణము చేతనున్నూ, నీ అన్నలూ తమ్ముళ్ళూ శుద్ధ నారద సంతానము కావడం చేతనున్నూ, (అనగా ఒకరికొకరికి తంపులు పెట్టి ఆనందించే స్వభావమని తాత్పర్యము) నిన్ను నీ భర్త నైన నేను ఈ క్రింది విధముగా హెచ్చరించడమైనది. నీయందు నా కుండుకున్న ప్రేమానురాగములకు ఏ విధమైన భిన్నము లేదనిన్నీ, నేను చేసిన ఆస్తి పంపకపు ఏర్పాట్లు నీ మేలు కోరే చేసియున్నాననిన్నీ, నీకు

ఆస్తిమీద ఏ విధమైన హక్కులూ లేకుండా వ్రాయుటకు పైన ఉదహరించిన సదరు మీ అన్నలూ, తమ్ముళ్లే కారణమనిన్నీ నీకు తెలియజేయడమైనది. అదియును గాక, ఆడవారికి ఆస్తినిచ్చుట అగ్నిలో ఆజ్యము పోయుట వంటిదని నా నిశ్చితాభిప్రాయము. సదరు కారణము మూలకముగానే అమ్మాయికి కూడా ఏ విధమైన హక్కులూ లేకుండా కట్టుదిట్టము జేసి, అల్లుడు గారి స్వాధీనములో ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరచరాస్తులన్నియు – నా స్వార్జితము గాన పెట్టుటకు నేను తీర్మానించడమైనది. అసలు ఆడువారికి మెదడు తక్కువని అందరకును తెలిసిన విషయమే. అందుకు ప్రబల నిదర్శనము మా తోబుట్టువున్నూ, ఆవులపాలెం జమీందారువారి ఆరవ కళత్రమున్నూ అయిన ఆదిలక్ష్మియే నని నీకు వేరే చెప్పవలసిన అవసరము లేదని అనుకుంటూ యున్నాను. ఆమె భర్త గారు కాలధర్మం చెందిన సందర్భలో ఆమెకు సంక్రమించిన అయిదులక్షల విలువ గల నగలున్నూ, అరవై నాలుగు యకరముల మామిడి తోటయున్న హారతి కర్పూరము వలె హరించిపోవు సందర్భములో, స్వార్థపరులైన ఆమె మరదుల ఆట కట్టించి అంతవరకూ అన్యులపరమైన అయిదు లక్షల నగలున్నూ తిరిగి సంపాదింపలేక పోయిననూ, నా తెలివి తేటలుపయోగించి, సదరు అరవై నాలుగు యకరముల మామిడి తోటైనా అన్యాక్రాంతము కాకుండా నా హక్కు భుక్తము లోనికి తెచ్చుకుని కాపాడినానన్న సంగతి మరిచిపోవని తలుస్తూ యున్నాను. ఆమె కన్ను మూసేవరకూ ఆమె పెట్టుపోతలు ఎంత శ్రద్ధాభక్తులతో జరిపియున్నానో నీకు తెలియని విషయం కాదు. అదియునుగాక 'స్త్రీ బుద్ధిః ప్రళయాంతక'మని పెద్దలన్నది అక్షరాలా నిజము. దానికి నీవే తార్కాణము. లోగడ నీ వొకమారు మీ రెండవ యన్నగారి చెప్పుడు మాటలు విని, నా మీద మనోవృత్తి దావా వేయుటకు సిద్ధపడిన సంగతి మరిచిపోలేదని తలుస్తూ యున్నాను. నాకున్నూ, మనయూరి సరవసానికిన్నీ ఏదో సంబంధమున్నదని కట్టు కథలు కల్పించి, నిజానిజాలు తెలుసు కోకుండా నీకు నాతో కాపురము చేయుటకు ఇష్టము లేదనిన్నీ, నా ఆస్థిలో మూడవ భాగము నీకు భరణముగా రావలసి యున్నదనిన్నీ వకీలు నోటీసు నిప్పించి యున్నావు. మగవారు కార్యరంగములో నిత్యమూ మునిగి తేలవలసినవారు కావడం చేతనున్నూ, లోకములో సన్మార్గులూ, దుర్మార్గులూ, సంసారులూ, సానులూ అన్నిరకముల వారున్నూ ఉండుకున్న కారణం చేతనున్నూ, అట్టివారితో, అతి స్వల్పముగా నైననూ సంబంధము లేకుండా యుండుట అసంభవము. ముఖ్యముగా సరవసాని విషయమైన సందేహము నీ మనస్సు నుండి దూరముచేయుట నా బాధ్యత కావడం చేత ఆ సందర్భమైన నా సముజాయిషీ. నీ కిందుమూలముగా తెలియజేయడ మైనది. మా అక్కగారైన ఆదిలక్ష్మికిన్ని, ఆమె మరుదులకున్నూ హైకోర్టువరకూ నడిచిన దావాలో సరవసానిసాక్ష్యం అతిముఖ్యమైనదని

నేను వేరే చెప్పవలసిన అవసరం లేదు. కేసు మా అక్కగారికి అనుకూలముగా కావడానికి సరవసానికి తెలిసిన విషయంలో ఏది కోర్టువారికి తెలిస్తే మంచిదో, ఏది తెలియకూడనిదో నిర్ణయించి ఆమెకు తరిఫీదునిచ్చిన సందర్భంలో, కొద్దిరోజులు రాత్రిం బగళ్ళు ఆమె ఇంట్లో నేను గడిపినమాట నేనునూ కాదనడం లేదు. సదరు తరిఫీదు సందర్భములో వ్యవహార విషయములు విని విని విసుగు పుట్టినప్పుడు, కొంచెము సొంత కులాసా కోసమున్నూ, కొంత అలవాటు కొద్దిన్నీ, కొన్ని శృంగార జావళీలు పాడి నాముందు అభినయించిన విషయము కూడా వాస్తవము. అది విన్నవారు నోరు మూసుకుని ఊరుకోక, నీ వద్దకు వచ్చి వర్ణించడం కారణంగా (ఒకరు సుఖపడుతూ యుంటే చూచి ఓర్వలేని జనం ప్రతి ఊరా ఉండుకుంటూ యుంటారు. వారి చెప్పుడు మాటలకు చెవి యొగ్గినట్లయితే, మనకు మిగిలేది మనస్తాపం మాత్రమే) నీవు వున్నవీ లేనివీ ఊహించుకుని మీ పుట్టినింటికి వెళ్ళిపోయినప్పటికిన్నీ, నీయందు నాకుండుకున్న సదరు ప్రేమవల్లనున్నూ, నీవు వట్టి అమాయకురాలివేగాని, దుష్టురాలవు కాదన్న దృఢ నమ్మకం నా కుండుకున్న కారణం చేతనున్నూ, సదరు సందర్భమైన కోపంగాని, కావేషీగాని, నాకు నీయందు లేదని ఇందు మూలముగా  తెలియజేయడమైనది.

ఈ వీలునామా నేను పోయిన తరువాత గాని, నీ చేతికి రాదు గనుకనున్నూ, అప్పటి నీకు కోపాలూ, అసూయలూ, మనస్సులో నింపుకోగలిగిన శక్తి కూడా సన్నగిల్లిపోతుంది గనుక నున్నూ, పైనుదహరించిన సందర్భంగా సంబంధమై కొంత ఇచ్చట ముచ్చటించుటకు నిర్ణయం. ఇది కేవలం నీకోసం కాదనిన్నీ – ఎందుకనగా ఆ స్థితిలో నీవు ఈ విషయాలన్నీ గ్రహించి చేయగలిగింది ఏమిన్నీలేదు– మన బంధుమిత్రుల కుటుంబాలలో ఉండుకున్న ఆడవారికి కొంత జ్ఞానబోధ చేయుటకనిన్నీ, అందునూ ముఖ్యముగా  వయస్సులో వున్నవారి కోసమనిన్నీ – మన అమ్మాయివంటివారు అసందర్భమైనటువంటి భావాలు పెట్టుకుని సంసారాన్ని నరకప్రాయంగా చేసుకోకుండా హెచ్చరిస్తూ – తెలియజేయడమైనది.

సరవసాని – సాని గనుక – సరసులను మెప్పించే ప్రయత్నం ఆమె చేయుట సహజమని వేరే చెప్పనవసరం లేదని తలుస్తూయున్నాను. నాయందు ప్రత్యేకముగా విశేషించి ఆమెకు ఎటువంటి అభిమానము గానీ యున్నట్లయితే, అందుకు పూచీ నాది యెంతమాత్రమూ కాదనిన్నీ, అసలు అటువంటిది ఏదైనా ఉండగలందులకు ఋజువు ఏమిన్నీ లేదనిన్నీ, ఇహ, నాకు ఆమె యందు మిక్కిలి ఎక్కువ మక్కువ. అనగా నీయందున్న మక్కువకు మిక్కిలి – ఉన్నట్టు నీకు గాని, మరెవరికి గాని ఒక సందర్భములో తోచియుండుకున్నట్లయితే, సదరు అభిప్రాయము సత్యదూరమనిన్నీ, ఒకవేళ నిజముగానే

ఆమె వలలో నేను చిక్కుకొనిపోయిన సందర్భంలో లేటు మాబావగారైన ఆవులపాలెం జమీందారు వారివలె నేనున్నూ, ఈ వీలునామాలో ఆస్తియావత్తున్నూ ఆమెకు వ్రాసి యిచ్చియుండేవాడనుగాని, అల్లుడుగారి సందర్భమైన ఆలోచనయే నా కుండేది గాదనిన్నీ నొక్కి వక్కాణిస్తూయున్నాను. లోగడ సదరు వీలునామా నీ కొకసారి చదివి వినిపించియున్నాను గనుక, సదరు మా బావగారు సరవసాని నుద్దేశించి "మహా పతివ్రతయయిన సరవసానికి నా యాస్తి సర్వస్వమున్నూ చెందగలందులకు నిర్ణయం" అని వ్రాసియున్న సంగతి, నీవు మరిచిపోలేదని తలుస్తూ యున్నాను. సదరు వీలునామా కోర్టులో చెల్లకపోయినా, తీరా కోర్టుకుపోయే సందర్భములో జడ్జీలూ, సాక్షులూ, సరవసాని చాకచక్యానికీ, చమత్కారానికీ ఎక్కడ దాసోహముజేసి, దావా ఆమె పక్షము చేస్తారో అన్న భయము కొద్దీ సదరు మా లేటు బావగారి సోదరులు, సరవసానితో రాజీ పడుటకు నిర్ణయించుకున్న సంగతి కర్ణాకర్ణిగా విన్నవాడనై, అటు వారికిన్నీ యిటు సరవసానికిన్నీ అటువంటి రాజీ గనక కుదిరిపోయి నట్లయితే, మా అక్కగారికి కలిగే నష్టము మనస్సులో పెట్టుకుని, నేను మధ్యలో సైంధవుని వలె అడ్డు పడవలసిన అగత్యం ఏర్పడియున్నది. అయితే సదరు వ్యవహారమునకు అవసరమైన దానికన్నా కొంత ఎక్కువ దగ్గర సంబంధాలు నాకున్నూ, సరవసానికిన్నీ ఎందుకు ఏర్పడవలెనని నీ వడిగిన యెడల అందుకు నా సమాధానము ఈ దిగువన ఉదహరిస్తూ యున్నాను.

చట్టము, న్యాయము, రీతి తత్సంబంధమైన విషయములన్నిన్నీ స్త్రీ పురుష వ్యవహారాలను చర్చించే సందర్భంలో అప్రస్తుతములై నవనే నేను నొక్కి వక్కాణింపగలను. కార్యరంగములో దిగి కిందా మీదా పడుతూ ఉండవలసిన మగవాడి మనస్సుకు కొంత విశ్రాంతి, కులాసా, మిక్కిలి యున్నూ అవసరమైయున్నవి. భార్య ఎంత అందగత్తె యైనను, ఎంత అనుకూలవతి యైనను భర్త మనసు పరకాంతల మీదికి మొగ్గుతూ యుండుట పురుష ప్రకృతిలో ఉండుకున్న ఒక విశేషం. అది గనుక భార్య గ్రహించి భర్త త్రొక్కే చిన్న చిన్న తప్పుదార్లను చూసీ చూడనట్టు ఊరుకొనిగాని, లేక చిరునవ్వుతో హాస్యపూర్వకంగా సదరు విషయాన్ని భర్తతోనే పరామర్శించి కాని భర్త ఎటువంటి వాడైనను తాను మాత్రం అతనియెడల సుముఖంగానే యున్నట్లు అతనికి అభిప్రాయం కలిగించినట్లయితే అటువంటి దాంపత్యం అత్యంత సుఖంగా సాగిపోవుననిన్నీ, భర్త భార్య యెడల అనురాగమే కాకుండ భక్తి గౌరవాలు కలిగి యుంటాడనిన్నీ నా అనుభవం వల్ల గ్రహించి యున్నటువంటి విషయం. అయితే ఈ పురాణాల్లో వ్రాసి యున్నటువంటి పతివ్రతల విషయమై నేను ప్రస్తావించడం లేదని నీవు గ్రహించునది. భర్త మనసు పరస్త్రీల మీదికే మొగ్గుట ఏ విధంగా ప్రకృతి సహజమో అప్పుడు భార్య మనసు పరపురుషుల మీదికి పోవుట కూడా

సహజమేనని నేను యిందుమూలముగా అంగీకరిస్తూ యున్నాను. అయితే భార్య విచ్చలవిడిగా ప్రవర్తించిన సందర్భంలో కుటుంబమే విచ్ఛిత్తి అయిపోతుంది గనుకనున్నూ, భర్త ఎంత స్వైర విహారము చేసిననూ, కుటుంబం అనే సూదంటిరాయి యొక్క ఆకర్షణకు లోనై ఉండక తప్పదు గనుకనున్నూ, భర్త కుండుకున్న స్వేచ్ఛ భార్యకు ఉండుటకు వీలులేదని స్పష్టం. ఏడ్పులూ, పెడబొబ్బలూ, దెప్పిపొడుపులూ, ఆయుధాలుగా ఉపయోగించే స్త్రీలు, భర్తలకూ, తమకూ కూడా జీవితం నరకప్రాయం చేయగలరేగాని, భర్తను సన్మార్గానికి ఎన్నడూ త్రిప్పలేరన్న విషయం నిర్వివాదము. అసలు భర్త అంతరాత్మే అతన్ని పీడిస్తూ యున్న సందర్భములో, ఆలు కూడా అతన్ని పీడించుట ఆరంభించినట్టయితే, అటు అంతరాత్మనూ, ఇటు ఆలినీ కూడా నోరు మూయించి, కట్లు త్రెంచుకుని విచ్చలవిడిగా వ్యవహరించడం తప్పనిసరిగా జరుగును. గనుకనే నేను ఇతఃపూర్వం ఇచ్చిన హెచ్చరిక.

మరొక్క ముఖ్యమైన విషయం ప్రస్తావించి నీ విషయం వదలివేయుటకు నిర్ణయం. నేను చనిపోయిన తరువాత, దురాశా పూరితులై నటువంటి పురోహితులు నీ చుట్టూచేరి, నాకు జరగవలసిన అంత్యక్రియల విషయమై నిన్ను – అమాయకురాలవు గనుక – ఒత్తిడి చేసి, అసలే భర్తృ వియోగంతో సతమతమవుతూ వున్న నీ మతి చెడగొట్టి, కేవలమున్నూ వారి స్వార్థం కోసం, అనవసరమైన ధనవ్యయం నీచే చేయించుటకు పూనుకొనుట తథ్యము. అందువల్ల నా అంత్యక్రియలు ఏమి చేయవలసి యున్నదో యిందుమూలముగా నీకున్నూ, నాకు ఆప్తులైన అమ్మాయీ, అల్లుడుగార్లకునూ తెలియచాయడమైనది. నా దహనమునకు అవసరమైన ఒక పుట్టి వంటచెరకుకు గాను, ప్రస్తుత వెల ప్రకారం రు.15లు అక్షరాలా పదిహేను రూపాయిలున్నూ, తిలలకు గాను ఆరు నయాపైసలున్నూ, వాహకులకు భుజానికి అర్థరూపాయి చొప్పున రు. 2లు అక్షరాలా రెండు రూపాయిలున్నూ వెరశి రు.17.06 న.పై.అక్షరాలా పదిహేడు రూపాయల ఆరు నయాపైసలున్నూ అల్లుడిగారికి నేను వ్రాయించి యిచ్చిన ఆస్తిలోనుంచి కేటాయించ గలందులకు నా నిర్ణయం. అంతకుమించిన కర్మకాండగాని, సంతర్పణలుగాని, సమారాధనలు గాని, దానములుగాని, నా యెస్టేటులో నుంచి వ్యయపరచుటకు వీలులేదని ఇందుమూలముగా హెచ్చరిస్తూ యున్నాను. నేను నా జీవితకాలములో చేసుకున్న కర్మ ఫలితముగా నేను నరకమునకు పోవుటే దైవ నిర్ణయమైన యెడల సంస్కృతభాషలో మంత్రములు చదివిగాని, సంతర్పణలు చేసిగాని, మరేవిధమైన ధనవ్యయము చేసిగాని, సదరు దైవ నిర్ణయమును మార్పజూచుట హాస్యాస్పదమని వేరే నొక్కి చెప్పవలసిన అగత్యములేదు. "అడుగో నీ భర్త, వైతరణి దాటలేక అవస్థపడుతూ యున్నాడు. ఒక్క

గోదానము చేసినట్లయితే దాని తోక పట్టుకుని వైతరణిని దాటి నరకానికి చేరుకుంటాడు" అని యెవ్వరైనా నిన్ను తొందర పెట్టిన సందర్భములో ఈ దిగువ నుదహరించిన సమాధానము నీవు వారికి ఈయవలసినదిగా నిర్ణయం.

"నా భర్త వైతరణిని దాటనేల, నరకమునకు పోనేల, వారు అతి త్వరలో నరకము చేరుకొన వలెనన్న ఆదుర్దా నాకేమీ లేదు. వైతరణికి ఇవతలిగట్టు నరకాని కంటే యెక్కువ వాసయోగ్యముగా ఉండునన్న విషయమై నా కేమియు సందేహము లేదు" అని చెప్పవలయును. ఇహ, పితృదేవతలలో చేరిన నాకు, మొదటి సంవత్సరం నెల నెలా, ఆ తరువాత సంవత్సరం, సంవత్సరం పితృ కార్యములు జరిపించుట కేవలమున్నూ అనవసరమని హెచ్చరిస్తూ యున్నాను. నా పేరు జెప్పి ఏ బ్రాహ్మణుణ్ణో మేపిన గాని, నాకు ఆ లోకములలో భుక్తి గడవదని మీరు భ్రమపడుట కేవలమూ పొరపాటు. ఈ నా భౌతిక కాయాన్ని విసర్జించిన వెనుక నాకు అన్నమూ, నీరూ అవసరముండదని నాకు నిశ్చయముగా తెలుసును. అదియునుగాక, అధవా అటువంటి అవసరమే నాకు గనుక ఏర్పడినట్లయితే, నా పొట్ట ఎలాగైనా నింపుకో గల చాకచక్యం నాకు కద్దనిన్నీ, అందుకని మరెవరున్నూ ఆత్రపడవలసిన అవసరం లేదన్నీ యిందుమూలముగా హెచ్చరిస్తూయున్నాను.

ఇహ నాకు గల స్థిర చరాస్తు లన్నియూ నా స్వార్జితము లేనని ముందే ఉదహరించి యున్నాను. నగదు రూపంలో నున్నూ, వెండి బంగారం రూపంలో నున్నూ, ప్రాంసరీ నోట్లు, తణఖా దస్తావేజుల రూపంలోనున్నూ నా ఇనుపపెట్టెలో ఉన్నటువంటిన్నీ, బ్యాంకులలోనున్న ఫిక్స్‌డ్ డిపాజిటులున్నూ, యావత్తున్నూ మా అల్లుడుగారైనటు వంటిన్నీ, లేటు వెంకటప్పయ్య బావగారి ద్వితీయ పుత్రుడైనటు వంటిన్నీ చిరంజీవి సూర్యభగవాన్లు, సాకీనుపల్లె పాలెంగారికి నా మరణానంతరం చెందగలందులకు నిర్ణయం. నా స్థిరాస్తి, ఈ దిగువ షెడ్యూలు దాఖలా, ఆవులపాలెం గ్రామ తాలూకు అరవై నాలుగెకరాల మామిడితోటయున్నూ, వేములదీవి గ్రామం తాలూకు నలభైమూడు యకరముల ముప్పై ఆరు సెంట్ల విస్తీర్ణముగల జిరాయితీ మెర్కయున్నూ, ఇరవై ఆరు యకరముల విస్తీర్ణము గల పల్లమున్నూ కూడా సదరు అల్లుడుగారికే చెందగలందులకు నిర్ణయం. ఈ స్థిరాస్తి యావత్తున్నూ సదరు అల్లుడుగారు దాన విక్రయ సత్తాధికారములతో, వారి ఇష్టానుసారము, పుత్ర పౌత్ర పారంపర్యముగా అనుభవింపవలెను. సదరు ఆస్తిమీద వచ్చే ఐవేజులో ఒక్క నా భార్య అయిన చి॥ సౌ॥ వెంకటచాషమ్మ (ఆమె బ్రతికినంతకాలం) పెట్టుపోతలు జరుపుటయు, పైన ఉదహరించిన ప్రకారం నా అంత్యక్రియలు జరుపుటకున్నూ తప్ప,

మరి ఇంకే విధమైన నా సంబంధమైన ఖర్చులకూ వినియోగింపవలదని అల్లుడుగారిని హెచ్చరిస్తూ యున్నాను.

మా అమ్మాయిన్నీ, చిరంజీవి సౌభాగ్యవతి అయినటువంటిన్నీ సత్యవతికి సదరు ఆస్తి పంపకపు ఏర్పాటు కొంత మనస్తాపము కలిగించిననూ, ఆమె మంచి మనసులో ఉంచుకునే ఇటువంటి ఏర్పాటు చేసియున్నావనని దైవ సాక్షిగా చెపుతూ యున్నాను. అసలు ఆడువారికి ఆస్తిలో భాగము కల్పించి సర్కారువారు సంఘానికి అపచారము చేసి యున్నారని నా విశ్వాసము. సంసారము సక్రమంగా జరుగవలెనూ అంటే ఆర్థికమైన అధికారం యావత్తూన్నూ ఇంటికి యజమాని యైన మగవానిచేతిలో ఉండక తప్పదు. ఆ సిద్ధాంతములో నాకున్న విశ్వాసమును పురస్కరించుకుని నేనిటువంటి ఏర్పాటుచేసి యున్నానేగాని, నాకు అమ్మాయిమీదకంటే అల్లుడుగారి మీద అనురాగము ఎక్కువ ఉన్నదని ఎంత మాత్రమునూ అర్థము కాదు. సదరు విషయమును విపులీకరించి అమ్మాయి కాపురంలో ఈ ఆస్థి మూలకమైన కలతలు ఏర్పడకుండా కాపాడుట నా విద్యుక్త ధర్మము గాన, ఆమె నుద్దేశించి ఈ క్రింది పేరాల దాఖలా యావత్తు విషయములూ వ్రాయించడమైనది.

చి॥సౌ॥ అమ్మాయి సత్యవతీని పుత్ర పౌత్రాభివృద్ధిగా ఆశీర్వదించి చెప్పుచున్న విషయములు.

నీకుగల బుద్ధి కుశలత, పెంకితనము, పట్టుదల, చూచినప్పుడల్లా నీవు కుమార్తెవు గాక కొడుకువై పుట్టియుండినట్లయితే – నన్ను మించినటువంటి వ్యవహర్తవై యుండేవాడవని నాకనిపిస్తూ యుంటుంది. అయితే అంత సన్నిహితులైన ఇద్దరు మేధావుల మధ్య పొత్తు కుదురుట కష్టమని కాబోలు భగవంతుడు నిన్ను కుమార్తెను జేసియున్నాడు. ఏమైననూ దైవ నిర్ణయమును గురించి తర్జనభర్జనలు చేయుట చాలా అవివేకము.

ఇహ :

ఆస్థి యంతయు నీ భర్త పేర వ్రాసిన కారణము నేను ముందుగా వివరించియే యున్నాను. తత్కారణముగా నీకున్నూ నీ భర్తకున్నూ మధ్య ఎటువంటి మనస్పర్థలు ఏర్పడినా అది కేవలమూ దురదృష్టమని అనుకోవలెను. ఎందుకంటే, నీవు ఇంకనూ మైనారిటీ దాటకముందే, నా ఇష్టమునకు వ్యతిరేకముగా నీ మేనమామగారి కుమారునితో పారిపోయి, ఎదురు మేనరికమని అయినా చూడక అతన్ని వివాహమాడి యున్నావు. అదియును గాక, ఈనాటి వరకున్నూ నన్నుగాని, నా ఇంటి ముఖము గాని చూచుటకై నను రాక, నీ భర్త మాటకు కట్టుబడి ప్రవర్తిస్తూ యున్నావు. అయితే నా అహంకారమును దిగమ్రింగి నీ మీద నాకున్న మమకారం వల్ల యెన్నో మారులు నిన్ను చూచుటకు రావలెనని

తీర్మానించుకుని కూడా, ఒక్క మీ అమ్మనే పంపి, నేను రాలేకపోవుటకు కారణము నీకున్నూ తెలుసుననుకుంటూ యున్నాను. నీ వివాహము వలన నాకు ఏర్పడ్డ కావేషీలు కారణంగా నేను, నీ మామగార్లున్నూనాకు బావమరుదులున్నూఅయిన సత్యనారాయణ వగైరాల మీద కక్ష వహించి వారి అన్నదమ్ముల మధ్య మనస్పర్థలు రేకెత్తించి వారి ఆస్తి యావత్తున్నూ లావాదేవీల ద్వారా హారతికర్పూరం వలె హరించిపోవునట్లు చాయుటయున్నూ, ఆ పగ మనస్సులో పెట్టుకుని, నేను వారి ఇంట శుభకార్యమునకు చుట్టపు చూపునకు పోగా, వారందరూ నన్ను కొట్టి, చచ్చిపోతినని భ్రమపడి నన్ను బ్రహ్మజెముడు డొంకలో పారవేయుటయున్నూ, నేను ఆ గాయముల తోటే రేవు దాటి సరాసరి కాకినాడ సర్కారు ఆసుపత్రి చేరుకుని సదరు గాయములకు గాను సర్టిఫికట్టు పొంది నీ పినమామగార్ని జైలుకు పంపుటయున్నూ మొదలుగా గల విషయములన్నియున్నూ నీకూ తెలిసినవే కావడం చేత తిరిగి చెప్పవలసిన అవసరం లేదు. అయితే అల్లుడుగారికిన్నీ, నాకున్నూ ఈనాటి వరకున్నూ మాటామంచీ లేకపోయిననూ, ఆస్తి ఆయన పేర వ్రాయుట కేమి కారణమని నీవు అడగవచ్చు. అల్లుడుగారు ఆస్తిని కాపాడుకోగల సమర్థులని నాకు రుజువైన కారణం మొదటిది. వారి పినతండ్రుల ఆస్థులన్నీ అన్యాక్రాంతమై పోయినప్పటికిన్నీఆయన మాత్రం బహు చాకచక్యముతో తన వాటాను కాపాడుకున్నా డన్న గౌరవం నాకు లేకపోలేదు. అంతకంటే కూడాయున్నూ బలమైన కారణము మరొకటియున్నది. సామాన్యముగా మనిషైపుట్టిన ప్రతివాడున్నూ చేసేటటు వంటి మహా చెడ్డ పొరబాటొకటి యున్నది. తన బిడ్డ అల్లరి చేసిననూ ముదికబుర్లు ఎంత అసహ్యకరముగా చెప్పిననూ, అవియన్నియున్నూ ముద్దుగా పరిగణించి, ఇరుగు పొరుగువారి బిడ్డలు అవే పనులు అంతకన్న తక్కువగా చేస్తూయున్నా సదరు చేతలను పెంకితనముగా పరిగ్రహించుట సామాన్యముగా ప్రతి తండ్రికిన్ని అలవాటు. అదేవిధముగా తన మిత్రుల యందున్నూ తన యందున్నూ ఉన్న వ్యవహార దక్షతకు లౌక్యమనిన్నీ అద్భుతమైన చాకచక్యమనిన్నీ పేర్లు పెట్టుకుని, అదే లక్షణము తన శత్రువులయందు న్నట్లయితేనున్నూ, దానిని దౌర్జన్యముతో లెక్కపెట్టుట మానవుల యందున్న మహా లోపము. నీకే మాటలు వచ్చినది మొదలు, సదరు అల్లుడుగారితో నీవు పారిపోయిన తేదీవరకూ, నా ఇష్ట ప్రకారం నీవు నడుచుకునేలాగు, ఒక్క నిముషములో నైనను బాయలేకపోయినానని నాకే తెలుయును. లోకమును జయించానని గర్వపడుతూ వున్న నన్ను నా ఇంట్లో అతి సులభముగా ఓడించి ఇంటి యజమానినైన నాకే నీవు యజమానివైనావు. నీకు ఏడెనిమిది ఏళ్ళ వయస్సులో ఒకనాడు సాయంకాలం నీకు కడుపునొప్పి వస్తుందేమో నన్న భయం వల్ల ముంజెకాయలు నిన్ను తినవద్దన్న కారణంగా చేతికందిన కీతకత్తి నా పైన నీవు విసురుటయు, అది దైవవశాత్తూ

కేవలం నాకీభూమి మీద ఇంకా నూకలు మిగిలి యుండుకున్న కారణంగా తలవెంట్రుక వాసిలోనా మెడతప్పి భుజాన్ని ఒరసికొని పోవుటయూ ఆ గాయము తాలూకు నా బాధ కోపముగా మారకముందే నీవు ఆ వయస్సులోనే అతి చాకచక్యముగా, ఆడువారి వరప్రసాదమునూ, తిరుగులేని ఆయుధమున్నూ అయిన ఏడుపును, ఊపిరితిత్తుల బలమంతయు వినియోగించి నాపైని ప్రయోగించుటయున్నూ, ఇంత మనిషినైన నేను సదరు సందర్భములో కింకర్తవ్యతా మూఢుడనై, నా గాయమునకు తువ్వాలు చుట్టబెట్టి, నీవు విసరిన కీతకత్తితోనే నీకు ముంజెకాయలు చెలిగి యిచ్చే వరకున్నూ నీవు ఏడుపనే బ్రహ్మాస్త్రమును ఉపసంహ రింపక పోవుటయున్నూ, నీవు మరచిననూ నేను మాత్రం మరిచిపోలేదు. ఇటువంటి సందర్భములు ప్రతి దినమునూ సామాన్యముగా జరుగుతూయున్నా, నిన్ను మాత్రము ఏమియు చేయలేక అనేకమార్లు ఓటమిని అంగీకరించి యున్నాను. నిన్ను నేను సదరు సందర్భములలో ముద్దు ముద్దుగా 'రాక్షసీ' యని సంబోధించినది నిజముగా నా మనస్సులో నీ యెడల ఉండుకున్న అభిప్రాయమని ఇప్పుడు బాహాటముగా చెప్పిననూ ఫరవాలేదు గనుక చెప్పుటకు నిర్ణయం. నిన్ను రాక్షసీగా ఇన్నాళ్ళూ అనుకుంటూ యున్నానని నేను చనిపోయి సురక్షితమైనంత దూరానికి పోయిన వెనుక, నీకు తెలిసిననూ, నాకు అపాయము లేదు గనుకనున్నూ నీ ఆప్తులు కూడా నిన్ను గురించి ఈ విధముగా అనుకుంటూ యున్నారని నీకు తెలియుట, నీ భావి జీవితమునకే మంచిది గనుకనున్నూ, సదరున ఉదహ రించితిని. ఇంత రాలుగాయి, పెంకిఘటమైన నిన్ను (నేనా విధముగా నిన్ను వర్ణించుట నీకు తృప్తికరముగా యుండదని నాకు తెలిసియున్నూ, చెప్పవలసిన విషయమును మాటున బెట్టి, అర్థమును మరుగు పరచినచో ఏమియున్నూ ప్రయోజనము లేదు గనుక ఇంత స్పష్టముగా చెబుతూ యున్నానే గాని, నీమీద నాకుండుకున్న మమకారము కొరతవడినదని నీ వనుకొన నక్కరలేదని స్పష్టం చాయడమైనది) అతి సునాయాసముగా దాసురాలిని చేసుకుని, నేను యెన్నడూ చేయజాలనటువంటి కార్యమును అల్లుడుగారు సాధించారన్న మిక్కిలిన్నీ మెచ్చుకోలు ఆయన యందు నాకు కలుగుట చేతనున్నూ, నా కన్నా ఘటికుడని రుజువైన కారణము చేతనున్నూ, నిన్ను జయించిన తరువాత లోకమును సునాయాసముగా ఆయన జయించగలరన్న విశ్వాసము ఏర్పడుట వలనున్నూ, నా యావదాస్థియున్నూ ఆయనకు సంక్రమించవలయు నని నిర్ణయం.

మరొహ విషయం :

నీవొకమారు ఉత్తరం వ్రాస్తూ – నీ వద్ద నుండి నాకు వచ్చిన ఉత్తరాలు రెంటిలో రెండవది – నేను పిత్రార్జితమైన ఆస్థినంతనూ క్రమంగా అమ్మివేస్తూ, ఆ సొమ్ముతోనే


వేరే భూములు కొని స్వార్జితమని చెప్పుకుంటూ యున్నాననిన్నీ, సదరు పన్నాగము, నిన్నూ నీ భర్తనూ మోసగించి నా అనంతరము మీకు రావలసిన ఆస్తి మీకు రాకుండా చేయుట కొరకే చేస్తూ యున్నాననిన్నీ వ్రాసియున్నావు. ఒకవేళ అటువంటి అభిప్రాయమే నాకున్ననూ, నేనా విధముగానే చేసియున్న ప్పటికిన్నీ – ఈ విధముగా అంటూ యున్నానని నేను సదరు నీ అభిప్రాయమును అంగీకరిస్తూ యున్నానని ఎంతమాత్రమును ఆశపడవలదని హెచ్చరిస్తూ యున్నాను – అలా చేసి యున్నప్పటికిన్నీ, మీరెవరుగాని ఆ విషయం రుజువు పరచలేరు. ముందు ముందు నీవు ఎప్పుడైనా అల్లుడుగారి మీద ఆగ్రహించి, నేను వారికి సంక్రమింప జేసిన ఆస్థి అసలు పిత్రార్జితము గావున, నీకు చెందవలసినదని, దురదృష్టవశాత్తూ లిటిగేషనులలోకి దిగదలచినచో, నీ ప్రయత్నము ఎన్నడూ ఫలించదని నీవు తెలుసుకోవలెను. అటువంటి అవాంతరమును ఎదుర్కొనుట కున్నూ, నీ వాదమును నిమిషములో త్రోసిపుచ్చుటకున్నూ, సదరుఆస్థి నా స్వార్జితమని రుజువు పరచుటకున్నూ బలమైన సాక్ష్యము, నీకు తెలియకుండా అల్లుడిగారి ఆధీనములో ఉంచుతూ యున్నానని నిన్ను మరీమరీ హెచ్చరిస్తూ యున్నాను. అటువంటి పొరపొచ్చము లేవీ నీ కాపురములో రాకుండా యుండుటకే నేను ఈ విధమైన కట్టుదిట్టము లన్నిన్నీ చేసియున్నానని నీకు వేరే చెప్పవలసిన అవసరము లేదు.

ఇది నా స్వబుద్ధిని వ్రాయించుకున్న వీలునామా.



# ఇల్లిందల సరస్వతీ దేవి

**(1918 - 1998)**



**సాం**ఘిక రాజకీయ రంగాలలో పనిజేస్తూ సాహితీ క్షేత్రంలో విశిష్ట స్థానాన్ని ఆక్రమించుకున్న విదుషీమణి. లోక స్వరూప స్వభావాలను గ్రహించిన రచయిత్రి. మానవత్వవే జీవిత మాధుర్యానికి ప్రధానము అనే దృష్టి వీరి రచనల్లో ద్యోతకమౌతుంది. హైద్రాబాదులో నివసించేవారు.

**రచనలు :** అక్కరకు వచ్చిన చుట్టము, ముత్యాలమనసు, పండుగ బహుమానం మొదలగు కథల సంపుటాలు, పెక్కు వ్యాసాలు.

# ముత్యాల మనసు

ముత్యాలు తల్లివెంట తిరుగుతూ "అమ్మా! దీనిమీద ఎక్కుతానే" అంటూ కుర్చీ ఎక్కబోయాడు.

"అమ్మగారు చూస్తే తంతారు. దిగు దిగు" పిల్లవాడిని దించి తన పనిమీద అవతలకి వెళ్ళిపోయింది వెంకటి.

తల్లిని వెళ్ళనిచ్చి – ముత్యాలు తనకు సరిపోయినట్లుగా కనబడ్డ ఆ చిన్న కుర్చీ మీద కూర్చుని – కాళ్ళు నేలకు తాకేట్లుగా ముందుకు జరిగి – చేతులు రెండూ కుర్చీ చేతులమీద పెట్టి తనను తాను చూచుకొని – తల ఇటూ అటూ తిప్పి చూశాడు. తన సంగతి ఎవరూ చూడలేదన్న ధైర్యముతో బాగా సర్దుకొని కుర్చీలో వెనుకకు జరిగి కూర్చున్నాడు. కాలిమీద కాలు వేసుకొని విలాసముగా ఊపుతూ ఒక్కసారి తల పైకెత్తాడు. ముత్యాల కెదురుగా గోడ దగ్గర ముత్యాలు కూర్చునటువంటి కుర్చీలో – వాడివంటి పిల్లవాడే కూర్చున్నట్లుగా కనబడ్డది. సరిగ్గా వాడి చొక్కాముత్యాలు వేసుకున్న దాని మాదిరిగానే ఉన్నది. బుజముమీద చినుగూ అదీనూ, ముందు భాగమంతా నల్లగా మాసిపోయి అట్టకట్టి ఉన్నది. వాడి ముఖము, తల జుట్టూ అంతా ముత్యాలులాగే ఉన్నాడు. ముత్యాలు తననూ వాడినీ పరకాయించి చూస్తూ పోల్చుతూ తన దేహాన్ని తడిమి చూసుకుంటూ ఆశ్చర్యపడిపోతున్నాడు.

ముత్యాలుకు కలిగిన ఆశ్చర్యము కౌతూహలము క్రిందికి మారటానికి ఎంతోసేపు పట్టలేదు. కుర్చీమీద నుంచి లేచి, మెల్లగా అడుగులు వేస్తూ, ఆ పిల్లవాడి దగ్గరికి బయలుదేరాడు ముత్యాలు. ఇట్లా రెండు అడుగులు వేశాడో లేదో, ఎదుటి పిల్లవాడు ఆ సంగతి గ్రహించినట్లే ఉన్నాడు – లేచి, ముత్యాలు కెదురుగా వస్తున్నాడు. ముత్యాలు ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. మనసు జంకుతున్నా, ధైర్యముచేసి ముందుకు అడుగులు వేశాడు ముత్యాలు. తీరా అక్కడికి చేరుకుంటుండగా వాడి ఆశ్చర్యము మరీ ఎక్కువైపోయింది. ఆ

పిల్లవాడు మొదలు అంత ధైర్యముగా బయలుదేరాడు గాని, తీరా ముత్యాలు తన దగ్గరకి వచ్చేసరికి తళతళలాడుతున్న గోడకు అంటుకొని పోయాడు; అయినా అదలించి చూద్దామని ముత్యాలు చెయ్యి ఎత్తాడు. దానికి జవాబుగా వాడూ చెయ్యి ఎత్తాడు. ముత్యాలు దించగానే వాడూదించాడు. తాను నవ్వితే వాడూ నవ్వుతున్నాడని ముత్యాలుకు అక్కసు కలిగి చేత్తో పట్టుకోబోయినాడు. కాని, వాడు అందలేదు.

ముత్యాలుకు చాలా ఆశ్చర్యము కలిగింది. ఆ గోడలో ఈ పిల్లవాడే కాదు. ఆ గదిలో ఉన్న మంచాలు, కుర్చీలు, బల్లలు, ఉయ్యాల అన్నీ కనబడుతున్నాయి. బట్టలు మడత వేస్తూ అటు తిరిగి నిలబడిన తల్లి కాలి దగ్గర్నుంచి తల వరకూ కనబడుతున్నది; ముత్యాలు మనసు ఆశ్చర్యముతో, ఆనందముతో గంతులు వేసింది. వాడు పకపక నవ్వుతూ ఎడమచేతి వైపుగా వెళ్ళి అక్కడ చిన్న గోడకు ఉన్న జాలీగుండా కిందికి చూశాడు. పెద్ద తోటా, ప్రహరీగోడ నానుకొని వున్న ఓ చిన్న గదీ కనబడ్డాయి. ఆ గదిలో కటిక చీకటి, సన్నటి నూనె దీపము గాలికి కదులుతూ వుంటుంది. ఈ గది ఎంత బాగుందో? నున్నటి నేల, నేలమీద పరచిన రంగు రంగుల చాపలు, వాటిమీద నడుస్తుంటే ఇంకా నడవాలనిపించింది. ఆ మంచము ఎంత చక్కగా వున్నదో?"

హఠాత్తుగా ముత్యాలు ముఖం ముడుచుకొని పోయింది. తన తల్లి ఆ వెధవ గదిలో చింకిచాపమీద బొంత గుడ్డ ఒకటి పడేసి పడుకోమని ఒక్క కేక పెడ్తుంది. ఆ వాసన కొట్టున్న బొంతమీద కళ్ళ నీళ్ళు కారుస్తూ కళ్ళు మూసుకొని పడుకోవాలి. నాయన కూడా పడుకోమని కేక పెడ్తూనే ఉంటాడు.

ముత్యాలు మెల్లగా అక్కడ నుంచి లేచి మంచము దగ్గరకి వెళ్ళిదాని మీద పరచిన దుప్పటి మీద చెయ్యివేసి తాకి చూశాడు. అది వాడి బొంతనూ, చొక్కాను తాకినట్టుగా కూడా లేదు. వాడి తండ్రి వేసుకునే ఖాకీబట్టలు తాకినట్టుగా కూడా లేదు. చేతికెంతో మెత్తగా తాకింది. వాడికెంతో బాగనిపించింది. మళ్ళీ మళ్ళీ తాకుదామనిపించింది. "అబ్బ: ఏమిటి.... ఎంత మెత్తగా తాకుతున్నది?" అనుకుంటూ కనుబొమ్మలు పైకెత్తాడు. వెంటనే వాడికేమనిపించిందో, ఆ మంచమెక్కి రెండు కాళ్ళూ చాపి వెల్లకిలా పడుకొని, సంభ్రముకొద్దీ కళ్ళు మెరస్తూండగా, వాడిలో వాడే అనుకుంటున్నాడు : "ఇంత బాగున్న మంచము మీద తనను పడుకోబెట్టకుండా ఆ వెధవ చింకిచాపమీద పడుకోబెట్టుతుందేం తన తల్లి; అంతచెడ్డ దేమిటి?"

ముత్యాలు బాగా ఆలోచించి నిశ్చయించుకున్నాడు. "ఏమయినా సరే – తానా మంచము మీద పడుకోవలసిందే! ఇక తానెప్పుడూ ఆ చింకిచాపమీద పడుకోడు. వాసన కొట్టుతున్న ఆ బొంతను చేత్తో అయినా తాకడు."

"ఆరివెధవా! అమ్మగారు చూస్తే తంతారు. దుప్పటి నలిగిపోయింది. లే" అని వెంకటి గదమాయించి రెక్కపట్టి కిందికి లాగేవరకూ ముత్యాలుకు ఆ ఊహే పోలేదు. "నేను దాని మీదనే పడుకుంటాన"ని ముత్యాలు మళ్ళీ మంచము ఎక్కబోయాడు. వెంకటి చెయ్యిపట్టి ఇవతలికి లాగి "తప్పు తప్పు! నాయన పిలుస్తున్నాడు కిందికిపో" అని ఒక్కతోపు తోసింది. ముత్యాలు కెవ్వుమన్నాడు. వాడికి అక్కడి నుంచి వెళ్ళాలని లేదు. మళ్ళీ మంచము వైపుకు దారి తీశాడు.

అంతలో "వెంకటీ" అన్న పిలుపు వినబడ్డది. వెంకటికి తొందర ఎక్కువైంది. ముత్యాలు తన మాట విననందుకు కోపం వచ్చింది. యజమానురాలు చూస్తే ఇంకేమయినా ఉన్నదా? బాబును నిద్రపుచ్చే వేళ కూడా అయింది. బాబు చికాకు చేసుకొని కేకలు వేస్తున్నాడు. వెంకటి కోపముతో, ఆదుర్దాతో, "కిందికి పో వెధవా" అన్నది. తల్లి అంతగా ఎందుకు కోపము చేస్తున్నదో ముత్యాలు కర్థము కాక నిలబడిపోయాడు. యజమానురాలు మళ్ళీ పిలవటములో వెంకటికి తొందర ఎక్కువై వాడి తలమీద దెబ్బవేసి అక్కడినుంచి వెళ్ళిపోయింది.

ముత్యాలు తలను తడిమి చూసుకుంటూ ఏడవటము మొదలు పెట్టాడు. అంతలో తండ్రి ఎటునుంచి వచ్చాడో మరో రెండు దెబ్బలు తగిలించి చెయ్యి పట్టుకొని ఈడ్చుకు వెళ్ళాడు.

ఆ మరుసటి ఉదయము ముత్యాలు నిద్రలేవగానే తల్లి ఎప్పటివలె కనపడలేదు. "లేవరా ముత్తిగా!" అని తండ్రి గదమాయించాడు. ముత్యాలుకు ఏడుపు వచ్చింది. "పెద్దమ్మగారి ఊరునుంచి ఇక్కడికి వచ్చినప్పటి నుంచీ అమ్మా నాయన తననిట్లానే గదమాయిస్తున్నారు. ఆ చీకటిగది దాటి బయటికి రానివ్వరు. ఎంతసేపయినా అక్కడే కూర్చోవాలి. పెద్దమ్మగారి ఊళ్ళో చల్లగాలికి చెట్లకింది పిల్లలతో గోలీలాడుతుంటే ఎంత బాగుండేది?" అనిపించింది ముత్యాలుకు.

అంతలో తండ్రి మళ్ళీ తన దగ్గరకి రావటము ముత్యాలు కంటబడ్డది. మెల్లగా లేచాడు. తండ్రి బలవంతముగా ఈడ్చుకొని పోయి ముఖము కడిగించి, ఒక గిన్నెలో పట్టెడన్నము కారపుముద్ద పడేసి ముందు పెట్టాడు. కళ్ళనీళ్ళతో తండ్రి మీద కోపము కొద్దీ ముత్యాలు ఒక ముద్ద నోట్లో పెట్టుకోగానే దగ్గు వచ్చింది. "కుండలో నీళ్ళు ముంచుకొని తాగరా వెధవా!" అని కసిరాడు తండ్రి. భయముకొద్దీ ఆ నాలుగు మెతుకులూ తిని యిన్ని నీళ్ళు తాగాడు ముత్యాలు.

"ఇక్కడే వుండు, కదలకు" అంటూ తండ్రి ఖాకీచొక్కా వేసుకొని తోట వైపుకు వెళ్ళిపోయాడు. ముత్యాలు చేతిగోళ్ళు కొరుక్కుంటూ ఆ గడప మీద కూర్చున్నాడు.

మేడమీద వరండాలో తల్లి బాబును ఎత్తుకొని బిస్కట్లు తినిపిస్తూ బొమ్మలు చూపిస్తూ తిరుగుతున్నది. అది చూచి ముత్యాలు ఆత్రముతో "అమ్మా అమ్మా" అని కేకపెట్టాడు. వెంకటి ఇటువైపు చూడనన్నా లేదు. బాబుచేతిలో ఉన్న బిస్కట్టుముక్క చూడగానే ముత్యాలుకు తాను తిన్న కారపు మెతుకులు జ్ఞాపకము వచ్చాయి. 'అప్పుడు తల్లి దగ్గరవుంటే ఆ బిస్కట్టు ఇచ్చేదేమో?' ముత్యాలుతల్లిదగ్గరకి వెళ్ళాలని బయలుదేరుతుండగా, తండ్రి రానేవచ్చాడు. "ఎక్కడికిరా వెళ్ళేది?" అని మళ్ళీ వెనక్కి లాగి గదిలోకి నెట్టాడు.

వారము రోజుల తరువాత ముత్యాలుకు జ్వరము తగిలింది. పిల్లవాడిని చూసి పొమ్మని వెంకటికి ముత్యాలు తండ్రి చెప్పి పంపాడు. క్రమం తప్పకుండా అన్నీ పనులూచేసి వెంకటి మధ్యాహ్నపు వేళకి ముత్యాలును చూడటానికి వచ్చింది. ముత్యాలు మేలుకొనే వున్నాడప్పుడు. తల్లిని చూడగానే "నీ వెంట వస్తాన"ని ఏడుపు సాగించాడు. "వద్దురా, నీవు రాకూడదు" అంటూ వెంకటి ఎంత చెప్పినా ముత్యాలు ఏడుపు మానలేదు. బాబు ఏడుపు విని వెంకటి వెళ్లిపోయింది. తండ్రి దగ్గర కూర్చొని కళ్ళు తుడిచి చాపమీద ముత్యాలును పడుకోబెట్టాడు. కళ్ళ నీళ్ళతో ముత్యాలు మేడవైపు చూశాడు. బాబుని ఎత్తుకొని తన తల్లి నిలబడ్డది. బిస్కట్టు తినిపిస్తూ ముద్దు పెట్టుకుంటున్నది.

ముత్యాలు మనసు భగభగ మన్నది. ఏడుపు పెద్దది చేసి లేచి కూర్చున్నాడు. తండ్రి మంచి మాటలతో ఎంత చెప్పినా వినలేదు. ఏడుపు మానలేదు. అతడికి విసుగుపుట్టి వీపు మీద అయిదువేళ్ళూ అంటేటట్టుగా కొట్టాడు. ఆ జ్వరపు ఒంటిమీద అయిదువేళ్ళూ వాతలు తేలాయి.

ఆరేళ్ళు నిండీనిండని ముత్యాలు మనసులో ఆ వూరు వచ్చిననాటి నుంచి ఒక విషయము కెలకవేస్తూ వచ్చింది. 'పెద్దమ్మ గారి ఊళ్లో వున్నప్పుడు తల్లి తనను ఎత్తుకొని తిరిగేది. దగ్గరతిరిగేది. దగ్గర పడుకో పెట్టుకొనేది. ఇక్కడికి వచ్చిన దగ్గర నుండీ తన నా చీకటి గదిలో పడేసి, వాళ్ళ బాబును ఎత్తుకుంటున్నది. తనని దగ్గరికైనా రానివ్వటం లేదు. తన కా చింకిచొక్కా తప్ప మరొకటి వెయ్యటములేదు. బాబుకు మంచి బట్టలు వేస్తున్నది. ఆ బాబును ముద్దు కూడా పెట్టుకుంటున్నది. తనను నాయనా, అమ్మా ఇద్దరు ఒకటే కొట్టటము మొదలు పెట్టారు. ఎందుకని?'

ముత్యాలుకు ముఖ్యముగా ఆ ఊరు నచ్చలేదు. తనతో కూడా ఆడుకొనే పిల్లలు అక్కడ లేరు. 'ముత్తిగా' అని ముద్దుగా పిలిచే తల్లి 'వెధవా' అంటున్నది.

ముత్యాలుకు తన పెద్దమ్మ గారి ఊరి తోవ తెలియదు. కాని, అక్కడ నుంచి ఎనిమిది రోజులు నడిచి రావటము మాత్రము జ్ఞాపకమున్నది.

ముత్యాలు ఒంటిమీద జ్వరము జారలేదు. తండ్రి తోట పని చేసుకుంటూ ముత్యాలును చూస్తున్నాడు. వెంకటి బాబు నిద్రపోయినప్పుడు మాత్రము వచ్చి చూసిపోతున్నది – అది కూడా ముత్యాలు కన్ను మూసినప్పుడే. మెలకువగా వుంటే ముత్యాలు తల్లిని విడువడు గదా!


అప్పటికి ముత్యాలు తల్లిని చూసి నాలుగురోజులైంది. సాయంత్రపు వేళ తండ్రి చెట్లకు నీళ్ళు పోస్తున్నాడు. ముత్యాలు మెల్లగా లేచాడు. మేడమీదికి ఒకసారి చూశాడు. తల్లి కనపడలేదు. తలుపులు బాగా తెరచిన గేటును చూడగానే ముత్యాలు అడుగు ముందుకు పడ్డది. జ్వరపు ఒంటితో ఒక వీధి – రెండవ వీధి – క్రమముగా దాటిపోతున్నాడు. జ్వర తీవ్రత చేత ముత్యాలు శరీరము తూలిపోవటము మొదలుపెట్టింది. మూడవ వీధిలోకి రాగానే కళ్ళు చీకట్లు కమ్మినట్ల యినది. కాళ్ళు తడబడిపోయి, రోడ్డు ప్రక్కగా వున్న తూములో జారిపడ్డాడు. మరో రెండు నిమిషాలకు సారా బట్టీలో నుంచి పొగలు గక్కుతున్న వేడి నీళ్ళు ఆ తూముగుండా ప్రవహించాయి.

చీకటి పడ్డ తరువాత వెంకటి అబ్బాయి గారిని యెత్తుకొని ముద్దులాడుతూ వుండగా ముత్యాలు కోసము తండ్రి వీధి వీధి వెతకటము మొదలు పెట్టాడు.



# బుచ్చిబాబు

**(1916 - 1967)**



**వి**శిష్టమైన సాహితీ వ్యక్తిత్వం గల కథకుడు. అసలు పేరు శివరాజు వెంకట సుబ్బారావు. వస్తు స్వీకరణలోనూ, కళాత్మకంగా చిత్రించడానికి తగిన రచనా విధానాన్ని అవలంబించడంలోనూ, కవికి మించిన భావావేశం, శక్తివంతమైన పద చిత్రాల ద్వారా ప్రస్ఫుటం చేయడం లోనూ, జీవిత సమస్యలనూ, మానవ ప్రకృతినీ తర్కించి, చర్చించడంలోనూ, కొత్త నిర్వచనాన్ని సృష్టించడంలోనూ, లౌక్య ప్రధానమైన హాస్యాన్ని మేళవించడంలోనూ, బుచ్చిబాబుగారు క్రొత్తదారులు తొక్కారు. కథా రచనలో 'చైతన్య స్రవంతి' ప్రక్రియని తెలుగులో ప్రథమంగా పరిచయం చేశారు. హైద్రాబాద్ ఎ.ఐ.ఆర్.లో పని చేసేవారు.

**రచనలు :** బుచ్చిబాబు కథలు - 4 సంపుటాలు. చివరకు మిగిలేది (నవల) ఆత్మ వంచన (నాటకం) బాల నాటికలు, వ్యాసాలు.

# కాగితం ముక్కలు, గాజు పెంకులు

వెనక తగిల్చిన పాత రైలు పెట్టెలను లాక్కొచ్చి వాళ్ళ ముందు గిరవాటెట్టింది కొత్త రైలింజన్. బ్రతుకంతా భ్రమ అనుకొని మడి గట్టుకొని మూల కూర్చుని పెదవి చప్పరించే వారికి యీ కొత్తింజన్ ఒక సవాల్. భీకరమైన కూత – ఎక్కడో భూమిని దొల్చుకొని, గోళం మధ్యలో కాలం బంధించిన ప్రళయాన్ని కదిపి, ఆ ధ్వనుల్ని తనలో జీర్ణించుకుని గతంలోంచి ప్రాణాన్ని తెచ్చుకున్న వొక చారిత్రక కళేబరం ఆ ఇంజన్. దాన్ని చూస్తే రైలు నడిపే వారికీ, ప్రయాణీకులకీ కూడా భయమే. కావాలనుకున్న రైలు ఆలస్యంగా రావడానికి వీలు చిక్కనీదు ఆ ఇంజన్. అసలు నాలుగైదు నిముషాలు ముందే వెళ్ళి కూర్చుంటుందిట. రైల్వే వారి కదొక సమస్య. ప్రయాణీకులు ఎల్లానో అల్లా దానిలో వెళ్ళి పడాలి. తీరుబడిగా, తాపీగా, నిశ్చింతగా, ప్రవర్తించ గూడదు. అది రావడం, వెళ్ళడం కూడా ఒక స్వప్నం లాంటిదే. అది కదలడం, వేగంగా కదలడం రెండూ ఒకటే. మెల్లిమెల్లిగా వేగాన్ని పెంచుకోడం అంటూ లేదు.

“ఈ కొత్తింజన్‌కి తలకాయ లేదు కాదూ – నాలా” అన్నాడు నరసింహం పెట్టెలో సామాను పడేసి. చంద్రానికి నవ్వొచ్చింది. అవును. నరసింహానికి పెద్ద తల, పెద్ద మెడ; మెడ, మొహం కలిసిపోయినట్లు వొక స్తంభం లాగుంటై. తల పెద్దదిగా వుంటే, మెడ సన్నదిగా కనపడుతుందని, చదువుకొనే రోజుల్లో జుట్టు పెంచేవాడు. పెద్ద ఉంగరాల జుట్టు. విచ్చల విడిగా పెరిగి నుదిటి మీద, కళ్ళల్లోనూ పడుతూ, వెనక్కి తోసినప్పుడల్లా చేతులకు పని చెబుతూ, మనిషి భీకరంగా ఉండేవాడు. అందరూ “సింహం” అని పిలిచేవారు. మరిప్పుడో – ఆ జుట్టు లేదు. ఆర్మీలో ఉద్యోగం. అదంతా కత్తిరించేసి పొట్టిక్రాఫ్. మెడ వెనక పై భాగం ఆకుపచ్చ చర్మం పాచిలా కనిపిస్తూనే వుంటుంది.

"తల పెద్దదైతే, భుజబలం వుండదంటారుగా పెద్దలు. ఇంజన్‌కి అదుంది. ఈ రోజుల్లో కావాల్సిందే అదిగా" అన్నాడు చంద్రం. కులాసా కబుర్లకు వ్యవధి నివ్వకుండా, వొక పెద్ద కూత పెట్టింది. అది కూత కాదు. కంఠంలోంచి ధ్వనులు రావడం కాదు. మొత్తం శరీరం అంతా కంఠమై, అల్లాగయ్యే యత్నంలో ఆ కంఠం పగిలినప్పు డొచ్చిన ధ్వని, ప్లాటుఫారం పైన జనం అదిరిపడ్డారు.

"చూస్కో – నే వున్నానని తెలిసి కాబోలు ఇంజన్‌గారు విర్రవీగిపోతున్నారు" అన్నాడు సింహం.

"రైలు కదులుతోంది" అన్నాడు చంద్రం.

"రైలు కదలడం లేదు – ధాటికి అదిరి భూమే వెనక్కి పారిపోతోంది. చాలా థ్యాంక్స్. ఈ నాలుగు రోజులు హాయిగా గడిచాయి. అరుణకి మరీ మరీ థ్యాంక్స్ చెప్పు. ఇదిగో – ఈ హంటర్ అంటే మోజుపడ్డావు. దగ్గరుంచుకో – జ్ఞాపకార్థం" అంటూ చేతిలోని హంటర్ చంద్రానికిచ్చాడు. అతను తటపటాయిస్తున్నాడు. ఇంజన్ మరొక్కసారి కేకేసింది – మిగిలిపోయిన ఆ కాస్త శక్తినీ యిప్పుడు పూరించుకొని, జండా పట్టుకున్న గార్డు కూడా అదిరిపడ్డాడు. ఒక్క గంతేసి రైల్లో పడ్డాడు గార్డు.

"చూశావా – వద్దంటానికి వీల్లేదు. ఇంజన్ కూడా నోరు కట్టేసుకో మంటోంది."

అప్పుడే చాలా దూరం వెళ్ళిపోయింది పెట్టె "సింహం"పెద్ద తలకాయ చిన్నదవుతోంది. చుక్కలాగై అంతర్ధానమైంది. హంటర్‌ని చేతిలో తిప్పుకుంటూ చంద్రం ఇంటికి బయలుదేరాడు. ఆర్మీలో పెద్ద ఉద్యోగస్థుడు వాడే హంటర్ అది. మూడడుగుల పొడవు, రెండంగుళాల వెడల్పు గల దండం చుట్టూ చాక్‌లెట్ రంగుతోలు చాపలా అల్లి వుంటుంది. ముందు ఒక అడుగు పొడుగు రెండు తోలు పటకాలు లాగా వేళ్ళాడుతూ వుంటాయి. అది తనకేమీ ప్రయోజనం లేదు. స్నేహితుడు జ్ఞాపకార్థం ఇచ్చింది. కాదనలేక పోయాడు. చదువుకొనే రోజుల్లో మోటుగా కరుకుగా వుండేవాడు సింహం. పోకిరీ అని చెప్పుకోవడం కూడా తనకి జ్ఞాపకం. ఆర్మీలో యీ ఉద్యోగం అతనికి సరి అయినదే. ఆర్మీలో వున్నాడంటే కరుకుగా మోడుగా వుండి వుండాలి అనుకున్నాడు. చాలా మందిలాగే తనూ. కాని సింహం అల్లాగలేదు. నవ్వించడం కోసం కొంత చౌకబారు సంభాషణ సాగించినా – అరుణ ముందు మరీనూ – మొత్తం మీద నమ్రతగా సంస్కారంతో వొచ్చిన ఒక నాజూకుతో వ్యవహరించాడు. ఆర్మీలో వున్న వారికి ఎక్కువ వినోదాన్ని కల్పించి మామూలు సమాజంలో సాధ్యం కాని స్వేచ్ఛతో ప్రవర్తించే అవకాశాలు కల్పిస్తారుట. కదిపితే ఆ విషయాలన్నీ అతను చెప్పునేమో, ఏకాంతంగా అవన్నీ చెప్పుకొనే అవకాశం దొరకలేదు. వారిద్దరి మధ్య ఏదో ఒక తెరలాంటిది వుంది. డబ్బు వల్లనో, హోదా వల్లనో, సంస్కారం వల్లనో

మసలే సమాజం వల్లనో దేనివల్ల నైతేనేం, వారిద్దరూ అనుకున్నంత అన్యోన్యంగా దగ్గరగా వుండలేకపోయారు. బహుశా "అరుణ" సమక్షంలో వారిద్దరూ ఎక్కువగా గడపడం వల్లనేమో, చంద్రానికి నవ్వొచ్చింది. ఉన్న నాలుగు రోజులు ఆమె ఎదురుగా వున్నా లేకపోయినా కూడా అరుణని అరుణగారూ అంటూనే వ్యవహరించాడు సింహం. రైలు కదిలేటప్పుడు మాత్రం ఆ "గారూ" వదిలేసి "అరుణ" అనే వ్యవహరించాడు. అంటే యీ నాలుగు రోజుల్లోనూ వారి మధ్య పెంపొందిన అనురాగానికీ, అన్యోన్యానికీ అదొక చిహ్నం. ఒకర్నొకరు "గారు" అని సంబోధించే అవసరం వున్నంత వరకూ వారిని నిజమైన స్నేహితులుగా పరిగణించడం సాధ్యం కాదేమో!

ఇంటికి చేరుకున్నాడు. మెట్లెక్కి తల్పు కొట్టాడు. నౌకరు తలుపు తీసి హాల్లో కుర్చీలు బల్లలూ సర్దుతున్నాడు. గోడ గడియారం అప్పుడే పది కొట్టింది. పోస్టుకు వెళ్ళి టపా తెస్తానని నౌకరు బయటికి వెళ్ళాడు. హంటర్ హాల్లో మధ్య బల్లమీద పడేసి, పత్రిక కోసం వెతుకుతూ పక్క గదిలోకి వెళ్ళబోయే ముందు భార్యని పిలిచాడు. సమాధానం లేదు. మళ్ళా వెనక్కొచ్చి, ఏమీ తోచక బల్లమీద హంటర్ చేతుల్లో పట్టుకొని, గది దగ్గరకెళ్ళి తలుపు కొట్టాడు. ఒక్క క్షణం ఆగి, తలుపు తోశాడు. సరిగ్గా పడని గడియ కాబోలు, చప్పుడు చేస్తూ కిందికి జారింది. తలుపు తోసుకొని లోపలి కెళ్ళాడు. ఎదురుగా అద్దం బల్లముందు మడత మంచం మీద కూర్చుని ఏదో కాగితం కేసి చూస్తూ వుంది అరుణ. భర్త రాగానే కంగారు పడినట్టు ఉలిక్కిపడి తను చూస్తూ వున్న కాగితాన్ని గుప్పెట్లో దాచేసి అతనికేసి చూడకుండా "అబ్బ, అబ్బ, కాసేపు అవతలుండండి" అంది. ఇదివర కెన్నడూ చూడని అరుణని చూశాడు చంద్రం. తలంటు పోసుకున్న జుట్టు తడిని తువ్వాలులో బిగించి ఆర్పుకొంటూ పల్చని తెల్లచీర పూర్తిగా కట్టుకోకుండా వొంటికి సగం సగం చుట్టబెట్టుకొని జాకెట్టు లేని భుజం పైన జారిన తడి కొంగు మడతగా మంచం క్రిందికి జారిన కొంగు చటుక్కుని కనబడిన తువ్వాలును లాగి మెడ చుట్టూ కప్పుకొన్న అరుణ– అదొక వింత దృశ్యం. అరుణ పల్చటి మనిషి. బహు లేత శరీరం. స్ఫుటంగా ఆకృతి పొందని అవయవాలు. గుండ్రతనం, నిండుతనం లేవు. అన్నీ కోణాలు, బలహీనమైన ఎముకలూ, నరాలు, బ్యాటరీ లైటు ఆమె శరీరం పైన ఫోకస్‌చేస్తే యిటు నుంచి అటు ప్రసరిస్తుంది కాంతి. బలంగా, లావుగా కనబడేందుకు ఆమె చేసే యత్నాలు చంద్రానికి తెలుసు. మందంగా వుండే బట్టతో అనేక మడతలుగా తీర్చిన లంగా. దానిమీద ఎనిమిది గజాల చీరె. బయటి కెళ్ళినప్పుడు వెల్వెట్ జాకెట్టు, సన్నటి, పల్చటి నాజూకైన మొహం. ప్రశాంతమైన కళ్ళు, శాశ్వతమైన మందహాసాన్ని సూచించే నోరు, జాలిగా మెరిసే క్రమమైన చిన్న పళ్ళవరస, ఒంపుకు ఆస్కారం లేని చిన్న చెక్కిళ్ళు. ఆ మొహం మరీ అంత చిన్నదిగా

కనబడ్డానికి కారణం ఆమె జుట్టు. దట్టంగా వొంపులు తిరిగిపోయిన మొహం మెడ, భుజాలు ఆవరించే మందమయిన తలకట్టు. ఇప్పుడు ఆమె కళ్ళు ఎర్రగా వున్నాయి. నిప్పులు గ్రక్కడం అంటే యిదే కాబోలు; క్రౌర్యంతో పెదవులు చలించి, చిన్న రంధ్రంలోంచి సోకిన సూర్యకిరణంలా ఒక గీతగా పెదవులు చివరలో బిగుసుకున్నాయి. నొక్కి పెట్టిన గుప్పెటపైన నరాలు పదునుగా తీర్చి ఉన్నాయి. ఏదో మహావృక్షం ఎన్నాళ్ళు గానో భూమికి పెనవేసుకున్న వ్రేళ్ళులాగా – ఆ చేష్టలో ఒక వికృతమైన ప్రాచీన శక్తి కనిపించిన వాడికి మల్లే అరుణని చూసి చంద్రం దిగ్భ్రమ చెందాడు, క్షణంలో తేరుకున్నాడు.

"చేతిలో ఏమిటది?"

సమాధానం లేదు.

ఒకడుగు ముందుకు వేశాడు.

ఆమె భుజం తడి ఆరింది – కాని చీర మడతలు తడికి చర్మాన్ని అంటి పెట్టుకొని శరీరం కాంతిని బైటపెడుతున్నాయి. పరాయి స్త్రీగా కనబడుతోంది అరుణ.

"నిన్నే"

"బైట కెళ్ళండి" అంది గుప్పిటిని చీర మడతలో దాచుకుంటూ.

"ఏమిటది?"

"ఏమీ లేదు"

"చెప్పాలి"

"ఏం లేదన్నానుగా"

చంద్రం మరో అడుగు ముందుకు వేశాడు. ఆమె మంచం మీద కొంచెం వెనక్కి జరిగింది. ఎడమ చేతితో మంచం బద్దీని నొక్కి పెట్టినప్పుడు భుజం మీద వొంపు రొమ్ములని కదిపి, చీర మడతల్ని కదుపుతున్నాయి.

"చెప్పి తీరాలి"

చంద్రంలో అస్పష్టమైన వాంఛ రేగినట్లు కళ్ళు పదే పదే చిట్లిస్తున్నాడు.

"చెప్పక పోతే"?

అరుణ చూపులో, మాటలో పెంకితనం, కొంటెతనం కూడా ప్రకటించింది.

"ఏం మాట్లాడుతున్నావో, ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?"

"తెలుసు."

"మరిల్లా గియ్యి, అదేమిటో?"

"ఇవ్వను, ఏం చేస్తారేమిటి?"

అరుణ సంసార బంధాన్ని విస్మరించింది. తను భార్య కాదు – వ్యక్తిత్వంతో

ప్రజ్వరిల్లుతున్న వొక ప్రాణి. ఆ తిరుగుబాటుతో ఆమె మరీ దూరమైపోతోంది. లోయలో నిలబడి దూరంగా శిఖరంపై కలని వెదుక్కుంటూ తిరుగాడే దేవకన్యని పిలిచినట్లుగా ఉంది. అతనొక బురదగుంట. అందులో తారక ప్రతిబింబంగా అరుణ కదులుతోంది. ఆ తిరుగుబాటు అతన్ని కవ్వించినట్లయింది. ఆమెను తన చేతుల మధ్య బిగించి, ఆశక్తికి ఆమె శరీరం వీడి రక్తం కారుతూంటే, అతనిలో కామజ్వాల చెలరేగి అందులో ఆమె హతమవుతే,– ఏదో వెఱ్రి ఆవేశానికి లొంగి పొయ్యాడు చంద్రం. అతని ఆవేశం వెనక పురుషుడు, 'మాన' ఉన్నాయి. చరిత్రలో కాయకష్టం చేసి, సౌందర్యాన్ని ఆరాధించి, విఫలుడైన లక్షలాది మానవుల – పురుషత్వం వుంది. తనింక ఆమె భర్త కాదు. చంద్రం కాదు. బలహీనమైన, తనచేతిలో లొంగిపోయి, తనిష్టమొచ్చినట్లు వాడి ధ్వంసం చేసుకునేందుకు అనువైన వొక స్త్రీ దొరికిన పురుష, పశు శక్తుల కుప్ప.

"ఏం చేస్తానా ?"

మీది కొస్తున్నాడు చంద్రం. నల్ల మేఘాన్ని తరుముకొచ్చిన పెనుగాలిలో అల్లల్లాడిపోయిన గడ్డిపువ్వులా ఆమె వొణికిపోయింది. ఆ గడ్డి పువ్వుకి కూడా వేరుంది. విత్తనం వుంది. అవి భూమిలో పాతుకుని వున్నాయి. భూమండలంలో శక్తికి కదిలినట్లుంది ఆమె. ఇంకా వెనక్కి జరిగింది. మడత మంచం చివర – చీరకొంగు జారి రొమ్ముల మధ్య యిరుక్కుంది. శ్వాస వేడిగా, తెరలుగా వొదుల్తోంది.

"నాకు తెలుసు" అన్నాడు.

"తెలిస్తే ఇంకెందుకు? వెళ్ళండి"

"చూడకుండా వెళ్ళను"

"నేనే వెడతాను" అని లేవబోయింది అరుణ. చీరముడి సరిగ్గా లేక నడుం మీదికి జారిపోతోంది. మంచంమ్మీది దుప్పటిని పైకి లాక్కుని కప్పుకుంటోంది. లేవలేదు. మళ్ళీ అక్కడే చతికిల బడింది.

"అది ఉత్తరం అవునా?"

"అవును"

"ఎవరు వ్రాశారు?"

"అది తెలుసుకున్న వారు ఇదీ తెలుసుకోండి"

చంద్రం తల తిరుగుతోంది. అతనికంతా తేటతెల్లమైంది. మరిప్పుడు ఆ వేదన లేదు. నరాలు లాగడం లేదు. స్థిరపడి కార్యానికి సిద్ధపడుతున్నాయి. "సింహం" స్టేషన్లో "అరుణగారు" అనడం బదులు "అరుణ" అని ఎందుకన్నాడో తెలిసింది. వారిద్దరు వున్నప్పుడు ఆమె సంభాషణ అదొకలా నడిచింది. చెప్పుకొన్న కబుర్లన్నీ ఎవరికో

ఉద్దేశించి చెప్పినట్లుగా వున్నాయి. అరుణ "సింహం" కేసి అదొకలా చూసింది. ఆ చూపుల్లో అమాయకత్వం బదులు, కుటిలత్వం కనబడింది. గుడ్లు వొప్పజెప్పేసిన చూపులవి. "సింహం" గురించి చదువు కొనే రోజుల్లో నలుగురూ చెప్పినవి గుర్తుకొస్తున్నాయి. అతనిలో సంస్కారం లేదు. నాజుకు లేదు. ఆర్మీలో వాళ్ళ మోటుదనం కరుకుదనం వున్నాయి. ఆ పెద్ద తల, పాచిలా మెరిసే పెద్ద మెడ, భీకరమైన కనుబొమ్మలు – బొగ్గు గనిలోకి తొంగి చూసినట్లు నల్లటి కళ్ళు – అబ్బ! ఆ స్థానంలో అతను తప్ప, ఇంక ఎవరున్నా, ఆమెను క్షమించి వుండును చంద్రం. ఆమెలో నాజూకు, అమాయకత్వం, మృదుత్వం సహజంగా వున్నాయి. వాటికి వ్యతిరేకమైన లక్షణాలు "సింహం"లో వున్నాయి. అందుకనే వాటిని కోరింది కాబోలు.

"ప్రేమలేఖ?"

"అవును"

"చూడనీ"

"చూడనివ్వను. మీ కొచ్చిన ఉత్తరాలన్నీ నాకు చూపుతున్నారా?"

"వేళాకోళమా?"

"నిజంగానే"

"ఇస్తావా, ఇవ్వవా?"

"ఇవ్వనంటినిగా"

అర్థం లేని ధ్వని చేశాడు చంద్రం. ఆమె మీది కొచ్చాడు. అతని రెండు మోకాళ్ళు మంచం ముందు భాగంలో అనించి ఆమెను పట్టుకోబొయ్యాడు. అరుణ వెనక్కి కదిలింది. ఆమె చెయ్యి మెడ వెనుక దాచింది. భుజం మీద పడింది. అతని చెయ్యి, దేగపాదం కప్పపిల్ల మీద పడ్డట్టు. మంచం చివరికి జరిగింది – పట్టు లేదు. లుంగ చుట్టుకొని కింద పడింది. బరువుకి చంద్రం వున్న భాగం పైకి లేచింది. ఆ వూపుకి వెల్లకిలా పడ్డాడు. దెబ్బ తగిలింది. అతని చూపు తడబడుతోంది. వొస్తువులు కనిపించడం లేదు. బుర్రలో వాక్య నిర్మాణం అవడం లేదు. ఏవో సగం సగం ధ్వనులు – చేస్తున్నాడు. లేచాడు. దూరంగా అరుణ వాడి వూడిన ఆకులా – ఒడ్డునపడి తెప్పరిల్లిన తెల్ల పిల్లకెరటంలా – చందమామను కప్పిన తెల్ల మేఘంలా అరుణ– ఊహలో అరుణ, జ్వాల నాలుక; కత్తిబాణం; అగ్నిదేవుడు విప్పి పారేసిన వస్త్రం, చిలుక పొడిచిన ఎర్రపండు – "సింహం" నోట్లో నలిగిన పావురం అరుణ. తను బోనులో లేచాడు; బోను కడ్డీలు వూడపీకుతున్నాడు. "ఇస్తావా? ఇవ్వవా? ఆమె మీదికి వెళ్ళి, ఒక్క వూపుతో ఆమెను నిలబెట్టి మంచం పైన కూలదోశాడు. చేతిలో "హంటర్" ని గిర గిర తిప్పి వ్రేళ్లాడుతున్న పటకాలతో ఆమె

జబ్బమీద కొట్టాడు.ఆమె పెనుగులాట విరమించి, మంచంమీద నుండి జారి, చేతి పట్టు విడిచివేసి కిందపడింది. చంద్రం ఆ ఉత్తరాన్ని చిక్కించుకున్నాడు. హంటర్ భుజాన వ్రేళాడేసుకొని హాల్లోకి నడిచాడు. బల్లమీద గ్లాసులో మంచినీళ్ళు త్రాగాడు. ముందు గదిలో కెళ్ళి తలుపేసుకొని ఉత్తరం చదువుకున్నాడు.

ఆకుపచ్చ రంగు కాగితం, పై భాగం చిరిగిపోయింది. అక్షరాలు సరిగా కనపడటం లేదు.

"…. నే నింక సుఖపెట్టగలనేమో. ఇన్నాళ్ళు ఉద్యోగం లేక నాతోపాటు నిన్ను కూడా ఈ సమిష్టి కుటుంబానికి బానిసగా చేశాను… నిర్మలమైన సెలయేటి అడుగున కనిపించే బంగారపు ఇసుక లాంటి నీ శరీర కాంతి. నా చీకటి కలలను వెలిగించింది. అంతటి నిర్మలమైంది కూడా నీ హృదయం. సుకుమారమైంది నీ శరీరం. ఏటికి అటూ ఇటూ గట్లంట ముళ్ళ పొదలు – పెద్ద పెద్ద చెట్లు – ముసలి వై వూగిస లాడి కొనఊపిరితో భూమిని అంటిపెట్టుకున్న చెట్ల లాంటి నా జీవితానికి ఆ యేరు మెల్లగా నృత్యం చేస్తూ, సున్నిత కంఠంతో గానం చేస్తూ ప్రవహిస్తుంటే చూసి ఆనందించటం తప్ప పరమావధి లేదు. అన్ని నదులూ ఎప్పుడో ఒకప్పుడు ఎక్కడో ఒక చోట సముద్రంలో పడాల్సిందే అన్నాడు ఒక కవి. ఇప్పుడా సమయం వచ్చింది. ఉద్యోగం దొరికింది. నీకు ఉయ్యాలంటే ఇష్టం కదూ?…. మనుషులు లేని ఏకాంత లోయలలో రెండు శిఖరాలకు మధ్య తగిలిద్దాం ఆనందం అనే ఉయ్యాలని… సిగ్గుతో దూరంగా వెళ్ళని పిల్లవాయువు ఆ ఉయ్యాలని ఊపుతుంది. చెట్ల ఆకులు సంతోషానికి తట్టుకోలేక మన మీద ఊడిపడి మన ఆనందాన్ని పంచుకుంటాయి… అరుణా… కొండ వెనక నుంచి వొక్కసారిగా నీ మోము వెలిగించే ప్రభాత కిరణం. నీ స్నానం కోసం వేచివున్న అడివి కొలను…. మన కోసం ఎదురు చూస్తూ వున్నాయి.

తరువాత అక్షరాలు బొత్తిగా కనబడటం లేదు. సంతకం కూడా లేదు. కాని చంద్రానికి తెలుసు వివాహం అయిన మరుసటి సంవత్సరం, ఉద్యోగం దొరకగానే అతను, అరుణకి వ్రాసిన లేఖ అది. అవుతే, ఇంత దాపరికం దేనికి? అర్థం లేని మొండి పట్టా? మూర్ఖత్వమా? హాస్యధోరణిలో ప్రారంభించిన పెంకిపట్టు విషాదంగా అంతమొందిందా? అతనికి అర్థం కావడం లేదు. ఆ ఉత్తరం అరుణకి ఆనందం యిచ్చి వుండాలి. ఎన్నేళ్ళ క్రితమో తాను పొందిన ఆనందాన్ని మళ్ళీ ఇప్పుడు చదువుకుని పొందుదామన్న సంకల్పానికి తన రాక అంతరాయంగా పరిణమించింది. ఆ ఉత్తరం వ్రాసిన చంద్రం వేరు. ఆ చంద్రం ప్రియుడు – యవ్వనంలో స్వప్నాలల్లే మాంత్రికుడు. ఇప్పటి చంద్రం భర్త. ఉద్యోగం హోదా, డబ్బూ, నౌకర్లూ, స్నేహితులూ, మర్యాదలు – ఆమె భార్య – వంటొండి పెడుతుంది.

ఆ ఉత్తరం చదవడంలో గతించిన కలలు, తిరిగి ఊహలో సృష్టించుకొని, రహస్యమైన ఆనందం పొందుదామని, తలంటు పోసుకుని, అలంకరించుకుంటూ, ఏకాంతంగా గతంలో యాత్రకి బైలుదేరుతూండగా, భర్త అనే ఇప్పటి చంద్రం, వర్తమానాన్ని హంటర్ స్వరూపంలో తన ముందు ప్రత్యక్షమై ఆ ఊహాజగత్తుని ధ్వంసం చేశాడు. అందుకే అతన్ని పరాయివాడిగా, విరోధిగా తూలనాడి, ఎదురు తిరిగి, స్వప్న జగత్తులో తన నిజస్వరూపాన్ని వొక్కసారి చూపెట్టింది.

వారి కిప్పుడు ఏ లోటూ లేదని చంద్రానికి తెలుసు. డబ్బుంది, ఉద్యోగం వుంది. అన్నీ వున్నాయి. కానీ ఏదో లోపించింది. ఆ లోపించింది ఆ ఉత్తరంలో వుంది. అందుకే అంత రహస్యం. గతానికో అద్దం ఆ ఉత్తరం. అందులో తన నిజ స్వరూపం చూసుకుంటుంది. ఉత్తరం నలిగింది; అద్దం మసగ్గా వుంది. అన్నీమరకలు ; తలంటు పోసి, శుభ్రం చేసినా బాగవదు.... అంతే మరి..

చంద్రం, హంటర్ తాళ్ళని తన వెన్ను మీద పేల్చుకు చూశాడు. శరీరానికి నెప్పి తెలుసు; బాధ తెలుసు. కాని హృదయానికి తెలిసేది గాయం. అద్దాన్ని పగల గొడుతుంది శరీరం. పగిలిన ముక్కల్ని ఏరి అతుకు పెడుతుంది హృదయం. హంటర్ బల్లమీద పడేసి, పైన పత్రిక కప్పి, అరుణ గదికేసి నడిచాడు చంద్రం. ఆ పత్రికని హంటర్‌ని పూర్తిగా కప్పేటందుకు సర్దుతున్నప్పుడు, వొక్క కన్నీటి బిందువు పడి, అక్కడ తడిసింది. ఒక్కటే బిందువు వుంది – పగిలిన వాటిని అతుకు పెట్టి జిగురులాంటిది. అది కాస్తా యిప్పుడు పడిపోయింది.

# కప్పగంతుల సత్యనారాయణ



**ఆం**ధ్రాంగ్ల భాషలలో సుప్రసిద్ధ పత్రికా రచయిత. కథకులు. వ్యాసకర్త. చీకట్లో తుపాకీ పేల్చిన కొసమెరుపుతో వీరి కథలు ముగుస్తాయి. వస్తువులో వైవిధ్యం. వర్ణనలో సహజత్వం, పాత్ర చిత్రణలో సునిశిత దృష్టి. సంభాషణల్లో చతురతా - కథా రచనలో ప్రత్యేకతలు. ఆంగ్ల దినపత్రిక 'మెయిల్' లో పని చేసేవారు.

**రచనలు :** మాణిక్యం, ఎవరికి వారేనా? ఋణ విముక్తి, తెల్లవారుజాము పాటాలు (కథల సంపుటాలు), మన మతములు - ప్రవక్తలు (వ్యాసాలు), ప్రపంచ దర్శిని.

# తుంగభద్ర పొంగింది

**జో**రుగా వాన కురిసి వెలిసింది. రాత్రి రెండు జాములవేళ. ఆనాడే దసరా వుత్సవాలు ముగిశాయి. వివిధ దేశాలనుండి విజయనగరపు కొలువుకి కానుకలు పట్టుకొని వచ్చిన రాయబారులు, మహారాజుకి నజర్లు తీసుకొని వచ్చిన సామంతులూ, తమ తమ స్వస్థానాలకి ఆ రాత్రే బయలుదేరుదామనుకున్నారు. సాయంకాలం జరిగిన గొప్పదర్బారులో, శ్రీకృష్ణదేవరాయలు విదేశీ రాజ ప్రతినిధులకీ, తన సామంతులకీ, పండితులకీ, వీరులకీ యధోచితంగా సత్కారాలు చేశారు.

తలవని తలంపుగా వాన రావడం వల్ల, ప్రయాణాలు పెట్టుకున్న అతిధులంతా, ఆనాటికి ఆగిపోవలసి వచ్చింది. నగరం చుట్టూ వేసిన దేరాలన్నీ ఎక్కడివక్కడే నిలబడిపోయాయి.

తుంగభద్ర నదికీ, రాయలవారి నగరుకీ మధ్యవున్న స్థలంలో మాత్రం ఎప్పుడూ దేరాలు వెయ్యడం మామూలు లేదు. రాయలవారి నగరులోనుంచి తుంగభద్రానదికి వెళ్ళడానికి, అటువైపు ఒకద్వారం వుంది. నదికీ, నగరుకీ మధ్య సుమారు ఒకఫర్లాంగు దూరంలో గుబురుగా పెరిగిన తోట వుంది. ఎల్లపుడూ, ఆ నగరు వాకిలిముందు ఒక సైనికుడు పహారా చేస్తుంటాడు. రెండేసిజాముల కొకడు చొప్పున యీ పహారా జవానులు మారుతూ వుంటారు.

వాన కురిసి వెలియడమూ, శరత్కాలపు చక్కదనంలో చంద్రుడు మళ్ళీ ఆకాశం మీద కనబడడమూ, హఠాత్తుగా చూసేసరికి ఆనందము కలిగించవచ్చును కాని, ఎక్కుపెట్టిన విల్లుతో, రాజనగరు వాకిలి ముందు పహారా తిరుగుతున్న సైనికుని ప్రాణానికి మాత్రం విసుగుగా వుంది. వాన రాకుండా వున్నట్లయితే రాత్రి మొదటి జాము అవగానే అతడు యింటికి వెళ్లేవాడు. కాని, మొదటి జాము అవకుండానే వాన జోరుగా ప్రారంభము కావడమూ, నడిరాత్రి దాకా వెలియకపోవడం వల్ల, అతడికి బదులు రావలసిన సైనికుడు

రాలేదు. మరొకడు వచ్చి పహారా అందుకుంటేనే తప్ప, అక్కడున్నవాడు వెళ్ళిపోవడానికి వీలులేదు. ఆ సైనికుడు తన కంటి ముందు సముద్రంలాగా కనిపిస్తున్న నీటి వంక చూస్తూ పహారా తిరుగుతున్నాడు.

ఆ వాన ఒక్క విజయనగరం మీదనే కాక, ఎగువను కూడా కురిసినట్లుంది. తుంగభద్ర నిమిష నిమిషానికీ లావెక్కుతున్నది. ఆ సైనికునికి తుంగభద్ర కనబడదు. కానీ, అతని ముందున్న తోటంతా, మోకాలి లోతున నీటితో నిండివుంది. ఆ నీరు క్రమేపీ ఎక్కువ అవుతున్నది. రాజనగరు ప్రహరీ ప్రక్కకు నీరు పొర్లి వస్తున్నది. ఆ సైనికుని చీలమండలు నీటిలో మునిగాయి. నీరు ఎక్కువ అవుతున్నది. ఏమైనాసరే, అతడు మాత్రము అక్కడనుంచి వెళ్ళిపోవడానికి వీలులేదు. అతనికి బదులు వచ్చేవాడు వచ్చే జాడ కనబడదు.

ఆ సైనికుడు అలాగే పహారా యిస్తున్నాడు.

ఉన్నట్టుండి "అబ్బా" అన్న పురుషస్వరమూ, దబాలున నీళ్ళలో మనిషి పడ్డ చప్పుడూ, ఆ సైనికుడికి స్పష్టంగా వినపడ్డాయి.

ఎవరో మనిషి నీళ్ళలో పడిపోయాడు. ఆ సైనికునికి ఏమీ తోచలేదు. ఏమి చెయ్యడమా అని ఆలోచిస్తూ వుండగానే, నీళ్ళలో పడ్డ మనిషి కాళ్ళు చేతులూ విదిలించి కొట్టుకుంటూ వున్నట్లు కూడా చప్పుడు వినబడింది. వెంటనే వెళ్ళి రక్షిస్తే, ఆ మనిషి బతకవచ్చును. ఆ సైనికుడు ఆలోచించలేకపోయాడు. పహారా వదిలి పోతే రాజద్రోహం. కదలకపోతే, నిండు ప్రాణం పోతూ వుంటే చూస్తూ వూరుకున్న వాడవుతాడు.

ఏం, చెయ్యడమా?

ఆ సైనికుడి తలలో ఏమి ఆలోచనలు రేకెత్తాయో, అతనిని ఏమి వుద్రేకం వహించిందో కాని, తన స్థానాన్ని వదిలి, మోకాలిలోతు, నీళ్ళతో నిండివున్న ఆ తోటలోకి సాగాడు. మనిషి కొట్టుకులాడుతూ వున్న చప్పుడు వస్తున్న వేపే అతడు వెడుతున్నాడు. కొంతసేపటికి, ఆ చప్పుడు ఆగిపోయింది. కాని, యింతకుముందే అతడు నిర్ణయం చేసుకున్న స్థలానికి, ఆ సైనికుడు వెడుతూనే వున్నాడు. సుమారు ముప్పాతి ఫర్లాంగులు మేర నీళ్ళల్లో కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళాడు. అతని కాళ్ళకు మనిషి తగిలాడు. చప్పున వంగి, ఆ సైనికుడు ఆ మనిషిని పైకెత్తాడు.

ఆజానుబాహు విగ్రహం. తెల్లని వస్త్రాలు బురదమయమై వున్నాయి. ఆ చెట్ల ఆకుల సందులో నుంచి పడుతున్న వెన్నెల కాంతులలో ఆ మనిషి రూపం స్పష్టంగా కనబడకపోయినా, అతడెవరో నాగరికుడని మాత్రం తెలుస్తోంది. ఆ వ్యక్తికి స్పృహ లేదు. నీళ్లు బాగా త్రాగినట్టున్నాడు.

ఆ సైనికుడు ఆ వ్యక్తిని బుజాన వేసుకుని, అతికష్టమీద మోసుకుంటూ, ఆ తోట మధ్యలో వున్న విహార మందిరానికి తీసుకొని వెళ్ళి పొట్టలో నీరు కక్కించుదామని బయలుదేరాడు.

భుజం మీద బరువుతో, మోకాలి లోతుకు మించిన నీళ్ళలో కాళ్ళీడ్చుకుంటూ నడక ప్రారంభించాడు సైనికుడు. భుజం మీద బరువును మొయ్యడం వల్ల, తల యెత్తి ముందుదారిని చూచుకోడానికి వీలు లేకపోయింది. అతి భారం మీద, నిమిషమొక్క యుగంగా కొంతసేపు నడిచేటప్పటికి అతడు తోట మధ్యలో వున్న విహార మందిరాన్ని చేరుకోడానికి బదులు, తోట ఉత్తరపు చివరకు వచ్చేశాడు. అక్కడ నీరు కూడా చాలా తగ్గిపోయింది. పది అడుగులు ముందుకు వేశాడు. అది మెరక, నీరు అప్పుడే ఎక్కుతోంది. చప్పున తన భుజంమీదవున్న మనిషిని నేలమీద పడుకోబెట్టి, పొట్టను రెండు చేతులతో నొక్కి నీరు కక్కించాడు. తన తలపాగాను విప్పి ఆ గుడ్డతో మనిషి తలా, మొహమూ తుడిచాడు. వంట్లో వేడి పుట్టడానికి మెడచుట్టూ, గుండెలమీద తన చేతులతో రాశాడు. కొంతసేపు ఇలా ఉపచారం చేయగా, ఆ వ్యక్తి కన్నులు తెరిచాడు.

"ఎవరు నువ్వు?" అని నీరసంగా అస్పష్టంగా అడిగాడు ఆ వ్యక్తి.

ఆ సైనికుడు మాట్లాడలేదు. ఆ వ్యక్తి కొంతసేపు ఏమీ మాట్లాడలేదు.

మళ్ళీ అడిగాడు "ఎవరు నువ్వు. మనం ఎక్కడ వున్నాము?"

"నేను కోట పహారా సైనికుణ్ణి. పద్మరాజు నా పేరు. నువ్వెవరు?" అన్నాడు సైనికుడు.

"నేనా, మేము – నేను – ఈ వూరు కాదు మాది. మనం ఎక్కడ వున్నాము?" అన్నాడు ఆవ్యక్తి.

"రాజుగారి తోటకు ఉత్తరాన వున్నాము. ఇదంతా నగరు బయలు. అరమైలు నడిస్తేనేగాని, నగరపు పడమట బజారు చివరకు చేరుకోలేము. నువ్వు నడవగలవా?" అని అడిగాడు పద్మరాజు.

"మెల్లిగా నడవవచ్చును. మా – నా కుడికాలులో చాలా పెద్ద ముల్లు గుచ్చుకున్నది. అంచేత కుంటుతూ నడవాలి" అన్నాడు ఆ వ్యక్తి.

"తుంగభద్ర పొంగుతున్నది. మనం త్వరగా నడిచి మిట్టమీదుగా ఊరు చేరకపోతే, మళ్ళీ నీళ్ళలో చిక్కుపడిపోవలసి వుంటుంది" అని హెచ్చరించాడు పద్మరాజు. అతడు, తాను రక్షించిన వ్యక్తి ముఖంవైపు ఆ వెన్నెలలో చూస్తున్నంతసేపూ, తనకు యెక్కడో బాగా పరిచయము గల మనిషిని చూసినట్టవుతోంది. కాని, ఆ మనిషి ఎవరో మాత్రం గుర్తు రావడం లేదు.

ఆ వ్యక్తి నీరసంగా లేచి నిలుచున్నాడు. కాలిలో ముల్లు బాగా బాధ పెడుతున్నట్టుంది. కానీ, దాన్ని తీసే ఉపకరణాలు ఎవరి దగ్గరా లేవు. కుంటుతూ ఆ వ్యక్తి నడుస్తున్నాడు. అతని ప్రక్కనే ఆ సైనికుడు, అతని భుజం పట్టుకొని అతణ్ణి పడనీయకుండా చూస్తూ నడుస్తున్నాడు.

దారిలో నడుస్తూ, తాను కోట పహరాను విడిచిరావడమూ, మళ్ళీ అక్కడకు వెళ్ళడానికి వీల్లేకపోవడమూ, మరునాడు తనకు ఏం శిక్ష పడుతుందో తనకే తెలియక పోవడమూ, ఆ వ్యక్తికి చెప్పాడు పద్మరాజు. ఆ వ్యక్తి నీరసంగా ఊ కొట్టాడు. వీరిద్దరూ పట్టణంలోకి చేరుకొనేటప్పటికి, దశమి చంద్రుడు ఆకాశ విహారాన్ని ముగించేశాడు. పడమటి బజారులో కొంత దూరం నడిచిన తరువాత, మేము – నేను యిక్కడ ఏ అరుగుమీదనైనా, తెల్లవారగానే నా విడిది చేరుకుంటాను. నువ్వు మీ యింటికిపో. మా – నా ప్రాణం రక్షించావు. నీకు కృతజ్ఞత ఎలా చెప్పాలో నాకు తెలియడం లేదు. ఆ ఇంద, నా జ్ఞాపకార్థం, యీ వుంగరం వ్రేలికి వుంచుకో అని ఆ వ్యక్తి, ఆ చీకటిలో తన ఉంగరం తీసి, ఆ సైనికుడికి ఇచ్చాడు. మొదట వద్దన్నా, బలవంతాన ఆ ఉంగరాన్ని పద్మరాజు తన కుడిచేతి ఉంగరపు వ్రేలికి పెట్టుకున్నాడు.

పద్మరాజు ముందుకు సాగాడు. ఆ వ్యక్తి మాత్రం ఆ సమీపంలోనే వున్న అరుగు యెక్కి, తన తడిగుడ్డలతోనే ఆ అరుగుమీద పడుకున్నాడు.

తెల్లవారి బారెడు ప్రొద్దెక్కే వరకు, విజనగరంలో ఎన్నడూ కని విని ఎరగ నంత కలకలంగా వుంది. ఏ బజారులో చూసినా, ఏ అరుగుమీద చూసినా, ఏ దుకాణం వద్ద చూసినా నలుగురైదు గురికి తక్కువ కాకుండా జనం చేరి ఏదో వింత విషయాన్ని చెప్పుకుంటున్నట్లుగా మాట్లాడు కుంటున్నారు.

రాజనగరం ముందు సుమారు పదివేల మంది జనం గుంపు జేరారు.

మహారాజ శ్రీకృష్ణరాయలు, రాజనగరులో కనబడడం లేదు. యేమైపోయినాడో ఎవరికీ తెలియదు. రాత్రి భోజనాలయిన తరువాత, రాజుగారు మేడమీదకు వెళ్ళడం పరిచారికలు చూశారు. తరువాత కొంతసేపటికి వాన వచ్చింది. ఎవరి పని వారు చూసుకొని పడుకున్నారు. రాజుగారు పడక గదిలోకి వెళ్ళి వుంటారని అంతా అనుకున్నారు. పగలంతా దసరా వుత్సవాలలో పాల్గొని వుండటం చేత ప్రభువు అలసి, నిద్రపోయారని అంతా అనుకున్నారు. తెల్లవారేసరికి నిద్ర లేచి, కసరత్తు, కాలకృత్యాలు తీర్చుకొనే ప్రభువు, బయటికి రాకపోతే, పరిచారికలు శయ్యాగృహంలో చూశారు. ప్రభువు లేదు. వెంటనే అందరూ నాలుగు దిక్కులూ చూశారు. ప్రభువు జాడ కనబడదు. పడక మీద ఎవరూ నిద్రించిన లక్షణాలు కనపడవు. రాజనగరులో కలకలం ప్రారంభమైంది. రాజనగరు

కలకలం, నగరులోకి పొక్కడానికి ఎంతసేపు కావాలి! రాజుగారు రాత్రినుంచీ, కనపడడం లేదని వూరంతా గుప్పుమన్నది. ప్రధాని తిమ్మరుసు, రాజనగరుకు వచ్చి ప్రతి పరిచారికనూ, ప్రతి పరిచారకుణ్ణీ ప్రశ్నించాడు. ఎవరికి ఏమీ తెలియదు. మహారాణులను పలకరించి చూశాడు. మహారాజు జాడ తెలియదు.

తిమ్మరుసు కుమారుడు గోపాలరాజు, నగర రక్షకుడు. తండ్రితో పాటు అతడు కూడా, మహారాజు జాడ తెలుసుకోవడానికితగు విచారణ చేస్తున్నాడు. గతరాత్రి, రాజనగరు చుట్టూ, పహరా చేసిన సైనికులనందర్నీ పిలవమన్నాడు. ఒక్కొక్కరినే విచారించాడు. పద్మరాజు దగ్గరకు వచ్చేటప్పటికి, కథకు ముడిపడింది. పద్మరాజు, తనకు సంబంధించినంత వరకు రాత్రి జరిగిన సంగతంతా చెప్పాడు. ఒక్క విషయం మాత్రం దాచిపెట్టాడు. అది తను రక్షించిన వ్యక్తి తనకు యిచ్చిన బహుమానం మాట. మిగతా కథ, అంతా తు.చ. తప్పకుండా నిజం చెప్పాడు. గోపాలరాయలు, పద్మరాజు కథను నమ్మలేదు. పద్మరాజు తన విధిని వుల్లంఘించి, పహారా వదిలి యింటికి పోయి వుంటాడనీ, ఇక నీళ్ళలో మునిగిన మనిషిని రక్షించడం, మొదలైన కథ అంతా శిక్ష తప్పించుకోడానికి యెత్తు అనీ, గోపాలరాయలు స్థిర పరచుకున్నాడు. పద్మరాజును, ప్రధానామాత్యుల ముందు హాజరు పెట్టాడు.

"నువ్వు, నీళ్ళలో నుంచి కాపాడిన వ్యక్తి ఎవరు?" అని ప్రధాన మంత్రి ప్రశ్న.

"ఈ ఊరు కాదన్నాడు. నేను ఎక్కువ ప్రశ్నలు కూడా వెయ్యలేదు."

"ఏమి?"

"అతడు ఆయాస పడతాడేమోనని."

"అతడు ఏమైనాడు?"

"పడమటి బజారులో మేము చీలిపోయినాము. నేను యింటికి పోయినాను. అతడు ఏ అరుగుమీదనైనా పడుకుని, తెల్లవారగానే తనవూరు పోతానన్నాడు."

"అతడు ఇప్పుడీ నగరమున వుండడని నీ సూచన కదూ?"

"అతడు చెప్పినదది"

"నీవు మరల పహరాకేలపోలేదు?"

"నేను మహారాజ నగరు దర్వాజా వదులునప్పటికే, నాకు మోకాలు లోతున అక్కడ నీరు వచ్చినది. అప్పటికింకా తుంగభద్ర పొంగుతూనే వుంది. అంచేత నీటిలో మునిగిపోతానని భయపడ్డాను."

"నీ ప్రాణం రక్షించుకో చూచావన్నమాట?"

పద్మరాజు బదులు పలుకలేదు.

"మహరాజు కనబడని కారణానికి నీవెంత బాధ్యుడవో నాకు తెలియదు. కాని, పహరాకు బదులు సైనికుడు రానిదే విడిచిపెట్టడం, విధ్యుల్లంఘనము. దానికి దండన మరణమే. ఆ విషయమున నేను కనికరింపలేను." అని తిమ్మరుసు గోపాల రాయలువంక చూచినాడు. గోపాల రాయులు పద్మరాజును బైటికి తీసుకుపొమ్మని, అచ్చటనే వున్న ఇరువురు సైనికులకు ఆజ్ఞ ఇచ్చాడు.

ఇంతలో రాజ నగరు సింహద్వారమునొద్ద బ్రహ్మాండమైన కలకలం బయలుదేరింది. నగరు లోంచి తిమ్మరుసు, ప్రధాని సేనాని తిరుమల రాయలు, నగర రక్షకుడు గోపాలరాయలు బైటికి వచ్చారు. వారి వెనకనే, పద్మరాజు, అతనికి కాపలాగా యిరువురు సైనికులు వున్నారు.

సింహ ద్వారం ముందు గుమికూడిన పదివేలమంది మహారాజు, మహారాజు అని ఒక్క గొంతుతో కేక వేస్తున్నారు. గుంపు రెండు భాగాలుగా చీలింది. మధ్య బాట ఏర్పడింది.

బురద పట్టిన వస్త్రాలతో నీరసంగా కుంటుతూ, విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణరాయ ప్రభువు, కటిక నేలమీద నడిచి సింహద్వారం వైపు వస్తున్నాడు. మహారాజుకు బాట వదిలిన సమూహం, మహారాజు వెనుకనే బాటను మూసివేస్తూ, ప్రభువును అనుగమిస్తున్నారు.

ప్రధానామాత్యుడు గబగబ నడచి మహారాజుకు ఎదురువెళ్ళి కౌగిలించుకున్నాడు.

తిమ్మరుసు భుజాన్ని ఆనుకుని మహారాజు ముందుకు నడిచాడు. సింహద్వారం వద్దకు వచ్చేటప్పటికి తిరుమలరాయలు, గోపాలరాయలు, పద్మరాజు, మిగతా సైనికులు వంగి మహారాజుకు నమస్కరించారు. మహారాజును చూసి పద్మరాజు తెల్లపోయినాడు. తన వ్రేలిన వున్న ఉంగరాన్ని చూసుకున్నాడు. రాజముద్రిక. పద్మరాజు శరీరం పులకరించింది.

మహారాజు నగరులోకి ప్రవేశించి, తనతో తిమ్మరుసు మాత్రం వెంటరాగా అంతఃపురంలోకి వెళ్ళాడు. మిగతావారంతా ఇవతల పెద్ద కూటంలో వుండిపోయారు.

ఒక గడియలో మహారాజుకు పరిచర్యలన్నీ జరిగిపోయాయి. ప్రభువు కూటంలోకి వచ్చి, సింహాసనం మీద ఆసీనుడయాడు. తిమ్మరుసు, తిరుమల రాయలు, గోపాలరాయలు తమ తమ స్థానాలలో కూచున్నారు. పద్మరాజు, మరికొంతమంది సైనికులు నిలబడి వున్నారు.

"అప్పాజీ! నిన్న రాత్రి భోజనానంతరం మేము తోటలోకి విశ్రాంతి మందిరం వైపు వెళ్ళాము. బడలిక వల్ల అక్కడే కొంతసేపు వుండిపోయాము. ఇంతలో వాన వచ్చింది. వాన వెలిసిన తరువాత నగరు చేరుకుందామని ప్రయత్నము చేశాము. కాని, మోకాలిలోతు

నీళ్ళలో కాలిలో బలమైన ముల్లు గుచ్చుకున్నది. ఆ ముల్లును లాగివేద్దామని ప్రయత్నించడంలో, కాలు జారి క్రింద పడిపోయినాము. ఎన్నిసార్లు లేవడానికి ప్రయత్నించినా, భూమి జారుడుగా వుండడం వల్ల పట్టు చిక్కలేదు. లేవలేకపోయినాము. ఈ లోపల నీరు త్రాగడం సంభవించింది. మాకు స్పృహ తప్పింది. తరువాత కొంతసేపటికి వెన్నెల కనబడింది. ఆ సైనికుడు మమ్మల్ని రక్షించాడు" అని మహారాజు కృతజ్ఞతా పూర్వకంగా పద్మరాజు వైపు చూపించాడు.

"ప్రభువులు నన్ను మన్నించాలి. తన స్థానాన్ని వదలిన నేరానికి, ఇంతకు పూర్వమే అతనికి మరణ శిక్ష చెప్పాను" అని తిమ్మరుసు విజ్ఞప్తి చేసుకున్నాడు.

"మీ పని మీరు చేశారు. అంతవరకు సమంజసమే కదా! కాని మా ప్రాణం రక్షించిన ఆ సైనికుడి ప్రాణాన్ని మేము రక్షిస్తున్నాము" అని ప్రభువు అన్నాడు.

పద్మరాజు ప్రభువుకి సాష్టాంగ ప్రణామం చేశాడు. అతని కన్నులు నీటితో నిండాయి.

పద్మరాజూ, మా ప్రాణాన్ని రక్షించినప్పటికీ, పహారా సైనికుడుగా నీవు అనర్హుడవని నిన్న రాత్రితో స్పష్టపడిపోయినది. ఈ రోజు నుండి నీవు పహరా సైనికుడుగా వుండరాదు."

"నిన్న రాత్రి నీవు చేసినది రాజోల్లంఘనము. కాని, దానిలోనే రాజ ప్రాణ రక్షణ చేసితివి. అందుకు మేము కృతజ్ఞులము. మా కృతజ్ఞత తెలియజేయడానికి నిన్ను పద్మపురానికి ఖిల్లేదారుగా నియమిస్తున్నాము" అన్నాడు ప్రభువు.

బైటనుంచి ఒక సైనికుడు లోపలికి వచ్చి "ప్రభువుల దర్శనం మరొకసారి చెయ్యాలని సింహద్వారం వద్ద నున్న ప్రజలు కుతూహలపడున్నా"రని మనవి చేసుకున్నాడు.

"పదండి" అని మహారాజు లేచాడు.

# విద్వాన్ మల్లాది సత్యనారాయణ

**బ**హుముఖంగా రచనలు సాగించి, విశేషఖ్యాతి గడించారు. అసంఖ్యాకంగా కథలు వ్రాయకపోయినా, వ్రాసిన ప్రతికథా బరువైన జీవిత సంఘటనలతో, వికాసోన్ముఖమైన ప్రయోజనంతో, తీక్షణమైన పరిశీలనా శక్తితో, పాఠకుని హృదయంలో అనుభూతి ముద్ర ప్రతిష్టించే విధంగా వుంటుంది. మద్రాసులో నివసించేవారు.

**రచనలు :** కనపడని గాయాలు, పరువు- ప్రతిష్ట (నవలలు), పేదపిల్ల, చెల్లాయి పెండ్లి, తాంబూలం (నాటకాలు) భక్త రామదాసు చిత్రానికి సంభాషణలు వ్రాశారు.

# జీవిత మాధుర్యం

**జీ**వితంలో ఎప్పుడో ఒకప్పుడు ప్రతి మానవునకు మంచి రోజులు వస్తాయనీ, అప్పుడే జాగ్రత్తగా మంచిరోజుల్ని సద్వినియోగం చేసుకున్నవాడే నేర్పరి అనీ, అయితే ఆ మంచి రోజుల కోసం నిరీక్షణ, ఓర్పు చాలా అవసరం అనీ గోపాలానికి తెలియకపోలేదు. అయితే కాలగర్భంలో కొన్ని సంవత్సరాలు కలిసిపోయి యెప్పుడు చూచినా గొట్టెకు బెత్తెడు తోకే అన్నట్లు యెదుగూ బొదుగూ లేని తన జీవితాన్ని తలచుకుంటూంటే, మంచి రోజులు వస్తాయన్న నమ్మకం కాస్తా నశించింది గోపాలానికి. నశించిపోవడమే కాకుండా ఆ మంచిరోజులు అన్న పదం ఎవరి నోటివెంటేనా వినపడ్డప్పుడల్లా యెవరికి మంచిరోజులు అనే ప్రశ్న వెనువెంటనే వెలువడేది. కాని, ఆ ప్రశ్నకు సమాధానం తన లోపలే అణగిపోయేది.

సంవత్సరం పొడుగునా వాన అనక, వరద అనక, ఎండనక, కొండనక, పురుగనక, పుట్ట అనక రెక్కలు ముక్కలు చేసుకుని పొలం పండించిన వానికి యెంత నిరీక్షించినా మంచి రోజులు రావు. భూమి గల ఖామందుకు యెప్పుడూ మంచి రోజులే వస్తుంటాయి. పగలు పన్నెండు గంటలూ రక్తం ధారవోసి మిల్లులో పనిచేసే కార్మికుడు ఎంత నిరీక్షించినా, యెంత ఓర్పు వహించినా మంచి రోజులు రావు. మిల్లు యజమానికి మూడువందల అరవైనాలుగు రోజులూ మంచి రోజులు.

కష్టపడే దొకడు, అనుభవించేది ఇంకొకడు అనే సిద్ధాంతం వేళ్ళు పాతుకు పోయిన మనదేశంలో అందరికీ మంచిరోజులు యెప్పుడూ రావు. కొందరికే వస్తూంటాయి. అందుచే గోపాలానికి ఆ మంచి రోజులు అన్నమాట వింటే హేళనగా వుంటుంది.

షాహుకారు వెంకట సుబ్బయ్య ఇచ్చిన ఆర్డరు ప్రకారం సరుకు కొనడానికి తెల్లవారుఝాము బండికే బయలుదేరే నిమిత్తం షాహుకారిచ్చిన యెనిమిది వందల రూపాయలు జాగ్రత్తగా జాలెసంచిలో భద్రపరచి, నడుంచుట్టూ కట్టుకొని బయలుదేరి

యింటికి వస్తున్న గోపాలానికి ప్రొద్దుటినించి తిండి లేనందున కళ్ళు తిరుగుతున్నాయి. తన తిండి మాట దేవుడెరుగు. చంటిపిల్లకి ప్రొద్దుటినుంచి పాలు లేవు. పాలడబ్బా నిన్ననే అయిపోయింది. ఆ సాయంత్రం పాలడబ్బా కొనుక్కు వెళ్ళకపోతే ఈ రాత్రి పిల్లని పట్టుకోగలరా? పాలడబ్బా మాట తలపునకు వచ్చే సరికి గుండె గుభేలుమంది. ఏంపెట్టి కొంటాడు పాలడబ్బా. నెలాఖరు అయి ఒకటవ తేదీ వస్తేనే కాని షాహుకారు వెంకట సుబ్బయ్య జీతం యివ్వడు. ఇవ్వడు అంటే షాహుకారుదేమీ తప్పులేదు. ఎందుచేతనంటే గోపాలం షాహుకారు చుట్టూ పని ఇప్పించమని తిరిగినప్పుడే షాహుకారు వెంకట సుబ్బయ్య కొన్ని షరతులు జాగ్రత్తగా బిగించి గోపాలం చేత సంతకం చేయించుకున్నాడు. అప్పటికి ఆమోదించి ప్రవేశించాడు గోపాలం.

నెలలో మధ్యగా యెప్పుడూ జీతం తాలూకు డబ్బులో కొంత కూడా అడగడానికి వీలులేదు. నెలా పూర్తి అయ్యాక ఒకటవ తేదీని పూర్తిగా జీతం యిచ్చే షరతు మొదటిది.

ఇక రెండవది గుమాస్తా సంఘాలలో చేరడంగాని సమ్మెలలో పాల్గొనడం గాని యెంత మాత్రం కూడదు.

మూడవది. ఇష్టం లేకపోతే పనిమాని వేయడం తప్ప జీతం పెంచమని యెప్పుడూ అడగకూడదు.

నాల్గవది. లేబరాక్టు రూల్సు అంటూ ఆదివారాలు పనిమానడానికి వీలులేదు. ఎంత అత్యవసరమైన పని అయినా షావుకారు పర్మిషను తీసికొననిదే మానడానికి వీలులేదు.

అయిదవది. పని యే మాత్రం తృప్తికరంగా లేకపోయినా గోపాలాన్ని పనిలో నుంచి తప్పించెయ్యడానికి నోటీసులతో నిమిత్తం లేకుండా పూర్తి హక్కులు షావుకారుకున్నాయి.

ఆరవది. నెలజీతం అరవై రూపాయలు అయినప్పటికి షావుకారు అంకెలు యెంత ఎక్కువగా వేసి సంతకం పెట్టమన్నా గోపాలం సంతకం పెట్టి తీరాలి.

ఇన్ని షరతులు కంగీకరించి ఉద్యోగంలో ప్రవేశించిన గోపాలం ఈ రోజు ఇంట్లో బియ్యం లేక పస్తుపడుకోవలసి వచ్చినా చంటిపిల్లకు పాలడబ్బా లేకపోయినా షావుకారుని యేమని అడుగుతాడు? కనీసం చెప్పడం కూడా తన అసమర్థతను చూచిస్తుందని చెప్పలేదు.

ఎన్ని షరతులు బిగించినా ఆనాటి ఆదుర్దా కొద్దీ గుమాస్తా పనికి ప్రవేశించాక యీనాడు షావుకారు దయతలంచలేదని అఘోరించి వాళ్ళ దగ్గర వాళ్ళ దగ్గర షాహుకారు యిట్లా చేస్తున్నాడని చెప్పుకోవడం కూడా పొరబాటేనని గ్రహించిన గోపాలం యెవ్వరితోనూ యేమీ చెప్పకూడదను కున్నాడు.

ఈరోజు ఎనిమిది వందల రూపాయలు మొలలో వున్నాయి. ఒక రూపాయ పెట్టి పాలడబ్బా కొని నాలుగు రూపాయల బియ్యం కొని ఇంటికి పట్టుకువెడితే... ఈ అయిదు

రూపాయలకి యేం జమాఖర్చు చెప్పాలి. ఒకటవ తేదీ ఇంకా పదిరోజులకి గాని రాదాయెను. వెధవ ఒకటవ తేదీ ముప్ఫయి రోజులు గడిస్తే గాని రాదు గదా. ఈ ముప్ఫయి రోజులయినా బురదపాము చందంగా నడుస్తాయి. కనిపెట్టుకు కూర్చున్నా ఆ ఒకటవతేదీ వస్తుందన్న మాటేగాని త్రాచుపాములా జర్రునజారి పోయి ఊరుకుంటుంది. పదహేను రోజులకొకసారి ఒకటవతేదీ వస్తుంటే బాగుండు ననిపించింది గోపాలానికి. ఏమైనాసరే బియ్యం పాలడబ్బా కొనుక్కు వెళ్ళడానికే నిశ్చయించుకున్నాడు. లేకపోతే యెట్లా? తనేదో ఉద్ధరిస్తాడని జీవితాంతం పోషిస్తాడని నమ్మి మెడలో పుస్తె కట్టించుకున్న భార్యకు బియ్యం తేలేకపోయానని ఏ ముఖం పెట్టుకు చెబుతాడు.

ఇంతకీ పెద్దవాళ్ళకి బుద్ధిలేదు. చిన్నతనంలోనే గుదిబండని మెడగట్టేసి వాళ్ళ బాధ్యత వాళ్ళు తీర్చుకుంటే సరేననుకున్నారు గాని తరువాత వచ్చే గోపాలం బాధలు కొంచెమైనా గమనించగలరా? అయితే ఒకటి. కాలమాన పరిస్థితిని బట్టి ఇప్పుడెంత తెచ్చినా చాలడం లేదు గాని గోపాలం చిన్నతనంలో వాళ్ళ నాన్న యెలిమెంటరీ స్కూలు మాస్టరీ చేసేటప్పుడు నెలకు పదిహేనున్నర జీతం ఇచ్చేవారు. ఆ డబ్బుతో నలుగురు పిల్లలతో సంసారాన్ని యీదుతూ అప్పుడప్పుడు ఒక్కొక్క కాసు బంగారం (అప్పుడు కాసెంత? పదమూడున్నరేగా) కొని గోపాలం తల్లికి చెల్లెళ్ళకీ మురుగులనీ మెళ్లో యేవో ఆంజనేయ బిళ్ళలనీ చేయిస్తూ వుండేవాడు. ఇప్పుడు గోపాలానికి షాహుకారు నెలకు అరవై రూపాయలు యిస్తాడు. తాను భార్య ఇద్దరు పిల్లలు బ్రతకడం కష్టం అయిపోతోంది. ఇరవయ్యో తారీఖువఱకు చచ్చీచెడి యీడ్చుకొస్తున్నాడు. అక్కడి నుంచి నెలాఖరువరకు రోజూ యేకాదశులు, శనివారాలు, కార్తీక పౌర్ణములు. ఎవరినీ చేయి చాచి అడగలేడు. గోపాలం చిన్నతనంలోనే "ఈ రోజుల్లో పెళ్ళాన్ని పోషించుకోలేని వాడెవడు?" అనేవాడు. అప్పుడు జీవితం అంత తేలికగా వుండేది. ఇప్పుడెంత బరువయిందో గోపాలంలాంటి వాళ్ళకే తెలుస్తుంది గాని, తక్కిన వాళ్ళకేం? తెలుస్తుంది.

తనూ, తన భార్య ఏ పస్తులు పడుకునో జీవితాన్ని గడిపేద్దామనుకుంటే, వీలు లేకుండా ఇద్దరు పిల్లలు కూడాను. గోపాలం దరిద్రానికి సాయం భార్య కాపరానికి వచ్చి ఇరవై యేళ్ళయితే, ఇప్పుడు పుట్టుకొస్తున్నారు పిల్లలు. ఏది తక్కువయినా పిల్లలు పేచీ పెట్టేస్తారు కదా. వాళ్ళకేం కావాలి సంసారంలోని బాధలు. పెద్దపిల్ల బృంద చూచినదల్లా కావాలని యేడుస్తుంది. ఇంక చంటిపిల్ల కవన్నీ తెలియవు. పాలు లేకపోతే యేడుస్తుంది. పస్తు పడుకునే తల్లి దగ్గర పాలెలా వుంటాయి?.....

పిల్లల భవిష్యత్తు కోసం బల్లలు గుద్ది ఉపన్యాసా లిచ్చే అగ్రనాయకులు చేసిందేమిటి? గట్టిగా అడిగితే, తిండి పెట్టలేనప్పుడు ఎందుకు కనాలి? సంతాన నిరోధానికి అనేక

సాధనా లున్నాయిగా? ఆచరణలో పెట్టకూడదా అంటారే గాని, జీవన పరిమాణం హెచ్చినందువల్ల తిండి పెట్టలేకపోతున్నాడనే ఆలోచనే రాదుగా. జీవన పరిమాణం హెచ్చడానికి కారణం ఏమిటీ అంటే స్వతంత్రం వచ్చింది గనుక, దేశంలో అన్ని విషయాలు సక్రమ పద్ధతిలో సర్దుకునేసరికి కొంతకాలం పడుతుంది. 'మేము మాశాయశక్తులా తంటాలు పడుతున్నాము. పంచవర్ష ప్రణాళికలు అమలు పరుస్తున్నాం. ఒక్కొక్క రాష్ట్రానికి రెండు మూడు విశ్వవిద్యాలయాలు స్థాపించి విద్యాభివృద్ధి చేస్తున్నాం' అంటారే గాని దిగమింగుడు దేవతలు అంగుళ్ళు లేకుండా ఎంత మింగేస్తున్నారో, ఎందరు పానకాలరాయుళ్లు పానంలాగా తాగేస్తున్నారో, ఎంత దుబారా ఖర్చులు క్రింద, కేళీ విలాసాల క్రింద ఖర్చవుతోందో, ఎన్ని అవసరమయి టియ్యే బిల్లులు ప్యాసవుతున్నాయో? తెలియదు గనుకనా! అందరికీ తెలుసు.... అయితే...? క్వశ్చన్ మార్కే. అది సాల్వుకాని సమస్య. పైకి చెప్పుకోడానికి వీలులేని సహస్ర వర్ష ప్రణాళిక. తెలిసి కూడా తెలియనట్టు నటించ వలసిన రాజకీయ రహస్యం. బయటపెడితే మొదటికే మోసం వచ్చే చిదంబర రహస్యం.... మనకెందుకు పోనివ్వండి.

అనేక ఆలోచనలు బుర్రలో పరుగెడుతున్నాయి గోపాలానికి. పాప బోసినోటితో నాన్న పాలడబ్బీ తెస్తాడని ఎదురు చూస్తూ వుంటుంది. వట్టిచేతుల్తో తాను వెడితే, "పాలడబ్బా కూడా కొనలేని వాడవు నన్నెందుకు కనాలి? నందనోద్యానవనం కావలసిన నా జీవితాన్ని మొలకెత్తే సరికే తుంపెయ్య దలుచుకున్నావా? నాకు జన్మాన్నిచ్చిందెందుకు? నాకా జన్మ నిమ్మని నిన్నేం బ్రతిమాలలేదే?" అని అడుగుతుందేమో?

ఉదయం బయలుదేరి యింట్లోంచి వచ్చేటప్పుడు పెద్దపిల్ల బృంద "నాన్నగాలూ! వాళ్ళ పాప ఎక్కి కూచుంటే.... ఊ.... ఊగుతోందీ..... అలాంటి ఊగే గుల్లాన్ని నాకు పత్తుకు లాలూ" అంది కాళ్ళ కడ్డంపడి, గోపాలం అల్లాగే లేమ్మా అన్నాడు అదెంతపని అన్నట్టు. ఆ గుర్రాన్ని కొనడం గోపాలానికీ సాధ్యమా? అప్పుడే కొననని చెబితే తీరిపోనుగా. ఆశ పెట్టుకు యెదురు చూడదుగా పిల్ల. పిల్లని ఊరుకో బెట్టడానికి అల్లాగే అనడం తరువాత పిల్లని నిరాశలో ముంచెత్తి నీరసింపచెయ్యడం ఇదీ మన బాలల భవిష్యత్తు.

ఎందుకింత నైరాశ్యం. మొలలో యెనిమిది వందలున్నాయి. ఏమైనా సరే ఖర్చుపెట్టి కావలసిన వన్నీ కొనుక్కు వెడతానని గబగబ నడుస్తున్నాడు.

"ఇతరుల సొమ్ము ఖర్చుపెట్టడానికి నువ్వెవరవోయి? నిన్ను నమ్మి వ్యాపారం చేసుకు రమ్మని షాహుకారు నీ చేతికి డబ్బు యిస్తే ఖర్చు పెడతావా? ఇదేనా న్యాయం? ఒకటవ తేదీ వచ్చేసరికి అరవై రూపాయలు చేతిలో పోస్తున్నాడే. అల్లాంటి షాహుకారుని అన్యాయం

చేస్తావా?" అని అంతరాత్మ ఘోషించింది. ఆ సంచిలోంచి ఒక్క రూపాయికూడా తీయకూడదనుకున్నాడు.

అల్లాగే నీరసంగా కాళ్ళీడ్చుకొంటూ వస్తున్నాడు. ఎదురుగా ఫుట్‌పాత్ మీద ఒక పంజరంలో చిలుకను బెట్టుకొని ఏవో కొన్ని మడతలతో ఉన్న కాగితాలు ఎదర బెట్టుకొని ఒక ఆసామీ "పక్షి పలుకుతుంది నీ భవిష్యత్తురా తమ్ముడూ" అంటున్నాడు.

గోపాలం యేమీ తోచక ఆ పక్షి యేం చెబుతుందోనని యాంత్రికంగా నడిచి అక్కడికి వెళ్ళాడు. ఆ ఆసామీ అణా యిమ్మన్నాడు. జేబులో యెప్పటినుంచో ఒక చిల్లికాని ఒక నయాపైస స్నేహం చేస్తున్నాయి. పాత క్రొత్తల కలయికలో దాస్య స్వతంత్రాల కలయిక కాలం అన్నట్టున్న ఆ చిల్లికాని ఆ నయాపైసల స్నేహాన్ని అమాంతంగా విడదీసి చిల్లికాని యిస్తానన్నాడు. పాపం యెందరి భవిష్యత్తేనా చెబుతాడు గాని తన భవిష్యత్తు తనకే తెలియని ఆ ఆసామీ ఆ చిల్లి కానీకే కక్కూర్తి పడి తీసికొని చిలకని పంజరంలోంచి బయటికి తీశాడు.

"అమ్మయ్య! నా చిల్లికానీ ధర్మమా అంటూ ఆ రెండు నిమిషాలేనా స్వతంత్రం యిచ్చాడు పాపం ఆ చిలకకి" అని సంతోషించాడు గోపాలం. కాని ఆ వెనువెంటనే ఎగరడానికీ వీలు లేకుండా చాటుగా రెక్కలు కత్తిరించి బహిరంగంగా స్వతంత్రం యిచ్చానని చూపించే ఆ ఆసామీ మోసం చూస్తే పాపం గోపాలానికి యేవేవో జ్ఞాపకం వచ్చాయి. ఆ జ్ఞాపకం వచ్చినవన్నీ పైకి చూపించడానికి వీలులేని ఆణిముత్యాలు చూపిస్తే యేదో వంకబెట్టి యేడూచలు లెక్కబెట్టించే పరమసత్యాలు.

ఆ చిలుక కాగితాల మడతలలోని ఒక మడతను ముక్కుతో లాగింది. ఆ ఆసామీ మడతవిప్పి చదవడం మొదలు పెట్టాడు.

"నీకు యిప్పుడు చాలా మంచి రోజులు. నీ ఆలోచనలు న్యాయం వైపునకే మొగ్గు చూపుతాయి. నీ పవిత్రతే నిన్ను కాపాడుతుంది. కంగారు పడి బురదలో అడుగు వెయ్యకు. వేశావా జీవితాంతం వదలదు" అని చదివాడు.

ఎక్కడ లేని కోపం వచ్చింది గోపాలానికి. ఏమాటంటే కడుపు రగిలిపోతోందో అదే యిక్కడ కూడా ప్రత్యక్షమైంది. ఇప్పుడు చాలా మంచి రోజులట. అందుకే కొంపలో బియ్యం లేవు. అప్పిచ్చే దాతా లేడు. అరువిచ్చే షాహుకారూ లేడు. ఎవరికి మంచిరోజులు. నాకు కాదు. మంచిరోజులు మా షాహుకారుకు వచ్చాయి. ముందెన్నో రాబోతున్నాయి. నెలరోజుల క్రితం లెక్కలు చూచుకోగా వ్యాపారంలో పన్నెండు వేలు లాభం వస్తే, యీ నాలుగు రూపాయలు పెట్టిచొక్కా కుట్టించుకోమని యివ్వలేక పోయాడు. ఇక నాకు మంచిరోజు లేవిటి?

వెధవరాతలు వీడూను. ప్రతీ కాగితం మడతలోనూ యిల్లాగే రాసి వుంటుంది. బహుశః వీడి దగ్గరికి వచ్చిన వాడికల్లా మంచిరోజులు వస్తూనే వుంటాయి. కాని, వీడికి మాత్రం మంచిరోజులు రావు కాబోలు. వస్తే వీడికి ఫుట్‌పాత్ మీద నివసించే ఖర్మం యేవిటి? మంచి రోజులమాట యెట్లా ఉన్నా, పిల్లయేడిస్తే కనీసం కాసిన్ని బటానీలేనా కొనిపెట్టకుండా చిల్లికానీకి మాత్రం ఖరాబు పట్టింది. బుర్రగోక్కుంటూ రెండు కాళ్ళకి బుద్ధిచెప్పి గోపాలం ఘటాన్ని యింటికి నడిపిస్తున్నాడు.

అదే ఫుట్‌పాత్ మీద పెద్ద చెయ్యిబొమ్మ వున్న అట్ట ఒకటి పెట్టుకుని ఏవో పెద్ద పెద్ద గ్రంథాలు దగ్గర పెట్టుకుని కూర్చున్నాడొక పెద్దమనిషి. పెద్ద తలపాగ, కోటు. ఆ కోటుకి నాలుగు మెడల్సు (బంగారానివో, గిల్టువో చెప్పలేం అనుకోండి) వేషం మాత్రం హంగుగానే వుంది. అగరవత్తుల సువాసనలు అఘ్రాణిస్తూ హస్త సాముద్రిక శాస్త్రంలో ఆరితేరిన మొనగాడిలా ఎఱ్ఱటి కుంకం బొట్టుతో ఆకర్షిస్తున్నాడు గోపాలంలాంటి అసహాయుల్ని.

పక్షి పలికే భవిష్యత్తు కోసం ఆశించిన గోపాలాన్ని చూశాడు. పడింది తన వలలో పిట్ట. పట్టింది వాడి డబ్బులకు ఖరాబు అనుకున్నాడు. ఒక చేత్తో కోర మీసాన్ని దువ్వుతూ హస్తసాముద్రికం చెబుతాం సార్! అన్నాడు గోపాలాన్ని చూచి.

చిరాకు వచ్చింది గోపాలానికీ. “వీడూ మంచిరోజులనే చెబుతాడు. చెడ్డరోజులని చెబితే రాగిపైసా యివ్వడు యెవ్వడూను. ఇదొక రకం బ్రతుకు తెరవు” అనుకుని సమాధానం చెప్పకుండా తల వంచుకు తొందరగా నడుస్తున్నాడు.

తనలో తనకే నవ్వు వచ్చింది. “మంచి రోజులట, మంచిరోజులు” అనుకున్నాడు మరోసారి. అంతలోనే ఎవరో వీపుమీద చరిచి ఏదో చెబుతున్నట్టయింది.

“అవును. నీకు మంచిరోజులు గనకనే నీ షాహుకారుకు పన్నెండువేలు లాభం వచ్చింది. నీ షావుకారుకు లాభం రాక నష్టం వచ్చివుంటే వ్యాపారమే మానివేసి ఉండును. అప్పుడు నీ గతి ఏమవుతుంది. గుమాస్తా పనికోసం ఎక్కే గుమ్మం దిగే గుమ్మం జ్ఞాపకముందా? ఆ అవస్థ నుండి తప్పించాడు నీ షాహుకారు. లాభం వచ్చింది గనుకనే మళ్ళీ వ్యాపారం సాగించాడు. కనుకనే ఏ నెల అరవై ఆ నెల ఎగగొట్టకుండా యిస్తున్నాడు. పన్నెండు వేలు లాభం వస్తే చొక్కాగుడ్డ కుట్టించ లేదని బాధపడుతున్నావా? అట్లా ఎందుకు ఆశించాలి? అరవై రూపాయల జీతానికి చాకిరీ చేస్తానని కుదిరావు, నీ షాహుకారుకు నష్టం వచ్చి ఉంటే నీ జీతంలో ఒక్క రూపాయి తగ్గించుకుందుకు నువ్వు వప్పుకుంటావా? నీ యజమాని బాగుండాలని కోరుకో. పొదుగుపిండి పాలు త్రాగడానికే ప్రయత్నించు. పొదుగు కోసి పాలు త్రాగడానికి ప్రయత్నించకు. నీ తోటి గుమాస్తా నీ షాహుకారుకు యెదురు తిరిగి యేం చెయ్య గలుగుతున్నాడు. కోర్టుల చుట్టూ తిరుగుతున్నాడు. లేబరాక్టు

యేదో ఉద్ధరిస్తుందని. బ్రతుకు తెరువుకు కావలసింది సామరస్యంగాని యాక్టులు, కోర్టులు గావు. మళ్ళీ ఎవడైనా గుమాస్తాగా పెట్టుకున్నాడా? ఎందుకు పెట్టుకుంటాడు? వెర్రివాడా! న్యాయంగా నీకు రావలసిన దానికే ప్రయత్నించు. అన్యాయంగా ఒక్క కాని కూడా ఆర్జించడానికి ప్రయత్నించకు, కష్టాలు వస్తాయి. నిగ్రహించుకోవాలి. అప్పుడే ఓర్పు చూపించాలి. కష్టాలు కూడా వున్నప్పుడే సుఖాల యొక్క విలువ తెలుస్తుంది. అప్పుడే నిజమైన జీవితమాధుర్యాన్ని అనుభవించ గలుగుతాడు మానవుడు."

వెనక్కు తిరిగి చూచాడు గోపాలం. ఎవ్వరూ లేరు. ఆలోచించాడు. తన హృదయమే చెప్పిందనుకున్నాడు. తనకు వినిపించిన మాటలన్నీ యదార్థమనుకున్నాడు. పొదుగు పిండి పాలు తాగాలి కాని కోసుకు తాగడం పొరబాటే ననుకున్నాడు. కష్టాలున్నప్పుడే సుఖాల యొక్క విలువ తెలుస్తుందనుకున్నాడు. ఈ రెండు విషయాలు శిలాక్షరాల్లా హృదయంలో నాటుకుపోయాయి గోపాలానికి. మననం చేసుకుంటూ కాళ్ళీడ్చుకుంటూ ఘటాన్ని యింటికి జేరేశాడు.

తండ్రి రాక కోసం ఎదరుచూస్తూ వీధిగుమ్మాన్ని పట్టుకు నిలుచున్న బృంద తండ్రి రాగానే కాళ్ళకు చుట్టుకొని "నాన్నగాలూ నాకు గుల్లం పత్తుకు వచ్చాలా?" అంది. ఏం చెప్పాలో తెలియలేదు గోపాలానికి. కళ్ళ నీళ్ళు తిరిగాయి. కనిపెట్టింది భార్య సుగుణ. బృందని చంకనెత్తుకుంది.

"ఛీ! అల్లాంటి గుర్రం యేం బాగుంటుంది. దాని మీద నుంచి పడితే దెబ్బ తగులు తుందమ్మా" అంది.

"ఎందుకు తగులుతుంది."

"ఆ గుర్రం పడగొట్టేస్తుంది."

"ఎందుకు పలగొత్తుతుంది? మరి వాళ్ళ పాపని పలగొత్తదేం."

"దానికి కోపం వచ్చినప్పుడు పడగొడుతుంది."

"ఎప్పుడొత్తుంది కోపం?"

"ఎప్పుడో వచ్చేస్తుంది. ఇంకా కావలిస్తే నాన్నగారిని అడుగు" అంది భర్తని బాధా సముద్రంలోంచి కాస్త మేల్కొల్పాలని.

"ఏవండి నాన్నగాలూ? గుల్లానికి కోపం వచ్చి పలగొత్తుతుందా?" అంది బృంద. కూర్చున్న తండ్రి ఒళ్ళోకెక్కి చొక్కా గుండీలు సర్దుతూ.

"అవునమ్మా" అన్నాడు గోపాలం, సుగుణ మాదిరిగా సర్ది చెప్పే విధానం తనకు తోచలేదను కున్నాడు.

"అయితే నాన్నగారూ! వెధవ గుల్లం మనకొద్దు" అంది బృంద బుంగముఖం పెట్టి తండ్రితో.

జాలే వేసింది గోపాలానికి. సిగ్గూ వచ్చింది తన అసమర్థతకు.

బిడ్డల కోర్కెలు తీర్చలేని వాళ్ళు ఎందుకు కనాలి? కని వాళ్ళ ఆశల్ని సమూలంగా నాశనం చేసి వారి పురోభివృద్ధినెలా అరికడుతున్నారో యీనాడు అర్థమైంది గోపాలానికి. తనకీ పాఠం నేర్పిన బృందను ఒక్క ముద్దు పెట్టుకున్నాడు.

మరి ఈ ముద్దో అని రెండో బుగ్గ చూపించింది బృంద. బాధంతా మటుమాయ మయి రెండో ముద్దు కూడా పెట్టుకున్నాడు.

క్షణ కాలం జరిగిపోయింది.

"సుగుణా! కాసిన్ని మంచినీళ్ళు అందుకుంటావా?"

"కొంచెం మజ్జిగ దాహం తాగరాదూ ఉప్పు వేసి యిస్తాను."

"మరి నువ్వు కూడా తాగవు? ఇవ్వాళిటికి ఇద్దరం చెరో కాస్త ఆ మజ్జిగ తాగి పడుకోవల సిందే. క్రిందటి జన్మలో ఎవరి నోటిముందు అన్నమో లాగేశాం. ఈ జన్మలో తిండికి మొఖం వాచాము" అన్నాడు కన్నీళ్ళతో గోపాలం.

"అదేవిటండి ఇంతమాత్రానికే..... మీరే కంట తడిబెడితే నే నేమైపోవాలి చెప్పండి... మన మాటకేం పాపం పాపకి ప్రొద్దుటినుంచీ పాలు లేవు."

"అవును కనడం మాత్రం కన్నాము. గుక్కెడు పాలు పొయ్యలేకపోతున్నాం. మనలాంటి గర్భదరిద్రుల కడుపున యెందుకు పుట్టాలి. మరి బృందనేలా ఊరుకోబెట్టావు."

"నిన్న వండగా గిద్దెడు బియ్యం మిగిలాయి.అవి వండి దానిమట్టుకు పెట్టాను"

"మంచి పని చేశావు. పాపకి పాలు లేవు"

"పాపం ఆ యెదరింటి వారి లక్ష్మి క్షణం క్రితం వచ్చింది. ఏదో మాటల సందర్భంలో పాలడబ్బా అయిపోయింది తేవాలి అని చెబితే, పాపం వాళ్ళ పాల డబ్బాలో పాలు కలిపి పట్టుకు వచ్చియిచ్చింది యిప్పుడే."

"మరి పట్టించావా"

"ఏదీ? ఆవిడావెళ్ళింది. మీరు వచ్చారు. మీకు మజ్జిగిచ్చి పాపకి పాలు పట్టిస్తాను." అని తొందరగానే వంటయింట్లోకి వెళ్ళబోయింది.

"సుగుణా" అన్నాడు కన్నీళ్ళతో గోపాలం.

"ఏవండీ!" అని దగ్గరకు వచ్చి చూచింది.

"ఏవిటండీ అది, చిన్న పిల్లాడిలా" అని కళ్ళనీళ్ళు తుడుచుకుంది.

"ఇంత అసమర్ధుడైన భర్తను కట్టుకుని యేం సుఖపడుతున్నావు సుగుణా"

"అబ్బ!...... ఏం మాటలండీ అవి."

"కూటికి కూడా గతిలేని కాపరం ఎందుకొచ్చిన కాపరం రా అనుకుంటోంది కదూ నీ మనస్సు సుగుణా."

ఆ మాట బాణంలా గ్రుచ్చుకుంది సుగుణ హృదయానికి. తీక్షణంగా చూచింది భర్త వంక "నేను బ్రతికుండటం మీకిష్టం లేదా!" అంది బాధగా.

"లేదులే సుగుణా, వెళ్ళి మజ్జిగ పట్టుకురా. చెరో గుక్కెడు తాగుదాం."

"ఇంకెప్పుడూ అలాంటి మాటలనని ప్రమాణం చెయ్యండి."

"లేదులే సుగుణా. వెళ్ళి మజ్జిగ తీసుకురా."

కన్నీళ్ళతోనే వంటయింటి గుమ్మంలోనికి వెళ్ళింది. పిల్లి మూతి నాకుకుంటూ యెదురుగా వచ్చింది. సుగుణ చూచింది. గుండె గుభేలుమంది. మూత పడగొట్టి మజ్జిగ కాస్తా పిల్లి తాగేసింది. కళ్ళనీళ్ళు గిర్రున తిరిగాయి. అక్కడే కూలబడింది. ప్రొద్దుటి నుంచీ యిద్దరికీ తిండిలేదు. భర్త యింటికి వచ్చాక, ఒకవేళ బియ్యం దొరక్కపోతే యిద్దరూ చెరో గుక్కెడు ఆ మజ్జిగత్రాగి ఈ రోజు గడపవచ్చు ననుకుని, మధ్యలో ఆకలిబాధ అణుచుకోలేక పోయినా మజ్జిగ త్రాగకుండా అలాగే అట్టేపెట్టింది. భర్తకు పట్టుకు వస్తానని చెప్పి లోపలికి వచ్చింది. ఏ ముఖం పెట్టుకుని భర్త దగ్గరకు వెడుతుంది? ఏమని చెబుతుంది?

పాప పాలులేక తొట్టెలో ఏడుస్తోంది. ఎంత సేపటికీ మజ్జిగ తీసుకురాక పోవడం చేత గోపాలం "సుగుణా!" అన్నాడు జవాబు రాలేదు. ఉదయం నుంచీ భోజనం లేకపోవడం చేత కళ్ళు తిరిగి పడిపోయి వుంటుందేమోనని కంగారుపడి వంట ఇంట్లోకి వచ్చాడు. సుగుణ ముఖం రెండు చేతులతో మూసుకొని ఏడుస్తోంది.

"ఏవిఁటి సుగుణా" అన్నాడు భయంగా.

"పిల్లి మజ్జిగ కాస్తా తాగేసింది" అంది యేడుస్తూ సుగుణ.

"ఇంత మాత్రానికే యేడుస్తారా? పోనీలే పాప యేడుస్తోంది. ఆ పాలు కాసిన్నీ పోయరాదు?" అన్నాడు.

లేచింది సుగుణ. పాలగ్లాసు తీసుకుంది. పట్టుకువచ్చింది. పాపని లేవదీసి పాలు పొయ్యడం కోసం కాళ్లమీద పడుకో బెట్టుకుంటోంది. పాప చేతులు కాళ్ళు కొట్టుకుని యేడవడంలో, చెయ్యి తగిలి ఆ పాలగ్లాసు పడిపోయింది.

'అయ్యో' అని అరిచింది సుగుణ. తల గోడకేసి కొట్టుకు యేడుస్తోంది పిల్లకి ఆ పాలు కూడా పట్టలేక పోయానే అని.

గోపాలానికి నవ్వు, ఏడుపు రెండూ కలిసే వచ్చాయి. కళ్ళ వెంట కన్నీరు కారుస్తూ నవ్వుతున్నాడు.

ఏడుస్తూనే "ఎందుకు నవ్వుతున్నా రం"ది సుగుణ.

"ఎందుకా! జీవిత మాధుర్యం అంటే యేవిఁటో ఈనాడు తెలుసుకున్నాను. నాకు జీవితపు లోతుల్లో ఉండే అందం కనిపిస్తోంది సుగుణా! ఎంత విచిత్రమైన సంఘటన! మన జీవితాంతం వరకు మరచిపోగలమా? కష్టాలున్నప్పుడే సుఖాల యొక్క నిజమైన విలువ తెలుస్తుంది సుగుణా. జీవితపు లోతుల్ని తరచి చూచిన వాడే నిజమైన జీవిత మాధుర్యాన్ని పొందగలుగుతాడు. సుగుణా! నిజమైన జీవిత మాధుర్యం అనే పదానికి సరియైన అర్థం ఈ మన విచిత్ర సంఘటనే సుగుణా;" అన్నాడు.

సుగుణకు ఏం అనాలో తెలియక గ్రుడ్లు వప్పగించి చూస్తోంది గోపాలం వంక.

కాళ్ళ మీద వున్న బోసినోటి పాప చైతన్య రహితయై వున్న సుగుణ కాళ్ళమీద నుంచి దొర్లిపోయి ఒలికిన పాలల్లో పడి రెండు చేతులతో తపతప కొడుతోంది. అవ్యక్తమైన ఆనందంలో బోసి నోటితో కలకల నవ్వుతూ తల్లివంక చూస్తోంది.

ఆ చూపులతో తేరుకొన్న సుగుణ ఒక్కసారి పాపను తీసుకొని గుండెలకు హత్తుకుని చిరునవ్వు నవ్వింది.



# మా గోఖలే

**(1917 - 1981)**



**సు**ప్రసిద్ధ చిత్రకారులు. మొదట శ్రామిక భాషలో కథలు రచించిన ఖ్యాతి గోఖలే గారికి చెందుతుంది. కూలీనాలీ చేసుకొని బ్రతికే కష్టజీవుల మనస్సుల్లో జొరబడి వారి వారి కష్టసుఖాల్నీ, మనసుల్నీ, మమతల్నీ వారి భాషలోనే కథల రూపంలో పరిచయం చేశారు. ఆర్థికంగా క్రింది తరగతికి చెందిన జనుల జీవిత విధానం, వారి దృక్పథాలూ, సమస్యలూ, పరిసరాలూ, వీరి దృష్టిని ఆకర్షించి సాహిత్య గౌరవం సంపాదించు కున్నాయి. వస్తువులో, శైలిలో, భాషలో క్రొత్త దారులు త్రొక్కి గోఖలేగారు ఒక ప్రత్యేక రచనా శిల్పానికి మార్గదర్శకులయారు.

**రచనలు :** మూగజీవాలు, బల్లకట్టుపాపయ్య (కథలసంపుటాలు)

# బల్లకట్టు పాపయ్య

ఏకువ జామున తొలికోడికూసేయాల మెట్టపల్లీ పొట్టపల్లికి మయాన పార్తుండ కిట్టకాలువ గెట్టుమీన్నుంచి ఎవురయినా నిలబడి సూత్తాయింటుంటే, మెట్టపల్లియేపుల్నించి సీకట్లో బజన పాటలు యినిపించి యింకూసేపటికి డొంకల్లోంచి సేతిగఱ్ఱ పొడుసుకుంటూ ఓ నల్లయిగ్రహం మిట్టపల్లాలు ఎక్కిదిగుతా వొచ్చొచ్చి కిట్టకాలవ గట్టెక్కి ఆడ గొలుసుతో కట్టేసుండ బల్లకట్టు కాడికొచ్చి నిలబట్టం తెలుసుద్దన్నమాట. ఆ యిగ్రహం బల్లకట్టు పాపయ్య.

పాపయ్యపని ఏకువజామున తొలికోడి కూసేయాల్టినుంచి రేత్తిరి జనం తిరగాట్టం మాటు మణిగేదాకా కిట్టకాలవలో బల్లకట్టు నడపడం. బల్లకట్టు ఉద్యోగమయినాక పాపయ్య బల్లకట్టు పాపయ్యయినాడు. ఆ సుట్టుపక్కల వూళ్ళ జనానికి, వుత్త పాపయ్యంటే పాపయ్య ఎవురికీ తెలవదు.

పెద్దమనిసి. నమ్మకస్తుడు. ఎవరిజోలికి పోడు. పద్దాకా బజనపాటలు పాడుకుంటా వుంటాడని వూళ్లో పదిమందీ అనుకుంటుంటే నెలకు ఆఱ్రూపాయల పావలా కాడికి బల్లకట్టు ఉద్యోగమయింది పాపయ్యకు.

పెల్లాం బూసమ్మ కట్టివచ్చిన సద్దిమూట బల్లకట్టులోన బెట్టి సెక్క మూతేసి, కాత్తె సలిగా ఉంటాన దుప్పటి అటనే కప్పుకొని, బొడ్డోంచి పుగాకుపాయ తీసి వాసన సూసుకుంటా, యిప్పట్నుంచి బల్లకట్టుకు కరుసుక్కోవటం దేని కనుకుంటా కాలవగెట్టుమీన కూకుని సుట్ట ముట్టిచ్చి, జనం ఎవురన్నా వొత్తా వుండారేమోనని సుట్టుపక్కల సీకట్లో సూత్తా..... ఆలోచనలో పడ్డాడు బల్లకట్టు పాపయ్య.

"ఇంగా జనం ఎవురూ తిరగాట్టం లేదే? ఏం జనమో, ఒక్కోపాలి కోడి కూయకతలికే వొచ్చి తపనబడ్తా కూకుంటారు. ఇంకోపాలి రేత్తిరి యిట్టా యింటికెల్దామని బయిలెల్లి సగం లెక్క బోయినాక ఎవరో ఒకడు దారి మయాన అడ్డుబడి "గెడ్డాం పట్టుకుంటా కాత్తె

కాలవదాటే సెళ్ళు అన్నన్నా" అంటా పానం దీత్తారు – ఏం మద్సులో! యియ్యాల పడవలేం రాటం లేదే? రాతారిబోటు వచ్చే యాలయింది. యీ రాతారిబోటు దర్జా రవిలుబండికన్నా ఉండదు. ఒచ్చి ఒకటేమయిన బాకా వూత్తా కూకుంటారు జనాన్ని పోగుజెయ్యడానికి, యీళ్ళ ఆర్భాటమేగాని యాడజనం యిట్టాంటి లంకణాల బోట్లెక్కకేం? యీ రోజుల్లో యాడ జూసినా బస్సు బుట్టి మాజోరుమీన లగెత్తుతుంటే, ఈ రాతారిబోటో రేందంటా మద్దెనా? అయినా యిప్పటికీ కొంతమంది వుండార్లె! అలవాటుమీనో, కరుజు తక్కువనో, మరదేమన్నా ఒకిటో, పయానం పదిరోజుల పాటయినా బోటెక్కి పోతావుంటారు. బల్లకట్టంటే దాని దారే వేరు.కాలవకు అడ్డంగా బస్సేడపోద్ది? ఒంతెన్లూ బిర్జీలంటే యాడబడ్తె ఆడ ఎట్టుంటై? ఇట్టాంటి కిట్టకాలవకు బల్లకట్టు లేకనేపోతే జనం అల్లాడిపోవల్సిందే ఎప్పటికయినా! అసలు పొద్దుగూకులూ యిట్ట గుక్క తిప్పుకోటానికి యీలవుద్దా బల్లకట్టు మద్సికీ? ఓ కూరగాయల మడుసులేందీ, పుగాకు, మిరపకాయ, నెయి, ఎన్న, పాలు, పెరుగు, నాట్లజనం, కోతల జనం, ఆరేంది, యీరేంది అన్ని యాపారాలు ఈ బల్లకట్టుమీన నడవాల్సిందేగా? యియాల గొల్లజనం రేలేదేందబ్బా? ఆళ్ళొత్తేసరి కాల కడాలు, సేతి మురుగుల్తో బల్లకట్టుమీనంతా యుద్దంసేసి పోతారు – అదొక రకం!" అనుకుంటూ పుగాకు మైకంలో ఏందేందో రకరకాల ఆలోసెనలు సేసుకుంటుండ బల్లకట్టు పాపయ్యకు "ఓ ఎమయ్యోవ్?" అంటా సెవిలో టాప్పున బాకా వూదినట్టు ఎవరో కాలవ ఆతలి గట్టునుంచి అరిశారు.

వులిక్కిబడి, పరకాయించి సూశాడు బల్లకట్టు పాపయ్య. జనం సాగారనుకుంటా. కిట్టకాలవ ఆతలిగెట్టున ఎవురో గెడకర్రకుమల్లె వుండ యిగ్రహం తొందరమీన గావాలు కదంతొక్కుతా అరుత్తావుండాడు.

"ఓ బల్లకట్టు పాపయ్యోవ్ – ఓ నిన్నేనయ్యోవ్? వుండావంటయ్యా ఆడా?" అనరిసింది ఆతలిగెట్టుమీన యిగ్రహం.

"ఆ ఆ, వున్నాలే–" అంటా వొళ్ళు యిరుసుకుంటా లెగిశాడు బల్లకట్టు పాపయ్య.

"వున్నావంటయ్యా? నీ యిల్లు బంగారంగాను, కాత్తె దొబ్బున రానీవయ్యా. బల్లకట్టునూ. పొద్దెక్కుతుండదీ" అంది యిగ్రహం గబగబ.

"అహాఁ, అంత తొందరైతే ఎట్టా? కాత్తె నిదానించవయ్యా నువ్వు ఎవురవో గాని – యీడ బల్లకట్టు గొలుసు వూడదియ్యాలా, గెడ సేతికి తీసుకోవాలా, మరికాత్తె నిల్దొక్కుకో" అన్నాడు బల్లకట్టు పాపయ్య, సేతులకు కాత్తె నోటి ఆవిరి పడ్తా.

"ఆ, అదెంత సేపులే సార్వీసయిన మడిసికీ! గెట్టిగా రెండు తోపులు తోశావంటే అయిపాయె! రానీ రానీ దొబ్బున" అంది యిగ్రహం.

"మళ్లీ అదేమాటా! ఎంత లెక్కనించి వత్తుండా వేం?"

"ఇప్పటికి రెండు కోసులు నడిత్తిని, యింగా రెండున్నర కోసులు పైసిల్కు పోవాలాయె. రానీ, రానీ" అంది యిగ్రహం.

"నీ మడిసి దొంగల్దోల! రెండు కోసులు నడ్సినోడివి బల్లకట్టుకు రెండు నిమిసాలు ఆగలేవంటయ్యా? మం దేవూరేం?"

"దనియాలపాడు, ఎవురన్నా తెల్సా ఆడా?"

"బలేవోడివి! దనియాలపాడే తెలవదంటా! వెంకటకిట్టయ్య బాగుండాడా?"

"చరెలే వెంకటకిట్టయ్య మా మేనమామేగా! ఆయనకేం రాయికిమల్లే వుంటే మడిసీ! నా పేరు రాంకిట్టయ్యలే.

గెట్టుకు బల్లకట్టు సేరీసేరకతలికే రాంకిట్టయ్య దడదడ మాంటా ఎక్కి కడ్డీమీన కూకుని, యిగ బల్లకట్టును పోనీ మన్నాడు.

"పోనిత్తాలే, యింగా మడుసులెవురన్నా వత్తాండారేమో సూద్దాం వుండు" అన్నాడు బల్లకట్టు పాపయ్య అటిటుసూత్తా.

"సూసేదేంది! యిగచరేలే! తెల్లారిపోయేదాకా యీ గెట్టుకాడే కూకో బెడ్తావెట్టా? నే నసలే సానాదూరం పోవాలంటుంటే అటిటు దికుల్జూస్తా మాటినిపిచ్చుకోడేం; ఎయ్ ఎయ్ గడేసి తొయవయ్యా దొబ్బునా నీ పాపయ్య బంగారంగానూ! పుగాక్కాడ కావాలెట్టా? యింద కాల్చుకో, మడుసులెవురన్నా వొత్తావుంటే మళ్లీ తిరిగొద్దువులే గాని నడువు నడువు!" అంటా రాంకిట్టయ్య కడ్డీ పట్టుకుని సిందుల్దొక్కాడు.

"ఎవురు జూసినా యిది గిదీ వరస, పద్దాక అటిటు బల్లకట్టు నడపటమంటే మాటలం డయ్యా! కాలవ పారుదలసూడు ఎట్టతోస్తా వుండదో? పుగాక్కాడకేం గానీ ఓ కానీ బిల్ల కూడా వుంటే సూడు ఎందుకయినా పనికొచ్చుద్ది" అన్నాడు బల్లకట్టు పాపయ్య బల్లకట్టు నడుపుతా.

"సిల్లరేం ఉండట్టులేదే – ఏల్లుండి మళ్ళీ తిరిగొత్తాగా. అప్పుడిచ్చిపోతాలే కానీ యాడికిపోద్ది! అయితే బల్లకట్టు పాపయ్యన్నా! మనకి నెలకి జీతం ఎంతొచ్చుద్దంటా?"

"ఆఁ, వుంటదిలే దెగ్గిరదెగ్గిర ఆరురూపాయిాల పావలా – ఏం సాలుద్ది సచ్చీ?"

"పరవాలేదే? ఎప్పటికయినా డబ్బు డబ్బే! పైన ఏమాత్రం?" అన్నాడు రాంకిట్టయ్య.

"పైనేందీ?" అన్నాడు బల్లకట్టు పాపయ్య.

"ఆఁ అదేలే, పైన కాత్తె కూత్తె సంపాదన వుంటది కావాల్నుగా? అటిటు వొత్తాపోయే జనం అదిదంటూ ఏమన్నా యియరంటయ్యా?"

"అదిదేందీ? యిప్పుడు నీ సంగతేంది సెప్పరాదూ? ఎల్లుండి సిల్లర మార్చి తెత్తా నంటుంటివి! అదిగంతే పైసంటే."

"ఆర్నీ బల్లకట్టుపాపయ్య దెబ్బతీశాడే! అయితే మాటంటే నమ్మకం లేదంటావ్? సరే నువ్వే సూత్తావుగా ఎల్లుండీ! అయితే, నీకు పెల్లాం బిడ్డ లుండరా? వుండక యాడికి పోతారనుకో! యింటికి మల్లీ ఎప్పుడు పోతా? రేత్తిరి బాగా పొద్దెక్కుద్దేం? మరి బల్లకట్టు పనంటే యిగనంతేగా? తెల్లారి సీకట్తో వొత్తా సద్ది బువ్వతెచ్చుకుంటావు గామాల్ను. మరి మద్దానం బువ నీ పెల్లాం తెచ్చుద్దేం? సెప్పిన మాట యింటదా నీ పెల్లాం? యినక ఎట్టుంట దనుకో! పిల్ల లెంతమందీ? నీకు నలభై ఏళ్లుంట య్యనుకుంటా – అసలు నలబయ్యన్నా లేంది బల్లకట్టుపనికి పనికిరా రనాల్చిందే – గట్టుకు చేర్నట్టుందే? మంచోడివిలే అన్నా – ఎవరో అప్పుడే తట్టలెత్తుకొస్తుండారే కోక లెగ్గట్టీ? ఆర్నీ గొల్ల జనం! బలే సందడి గుంటదిలే – ఆవులెల్లుండి యిత్తాలే కానీ బిల్లా – ఎల్తుండా బల్లకట్టు పాపయ్యన్నోవ్" అంటూ పట పట మిరగాయలు ఏపినట్టు మాటలు దులిపి, గెట్టుమీనకి దూకి గొల్లజనాన్ని ఓ సూపుసూత్తా, అంగలేసుకుంటా గెట్టుదిగి డొంకల్లోబడి మాయమయ్యాడు రాంకిట్టయ్య.

"ఓ బల్లకట్టు పాపయ్యన్నోవ్? యిటే వుండావంటయ్యా? నీకు పున్నెం వుంటది కాత్తె ఆదరికి దొబ్బునపోనియి బాబూ, అప్పుడే తెల్లార్తుండది! నాగరత్తీ రాయే దొబ్బునా? చుబ్బక్కా, లచ్చుమ్మా రాండి రాండి – ఎంకాయిపిన్నాం ఏదే? ఓ చీతామోవ్ లగెయ్‌లగెయ్? అంటా గొల్లజనం కడాలు, గొలుసులు కొట్టుకుంటా, మట్టెలు టక్‌టక్‌మనిపిస్తా పెరుగోసన గబ్బుమనిపిస్తుంటే, రవిలు బండిపెట్టెలకుమల్లే తోసుకుంటా వొచ్చి బల్లకట్టుమీన నుంచుండారు సోల్పున మానికా, తవ్వా, పోల, గిద్దలకిమల్లే,

"అంతా వొచ్చారా యింగా ఎవురన్నా పొదలసాటునా వుండారా?" అన్నాడు బల్లకట్టు పాపయ్య గెడమీన ఓరగా ఆనుకుని సూత్తా.

"పొదల సాట్నేందయ్యోయ్? సింతచచ్చినా పులుపు సావలేదంట! యీబల్లకట్టు పాపయ్యకు ఏళ్లు మిగులుండా సెతురు తగ్గటం లేదే? నవుతావు దేనికే నాగరత్తీ? మరి సూడమ్మ యీ పాపయ్యకు తెల్లారిందప్పుడే సెతరాడనూ" అంది ఎంకాయిపిన్నాం.

అదేంది పిన్నాం అట్టంటదేం? గెడకఱ్ఱకుమల్లే పాపయ్య అట్టుంటే ఏళ్లు మిగల్టమేంది పాపం – యిహీహిహీ –" అంది నాగరత్తి కొంగుచాట్న పకపక మంటూ.

"అదేంది పిల్లోవ్ అట్టిరగపడ్తుండావ్? ఆ పొళ్లుకాత్తా రాలి కాలవలో పడేను!" అంది సుబ్బక్క.

"అదేంది చుబ్బమ్మోవ్, అట్టంటావ్. దాని పళ్లు చూసే పుల్లన్న దాన్ని కట్టుకుంటే" అన్నాడు బల్లకట్టు పాపయ్య గెడేసి బల్లకట్టు నడుపుతా.

"సూడే ఎంకాయి పిన్నాం, ఈ పాపయ్యా? నన్నంటే అన్నావుగానీ యింటి కాడ, మా బూసమ్మోదినకాడ అనే వయ్యోవ్ బద్రం వొల్లంతా పిడకలు కొట్టుద్ది!" అంది నాగరత్తి.

"అయితే పద్దాకా ఈ వుత్తకబుర్లేనా, లేకబోతే యియ్యాలన్నా కాత్తె పెరుగు సద్దిబువలోకి పోత్తారా!" అన్నాడు బల్లకట్టు పాపయ్య.

"కాత్తె పొయిరాదంటే నాగరత్తీ!" అంది లచ్చుమ్మ.

"అఁ, నువు పొయరాదూ సాటుగా మూల కూకుండావుగానీ! యియ్యాలసలే నా పెరుగు తగ్గింది. ఏం మాటొచ్చుద్దో, పిన్నాంకాడ. ఏమన్నా దొరుకుద్దేమో?" అంది నాగరత్తి.

"చరే, నా సంగతి పాపన్నకే తెల్చు" అంది ఎంకాయి పిన్నాం.

"పులుపు సిచ్చుగుండది మరీ యియాల నాపెరుగు! మరీ యిదెట్ట పొయనమ్మా–కాదంటే చుబ్బక్కా?" అంది సీతాం.

"యిదిగో మద్దె మీరెందుగ్గాని కొట్టుకోటం, గెట్టొచ్చింది. దిగండి, దిగండి! మీ సంగతి యియాల నాకేమన్నా కొత్తెట్టా? రత్తమ్మ వొత్తావుంటే మిమ్మల్ని అడక్కనే పోదును. పోనీగానీ ఎవురో ఒకరు రేపన్నా కాత్తె పోసిపొండి" అన్నాడు బల్లకట్టు పాపయ్య.

"ఓ, రేపు తప్పకుండా నలుగురం నాలుగింతలు పోసిపోతే సరిగా – దిగరేమే యింకా కూకుండారూ? రాండి, రాండి! పొద్దెక్కింది–" అంటా తోసుకుంటా గెట్టు దిగి ఎల్లిపొయ్యారు గొల్లజనం.

అటెటు సూసి దగ్గిర్లో జనం ఎవురూ లేకబొయ్యేతలికి యాప్పుల్ల యిరుసుకుని నోట్లో బెట్టుకుని, గట్టుమీన కూకుండాడు బల్లకట్టు పాపయ్య.

సంకురేత్తిరి దగ్గిర కొస్తుండది. యిగ కోతల జనం సాగుతా రనుకుండాడు పాపయ్య. యాడ జూసినా వొడ్డగింజ అగుపిస్తా వుంటది. దొబ్బున కోతలొస్తే బాగుండుననుకుంటాడు పాపయ్య. అయినా యీ కూలిజనానికి తగువాడు కోడం తోనె సరిపోద్దిగాని పక్కవోడిమాట యినిపిచ్చుకోరు. అదేమంటే ఆసాములు కూలిగింజలు సరిగా కొలవటం లేదంటారు. ఎంత సెడ్డా ఆళ్ళూ కూలిజనమేగా మరి? మిరబగాయ దర పెరిగిందట. పద్దాకా బల్లకట్టు తొందరేగాని ఏమన్నా యియమంటే రేపు రేవంటాడే ఎప్పుడు సూసినాయీ రంగయ్యి? ఆరోరికి తోస్తే ఏమన్నా యిచ్చి పోతాండాల్సిందే గాని గెట్టిగా ఎవుర్ని మటుకేం నిలవదీస్తా, తప్పుగాదూ? బల్లకట్టు ఎక్కనియ్యకుంటానికి నా యబ్బ సొమ్మెట్టా బల్లకట్టా? యింటో సూడబోతే ఈ బూసమ్మ నేనేమో మూటలు కట్టుకు రాటం లేదనుకుంటది. యిక్కడి యవారం నీకు తెలవదులే అంటే నీకు నోట్లో నాలిక లేదంటది. యింటో వుండే

ఆడగూతురు గనక అదా మాటన్నది. "ఈ భాగ్యానికి సీకట్తోననంగా లెగెసెల్లి వూరు నిదరబోయినాక తిరిగి రావాలా?" అంటది. సీకట్తో లెగిసొస్తుంటే పంచ పట్టుకు గుంజుద్ది తెల్లారినాక పోవచ్చులే అంటా. పద్దాకా మంచంలో కూకుంటానికి ఎనక తింటానికి నీకేమన్నా వుంటేగదా? ఏందో, దాని రంది దాన్దేగాని యివకాడ యవారం కాత్తెన్నా తెల్చుకోక్కర్లా? చుబ్బయన్నా అగుపియటం లేదే కాత్తె అప్పేవన్నా యిత్తాడేమో అనుకుంటుంటే? అనా వజాన ఎటెటుగానో ఆలోసెలల్లో బడిపోతుండాడు బల్లకట్టు పాపయ్య.

"ఓ బల్లకట్టు పాపయ్యన్నోవ్. రావయ్యా రావయ్యా ఆతలేపుకెల్లి అటనే కూకుండావూ?" అంటా అరుస్తా ఆతలేపు జనం గట్టెక్కటం సూసేతలికి వులిక్కిపడి లెగిసి తెడ్డు తీసుకొంటాడు బల్లకట్టుపాపయ్య.

"మీ అమ్మ రాలేదేరా కొండయ్యా? అంతలావుపనేం జేత్తుండదబ్బా యింటికాడా?" అన్నాడు బల్లకట్టు పాపయ్య. కొడుకు కొండాయి మజ్జాన్నం బువ్వ దెచ్చి ఏపసెట్టుకింద పెట్టేతలికి.

"బట్టలు గుంజుకోవాలంట" అన్నాడు కొండాయి.

"బట్టలు యిప్పుడే గుంజుకోవాలెట్టా? నువు బువ దిన్నావంట్రా?" అన్నాడు పాపయ్య బువకాడ కూకుంటా.

"తిన్నానయ్యా, అదేమో నేను బెచ్చాలాడుకుంటంటే వొచ్చి బువ తీసికెల్లని అమ్మ కొట్టిందే!"

"అయితే ఎప్పుడూ బెచ్చాలేనంట్రా నువాడేదీ?"

"బిల్లంగోడుకఱ్ఱ సుబ్బాయి తీసుకెల్లాడు!"

"చీ యదవా ఎప్పుడూ ఆటలేనంటుంటే!"

"నిన్నా, యియ్యాలేనయ్యా నే ఆడ్తుండదీ! అయ్యోవ్? బడ్లోకి పంపిత్తా నంటివే?"

ఎళ్దువులే బడి యాడికి పోద్ది యిదిగో యీపాలి గెట్టిగా పంతుల్లో సెప్పి బళ్లో సేరిపిత్తే సరిగా! మరిఎప్పుడు సెప్పినాపైనొచ్చే మంచి రోజున సేరిపిత్తానంటాడే గాని మరా మంచి రోజు ఎప్పుడొచ్చుదో యిన్నాలకి తేలకబోయే! సివరికి సేతిలో యావన్నా పెట్టమంటాడో ఏందో మరి! యిదిగో యీపాలి అదేదో గెట్టిగానిలేసి తేల్చుకుంటాగా, ఒరే కొండాయ్?"

"ఏందయ్యా?"

"అయితే మీ అమ్మ యింటికాడ ఏం జేసుద్దంటా?"

"బట్టలు గుంజుకోవాలంట."

"ఇప్పుడే బట్టలు గుంజాలెట్టా? బువదీసుకుని కూసేపు యిటొచ్చిపోతే కాళ్ళేం అరిగిపోతయ్యా? ఒరే కొండాయ్?"

"ఏందయ్యా?"

"రేపు మజ్జానం మీ అమ్మనే బువపట్టుకురామను."

"రేత్తిరిఅమ్మతో నువ్వే సెప్పరాదంటయ్యా?"

"పరవాలేదులే సెప్పమంటూంటే?"

"నాకేం, అయ్య సెప్పమన్నాడని సెబుతా!"

"చా ఎదవా పోళ్లు రాల్తయి సెప్పావంటే తెల్చిందా? ఎవురో వొచ్చి అప్పుడే బల్లగట్టుమీద కూకుండరే! కాత్తె వుండవయ్యా బువదింటుండానూ – అంటా బువ తీసుకురావడానికి బూసమ్మ పాలు మాల్తుండదని చిరాకుబడ్తా బువ కాణ్ణుంచి లెగిశాడు పాపయ్య.

❄ ❄ ❄ ❄

ఓ రోజు బాగా రేత్తిరయినాక బల్లకట్టు పాపయ్య యింటికెల్దామని గెట్టు దిగే సమయానికి అవతలి గెట్టు నుంచి పొరుగూరు ఎల్లివస్తావుండ సుబ్బయ్య గొంతు యినిపించింది.

"రా, రా, సుబ్బయ్యన్నా – యింగా నయం, యిప్పుడే బల్లకట్టేసి గెట్టు దిగబోతుండా – ఎన్నాలయిందీ సూసీ! ఏ వూరెల్లావూ ఏంది కతా రా, రా–"

సుబ్బయ్యను యివతలి గట్టుకు సేర్చి మల్లీ బల్లకట్టు గొలుసుబిగిచ్చాడు పాపయ్య.

"కూసేపు కూకునెల్దాం కూసో పాపయ్యా! అబ్బ నడిసి నడిసి సివరకి మనూరి సాయల కొచ్చేతలికి పోయిన పానం మల్లీ తిరిగొచ్చిందంటే నమ్ము! కాళ్లు గుంజుతుండై. కూసేపు కూకుని పోదాంలే వుందూ–ఆఁ తంగిరాల్లో బాకీ వుంటే పోయినాలే కూకో, కూకో నీ పెళ్లాంతో నేను సెబుతాలే!" అన్నాడు సుబ్బయ్య గట్టుమీన సాగిలపడ్తా.

"ఆఁ అదసలే గుబులుమడిసి" అన్నాడు పాపయ్య పొద్దు సానా పోయిందనుకుంటా.

"కాదుమరీ! ఎంత సెడ్డా పెల్లామాయె. యిదిగో మనగాడి లంకపుగాకుండది ఓ పాయ సుట్టిసూడు – కూకో – నా కాడ సెకుముకి వుండదిలే."

సుబ్బయ్య, బల్లకట్టు పాపయ్యలు సుట్టలు ముట్టిచ్చి కూకుండారు సీకట్లో కోటయ్య కొండమీద శిఖరాలకి మల్లే.

ఆ వజాన కూకుని సుబ్బయ్య, బల్లకట్టు పాపయ్యలు ఏ మ్మాట్టాడకుండా సుబ్బయ్య పాపయ్యతో సెప్పిన అస్సల్సంగ తిది:

"పుగాకు అమ్మకం బెట్టిన మన రత్తయ్యను ఎరుగుదువుగా?" అన్నాడు సుబ్బయ్య.

"అదేంది సుబ్బయ్యన్నా రత్తయ్యనే ఎరగనంటా?" అన్నాడు పాపయ్య.

"నీకు ఎందుకు తెలవదు గానీ, అయితే యీ సంగతి యిన్నావా?" అన్నాడు సుబ్బయ్య.

"అదేందో నా కేం తెలుసుద్దీ సెప్పందీ?" అన్నాడు పాపయ్య.

"రత్తయ్య పెల్లాం కాంతమ్మ ఆ పొరిగింట ఈరబెమ్మం పిలుస్తే దేశాంత రాలెల్లిందంట!" అన్నాడు సుబ్బయ్య.

"చా!" అంటా నోరు దెరిశాడు బల్లకట్టు పాపయ్య.

"చా ఏంది! రెండు మూడు దినాలు కప్పిపెట్టారు. చివరకి గబ్బు లెగిసింది" అన్నాడు సుబ్బయ్య సుట్టపొగ పంటిసందుల్నించి వొదుల్తా.

"అదేంది – కాంతమ్మ" అంటున్నాడు పాపయ్య ఇంకా తెప్పరిల్లక.

"మంచిదే మరి! ఏవయినా యివన్నీమన మాటల్తో కట్టబడుండే యవారాలు కాదు సూడూ! ఈ రత్తయ్యేమో నాలుగు డబ్బులు సంపాయిచ్చు కొద్దామని రెండు మూడు దినాలపాటు పొరుగూరు ఎల్తా వుంటాడు, మరి యీ మద్దెన ఈరబెమ్మం ఏ పసర పూశాడో ఏమో – కాంతమ్మ కాస్తా మాయమయింది?" అన్నాడు సుబ్బయ్య.

"అంతా మాయగా వుంది!" అన్నాడు పాపయ్య.

"ఇదిగో మన్లో మాట – మనూరి రంగయ్యకు నువేమన్నా బాకీ పడ్డావంటయ్యా పాపయ్యా?" అనడిగాడు సుబ్బయ్య.

"ఆఁ వుంటే రూపాయో, రెండో వుంటదిలే" అన్నాడు పాపయ్య.

"అబ్బే ఏంలేదుగానీ, వాడి గుణం మనూళ్ళో అందరికీ తెల్సిందేగదా? ఆఁ. నువు ఇంటో లేనప్పుడు ఎల్లి నీ పెల్లాం బూసమ్మను ఏదించుకు తింటాడంట. ఆడ్డి ఆడికి పారేయరాదూ పీడా వదుల్తుందీ – మాట్లాడుకుంటా ఎల్దాం లెగు పొద్దు పోతుండదీ" అంటూ పంచ దులుపుకుంటా లెగిశాడు సుబ్బయ్య.

"ఓ బల్లకట్టు పాపయ్యాన్నేవ్? బాబ్బాబు కాత్తె బల్లకట్టు యివకాడికి రానియి నాయనా సానా పొద్దు పొయ్యొచ్చామూ" అనరిశారు ఎవరో ఆతలి గట్టునుంచి.

❄ ❄ ❄ ❄

ఆ రేత్తిరీ, మరసనాడూ ఏకువజామునా బల్లకట్టు పాపయ్య బజన పాటలు ఎవురికీ యి(నాలా.

మజ్జానం బువదెచ్చిన కొండాయికి బల్లకట్టు ఒప్పజెప్పి, మెట్టపల్లికి గబగబ ఎల్లి తనింటో రంగయ్య సుట్ట ముట్టించుకు పోతుంటం సూసిన బల్లకట్టు పాపయ్య ఎల్లి పెల్లాం బూసమ్మ వొళ్లు పచ్చడిజేసి బల్లకట్టుకాడికొచ్చి యిగ ఆడనే గెడకర్ర తీసుకు కూకుండాడు.

ఆ నిశి రేత్తిరి కిట్ట కాలవ గట్టు కాడికొచ్చి, పాపయ్య కెదురుగ్గా నిలబడ్డది బూసమ్మ కొడుకు కొండాయితో.

"ఇంటికి ఎల్దాం రా" అంది బూసమ్మ ఏడుస్తా.

"దెగ్గిర కొచ్చావంటే సంపుతా – ఎల్లు" అన్నాడు పాపయ్య.

"సంపు,సంపి యీ కిట్టకాలవలో పారెయ్యి నన్ను. నేనే పాపం ఎరగను. నీకేందో గుబులు తిరిగింది" అంది బూసమ్మ.

"ఎవురికి తిరిగిందో యియాల తేలుత్తా" అన్నాడు పాపయ్య.

ఆవజాన ఏం జరిగినా జరగనీ – రేత్తిరి మూడు గంటలయాలకు బల్లకట్టు పాపయ్యను ఎంట బెట్టుకొని కొండాయితో యింటికి చేరింది బూసమ్మ.

అప్పట్నుంచి కొన్నేళ్ళు అయ్యా, అమ్మకు బెదుస్తా రావడం కొండయ్య సూత్తావొచ్చాడు.

"ఒరే కొండయ్యా!" అని ఓనాడు కొడుకుని పిలిచాడు. మంచంలో కూకుండ బల్లకట్టు పాపయ్య.

"ఏందయ్యా?" అన్నాడు కొండయ్య.

"రేపట్నించి యిగమీదట బల్లకట్టుపని నువ్వ సూసుకో నా పని అయిపోతుందది" అన్నాడు బల్లకట్టు పాపయ్య.

"నా పెల్లాం బల్లకట్టుపని వొద్దంటున్నది" అని సెప్పాడు కొండయ్య.

మరసనాడు కోడితోపాటు లెగిసి,పెల్లాం కట్టబెట్టిన సద్దిమూట తీసుకుని కఱ్ఱ పొడుసుకుంటా బజన పాటలు పాడుకుంటా ఎప్పటికిమల్లే కిట్టకాలవ బల్లకట్టు వైపుగా ఎల్లాడు బల్లకట్టు పాపయ్య.



# సంజీవదేవ్

**(1924 - 1999)**

**స**ంజీవదేవ్ గారికి ప్రపంచం ఒక పరిశోధనా కేంద్రం లాంటిది. అందులో వీరు నిరంతరమూ - రసం, రూపం, భావం, కళలూ, తత్త్వం, రమణీయకతా మొదలైన విషయాలపై పరిశోధన సాగిస్తూనే వుంటారు. తెలుగుతో పాటు సంస్కృత, ఆంగ్ల, ఫ్రెంచి, వంగ, హిందీ, ఉర్దూ భాషలలో ప్రావీణ్యం సంపాదించుకున్నారు. ప్రాచ్య, పాశ్చాత్య చిత్రలేఖనా పద్ధతులను బాగా అవగతం చేసుకున్న గొప్ప కళా విమర్శకుడు, ప్రకృతి దృశ్య చిత్రకారులు. ఉత్తరాలు వ్రాయడములో సిద్ధహస్తులు. గొప్ప వక్త. ఆ సాంస్కృతిక జీవి రచనలూ, లేఖలూ, ఉపన్యాసాలూ - మానసిక వికాసానికి తేజోరేఖ ల్లాంటివి. “సంజీవదేవ్ గారు కథలు కూడా వ్రాస్తారా?” అని ఆశ్చర్య పోయేవారికి ఈ సంపుటి లోని కథ వారు వ్రాసిన తొలి కథ అంటే మరీ ఆశ్చర్యం కలగకపోదు. స్వగ్రామం తుమ్మపూడి.

**రచనలు :** రసరేఖలు, సంజీవదేవ్ లేఖలు, తేజోరేఖలు

# ప్రొఫెసర్ భార్య

**కి**టికీలోగుండా తోటలోని పూలతో చిన్న చిన్న చెట్లూ పూలతో లేని పెద్ద చెట్లూ కనిపిస్తూన్నాయి. గదిలో గోడమీద ఒక్క బొమ్మ కూడా లేదు. గదిలోని నేలంతా డిజైన్లు లేని ఒకే రంగు, లేత పసుపు తివాచి పరిచివుంది. అక్కడక్కడ గోడకు ఆనికొన్ని దిండ్లున్నాయి. మధ్యకు కొంచెం దూరంలో ఒక ముక్కాల పీట మీద ఇత్తడి పుల్‌దాన్; అందులో ఒకే ఒక తెల్లని పూవుతో వున్న ఈస్టర్ లిల్లీ మొక్క. ఈస్టర్ లిల్లీ మృదు పరిమళం అవ్యక్తానందాన్ని వెదజల్లుతూంది.

ప్రొఫెసర్ భార్య మందాకిని కిటికీ దగ్గర నిల్చొని చెట్ల పండిన ఆకులలో గుండా నీలాకాశాన్ని చూస్తూంది ఏదో దృశ్యజగత్తును దాటిచూచే కళ్ళతో, దూరంగా ఆకాశంలో తెల్లకొంగ ఒకటి ఎగురుతూ అదృశ్యమైపోయింది.

మందాకిని భుజంమీద స్పర్శతో వెనుతిరిగి చూస్తే, ప్రొఫెసర్ దయానిధి నవ్వుతూ నిలుచొని వున్నాడు.

“ఏమిటి దివాస్వప్నాలు కంటున్నావు కిటికీలోగుండా?” అన్నాడు.

“నేను కనే దివాస్వప్నాలు, మీరు కనే నిశాస్వప్నాలు కంటే ఎంతో ఎక్కువ వాస్తవత్వం కలవి” అంది మందాకిని, ప్రొఫెసర్ చేతిని తన చేతిలోకి తీసుకుని.

ప్రొఫెసర్ దయానిధికి నలభై ఏళ్ళుంటాయి. మందాకిని వయసు ప్రొఫెసర్ వయసుకంటే ఇంకా రెండు మూడేళ్ళు ఎక్కువ. ఆయన అప్పుడు జర్మనీలో భాషా విజ్ఞానంలో డాక్టరేట్‌కు అధ్యయనం చేస్తూన్నాడు. ఆమె అక్కడ పాశ్చాత్య సంగీతాన్ని గురించి అనుశీలన చేస్తూంది. ప్రథమంలో ఒక జర్మన్ సంగీతజ్ఞుణ్ణి వివాహం చేసుకోవాలనే నిర్ణయించు కొన్నది. కాని దయానిధితో పరిచయం, స్నేహం, ప్రేమ ఏర్పడ్డ తరువాత తనకంటే రెండు మూడేళ్ళు చిన్నయినా దయానిధినే చేసుకో నిర్ణయించింది. దయానిధి కూడా

తాను అవివాహితుడుగా వుండాలనే నిర్ణయాన్ని మార్చుకొని మందాకిని చేసుకొనేందుకు సుముఖుడైనాడు. తన కంటే రెండు మూడేళ్ళు పెద్దదయినా కూడా.

కిటికీ దగ్గరనుంచి ఇద్దరూ వరండాలోకి వచ్చారు.

"స్వీడన్ నుంచి వస్తామన్న మిత్రులు రావటంలో ఇంకెంత ఆలస్యం పడుతుందో" అన్నది మందాకిని పారిజాతం చెట్టునుంచి ఎర్ర తొడిమెల తెల్లపూలు రాలటం చూస్తూ.

"వారి విమానం వాతావరణం అనుకూలంగా లేనందున కెయిరో లో ఆగిపోయిందట. ఇవాళ వస్తారో రారో అనుమానం" అన్నాడు ప్రొఫెసర్.

"ఆ స్వీడిష్ మిత్రుల కంటే వారు నా కోసం తెస్తున్న ప్రసిద్ధ స్వీడిష్ కేమిరా "హేజెల్‌బ్లాడ్"ను చూడాలని నాకు తొందరగా వుంది" అన్నది మందాకిని.

"అయితే నీవు చాలా స్వార్థపరురాలవన్న మాట. మిత్రుల మీద కాక మిత్రులు తెచ్చే వస్తువుల మీద నీకు ప్రేమ ఎక్కువన్నమాట!" అన్నాడు ప్రొఫెసర్.

"ఇతర్లకు కష్టాల్నీ నష్టాల్నీ కలిగించని స్వార్థం పరమార్థమే అవుతుంది కాని స్వార్థంకాదు. అందుకు వ్యతిరేకంగా, ఇతర్లను బాధపెడుతూ చేసే పరార్థం అనే కొన్ని పనులు నిజానికి స్వార్థమే అవుతాయి" అన్నది మందాకిని.

"అయితే, ఇకనుంచి నిఘంటువులోని అర్థాలను మార్చాల్సి వుంటుంది. నీ నిర్వచనం ప్రకారం స్వార్థం అనే పదానికి ఇతరులకు ఉపకారం చేయుట అనీ పదార్థ అనే పదానికి స్వలాభం అనీ అర్థాలు నిర్ధారించాల్సి వుంటుంది" అన్నాడు ప్రొఫెసర్ మందాకిని తలలో నుంచి తెల్లగులాబిని పైకి లాగుతూ.

"నీవు భాషా విజ్ఞానివి. నీవు ఏ పదాన్ని ఏ అర్థాలలోకైనా మార్చగలవు. అవును అనే పదానికి కాదు అనే అర్థాన్నీ, జీవితం అనే పదానికి చచ్చుట అనీ, మరణం అనే పదానికి బ్రతుకుట అనీ, స్త్రీ అంటే మొగ అనీ, పురుష అంటే ఆడ అనీ ఇటువంటి భాషా ఇంద్రజాలాన్ని ఎంతైనా చేయగలరు భాషా విజ్ఞానులు" అన్నది మందాకిని.

భోజనం వడ్డించాను అంటూ వంటమనిషి వచ్చాడు. దంపతులిద్దరూ లోపలికి పోతుండగా, ఇద్దరు బాలికలు బయటి నుంచి వచ్చారు. ప్రొఫెసర్ భార్య నడుపుతూన్న అనాధ శరణాలయానికి చెందిన బాలికలు. ఈ రోజు సాయంత్రం అనాథ శరణాలయపు వార్షికోత్సవం సందర్భంలో ఏర్పాట్లన్నీ పూర్తి అయినాయి. ఆమెను చూచిపొమ్మని వచ్చారు.

మందాకిని అన్నది ఆ బాలికలతో "మీ రిద్దరు కూడా మాతో భోజనం చేయండి. తరువాత అంతా కలిసి శరణాలయానికి పోదాం."

"మేము భోజనాలు ముగించుకొనే వచ్చాం. మళ్ళీ ఎలా భోజనం చేయగలం" అన్నారు ఆ బాలికలు.

"అయితే మాతోపాటు కూచొని పళ్ళు తినండి. రండి లోపలకు" అంటూ వాళ్ళ తలలు నిమురుతూ వాళ్ళని లోనికి తీసుకువెళ్ళింది. ఇంతలో కవితకూడా పరుగెత్తుక వచ్చింది. కవిత మందాకిని కూతురు. వయస్సు పది.

❄ ❄ ❄ ❄

స్వీడన్ నుంచి వచ్చిన మిత్రులు ముగ్గురు. ఇద్దరు స్త్రీలు, ఒక పురుషుడూ. వీరికి ప్రొఫెసర్ దయానిధితో ఇదివరలో పరిచయం లేదు. కాని మందాకినికి బాగా పరిచితులు. ఆమె స్కాండినేవియా పర్యటన చేసినప్పుడు వీరుముగ్గురు కూడా ఆమెతో పర్యటించారు. భారతదేశాని కొచ్చి ఇక్కడున్న ప్రాకృతిక వైభవాన్ని, మానవుల దారిద్ర్యాన్నీ, భారతీయ సంస్కృతిలోని వైవిధ్యాలనూ, జీవన విధానాల్లోని వడుదుడుకులనూ, భారతీయ తత్వశాస్త్రపు మహత్వాన్నీ చూచిపొమ్మని వారిని ఆహ్వానించింది మందాకిని.

వారికి దేశంలో చూడదగినదంతా చూపించింది. కంటికి కనుపించే యథార్థాన్ని మభ్యపెట్టి మరోవిధంగా వ్యాఖ్య చేసి వారికి బోధించలేదు మందాకిని. సన్నని గొందులలో ప్రవహిస్తున్న మురికినీటి దుర్గంధాన్ని మార్మికమైన అర్థాలలోకి అన్వయించి అది భారతీయ సంస్కృతిలోని ప్రత్యేకత అని ఆ విదేశీయులకు చెప్పలేదు మందాకిని. వెలుగును వెలుగుగానూ, చీకటిని చీకటిగానూ మాత్రమే వారికి ప్రదర్శించింది. నిరక్షరాస్యులైన కోట్లకొలది ప్రజలను చూసి "వీళ్ళకు విద్యలేక పోతే మాత్రం ఏమి. మీ పాశ్చాత్యులలో విద్యావంతులకు కూడా తెలియని తాత్విక రహస్యాలు వీళ్ళ కెన్నో తెలుసు" అనే అసత్యాలను ఆ స్వీడిష్ మిత్రులకు వినిపించలేదు ప్రొఫెసర్ భార్య. భారతీయ ఆదర్శాలలో వున్న గొప్పతనానికి ఆచరణలో వున్న తక్కువ తనానికీ మధ్య సుస్పష్టంగా గోచరించే భేదాన్ని అస్పష్టం చేయ ప్రయత్నించలేదు ఆమె.

ఇప్పటికీ భారత దేశంలో వ్యాప్తమైవున్న అంటరానితనాన్ని గురించి విన్న తరువాత స్వీడిష్ మిత్రులన్నారు. "మానవుడుకీ మానవుడుకీ మాత్రమేకాక మానవుడికీ పశు పక్షులకూ కూడా భేదం లేదు. అన్నిటిలోనూ ఒకే పరమాత్మ ప్రకాశిస్తున్నాడు అని భారతీయతత్వం ఘోషిస్తుంటే ఆ తత్వాన్నే అనుసరిస్తున్నామనే సమాజం తోటి మానవులనే అంటుకోటం తప్పు అంటారు. సూత్రాలకూ సామాజికాచరణకూ ఇంత వైరుధ్యమా? నిజానికి ఏ దేశంలోనైనా ఆదర్శాలకూ ఆచరణకూ భేదం వుండకపోదు. కాని ఇంత విపరీతభేదం మరెక్కడాలేదేమో!"

"అవును, ఇటువంటి విపరీత భేదం భారతదేశంలోనే. అందులో ప్రత్యేకించి హిందూ సమాజంలోనే ప్రధానంగా గోచరిస్తూన్నది" అన్నది మందాకిని గంభీరంగా.

దేశంలోని మైదాన ప్రదేశాలను చూడటం అయిన తరువాత హిమాలయ ప్రదేశాలను చూడాలని బయలుదేరారు విదేశీ మిత్రులూ, మందాకినీ కూడ.

కాఠ్, గోదాంలో రైలు దిగి కారులో బయలుదేరారు రాణీఖేత్‌కు. రోడ్డు పాము మెలికలు తిరుగుతూ హిమాలయ పాదాలను ఆరోహిస్తూంది. సన్నగా పొడవుగా పెరిగిన రకరకాల పైన్ వృక్షాలూ,లోయలూ, కొండలూ, కొండలకావలగా నీలాకాశం. ఆకాశంలో తెల్లని పలుచని దూది మబ్బులూ, చల్లగాలీ ఇవన్నీ కూడ వేడీ, దుమ్మూ ధూళితో నిండిన మైదానాల్లో తిరిగి వచ్చిన విదేశీ మిత్రులకు తన్మయత్వా న్నివ్వసాగినాయి. ఇంతవరకూ చూచింది అదొక భారతదేశం; ఇప్పుడు చూస్తున్నది ఇదొక భారతదేశం.

పొదల మధ్యగా, రాళ్ళలో గుండా తెల్లగా నురుగులు కక్కుతూ ఒక ధార ప్రవహిస్తూన్నది. అక్కడ కారు ఆపుకొని అందరూ కొంచెం అల్పాహారాన్ని తీసుకొంటున్నారు. ప్రక్కనున్న కొండల పల్లెలనుంచి కొంతమంది పశువుల్ని మేపటాని కటు తోలుకవచ్చారు. విదేశీ ముఖాల్ని చూచి వాళ్ళంతా గుమికూడారు. తినే అల్పాహారాన్ని వాళ్ళకు కూడా పంచిపెట్టి, మందాకిని వాళ్ళతో ఏదో సంభాషించిన తరువాత వాళ్ళ దారిన వాళ్ళు పశువుల్ని తోలుకొని ఆ పర్వత సానువుల వైపుకు వెళ్ళారు.

స్వీడిష్ వారు ఆశ్చర్యపోయి మందాకిన్ని అడిగారు. "ఏమిటి, ఇక్కడి యీ హిమాలయ ప్రాంతంలో కూడా మనుషులు ఇంత దుర్భలంగా దీనావస్థలో వున్నట్లున్నారు? ఇటువంటి సుందరమైన, ఆరోగ్యమైన ప్రకృతి మధ్య నివసిస్తూ గూడా మనుష్యులు ఇంత దుస్థితిలో వుండటం చాలా ఆశ్చర్యంగా వున్నది. ప్రకృతి వైభవం అపారంగా వున్నది. దానికి విరుద్ధంగా మానవుని దైన్యంకూడా అపారంగా వున్నది!"

"ఇంకా మైదానాలలోనే చాలా వరకు నయం. ఇక్కడ హిమాలయాల్లోని ప్రజల ఆర్థిక దుస్థితి చెప్పటానికి వీలు లేనంతగా వున్నది. దారిద్ర్యం, దైన్యం, వ్యాధులూ యీ పర్వత ప్రాంతాలలో చాలా అధికం. ఇక్కడ మనం చూడాలిసింది చెట్లనూ, జంతువుల్నీ, లోయల్నీ, హిమశృంగాన్నీ కాని ప్రజలను కాదు" మందాకిని విచారవదనంతో అన్నది.

కారు ఎత్తుకు వెళ్ళిన కొద్దీ వాతావరణంలో చల్లదనం ఎక్కువ కావటం ప్రారంభించింది. అడుగడుగుకూ తెల్లని చల్లని జలధారలు గలగల పైనుంచి క్రిందకు పరుగెత్తుతూన్నాయి. ప్రయాణీకులకు ఏదో అలౌకిక ఆనందం తట్టసాగింది. ఒక్కో తావున ఒక్కో రంగు పూలు ఎంతో స్థలాన్ని ఆక్రమించి వుంటాయి. ఒక్కో లోయలో దట్టమైన అరణ్యం. ఒక్కోలోయలో అరణ్యం లేకుండా రాళ్ళూ నీళ్లూ.

సూర్యాస్తమయం అవుతూండగా ప్రయాణీకులు రాణీకేత్ చేరుకొని డాక్ బంగళాలో బసచేశారు. మేఘాలు లేని విశుద్ధాకాశంలో మొదటి హిమాలయ సంధ్యను దర్శించారు;

స్వీడిష్ మిత్రులు ఉత్తరంగా లోయల మీదుగా ఆకాశంలోకి తూర్పు నుంచి పడమటకు రెండు వందల మైళ్ళ పొడవునా హిమశృంగాలు సంధ్యారాగాన్ని ప్రతిబింబిస్తూ నిలిచి వున్నాయి. ఆ దివ్య దీప్తిముందు మందాకినీ, స్వీడిష్ మిత్రులూ తన్మయత్వంతో తలలు వంచి కళ్ళు మూశారు.

రెండో రోజు రాణీ ఖేత్‌కు సమీపంలోనే వున్న ద్రోణగిరి పర్వతపంక్తుల్నీ, అక్కడ ద్వారాహాట్ అనే దేవాలయాల్నీ చూచి సాయంత్రానికి మళ్ళీ బంగళాకు చేరుకొన్నారు. స్వీడిష్ మిత్రులు ఆమెకు తెచ్చియిచ్చిన 'హేజల్ బ్లాడ్' కెమెరాతో మందాకిని ఎన్నో, నలుపూ, తెలుపు లోనూ, రంగుల్లోనూ, దృశ్యాలను ఫొటో తీసింది. ఒక దేవదారు కొమ్మమీద ఎత్తున కూర్చున్న ఒక విచిత్ర వర్ణాలలో వున్న పక్షిని 50 సెంటిమీటర్ల టెలిఫొటోలెన్సును ఉపయోగించి క్లోజప్ తీసింది ఆగ్ఫాకలర్‌లో.

"ఈ హిమాలయ ప్రదేశాన్ని వదిలి మళ్ళీ స్వదేశానికి వెళ్ళబుద్ధి పుట్టటం లేదు" అన్నారు స్వీడిష్ మిత్రులు, దూరాన ఉత్తరంగా కనుపించే హిమశిఖరాల పంక్తిని చూస్తూ.

"అవును, నాకూ అలాగే అనిపిస్తుంది; ఇక్కడే వుండిపోవాలని. అయితే ప్రొఫెసర్ ఇప్పట్లో విశ్వవిద్యాలయాన్ని వదిలి రాడు. మా అమ్మాయి కవితకు చదువులు సాగటం కష్టం. ప్రొఫెసర్‌ను వంటరిగా వదలేసి నేనిక్కడ వుండగలను కాని నన్ను వంటరిగా వదలేసి ప్రొఫెసర్ అక్కడ వుండలేడు. కవిత నన్ను వదలి వుండగలదు కాని తండ్రిని వదలి వుండలేదు. ఒకసారి ఏదో మాటల సందర్భంలో ప్రొఫెసరన్నాడు "నీవు హిమాలయాలలో వుండిపోతే నేనూ కవితా ఇక్కడ వుండటానికి బాధపడకుండా వుండేలాగా తయారు కాగలం" అని. కనుక యీ విషయంలో కూడా అంత బాధ లేదు" అన్నది ప్రొఫెసర్ భార్య.

"అయితే ఇంకేం మనమంతా కలిసి యీ సురమ్య ప్రదేశంలో ఒక ఆశ్రమం ఏర్పరచుకొని పరతత్వ సాధనలో ఆనందాన్వేషణ చేతాం. మేమూ స్వదేశాలకు తిరిగి వెళ్ళాల్సిన అవసరం లేదు. మేము స్వేచ్ఛావిహంగాలం" అన్నారు విదేశీ మిత్రులు.

"సరే నేనూ అందుకు తయారే" మందాకిని అన్నది.

''ఈ ప్రాంతంలో కొంతమంది పాశ్చాత్యులు ఇదివరకే ఆశ్రమవాసాలు చేస్తున్నారటగా?" అన్నారు వారు.

"అవును, కొందరు గొప్ప పాశ్చాత్య మేధావులు ఈ ప్రాంతంలో ఆశ్రమవాసులై శాశ్వతానంద సాధనలో కాలం గడుపుతున్నారు."

ఉదయం డాక్ బంగాళా వరండాలో కూచొని ప్రయాణీకులు నలుగురూ ఫలహారాలు చేస్తున్నారు. డాక్ బంగళా వాచర్ అటూ ఇటూ తిరుగుతున్నాడు. మందాకిని అతన్ని

దగ్గరకు పిలిచి అతను హిమాలయాలలోని ఏ భాగానికి చెందిన వాడో అడిగింది. తాను అక్కడకు పడమటగా వున్న జౌన్సార్ నుంచి వచ్చినట్లు చెప్పేడు. స్వీడిష్ మిత్రులు కూడా అతని మాటల్లో అభిరుచి కనపరచారు. మందాకిని అతని మాటల్ని వారికి అనువదించి చెపుతూన్నది.

"మీ ప్రాంతంలో అన్నదమ్ము లందరికీ ఒకే భార్య వుందట నిజమేనా?" మందాకిని వాచర్ని అడిగింది.

"అవునమ్మా నిజమే. ఎంతమంది అన్నదమ్ములున్నా, వారందరికీ భార్య మాత్రం ఒకటే పంచపాండవులకు ద్రౌపది లాగా" అన్నాడు వాచర్.

ఆ విషయాన్ని విదేశీయులకు ఆమె అనువదించి చెప్పింది. వాళ్ళు చాలా ఆశ్చర్యపోయారు. చాలా సేపటివరకూ నిర్ఘాంతపోయారు. ఏ విధంగా కుదురుతుందా అని వాళ్ళ విస్మయం.

మందాకిని అన్నది "ఇటువంటి సాంఘిక వ్యవస్థలో ఇబ్బందులు కొన్ని వున్నా ఒక వీలు మాత్రం వున్నది. అదే కుటుంబ నియంత్రణ. ఈ బహుభర్తృ వ్యవస్థ మూలంగా కుటుంబాలు ఎక్కువ కావు. ఒక స్త్రీకి ఒక భర్త వుంటే ఎందరు సంతానం కలుగుతారో పదిమంది భర్తలున్నా అందరే సంతానం కలుగుతారు కాని ఎక్కువ కలగరు. ఒక కుటుంబంలో ఆరుగురు అన్నదమ్ములుండి ఆరుగురికి ఆరుగురు భార్యలుంటే సగటున ఒకో భార్యకు ముగ్గురు పిల్లలు కలిగినా ఆరుగురి భార్యలకూ పద్దెనిమిది మంది పిల్లలవుతారు. ఆ విధంగా కాక ఆరుగురికీ ఒకే భార్య వుంటే పై లెక్క ప్రకారం ముగ్గురు పిల్లలే వుంటారు. ఈ విధంగా ఇదొక విధమైన కుటుంబ నియంత్రణ బాగా లేదా ఈ పద్ధతి?"

స్వీడిష్ మిత్రులు నవ్వి చాలా బాగున్నదన్నారు.

మూడో రోజు రాణీఖేట్‌కు చుట్టుపట్ల వున్న మరికొన్ని రమణీయ స్థానాలను చూచి రాబోయారు నలుగురూ.

❄ ❄ ❄ ❄

ప్రొఫెసర్ దయానిధి తన బంగళాలో కూచొని హెమిటో సెమిటిక్ భాషా కుటుంబాన్ని గురించి ఒక సుదీర్ఘమైన వ్యాసం వ్రాస్తూన్నాడు. భాషా వైజ్ఞానిక ప్రత్యేక సంచిక కొకదానికి. కవిత దగ్గరలో వున్న సోఫాలో కూచొని అమ్మ ఎప్పుడొస్తుందని తండ్రిని అడుగుతూన్నది. ఆయన వ్రాస్తూనే, "తొందరలోనే వస్తుందమ్మా, అమ్మను చూడ బుద్ధిపుడుతూందా?" అన్నాడు. అందుకామె లేదన్నట్లు మౌనంగా తలకాయ అడ్డంగా త్రిప్పింది.

ఇంతలో పోస్టు మనిషి కొన్ని వుత్తరాలను తెచ్చి ప్రొఫెసర్ చేతికిచ్చాడు. ఆ ఉత్తరాన్ని బల్లమీద పడేసి తన వ్యాసాన్ని పూర్తి చేయడంలోనే తిరిగి నిమగ్నుడైనాడాయన. మళ్ళీ కవిత అన్నది "అమ్మ దగ్గర నుంచి ఏమైనా ఉత్తరం ఉన్నదా" అని. "చూడు నీవే" అని ఆయన వ్రాస్తూనే వున్నాడు.

మళ్ళీ వెంటనే తానే వ్రాసేదాన్నిఅవతలుంచి ఆ ఉత్తరాల్లోనుంచి ఒక బూడిదరంగు కవర్ను తీసి చించి సోఫాలో పడుకుని చదవసాగేడు మనసులో. కవిత మిగతా విదేశీ కవర్లమీది రకరకాల తపాలా బిళ్లలను ఊడతీసుకొనే పనిలో లీనమైంది. ప్రొఫెసర్ ఉత్తరం కొంత చదివి మళ్ళీ మొదలు పెట్టేడు :

**అత్యంత ప్రియమైన ప్రొఫెసర్!**

నీవూ, కవితా ఆరోగ్యంగానూ ఆనందంగానూ వుంటారని ఆశిస్తాను. స్వీడిష్ మిత్రులూ నేను కలిసి హిమాలయ ప్రాంతాలను సందర్శిస్తూ అనుపమ ప్రకృతి శోభను ఆనందిస్తున్నాం. శాశ్వతానంద సాధనకు ఈ ప్రదేశాలు ఎంతో యోగ్యంగా వున్నాయి.

ఇంద్రియాలద్వారా బోలెడంత ఆనందాన్ని అనుభవించొచ్చు. సందేహం లేదు. కాని ఆ ఆనందంలో శాంతికంటే అశాంతి ఎక్కువుంటుంది. అందుకే ఇంద్రియాలిచ్చే ఆనందంకంటే మించిన ఆనందాన్నిఅనుభవించే నిమిత్తం మానవుడు స్మరణాతీతకాలం నుంచీ నేటివరకూ అన్వేషణ జరుపుతూనే వస్తున్నాడు; ఆ అన్వేషణ ఫలిస్తూనే వస్తూన్నది.... దీన్నే ఆత్మసాధన అంటాం.

ఆత్మసాధన నిమిత్తం హిమాలయాలలోనే వుండాలా నగరాల్లో వుంటే కుదరదా అంటారు చాలా మంది. ఎందుకు కుదరదు. కుదురుతుందీ, అయితే ఒక్క విషయం మాత్రం నిర్వివాదాంశం. మానవచేతన పైన పరిసర ప్రభావం ఎంతైనా వుంది. పరిసర ప్రభావాలనుంచి స్వేచ్ఛను పొందాలనే, తనను చుట్టి వున్న పరిస్థితులను అధిగమించాలనే మానవుని నిరంతరా కాంక్ష.

కాని సాధకుడు ప్రథమంలోనే ఆ పని చేయలేడు. అందుకే తనకు ఇష్టమైన, ఆనందానుభూతి నిచ్చే పరిసరాన్ని ఎన్నుకుంటాడు. హిమాలయప్రాంతాల నైసర్గికశోభ, ఇక్కడి శీతల వాతావరణం అలాంటి అశరీర అనుప్రేరణ కలిగించటానికి ఎంతో అనుకూలంగా వుంటాయి. అందుకే హిమాలయాలకు సాధన భూమి అనే పేరు.

నీవు నా మనస్తాత్విక రహస్యాన్ని బాగా ఎరుగుదువుగా; యవ్వనంలో మన ఇద్దరం హీడెల్ బర్గులో ప్రేమించి వివాహం చేసుకున్న నాటి నుంచీ కూడా ఇంద్రియాలు ఇవ్వగలిగిన ఆనందం కంటే ఇంద్రియాలు ఇవ్వలేని ఆనందం వైపు నా మొగ్గు వుండేది ఎక్కువగా. అ మనస్తత్వం క్రమేణ బలమవుతూ రావడం కూడా నీవు కనిపెడుతూనే వున్నావు. నీవు

ఒకరోజు అన్నావు."నీ జీవితం క్రమేణ మీరాబాయి జీవితం అవుతూన్నట్లుంది" అని. అవును. అంతే అయింది.

శరీర చైతన్యంలో జీవించటంలో నాకేమాత్రమూ ఆనందం జనించటం లేదు. అశరీరానందం మాత్రమే నాకు ప్రస్తుత శరణ్యం. ఈ హిమాలయాల కమనీయ దృశ్యాల మధ్య నివసిస్తూ అశరీర సాధన సాగించటంలోనే నా ఆనందం ఇమిడి వుంది.

ఇలాంటి జీవితాన్ని పలాయనవాదం (Escapism) అనే పేరుతో పరిహసించవచ్చు. పరిశీలించి చూస్తే పలాయనవాదం కాంది ఏది? సంగీతం, కవిత, నాట్యం, చిత్రం, శిల్పం అన్నీ పలాయన వాదంలోనివే. మరణించటం అన్నిటి కంటే గొప్ప పలాయనవాదం. అందుకని ఇవన్నీ చేయకుండా జీవించటం ఎలా? ఇవన్నీ చేయకుండా జీవించటం అన్నిటికీ మించిన గొప్ప పలాయన వాదం?

సరే, స్వీడిష్ మిత్రులూ నేనూ కూడా ఇక్కడే ఆశ్రమజీవులుగా స్థిరపడి పోతున్నాం. ఈ హిమాలయ శోభమధ్య శాశ్వతానంద సాధనలో, నే నిప్పటిలో మీ తావుకు రాను. సెలవల్లో కవితను తీసుకొని నీవు కూడా వచ్చిపో, వీలుంటే కవితా, నీవూ కూడా శాశ్వతంగా మాతోనే వుండిపోండి. మనమంతా ఆనంద దీపికలై వెలుగుదాం.

సెలవు నేటికి.

నీ ప్రియమైన
**మందాకిని.**

# పి.వి. సుబ్బారావు



**సా**రస్వాతాభిలాషి, రాజకీయవాది, యం.యన్. రాయ్ అనుచరులు. మంచి వక్త. కథకులు. నవలాకారులు. వ్యాసకర్త. రాజకీయసంబంధమైన కథలువ్రాసే బహుకొద్ది మంది రచయితల్లో వీరు ఒకరు. నోటిలో వేసుకొంటే, చల్లని బాధతో నాలుక లాగివేసే 'వడగళ్లు' లాంటి వీరి కథలు - వాస్తవంలోని కాఠిన్యతను నిర్మోహమాటంగా వెలిగ్రక్కుతాయి.భాష, శైలి, శిల్పం - వీరి కథల్లో నిండుదనాన్ని పుణికి పుచ్చుకున్నాయి.

**రచనలు :** ఆమె చెప్పింది, శ్రీమతి రజనీకాంతా రావమ్మాజీ, గాలిపటం (నవలలు), దేశద్రోహి, జైహింద్, వడగళ్లు కథల సంపుటాలు, రష్యా విప్లవం, యం.యన్. రాయ్ జీవితం రాజకీయ గ్రంథాలు.

# స్మారక సభ

ఇది వ్రాస్తున్న నాటికి సరీగ్గా పది సంవత్సరాల క్రిందటి సంగతి. ఆ రోజు నా స్మారకసభ. సభను సారస్వత ప్రియులు, రాజకీయవాదులు, నా స్నేహితులు, అభిమానులు అంతా కలిసి ఏ అభిప్రాయభేదాలు లేకుండా ఏర్పాటు చేశారు. స్మారకసభ ఏర్పాటుకు విరాళాలు విరివిగా, ధారాళంగా వచ్చిపడ్డాయి. అందరూ పూనుకొని దాన్నొక బృహత్కార్యంగా తలపెట్టారు. అసలు ఈ అవసరం పూనిక కలుగుతుందని ముందే అయత్తపడివున్నారు కొంతమంది – కాదు, చాలా మంది. దానికి ఒక కారణం గూడా వుంది. అంతకు ముందు పది రోజుల క్రిందటో పదిహేను రోజుల క్రిందటో నేను జబ్బుచేసి పడివున్న సంగతి పత్రికల్లో ప్రకటించబడింది. నాకు వైద్యం ఎవరు చేస్తున్నదీ ఎక్కడ చేస్తున్నదీ మాత్రం వ్రాయలేదు పత్రికల్లో. జబ్బేమిటో గూడ వ్రాయలేదు. దేశంలో– ముఖ్యంగా మా పట్టణంలో – అనేక రకాలైన పుకార్లు పుట్టాయి. నాకు జబ్బు చేసిన మాట వాస్తవం కాదన్నారు కొందరు.

"జబ్బు చెయ్యడమేమీటి! బ్రహ్మాండంగా చేసింది. కోలుకోవటం కష్టం" అన్నారు మరికొందరు.

"ఓరి మీ కడుపులు వుడక, ఆయన దారిన ఆయన ఎప్పుడో చక్కాపోతేను" అన్నాడు ఒక సహృదయుడు.

"అయితే మరి జబ్బుగావున్నట్లే ఎందుకు వ్రాశారు పత్రికల్లో?" అని ప్రశ్నించాడు ఒక కుర్ర కుంక.

"దానిలోనే వుంది మజా. చనిపోయాడని వ్రాస్తే ఏముంది మరి!" అన్నాడు సహృదయుడు.

"ఏమిటి ఆ మజా?" అడిగాడు కుర్రకుంక.

"నీకు తెలీదు" అన్నాడు సహృదయుడు

"ఎందుకని?" పృచ్ఛించాడు కుర్రకుంక.

"నీవు కుర్రకుంకవు గనక" అన్నాడు సహృదయుడు నిండుగా.

"అంతే. అంతే," అంది చుట్టూ వున్న మూక. అంతేగాబోలు అనుకొని వూరుకున్నాడు కుర్రకుంక.

కొంతమంది "మదరాసు ఆసుపత్రిలో చేర్చారట" అన్నారు. మరికొందరు "కాదు విశాఖపట్టణమట" అన్నారు.

"కాదు. యింటివద్దే వున్నాడట. ఆయన స్నేహితులయిన ఇద్దరు ముగ్గురు డాక్టర్లు రోజూ వచ్చి పరీక్షించి వైద్యం చేస్తున్నారట కలిసికట్టుగా" అన్నారు యింకా కొందరు.

"అసంభవం. డాక్టర్లు కలిసికట్టుగా ఉండటం ఈ దేశంలో, ముఖ్యంగా ఈ పట్టణంలో జరగని పని. స్మశానంలో గూడ వాళ్ళ రోగుల శవాలను ప్రక్క ప్రక్కగా దహనం చెయ్యనివ్వరు" అన్నాడు ఒక బొద్దంకి ప్లీడరు.

కొంతమంది ఆదుర్దాపరులు నిజం తెలుసుకుంటానికి ఇంటికి వచ్చి చూశారు. ఇల్లు తాళం వేసి వుంది. చుట్టుప్రక్కలవాళ్లు 'మాకేం తెలియదంటే మాకేం తెలియదు' అన్నారు. ఆదుర్దాపరులు ఎన్నో సార్లు వెళ్ళి ప్రయత్నం చేశారు – ఆచూకీ తెలుసుకుందామని. కాని, అన్ని సార్లూ తాళం వేసే వుంది యిల్లు. ఆదుర్దాపరులకైనా అంతకంటె ఎక్కువ పట్టలేదు. వాళ్లు కేవలం ఆదుర్దాపరులు మాత్రమే.

నా రచనలన్నా, నేనన్నా అభిమానం వున్న యువకులు కొందరు మాత్రం రోజూ పత్రికలు రాగానే నా ఆరోగ్యాన్ని గురించిన బులిటెన్ ఏమైనా వుందేమోనని చూచే వాళ్లు. నా ఆరోగ్యాన్ని గురించి ఒకసారి ప్రకటించడానికే 'స్తలాభావం' అంటూ సణుగుకొని, ఏదో ఒకమూల కొద్దిగా వేసిన పత్రికాధిపతులకు నిత్యం నా ఆరోగ్యాన్ని గురించిన బులిటెన్ వేయాలనే ఆలోచనే అసందర్భంగా తోచిందేమో! ఎప్పుడూ, ఎక్కడా వేసే వాళ్లు కాదు. కాని, నాకు చిరపరిచితుడు – కాదు మిత్రుడు – అయిన ఒక ప్రముఖ దినపత్రికా సంపాదకుడు మాత్రం నా ఆరోగ్యాన్ని గురించి బులిటెన్ వేస్తూనే వచ్చాడు. కాని, అతనైనా నా వైద్యం ఎక్కడ చేయించుకుంటోంది వేసేవాడు కాదు.

పది పదిహేను రోజులు గడచిన మీదట, అన్ని పత్రికలూ నా మరణ వార్తను ప్రకటించాయి. నా మిత్రుడైన ప్రముఖ దినపత్రికా సంపాదకుడు మాత్రం నా మరణవార్తను నల్లటి బార్డరుతో ప్రముఖ స్థానంలో బాక్సుకట్టి వేశాడు తన పత్రికలో. కొన్ని సంతాప

సందేశాలు గూడా ప్రచురించాడు. కాని, ఇంతచేసినా నా మిత్రుడు మాత్రం నన్ను గురించి ఒక్క ముక్క వ్రాయలేదు – తానుగా తన దినపత్రికలో. అదీ ఒక రకమైన బరువుతనాన్నే యిచ్చింది – నా మరణవార్తకు అనుకున్నారు కొందరు.

అసంఖ్యాకం కాకపోయినా, లెక్కపెట్టడానికి వీలైన ఉత్తరాలు వచ్చాయి – నా మిత్రుడైన సంపాదకునికి. నన్ను గురించిన వివరాలు పంపమనీ, అముద్రితాలైన గ్రంథాలు ఏవైనా వున్నాయా అనీ, నా ఆస్థిపాస్తుల విలువ ఎంత వుంటుందనీ, స్మారక నిధి ఏమైనా వసూలు చేస్తున్నారా అనీ –యిత్యాదులైన వివరాలు, ఆరాలు చాలా అడిగారు – ఆ వుత్తరాల్లో. నా కుటుంబానికి సానుభూతి చూపారు. మరీ కుర్రకారు నా అభిరుచులు ఏమిటనీ, వేరుశనగకాయలు, గోంగూర అంటే చాలా యిష్టమట నిజమేనా అనీ, నేను సబ్బు వాడతానో, సీకాయపొడి వాడతానో తెలిసివుంటే తెలియజేయవలసిందనీ గూడా వ్రాశారు – దినపత్రికా సంపాదకుడైన నా మిత్రునికి.

మరణం, మరణానంతర స్థితిని గురించి నా ఆలోచనలు ఎట్లా వుండేవో తమకేమైనా తెలుసా అని సంపాదకుణ్ణి గుచ్చి గుచ్చి పృచ్ఛించా డొక తత్వ మీమాంసకుడు.

అవును. ఆ రోజు నా స్మారక సభ అన్నాను. వాటి స్థాపనకూ నాకూ సంబంధం వున్న కొన్ని సంస్థలు ఆరోజు మూసి వేశారు. మరికొన్ని ఆఫీసులు గూడా మూసివేశారు నా స్మృత్యర్థం, గౌరవార్థం. మా ఇంటి ప్రక్క చిల్లరకొట్టు వీరభద్రయ్య గూడా కొట్టు కట్టివేశాడు. "ఏం భద్రయ్యా! కొట్టు కట్టేశావా ఇవాళ" అని ఎవరో అడుగుతుంటే, "అవునండీ! అంతటివాడు పోగా కొట్టు మూస్తానికొచ్చిందా? ఎప్పుడూ నవ్వుతూ పలకరిస్తుండేవాడు. ఏం వీరభద్రయ్యా! వ్యాపారం బాగా సాగుతుందా అని ఎంతో యిదిగా అడిగేవాడు మారాజు" అని చెబుతున్నాడు వీరభద్రయ్య.

"అయ్యో, అదేంది బద్దరయ్యా! అట్టా చెబుతున్నావు. 'ఇంట్లో ఇబ్బందిగా వుంది రేపు కొట్టు కట్టేసి పెళ్లాన్ని తెచ్చుకుంటాను' అని నిన్ననేగా చెప్పావు" అని రాగాలు తీస్తో అడుగుతోంది అతని కొట్టుముందు నిలబడ్డ, మొగుడు వదలివేసిన సుబ్బమ్మ.

"రెండూ కలిసొచ్చినయిలే సుబ్బమ్మా. అవును గాని, నా పెళ్ళాం వస్తుందంటే నీకెందుకూ అంత కడుపుబ్బరం" అంటున్నాడు వీరభద్రయ్య. ఏమైతేనేం వీరభద్రయ్య కొట్టు గూడా నా స్మృత్యర్థం మూసివేసిన కార్యాలయాల జాబితాలో పడిపోయింది. ఇక్కడ ఒక్క విషయం చెప్పాలి. నేను మరణించిన నాడు మాత్రం వీరభద్రయ్య కొట్టు తెరిచేవుంచాడు.

స్మారకసభ ఏర్పాటు చేసిన పెద్దలు యింకా కొంతమందిని బలవంతం చేసో, మొఖమాట పెట్టో మరికొన్ని కార్యాలయాలు, దుకాణాలు గూడా మూయించారు. అంటే

ఏమీలేదు. కిళ్లీ షాపులు, మంగలి దుకాణాలు, టిక్కీ హోటళ్లు ఇత్యాదులు. పెద్ద బజారులోని కిళ్లీ కొట్టు సాంబయ్య కొంచెం మొరాయించాడు.

"అసలు ఆయన ఎవరండీ! నాకు తెలీదు. ఏం చేస్తూ వుండేవాడు? రామయ్యగారూ!" అని అడిగాడు స్మారకసభ కార్యకర్తలో ఒకరిని.

"ప్లీడరుగారు" అన్నాడు రామయ్య.

"ప్లీడర్లు చావాల్సిందే!" అని కసిగా అన్నాడు సాంబయ్య. తన చెల్లెలు మనోవర్తి దావా క్షవరం చేసిన ప్లీడరు గుర్తుకొచ్చాడు సాంబయ్యకు. మనోవర్తి దావా వోడిపోయిన వాళ్ళూ మాన నష్టం దావా గెలిచిన వాళ్ళూ లేరన్న సామెత సాంబయ్యకూ తెలుసు. కాని వాళ్ళ చెల్లెలి ప్లీడరు వెయ్యి రూపాయలూ మింగి బోడి మనోవర్తి దావా గూడా గెలిపించలేక పోయాడు. పైగా అటువైపు ఏదో నంజాడని గూడా పుకారు పుట్టింది. అది విన్నప్పటినించీ సాంబయ్యకు ప్లీడర్లు అంటే అసహ్యం వేసింది. ఎవడన్నా ప్లీడరు చస్తే ఒక్క కట్టెపేడు గూడా సప్లయి కానివ్వగూడదని నిశ్చయించుకున్నాడు అతను. ప్లీడర్లలో రెండువైపులా మేసే, పెద్దమనుష్యులూ, పోలీసు మామూళ్ళకని డబ్బు భోంచేసే బుద్ధిమంతులూ, దావాలు వెయ్యకుండా వేశామని డబ్బు కైంకర్యం చేసే ఘనులూ, వుంటారని సాంబయ్యకు తెలీదు.

"అట్లాకాదులే సాంబయ్యా! ఆయన చాలా గొప్పవాడు. ఎంతో యిదిగల వాడు" అని బ్రతిమాలాడు రామయ్యగారు.

"సరే, ఎట్లా గొప్పోడో చెప్పండి వింటాను. పోనీ ఒక్కరోజు కొట్లు కట్టేస్తే ముంచుకుపోయేది లేదు" అడిగాడు సాంబయ్య. రామయ్యగారు తడబడ్డారు. రామయ్యగారికి నన్ను గురించి ఏమీ తెలీదు. అసలునన్ను ఎరుగడు గూడాను. ఈ స్మారకసంఘ సభ్యత్వంతో నలుగురి లోనూ తెలిశాడు రామయ్యగారు. అది అతనికి చాలా లాభదాయకంగా కనిపించింది గూడాను. సాంబయ్యకు ఎట్లా నచ్చజెప్పాలో గూడా బోధపడలేదు రామయ్యగారికి. పాపం నన్ను గురించి బొత్తిగా ఏమీ తెలియని వాడయ్యె.

"సాంబయ్యా! యింతెందుకు. నన్ను జూచి నీ కొట్టు మూసెయ్యి, ఇవ్వాల్టికి మీటింగుకి అంతా వచ్చిపోయే దార్లో వుంది నీ దుకాణం. నీకు పుణ్యం వుంటుంది" అని బ్రతిమాలాడారు రామయ్యగారు. సాంబయ్య క్షణం సేపు పస్తాయించి యిట్లా అన్నాడు.

"సరేలే, రామయ్యగారు. ఆయన ఎవరో నాకు తెలీదు. నేను కొట్టు మాత్రం నీ కోసం మూస్తున్నా." రామయ్యగారి గుండెలు గతుక్కుమన్నాయి. తనకొరక కేమిటి వెధవాయి. తన్ను గాని చావాలని కోరుకోవడం లేదు గదా వీడు అనుకున్నాడు రామయ్యగారు. ఎట్లా అయితేనేం అంత పెద్ద కిళ్లీకొట్టూ మూయించాడు రామయ్యగారు.

స్మారక సభకు పూలదండలు అవసరం లేకపోయింది. కాని అది తెలియని కిష్టయ్య చౌకగా వస్తుంటే గుత్తజట్టీగా పూలుకొని పారేసి తన భార్యచేత, కోడలుచేత, దండలు కట్టించుకొచ్చాడు. బిల్లు మాత్రం కొంచెం ఘనంగానే వేయించుకొని జేబులో పెట్టుకున్నాడు. సభకు స్వామిగారు అధ్యక్షత వహించారు. వారిలో ఒక మంచితనం వుందనుకుంటారు అంతా. ఎవరు ఏ సభలో మాట్లాడమన్నా, నిరాకరించకుండా, నిండుగా మాట్లాడి, సభకు గాంభీర్యాన్ని తెచ్చిపెడతారని ఒక ప్రతీతి వుంది. అందుకనే పట్టణంలో ఏ స్మారకసభ జరిగినా, సన్మానసభ జరిగినా, ఏ బహిరంగ సభ జరిగినా, స్వామిగారు అధ్యక్షుడుగానో, ఉపన్యాసకుడుగానో వుండి వుంటాడు. ఉపన్యాసానికి పొరుగూళ్లు కూడా వెళ్ళి వస్తుంటాడు. అందుకనే ఆయన్ని ఉపన్యాసాల పౌరోహితుడు అంటారు కొందరు. కాని, ఆయన వుంటే మీటింగు నిండుగా వుంటుంది అని ప్రతివారూ అంగీకరిస్తారు.

సభకు చాలా మంది పోగయ్యారు. మా పట్టణంలో వున్న టౌనుహాలు ఇట్లాంటి సభలకు చాలా ముచ్చటగా హంగుగా కుదిరిపోతుంది. టౌనుహాలు నిండిపోయారు జనం. చాలామంది విచారసాగరంలో మునిగి, గంభీరంగా కూచున్నారు. పాపం వాళ్ళకు నిజంగా నా మరణం పట్లఎంతో దుఃఖం కలిగిందనే చెప్పాలి. కాని, మూగజీవాలు,ఉపన్యాసాలు చెయ్యలేరు. నా మీద వున్న అభిమానాన్ని, ఏ రకంగా తెలియజెయ్య వచ్చో గూడా తెలియని అమాయకులు వాళ్ళు. కనకనే, స్మారకసభ అంటే పరుగెత్తుకొని వచ్చారు. నన్ను గురించి తెలిసిన వాళ్ళు, చెప్ప గలవాళ్ళు, ఏమైనా చెబితే వినాలని ఆదుర్దాపడుతూ వచ్చారు.

ముందుగా స్వామిగారు అధ్యక్ష పీఠం నుంచి లేచి ప్రారంభించారు. తమ ఉపన్యాసాన్ని – నేను మంచి సాహిత్య వేత్తననీ, నాకథలు, నాటకాలు, నవలలు ఆంధ్రదేశానికీ సుపరిచితాలని, సాహిత్యంలో వాటి కొక స్థానం వుందనీ, వాటి కొక ప్రత్యేకత వుండిపోయిందనీ, నేను అసంఖ్యా కంగా వ్రాశాననీ; నా కథల వల్ల నాటకాలవల్లా సంఘానికి ఎంతో సేవచేస్తున్నాననీ – వారు చెబుతుంటే, శ్రోతలు నా మీద వున్న అభిమానంకొద్దీ పారవశ్యత పొందారు. చాలామందికి కళ్లు చెమ్మగిల్లాయి. కొందరు ఉద్రేకపరులు చీదటం మొదలు పెట్టారు. నేను మంచి సాహిత్యవేత్తనే గాకుండా శాస్త్రీయమైన రాజకీయవేత్తను గూడా అని స్వామిగారు నన్ను గురించి చెప్పి, నా రాజకీయ పరిజ్ఞానాన్ని, విశిష్టతను గురించి మొదలుపెట్టారు. వారు చాలా అనర్గళంగా ఉపన్యసించగలరు. ఆపూటచాలా ఆవేశపూరితంగా గూడా మాట్లాడుతున్నారు. ఇంతలో సభలో నించి "కథలు వ్రాసే వాళ్ళంతా పనికిమాలిన వాళ్ళనీ, సంఘానికి నిరుపయోగ మైన వాళ్ళనీ మీ అభిప్రాయ మనుకుంటాను. ఎప్పుడు మార్చుకున్నారు?" అని గొంతు వినబడింది. శ్రోతలంతా అటువైపు తిరిగారు. ఎవరో కుర్రవాడు. లాల్చీవేసి, పైజామా

తొడిగి వున్నాడు. చుట్టుప్రక్కల వాళ్ళు కొరకొర చూస్తున్నారు అతని వంక. అతను మాత్రం ఆ చూపుల్ని ఏమీ లక్ష్యం చెయ్యకుండా స్వామిగారి వంక చూస్తున్నాడు – ఏమని సమాధానం వస్తుందో నని. స్వామిగారు మాత్రం అతని మాటలు అసలు విననట్లే తన ఉపన్యాసాన్ని ముందుకు తీసుకుపోతున్నారు. అందరికీ వినపడ్డా, ఆ మాటలు స్వామిగారికి నిజంగా వినపడ లేదేమో అనిపించింది. రాజకీయాల్లో నాకూ ఆయనకూ యెంతో సాన్నిహిత్యం వుందనీ, యెప్పుడూ కలిసికట్టుగా పనిచేసే వాళ్ళమనీ రాజకీయాల్లో నేనూ, నా ప్రతిభ రాణించడం కోసమూ తాము అహర్నిశలూ కృషి చేశామనీ, నేను గనుక బ్రతికివుంటే యెంతో ఉజ్వల భవిష్యత్తువుండేదనీ, నేను ఆ స్థాయికి అందుకోవాలనే వారు సర్వదా అభిలషించేవారనీ చెబుతున్నారు స్వామిగారు. ఈసారి వెనక ప్రశ్న వేసిన కుర్రవాడు లేచి నిలబడ్డాడు. గొంతు సవరించుకొని, లాల్చీ పైకెత్తి యిట్లా అన్నాడు. "ఎందుకు స్వామిగారూ! అన్ని అబద్ధాలాడుతారు. వారు రాజకీయంగా ఎక్కడ పైకి వస్తారోనని మీరు యెంతగా బాధపడ్డదీ నాకు తెలుసు. ఒక పార్టీ అయివుండి గూడా వారిని రాజకీయంగా చంపటానికి మీరు చేసిన కృషి నాకు తెలుసు. ఆయన వ్రాతలు అన్నీ చెత్తా చెదారం లాంటివనీ, ఆయన్ని రాజకీయంగా పైకి రానివ్వగూడదనీ మీరేగా నాలాంటి కుర్రవాళ్ళను చేర్చి చెప్పింది. ఇంతలోనే యింత మార్పా!" సభలో గందరగోళం, పెద్ద కలకల బయలుదేరింది. స్వామిగారు వుపన్యాసం ఆపి నిండుగా నిలబడ్డారు. అందరికీ కుర్రవాడి మీద అపరిమితమైన కోపం వచ్చింది. "స్మారకసభను రసాభాస చెయ్యటానికే వచ్చాడు ఈ కుర్ర వెధవ" అనుకున్నారు చాలామంది.

"కాదు. అతను కమ్యూనిస్టు" అన్నారు కొంతమంది బుద్ధిమంతులు. "ఒకవేళ స్వామిగారికి వారి రచనలన్నా, రాజకీయాధిక్యత అన్నా యిష్టమే లేకపోవచ్చు. ఏదో మరణించాడు. యిక తిరిగిరాడు గదా పాపం, అని నాలుగు మంచి మాటలు చెప్పటం తప్పా! ఎవడీ కుర్రవెధవ" అన్నాడు స్వామిగారి మిత్రుడైన అభినవ అష్టదిగ్గజాల్లోని ఒక కవి.

"ఆఁ పిదప కాలం, పిదప బుద్ధులు" అన్నాడు ఒక వయోవృద్ధుడు.

"పాపం స్వామిగారు సరసుడు గనక సరిపోయింది" అన్నాడు ఒక తెలుగు పండితుడు.

"స్వామిగారు నిండుకుండ. తొణకడు చూచారా!" అని హర్షించాడు పక్క వాయిద్యగాడు. నలుగురూ నానా చీవాట్లు పెట్టి కుర్రకుంకను నోరు మూయించారు. కాని స్వామిగారు మాత్రం ఇక మాట్లాడలేదు. ఉపన్యాసాలు అన్నీ ముగిశాక అంత్యోపన్యాసం చేస్తానని చెప్పి తరవాత ఉపన్యాసకుణ్ణి పిలిచాడు. వరుసగా నలుగురైదుగురు ఉపన్యసించారు. ప్రతి ఉపన్యాసకుడూ నన్ను ఎంతగానో శ్లాఘించాడు. నేను ఎంతో

ఉదారస్వభావుణ్ణి అన్నారు. శాంతమూర్తిని అన్నారు. నా రచనలు సూటిగా, వాడిగా, నిశితంగా ఉంటాయన్నారు. నా రచనల్లో వున్నట్లుగానే జీవించా నన్నారు. ఆంధ్రదేశంలో నా రచనలకు ఒక విశిష్టస్థానం ఏర్పడిందన్నారు. ఇక అది మాసిపోని చరిత్ర అన్నారు. ఎంతటి కల్లోల పద్ధతుల్లో గూడ ఉద్రేకపడని శాంతస్వభావుడను అన్నారు. నా సాహిత్య రచనలే గాకుండా, నా రాజకీయ రచనలు గూడా పరాకాష్ట నందుకున్నాయని, అంతటి ఉత్తమ గ్రంథాలు ఇంతకు ముందు ఏ సాహిత్యంలోనూ రాలేదనీ, lucid analysis వున్న రాజకీయ రచయితననీ చాలా చెప్పారు. ఎంతో వుద్రేకపడ్డారు. నేను లేని కొరత కొరతే నన్నారు. ప్రతి ఒక్క ఉపన్యాసకుడూ నేను తనకు ఆత్మవంటి వాణ్ణని, ఇప్పుడు తాము ఆత్మలు లేని శరీరాలు మాత్రమేనని చెప్పారు.

చివరి ఉపన్యాసకుడుగా రామారావు లేచాడు. నిజంగా చాలా ఆశ్చర్యకరమైన సంగతి. రామారావు అసలు స్మారకసభకు రావటమే ఒక వింత. ఇక అతను మాట్లాడ్డం ఒక పెద్ద విడ్డూరం. రామారావు గొంతు సవరించుకొని తాపీగా, కడుపు నిండా భోజనం చేసి వచ్చిన వాని మాదిరిగా మొదలుపెట్టాడు ఉపన్యాసం. రామారావు అనేక వ్యాపారాలు చేసి, అనేక రకాలుగా బాగుపడి, డబ్బు మూలుగుతున్న వ్యక్తి. రామారావు ఉపన్యాస సారాంశం ఇది.

అనేకమంది చాలా అపోహలుపడి, నావల్ల అతను అంత పెద్దవాడు అయ్యాడని పొరపాటుగా ఆలోచిస్తున్నారన్నాడు. అతను ఏశక్తీలేని వుత్త చవట అని నావల్లనే అంత అభివృద్ధి లోనికి వచ్చాడని గూడా ప్రజలు దురభిప్రాయపడుతున్నారనీ, అది వాస్తవంకాదనీ అతని వల్లనే నేను ఎంతో వృద్ధిలోనికి వచ్చాననీ చెప్పాడు. నా మరణం సంప్రాప్తమయ్యే రోజుగూడా తనునా శయ్యవద్దనే వున్నాననీ, నేను అతనికి, అతని స్నేహానికి ఋణపడివున్నానని చెప్పి ఎంతో బాధపడ్డాననీ, అతను నన్ను ఓదార్చి నిజమైన స్నేహానికి ఏ తేడాలూ, ఎల్లలూ లేవని నాకు తాను చెప్పి మనస్తాపం తగ్గించినట్లు, నేను బ్రతికివుంటే అసంపూర్తిగానే వుండిపోయిన నా బృహద్గ్రంథాన్ని పూర్తి చేయించి ప్రచురణ ఖర్చులు అన్నీ తానే అచ్చుకుందామని నిర్ణయించుకున్నాననీ, దురదృష్టవశాత్తూ నేను యిక తనకు లేకుండాపోయాననీ చెప్పి చెమ్మగిల్లిన కళ్లు జేబుగుడ్డతో తుడుచుకున్నాడు. తిరిగి యింకా చెప్పబోయాడు రామారావు. కాని గొంతులో వెలక్కాయ పట్టుకుంది. తనకు ఎదురుగా నిలబడివున్న వ్యక్తిని చూచి అదిరిపోయాడు. అదే లాల్చీ, అదే పైజామా. అదే కుర్రకుంక.

“చూడండి. ఇదంతా నమ్మేది ఎట్లా” అన్నాడు వుద్రేకంగా కుర్రవాడు.

“నేను అబద్ధాలేవీ చెప్పలేదే. నాకు అబద్ధాలన్నా, అన్యాయాలన్నా చెడ్డమంట” అన్నాడు

రామారావు. స్వామిగారి మాదిరిగా గుడ్లు వొప్పచెప్పి నిండుగా నిలబడి వూరుకోదలచలేదు రామారావు.

"మీరు అన్నీ అబద్ధాలే చెబుతున్నారు. ఈనాడు ఎవరి స్మారకసభ జరుపుకుంటున్నామో వారిని గురించి మీరు అన్నీ అబద్ధాలే చెప్పారు. అయితే నీటుగా నిలబడి ఎదురుగా చెప్పే ధైర్యం, మంచి అలవాటు మీకు లేదు గనుక రహస్యంగా, గోడచాటుగా ప్రచారం చేసిన ఘనత, అగ్రస్థానం వారి మిత్రుల్లోనే గాకుండా శత్రువుల్లో సైతం మీదేనని ఒప్పుకోవాలి..." కుర్రకుంక యింకా ఏమేమో చెప్పబోతున్నాడు.

"పొరపాటు, పొరపాటు. ఇది గిట్టని వాళ్ళు చేసే ప్రచారం. ఆయన బ్రతికివుంటే నేనే వాస్తవం చెప్పానని అంగీకరించేవాడు. ఆయన ప్రతిభను ఎంతో రాణింపుకు తెచ్చింది నేనే" అని మొరాయించాడు రామారావు. ఆతని మొరాయింపు చూస్తే కుళ్ళాయి వద్ద నా బిందె ముందు నింపుకోవాలని మొరాయించే గయ్యాళి గుర్తుకొస్తుంది.

"అసలు నిన్ను ఒక మనిషిని చేసింది ఆయనగారేనటగా, మరి అది చెప్పవేం?" అన్నాడు యింకో ప్రక్కనించే మరో యువకుడు.

"మొదట్లో నీకు నోరూవాయి లేదటగా! ఆయనేనటగా నిన్ను యింతటివాణ్ణి చేసింది" అన్నాడు మరో పురుషుడు – యింకో దిక్కునించీ.

"చూడు, వారి సహాయం లేకపోతే నిన్ను బొక్కలో వేసేవారటగా! మరి యిప్పుడు ఇట్లా త్రేపుతూ అబద్ధాలు చెబుతావెందుకు?" అన్నారు నలుగురైదుగురు విద్యార్థులు.

"నిజమే, నిజమే" అంది మూక. పూర్వ విషయాలు ఏవో అప్పుడే గుర్తుకొచ్చినట్లు. రామారావు ధైర్యం ప్రీలింది. కాళ్లు తడబడ్డాయి. గొంతు తడిఆరింది. "కూర్చో, కూర్చో పెద్దమనిషీ" అన్నారు కుర్రకుంకలు. "అంతే, అంతే" అంది మూక. అంతే. రామారావు ఏమయ్యాడో, ఎటు జారుకున్నాడో ఎవరూ చూడలేదు. అతను అలంకరించిన కుర్చీ మాత్రం వెలితిగా వెకిలిగా చూస్తుంది రామారావు కొరకు. అంతా గందరగోళంగా వుంది. స్మారకసభలోని విషాదచ్ఛాయలు పోయి ఆవేశాలు పెరిగినాయి. అధ్యక్షుడు తన అంత్యోపన్యాసంచేసి సభకు నిండుతనాన్ని కల్పిద్దామని ఆయత్తపడుతున్నాడు. పాపం, స్వామిగారికి ఇదంతా చాలా చికాకు కలిగించింది. స్మారకసభలో ఆవేశాలు, కావేషాలు చూచి చాలా చింతించాడు ఆయనగారు.

ఇంతలో ఒక మూల ఏదో సంచలనం కలిగింది. కొందరు నన్ను యెగాదిగా చూచి సంభ్రమాశ్చర్య భరితులయ్యారు. మరికొందరు భయపడిపోయి వొదిగి వొదిగి దారి యిచ్చారు నాకు. నన్ను తెలియనివాళ్లు కొరకొర చూస్తున్నారు – నావంక; నేను వారిని తోసుకొని, నెట్టుకొని ముందుకు వచ్చే తీరుజూచి. ఎట్లా అయితేనేం వేదికవద్దకు చేరాను. స్వామిగారు

నన్ను జూచి ఆవులించారు. సభలో ఒక్కసారి కలకలం బయలుదేరింది. అంతలో నిశ్శబ్దమయింది. నేను మాట్లాడటానికి అధ్యక్షులవారి అనుమతి అడిగాను. కాని, వారు గమనించే స్థితిలో లేరు. అంతటి నిండుకుండ కూడా తొణికింది.

"మహాజనులారా! యీనాటి స్మారకసభలో పలువురు పెద్దలు ఉపన్యసించారు. వారికి నా కృతజ్ఞతలు. అధ్యక్షుల వారు నన్ను గురించి చాలా తియ్యటి మాటలు చెప్పారు. వారికి నా మీద అంతటి అభిమానము, గౌరవం వుందని నేను గ్రహించలేకపోయాను. మూర్ఖుణ్ణి ఏదో కుర్రవాళ్లు మాట్లాడిన దానికి నేను ఎంతో చింతిస్తున్నాను. ఒక్కొక్కప్పుడు మంచిని గూడా మనం గ్రహించలేము. నేను బ్రతికివున్నప్పుడు వారికి నామీద సదభిప్రాయం లేదని నేను అర్థం చేసుకున్నది తప్పు అని నేటికి తెలిసింది. క్షంతవ్యుణ్ణి. అన్నిటికంటే మరీ ఆశ్చర్యకరమైన విషయాలు రామారావుగారు వెల్లడించారు. అవి నాకే వింతగా వున్నాయి. నా ప్రతిభ – వుంటే – రాణింపుకు కారణం వారేననీ, నాకు వారు అత్యంత ప్రీతికరమైన మిత్రులనీ, నేను వారి సహకార, స్నేహలతో పైకి వచ్చాననీ – అహఁ వచ్చివుంటే – ఎన్నెన్నో శలవిచ్చారు. కృతజ్ఞుణ్ణి. ఇక నా వల్ల వారు యిదయ్యారనీ, అదయ్యారనీ ఏమేమో దూకుడుగా మాట్లాడి కుర్రవాళ్లు వారి అత్యంత వుదారము, నవనీతము అయిన హృదయాన్ని కష్టపెట్టారు. వారి తరపున రామారావుగారికి, నా క్షమాపణలు చెప్పుకుంటున్నాను. ఇంకా అనేకమంది పెద్దలు అనేకం చెప్పారు. నన్ను గురించి. కాని నేను చెప్పదల్చుకుంది మాత్రం ఇది. నేను వారు వుపన్యసించి గానీ నంత పెద్దవాణ్ణి గాని, వారి మనస్సుల్లో నన్ను గురించి అనుకున్నంత చిన్నవాణ్నీ కాదని, నా రచనలూ నేనూ శాశ్వతంగా నిలిచిపోతామని పెద్దలు వక్కాణించారు. నేను అసంఖ్యాకంగా వ్రాశానని గూడా చెప్పారు. చిరస్థాయిగా నిలిచిపోయే రచనలు చెయ్యాలనే నా సంకల్పం ఆకాంక్ష. కాని కృతకృత్యుణ్ణి అవుతానో లేదో కాలం నిర్ణయించాలి. నేను అసంఖ్యాకంగా వ్రాశానన్నారు. అది నిజంకాదు. ఇక నేను శాంతమూర్తిని అన్నది సర్వాబద్ధం. శాంతానికి నాకూ చుక్క యెదురు. నేను ఈర్ష్యాద్వేషాలు బొత్తిగా లేనివాణ్ణి అన్నారు. అది మరొక అబద్ధం. నేను మానవుణ్ణి. మానవుడుగా బ్రతకాలని తాపత్రయ పడుతున్నవాణ్ణి. కనక, నాకూరాగద్వేషాలు వున్నాయి. లేవనడం కేవలం వుపన్యాసం చెయ్యటానికి పనికివస్తుంది. ఇక నా ప్రతిభ విషయ మంటారా అధ్యక్షుల వారిని, రామారావుగారిని యిప్పుడు చెప్పమనండి విందాం. నా స్మారకసభ యింత విజయవంతంగా, ఇంత అభిమానంగా జరిపిన కార్యకర్తలందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు చెప్పే ముందు ఒక్కమనవి. నేను వ్రాస్తున్న బృహత్కావ్యాన్ని పూర్తి చేసి వున్నట్లయితే అచ్చు వేయించి వుండేవాడిని అని అన్నారు రామారావుగారు. అది నేను నిన్నటితో పూర్తి చేశాను. దాని అచ్చు ఖర్చులు రామారావుగారి చేత పెట్టించే పూచీ, భారము సభికులైన మీకే వదలివేస్తున్నాను.

మరొక్కమాట. నేను మరణించిననాటికి ముందు రోజున నా ప్రక్కలోనే కూర్చుని వున్నాననీ, అనేక విషయాలు ఆత్మీయంగా మాట్లాడాననీ, నాకు అత్యంత ప్రియమిత్రులమనీ చెప్పారు రామారావుగారు, నేను మరణించిందీలేదు. వారు కూర్చున్నదీ లేదు. ఏదో స్మారకసభ గదా అని ఆ మాత్రం ఉపన్యాసమైనా చెయ్యకపోతే బాగుండదని మాట్లాడారనుకుంటాను రామారావుగారు దాన్ని హాస్యం క్రింద తీసుకో ప్రార్థన.

"పాపం అధ్యక్షుల వారు యీ స్మారకసభకు యిన్ని హంగులు చేయించినందుకు వారికి నా ప్రత్యేక వందనాలు" అని నా స్మారకసభలో నేనూ ఉపన్యాసం చేశాను. సభ అంతటా పెద్ద అలజడి, కేకలు, పెడబొబ్బలు, నానా బీభత్సమూ సాగింది. ఏది నిజమో, ఏది అబద్ధమో, నాది మరణమో, మరణాంతర స్థితో, ఏదో తేలక తన్నుకుంటున్నారు జనం – గుంపులు గుంపులుగా పడి, కొంచెం సేపటికి ప్రశాంతత ఏర్పడింది. కారణం ఏపుణ్యాత్ముడో పోలీసుల్ని పంపాడు. ఎక్కడి వారక్కడ పోవడానికి వుద్యుక్తు లౌతున్నారు. నా అభిమానులు అయోమయంలో పడిపోయారు. నేను మరణించినందుకు ఆనందమే పొందుతున్నారో, నా స్మారకసభ రసాభాస అయినందుకు విషాదాన్నే అనుభవిస్తున్నారో గూడా తెలియని అయోమయ స్థితిలో పడ్డారు. అట్లాంటి సమయంలో స్వామిగారు గొంతు సవరించుకొని యిట్లా అన్నారు :

"సభ్యసోదరులారా! ఇక అధ్యక్షుని అంత్యోపన్యాసం మిగిలింది. నేను చెప్పవలిసంది గూడా రెండే ముక్కలు. నాకు ఏదోవొక ఉపన్యాసం చెయ్యనిదే తిన్నది జీర్ణం కాదు. అది మీకూ తెలుసు. కనుకనే అధ్యక్షత వహించి ఉపన్యసించాను. అంతకంటె యీ స్మారకసభకు అర్థమూ లేదు. ఈ మరణించిన వారికి విలువా లేదు. శలవు" అన్నాడు స్వామిగారు. అంతా గొల్లున నవ్వారు. గోల చేశారు. ఈలలు వేశారు. అతనిమీదకు ఎగబడ్డారు.కాని, ఏమైనా స్వామి స్వామే. తస్సా చెక్కా, ఎంత దెబ్బకొట్టాడు. అతని ద్వేషం అతనిదే. ఉపన్యాసం ఉపన్యాసమే.

చివరిమాట. స్మారకసభలో నేనూ ఉపన్యసించానని విని, రామారావు పది లంఖణాలు చేశాడు.



# భాస్కరభట్ల కృష్ణారావు

**(1918 - 1966)**

**తె**లంగాణా పల్లెటూళ్ళ పరిస్థితులనీ, కడగండ్ల పాలైనా నిజాయితీ విడువని తెలంగాణా రైతుల అమాయకపు బ్రతుకులనీ, కళ్ళకి కట్టినట్టు చిత్రించగల శిల్పి, నిగూఢమైన పరిశీలనా దృష్టితో, కులాసాగా నడిచే శైలితో, పొందికైన వర్ణనలతో, బిగువైన సంభాషణలతో వీరి కథలు పాఠకుల్ని విశేషంగా ఆకర్షించాయి. ప్రఖ్యాత నవలాకారులు. ఆకాశవాణి కడప కేంద్రంలో పని చేసేవారు.

**రచనలు :** వెన్నెల రాత్రి (కథలు) వింత ప్రణయం, యుగసంధి, వెల్లువలో పూచికపుల్లలు (నవలలు)

# ఇజ్జత్

రంగారావు ఓ నిశ్చయానికి వచ్చాడు. వెంటనే చేతిసంచిలో రెండు షర్ట్లు, ఒక ధోతి, ఒక బనియన్, ఒక టవల్ వేసుకున్నాడు. చెప్పులు తొడుక్కుంటుండగా, తల్లి విధవావిడ, ఎదురుపడి "ఎక్కడికి వెడుతున్నావురా?" అని అడిగింది. "అడిగావూ?" అని విసుక్కున్నాడు రంగారావు. తల్లి కిక్కురు మనకుండా లోపలికి వెళ్ళిపోయింది. అప్పటికే రెండు అపశకునాలు ఎదురు పడ్డాయి. వెడుతున్న పని అవుతుందో, లేదో అనే సందేహం కలిగింది అతనికి. తీరా బయల్దేరుతూ అపశకునాలను గూర్చి ఆలోచించడం మంచిది కాదనుకున్నాడు రంగారావు. చప్పున యింట్లోంచి బయల్దేరాడు. వాకిలి గుమ్మం దాటాడో, లేదో ఎక్కడినుంచో ఒక తుమ్ము వినపడింది. తిరిగి ఇంట్లోకి వెడదామా అని ఒక నిమిషం ఆలోచించాడు. కాని తిరిగి వెళ్ళడానికి మనస్సు ఒప్పలేదు. నిలుచున్న చోటునుంచి కదిలాడు. సికింద్రాబాద్ స్టేషన్ దారిపట్టాడు. స్టేషన్ చేరుకునేసరికి ఇంకా రైలు రాలేదు. టిక్కెట్టు కొని ప్లాటుపారం మీదికి వెళ్ళాడు. ట్రైన్ అరగంట లేటని తెలిసింది.

నిప్పుకుమల్లె మెదడు రాజుకుంటున్నది; పొగలకుమల్లే ఏవో ఆలోచనలు. తన పెద్ద చెల్లెలు ఛాయ పెళ్ళికి, రెండు నెల్లు కూడా వ్యవధిలేదు. పెళ్ళి ఖర్చులు కాక, వెయ్యిన్నూటపదహార్లు కట్నం, ముహూర్తం కూడా నిశ్చయమైంది. బహుశా వివాహానికి మూడు వేల దాకా ఖర్చు కావచ్చు. సంబంధం చాలా మంచిది. పెళ్ళి కొడుకు బుద్ధిమంతుడు. బి.ఏ. ప్యాసైనాడు తనకు మల్లేనే సెక్రెట్రియేట్లో గుమాస్తా ఉద్యోగం చేస్తున్నాడు. నెలకి వంద రూపాయల దాకా ఆదాయం వుంటుంది. ఏ బాదరబందీ లేదు. ఆ ఆదాయంతో భార్యాభర్తలు సుఖంగా కాలం గడపవచ్చు. తన దగ్గర డబ్బు లేదు. తనకి వచ్చే ఆదాయంతో భుక్తి గడపటమే కష్టసాధ్యంగా వుంది. ఇట్టి పరిస్థితుల్లో మూడు

వేలు తనెక్కడ తేగలడని? ఇది కాని కాలం. అప్పు ఎక్కడ పుడుతుందని? పుట్టినా, తనకు తీర్చే తాహతు లేదు. ఇచ్చేవాడు కూడా ఏమి చూసి యిస్తాడని? రఘునాథపల్లెలో తమకు ఒక బావి, పది ఎకరాల ఖుష్కీ వుంది. బావిక్రింద ఎకరం, ఎకరంన్నర తరీ వుండవచ్చు. బావి తాకట్టు పెట్టి అయిదారు వందల రూపాయలు తీసుకురావచ్చు. అయిదారు వందలు ఏ మూలకి వస్తాయని? అమ్మ జూపితే మూడు నాలుగు వేలదాకా రావచ్చు. కాని ఆ భూమి కొనడానికి ఎవరైనా ముందుకు వస్తారో, లేదో – ఒక కాలంలో అది ఇనాం భూమి, తన తండ్రి పోయిన తరువాత, తన పేరన పట్టా అయింది. ఎందుకో ఈ మధ్య ఇనాం భూములన్నీ పట్టాలు అవుతున్నాయట. మల్లయ్య కుటుంబం, తండ్రి తాతల కాలం నించీ, ఆ భూమి సేద్యం చేస్తున్నది. "ఈ భూమిలో పుట్టి, ఈ భూమిలో పెరిగాం" అంటాడు మల్లయ్య. మనిషి దైవభక్తి కలవాడూ, నెమ్మదైన వాడునూ, అతని కెన్నడూ తను కౌలుపత్రం వ్రాసియ్య లేదు. పట్టుపట్టి అతనూ వ్రాయించుకోలేదు. కౌలు గింజల విషయంలో ఏదో ముఖాముఖి మాట్లాడు కోవడం, ఇంత అని ఒక నిర్ణయానికి రావడం. అతను సరే ననడం, ఇదీ ఆకాలం నుంచి వస్తున్న ఆ పద్ధతి. వంశ పారంపర్యంగా వస్తున్న ఆ పద్ధతికి తను ఎన్నడూ విరుద్ధంగా వెళ్ళలేదు. విరుద్ధంగా నడుచుకోవల్సిన అవసరం కూడా కలగలేదు. మల్లయ్య భూమిపన్ను తనే కట్టుకుంటున్నాడు. పన్ను పోనూ సంవత్సరానికి  పుట్టెడు గింజలు యిస్తున్నాడు. శివుడిమీది పూలు తప్పినా, అతను కౌలు గింజలివ్వడం ఎన్నడూ తప్పలేదు. కాని గడిచిన రెండు సంవత్సరాల నించీ, తనకు మల్లయ్య దగ్గర నించి ధాన్యం ఏమీ రావడం లేదు. ఈ మధ్యనే అతను కూతురు పెళ్ళి చేశాడు. ఖర్చులో పడ్డాడు. కాగా గోరుచుట్టుపై రోకలిపోటు అన్నట్లు పక్కనున్న కుంట గండిపడి ఆ భూమిలో ఒక సంవత్సరం నించీ ఏమీ పండడం లేదు. కుంటగండి పూడ్చడానికి, తనకు గానీ మల్లయ్యకు గానీ తాహతు లేదు. కనీసం అయిదువందల రూపాయిలయినా కావాలి. కుంట పెద్దది అయితే ప్రభుత్వం సహాయమైనా పొందవచ్చు. తాలూకా కచేరీలో దరఖాస్తు ఇచ్చి కూడా చూశాడు మల్లయ్య. రెవెన్యూ అధికారి వచ్చి చోటు తనిఖీ కూడా చేశాడు. అది కుంట కానిదే, అతను మాత్రం ఏమి సిఫారసు చేస్తాడని? ఏదో పెద్ద బొంద, అక్కడ వానా కాలంలో నీళ్ళు ఆగుతాయి. ఆ నీళ్ళన్నీ వరిచేనులోకి కొట్టుకొస్తాయి.ఎండాకాలంలో బావిలోని నీళ్ళు వరిపొలానికి చాలవు. ఫలితం, ఏ కారులోనూ, ఆ పొలం పండడం లేదు. మల్లయ్య తనకు కొలవవలసిన ధాన్యం కొలవడం లేదు. పాపం అతను మాత్రం ఎల్లా కొలుస్తాడని – భూమిలో ఏమీ పండనప్పుడు, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న భూ సంస్కరణల ఫలితంగా, అతనికి టెనెన్సిఫారం దొరికింది.

అతనికి కూడా ఆ భూమిలో కొంత హక్కు సంక్రమించింది. ఆ భూమినించి అతన్ని తొలగించడానికి వీలు లేదు. భూమిని అమ్మదలచినా మొదట అతనికి అమ్మజూపాలి. తను ఒకేసారి ధనం కక్కాల్సిన అవసరం లేదు. చిన్న చిన్న మొత్తాల్లో కొన్ని సంవత్సరాల వరకూ చెల్లిస్తూ వుండవచ్చు. అతని పరిస్థితి ఏ మాత్రం బాగులేదు కనుక. అతను ఆ భూమిని కొనుక్కోకపోవచ్చు. పైగా అతనికి కూటికీ, గుడ్డకీ వెళ్ళడం లేదని వినికిడి.

ఐనా భూమిపై తనకు గల హక్కుని వదులుకుంటాడా? భూమి వదులుకొని రాజీనామా ఇస్తాడా? అసాధ్యం – భూమీ వదులుకోడు – రాజీనామా ఇవ్వడు. కాగా కౌలు గింజలు కొలువడు. ఈ రైతులకి భూమి అంటే అంత మమకారం ఎందుకో?

మొదట కౌలుగింజల విషయంలో వత్తిడి కలుగజేయాలి. అతను ఎల్లాగూ ఇవ్వలేడు. ఆ తరువాత గొడ్డో, గోదో వేలం వేయడానికి ప్రయత్నించాలి. అప్పుల వాళ్ళ బాధ పడలేక, ఇటీవలనే అతను రెండు కోడెలు అమ్ముకున్నాడట. ఇక మిగిలితే ఒకటీ అర గొడ్డు మిగిలి వుండవచ్చు. ఉన్న ఒక్క గొడ్డు వేలం వేయడానికి పూనుకుంటే అతను బెంబేలు పడిపోతాడు. కాళ్ల బేరానికి వస్తాడు. అప్పుడు నెమ్మదిగా భూమికి రాజీనామా ఇవ్వమని నచ్చజెప్పి ఒప్పించాలి. మొదట ఒప్పుకోడు, ఎకరమో, అరో ఖుష్కీదానమిస్తానంటే ఒప్పుకోవచ్చు. అప్పుడుభూమి అమ్మకానికి చూపితే నాలుగు రాళ్ళు వస్తాయి. తన గండం గట్టెక్కుతుంది. ఈ వ్యవహారమంతా ఎంతో చాకచక్యంతో నడపాలి. దీనికి కరణం రామచంద్రయ్య సహాయం తనకు యెంతైనా అవసరం. రఘునాథపల్లెకు వెళ్ళగానే అతన్ని ముందు పట్టుకోవాలి. ఇల్లాంటి దగుల్బాజీ వ్యవహారాల్లో అతను దక్షుడు. అతనికి ఏదో ఆశపెట్టి వ్యవహారం సానుకూలం చేయించుకోవాలి. గుట్టుగా గ్రామంనుంచి బయటపడాలి. దానితో ఆ గ్రామానికీ తనకూ మధ్యగల సంబంధ బాంధవ్యాలు తెగతెంపులవుతాయి.

రాఘునాథపల్లె, తెలంగాణాలో ఒక మారుమూలలోని కుగ్రామం. ఆ గ్రామం ఇంకా సభ్యతకు కన్ను విప్పలేదు. భూ సంస్కరణలకు సంబంధించి వార్తలు ఇంతవరకు అక్కడికి ప్రాకలేదు. నాలుగు రోజులవుతే పరిస్థితులు ఈ విధంగా వుండవు. విషమ పరిస్థితులు ఏర్పడకముందే, వున్న ఆ కాస్త భూమి అమ్ముకోవడం శ్రేయోదాయకం. నాలుగు రోజులయితే భూముల ధరలు మరీ పడిపోతాయి. దున్నేవాడికే భూమి అనే నినాదం అక్కడ క్కూడా ప్రాకుతుంది. అప్పుడు భూములు కొనడానికి రైతు లెవ్వరూ ముందుకు రారు. భూమి అమ్మివేయడం ఇప్పటికే ఆలస్యమైంది. ఇంకా జాప్యంచేస్తే అసలుకే మోసం వస్తుంది. చాయ పెళ్ళి నిశ్చయించుకోవడం మంచికే వచ్చింది. లేకపోతే భూమి అమ్మవలసిన అవసరం అసలు ఏర్పడేది కాదు.

రంగారావు మానసికంగా ఒక గడ్డు సమస్యను పరిష్కారం చేసి, స్టేషన్ గడియారం కేసి చూచాడు. పదిగంటల అయిదు నిముషాలు అయింది. పది గంటలకు తను ప్లాటుఫారం మీదికి వచ్చాడు. ఒక అయిదు నిముషాల్లో రఘునాథపల్లె చుట్టి వచ్చాడు. ఎందుకో, రంగారావుకు మానసిక కాలానికీ, భౌతిక కాలానికీ ఎంతో తేడా కనపడింది. మానసిక కాలం ఇట్లే వాయువేగంగా పరుగెడుతుంది. భౌతిక కాలం వున్నచోటునే వుండిపోతుంది. ఒకవేళ నడచినా మందకొడిగా నడుస్తుంది. ఈ భేదం ఎందుకుంటుందో అతని కేమీ అర్థం కాలేదు.

రైలు... బస్సు... కాలి నడకను ప్రయాణం చేసి రంగారావు సాయంత్రాని కల్లా రఘునాథపల్లె చేరుకున్నాడు. తెచ్చిన చేతిసంచి తమ షాహుకారు ఇంట్లో పడేసి, కాళ్ళూ చేతులూ కడుక్కొని, తిన్నగా కరణం రామచంద్రయ్య ఇంటికి బయల్దేరాడు. రాంచంద్రయ్య ఇంటి వాకిలి గుమ్మానికి రెండువేపులా రెండు పెద్ద అరుగులున్నాయి. రామచంద్రయ్య ఒక అరుగు మీద కూర్చొని ఒక రైతుతో ఏదో వ్యవహారాన్ని గూర్చి మాట్లాడుతున్నాడు. తనను చూడడం తోనే చేతులు జోడించి "రండి, పంతులుగారు, ఇదేనా రాకడ?" అని పరామర్శించాడు. రంగారావు "దీర్ఘాయుష్యమస్తూ" అని, ఏవో కుశల ప్రశ్నల్లోకి దిగాడు. రామచంద్రయ్య ఇంగితం గ్రహించి ఏవో నాలుగు మాటలు చెప్పి, తనతో కూర్చున్న రైతును పంపించి వేశాడు. ఆ వెంటనే రంగారావు వేపు తిరిగి "ఇక చెప్పండి" అన్నట్లు చూచాడు.

తను ఏ పనిమీదా గ్రామానికి వచ్చిందీ, రంగారావు సవివరంగా చెప్పాడు. "మీ సహాయం లేకపోతే, ఈ పని ఏ మాత్రం సానుకూలం కా"దని కూడా హెచ్చరిక చేశాడు అతను.

"దానిదేమిలెండి, ఉదయమే మల్లయ్యనిపట్టి తెప్పిద్దాం" అన్నాడు రామచంద్రయ్య జవాబుగా.

"అల్లా అంటే కుదరదు – ఇది మీరు మీ స్వంత పనిగా భావించాలి. మల్లయ్యతో రాజీనామా యిప్పించి, మంచి ధరకు ఆ భూమిని కాస్తా అమ్మించి పెట్టాలి" అని రామచంద్రయ్య చేయవలసిన పనిని, విస్పష్ట పరిచాడు రంగారావు.

"ముందు మల్లయ్య దగ్గరి నుంచి రాజీనామా రాబట్టుకోవడం, మనకు చాలా ముఖ్యం – ఆ తరువాత భూమి అమ్మకం అంటారా? అది అవలీలగా నిమిషాల్లో జరిగిపోతుంది. ఈ వూరి రైతుల దగ్గర మంచి ధర పలకకపోతే, పొరుగూళ్ళ నించి రైతుల్ని

పిలిపింతాం" అన్నాడు రామచంద్రయ్య రాజీనామాకి సంబంధించిన వ్యవహారానికి ఎక్కువ ప్రాముఖ్యత యిస్తూ.

"ఈ వ్యవహారంలోంచి నన్ను ఎలాగైనా గట్టెక్కించండి. మీ చేతులతోనే ఛాయ పెళ్ళి చేసినవారవుతారు. పైగా మీ కష్టం నేనేమీ ఉంచుకోను. అణా పైసలతో సహా చెల్లించుకుంటాను" అన్నాడు రంగారావు. చల్లకొచ్చి ముంత దాచుకోవడం దేనికనే ధోరణిలో.

తనురెండు వందల రూపాయలు రామచంద్రయ్యకు యిచ్చేటట్టూ, అతను మల్లయ్య దగ్గర రాజీనామా యిప్పించి, ఆ పొలం, మూడువేలూ, నాలుగు వేలకి మధ్య అమ్మించి పెట్టేటట్టూ, అన్ని విషయాలూ ముఖాముఖిగా మాట్లాడుకొని రామచంద్రయ్యతో రంగారావు ఒక ఒప్పందానికి వచ్చాడు.

"ఈ రాత్రికి మీరు నిశ్చింతగా వుండండి. రేపీపాటికి మీ వ్యవహారం ఫైనల్ కాకపోతే, నన్ను మారుపేరు పెట్టి పిలవండి" అన్నాడు రామచంద్రయ్య చివరి మాటగా.

"అయితే, నా కింక సెలవిప్పించండి" అని లేచాడు రంగారావు.

"శలవు. నమస్కారాలు"అంటూ రామచంద్రయ్య కూడా లేచాడు అరుగుమీది నించి.

"దీర్ఘాయుష్యమస్తూ" అని కదిలాడు రంగారావు అక్కడినించి. మరునాడు ఉదయం ఎనిమిది గంటలకల్లా రంగారావు కాలకృత్యాలు తీర్చుకొని, టీ తాగి, కరణం రామచంద్రయ్య ఇంటికేసి వెళ్ళాడు. రామచంద్రయ్య తన ఇంటిముందు అరుగు మీద కూర్చుని వున్నాడు. అప్పటికే కావలివాడిని పంపి, మల్లయ్యని పట్టి తెప్పించాడు. ఎందుకో రంగారావుకు ఎడమకన్ను అదిరింది. నిర్లక్ష్యంగా ముందుకు నడిచి, వెళ్ళి అరుగుమీద కూర్చున్నాడు. రామచంద్రయ్య నమస్కారానికి "దీర్ఘాయుష్యమస్తూ" అని ఆశీర్వదించాడు.

రంగారావుని చూసీ చూడడంతోనే "దండాలు పంతులు గారూ" అన్నాడు మల్లయ్య – ఎందుకో రంగారావు జవాబుగా "దీర్ఘాయుష్యమస్తూ" అని అనలేకపోయాడు.

"రెండు సంవత్సరాల నించి కౌలుగింజలు కొలవడం లేదు. పంతులు బాకీ గల్లా (ధాన్యం) కోసం వచ్చాడు పట్నం నించి. వెంటనే గల్లాయిచ్చి వ్యవహారం ఫైనల్ చేసుకో" అన్నాడు రామచంద్రయ్య నాందీప్రస్తావనగా మల్లయ్య నుద్దేశించి.

"ఇప్పుడు గల్లా యాడికెల్లి ఎల్లుతది దొరా నా దెగ్గర – నాలుగు రోజు లాగితె మొత్తం గల్లా గొలుస్త" అన్నాడు మల్లయ్య దీనంగా.

"రేపు, రేపు అంటూ రెండు సంవత్సరాలు దాటేశావు. ఇంకా ఎన్నేళ్ళు బ్రాహ్మలకి ఎగనామం పెడతావు?"అని అడిగాడు రామచంద్రయ్య నిక్కచ్చిగా.

"కుంట గడ్డి పడ్డది – పొలంలో చారెడిత్తులు (గింజలు) పండుతులేవు. బాయి బెట్టైబడి పోతున్నది. ఇంక యాడికెల్లి గొలుస్త దొర గల్ల?" అని మల్లయ్య సంగతి సందర్భాలు వివరించాడు.

"బొత్తిగా లాభం లేకపోతే బావి వదిలేసెయ్యి – ఇంకెవరికైనా కౌలు కిచ్చుకుంటారు పంతులు"అని సూచించాడు రామచంద్రయ్య.

"ఆ బాయికాడ బుట్టి, ఆ బాయికాడ బెరిగిన – సస్తే ఆ బాయి గడ్డమీదే సావాలె. గిప్పుడు (ఇప్పుడు) యేమి మొకం బెట్టుకొని వదిలెయ్య మంటవుదొర?" అని అడిగాడు మల్లయ్య సూటిగా.

ఆ ప్రశ్నకి రంగారావు మనస్సు కలుక్కుమంది. కాని అతను ఏమీ కల్పించుకోలేదు మధ్యలో.

"నీ వెధవ వేసాలు నా దగ్గర సాగవు. కొలిస్తే బాకీ గింజలు వెంటనే కొలువు. లేకపోతే వెంటనే భూమికి రాజీనామా యివ్వు" అని నిష్కర్షగా చెప్పాడు రామచంద్రయ్య.

"మా తాతలకాడినించి ఆ బాయి జేస్తున్నాం. గిప్పుడు బాయి యిడిసిపెట్టి యాడికిపోను దొరా?" అని అడిగాడు మల్లయ్య తన కేదైనా బ్రతుకు తెరువు చూపించమన్నట్లుగా, జాలిగా. ఆ వాక్యానికి రంగారావు హృదయం అమాంతంగా కరిగింది. "వీడిని పీడించడ మెందుకు, వదిలివేతమా" అనుకున్నాడు మనస్సులో–కాని ఛాయపెళ్ళి, ఒక పెద్ద సమస్యగా మారి, అతని కళ్ళముందు ఆకాశం ఎత్తున లేచింది. దానితో రంగారావు హృదయం చప్పున గడ్డ కట్టింది.

"పోనీ, సొమ్మూ సంబంధం, గొడ్డూ గోదా ఏమైనా వుంటే వెంటనే అమ్మి బాకీ చెల్లించు" అన్నాడు రామచంద్రయ్య మల్లయ్యని.

"నాతాన (దగ్గర) సొమ్ము, గిమ్ము యాడుంది దొరా – పొల్ల (అమ్మాయి) పెండ్లికి వలిశంత అప్పుజేసిన – అప్పులోళ్ళువచ్చి, రెండు కోడెలు గొటుకపోయిన్రు, ఒక యెద్దు నాం దిని సచ్చింది. గిప్పుడు ఒక బక్క దున్న పోతున్నది నాతాన" అన్నాడు మల్లయ్య జవాబుగా.

"వీడుమంచి మాటలతో ఏమాత్రం వినేట్టు లేదు. ఇంక చూస్తా రెందుకు? వంగబెట్టి వీపుమీద బండ పెట్టండి" అని రామచంద్రయ్య ఆగ్రహావేశంతో కావలి వాళ్ళని ఉద్దేశించి అన్నాడు.

'నీ కాలుమొక్కుత (కాళ్ళకి మ్రొక్కుత) నా ఇజ్జత్ (పరువు) తీయకుదొరా. నా ఇజ్జత్ తీయకు దొరా" అని కంట నీరు పెట్టాడు మల్లయ్య. ఇద్దరు కావలి వాళ్ళు మల్లయ్యని

పట్టుకొని, అతన్ని వంగబెట్టి, వీపుమీద ఒక బండ పెట్టారు. మల్లయ్య వాళ్ళని ఏమీ ఎదిరించలేదు. యజమానికి మచ్చికపడ్డ గొడ్డుకు మల్లే లొంగిపోయాడు. ఆ యిద్దరికినీ – ఆ తరువాత మల్లయ్య అవమానంతో ఇటూ, అటూ ఎవ్వరినీ చూడలేదు. నేలకేసి చూస్తున్న అతని మొహం నేలకేసి చూస్తూనే వుండిపోయింది. భూమిపైన ఏకధారగా అశ్రువులు రాలడం మొదలెట్టాయి.

రామచంద్రయ్య ఆ వ్యవహారాన్ని అంతటితో తాత్కాలికంగా ఆపి, ఇంకొక వ్యవహారంలోకి దిగాడు యాంత్రికంగా.

రంగారావు మొహంలో కత్తివేసినా నెత్తురు చుక్కలేదు. కూర్చున్న వాడు కూర్చునే వుండిపోయాడు.

కొంత సేపటికి కడవలతో నీళ్ళు పోసినట్లు, మల్లయ్యకి, చెమటలు కారడం మొదలెట్టాయి. అవమాన భారంతో కరిగి నీరౌతున్నాడా అనిపించింది రంగారావుకు. అతను మల్లయ్యకేసి చూడడం మాని, ఇంకొకవేపు చూడడం ఆరంభించాడు.

మల్లయ్యకి మరీ నీరసం ఎక్కువైంది. దానితో తల తిరగడం ఆరంభించింది. కళ్లు చీకట్లు కమ్మాయి. వెంటనే స్పృహ తప్పి కుప్పగా కూలాడు మల్లయ్య బండతో సహా.

మల్లయ్య పడిపోవడంతోనే, అక్కడున్న ప్రజ, మల్లయ్య చుట్టూ మూగింది. కొందరు అతన్ని ఎండలోంచి నీడకి తీసుకువెళ్ళడానికి ప్రయత్నిస్తున్నారు. మరి కొందరు "వద్దు, వద్దు" అని వారిస్తున్నారు.

మల్లయ్య పడిపోవడంతోనే, రంగారావు, రామచంద్రయ్యలు అమాంతంగా అరుగు మీదినించి క్రిందికి దూకి, అతను పడిపోయిన చోటుకి పరుగెత్తారు. ఊపిరి సలుపదేమో నని భయపడి, జనాన్ని కొంచెం దూరంగా జరిపారు. ఒకరిని నీళ్ళకోసం పరుగెత్తించారు. ఇంకొకరిని అతని భార్య దగ్గరికి తరిమారు.

మొహం మీద నీళ్ళు చల్లిన కాసేపటికి కొద్దిగా స్పృహ వచ్చింది మల్లయ్యకు.

"ఇజ్జత్ పోయింది. ఇంక బతికేమి లాభం?" అంటూ గొణుక్కుంటున్నాడు మల్లయ్య ఆ మైకంలోనే.

రంగారావుకి, ఆ గొణుగుడికి కళ్ళ నీళ్ళ పర్యంతరమైంది.

"పాపం – పట్టుమని పది మెతుకులు తిని ఎన్నిరోజులైందో?" అంటున్నారు ఎవ్వరో ఆ గుంపులో.

ఆ వాక్యం రంగారావు చెవిని పడింది. మల్లయ్య అంత బీదరికం అనుభవిస్తున్నాడని అతనికి తెలియదు.

ఇంతలోకే మల్లయ్య భార్య, మల్లి – "ఏమైంది మామా?" అని గొల్లున ఏడుస్తూ అక్కడికి పరుగెత్తుకొచ్చింది. మల్లిని చూడడంతోనే చుట్టూ మూగిన జనం దానికి దారి ఇచ్చారు.

మల్లి, మల్లయ్యని సమీపించి చెంబులోని నీళ్ళు చేతితో మొహం మీద వత్తుగా చల్లింది. కొంగుతో మల్లయ్య మొహం తుడిచింది.

"ఇజ్జత్ పోయింది పిల్లా" అంటున్నాడు మల్లయ్య. ఇంతలోకే ఎవరో వేడి పాలు తీసుకు వచ్చి, మల్లికి అందించారు. మల్లి పాలగ్లాసు మల్లయ్య నోటిదగ్గరికి తీసుకువెడితే, అతను వద్దన్నట్లు మొహం తిప్పుకున్నాడు.

"మల్లయ్యా! కాసిన్ని పాలుతాగు" అని అన్నాడు రంగారావు. గుంపులో ఒకరిద్దరు కూడా అదే మాట అన్నారు. కాని మల్లయ్య వాళ్ళ మాటలు వినిపించుకోలేదు. పాలు తాగనూ లేదు.

"లే మామా మనింటికి పోదాం లే" అని మల్లి, తన మెడ చుట్టూ అతని చెయ్యి వేసుకొని, మల్లయ్యని నెమ్మదిగా లేపింది. మల్లయ్యని లేపడంలో మల్లికి యిద్దరు ముగ్గురు మనుషులు సహాయం చేశారు.

"పోదాం పా పిల్లా" అంటూ నెమ్మదిగా కదిలాడు మల్లయ్య.

నెమ్మదిగా నడిపించుకుంటూ, మల్లి, మల్లయ్యని యింటికి తీసుకెళ్ళింది. రంగారావు కూడా మల్లయ్య యింటిదాకా వెళ్ళి వచ్చాడు.

"జర్రంత గట్కు తాగుతావు మామా" అని అడిగింది మల్లి. ఎక్కడి వాళ్ళు అక్కడికి వెళ్ళిపోగానే.

"గింజలు యాడికెల్లి దీసుకొచ్చినవు?" అని అడిగాడు మల్లయ్య. మల్లిని ఆతురతగా.

"యెల్లవ్వ జర్రన్ని సజ్జగింజలు పెట్టింది" అన్నది మల్లి సమాధానంగా.

"నా కొద్దు పిల్లా నా మనస్సు బాగాలేదు. నువ్వు జర్రంత దాగి, బుడ్డోడికి పెట్టు" అని అన్నాడు మల్లయ్య.

"నిన్న పొద్దుగల్లి దాగిన గట్కు – జర్రంతా దాగు మామా!" అని మల్లి ప్రాధేయపడ్డది.

మల్లి మాటని తోసెయ్యలేక పోయాడు మల్లయ్య. ఏదో ఎంగిలి పడ్డాడు ఆపక్క మీదే. మల్లిని సంతృప్తిపరచే ఉద్దేశంతో.....

తండ్రిని, ముగ్గురు నలుగురు మనుషులు పట్టుక రావడం చూచి, ఏదో జరిగిందని ఊహించి, క్షణం ఇంట్లో వుండని మూడేళ్ళ కుర్రవాడు రామయ్య, ఆనాడు తండ్రి పక్క దగ్గరి నించి కదలలేదు.

"నేను పెద్దల ఇజ్జత్ పోడగొట్టిన – బుడ్డోడా నువ్వన్న నిలబెట్టాలె" అన్నాడు మల్లయ్య బుడ్డోడిని దగ్గరికి తీసుకుంటూ.

"ఏఁదీ మామా ఆ మాటలు?" అంది మల్లి కళ్ళల్లో నీళ్ళు నింపుకుంటూ–

మల్లయ్య కాసేపు మధ్యాహ్నం పడుకోవడానికి ప్రయత్నించాడు. కాని అతనికి ఏ మాత్రం నిద్ర పట్టలేదు. ఉండి వుండి, ఉదయం జరిగిన సంగతులే మాటి మాటికీ జ్ఞాపకం రావడం మొదలెట్టాయి అతనికి. పక్క మీద ఇటూ, అటూ పొర్లుతూ కాలం గడిపాడు.

సాయంత్రం చీకటి పడుతుండగా పక్కమీది నించి లేచాడు మల్లయ్య.

"యాడికి మామా?" అని మల్లి అడుగుతూనే వుంది. కాని మల్లయ్య, మల్లి మాట వినిపించు కోలేదు. ఒక యిత్తడి చెంబు చంకలో పెట్టుకొని, భుజాలమీది నించి చెంబు కనబడకుండా ఒక దుప్పటి కప్పుకొని, నీరసంగా ఇంట్లోంచి బయల్దేరాడు మల్లయ్య. అతను ఎక్కడికి వెడుతున్నదీ మల్లి ఇట్టే గ్రహించింది. "మనస్సు బాగాలేదు. పోనియ్యి" అనుకొని మౌనం వహించింది మల్లి.

రాత్రి ఎనిమిది దాటిన తరువాత మల్లయ్య ఇంటికి తిరిగి వచ్చాడు. చెంబు తిరిగిరాని సంగతి మల్లి ఇట్టే పసి గట్టింది. చెంబు కుదవబెట్టి భర్త తాగి వచ్చాడన్న సంగతి అవలీలగా తెలుసుకుంది.

"పిల్లా, బుడ్డోడు పండుకున్నాడా?" అని అడిగాడు మల్లయ్య వచ్చీ రావడంతోనే.

"ఆఁ" అంది మల్లి జవాబుగా.

"నువ్వు బుక్కెడు గట్కు తాగినవా" అని అడిగాడు మల్లయ్య ఆతురతతో.

"ఇంక గట్కు యాడిది మామా? యెల్లవ్వతాన దెచ్చిన గింజలు పొద్దునట్టె అయిపోయినయి" అంది మల్లి అనునయంగా.

"పోనీలే. ఈ పూటకు మనకు ప్రాప్తం (ప్రాప్తం) లేదు" అన్నాడు మల్లయ్య వేదాంతి ధోరణిలో.

"పిల్లా!"

"ఊఁ"

"ఒక మాట జెపుత యింటావు?

"ఏంది మామా?"

"పొల్ల పెండ్లికి దుచ్చిన చీర గట్టుకొనీ, జెర్ర ఆ అద్దాల రయికె దొడుక్కో" అన్నాడు మల్లయ్య ప్రేమ ఉట్టిపడుతున్న కంఠంతో.

"ఊర పొద్దు గూకలేదు. ఏంది మామా ఈ సరసాలు" అని ప్రణయ కోపాన్ని నటించింది మల్లి.

"కట్టుకోకపోతే బుడ్డోడి మీద ఒట్టే" అని బలవంత పెట్టాడు మల్లయ్య,.

విధి లేక మల్లి అమ్మాయి పెళ్ళినాడు తనకు భర్త తెచ్చిన ఆకుపచ్చ చీర కట్టుకొని, అద్దాల రవిక తొడుక్కుంది. వొయ్యారంగా వచ్చి పక్కలో వాలింది.

"వనలచ్చిమి వోలున్నవు" అన్నాడు మల్లయ్య, మల్లిని గట్టిగా ముద్దు పెట్టుకొంటూ.

"బుడ్డోడు పండుకున్నడో, లేదో జ్రరసూడు" అని హెచ్చరిక చేశాడు మల్లయ్య కొద్ది సేపటికి.

"మెసల్తున్నడు మామా!" అని అంది మల్లి కొంటిగా.

మల్లయ్య ఒక నిమిషం పాటు కుర్రవాడిని పరీక్షించి చూచాడు. కుర్రవాడు వొళ్ళు తెలియకుండా నిద్రపోతూ వుండడం గమనించి, అతని మనస్సు కుదుటపడింది.

"అబద్దా లాడుతున్నావ్ పిల్లా."

"లేదు మామా, పండుకో లేదనుకున్నా."

"పిల్లా! నీయన్ని దొంగ ఎత్తులే"

ఆ వాక్యానికి మల్లి ఆ కాశం ఎత్తున ఉప్పొంగిపోయింది...

రాత్రి రెండుజాముల తరువాత మల్లయ్య చడీ చప్పుడూ లేకుండా పక్క మీది నించి లేచాడు. మల్లి పక్కలో మైమరిచి నిద్రపోతున్నది. చీకూ చింతా లేకుండా కుర్రవాడు నిద్రపోతున్నాడు. మల్లయ్య తిన్నగా కుర్రవాడి మీదికి వాలి, అతన్ని తేలికగా ముద్దు పెట్టుకున్నాడు. మల్లి లేస్తుందేమోననే భయం కొద్దీ ఆమె దగ్గరికి వెళ్ళలేదు. దూరంగా వుండి తదేక దీక్షగా ఆమె మొహంలోకి ఒక నిమిషం పాటు పరికించి చూచాడు. ఆ తరువాత ఒక తాడుతో సహా నెమ్మదిగా పక్కగదిలోకి వెళ్ళాడు. గది తలుపులు బంధించి వేశాడు. ఇంక ఆ గదిలోంచి వెలుపలికి రాలేదు.

మల్లి తెల్లవారుజామున మగత నిద్రలో అలవాటు ప్రకారం పక్క తడిమి చూచుకుంది. పక్క ఖాళీగా వుండడం గమనించి, దిగ్గున లేచి కూర్చుంది. అవతలి కెళ్ళాడో ఏమోనని కాసేపు భర్తకోసం నిరీక్షించింది. ఎంతకూ రాకపోవడంతో లేచి యిల్లంతా వెతికింది. పడమటి గది తలుపు లోపల గడియవేసి వుండడం గమనించి ఒక్క సారే గొల్లుమంది. ఆ ఏడ్పులకి పొరుగున వున్న నాలుగు యిళ్ళ వాళ్ళు మల్లి యింట్లో పోగైనారు. పడమటి గది తలుపులు బద్దలు కొట్టారు. మల్లయ్య లోపల దూలానికి వ్రేలాడుతూ వున్నాడు.

"ఇజ్జత్ పోయింది. పాపం మల్లయ్య ఆత్మహత్య చేసుకున్నాడు" అన్నారు అందరూనూ. మళ్లీ ఏడ్పులు ఊరంతా ప్రతిధ్వనించాయి.

రెండు రోజుల వరకూ, రఘునాథపల్లె పోలీసు అధికారుల రాకపోకలతో హడావుడిగా వుండింది.

ఎవ్వరి ప్రేరణతో కూడా ఆ ఆత్మహత్య జరగలేదని నిరూపించడానికి, రామచంద్రయ్య తల ప్రాణం తోకకు వచ్చింది. రంగారావు, రామచంద్రయ్యలు చెరి రెండు వందలు తడిపి ఎక్కడి వ్యవహారం అక్కడ సర్దేశారని ఆ వూళ్ళో గిట్టని వాళ్ళు చెప్పుకుంటారు.

బ్రతుకు జీవుడా అని నాలుగు రోజుల తరువాత రంగారావు తిరిగి పట్నం చేరుకున్నాడు. "ఊరికి వెళ్లావేమో, ఏమైందిరా?" అని తల్లి అడిగితే "ఛాయకి పెళ్ళి అయ్యే యోగం లే" దని నిక్కచ్చిగా చెప్పాడు. మీ సంబంధం మాకు నచ్చలేదని తెలుపుతూ పెళ్ళికొడుకు వాళ్ళకి ఉత్తరం వ్రాసి పడేశాడు రంగారావు.

ఇప్పటివరకూ ఆ పొలం అమ్ముడు పోలేదు. ఛాయ పెళ్ళి ఇంతవరకూ జరగనూ లేదు.



# ధనికొండ హనుమంతరావు

**(1919 - 1989)**

**తె**లుగు సాహిత్యం సర్వతోముఖంగా వికసించటానికి దోహదమిచ్చిన ప్రతిభావంతులగు రచయితల్లో ధనికొండ ముఖ్యులు. తెలుగు కథ రూపురేఖలు దిద్దుకొంటున్న తరుణంలో వీరు రసవంతమైన కథలూ, నవలలూ వ్రాసి, ప్రజలకు సాహిత్యంలో అభిరుచినీ, అభినివేశాన్నీ కలిగించటానికి కృషి చేశారు. మొదట హాస్య రచనలే చేసినా, పోను పోను దైనిక సమస్యలని ఇతివృత్తాంతాలుగా స్వీకరించి, జీవితంలో సెక్సు ప్రభావాన్నీ నేటి జీవిత విధానంలోని కృత్రిమాలనీ విశదపరుస్తూ అనేక కథలు వ్రాశారు. వ్యక్తి మానసిక పరిధి వయసుతో, విద్యతో, అనుభవంతో, సంస్కారముతో ఎలా విస్తృతమయ్యేదీ వివరించటం వీరి ఆశయంగా కనిపిస్తుంది. వ్యంగ్య విన్యాసంతో అలరించే శైలి వీరిది.

రచనలు : ఇలవేల్పు, లోకచరిత్ర, మగువ మనసు, గుడ్డివాడు, ప్రమాదాలు (నవలలు), అనాథ, శీలవతి మొదలగు కథా సంపుటాలు.

# సత్యవ్రతుడు

ఎండాకాలం కావటం వల్ల ఉదయం తొమ్మిదింటికే సూర్యుడు నిప్పులు చెరగనారంభించాడు. గాలి స్తంభించిపోయినట్లుగా వుంది. ప్రసాదరావు కాలుకాలిన పిల్లల్లే వంటింట్లోకి వెళ్ళి ఇంకా వంట కానందుకు విసుక్కున్నాడు. ఈ చిన్న విషయంలో భార్యతో పోట్లాట వేసుకున్నం దుకు రభస కావటం తప్ప మరేమీ జరగదు. అసలే చిరాగ్గా వుంది; ఆమెను కదిపి ఈ చిరాకు రెండింతలు చేసుకోవటం అర్థంలేని పని.

సావిట్లో పడక కుర్చీలో వాలి ఆలోచిస్తున్నారు. ఏం జీవితం అనిపిస్తోంది. ఎనభై జీతం సంపాయించేటప్పుడు ఎంత లేమివుండేదో, నూటపాతిక సంపాయించినప్పుడూ అంతే! ఏమిటో – జీతం పెరుగుతే బాగుండు ననుకోవటమే కాని, పెరుగుదలకు మార్పు కనిపించలేదు.

పోనీ ఇంట్లో జనాభా ఎక్కువైందా అంటే – అదీ లేదు, తనూ, భార్యా ఇద్దరు పిల్లలూను. ఏడాది నిండని చంటివాడివల్ల ఖర్చు పెరిగిందనుకునే సాహసం కలగలేదు. ఏమైనా డబ్బు చాలటం లేదు.

ప్రతినెలా ఏదో వొక అవాంతరం వొస్తూనే వుంది. గత మూడు నెలలుగా చూచుకుంటే ఒకనెలలో సంక్రాంతికి బట్టలకింద యాభై రూపాయిలు. మరో నెలలో భార్యకూ పెద్దవాడికీ జబ్బు చేయడం వల్ల డాక్టర్ బిల్లు అరవై రూపాయిలు. గత నెలలో సంవత్సరాది పండుగకు మళ్ళీ అరవై రూపాయిల బట్టలు; ఇలా ప్రతి నెలా అదనపు ఖర్చు వొస్తూనే వుంది. ఇందులో ఏదీ మానుకోగలిగిందిగా తోచటం లేదు. వొచ్చిన జీతమంతా ఖర్చు పెట్టుకున్నా జీవితం నిస్సారంగానూ అసంతృప్తిగానూ వుంటూనే వుంది. తనకన్నా చాలా తక్కువ జీతం తెచ్చుకుంటూన్న వాళ్ళు తన కన్నా ఎంతోహాయిగా బతుకుతూండటం తనకు తెలుసు! జీవితాన్ని అనుభవించటం ఒక కళయితే, ఆ కళారాధనకు తను అనర్హుడై వుండాలి.

నిత్య జీవితావసరాలకు ఇబ్బంది పడకపోయినా, విలాసాలకు అవకాశాలుండనందుకు తన భర్య బాధపడుతుంది; తనకూ ఆ బాధ వుంది మరి. కాని కోర్కెలు కలగటం వేరూ; వాటిని తీర్చుకో గలగటం వేరూను. నగలూ నాణాలూ లేవని ఆమె ఫిర్యాదు; కారూ, షికార్లూ, సినిమాలూ లేవని తన ఏడుపూ!.... కాని ఈ తీరని కోరికలంటూ వుండి, వాటిని తీర్చుకునేందుకు ఉత్సాహంగా పని చేయటంవల్లే బతుకు దొళ్ళుతోందేమో? ఇది నిజమైనా, ఇలా ఆలోచించి తృప్తి పడగల సామాన్య మానవు లెందరుంటారు? ఎంత సంస్కారం పెరగాలి? తన సంస్కారమే చాలలేదు!

గడియారం ఐదునిమిషాలు తిరిగింది. మరో యాభై ఐదు నిమిషాలకల్లా తను కౌంటర్‌లో ఉండాలి. నది మహావేగంతో వొచ్చిపడుతోందని తెలిసివుండి కూడా ఆ ప్రవాహానికి ఎదురుగా నిలబడే వ్యక్తివలెనే తను, జనప్రవాహానికి ఎదురుగా నిలబడి ఆ వొత్తిడికి తట్టుకోవాలి. చెక్కులు, డ్రాఫ్టులు, డిపాజిట్లు – మొదలైనవి జడివానల్లే వొచ్చి పడుతూవుంటే, వొళ్ళు దగ్గిర పెట్టుకొని ఒకటికి రెండుసార్లు నోట్లు లెక్కపెట్టి డబ్బు విసిరి మొహాన పారేస్తూండాలి. ఏమాత్రం అన్యమనస్కంగా వున్నా గుణ్ణమే! వెనకటి రెండేళ్ళకింద ఒకసారి వంద రూపాయినోట్లు ఇచ్చేందుకు రెండు రూపాయిలనోట్లు ఇచ్చాడు: అవతలాయన పెద్దమనిషి కనుక. ఒకసారి హెచ్చరించి ఎక్కువిచ్చిన వందా తిప్పి ఇచ్చాడు. ఆ నెలజీతం వందా పెరిగినట్లే తోచింది!

వేల సంఖ్యల్లో పైకం తిప్పేప్పుడు పొరపాట్లు పడకుండా ఉండవు మరి. ఐతే తనెంతో జాగర్తగా వుంటాడు. అంతర్వాణి ఎక్కడ నిద్రపోతుందోనని భయం. గొణుక్కుంటూ, ఎవరికో జవాబు చెపుతూన్నట్లు, తను చేసే పనిని అదృశ్య శక్తి ఏదో పరీక్షగా కనిపెడుతున్నట్లుగా లెక్కలు పెడతాడు. అంతర్వాణి సరేననే దాకా అనుమానం తీరదు. ప్రతి లెక్కలోనూ తను పొరపడుతూన్నట్లు, ఆ డబ్బు తీసుకునేవాడు తనకు టోపీ పెట్టేందుకు ఎదురుకుండా సిద్ధంగా వున్నట్లే అనిపిస్తుంది. కాస్త ఏమరుతే చేతులు కాలే ఈ బోడి ఉద్యోగమంటే ఏవగింపు కలుగుతూంటుంది కాని, ఇంతకన్న మంచి ఉద్యోగం ఎక్కడ తనకోసం వేచి కూర్చుంది కనుక?

ఐతే ఈ ఉద్యోగాన్నిగూర్చి తను గర్వపడే క్షణాలు అనేకం. ఎంతలావు మనిషైనా, ఎంత గొప్పవాడైనా సరే, కౌంటర్ ముందు, తను లెక్కపెట్టి డబ్బు పారేసేదాకా కాచుకొని ఉండాల్సిందే. పని తొందరలో కాస్త ఆలస్యమైతే దీనంగా జాలిగా తనను ప్రార్థించాల్సిందే; లేదా ప్రార్థనా పూర్వకంగా చూపుల్తో అర్థించాలి! తన ప్రక్కనవున్న ట్రంకులోని కరెన్సీ నోట్ల బొత్తర్లు చూస్తుంటే, ఇదంతా తనదేననట్లు, ఈ నోట్లన్నీ తన చేతులమీదుగా సర్క్యులేట్

కావాలనే గర్వం కలుగుతూంటుంది. ఇంత ఐశ్వర్యవంతుడికి బ్యాంకులో వున్న కాస్సేపూ ప్రపంచంలో లేమి అనేదే లేదనిపిస్తూంటుంది. కాని, బ్యాంకు మూసేసే సమయంలో గుండెల్లో రైళ్ళు పరుగెత్తుతవి. ఎంత పొరపాటువుందోనని. సరిగ్గా స్క్రోల్‌కూ, క్యాషుకూ సరిపెట్టగానే, పోయిన సగం ప్రాణం తిరిగి వొచ్చినట్లనిపించి, ట్రంకును ఇనప్పెట్టెలో పెట్టి, రిలీఫ్‌ను సూచించేందుకు ఊపిరి తిత్తుల్లోని చెడుగాలిని శబ్దమయేట్లు బైటికి వూది బైట పడుతూంటాండు.

ఒక్కొక్కప్పుడు ఎకౌంటెంట్ పని సుళువనిపిస్తుంది. ఒకవేళ కూడికలు తప్పినా, జమ కాలంలో ఖర్చు వేసినా మరేం ఫర్వాలేదు. అదంతా కాగితం మీదనే కనుక సరిదిద్దవొచ్చు. అది థియరీ ఐతే, తనది ప్రాక్టికల్: ఇక్కడ పడే పొరపాటుకు జరిమానా క్యాష్ రూపంలో వెను వెంటనే చెల్లించాలి: తనెంత భయపడి ఛస్తూంటాడో, ఎకౌంటెంట్లు అంత కులాసాగా, నిర్లక్ష్యంగా నవ్వుతూంటారు. వాళ్ళమీద యీర్ష్య పెంచుకొని ఆలోచిస్తూంటే, అది తనకే నష్టం; డబ్బులో పొరపాటు పడొచ్చు. అందుకని ఈ ఇబ్బందులన్నింటినీ అలవాటు చేసుకున్నాడు.

"మూడ్" బాగుండక ఒకటిరెండుసార్లు చాలా చిన్న మొత్తాల్లో పొరపాట్లు జరిగినవి. వెంటనే ఆ మొత్తాల్ని కట్టేసి అవి చాలా చిన్న మొత్తాలైనందుకు సంతోషించాడు. యీ "మూడ్" బాగుండక పోవటానికి కారణం. ఉదయాన్నే భార్యతో వాగ్వాదం జరిగి, మనస్సు పాడు కావటమే! అందుకనే ఆమె ఎంత తప్పు చేసినా పొద్దుటి పూట మాత్రం ఆమెను ఏమనేందుకూ సాహసించలేదు.

పెద్దముల్లు రెండు మీదికి జరిగింది.

"వంటవ్వలా?" అని అరిచాడు.

అవుతోంది.... ఇంకో ఐదు నిమిషాలు, గొణుక్కొన్నాడు ప్రసాదరావు. ఈ ఐదు నిమిషాలూ గడిపేందుకు సిగరెట్ ముట్టిద్దామనుకున్నాడు. కాని, పెట్టె ఖాళీగా వుంది. ఎలాగూ కావాల్సిందే కనుక కొత్త పెట్టె తెప్పిద్దామని చొక్కా జేబు ఎంత కెలికినా చిల్లరే తగిలింది కాని, అందులో ఉండవలసిన రూపాయి కాగితం కనిపించలేదు.

జేబు బోర్లించి చూశాడు లేదు; లేదు. ఒకవేళ కోటుజేబులో వున్నదేమో అనే సందేహం వొచ్చింది. అలంకారార్థమే ఆ కోటు కాని. బ్యాంకులో కూడా ఆ కోటను కుర్చీకే తొడుగుతాడు; అందులో సిగరెట్ పెట్టా, అగ్గిపెట్టా, వక్కపొట్లాలు తప్ప వేరేమీ ఉండవు. ఏమో–ఐనా పొరపాటున కోటుజేబులో పెట్టి వుండొచ్చనే అనుమానం తగిలి, జేబులన్నీ దేవి, బోర్లించి చూశాడు. కనిపించలేదు.

గృహిణి చేసిన పనే ఐవుంటుందని కోపం వొచ్చింది. అందులోనూ ఇవాళ ఒకటో తారీకు; ఇది చివరినోటు; కొత్తబొత్తిలో చివరినెంబరుది! సాయంత్రానిక్కాని జీతాలు రావు. కాస్తఆలోచించి, తనను అడిగి తీసుకునేపాటి జ్ఞానమన్నా ఆమెకు లేకపోతే ఎలా? సాధ్యమైనంత వరకూ కోపాన్ని తగ్గించుకొని ఆమెను కేకేశాడు. చేతులో గరిటెతో సహా ఆమె ప్రత్యక్షం కాగానే "జేబులో డబ్బు తీశావా?" అన్నాడు.

"అరుస్తే పిల్లాడు లేస్తాడు... నాకెందుకు డబ్బు? నేను తియ్యలేదు... ఎంత?" అందామె మృదువుగా.

తనకున్న ఆతృత, ఉద్వేగం ఆమె కెందుకుంటవి? బ్యాంకులో ఎక్కౌంటెంట్ల ధోరణి అది!

"రూపాయి కాగితం!" అన్నాడు చిరాగ్గా. చివర సున్నాలున్న కొత్త కాగితం కళ్ళ ముందాడుతోంది.

"నేను తియ్యలేదు... ఎలా పోయి వుంటుంది?"

అదే తనూ ఆలోచిస్తున్నాడు. ఇవ్వాళ పనిమనిషి కూడా రాలేదు. అందుకనే వంట ఆలస్యం. నిన్న సాయంత్రం కూడా నోటు మార్చబోయి. చిల్లరవుంది కదానని దాంతోనే సిగరెట్లు కొనుక్కున్న సంగతి బాగా గుర్తుంది. రాత్రికి రాత్రికే జేబులోంచి ఎలా మాయమై వుంటుంది? తన భార్య తీయని పక్షంలో పెద్ద వెధవ సీనుగాడే తీసివుండాలి.

"ఏడీ వాడు?" అన్నాడు.

"నాకేం తెలుసూ? ఆ వీధిలో ఆడుకుంటున్నాడేమో పిలవండి"

వీధిలోకి వెళ్ళి ప్రమాదాన్ని సూచించే కంఠస్వరంతో ఎలుగెత్తి పదిసార్లు పిలుస్తేనే కాని వాడు రాలేదు.

"ఏరా – జేబులో చెయ్యిపెట్టావా?"

"లేదే!" అన్నాడు వాడు, అమాయకంగా.

"చెప్పరా.... తీస్తే తీశానని చెప్పు" అంది తల్లి.

"నాకేం తెలుసూ?"

"తీస్తే తీశావ్.... అబద్ధం మాత్రం ఆడొద్దు"

"నేను తియ్యందే!"

"ఈ మధ్య నీకు వెధవస్నేహాలు ఎక్కువైనవి. ఆ వెధవ లెవరన్నా డబ్బులు తెమ్మన్నారా?" అంది తల్లి.

"ఊహుఁ."

యేం మాట్లాడేందుకు తోచక ప్రసాదరావు వూరుకున్నాడు. నేరం విచారించటమంతా అతని భార్యే సాగించింది.

"చెప్పు వెధవా! పొద్దున్న నిద్రమంచం మీంచి లేవటం, ఆ బజార్లో వెధవల్తో ఆటలూను. వడగాలిలో చింతచెట్లు ఎక్కటం, బొంగరాలు తిప్పటం..... భోజనానిక్కూడా దొరగార్ని పిలుచుకొని రావాలి. చీకటి పడ్డాక కూడా ఇంటికి రావుకదా... చెప్పు..... తీశావా, లేదా?"

సీను తలొంచుకొని తల్లి చేసిన ఫిర్యాదులకు జవాబు చెప్పలేక "నేను తియ్య లేదు" అన్నాడు, ఆ చివరి ప్రశ్నకు మాత్రం.

"తియ్యలా? తియ్యలా?" అని ఆమె ఒక దెబ్బ వేసింది.

"లేదు--" అన్నాడు వాడు నిబ్బరంగా

మరో రెండు దెబ్బలు పడినవి; వాడి కవి ఆనినట్లు లేవు. "ఏడవడేం వెధవ?" అనుకున్నాడు ప్రసాదరావు

"తీశాడో లేదో చెప్పించండి. చదువు అంటకపోయినా యీ దొంగబుద్ధులు మాత్రం తేలిగ్గా వొస్తయ్" అందామె, తన అసమర్ధతను హేళనచేసే ధోరణిలో.

ప్రసాదరావుకు క్షణంలో శివ మెక్కింది. సామాన్యంగా కోపం రాదు కాని, వొస్తే మాత్రం మనిషి కాదు అతను.

అందులోనూ సీను సినిమాకు వెళ్ళేందుకు తనను రూపాయి అడిగాడు. కల్లిబొల్లి మాటలు చెప్పి, సినిమా వాయిదా వేచాడు తను. అందుకని వాడే తీసి వుంటాడనే నమ్మకం కలిగింది. ఆ మాట వీడిచేత ఒప్పించకుంటే, తనెందుకు?

సీనుగాడ్ని వొంచాడు; వీపుమీద బలంగా చరిచాడు. "తీశావా?" అన్నాడు 'లేదు' అన్నాడు వాడు. మరో దెబ్బ; అదే జవాబు. ఇలా ఎన్ని దెబ్బలు కొట్టాడో లెక్కలేదు: వాడుమాత్రం ఏడుస్తూ గిల గిలా కొట్టుకుంటున్నాడు. వాడు తీశానని వొప్పుకుంటే చాలు – తనకు మనశ్శాంతి దొరుకుతుంది. వెధవ రూపాయిని గూర్చి కాదు తాను బాధపడేది; దొంగబుద్ధి కొడుక్కు అలవడుతోందేమో నని.

నేరస్థుని తాలూకు పుట్టు పూర్వోత్తరాలన్నీ కోర్టులో కడిగివేసినట్లే. సీను చేసిన అనేక ఇతర అల్లరుల్ని ఆ భూతకాలంలోంచి తవ్వి, దుమ్ము దులిపి వాగుతూ బాదాడు వాణ్ణీ. ఎన్ని దెబ్బలు తిన్నావాడు మాత్రం రూపాయి నోటు తియ్యలేదనే అంటున్నాడు. చివరకు ఏడుపుతో వెక్కిళ్ళు కూడా ఆరంభమైనవి. ఊపిరాడనట్లు, గాలికోసం పాకులాడుతూన్నట్లుగా వుంది వాడిపని. ఒళ్ళూపై తెలియకుండా వాణ్ణి శిక్షించినందుకు ప్రసాదరావు బాధపడ్డాడు.

తన అరిచేతులు ఎంత కందినవో చూసుకుంటే వాడి వీపుమీద ఎన్ని ముద్దర్లు, ఎంత లోతుగా దిగి, వుబ్బివుంటవో చెప్పవొచ్చు..... నిజానికివాడు తియ్యనే లేదేమోననే అంతరాత్మ ఘోషకు తట్టుకోలేకపొయ్యాడు. అనవసరంగా ఇన్ని దెబ్బలు కొట్టాల్సివొచ్చిందేననే వ్యథతో మెలికలు తిరిగాడు. ఒక పక్క నిజాన్ని కక్కించాలనే పట్టుదల సడలిపోయింది.

ఈ సమయంలో భార్య అడ్డుపడకుంటే ఏమయ్యేదో తలుచుకుంటే ప్రసాదరావు వొణికి పొయ్యాడు. ఆమె నీళ్ళు తెచ్చి మొహానకొట్టి, మంచి నీళ్ళు తాగిస్తేనేకాని, వాడికి వూపిరాడలేదు.

"ఇల్లా పశువల్లే కొట్టుకుంటారా?" అందామె. ఆమె ముఖమంతా పాలిపోయివుంది; ఆ దెబ్బలు తనే తిన్నంతగా బాధపడుతోందామె.

ప్రసాదరావుకు మండిపోయింది.

"అసలు నువ్వే కొట్టించావ్ నా చేత. వెధవ రూపాయి పోతే పోయిందని నేను వూరుకున్నాను. నువ్వే నా అసమర్థతను ఎగతాళిచేసి......"

ఉయ్యాల్లో పిల్లాడు కెవ్వుమని ఏడుస్తూ లేచాడు. కఠినమైన తన కంఠస్వరం వాడ్ని నిద్రలో కూడా భయపెట్టింది. ఒక పక్క పెద్దవాణ్ణి ఓదారుస్తూ, మరో పక్క చంటిబిడ్డను లాలిస్తోందామె.

ఈ దృశ్యాన్ని చూసేప్పటికి ప్రసాదరావు మనస్సు వికలమైంది. తన రాక్షసత్వం తన కళ్ళ యెదుటనే రుజూచేసినట్లయింది. ఆ ప్రదేశంలో ఒక్క క్షణం కూడా నిలవలేక పోయ్యాడు. భోజనం సంగతి కూడా ఆలోచించకుండా చప్పుచప్పున దుస్తులు ధరించి సైకిలెక్కి పారిపొయ్యాడు – పిరికి ప్రసాదరావు:

ఇంకా అరగంట వ్యవధి ఉండటం వల్ల ప్రసాదరావు హోటల్‌లోకి దూరాడు. భోంచేద్దామా అని కాస్త ఆలోచించాడు; కాని భోజనానికి సరిపొయ్యే డబ్బు జేబులోలేదు. అదీగాక, భోజనం సయించేట్లుగా కూడా తోచలేదు. ఏదో కాస్త టిఫిన్ తిని కాఫీ తాగుదామనుకున్నాడు.

ఎంత ప్రయత్నించినా, బలవంతాన కూడా తను చేసిన పాడుపనిని మనస్సులో నుంచి తోసెయ్యలేక పోతున్నాడు. టిఫిన్ వొచ్చింది. కాని, వెగటుగా వుంది. ఒక రకమైన వికారం ఆరంభమైంది. కళ్లముందు దెబ్బలుతిని వూపిరి అందక నేలమీద పొర్లాడే సీను కనిపించాడు. తనను తాను దూషించుకున్నాడు; శాపనార్థాలు పెట్టుకున్నాడు. ఐనా మనశ్శాంతి కలగలేదు.

టిఫిన్ సయించక వొదిలేశాడు; కాఫీ కూడా సగమే తాగి బైటపడ్డాడు. అసలు

ఇవ్వాళ బ్యాంకుకు వెళ్ళే పరిస్థితిగా తోచలేదు. క్యాజువల్ లీవ్ పారేస్తే బాగుండును; కాని సెలవు తీసుకొని ఏం చెయ్యాలి? సాయంత్రందాకా ఎక్కడ గడపాలి? ఇంటికి వెళ్ళి ఆ అశాంతిని యెదుర్కోలేడు. అదీగాక, ఇవ్వాళ జీతాలిచ్చే రోజు గనుక, మానుతే పైకానికి యిబ్బంది పడాలి.

ఇది చాలా దుర్దినంగానే తోచింది ప్రసాదరావుకు. ఇవ్వాళ యెంత జాగర్తగా వున్నా సరే తప్పకుండా ఇచ్చి పుచ్చుకోవటాల్లో పొరపాటు జరిగే తీరుతుందనే నమ్మకం ఏర్పడిపోయింది. ఎంతో చిరాకు, ఏది చూసినా ఏవగింపు, తలపులు ఇంటివైపు మళ్లితే వాంతి వస్తూన్నట్లుండి, రాక గొంతులో అడ్డం పడ్డ బాధ, వీటిని భరిస్తూ డ్యూటీ చేయటం, ఇవన్నీ అతన్ని మెలిపెట్ట సాగినవి. కడుపులో చెయ్యిపెట్టి దేవుతూన్నట్లే వుంది.

అలాగే భరిస్తూ కౌంటర్ దగ్గిర పనిచేస్తున్నాడు. ఒక పక్క యాంత్రికంగా కళ్ళూ, చేతులూ పని చేస్తూనే వున్నవి; మరొకవైపు రోజూకన్న ఎక్కువ జాగ్రత్తగా వుండాలని తనను తాను హెచ్చరించుకుంటూనే వున్నాడు. ప్రతి చిన్న విషయంలోనూ అనుమాన భూతం భయంకర రూపాల్ని ప్రదర్శిస్తూనే వుంది.

కుర్రాడి దీనవదనం, జాలిగా బాధగా వాడు ఏడవటం, తాను అనవసరంగా ఉద్రిక్తపడి, వెధవ పట్టుదలకు పోయి, అతి స్వల్ప విషయాన్ని గోరంతలు కొండంతలుగా చేసుకొని వాణ్ణి చావబాదటం, చేయని నేరానికి శిక్ష విధించటంతో తాను పొందవలసిన అంతులేని పశ్చాత్తాపం, తాను బలవంతుడు కనుక, తన అన్యాయాన్నీ అక్రమాన్నీ సీను భరించడం – మొదలైన విషయాలు చుట్టూ వున్న కరెన్సీ నోట్లమీదా, చెక్కులమీదా, డ్రాఫ్టులమీద ప్రస్ఫుటంగా కనిపిస్తూన్నవి. యీ ప్రపంచంలో వున్నప్పటికీ, ప్రసాదరావు వేరొక ప్రపంచంలో నడుస్తున్నాడు. సీనును కొట్టిన ప్రతిదెబ్బా అంతకు రెట్టింపు బలంతో తనవీపుమీద పడుతూనే ఉన్నది. అలా ఎన్నిసార్లు పడినా వాటికొక అంతువున్నట్లు లేదు. అదృశ్యశక్తి తాలూకు ఆ పీడనకు దాదాపు వూపిరి అందనట్లవుతోంది.

మాటిమాటికి చేతులు చూచుకుంటున్నాడు; ఆ కందిపోయిన చేతుల తాలూకు బాధ గడిచిన దృశ్యాన్ని మరువలేకుండా చేస్తోంది. అసలే ఎండ తీవ్రంగా వుంది; దానికి తోడు చెట్ల ఆకులు కూడా కదలటం లేదు. ఉండి వుండి ఆ చెవిలో గాడ్పు యీ చెవిలోంచి పోతోంది. ఎన్నిసార్లు మంచినీళ్ళు తాగినా, ఆ దాహం ఆరేట్లుగా తోచటం లేదు. నరకంలో పాపిని నిప్పుల్లో కాల్చుమంటే ఇదేనేమో? బాహ్యంగానూ ఆంతరంగికంగానూ కూడా వాతావరణం ఒకే మాదిరిగా వుంది.

ఈ జరిగిపోయిందే కాకుండా, జరగబొయ్యేది కూడా ఆలోచించుకుంటే ప్రసాదరావుకు

మతిపోతూన్నట్లయింది... ఈ పాటికి వాడికి తీవ్రంగా జ్వరం వొచ్చి వుంటుంది. రాత్రికి పిచ్చిమాటలు ఆరంభమౌతవి. తను వాణ్ణి కొడుతూన్నట్లు, వాడు "తీయలేదు" అంటూన్నట్లో వూహించుకునేందుకే ప్రసాదరావుకు భయం వేసింది. చివరకు వాడు ఆ మంచంమీదినుంచి మరి లేవడు. చేతులారా బిడ్డను చంపుకున్నవాడవుతాడు తాను!... ఇలాటి కథ ఎక్కడో చదివాడు. ఐనా పసిహృదయం పొందే ఆవేదన ఎలా వుంటుందో తను తేలిగ్గా వూహించగలడు... నిజంగా అలాగేఐతే.... జీవితంలో తాను హంతకుడు కూడా అవుతాడు కదా!.

అనవసరంగా చిర్రుబుర్రులాడాడు; ప్యూన్సను చాలాసార్లు కోప్పడ్డాడు. తనొక వింతమృగమైనట్లుగా చుట్టుపక్కల వాళ్ళు చూశారు; ఎకౌంటెంట్లు కళ్ళతోనే హెచ్చరించారు. తన కేకలకు ఒకటి రెండుసార్లు ఏజెంట్ హాలులోకి వొచ్చి వెళ్ళాడు.

తనకు పిచ్చెక్కుతోం దనిపించిందతనికి. ఈ పిచ్చి నుంచి తప్పించుకోవటం ఎలాగో తెలియడంలేదు. పూర్తిగా లొంగిపోక ముందే, వున్న కాస్త శక్తితోనూ తనను తాను కాపాడుకోవాలి. కుర్రాడి సంగతి ఆలోచించేందుకైనా సరే తనకు మతిభ్రమణం కలగకుండా చూసుకోవాలి. ఉన్నకొద్ది శక్తుల్నీ కూడదీసుకొని నానా అవస్థ పడసాగాడు.

అదృష్టవశాత్తూ యీనాడు శనివారం కనుక, ఒంటి గంటకే కౌంటర్ మూసి వేయగలిగాడు. స్క్రోల్ ఎన్నిసార్లు కూడితే అన్ని రకాలూగానూ వొచ్చింది. ఎక్కౌంటెంట్ సహాయాన్ని కోరాడు.

"ఏం అలా వున్నావ్?" అన్నాడా ఎక్కౌంటెంట్.

నిజం చెపితే అందరూ నవ్వుతారు; తను పొందే మనోవేదనను, అనుభవించి తెలుసుకోవా ల్సిందే కాని, చెప్పి తెలియ చెప్పగలిగే సామర్థమే వుంటే ఉత్తమ కథకుడు అయేవాడు తాను; ఒకవేళ ఎవరికైనా ఇదంతా అర్థమైనా అంతా తన తప్పేననీ తన వేలితో కన్ను పొడుచుకున్నాడని అంటారు. యీ వున్నఆవేదనకు ప్రజాభిప్రాయం కూడా జోడిస్తే ఎప్పుడో కలిగే మతిభ్రమణం ఇప్పుడే కలుగుతుంది.

"ఏం లేదు.... తలనెప్పిగా వుంది....వికారం!" అన్నాడు.

స్క్రోల్ కూడికలు అయినవి. కాగితంమీద అంకె ప్రకారం క్యాష్ సరిపోవాలి. ఇందులో ఎంత తొర్రపడుతుందోనని ప్రసాదరావు వొణికిపొయ్యాడు. తప్పకుండా పొరపాటు జరిగి వుంటుందని అతని నమ్మకమే భయపెట్టింది.

డబ్బు కూడా ఎక్కౌంటెంట్‌నే లెక్కపెట్టమన్నాడు. ఏమౌతుందోనని ఆతృతతో వేచి వున్నాడు... పదినిమిషాలయ్యాక "కరెక్ట్!" అన్నాడు ఎక్కౌంటెంట్. ఆ మాటల్ని ప్రసాదరావు నమ్మలేక పొయ్యాడు; "ఏమిటీ?" అన్నాడు.

"సరిగ్గా వుంది–" నవ్వుకుంటూ వెళ్ళిపోయ్యాడు ఎక్కౌంటెంటు. దురదృష్టదేవతకు భయపడి, అదృష్టదేవత దాని వెనకాలే, చెట్లచాటుగా తనతో పాటే నడుస్తోందనిపించిం దతనికి. సీనుగాడు నిజంగా డబ్బుతీసి వుండడనేది ఖచ్చితంగా తేలినట్లనిపించింది. వాడు నిజంగా తీసివుంటే ఇక్కడ పొరపాట్లు పడాల్సింది; దానికీ, దీనికి సంబంధం లేదని కొంచెం తెలివిగా ఆలోచిస్తే తెలుస్తుంది. కాని ప్రసాదరావు లోని తెలివి సెంటిమెంటుగా మారింది. దానికి అర్థం లేదు; ఒక గుడ్డినమ్మకం– అంతే?

తను చేసిన నేరానికి, ఆ సర్వాంతర్యామే శిక్ష విధించాలి. పాతికో పరకో ఇక్కడ తొట్రపడి వుంటే, ఆ శిక్ష అనుభవించిన ఆనందం కలిగేది. అది జరగలేదు. కనుక హృదయభారం ఏమీ తగ్గలేదు.

కుర్రాడు రూపాయి తీసివుంటాడనే నమ్మకమే వుంటే, దాని కంత బాధ పడేవాడు కాడు. జరిగిన నేరానికి తనవాడనే పక్షపాతం లేకుండా శిక్ష విధించి, విధి నిర్వర్తించిన తృప్తన్నా మిగిలేది... కాని అంతరాత్మ ఘోషిస్తోంది – నిరపరాధిని శిక్షించావని; ఎలా సరిపెట్టుకోవాలని చూసినా కుదరటం లేదు.

అందరూ, జీతాలు తీసుకున్నాక, క్యాష్ పెట్టెను ఇనప్పెట్టెలో పెట్టి ప్రసాదరావు బైటపడే లెక్కలో వున్నాడు.

"ఒంట్లో బాగుండకపోతే, సెలవు పెడితే బాగుంటుంది మిష్టర్ ప్రసాదరావు! అంతేకాని ఏదో "మూడ్"లో ప్రవర్తిస్తే కస్టమర్స్ హర్ట్ అవుతారు!" అన్నాడు ఏజెంట్.

ఒక్కక్షణం నివ్వెరపోయి, తల వొంచుకుని తన తప్పుని వొప్పుకున్నట్లు పోజ్ వేశాడు. తన హృదయంలో బద్ధలైన అగ్నిపర్వతం సంగతి యెవ్వరికీ తెలియదు; లోన జరిగే మహా భారత యుద్ధభూమిలో, పద్మవ్యూహంలో ఇరుకు పడిన అభిమన్యుని స్థితి సంగతి గమనించిన వాళ్ళు లేరు. కస్టమర్స్ హర్ట్ కావటం మాట నిజమే ఐనా, తన హృదయంలో పడిన గాయంతో పోలుస్తే వాళ్ళ కయే గాయం ఒక లెక్కలోదే కాదని తేలుతుంది! ఏదో తన ప్రవర్తనను మాత్రమే వీళ్ళు తూచగలరు; కనుకనే వ్యక్తిగతమైన అనేక అనుభూతులు ఎవరికి వారుగా చాలావరకు అనుభవించ గలుగుతున్నారు.

"సరే– వెళ్ళండి!"

వినయపూర్వకంగా ప్రసాదరావు బైటపడ్డాడు; గోడ గడియారం నాలుగుసార్లు మోగటం వినిపించింది.

జేబునిండా డబ్బున్న యీ రోజు నిజానికి చాలా ఆనందంగా ఉండవలసింది; కాని ప్రసాదరావుకు చాలా బాధగానే వుంది. కుర్రాడు యెలా వున్నాడో తెలుసుకోవాలనే ఆత్రుత చాలా అధికంగా వున్నప్పటికీ, వెంటనే ఇంటికి వెళ్ళే ధైర్యం కలగలే దతనికి.

కాస్సేపు సముద్రపు టొడ్డుకు వెళ్ళాడు కాని, ఆ చల్లదనమే శరీరానికి తగిలినట్లు తోచలేదు. ఎక్కడెక్కడ తిరిగాడో, ఏమేం చూశాడో తెలియలేదు. రెండు మూడు సార్లు తన వెనుక చాలా బరువుగా కార్లు ఆగటం, డ్రైవర్లు గొణుక్కుంటూ తిట్టుకుంటూ సాగిపోవటం తెలుసు. తన అన్యమనస్కత, స్వాధీనంలోకి రావటం లేదు, ఎంత ప్రయత్నించినా.

ప్రకృతి ఏర్పరచిన చీకటిని తరిమేందుకు మానవుడు కనిపెట్టిన విద్యుద్దీపాలు వెలిగినవి. తన యీ మానసిక బాధ ఆలోచనల వల్ల తీరదు; సంఘటనను ఎదుర్కోక తప్పేదీ లేదు.

ఇంటికి వెళ్ళి, లాలించి, బతిమాలి, భంగపడి కుర్రాణ్ణి అడుగుతే, నిజంగానే వాడా రూపాయి నోటు తీశానని వొప్పుకుంటే – భగవాన్; – అంతకన్న తనకు కావాల్సిందేమిటి? జీవితంలో అత్యున్నతమైన ఒకానొక ఆదర్శాన్ని పిల్లవాడికి బోధించేందుకు మాత్రమే తను ప్రయత్నించినట్ల వుతుంది. ఎందుకనో కాని ఇలా జరుగుతుందని నమ్మ గలిగాడతను.

ఒక చాక్లెట్ల డబ్బా, ఒక బిస్కత్తుల పొట్లాం కొనుక్కుని చరచరా సైకిల్ తొక్కనారంభించాడు. ఏదో మహత్తర కార్యాన్ని సాధించేందుకు వెళ్తున్నట్లు, ఆలస్యమయితే ప్రతిక్షణమూ విలువైనదే ఐనట్లు శక్తి నంతట్నీ కూడ దీసుకొని ఒళ్ళూ పై తెలియకుండా సైకిల్ తొక్కాడు. తీరా ఇంటిముందు ఆగాక, తలుపు తట్టేందుకు కానీ, పిలిచేందుకు కానీ వూపిరి పీల్చుకోవాల్సి వొచ్చింది.

మహాపాపి, పవిత్ర దేవాలయంలోకి ప్రవేశించే ముందు, పొందే భయోత్పాతం లాంటి ఆవేదనతో పిల్లల్లే ఇంట్లోకి ప్రవేశించాడు. భార్య కుర్చీలో కూర్చొని తన రాకకు స్వాగతం ఇవ్వకుండానే తనను ఒక్కసారి యీసడింపుతో చూసి, లేసు అల్లుకుంటోంది. ప్రసాదరావు కళ్ళు సీనుకోసం, వాడి రోగిష్టి మంచం కోసం శరవేగంతో ఇంటి నంతటినీ పరిశీలించినవి; భార్యను గమనించి ఆలోచించే తీరిక లేదిప్పుడు.

ఆ దృశ్యాన్ని చూసేప్పటికి ప్రసాదరావుకు ప్రాణం లేచి వొచ్చింది. సీను ప్రశాంతంగా ఒక మూల చాప మీద కూర్చొని చదువుకుంటున్నాడు. వాడెప్పుడూ ఇంత నిశ్శబ్దాన్ని ఆరాధించ లేదు. ఒక్కసారి తండ్రి మొహంలోకి ఏవగింపుతో చూసీ, వెంటనే దృష్టి పుస్తకం మీదికి మరల్చు కున్నాడు. తను వూహించిన అసందర్భాలు లేకుండటంతో ప్రసాదరావు మనస్సు కుదుట పడింది.

కాని అతని అంతరాత్మ పొందిన క్షోభ ఉండనే వుంది; దాన్ని శాంత పరచాలి. నిజం తెలుసుకోవాలి – సీను కాళ్ళా వేళ్ళా పడైనా సరే; వాడి దగ్గిరికి వెళ్ళి మోకరించాడు

ప్రసాదరావు. "నాయనా! నిజం చెప్పు.... నాజేబులో రూపాయి నోటు తీసావా లేదా?" అన్నాడు  దీనాతిదీనంగా. తన మీద కోపంతో అలిగి అసలు తనతో మాట్లాడడేమోనని తన కంఠస్వరంలోని దైన్యాన్ని గమనించి, భార్య లేసుపని ఆపి వెంటనే రంగంలోకి వచ్చి, తన పక్షమైంది.

ప్రసాదరావు చాక్‌లెట్ల డబ్బా బిస్కత్తుల పొట్లాం కుర్రాడి ముందు పెట్టాడు. "ఇవన్నీ నీకే... నిజం చెప్పు బాబూ?" అన్నాడు

"చెప్పరా... పోనీ తీస్తే తీసానని చెప్పు బాబూ!" అంది గృహిణి.

"లేదు....."

ప్రసాదరావు భార్య ముఖంలోకి చూశాడు; ఆమె కూడా వాడిచేత నిజం చెప్పించాలనే ఆతృతను సూచిస్తోంది. భర్త ప్రవర్తనను ఆమె వెంటనే క్షమించగలిగింది. మరి సత్యమనేది అంత గొప్పది; అది వ్యక్తిత్వాలకూ, ఆవేశాలకూ, అనురాగాల క్కూడా అతీతం. ఆ సత్యాన్ని వంచించటమనే ఆదర్శానికి శతాబ్దాల తరబడిగా జరిగిన ప్రచారం, హరిశ్చంద్రుని లాంటి ఆదర్శమూర్తుల కథల తాలూకు నైతిక విలువలూ. మొదలైనవి తరతరాలుగా రక్తంలో కలిసిపోయినవి. వాటికొక రూపాన్ని ఇవ్వటంతో, సత్యంపట్ల తమ గౌరవాన్నిచూపటంలో సంస్కారం గల వాళ్ళెవరు వెనుకడగుగు వేస్తారు?

"అన్ని దెబ్బలు తిన్నావుకదా! ఇప్పుడైనా చెప్పరా తండ్రీ!" అందామె లాలిస్తూ, ఎంతో మృదువుగా.

"నేను  తియ్యలేదమ్మా!"

ఈ వెధవపాటే పాడుతూన్నందుకు ప్రసాదరావుకు మళ్ళీ కోపం వొచ్చింది; కాని తన్నినందు వల్ల లాభమేమిటో యీ ఉదయమే అనుభవపూర్వకముగా తెలుసుకున్నాడాయె! అదీకాక నిజంగా వాడు తీసివుంటే, ఆ నేరానికి అనుభవించే శిక్ష యేదో ముందుగానే అనుభవించేశాడు. కనుక, చెడిన వ్రతానికి ఫలాన్ని ఆపేక్షించలేదు. కనుక వేరుమార్గంలో వాణ్ణి బైటికి లాగాలి.

"చూడు బాబూ!... నిజంచెప్పు..... నువ్వు తీసినందుకు ఏమీ అనము... నిజం చెపితే యీ ఐదు రూపాయిలూ బహుమతిస్తాను" అన్నాడు ప్రసాదరావు, జేబులో నుంచి కొత్త ఐదు రూపాయల కాగితాన్ని తీసి ఫెళ పెళలాడిస్తూ.

కుర్రాడి కళ్ళు ఆశతో మెరిసినవి; కాని మరుక్షణంలోనే ఆ ఉద్వేగానికి తట్టుకొని "నిజంగా నేను తియ్యలేదు నాన్నా!" అన్నాడు.

ప్రసాదరావు కంఠస్వరాన్ని పెంచి "నిజం చెప్పు..... పదిరూపాయిలిస్తాను....." అని

మరో ఐదురూపాయల కాగితాన్ని మొదటిదానికి జోడించాడు.

"పది రూపాయిల్తో ఎన్నో సినిమాలు చూడొచ్చు" అంది తల్లి. ఆ కాగితాల విలువను వాడి పరిభాషలోకి మారుస్తూ.

సీను కళ్ళల్లోని మెరుపు యీసారి ఆగింది. సిగ్గుతో వేరొక దిక్కు చూస్తూ "నేనే తీశాను" అన్నాడు.

ప్రసాదరావు ప్రాణం ఒడ్డున పడ్డది.

"తీసుకో......" అని రెండు ఐదు రూపాయిల కాగితాల్నీ వాడికి ఇచ్చాడు.

"ఏం చేశావురా అమరి?" అంది తల్లి.

వాడు జవాబు చెప్పలేదు.

"ఏం చేస్తేనేం? వెధవ రూపాయి కోసం.....నేను......ఆనిజం కక్కించేందుకు అన్ని దెబ్బలు కొట్టాను! ఇవాళలల్లా నేను నరక బాధపడుతూనే వున్నాను. యీ నిజం చెప్పాక, నా మనస్సు తేలిక పడింది..... వాడిని మరేమీ అడగవోక" అన్నాడు ప్రసాదరావు; తన గెలుపును కూడా ప్రకటించుకో గలిగిన ఆత్మబలాన్ని పోగొట్టుకున్నాడు మరి!

ఆ క్షణంలోనే విషాద మేఘాన్ని పటాపంచలు చేస్తూ ఆనందదేవి నృత్యగీతాల్ని ఆలాపించిందా ఇంట్లో.

❄ ❄ ❄ ❄

మర్నాడు ఉదయం చాకలాడికి బట్టలు వేసే పనిలో వున్నాడు ప్రసాదరావు. నిన్నటి చొక్కాచేతి మడతల్ని విప్పుతూండగా, కొత్త రూపాయి నోటు కింద పడింది.

ప్రసాదరావు నిర్ఘాంతపొయ్యాడు. నిన్న పోయిందని ఇంత రాద్ధాంతమూ చేసిన నోటే ఇది; ఎవర్నో చూసి తనూ చొక్కా చేతి మడతలో పెట్టిన సంగతి గుర్తొచ్చింది. చాకలాణ్నీ పంపి, ప్రసాదరావు ఆలోచనలో పడ్డాడు.

ఐతే సీను మొదట చెప్పిందే నిజమన్నమాట! ఎన్ని దెబ్బలు తిన్నా ఆ సత్యం కోసమే, ఆ అత్యున్నతాదర్శం కోసమే వాడు అంత బాధపడ్డాడు! కాని తానా మాటనమ్మలేక వాడికి బహుమతి ఎరగా వేసి, లంచం పెట్టి బలవంతంగా అబద్ధం ఆడించాడు! పొందిన శిక్షను క్యాష్ చేసుకునే అవకాశాన్ని వాడికి కలిగించాడన్నమాట! ఇప్పుడు ఆనోటు దొరికిన సంగతి చెపితే భార్యక్కూడా విరోధమౌతాడు. పోనీ కొడుకునన్నా సరైన మార్గంలో పెట్టుకో గలిగాడా అంటే అదీ లేదు. తనే వాణ్ణి వక్రమార్గానికి తోశాడు.

నిజం చెప్పటమనేది స్వభావ సిద్ధంగానే వొస్తుందా అనే అనుమానం కలిగింది. బలవంత పరిచి, బాధించినందువల్ల నిజమే బైటపడుతుందని ఎలా చెప్పటం? హరిశ్చంద్రుణ్ణి

ఎవరు కోరుతే నిజానికే నిలబడ్డాడు? అబద్ధమాడమని ఎన్నో ఆశలు చూపి, ఎంతో హెచ్చరించినప్పటికీ లొంగలేదు, ఐతే కాలం మారింది. యీనాటి మనుషులు హరిశ్చంద్రుణ్ణి మూర్ఖుడుగా పరిగణిం చవచ్చు. ఒక్క నిజం కోసం జీవితమంతా పోరాడి సాధించిందేమిటి? చివరకు ఆ దేవుడే ప్రత్యక్షమై మెచ్చుకుంటే ఏం జరిగేది? ఆ దేవుడిమీది నమ్మకమే దిగజారిన యీరోజుల్లో నిజం కోసమై సర్వనాశనం అవగలిగే వాళ్ళెవరు?..... తను బలవంతం చెయ్యటం వల్లనే వాడి సహజగుణమైన సత్యవచనం భంగపడింది... బహుశా శాశ్వతంగానే నేమో?

ఇక వాడిచేత నిజం చెప్పించడం తన వల్ల కాదు. ప్రపంచంలో నీచకార్యాల క్కూడా విలువలంటూ ఏడవబట్టే వాటిని ఆచరించేవాళ్ళున్నారు; సత్కార్యాలకన్న వాటికే ఎక్కువ ధర పలుకుతుంది. ఒక్క చిన్న అబద్ధానికి తను పది రూపాయలు విలువ చెల్లించలా? పోలీసులు చితకతన్నినా, ప్రతిఫలం వేరొక రూపంలో ముట్టుతుంది కనుకనే దొంగ నిజం చెప్పడు. అదే విధంగా జైలు శిక్ష కూడాను. ఇక దొంగతనం చేయని వాటికి శిక్ష వేయటంవల్ల, వాడు నిజంగా దొంగగా మారినా ఆశ్చర్యపడాల్సింది లేదు.

ప్రసాదరావును ఇప్పుడు వేధించేది పదిరూపాయల సంగతే కాదు. సీనును మళ్ళీ సక్రమ మార్గంలోకి లాగటం. వాడిచేత నిజం చెప్పించటం ఎలా? ఐనా ఒకసారి పరీక్షిద్దామను కున్నాడు.

ఆ సాయంత్రం చాలా సీరియస్‌గా సీనును పిలిచి, భార్య సమక్షంలోనే రంగం నడిపాడు.

"వెధవా; నిజం చెప్పు..... నా జేబులోంది ఐదురూపాయిల కాగితం తీశావా? లేదా?"

సీను వెర్రి మొహం వేశాడు.

"మళ్ళీనా? నీకీ దొంగ బుద్ధేమిటిరా? చూస్తారేమండీ – నాలుగు వుతక్క?" అంది భార్య.

"ఏరా – తీశావా? లేదా?

"లేదు... నాన్నా!"

"చితక తంతాను–"

"నిజంగా తియ్యలేదు నాన్నా!"

"చూడు... నిజం చెప్పాలి..." మృదువుగా అన్నాడు ప్రసాదరావు, తీస్తే తీశానని చెప్పు... పది రూపాయిల బహుమానం...."

"దొంగతనానికి బహుమతులు కూడాను!" అని మూతిముడిచిందా ఇల్లాలు.

"నువ్వుండు... తీశావా చెప్పు... పది రూపాయిలిస్తాను–"

సీను ఒక్క క్షణం ఆలోచించాడు.

నవ్వుతూ "తీశాను నాన్నా!" అని పదిరూపాయిల కాగితం కోసం చేయి జాపాడు.

వాడు చెప్పిన అబద్ధం తండ్రికి తెలియదని వాడి వూహ... ప్రసాదరావు అచేతను డయ్యాడు. కొడుకు చేత నిజం పలికించటానికి ఇక బ్రహ్మరుద్రులు రావాల్సిందే కాని తనలాటి మానవమాత్రుడి వల్లకాదు. తెల్లమొహం వేసి, దాదాపు మూర్ఛ పర్యంతమైన తండ్రి చేతులోనుంచి సీను పదిరూపాయిల కాగితాన్ని ఊడ పెరుక్కుని పరుగెత్తాడు.

"అయ్యో! ఇదేం కాలం! అధర్మ దేవతకు క్కూడా పట్టం కట్టటమా?" అందామె.

తనే పట్టం కట్టాడేమో ఆ దేవతకు? నిన్నటి నుంచే అధర్మదేవత యీ కొంపలో సింహాసన మెక్కి రాజ్యపాలన చేస్తోంది. ఆమె మీద తిరుగుబాటుచేసి ఆమెను విసిరి అవతలికి పారెయ్యాలి.... కాని ఆమె సాక్షాత్తూ తన ముద్దుల కుమారుని అవతారంలోనే వుంది. కనుక భరించక తప్పదు! ఆమె పలుకుబడిని అంగీకరించకా తప్పదు!

# వి.యస్. అవధాని



కథారచయిత. నవలాకర్త. మామూలు అబ్బాయీ- అమ్మాయీ కథలు కాకుండా తెలుగునాట సాంఘిక జీవితాన్ని కళ్లకు కట్టినట్టు చూపెట్టే కథలు ఎన్నో వ్రాశారు. బాహ్యజగత్తులో సంఘటనలే వీరి కథలకు ఇతివృత్తాలు. ఆ ఇతివృత్తాల్ని చక్కని శిల్పంతో, అనుభవం ఇచ్చిన వూతంతో, జీవిత సత్యాన్ని చెప్పక చెబుతూ, సంప్రదాయ సిద్ధమైన రీతిలో కథలుగా మలిచారు. యు.ఎఫ్ ఇనఫర్‌మేషన్ సెంటర్, మద్రాసులో ఉద్యోగం చేసేవారు.

**రచనలు :** చారులత, ఇంటిదొంగ (నవలలు) ప్రత్యుపకారం (కథలు)

# జ్యేష్ఠుడు

**శే**షుకు తన బ్రతకంతా వర్తి తిట్లూ దెబ్బల గుణింతంలా కనబడింది. ఎంత ఆలోచించినా అమ్మా, నాన్నా, బళ్ళో పంతుళ్ళూ – వీళ్ళంతా యింత నిర్దయగా ఎందుకు తనపట్ల ప్రవర్తిస్తున్నారో అతడి చిన్నబుర్రకు అర్థం కాలేదు.

తను యింటికి జ్యేష్ఠుడు.అది నిజమే! మొదట పుట్టినవాళ్ళందరు తన మాదిరిగా ఇంట్లో అమ్మచేత, బళ్ళో పంతుళ్ళచేత దెబ్బలు తినవలసిందేనా? మంచి పిల్లలను ఎవరూ కొట్టరని అంటారు. కాని మంచిగా వుండడం ఎలా? అమ్మకు మంచి పనయింది నాన్నకు మంచిపని కాదు. వీళ్ళిద్దరికీ మంచిపనులు చేసిపెడుతూంటే పాఠాలు రావు. పాఠాలు రాని పిల్లలు పంతుళ్ళకు మంచివాళ్ళు కారు. కనుక పంతుళ్ళు, అటువంటి వాళ్ళను తంతారు. తన్నకపోతే పిల్లలకు భయం ఉండదంటారు. శేషుకు భయం వున్నది. పాఠాలు చదవాలని కూడా వున్నది. చదివితే– అసలు చదవడానికి తీరిక కనేదంటు వుంటే, తనక్లాసులో తనకంటే ఎవరికీ మంచి మార్కులు రావు.

ఎటొచ్చీ పరీక్షలు జరిగే రోజులలోనూ పరీక్షల ముందూ తనకు ఇంట్లో యెవరూ ఏ పనీ చెప్పరు. కనుక ఆ రోజులలో తనకు కొంచెం తీరిక. ఆ రోజులలో శేషు కొంచెం కష్టపడి పాఠాలు చదువుతాడు. ప్రతి సబ్జక్టులోనూ మంచి మార్కులే వస్తవి. ఇంతవరకూ యే తరగతిలోనూ తప్పిపోలేదు. కనుక తనకు చదువు రాదన్న భయం నాన్నకు లేదు. కనుక అమ్మ ఏపని చెప్పినా నాన్న వద్దనడు.పైగా "బజారు కెళ్ళి సిగరెట్లు తీసుకురా, ఇంట్లోకి చింతపండు తీసుకురా!" అంటాడు. అయితే నాన్నఎందుకు కొడతాడంటారా? పెన్సళ్ళుపోతే కొడతాడు. పుస్తకాలు కావా లంటే విసుక్కొంటాడు. ఈ చిక్కులు తమ్ముడికి లేవు. చెల్లాయికీ లేవు. వాళ్ళు చిన్నవాళ్ళు. వాళ్ళంటే అందరికీ యిష్టం. అదీకాక అసలు వాళ్ళచేత అమ్మా నాన్నా ఏ పనీ చేయించరు. కనుక ఆ పని వాళ్ళు బాగా చేస్తారో లేదో

శేషుకు తెలియదు. చేస్తే బాగానే చేస్తారని అమ్మకూ నాన్నకూ తెలుసేమో! అందుచేతనే వాళ్ళను కొట్టరు.

ఇవి మామూలుగా శేషు నెదుర్కొనే సమస్యలు. ఇవి గాక మరికొన్ని ప్రత్యేక సమస్యలున్నవి. ఆ సమస్యలు వచ్చినపుడు శేషు ఒక్కొక్కసారి అమ్మగా మారిపోవాలి; మరొకసారి నాన్నగా మారిపోవాలి. అంటే, వాళ్ళుచేసే పనులన్నీ చెయ్యాలి. ఆ పనులు బాగా చేస్తే మెచ్చుకునే వాళ్ళు లేరుగాని అజాగ్రత్తగా చేస్తే దండించేవాళ్ళు మాత్రం చాలా మంది ఉన్నారు. చివరికి చెల్లాయీ తమ్ముడూ కూడా ఎగతాళి చేస్తారు....

❋ ❋ ❋ ❋

ఇంకా తెల్లవారలేదు.

ఉయ్యాలలో పాప గీ పెడుతున్నది. "పెద్దవాడా.... పెద్దవాడా" అమ్మ పిలుస్తున్నది. శేషు ఇంకా మంచంమీద నుంచి లేవలేదు. అమ్మ మళ్ళీ అంటున్నది.

"పెద్దవాడా..... ఏమిట్రా ఆ మొద్దు నిద్ర.....లే....." శేషుకు కళ్లు తెరుపుడు పడడం లేదు. అలాగే కళ్లు నలుపుకొంటూ బద్ధకంగా మంచం మీద నుంచి లేచాడు. అంతలో అమ్మ మళ్ళీ "కాస్త ఆ దణ్ణెం మీద నల్లచీర ఇటు పడెయ్యి" అంటున్నది. శేషు తలెత్తి చూచాడు. అమ్మ వరండాలో నుంచున్నది. శేషుకు నిద్రమత్తు పూర్తిగా వదిలింది.

శేషు నల్లచీర అమ్మ దగ్గరకు విసరి వేసి మళ్ళీ మంచం దగ్గరకు వెళుతూండగా అమ్మ అన్నది కదా!

"మళ్ళీ పడుకుంటావేం రా? కాజీ వస్తున్నది. లేచి కాస్త అంట్లూ చెంబులూ బయట పడెయ్యి. ఇవాళ వీరాస్వామి వూళ్ళోలేడు. పాలు తియ్యాలి, లే..... తెల్లవారిపోతోంది."

శేషు నసుగుతూ ఉయ్యాలలోనించి పాపను తీసి నేలమీద పడుకోపెట్టాడు. అమ్మ దగ్గరకు తాను వెళ్లకూడదుగా! ఆ తరువాత నెమ్మదిగా వంటింట్లోకి ప్రవేశించాడు. అంట్లూ చెంబులూ దొడ్లో పంపుదగ్గర పడేశాడు.

అమ్మ రాత్రి తోమి అలమారులో పెట్టిన చెంబులో కొంచెం నీళ్ళు పోసుకుని బఱ్ఱె దగ్గరికి వెళ్ళాడు. దూడను వదిలాడు. పొదుగువంక జాగ్రత్తగా చూస్తున్నాడు. ఎంత జాగ్రత్తగా చూచినా దూడ కాసినిపాలు తాగిపోతుంది. అమ్మ తనని తిడుతుంది. ఎలాగో తంటాడు పడి పాలు తీశాడు. ఆ తరువాత పండ్లపొడి చేతిలో వేసుకొని పండ్లు తోమడానికి పంపు దగ్గరకు వెళ్ళాడు. పండ్లు తోమడం ప్రారంభించాడు. పండ్లు తోముకుంటూ ఆలోచిస్తున్నాడు. ఎన్ని ఆలోచనలని? ఇంట్లో పిల్లలకు నీళ్ళు పోసి అన్నాలు పెట్టడం, వంట చెయ్యడం, ఇవన్నీ వాళ్ళ సుబ్బారావు చేస్తున్నాడా? పోనీ, లలిత ఆడపిల్ల కదా! లలిత చేస్తున్నదా?

వాళ్ళందరూ బడి వదిలిన తరువాత ఎంత హాయిగా ఆడుకొంటారూ? తానో....

బడి వదలగానే ఇంటికి రావాలి, కాజాబీబీ రాకపోతే ఇంట్లోకి నీళ్ళు తీసుకురావాలి. అమ్మ బయటవుంటే కాలవ నుంచి మంచినీళ్ళు కూడా తీసుకురావాలి? ఇవన్నీ తనెందుకు చెయ్యాలి? తమ్ముడు చెయ్యరాదా? చెల్లాయి చెయ్యరాదా?.....

❉ ❉ ❉ ❉

అంతలో అమ్మ వేసిన కేకలకు అదిరిపడి పండ్లు తోమడం పూర్తి చేశాడు. పాపకు పాలు పట్టాడు. తమ్ముడూ, చెల్లెలూ, అంతలో అన్నానికి సిద్ధమయినారు. వాళ్ళకు అన్నాలు పెట్టాడు. కుంపటి మీద నీళ్ళు పెట్టి పంచదార పానకం లాగా కాఫీ చేసి అమ్మకు తమ్ముడి చేత పంపించాడు. ఆ తరువాత గబగబా పంపుదగ్గరకు పోయి నాలుగు చెంబులు నీళ్ళు పోసుకుని వచ్చాడు. అన్నం తినేటప్పటికి గోడ గడియారం ఎనిమిది కొట్టింది. ఇంకా హోమ్‌వర్కు లెక్కలు చెయ్యాలి. తెలుగు పద్యం ఒక్కసారైనా చదవాలి.

మధ్యాహ్నం తను బడినుంచి వచ్చేలోగా పాపకు పాలో? అమ్మకు అన్నమో? అబ్బబ్బ! ఇవన్నీ ఎవరు చేస్తారు లెమ్మనుకొని శేషు పుస్తకాలు సర్దుకుని బడికి బయలుదేరుతుండగా అమ్మ అన్నది:

"మధ్యాహ్నం పిల్లలేం తింటార్రా? త్వరగా పొయ్యిరాజేసి అన్నానికి ఎసరు పెట్టు. ఆ పొయ్యి అంటుకోగానే రెండోపొయ్యి అంటించి పప్పు దానిమీద వెయ్యి. ఇంకా చూస్తావేం?బడికి టైం కావటం లేదూ?"

బడి..... తను బడికికెళ్ళాలి, చదువుకోవాలి, ఓహ్..... మంచి మార్కులు సంపాదించాలి..... ఇవన్నీ తన సంగతులేనా అనిపించింది శేషుకు.

"ఇంకా కదలవేం" అని మళ్ళీ అమ్మ గద్దించింది. శేషు వంట ఇంట్లో మళ్ళీ ప్రవేశించాడు. పొయ్యి రాజెయ్యాలి, అది రాజితేగదా? అమ్మ చాలా తొందరగా పొయ్యి రాజేస్తుంది. ఎట్లా?.... ఒక చిన్న పిడకమీద కొంచెం కిరసనాయిలు పోసి దానికి నిప్పంటించి దానిమీద చిన్నచిన్న పుల్లలు పెడుతుంది. తానూ అలాగే చేశాడు. అహ..... పొయ్యి రాజుకుంటేనా? ఇట్లా కాదని చిన్న కిరసనాయిలు డబ్బా తెచ్చి ఒక్కొక్క కట్టె పుల్లని అందులో ముంచి, వాటన్నింటినీ పొయిలో పెట్టి నిప్పుపుల్ల గీసి వాటికి అంటించాడు. గప్పున మంట పైకి వచ్చింది. ఇంక నయం. కొంచెంలో తప్పిపోయిందిగా లేకపోతే క్రాపింగుకు నిప్పు అంటుకోవాల్సింది. ఎసరుపెట్టి వండడం ఆలస్యం. అందుకని మూడుసోలల గిన్నెలో బియ్యం పోసి, కడిగి పొయ్యిమీద పెట్టాడు. అంతలో మళ్లీ ఒక సంగతి గుర్తు వచ్చింది. ఎన్ని నీళ్ళు పోశాడూ? అమ్మ ఏదో గుర్తు చెప్పింది. అంటే ఐదు వేళ్లు మునిగే వరకు నీళ్లు పోయాలి. గిన్నె దింపి చూచాడు. నీళ్లు అరచేతి వేళ్ళ వరకే వున్నవి. అమ్మయ్యో అనుకుని మళ్ళీ గిన్నె పొయ్యిమీద పెట్టాడు. దాని దుంపతెగా. పొయ్యి

కాస్తా ఆరి వూరుకుంది. విసనకర్ర తెచ్చి విసరగా, విసరగా కళ్ళ వెంట నీరు కారగా, కారగా మళ్ళీ మంట రాజింది.

అంతలో అమ్మ మళ్ళీ కేకవేసింది : "రెండోపొయ్యి రాజేశావా? రాచిప్పకు మట్టి రాశావా?..... గడియారం తొమ్మిది కొట్టింది....."

❄ ❄ ❄ ❄

ఇంట్లో పని తెమిలి, బడి ఆవరణంలో ప్రవేశించేటప్పటికి క్లాసులోనుంచి హెడ్మాష్టరు ఆఫీసు రూముకు వెళుతున్నాడు. అంటే, మొదటి పీరియడ్ అయిపోయిందన్న మాట. అంటే, హెడ్మాష్టరు చేతిలో దెబ్బలు తథ్యమన్నమాట. వెధవ ఇంగ్లీషు!! ఆ ఇంగ్లీషు పాఠం, ఒకసారి చదివి ఇతరులకు తాను పాఠం చెప్పగలడు. బళ్లో వాళ్లందరికీ తెలుసు. హెడ్మాష్టరుకూ తెలుసు. కాని రూల్సు రూల్సే. పిల్లలందరూ టైముకు బడికి రావాలి. అట్లా రానివాళ్ళను హెడ్మాస్టరు తన్నక తప్పదు.

ఆలోచిస్తూనే శేషు క్లాసురూము బయట నుంచున్నాడు. "గెట్‌యిన్" అన్నాడు లెక్కలమాస్టరు. లెక్కల మాస్టరు యెంత మంచివాడు! తనకు లెక్కలలో మంచి మార్కులే వస్తవి. కాని ఫస్టు మార్కులు రావు. క్లాసులో ఎంత చిక్కు లెక్కలైనా తానొక్కడే సరిగ్గా చేస్తాడు. అందుకే లెక్కల మాస్టరుకు తనంటే ఇష్టమేమో!

లెక్కల మాస్టరు క్లాసులో నాలుగు లెక్కలు చేయించి మూడు లెక్కలు హోమ్ వర్కు ఇచ్చాడు. అంతలో రీసెస్‌బెల్ కొట్టారు. ప్యూన్ బాలయ్య ఏదో చీటీ తెచ్చి లెక్కల మాస్టరు కిచ్చాడు. లెక్కల మాస్టరు శేషువంక చూచి "హెచ్.ఎం. నిన్ను రమ్మన్నాడు" అన్నాడు.

ఆ సంగతి శేషుకు తెలుసు. హెచ్.ఎమ్.కు తనంటే కోపం. తనంటే కాదు. తన తెలివి తేటలంటే కోపం. క్లాసులు ఎగవేసినా, నోట్సు సరీగ్గా రాయకపోయినా ఇంగ్లీషు సెకండు పేపరులో తనకు ఫస్టు మార్కు ఇవ్వక తప్పదు. అవకాశం దొరికితే తనను తన్నాలని ఆయన యెప్పుడూ యెదురు చూస్తుంటాడు. అందులోను తానివ్వాళ మొత్తం పిరియడంతా ఎగవేశాడు. ఎంత తప్పు! హెచ్.ఎమ్.క్షమించ తగ్గ తప్పాయిది!.

దిగాలుగా శేషు ఆఫీసు గదిలోకి వెళ్ళాడు. "ఏం..... ఇవాళ క్లాసు ఎగవేశారే దొరగారు" అన్నాడు హెచ్.ఎమ్.శేషు ఏం చెపుతాడు? ఏం చెప్పగలడు? చెపితే లలితా, మోహన్, సీతారామయ్య మొదలయిన వాళ్ళందరూ ఎగతాళి చేసి చంపరూ? అందుచేత మెదలకుండా నుంచుని తీరిగ్గా రెండు చేతులూ చూపి ఆయన వడ్డించినవన్నీ తిని గుడ్లల్లో నీళ్ళు గుడ్లలో నుంచి గొంతులోకి తెప్పించుకొని కాలవగట్టుమీదకు వెళ్ళి భోరున యేడ్చి మూడవ పిరియడు మొదలయి తెలుగు మేస్టరు క్లాసులోకి వెళుతుండగా శేషు కూడా తరగతిలోకి వచ్చి పడ్డాడు.

❄ ❄ ❄ ❄

అకారణంగా దెబ్బలు! నిష్కారణంగా చివాట్లు! నిర్దాక్షిణ్యంగా ఎగతాళి....ఛీ.....ఛీ.... జీవితం అనుకున్నాడు పదమూడేండ్ల శేషు! సాయంకాలం ఆరు గంటలయింది. అయినా శేషు యింటికి వెళ్ళలేదు. మూడు రోజుల పరీక్షల్లో శేషు బడి వదలగానే ఇంటికి రావాలి. ఇదీ అమ్మ చేసిన శాసనం. ఈ శాసనానికి యెదురు లేదు.

శేషు ఆలోచిస్తున్నాడు. ఇంట్లో పని తనెందుకు చెయ్యాలి? తమ్ముడు చెయ్యరాదా? చెల్లాయి చెయ్యరాదా? అంత వాళ్ళు యెవరూ చెయ్యలేకపోతే వంట మనిషిని పెట్టరాదా? ఇంట్లో పని చేస్తే చదువెలా వస్తుందీ? చదువు రాకపోతే పంతుళ్ళు తంతారు. పైగా నలుగురిలో అవమానం. మార్కులు సరీగ్గా రాలేదని తంతే అది వేరే సంగతి. చేయవలసిన పని చెయ్యపోతే తన్నితే అందులో అర్థం వుంటుంది. ఇంట్లో వాళ్ళూ, బళ్ళో వాళ్లు కూడా తన దృష్టిలో తనను అనవసరంగా తంతున్నారు. ఈ తన్నులు తినేదాని కన్నా దేశం మీద తిరిగితే సరి. ఆకలయితే అడుక్కుంటే సరి. లేకపోతే ఏదయినా కూలి చేసుకుంటే సరి. శేషు కాలవగట్టు మీదవున్న చింతచెట్టు కింద కూచుని ఆలోచిస్తున్నాడు.....

"బాబూ......"

ఎవరిదా పిలుపు!! శేషు అటూ ఇటూ చూచాడు. పెదనాన్న మందులసంచీ బుజాన వేసుకుని చేతికర్రతో నేలమీద పొడుస్తూ వస్తున్నాడు.

"బాబూ... ఇక్కడ కూచున్నావేం? అందరూ కులాసాగా వున్నారా....."

"పెదనాన్నా......" అన్నాడు శేషు. శేషుకు తెలియకుండానే ఏడుపు వచ్చింది.

"ఛీ.....ఇదేమిటి బాబూ......మగవాళ్ళు ఏడవరాదు......ఏరా....నాన్న వూళ్ళో వున్నాడా.... అందరూ కులాసాగా వున్నారా?...."

"నాన్న కాంపుకి వెళ్ళాడు."

"అమ్మ కులాసాగా వున్నదా....."

"అందరూ బాగానే వున్నారు.'...

నువ్వు ఇంటికి వెళ్ళు. నేను రాను."

"అదేమిటి బాబూ....ఇంటికి రాని దెందుకని?"

"పెదనాన్నా– నేను ఇంటిపని ఎందుకు చెయ్యాలి?"

"చెపుతాగా....ముందు ఇంటికి పద. చీకటి పడింది. పురుగూ పుట్రా వుంటవి పద, మా బాబు మంచివాడు."

పెదనాన్న ఎంత మంచివాడు! శేషు నెమ్మదిగా పెదనాన్న వెంట ఇంటికి వచ్చేటప్పటికి ఇంట్లో ఎవరూ దీపం కూడా పెట్టలేదు. పెదనాన్నే దీపం వెలిగించాడు. పెదనాన్నే వంట చేసి పిల్లలకి పెట్టాడు. పెదనాన్నే పాపకు పాలుకాచి పోశాడు . పెదనాన్నే పాలు పితికాడు. పెదనాన్న ఎంత మంచివాడు!

రెండు రోజులు గడిచిపోయినవి. మూడో రోజు సాయంకాలం శేషు బడినుంచి ఇంటికి రాగానే స్నానం చేసి పెదనాన్న వెంట శివాలయానికి వెళ్లాడు.

పెదనాన్న తెల్లటి గడ్డం సవరించుకుంటూ ఏవేవో మంత్రాలు బిగ్గిరగా చదివాడు, ఆ పల్లెలోని వారందరూ పెదనాన్నను ఎంతగానో గౌరవించారు. ఇంటికి వస్తుండగా శేషు నెమ్మదిగా అన్నాడు గదా.

"పెదనాన్నా-"

"ఏమిటి బాబూ"

"నేను ఇంట్లో పని ఎందుకు చెయ్యాలి?"

"మరి ఎవరు చేస్తారూ? అమ్మ వాకిట చేరిందాయె. నాన్న వూళ్లో లేడాయె. ఈ వూళ్ళో మన వాళ్లెవరూ లేరాయె."

"అమ్మ ఇంట్లో వున్నానేను పని చేయాలి పెదనాన్న."

"అమ్మ ఇంట్లో వున్నా నీచేత పని చేయిస్తుందా?"

"ఆ..... నీళ్ళు తీసుకురావాలి. పిల్లలందరికీ పక్కలు వేయాలి. బజారుకు వెళ్ళి ఇంట్లోకి కావలసినవి తీసుకు రావాలి".

"ఇవన్నీ పెద్ద పనులా బాబూ? పెద్ద పనులయితే మాత్రం చేసుకోవద్దూ? మన పని మనం కాకపోతే ఎవరు చేస్తారూ?"

"ఏం తమ్ముడు చెయ్యరాదా? చెల్లాయి చెయ్యరాదా?"

"వాళ్లు చిన్నవాళ్లు"

శేషు మాట్లాడలేదు. పెదనాన్న మళ్ళీ అన్నాడు గదా:

"అమ్మ, జబ్బు మనిషి! బాబూ, అమ్మకు సేవ చెయ్యడం దైవపూజతో సమానం. ఈ ఇంటికి నువ్వు జ్యేష్ఠుడివి. మీ అమ్మకు మొదట పుట్టావు. కనుక అమ్మకు నువ్వు చేదోడు వాదోడుగా వుండాలి."

శేషు ఇందుకు సమాధానం ఏమీ చెప్ప లేదుగాని ఏదో పరమరహస్యం తెలిసినట్లనిపించి మనసులో అనుకున్నాడుగదా: "ఓయి భగవాన్..... నేనెందుకు మొదట పుట్టాను" అని....

మొదట పుట్టిన వారందరి బాల్యం ఇలానే వుంటుందా.....



# పన్యాల రంగనాథరావు

**(1919 - 1987)**



**ప**న్యాల రంగనాథరావుగారి పేరు వినని వారంటూ ఆంధ్రప్రదేశ్‌లో లేరనడం అతిశయోక్తి కాదు. పిన్నలకూ, పెద్దలకూ, నిరక్షరాస్యులకూ ఈ మధ్య వరకూ వారి గొంతు ఆలిండియా రేడియోలో పరిచితమైందే. సారస్వత జగతిలో కూడా పన్యాల వారికి మంచి పేరున్నది. వీరు ఎన్నో కథలు, నాటికలూ, నవలలూ, కావ్యాలూ వ్రాశారు. వీరి కథలు సహజమైన జీవిత సంఘటనలతో, విభిన్న మానసికా వేదనల చిత్రణతో, ఇంపైన శిల్పంతో, సరళమైన భాషతో, సాంఘిక ప్రయోజనాల నిమిత్తం - చదవరులకు ఆహ్లాదాన్ని సమకూరుస్తాయి. ప్రెస్ ఇన్‌ఫర్‌మేషన్ బ్యూరో హైద్రాబాదులో పనిచేసేవారు.

**రచనలు :** నీకోసం, అనూరాధ, అంతస్థులు (నవలికలు) ఆద్యంతం, పన్యాల కథలు (కథా సంపుటాలు) ప్రేమలత, అశ్రుగీతి, అభయముద్ర (కావ్యాలు)

# అమాయకత్వం

**పం**తులికి ఆ రోజంతా కూడా దుర్దినంగానే పరిణమించింది. పొద్దున నిద్ర లేవకముందే గురుతుగా డొచ్చాడు. వాడన్న ముక్కలేవో తుంపుడు ముక్కలల్లే జ్ఞాపకమున్నాయి. తను పెరట్లోకి పోతూ వుండగా, రమణయ్య నౌకరు పరుగెత్తుకుంటూ వొచ్చాడు. చంటివాడికి రాత్రి హఠాత్తుగా జబ్బు ఎక్కువయిందనీ, తన్ను వెంటనే రమ్మన్నారనీ చెప్పి వెళ్ళాడు. ఏడాదైనా నిండిందో లేదో వాడికి, నాలుగు రోజులై సరిగా ఊపిరైనా తీయలేకుండా వున్నాడు. ముక్కులో ఏదో అడ్డుకున్నట్టుగా బాధ పడతాడు. రాత్రి డాక్టరునైనా పిలిపించారో లేదో! ఆ డాక్టరు – రమాపతిగాడు – ఈ జబ్బు కేదో పెద్ద పేరు కూడా ఏడిశాడు. రోగాలకు పెద్ద పెద్ద పేర్లు పెట్టడం చాతవును యీ డాక్టర్లకు! ఇచ్చే మందుల్లో గుణం పూజ్యం! సరి, ఈరమణయ్య నౌకరు అలా వెళ్లాడో లేదో, తన పెరట్లో నూతిగట్టు దగ్గర జారి పడ్డాడు. కాలో చేయో విరగలేదు. అక్కడికది నయం.

వీటన్నింటి కేం గానీ, ఎన్నడూ లేనిది, ఇవేళ పంతులు తలకాయలో ఆలోచనా పరంపరలు, గాజుబుడ్డీలో చేపలీత్తున్నట్లు ఈత్తున్నాయి. ఆలోచనలు చేయటమంటే పంతులికి మండుకొస్తుంది. అందుకే ఈవేళ మరీ దుర్దినంగా కనిపిస్తున్నది. ఈ ఆలోచనలైనా యిప్పుడే రావాలా? వేళాపాళాలేదా?

రాత్రి ఒంటి గంటప్పుడు, కటికచీకట్లో పంతులు అడుగులో అడుగు వేస్తూ నడుస్తున్నాడు. పైగా తుంపర జల్లు కూడాను. వర్షాకాల మంతా దాటిపోయినాక, ఇక్కడ వర్షం పెళ్ళినడకతో సహా వచ్చింది. ఇదికూడా ఆ గురుతుగాడు కట్టుకున్న పుణ్యమే! వాడన్నమాట దాఖలా యిచ్చి తీరుతుంది. ఒక్కొక్కడి నోట్లో శనిగాడు నాట్యం చేస్తూ వుంటాడు కాబోలు. తను నిద్రలేవక ముందే వచ్చి, గురుతుగాడు, "ఈవేళ వర్షం పడేట్టుంది"

అన్న ముక్క, తనకు జ్ఞాపకముంది. గురుతు మంచి సూక్తులెన్నడూ పలకడు, అందుకే కాబోలు దాదాపు అన్నీ దాఖలా ఇస్తాయి. తన ఎరికలో వాడన్న ఒక్క మంచిమాటా, తన గురించే!

"నీకూ, నీతో పాటు నాకూ మంచి రోజులున్నాయిలే. బెంగపెట్టుకోకు." అన్నాడు ఒకసారి. ఇటువంటి మాట వెంటనే దాఖలా ఇవ్వకూడదూ?

ఎటు చూసినా జీబురుగానే వుంది. ఈ రొజ్జగాలికీ, చినుక్కీ, మునిసిపల్ దీపాలు కాస్తా ఆరి వూరుకున్నాయి. గుడ్డివాడికీ, తనకూ ఈ క్షణంలో భేదం లేదనుకున్నాడు పంతులు. వర్షం అంత ఎక్కువగా లేదు. అయినా ఈ కాస్త చినుక్కీ చేతిలో వున్న గొడుగు ఆనేట్టు లేదు. పంతులు రోడ్డు ప్రక్కనే వున్న ఒకయింటి అరుగుమీదకెక్కి, కుడిచేతిలో ఉన్న చిన్న మందుసీసా ఎడమచేతిలోకి తీసుకొని, ఎడమ చేతిలో ఉన్న గొడుగు కుడిచేతికి మార్చాడు. నిజానికి, ఈ మాత్రం మార్పువల్ల పంతులు ఆలోచనలు మట్టుకు పోలేదు. రెండు నిమిషాలు అట్లానే నిలబడి, పంతులు మళ్ళీ, వర్షంలో, చీకట్లో, వీధిలో పడినడవసాగాడు.

పంతులు కిప్పుడు ముఖ్యంగా మంచిచెడ్డల గురించి ఆలోచన పట్టుకుని పీడిస్తున్నది. తెలిసి, తెలిసి, తను ఈ సంఘం జోలికి ఎన్నడూ పోలేదు. అయితే, గురుతు ఇటీవల ఆ మాట పదే పదే ఉపయోగించాడు. ఇప్పుడది తనకు మరపుకి రావటం లేదు. ఆలోచించిన కొద్దీ – పాడు ఆలోచన సంఘంలో ఉన్న సత్యాన్ని తనే కనిపెట్టినట్టని పిస్తున్నది. ఈ సంఘం, ఒక సరళ రేఖను బట్టి పోతుందనుకున్నాడు పంతులు. దానికి ఒక వైపంతా మంచీ, మరోవైపంతా చెడూ కనిపిస్తున్నది. ఈ రెండింటికి, ఆది నుంచీ రామరావణ యుద్ధం సాగుతున్నట్టు తడుతున్నది తనకు.

పంతులు ఒకసారి తనలో తను నవ్వుకున్నాడు అమాయకంగా. చటుక్కున పంతులికి, ఈ మంచిచెడ్డలన్నీ కల్పించుకున్నది మనమే అని తట్టింది. ఆ "మనం"లో తను కూడా ఒక పాత్రే అనిపించింది. ఈ రెండు గుణాల మధ్యా వున్న సరళరేఖ మీద, సంఘాన్ని రిక్షా లాగినట్టు లాగుతున్న కోట్లాది జన ప్రవాహంలో, పంతులికి తన రూపం కూడా కనిపించసాగింది.

అయితే,ఇందులో మంచేదో చెడేదో చెప్పటంలోనే వస్తున్నది పేచీ. ఒకరికి మంచిగా తోచినది మరొకరికి చెడుగా తోస్తున్నది. తనకే మంచిగా తోచింది ఇతరులకు చెడు కావచ్చుకద!

పంతులు నుదుటిమీద చెమట పోసింది. తల వేడెక్కినట్లు అనిపించింది. ఈ మంచిచెడ్డల ఆలోచన కూడా తన తలలో కెక్కించింది గురుతే అని చప్పున తట్టింది.

"ఛీ..... ఈ మంచి చెడ్డలంటేనే ఏమిటో అర్థం కాకుండా పోతున్నది." అనుకున్నాడు పంతులు.

గురుతుగాడి మాటను కూడా బొత్తిగా కొట్టి పారెయ్యటానికి వీలుపడదు – వాడి నోట్లో ఎంత శని ఉన్నా! వాడుమట్టుకు ఏం చేస్తాడు? ఉన్న నిజమేదో చెప్తాడు– ఉత్త అమాయకుడు!

గురుతు తనకు చేసే సహాయమంటూ ఏదీలేదు. ఆ మాటకొస్తే, రమణయ్యనే చెప్పుకోవాలి. తన కెన్ని సార్లు చేబదుళ్ళివ్వ లేదు రమణయ్య? తను మళ్ళీ తీర్చుకోలేడని రమణయ్యకు తెలుసు. అయితే ఏమాట కామాటే. గురుతు అప్పుడప్పుడు ఒక వొడ్డు మట్టుకు కాసేస్తాడు. వెనకొకసారి, తన కూతురి మీద, ఈ డాక్టరు గాడు – ఈ రమాపతే, కన్ను వేసినప్పుడు. గురుతుగాడుండబట్టి కద గండం గడిచింది!

పంతులు పెద్ద గడసరికాడు. అంత ధైర్యవంతుడూ అనలేం. అతను కేవలం మామూలు మానవ మాత్రము. అయితే కేవలం మామూలు మానవ మాత్రులు కూడా, ఒక్కొక్కప్పుడు ఎన్నడూ లేని ఆలోచనలు చేస్తారు. ఎన్నడూ లేని సాహసం కూడా చూపిస్తారు.

"నువెంత అమాయకుడివి!" అన్నాడు గురుతు నెన్నోసార్లు. బహుశా అది నిజమే కావచ్చు!

ఆ మాటకొస్తే, అమాయకు లెవరుకారు? తన కూతురు! ఎంత అమాయకురాలు కాకుంటే, దాని బతుకిట్లా తెల్లవారుతుంది; గురుతుగాడు మాత్రం? ఏదో వాగుతాడుగాని, ఎంత అమాయకుడు కాకుంటే, తన దరిద్ర్యమే ఐశ్వర్యమైనట్టు తన్నే అంటిపెట్టుకుని ఉంటాడు! పోతే రమణయ్య – వాడి భార్యా కూడా అమాయకులు కారూ? చంటివాడికి జబ్బు చేస్తే కళ్ళనీళ్ళు పెట్టుకోవడం లేదూ?

సాహసించి ఇంతవరకూ తను, సాహసమయిన పని ఏదీ చేయలేదు. సాహసం లేకుంటే, బతకడం కష్టమన్నాడు గురుతు. నిజమే. అందుకే, తనై తాను ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక సాహసానికి వొడిగడతాడని మాత్రం పంతులు విశ్వసించలేదు.

పంతులు తన జీవితాన్ని తరచి చూసుకోవడం యిదే మొదటిసారి. ప్రతి వ్యక్తీ, ఏదో ఒక రోజున, జీవితాన్ని ఈ విధంగా పునశ్చరణ చేసుకోవలసిందే. కాని, గురుతే లేకుంటే, పంతులు అసలీ ఆలోచనలకే దిగేవాడు కాదు – కనీసం ఇప్పుడు జరిగివుండేదికాదు!

పంతులులో గొప్పవిశేషమేదీ లేదు. ఇది తనకు బాగా తెలిసిందే. చాలా మంది పేద కుటుంబీకులలాగనే. తను కూడా పేద కుటుంబీకుడే. తన తండ్రి తనకు వారసత్వంగా యిచ్చిపోయిన ప్లీడరు గుమాస్తాగిరే, నాటినుంచీ వెలిగిస్తున్నాడు పంతులు. ఆ ప్లీడరు ఎవరో కాదు. తన స్నేహితునివంటివాడు; రమణయ్య! తన తండ్రి, రమణయ్య తండ్రి

దగ్గర గుమస్తా చేస్తే, తను రమణయ్య దగ్గర చేస్తున్నాడు. తనూ రమణయ్యా దాదాపు ఒకే యీడువాళ్లు. చిన్న క్లాసులలో కలిసి చదువుకున్న వారు! ఆ అభిమానం ఉండబట్టి కదా తన్ను ఆదరించాడు రమణయ్య!

పంతులికి దక్కిన సంతానం – ఇద్దరు కొడుకులూ, నలుగురు కూతుళ్ళూనూ. పెద్దవాడు తనకు మించిన ఘనుడు. వాడికిప్పుడు ఇరవయ్యేళ్ళు వచ్చినై. చదవవేస్తే – ఉన్న మతికూడా చెడగొట్టుకున్నాడు. ఊరుమీద పడి తిరిగే ఆంబోతుకీ వాడికీ ఆటే తేడా యేదీ లేదు. వాడివల్ల తనకు దమ్మిడీ ప్రయోజనం లేదని ఏనాడో తెలుసుకున్నాడు పంతులు. పెద్ద కూతురు కాస్తా – దాని కిప్పుడు పద్దెనిమిదో యేడు – ఇల్లు పట్టింది. ఇంటో ఆడదిక్కంటూ ఉందనుకోవచ్చు. కాని పాపం దాని కాపరం కాస్తా బుగ్గయినట్టే. దాన్ని కట్టుకున్నవాడు ఎటు పోయినాడో, అసలు యెక్కడన్నా బతికున్నాడో లేడో, అతీగతీ లేదు. ఆ తర్వాత పంతులుకి వరుసగా ముగ్గురు కూతుళ్ళు, ఇద్దరు కొడుకులు. కూతుళ్ళు దక్కి, కొడుకులు పోయినారు. భార్య ఒక యేడాది పాటు మంచం కూడా పట్టింది. మళ్ళీ లేచి, కాస్త తిరగ్గలుగుతున్న దనగానే పుట్టె మునిగినట్టు, నరసుగాణ్ణి కన్నది! దాన్ని మాత్రం అని ఏం లాభం? అమాయకురాలు! తన బుద్ధి గడ్డితిన్నది. అయినకాడి కేదో అయింది. పోతే, తన ఆశలన్నీ ఆ నరసుగాడిమీదనే! వాడికిప్పుడు అయిదో యేడు వెళ్ళి ఆరోయేడు వస్తున్నది. రమణయ్య పెంపకంలో!

కష్టాలలోనే పుట్టి పెరిగినవాడూ, జీవిస్తున్నవాడూ గనక, పంతులు ఈ కష్టాలను లెక్కచేయలేదు. మూడేళ్ళ కిందట – నరసు రెండోయేట, తన భార్య పోయినప్పుడు కూడా పంతులు ఆటే విచారించలేదు. విచారించి మటుకి చేసేదేముంది? అప్పటికింకా కూతురు ఇల్లు పట్టలేదు. అది వచ్చి రెండేళ్ళయింది.

పెద్దకూతురు పెద్ద అందగత్తె కాదు. ఆడపిల్లలకు ఈడే అందం! అందుకే ఈ డాక్టరుగాడు కన్ను వేశాడు.

"దాన్ని నా కిచ్చి పెళ్ళి చేయమంటే, నువు వినిపించుకున్నావా? ఇప్పుడీ గతి పట్టి వుండేదా? నాకన్న పదహారేళ్ళు చిన్నదని గోలపడ్డావు. ఇప్పుడేమయింది మరి?" అన్నాడు గురుతు. తను సమాధానం యివ్వలేదు. ఏముంది ఇవ్వటానికి?

"ఊరికే హాస్యానికన్నాను. నా పొట్ట నేనే నింపుకోలేనివాణ్ణి, దాన్ని కట్టుకుని ఏం చేసుకోను!" అన్నాడు గురుతు.

"హాస్యాని కెందుకంటావులే! నీతోపాటే అదీ ఉండేది. మొగడంటూ కళ్ళకు కనపడుతూ వుండేవాడు!" అన్నాడు తను. పంతులుకి ఇందులో తన అమాయకత్వం స్ఫురించకపోవడంలో ఆశ్చర్యం లేదు. గురుతు నవ్వి ఊరుకున్నాడు.

పంతులు జీవితంలో దరిద్రం బాగానే తాండవిస్తున్నది. కాలం సుఖంగా గడిస్తే దారిద్ర్య ప్రస్తావనే ఉండదు. పంతులుకి కాలమంతా గడ్డుగానే ఉంటున్నది. రెండోపిల్ల పెళ్ళికి సిద్ధంగా వుంది. భగవంతుడనే వాడుండి, తన కేదన్నావరం ప్రసాదించాడనుకుంటే, ఆ వరమేదో ఈ పిల్లకు అందం రూపంలో ఇచ్చి పోయినా దనుకున్నాడు పంతులు.

ఆరునెల్ల కిందట, గురుతు ఎవణ్ణో లాక్కొచ్చాడు. వాడు ఈ పిల్లను సినీమాతార చేస్తానని కూర్చున్నాడు. తనకే దేనికో భయంవేసి, దాన్ని పంపలేదు. గురుతు ఎంత బలవంతం చేశాడు! పంపినా బాగుండిపోనేమో! ఈ బతుకు సుఖంగా గడిచిపోయేది. పంపకపోవడం వల్ల, నాటినుంచీ దీనికి సినిమా పిచ్చిజాస్తి అయిపోయింది. ఎట్లా వెళు తుందోగాని, అది చూడని సినీమాలు లేవు. తన మాటల లక్ష్యపెట్టకుండా మారింది. ఏ నిమిషాన దీన్ని ఎవడు ఎగరేసుకు పోతాడో అన్న భయమొకటి పీకుతున్నది పంతులికి.

ఇక మిగతా ఇద్దరు ఆడపిల్లలూ, దినదినానికీ పెరుక్కొస్తున్నారు. ఏ పిల్లకీ చదువు సంధ్యలు అసలు లేవు. వీళ్ళందరికీ మొగుళ్ళెక్కడ దొరుకుతారు? పెద్దదానికయినట్టు, ఎవడో వచ్చి నట్టేట్లో ముంచేస్తే ఏం దారి? గురుతుగాడికితనమీద ఎందుకో ఇంత జాలి! అమాయకుడు! తన కున్న ఆడసంతానం చూస్తే, ఎవరికేనా సానుభూతి కలగాలి! వాడొకడుండి, వీళ్ళందర్నీ వెంట తిప్పుకుంటూ ఉండడం వల్ల తనకు ఊపిరి సలుపుతున్నది. రోజూ ఈ సంతానాన్ని ఇంట్లో చూస్తూ కూర్చుంటే, ఈ పాటికి, బెంగతో, తన ప్రాణాలు ఎప్పుడో ఎగిరిపోయేవి!

తన గుమాస్తాగిరి ఏ మంత ఎక్కువ విలవైందికాదు. రమణయ్య గనక సరిపోయింది. తోటివాళ్ళ కన్న నాలుగు రాళ్ళు ఎక్కువ ముడుతున్నాయనుకోవచ్చు. భార్య ఎప్పుడో జబ్బు పడ్డప్పుడు, చేయవలసివచ్చిన అప్పు ఇంకా పీడిస్తున్నది. పూటకు ఆరుకడుపులు నిండాలి. ఈ రోజులలో ఇంతకన్న పెద్ద ఆర్థిక దారిద్ర్యం మరొకటి ఎక్కడుంది? రమణయ్య, తన్ను ఒక కంట కనిపెడుతూ ఉండబట్టి, అప్పు పెరగడం లేదు. అందుకు తను రమణయ్యకు యెంత కృతజ్ఞత చూపినా చాలదనిపిస్తుంది.

నరసుగాడు పుట్టినపుడు, వాడి మీద తనకు పుట్టుకొచ్చిన ఆశలు జ్ఞాపకం రాసాగాయి పంతులికి. అయితే, నలుసంత ఉన్నాడు. వాడు పెరిగి పెద్దవాడైనదేనాడు? ఏ యమ్మేవో ప్యాసయి, పెద్ద ఉద్యోగస్థుడై తన దరిద్రం తీర్చేదెప్పుడు? ఆశ లెలావున్నా; తనుమాత్రం వాడికి దూరం కాక తప్పలేదు. ఈ దరిద్ర వాతావరణం వాడి వొంట పట్టకూడదనే పంతులు, వాడికి దూరమయినాడు. సరిగ్గా తన భార్య పోయిన సమయంలో రమణయ్య, వాడి భార్యా తన్ను ఆదుకొని, ఈ కడగొట్టు గుడ్డుని చేరదీయక పోయివుంటే, ఈపాటికి

ఈ దరిద్ర రక్తం వాడివొంట కొంత పట్టేది. గోచీ పెట్టుకుని వీధిలో నలుగురితో పాటు గోలీకాయలాడుతూ ఉండేవాడు. పెద్దవాడు మట్టుకు ఈ యీడప్పుడు అంతకన్న ఏం చేశాడు?

రమణయ్య ఎంతేనా సంస్కారం ఉన్నవాడు. ఈ సంస్కారాన్ని పంతులు ప్రత్యక్షంగానే చూశాడు. ఎంత సంస్కారం ఉన్నవాడూ కాకుంటే, ఆగర్భ శ్రీమంతుడై వుండి కూడా, తన్ను నలుగురుతోపాటే సమానంగా చూచుకుంటాడు!

భార్య పోయిన కొద్ది రోజులకే పంతులు, నరసుని, రమణయ్యకు వప్పగించాడు. రమణయ్యకు పిల్లలెలా లేరో, వాడి భార్యకు, పాపం పిల్లలందే అంత ప్రాణం. దారిద్ర్యమూ, ఐశ్వర్యమూ, సంతానమూ సమపాళ్ళలోఎందుకుండవో ఎంత ఆలోచించినా పంతులుకి తట్టలేదు. రమణయ్య భార్య దగ్గర నరసుగాడికున్న ప్రాపకం వల్ల, తల్లి పోయినప్పుడు వాడికా భేదం కూడా తెలీలేదు. తెలిసిన కొద్ది పాటి లోటూ, వారి భార్యే తీర్చింది. జ్ఞానమొస్తున్న ఆడపిల్లలు ఏడ్చారు; బెంగ పెట్టుకున్నారు తల్లి కోసం. కొద్దిరోజుల్లోనే అంతా మరిచిపోయి మామూలైనారు– రమణయ్య భార్య మూలంగానే! రమణయ్యకీ, వాడి భార్యకీ ఎంతో ఋణపడి వున్నాడు.

అప్పట్లో నరసు పెంపకానికి కావలసిన తంతు జరగలేదు. రెండేళ్ళ కిందట, తన పెద్ద కూతురు ఇల్లుపట్టిన రోజులలో, ఆ తంతేదో రమణయ్యే జరిపించుకున్నాడు. శంఖంలో పోసిన తీర్థమయినాడు నరసు. ఇది తలుచుకొని, పంతులు చాటుగా కొన్నాళ్ళు కళ్ళు తుడుచుకోక పోలేదు. కాని ఇదంతా నరసు వృద్ధిలోకి రావడం కోసమే చేశాననీ, మున్ముందు, హాయిగా ఏదో వాడి చాటున కాలం వెళ్ళబుచ్చే రోజుల కోసమే చేశాననీ, గురుతన్న మాటలు గుర్తుకొచ్చి తృప్తి పడేవాడు.

నరసు ఏ ముహూర్తాన పెంపకానికి వెళ్ళాడోగాని, ఆరు నెలలకే రమణయ్య భార్యకు వేవిళ్ళు ప్రారంభమైనై! ఇట్లా జరుగుతుందని ఎవరూ అనుకోలేదు. భార్య కాపరానికొచ్చి ఇరవై యేళ్ళయింది. ఇక పిల్లలు పుట్టరనుకున్నాడు రమణయ్య. తనూ అంతే అనుకున్నాడు పంతులు. ఇప్పుడు రమణయ్యకు ఏడాది చంటివాడు! దీనివల్ల నరసుగాడి బతుకు బండలవుతుందని తనమనసు కెలికినవాడు గురుతు! రమణయ్య విషయంలో తను అట్లా భావించడం మహాపాపం!

తనకున్న కష్టాలు చాలకుండా, కూతురు మరికొన్ని మూట కట్టుకొచ్చింది! ఇది ఇల్లు పట్టినప్పుడు దానికి నాలుగోనెల. ఉన్నట్టుండి దానికి చచ్చినంతయింది. అప్పట్లో డాక్టరు రమాపతి దగ్గర ఒక మంత్రసాని కూడా ఉందన్న ధైర్యం మీద, రమణయ్య

సహాయంతో, దాన్ని రమాపతి 'నర్సింగ్ హోం'లో చేర్చాడు పంతులు. కడుపుపోయింది. గండం గడిచి, కూతురు బయటపడింది. కానీ పీడ మాత్రం పట్టుకుంది!

తన కూతురే చాలా మట్టుకు తన కళ్ళు కప్పిందనుకున్నాడు పంతులు. చాలా కాలం గడిచాక గాని తన కా విషయం తెలిసిరాలేదు. కన్నునొప్పో కాలునొప్పో ఏదో ఒక వంక పెట్టి, అది నిత్యకృత్యంగా ఆస్పత్రికి పోతూ ఉండడం, మొదట్లో తనకేమీ అనుమానానికి దారి తీయలేదు – గురుతువచ్చి చెప్పే వరకూ!

ఇందులో గురుతుకున్న శ్రద్ధయేమిటో పంతులెన్నడూ ఆలోచించలేదు. పంతులు ఒకటే నమ్మాడు. గురుతు ఎంత చెడ్డా, తన మంచికే ఆలోచిస్తాడు!

అమాయకత్వం కాకుంటే, అది మట్టుకేం చేస్తుంది? దాని అమాయకత్వం గ్రహించే ఈ డాక్టరు – ఈ వెధవ – దాన్ని కాస్తా బుట్టలో వేసుకున్నాడు.

గురుతు ఏం చెప్పినా బాగానే ఉన్నట్టు కనిపిస్తుంది తనకు. రెండు మూడు రోజుల కిందట గురుతు ఒక ముక్కన్నాడు. ఇవేళ తెల్లవారు ఝామునే వచ్చినప్పుడు కూడా, బహుశా ఆ ముక్కే అని ఉంటాడు. ఇప్పుడు తన ఆలోచనలన్నీ ఇట్లా తెల్లవారుతున్నందుకు వాడే కారణం!

"రమణయ్య కొడుక్కి చాలా జబ్బుగా ఉందిట  కదూ?" అన్నాడు గురుతు.

ఏడాదైనా నిండిందో లేదో! బాలారిష్టాలు తీరేసరికి మూడు చెరువుల నీళ్లు తాగాలి – అనుకున్నాడు తను.

"నిమోనియానో, టైఫాయిడోట కదూ!" అన్నాడు గురుతు.

"నువ్వన్నదేదో అయి ఊరుకుంటుంది. అట్లా యేం అనకు. ఇంకా ఏదీ నిర్ణయం కాలేదు. డాక్టరుని మార్చమని చెప్తూనే వున్నాను. వాళ్ళకు రమాపతి దేముడై కూర్చున్నాడు. పెద్దవాళ్ళు, ఏం చేయను?" అన్నాడు తను. గురుతు నవ్వాడు.

"అదే నీ పొరపాటు. నీకు మంచిగా తోచింది అందరికీ మంచిగా తోస్తుందను కొంటావు. ఎట్లా కుదురుతుందీ? పోన్లే. ఏదొచ్చినా మన మంచికే అనుకుంటే సరి" అన్నాడు గురుతు.

పంతులుకి ఈ చివరి ముక్కలో శ్లేష స్ఫురించలేదు. పంతులు మౌనంగా ఉండటం చూసి, గురుతు మళ్ళీ అందుకున్నాడు–

"రమణయ్య భార్య కడుపుతో ఉన్నప్పుడు నేనన్నాను జ్ఞాపకం ఉందా? ఎందుకు తొందరపడి నరసుని పెంపకాని కిచ్చావని? భగవంతుడనే వాడుంటే, నీ దరిద్రం – నీతోపాటు నాదీ చూడదూ?"

"నరసుని పెంపకానికి తీసుకున్నప్పుడు వాళ్ళు మట్టుకు కలగన్నారా ఏమిటి కొడుకుని కంటామని? ఇంక కాన్పు ఉండదని నమ్మబట్టే కద వాణ్ణి తీసుకున్నారు! అప్పటికప్పుడే పదిహేను ఇరవై యేళ్ళయి కాపరం చేస్తున్నారాయె. అంత మరీ ఆలస్యంగా కాన్పొస్తుందని ఎవడనుకోగలడు? ఇంతకీ ఇప్పుడు నరసుకేం మయిందనీ? రాజాలాగా వుంటున్నాడు అక్కడ. వాడికీ దరిద్రం తీరిపోయింది" అన్నాడు తను.

"వాళ్ళు ముసలి కాలానికి సరిగ్గా కూర్చొని పిల్లల్ని కనడం ప్రారంభిస్తే మట్టుకు ఎవడిక్కావాలిలే! సరిగ్గా నేను చెపుతున్నదీ అదే! నువ్వన్నట్టు నరసు దరిద్రం తీరింది."

"అదే కద నేను కోరేది?" అన్నాడు తను.

"అవును. కాని, నువు కోరని మరో రకం దరిద్రం వాణ్ణి పట్టుకుంటున్నది. ఆ సంగతి ఎప్పుడన్నా ఆలోచించావా అంటున్నాను". అన్నాడు గురుతు చుట్ట ముట్టిస్తూ.

పంతులు కిదేమీ అర్థంకాలేదు.

"నరసు కేమయిందంటావు?" అన్నాడు తను.

"నీకు తెలీకే అడుగుతున్నావా?"అన్నాడు గురుతు.

"వాడు బంగారంలా వున్నాడు. వాడంటే రమణయ్య భార్యకెంత ఇష్టమో నీకేం తెలుసు? ఆ పుట్టిన పిల్లవాడంటే నరసుకెంత ప్రాణమో నువ్వేం చూశావు? తమ్ముడూ, తమ్ముడూ, అంటూ, ఒక ఆటబొమ్మలా వాడు ఆడుకుంటూ వుండటం కూడా ముచ్చటగా వుండదా?" అన్నాడు తను.

"ఏడిసినట్టుంది నీ ఆలోచన. వాణ్ణి ఆడించేవాడైనాడు చివరకు నీ నరసు. నరుసు కాయింట్లో ఉంటున్న గౌరవమేమిటో, ఎంతో అర్థమయిందా నీకు? ఇప్పుడన్నా కాస్త ఆలోచించు" అన్నాడు గురుతు.

తనకు తోచని విషయాలు ఈ గురుతు కెట్లా తోస్తయ్యో పంతులుకి అర్థం కాలేదు. ఈ ముక్క తనకు బొత్తిగా తట్టలేదు. గురుతు చెప్పింది నిజమే అనుకోవాలా? గురుతు ఏం చెప్పినా ఆలోచించే చెపుతాడు. ఇదివర కెన్ని సార్లిట్లా, అనేక సందర్భాలలో చెప్పలేదు? గురుతు చెప్పిన తరువాత ఆలోచిస్తే, అది నిజమే అనిపిస్తున్నది.

"ఇందులో ఆలోచించటానికేదీ లేదులే. అంతా స్పష్టంగా తెలుస్తున్నదే. నీకు తోచకుంటే నే చెపుతా విను. కన్న కడుపు యెట్లాగూ వేరు. నరసుగాడి మీద నీకుండే ప్రేమాభిమానాలు వాళ్ళకుంటా యనుకోవటం పొరపాటు వాళ్ళకు సంతానం కలగకుండా ఉండివుంటే, వేరే విషయం. కలిగాక, ఇక నరసుగాడు ఎప్పుడా సంగతి ఆలోచించినా పరాయివాడుగానే తోస్తాడు. తోచడం కాదు. పరాయివాణ్ణిగానే చూస్తారు.

పంతులు మాట్లాడకుండా వింటున్నాడు. గురుతు మళ్ళీ ప్రారంభించాడు.

"నీకు మనుషుల నైజం తెలీదు. ఎన్నాళ్ళ నుంచో నీతో చెప్పాలనుకుంటున్నాను. సమయం వచ్చింది గనక చెప్తాను విను. అసలు ఇంత దూరం ఎవరికీ ఏదీ చెప్పను. ఎందరో తెలిసిన వాళ్ళు సలహాలడుగుతూ వుంటారు. సలహాలు మట్టుకు అంత చవకా? కాని, నువు ఏ సలహా కూడా అడగనక్కరలేకుండానే అనేకం చెపుతూ వుంటాను. ఎందుకూ? నువు నా వాడివి గనక. నేను చెప్పినట్టు విని. చేయమన్నది చేస్తావు గనక. నువ్వు వెర్రిబాగులవాడివి. అందుకే నిన్ను ఒక కంటకని పెట్టుకుని ఉంటున్నాను. ఎవరినైనా నువు యిట్టే నమ్మేస్తావు. వాళ్ళు చెప్పేది నిజమనుకుంటావు. నా మాట కూడా పూర్తిగా నమ్మమని నిన్ను బలవంతం చెయ్యను. నేను మట్టుకేం ఎక్కువ? కాని, ఒకటి ఆలోచించుకుంటూ వుండు. ఎవరు చెప్పిన దాన్లో ఎంతవరకూ నిజముందా అని ఆలోచించు. నీకే తెలుస్తుంది. నువ్వసలు ఏదీ ఆలోచించవు. ఆలోచనలకు కూడా ఇతరుల మీద ఆధారపడతావు. ఈ సంగతి ఏనాడో తెలుసుకున్నాను గనుక, వెయ్యి కళ్ళతో నిన్ను కనిపెడుతున్నాను. నీ బాగు కోసం ఎన్నో సలహాలిచ్చాను. ఆమాట కొస్తే, నరసుగాణ్ణి పెంపకానికి ఇవ్వాలని, దూరమాలోచించి నీకు నేను సలహా యివ్వలేదూ? పెంపకాని కివ్వటంలో తొందర పడ్డావని తరవాత అన్నాననుకో, అంటే, ముందు వెనుకలూ, మంచి చెడ్డలూ ఆలోచించే వాణ్ణి గనక, అదీ అన్నాను. ఇవ్వటమే మంచిదయిందని మళ్ళీ అంటున్నాను. ఎందుకంటున్నానో తరువాత చెప్తాను."

పంతులు ఆలోచించ సాగాడు. గురుతు చెప్పే ముక్కలలో నిజానికి ఒక్క పొల్లుముక్క కూడా పంతులుకి తట్టలేదు.

గురుతు, చుట్ట నుసి దులిసి, నోట్లో నమిలిన పొగాకు తుంచి, ఉమ్మేసి, ఒక్క పీల్పు పీల్చి మళ్ళీ ప్రారంభించాడు.

"నీకు ఆ రమణయ్య పెద్ద స్నేహితుడై కూర్చున్నాడు. వాడు నిన్నెక్కడ బుట్టలో వేస్తాడో అనే నా భయం. అట్లా జరక్కుండా ఉండాలనే, నరసుగాణ్ణి పెంపకానికి, ఆ రమణయ్యకే యిమ్మన్నాననుకో! నువ్వేదో అనుకుంటావు గానీ, ఆ రమణయ్య ఎంత అసాధ్యుడో నాకు తెలుసు. మనుషుల గుణాల్ని నేను ఇట్టే పట్టెయ్యగలను. అది నీ కింకా చాతకావడం లేదు. ఎప్పుడో నీకు నేనే నేర్పించాలిలే! అతనివన్నీ ప్లీడరు యెత్తులు. వృత్తి దోషంలే! ఇన్నాళ్లు అతని కింద ఉన్నావు– నీకు ఒక్క గుణం అబ్బలేదు. చెప్పాను కానా నువ్వు వుత్త వెర్రివాడివని! నీ అమాయకత్వం బాగా చూశాడు. నీచేత అరవచాకిరీ చేయించుకున్నాడు. కావలసినప్పుడు కానీ డబ్బు ముష్టి కింద పడేస్తే, నీనోరు కడుతున్నది. నీదగ్గర ఎంతో మంచిగా ఉన్నట్టే కనిపిస్తాడు. ఎందుకూ? నీ వల్ల పని జరుగుతున్నది గనక, చూడూ– ఒకటి మరిచిపోకు. స్వార్థం లేకుండా ఎవడూ ఏ పనీ చేయడనుకో.

నాకు మట్టుకు లేదా స్వార్థం? నీకేదో మంచి సలహాలు ఇచ్చి నిన్ను కాపాడుకొస్తూ ఉంటే, నా దినాలు కాస్త గట్టెక్కుతున్నాయి. అయితే, అంతా నాలాగా మంచితనం మూలంగా స్వార్థం గడుపుతారనుకోకు. రేపు నరసుగాడి విషయంలోనూ ఇదే జరుగుతుంది. నీ కన్నా వయసులో నేను కొద్దిగా చిన్నవాణ్ణే అయినా, ప్రపంచం ఎక్కువ చూశాను. మొదట్నుంచీ సంసార తాపత్రయంలో పడ్డావు గనుక. నీకా అవకాశం ఆటే లేకపోయింది.

ఈ ప్రసంగాన్ని తదేకంగా వింటున్న పంతులికి, గురుతు పడుతున్న బాధేమిటో స్ఫురించలేదు.

ఒకటి మట్టుకు పంతులికి తెలుసు. ఏదీ లేనిదే గురుతు ఇన్ని మాటలు చెప్పదని. గురుతు బాగా ఆలోచించి చెపుతున్న మాటలలో అబద్ధమెందుకుంటుందీ? రమణయ్య, తనమంచికోసం, ఈ విధంగా ఎన్నడయినా మాట్లాడాడా? ఇప్పుడు తెలుస్తున్నది తనకు. మనిషికీ మనిషికీ వున్న భేదమేమిటో!

"ఇంతకీ, నేను చెప్పాలనుకున్నది ఇంకా అలానేవుంది. ఆ రమణయ్య కొడుకు కాస్త పెరిగి పెద్దవాడవుతే, వాడి ఆస్థిలో నరసుకి చిల్లిగవ్వ దక్కనివ్వడు" అన్నాడు గురుతు. ఈ ముక్కతో పంతులుకి వున్న మతి కాస్తా పోయినట్లయింది.

"ఏమిటి నువ్వంటున్నది? రమణయ్య పెద్దమనిషి కాడా? నరసుని అన్యాయం చేస్తాడా?" అన్నాడు తను.

"ఇటువంటి పెద్దరికాలు చాలా చూశాం లెద్దూ! నేను యిప్పటిమాట చెప్పటం లేదు. పాతికేళ్ళ తరువాత ఏం జరగవచ్చునో చెపుతున్నాను. ఈ వ్యవహారం రమణయ్య దాకా రానక్కర్లేదు. వాడి కొడుకు పెద్దవాడయితే, నరసు పెంపకం బాపతు అని తెలియకుండా వుంటుందా? నరసుని ఇంట్లోంచి వెళ్లగొట్టడనే గ్యారంటీ ఎక్కడుంది?

"పోనిస్తూ, ఎప్పటి మాటోఇప్పుడెందుకూ?" అన్నాడు పంతులు కాస్త విసుగుతో.

"నాకు తెలుసు నీ కిటువంటివి రుచించవని. నాకేం కాసులు రాల్తాయా ఏమిటి? ఇప్పుడు ఇప్పటి మాట కూడా చెపుతాను విను. వాళ్ళకు సొంతంగా కొడుకు పుట్టాక, నరసుగాణ్ణి ఎందుకు ఆదరించాలీ? నిన్ను మట్టుకు ఎందుకు ఆదరించాలీ? నువ్వెవరు వాళ్ళకి? నాకు తోచించి నేను చెప్పాను. కొంపలంటుకుంటేనే గాని నోరు విప్పను కద! రేప్పొద్దున్న, ఆ పిల్లాడి జబ్బు కాస్తా నయమయ్యాక, నీ బదులు రమణయ్య మరో గుమాస్తాని పెట్టుకున్నా నే నాశ్చర్యపడను" అన్నాడు గురుతు.

పంతులు కాస్త జలదరించాడు.

"అదెట్లా సంభవం?" అన్నాడు.

గురుతు చిరునవ్వు నవ్వాడు.

"ఎందుకు కాకూడదూ? రమణయ్యకు కొడుకు పుట్టడంతో, నీ అవసరం సగానికి సగం తీరిపోలేదూ? ఉన్న లంపటాలు వొదిలించుకోడానికీ, మున్ముందు ఎటువంటివీ లేకుండా చేసుకోడానికీ ప్రయత్నించడా? ఏమిటట్లా తెల్లపోతావు?" అన్నాడు గురుతు.

పంతులు మాట్లాడలేదు. రమణయ్య తన్ను అప్పుడే పనిలోంచి తీసివేశాడని పించింది. పంతులుకి ముచ్చెమటలు పట్టసాగినై.

"ను వట్లా ఆలోచిస్తూ, శూన్యంలోకి చూస్తూ కూర్చొంటే లాభం లేదు. నీ కన్నీ నేనే చెప్పుకురావాలి. ఏం చెయ్యను? తీరుతుందా మరి? నువు గంగలో కొట్టుకుపోతూ ఉంటే చూస్తూ ఊరుకోవటం నా చేతకాదు." అన్నాడు గురుతు.

"ఏం చెయ్యమంటావు?" అన్నాడు తను.

"అదే చెప్పటానికి ప్రయత్నిస్తున్నాను. నేను చెప్పకుండా, చేయవలసిన మంచి పనేదో నీకే తడుతుంది చివరికి. ఈ ముక్కచెప్పు. నీ కొడుకుని ఏ ఉద్దేశంతో పెంపకాని కిచ్చావు? వాడు బాగుపడాలనేనా? శ్రీమంతుల ఇంట్లో నిక్షేపంగా బతలకాలనేనా? వాళ్ళ తదనంతరం వాళ్ళకున్నది యావత్తూ, వాడికి దక్కాలనేనా? వాడితోపాటు నువ్వు కూడా తలెత్తుకు తిరగాలనే కద? ఈ గర్భదరిద్రం నుంచి బయట పడాలనే కద? ఇదంతా నీ మంచికే కద? ఇంతలో పుట్టె మునిగేలాగ వాళ్ళు ఒక పిల్లవాణ్ణి కని కూచుంటారని నువు మట్టుకు కలకన్నావా? తీరా కన్న తర్వాత చేసే దేముంటుంది? నరసుగాడి మీద ప్రేమాభిమానాలు ఏమున్నా, ఇప్పుడవి ఆ పిల్లవాడి సొత్తే కద! నరసు పెద్దవాడైనాక, ఈ సంగతులు తెలీవా? తెలిస్తే బాధపడడా? పడతాడని ముందే నీకు చెబుతున్నాను జ్ఞాపకముంచుకో, అంతేకాదు. బతికున్ననాళ్లు నిన్ను అసహ్యించుకుంటాడు. నిన్ను శత్రువల్లే చూస్తాడు. ఇంకొకరి యింట్లో పనిచేసే కుర్రాడిగా తన్ను నువు అమ్మేసినట్టు భావించుకుంటాడు. నువు ఇంత దూరపాలోచన చెయ్యలేదు. నేను చేశాను" ఎందుకు? నీ మంచి ఆలోచించినవాడినై చేశాను. తప్పా?"

పంతులు మాట్లాడలేదు. గురుతు చెపుతున్న మాటలు, అతని చెవిలో గంటలు మ్రోగించటం ప్రారంభించినై.

"నాలోనూ కొంత స్వార్థముందని నీ కిదివరకే చెప్పాను. ఆ మాటకొస్తే స్వార్థం లేని వాడెవడూ లేడు. నువు వాణ్ణి పెంపకాని కివ్వటంలోనూ, వాళ్లు పెంపకానికి తీసుకోవటంలోనూ కూడా స్వార్థమే పని చేసింది. స్వార్థం లేనిది ప్రపంచమే లేదనుకో. ఇక నా మాటా? ఏదో నీ పంచ పట్టినవాణ్ని. నిన్ను కాపాడుకుంటూ, నిన్నే నమ్ముకున్న వాణ్ణి. నీ కొడుకు బాగుపడితే, నీతో పాటు, నీ కూతురుతో పాటు, నీ పెద్ద వాడితో పాటు, ఈ తతిమ్మా ముగ్గురు ఆడపిల్లలతో పాటు నేనూ బాగుపడ్డానన్న మాటే. అందుకు

నువు కాదంటావు గనకనా? ఈ ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు చేయాలనే దిగులు కూడా నీకుండదు. అంతా వాడే చేసుకుపోతాడు. అయితే ఇవన్నీ గాలిమేడలయినట్లు కనిపిస్తోంది కద? కేవలం నీ అమాయకత్వం మూలంగా ఇప్పుడు – ఇంతమందిమి – కేవలం నువు కళ్లు మూసుకోవడం మూలాన మట్టి కొట్టుకు పోవడానికి సిద్ధంగా ఉన్నాం.”

పంతలు కళ్లకు ఈ ప్రపంచమంతా అయోమయంగా కనిపించసాగింది. దరిద్రం, అందులో కొడుకూ, కూతుళ్ళూ తనూ తలోమార్గం పట్టి, ఇష్టమొచ్చినట్టు గంతులేస్తున్నట్టు కనిపించసాగింది.

“మాట్లాడవేం ఇంత చెప్పుకొస్తున్నా కూడానూ?” అంటూ హెచ్చరించాడు గురుతు.

“నరసుని తిరిగి మనం తెచ్చుకుంటే ఈ సమస్యలన్నీ పరిష్కారమవుతాయనేనా నువ్వనేది?” అన్నాడు తను.

గురుతు పక్కున పెద్దనవ్వు నవ్వాడు.

“నీ తెలివి పూర్తిగా తెల్లవారింది. వాణ్ణి అక్కడనుంచి తెచ్చుకొని ఏం చేద్దామనుకుంటున్నావో, నాకు బోధపడలేదు. నువు చేయవలసిన పని, వాణ్ణి అక్కడ శాశ్వతంగా ఉంచటమే” అన్నాడు గురుతు.

“ఉండకేమవుతాడూ? వాళ్ళు తరిమికొడతారా?” అన్నాడు తను.

“ఇన్నాళ్ళకి నీ జీవితంలో ఒక్క తెలివైన మాట, ఆలోచించిన మాట అన్నావు. అదే పదివేలు చేస్తుంది.” అన్నాడు గురుతు.

“అట్లా ఎన్నటికీ జరగదు. నరసంటే ప్రాణం పెడుతున్నది వాడి భార్య. అంత పని చేస్తుందనుకోవటం నీవెర్రి. ఇవేళ మరి నాకేమీ చెప్పకు – నీ పుణ్యముంటుంది” అన్నాడు తను.

గురుతు ఆ నాటికి మరేమీ చెప్పలేదు. మర్నాడు వచ్చి, మళ్ళీ ఇదే ప్రసంగం ఎత్తటానికి పూర్వం – కడచిన ఇరవై నాల్గు గంటలలోనూ, పంతులు మనసు అనేక సార్లు భూప్రదక్షిణం చేసి వచ్చింది. ఆమనసులో, తనకు తెలీకుండానే, ఎన్నో ఆలోచనలూ, ఎన్నో భయాలూ బయల్దే రినై. ఆ మనసు, చక్కని మార్గాలలోనే కాక, సందుగొందులు దూరి, నానా కశ్మలాన్నీ కూడా గట్టి, తిరిగొచ్చింది.

గురుతు రాగానే తను –

“నిన్న నువు నా మనసుని కెలికిపోయినావు. రాత్రి నాకు నిద్ర కూడా రాలేదు” అన్నాడు.

“ఇన్నాళ్ళూ నువు నిద్రపోతున్నావని వేరే చెప్పనక్కర్లేదు. ప్లీడరు గుమాస్తావి అయివుండి, తెల్లవారిలేస్తే వెయ్యి కేసులు తెలుసుకుంటూ వుండేవాడివి, నీకీ మాత్రం మెళుకువలు

పట్టుపడలేదంటే నమ్మశక్యం కాకుండా వుంది. మరొకడవుతే అసలు నమ్మడు. నెల్లాళ్ళ క్రిందట, ఈ పక్కవీధిలోనే ఒక ఇంట్లో పదేళ్ళ పిల్ల రాత్రి నూతిలో పడి చచ్చింది. జ్ఞాపకముందా?"అన్నాడు గురుతు.

"ఊఁ–" అన్నాడు తను. ఆ పిల్లా తన మూడోకూతురూ ఒకే యీడువాళ్ళు. తనకూతుళ్ళతో ఆ పిల్ల అప్పుడప్పుడు తిరుగుతూ వుండటం జ్ఞాపకముంది పంతులికి.

"ఆ కేసు గురించి ఆరా తీశావ్లే!"

"ఆరా తీయటాని కేముంది? ఆ పిల్ల నీళ్ళకు వెళ్ళి, కాలు జారి పడిందటా– దిగుడుబావి లాంటిది కూడాను!" అన్నాడు తను.

గురుతు నవ్వాడు.

"ఏం కాదు. అంతా కల్పన. సవిత్తల్లి వయసులో వుంది. తండ్రి ముసలాడు. రెండోపెళ్ళి. ఆ పిల్లకు ఇంట్లో ప్రైవేటు మేష్టర్ని పెట్టి చదువు చెప్పిస్తూ వుండేవాడు. వాడికీ ఇంటావిడకీ బేరం కుదిరింది. ఒకనాడేమో ఆ పిల్ల బయటి కెక్కడికో వెళ్ళి వచ్చిందిట. పిన్నీ, మేష్టరూ గదిలో తలుపు వేసుకున్నారని కనిపెట్టేసింది. రాత్రి తండ్రితో చెప్పి వుంటుంది. ఆముసలాడు పెళ్ళాం మక్కెలు విరగదన్నాడు. ఆ తర్వాత రెండు రోజులకే, ఆ పిల్ల, కాలు జారి నూతిలో పడిందన్నారు. ఇప్పుడా మేష్టరు ఆవిడకే చదువు చెప్తున్నాడు" అన్నాడు గురుతు.

"ఆ పని ఆవిడే చేసిందంటావా?" అన్నాడు తను.

"ఆ ముక్క తెలుస్తూనే ఉందిగా! కాని ఆ ముసలాడేదో కుమ్మక్కు చేశాడు. తన పీకలమీద కొస్తుందని! దానితో అంతా అణిగిపోయింది. ఎదుకు చెప్పొచ్చానంటే, మంచీ, చెడ్డా అంటూ తిష్ఠ వేసుక్కూచుంటే, ఈ ప్రపంచంలో సాధించేదేదీ లేదు. ఏది మంచిదనుకొని, ఏమంచి తనాన్ని నువు పట్టుకుని పాకులాడతావో, అదే నీ కొంప తీస్తుంది. అంతా మంచివాళ్ళను కుంటావు ఎందుకూ? నువు మంచివాడివి గనక. అంతా అమాయకులను కుంటావు, నువు అమాయకుడివి కనక. అక్కడే పప్పులో కాలు వేసేవన్నమాట. నా యేడుపేమిటంటే, నువ్వనుకుంటున్నంత మంచివాళ్ళు, కనీసం నీ అంత మంచివాడు, మరొకడు లేడని!"

"నువ్వింతకీ చెప్పొచ్చేదేమిటి? నిన్నట్నుంచీ వేదాంతంతో చంపుతున్నావు!" అన్నాడు తను.

"నేను వేదాంతం చెప్పటం లేదు. ఉన్న నిజం చెపుతున్నాను. మన ఇద్దరికీ సంబంధించిన వ్యవహారంలో ఒక పని నాకు మంచిగా తోస్తుంది. అంటే, నా మేలు కోసం, నా బతుకు కోసం, నా సుఖం కోసం అది నాకు చాలా మంచిపని. కాని, అది

నీకు సరిపడదు. ఎంచేతా? దాని వల్ల నీకుకొంత నష్టం ఉండొచ్చు గనక. ప్రపంచంలో కేవలం మంచిగానీ, కేవలం చెడుగానీ లేదు. రెండూ సమపాళంలోనే వున్నాయి. ఉండక తీరదు. ఒకదాని కొకటి తోడు నీడలు. లాభనష్టాలూ అంతే. ఎంత లాభానికంత నష్టం, ఎంత చెట్టు కంత గాలి అన్నట్టు. పాముంది. అది నిన్ను చూడగానే కాటేస్తుంది. దాని ప్రాణం నువెక్కడ తీస్తావో అని దాని భయం. నిన్ను అదెక్కడ కాటు వేస్తుందో అన్న భయం వల్ల, నువు దాన్ని హతమారుస్తావు. అక్కడే వుంది అసలీ సృష్టి వైచిత్ర్యం యావత్తూనూ" అన్నాడు గురుతు.

"నాకు పాఠం చెప్తున్నావా యేమిటి నువు?" అన్నాడు చిరాకుతో.

"అవసరమొచ్చినపుడు అదీ చేయాలి మరి! తప్పుతుందా? ఇప్పుడొక పాము నిన్ను కాటెయ్యటానికి సిద్ధంగా వుంది. దాన్ని హతమార్చే పని నీచేతిలో వుందంటావా, లేదంటావా? నే నన్నింటికీ తెగించినవాణ్ణి, నీకు కోపమొచ్చి నా ముఖంమీద ఉమ్మేసినా ఉమ్మెయి. కాదనను. కాని నువు పిల్లలు గలవాడివి. నీ కూతుళ్ళ పెళ్ళిళ్ళు నరసు మీద ఆధారపడి ఉన్నాయి" అన్నాడు గురుతు.

పంతులు ఉమ్మెయ్యలేదు. చలించలేదు. మాట్లాడనేలేదు.

"అన్నట్టు – డాక్టరు రమాపతి దగ్గర్నుంచి నువ్వే మందు తెచ్చిపెడుతున్నట్టున్నావు!" అన్నాడు గురుతు చప్పున జ్ఞాపకం వచ్చినట్టు.

పంతులు సమాధానమివ్వలేదు. కొయ్యమాదిరిగా, తదేకంగా గోడవేపు చూస్తూ కూర్చుని పోయినాడు. పంతులికి మతి పూర్తిగా చలించి ఉండాలి.

❄ ❄ ❄ ❄

మంచం మీద ఏడాది పసికందు శరీరం జ్వరంతో కాగిపోతున్నప్పుడు, రమణయ్య భార్య ముఖంలో దిగులు చూసినా, పంతులు ఆలోచనలు తగ్గలేదు. నరసు, ఆవిడను సమీపించి, "అమ్మా! తమ్ముడికి జ్వరంపోతే, వాడికోసం చిన్న తోపుడుబండీ కొనవుటే?" అంటున్న మాటలు పంతులుకి వినపడలేదు.

"వాడికీవేళంతా జ్వరం తగ్గలేదోయ్! డాక్టరొస్తానన్నాడులే అవసరముంటే. నిమోనియా అని అనుమానిస్తున్నాడు. ఎందుకేనా మంచిది – ఒకసారి వెళ్ళొస్తావేమిటి?" అన్నాడు రమణయ్య పంతుల్ని సమీపించి.

"ఆఁ – ఎందుకూ?...... డాక్టరా?" అన్నాడు పంతులు.

"ఏమిటో పరధ్యానంగా వున్నావు, నాకులేని బెంగ నీకు పట్టిందా యేమిటి?" అన్నాడు రమణయ్య పంతులు భుజం తట్టి.

"అబ్బే – ఏం లేదు.. వెళ్తాను.... ఎన్నటికి కాదు." అన్నాడు పంతులు ఇంకా పరధ్యానంగానే.

"ఏమిటి ఎన్నటికీ కాదు?" అన్నాడు రమణయ్య. ఏదీ అర్థం కాక. పంతులు ఇప్పటికి తేరుకున్నాడు.

"ఏం లేదులే. నాకు నరసొకటీ వాడొకటీనా – ఎన్నటికీ కాదంటున్నాను. సీసా పడెయ్యి, పోతాను."

"రేప్పొద్దున వెడుదూగాని లెద్దూ. ఈ నిశిరాత్రప్పు డేం వెళతావు. పైగా వర్షం కూడాను. పిల్లాడి కిప్పుడే నిద్రపట్టినట్టుందిలే" అన్నాడు రమణయ్య.

"ఏం భయం లేదు. ఒకసారి డాక్టరుతో చెపితే ఎందుకేనా మంచిది. మందు మారుస్తాడేమో. గొడుగుంటే ఇవ్వు" అంటూ లేచాడు పంతులు.

రాత్రి ఒంటిగంటప్పుడు, చేత గొడుగూ, మందు సీసా పట్టుకొని ఆ వర్షంలోనే బయల్దేరాడు పంతులు, రమాపతి దగ్గరకి.

❄ ❄ ❄ ❄

"నాకేమిటో అర్థం కాకుండా వుంది. ఏదీ అర్థం కాలేదు. నాకు నేనే అర్థం కాను....!" అనుకోసాగాడు పంతులు. ముసురు పోయి పెద్ద చినుకులు పడుతున్నాయి. గొడుగుమీద చినుకుల శబ్దం ఎక్కువయింది.

తొలిరోజున గురుతు చెప్పింది యథార్థమే అవుతుందా? ఏమో! ఎవడు చూశాడు! ఎవడికి తెలుస్తుంది మనసు లెట్లా మారతాయో! గురుతు ఎంతకేనా తెలివైనవాడు. వాడి పాటి ఆలోచనాశక్తి తనకులేదు. తీరా వాడు చెప్పాక ఆలోచించడం ప్రారంభిస్తే అంతా నిజంలాగానే తోస్తున్నది – పాడు!

నిజమే – ఎవడిసుఖం వాడు చూసుకోవాలిమరి. తన సుఖం కోసం, నరసుకోసం, వాడిభవిష్యత్తు కోసం తను చేసేపని తనకు మంచిగాతోస్తే, ఇతరులకది చెడుకావచ్చు. అవుతేనేం? ఇతరులూ అదే చేస్తున్నారు గురుతు చెప్పినట్టు! ఈ సంఘంలో అందరూ అదే సూత్రం అనుసరిస్తున్నారు. ఎంతెంత మంది ఎన్నెన్ని పనులు చేయటం లేదు? ఏదో ఒకటి చేయాలి. చేస్తేనే నోటికి ముద్ద, ఎవ డేం చేసినా చివరి లక్ష్యం ఒకటే– తిండి కోసం! ఏదీ చేయని వాడినే దరిద్రం వరిస్తుంది. ఏదో చెయ్యాలి. ఎందుకు చెయ్యకూడదూ? నరసుకోసం, వాడి సుఖంకోసం చేయాలి. ఇంతలో పోయిందేముంది?

పంతులికి వెర్రెత్తినట్లయింది. తల చిటపట లాడడం ప్రారంభించింది.

ఆ గొడవలో రమాపతి ఏదో ప్రశ్నించాడు. చిరాకుపడ్డాడు. ఇంత వర్షంలో అర్థరాత్రి రాకుంటే ఏం మునిగింది? అన్నాడు. పంతులు సమాధానాలు ఇవ్వలేదు.పిల్లవాడు నిద్రపోతే

లేపవద్దనీ, నిద్రలేస్తే ఇవ్వమనీ ఏదో మందిచ్చాడు. పంతులు అది పుచ్చుకొని బయటపడ్డాడు.

రొజ్జగాలి రివ్వుమంటున్నది. పంతులు నుదుటిమీద చెమట బొట్టు కట్టడం ప్రారంభించింది. వర్షం ఎక్కువయింది. పంతులు ఇప్పుడు ఆలోచనలు చేయటం లేదు. అతని తల ఖాళీగా వున్నట్టు తోచింది. గుండె తీవ్రంగా కొట్టుకుంటున్నది. పంతులు ఒక అరుగెక్కి కాసేపు నిలబడ్డాడు. గొడుగు ఝాడించాడు. వర్షం తగ్గినట్టు వుంది. మళ్ళీ ఆ చీకట్లో పడ్డాడు. గబగబా నడవడం ప్రారంభించాడు. ఆ చీకట్లోనే మెట్లు అడ్డొచ్చాయి. కాసేపు ఆగాడు. మెట్లెక్కాడు. వెంటనే దిగిపోయాడు. తల వేడెక్కిపోయింది. మళ్ళీ మెట్లెక్కాడు. తలుపు కొట్టాడు.

గురుతు వచ్చి తలుపు తీశాడు.

❄ ❄ ❄ ❄

తలుపు తీసిన రమణయ్య తడిసి ముద్దకట్టిన పంతులిని చూసి కంగారు పడ్డాడు.

"పద పద. నీ క్కాస్తొ ఏ జ్వరమో వచ్చేట్టుంది చూస్తే, ఆ బట్టలు మార్చు ముందు. ఇంద నా పంచె. నేరక పంపాను నిన్ను" అంటూ, రమణయ్య, పంతుల్ని లోనికి తీసుకుపోయినాడు. పంతులు వొణుకుతున్నాడు.

"రమాపతి తెల్లారేసరికి వస్తానన్నాడు. పిల్లవాడు నిద్రలేస్తే ఈ మందు ఒక మోతాదు పట్టమన్నాడు" అన్నాడు పంతులు. మందుసీసా ఇస్తున్నప్పుడు అతని చేతులు వణికినై, ఆ కంగారులో సీసా కింద పడబోయింది.

"నువు వణికిపోతున్నావు. కాస్తలో అది జారిపడేది. బట్టలు మార్చుకో" అన్నాడు రమణయ్య,.

"ఫరవాలేదులెద్దూ! నేను ఇంటికి పోతాను. తెల్లారేసరికి వస్తానులే" అన్నాడు పంతులు.

"ఇప్పు డింటికేంపోతావు?"

"ఆడపిల్ల లొక్కళ్ళే వున్నారు. పెద్దవాడు రాత్రి ఇంటికొచ్చాడో లేదో, పోతాను" అంటూ పంతులు గుమ్మం దిగాడు. అతనికి ముచ్చెమటలు పోస్తున్నై ఒకవైపు వొణికిపోతున్నప్పటికీ, తను చేస్తున్నదేమిటో తనకే తెలీదనిపిస్తున్నది.

పంతులు ఇంటికి పోలేదు. ఆ జడివానలో తడుస్తూనే, చీకట్లో, గోడపక్కనే కటిక బురదలో చతికిల పడ్డాడు. అతని కాళ్ళలో శక్తి పోయిందనిపించింది. అంతా నిశ్శబ్దంగా ఉన్నట్టుంది. జడివాన శబ్దం కూడా పంతులుకి వినపడటం లేదు.

ఎక్కడో గంటలు మ్రోగినై. పంతులు గుండెలలో గంటలు మ్రోగినై. నాలుగు గంటలు వినపడ్డయి. పంతులు గుండెలో వేయి గంటలు వినపడ్డాయి. మరి గంటలు మ్రోతలేదు.

పంతులు గుండె కూడా గంటలు కొట్టలేదు. గుండె మీద చేయివేసుకుని చూసుకున్నాడు పంతులు. దడదడమంటున్నది గుండె; పిరికిగుండె! పిల్లవాడు లేచివుంటాడు. మందు కాస్తా పడుతుంది – రమణయ్య భార్య! అమాయకురాలు! వెంటనే పోయి, ఆ మందు పట్టవద్దని వారిస్తే? ఎట్లా?

పిల్లవాడు లేచినట్టయింది. పంతులు లేచి నిలబడ్డాడు. ఒకసారి గుమ్మమెక్కాడు మళ్ళీ దిగిపోయినాడు.

పంతులు కెక్కడో ఒక కేక వినపడ్డది. ఉలిక్కిపడ్డాడు.

గదిలోంచి మరో కేక వినపడ్డది.

రమణయ్య భార్య!

నరసు లేచినట్టయింది. వారి ఏడుపు వినపడుతున్నది. రమణయ్య ఏమైనాడో!

పంతులు ఒక్కపెట్టున – నిలుచున్నపాటున పరుగెత్తాడు.

"నరసు! నరసు! నరసు కింక దిగులులేదు. వాడు బతికిపోతాడు!" అన్నమాటలు మట్టుకు పంతులు చెవిలో ప్రతిధ్వనించినై.

పంతులు ఎక్కడికి పరుగెత్తుతున్నదీ, ఆ చీకట్లో, వర్షంలో ఎటుపోతున్నదీ అతనికే తెలీదు.

# జమదగ్ని



**క**వి, కథారచయిత, వ్యాసకర్త, వివిధ పరిస్థితులు, వయోభేదాలు, అంతస్థుల తేడాలు, సంస్కారంలోని హెచ్చుతగ్గులు ఉత్పన్నం చేసే సమస్యలనీ, పిన్నల మనస్తత్వాలనీ, మనోభీష్టాలనీ ఆకళింపు చేసుకొని జమదగ్నిగారు మనోజ్ఞమైన కథ లనేకం వ్రాశారు. వీరి కథలు చదువుతున్నప్పడు తెలుగుదేశంలో తెలుగు ప్రజల మధ్య సంచరిస్తూ, మనకి తెలిసిన వ్యక్తుల్ని గురించి మరికొన్ని కొత్త విషయాలు తెలుసుకొంటున్నట్టుగా అనుభూతి పొందుతాము. క్రమశిక్షణతో జవసత్వాలతో చకచక సాగిపోయే వాక్యాలతో వీరి శైలి ముచ్చట గొల్పుతుంది.

**రచనలు :** చిలకా - గోరింకా, మరపురాని ఆ వూరు, ప్రతిఫలం, గొల్ల హంపన్న, అన్న దమ్ములు (కథల సంపుటాలు)

# బళ్లోకి వెళ్లాలి

ఆ పూట గోపాలం మనసు మనసులో లేదు.

ఉదయాన లేస్తూనే తండ్రి చెప్పిన విషయం అతని గుండెల్లో అలా రాయపడవేసింది.

"ఒరే గోపీ! రేషను గింజలు తేవాలిరా" అంటున్నది తల్లి.

"ఇవాళ నా దగ్గర పైకం లేదు. రేపు చూద్దాం" అంటున్నాడు తండ్రి.

అయితే ఏమిటి గతి? ఇదే ప్రశ్న అందరినీ కలవరపరచింది. అప్పు గూడా పుట్టే దిక్కు లేదనుకుంటున్నది తల్లి. ఇవాళకు యెలా గడిచినా, యికముందు నుంచైనా ఈ బాధ తప్పుతుంది గదా అని కొడుకు మీద ఆశ పెట్టుకుంటున్నాడు తండ్రి. తండ్రి చెప్పినట్లు చెయ్యక తప్పదనిపిస్తోంది గోపాలానికి.

వాకిట్లో బక్కచిక్కిన గుఱ్ఱం ఆకలిబాధ సూచిస్తూ కాబోలు సకిలించింది.

తండ్రి చిరిగిన చొక్కా తొడుక్కొని వెళ్ళిపోతున్నాడు.

వీధిమూలనుంచి పంతులవారు బళ్లోకి వచ్చినట్లు ప్రార్థన పద్యం తెలియజేస్తోంది.

తా నక్కడ లేకపోయినా గోపాలం మనసులో పద్యం చదువుకున్నాడు. అప్పుడే పంతులుగారు నిన్నటి పాఠాలు అప్పజెప్పుకుంటున్నారు. అందరూ తప్పుచెపుతున్నారు. తానుంటే సరిగా చెప్పేవాడు. అతని నోరు పాఠం అప్పజెప్పేస్తోంది.

"అక్కఱకు రాని చుట్టము,
మ్రొక్కిన వర మీని వేల్పు, మోహరమున దా
నెక్కిన బాఱని గుఱ్ఱము,"
గ్రక్కున విడువంగవలయు గదరా సుమతీ!"

అత నింకా పద్యం పూర్తి చెయ్యనేలేదు. ఈ మూలనుంచి గొల్లుమని ఏడుపు వినవచ్చింది. ఏమటా అని గోపాలం బయటికి వచ్చాడు. మిద్దెయింటి షాహుకారు భార్య

వాళ్ళ బుచ్చి రామవేణుగోపాల కృష్ణయ్యను బళ్లోకి పంపిస్తోంది. అతగాడు “నేనుపోనే” అని అరుస్తున్నాడు కన్నీళ్ళతో బట్టలు తడుపుకుంటూ.

❊ ❊ ❊ ❊

స్టేషను దగ్గఱ బళ్లసాండులో బండి దగ్గఱ నిలబడి వున్నాడు తండ్రి గోపాలం వెళ్ళేప్పటికి.

అప్పుడే రైలు వచ్చినట్లుంది. జనం గుంపులు గుంపులుగా దిగుతున్నారు. గోపాలం ఇంకా తండ్రిని సమీపించనేలేదు. కాని తండ్రి ముఖం చూడలేకపోయాడు గోపాలం. అంతవరకూ బాడుగ దొరకలేదు కాబోలు, డీలాపడిఉన్నాడు తండ్రి.

ఎవరోగాని ముగ్గురు పెద్దలు ఆరు పెట్టెలు స్వయంగా మోసుకొని వచ్చి “బండి కడ్తావా?” అన్నారు.

“ఆ! బాబా!”

“కొత్తపేట కేం ఇవ్వమంటావ్?”

“తమ చిత్తం బాబయ్యా!”

“మూడణాలు ఇస్తాం”

“ఆరు మైళ్ళుంది. గడ్డురోజులు. తమ దయ”

“నీ ఇష్టమైతేనే కట్టు!

మారుమాట అనకుండా సామాను సద్ది “ఎక్కండి బాబయ్య!” అన్నాడు తండ్రి గుఱ్ఱాన్ని చూస్తున్న గోపాలం కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

అంతలో తండ్రిని సమీపించి “బాబా!” అన్నాడు గోపాలం.

“వచ్చావ్! గోపీ! రా! ఎక్కు! ఈ బాడుగ దింపి పోదాం”

“ నే నడిచే వస్తాను” అంటున్న గోపాలం మాటలు వినిపించుకోకుండానే బండిలో ఒక ఆసామి “ఇంకా ఎంతమందిని ఎక్కిస్తావు? అసలే చచ్చుగుఱ్ఱం! పోనీ!” అన్నాడు.

లాగలేక లాగలేక గుఱ్ఱం లాగుతోంది.

చూడలేం చూడలేక గోపాలం చూస్తున్నాడు.

“నే నిప్పుడే వీరిని దింపివస్తాను. నువ్వు ఇక్కడే వుండు” అన్న తండ్రి మాటలు గోపాలానికి వినపడనేలేదు. గోపాలం అల్లా నడుస్తూనే వున్నాడు.

❊ ❊ ❊ ❊

అప్పటికి తొమ్మిది గంట లైందేమో! ఎండ ఎక్కే పొద్దు. ఇంట్లో గింజలు లేక తల్లి గంజికూడా కాచి ఇవ్వలేదు. ప్రాణం శోష వస్తోంది. గోపాలం ఇక నడవలేకపోయాడు. దారి ప్రక్కన ఒక చెట్టు ఉంటే దానిక్రింద చతికిలబడ్డాడు.

ఎండలో నుండి నీడలోకి కొత్తగా రావడంలో అతనికి కాసేపు ఏమీ కనిపించలేదు. ఆ పసిమనస్సుకు భవిష్యత్ వూహలు ఏమీ లేవు కాని అదీ అల్లా అయోమయం గానే ఉన్నది.

కూర్చుని కూర్చుని విసిగెత్తి గోపాలం నడుం వాల్చాడు. కన్ను మూశాడు. వివశమైన శరీరానికి నిద్ర వచ్చింది.

గోపాలం పాఠాలన్నీ గడగడా అప్పజెప్పాడు. చురుకుగా లెక్కలు చేశాడు. బళ్లో మాస్టారు గోపాలంతో అన్నారు : "అబ్బాయి! నీకు బాగా చదువు వస్తుంది. నువ్వు పెద్ద బళ్లో చేరి చదువుకో!" గోపాలానికి పట్టరాని సంతోషం అయింది. నాన్నను అడుగుదామని పరుగెత్తుకు ఇంటికి వెళ్ళాడు. వాకిట్లోనుంచే "నాన్నా!" అని కేకవేశాడు.

గోపాలానికి మెలకువ వచ్చింది. అతడు కూర్చునే "నాన్నా!" అంటున్నాడు.

ఎదురుగా బండి ఆగింది. గోపాలం తండ్రి కొడుకుని చూచి ఆశ్చర్యపడ్డాడు. అతని తండ్రి ప్రేవు జవజవలాడింది. తిండి లేక కన్నకొడుకు కూర్చుని నిద్రపోతూ సంధిమాటలు అంటున్నాడు.

"గోపీ!" అన్నాడు తండ్రి.

"నాన్నా!" అన్నాడు గోపాలం.

"ఇక్కడ కూర్చున్నావేం? ఇందాకా ఎందుకు వచ్చావ్! రా పోదాం, అయ్యగారి దగ్గరకు" అన్నాడు తండ్రి.

గోపాలం లేచి బండి ఎక్కాడు.

బండి పెద్ద బజారు దాటింది. అప్పుడు పదిన్నర కావస్తోంది.

"ఎక్కడికి నాన్నా,మనం వెళ్లేది?" అన్నాడు గోపాలం.

"ఇక్కడికే!" అంటూ బండి ఆపాడు.

బండిలోనుంచే గోపాలం నాలుగు ప్రక్కలా చూచాడు. అదే పెద్దబడి. అతనికి ఆశ్చర్యం వేసింది. బళ్లో పంతులుగారు తనతో నిద్రలో అన్న మాటలు జ్ఞాపకం వచ్చాయి.

"నాన్న ఎంత మంచివాడు!" అనుకున్నాడు గోపాలం.

గంజి తాగని నిస్సత్తువ అతని కప్పుడేమీ తెలియలేదు.

హెడ్మాష్టరు గది గుమ్మం దగ్గర కొడుకుతో నుంచొని ఉన్నాడు తండ్రి.

ఒకసారి బడి అంతా చూచి అప్పుడే హెడ్మాష్టరు వస్తున్నాడు.

ఆయన తలపాగ, కోటు, ఠీవి చూచి ఎంత గొప్పవాడో అనుకున్నాడు గోపాలం. అతనికి బళ్లో చేర్పించడానికే తండ్రి తన్ను అక్కడకు తీసుకువచ్చాడన్న ఊహ పాతుకుపోయింది. ముఖం కళకళ లాడిపోతోంది.

"వీడేరా మీ అబ్బాయి!" అన్నాడు హెడ్మాష్టరు అతని ముఖంలో తెలివి తేటలు గమనిస్తూ.

"చిత్తం బాబయ్యా! తమ దయ"

"సరే! ఇవ్వాళిటి నుంచే చేరమను"

అయ్యగారికి దణ్ణం పెట్టమని తండ్రి సైగ చేశాడు. గోపాలం పెట్టాడు.

హెడ్మాష్టరు గదిలోకి వెళ్ళిపోయాడు.

"నువ్వు ఇక్కడే ఉండు. వారేం పని చెప్తే అది చెయ్యి. ఒంటి గంటకు బడి విడిచిపెడ్తారు. అప్పుడు వణ్ణానికిరా! జాగ్రత్తగా మసులుకో!" అని తండ్రి హెచ్చరించి వెళ్లిపోయాడు.

గోపాలానికి అంతా అయోమయంగా ఉంది. అక్కడే నిలబడి వున్నాడు. ఏం చెయ్యాలో తెలియక.

గదుల్లో పిల్లలకు మాష్టర్లు పళ్లు కొరుకుతూ పాఠాలు చెప్తున్నారు.

## 2

గోపాలం రోజూ హెడ్మాష్టరు ఇంటి దగ్గరే పడుకుంటాడు. రాత్రి పదిగంటలకు. ఉదయాన లేచింది మొదలు నీళ్లు తోడడం, గుడ్డలు తకడం, బజారుకు పోయి సరుకులు తేవడం, ఇంటికి పోయి గంజితాగి మళ్లీ అయ్యగారింటికి అరగంటలో రావడం – ఇవన్నీ అతనికి నిత్యకృత్యాలయి పోయాయి. పదమూడేళ్లు నిండని అతనికి ఈ పని చాలా భారమే అయినా ఒకే ఒక ఆశతో ఈ రెండు నెలలబట్టీ చెయ్యగలుగుతున్నాడు గోపాలం.

ఇంత కష్టాన్నీ అతని కర్తవ్యంలో ఒక్కపని వల్ల మాత్రం అతడు మరచి పోగలిగేవాడు. అది గంటలు కొట్టడం.

తొమ్మిదిమ్ముప్పావుకు మొదటి గంట కొట్టేవాడు. ఆ గంట మోగుతున్నంతసేపూ అయ్యగారి ఇంటి పనిభారంలో అణగిపోయిన తనలోని ఏశక్తో నిద్ర మేలుకుంటున్నట్లు ఉత్సాహం పొందేవాడు గోపాలం. కాసేపు ఉంటే వందల కొద్దీ తన యీడు కుఱ్ఱవాళ్లు, తనకంటే చిన్నవాళ్లూ పెద్దవాళ్ళూ గూడా చదువు కోవడానికి వస్తారు. తాను మూడో గంట కొట్టందే ఏ పంతులూ పాఠం చెప్పడానికి వెళ్లడు. ఇంతమంది కుఱ్ఱవాళ్లను చదువుకోనిస్తున్నది తానే! తనకు గూడా చదువుకునేందుకు అవకాశం ఉంటే....

అంతలో హెడ్మాష్టరు రానే వచ్చేవాడు. తాళం చెవి ఇచ్చి తలుపులు తీసి ఊడవ మనేవాడు. కూజాలో నీళ్లు పట్టుకురమ్మనే వాడు. ఏవేవో కాయితాలు ఇచ్చి అన్ని గదులకూ

పోయి మాస్టర్లకు చూపించి రమ్మనేవాడు. ఒకగదిలో లెక్కలు వినపడేవి! మఱొక గదిలో పద్యాలు వినపడేవి! ఇంకొక గదిలో ఎవరో పంతులు కథలు చెప్తూతూ ఉండేవాడు. గోపాలం ఒక్కొక్కచోట అవి వింటూ అట్లాగే ఉండిపోయేవాడు. రావడం ఆలస్యమయి పోయేది. హెడ్మాష్టరు "వెధవా! షికార్లు కొడుతున్నావా? ఇంతసేపేమిటి? డొక్క చీరేస్తాను" అనేవాడు. గోపాలం కళ్ల నీళ్లు పెట్టుకొనేవాడు.

"ఏడుపుగొట్టు వెధవా! అవతలికిపోయి ఏడు" అనేవాడు హెడ్మాష్టరు.

ఇంటి దగ్గర తల్లీ, తండ్రీ మాత్రం కొంత సంతోషపడేవారు. గోపాలాన్ని మెచ్చుకునేవారు ఇరుగు పొరుగు వారితో చెప్పుకుని. చిన్నవాడైనా బుద్ధిగా పని చేస్తూ ఉండబట్టి తమకు అన్నానికి యిబ్బంది తప్పిందని. రోజూ రెండుమాట్లు ఇంటికి అన్నానికి వెళ్ళే ఆ అరఘడియ కాలంలోనూ అప్పుడప్పుడు ఈ ముక్కలు అతని చెవిని గూడా పడేవి. ఆ మాటా నిజమే! ఇప్పుడు తాను గూడా తిండి సుఖం అనుభవిస్తున్నాడు. ఉద్యోగం చేస్తున్నాడని తల్లి కష్టపడి చేత్తో కుట్టిన మంచి చొక్కాలు రెండు ఏరోజు కారోజు ఉతికి యిచ్చేది. తమకు ఉన్నా లేకపోయినా వండిన భాగం ముందు తనకే పెట్టేవాళ్ళు తల్లీ తండ్రీని.

గోపాలానికి ఏడవాలో, సంతోషించాలో ఏమీ తెలిసేది కాదు.

❈ ❈ ❈ ❈

ఆ రోజు ఆదివారం బడిలేదు. కాని గోపాలానికి సెలవు లేదు. అతని కారోజేపని ఎక్కువ.

మామూలు ప్రకారం అన్ని పనులూ చేసి గోపాలం వసారాలో కూర్చుని ఉన్నాడు. అలసిన శరీరంతో గుంజకానుకొని కునికిపాట్లు పడుతున్నాడు.

అయ్యగారు అప్పుడే భోజనం చేసి త్రేనుస్తూ వసారాలోకి వచ్చారు. పడకకుర్చీ పిలుస్తున్నా వినిపించుకోకుండా గోపాలాన్ని కేకలు వేశారు.

గోపాలం ఉలిక్కిపడి లేచి నిలబడ్డాడు.

"ఏం పని లేక కొట్టుకుంటున్నట్లున్నావే! అమ్మగారిని అడిగి డబ్బులు తీసుకుపోయి తమలపాకులు పట్టుకురా!" అన్నారు.

గోపాలం తలవంచుకొని వెళ్ళిపోయాడు.

అతను తిరిగి వచ్చేటప్పటికి అయ్యగారు ఆరేళ్ళ చిన్న అయ్యగారిని పొట్టమీద కూర్చో బెట్టుకొని పద్యాలు చెప్తూతున్నారు.

గోపాలం మరచిపోలేదు చదువుకున్న చదువు. ఆ పద్యాలు చెవిని పడటం తోటే, ఎండలో బజారుకు వెళ్ళివచ్చిన కష్టం అంతా మరచిపోయి, మనసులో అనుకుంటూ లోపలికి వెళ్ళి అమ్మగారికి ఆకులు యిచ్చి, బయట వసారాలో గుంజ కానుకుని నుంచున్నాడు.

అయ్యగారు తాంబూలం వేసుకుంటున్నారు. చిన్నయ్య గారు పద్యాలు అప్పజెప్తుతున్నారు. అమ్మగారు పక్కనే నుంచుని కొడుకు తెలివితేటలకు సంతోషిస్తున్నారు.

చాలా చక్కని సమయం. గోపాలానికి ఆగబుద్ధి వేయలేదు. అడుగుదామన్న ఆతురత హెచ్చిపోయింది.

"బాబూ!" అన్నాడు మెల్లగా.

"వెళ్ళి భోం చేసి త్వరగారా" అన్నారు అయ్యగారు విసుక్కుంటూ.

గోపాలం కదల్లేదు. అట్లాగే చేతులు నలుపుకుంటూ నిలబడ్డాడు.

అయ్యగారు చిన్నయ్యగారితో ఆడుకుంటున్నారు.

గోపాలం మళ్ళీ "బాబూ!"అన్నాడు.

"వెళ్ళమన్నాను గదరా!"

"అదిగాదు బాబూ! ఒక్క మనవి."

"మీ అయ్య అడిగిందేనా? తర్వాత చూద్దాంలే." అయ్యగారు ఉత్సాహంతో ఉండబట్టి ఆ మాత్రం మంచి మాటైనా వచ్చింది. మొదట్లో అడిగినప్పుడు "ఇక్కడ నీ కోసం కొట్టు పెట్టామా?" అని చీవాట్లు పెట్టారు. తొడిగిన పాత గుడ్డ ఇవ్వడానికి. ఇవాళ ఈ మాత్రం సుముఖంగా ఉన్నారు కదా అని గోపాలానికి ధైర్యం వచ్చింది.

"కాదండి బాబయ్యా."

"ఏమిటిరా మఱి?"

"నాకుగూడా చదువుకోవాలని ఉంది బాబయ్యా."

"నీకు చదువేమిటిరోయ్? ఏమైనా మతిపోయిందా?"

ఓ అంటే నా రాని అమ్మగారి దగ్గరి నుండి తొక్కుపల్కులు పల్కుచున్న చిన్నయ్యగారి వఱకు విరగబడి నవ్వారు.

గోపాలానికి ఏమనాలో తెలియలేదు. ఏం, తానెందుకు చదువుకోగూడదు? తనకంటే చిన్నవాడు చిన్నయ్యగారు చదువుకుంటూంటే, అంతమంది బళ్ళోకి వస్తూ వుంటే, ఒక్క తాను మాత్రం ఏం పాపం జేసుకున్నాడు?

చిన్నయ్యగారు పద్యం చెప్తుతున్నారు. "అక్కలకులాని సుత్తము" అంటూ.గోపాలం తన్ను తాను ఆపుకోలేకపోయాడు.

“అక్కరకు రాని చుట్టము” పద్యము పూర్తిగా అప్పజెప్పాడు స్వచ్ఛంగ.

పెద్దయ్యగారు నిర్ఘాంతపోయి చూచాడు గోపాలం వంక.

గోపాలం చేతులు నలుపుకొంటూ “నే నసలు చదువుకుంటున్న వాణ్ణేనండి! మా అయ్య చదువు మాన్పించి, ఇల్లు నెట్టలేక ఈ పనిలో పెట్టాడు. తమ దయ ఉంటే మీ పేరు చెప్పుకుని చదువుకుంటాను” అన్నాడు గోపాలం.

పెద్దయ్యగారు పడక కుర్చీలోంచి కష్టపడిలేచి “ఏడిశావు లేవోయ్! చదువుట, చదువు! చెప్పినపని చెయ్యలేక చతికిలబడుతున్నావు! చదువొక్కటి తక్కువైంది నీకు. చదువుకునే యోగ్యతే ఉంటే ఈ కర్మ మేమిటి? పో పో; భోం చేసిరా! బళ్లోకి వెళ్లాలి!” అన్నారు మండిపడుతూ.

గోపాలానికి కళ్ళ నీళ్లు గిఱ్ఱున తిరిగాయి. అలాగే తలవంచుకొని నట్టెండలో ఇంటిదారి పట్టాడు తన కర్మ ఏమిటో తనకే బోధపడక మనసులో బాధపడుతూ!

“బళ్లోకి వెళ్లాలి! బళ్ళోకి వెళ్లాలి!’ అవే మాటలు అతని చెవుల్లో గింగురు మంటున్నాయి దారి పొడుగునా!

❊ ❊ ❊ ❊

ఇప్పటికీ పాపం గోపాలం బళ్ళోకి వెళ్తూనే ఉన్నాడు. గంటలు కొడ్తూనే వున్నాడు.

# కె. లక్ష్మీరఘురామ్

**వి**ద్య నభ్యసించే కాలం నుండీ సాంఘికసేవ, మహిళాభ్యుదయం జీవితాదర్శాలుగా ఎంచుకొని, తమ లక్ష్యాల సాధనకోసం నిరంతరం కృషి సల్పుతూన్న జాతిరత్నం శ్రీమతి లక్ష్మీరఘురామ్‌గారు. తెలుగులో పాండిత్యమూ, ఆంగ్లభాషలో ప్రావీణ్యములతో బాటు హిందీ, తమిళ, కన్నడ, ఫ్రెంచి భాషలతో విశేష పరిచయం గలదు. ఎన్నో స్త్రీ సంక్షేమ సంఘాలకు అధ్యక్షులుగా, కార్యదర్శినిగా వ్యవహరించి, విదేశీ పర్యటనలు కొనసాగించారు. "ఆంధ్ర మహిళ"కు కొంత కాలం సంపాదకులుగా ఉన్నారు. వీరు కథలు చాలా తక్కువ వ్రాసినా, స్త్రీజనాభ్యుదయాన్నీ, సంఘసంస్కరణనూ దృష్టిలో పెట్టుకుని వ్రాశారు.

**రచనలు :** ఆంధ్రనారి, మొగిలిపొట్లం, మనలో మాట, దారీతెన్నూ, చిల్లిగవ్వ, ధన్యజీవి మొదలైనవి.

# బంధము

"ఎక్కడికి ప్రయాణము" ప్రశ్న –

"అరవిందాశ్రమానికి" అని జవాబు :

ఈ ప్రశ్నకు ఈ జవాబు వచ్చినప్పుడు ఇంటెల్లపాది భయపడతారు. అంటే ఇహ ఎన్నో టపాకాయలు పేలుతవన్నమాట! ఇల్లంతా కాస్సేపు నిశబ్దంగా వుంది.

"అరవిందాశ్రమాని కెందుకులే. నీ వే ఓ స్వాములోరై మన తోటమూలలో వున్న చింతచెట్టు కింద ఓ ఆశ్రమము ఏర్పాటు చెయ్యి. అన్ని విధాలా లాభదాయకంగా వుంటుంది" అని సలహా...

నిజమే. వ్యాపారరీత్యా ఆలోచిస్తే మంచి లాభాలు పొందవచ్చు. ఈ రోజుల్లో సన్యాసి వృత్తికి మించిన వృత్తి లేదు. కాని సలహా యిచ్చిన వారికి అంతా హాస్యముగా, వినోదంగా వుండవచ్చు. వారికేమి తెలుస్తుంది నా బాధ. ఉదయమునుండి రాత్రి వరకు ఇంటి పనులతో సతమతమై ఓ క్షణము విశ్రాంతి లేకుండా విరగపడుతూ వుంటే ఆశ్రమము చింతచెట్టు క్రింద ఏర్పాటు చెయ్యాలట! పిల్లికి చెలగాటము ఎలుకకు ప్రాణసంకటము. చింతచెట్టు! ఎవరికైనా వళ్లు మండదూ ఈ పరిస్థితుల్లో? పైగా ఎండాకాలం కూడాను. మార్చి నెల. అప్పుడే ఎండలు చాలా తీవ్రరూపము దాల్చిన వెందుకో ఈ సంవత్సరము. వళ్లు చిటపటమంటోంది. పిల్లలకు పరీక్షల రోజులు. ఒకరు ఆర్కిమెడీస్ ప్రిన్సిపిల్ ఒప్పచెపుతాము వినమంటే, ఇంకొకరు భర్తృహరి పద్యాలు వినమంటూ చేతిలోకి పెన్సిల్సు చెక్కమని అందించారు. పరీక్షలప్పుడు పారేస్తే పిల్లలు చిన్నబుచ్చుకుంటారని వూరుకున్నాను గాని లేకపోతే ఆ పెన్సిల్సును తోటలోకి గిరవాటు వేసేదాన్నే. ఈ పెన్సిల్సు పాఠాల వ్యవహారము ముగించుకొని పాండుచెరీలోని ఆశ్రమము వ్యవహారమునకు వద్దామనుకున్నా గాని, నేను పుట్టిన రౌద్రనామ సంవత్సర దోషము వల్ల, బ్రహ్మగారు మనకు పోసిన ఎక్కువ డోసు రౌద్రము దూసుకువచ్చింది.

"ఆ ఆశ్రమాలే ఆరంభిస్తాను. మీకేమి హాయిగా ఫాను కింద కుర్చీలో కూర్చుని ఊళ్ళో వాళ్ళకి సలహాలిస్తూ ఉండవచ్చు" అని అన్నాను.

"ఊళ్ళో వాళ్ళ కెందుకిస్తాను.ఇంట్లో వాళ్ళకే సలహాలిచ్చేది. నీవు కూడా ఫాను క్రింద కూర్చోరాదూ? గొడవచేయకుండా" అని మా ఆదేష్ఠగారు సెలవిచ్చారు.

"కూర్చుంటే అన్నీ బాగానే కుదురుతవి. పైగా గొడవ కూడానా, అందరి ఇళ్లలో భర్తలూ తమ భార్యలని ఈలాగే కూర్చోమని సలహాలిస్తారట– పంచభక్ష పరమాన్నాలు విస్తరిలోకి అలాడిన్ లాంతరుతో అమర్చేటట్లు."

పిల్లలు పుస్తకాలు అందుకొని, పెన్సిల్సు పుచ్చుకొని "బాగా వచ్చినవా అమ్మా?" అన్నారు.

"ఎక్కడొచ్చింది. 'నలరవి దేనిచే దిరుగునో ఘన కర్మము నంద్యమే కదా' అన్న పాదము ఆ నలువకులాలు భంగి పద్యములో ఎగరగొట్టా వన్నాను. పెద్ద శ్రుతిలో సుజన పద్ధతి ఆరంభము. "నా ఆఫీసుకు టైమైంది. టెలిఫోనులో మిమ్ములను మహిళాసభ వారు పిలుస్తున్నారు. నాకు ఇడ్లీ వద్దు, బ్రెడ్డు కావాలి. బట్టలుతికే సబ్బు అయిపోయిందండీ, కారులో పెట్రోలు లేదు, నాక్కూడా బస్సుకు చిల్లరకావాలి" వగైరా, వగైరా! ఈ శతావధానము ముగించుకొనేటప్పటికి గడియారము టంగ్ టంగ్ మని పదకొండు కొట్టింది. పడకకుర్చీలో వ్రాలి, ఆశ్రమము సంగతి మళ్లీ ఆలోచించా! "తీరా పరీక్షలప్పుడు నేను ఆ గ్రామానికి వెళితే పాపము పిల్లలు యిబ్బంది పడిపోరూ? అబ్బే! అయినా ఆశ్రమాలకు వెళ్లటమేమిటి? బుద్ధి గడ్డి తింటున్నట్లుంది! (అదే ఎవరన్నా అంటే వూరుకోమనుకోండి!) పిల్లలు పరీక్షలు ముగించిన తరువాత శలవల్లో ఈసారి మద్రాసు నుంచీ వెళ్లిపోయి ఈ బాదరబందీని వదిలించుకొని ఒక పదిహేను రోజులైనా విశ్రాంతి తీసుకోవాలి. పిల్లలకు కులాసాగా వుంటుంది, యక్కడికైనా వెళితే, వూటీకో, బెంగుళూరుకో వెళితే బాగుండేటట్టుగా వుంది. అబ్బే, చల్లగా వుంటాయని ఆశపడి ఈ వూళ్ళు వెళితే నాకు విశ్రాంతి ఎక్కడ? స్వర్గానికి వెళ్ళినా తెడ్డేనా అన్నట్లు అక్కడికి వెళ్లి, మళ్లీ యిల్లూ, పిల్లలూ,వంటా నౌకర్లు రభస తప్పదుగా. ఎక్కడికి వెళ్ళితే హాయిగా పని చేయకుండా కూర్చోవచ్చునని ఆలోచించా. అమ్మగారింటికి వెళితే బాగుండుననుకొని మళ్ళీ ఎండలు తలచుకొని భయపడి వూరుకున్నాను.

ఆనాడు సాయంకాలము తండ్రీ పిల్లలూ ఏదో గుసగుసలాడుతున్నారు. వరండాలో కూర్చుని నన్ను చూడగనే అదో విధంగా నవ్వారు. "ఏమిటి మీ మంతనాలు" అన్నాను. "ఏమీ లేదు అమ్మా! మేమంతా ఒక ప్లాను వేసుకున్నాము శెలవలకి" అన్నారు ఏక కంఠముతో. "ఇంకా పరీక్షలు ఆరంభమన్నా కాలేదు అప్పుడే శలవలు సంగతి

ఆలోచిస్తున్నారా? పోయి చదువుకోండి అనగానే అమ్మో పరీక్ష" లనుకుంటూ పరిగెత్తారు పుస్తకాల దగ్గిరకు.

"ఏమిటి మీ ప్లాను?" అన్నాను.

"నేను మన వూరు వెళ్లాలి. చాలా పనులున్నవి. అక్కడికి పిల్లలు వస్తామంటున్నారు. ఎట్లాగయినా వీలు చేసుకొని ఈసారి నీవు కూడా బయలుదేరితే అందరము వెళ్లి ఒక నెల రోజులుండి వద్దాము" అన్నారు. రోగి కోరిందే వైద్యుడు చెప్పాడని మనస్సులో అనుకొని "సరే" నన్నాను.

రాత్రిపడుకుంటే నిద్ర పట్టలేదు. ఆ కోపములో, చిరాకులో, విసుగుతో ఉదయము ఎక్కడికైనా వెళ్ళితే బాగుండుననుకున్నాను. గాని ఎక్కడికి వెళ్లేది? ఇల్లు వదలి వెళ్లాలంటే సామాన్యమైన పనా? గొడ్లు, గోదా, తోటా, గీటా అన్నీ చెడిపోవూ మళ్లీ తిరిగివచ్చే లోపల! పైగా "సరే" నని ఒప్పుకున్నానే మా విరాట్టుతో! మళ్లీ నేను రానంటే "ఇదిగో మీ ఆడవాళ్లకున్న బుద్ధేయిది. నిమిషానికో మాట" అని కోప్పడరు! "రేపు చూద్దాములే" అని అనుకుంటూ నిద్రపోయాను. నా జీవితంలో చిత్రంగా నిద్రలోనే ఎన్నో సమస్యలను పరిష్కారము చేసుకున్నాను!

❄ ❄ ❄ ❄

పిల్లల పరీక్షలై పోయిన తెల్లవారే స్వగ్రామమునకు కారులో ప్రయాణము.

ఇంకా చీకటుందనగానే స్నానపానాదులు ముగించుకొని, కారులో సామానులు సర్దుకొని బయలుదేరినాము. నెల్లూరు వరకు ప్రయాణము హాయిగానే వుంది. అక్కడ నుంచి మేము ఒక్కొక్క మైలు ముందుకు సాగిపోతూ వుంటే వేడిమి ఒక్కొక్క డిగ్రీ హెచ్చుతున్నట్లు తోచింది. ఒంగోలు దగ్గిర ఒక మామిడి తోటలో ఆగి భోజనాలు ముగించి అరగంట సేపు విశ్రమించి తిరిగి ప్రయాణము సాగించాము. చిలకలూరి పేట సమీపము చేరేటప్పటికి ఎండలు నిప్పులు చెరుగుతున్నవి.

"కారు కొంచెము ఆపండి" అన్నాను. "ఎందుకు?"

"పనుంది కాస్త ఆపాలి"..... గానుగచెట్ల క్రింద కారు ఆగింది. కారులో నుంచి నేను దిగాను.

"మీరు దిగరా" అన్నాను కారులోని వాళ్లతో – "ఈ ఎండలో మేము దిగము" అని ఒకరు జవాబు "ఓయి" అని మరియొకరికేక. "ఎందుకు అట్లా కేకలేస్తారని" గద్దించాను. "చూడు పైన ఏముందో" అని అందరూ ఏక కంఠముతో అరుపు. చెవులు మూసుకొని పైకి చూతును గదా ఓ పెద్ద కోతి చెట్టుకొమ్మ మీద కూర్చుని వుంది. అక్కడికి ఒక ఇరువై గజాల దూరాన ఒక కాలువ వున్నది. నీరు ఎండాకాలమైనా ప్రవహిస్తూనే వున్నవి. ఆ కాలువలోని చల్లటి నీళ్లతో ముఖము కాళ్లు కడుక్కుంటే ఎండ తాపం తగ్గుతుందనే నేను

కారు అక్కడ ఆపమన్నది. బ్రహ్మకు తప్ప తలవగ్గని నేను కోతిని చూచి జడుచుకుంటానా! ఒక టవలు లోటా తీసుకొని నేను ఆ కాలువ దగ్గిరకు వెళ్లడము చూచి "అమ్మా? అక్కడ కోతులున్నాయ్" అని పిల్లలు కేకలేశారు. "ఏమీ ఫరవాలేదులే, వాళ్లు అమ్మ చుట్టాలే" అని పిల్లలకు ఓ కొత్త వార్త. "కోతులు నన్నేమి చేస్తవిలే" నని నేను వెళ్లి కాలువలో దిగబోయాను. లోతుగా వున్నట్లు తోచింది, అందుకని ఇంకా కొంచెము ముందుకు పోయి నీళ్లలో బండలు కనబడతే ఆ బండమీదకు నోటి నీళ్లు అందుకుని ఆ చల్లటి నీళ్లతో ముఖము కాళ్లు చేతులు కడుక్కుంటే యెంతో ప్రాణానికి హాయని పించింది. ఇంతలోకే కారులోంచి మళ్లీ కోలాహలం. అందరూ హడావిడిగా చేతులూపుతున్నారు రమ్మనమని. వెనక్కి తిరిగి చూద్దును గదా ఓ కోతి మెల్లగా దగ్గిరకు వచ్చి నీళ్లలోకి చూస్తూ వుంది. నేను టవలుతో తుడుచుకుంటూ గానుగచెట్టు సమీపించాను.

"ఎంతసేపు కాలువ దగ్గిర! కూర్చో కూర్చో – వాగులో దిగి, కోతుల్ని పలుకరించుతూ మార్గమధ్యలో మజిలీలు చేస్తూ వుంటే మనము మనవూరు చేరేటప్పటికి చీకటిబడుతుంద"ని విసుక్కున్నారు – మమ్ములను సురక్షితంగా చేర్చవలసిన బాధ్యతగల మా నితమరి.

"ఎంత హాయిగా వుందక్కడ ఆ కాలువ, ఆ వనము" – అంటూ కూర్చున్నాను కారులో. వెంటనే కారు బయలుదేరింది.

"ఏం! వనవాసమ్మీద కోరిక పుట్టుతున్నదా" అన్నారు.

"వనవాసాలు కోరుకోకుండా మునుపు ఆ రామయ్య సీతమ్మకి బుద్ధి వచ్చేటటు చేశాడుగా" అన్నాను.

ఎండల్లో మాడి గుంటూరు మూడు గంటలకు చేరాము. అక్కడ ఐసుక్రీములు వేసి శరీరాలు కొంత చల్లబరచుకున్న తర్వాత అయిదు గంటలకల్లా స్వగ్రామము చేరాము.

ఇహ నా విశ్రాంతి కార్యక్రమము ఆరంభించాలని నిశ్చయించుకున్నాను. అనుకొనటమేమిటి, పత్రికలలో ప్రకటించటము మినహా, పుట్టింటా, అత్తింటా బంధువులందరికీ తెలియ చేయించాము మనము విశ్రాంతి తీసుకో బోతున్నామని.

ఉదయము కాఫీ తెచ్చియిస్తేనే నిద్ర నుంచి లేద్దాము. భోజనానికి, స్నానానికి అన్నీ ఆయత్తపరచి కబురు వచ్చేవరకూ కూర్చున్న చోటు నుంచి లేవనని నిశ్చయించుకున్నాను. పిల్లలకు సెలవుల్లో పనులు నేర్చుకోవాలని చెప్పేశాను. (అంటే వాళ్ళ పనులు వాళ్లు చేసుకోవాలని) కాని ఇది వరలోనే అందరికీ Ultimatum ఇవ్వబట్టి పాపము అమ్మను తిప్పలు పెట్టవద్దు. మేము తల దువ్వుకోము, మేము బొట్టు పెట్టుకోమని పిల్లల పనులన్నీ అందరూ అందుకున్నారు.

మొదటిరోజు ఉదయము కాఫీ వచ్చే వరకూ లేవలేదు. "అబ్బ! ఎన్నాళ్లకు నేను లేవకుండా కాఫీయే నా దగ్గిరకు రావట"మని సంతోషించి– అమృతము త్రాగినట్లు ఆ

కాఫీని యెంతో ఆప్యాయంగా త్రాగాను. "అల్ప సంతోషివి" అన్నది ముసలమ్మ. అల్పమో, స్వల్పమో ఈ విధంగా పదిహేను రోజులు గడుపదలచాను.

రెండోరోజు నిద్దుర రాలేదు. తెల్లవారుఝామున కోడి కూసినప్పట్నుంచీ అలవాటు ప్రకారము నిద్దుర మెలుకువే! లేగదూడలు 'అంబా' అని అరుస్తూ వుంటే జీతగాళ్లు లేచి పాలు పితగక తప్పింది గాదు. ఇంట్లో పొయ్యి వూదుట, ఇల్లు చిమ్ముట, బైట కళ్లాపి జల్లుట మొదలగు పనుల అలజడులు బయలుదేరినవి. కాళ్లు చేతులు బాగానే వుండి నిద్రరాకుండా మంచము పట్టుకు అలా పరుండటము నాకేమీ బాగుండలేదు. పైగా పెద్దవాళ్లు (అమ్మా, నాయనమ్మలు) లేచి పనులు యధావిధిగా చేసుకుంటూ వుంటే చిన్నదాన్ని నేను సోమరితనముగా వుండటము ఏమీ బాగాలేదు. పెద్దవాళ్లు నన్ను నిందించకపోయినా నేను చేస్తున్న పని నాకు సబబ నిపించలేదు. నా విశ్రాంతి నాకు మెల్లగా, బాధగా వుండటము ఆరంభించింది. నాల్గు రోజులయ్యే టప్పటికి 'విశ్రాంతి' భరించరాని దైనది. పోనీ, ఏదైనా పని చేద్దామా అంటే అక్కడ (చోద్యంగా పుట్టింట్లోనే) నా కేమీ పని చేయటానికి కుదరలేదు. అంతా క్రొత్తే! ఇహ ఇంటికి వెళ్లుదామన్నాను. "ఏం! ఇంటి మీద గాలి మళ్లిందా" అని అందరూ నవ్వారు.

అక్కడ పనులు తొందరగా ముగించుకున్నాము. నాకు విశ్రాంతి విసుగు పుట్టినట్లే పిల్లల పరీక్షా ఫలితాల ఆరాటము ఎక్కువైంది. ఫలితాలు తెలియగానే సీట్ల అన్వేషణ ఆరంభించాలిగా –

రేపు ప్రయాణమన్నాము. "వీల్లేదు. రేపు అష్టమి, ఎల్లుండి నవమి" అన్నారు చిన్నబ్బాయి. "అప్పుడే బయలుదేరుతున్నారేమి? విశ్రాంతి తీసుకున్నావా? వంట్లో సులువేనా? అన్నారు బుగ్గమీసాల సుబ్బయ్య మామ."ఆ కులాసాగానే వుంద"ని జవాబిచ్చాను. దశమి రోజు ప్రయాణము నిశ్చయింపబడ్డది. సురక్షితముగా యిల్లు చేరాము. తాళముతీసి 'అబ్బ! ఎన్నాళ్లకి' అని సోఫాలో కూలబడ్డాను.

"విశ్రాంతి చాలిందా" అన్నారు వసారా చూచుకుంటూ మా విధాతృడు.

"ఆ" అన్నాను క్లుప్తంగా.

"దైవమెంతటి చిత్రపు బంధముతో స్త్రీని గృహానికి బంధించాడో"నని ఆలోచించటము మొదలు పెట్టాను మొదటసారిగా.

# వేలూరి సహజానందం



**మా**నవ జీవితాలను ముసురుకున్న చీకట్లని పారద్రోలటానికి వెలిగించిన క్రొవ్వొత్తులు సహజానందం గారి కథలు. ఈ లోకంలో శుక్ల పక్షమే కాదు. కృష్ణపక్షమూ వుందని సూచిస్తూ, ఎంత సంస్కారం, నాగరికత పెంపొందించుకున్నా, మనుషులు ప్రధాన వాసనల వల్ల ఎట్లా శాసింపబడేదీ, జీవితాలని విషాదం ఎట్లా కార్చిచ్చులా దహించేదీ చిత్రిస్తూ వీరు చక్కని కథలెన్నో వ్రాశారు. ఆకాశవాణి హైద్రాబాదులో పని చేసేవారు

**రచనలు** : శ్రీమద్భగవద్గీత, విద్య - జీవితార్థం, కథలూ, నాటికలూ, ఎన్నో వ్యాసాలూ.

# జీవిక

"ఒరే......"

"ఇదేమిట్రా...... ఇలా వచ్చేశావ్?"

"నాన్న......"

"ఆ! మొన్ననేగా ఆసుపత్రిలో చేర్పించి...."

అతనేమీ మాట్లాడక, యెదురుగుండా వున్న కుర్చీలో కూర్చున్నాడు.

నేను నిర్ఘాంతపోయి చూస్తూ వున్నాను. వాడు ఆరంభించాడు.

"అలా చూస్తూవుంటే లాభం లేదు. మీ ఆఫీసరుకు చెప్పి వెంటనే బయలుదేరు.... మరి శవ...."

వాడి స్వరంలో గాద్గదికత లేదు. అనుమతిని పొంది, నేను వాడి ననుసరించాను. ఆఫీసు గడియారం రెండు గంటలు కొట్టింది.

నాలో నేను చాలా బాధపడుతున్నాను. ఈ రెండు రోజుల్లో ఒకసారైనా ఆసుపత్రికి వెళ్ళి, రోగిని చూడలేకపోయానే అని. ఎంత పొరపాటు! ఎంత అజ్ఞానం! దైనందిన అట్టహాసంలో ఈ కొద్దిపాటి కర్తవ్యానికి కూడా అవకాశం లేకపోయింది!

దిద్దుకో వీలులేని తప్పుకు యావజ్జీవితం ప్రాయశ్చిత్తమే. అంతే. ఒక్కసారైనా వెళ్ళి చూసి వుంటే ఆ రోగి ఎంత తృప్తి చెందేవాడు! అంతకన్న మన నుంచి రోగి కోరేది ఇంకేమీ లేదు. తనలోని దీపం ఆరిపోతున్నా,మరొక ఉజ్వల దీపంకేసి చూస్తూ వుంటే ఏదో తృప్తి! ప్రేమకు నోచుకోని వారికి ప్రేమగాథలు ప్రాణప్రదమైనట్లు. అంత మాత్రపు సానుభూతి నాలో కరువైంది.

"డాక్టరు యేం ఫరవాలేదన్నాడు గదరా!" అన్నాను.

"అవును......"

"మరి...."

"నాకు ఆఫీసుకు ఆసుపత్రి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. 'మీ నాన్నగారు పరమపదించారు. మీరు వెంటనే రావాలి అని"

"అయితే నువ్వు....."

"శెలవు దొరకలేదు. పైగా ఆదుర్దా ఏమీ లేదని డాక్టరు ఉదయమే చెప్పె!"

"సమయానికి నువ్వూ లేవన్నమాట ఆయన దగ్గర?"

"లేను. నే వెళ్ళేప్పటికే శవమందిరానికి మార్చారు."

బలవన్మరణం కన్న కూడా ఏకాంత మరణం మరింత ఘోరం! ఆ జీవి ఏం వినాలని, ఏం చెప్పాలని వ్యధపడి, క్షోభపడి వుంటుందో! చీకటి కమ్ముకుంటున్న ఆ సంధ్యా సమయంలో ఏ ప్రత్యక్ష ముఖం కేసో చూస్తూ, కనులు మూయాలని కాంక్షించని జీవి ఎవడుంటాడు? సర్వశక్తినీ, హరించిపోతున్న సర్వశక్తి, నీ శుష్క నేత్రాల్లో ఇముడ్చుకొని, ఆ సజీవ ముఖం కేసి చూస్తూ వుండటమే జీవి కోరేది. కాని ఆ కోరిక, మృత్యు శయ్య పైని కోరిక కూడా కొంతమందికి తీరని కోరికే. ధూళి ధూసరితమై, పెనుగాలులు హోరెత్తు స్మృతి వీధిలో సలుపు పరిదేవన యమపాశ పీడనకన్న కూడా క్షోభ!

వాడు నాభుజాన్ని తట్టాడు. "బావుంది. ఏమిటి ఇంకా ఏవోఆలోచనల్లో పడ్డావు.... ముందు కర్తవ్యం చూడాలి" అన్నాడు.

"అవును... మరి.... ఆయన సదాచార సంపన్నుడు....శవ వాహకులు!"

"అప్పుడే రెండు దాటింది. ఆకాశం అంతా మబ్బు మబ్బుగా వుంది....సాధ్యమైనంత త్వరలో....."

"సరే... అయితే.... ఆసుపత్రినుంచే ఫోను చేద్దాం....కారుకు"

కారువాడు పాతిక అడిగాడు. 50 అడిగినా ఇచ్చే వాళ్లమే. ఆసుపత్రి శవమందిరపు ద్వారంలో నిలబడ్డాం.

"మీ.... అమ్మగారు" అన్నాను.

ఒక్కమాటుగా వాడి ముఖం అంతా కదలబారింది. కళ్లు నిలకడ తప్పినయ్.

"అదేరా....మరీని! ఇవాళ పొద్దున ఆవిడ ఆసుపత్రికి బయలుదేరుతానంటే, సాయంకాలం తీసుకువెళ్తాలే అని ఆపాను.... ఇప్పుడావిడ కోసంమా మేనల్లుడిని పంపాను.... ఆవిడ ముఖం..ఎలా చూచేది?" అన్నాను కంపిస్తున్న గొంతుతో.

ఎవడో తలపాగా చుట్టుకున్న వాడొకడు మెల్లిగా మాముందు ప్రత్యక్షమయాడు. అంతకు ముందునుంచి కూడా వాడు ఆ ప్రాంతాల్లోనే ఉన్నట్టు నాకు చాయగా గుర్తు. కాని చూపు గాని, ఆలోచనగాని వాడిమీదకు అంతకు మునుపు పోలేదు.

"బాబు.... గారూ!"

చూశాం వాడికేసి. ఏదో ఒంటెద్దుబండివాడిలా ఉన్నాడు. ఈ సమయంలో వీడెవడు? నా కాశ్చర్యమే గాక, తీవ్ర కోపం వచ్చింది. అందుకు బహుశ నా స్వంత అశక్తతే కారణం కావొచ్చు. నిస్పృహ, అశక్తత ఎక్కువగా కోపానికి ఆజ్యం పోస్తయ్.

"అరగంటలో వెళ్లిపోతాం" అన్నాడు వాడు.

"ఎక్కడికిరా?"

నా ప్రశ్న వినిపించుకున్నట్టు లేదు వాడు.

"గిత్తండి బాబు.... గిత్త... జోరుగా ఎళ్తుంది"

"వీడి బండి గోల ఏమిటి?"

"ఏమిటీ గొడవ?" అన్నాను.

వాడు జవాబు చెప్పాడు. ఒక్క అరగంటలో శవాన్ని బండిలో శ్మశానానికి చేరుస్తానంటున్నాడు.నేను, మిత్రుడు ఇద్దరం కొంచెంసేపు తెల్లపోయాం. ఈ ఆసుపత్రి ద్వారాల నుంచి సూటిగా అంతిమ యాత్ర చేసేవారి వాహన సౌకర్యం గురించి ఆలోచించి ఉంటే, బహుశ అంత ఆశ్చర్యానికి అవసరం ఉండేదికాదు. చటుక్కున వీడెవడో చిన్న రైల్వేస్టేషన్ ముందు బాడుగ మాట్లాడుతున్నంత తేలిగ్గా మాట్లాడటం నాకు చిత్రం వేసింది. గోడ అవతల ఉన్న ఒంటెద్దు బండి గూడు, ఎదునల్లమూపురం, కొమ్ములు కనపడినయ్.

"తెలిసి వచ్చావా?" అని అడిగాను.

"కాదు బాబూ! ప్రొద్దూకులా ఇక్కడే ఉంటాను."

"రోజూ శవాలను జేరవేయటమే అన్నమాట నీపని?"

"అవును.... బాబూ!"

"ఇప్పటికి ఎన్ని వందల మందిని లాక్కుపోయావు?" అని అడిగాను వెటకారంగా.

వాడు పెద్దగా నవ్వుతూ "అదేంటి బాబూ... దేవుడు చల్లగా చూడాలి గాని, మిమ్మల్ని మటుకు...." అన్నాడు.

నా గుండె జలదరించింది. వాడి మాట పిడుగులా పడింది చెవిలో. ఎంత నవ్వుతూ చెప్పేశాడు... మళ్ళీ క్షణంలో తమాయించుకున్నాను.

మా వాడికి విసుగు తోచింది. "వాడితో ఏమిట్రా నీకు! ఇలాగే ఏదో ఒక అశుభం అనిపించుకోటం సరదా" అని నన్ను చివాట్లు పెట్టి, "పో అబ్బీ, పో... మేం కారుకు ఫోను చేశాం" అన్నాడు.

వాడి తీరు మారింది.

"అదేంటి బాబూ! కారెందుకూ... అదొచ్చే లోపు తీసుకుపోతాను.....పరుగెతిస్తాను గిత్తని" అన్నాడు.

"ఉండరా బాబూనువ్వు... నువ్వేమిట్రా పీడ" అని మా వాడు అంటూనే ఉన్నాడు. ఆ కారు రానే వచ్చింది.

"ఏమి సార్... శీఘ్రంగా పోదాం" అన్నాడు డ్రైవరు.

"కొంచెం సేపు ఆగాలి" అన్నాడు మావాడు.

టాక్సీలోంచి ఎవరో దింపుతూన్నట్టు దిగింది వాడి తల్లి. ఆమె ముఖంలో, కళ్లలో జీవం లేదు. ఇళ్లు నిప్పంటుకున్నప్పుడు, ఆ జ్వాలలకు చుట్టుపక్కల చెట్టు, చేమ కమిలి పోయినట్టుంది ఆమె ముఖం. నోట మాట లేదు. గందరగోళం లేదు. గుండె బాదుకోవటం లేదు. జీవశక్తులన్నీ దగ్ధమై, కేవలం ఆకారం మటుకు నిలిచి ఉన్నట్టుంది. ఆ కళ్లలోని దవానలం ముందు, కార్చిచ్చు చిన్న నిప్పునలుసు. ఏడ్పుల్లో, పెడబొబ్బల్లో, – ఏదో విధమైన ఒక ఉపశమనం! ఏదో బరువు తృణమాత్రమైనా తగ్గినట్టు కాని ఈ రోదన హీన, నిశ్శబ్ద దుఃఖం లోతులోతుకు, మరింత లోతుకు దించుకు పోయే పదును కత్తి! ఆ నిబ్బరం, ఆ స్తబ్దత, ఆ మౌనం చాటున శతసప్త సముద్రముల ఘోష ఉక్కిరి బిక్కిరి అవుతూ ఉంటుంది. ఆ దుఃఖము ఒకరి వినికిడికి కాదు, ఒకరి ఓదార్పుకు కాదు. అది సహజీవి విచ్ఛేదం వల్ల శరీరంలో అణువు అణువున చీల్చుకుని ఘోషించు భగ్నాత్మవేదన! మృతినుంచి జనితమైన ఈ దుఃఖానికి మృతే ఓదార్పు!

కొడుకును గుండె కదుముకున్న ఆమె అశ్రువులు, జీవిత రహస్యాన్ని, సత్యాన్ని వ్యక్తం చేసే దుఃఖాక్షరాలు. గొడ్డలి పెట్టుకు చెట్టు అల్లల్లాడినట్టు ఆమె తల్లడిల్లింది.

"ఎంత పాపిష్ఠిదాన్ని!"

కారు డ్రైవరు తొందర చేస్తున్నాడు. మెల్లిగా శవాన్ని కారులో పడుకోపెట్టాము. ఎక్కడ దెబ్బ తగిలిపోతుందో! చేతికెక్కడ కారు తలుపు గీచుకుంటుందో! మోకాలి కెక్కడ దెబ్బ తగులుతుందో! నిర్జీవ ఆకృతి. కాని ఇంకా జీవించి ఉన్నట్టే మమత! నా కొక చిన్ననాటి విషయం గుర్తు వచ్చింది. ముసలి అవ్వ శవమును పాడెపై పరుండబెట్టి, ఆమె మెడను తాడుతో బిగించబోగా, ఆ వ్యక్తిని ఒక తోపు తోశాడు చూస్తూ వున్న కుర్రవాడు. ఆమె జీవించి ఉన్నట్టు, తాడు ఒరిపిడి కామె గొంతుక ఒరుసుకొని పోతుందని ఆ కుర్రవాని బాధ. ఆ పెద్ద వ్యక్తి చిరు నవ్వు నవ్వి పాశబంధనం పూర్తి చేశాడు.

కారెక్క బోతున్నాం. ఆ తలపాగా వాడు నాకేసి, డ్రైవరుకేసి మహా తీక్షణంగా చూస్తూ, గొణుక్కుంటున్నాడు. వాడి చూపులకు నా గుండె మళ్లీ జలదరించింది.

"నేనైతే మూడు రూపాయలకు తీసుకుపోయే వాడిని. ఇవ్వండి కారుకు పాతిక రూపాయలు."

వాడి మాటల విసురు స్పష్టం వినబడింది.

ఆ ఒంటెద్దు బండి నల్లని గూడు, ఆ ఎద్దు నల్లటి మూపురం, వాడి ఎరుపు అంచు తలపాగా, కారులో కూర్చున్న నా కళ్లలో అనుక్షణం మెదులుతూనే వున్నయ్!

"ప్రొద్దూకులూ ఇక్కడే వుంటాను."

"శవాలను జేరవేయటమే పని."

ఎంతో తాపీగా వాడన్న మాటలు నాకిప్పటికీ వినిపిస్తూనే ఉంటయ్. ఆప్తులు రోగుల గృహగమనానికి ఎదురు చూస్తూ ఉంటే, ఇక్కడ వీడు వారి శ్మశానాగమనానికి ఎదురుచూస్తూ వుంటాడు. రోగులంటే వాడికి శత్రుత్వం లేదు. పైగా ఇష్టమే. ఎప్పుడు స్ట్రెచర్ శవమందిరం వైపు వస్తుందా అని చూస్తూ ఉంటాడు.

అది వాడి....!



# అంగర వేంకట కృష్ణారావు

**(1920 - 1974)**

**స**ంస్కృతాంధ్రాంగ్ల భాషలు అధ్యయనం చేసిన విద్యాధికులు. జీవితంలోని వెలుగు చీకట్లనీ, ఆశా నిరాశలనీ నిర్దుష్టమైన శైలితో సమపాళ్లలో పాఠకుల కందించిన ఉత్తమ కథకులు. అంగర వారి కథలు పఠితలో ఉదాత్తభావాల్ని ప్రేరేపించి హృదయాన్ని ఆర్ద్రం చేయడమే సాహిత్య లక్ష్యమనే సిద్ధాంతానికి పట్టుకొమ్మలు. విశాఖ పత్రికా సంపాదకవర్గంలో పని చేసేవారు.

**రచనలు :** ఊసరవెల్లులు, జ్వాలా సుందరి, భావికాలం (నవలలు)

# తొగరుచెట్టు

**జి**ల్లా ట్రెజరీ హెడ్ అకౌంటెంట్ చిట్టి వెంట్రామయ్యగారు అవాళ సాయంత్రం గడియారం టంగుటంగున ఐదు కొట్టగానే టక్కున లేచారు. ఇంటికి వెళిపోయారు.

ఏం చెప్మా అనుకున్నారు పెద్ద గుమాస్తాలంతా. ఏదో కొంప మునిగిందను కున్నారు. ఆయనతో అంత కలివిడిగా వుండని అభ్యుదయ గుమాస్తాలంతా వెటకారంగా, ఇవాళైనా వెలుగులో భార్యా బిడ్డల మొహాలు చూస్తామనుకున్నారు, టైపిస్టులూ అటెండర్లు. అయ్యో యివాళ చిట్టి వెంకట్రామయ్యగారు లేకుండా వొంటరిగానే మరిరెండున్నర గంటల దూరం నడవాలా అనుకుని ఆఫీసు గడియారం వలవల యేడిచింది.

అయితే, గత పన్నెండు సంవత్సరాలలో యిలాంటి విపరీతం జరగలేదు. ఇది జనన తేదీలు అజాయించేపట్ల మనవాళ్ళు భూతకాలంలోని తుఫానులు, భూకంపాలు మొదలైనవి వుటంకించినట్లు చెప్పుకోదగ్గది.

చిట్టి వెంకట్రామయ్యగారు పన్నెండేళ్ళ కిందట ఆ జిల్లా ట్రెజరీకి హెడ్ అకౌంటెంట్‌గా వచ్చేరు. అప్పటికీ యిప్పటికీ ఆయన హోదాలోగాని, ప్రవర్తనలోగాని మార్పు లేదు. ఉదయం పదకొండింటికి వచ్చి సాయంత్రం ఏడున్నరకి లేచేవారు. ఎప్పుడూ నవ్వకపోయినా, యేడుపు ముఖం పెట్టలేదు. ఎవర్ని యెన్ని తిట్టినా పై అధికారితో చెప్పి అపకారం చేయించలేదు. ఆయన్ని అర్థం చేసుకున్నా మనుకున్న వాళ్ళు గత్యంతరం లేక సమాధానపడ్డారు. ఇతరులు ఆయన మూర్ఖుడనీ, హృదయం లేనివాడనీ ఇంకా ఇంకా 'ఈస్తటిక్ సెన్స్' లేనివాడని అనుకునే వారు.

పోతే. ఆవాళ సాయంత్రం ఐదింటికి అకస్మాత్తుగా ఆయన యెందుకు లేచి వెళ్లిపోయారో యెవరికీ తెలీదు. చివరికి ఆయన ప్రైవేట్ సెక్రటరీలాంటి బంట్రోతు అహమ్మదుకు కూడా తెలీదు. అసలాయనకి ప్రైవేటు జీవితం లేదనే అందరి అభిప్రాయం.

చిట్టి వెంకట్రామయ్యగారి గురించి యితరులకు తెలిసినది ఆయన వొక గౌరవనీయ కుటుంబానికి చెందినవారని, ప్రస్తుతం ఆయనకి 'నా' అన్న దగ్గర దూరం బంధువు లెవ్వరితోనూ ఎక్కువగా ప్రమేయం లేదనీ, ఆయన వొంటరిగా ఒక మేడలో నివసిస్తున్నాడని మాత్రమే. ఆయన సుమారు ముప్పయ్యేళ్ళ కిందట పెళ్ళి అయిన కొద్ది నెలలలోనే భార్య పోయిందని కూడా కొందరికి తెలుసు. ఇంకా లోతైన విషయాలు బంట్రోతు అహమ్మదుకీ, కనీసం పన్నెండేళ్ళ నుంచీ వంట చేస్తూన్న నరసింహానికీ కూడా తెలీవు.

సూర్యుడికంటే ముందు లేచి స్నానం చేసి, సంధ్యవార్చి, ఆఫీసు కాగితాలు చూసుకుని, తొమ్మిది గంటలకి వేడి వేడి పెసరకట్టు వుడికించిన కూర, పెరుగూ అన్నం తిని ఆఫీసుకు వెళ్ళడం, సాయంత్రం సుమా రెనిమిదింటికి యిల్లు చేరి మడికట్టుకుని భోం చేసి, రాత్రి సుమారు పదకొండు వరకూ తిరిగి ఆఫీసు కాగితాలు చూసుకుని పడుకోవడం ఆయన దినచర్య. దీనిలో యెన్నడూ ఏమీ మార్పుండదు.

ఆయన యెప్పుడూ సినిమాలూ నాటకాలూ చూడరు. ఎప్పుడైనా వాళ్ళ బంధువులెవరైనా ఆ వూరు వస్తే వాళ్ళింట్లోనే దిగేవారు. దూరపు అన్న దమ్ములు, రెండు వేళ్ళు విడిచిన మేనమామ మనవరాళ్ళూ, స్నేహితులు, స్నేహితుల స్నేహితులు యిత్యాది. కారణం ఆయన మీద అభిమానం అనుకోవడం సత్యానికి చాలా దూరం; ఆయన కలిగిన వాడని, ఖర్చు లేనివాడని. వాళ్ళ ఊహ నిజమే. అయితే ఆయన యెవ్వరితోటీ ఆటే మాట్లాడేవారు కారు. చుట్టపక్కాలున్నప్పుడు కూడా ఆయన మేడమీద తన గదిలోంచి బైటికి వచ్చేవారు కారు. అంచేత ఆ వచ్చిన వాళ్లు కూడా ఆనవాయితుకు "బాబాయీ బాగున్నావా"అనో "అన్నయ్యా యెన్నాళ్లయింది నిన్ను చూసి" అనో పలకరించినా, ఆ యింటిని సుమారొక విశ్రాంతి గృహంగానే భావించేవారు, ఛార్జీలు మినహా.

చిట్టి వెంకట్రామయ్యగారి "గది" మేడమీదుంది. మేడమీదున్న గది అదొక్కటే. ఆ గదికి ఉత్తరం వేపున్న కిటికీ గుండా పెరట్లో వున్న తొగరుచెట్టు పైభాగం సూటిగా అగుపిస్తుంది. తీరికగా వున్నప్పుడల్లా ఆయన దానివేపు చూసేవారు. ఆయన యెరగని ఆ చెట్టు యెప్పుడూ అలాగే వుంది. ఆకులు లేకుండా మోడులా, దానిని చూస్తూన్నంత సేపూ ఆయన మనసు శాంతియుతంగా వుండేది.

ఆవాళ ఆయన సాయంత్రం ఐదు గంటలకి టక్కున లేచి, ఆఫీసు నుంచి వెళ్ళిపోవటం లగాయతు, ఆర్నెల్ల పాటు ఆయన ఆఫీసు జీవితంలో వింతమార్పు వచ్చింది. ఉన్నంత సేపూ అందరిమీద రుస రుసలాడ్డం, తిట్టడం, ట్రెజరీ ఆఫీసుమీదే ప్రత్యక్షంగానూ పరోక్షం గానూ విసుక్కోవడం. ఎంత గొడవ చేసినా సాయంత్రం ఐదింటికల్లా డ్రాయర్లు మూసి వెళ్ళిపోవడం. ఆయన్ని ఎవరూ యేమీ అనేవారు కారు. కారణం ఆయనకి అప్పుడే

చాలా సర్వీసు అయిపోయింది. పైగా ఆయన వయసు యాభై లోపైనా, పళ్ళూడిపోయి, దిగజారిపోయి అరవైయేళ్ళవాడిలా అగుపించేవాడు.

డిశంబరు నెల నడుస్తూంది. హేమంతుడి ప్రతాపానికి తట్టుకోలేక పృథక్ శయ్యలు ఏకశయ్యలౌతున్నాయి. చిట్టి వెంకట్రామయ్యగారు వొక్క నిద్ర తీసేరు. ఈదురుగాలికి తెలివి వచ్చింది. పెరటి వెంపు కిటికీ తలుపు మూసివేద్దామని లేచారు. కిటికీ దగ్గరకి వెళ్ళగానే తొగరు చెట్టు మొండి కొమ్మల్లోంచి వొక దృశ్యం అగుపించింది. అవతల వీధి మేడ మీద కిటికీ తెరచివుంది. ఎలెక్ట్రీ దీపం కాంతి చక్కగా వుంది. ఒక యువకుడు ఒక యువతి – నిటారుగా, నగ్నంగా, గాఢాలింగంలో పెనవేచుకుపోయేరు, చెట్టుతీగలా. చిట్టి వెంకట్రామయ్య గారి హృదయం వేగంగా కొట్టుకుంది. వెంటనే చలి పటాపంచలై ఆపాదమస్తకం వేడెక్కింది.

కిటికీ మూసి వెడిపోదామా అనిపించింది. కాని, అలా చెయ్యలేకపోయేరు. తను చీకట్లో వున్నారు. వాళ్ళు లోకానికి మటుకే చీకట్లో వున్నారు. వాళ్ళు నూతన దంపతులై వుంటారు. నిర్భయంగా, నిస్సంకోచంగా, నిర్లజ్జగా, రక్తమాంసాస్తి నరాలకు పంచభక్ష్య పరమాన్నాలతో విందుగా ప్రవర్తిస్తున్నారు. చిట్టి వెంకట్రామయ్యగారి శరీరం విపరీతంగా కంపిస్తూంది. నిత్య శిశిరజీవితం గడుపుతూన్న ఆ నిర్భాగ్యపు తొగరు చెట్టు అవతలి, జీవిత పరిణామంలో మహోద్రేక పూరితమైన యీ ఘటపు విశ్వరూపం యిలా ఆ హేమంత నిశామధ్యంలో ప్రత్యక్షం అవుతుందని ఆయన కలలో కూడా అనుకోలేదు. ఆ సన్నివేశం ఆయన ప్రవృత్తిని పునాదులతో కుదిపింది.

ఆఫీసులో అంత అలజడి ఆ మర్నాడే జరిగింది. కిటికీలో నాటకం ఆరంభం ప్రతిరోజూ సాయంత్రం ఆరుగంటలకే. దానికి చివరి అంకం భరతవాక్యం వుంటాయని చిట్టి వెంకట్రామయ్య గారు అనుకోలేదు. ఆలసించిన ఆశాభంగమని ప్రతిరోజూ ఐదు గంటలకే ఆఫీసు విడిచి పెట్టేవారు.

కాలచక్రం తిరుగుతూంది. మార్చినెల ప్రవేశించింది. హటాత్తుగా పెరట్లో తొగరుచెట్టు చిగిర్చింది పన్నెండేళ్ళ తరవాత. చూస్తుండగా చెట్టంతా గుబురై పచ్చటి ఆకులు నిండింది. తొగరుపూల పరిమళాలు చిట్టి వెంకట్రామయ్యగారి గదిమీద కాదు, గుండెలమీద దాడి చేస్తున్నాయి. ఏం లాభం? కిటికీ కనుపించడం లేదు. ఆయనకి చిర్రెత్తింది. వెఱ్ఱెత్తింది. కాలుగాలిన పిల్లిలా అలమటించి పోయేవాడు. నిద్ర ఇదివరకే లేదు. కాని, ఇప్పుడు నిద్రలేని సుఖం కూడా లేదు.

ఒకనాడు ఆఫీసుకు వస్తూనే అహ్మదుతో చెప్పేడు "సాయిబూ, మన పెరట్లో తొగరు చెట్టు నరికించీ... వెధవచెట్టు...." సాయిబు హడలిపోయేడు. "అదేం అయ్యగోరూ – పాపం ఆ చెట్టు యెన్నాల్లకో ముచ్చటగా సిగిర్చింది. దాన్నెందుకు నరకాలి?"

"నీకు తెలీదు – సాయంత్రానికి నరికించీ." అహ్మద్ గొణుక్కుంటూ వెళ్ళిపోయేడు.

ఒంటి గంటకి ఆఫీసుకి ఒక యువకుడొచ్చాడు చిట్టి వెంకట్రామయ్యగారి కోసం. ఆయనకి సరిగా గుర్తు రాలేదు.

"మరేం లేదు. మీ యింటో క్రింద భాగములో చాలా గదులున్నాయిట. నాకో గది అద్దెకిస్తారేమో అని అడుగుదామని వచ్చా"

"నేనెప్పుడూ యెవరికీ అద్దెకివ్వలేదే...... అయినా మీరెక్కడుంటున్నారు?"

"ఇక్కడే..... అంటే ఓ క ంపెనీలో ఉద్యోగం చేస్తున్నా. మీ యింటి దగ్గిరసానే వుంటున్నా. మా మేడమీంచి మీ పెరట్లో తొగరు చెట్టు అగుపిస్తుంది...."

చిట్టి వెంకట్రామయ్యగారు అదిరిపడ్డాడు. ఇప్పుడు పోలిక అందింది. కొంచెం సర్దుకొని అడిగాడు. "మీరు బాచిలరా?"

అతడు సిగ్గుతో అన్నాడు, "కాదండీ... మా ఆవిడ... పుట్టింటికి వెడుతూంది. మరేం..... పురిడికి..... ఈలోగా నాకెందుకు అంత యిల్లని... మీ యింట్లో ఏదో ఒక గది యిస్తే చాలు...."

చిట్టి వెంకట్రామయ్యగారి మనసులో ఒక పెద్ద అల్లకల్లోలం లేచి క్రమేణా చల్లబడింది. అది వొక పెద్ద శస్త్రచికిత్స! యువకుడిని మర్నాడు మంచి రోజని తనయింట్లో దిగిపొమ్మన్నాడు.

"అహమ్మదూ...."

"అయ్యగోరూ......"

"తొగరు చెట్టు నరకొద్దురా...."

"ఏం అయ్యగోరూ......"

"తొగరు చెట్టు చిగిర్చిందిరా...." చిరునవ్వుతో అన్నారు. అహమ్మద్‌తో సహా ఆఫీసంతా మూర్ఛపోయింది.

# యన్.ఆర్. చందూర్

**(1916 - 2011)**



**న**వలా నిర్మాత, కథా రచయిత, వ్యాసకర్త, అసంఖ్యాకంగా కథలు వ్రాసి, విశేష ఖ్యాతి నార్జించారు. వీరి కథలు చదువుతూంటే సాయంకాలంపూట పచ్చిక బయళ్ళ పైకి షికారు కెళ్ళినట్టుగా ఉంటుంది. అతి నాజూకైన హాస్యం. సున్నితమైన సంఘటనలూ, మనోహరమైన వాతావరణమూ, ఆశ్చర్య జనితమైన మలుపూ - వీరి కథల్లో గోచరిస్తాయి. 'జగతి' పత్రికా సంపాదకులు. మద్రాసులో నివసించేవారు.

**రచనలు :** భానుమతి భార్య, సీతతో సినిమాకు, శివరావు, నట్టింట దీపం, శిక్ష, మనకీ ఒక కారు, మహాబలిపురం మొదలగునవి.



# దరఖాస్తులు

త్రిభువనదాస్ భాగ్యవంతుడు. భాగ్యవంతుడంటే ఇలాగా అలాగా కాదు; అతి భాగ్యవంతుడు. అతనికి ఎంత ఆస్తి వుందో అతనికే తెలియదు. ఆ ఆస్తి వెండి రూపాయలుగా మారిస్తే, ఆ వెండి రూపాయలు కన్యాకుమారి నుంచి వింధ్యపర్వతాల దాకా పేర్చవచ్చునని ఒక వృద్ధుండుడు అంచనా కట్టాడు. అతను తలచుకొంటే అణన్నరకి దొరికే షేవింగ్‌బ్లేడ్ అర్ధరూపాయికూడా దొరక్కుండా చెయ్యగలడని కొందరు అర్ధశాస్త్రకోవిదులు అంటారు. అందులోని నిజానిజాలు మన కంతగా తెలియవు. త్రిభువనదాస్ సన్మార్గుడనీ, దాన ధర్మాలు విరివిగా చేస్తాడనీ మరికొంత మంది అంటూ వుంటారు. ఆ విషయమూ మనం అంతగా నమ్మకూడదు. త్రిభువనదాస్ గుప్పెట్లో 13 పెద్ద కంపెనీలు వున్నాయి. అతను ఎవరికీ ఒక పక్షాన కనిపించడు. పన్నెండేండ్ల బట్టీ పనిచేస్తూ, అతని మొహం ఎలా వుంటుందో చూడని బ్రాంచి మేనేజర్లు చాలా మంది వున్నారట.

13 కంపెనీల తాలూకు ఏ ఆఫీసులో ఎక్కడ ఏ ఉద్యోగం ఖాళీ వచ్చినా, ఆ ఉద్యోగంకోసం వచ్చిన దరఖాస్తుదారు లందర్నీ పరీక్షించి, వారిలో బాగా పనికొచ్చే వాడిని ఏరుకునేందుకు ఒక డిపార్టుమెంటు వుంది. దాని పేరు ఉద్యోగాలశాఖ. ఆ శాఖ నిర్వహణలో బోలెడంత కర్మా కాండ వుంది. ఏదో ఒక ఆఫీసులో గుమాస్తా గిరీ ఖాళీ అవుతుందనుకోండి. ఫలానా త్రిభువన దాస్ కంపెనీలో, ఫలానాబ్రాంచిలో, ఫలానా రకం ఉద్యోగం ఖాళీగా వుందనీ, ఫలానా అర్హతలు వున్నవారు, ఫలానా తేదీ అయిదు గంటల లోపున సదరు ఆఫీసుకి అందేటట్టు దరఖాస్తులు పెట్టుకోవచ్చుననీ దినపత్రికలలో ప్రకటిస్తారు. లక్షలాది నిరుద్యోగులున్న ఈ దేశంలో దరఖాస్తుదారులకి కొదవ ఏమిటి?

దరఖాస్తులు చూసే డిపార్టుమెంటులో నలుగురు గుమాస్తాలూ, ఒక హెడ్డూ వున్నారు. ఆ హెడ్డూ మా దాశరథి. గుమాస్తాల్ని సెలక్ట్ చెయ్యడం దాశరథి పని. దరఖాస్తూ, దరఖాస్తుకి గుచ్చి కంపెనీ వారి ఫారమొకటీ వుంటాయి. ఆ ఫారమ్ మీద దాశరథి తన రిమార్కులు రాయాలి. రూపం – తెలివి – ప్రపంచజ్ఞానం – మిగతా విశేషాలు; ఈ నాలుగూ పూరించి, తను ఏ కారణంవల్ల ఫలానా దరఖాస్తు దారుని ఏరినదీ వివరిస్తూ చిన్న నోట్ రాసి, త్రిభువనదాస్ గారి సెక్రటరీకి పంపాలి దాశరథి. అదంతా క్రమపద్ధతిలో జరగవలసిన తంతు. దాశరథి చేసిన సెలెక్షన్ పైవాళ్ళెప్పుడూ కాదనరు.

❊ ❊ ❊ ❊

"నీది భలే ఉద్యోగం!" అన్నాను.

"ఏం – అలా అంటావ్?" అని అడిగాడు దాశరథి.

"నీ పని ఉద్యోగా లివ్వడమేగా!"

"అది మాత్రం మాటలా? ఒక్కరోజు వచ్చి కూచో నా ఆఫీసులో – నీకే తెలుస్తుంది!" అని బెదిరించాడు.

ఉద్యోగం తీసెయ్యడమంటే కష్టం – ఒకళ్ళ కడుపు కొట్టడమవుతుంది కనక! ఉద్యోగం ఇవ్వడమంటే ఏదో పెళ్ళి భోజనం పెట్టడం లాంటిది. దాశరథి ఉద్యోగమే నాకువుంటే ఎంత సంతోషిద్దును!

"నువ్వు చాలా అదృష్టవంతుడివి, దాశరథీ."

"రేపు మా ఆఫీసుకి రా."

❊ ❊ ❊ ❊

మర్నాడు దాశరథి ఆఫీసుకు వెళ్ళాను. అతని టేబుల్‌మీద 109 అప్లికేషనులు కంపెనీవారి ఫారాలతో సహా ఒక గుట్టగా పడివున్నాయి.

ఆఫీసులో 7వ సెక్షనులో 5వ గుమాస్తాని సెలెక్టు చెయ్యాలి మా దాశరథి. దరఖాస్తుదారు లందరూ యిరవై యిరవై మూడేళ్ళ మధ్య నున్నవారు.

"ఇవన్నీ నెంబరు వారీగా వున్నాయి. దరఖాస్తుదారిది ఎన్నో నంబరో బయట నోటీసు బోర్డులో వుంటుంది" అన్నాడు దాశరథి. నాకు తన ఉద్యోగ ధర్మాన్ని పరిచయం చేస్తూ.

కాలింగ్ బెల్ కాక, ఎలక్ట్రిక్ బెల్ నొక్కగానే బయటనుంచి మొదటి దరఖాస్తుదారు లోపలికి ప్రవేశించాడు. టై లేదు గాని కాటన్ సూటు వేసుకున్నాడు.

"పేరు... మాధవరావు కాదూ?"

"అవునండి."

"బ్రిటన్‌కి ప్రధానమంత్రి ఎవరు?"

"చర్చిల్."

"ఆల్‌రైట్, ఇటుపక్క హాలులోకి వెళ్ళి కూచోండి, మిగతావారిని కూడా పరీక్షించిన మీదట మీకు ఉద్యోగం వొచ్చేదీ రానిదీ చెబుతాను."

మాధవరావు పక్క హాలులోకి వెళ్ళి కూచున్నాడు. దాశరథి అతని తాలూకు ఫారమ్‌మీద యిలా రాశాడు. "ఉన్నదున్నట్టు మొహంమీద చెబుతాడు."

రెండవ దరఖాస్తుదారు ప్రవేశించాడు. గీరల పాంటూ, బుష్ కోటూ, కళ్ళజోడు కూడాను.

"పేరు?" అని అడిగాడు దాశరథి.

"గోకుల్."

"బ్రిటన్‌కి ప్రధానమంత్రి ఎవరు?"

"మాల్టోవ్."

"ఆల్ రైట్. ఇటు పక్క హాలులోకి వెళ్ళి కూచోండి. మిగతా వారిది కూడా పరీక్షించిన మీద, మీకు ఉద్యోగం వొచ్చేదీ రానిదీ చెబుతాను."

గోకుల్ పక్క హాలులోకి వెళ్ళి కూచున్నాడు. దాశరథి గోకుల్‌కి సంబంధించిన ఫారమ్‌మీద యిలా రాశాడు : "ఊహాపోహాలు గల మనిషి."

"బ్రిటిష్ ప్రధాని మాల్టోవ్ అనే వాడికి వూహ పోహలేమిటి – నీ తలకాయ నా తలకాయ" అన్నాను దాశరథితో.

"దీన్నే 'యింటెలిజెన్స్ టెస్ట్' అంటాము. ఆ కుర్రవాడికి తెలిసే, మనల్ని తమాషా చేసేందుకు చెప్పాడేమో!"

"ఏడ్చినట్టే వుంది – కానియ్."

మూడవ దరఖాస్తుదారు వచ్చాడు. బిళ్ళగోచీ, పంచెకట్టు, లాల్చీ.

"పేరు."

"వినోదబాబు."

"బ్రిటన్‌కి ప్రధాని ఎవరో తరవాత చూచుకుందాముగాని, ఆ ఉద్యోగం నా కిప్పించారా, నేను ఇండియాకి ప్రధాని నవుతాను."

ఆభరణంలా ధరించే చిరునవ్వు చెదరకుండా దాశరథి, "ఆల్‌రైట్, ఇటు పక్కహాలులోకి వెళ్ళి కూచోండి. మిగతా వారిని కూడా పరీక్షించిన మీదట, మీకు ఉద్యోగం వొచ్చేదీ రానిదీ చెబుతాను."

మూడవ దరఖాస్తుదారు పక్క హాలులోకి వెళ్ళాడు. నాకు వొళ్లు మండిపోతోంది. ఈ దరఖాస్తు దారులందరూ ఒక పిచ్చి సజ్జులా వున్నారు. వినోదబాబు ఫారమ్ మీద యిలా రాశాడు మావాడు: "అనవసరమైన వాటి జోలికి పోడు."

నే నొక సిగరెట్టు ముట్టించి దాశరథికి ఆఫర్ చేశాను. "నువ్వు కాల్చుకో, నేను కాల్చకూడ దిక్కడ. నేను సిగరెట్టు ముట్టిస్తే, మా డిపార్టుమెంటల్ బాయ్స్ బీడీలు ముట్టిస్తారు"అన్నాడు దాశరథి.

ఇంతలో నాలుగవ దరఖాస్తుదారు వచ్చాడు. ఖద్దరు చొక్కా ఖద్దరు పంచె టోపీ మాత్రం లేదు.

"పేరు?"

"చిదంబరం."

"బ్రిటన్‌కి ప్రధానమంత్రి ఎవరు?"

చిదంబరం – "యింత చిన్న విషయం నాకు తెలియదనుకున్నారా!" అన్నట్టు మొహం పెట్టి – "ఆc..... యివ్వాళ పేపరు చూడటం మర్చిపోయాను." అన్నాడు.

"ఆల్ రైట్. ఇటు పక్క హాలులోకి.... .... ....."

నాలుగవ దరఖాస్తుదారు పక్క హాలులోకి వెళ్ళాడు. నా కింక కోప తాపాలు పోయాయి. విరోధుల క్కూడా దాశరథి ఉద్యోగం లాంటిది వొద్దనుకున్నాను. చిదంబరం ఫారమ్ మీద యిలా రాశాడు : "ఎంత కావాలో అంతే తెలుసుకుంటాడు."

అయిదవ దరఖాస్తుదారు బ్రిటన్‌కి ప్రెసిడెంటే గాని ప్రధాని లేడన్నాడు. ఆరవ అతను – బ్రిటిష్ ప్రధాని చాంబర్లేనో, ట్రూమనో అయుండాలి, ఎవరైతే మనకేం – అన్నాడు. ఏడవ అతను తడుముకోకుండా 'రూజ్‌వెల్ట్' అన్నాడు. 12వ అతను 'జార్జి' అన్నాడు. 34వ అతను 'ముస్సోలినీ' 'స్టాలిన్' పేరు చెప్పి చూదామనుకున్నాడు' – 69వ అతను.

లంచ్ టైములో దాశరథితో అన్నాను : "ప్రతి చవట వెధవనీ ఇలా చిరునవ్వుతో ఆహ్వానించి, వాడు చెప్పే వెర్రి సమాధానం శ్రద్ధగా విని, మళ్ళీ వాణ్ణి చిరునవ్వుతో సాగనంపటానికి చాలా ఓర్పు కావాలి. నీ కెంత యిచ్చినా మీ వాళ్ళకి నష్టం లేదు. నాకైతే వాళ్ళ జవాబులు వినలేక పిచ్చెత్తుతోంది సుమా! వెనక ఒక టీచరు మిత్రుడు చెప్పాడులే. 'మద్రాసు నుంచి ఏమి ఎగుమతి అవుతుంది' – అని తను ప్రశ్నయిస్తే – 'కచ్చికలు' అని రాశాడట, ఒక అఖండుడు. ఆకుర్రవాడికి 'కచ్చికలు' మినహా మరొకటి స్ఫురించకపోవడం వింతగా లేదూ?"

"నో, నో, ఆ కుర్రవాడు పెద్దయిన తర్వాత పళ్ళ వ్యాధితో బాధపడతాడు."

"ఇలాటి మిడతంబొట్లు శకునాలు చెబుతేనే, ఆ త్రిభువన్‌దాస్ నీకీ ఉద్యోగం యిచ్చినట్టున్నాడు."

"ఏమైనా, సాయంత్రం దాకా వుండి యజ్ఞం పూర్తి చేయించి వెళ్లు."

లంచ్ అయాక మళ్ళీ మొదలెట్టాడు దాశరథి.

"పేరు?"

ఫలానా...... వెంకయ్యో, తిమ్మప్పో, మాసిలామణో, రాముని నాయరో..... ఏదో ఒకటి.

"బ్రిటన్‌కి ప్రధానమంత్రి ఎవరు?"

84వ అతను 1947 ఆగస్టు 15వ తేదీ నుంచీ తనా పక్కకి చూడటం మానేశానన్నాడు. 93వ అతను 'స్మట్స్' అన్నాడు మహా తెలివిగా. 108వ అతను మన కెందుకు పోనిద్దురు అన్నాడు కలుపుగోరుతనంగా.

పరీక్ష సర్వసంపూర్ణం అయేప్పటికి నాలుగైంది. 109 మంది దరఖాస్తుదారులకీ మధ్యాహ్నం కాఫీ టిఫినూ త్రిభువన్‌దాస్ కంపెనీవారి కాంటీన్ ఫ్రీగా సప్లయి చేసింది. అందరూ ఫలితం కోసం ఎదురు చూస్తూ పక్కహాలులో కూచున్నారు. దాశరథి ఎవరిని సెలక్ట్ చేస్తాడా అని నేనూ ఎదురుచూస్తున్నాను.

చటుక్కున ఫోన్ తీసి, "అవునవును....సెక్రటరీగారు కావాలి.... దాశరథి మాట్లాడుతూ వుంట... ఎంప్లాయిమెంట్ డిపార్ట్‌మెంట్ దాశరథి. E ఆఫీసులో 7వ సెక్షన్‌లో 5వ గుమాస్తాగా గోకుల్‌ని సెలెక్టు చేశాను." అన్నాడు.

"ఓకె, ఓకె," అని వినిపించింది ఫోనులోనుంచి.

గోకుల్ లోపలకి పిలవబడ్డాడు. మిగతా 108 మంది ఏడుపు మొహాలతో యిళ్ళకి వెళ్ళి పోయారు. దాశరథి గోకుల్‌కి ఒక పచ్చ కార్డు యిచ్చాడు; మర్నాడు పొద్దున 9-55కి E ఆఫీసు దగ్గర హాజరై 7 వ సెక్షన్ హెడ్డుని కలుసుకో మన్నాడు. గోకుల్ ఎంతో సంతోషంగా వెళ్ళిపోయాడు.

"నీ సెలక్షన్ నా కేమీ నచ్చలేదు బ్రదర్. బ్రిటిష్ ప్రధాని పేరేమిటో తెలియని వాడికి ఉద్యోగ మివ్వడ మేమిటి?"

'పోన్లెద్దూ, నా డ్యూటీ నేను చేశాను" అన్నాడు దాశరథి.

❄ ❄ ❄ ❄

మూడురోజులు పోయాక, సాయంత్రం వేళ క్లబ్బులో కనిపించి చెప్పాడు దాశరథి!

"నన్ను మా కంపెనీవాళ్ళు అమెరికా పంపిస్తున్నారు, స్టడీటూర్."

"ఏడ్చినట్టే వుంది. బ్రిటిష్ ప్రధాని మాల్టోవ్ అన్న బడుద్ధాయికి ఉద్యోగం ఇచ్చిన ఘనుడివి కనకనా?"


"అక్కడే వుంది కీలకం."

"ఏమిటి?"

"గుమాస్తాలను సెలెక్టు చేయడంలో నా అంతటివాడు ఇండియాలో లేడని త్రిభువన్‌దాస్ అన్నాడట. నా సెలెక్షన్ చాలా బావుంది కనక అమెరికా పంపిస్తున్నారు."

"ఎందుకని బావుంది?"

"గోకుల్ అనే బావమరదొకడు మా సెక్రటరీకి వున్నాడని నేను ముందు తెలుసుకుని వుండటం వల్ల."



# దాసరి సుబ్రహ్మణ్యం

**(1921 - 2010)**

**క**థకులు, నవలా రచయిత. జీవితం అత్యంత కఠినంగా అనుభవంలోకి రావడం వల్ల, జీవితం తాలూకు కొన్ని సమస్యల పట్ల తీవ్రమైన రాగద్వేషాలు వుండటం చేత - ఆ ఛాయలు వీరి రచనల్లో ప్రతిఫలిస్తూ వుంటాయి. చెప్పదల్చుకున్న విషయాన్ని నిర్మోహమాటంగా, నిశితంగా సూటిగా, స్పష్టంగా చెప్పట వీరి ప్రత్యేకత. 'చందమామ' సంపాదవర్గంలో పని చేసేవారు.

**రచనలు :** ఇంద్రాణి, పగటి కలలు (కథలు) సినీ తార దుర్మరణం మొ॥ (నవలలు)

# ముందుచూపు

నంగోడి సింకిగట్టు మీద పూరిపాకలో, ఈతాకులు చాపమీద వెల్లికిలా పడుకునున్న పానకాలరావు బద్ధకంగా ఓసారి ఒళ్ళు విరుచుకొని, కళ్ళు మూయబోయి అంతలోనే ఉలిక్కిపడి లేచి కూచున్నాడు. చుట్టూ వున్న తాడితోపులో ఎక్కడో ఓ పమిడికంటి ప్రాణం కడబట్టినట్టు బొంగురుగా కీచుమన్నది. ఆ వెంటనే  సింకి అవతలనున్న సరుగుడు చెట్లలోంచి మరో పమిడి జంటి తీవ్రంగా తేటగా ఖంగుమని కంచు కంఠంతో జవాబు పలికింది.

"సింకి యివతల తాటితోపులో ఒకళ్ళూ, సింకి అవతల సరుగుడు చెట్లలో ఒకళ్ళూ – ఎవరెవరైనట్టు? వాడికీ వెంట బలగం లేదుగదా? వుంటే?.... వుండి ఒకళ్ళ నొకళ్ళు నరుక్కోవటం జరిగితే?...." పానకాలరావు శరీరం హఠాత్తుగా ఈదురుగాలి దెబ్బతిన్నట్టు పులకరించింది. అతడు పాక వాకిట్లోంచి బయటి చీకటి కేసి చూస్తూ, "ఇది రాత్రివేళ సాధించే పని గాదు; పగటి వేళ వాణ్ణి పట్టుకోవడం కష్టం, ఛీ, ఛీ!" అనుకున్నాడు నసుగుతున్నట్టు.

అప్పటికి చంద్రుడు అస్తమించి ఒక గంట అయింది. సముద్రం హోరుకూడా క్రమంగా తగ్గిపోతున్నది. సింకిలో పోటుకు నిండుగా ఎక్కిన నీరు, పాటుకు జల జలమంటూ సముద్రం కేసి తిరిగిపోతున్నది. నీటి పోటుతో పాటు సింకిలోకి వచ్చిన చేపలు, వేగంగా తిరిగిపోతున్న నీటిలో గిలగిల కొట్టుకుంటూ, మధ్యమధ్య ఠపీఠపీ మని గట్టుమీదికి ఎగిరిపడుతున్నవి. ఆ ధ్వనులు వింటున్న పానకాలరావు, "సింకిలో చేపలు యింత సునాయాసంగా దొరుకుతై గదా – వెంకడు అంత ఖరీదు చెపుతా డేం? వాడికి బస్తీకి వెళ్ళి రావడం అలవాటైంది. దానితో డబ్బాశ పట్టుకున్నది?" అనుకుంటూ అయిష్టంగా తలాడించి మునిపళ్ళతో కిందిపెదవ్ని గట్టిగా నొక్కుకున్నాడు?

తాడితోపులో నక్కలు రెండు భోరు భోరు మంటూ కూతవేసినై. ఆ వెంటనే పాకమీద రెక్కలు టపటప లాడిస్తూ, గుడ్లగూబ ఒకటి కెవ్వుమని అరిచింది. పానకాల రావు ముఖం చీదరింపుగా పెట్టుకుని, పాకలో నుంచి బయటకు వచ్చి, చిక్కనిచీకట్లో గీబు గీబు మంటున్న సరుగుడుతోపు కేసి చూచాడు. తోపులో ఎక్కడా రవంత కాంతి కూడా అతనికి కనిపించలేదు. వెనక్కు తిరిగి తాడితోపు కేసి చూచాడు. అక్కడ కూడ చిమ్మచీకటి. ఆఖరుకు మిణుగురులైనా కదులుతున్న సూచనలు లేవు.

"ఏమిడికంట్లు ఎందుకు అరిచినట్టు?" అనుకున్నాడు పాలకాలరావు. అవి పక్షుల అలికిడికీ, జంతువుల అలికిడికీ అరవవు. ఎవడో మనిషి కంటబడినప్పుడే అవి హెచ్చరికగా అరవటం జరుగుతుంది. అరవటం ఇంతకు ముందెవరో మనుషులు తాడితోపులోనూ, సరుగుడు తోపులోనూ కూడా వాటికి కనిపించారు. వాళ్ళెవరు? తన జీతగాడు నారన్న అనుమానిస్తున్నట్టు – మల్లయ్యక్కాడా కొందరు వత్తాసు గాళ్ళున్నారా? వుంటే?"

పానకాలరావుకు వెన్నెముక ఝలుక్కుమన్నట్టయింది. "నేను పిరికివాణ్ణవుతున్నానా?" అనుకున్నా డతడు. గుండెలు వేగంగా కొట్టుకున్నై. "పిరికి వాణ్ణి కాదు, ముసలి వాణ్ణవుతున్నాను" అనుకుంటూ పానకాలరావు తృప్తిగా తలాడించాడు. అంతలో ఎవరో వెన్నుమీద గట్టిగా చరిచినట్టయి, "నలభై అయిదేళ్ళకే ముసలితనమా? హుం హుం అంటూ గట్టిగా కాండ్రించి దూరంగా వూశాడు.

మల్లయ్యంటే నా కేదో భయం – అన్నభావం పానకాలరావు మనసులో కదిలీ కదలకముందే, అతడు కాళ్ళను నేలమీద గట్టిగా తాటించి, "వాడు పోలీసులకు చిక్కకపోగాక; వాళ్ళ పాలిటి యముడయినా అవుగాక – కాని నాకు ఈ పీకల......" పానకాలరావు గుబురు మీసాల చాటున చిరునవ్వు నవ్వుకుని. మీసపు కొనల్ని రెండు వేళ్ళ మధ్యా గట్టిగా పట్టుకొని ఎత్తి ఒక పురి కొట్టి వదిలాడు.

సింకికి అవతలిగట్టు నానుకొని వున్న సరుగుడు చెట్లలో టార్చిలైటు కాంతి గప్పున వెలిగి అంతలోనే ఆరిపోయింది. పానకాలరావు శరీరం ఆపాదమస్తకం బిర్రబిగుసుకు పోయింది. ఓ క్షణకాలం ఉఛ్వాస నిశ్వాసాలు ఆగిపోయినై. అంతలో గట్టుమీద నారన్న మాటలూ, అతడి చేతిలోని టార్చిలైటు కాంతి కనబడింది.

"లోతుంటుందేమో" అని నీళ్ళని చూసి దడుసుకు చస్తున్నావా, చావవురో దిగు!" అని నారన్న గట్టిగా కసురుకుంటున్నాడు. ఆ వెంటనే మరో టార్చిలైటు కాంతి సింకి నీళ్ళల్లోకి పడింది. ఆ వెలుగులో పానకాలరావు, "ఒకటి, రెండు, మూడు, నాలుగు.....ఐదు!" అని లెక్కపెట్టుకుని,. "నేను అనవసరంగా భయపడ్డాను సుమా!

పోయిన నలుగురూ తిరిగి వస్తున్నారు. వాడూ ప్రాణాలతోనే చిక్కాడు!" అనుకుంటూ వున్నచోటునుంచి కదిలి పాకలోకి వెళ్ళాడు.

పాకలో ఒకమూల కునికిపాట్లు పడుతున్న లాంతరువత్తి పెద్దది చేసి, దాన్ని పాకగుమ్మంలో పెట్టి, పానకాలరావు తిరిగి చాప మీద కూచున్నాడు. ఇంతలో పాకముందు నుంచి "దొరగారో, వాణ్ణి పట్టుకు లాక్కొచ్చాం!" అన్న నారన్న గొంతి వినిపించింది.

"వాణ్ణి పాకలోకి తీసుకురా. తతిమ్మా ముగ్గుర్నీ పాక బయటనే వుండమను" అన్నాడు పానకాల రావు కర్కశంగా.

నారన్న కుడిచేతితో బరిసె ఝళిపిస్తూ, ఎడం చేతిలో వున్న టార్చిలైటును వెన్నుమీద బలంగా ఆనించి ఒక వ్యక్తిని పాకద్వారం గుండా లోపలికి నెట్టాడు.

"ఏదీ, లాంతరు వాడి ముఖానికి చూపించు, ఈ ప్రాంతాల నన్నే ఎదిరించి బతక దలిచిన ఆ మొనగాడి ముఖం యెలా వుంటుందో చూస్తాను" అన్నాడు పానకాలరావు.

నారన్న పాకలోకి వచ్చి, లాంతరు అందుకుని, దాన్ని పట్టుకు వచ్చిన వాడి ముఖం ముందు ఆడించాడు. పానకాలరావు ఆ ముఖం చూస్తూనే గతుక్కుమన్నాడు. ఆ ముఖం ఎన్నడో, ఎక్కడో చూసిందే!

"ఊఁ, ఇక లాతరు కిందపెట్టి, నువ్వు కూడా బయట నుంచో!" అన్నాడు పానకాలరావు బొటనవేలుతో మీసాన్ని పైకి దువ్వుకుంటూ.

ఆ వచ్చిన వాడిలో చలనం లేదు. ముఖంలో ఏ భావమూ ప్రస్ఫుటం కావటం లేదు. ఒకసారి మెడ కొంచెం ప్రక్కకు తిప్పి, చూరు అంచు కేసి చూసి, చిరునవ్వు నవ్వబోయి తమాయించుకుని నిబ్బరంగా నిలబడ్డాడు.

పానకాలరావు అతణ్ణి నఖశిఖ పర్యంతం పరీక్షగా చూశాడు. మనిషి ఆజానుబాహువు, ఆరడుగులకు ఏ కొంచెమో తగులుగా వుంటాడు. మట్టి కొట్టుకుని మాసిపోయి వున్న కంటి మెడ బనీనులోంచి, ఎత్తయిన వక్ష స్థలం, కండలు తిరిగిన దండెలూ కొట్టవచ్చినట్టు బయటకు ఉబ్బరించుకు కనబడుతున్నవి.వయసు ముప్పై అయిదూ నలభై మధ్య వుంటుంది. నల్లని తుమ్మెద రెక్కల్లాంటి వత్తు మీసం కట్టు, కొడవలి మొనలా బుగ్గల మీదికి మెలి తిరిగి వున్నది. వెనక్కు విరిచి మోకాళ్ళ వరకు కట్టుకుని వున్న కావిరాయి పంచ, నీళ్ళలో సగం వరకు తడిసి, ఆ నీరు మోకాళ్ళ మీదుగా పాదాల వరకూ జారి, పాకలో అతడు నిలబడిన చోట భూమిని చెమ్మగిల చేస్తున్నది.

"నీ పేరు?" అన్నాడు పానకాల రావు హఠాత్తుగా పిడుగు పడ్డట్టు.

"పేరైనా తెలియకుండానే నన్ను పట్టుకునేందుకు బరిసె లిచ్చి నల్గురు జీతగాళ్ళను పంపావా?" అన్నాడా వ్యక్తి.

"నీ పేరేమిటని అడుగుతున్నాను!" అంటూ పానకాల రావు గట్టిగా చాప మీద గుద్ది, కళ్ళు రిమాడు.

"ఈమధ్య చాలా కాలంగా మల్లయ్య."

ఆ చెప్పడంలో అవహేళనే గాక, పెదాలమీద రవ్వంత చిరునవ్వు కూడా కదలినట్టు పానకాలరావు అనుమాన పడ్డాడు. "ఇదెక్కడో బాగా చూసిన ముఖమే. ఎక్కడా?" అన్న మధన ప్రారంభమైంది అతడి మనస్సులో.

మల్లయ్య నిశితంగా పానకాలరావు ముఖంలోకి చూస్తూ, పాక చూరుకు మరింత దగ్గిరగా జరిగే ప్రయత్నంలో కొంచెంగా ప్రక్కకు కదిలాడు.

"నువ్విక్కణ్ణుంచి ప్రాణాలతో పోలేవు. బైట బరిసెలు పట్టుకుని నా జీతగాళ్లు నలుగురు తయారుగా వున్నారు తెలుసా?" అన్నాడు పానకాలరావు.

"తెలుసు. నన్నిక్కడికి తీసుకువచ్చే దారిలో, సింకి గట్టుపక్కనే నా కోసం తీసిన గొయ్యిని కూడా, నీ జీతగాడు నారన్న నాకు చూపించాడు" అన్నాడు మల్లయ్య.

పానకాలరావు ముఖంలో ఆశ్చర్యం, అనుమానం పడుగూపేకల్లా అల్లుకుపోయినై. మల్లయ్య చిరునవ్వు నవ్వాడు.

"ఇన్ని తెలిసివుండీ, నువ్వెందు కింత అహంభావం కనపరుస్తున్నావ్?" అన్నాడు పానకాలరావు.

"తెలుసుగనకే?" అన్నాడు మల్లయ్య నిబ్బరంగా.

"తెలుసు గనక?"

"నేను ప్రాణాలతో యిక్కడనుంచి పారిపోలేనని తెలుసు గనక."

"ఇంత కాలంగా పోలీసుల కళ్ళే గాక, నా కళ్ళు కూడా కప్పి, ఈ ప్రాంతాల దొంగసారా కాస్తున్న నువ్వు ఎంతో తెలివిగల వాడివై వుంటా వనుకున్నాను. కాని నువ్వు వట్టి వెధవలా కనిపిస్తున్నావు" అన్నాడు పానకాలరావు ఏవగింపుగా.

మల్లయ్య కుడిచెయ్యి పైకెత్తి, పాకచూరులో నుంచి బయటికి పొడుచుకు వచ్చిన, ఒక కొయ్య పిడిమీద చూపుడు వేలితో ఠంగుఠంగు మనిపించాడు. ఆ శబ్దం వింటూనే పానకాలరావు, అటుకేసి పరీక్షగా చూసి కొయ్యబారిపోయాడు.

"ఇది గీత కత్తి! ఇక్కడ చూరులో యిది చాలాకాలంగా వుండటం నాకు తెలుసు. మీరెవరూ యిక్కడ లేని సమయంలో, వానా వంగిడి తారసపడితే యీ పాకలో తలదాచుకొనే వాణ్ణి. నువ్వు, నీ జీతగాళ్లను కేక వేసే లోపల, ఈ గీత కత్తితో నీ గొంతు కోయగలను. ఆ తరువాత నీ జీతగాళ్ళ బరిసె పోట్లకు నేనెలానూ చస్తాను. నా చావుకోసం అన్నీ సిద్ధం చేసిన నిన్ను చంపకుండా నేనెందుకు చావాలి?" అన్నాడు మల్లయ్య.

పానకాలరావు ఎంతో ప్రయత్నం మీద నరాలను చిక్కబట్టుకొని "నిన్నెక్కడో లోగడ చూశాను; ఎక్కడా?" అన్నాడు గొంతులో కాస్త జీర పలికిస్తూ.

"నన్ను నువ్వు చూసి చాలా కాలమైంది," అన్నాడు మల్లయ్య.

"ఎక్కడా?"

"బళ్ళారిలో నువ్వూ, నేనూ మరి చాలా మందిమి ఒకేచోట వున్నాం. ఆ రోజుల్లో మనిద్దరికీ పెద్ద స్నేహమంటూ లేకపోయినా, ఒకళ్ళ కొకళ్ళం బాగా పరిచయస్థులం కింద లెక్క." అన్నాడు మల్లయ్య.

పానకాలరావు నిలువుగుడ్లతో మల్లయ్య ముఖంలోకి ఓ క్షణకాలం చూసి ఆతృతగా, "నీ పేరు మల్లయ్య కాదు. సత్తెం సత్యం! వార్డె బసప్పను కట్టిపేడుతో గొడ్డును బాదినట్టు బాదింది నువ్వే కదా?" అన్నాడు.

మల్లయ్య చిరునవ్వు నవ్వుతూ తలాడించాడు.

"దేశం కోసం ఎంతో త్యాగం చేసిన నువ్వు ఈనాడు యిన్ని నీచపు పనులు చేస్తున్నావేం?" అన్నాడు పానకాల రావు, ఈసడింపుగా.

"నీ సంగతి?"

"నేనా?"

మల్లయ్య పానకాలరావు కేసి అడుగు వెయ్యబోయి ఆగి, "నీకున్న కీర్తి ఈ చుట్టుపక్కల అందరికీ తెలుసు. చాటుగా అందరూ నిన్ను పిలిచే పేరేంటో తెలుసా? పీకల పానయ్య!" అన్నాడు కటువుగా.

"అంటే, నే నెన్ని పీకలు కోశానో, ఈ చుట్టుపట్ల అందరికీ తెలుసునన్న మాట!" అంటూ పానకాలరావు అవహేళనగా నవ్వాడు.

పాక బయటి చీకటిలో నుంచి పెద్దగా మాటలు వినిపించినై. పానకాలరావు వాకిట్లోంచి బయటి చీకటిలోకి చూస్తూ. గొంతెత్తి ఏదో అనబోయేంతలో, మల్లయ్య చూరులో వున్న గీతకత్తి పిడిని కుడిచేత్తో పట్టుకుంటూ, ఎడమ చేత్తో పానకాలరావుకు కేక వెయ్యవద్దని సౌంజ్ఞ చేశాడు.

పానకాలరావు గతుక్కుమని, అంతలోనే సర్దుకుంటూ చాపమీద తాపీగా కూర్చుని, "అయితే సత్యం నా గురించి నీకు చాలా సంగతులు తెలుసునన్నమాట! అంత దుర్మార్గుణ్ణని తెలిసీ నాతో విరోధం ఎందుకు పెట్టుకున్నావ్?" అన్నాడు.

"ఇద్దరు దుర్మార్గుల మధ్య వుండవలసినది విరోధం కాదు, స్నేహం" అన్నాడు మల్లయ్య నిండుకంఠంతో.

"బాగానే వుంది. కాని నువ్వొక సంగతి మరిచిపోతున్నావ్. నేను నీకన్న ఎన్నో రెట్లు పెద్ద దుర్మార్గుణ్ణి. ఈ చుట్టుపక్కల పదీ పన్నెండు మైళ్ళ లోపల నా మాటకు తిరుగులేదు. పైగా నేను మాట తప్పేవాణ్ణి కాదు. మరెవరో కూడా ఈ ప్రాంతాల నుంచి దొంగసారా బస్తీకి చేరవేస్తున్నారని హెచ్చరికలు వచ్చిం తరువాతే, నీ కోసం వేట సాగించాను" అన్నాడు పానకాలరావు.

"బస్తీకి సారా చేరవేస్తున్నది నేను కాదు" అన్నాడు మల్లయ్య.

"అదా సంగతి? ఇంతకు ముందు తాడితోపులో పమిడికంట్లు కూత వేసినప్పుడే అనుకున్నాను. నీ క్కూడా ఏదో కొంత బలగం వుందని" అన్నాడు పానకాలరావు తాపీగా.

"నాకు బలగం ఏమీ లేదు, నేను కాచింది ఓ గుర్తు గల చోట పెడతాను, వాళ్ళు డబ్బు అక్కడ పెట్టి దాన్ని ఎత్తుకుపోతారు."

"ఆ డబ్బు సంగతి నాకు తెలియదు గాని నువ్వు సారా దాచే చోటు ఈ మధ్యనే తెలుసు కున్నాను. వెంకడు.... యానాది వెంకడు తెలుసుగదా... చేపల కోసం సింకి నీళ్ళల్లో వల వేస్తుంటాడు... సరే పోలీసులు ఈ ప్రాంతాలకు రాకుండా చూచుకోవలసిన అవసరం నాకు చాలా వుంది. నాది పెద్ద వ్యాపారం, అంతా టోకు, నీ చిల్లర మల్లర వ్యాపారంతో నాకు లేనిపోని చికాకులు తెచ్చిపెడుతున్నావ్. పైవాళ్ళకు తెలిసి, ఏవైనా చిక్కులొచ్చే ట్టుంటే నే నింత పారేసి వాళ్ళ నోళ్ళు కట్టగలను. నీ చేత ఏమవుతుంది?"

పానకాలరావు మాటలు వింటున్నంత సేపూ, మల్లయ్య పెదాల మీద చిరునవ్వు లీలగా కదలుతూనే వుంది. ఓ కంటితో వారగా పాక ద్వారం కేసి మధ్య మధ్య చూస్తూనే వున్నాడు.

"నేనూ ఏదో ఒకనాడు నీ అంత డబ్బూ, దానితో పాటు నలుగురినోళ్ళూ కట్టగలిగే శక్తి సంపాయిస్తాను – తొందరపడకు. అయినా, మనలో మాట. నీకు పీకల పానయ్య అని కీర్తి తెచ్చిన రెండు శాల్తీలనూ లేపినందుకు ఆ పై వాళ్ళకూ ఎంత యిచ్చి నోళ్లు కట్టావ్?" అన్నాడు మల్లయ్య.

పానకాలరావు అయిష్టంగా ముఖం చిట్లించి, "దమ్మిడీ ఇవ్వవలసిన అవసరం కలగలేదు. శవాలు కనిపిస్తే గదా! నీకూ వాళ్ళ గతే పట్టబోతున్నది" అన్నాడు.

"మళ్ళీ మొదటికి వస్తున్నావ్, సరే!" అంటూ మల్లయ్య, పాకచూరులో వున్న గీతకత్తి పిడిమీద చేయివేసి "ఊఁ, నీ జీతగాళ్ళను కేక వేయదలిస్తే వెయ్యి!" అన్నాడు పళ్ళు బిగించి.

పానకాలరావు, మల్లయ్య ముఖంలోకి ఓ క్షణంకాలం చూసి, నిర్వేదంగా తలాడిస్తూ. "నువ్వు వట్టి పొగరుబోతు వనుకున్నాను, కాదు, నిజంగా ధైర్యవంతుడివే. ఇప్పుడు చెప్పు;

నువ్వు ఏ కూలో నాలో చేసుకు బతక్క, ఇంత ప్రమాదకరమైన పనుల్లోకి ఎందుకు దిగావ్?" అన్నాడు.

"నువ్వు?"

"ముందా ప్రశ్న వేసింది నేను" అన్నాడు పానకాలరావు కోపంగా.

"కూలీ నాలీ వల్ల పొట్ట గడవలేదు. అందుకని."

"లక్షలూ కోట్లమంది పొట్ట గడుపుకుంటున్నారు." అన్నాడు పానకాలరావు మల్లయ్య మాటలకు అడ్డువస్తూ.

"మన కలాంటి శక్తీ లేదు, ఓర్పూ లేదు. నీ సంగతేమిటి?" అని రెట్టించినట్టు ప్రశ్నించాడు మల్లయ్య.

"నా సంగతా? నేను పుట్టు దుర్మార్గుణ్ణి!" అన్నాడు పానకాలరావు ఉద్వేగంతో కళ్ళింత చేసి, ముక్కు పుటాలు ఎగరవేస్తూ.

"నేను మాత్రం పుట్టు దుర్మార్గుణ్ణి కాదు. దుర్మార్గులు ఎంత కులాసాగా, కుదురుగా బతుకుతున్నారో చూసి, నేర్చుకున్న వాణ్ణి, మాటవరస కడుగుతున్నాను; మనం ఒకప్పుడు బళ్ళారి జైలులో కాలం గడిపినందువల్ల ఎవళ్ళకైనా మేలు జరిగిందంటావా?" అన్నాడు మల్లయ్య.

"ఏమో కీడేం జరగలేదు. ఆనాటి సంగతులన్నీ గుర్తు తెచ్చుకున్నప్పుడు, అది పూర్వజన్మలో జరిగిపోయినట్టుగా వుంటుంది. అప్పట్లో పెద్ద పెద్ద వాళ్ళ వల్ల ఎంతలేసి గొప్ప సంగతులు విన్నాం," అన్నాడు పానకాలరావు, ఏదో మత్తులోకి జారుకుంటున్నవాడిలా.

"ఆ వివరాలేవీ నా కంతగా గుర్తు లేవు," అన్నాడు మల్లయ్య.

"ఎందుకు లేవూ, వున్నాయి. ఇప్పుడు మన మాటల తీరు చూసి, ఎవరైనా మనల్ని దొంగసారా తయారుచేసి బతికే వాళ్ళనుకోగలరా? ఏదీ మన నోటినుంచి యింతవరకు ఒక్కగానొక్క బూతుమాట రాలేదు. ఎందువల్లా?"

"బళ్ళారి జైలు, పెద్దల సావాసం!"

పానకాలరావు అప్పుడే మత్తులోంచి బయట పడినవాడిలా, కళ్ళింత చేసుకొని, చుట్టూ ఓమారు కలయచూసి, మల్లయ్య ఎదురుగా నిలబడివున్నట్టు అపుడే గుర్తించిన వాడిలా, "ఇంతకూ నువ్వనేదేమిటి." అని ప్రశ్నించాడు అదమాయిస్తున్నట్టు.

"నే ననేదేమీ లేదు. మన యిద్దరం బతకటమో లేక చావటమో నీ చేతిలో వుందంటున్నాను." అన్నాడు మల్లయ్య తాపీగా.

"నీకు పెళ్ళాంబిడ్డ లున్నారా?"

"ఊహూఁ"

"నాకూ లేరు. అందుకే నీ వింతగా తెగించావ్?" అన్నాడు పానకాలరావు.

"దారిలో నా కోసం తీసిన గోతిని నీ జీతగాడు చూపించాడు."

"అదీ సంగతి!"

"అయితే యిక వెళ్ళనా?" అంటూ మల్లయ్య, పాక వాకిలికేసి కదలబోయాడు.

"ఎలా వెళతావ్?" అన్నాడు పానకాలరావు తీవ్రంగా.

మల్లయ్య చప్పున చేయి యెత్తి పాక చూరులోంచి గీతకత్తిని బయటికి లాగి, "యిక నీ జీతగాళ్ళు నలుగురినీ కేకపెట్టు!" అంటూ పానకాలరావుకేసి ఒకడుగు వేశాడు.

"ఆగు!" అన్నాడు పానకాలరావు తొణక్కుండా. మల్లయ్య ఆగాడు.

"నీ చేతిలో వున్న కత్తిని చూసి భయపడిపోయాననుకోకు. ఈ నాటినుంచి మనిద్దరం భాగస్థులం. ఏమంటావ్?" అన్నాడు పానకాలరావు.

"నా కభ్యంతరం లేదు. కాని, నామీద ఆధారపడి బతుకుతున్న వాళ్ళు, ముగ్గురున్నారు. వాళ్లకి బస్తీలో పెళ్లాం బిడ్డలు కూడా వున్నారు."

"వాళ్ళకు గిట్టుబాటయేది గిట్టుబాటవుతూనే వుంటుంది. పోతే, ఒక షరతు. ఆ జరిగే దేదో యికనుంచి నా ద్వారా జరగాలి." అన్నాడు పానకాలరావు.

"ఇందులో మోసం ఏమీలేదు! ప్రమాణం చేస్తావా?" అనడిగాడు మల్లయ్య.

"కావాలంటే చేస్తాను. పీకల పానయ్య చేసే ప్రమాణాలకి విలువుందని యింత వరకూ నాకు తెలీదు." అన్నాడు పానకాలరావు.

"అయితే ప్రమాణాలతో పనిలేదు" అంటూ మల్లయ్య గీతకత్తిని చూరులో దోపి,"ఇక వెళ్లనా?" అన్నాడు.

"కొంచెం ఆగు. జీతగాళ్ళను లోపలకు రానీ" అంటూ? పానకాలరావు, "నారన్నా!" అని కేకపెట్టాడు.

కేక వింటూనే నారన్న బరిసె పట్టుకుని పాకలోకి వచ్చాడు. "ఆ ముగ్గుర్ని కూడా రమ్మను" అని చెప్పాడు పానకాలరావు. నారన్న తతిమ్మా ముగ్గురు జీతగాళ్లనూ కేక వేశాడు.

పానకాలరావు వాళ్లకు మల్లయ్యను చూపిస్తూ "ఈ రోజు నుంచీ మల్లయ్య మనలో ఒకడు తెలిసిందా?" అని చెప్పి "ఆ సీసాకాయలు మూడూ వెంటనే వెళ్ళి పట్టుకురండి," అంటూ, మల్లయ్య కేసి తిరిగి చిరునవ్వు నవ్వుతూ, ఓ కన్ను సగం మూసి తలాడించాడు.

"ఆ కాయలు అక్కడే వుండనివ్వండి. తెల్లవారుజామున వాళ్లొచ్చి ఎత్తుకుపోతారు" అన్నాడు మల్లయ్య ఆదుర్దాగా.

పానకాలరావు పెద్దగా నవ్వాడు. వాళ్ళు ఎత్తుకుపోవడమే జరిగితే, బస్తీలో అది తాగిన ముగ్గురిలో యిద్దరు చస్తారు. బతికివున్న వాడు నీ ఖాతాదార్ల పేరు చెపుతాడు. వాళ్ళు నీపేరు చెపుతారు. నువ్వు ఉరెక్కవలసి వస్తుంది."

మల్లయ్య ఏదో ప్రశ్నించబోయాడు. కాని నోట మాట పెగలలేదు.

"నువ్వు నా చేతికి చిక్కు తావో చిక్కవోనని, నువ్వు పొదల్లో దాచిన మూడు సీసాకాయల సారాలో రెండింట్లో మాత్రం నాభి కలిపించాను. ముందు చూపుకు నాది పెట్టింది పేరులే;" అన్నాడు  పానకాలరావు.

మల్లయ్య ఓ క్షణకాలం నిశ్చేష్టు డయాడు. మరుక్షణం అతడి శరీరం భయంతో వణికిపోయింది.

"పానయ్యా, నే వెళుతున్నాను. మళ్ళీ నీకు కనబడితే రేపు మధ్యాహ్నం లోపల కనబడతాను. లేకపోతే.... ఈ ప్రాంతాల నలభై యాభై మైళ్ళ లోపల ఎక్కడా లేననుకో.ఎందుకైనా మంచిది, ఆ చూర్లో వున్న గీతకత్తి తీసి కనబడకుండా దాయి" అంటూ మల్లయ్య పాకలోంచి చక చకా బయటికి నడిచి సరుగుడు తోపుకేసి వెళ్ళిపోయాడు.



# దేవరకొండ బాలగంగాధర తిలక్

**(1921 - 1966)**

**క**థ, నాటిక, కవిత, వ్యాసం - ఏ సాహిత్య ప్రక్రియయైనా వీరి చేతిలో సాన పట్టిన వజ్రం వలె రాణిస్తుంది. కవితకీ కథకూ గల సంబంధం వీరి కథల్లో సువ్యక్తమౌతూ వుంటుంది. 'కథకునికీ నవలాకారునికీ జీవితమే లేబరేటరీ. ప్రతి కథా మనకి జీవితంతో, జీవిత రహస్యంతో, జీవిత వైచిత్రితో కొంత కొత్త పరిచయాన్ని కలుగజెయ్యాలి.' ఈ సిద్ధాంత సత్యానికి వీరి కథలు నిదర్శనాలనవచ్చు.

**రచనలు :** ప్రభాతము - సంధ్య, కళినోపనిషత్, గోరువంకలు (కావ్యాలు) సుచిత్ర ప్రణయం, సుశీల పెళ్లి (నాటికలు) సుందరీ - సుబ్బారావు, ఊరి చివరి ఇల్లు (కథల సంపుటాలు)

# నవ్వు

రామచంద్రరావు, ఎప్పుడూ నవ్వుతూ కనిపిస్తాడు. అతనికి నవ్వడం ఒక స్వభావమైపోయినట్టూ, కష్టాలూ చికాకులూ అతనికి దూరంగా తొలగి వుంటాయన్నట్టు అనిపిస్తుంది. ఊళ్ళో అందరినీ అతను నవ్వుతూ పలకరిస్తాడు. అందరూ అతనికి స్నేహితులు.

అతను పక్కనుంటే మూర్తికి వొళ్ళంతా తేలిక పడినట్టు. ఉదయపు  నీరెండ వంటి ఉత్సాహం వచ్చినట్టు అనిపిస్తుంది. మూర్తికి సమస్యలు చాలా వున్నాయి. కాని ఆ సమస్యలన్నీ రామచంద్రరావు ఎదురుగా ఉన్నంతసేపూ మంచు విడిపోయినట్లు మాయమైపోతాయి.

కాని, మూర్తికి ఎప్పుడూ ఆశ్చర్యం కలుగుతూంటుంది. ఎందుకు ఇతని వదనాన, ఒక విషాదరేఖ గానీ, విసుగు గాని కనిపించవు? ఏ జీవిత రహస్యం యితనికి తెలుసును? సుఖంలోని ఆనందంలోని ఏ కీలకాన్ని ఇతను వశపరచుకున్నాడు?

తీరా చూస్తే రామచంద్రరావు సామాన్యుడు. ఆస్తీ హోదా ఉన్నవాడు కాదు. ఏదో చిన్న ఉద్యోగం చేసుకుంటున్నాడు. 'నా' అన్నవాళ్ళెవరూ ఉన్నట్టు కనపడరు. అతను వొంటరివాడు. ఏలూరు నుండి వచ్చే బస్సు ప్రమాదానికి లోనయిందనీ ప్రయాణీకులకి చాలా మందికి గాయాలు తగిలాయనీ విన్నాడు మూర్తి. వారిలో రామచంద్రరావు ఒకడని తెలిసినప్పుడు చాలా బాధపడ్డాడు మూర్తి. కంగారు పడ్డాడు. సరాసరి టిక్కెట్టు కొనుక్కుని ఏలూరు వెళ్ళి ఆస్పత్రికి వెళ్ళాడు. గాయపడిన వారిలో రామచంద్రరావును గుర్తించడం కష్టమయింది. అతనికి తలకీ చెంపలకీ కట్లు వున్నాయి. అతనికి స్పృహ లేదు. మూర్తి గాభరా పడ్డాడు. తక్కిన గాయపడిన వారందరి దగ్గరా వారివారి భార్యలూ తలితండ్రులూ వున్నారు. రామచంద్రరావు మాత్రం వొంటరిగా మృత్యువుకీ బ్రతుకుకీ మధ్య ఉన్న మసక

మసక అంచుమీద ఉన్నాడు. మూర్తికి కళ్ళనీళ్ళు తిరిగాయి. ఇంత ఉత్తముడికి ఎందుకిటువంటి గతి పట్టింది అనుకున్నాడు. అతని మంచం ప్రక్కన ఒక కుర్చీమీద కూర్చున్నాడు మూర్తి. స్పృహ రాగానే.... తనని చూస్తాడనీ కావలించుకొని ఏడుస్తాడనీ అనుకున్నాడు. తనకీ ఏడుపు వచ్చేస్తుంది. ఎలాగ యితనికి ధైర్యం చెప్పి వోదార్చడం? ఎప్పటికో గాని రామచంద్రరావుకి స్పృహ రాలేదు. అతడు కొంచెం కదలడం మొదలు పెట్టాడు. మూర్తి గుండెలు కొట్టుకున్నాయి. దుఃఖంతో ఆనందావేశంతో రామచంద్రరావు కళ్ళు తెరిచాడు. ఓ నిముషం తదేకంగా మూర్తి కేసి చూశాడు. 'బతికే వున్నానా' అంటూ నవ్వాడు. సన్నని చిన్నని నవ్వు. హాయిగా మొగ్గవిడి తెల్లని పువ్వు రేకులను విచ్చు కుంటూన్నట్టు.

మూర్తి 'షాక్' తిన్నాడు. అలాంటి విపత్సమయంలో కూడా అతడు నవ్వగలడని అనుకోలేక పోయాడు. తర్వాత రోజున మాటల సందర్భంలో అతని చేతిని, తన చేతిలోకి తీసుకుంటూ మూర్తి అన్నాడు. 'రామం' నీవు పెళ్ళి చేసుకోవాలి. ఇటువంటి సమయంలో నీకు భార్యవుంటే ఎంత పరిచర్య చేసేది? ఇలా ఒంటరిగా ఎన్నాళ్ళు వుంటావు.

రామచంద్రరావు జవాబుగా – నవ్వాడు.

సరళ కనుక అంగీకరించి వుంటే రామచంద్రరావుకి యీ వొంటరితనం ఉండేది కాదు.సరళ రామచంద్రరావుకి దూరపు బంధువుల అమ్మాయి. సన్నగా నాజూకుగా వుంటుంది. ఆమె కళ్ళలో తెలివైన వెలుతురు వుంది. సరళా రామచంద్రరావూ కలిసి చదువుకున్నారు. అప్పుడే వారిద్దరి స్నేహంకలిసింది. ఆ స్నేహం ప్రేమగా మారినట్టు కూడా మూర్తికి తెలుసును. రామచంద్రరావు మూర్తితో అన్ని సంగతులు చెప్పేవాడు. ఆమె తనని తప్పకుండా పెళ్ళి చేసుకుంటుందన్న విశ్వాసాన్ని ప్రకటించేవాడు. సరళ తల్లిదండ్రులు కూడా ఏ నాడూ వీరిరువురి స్నేహానికి అభ్యంతరం చెప్పలేదు. సరళ తల్లిదండ్రులు కలవారు. సరళ ఒక్కర్తే వారి సంతానం. రామచంద్రరావుకి సరళతో పెళ్ళి జరగాలనీ, దానితో అతని వొంటరి తనమూ ఆర్థిక సమస్యా రెండూ తీరి సుఖిస్తాడనీ నిజమైన నిర్మలమైన స్నేహితుడైన మూర్తి ఎంతో ఆశించేవాడు.

"రామం, నువ్వెప్పుడైనా ఆమె అభిప్రాయం తెలుసుకున్నావా?" అని అడిగాడు మూర్తి. రామచంద్రరావుకి ఉద్యోగం వచ్చిన రోజున.

"సమయం రానీ" అన్నాడు రామచంద్రరావు

రెండు మూడు నెలల అనంతరం సరళా రామచంద్రరావులు పార్కులో కలుసుకున్నారు.

విద్యుద్దీపాల కాంతీ, సప్తమీ వెన్నెలా కలిసి వీరు కూర్చున్న బెంచీ మీద విచిత్రంగా

పడింది. రామచంద్రరావు తన మనస్సులోని అభిప్రాయాన్ని విప్పి చెప్పాడు కాని ఆ క్షణాన సరళ వివేకం ఆమె హృదయ దౌర్బాల్యాన్ని జయించింది.

"రామం, నీ ఆస్తి యెంత?" అని అడిగింది.

"ఒక పాత పెంకుటిల్లు, అదైనా మావూళ్ళో వుంది" అన్నాడు రామచంద్రరావు.

"భూమి గట్రా ఏమైనా..." అని ప్రశ్నించింది సరళ.

"సెంటు భూమి కూడా లేదు" అనికులాసాగా జవాబు చెప్పాడు రామం.

"నీ జీతం ఎంత?" అని అడిగింది సరళ.

"నూట యిరవై రూపాయలు" అన్నాడు రామం.

సరళ నిట్టూర్చింది. ఆమె తన సాధక బాధకాలూ, అవసరాలూ అలవాట్లూ తన తల్లిదండ్రుల కనీసపు కోర్కెలు అన్నీ చెప్పింది. చివరికి ప్రేమా ఇష్టమూ మొదలైన దౌర్భల్యాలకి లోబడి తన సుఖాన్నీ భద్రతనీ బలియిచ్చుకోలేనంది. "నువ్వంటే నాకెప్పుడూ ఇష్టమే, కాని నా జాగ్రత్తలో నే నుండాలిగా" అంది.

పార్కులోంచి రామచంద్రరావు ఇవతలికి రాగానే మూర్తి ఎదురై "ఏమైంది, ఏమైంది" అని ఆతృతగా అడిగాడు.

"నిరాకరించింది" అన్నాడు రామచంద్రరావు.

మూర్తికి కోపం వచ్చింది రామచంద్రరావు మీద. అతనంత తాపీగా జవాబు చెప్పినందుకు కాదు. అతని పెదాల మీద నిశ్చలంగా నిలిచిన చిరునవ్వుని చూసి. ఏ ప్రేమ వైఫల్యానికి మనుషులు ఆత్మహత్యలు చేసుకుంటారో, ఏకాంతంలో పడి ఏడ్చి ఏడ్చికృశించి పోతారో అటువంటి దానికి హాయిగా నవ్వగలిగే ఈ రామచంద్రరావులోని విశేషం ఏమిటి? ఇంత కులాసా, యింత ధీమా ఎక్కడివి అని విస్తుపోయాడు మూర్తి.

సరళకి వివాహమైంది. పెళ్ళికి రామచంద్రవు వెళ్ళాడు. పెళ్ళి నాలుగు రోజులూ యిటు ఆడపెళ్ళివారితో, అటు మగపెళ్ళి వారితో కలుపుగోలుతనంగా తిరిగాడు. అత్తింటికి వెళుతున్న సరళతో "నీ భర్త రూపసి! ఉత్తముడు కూడా, నువ్వు ఎప్పుడూ సుఖంగా వుండాలని కోరుతున్నాను. వచ్చే ఏడాదికి నువ్వు పాపాయి నెత్తుకొని రావాలి సుమా" అన్నాడు. అతని స్నేహ స్నిగ్ధ కంఠస్వరానికి సరళ హృదయం ఆర్ధ్రమయింది. కృతజ్ఞతతో సిగ్గుతో "థ్యాంక్సు" అంది.

కాని రామచంద్రరావు మనసారా కోరిన అదృష్టం ఆమెను వరించలేదు. ఏడాదికే ఆమె విధవరాలై తిరిగి వచ్చింది. రామచంద్రరావు చూడటానికి వెళ్ళాడు. ధైర్యం చెప్పాడు. అలాగ ప్రతిరోజు వెళ్ళి ఎన్నో కబుర్లు, కథలు చెప్పేవాడు. ఆమె దుఃఖం నుండి కోలుకుంది. ఇంక యితని అవసరం తీరిందనుకున్న సరళ తండ్రి రామచంద్రరావుని చాటుగా పిలిచి

"నువ్వు రోజూ యిలా రావడం బాగుండదు. లోకం ఏదైనా అనుకుంటుంది" అన్నాడు. రామచంద్రరావు నవ్వుతూ "మీరు చెప్పింది నిజమే. ఇంక నేను రాను" అని వెళ్ళిపోయాడు. మళ్ళీ సరళ దగ్గరకు ఎన్నడూ వెళ్ళలేదు. రామచంద్రరావు ఒక మూడు గదులవాటా తీసుకుని అద్దెకు వుంటున్నాడు. ఒకగది వంటగదిగా ఉపయోగించుకుని స్వయంగా వండుకు తింటాడు. తొమ్మి దింటి కల్లా స్నానం చేసి, భోజనం చేసి, తెల్లని దుస్తులు వేసుకుని ఆఫీసుకు బయలు దేరతాడు. దారిలో కిల్లీకొట్టు పోలయ్యనీ, ప్లీడరు రాఘవరావు గారినీ, వెంకయ్య మాస్టారినీ, పెరుగమ్ముకుని బతికే గోవిందయ్యనీ – అందరినీ నవ్వుతూ పలకరిస్తూ ఆఫీసుకు వెళతాడు. ఆఫీసులో అందరూ అతని మిత్రులు. ఆఫీసరు కూడా రామచంద్రరావంటే దయగా అభిమానంగా ఉంటాడు.

కాని రామచంద్రరావుని దురదృష్టమే వరించింది. ఆఫీసు రిట్రెంచిమెంటులో పై వాళ్ళు అతన్ని ఉద్యోగం నుండి తొలగించి వేశారు. మూర్తి చాలా ఆందోళన చెందాడు. ఇకమీద రామచంద్రరావుకి గడిచే విధానం లేదు. అయినా రామచంద్రరావు ఏమీ బెదిరిపోలేదు. పైగా మూర్తికి అతను నవ్వుతూ ధైర్యం చెప్పాడు.

ఉద్యోగం పోయిన రెండు రోజులకే రామచంద్రరావు తన స్వగ్రామం వెళ్ళాడు. ఓ నెల్లాళ్ళ పాటు అక్కడే వుండి, అతని పాత పెంకుటింటి లోగిలిని అమ్మివేసి మూడు వేల రూపాయలు చేత్తో పట్టుకుని తిరిగి వచ్చాడు. ఈసారి పాత మూడుగదుల పోర్షన్ వదిలేసి ఒకే ఒక గది అద్దెకు తీసుకున్నాడు. ఒక టైప్ మిషన్ కొని, 'ఇచ్చట టైప్ చేయబడును' అని బోర్డు కట్టాడు. ఈ మూడువేలూ ఎన్నాళ్ళు వస్తుంది? ఈ టైపు వల్ల వచ్చే ఆదాయం ఏం సరిపోతుంది? నీ భవిష్యత్తు ఎలాగ? అని ఆతృత కనపరిచాడు మూర్తి.

రామచంద్రరావు నవ్వాడు. "ఎవరి భవిష్యత్తు మాత్రం ఎవరు చెప్పగలరు మూర్తీ. మనం చేసుకున్న కట్టుదిట్టాలు నిజంగా రక్షిస్తాయా?" అన్నాడు.

రామచంద్రరావు తన స్వగ్రామం వెళ్ళిన రోజులలో సరళ తండ్రి చనిపోయినట్టూ, ఇంటి యాజమాన్యమంతా సుకుమారమైన సరళ మీద పడినట్టూ తెలుసుకున్నాడు. ఒకసారి సరళని చూసి వచ్చాడు.

ఆరు నెలలు గడిచాయి. రామచంద్రరావుకి తీవ్రమైన జబ్బు చేసింది. పదిహేను రోజులైనా జ్వరం తగ్గుముఖం పట్టలేదు. మూర్తి భయపడ్డాడు. తిన్నగా సరళ ఇంటికి వెళ్ళాడు. రామచంద్రరావు పరిస్థితిని వివరించి చెప్పాడు.

"మీరు అతని బాధ్యతని వహించాలి. ఒకనాడు మీరు అతన్ని మోసగించారు. కాని అతడు ఏనాడూ మిమ్మల్ని నిందించలేదు. డబ్బుతో ఏమైనా కొనవచ్చును గాని అటువంటి అమృత హృదయాన్ని పొందలేము. మృత్యుముఖంలో ఉన్న అతన్ని కనికరించండి. లోకం ఏమనుకుంటుందో అనుకుని సంశయించకండి. ఒక్కడూ ఆ చిన్నగదిలో చీకటిలో బాధతో

వ్యాధితో చివికిపోతున్నాడు. వివేకం కన్న హేతువు కన్న హృదయ ధర్మం గొప్పది. ఈ సత్యాన్ని యిప్పుడైనా మీరు తెలుసుకోరా" అని మూర్తి ప్రాధేయపడ్డాడు. అతను తల పైకెత్తి చూసేసరికి సరళ చెక్కిళ్ళు కన్నీళ్ళతో తడిసి వున్నాయి. "పదండి నేనూ మీతో వస్తున్నాను" అంటూ సరళ ఎలా వున్నది అలా బయలుదేరింది.

రామచంద్రరావుని జాగ్రత్తగా సరళ యింటికి మార్చారు. పక్కగదిలో డాక్టరు ""ఇతను బతుకుతాడని నమ్మకం లేద"ని చెప్పడం అప్పుడే మెలకువ వచ్చిన రామచంద్రరావుకి వినిపించింది. భయాందోళనలతో కన్నీటితో సరళా, మూర్తీ రామచంద్రరావు దగ్గరకు వచ్చి నిలబడ్డారు.

"నేను డాక్టర్ చెప్పింది విన్నాను. దాని కింత భయమెందుకు?" అన్నాడు రామచంద్రరావు. అతని పెదవుల మీద చిరునవ్వు నిలిచి వుంది. కష్టాల్నీ, బాధల్నీ చివరికి మృత్యువునీ కూడా లక్ష్యం చెయ్యని చిరునవ్వు. అంత ఆందోళనలోనూ ఆశ్చర్య చకితుడయ్యాడు మూర్తి. కాని రామచంద్రరావు సరళ సపరిచర్యలో మూర్తి నిరంతర సాన్నిధ్యంలో పట్నం నుంచి పిలిచిన పెద్ద డాక్టర్ల సహాయంతో వ్యాధినుండి విముక్తుడయ్యాడు. సరళ అతన్ని తన యింట్లో ఉండి పొమ్మని కోరింది పూర్తిగా ఆరోగ్యం కోలుకునే వరకూ.

మూడు నెలల అనంతరం సంపూర్ణ ఆరోగ్యవంతుడైన రామచంద్రరావు తన కృతజ్ఞతను తెలియజేసి, వెళ్ళిపోతానన్నాడు."నా గదికి వెళ్ళిపోతాను. మళ్లీ టైపు మొదలు పెట్టాలి. సెలవిప్పించు" అన్నాడు.

అయితే "నేనూ వస్తాను, ఆ ఒక్క గదిలో మనమిద్దరమూ ఎలా వుండటం?" అంది సరళ.

"నువ్వు రావడమేమిటి. నాతో వుండడమేమిటి?" అన్నాడు రామచంద్రరావు తెల్లబోయి. "మరి భార్య భర్తను వదిలి వుంటుందా?" అంది సరళ తలవాల్చి వోరగా చూస్తూ ఈసారి నిజంగా రామచంద్రరావు సిగ్గుపడి పోయాడు. అతను తెప్పరిల్లి చటుక్కున ఆమెను కౌగిలిలోకి తీసుకున్నాడు.

సరళా రామచంద్రరావుల వివాహం నిరాడంబరంగా జరిగింది. మూర్తి ఉత్సాహానికి పట్టపగ్గాల్లేవు.

మొదటి రాత్రి రామచంద్రరావు జట్టులోనికి వేళ్ళు పోనిస్తూ మృదువుగా అడిగింది సరళ. "మీరు ఎప్పుడూ నవ్వుతూనే వుంటారు. కారణం ఏమిటి నాకు చెప్పరూ?" రామచంద్రరావు కళ్ళలో గత స్మృతుల నీడలు బరువుగా నల్లగా కదిలాయి. కిటికీలోంచి చీకటిలోకి అలాగ కొంత సేపు చూస్తూ నిలుచున్నాడు. అతని కంఠస్వరం గంభీరంగా మారిపోయింది.

'నా పదహారవ ఏట' నేనూ మా అమ్మా, నాన్నా, మా చెల్లెలూ, తమ్ముడూ భద్రాచలం వెడుతున్నాము. నేను అనారోగ్యంతో సన్నగా నీరసంగా వుండేవాణ్ణి. ఎప్పుడేమైపోతానో అని అమ్మా నాన్నా భయపడుతుండేవారు. భద్రాచలరాముని దర్శనంతో నేను ఆరోగ్యవంతుణ్ణి అవుతానని వారి నమ్మకం. అందుకే భద్రాచలం వెళుతున్నాము. పాపికొండల దగ్గర హఠాత్తుగా మా పడవ బోల్తా కొట్టింది. కారణం ఏమిటో యిప్పటికీ నాకు తెలియదు. నేను స్పృహ లేకుండా ఒక ఒడ్డుకు కొట్టుకు పోయాను. తెలివి వచ్చేసరికి నా చుట్టూ జనం వున్నారు. మరి కాస్తదూరంలో మా తల్లి తండ్రుల సోదర సోదరీల శవాలు పడివున్నాయి. వాళ్ళందరూ చచ్చిపోయారు. ఒక్కసారిగా నేను దిక్కులేని వాడినయాను. ఒక్కసారిగా అపారదుఃఖం నన్ను నిశ్చేష్టితుణ్ణి చేసివేసింది. గుండెలు పగిలిపోయినాయ్. మళ్ళీ అదే నదిలో దూకి చచ్చిపోదామనుకున్నాను. కాని ఒకమెరపు లాగ నా మనస్సులో ఏదో మెరిసింది. ఈ సృష్టి ఈ జీవితమూ అంతా ఒక హాస్యం. దీనికి ఒక నియమమూ నిర్ణీత పద్ధతీ అంటూ లేవు. ఉన్నా ఉనికి తెలియదు. మనం తెలుసుకోలేము. ఎవరో తెరవెనుక నుండి మనల్నియిలా ఆడిస్తున్నారు. ఇది ఒక పెద్ద జోక్ – నవ్వులాట. లేనిదే అనారోగ్యంతో ఎప్పుడేమవుతానో అన్న నేను బతకడమేఁమిటీ? నిండు ఆరోగ్యంతో ఆశలతో వున్న వాళ్ళు పోవడమేమిటి? ఈ అద్భుతమైన హాస్య నాటకములో నేనూ ఒక పాత్రని. కష్టాలకీ, భయాలకీ రేపటి బాధలకీ ఆందోళన చెందడం ఎంత తెలివితక్కువ సరళా? ఈ కాస్సేపటి బతుకునీ సంకుచితత్వంతో సందేహంతో ద్వేషవిషంతో నింపుకోవడం ఎంత మూర్ఖత్వం సరళా."

ఈ మాటలకి సరళ చలించి పోయింది. విద్యుద్దీపాల కాంతిలో అతని కళ్ళు చెమ్మగిల్లినట్లు అనిపించిందామెకు. అతన్ని గుండెలకి హత్తుకుని, "నేను నిన్ను వదలను రామం" అని అర్థం లేకుండా ఆవేశంగా అంది.

రామచంద్రరావు చల్లగా నవ్వాడు తెల్లని మల్లెపువ్వు విరిసినట్టు స్వచ్ఛమైన హిమకణం సూర్యరశ్మిలో మిల మిల మిల మెరసినట్టు...

సరళకి అర్థమయింది – అతని నవ్వు వట్టి నవ్వు కాదని, అతని నవ్వు వెనకాల భయంకర విషాదముంది. వేదాంతం వుంది.

కానీ యీనాటి వరకూ మూర్తికి మాత్రం అతని నవ్వుకి కారణం తెలియదు పాపం.

# క్రొవ్విడి లక్ష్మన్న

బహుభాషా కోవిదులు. సంస్కృతాంగ్ల భాషలలో ఎం.ఏ. పట్టం పొందారు. బి.యల్. కూడా సంపాదించారు. ఫ్రెంచి భాషలో చాలా వ్యాసాలు వ్రాశారు. వీరి కథలు నిండైన తెలుగుదనంతో, పసందైన అలంకారాలతో, సమయస్ఫూర్తి గల లోకోక్తులతో, పాత్రోచిత భాషగల సంభాషణలతో, అద్భుత సన్నివేశాలతో అలరారుతూ ఉంటాయి.

**రచనలు :** కాలం మారాలి (నవల) కోర్టుమార్షలు, హిమగిరి తనయే (కథలు) హానోయ్ విశేషాలూ- కాంబోడియా కబుర్లూ (వ్యాసాలూ), The Studies of the Ancient Sanskrit Drama మొదలగునవి.



# కోర్టు మార్షల్

**అ**ప్పటికప్పుడే పదకొండు దాటింది. ఎడారి యెండ, చెమట పొయ్యదు పొయ్యిలో పెట్టిన రొట్టెలాగ లోలోపలే ఉడికించివేస్తుంది. అపరిమితమయిన దాహం. కాల్చిన సూదులలాగా ఇసుక రేణువులు చుర్రుమంటూ ముఖాన్ని తాకి, లోనున్న తాపం మరీ యినుమడింప జేస్తున్నాయి. దిక్కుమాలిన స్టుడిబేకరు! లారీ అంతా ఇనపమయం; దానికి తోడు ఆ స్పీడుకి ఇరుప్రక్కల నుంచీ కొలిమి తిత్తుల్లోంచి ఊదినట్టు వేడిగాడుపు. ఆ సరికి అప్పుడే నాకు చెవులు ఘడియలు వేసుకుపోయి, మొహం తిరగడానికి సిద్ధంగా వుంది. వాటరుబాటిల్లో ఒక్కచుక్క అయినా మిగలలేదు. టోపీ క్రింద బుర్ర బరువుగా సీసపు ముద్దలాగా అనిపిస్తోంది. అలాగని ఆ టోపీ తీసెయ్యడానికి వీల్లేదు, తల దిమ్మెక్కిపోతుంది. ఎటు వెళుతున్నానో, యెలాగ వెళుతున్నానో తెలియడం లేదు. అంతా నిర్మానుష్యమయిన యెడారికనుక ఏక్సిడెంట్లు కలుగుతాయన్న భయం మాత్రం లేదు. నా యంత్రంతో పాటు నేనూ యంత్రవతుగానే సాగిపోతున్నాను. సహవాస దోషేణ గుణాః భవంతి!

ఇంక నాలుగు ఫర్లాంగులు పోతే ఒక "ఒయాసిస్సు" దగ్గిర ఉంది సిబ్బంది కేంద్రస్థానం. అదే గమ్యస్థానం. ఒంటి గంటలోపున వెళ్ళి ఛార్జీ పుచ్చుకోవాలి. కొంచెం స్పీడు హెచ్చించాను. మకాముకి అద్దరినున్న బారకాసుల సమీపంలోకి వచ్చేసరికి, కుడివైపు ముందు చక్రం అటూ ఇటూ అల్లల్లాడి, బ్రేకువేసే లోపుగా యెదరకి తూలిపోయింది. అయిదు టన్నుల లారీయేమో, అమాంతంగా, గొడ్డుపలుపులు దప్పిన బండిలాగ, ముందుకి వొరిగి పడిపోయింది. నా అవస్థకి నాకే జాలివేసింది; కాని యేం చెయ్యనూ? సీటు క్రింద "జాకీ" ఎక్క పీకి లారీ పొజిషన్‌లో వుంచి, చక్రం ముందు యిరుసుకి అతికేను, "స్టీరింగ్ బుష్"లు సరిచెయ్యడానికి లారీక్రింద దూరే సరికి, కాలిన యిసకలో శరీరం

చుట్రుమని, ఒక్క గెంతులో బయటికి వచ్చేసి, సీటుదిండు క్రిందవేసుకొని మళ్ళీ ఆరంభించాను మరామత్తు – అయినా కాలిన పెనంమీద పడుకున్నట్టే అనిపించింది! పట్టుకున్న యినపరెంచి మూలాన్ని అరిచెయ్యి బొబ్బ లెక్కింది. ఎలాగో పనిముగించుకుని లారీ స్టార్టు చేసే సరికి బారెక్సు తీగెల దగ్గిర ఆ మండుటెండలో ఒక ఇరవయ్యేళ్ళ కుర్రాడు, చొక్కా అయినా లేకుండా, కొయ్యలు పాతుతూ కనపడ్డాడు. అతని శరీరం బాగా కమిలిపోయి వుంది. పరకాయించి చూసేను, అది పటాలంలో శిక్షలు అనుభవించే వాళ్ళు ఉండే బారకాసు. అంత కఠిన శిక్ష విధించిన రాతిగుండెల రాక్షసి యెవరు చెప్మా అని విస్తుపోయాను. అటువంటి క్రూరశిక్షపాలు కావడానికి అతను ఏం నేరం చేశాడో!

లారీ స్టార్టు అయిన అలజడికి గాబోలు, ఆ కుర్రవాడు తలయెత్తి నా వంక పరిశీలనగా చూశాడు. అతను యింకా అలాగ చూస్తూ వుండగానే వాహనం శరవేగంతో పరుగెత్తిపోయింది.

## 2

సాయంత్రం ఏడున్నర అవుతుంది. గుడారం బయట మేజామీద టీ, బిస్కట్లూ, డబ్బాపళ్ళూ పెట్టుకుని తింటూ, వైర్లెస్ వర్తమానాల ప్రకారం ప్రోగ్రాములు వేసుకుంటూ కూచున్నారు. ఒక జమేదారు వచ్చి సెల్యూట్ చేసి మర్నాటి కార్యక్రమం చేతికిచ్చాడు. మొట్టమొదటి అయిటం ఒక హవల్దారు క్లార్కు కోర్టుమార్షల్! ఏమి శిక్ష విధించవలసి వస్తుందో ఏఁవిరా భగవంతుడా, చార్జీ పుచ్చుకోగానే యిటువంటి పని తగిలిందీ అనుకున్నాను. తల అమ్ముకొన్న తరువాత తప్పుతుందా? పది నిమిషాలు అలాగే సిగరెట్టు కాలుస్తూ ఉండిపోయినాను. ఆ నెంబరు – 249052 కళ్ళకు కట్టినట్టుగా ఉంది. ఆ విషయం ఎంత మరిచి పోదాం అనుకున్నా మరుపుకు రావడం లేదు. మనస్సు యెందుకు అలాగ పీకుతుందో ఊహించుకోలేక పోయినాను. ఇంతలోకే చిన్నప్పుడు చదువుకున్న షోహరాబ్ – రుస్తుముల కథ జ్ఞాపకం వచ్చి గుండెఝల్లుమంది. ఎందుకయినా మంచిదని ఆ నెంబరుగల ఆసామీ పేరు చూడమన్నాను. గుమాస్తాని పిలిచి... నా సన్నిహితబంధువే– మా జగ్గుడు! అతన్నేనా యేఁవిటిచెప్మా ప్రొద్దున బారెక్సులో చూసేనూ! కాని మావాడు అంత నల్లగా ఉండడే. ఏమో ఈ మిలిటరీ ఉద్యోగంలో చేరి, హితవయిన తిండీ తిప్పలూ లేక, యెడారి యెండల్లో బాధలు పడుతూ అలా గయిపోయాడేమో!

జగ్గుడు! వాడి పరిస్థితులు తలుచుకుంటే యెంత శిలా మయమయిన హృదయం అయినా ద్రవించి దయామయమయి పోకమానదు. వాళ్ళు బహు శ్రీమంతులవడం చేత,

జగ్గడి నాన్నగారు ముగ్గురు అన్నదమ్ముల్లోకి పెద్దవాడు అవడం చేతా, అతిగారాబంగా పెరిగాడు. తండ్రిపోయిన కారణంగా ఆయన చిన్నతనంలోనే చదువు చాలించుకున్నప్పటికీ, యిద్దరు తమ్ముళ్ళకి చదువు చెప్పించి, పెళ్ళిళ్ళు చేసి, సిగపువ్వు వాడకుండా పెంచుకువచ్చి తండ్రి లేని కొరత తీర్చాడు. కొంతకాలం బాగానే జరిగింది. ఇద్దరు తమ్ముళ్ళూ చేతికి అందుకు వచ్చారు. యిద్దరూ డాక్టర్లే. కాస్త పేరు కూడా సంపాదించుకుంటూ ఉండడం వల్ల, నిజంగా జగ్గడు నాన్నగారికి ఆ తమ్ములని చూస్తే కొండ అందుకున్నట్టు ఉండేది. ఆస్తి పంచేసుకుని అన్న దమ్ములు కేటాయింపు అయిపోయినారన్న సంగతి లోకానికి తెలియదంటే, వాళ్ళు యెంత అన్యోన్యంగా వుండేవారో ఊహించుకోవచ్చు. ఇంతకూ ఇద్దరు తమ్ముల ప్రాక్టీసూ పలుకుబడీ బాగుండేవి. జగ్గడి నాన్నగారిది మొదటినుంచీ దర్జా జీవితమే వచ్చీపోయే వాళ్ళతోనూ, వాళ్ళ మర్యాదలతోనూ, విందులతోనూ సంతర్పణలతోనూ,యెప్పుడూ నిత్యకళ్యాణం పచ్చతోరణంగా ఉండేది జగ్గడి నాన్నగారి ఇల్లు. ముఖ్యంగా యీయన్నెందుకు చెప్పాలీ అంటే, ఇంటికి పెద్ద కనక – అభం శుభం అన్నీ యీయననెత్తినే పడుతూ వుండేవి. దానికి తోడు కాస్త భారీ చెయ్యి అవడం వల్ల అవసరానవసరాలతో ప్రమేయం లేకుండానే ఖర్చులు తగులుకుంటూ ఉండేవి.

స్వార్జితం అనేది లేకపోయిన తరువాత, మార్చుకుని తింటూ ఉంటే ఎంత కాలం వస్తుందీ? ఒక దశ తిరిగేటప్పటికి ఆయన దశ మారిపోతూన్నట్లనిపించింది. ఒకటిరెండుసార్లు యీయన రెండుమూడు సంచులు అప్పు చేశాడని తెలిసి, మరదళ్ళలో మనోవికారాలు పొడగట్టేయి అంటారు. అయినా అన్నదమ్ముల సౌజన్యానికి యేఁవీ లోటు రాలేదు. ఏదో మారుమూల మడిచెక్కక రాఁరావుడి చుట్టుకు పోయినా, రాజసం మాత్రం యథాప్రకారంగానే బావుటా యెగిరించేది. మరొక్క నాలుగేళ్ళు పోయేసరికి, చదువుకోవలసిన ముగ్గురు మొగపిల్లల మాట అలా వుంచగా, ఎదిగిన ఆడపిల్లలు యిద్దరూ యింట్లో మెసులుతూ ఉండడం కొంచెం గుండెలమీది కుంపటిలాగ తోచింది. పిల్లలయితే కుందన బొమ్మలే. సందేహం లేదు. కాని కట్నాలు యివ్వకుండా కళ్యాణాలు కలిసివస్తాయా అప్పటికప్పుడే అప్పులపాలయి పోతున్నాడన్న అప్రతిష్ఠ గాఢంగా అలుము కుంటోంది.

ఇంతలోకే యుద్ధం వచ్చిపడింది. హిట్లరు యూరపు దేశాలని వరసగా ఆక్రమించుకుంటూన్న రోజులు. అక్ష రాజ్యాలు ఐక్యమయి విజృంభించేస్తాయనీ, భారతదేశానికి పెనుప్రళయం రానున్నదనీ, అపోహపడిన కాలం అది. జగ్గడు నాన్నగారికి పూర్తిగా కలికాలం అయి పరిణమించింది. అప్పులవారి పోరు పడలేక ఉన్నదల్లా తెగనమ్మేడు; దాంతో ఆయన పరువు బొత్తిగా వీధిన పడిపోయింది. సేలం జరీ ధోవతులూ,

పెద్దాపురం పట్టుకోట్లూ ముతక ఖద్దరుకి దారిచూపగా, కత్తెరమార్కు సిగరెట్టు కాకీ యూనిఫారం ధరించి బీడీరూపేణా ఆసరా అయి నిలిచింది ఆయనకి. తన పిల్లలయినా చేతికి అందుకు వస్తారేమో నంటే, యిద్దరు పెద్దవాళ్ళూ మూడేసేళ్ళు స్కూలు ఫైనల్ వెలిగించి, యిహ చదువులకి పనికి రాకుండా పోయారు. ఇరవయ్యేసి యేళ్ళు వున్నా, ఆఖరికి ఒఖ్ఖడి మెళ్ళోనూ జందెం పోచపడలేదు; కాగా పెద్దెనిమిదేళ్ళ పెద్ద పిల్ల ఒకర్తె! మనస్సులో ఆమె పరిపరి విధాల కుమిలిపోయినా, తండ్రికి మరింత విచారం కలుగుతుందేమోనని, పైకి నిండుకుండలాగ ప్రవర్తించడంతో, ఆమె సౌశీల్యాన్ని చూసినకొద్దీ జగ్గడు నాన్నగారికి గుండె చెరువైపోయేది.

ఇంతలోకే ఒక తమ్ముడు హఠాత్తుగా పరమపదించాడు. రెండో తమ్ముడికి స్వకుటుంబభారం అధికం అవడంవల్లనో, మరే కారణంచేతనో సద్దుబాటు చెయ్యడానికి అవకాశం తప్పింది. కాకపోయినా, ఒక యావత్తు కుటుంబాన్నీ యింకో కుటుంబీకుడు యెంత కాలం అని పోషించగలడు? తీరా చేస్తూ వుంటే ఎలాగో సరిపుచ్చుకోడానికి బదులు, 'పుణ్యానికి పెట్టినమ్మా నీ మొగుడితో సమానంగా పెట్టవమ్మా' అన్నట్టుంటాయి. ఆడవాళ్ళ మనస్తత్వాలు, ఉన్న ఊళ్ళో యింక తలయెత్తుకు తిరగలేక, మకాం యెత్తేశాడాయన. బెజవాడ, బందరు, మద్రాసు అన్నీ చూడడం అయింది. కాటికి కాలు జాచుకుని ఉన్న వాడికి ఉద్యోగం ఎవరిస్తారు? ఇంతకూ, చెప్పుకోదగిన ఉద్యోగం చెయ్యడానికి ఉన్న అనుభవం యెంత!

నానాటికీ పరిస్థితులు మరీ దుర్భరం అయిపోతున్నాయన్న సంగతి జగ్గడూ వాళ్ళ అన్నయ్య గమనిస్తూనే వున్నారు; అడ్డంమయినవాళ్ళ కాళ్ళూ పట్టుకుంటూనే ఉన్నారు. నౌకరీల కోసం. కాని చదువులకి బాలారిష్టదోషం పట్టడం మూలాన్ని యెక్కడా దారీ తెన్నూ కనిపించింది కాదు. ఒకనాడు వాళ్ళ అమ్మా పెద్దచెల్లీ ఉపోషం వుండి తమ్ముడికీ చిన్న చెల్లికీ అన్నం పెట్టడం కళ్ళారా చూసేడు జగ్గడు. దాంతో వొళ్ళంతా జెర్రులు పాకినట్టనిపించి, యెవ్వరితోనూ చెప్పకుండా ఆ రాత్రే మద్రాసు వెళ్ళి మిలిటరీలో చేరిపోయినాడు. నాటినుంచీ ప్రతినెలా ముప్ఫయ్యో, నలభయ్యో తప్పనిసరిగా యింటికి పంపుతూ ఉండేవాడు. కుచేలుడి సంతతిలో వాడూ, తన లోతుపాతులు యెరిగినవాడూ కనుక ఉద్యోగంలో బహు మెలకువగా ఉండేవాడు, రాకరాక వచ్చిన ఉద్యోగం నిలబెట్టుకుందాం అని వాడికి మా పట్టుదలగా వుండేది. ఆ యీ సంగతులు నాకు అడపా దడపా వచ్చిన రికార్డుల వల్ల తెలుస్తూ ఉండేది కూడాను. మరి అలాంటి వాడికి యీ కోర్టుమార్షలు యేఁవిటి చెప్మా?

## 3

గత చరిత్ర అంతా సినిమాలో చూసినట్టు ఆ అరగంటలోనూ దృగ్గోచరమయ్యే సరికి నాకు మరీ ఉండబట్టింది కాదు; అలాగని పనికట్టుకుని బారెక్సుకి వెళ్ళి మనిషితో మాట్లాడి గుండుకొమ్ముల అనుమానం తీర్చేసుకుందాం అంటే – పైస్థలం – ఎంత తాబేదార్లయినా ఉన్న వాళ్ళంతా పంజాబీ వాళ్లు. ఎవడైనా కించిత్తు రూమరు పుట్టించి పోయాడంటే, వైర్లెస్ కన్నా త్వరగా అది ఢిల్లీ చేరుకోవడం మాట అలా ఉండగా, నాకే యెసరు వచ్చి మొదటికి మోసం కలగవచ్చు. వెంటనే జరగవలసిన పని జరగదు సరేకదా, ఇంక ఎన్నడూ ఎవ్వరికీ యే సదుపాయమూ చెయ్యలేని పరిస్థితులు యేర్పడతాయి....

ఆ రాత్రి నాకు నిద్దర పట్టలేదు. ఏ రెండు గంటలకో మూగన్ను పడిందేమో? మామూలుగా నాలుగున్నర కల్లా తెలివి వచ్చేసింది. ఆహ్నికాలు తీసుకుని, కాఫీ పుచ్చుకుంటూ వుండగా చిన్న ఉపాయం తట్టింది. క్రొత్తగా ఛార్జీ పుచ్చుకున్న వాడిని కనుక, నా క్రింద యెటువంటి మనుషులున్నారో, యెవరిని యెంత వరకు నమ్మవచ్చునో తెలుసుకోవడం ఆవశ్యకం అన్న నెపంతో ఒక్కొక్కడి విషయంఆరా తియ్యడం ఆరంభించాను. ఆ దెబ్బతో జగ్గుడి వివరాలు చాలా తెలిశాయి. పాపం మొదట్లో సిపాయిగా ప్రవేశించి రెణ్ణెల్లు తిరక్కుండానే హవల్దారు క్లార్కుగా ప్రమోషను పొందేడు. మరొక్కయేడు తిరిగేటప్పటికి మూడో గ్రేడులోంచి మొదటి గ్రేడులోకి డబుల్ ప్రమోషను కూడా సంపాదించుకున్నాడు. వీడిని చూసిన ప్రతీ ఆఫీసరూ మంచే వ్రాసేడు. ఎక్కడా చెడుగా లేదు – ఆవేళ జరగనున్న కోర్టు మార్షలుతప్ప!

మిలటరీలో ఉండే విశేషమే అంత. ఏ సంగతీ మొత్తంగా చూడరు. మనిషి తాలూకు ప్రవర్తన నమ్మికల తోటి అసలే పనిలేదు. దీనికి కారణం కూడా లేకపోలేదు. ఇవాళ యిక్కడ ఉన్న ఆఫీసరు రేపు యింకో చోటికి బదిలీ అయిపోతాడు. దాంతో వాడి మేహార్బానీ సంపాదిద్దాం అని చేసిన చాకిరీ అంతా బుగ్గి అయి ఊరు కుంటుంది. వాడి స్థానే వచ్చిన వాడు కర్కోటకుడే అవునో, కరుణామయుడే అవునో! ఇంతకూ ఆవచ్చిన వాడికి వీడియందు నమ్మిక కలగాలంటే కొంత కాలం పడుతుంది. సందర్భాలూ జతపడాలి. ఈలోగా యేది యెటునుంచి వచ్చినా, గాలిలో దీపం పెట్టి దేఁవుడా నీదే భారం' అన్నట్టు అవుతుంది. అందుచేతయీ క్షణంలో శహబాసు అనిపించుకున్నవాడు ఉత్తరక్షణంలో ఓటికుండ అయిపోతూ ఉంటాడు. ఇదే ఏ సివిలు ఉద్యోగమో అయితే, అంతత్వరగా 'బ్లేకుమార్కు' పడుతుందా? అందులోనూ ఆదినుంచీ మంచి రికార్డు ఉన్నవాడికి పోటాబెట్టాలంటే ఎన్ని గుండెలుండాలి! కాని మిలిటరీలో మాత్రం యిటువంటివి బహు సామాన్యం. ఇవాళ

కెప్టెనుగా ఉన్నవాడు ఓ చుక్క యెక్కువ సేవించి, ఒళ్ళు తెలియక పై ఆఫీసరుకి సెల్యూటు చెయ్యక పోతే, ఆ సాయంత్రమే లెఫ్టినెంటుగా దింపేస్తారు. మళ్ళీనాలుగు రోజులు ఒళ్ళు దాచుకోకుండా పనిచేసేడంటే, వాడే తిరిగి కెప్టెనూ – ఇంకా మేజరో అయిపోతాడు. ఫోక్తు మిలటరీలో సంగతే అంత, కాని క్రొత్తగా మిలిటరీలో చేరిన వాడికి యిటువంటి అసందర్భం ఏదైనా తటస్థిస్తే తల తీసేసినట్టు ఉంటుంది. ఆఫీసర్లగతే అలా గడ్డలయిపోతూ ఉంటే హవల్దారు క్లార్కుని ఆదుకునే దెవరూ?

నాకు వొళ్లు కంపరమెత్తి పోయింది. కుర్రనాగమ్మ పొరపాటు చేశాడే అనుకోండి; పూర్వాపరాలు చూడొద్దూ? ఆదినుంచీ అష్టకష్టాలూ అనుభవించి, ఎలాగో ఒక ఉపాధి సంపాదించి, ఆత్మ ప్రబోధంతో, తనవారంతా తన మీదనే ఆధారపడి ఉన్నారన్న జ్ఞానంతో, తల్లిదండ్రుల ఋణం తీర్చుకుందాం అనే దృఢసంకల్పంతో శ్రమిస్తూన్న మనిషి కాస్త పరాకు పడగానే – అదయినా బుద్ధిపూర్వకంగా చేసిన తప్పిదం కాదు – దివ్యంగా వున్న పూర్వ చరిత్ర అంతా విస్మృతం అయిపోవలసిందేనా? నిజంగా వొళ్లువంచి పనిచేసేవాడికే అన్ని యిబ్బందులూను. సహృదయుడైన ఆఫీసరు హయాంలో అయితే అలా జరుగుతుందా? పాపం! వాడి కృషికీ తత్ఫలితానికే అమితానంద గర్వాలని పొందుతూ, తారాజువ్వలాగ తారాపథంలోకి చొచ్చుకు పోవలసిన తేజోమూర్తిని నాలుగు గోడల మధ్యా బంధించి, సరియైన తిండి పెట్టక, ఆ యెడారి మండుటెండలో పైన చొక్కా అయినా లేకుండా ఏ కొయ్యలు పాతమనో? లొట్టిపిట్టలకి మాలీసు చెయ్యమనో నియోగించి, ఎందుకూ పనికిరాని వాణ్ణిగా మార్చేశారు. ఆ అమాయక హృదయం యెన్ని విధాల పరితపించి పోతోందో!

ఇటువంటి పర్యాలోచనలతో ఎనిమిది గంటలు దాకా తెలియకుండానే కాలం గడిచిపోయింది. బేరరు వచ్చి స్నానానికి లేవమన్నాడు. అభ్యంగనం, ఛోటాహజ్రీ ముగించుకుని, తొమ్మిదింటికల్లా లైన్సుకి వెళ్లాను. నేనే అధ్యక్షుణ్ణి ఆ కోర్టుమార్షలుకి. ఇరుప్రక్కలా యిద్దరు కెప్టెనులు కూచున్నారు, న్యాయపరిశీలనలో నాకు సహాయం చెయ్యడానికి, నేరస్థుడు ఎదురుగా నుంచుని సెల్యూటు చేశాడు. హెడ్‌క్లార్కు ఛార్జీషీటు పుచ్చుకుని నేరం చదివాడు. నేరం సర్కారు మిలిటరీలో ఉండి కాన్వాయిని తీసుకు వెళ్ళిన సందర్భంలో కనబరచిన అప్రమత్తత, సందర్భం పరిశీలించడానికి పూనుకున్నాం.

బర్మా యుద్ధం తీవ్రంగా సాగుతూ వున్నప్పుడు ఓసారి అక్కడికి కొన్ని యుద్ధ పరికరాలు పంపవలసి వచ్చింది. వ్యవహారం అర్జంటు అవడం చేతా, అందరిలోకీ జగ్గుడంటే అప్పుడున్న ఆఫీసరుకు మాంచి గురి ఉండడం చేతా వీణ్ణి ఆ కాన్వాయి తీసుకు వెళ్ళి కలకత్తాలో వప్పజెప్పడానికి నియోగించారు. అహోరాత్రులు నిద్రా విశ్రాంతులు లేకుండా

ఏడువందల మైళ్లు లారీ నడిపించుకుని కలకత్తా పొలిమేర చేరుకున్నాడు. బహుభద్రంగాను, ఇహ గమ్యస్థానం చేరుకుంటాడనగా ఒక 'మద్రాసీ హోటలు' కనిపించింది వీడికి. కష్టాలకు ఓర్చుకోలేని చిన్నతనం. అప్పటికి అప్పుడే మూడు రోజుల బట్టీ ఆత్మత్యాగం చేస్తున్న వ్యక్తి. ఉదయం ఎనిమిది గంటల వేళ, మిగతా లారీ డ్రయివర్లందరికీ, తను పస్తు ఉంటూన్నా, భోజన సదుపాయం చేశానన్న ఆత్మజ్ఞానం అటువంటి సందర్భాలలో వీడికి కాస్త కాఫీ పుచ్చుకుందాం అని మనస్సు పీకులాడింది అంటే ఆశ్చర్యం ఏమీ కనపడదు. 'ఓస్, ఓ పావుగంట ఆలస్యం అయితే మాత్రం కలుసుకోలేక పోతానా, యింతకూ నా లారీ వొట్టిదే కదా' అన్న ధీమాతో హోటల్లో జొరబడ్డాడు. ఇడ్లి, కాఫీ, దోసె – అప్పటికి మూడేళ్ళయి మొహం వాచి ఉన్నాడట వీటికోసం – పుచ్చుకుని బయటికి వచ్చేసారికి వీడి లారీ కనపడలేదు. మనిషికి ముచ్చెమటలు పోసేశాయి. నిముషాలు గడుస్తున్నకొద్దీ నిలువునా నీరయిపోతున్నాడు. ఏంవీ పాలుపోయింది కాదు. ఇంతలోకే హోటలు గోడ వెనుక వైపు ఒక లారీ – అదీ మూడు టన్నులదె – నల్ల టార్పాలినుతో ఉన్నది – కనబడేసరికి. తనదే యెవడో అక్కడ పెట్టేడన్న భావంలోపడి (అన్ని లారీలూకవలపిల్లలాగా వుంటాయి మరి మిలటరీలో) యింతకూ లారీ దొరికింది. బ్రతుకు జీవుడా అని, ఒక్క ఊపున ఝుమ్మని వెళ్ళి కాన్వాయిని కలుసుకుని గమ్యస్థానం చేరుకున్నాడు జగ్గుడు.

అక్కడ సెక్యూరిటీ ఆఫీసరు సామగ్రి అంతా లెక్క వప్పజెప్పుకుని, ఏడు లారీలూ సక్రమంగా వచ్చేయని కాగితం సంతకం చేసి యిచ్చెయడం తోటే, తన అదృష్టానికి సంతోషిస్తూ కేంటీనులోకి పోయాడు టీ పుచ్చుకోడానికి.

మరొక్క పది నిమిషాలకి అమెరికన్ "బేసు కేంపు" నుంచి టెలిఫోను వచ్చింది ఫలానా నెంబరు గల వాళ్ళ లారీ కనిపించడంలేదు కనక, యిక్కడ వీళ్ల వద్ద నున్న లారీ నెంబర్లు సరిచూసి, ప్రమాదవశాత్తూ అక్కడికి చేరుకుందేమో తెలియజెయ్య వలసిందంటూను. ఆవేళ మనవాడి కాన్వాయి లారీలు తప్ప యింకేవీ అక్కడికి చేరుకోలేదు. యీ సంగతి సెక్యూరిటీ ఆఫీసరుకు తెలుసును. ఫలానా కేంద్రం నుంచి వచ్చిన మా లారీలే గాని మీవి యేవీ రాలేదని వర్తమానం చేసేద్దాం అనుకున్నాడు. కాని, యెందుకయినా మంచిదని కాన్వాయి లారీ నెంబర్లు తనిఖీ చెయ్యడం ఆరంభించాడు. ఏయే నెంబరు లారీలు కాన్వాయిగా యేర్పరచారో జగ్గుడి "డ్యూటిస్లిప్పు"లోనే ఉంటుంది. సెక్యూరిటి ఆఫీసరు మొదట్లో లారీల సంఖ్య మాత్రమే చూపేడు. నెంబర్లు బేరీజు వెయ్యలేదు. తీరా ఆ పనికి పూనుకునేసరికి ఒక లారీ నెంబరు భేదించింది. ఆ భేదించిన నెంబరూ అమెరికన్ బేసుకేంపు వాళ్లు యిచ్చిన నెంబరూ సరిపోయినాయి. సెక్యూరిటీ ఆఫీసరుకు తలా తోకా తెలియలేదు.

అంతలోకే ఒక అమెరికను ఆఫీసరు కూడా దిగబడ్డాడు. మూడు టన్నుల లారీ వేసుకుని, ఆశకటం చూడడంతోటే జగ్గుడి ప్రాణాలు నిలువునా యెగిరిపోయినాయి. అయినా యిక చెయ్యగలిగింది యేంవీ లేదనుకుని గంభీరంగా వూరుకున్నాడు.

చూస్తూ ఉండగా ఆ అమెరికను తిన్నగా సెక్యూరిటీ ఆఫీసరు వద్దకు వెళ్ళి "ఫలానాచోట కాఫీ పుచ్చుకుని బయలు దేరే సమయంలో మా లారీకి బదులు మీ దాన్ని తీసుకుపోయాను కొంతదూరం పోయేసరికి, లారీలో పెట్టుకున్న నాసిగరెట్టు టిన్ను కనిపించలేదు. దానికోసం తడుముల్లాడుతూ వుంటే బంపరుమీది నెంబరుని బట్టి తెలిసింది –యిది మీది అని – తీసుకోండి. ఫలానా మా లారీ గైలు విలియా అయిపోయిందని మా కేంద్ర స్థానానికి ఫోను చేసేను. ఈ వ్యవహారంలో మీ కేమయినా యిబ్బంది కలిగితే మన్నించండి" అంటూ యెంతో పెద్దమనిషి తరహాగా చెప్పాడు.

ఈ వాఙ్మూలం సెక్యూరిటీ ఆఫీసరు ఇచ్చాడు. జగ్గుడు వొప్పుకున్నాడు. అందులో వివరాలన్నీ నిజమేనని. మిలిటరీ డ్యూటీలో ప్రమత్తుడుగా ఉన్నాడన్న నేరం పైన యింక శిక్ష విధించాలి. కథ అంతా విని మిగతా ఇద్దరు మెంబర్ల ముఖాల కేసి చూసేను, వాళ్ల అభిప్రాయం ఆహ్వానిస్తూను – ఇద్దరూ నేరం స్థిరపరిచారు.

నాకు వొళ్లు మండిపోయింది. కేసు పరిష్కరించే సందర్భంలో వీళ్లు మూల కారణం యెత్తుకోవడమే లేదు. "వీడు డ్యూటీలో వుండగా దారి మధ్యస్థంగా ఎందుకు ఆగేడు అన్నది వేరే ప్రశ్న. దాన్ని తరవాత ఎత్తుకుంటాను. ఆదిని నేను అడిగేది ఏంవిటీ అంటే, జగ్గుడు నిలిపిన లారీ ఆ స్థలంలోంచి యెందుకు కదలాలి అని. అవతలి వాడు పెద్ద ఆఫీసరు. జవాబుదారి యెక్కువ ఉన్న మనిషి. తన లారీ యెక్కడ ఉండేదో తనకే తెలియదూ? ఎదురుగా ఉన్నవాడే పెళ్ళికొడుకా? రేపు యింకో సంగతి జరిగినా యిలాగ పరిష్కారం అయిపోవలసిందేనా? ఆ ఆఫీసరు ప్రమత్త ప్రవర్తనకి ఏమి సంజాయిషీ వచ్చింది? అసలు అమెరికను వారితో యీ ప్రసక్తి యెత్తుకున్నారా? లేకపోతే యెందుకు లేదు? ఆ లారీ అక్కడే వుంటే యీ గొడవే లేకుండునే?

"ఇహ కాగా పోగా, జగ్గుడు ఆ హోటలు దగ్గిర పర్మిషను లేకుండా యెందుకు ఆగేడూ అని – ఒక యూనిట్టు వొదిలి రెండో యూనిట్టు చేరుకోకముందు, స్వయం రాజా స్వయం మంత్రినీ. ఇంతకూ పర్మిషన్ పుచ్చుకోడానికి అక్కడ మధ్యమార్గంలో పై అధికారులు యెవరు ఉన్నారనీ? దురుద్దేశం యేమయినా కనిపించందే వోనంటే, చెడుగులేదు సరికదా, నిర్ణీత కాలానికి వస్తువులు గమ్యస్థానం చేరుకోవాలనే దృఢ నిశ్చయంతో మిగిలిన లారీలను వాడు ఆపు చెయ్యలేదన్నది మెచ్చుకోవలసిన విషయం, కనిపిస్తూనే ఉందాయిరి! పైగా లారీ కనుక్కున్నానని అనుకున్న వెంటనే రివ్వున పోయి

వాటిని చేరుకుని భద్రత కనబరచాడు. ఆ లారీ కనుక్కోవడంలో పొరపాటు జరిగిందంటారు. ముందుగా యింకొకరివల్ల జరిగిన పొరపాటుకి యిది అనుబంధం అంటాను నేను. వీడే ఆపాళంగా లారీ పోయిందని నాలుగు కేంద్రాలకి ఫోనులో చెబితే యేమవును? దీర్ఘప్రయాణంలో కాన్వాయి ఏ ప్రదేశంలోనూ ఆగకూడదని రూల్సు ఉన్నాయా? అలా ఆగినప్పుడు యీ ప్రమాదం జరగడం అసంభవమా?"

అరగంట గొంతుక చించుకున్నా, యిద్దరిలోనూ ఒకడూ ఉలకడు, పలకడు! కేసు కొట్టేశాను. ఈ రికార్డు పైకి వెళ్ళిన పది రోజుల్లో నాకు సింగపూరు బదిలీ అయిందని వార్త వచ్చింది. ఇద్దరు కెప్టెనులూ ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు. వీడ్కోలు సమయంలో సెల్యూటు తీసుకుని కరస్పర్శ చేస్తూ అన్నాను. "అక్కడా యెవడో వుండి వుంటాడు. నా చేతుల్లో విడుదల కావడాని" కని. ఆకాశంలో నక్షత్రాల్లాగ వాళ్ల కళ్లు ఒక్కమారు మెరిసేయి. మన పటాలం మొహాన్ని చిరునవ్వు చంద్రవంక అయి వెలిసింది.

# తూలికా భూషణ్



అసలు పేరు బుద్ధవరపు చిన కామరాజు. పత్రికా రచన వీరి ప్రధాన వృత్తి. లోకావలోకనం వీరి స్వభావం. అదే వీరి రచనకు ఆలంబనం. వర్తమాన సమాజం - వీరి కథా వస్తువులకు ఒయాసిస్సు. వినూత్న వస్తువు వీరి ప్రతిభా సంపన్నతకు ముంజేతి కంకణం. ఒకరి శైలీ, ఒకరి పోకడా - వీరికి నచ్చవు. స్వయం వ్యక్తిత్వమే వీరి సాహిత్య ప్రక్రియలకు మణిదీపం. భాష, భావం, శిల్పం, కల్పనా, ప్రయోజనమూ - వీరి సాహితీ సృష్టికి పట్టుగొమ్మలు. ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికకు ఇన్‌ఛార్జిగా ఉండేవారు.

**రచనలు :** ఋణానుబంధం, బ్రతికిన దినాలు, లచ్చి తల్లి (కథల సంపుటాలు)

# మెరీనా తీరే

**మ**హా నగరాలలో అనేక తరహాలవాళ్లు ఉంటారు. మద్రాసులోనూ అంతే.

ఇప్పుడు మన కథకు సంబంధించిన తరహా అన్నిటిలోకీ విశిష్టమైనది. ఈ తరహా వారు నారద గోత్రికులు. నారద కుటుంబం వారు. స్థూలంగా "నారదులు" అనే వ్యవహరిస్తాను.

నారదుడు లోకసంచారి. సంచారమే ఆయన జీవితం, ప్రధాన కర్తవ్యమున్నూ, భక్తి అనేది సంచారానికే హంగు. మద్రాసు నారదులూ సంచారులే. అయితే లోక సంచారులు మాత్రం కారు. కాలేరు. కేవలం సాయంకాల సముద్రతీర సంచారులు. దానిని విహారమన్నా చెల్లును. ఈ తీరప్రాంతమే "మెరీనా" పేరుతో విలసిల్లుతున్నది.

ఈ నారదులు కూడా భక్తులే. వారి పరమదైవం సముద్రుడు. సముద్ర నామస్మరణం తక్క అనన్య మెరుగని పుణ్యజీవులు వారు. ఎల్లప్పుడూ సముద్రుని భజిస్తూ, సముద్రుని గాథలు ఆలకిస్తూ పఠిస్తూ విన్పిస్తూ ఇహలోకయాత్ర సాగించే ధన్యజీవులు వారు.

ప్రతి రోజూ సాయంకాలం కాగానే సముద్రతీర ప్రాంతం చేరుకొంటారు. ప్రకృతిలో ప్రశాంతత అధికమై సముద్రుని ఘోష చెవిని పడబోయే సమయానికి తిరిగి తమ తమ ఆవాసాలు చేరుకొంటారు. ఇది భక్తితో దీక్షతో వారు పాలించే వ్రతం.

❄ ❄ ❄ ❄

ఆవేళ ఇద్దరు నారదులు సముద్ర తీర ప్రాంతంలో నియమిత ప్రదేశం చేరుకొనే సరికి మరొక నారదుడు, గృహోన్ముఖుడైనవాడు వారికి తారసిల్లాడు.

ఒక నారదుని సంబోధించి ఇలా అన్నాడు : "వెంకటీ, నీ కోసం ఇంటికి వద్దామనుకొన్నాను. దేవుడులా కనుపించావు. రేపు మా ఇంటికి భోజనానికి రావాలోయ్!"

వెంకటి ముఖం వికసించినది. వెంకటి భోజనానికి ఇచ్చేటంత ప్రాధాన్యం సముద్ర భజన తరువాత మరి దేనికీ ఇవ్వడు. అయినా వెంకటి అనుభవజ్ఞుడు. భోజనశాస్త్ర

ప్రవీణుడు. ముందూ వెనుకా చూడకుండా ఏదీ చేయని, తలపెట్టని ఆలోచనాపరుడు. పైగా అప్రయత్న లబ్ధమైన భోజనం అనుమాన హేతువే కాని ఆనందకారణం కాదుకదా!

కనుకనే వెంకటి ఆనందాతిరేకాన్ని రవంత సేపు అణుచుకొన్నాడు. "ఏమిటి విశేషం" అని ప్రశ్నించాడు.

"రేపు మా నాన్నగారి తద్దినమోయ్, వెంకటీ, మిత్రులందరినీ ఆహ్వానిస్తున్నాను" అన్నాడు గృహోన్ముఖ నారదుడు.

వెంకటి జీవిత నాటక రంగంలో పేరు మోసినవాడు. విచారం అభినయించాడు. తోడి నారదుని నిర్దేశించి చూపుతూ గృహోన్ముఖ నారదునితో ఇలా అన్నాడు: "భోజనం పేరు చెప్పితే నన్ను వదిలించుకోవడం ఎవరికీ సాధ్యం కాదని నీకు తెలుసు కదా? కాని, వేణూ, రేపు నా సహచరుడు ప్రసాద్ కుమారుని బారసాల. ఆయన ఇంటికి భోజనానికి వెడుతున్నాను. అందుచేత మన్నించాలోయ్. మరెప్పుడైనా అయితే ఒక్క అంగలో మీ ఇంట్లో వాలి ఉండేవాడిని. నాకు చాలా విచారంగా ఉంది."

మద్రాసు నగర వాసులు ద్వంద్వాతీతులు. వేణు సరిపెట్టుకున్నాడు. సముద్రతీర విహార నారదుల వద్ద శలవు తీసుకొని సముద్ర భజన చేస్తూ వెళ్ళిపోయాడు.

అతడు కనుచూపు మేర దూరం దాటిన వెనుక ప్రసాద్ ఉగ్రరూపం ధరించాడు. వెంకటిమీద విరుచుకొని పడ్డాడు.

"ఒరేయి వెంకటీ, అబద్ధాలాడతావని తెలుసు. నాకు ఆక్షేపణ కూడా లేదు. అబద్ధాన్ని సమర్థించేది అవసరం. ఇప్పుడు ఏమి అవసరం వచ్చిందని ఈ అబద్ధం ఆడావో నాకు తెలియడం లేదు. అది విడమరిచి చెప్పు. ఎప్పటికైనా నిన్ను మన్నించగలనేమో చూస్తాను. ఏమైనా గొడ్డు బ్రహ్మచారిని కదా నేను! నాకు ఒక భార్యను సృష్టించావు. ఊరకుండక పిల్లవాడిని కల్పించావు. వాడికి బారసాల ఏర్పాటు చేశావు. చాలనట్లు భోజనానికి ఆహ్వానించుకొన్నావు. ఆ భోజనం మాత్రం అసంభవం. ఇది ఖండితంగా చెప్పేస్తున్నాను. ఊఁ. ఇంక నీ వాదం వినిపించు. న్యాయమూర్తి సిద్ధంగా వున్నాడు."

నారదులు ఇద్దరూ కూర్చున్నారు. ఆ క్షణంలో ఇసుకలోనుంచి ఉద్భవించినట్లుగా ప్రత్యక్షమైన బ్రాహ్మణ బాలకుని వద్ద వేరుగడలు కొని సేవించడం సాగించారు. "ఓ జోన్" ఊపిరితిత్తులు నింపుతున్నది. శరీరాలు సైకతంలో లీనమై వ్యక్తిత్వం కోల్పోయినవి. నారదుల సంభాషణఘోష సముద్రఘోషను ముంచెత్తుతున్న అమృత ఘడియలు అవి.

"తద్దినం భోజనం సర్వత్ర వర్జయేత్ అని నా అనుభవం చెబుతున్నది. పైగా నాకు మూర్ఛ రావచ్చు" అన్నాడు వెంకటి.

"తద్దినం భోజనానికి, మూర్ఛకు సంబంధం ఏమిటి? ఏమా అనుభవం" అని ప్రశ్నించాడు ప్రసాద్.

వెంకటి చెప్పినది ఇది :

నాకో మేనత్త కూతురు వుంది. దాని పేరుతో మనకు నిమిత్తం లేకపోయినా చెబుతున్నాను. సుబ్బులు. ముద్దుకు సుబ్బి అని చిన్నప్పుడు పిలిచేవాళ్ళం.

సుబ్బుల్ని నాకు యిచ్చి పెళ్ళి చేద్దామని మొదట్లో అనుకొన్నారు. నా దురదృష్టం అలాంటిది. సుబ్బులు నా పెళ్ళాం కాలేదు. దురదృష్టం ఏమిటో చెబుతాను. సుబ్బులు జాతకంలో భర్త లక్షాధికారి అవుతాడని ఉంది. ఇప్పుడు ఆ అదృష్టమంతా సుబ్బులు మొగుడు శేషారావును వరించింది. సుబ్బుల్ని పెళ్ళి చేసుకొంటే నా జీవితం బాగా ఉండేది. లక్షాధికారిని అయినా, కాకపోయినా భోజనానికి ధోకా ఉండేది కాదు. నా బ్రతుకు నిరాఘూటంగా సాఫీగా సాగి ఉండేది. బ్రతుక్కి భోజనమే కదా ఆధారం?

సుబ్బులు, మొగుడు చాలా కాలమై మద్రాసు వచ్చేశారు. ఎగ్మూర్‌లో ఉండేవారు.

నాకో ఉద్యోగం దొరికింది మద్రాసులో, వచ్చాను. ఆశ్రయ మివ్వడానికి మేనత్త కుమార్తె కన్న అర్హులు ఎవరు ఉంటారు? సరాసరి సుబ్బులు ఇంటికి వెళ్ళాను. సుబ్బులు మొగుడు నన్ను చూచి ఆనందించలేదు. నేను ఇంట్లో కాలు పెట్టగానే నన్ను పలకరించనైనా పలకరించకుండా బయటికి వెళ్ళిపోయాడు. అప్పుడు అర్థం కాకపోయినా తరువాత అర్థం అయింది. మద్రాసులో మనుషుల పద్ధతే అంత. ఇంటికి వచ్చిన బంధువులను పలకరించరు. ఉండమనరు. కొన్ని సందర్భాలలో వెళ్ళమంటారు కూడా.

సుబ్బులు మొగుడు ఏలాంటి వాడయితే మనకేమి? సుబ్బులు మనదే కదా అనుకొన్నాను. కాని సుబ్బులు కూడా నన్ను చూచి ఆనంద బాష్పాలు రాల్చలేదు. నెలవంక లాటి ముఖం మేఘావృతమయింది. "ఏమిటి పని? ఎన్నాళ్లు వుంటావు" అని ప్రశ్నించింది నీరసంగా.

పరిస్థితి చూచాను. కోపగించి వెళ్లిపోతే ఉండడానికి ఆస్కారం ఉండదు. నా దగ్గర డబ్బు లేదు. మద్రాసులో వసతి ముఖ్యం. వసతి అంటూ ఉంటే ఆ యోగ్యత ఆధారం చేసుకొని భోజనం సంపాదించవచ్చు.

అంతా ఆలోచించిన మీదట అలవాటే కనుక అబద్ధమాడాను.

ఏదో కంపెనీలో పెద్ద ఉద్యోగం వచ్చిందన్నాను. ఉజ్జాయింపుగా జీతం చెప్పాను. అదృష్టవశాత్తూ అది సుబ్బులు మొగుడు జీతం కన్న హెచ్చు. సుబ్బులు ముఖంలో అప్పుడు రవంత వికాసం చూశాను. నీరసమూ తగ్గింది.

"ఉద్యోగంలోచేరి ఇల్లు చూచుకొనేదాకా మా ఇంట్లో ఉండరా బావా. మరి భోజనానికి

మాత్రం హోటల్లో ఏర్పాటు చేసుకో. దగ్గర్లో మంచి హోటల్ ఉందిలే. అక్కడ భోజనం బాగానే ఉంటుంది" అన్నది సుబ్బులు.

బహుశా భోజనం పెట్టకపోయినా ఉండనిచ్చినది కాదని తన వాళ్ళు, నా వాళ్ళు ఆడిపోస్తారని భయపడిందేమో సుబ్బులు అనుకొన్నాను.

ఏమైతేనేం, నా ఎత్తు ఫలించింది. ఉండడానికి ఆస్కారం లభించింది.

జీతం సంగతి విన్నాడేమో ఆ తరువాత శేషారావు కూడా ముఖం చాటు చేసుకోవడం మానివేసి నాతో మాట్లాడేవాడు.

ఉద్యోగంలో చేరాను. నెల్లాళ్ళకే ఏమొచ్చిందో ఏమో అది కాస్తా ఊడింది.

అది మద్రాసులో ఒక సుగుణం. ప్రయత్నించితే ఏదో ఒక ఉద్యోగం లభించకపోదు. కాని చిరకాలం ఉండదు. ముసాఫిర్ జీవితానికి తగిన తాత్కాలికమైన ఉద్యోగాలు. సృష్టి కూడా అలాంటిదే కాదా? శాశ్వతత్వంలో అశాశ్వతత్వం మిళితమై ఉంటుంది. అసలు జీవితమే శాశ్వతం కానప్పుడు ఉద్యోగాల మాట ఎందుకు?

ఉద్యోగం ఆధారంగా ఉండటానికి ఆస్కారం లభించింది కనుక అదిపోతే ఆస్కారమూ పోతుంది. సుబ్బులుతో నా ఉద్యోగం పోయిన సంగతి చెప్పలేదు. ఆస్కారం దక్కించుకొన్నాను.

భోజనం కరువు అయిన కాలం వచ్చింది. ఏమైనా తిని వారం రోజులు అయింది. నిరుద్యోగానికి నేను తట్టుకోగలిగాను. కాని అకారణం అయినా సకారణమే అయినా ఈ నిర్బంధ నిరుద్యోగానికి నా కడుపు తట్టుకోలేకపోయింది. మొదట్లో ఎదురుతిరిగింది. వ్యతిరేక నినాదాలు చేసింది. ఆక్రోశించింది; రోదించింది; మూలిగింది. ఎన్నయినా చేసింది. ఇంత నీరు పోసి ఆ క్రోధాగ్ని చల్లార్చడానికి పూనుకొన్నాను. అదీ సఫలమైంది. తరువాత తరువాత కడుపును ఒక విధమైన స్తబ్ధత్వం, జడత్వం ఆవహించాయి. అది దేనినీ కోరేది కాదు, ఆఖరికి తన ఉనికి ప్రకటించుకొనడం సహితం మానివేసినది.

అది ఒక విధమైన యోగస్థితి. నిరాహారులు మాత్రమే తపస్సు చేసి సాధించగలిగేదిన్నీ. అలాంటిది అదృష్టవశాత్తూ నాకు సాధ్యమైనది. పరిపూర్ణంగా అనుభవంలోనికి వచ్చింది.

అయితే మెదడు మాత్రమే వేరొక మార్గం అనుసరించింది. పూర్వం రోజుకు కొలది సార్లు మాత్రమే భోజనం గురించి ఆలోచించేవాడిని. అలాంటిది ఇప్పుడు సర్వకాల సర్వావస్థల్లోనూ ఆలోచనలు భోజనం చుట్టూ పరిభ్రమించ సాగాయి. భోజనం గురించే కేవలం రాత్రులు కాక జాగ్రదావస్థలో కూడా అనుక్షణమూ కలలు కనేవాడిని.

"ఎప్పటికైనా చేతిలో పుష్కలంగా డబ్బు ఉంటుంది. అప్పుడు వంటవాడిని పెట్టుకొంటాను. తెల్లవారి లేచేసరికి ఇడ్డెన్లు, మళహాపొడి, నెయ్యి, పెసరట్టు, ఉప్మా సిద్ధంగా

ఉంచుతాడు తింటాను. పదకొండు గంటల వేళ నాలుగు కూరలు, నాలుగు పచ్చళ్ళు, పులుసు, చారు,పెరుగు వేసుకొని భోజనం చేస్తాను. అపరాహ్ణం నేయితో వేసిన రవదోసె, వడలు, బజ్జీలు పకోడీలు తింటాను. రాత్రి మళ్ళీ కూరలు, పచ్చళ్లు, తీపి సరుకులు, పెరుగుతో కమ్మని భోజనం చేస్తాను. హోటల్‌కు వెళ్లి, ఒక్కటే ఆర్డరు వేస్తాను. "ఏయ్, పెద్దమనిషీ! మీ హోటల్‌లో ఈవేళ చేసిన ప్రతి పదార్థం ఒకొక్క ప్లేటు తీసుకొనిరా!" అంటాను. అన్నీ తినేస్తాను."

"ఇవి కాక బిస్కట్లు, చాకలెట్లు, కేకులు, పళ్లు పుష్కలంగా తింటాను."

"తిన్న, విన్న, చూచిన, చదివిన, తెలుసుకొన్న ప్రతిపదార్థం తింటాను. అమితంగా తింటాను."

"ఇంక కడుపు మళ్ళీ బ్రతికివుండగా, ఎప్పుడూ తిరుగుబాటు చేయలేనంతగా తింటాను."

"తినడంలో అంతు చూస్తాను."

ఇలా ప్రతినిమిషం ఎన్నో ప్రణాళికలు వేసేవాడిని.

ఇలా ఆలోచిస్తూ రోడ్లమీద తిరిగేటప్పుడు ఆవులు కనిపించేవి. నాకో ఆవు వుంటే ఎంత బాగా ఉండును? ఎప్పుడు పడితే అప్పుడు పాలు పిండి తాగేవాడిని కదా అనుకొనేవాడిని.

మద్రాసులో ఆవులు ఒక విశిష్టమైన రకానికి చెందినవి. ఎప్పుడు పడితేఅప్పుడు పాలు యివ్వగలవు. ఇస్తాయి. ఏదిపడితే అది తినగలవు. జీర్ణం చేసుకోగలవు. పాలు సృష్టించగలవు.

మద్రాసులో ఆవులకు ప్రధానంగా కాగితాలు, అట్టలు, సిగరెట్టు పీకెలే ఆహారం. వాటిలో గడ్డి, అదయినా ఎండురకం నంజుకొంటాయి.

అలాంటి ఆహారంతో పొట్ట నింపుకొంటూ పాలు ఇచ్చి అవి యజమానులకు కొల్లలుగా డబ్బు ఆర్జించి పెట్టుతాయి. కనుకనే యజమానులకు వాటిమీద తగని ప్రేమ, అవి కోరిన ఆహారం పుష్కలంగా ఉచితంగా లభించే జన సంకీర్ణమైన ప్రదేశాలలో ఆ ఆవులను యధేచ్ఛగా తిరగనిస్తారు యజమానులు ఎల్లవేళలా.

నాకో చిత్రమైన ఆలోచన కలిగేది. మద్రాసు ఆవును అయితే ఎంత బాగుండేది! కాగితాలు, అట్టలు, చుట్టపీకలు, తినేవాడిని కదా? పస్తు అక్కర్లేదు కదా అనుకొంటూ నా దురదృష్టానికి నన్ను నిందించుకొనేవాడిని.

చివరికి ఒకరాత్రి ఏమైనా సరే తినాలని అనిపించింది. ఆ రాత్రి భోజనవేళ సుబ్బులు యింటికి వెళ్లాను. సమయం కాని సమయంలో తిరిగి వచ్చిన నన్ను చూచి భార్యాభర్తలు గతుక్కుమన్నారు.

కొలది రోజులుగా నా ఆకారం, వాలకం గమనిస్తున్నారు ఆ దంపతులు. నా చూపులు ఎప్పుడూ అప్రయత్నంగా వంట ఇల్లుమీద కేంద్రీకృతమై వుండేవి కాబోలు. ప్రతి రాత్రీ వంటగదికి తాళం వేసి మూడుసార్లు లాగి చూసిన తరువాత కాని నిద్రపోయేవారు కారు ఆ పుణ్యదంపతులు.

ఆ రాత్రి నేను తిరిగి వెళ్లేసరికి శేషారావు భోజనం చేస్తున్నాడు. ప్రక్కనే పీట వేసుకొని కూర్చున్నాను. ముద్దలు లెక్క పెట్టుతున్నాను. శేషారావుకు అన్నం సహించలేదు. సుబ్బులుకు చేయి ఆడలేదు. కాళ్లు తడబడసాగాయి.

"భోజనం చేశావా" అని ఎవరూ అడగలేదు. ఆ దంపతులకు నోరు పెగలడం లేదు.

నే నే అన్నాను – "ఈవేళ భోజనం చెయ్యలే"దని.

"హోటల్ ఇంకా మూసెయ్యరు, త్వరగా వెళ్లిరా" అంది సుబ్బులు.

నేను సుబ్బుల్ని మనస్సులో అభినందించ కుండా ఉండలేక పోయాను. అలాంటి విపత్కరమైన స్థితిలో కూడా తీరా భోజనం ప్రసక్తి రాగానే సుబ్బులు నిలద్రొక్కుకొని ధైర్యంగా ఆ పరిస్థితిని ఎదుర్కొంది.

"డబ్బులు లేవు" అన్నాను.

శేషారావు మజ్జిగ పోసుకోవలసిన సంగతి మరిచిపోయి చేతులు కడుగుకొన్నాడు. అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

సుబ్బులు నాటికి అభోజనం ఉండటానికి నిశ్చయించిందేమో అన్నం గిన్నె వంటగదిలో పెట్టి వచ్చింది.

పైగా "బియ్యం అయిపోయాయిరా" అందుకని మీ అన్నయ్య కోసం మిగిలిన గిద్దెడూ ఉడక బెట్టాను. ఇంక పిల్లికి నాలుగు మెతుకులు మిగిలాయి" అంది నాతో.

నేను జాగ్రత్తగా చూచాను. చిన్నదే అయినా గిన్నె నిండా అన్నం వుంది.

ఎంత చెడ్డా సుబ్బులుకు నేను మేనమామ బిడ్డను. పెంపుడు పిల్లిపాటి చేయలేదే అనుకున్నాను.

అంతలో పిల్లి అక్కడికి వచ్చింది. అది కాదు కూడదు అన్నా అకస్మాత్తుగా పట్టుకున్నాను. పిల్లి నాతో యుద్ధం ప్రారంభించింది.

"చూడు, దీనికి ఒంట్లో బాగాలేనట్లుందే. ఈ రాత్రికి అన్నం పెట్టకు" అన్నాను సుబ్బులుతో– పోనీ ఆ నాలుగు మెతుకులు అయినా నాకు పడవేస్తుందేమోనని.

సుబ్బులు ఆవేశంతో నాలుగు అంగలు వేసి నా చేతుల్లోంచి పిల్లిని ఊడలాక్కుని "నిక్షేపంలా వుంది. దానికి లేనిపోని జబ్బులు అంటగట్టకు, పుణ్యం వుంటుంది"అని కసిరి దాన్ని వంట గదిలోకి తీసుకొని పోయి తలుపు వేసేసుకొంది.

పిల్లికి పెట్టిందో లేక తనే తిన్నదో తెలియదు కాని పది నిమిషాల కల్లా బయటికి వచ్చి గిన్నె తోమి కడిగి బోర్ల పెట్టింది.

అప్పటికి కాని నేను అక్కడి నుంచి తిరోగమించలేదు.

మొత్తం మీద ఆరాత్రి నాకు భోజనం దొరికింది కాదు.

ఆరాత్రి అంతా నిద్రలేదు. మరునాటిఉదయం రోడ్డుమీద పోతున్నాను. నెల్లాళ్ళ ఉద్యోగంలో సహచరుడు విఠల్ కనుపించాడు. సరిగా ఈవేళ వేణు అన్నట్లే అన్నాడు. "మీ కోసమే వస్తున్నానండీ, దేవుడిలా కనుపించారు. మా ఇంటికి భోజనానికి రావాలి" అని ఉన్న పళంగా తనతో కూడ రమ్మన్నాడు. మాట్లాడకుండా వెళ్లాను.

తీరా ఇల్లుచేరాక "ఈవేళ మా నాన్నగారి ఆబ్దికం. మీరు భోక్తగావుండి ఈ కార్యం సానుకూలం చేయాలి" అని కోరాడు విఠల్. దక్షిణ మిగల్చడానికి నన్ను అన్వేషించాడా ఉత్తముడు. అప్పటికి శరీరంలో త్రాణ లేదు. భోజనం కోసం అలమటిస్తున్నాను. భోజనం లభించిందన్న ఆనందాతిరేకమో లేక మరి రెండు మూడు గంటల కాలం పరిశ్రమ చేస్తే కాని భోజనం లభించదన్న నైరాశ్యమో తెలియదు కాని అకస్మాత్తుగా స్మృతి తప్పిపడిపోయాను.

పాపం! నా మూలంగా ఆ ఏడాది విఠల్ పితృదేవతల స్వాగత సత్కార కార్యక్రమం మరొక గంటసేపువాయిదా పడింది.

అదిగో అప్పటినుంచీ తద్దినం భోజనానికి వెళ్ళితే మూర్ఛ వస్తుందేమోనని నా భయం.

❄ ❄ ❄ ❄

సముద్రుని ఘోష వినవస్తున్నది. నారదులు గృహోన్ముఖులైనారు, నాటికి వ్రత దీక్ష సమాప్తమైనది.

ప్రసాద్ లేచాడు. "లేరా, వెంకటీ, ఈరాత్రి సినిమాకువెడదాం, రేపు నీకు విందు" అన్నాడు.

వెంకటి తూలిపడిపోయాడు.

# రాచకొండ విశ్వనాథశాస్త్రి

**(1922 - 1993)**



**న**వల, నాటకం, కథానిక - ఈ సాహిత్య ప్రక్రియల్లో కొత్త బాటను త్రొక్కి, సాహితీ క్షేత్రంలో అద్భుతమైన పంటల్ని పండించిన రచయిత. వీరి కథల్లో ఉత్తమ పాత్ర చిత్రణా, ఉత్కృష్టమైన శిల్పమూ, ఊహాపుష్టీ, కమ్మని కవిత్వమూ, నిండైన నాటకీయతా, నిశితమైన జీవిత పరిశీలనా, పదునైన వ్యాఖ్యానమూ, కఠోరమైన వాస్తవికతా వున్నాయి. ఉపచేతనాన్ని మథించి, పాత్రోచిత భాషలో విలక్షణ వాక్య విన్యాసంతో జీవితంలోని ఒక అంశం ఆధారంగా జీవితం మొత్తాన్ని ఆవరించిన విషాదాన్ని చిత్రించడం రాచకొండ ప్రతిభా విశేషం. వస్తువులో కూడా వీరు విప్లవాన్ని సాధించారు. విశాఖపట్టణంలో అడ్వకేట్‌గా ఉండేవారు.

**రచనలు :** అల్పజీవి (నవల), నిజం (నాటకం), ఆరు సారా కథలు, ఆరు సారో కథలు, మరో ఆరు చిత్రాలు మొదలగు కథల సంపుటాలు



# వర్షం

వర్షం దబాయించి జబర్దస్తీ చేస్తోంది. సాయంకాలం అవుతోంది. మబ్బుల వల్ల, మామూలు కంటే, చీకటి ఎక్కువగా వుంది. రోడ్డు పక్క కమ్మల పాక – టీ దుకాణంలో చీకటి చికాగ్గా వుంది. అడివిపాలెం నుంచి వచ్చి, తన దుకాణంలో చిక్కుకు పోయిన సిటీబాబుని ఉద్దేశించి,

"మూడ్రోజులక్కాని ఒగ్గదీ వరసం" అన్నాడు దుకాణం తాత. ఒగ్గితే సెవి కదపాయిస్తానన్నాడు.

బల్లమీద దిగులుపడి కూర్చుండిపోయేడు సిటీబాబు అనబడే పురుషోత్తం.

"టెసన్ కి కదు బాబూ ఎళ్ళాలన్నావు?"

ఆకాశం మెరుపుతో చీల్చుకొంది.

"అవును."

"అబ్బో! ఎక్కడ, రొండు కోసులుందే!"

పిడుగు పడ్డట్టుగా ఉరిమింది.

"ఏఁ విఁ టీ?"

"రొండు కోసులుందయ్యా బాబూ ! బొగ్గుల కోసం కుర్రోణ్ణి అక్కడికే తగిల్నాను. సదువు కోనేదు గాని నాకెరికే. రొండు కోసులుంది" అది రెండువేల మైళ్ళ దూరం అన్నట్టుగా చెప్పేడు దుకాణం తాత.

"బస్సు దొరకదా?" అని హీనస్వరంతో అడిగేడు పురుషోత్తం.

"ఈ వొరసంలో బస్సు రాగల్దా? ఎర్రేటి నీకు? ఉత్తప్పుడే రాదు. మా కుర్రాడు నడిసే ఎళ్ళాడు" పురుషోత్తానికి కొంచెం గాభరా వేసింది. అత్యవసరమైన పని మీద అతను కలకత్తా వెళ్ళవలసి వుంది. మూడురోజుల లోపల అక్కడికి వెళ్ళాలీ అంటే మరో రెండు

గంటల్లో అతను స్టేషన్ చేరుకోవాలి. బస్సురాదుట. బళ్ళు కనిపించవు. వర్షం చూస్తే పెను ప్రళయంలా వుంది.

"నేను కలకత్తా వెళ్ళాలే."

"ఏవూరూ?"

"కలకత్తా"

"అబ్బో, శానాదూరంవేం! అక్కడి కెళ్ళాలా నువ్వు?"

"అవును"

"ఎళ్ళలేవు"

చాలా ఖచ్చితంగా చెప్పేడు దుకాణం తాత. దిగులుపడి కూర్చుండిపోయాడు పురుషోత్తం. కత్తుల్లా మెరుపులు మెరుస్తున్నాయి. కొండలు బద్దలయినట్టు ఉరుములు ఉరుముతున్నాయి. శివాలెత్తి గాలి పరుగెడుతోంది. పగ పట్టినట్టుగా వర్షం తెగపడుతోంది. చీకటిపట్టిన పాకలో, కొత్త పంట్లాం, కొత్త చొక్కా, కొత్త జోళ్ళు బాగా కనిపిస్తున్నాయి. ఈ మూడూ పురుషోత్తం వేసుకున్నాడు. అతన్నిబాగా చూడాలీ అంటే దీపం వెలిగించి చూడాలి. అతను చక్కనివాడా? ఒప్పుకొనే వాళ్ళు తక్కువ. అతని నడుం మాత్రం చక్కగా సన్నగా వుంటుంది. అతను సింహ మధ్యముడే కాని సింహంలా ఉండడు. అతని పదిహేనోయేట "ఇరవయ్యే ళ్ళుండవా?" అని చాలా మంది అనుకొనేవారు. దుకాణం తాతని ఆ సమయంలో అడిగితే "నలభై దగ్గిరుండవా" అని అడగ్గలడు. పురుషోత్తం పాతిక సంవత్సరాల క్రితం పుట్టేడన్న సంగతి, ఆ పుట్టుక తెలిసిన వాళ్ళకి తప్ప మరొకరికి తెలియదు. అతను ఎదగని పడ్డలా ఉండిపోయేడు.

ఆ సమయంలో ఆ దుకాణంలో దూరేందుకు అతగాడు ఆ ముందురోజు బయల్దేరేడు. పయనమవడం కలకత్తాకనే పయనమయేడు. అంతలో అతని మేనమామ గాలీ ధూళీలా వచ్చి పడ్డాడు. ఆ మేనమామ అందరికీ ఉచితంగా సలహా లివ్వగలడు; అవలీలగా పనులు పురమాయించ గలడు. అతగాడు వచ్చిపడి "నీకు పెళ్ళి కావాలనే సంగతి నీకేమైనా తెలుసా?" అని పురుషోత్తాన్ని ప్రశ్నించి టకాయించేడు. టకాయించి "వెళ్ళు వెళ్ళు. మంచిది, వయసుది, డబ్బుది, అడివిపాలెంలో మున్సబు కూతురుంది. పిల్లని చూసేసి అలా కలకత్తా వెళ్ళిపోవచ్చు. వెళ్ళు వెళ్ళు, వెళ్ళి చూడు" అని మేనల్లుణ్ణి వెంట తరిమేడు. దాన్తో చేతిలో పెద్ద సంచీ పట్టుకొని అడివిపాలెంలో బంధువులింట్లో ప్రత్యక్షమై సాయంకాలం మున్సబుగారింట్లో కొత్తబట్టల్తో పెళ్ళికూతురి ముందు ప్రత్యక్షమయేడు పురుషోత్తం. ఆ పిల్ల తన చూపుతో అతనికొక చిక్కు ప్రశ్న వేసింది.

"మునిసీబు" గారిది పాతకాలపు పెంకుటిల్లు. లోపల వరండాలో చాపమీద కూర్చోబెట్టారు పెళ్ళికుమార్తెని. ఆ పిల్ల మఠం వేసుకొని కూర్చుంది. పక్కనే వాకిట్లో తులసికోట పక్క దండెం మీద తెల్లచీర ఒకటి ఆరవేసి వుంది. వాకిట్లో తోమిన ఇత్తడి గిన్నెలు తడితో మెరుస్తున్నాయి. ఇంటి వెనుక మామిడి చెట్టొకటి చీకటిగా ఆకుపచ్చగా కనిపిస్తోంది. దాని పక్కనే కొబ్బరి చెట్టొకటి నిటారుగా ఎత్తుగా గంభీరంగా మామిడిచెట్టు కోసం ప్రాణాలివ్వడానికి సిద్ధంగా నిల్చొంది. అస్తమించడానికి తటపటాయిస్తూ దూరాన్న సూర్యుడు ఆకాశంలో అవతల గుమ్మం దగ్గర నిల్చున్నాడు. అంతలో గది తలుపులన్నీ గప్పున తెరచి ఆకాశమంతటా కుంకాన్నెవరో కుమ్మరించేరు. అంతట, చెట్టున మామిడి చిగుళ్ళు, చెట్టున కొబ్బరి కొమ్మలు సంతోషంతో మూగనవ్వు నవ్వేయి. ఆరవేసిన తెల్లచీర వెలుగుని వరండా అంతటా ఎర్రగా గుప్పున వెదజల్లింది. మెరిసే ఇత్తడి గిన్నెలు రాగిరంగు కలుపుకొని బంగారంలా మెరిసేయి. తులసి కోటలో తులసి మొక్క నర్తకిలా నిల్చొంది.

దీపపు వెలుగున దేవీ విగ్రహంలా కనిపిస్తోంది పెళ్ళికూతురు. ఆమె తల కొంచెం దించి, రెప్పలు కొంచెం పైకెత్తి, పురుషోత్తాన్ని నిదానంగా పరిశీలనగా చూసింది. ఆమె కళ్ళు విశాలంగా స్వచ్ఛమైన నీటితో నిండిన తటాకాల్లా వున్నాయి. మారుమూల కుగ్రామంలోనే ఉన్నప్పటికీ ఆ తటాకాలు మెరిసే చుక్కల్నీ, వెలిగే చంద్రుణ్ణి, మండే సూర్యుణ్ణి కూడా సుస్పష్టంగా చూడగలవు. అవి చాలా దూరం చూడగలవు.

ఏవేవో ప్రశ్నలు వేసి కూతురిచేత జవాబులు చెప్పిస్తోంది తల్లి. ఆ పిల్ల సన్నంగానే మాట్లాడుతోంది గాని, గుహలో మాట్లాడినట్టుగా గంభీరంగా మాట్లాడుతోంది. ఇంటర్వ్యూ ముగిసేక పురుషోత్తం లేచి నిల్చున్నప్పుడు, ఆమె చాపమీద కూర్చొనే అతణ్ణి నిదానంగా మరోసారి బరువుగా రెప్పలు కొంచెం పైకి వంచి అతణ్ణి చూసింది. చూసి, నెమ్మదిగా నిల్చొని లోనికి వెళ్ళిపోయింది. ఆమె చూపు అతన్లో ఏదో అలజడి పుట్టించింది. కాని అతనికేమీ సరిగా అర్థంకాలేదు.

మర్నాడు బంధువులింట్లో మధ్యాహ్నం భోజనం చేసి రెండెడ్ల బండి ఎక్కి రోడ్డు జంక్షన్‌కి బయల్దేరాడు. మధ్యాహ్నం ఒంటి గంటయింది. మువ్వలు చప్పుడు చేస్తూ ఎడ్లు ముందుకు సాగాయి. దార్లోనే వున్న మున్సబు గారింటిని, బండి దాటుతూండగా ఆ అమ్మాయి ఎందుకోసమో వీధి నడవలోకి వచ్చి బండి చూసి ఇంట్లోకి వెళ్ళిపోకుండా, అక్కడే ఆగి, గుమ్మాన్ని ఓచేత్తో ఆనుకొని నిశ్చలంగా నిల్చొని అతణ్ణి నిశ్చలంగా చూసింది. బండి ముందుకి సాగిపోయింది. ఆమె దూరాన్న ఉండి పోయింది. కాని ఆ చూపు అతణ్ణి వెంట తరుముతోంది. మరో విధంగా చెప్పాలంటే ఆచూపు అతన్లో గోతులు తవ్వుతోంది. కొన్నాళ్ళ క్రిందట పురుషోత్తం జబ్బుపడి ఆస్పత్రికి వెళ్ళాడు. అప్పుడతను చాలా నీరసపడి

చిక్కిపోయున్నాడు. ఆస్పత్రిలో డాక్టర్ల వెనుక నుంచి ఓ నర్సు ముందుకొచ్చి "ఇలారా" అని అతణ్ణి తూకపు మెషీను దగ్గరికి తీసుకెళ్ళింది. తీసుకువెళ్తూ తనని ఆమె చూడ్డం అతను గమనించేడు. ఆమె చాలా లేతగా వుంది. రోగుల బాధలకి బాగా అలవాటు పడిపోగా ఆమె ఇంకా అమానుషంగా తయారవలేదు. ఆమె కళ్ళు చాలా చిన్నవి. ఆమె చూపులో అర్థం అతనికి తూకం మెషీను చూసేదాకా బోధపడలేదు. దాన్ని చూసేక "ఓహో ఈమె నా బరువెంతో అంచనా కడుతోంది అనుకున్నాడు. మెషీన్ మీంచి అతను దిగిన తరువాత ఆమె జాలిగా చూసి, హెచ్చరికగా నవ్వి, "మరేం భయంలేదు. ధైర్యంగా వుండు. నిమిషంలో నయమవుతుంది జబ్బు" అని హుషారిచ్చింది. కృతజ్ఞత ఎలా తెలియజేయాలో తెలియక అతనప్పుడు కంట తడిపెట్టేడు. బండిలో కూర్చొని వెళ్తూంటే ఈ లేత నర్సెందుకో గాని గుర్తుకొచ్చింది పురుషోత్తానికి. దూరంలో నల్ల కొండలు, ఇవతల కొబ్బరి తోటలు, పక్కన పచ్చని చేలు. పైన తెల్లటి మేఘాల చాందినీ, అంతా అలా చూస్తోనే అతను ఆలోచనలో పడిపోయాడు. నేను సరియైన బరువులేనా? అని ఓసారి అనుకున్నాడు. కాని అతని కేమి సరిగా అర్థం కావడం లేదు. తడికర్రకి నిప్పంటనట్టుగా, అతని మనసు రాజుకోడం లేదు. బండి తాజుగా వెళ్తోంది. "ఒహోయ్! హోయ్ హోయ్" మంటూ బండివాడు ఎడ్లని ఆపేటప్పటికి తుళ్ళిపడి, బండిలోంచి దిగేడు పురుషోత్తం. ఆ సమయంలో ఎక్కడో దద్దరిల్లింది. తోటల్లో గాలి గలగలమంది; రివ్వు రివ్వుమంది. పురుషోత్తం ఆకాశం కేసి చూసేడు. తెల్లమబ్బుల్ని గాలి తుడిచి పారేసింది. ఓ పక్క నల్ల మబ్బులు, లావాలా పెనుగడ్డలా పెల్లుబికి, వాహినిగా విజృంభించి ముందు కొస్తున్నాయి.

నాటురోడ్డూ ట్రంకురోడ్డూ కలిసే చోట, రోడ్డు పక్క, అధికారిలా నిల్చున్న చింత చెట్టు ఈదురుగాలికి తల విసిరి ఆకాశాన్ని ఎదిరిస్తోంది. చెట్టు కింద కమ్మలపాక చలిగాలికి ముసలమ్మ వణికినట్టు వణుకుతోంది. అంతలోనే మబ్బులు ముంచుకొచ్చేయి. ఎండ వేడికి పలకమీదినీరు మాయమైనట్టు ఎండంతా కూడా చూస్తోండగా మాయమయింది; పొలాలమీద మబ్బుల నీడ ప్రవాహంలా పరిగెట్టింది.

బండివాడు గాలినీ ధూళినీ బూతులు తిడుతూ బండిని మళ్ళించి మొత్తాల మీదికి చెంగున ఎగిరేడు. ధూళిని చీలుస్తూ ఎడ్లు దౌడు తీసేయి. పురుషోత్తం ఎదురుగా వున్న కమ్మలపాకలోకి దూరేసరికి వర్షం దడదడ లాడుతూ దిగింది. జోరుగా వీస్తోన్న గాలి మరికొంత జోరు చేసేసరికి, ప్రవాహం ఒక్కసారిగా పల్లానికి దిగినట్టు, వర్షపు దార పాకని ముంచేసి హోరుమంటూ ముందుకు పోయింది.

కమ్మలపాక 'టీ' దుకాణంలో బల్లమీద గంటపై నుంచీ కూర్చున్నాడు పురుషోత్తం.

‘టీ’ బల్లమీద గళాసులు పనిలేక పడున్నాయి. కెటిల్ వంటిదొకటి పొయ్యి మీద పడుక్కుంది. పొయ్యిలో నిప్పు చల్లబడి పోతోంది. దుకాణం అంతా తీరుబాటుగా వుంది టీ చెయ్యడం తనపని కానట్టుగా ముక్కాలిపీట మీద ముసలిపిల్లిలా కూర్చున్న దుకాణం తాత, ఆరిపోయిన చుట్టని రెండు పీల్పులు పీల్చి, అంటించకుండా దాన్ని టీ బల్లమీద పెట్టి, “ఏవూరు బాబూ మన్దీ?” అని పురుషోత్తాన్ని మొదటి ప్రశ్నగా అడిగేడు. తరువాత వరుసగా, నెమ్మదిగా – కమ్మలచూరు నుంచి వానజల్లుకి ఒకటి ఒకటీగా నీటిబొట్లు తాజుగా కిందికి దిగినట్టు –ప్రశ్నల్ని వరసగా దింపడం ప్రారంభించేడు. జవాబివ్వక పోతే ఏం కొంప మునిగిపోతుందో అన్నట్లు వాటన్నిటికీ పురుషోత్తం జవాబిస్తున్నాడు.

అన్నీ తెలుసుకుని, ఆఖరికి, నువ్వు వెళ్ళదల్చుకున్న చోటికి వెళ్ళలేవు అని ఖచ్చితంగా పురుషోత్తంతో చెప్పేసి అందుగురించి సంతృప్తి పడి నవ్వుకున్నాడు దుకాణం తాత.

పైన వర్షం జోరు చేస్తోంది. గాలి గీఁ కొడుతోంది. ఆకాశాన్ని మెరుపులు చీలుస్తున్నాయి; ఉరుములు బద్దలు కొడుతున్నాయి. కొండలన్నీ వాన తాకిడికి మొండికెత్తి నిల్చున్నాయి. చెట్లన్నీ తిరగబడుతున్నాయి. దుకాణంలో పొయ్యిలో నిప్పుకి గాలి అందడం లేదు. మీద నుంచి కురిసే నీరు మాత్రం కెటిల్ మీంచి జారి నిప్పుల్లో ఇంకుతోంది.

నవ్విన నవ్వుని మాసిన గడ్డంలో మాయం చేసేసి “బొగ్గుల కెళ్ళేడు. కుర్రోడింకా రానేదు బాబూ, ఎక్కడుండిపోనాడో ఏటో” అన్నాడు దుకాణం తాత.

“అయితే బస్సు రాదంటావా?” అన్నాడు పురుషోత్తం.

“ఆ మాటకొస్తే రెయిల్ గాడీ నే రాదు. ముండమోపి బస్సుకి నెక్కేటి?” అని, ప్రపంచమంతా ఆ విధంగా వర్షం వల్ల స్తంభించిపోయినందుకు, హర్షం వెలిబుచ్చేడు దుకాణం తాత.

గాలికీ వానకీ పాకమీద పాములు జారినట్లుగా చప్పుడౌతోంది. ట్రయిన్ రావడానికి పూర్తిగా రెండు గంటలైనా వ్యవధిలేదు.

“పెందలికాడే బయలెల్బి నడిచేసినా అందేద్దువు. మరిం కిప్పు డీల్లేదు. ఏళ్లూ వూళ్ళూ ఏక వేఁమరింక.”

నడిచి వెళ్ళడానికి వీలు పడనందు క్కూడా హర్షం వెలిబుచ్చేడు దుకాణం తాత.

బాధింపబడుతూ అలానే కూర్చున్నాడు పురుషోత్తం. బొగ్గుల కోసం పయనమైన కొడక డింకా రానేదని దుకాణం తాత విసుక్కుంటున్నాడు. పాకంతా తడిసి ముద్దయింది. చలి హెచ్చూ, చలిగాలి జోరూ అయేయి. పైన వర్షం పడుతోంది.

“పడకేటి చేస్ది బాబూ? దాని టయాం అది.”

ట్రెయిన్ రావడానికి రెండు గంటలైనా వ్యవధి లేదు. రెండు కోసుల దూరం అలానే

వుండిపోయింది. బస్సు ఎక్కడో ఆగిపోయింది. ఆకాశం విరుచుకు పడిపోతోంది. పురుషోత్తం లేచి నిల్చున్నాడు.

"నరమానవు దన్నవోడు బైట అడుగెట్టడాని కీల్లేదు" రెస్టు లేని వాళ్ళా పురుషోత్తం అటూ ఇటూ తిరిగేడు. పనిలేక గింజుకున్న వాళ్ళా గింజుకున్నాడు.

"అగ్గుందా బాబూ?"

"లేదు"

"ఉండదనే అనుకున్నాన్లే. నీట్లో అగ్గి పుట్టించాలగాని, మరి దొరకదు. ఈడు జూస్తే ఇంకా రానేదు. ఎక్కడ టిక్కడిపోనాడో ఏటో? గేటు కాణ్ణుంచి బొగ్గులు పట్టుకొస్తానని పారెళ్ళాడు బాబూ, కుర్రోడే గాని శండశాసమ్ముండకొడుకులే? ఒరసవేఁనన్న మాటేటి, దిమదిమలాడుతూ ఏనుగులు దిగేసినా నెక్కసెయ్యడు".

కుర్రవాడు వెళ్ళడం, బొగ్గులు తేవడం, ఏనుగులు దిగడం – వీటిని గురించి వినడం లేదు పురుషోత్తం. చుట్టూ పాకంతా బందిఖానాలా అవుపిస్తోందతనికి. ఇనప ఊచలు దిగ్గొడుతు న్నట్టుగా వర్షధారలు చుట్టూ దిగుతున్నాయి. అతను ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరవుతున్నాడు. పరిస్థితులకు చిరాకు పడిపోతున్నాడు.

వెళ్ళు వెళ్ళంటే వెళ్ళిపోయి వచ్చేడుతను. ముందు కలకత్తా వెళ్ళి అక్కడి పరిస్థితులు చూచు కొని ఆ తరువాతే వచ్చిపెళ్ళి కూతుర్ని చూడవలసింది. ఎప్పుడూ ఇలాగే అవుతోంది. ఆ పిల్ల కరెక్టుగానే ఆచోకీ కట్టి నట్టుంది. ఛ! తనెప్పుడూ ఇంతే. కలకత్తా రావాలిస్మా అన్నారు. ఒస్తున్నానన్నాడు అడివిపాలెం ఫో అన్నాడు మాఁవఁ. పోతున్నానన్నాడు. చిన్నప్పటి నుంచీ కూడా ఇంతే. చదువుకోకపోతే చెడిపోతావు. చదువుకో అన్నారు. చదువు కుంటానన్నాడు. బుద్ధిగా ఉండకపోతే బాగుపడవు స్మీ అన్నారు. బుద్ధిగా ఉంటానని లెంపలు వేసుకున్నాడు. మజాలేని వెధవలు మంచిగానే ఉంటారు మరి అన్నాడొక స్నేహితుడు. అవునవునని తను ఒప్పుకున్నాడు. ఇలాగే అన్నీను. ఈత రాకుండా నీట్లోకి దిగేవు జాగ్రత్త! "దిగను". దీపం లేకుండా చీకట్లో నడిచేవు జాగ్రత్త!" "నడవను". చక్కని రాజమార్గాలుండగా సందులంట తిరిగేవు జాగ్రత్త 'తిరగను" వాళ్ళేలాచస్తే నీకెందుకు? వాళ్ళ జట్టీల్లోకి నువ్వు వెళ్ళేవు జాగ్రత్త "వెళ్ళను" అన్యాయం, అధర్మం! నీకేలదంతా?; నీ పని నువ్వు చూసుకో. లేకపోతే తన్నులు తగిలేను జాగ్రత్త! "అదంతా నా కెందుకు?! ఆ తన్నులు నా కెందుకు? నా పని నే చూసుకుంటాను." టైఫాయిడ్, న్యూమోనియా, మరేదో, మరేదో ఏదైనా ఒస్తుంది. వర్షంలో చొరపడేవు జాగ్రత్త! "చొరబణ్ణే. ఇక్కడే ఉంటాను".

తుళ్ళి పడ్డాడు పురుషోత్తం. మరైతే కలకత్తా వెళ్ళడం ఎలాగ? గంటన్నర కంటే మరింక టైం లేదు. ఏం చెయ్యడానికి పాలుపోక పురుషోత్తం మళ్ళీ బల్లమీద కూర్చోబోతూ

వుండగా దుకాణం తాత చూరు కిందనించి రోడ్డువైపు చూసి “అఁ! ఒస్తడొస్తన్డు హదిగదీ! రేసుకుక్కే! పా(రా! పా(రా!” అని ఉత్సాహంతో కేకలు వేసేడు. పురుషోత్తం కూడా వంగొని, చూరు కింద నుంచి చూసేడు.

ఎదురుగా తిన్నగా దూరానికి కనిపిస్తోంది రోడ్డు. రెండు పక్కలా ఉన్నచెట్లు సిపాయిల్లా నిల్చొని అలజడి చేస్తున్నాయి. రోడ్డంతా నీటితో ఏటికాలవలా ఉంది. అందుమీద ఆరని నిప్పు తునకలా, నీటిమీద బోటులా, చెట్లని చీల్చుకొని బాటవేసుకొని వస్తున్నట్లుగా ఓ కుర్రవాడు భుజాన్న మూట వేసుకొని పరుగెట్టుకొని కొట్ కొస్తున్నాడు.

కుర్రవాడికి హుషారిచ్చిన తరువాత దుకాణం తాత బుగ్గలు పూరించి పొయ్యి ఊది “ఆరిపోనా దనుకున్నాను. అగ్గుందిరా బాబు” అని ఇంకా జోరుగా ఊదడం ప్రారంభించేడు.

కుర్రవాడు పరిగెట్టి, పరిగెట్టి పాకలోకి ఒక్కసారిగా విరుచుకుపడ్డాడు. “ఒచ్చీసినా న్తాతా!” అని వచ్చీ రావడంతో కేకవేసి, మూటనుండి భుజాన్ని సుళువుగా తప్పించి, బొగ్గుల మూటని చక్కున కిందకి విసిరేడు. కుర్రవాడికి పన్నెండేళ్ళకి మించి ఉండదు వయసు. సరిగ్గా రేచుక్కలాగే ఉన్నాడు. అరనిమిషంలో, జుట్టు నుంచి నీటిని నొక్కేసి, బట్టల్నించి నీటిని పిండేసి ఆ పాకలో పొడిగా గెంతులు వేసేడు.

“వొరసంలో దార్లో సత్తే ఏటిజేద్దువురా మనవడా!” అన్నాడు దుకాణం తాత. బొగ్గుల మూట విప్పుతూ, మూట విప్పగానే రాక్షసి బొగ్గులు నిగనిగ మెరిసేయి. “ఒరసవాఁ! మన సంగ త్తెల్దేటి తాతా? ఒరసాన్ని సంపిడిసిపెడతా డీ పోతురాజు” అని మూడు లోకాలూ ఏలేవాళ్ళా జవాబు చెప్పి, పొయ్యి విసరడానికి విర్రవీగుతూ వెళ్ళేడు కుర్రవాడు.

ఆ పాకలో పాతుకుపోయినట్లుగా నిశ్చలుడై నిల్చుండిపోయేడు పురుషోత్తం. ఆకాశం ఒక్కసారి గప్పున మెరిసింది. అంతవరకూ పురుషోత్తాన్ని వెంటతరిమిన పెళ్ళి కుమార్తె చూపు ఆ క్షణంలో అతని ముందుకొచ్చి మూర్తీభవించి నిల్చొంది. ఆమె చూచిన చూపు, ఆనాటి నర్సు నవ్విన లేనవ్వు; చిగిర్చిన మామిడి మొక్క, ఎగసిన కొబ్బరి చెట్టు; ఈదురు గాలి, హోరున వర్షం; నీటిలో నిప్పు, మనిషిలో జ్వాల – అన్నీ అతనికి అర్థమయేయి. అర్థయుక్తంగా, స్పష్టంగా తెరమీది కథలా అతని కంతా బోధపడింది. అంతా చూస్తూ అతనలా నిల్చుండి పోయేడు.

పైన వర్షపు ధారలు స్తంభించినట్లుగా అలాగే ఉండిపోయేయా అన్నట్టుగా అనిపిస్తోంది. ఆకాశం ఇంకా దట్టంగా మూసు కొంటోందే గాని పల్చబడ్డం లేదు. గుర్రాల్ని కట్టుకొని ఝూమ్మని అన్నింటినీ తొక్కుకు పోతోంది ఈదురు గాలి, మెరుపులు పిడుగులయి అందిన దాన్నల్లా హతమార్చేస్తున్నాయి. మబ్బులు కమ్మిన కొద్దీ పాకలో చీకటి చిక్క నవుతోంది.

పొయ్యి విసురుతూన్న కుర్రవాడు ఇనుంలా ఎర్రగా మెరుస్తూన్నాడు.

కొద్దిసేపయింది.

అటూ ఇటూ హడావిడిగా తిరుగుతూన్న దుకాణం తాత ఏదో గుర్తు కొచ్చినట్టుగా టక్కున ఆగి, కళ్ళు చిట్లించి, అటూ ఇటూ చూసి, మనవణ్ని "పోతురాజొరే" అని పిల్చి "ఇప్పు డిప్పు డిక్కడున్నాడు! చిటీబా బెక్కడికి పోనాడ్రా?" అని ఆశ్చర్య పడుతూ, సిటీబాబుని ఎన్నెమ్మకాని ఎత్తుకుపోయిందా?! అన్నట్టుగా అడిగేడు.

"అడుగో" అన్నాడు పోతురాజు.


"ఏడి?"

"అడుగడుగడుగో" అని రోడ్డు వైపు చూపించేడు పోతురాజు

"ఏటి!! పప్పుముద్దనా సతికిలబడిపోన్ డు; ఒరసం ఒగ్గనట్టు పాకొగ్గడుసుకున్నాన్రోరె, ఆ! ఆ! కదిన్నాడే!" అంటూ మోకాళ్ళు వంచి వీపు విరిచి చూర్లోంచి పైకి చూసేడు దుకాణం తాత.

మసక చీకట్లో తిన్నగా సూటిగా, ఈదురుగాలి కెదురుగా, వర్షాన్ని సరకుచేయకుండా, తెరల్ని ఛేదించుకొంటూ చకచకా ముందుకి వెళ్తున్నాడు పురుషోత్తం. అతణ్ణి చూసి తల పంకించి, హసించి "సెబాసా" అని మెచ్చుకున్నాడు దుకాణం తాత.

# పంతుల శ్రీరామశాస్త్రి



**గా**లి విసురు అలల్ని కదిలించే విధంగా పంతుల వారి కథలు పాఠకుని మనస్సులో ఆలోచనల్ని రేకెత్తిస్తాయి. ప్రయోగాలతో రిసెర్చి చేసే శాస్త్రజ్ఞునిలా, ఊహా బలంతో సంఘటనల్ని సంభవింప జేసి రకరకాల తరహాలకి చెందిన మనుషులు వివిధావస్థలలో ఏ విధంగా ప్రవర్తించేదీ సూచిస్తూ ప్రాపంచిక సత్యాలను వెల్లడించే కథలు వ్రాయటంలో దిట్ట శ్రీపంతుల శ్రీరామశాస్త్రి. ఒరిస్సా - రాయగడలో నివసించేవారు.

**రచనలు :** కథా సాగరం, కుటుంబం (కథల సంపుటాలు)

# కిళ్లీ దుకాణం

మద్రాసు మహానగరంలో ప్రసిద్ధుడయి వచ్చిన నారాయణకి ఆ చిన్నపట్నం ఒక ఎడారిలాగ కనిపించడంలో వింతలేదు. ఇక్కడ ట్రాములు, బస్సులు, మేడలూ, మిద్దెలూ లేకపోవటమే కాదు. అధమం ఒక సినిమా థియేటరయినా లేదు. తక్కినవి ఎన్ని లేకపోయినా భరించగలడు గాని, సినిమాలు లేకపోతే సగం జీవితమే పోయినట్టు భావిస్తాడు నారాయణ. అందుకు తగిన కారణం కూడా వుంది. అతని కాలేజీ చదువు సినిమాల సరదాల వల్లనే ఆగిపోయింది. కాని, అందుకు బదులుగా అతనెంతో విజ్ఞానం ఆర్జించగలిగాడు. తన విజ్ఞానాన్ని వెదజల్లే ఉద్దేశంతో ఒక సినిమా మాస పత్రిక కూడా నడిపాడు కొంతకాలం. పత్రిక ఆరంభ దశలోని వడు దుడుకులను అధిగమించి కాస్త నిబ్బరంగా నడుస్తున్న సమయంలో అతనికి స్వయంగా ఫిలిము తీయాలని కోరిక కూడాకలిగింది. ద్రౌపతిని కూడా ఒడ్డుతున్నాను, అని ధర్మరాజు అన్నట్లుగా యావదాస్తినీ పట్టుకొని దిగబడ్డాడు. ఒక ఎనిమిది నెలలపాటు ఎటువెళ్తున్నాడో అతనికి ఆనూ, పానూ దొరకలేదు. ఎంతసేపూ ఎగ్రిమెంట్లు, ఎడ్వర్టజుమెంట్లు, జీతాలు, భత్యాలు – ఇవే.

అంత త్వరలో కంపెనీ దివాలా తీస్తుందని అతను స్వప్నేపి అనుకోలేదు. కంపెనీ దివాలా మాట దేముడెరుగును గాని, అందుమూలంగా తన పత్రిక కూడా పడుకుంది. అంతేకాదు అంతటి మహాపట్నంలో తనవంటి ప్రతిభాశాలికి ఉద్యోగం దొరక్కపోవడ మేమిటి? అయితే అదీ ఒకరకంగా అదృష్టమే. లేకపోతే తానీ సరికిఏదో ఒక క్షుద్రమయిన నౌకరీలో ఇరుకుకొని ఉండును. అంతకంటె నిరుద్యోగిగా ఉండడం వెయ్యిరెట్లు నయం.

కాక, తాను మరీ నిర్వ్యాపారుడుగా, ఊరికే బాల్యమిత్రుడు శేషయ్య గారింట్లో భోంచేస్తూ కూర్చోడంలేదు. తన ప్రయత్నం తాను చేస్తూనే ఉన్నాడు. అది ఏరోజయినా ఫలించవచ్చును. అంతవరకూ సముద్ర మధ్యలో ఓడ పగిలిన బాటసారి ఏదో చిన్న ద్వీపం మీద ఆ దారిని

ఏమైనా ఓడలు వచ్చేవరకూ కాలం గడపదలచినట్లుగా గడపదలిచాడు. ఆ ఊళ్ళో నారాయణ. అంతేకాని, ఎప్పటికైనా, తానిక్కడి వాడు మాత్రం కాదు.

తన దైవిక కృత్యాల్లో కాస్త హుషారు కలిగించేదల్లా రాత్రి భోజనానంతరం రైల్వే స్టేషను పర్యంతం వెళ్ళే షికారు మాత్రమే. ఆ సందర్భంలో మధ్యను ఎవరయినా పలకరించి మాట్లాడిస్తే మాత్రం అతనికి బహు అయిష్టంగా ఉంటుంది. కాని తప్పదు. రోజూ ఎవరో ఒకరు మధ్యలో నిలవేస్తూనే వుంటారు. ఇవాళ ఆ పని రామచంద్రుడిగారి వంతు పడ్డది. ఉభయకుశలోపరి రామచంద్రుడుగారు ప్రశ్నించారు: పొరుగు పట్నం సినిమాహాలుకు వచ్చిన కొత్త ఫిలిం 'సుప్రభాతం'కి ఇంకా నారాయణగారు వెళ్ళి రాలేదా అని. నారాయణ ఏమో దానిని చూడలేదు. నిజమేగాని, చూసిన వాళ్ళందరికీ అతనికి తెలిసినంతగా దాన్ని గురించి తెలియడానికి సావకాశం ఉంటే కదూ. అసలు కథ, నటీ నటుల మాటకేం, ప్రధానమైన టెక్నిక్కు అవే గొప్ప విషయం ఉందే, దాన్ని గురించి అమోఘమయిన ఉపన్యాస రాజాన్ని ఆరంభించాడు. రామచంద్రుడిగారికి గుండెల్లో బితుకు పట్టుకుంది అన్నా, యీ ఉపన్యాసం పూర్తి కావడానికి ఎన్ని గంటలు పడుతుందో అని. ఏ మిషచెప్పి తప్పించుకోవడమా అని ఆలోచించి ఆలోచించి "పంతులుగారు! ఇవన్నీ మాకు బోధ పడవు గాని, తమరు ఒక పర్యాయం మా ఇంటికి దయచేసి శాంతంగా సెలవియ్యాలి. నా గొడుగు బజారులో బట్టల దుకాణంలో మరిచిపోయాను. వేగం వెళ్ళకపోతే పోతుందేమో సెలవు" అంటూ జారిపోయాడు. అతడు వెళ్ళిపోయిన కొంతసేపటి వరకూ, నారాయణ ఉపన్యాస ధోరణి ఆగకుండా "న్యూటను" చలన చిత్రాలలోని మొదటిది నిజమే ననిపింపజేసింది.

ఒక్క క్షణం చించుకున్నట్లయి, నారాయణకి తన షికారుకి కలిగిన అభ్యంతరం తొలగినందుకు సంతోషమే కలిగింది. అసలు ఇప్పటికే కొంత ఆలస్యం అయింది. స్టేషను దగ్గర రాధ కిళ్లీల షాపు ఇప్పటికే కట్టేసి వుండవచ్చును. మర్నాటికి తనకి కావలసిన చుట్టలు, తమలపాకులు మరెక్కడయినా తీసుకోవచ్చును డబ్బులిచ్చి. కాకపోయినా తక్కిన దుకాణాల వాళ్ళు కూడా అరువియ్యకపోరు గాని, పాపం ఆమెకి ఆట్టే బేరం లేదు. కాక రోజూ అదొక అలవాటయిపోయింది.

బ్రిడ్జి దాటుతూ ఉండగా అతడు గమనించాడు? తాను అతి త్వరగా నడుస్తున్నట్లు. కాక అల్లంత దూరంలో తనకి కావలసిన షాపు దీపం కనబడడంతో అతని నడక వేగం దానంతటదే తగ్గింది.

దుకాణం ముందున్న బెంచీమీద విశ్రాంతిగా కూర్చొని తొలినాటి చుట్టలలోని ఆఖరుదాన్ని ముట్టించాడు. చుట్ట బాగా అంటుకుని కాలుతూ ఉండగా అతడు ప్రక్కగా వంగి ఉమ్మివేసి గొంతు సర్దుకొని ఇవాళ నేను బాగా ఆలస్యం చేశాను కాబోలు! అంటూ ప్రసంగం ప్రారంభించాడు.

అట్టే లేదులెండి, రోజూ బండి లైన్ క్లియర్ గంట కొట్టే వేళకు వచ్చేవారు. ఇవాళ ఇప్పుడే ఔట్ బెల్లు కొట్టారు. ఇక మరొక మూడునాలుగు నిమిషాల్లో రైలు రావచ్చును.

అంటే, ఆ తరువాత మరి అయిదు నిమిషాల్లో మీ షాపుకూడా కట్టేస్తారు.

"అసలు ఒక గంట గంటన్నర క్రితం కట్టినా సరిపోయేదే. ప్రస్తుతం రాత్రి బేరం ఏమీ ఉండడం లేదు. నిజానికి మీరు వస్తారనే ఇప్పటి వరకూ ఉంచడం."

నారాయణకి ఈ సమాధనంతో యెంతో తృప్తి కలిగింది. వెంటనే అప్రయత్నంగా "అయితే, ఇప్పుడే ఇలా ఉందా, మునుపూ బేరం ఇలాగే ఉండేదా?" అన్నాడు.

"అలాగయితే అసలు దుకాణమే లేకపోవును. అదుగో, అల్లా ధాన్యపు గోడౌనుందే, అది ఒక సినిమాహాలు. అప్పుడు ఇక్కడ మరొక ఆరేడు షాపులుండేవి. వాళ్ళంతా అప్పుడు సినిమా ఎత్తిపెట్టడంతో, ఊళ్ళోకి మారిపోయేరు. మేముమాత్రం ఈ ఇంటినీ, ఈ పువ్వుల మొక్కల్నీ విడవలేక ఇక్కడే ఉండిపోయేము. ఇక్కడయినా వేసవికాలంలో ఇంత అన్యాయం లేదు. సోడాలు సెర్బతులూ బాగానే ఖర్చవుతాయి. అదుగో అప్పుడే రైలు వచ్చేసింది."

కాని, నారాయణ ఆలోచన వేరే ధోరణిలో వుంది.

"అయితే మీకు ఇక్కడే ఇంత దగ్గరలోనే సినిమాహాలుండేదన్న మాట. అప్పట్లో మీరు చాలా సినీమాలు చూసే ఉండాలి."

"మీరు ఎన్నయితే చాలా అంటారో నాకు తెలీదు గాని, మొత్తం పది పన్నెండు చూచి ఉంటాను. కాని, ఏమిటో మామటుకు అన్నీ ఒక్కలాగే ఉంటాయి. కాక, దుకాణం బేరం ఒకటి చూచుకోవలసి వుంటుంది కదా!"

"అంటే ఇంత దగ్గరలో సినిమాహాలు ఉండి కూడా మీకు సినిమాలంటే సరదా కలగ లేదన్నమాట."

"సరదా, ఓ ఉండకేం ఉంటుంది. అయితే ఏం లాభం. నా చిన్నతనంలో మధ్యను పచ్చరాయి వేసిన బంగారు ఉంగరం అంటే ఎంతో వెర్రి సరదా ఉండేది. కాని, తీరా కొనేవేళకు పెట్టుకోవాలని పించలేదు. అది అలా పెట్టెలోనే కొన్నాళ్లు ఉండేది. తరవాత ఎప్పుడో తక్కిన వస్తువులతో పాటుగా అమ్మడం జరిగింది."

ఆమె ఈ మాటలు నారాయణ వింటున్నాడో వినలేదో కూడా. తన ఊహలే తనవి.

ఆ వూళ్ళో అతని గురించి ఓ అపప్రధ ఉంది. ఏమిటంటే, ఏకాస్త, డబ్బున్న మనిషి కనిపించినా, అతనికి సినీమా పరిశ్రమలోని మహదవకాశాలను గురించి ఉద్బోధ చెయ్యకుండా ఉండలేకపోవటమే. అంతవరకూ అతని స్వభావంలోని దౌర్బల్యాన్ని కనిపెట్టిన ఆ వూరి ప్రజ అతనిలోని ఇంకొక ముఖ్య లక్షణాన్ని కనిపెట్టలేక పోయేరు. అదేమిటంటే తన దృష్టిని ఆనిన ఏ అందమయిన ఆడమనిషి కనిపించినా, ఆమెనే గాని సినీమాల్లో సరిగా ఉపయోగించుకుంటే ఇప్పుడు ఏ మాత్రము ప్రత్యేక దృష్టితో చూడని ఆ మూర్తిమంతమునే దర్శించడానికి ప్రజలు తండోప తండాలుగా విరగబడతారు అన్న మధుర దృశ్యాల గురించిన ఊహాపరం పర అతని మనోయవనిక మీద మెరవకుండా ఉండదు. కిళ్లీదుకాణం మీద రాధను చూసినప్పుడల్లా అతని మనసు మనసులో ఉండదు. ఇక్కడ ఈ దరిద్రపు దుకాణం మీద కూర్చొని, కానీ, పరకాబేరాల ఆలోచనలతో అందాన్ని, వయస్సునీ ధ్వంసం చేసుకొంటున్నది. ఇదివరకయితే, ఈ మాటలు లోపల్లోపలే అనుకునేవాడు. ఇప్పుడిప్పుడు ఒకమాదిరిగా బైటికే అనగలుగుతున్నాడు. రాధ కూడా ఏమంత అభ్యంతరం చెప్పడంలేదు.

"మీ మటుకు మీకు కేవలం సరదా ఏమిటి? అసలు సినిమాలోనే మీలాటి వాళ్లుంటే! హుఁ, ఆ డైరెక్టర్లకీ, ప్రొడ్యూసర్లకీ అందాన్ని చూడటానికి కళ్ళుంటూ ఉంటే కదూ, ఎన్నో రత్నాలు సహజ సంపదతో మెరసిపోతో ఉంటే ఆ పాత ముఖాల్నే కొత్త కొత్త రంగులతో చూడటానికి తాపత్రయపడతారు. ఎంతసేపూ వాళ్ళ వ్యాపారమే వాళ్ళది. అసలు ఆ రకంగా మార్చుకోలేకుండా పాతపుంతల్ని పట్టుకొని ఏడవడం వల్లే వాళ్ళ వ్యాపారం కూడాఎదుగూ, మెదుగూ లేకుండా ఉంది. నిజంగా వాళ్లే గాని సరైన పద్ధతులు అవలంబించి నడిస్తే మన దేశం అంతా మాటకేం అంతర్జాతీయ కీర్తికి కూడా సావకాశం ఉండును.... నిజంగా నాకే గాని డబ్బు ఉంటే!'"

"మీకు అంత డబ్బు ఉంటే ఈ ఊళ్లో జమీందారుగా రింటిలోనే ఉండకపోదురు."

"నిజమే నిజమే మీరన్నది. కాని, కాని, ఒకప్పుడు ఈ సామాన్య మానవుడికి కూడా డబ్బు ఉంటూ ఉండి, ఎటు కదలాలన్నా కారూ, వేషమూ అంతా ఉండేదన్నమాట. మీకు నమ్మడానికి వీలుగా ఉండదేమో! అయితే, మళ్ళీ యెప్పటికైనా ఆ రోజులు రాకపోతాయా?"

"నే నేదో ఊరకే మాటవరసకి అన్నాను పంతులుగారూ!"

"ఊరికే కాదు, నిజమే. ఇక్కడ ఒకళ్ళ ఇంట్లో ఏ పనీ పాటూ లేకుండా ఉంటున్న ఆసామీని గురించి ఎవళ్లు యేమనుకున్నా సబబే గాని, నాకే, ఎప్పుడో కాదు. ఇప్పుడే డబ్బు ఉండి ఉంటే!"

“ఒక అణా చుట్టలు, ఒక అగ్గిపెట్టె వేగం కావాలి. అవతల కూలివాడు వెళ్ళిపోతున్నాడు” అన్న బేరగాడివల్ల అతని ప్రసంగం మధ్యలో ఆగిపోవలసి వచ్చింది. అంత తొందరపడ్డ వాడు చిల్లర ఇవ్వరాదు, ఇక్కడ ఈమె గల్లాపెట్టిలో దాచిపెట్టినట్టు రూపాయిచ్చి చిల్లర తెమ్మంటాడు. ఆమె యేమీ తొందర లేకుండానే పెట్టె తీసి చిల్లర ఎంచి రెండుమార్లు లెక్కచూసి మరీ యిచ్చింది. ఆ చిల్లర లెక్కపెడుతున్నప్పటి మూగ భంగిమం నాయకుడికి తనమీద కలిగిన అనుమానాన్ని ఏ విధంగా తొలగించుకోవడమా అని సినిమా నాయకి పడుతున్న అవస్థగా రూపించింది నారాయణకి. నిజంగా సినీమాలో అటువంటి భావప్రకటన కావాలంటే ఎంత కష్టం? అయినా అసలు నటించే వాళ్ళలోనూ ఉంటుంది. కొందరికి భావ ప్రకటన సహజంగా వచ్చేస్తుంది. అబ్బ ఇప్పటికి కదిలేడు బేరగాడు, మహాశయుడు మూడుసార్లు చిల్లర లెక్కచూసుకొని.

కాని, నారాయణ మాత్రం తన సంభాషణా సూత్రాన్ని విడిచిపెట్టలేదు. “నాకే గాని, ఇప్పుడు డబ్బుంటే, ఎప్పుడో పదేళ్ళు పోయాక అయితే ప్రయోజనం లేదు. ఏడాది ఆఖరులోగా ఒక ఫస్టురేటు ఫిలిము తెలుగు, హిందీ, ఇంగ్లీషులలో తీసి ఒక్కమారుగా అమెరికాలోనూ, ఇంగ్లాండులోనూ విడుదల చెయ్యనూ.”

“ఎందుకు చెయ్యరు? తప్పకుండా అంతే చేస్తారు.” ఏదో అనాలన్నట్టుగా ఆమె అంది.

“అయితే, అందులో హీరోయిను ఎవరని అడగవేం? తెలుగు, హిందీలలో మీ మాట చాల స్వచ్ఛంగా ఉంటుంది. ఆవేళ యెవరో కష్టమరుతో హిందీ మాట్లాడుతూ వుంటే విన్నాను. కాని, ఇంగ్లీషే కొంచెం చిక్కు పెడుతుంది. అయినా, అట్టే బాధ లేదులెండి, కొద్దిపాటి తర్ఫీదుతో మీరు నిభాయించుకొని రాగలరు. ఇంతకీ ఆ పెర్సనాలిటీతో ఏమాట యెలా ఉన్నా ఉచితంగానే ఉంటుంది. పాట కేం బాధలేదు. ఆ గొడవంతా మ్యూజికల్ డైరెక్టర్లు చూసుకుంటారు. అంతగా కుదరకపోతే “ప్లే బాకు” పెట్టుకొంటాము. నా కప్పుడే అంతా కనిపిస్తున్నది.... అదిగో యెదురుగా.”

“పంతులుగారూ మీ కివి ఇవాళంటే ఇవాళ కాకపోయిన, ఎప్పుడో ఒకనాడు నిజం కావలసినవే. మాకు మాత్రం గాలిమేడల కంటే నమ్మలేనివి. అయినా మీరు మళ్లీ సినిమాలు తీసేవేళకి మీ కిక్కడ మళ్లీ సినిమా హాలు రాకపోతుందా? తక్కిన ఏ సినిమాలు చూసినా చూడకపోయినా మీవి మాత్రం తప్పకుండా చూస్తాము నేను మా నరిసింగున్నూ. అప్పటికయినా నరిసింగు రాడంటారా? ఇప్పటికే రెండేళ్ళు పైగా అయింది. మొత్తం మూడేళ్ళు. చూడండీ అన్యాయం ఇద్దరూ కొట్టుకున్న దానికి అవతలి మనిషి డబ్బున్న వాడు కాదా అని తనకి మూడేళ్ళు శిక్ష – ఏమి న్యాయమో మీరే చెప్పండి.

నారాయణకి ఈ ప్రశ్న అట్టే ఇష్టపడలేదు. దానికి జవాబు చెప్పకుండానే, "ఈమారు నేను ఫిలిం తీయడం అంటూ జరిగితే అందులో మీరు ఉండక తప్పదన్నది, సూర్యుడు తూర్పున ఉదయిస్తా డన్నది ఎంత నిజమో, అంత నిజం."

"ఏమిటో మీరు చాలా చిత్రవిచిత్రమయిన మాటలు చెప్తారు."

"చిత్రం ఎంత మాత్రం గాదు. నిజమే. అయితే ఎంత నిజమూ ఒకప్పుడు విచిత్రంగానే కనిపించ వచ్చును. మామూలు కాంట్రాక్టుల లాగా నెలకింత జీతం అని కాదు. వచ్చిన లాభంలో నాలుగవ వాటా అంటే, ఒక పదిలక్షలకి లోటుండదు. ఇచ్చేయటమే, ఆ మాటకివస్తే నాలుగవ వాటా అన్న మాటేమిటి సగానికి సగం ఇవ్వడానికి కూడా నాకు అభ్యంతరం లేదు. అసలు అటువంటి కళాసేవ చేసే సావకాశం అంటూ నాకు లభ్యమయితే అంతే చాలును, వెధవ డబ్బు మాటకేం – ఏమిటి మీరు దుకాణం కట్టేసే వేళయి నట్టుంది, మరి నేను వెళ్తాను."

"ఇందండి మీ చుట్టలు, కారా మసాలాను."

"చూశారా ఏవో కబుర్లు చెపుతూ అసలు మాటే మరచిపోయేను."

"పాపం మీరు చాలా దూరం వెళ్ళాలి ఇంత రాత్రప్పుడు."

"దూరానికీ రాత్రికీ ఏం బాధ లేదు. అసలు నాకు రాత్రి పన్నెండు దాటితేనే గాని నిద్రపట్టదు. ఇంతకి మరింత దూరమయినా బాధలేదు గాని ఈ వెధవ చినుకులొకటి, పెద్ద వాన పడేది లేదు ఏమీలేదు గాని ఈ ఊళ్ళో అధమం ఒక రిక్షా అయినా లేదు చూడండి."

బాగా పడమట మెరుస్తున్నట్టుంది. వానలో తడిసిపోతారేమో మా యింట్లో పాత గొడుగొకటుంది. తెస్తా నుండండి."

"కేవలం గొడుగు ఒక గొప్ప వస్తువని గాని, అది లేకపోతే తను మహా కష్టపడి పోతాడని కాదు, కాని ఆ ఇవ్వడంలో ఉండిన ఆర్ద్ర హృదయాన్నిముందే అది గణనీయమయినది."

"మళ్ళీ మీకు అవసరం ఉంటుందేమో ఉదయం జమీందారుగారి మనిషి చేత పంపించేస్తాను."

"ఎందుకు అక్కర్లేదులెండి. నాకు దాని ఉపయోగం యేమీలేదు. మళ్ళీ మా నరసింగు వచ్చే వరకూ అది అలా పడివుండవలసిందే. మీరు రేపు రాత్రి చుట్టలకి వచ్చేటప్పుడు తేవచ్చును లెండి."

"అలాగే తెస్తాను లెండి. మరి నేను వెళ్తాను. యేదీ ఒక గ్లాసుడు మంచినీళ్ళనిస్తారా?"

మంచినీళ్ళు త్రాగి నడుస్తుంటే వెంటనే వాన పడడం మొదలు పెట్టింది. అతనికి అంత అభిమానంతో ఇచ్చిన ఈ గొడుగు తడిసిపోవడమంటే ఎంతో కష్టమనిపించింది. రాత్రి యింటికి వెళ్ళి పడుకున్నాక మధ్యలో మూడు మార్లు లేచి చూశాడు భద్రంగా ఉందో లేదో అని. ఆఖరుమారు బాగా తడి ఆరిపోయింది. ఇక్కడ విడిగా వరండాలో ఉంటే ఎవరు సంధించినా సంధించవచ్చునని తలగడ క్రింద పెట్టుకుని మరీ నిద్రపోయాడు.

❁ ❁ ❁ ❁

రోజంతా చిన్న చినుకులు పడుతూనే వున్నాయి. ఆ వేళ రాధ సాయంత్రంతోనే దుకాణం కట్టేసింది. రాత్రితోపాటు వాన కూడా ఎక్కువ కాసాగింది. ఎందుచేతో ఆ రాత్రి పదిగంటల బండి కూడా పన్నెండు గంటలు దాటినా రాలేదు. అసలే రాత్రి జనసంచారం తక్కువయిన ఆ ఊళ్ళో ఆనాటి రాత్రి మనిషి మొగమే కనబడడం లేదు. అదివరకు తెలిసిన వాళ్ళకే తప్ప, తక్కిన వాళ్ళకి ఊళ్ళో మనుష్యులున్నారా అనిపిస్తుంది. చాలా భాగం పురాతన పద్ధతిని కట్టబడిన యిల్లు. వాటికి ఉన్న కిటికీలే తక్కువ. వాటిలో ఒకటయినా పొరపాటు చేతనయినా తెరుచుకుని ఉండలేదు.

తాలూకా ఆఫీసులో గంటలు కొట్టే మనిషి మాత్రం మేలుకొనే నిద్రపోతున్నాడో, నిద్రలోనే వేళకు మేలుకోగలుగు తున్నాడో, వేళకు మాత్రం లేచి బద్ధకంగా ఒక గంట కొట్టి పడుకున్నాడు.

అటువంటి రాత్రి తన వీధి తలుపు చప్పుడు కావడం రాధకు ఆశ్చర్యం కలిగింది. దొంగలేమో నన్న భయం ఆమె కెన్నడూ లేదు. ఏమో రయిలు దిగి వచ్చేవారెవరో అంటే రైలు కూతయినా వినపడలేదు. ఏమో గాలి హోరులో తనకు వినపడక పోయి ఉండవచ్చును. ఏదీ మరి చప్పుడు కాలేదు. వట్టి గాలేమో! ఊహుఁ కాదు. మళ్ళీ చప్పుడు వినిపిస్తూంది. మరి లాభం లేదు. లేచి వెళ్ళి తియ్యవలసిందే..

తీసి తియ్యడంలో రివ్వుమని గాలి లోపలికి దూసుకుని వచ్చింది. వానలో ముద్దగా తడిసిపోవడం చేత రోజూ చూస్తున్న మనిషినే వెంటనే పోల్చుకోలేక పోయింది.

“అమ్మయ్య. ఎవరు నారాయణపంతులు గారే! ఏమిటిలా వచ్చారు. ఇంత రాత్రప్పుడు అందులో ఈ గాలివాన సమయంలో. ముందు లోపలికి రండి! బాగా తడిసిపోయారు. గొడుగయినా లేదు.”

అంతగా గాలివాన దెబ్బతిని వున్న నారాయణకి ఆ చిన్న ఇంటిలో ప్రవేశించడముతో ఏదో బ్రహ్మాండమైన భవనంలో ప్రవేశించినట్టని పించింది. పైన కప్పుకొన్న దుప్పటి, లోపలి చొక్కా కూడా పూర్తిగా తడిసిపోయాయి. అవి తీసి ప్రక్కన పెడుతూ వుంటే ఆమె

అందుకుని మూలనున్న తీగ మీద ఆరవేసింది. ఒక మంచం ఒక చిన్న టేబిలూ, ఒక సాదా కుర్చీ, ఒక పడక కుర్చీ గది గోడలలో మూడింటికి దేశీయ నాయకులవి, దేవుళ్ళవి పటాలు, ఒక గోడకి ఒక పెద్ద అద్దం దాని ప్రక్కన ఒక ఫొటో ఎన్లార్జిమెంటు, పెద్ద మీసాలు, గిరిజాల జుట్టు సూదుల్లాటి చూడ్కులు గల కళ్ళు..... అతడే కాబోలు ఆమె అప్పుడప్పుడు చెపుతుండే నరసింగు.

వెంటనే టీ గాని, కాఫీ గాని ఇవ్వటానికి పాలు లేకపోవడం వల్ల ఆమె అతను సర్దుకొందికి ఒక సోడా యిచ్చింది. అది త్రాగి చుట్ట ముట్టించడం తోనే అతనికి కాస్త హుషారు కలిగింది గాని, ఎలా ఉపక్రమించడమో అర్థం కాకుండా వుంది. పోనీ ఇంకా కొంతసేపు ఆలోచిద్దాము అంటే లాభం లేదు. టైము చాలా తక్కువగా వుంది. మరి మూడు గంటలలోగా బయలుదేరి పోవలసి వుంది.

అతడింకా సర్దుకుని ఎత్తుబడి చేసే లోపున ఆమె అంది. "మరి ఈ రాత్రి ఈ గాలివానలో అంతమేర ఎలా వెళతారు? ఇక్కడ మంచం మీద పడుకోండి. నేను అవతలి గదిలో పడుకుంటాను."

మరి ఉపోద్ఘాతమూ, ఉపసంహారమూ అంతా సర్దుకుని లాభం లేదని అతను అసలు విషయమే అందుకున్నాడు. "పడుకోవడము మాట తరువాత చూద్దాము గాని మరి మీరు అన్నీ సర్దుకోరూ మన ప్రయాణానికి?"

"ప్రయాణమా? ఎక్కడికి? ఎందుకు? అందులోనూ ఈ గాలివానలో?"

"ఇదే అతి ప్రశస్తమయినది. ఈ తెల్లవారుజామున పాసెంజరులో బయలుదేరి ఈ మధ్యాహ్నం రైలందుకుంటే రేపు ఉదయానికల్లా మద్రాసు చేరుకోగలము."

"అయితే, ఈ గాలివానలో మీరు వృధాగా నడిచి రాలేదన్నమాట?"

"అంటే ఏమిటి? మీరింకా అనుమానంగానే వున్నారా? మరి ఈ తప్పించుకునే మాటలేవీ లాభం లేదు. ఇవాళతో సరి. ఈ పాత జీవితం యీ గాలివానతోనే సమాప్తమయి కొత్త ప్రకరణం ఆరంభమవు తుంది. భగవద్గీతలో 'వాసాంసి జీర్ణాని' అన్న శ్లోకంలో చెప్పాడు కదూ. అలాగ మీరు ఇప్పటి మట్టుకు ఈ చిరకాలంగా అలవాటయిన పాత వస్తువులను పరిసరాలను విడిచిపెట్టడం అంటే కష్టంగానే ఉండవచ్చును. కాని ఒక్క నెల్లాళ్ళలోనే మీ అంతట మీరు ఇంత కాలంగా తెలిసి వుండి కూడా ఇన్నాళ్ళూ మిమ్మల్ని అక్కడికి తీసుకుని వెళ్ళలేదేమని అనకపోతే నా చెవి కదపా ఇస్తాను."

"అలాగే కావచ్చును లెండి. రేపు ఉదయం గాలివాన తగ్గాక అంతా ఆలోచిద్దాము లెండి. ఇప్పుడు హాయిగా పడుకోండి."

"మరి ఉదయం వరకు వ్యవధి అంటూ వుంటే కదూ. ఇంక మరొక్క రెండు గంటల్లో రైలు. మీరు మరేమీ ఎక్కువగా సర్దుకో అక్కర్లేదు. అక్కడికి మనం వెళ్ళేవరకూ బట్టలుంటే చాలును. అక్కడికి వెళ్ళగానే కావలసినవన్నీ అవే వస్తాయి."

"మీకీ ఆలోచన ఎలా పుట్టిందా అని నాకు ఆశ్చర్యంగా వుంది పంతులుగారూ. నేను ఏదో చిన్న పల్లెటూళ్ళో పుట్టి పెరిగినదాన్ని. అటువంటి నాకు మీరు చెప్పే సంగతులన్నీ ఏం తెలుసును? ఏదో ఇదివరకు మీరు అంటూంటే ఎలాగూ జరగని దానికి ఏ విధంగా అనుకుంటే ఏం నష్టం అని ఊరుకునేదాన్ని. అంతేగాని నిజంగానే మీరంటున్నారని తెలిస్తే మొట్టమొదటే స్పష్టంగా చెప్పేసి వుందును. మరొక ఏడాదిలో మా నరసింగు వచ్చేస్తాడు కదా."

"ఇటువంటి చాదస్తపు ఆలోచనలు పెట్టుకోబట్టే మనదేశం ఇలా యేడుస్తూంది. శక్తి, నైపుణ్యమూ అన్నీ వున్నవాళ్లు ఇలా మారుమూలలను తమంతట తామే అణగిపోబట్టే ఇలా వుంది. మీరు ఏమంటే అనండి. బలవంతంగా నయినా సరే ఇవాళ మిమ్మల్ని తీసుక పోవడానికి నిశ్చయించు కొన్నాను. మీ ఇక్కడి ఆస్తి గురించి మరేం భయం లేదు. ఇదంతా నాకే అమ్మేయండి. మీ యిష్టం వచ్చిన ధర వెయ్యండి. అంతేగాని ఇప్పటి ప్రయాణం మాత్రం వాయిదా వెయ్యడానికి వీల్లేదు. నేను ఇందులో నా స్వార్థం ఆలోచించి లవలేశమూ చెప్పడం లేదు."

"లేకపోయినా ఉన్నా నాలాంటి దాన్ని బాగుచెయ్యాలన్న తలంపు మీ కెందుకు కలగాలీ? నన్నేదో నామానాన ఉండనియ్యండి, మా నరసింగు యేమీ మంచివాడు కాడు. కిందటిమారు యేమీ లేనిదానికే నరసయ్య చెయ్యి విరగ్గొట్టేడు. నా కేమో భయంగా వుంది. మీరు వెళ్ళండి. మీరు తప్పకుండా ఒకటికాదు, వంద సినీమాలు తీసి బాగుపడాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తాను. అంతేకాని నన్ను మాత్రం యేమీ అనకండి మీ రయినా ఇప్పుడీ గాలివానలో యేమి ప్రయాణం చేస్తారు. ఈ రాత్రి ఊరుకుని రేపు మధ్యాహ్నం రైలుకి వెళ్ళండి.

"ఓస్ మీ భయం నాకు తెలిసింది, ఎక్కడో జైలులో వున్న మనిషి మనల్నేం చేస్తాడు. రేపు ప్రొద్దున ఈ ఊరు దాటిపోయిన తరవాత మనల నెవరయిన తేరిపార చూడగలరా? అసలు మీరు ఈ పాత పేరుతో ఇంకా ఉంటారా? రేపటి కాంట్రాక్టులో మీ పేరు "కిరణ్" కాంతి కిరన్‌లా మీ పేరు ఒక్క క్షణంలో దిశ దిశలూ వ్యాపించదూ?"

ఆమె ఒక్కక్షణం ఏమీ మాట్లాడకుండా ఊరుకొని "గాలి తగ్గినట్టుంది. మీరు తప్పదు

వెళ్ళిపోతానంటే వెళ్ళిపోండీ లేకపోతే హాయిగా పడుక్కోండి. మీ రేమీ మాట్లాడకండి. ఇదివరకు మీతో స్పష్టంగా మాట్లాడకపోవడం నా పొరపాటే కావచ్చును."

నారాయణ ఏ రకమయిన సమాధానాన్ని వినిపించుకొనే స్థితిలో లేడు. నోటితో స్పష్టంగా చెప్పబడిన మాటలు చేతులతో చెప్పవచ్చునేమోనని దగ్గరగా వెళ్ళిం రెండు చేతులూ బ్రతిమాలుతున్నట్లుగా పట్టుకొని "ఇదిగ" మరి మీరు నేను...."

వీధి తలుపులు దఢాలుమని చప్పుడయింది.

నారాయణకి ఎందుకో కాళ్ళు గజగజ వణకసాగాయి. "తలుపు మాత్రం తియ్యకు ఎవళ్ళూ లేరని చెప్పేయ్."

మళ్ళీ చప్పుడయింది. ఈ మారు చప్పుడుతో పాటు ఒక వింతయిన కర్కశ స్వరం కూడా వినిపించింది. అది వినీ వినడంతో "నరసింగు" అంటూ ఛంగున లేడిపిల్లలా గెంతింది. రాధ తలుపు వంకకు.

తలుపు తీస్తూనే "ఇంకా ఏడాది దాకా రానన్నావు?" అంది రాధ.

నరసింగుకి యీ ప్రశ్న ఏమీ రుచించలేదు. "అయితే నేను రావాలని లేదన్నమాట" అంటూ నారాయణ వంక చూశాడు.

అసలే భయంతో వణకిపోతున్న నారాయణకి ఆ చూపుతో ముచ్చెమటలు పోశాయి.

ఇక విషక్రిమిని చూసినట్లుగా చూచి, "వీడెవడు?" అని ఉరిమేడు. తరవాత జరిగిన సంగతులు ఏవీ వరుసగా నారాయణకి జ్ఞాపకం లేదు. టేబిలు మీద లైటు తల్ల క్రిందులై నేలను పడి పగలడమూ! రాధ ఏదో ఏడుపు స్వరముతో మాట్లాడటం మాత్రం తెలుసును. తరవాత ఏవో తన్ని ఉద్దేశిస్తూ నరసింగు ఆడిన మాటలు వాటికి తాను సమాధానం చెప్పేడో లేదో పో కుక్క అన్న మాటతో తన వీపుమీద పెద్ద తాపు తగిలింది. తాను వీధిలో పడ్డాడు.

మర్నాటి ఉదయం పది గంటలకు పోలీసులు వచ్చి నరసింగుని అరెస్టు చేసే వేళకు రాధకు వంటి మీద స్పృహ లేదు. జైలు నుండి తప్పించుకొని వచ్చిన నేరమూ, శేషయ్య గారింట్లో రెండు వేలు అపహరించిన నేరమూ రెండూ రుజువయాయి. నేరస్థుడు డబ్బుతో సహా పట్టుబడడం వల్ల.

నారాయణ నాటి ఉదయం మంచం మీద నుండి మామూలుగా లేవలేదు. జ్వరం చాలా ఎక్కువగా వుంది. తర్వాత నాలుగు రోజులు ఈ లోకపు ప్రసక్తే లేకుండా ఉన్నాడు. జ్వరం తగ్గి పత్యం పుచ్చుకున్న మర్నాడే శేషయ్యగారు 'పోనీ మరికాస్త ఆరోగ్యం వచ్చేవరకూ ఉండకూడదా' అంటూ ఉన్నా వినిపించు కోకుండా రైలు ఖర్చులకు ఒక యాభై చే

బదులు పుచ్చుకొని బయలుదేరి పోయాడు. రాధ దుకాణం వంకయినా చూడకుండా.

మరి రెండు రోజల నుండి కిల్లీల దుకాణం ఎప్పటిలాగే సాగుతూంది. ఏదో అణా పరకా వస్తువులు కొనుక్కుని పోయే వారికి ఆమె పగటి ఆలోచనలతో గాని రాత్రి కలలతో గాని సంబంధం లేదు కదా.

నరసింగు మరి కొద్ది రోజుల నాడు జైలులో ఆత్మహత్య చేసుకున్నాడని ఆమెకు వార్త వచ్చింది. అసలటు వంటి వార్త రాకపోయినా సరే నాటి రాత్రి తనను నమ్మకపోవడంతో నారాయణ పంతులుగాని మళ్ళీ వచ్చి తనతోకూడా ఏ సముద్రంలో దూకమన్నా ఆమె సిద్ధంగా ఉందన్న సంగతి అతనికేం తెలుసును. విశ్వ విఖ్యాతుడనయి ఉందునని అనుకొన్న ఆ మహానుభావుడు ఒక ఫిలిం డిస్ట్రిబ్యూటింగు కంపెనీకి అసిస్టెంటు మేనేజరుగా జీవితం వెళ్ళబుచ్చుతున్నాడు. అతని దృష్టిలోని ఊర్వశి వారానికి ఒక రోజయినా కట్టకుండా, రోజుకు 2 రు. మించని కిల్లీ దుకాణం బేరసారాలు సాగిస్తూంది.

**SATHA VASANTHALA TELUGU KATHA**

*Compiled by:*

***Taalluri Nageswara Rao, Hitasri***

**తె**లుగు కథకు శ్రీకారం చుట్టిన శ్రీ గురజాడ అప్పారావుగారి కాలం నుంచీ ఈనాటివరకూ వచ్చిన కొన్ని వేల కథలలో ఉత్తమ కథలను ఎన్నిక చేసి ప్రచురించాలనే సంకల్పం కలిగినా, ఆ కోరిక 1974 వ సంవత్సరానికి గాని తీరలేదు. ఆ నాటి ఆ కథా సంకలనాన్ని పునర్ముద్రించమని అనేకమంది రచయితల, పాఠకుల అభీష్టం మేరకు కొద్ది మార్పులు, చేర్పులతో తిరిగి ఆనాటి ఆణిముత్యాన్ని అందిస్తున్నాం.

ఆంధ్రుల సామాజిక, ఆర్థిక, కుటుంబ జీవనంలో గత వంద సంవత్సరాలల్లో వచ్చిన మార్పులకు ఈ కథాసంకలనం అద్దం పడుతుంది.

లాటిన్ అమెరికన్ కవి పాబ్లో నెరుడా అన్నట్లు – కవితలు, కథలు అభాగ్య సోదరుల కన్నీరు తుడిచే చేతిగుడ్డలు కావాలి; వారి పోరాటాలకు సాధనాలుగా కత్తులు లాంటి కథలు కావాలి... "రుమాళ్ళుగా, సవాళ్ళుగా, ఎర్రెర్రటి జెండాలు"గా ఆ కథా సంకలనాన్ని స్వీకరించి విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ **శత వసంతాల తెలుగు కథ**ను పాఠకులకు సగర్వంగా అందిస్తుంది.

₹ 450/-

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ-520 004